శ్రీః

అరణ్యకాణ్డమ్

అథ ప్రథమః సర్గః

[సీతాలక్ష్మణసహితు డైన శ్రీరాముని ఆశ్రమవాసు లైన మునులు సత్కరించుట.]

మూ. ప్రవిశ్య తు మహారణ్యం దణ్డకారణ్యమాత్మవాన్,
రామో దదర్శ దుర్ధర్షస్తాపసాశ్రమమణ్డలమ్. 1

ప్ర. అ. ఆత్మవాన్ = బుద్ధిమంతుడు, దుర్ధర్షః = ఎవరిచేతను ఎదిరింప శక్యము కానివాడు అయిన, రామః = రాముడు, మహారణ్యమ్ = మహారణ్య మైన, దణ్డకారణ్యమ్ = దండకారణ్యమును, ప్రవిశ్య = ప్రవేశించి, తాపసాశ్రమ మణ్డలమ్ = మునుల ఆశ్రమముల సముదాయమును, దదర్శ = చూచెను.

తా. బుద్ధిమంతుడు, ఎవరిచేతను ఎదిరింప శక్యము కానివాడు అయిన రాముడు దండకమహారణ్యములో ప్రవేశించి అక్కడ మునులు నివసించే ఆశ్రమ ముల సముదాయమును చూచెను. 1

మూ. కుశచీరపరిక్షిప్తం బ్రాహ్మ్యా లక్ష్మ్యా సమావృతమ్,
యథా ప్రదీప్తం దుర్దర్శం గగనే సూర్యమణ్డలమ్. 2

ప్ర. అ. కుశచీరపరిక్షిప్తమ్ = కుశలచేత, నారచీరలచేత వ్యాప్తము, బ్రాహ్మ్యా = బ్రహ్మసంబంధ మైన (వైదిక మైన), లక్ష్మ్యా = కాంతిచేత, సమావృతమ్ = కప్పబడినది, గగనే = ఆకాశమునందు, ప్రదీప్తమ్ = ప్రజ్వరిల్లుచున్న, సూర్యమణ్డలం యథా = సూర్యమండలము వలె, దుర్దర్శమ్ = చూడ శక్యము కానిది అయిన (ఆశ్రమమండలమును చూచెను).

తా. ఆ ఆశ్రమమండలములో అక్కడక్కడ కుశలూ, నారచీరలు కనబడుచుండెను. అక్కడ వైదికశోభ (బ్రహ్మవర్చస్సు) స్పష్టముగా కనబడుచుండెను. ఆకాశములో ప్రకాశించుచున్న సూర్యమండలము వలె చూచుటకు శక్యముకాకుండ ఉండెను. 2

మూ. శరణ్యం సర్వభూతానాం సుసంమృష్టాజిరం సదా,
మృగైర్బహుభిరాకీర్ణం పక్షిసంఘైః సమావృతమ్. 3

ప్ర. అ. సర్వభూతానామ్ = సకలప్రాణులకు, శరణ్యమ్ = రక్షణము ఇచ్చునది, సదా = ఎల్లప్పుడు, సుసంమృష్టాజిరం = చక్కగా తుడవబడిన ముంగిళ్లు కలది, బహుభిః = అనేక మైన, మృగైః = మృగములచేత, ఆకీర్ణమ్ = వ్యాప్తము, పక్షిసంఘైః = పక్షిసముదాయములచేత, సమావృతమ్ = ఆవరింపబడినది (అయిన ఆశ్రమమండలమును చూచెను).

తా. ఆ ఆశ్రమమండలములో అన్ని ప్రాణులు నిర్భయముగా నివసించుచుండెను. మాటిమాటికి తుడుచుచుండుటచే ముంగిళ్లు శుభ్రముగా ఒప్పుచుండెను. ఆ ఆశ్రమమండలములో అనేకమృగములు, పక్షులూ కూడ సుఖముగా నివసించుచుండెను. 3

మూ. పూజితం చోపనృత్తం చ నిత్యమప్సరసాం గణైః,
విశాలైరగ్నిశరణైః స్రుగ్భాణ్డైరజినైః కుశైః. 4

సమిద్భిస్తోయకలశైః ఫలమూలైశ్చ శోభితమ్,
ఆరణ్యైశ్చ మహావృక్షైః పుణ్యైః స్వాదుఫలైర్వృతమ్. 5

ప్ర. అ. అప్సరసామ్ = అప్సరఃస్త్రీలయొక్క, గణైః = గణములచేత, పూజితం చ = పూజింపబడినది, ఉపనృత్తం చ = సమీపమునందు నృత్తము చేయబడినది, విశాలైః = విశాలము లైన, అగ్నిశరణైః = అగ్నిగృహములచేతను, స్రుగ్భాణ్డైః = స్రుక్కులచేతను, పాత్రలచేతను, అజినైః = కృష్ణాజినములచేతను, కుశైః = కుశలచేతను, సమిద్భిః = సమిధలచేతను, తోయకలశైః = జలకలశలచేతను, ఫలమూలైశ్చ = ఫలములచేతను, మూలములచేతను, శోభితమ్ = ప్రకాశింపచేయబడినది, ఆరణ్యైః = అరణ్యములకు సంబంధించిన, పుణ్యైః =

పవిత్రము లైన, స్వాదుఫలైః = మధుర మైన ఫలములు గల, మహావృక్షైః = మహావృక్షములచేత, ఉపశోభితమ్ = ప్రకాశింపచేయబడినది (అయిన ఆశ్రమ మండలమును చూచెను).

తా. ఆ ఆశ్రమమండలమును అప్సరస్త్రీలు పూజించుచు, నిత్యము అక్కడ నృత్యము చేయుచుందురు. అది విశాలములైన అగ్నిగృహములతోను, స్రుక్సుంతోను, పాత్రలతోను, కృష్ణాజినాద్యజినములతోను, కుశలతోను, సమిధలతోను, ఉదకకలశలతోను, ఫలములతోను, మూలములతోను ఒప్పుచుండెను. ఆ ఆశ్రమ మండలము చుట్టూ పవిత్రములు, మధురము లైన ఫలము లిచ్చేవీ అయిన అరణ్యములో పెరిగే మహావృక్షములు ఉండెను. 4, 5

మూ. బలిహోమార్చితం పుణ్యం బ్రహ్మఘోషనినాదితమ్,
పుష్పైశ్చాన్యైః పరిక్షిప్తం పద్మిన్యా చ సపద్మయా. 6

ప్ర. అ. బలిహోమార్చితమ్ = భూతముల కిచ్చే ఆహారరూపము లైన బలులచేతను, హోమములచేతను పూజింపబడినది, పుణ్యమ్ = పవిత్రము, బ్రహ్మఘోషనినాదితమ్ = వేదఘోషచేత ప్రతిధ్వనింపచేయబడినది, సపద్మయా = పద్మములతో కూడిన, పద్మిన్యా = పద్మలతచేతను, అన్యైః = ఇతరములైన, పుష్పైశ్చ = పుష్పములచేతను, పరిక్షిప్తమ్ = చుట్టూ వ్యాప్తమూ అయిన ఆశ్రమమండలమును చూచెను.

తా. ఆ పవిత్ర మైన ఆశ్రమమండలమునందు బలిహోమాదులతో దేవతా పూజలు జరుగుచుండెను. వేదఘోషలు మార్మ్రోగుచుండెను. దాని చుట్టూ పద్మములతో నిండిన పద్మలతలు, ఇతరపుష్పములు అధికముగా ఉండెను. 6

మూ. ఫలమూలాశనైర్దాన్తైశ్చీరకృష్ణాజినామ్బరైః,
సూర్యవైశ్వానరాభైశ్చ పురాణైర్మునిభిర్యుతమ్. 7

ప్ర. అ. ఫలమూలాశనైః = పండ్లు, దుంపలు ఆహారముగా గలవారు, దాన్తైః = ఇంద్రియనిగ్రహవంతులు, చీరకృష్ణాజినామ్బరైః = నారచీరలను, కృష్ణాజినములను వస్త్రములుగా ధరించినవారు, సూర్యవైశ్వానరాభైశ్చ = సూర్యుని వంటి, అగ్నివంటి కాంతి గలవారు అయిన, పురాణైః = ప్రాచీను లైన (వందల

కొలది సంవత్సరాల వయస్సు గల) మునిభిః = మునులతో, యుతమ్ = కూడినదీ అయిన (ఆశ్రమమండలమును చూచెను).

తా. ఆ ఆశ్రమమండలములో, ఫలమూలములను ఆహారముగా తీసికొను వారు, ఇంద్రియనిగ్రహవంతులు, నారచీరలను, కృష్ణాజినములను ధరించిన వారు, సూర్యాగ్నులవంటి తేజస్సు కలవారు అయిన అతివృద్ధులైన మునులు నివసించుచుండిరి. 7

మూ. పుణ్యైశ్చ నియతాహారైః శోభితం పరమర్షిభిః,
తద్ బ్రహ్మభవనప్రఖ్యం బ్రహ్మఘోషనినాదితమ్. 8

ప్ర. అ. పుణ్యైః=పవిత్రులు, నియతాహారైః = నియతమైన ఆహారము కలవారు అయిన, పరమర్షిభిః = గొప్ప ఋషులచేత, శోభితమ్=శోభింపచేయ బడినది, బ్రహ్మఘోషనినాదితమ్ = వేదఘోషచేత ధ్వనింపచేయబడినదై, బ్రహ్మభవనప్రఖ్యమ్ = బ్రహ్మలోకముతో సమానమైన, తత్ = ఆ, (ఆశ్రమ మండలమును చూచెను).

తా. ఆ ఆశ్రమమండలమును పవిత్రులు, ఆహారమునందు నియమము పాటించువారు అయిన మహర్షులు శోభింపచేయుచుండిరి. వేదఘోషతో నిండి యుండుటచే అది బ్రహ్మలోకము వలె ఉండెను. 8

మూ. బ్రహ్మవిద్భిర్మహాభాగైర్బ్రాహ్మణైరుపశోభితమ్,
తద్దృష్ట్వా రాఘవః శ్రీమాంస్తాపసాశ్రమమణ్డలమ్, 9
అభ్యగచ్ఛన్మహాతేజా విజ్యం కృత్వా మహద్ధనుః.

ప్ర. అ. బ్రహ్మవిద్భిః=వేదవేత్తలు, మహాభాగైః = మహాభాగ్యవంతులు అయిన, బ్రాహ్మణైః = బ్రాహ్మణులచేత, ఉపశోభితమ్ = ప్రకాశింపచేయబడిన, తత్ = ఆ, తాపసాశ్రమమణ్డలమ్ = మునుల ఆశ్రమసముదాయమును, దృష్ట్వా = చూచి, శ్రీమాన్ = శ్రీయుతుడు, మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడు అయిన, రాఘవః = రాముడు, మహత్ = గొప్పదైన, ధనుః = ధనస్సును, విజ్యమ్ = నారి లేనిదానినిగా, కృత్వా = చేసి, అభ్యగచ్ఛత్ = సమీపించెను.

తా. గొప్ప శోభకలవాడు, మహాతేజశ్శాలీ అయిన రాముడు, తన గొప్ప

ధనస్సు నారిని విప్పివేసి, వేదవేత్తలు, మహాపుణ్యాత్ములు అయిన బ్రాహ్మణులతో శోభించుచున్న ఆ మునుల ఆశ్రమమండలము వైపు, వినయపూర్వకముగా వెళ్లెను. 9

మూ. దివ్యజ్ఞానోపపన్నాస్తే రామం దృష్ట్వా మహర్షయః, 10
అభిజగ్ముస్తదా ప్రీతా వైదేహీం చ యశస్వినీమ్.

ప్ర. అ. దివ్యజ్ఞానోపపన్నాః = దివ్యజ్ఞానముతో కూడిన, తే మహర్షయః = ఆ మహర్షులు, రామమ్ = రాముణ్ణి, యశస్వినీమ్ = కీర్తిమంతురాలైన, వైదేహీం చ = సీతను, దృష్ట్వా = చూచి, ప్రీతాః = సంతోషించినవారై, తదా = అప్పుడు, అభిజగ్ముః = ఎదురుగా వెళ్ళిరి.

తా. అప్పుడు, దివ్యజ్ఞానసంపన్నులైన ఆ మహర్షులు, రాముడు, కీర్తిమంతురాలైన సీతా తమ ఆశ్రమము వైపు వచ్చుట చూచి, సంతోషముతో ఎదురేగిరి. 10

మూ. తే తు సోమమివోద్యన్తం దృష్ట్వా వై ధర్మచారిణమ్, 11
లక్ష్మణం చైవ దృష్ట్వా తు వైదేహీం చ యశస్వినీమ్,
మఙ్గలాని ప్రయుఞ్జానాః ప్రత్యగృహ్ణన్ దృఢవ్రతాః. 12

ప్ర. అ. దృఢవ్రతాః = దృఢమైన తపోనియమము గల, తే = ఆ మహర్షులు, ఉద్యన్తమ్ = ఉదయించుచున్న, సోమమివ = చంద్రుడు వలె ఉన్న, ధర్మచారిణమ్ = ధర్మము నాచరించు రాముణ్ణి, దృష్ట్వా తు = చూచి, లక్ష్మణం చైవ = లక్ష్మణుణ్ణి, యశస్వినీమ్ = కీర్తి గల, వైదేహీం చ = సీతను, దృష్ట్వా తు = చూచి, మఙ్గలాని = మంగళకరములైన వాక్యములను, ప్రయుఞ్జానాః = ప్రయోగించుచు, ప్రత్యగృహ్ణన్ = గ్రహించిరి (సాదరముగా స్వాగతము చెప్పిరి).

తా. దృఢమైన నియమములను పాటించు ఆ మహర్షులు, ఉదయించుచున్న సూర్యుడు వలె ఉన్న, ధర్మాచరణతత్పరుడైన ఆ రాముణ్ణి, లక్ష్మణుణ్ణి, కీర్తిమంతురాలైన సీతను చూచి, మంగళకరమైన మాటలు పలుకుచు వారికి స్వాగతము పలికిరి. 11, 12

మూ. రూపసంహననం లక్ష్మీం సౌకుమార్యం సువేషతామ్,
దదృశుర్విస్మితాకారా రామస్య వనవాసినః. 13

ప్ర. అ. వనవాసినః = వనములో నివసించువారు, రామస్య = రాముని యొక్క, రూపసంహననమ్ = రూపమును శరీరసంఘటనమును, లక్ష్మీమ్ = శోభను, సౌకుమార్యమ్ = సౌకుమార్యమును, సువేషతామ్ = మంచి వేషమును, విస్మితాకారాః = ఆశ్చర్యము చెందిన ఆకారములు కలవారై, దదృశుః = చూచిరి.

తా. వనములో నివసించేవారు రాముని రూపమును, శరీరసౌష్ఠవమును, శోభను, సౌకుమార్యమును, మంచి వేషమును చూచి ఆశ్చర్యభరితు లైరి. 13

మూ. వైదేహీం లక్ష్మణం రామం నేత్రైరనిమిషైరివ,
ఆశ్చర్యభూతాన్ దదృశుః సర్వే తే వనవాసినః. 14

ప్ర. అ. సర్వే = సమస్త మైన, తే వనవాసినః = ఆ అరణ్యవాసులు, ఆశ్చర్యభూతాన్ = ఆశ్చర్యజనకులుగా ఉన్న, వైదేహీమ్ = సీతను, లక్ష్మణం చైవ = లక్ష్మణుణ్ణి, రామమ్ = రాముణ్ణి, అనిమిషైరివ = రెప్పపాటు లేనివా అన్నట్లున్న, నేత్రైః = నేత్రములతో, దదృశుః = చూచిరి.

తా. వనములో ఆ జనులందరు, ఆశ్చర్యమును కలిగించే రూపసౌంద ర్యాదులు గల ఆ సీతను, లక్ష్మణుణ్ణి, రాముణ్ణి కూడ, రెప్పలు వాల్చకుండా చూచిరి. 14

మూ. అత్రైనం హి మహాభాగాః సర్వభూతహితే రతాః,
అతిథిం పర్ణశాలాయాం రాఘవం సంన్యవేశయన్. 15

ప్ర. అ. సర్వభూతహితే = సకలప్రాణుల హితమునందు, రతాః = ఆసక్తి గల, మహాభాగాః = మహాత్ము లైన ఆ మునులు, అత్ర = ఈ ఆశ్రమము నందు, పర్ణశాలాయామ్ = పర్ణశాలలో, అతిథిమ్ = అతిథి యైన, ఏనం రాఘవమ్ = ఈ రాముణ్ణి, సంన్యవేశయన్ = నివసింపచేసిరి.

తా. సకలప్రాణుల హితమును కోరు ఆ మహర్షులు, తమ అతిథిగా వచ్చిన ఆ రామునకు, ఆ ఆశ్రమములోని ఒక పర్ణశాలలో నివాస మేర్పరచిరి.

మూ. తతో రామస్య సత్కృత్య విధినా పావకోపమాః,
ఆజహ్రుస్తే మహాభాగాః సలిలం ధర్మచారిణః. 16

ప్ర. అ. తతః = అటు పిమ్మట, పావకోపమాః = అగ్నితో సమానులైన, మహాభాగాః = మహాభాగ్యవంతులైన, తే = ఆ, ధర్మచారిణః = ధర్మాచరణ చేయు మహర్షులు, విధినా = యథాశాస్త్రముగా, సత్కృత్య = సత్కరించి, రామస్య = రామునకు, సలిలమ్ = ఉదకమును, ఆజహ్రుః = తీసికొనివచ్చిరి.

తా. అగ్నితో సమానులు, ధర్మతత్పరులు, మహాతపోభాగ్యసంపన్నులూ అయిన ఆ మునులు యథాశాస్త్రముగా రాముని సత్కరించి, ఆతనికి ఉదకము తెచ్చి ఇచ్చిరి. 16

మూ. మఙ్గలాని ప్రయుఞ్జానా ముదా పరమయా యుతాః,
మూలం పుష్పం ఫలం సర్వమాశ్రమం చ మహాత్మనః,
నివేదయిత్వా ధర్మజ్ఞాస్తే తు ప్రాఞ్జలయోఽబ్రువన్.

ప్ర. అ. ధర్మజ్ఞాః = ధర్మములను ఎరిగిన, తే = ఆ మహర్షులు, మఙ్గలాని = మంగళములను, ప్రయుఞ్జానాః = ప్రయోగించుచు, పరమయా = గొప్పదైన, ముదా = సంతోషముతో, యుతాః = కూడినవారై, మూలమ్ = మూలములను, పుష్పమ్ = పుష్పములను, ఫలమ్ = ఫలములను, సర్వమ్ = సమస్తమైన, ఆశ్రమం చ = ఆశ్రమమును, మహాత్మనః = మహాత్ముడైన రామునకు, నివేదయిత్వా = సమర్పించి, ప్రాఞ్జలయః = కట్టబడిన దోసిళ్లు కలవారై, అబ్రువన్ = పలికిరి.

తా. ధర్మము లన్నీ తెలిసిన ఆ మునులు, చాల సంతోషించుచు, మహాత్ముడైన ఆ రామునకు మూలములను, పుష్పములను, ఫలములను, ఆ ఆశ్రమము నంతనూ కూడ సమర్పించి, వినయపూర్వకముగా ఇట్లు పలికిరి. 17

మూ. ధర్మపాలో జనస్యాస్య శరణ్యశ్చ మహాయశాః, 18
పూజనీయశ్చ మాన్యశ్చ రాజా దణ్డధరో గురుః.

ప్ర. అ. రాజా = రాజు, మహాయశాః = గొప్ప కీర్తి గలవాడు, అస్య

= ఈ, జనస్య = జనముయొక్క, ధర్మపాలః = ధర్మమును పాలించువాడు. శరణ్యశ్చ = రక్షకుడు. పూజనీయశ్చ = పూజించదగినవాడు. మాన్యశ్చ = గౌరవించ దగినవాడు. దణ్డధరః = దండమును ధరించు (దుష్టులను శిక్షించు) వాడు, గురుః = పూజ్యుడు.

తా. రాజు గొప్ప కీర్తి గలవాడు. అందరు ప్రజల ధర్మమును సంరక్షించువాడు. రక్షకుడు. పూజింపదగినవాడు. గౌరవింపదగినవాడు. దుష్టశిక్షకుడగుటచే పూజ్యుడు. 18

మూ. ఇన్ద్రస్యైవ చతుర్భాగః ప్రజా రక్షతి రాఘవ, 19
రాజా తస్మాద్వరాన్భోగాన్ రమ్యాన్ భుఙ్క్తే నమ
స్కృతః.

ప్ర. అ. రాఘవ = రామా! ఇన్ద్రస్యైవ = ఇంద్రునియొక్కయే, చతుర్భాగః = నాల్గవ భాగము, ప్రజాః = ప్రజలను, రక్షతి = రక్షించుచున్నది. తస్మాత్ = ఆ కారణమువలననే, రాజా = రాజు, నమస్కృతః = నమస్కరింపబడుచున్నవాడై, వరాన్ = శ్రేష్ఠము లైన, రమ్యాన్ = సుందరములైన, భోగాన్ = భోగములను, భుఙ్క్తే = అనుభవించుచున్నాడు.

తా. రామా! ఇంద్రుని నాల్గవ అంశమే ప్రజలను రక్షించుచున్నది. అందువలననే రాజు అందరి నమస్కారములు అందికొనుచు, శ్రేష్ఠములు,సుందరములూ అయిన భోగాలను అనుభవించుచున్నాడు. 19

మూ. తే వయం భవతా రక్ష్యా భవద్విషయవాసినః,
నగరస్థో వనస్థో వా త్వం నో రాజా జనేశ్వరః. 20

ప్ర. అ. భవద్విషయవాసినః = నీ దేశమునందు నివసించుచున్న, తే వయమ్ = అట్టిమేము, భవతా = నీచేత, రక్ష్యాః = రక్షించదగినవారము. నగరస్థః = నగరములో ఉన్నా, వనస్థో వా = వనములో ఉన్నా, జనేశ్వరః = జనులకు ప్రభువువైన, త్వమ్ = నీవు, రాజా = రాజువు.

తా. నీ దేశములో (రాజ్యములో)నివసించుచున్న మమ్ములను నీవే రక్షించ

వలెను. ప్రజలకు ప్రభువు వైన నీవు నగరములో ఉన్నా, వనములో ఉన్నా, నీవే మాకు రాజువు. 20

మూ. న్యస్తదణ్డా వయం రాజఞ్జితక్రోధా జితేన్ద్రియాః,
రక్షణీయా స్త్వయా శశ్వద్గర్భభూతా స్తపోధనాః. 21

ప్ర. అ. రాజన్ = రాజా ! జితక్రోధాః = జయింపబడిన క్రోధము కలవారము, జితేన్ద్రియాః = జయింపబడిన ఇంద్రియములు కలవారము, తపోధనాః = తపస్సే ధనముగా గలవారము అయిన, వయమ్ = మేము, న్యస్తదణ్డాః = విడువబడిన దండనము కలవాళ్లము. గర్భభూతాః = గర్భమువంటివార మైన మేము, త్వయా = నీచేత, శశ్వత్ = ఎల్లప్పుడూ, రక్షణీయాః = రక్షింపదగిన వాళ్లము.

తా. రాజా ! మేము క్రోధమును జయించి, జితేంద్రియుల మై, తపస్సే ధన మని నమ్మచు, అపకారులపై కూడ దండప్రయోగమును విడిచివేసినాము. అందుచేత నీవు మమ్ములను సర్వదా తల్లి గర్భమును రక్షించి నట్లు రక్షించవలెను. 21

మూ. ఏవముక్త్వా ఫలైర్మూలైః పుష్పైరన్యైశ్చ రాఘవమ్,
వన్యైశ్చ వివిధాహారైః సలక్ష్మణమపూజయన్. 22

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, సలక్ష్మణమ్ = లక్ష్మణునితో కూడిన, రాఘవమ్ = రాముణ్ణి, ఫలైః = ఫలములచేత, మూలైః = దుంపలచేత, పుష్పైః = పుష్పములచేత, అన్యైశ్చ = ఇతరము లైన, వన్యైః = వనమునకు సంబంధించిన, వివిధాహారైః = అనేకవిధము లైన ఆహారములచేత, అపూజయన్ = పూజించిరి.

తా. మునులు ఈ విధముగ పలికి, లక్ష్మణసమేతు డైన ఆ రామునకు ఫలములు, మూలములు, పుష్పములు, వనములో లభించు ఇతరము లైన ఆహారములు ఇచ్చి పూజించిరి. 22

మూ. తథాన్యే తాపసాః సిద్ధా రామం వైశ్వానరోపమాః,
న్యాయవృత్తా యథాన్యాయం తర్పయామాసురీశ్వరమ్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ప్రథమః సర్గః.

ప్ర. అ. తథా = అగ్నే, వైశ్వానరోపమాః = అగ్నితో సమాను లైన, సిద్ధాః = తపఃసిద్ధులైన, అన్యే = ఇతరులైన, న్యాయవృత్తాః = న్యాయమైన ప్రవృత్తి గల, తాపసాః = మహర్షులు, ఈశ్వరమ్ = ప్రభువైన రాముణ్ణి, యథా న్యాయమ్ = న్యాయానుసారముగా, తర్పయామాసుః = సంతృప్తిపరచిరి.

తా. అగ్నితో సమానమైన తేజస్సు కలవారు, తపఃసిద్ధులు, న్యాయ సమ్మత మైన ప్రవర్తన కలవారు అయిన మరి కొందరు మునులుకూడ, ఈ విధముగానే, ప్రభు వైన రామునకు సంతోషము కలిగించిరి. 23

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో ప్రథమసర్గ సమాప్తము.

అథ ద్వితీయః సర్గః

[వనములో రామాదులను విరాధుడు ఎదిరించుట.]

మూ. కృతాతిథ్యోఽథ రామస్తు సూర్యస్యోదయనం ప్రతి,
ఆమన్త్ర్య స మునీన్ సర్వాన్ వనమేవాన్వగాహత. 1

ప్ర. అ. అథ = అటుపిమ్మట, కృతాతిథ్యః = చేయబడిన ఆతిథ్యము గల, సః రామస్తు = ఆ రాముడైతే, సూర్యస్య = సూర్యునియొక్క, ఉదయనం ప్రతి = ఉదయమునకు పూర్వము, సర్వాన్ = సమస్తమైన, మునీన్ = మునులను, ఆమన్త్ర్య = వీడుగొల్పి, వనమేవ = వనమునే, అన్వగాహత = ప్రవేశించెను.

తా. రాముడు మునుల ఆతిథ్యము స్వీకరించి, సూర్యోదయమునకు పూర్వమే ఆ అందరి మునుల అనుజ్ఞ పొంది వనములోనికి ప్రవేశించెను. 1

మూ. నానామృగగణాకీర్ణమృక్షశార్దూలసేవితమ్,
ధ్వస్తవృక్షలతాగుల్మం దుర్దర్శసలిలాశయమ్. 2

నిష్కూజమానశకుని ఝిల్లికాగణనాదితమ్,
లక్ష్మణానుచరో రామో వనమధ్యం దదర్శ హ. 3

ప్ర. అ. లక్ష్మణానుచరః = లక్ష్మణుడు అనుచరుడుగా గల, రామః = రాముడు, నానామృగగణాకీర్ణమ్ = అనేకవిధములైన మృగముల సముదాయములచే వ్యాప్తము, ఋక్షశార్దూలసేవితమ్ = ఎలుగుబంటులచేత, పెద్దపులులచేత సేవింపబడినది, ధ్వస్తవృక్షలతాగుల్మమ్ = పాడుపడిన వృక్షములు, లతలు, పొదలు కలది, దుర్దర్శసలిలాశయమ్ = చూడ శక్యము కాని (కనబడని) జలాశయములు కలది, నిష్కూజమానశకుని = కూయుచున్న పక్షులు గలది, ఝిల్లికాగణనాదితమ్ = అడవి ఈగల గుంపులచేత ధ్వనింపచేయబడినది అయిన, వనమధ్యమ్ = వనమధ్యమును, దదర్శ హ = చూచెను.

తా. లక్ష్మణునితో కూడిన రాముడు ఆ అరణ్యమధ్యమును చూచెను. ఎలుగుబంట్లు, పెద్ద పులులు మొదలైన అనేకవిధము లైన మృగములు అక్కడ గుంపులు గుంపులుగా తిరుగుచుండెను. అక్కడ ఉన్న వృక్షములు, లతలు, పొదలు పాడువడి యుండెను. చుట్టుప్రక్కల ఎక్కడా సరస్సులు మొదలైన జలాశయములు కనబడుటలేదు. పక్షులు కూయుచుండెను. అడవి ఈగల రొద అంతటా వ్యాపించి ఉండెను. 2, 3

మూ. సీతయా సహ కాకుత్స్థస్తస్మిన్ ఘోరమృగాయుతే,
దదర్శ గిరిశృఙ్గాభం పురుషాదం మహాస్వనమ్. 4

ప్ర. అ. సీతయా సహ = సీతతో కూడిన, కాకుత్స్థః = రాముడు, ఘోర మృగాయుతే = ఘోరములైన మృగములతో కూడిన, తస్మిన్ = ఆ అరణ్య మధ్యమునందు, గిరిశృఙ్గాభమ్ = పర్వతశిఖరమువంటి కాంతి గలవాడు, మహా స్వనమ్ = గొప్ప ధ్వని గలవాడు అయిన, పురుషాదమ్ = పురుషులను భక్షించే రాక్షసుని, దదర్శ = చూచెను.

తా. సీతాసమేతు డైన రాముడు భయంకరము లైన మృగములతో నిండిన ఆ అరణ్యమధ్యమునందు గొప్ప ధ్వని చేయుచున్న ఒక నరభక్షకు డైన రాక్షసుని చూచెను. ఆతని దేహము పర్వతశిఖరము వలె ఉండెను. 4

మూ. గభీరాక్షం మహావక్త్రం వికటం వికటోదరమ్,
బీభత్సం విషమం దీర్ఘం వికృతం ఘోరదర్శనమ్. 5

ప్ర. అ. గభీరాక్షమ్ = లోతైన నేత్రములు కలవాడు, మహావక్త్రమ్ = పెద్ద ముఖము కలవాడు, వికటమ్ = వికారరూపముతో ఉన్నవాడు, వికటోదరమ్ = వికారముగా ఉన్న పొట్ట గలవాడు, బీభత్సమ్ = భయంకరుడు, (జుగుప్స కలిగించువాడు), విషమమ్ = చాల చిన్నదీ చాలపెద్దదీ అయిన అవయవ ములతో విషమముగా ఉన్నవాడూ, దీర్ఘమ్ = పొడవైనవాడు, వికృతమ్ = వికార ముగా ఉన్నవాడు, ఘోరదర్శనమ్ = భయంకరమైన దర్శనము కలవాడు అయిన (రాక్షసుని చూచెను).

తా. ఆ రాక్షసుని కళ్లు లోతుగాను, ముఖము చాల పెద్దదిగాను, పొట్ట వికారముగాను ఉండుటచే ఆతడు వికటరూపముతో జుగుప్స కలిగించే టటు

ఉండెను. ఆతని కరచరణాద్యవయవములు విషమముగా (హెచ్చుతగ్గులతో) ఉండెను. చాల పొడవుగా, వికృతాకారముతో ఉన్న ఆతడు చూచుటకు భయంకరుడుగా ఉండెను. 5

మూ. వసానం చర్మ వైయాఘ్రం వసార్ద్రం రుధిరోక్షితమ్,
త్రాసనం సర్వభూతానాం వ్యాదితాస్యమివాన్తకమ్. 6

ప్ర. అ. వైయాఘ్రమ్ = వ్యాఘ్రసంబంధ మైన, చర్మ = చర్మను, వసానమ్ = ధరించినవాడు, వసార్ద్రమ్ = వసచేత తడిగా ఉన్నవాడు, రుధిరోక్షితమ్ = రక్తముచేత తడపబడినవాడు, సర్వభూతానామ్ = సమస్తప్రాణులకు, త్రాసనమ్ = భయము కలిగించువాడు, వ్యాదితాస్యమ్ = తెరవబడిన ముఖము గలవాడు, అన్తకమ్ ఇవ = యముడు వలె ఉన్నవాడు అయిన (రాక్షసుని చూచెను).

తా. వ్యాఘ్రచర్మను ధరించిన ఆ రాక్షసుని శరీరము వసతో తడిగా ఉండెను. రక్తముతో తడిసెను. సకలప్రాణులకు భయము కలిగించు ఆ రాక్షసుడు నోరు తెరచుకొని మృత్యుదేవత వలె ఉండెను. 6

మూ. త్రీన్ సింహాంశ్చతురో వ్యాఘ్రాన్ ద్వౌ వృకౌ పృషతాన్దశ
సవిషాణం వసాదిగ్ధం గజస్య చ శిరో మహత్, 7
అవసజ్యాయసే శూలే వినదన్తం మహాస్వనమ్.

ప్ర. అ. త్రీన్ = మూడు, సింహాన్ = సింహములను, చతురః = నాలుగు, వ్యాఘ్రాన్ = పెద్దపులులను, ద్వౌ = రెండు, వృకౌ = తోడేళ్లను, దశ = పది, పృషతాన్ = చుక్కల లేళ్లను, సవిషాణమ్ = దంతములతో కూడిన, వసాదిగ్ధమ్ = వసచేత పూయబడిన, మహత్ = పెద్దదైన, గజస్య శిరః = ఏనుగుయొక్క తలను, ఆయసే = ఇనుము వికారమైన, శూలే = శూలము నందు, అవసజ్య = గ్రుచ్చి తగుల్చుకొని, మహాస్వనమ్ = గొప్పధ్వని కలుగునట్లుగా, వినదన్తమ్ = ధ్వని చేయుచున్న (రాక్షసుని చూచెను).

తా. ఆ రాక్షసుడు మూడు సింహాలను, నాలుగు పెద్ద పులులను, రెండు తోడేళ్ళను, పది చుక్కలజింకలను, పైన వసతో నిండిన, దంతసహితమైన

ఒక పెద్ద ఏనుగు తలను ఇనుప శూలమునకు గ్రుచ్చి మోసికొనిపోవుచుండెను. గట్టిగా అరచుచుండెను. 7

మూ. స రామం లక్ష్మణం చైవ సీతాం దృష్ట్వా చ మైథిలీమ్,
అభ్యధావత్సుసంక్రుద్ధః ప్రజాః కాల ఇవాన్తకః.

ప్ర. అ. సః = అతడు, రామమ్ = రాముణ్ణి, లక్ష్మణం చ = లక్ష్మణుణ్ణి, మైథిలీమ్ = మిథిలానగరరాజపుత్రి యైన, సీతాం చ = సీతను, దృష్ట్వైవ = చూడగానే, సుసంక్రుద్ధః = చాలా కోపగించినవాడై, అన్తకః = సంహారముచేయు, కాలః = యముడు, ప్రజాః ఇవ = ప్రజలనుగూర్చి వలె, అభ్యధావత్ = వారికి ఎదురుగా పరుగెత్తెను.

తా. ఆ రాక్షసుడు రాముణ్ణి, లక్ష్మణుణ్ణి, సీతను చూడగానే చాల కోపముతో యముడు సంహరించుటకై ప్రజలమీద పడి నట్లు, వారి వైపు వరుగెత్తి వెళ్ళెను. 8

మూ. స కృత్వా భైరవం నాదం చాలయన్నివ మేదినీమ్, 9
అఙ్కేనాదాయ వైదేహీమపక్రమ్య తదాబ్రవీత్.

ప్ర. అ. తదా = అప్పుడు, సః = అతడు, మేదినీమ్ = భూమిని, చాలయన్నివ = చలింపచేయుచున్నవాడు వలె, భైరవమ్ = భయంకర మైన, నాదమ్ = ధ్వనిని, కృత్వా = చేసి, వైదేహీమ్ = సీతను, అఙ్కేన = ఒడిచేత (ఒడిలోనికి), ఆదాయ = తీసికొని, అపక్రమ్య = దూరముగా తొలగి, అబ్రవీత్ = వలికెను.

తా. అప్పు డాతడు భూమి దద్దరిల్లు నట్లు భయంకరముగ ధ్వని చేసి, సీతను ఒడిలోనికి తీసికొని, కొంచెము దూరము తొలగి, ఇట్లు వలికెను. 9

మూ. యువాం జటాచీరధరౌ సభార్యౌ క్షీణజీవితౌ, 10
ప్రవిష్టౌ దణ్డకారణ్యం శరచాపాసిధారిణౌ.

ప్ర. అ. జటాచీరధరౌ = జటలను, నారచీరలను ధరించిన, క్షీణజీవితౌ = క్షీణించిన జీవితము గల, యువామ్ = మీరిద్దరూ, సభార్యౌ = భార్యతో కూడిన

వారై, శరచాపాసిధారిణౌ = శరములను, ధనస్సును, ఖడ్గములను ధరించినవారై, దణ్డకారణ్యమ్ = దండకారణ్యమును, ప్రవిష్టౌ = ప్రవేశించినారు.

తా. మీ రిద్దరూ జటావల్కలములు ధరించి, భార్యాసహితులై, ధనుర్బాణములను ఖడ్గములను ధరించి, దండకారణ్యములో ప్రవేశించినారు. మీ ఆయుపు మూడినది. 10

మూ. కథం తాపసయోర్వాం చ వాసః ప్రమదయా సహ. 11
అధర్మచారిణౌ పాపౌ కౌ యువాం మునిదూషకౌ.

ప్ర. అ. తాపసయోః = మునులైన, వామ్ = మీ ఇద్దరికీ, ప్రమదయా సహ = స్త్రీతో కూడ, వాసః = నివాసము, కథమ్ = ఎట్లు? అధర్మాచరిణౌ = అధర్మమును ఆచరించుచున్న, మునిదూషకౌ = మునుల వ్రతమునకు విరుద్ధముగా ప్రవర్తించుచున్న, పాపౌ = పాపాత్ములైన, యువామ్ = మీ రిద్దరూ, కౌ = ఎవరు?

తా. మునులై యుండి మీరిద్దరూ స్త్రీతో కలిసి ఎట్లు నివసించుచున్నారు? మునుల నియమమునకు విరుద్ధముగా అధర్మాచరణము చేయుచున్న పాపాత్ములైన మీరు ఎవరు? 11

మూ. అహం వనమిదం దుర్గం విరాధో నామ రాక్షసః, 12
చరామి సాయుధో నిత్యమృషిమాంసాని భక్షయన్.

ప్ర. అ. అహమ్ = నేను, విరాధో నామ = విరాధు డను పేరు గల, రాక్షసః = రాక్షసుడను. సాయుధః = ఆయుధము ధరించినవాడనై, నిత్యమ్ = ఎల్లప్పుడు, ఋషిమాంసాని = ఋషుల మాంసములను, భక్షయన్ = భక్షించుచు, దుర్గమ్ = ప్రవేశింప శక్యముకాని, ఇదమ్ = ఈ, వనమ్ = వనమును, చరామి = సంచరించుచుందును.

తా. నేను విరాధు డనే పేరు గల రాక్షసుడను. ఆయుధధారినై, ఋషుల మాంసములు తినుచు నిత్యము, ఈ దుర్గమారణ్యములో సంచరించుచుందును.

మూ. ఇయం నారీ వరారోహా మమ భార్యా భవిష్యతి, 13
యువయోః పాపయోశ్చాహం పాస్యామి రుధిరం మృధే.

ప్ర. అ. వరారోహా = శ్రేష్ఠ మైన కటిప్రదేశము గల, ఇయం నారీ = ఈ స్త్రీ, మమ = నాయొక్క, భార్యా = భార్య, భవిష్యతి = కాగలదు. అహమ్ = నేను, మృధే = యుద్ధమునందు, పాపయోః = పాపాత్ము లైన, యువయోః = మీ ఇద్దరియొక్క, రుధిరమ్ = రక్తమును, పాస్యామి = త్రాగగలను.

తా. సుందర మైన కటిప్రదేశము గల ఈ స్త్రీని నేను భార్యగా స్వీకరించెదను. పాపాత్ము లైన మీ ఇద్దరి రక్తమును, యుద్ధములో త్రాగగలను. 13

మూ. తస్యైవం బ్రువతో దుష్టం విరాధస్య దురాత్మనః, 14
శ్రుత్వా సగర్వితం వాక్యం సంభ్రాన్తా జనకాత్మజా.

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, బ్రువతః = పలుకుచున్న, దురాత్మనః = దుష్టబుద్ధి గల, తస్యవిరాధస్య = ఆ విరాధునియొక్క, సగర్వితమ్ = గర్వముతో కూడిన, దుష్టమ్ = దుష్టమైన, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, జనకాత్మజా = సీత, సంభ్రాన్తా = చాల భయపడినది.

తా. దురాత్ము డైన విరాధుడు ఈ విధముగా పలికిన, గర్వముతో కూడిన దుష్టవాక్యమును విని సీత చాల భయపడెను. 14

మూ. సీతా ప్రవేపితోద్వేగాత్ ప్రవాతే కదళీ యథా. 15
తాం దృష్ట్వా రాఘవః సీతాం విరాధాఙ్కగతాం శుభామ్,
అబ్రవీల్లక్ష్మణం వాక్యం ముఖేన పరిశుష్యతా. 16

ప్ర. అ. సీతా = సీత, ఉద్వేగాత్ = భయమువలన, ప్రవాతే = అధిక మైన గాలి గల ప్రదేశమునందు, కదళీ యథా = అరటిచెట్టు వలె, ప్రవేపితా = చాల వణకిపోయెను. రాఘవః = రాముడు, విరాధాఙ్కగతామ్ = విరాదుని ఒడిలో ఉన్న, శుభామ్ = మంగళప్రదురా లైన, తామ్ = ఆమెను, దృష్ట్వా = చూచి, పరిశుష్యతా = ఎండిపోవుచున్న, ముఖేన = ముఖముతో, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. సీత భయముతో, గాలివానలో అరటిచెట్టు వలె వణకిపోవుచుండెను. అప్పుడు విరాదుని ఒడిలో ఉన్న సీతను చూచి, రాముడు దుఃఖముచేత వాడిపోయిన ముఖముతో, లక్ష్మణునితో ఇటు పలికెను. 15,16

మూ. పశ్య సౌమ్య నరేన్ద్రస్య జనకస్యాత్మసంభవామ్,
మమ భార్యాం శుభాచారాం విరాధాఙ్కే ప్రవేశితామ్, 17
అత్యన్తసుఖసంవృద్ధాం రాజపుత్రీం యశస్వినీమ్.

ప్ర. అ. సౌమ్య = ఓ! సౌమ్యుడా ! నరేన్ద్రస్య = మహారాజైన, జనకస్య = జనకునియొక్క, ఆత్మసంభవామ్ = కుమార్తె, మమ భార్యామ్ = నా భార్య, శుభాచారామ్ = మంగళప్రదమైన ఆచారము కలది, అత్యన్తసుఖసంవృద్ధామ్ = అత్యధికమైన సుఖముతో పెరిగినది, యశస్వినీమ్ = కీర్తిమంతురాలు, విరాధాఙ్కే = విరాధుని ఒడలో, ప్రవేశితామ్ = ఉంచబడినదీ అయిన, రాజపుత్రీమ్ = రాజపుత్రియైన సీతను, పశ్య = చూడుము.

తా. సౌమ్యుద వైన లక్ష్మణా ! జనకమహారాజు కూతురు, నా భార్య, సదాచారవంతురాలు, చాల సుఖములతో పెరిగినది, కీర్తిమంతురాలు అయిన ఈ సీత ఎట్లు విరాధుని ఒడిలోనికి లాగబడినదో చూచితివా ! 17

మూ. యదభిప్రేతమస్మాసు ప్రియం వరవృతం చ యత్, 18
కైకేయ్యాస్తు సుసంవృత్తం క్షిప్రమద్యైవ లక్ష్మణ.

ప్ర. అ. లక్ష్మణ = ఓ ! లక్ష్మణా ! అస్మాసు = మన విషయములో, యత్ = ఏది, అభిప్రేతమ్ = ఇష్టమైనదో, యత్ = ఏది, వరవృతం చ = వరముగా కోరబడినదో, అట్టి, కైకేయ్యాః = కైకేయికి, ప్రియమ్ = ప్రియమైన విషయము, అద్యైవ = ఇప్పుడే, క్షిప్రమ్ = శీఘ్రముగా, సుసంవృత్తమ్ = బాగా జరిగిపోయినది.

తా. లక్ష్మణా ! కైకేయి మనకు ఏమి జరగవలె నని అభిలషించినదో, వరము ద్వారా కూడ కోరినదో అది, అతిశీఘ్రకాలములోనే, ఇప్పుడే, జరిగి పోయినది. 18

మూ. యా న తుష్యతి రాజ్యేన పుత్రార్థే దీర్ఘదర్శినీ, 19
యయాహం సర్వభూతానాం ప్రియః ప్రస్థాపితో వనమ్,
అద్యేదానీం సకామా సా యా మాతా మధ్యమా మమ. 20

ప్ర. అ. దీర్ఘదర్శినీ = దీర్ఘాలోచన కల, యా = ఎవ్వతె, పుత్రార్థే = పుత్రునికొరకైన, రాజ్యేన = రాజ్యముచేత, న తుష్యతి = సంతోషించలేదో, యయా = ఎవ్వతెచేత, సర్వభూతానామ్ = సకలప్రాణులకు, ప్రియః = ఇష్టుడనైన, అహమ్ = నేను, వనమ్ = వనమునుగూర్చి, ప్రస్థాపితః = పంపబడితినో, యా = ఎవ్వతె, మమ = నాయొక్క, మధ్యమా మాతా = మధ్యమురాలైన తల్లియో, సా = అట్టి కైకేయి, అద్య = ఇప్పుడు, సకామా = తీరిన కోరిక కలదైనది.

తా. నా తల్లులలో మధ్యమురాలైన ఏ కైకేయి చాల దూరపు టాలోచనతో, తన కుమారునకు రాజ్యము లభించుటతో సంతృప్తి చెందక అందరికీ ఇష్టుడనైన నన్ను అరణ్యానికి పంపినదో ఆమె కోరిక నేడు సఫల మైనది. 20

మూ. పరస్పర్శాత్తు వైదేహ్యాః న దుఃఖతరమస్తి మే,
పితుర్వినాశాత్ సౌమిత్రే స్వరాజ్యహరణాత్తథా. 21

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా ! వైదేహ్యాః = సీతయొక్క, పరస్పర్శాత్ = పరపురుషస్పర్శకంటె, పితుః = తండ్రియొక్క, వినాశాత్ = మరణము కంటె, తథా = మరియు, స్వరాజ్యహరణాత్ = నా రాజ్యమును హరించుటకంటె, మే = నాకు, దుఃఖతరమ్ = ఎక్కువ దుఃఖమును కలిగించేది, నాస్తి = లేదు.

తా. లక్ష్మణా ! సీతను పరపురుషుడు స్పృశించుట, తండ్రి మరణము, నా రాజ్యమును ఇతరులు అపహరించుట-వీటికి మించిన దుఃఖహేతువు, నాకు మరొకటి లేదు. 21

మూ. ఇతి బ్రువతి కాకుత్స్థే బాష్పశోకపరిప్లుతః,
అబ్రవీల్లక్ష్మణః క్రుద్ధో రుద్ధో నాగ ఇవ శ్వసన్. 22

ప్ర. అ. కాకుత్స్థే = రాముడు, ఇతి = ఇట్లు, బ్రువతి = పలుకుచుండగా, లక్ష్మణః = లక్ష్మణుడు, బాష్పశోకపరిప్లుతః = బాష్పముతోను, శోకముతోను నిండినవాడై, (వ్యాకులుడై), క్రుద్ధః = కోపించినవాడై, రుద్ధః = అడ్డుకొనబడిన, నాగః ఇవ = సర్పము వలె, శ్వసన్ = నిట్టూర్చుచు, అబ్రవీత్ = పలికెను.

తా. రాముని మాటలు విని, లక్ష్మణుడు, శోకాక్రాంతుడై, బాష్పము విడచుచు, కోపించి, అడ్డగింపబడిన సర్పము వలె బుసలు కొట్టుచు, ఇట్లు పలికెను. 22

మూ. అనాథ ఇవ భూతానాం నాథ స్త్వం వాసవోపమః,
మయా ప్రేష్యేణ కాకుత్థ్స కిమర్థం పరితప్యసే. 23

ప్ర. అ. కాకుత్థ్స = రామా! భూతానామ్ = ప్రాణు లందరికీ, నాథః = నాథుడవు, వాసవోపమః = దేవేంద్రునితో సమానుడవు అయిన, త్వమ్ = నీవు, అనాథః ఇవ = నాథుడు లేనివాడవు వలె, ప్రేష్యేణ = కింకరుడ నైన, మయా = నాతో కూడ ఉండి కూడ, కిమర్థమ్ = ఎందుకు, పరితప్యసే = బాధపడు చున్నావు?

తా. రామా! నీవు సర్వభూతనాథుడవు. దేవేంద్రునితో సమానుడవు. నేను నీ కింకరుడనై ఉన్నాను. అట్టి నీవు అనాథుడు వలె ఎందుకు చింతించు చున్నావు? 23

మూ. శరేణ నిహతస్యాద్య మయా క్రుద్ధేన రక్షసః,
విరాధస్య గతాసోర్హి మహీ పాస్యతి శోణితమ్. 24

ప్ర. అ. క్రుద్ధేన = కోపించిన, మయా = నాచేత, అద్య = ఇప్పుడు, శరేణ = బాణముచేత, నిహతస్య = కొట్టబడినవాడై, గతాసోః = పోయిన ప్రాణములు గల, రక్షసః = రాక్షసుడైన, విరాధస్య = విరాధునియొక్క, శోణితమ్ = రక్తమును, మహీ = భూమి, పాస్యతి = త్రాగగలదు.

తా. క్రుద్ధుడ నైన నేను బాణమును ప్రయోగించి సంహరించగా, రాక్షసు డైన ఈ విరాధుని రక్తమును భూమి త్రాగగలదు. 24

మూ. రాజ్యకామే మమ క్రోధో భరతే యో బభూవ హ,
తం విరాధే విమోక్ష్యామి వజ్రీ వజ్రమివాచలే. 25

ప్ర. అ. రాజ్యకామే = రాజ్యమునందు కోరిక గల, భరతే = భరతుని యందు, మమ = నాకు, యః = ఏ, క్రోధః = క్రోధము, బభూవ హ = కలిగెనో, తమ్ = ఆ క్రోధమును, వజ్రీ = ఇంద్రుడు, వజ్రమ్ = వజ్రమును, అచలే ఇవ = పర్వతముపైన వలె, విరాధే = విరాధునిమీద, విమోక్ష్యామి = విడువగలను.

తా. రాజ్యమునందు కోరిక గల భరతునిపై నాకు పూర్వము కలిగిన

క్రోధమును, దేవేంద్రుడు వజ్రమును పర్వతముపై విడచి (ప్రయోగించి) నట్లు ఈ విరాధునిపై విడువగలను. (చూపగలను). 25

మూ. మమ భుజబలవేగవేగితః
పతతు శరోఽస్య మహాన్ మహోరసి,
వ్యపనయతు తనోశ్చ జీవితం
పతతు తతశ్చ మహీం విఘూర్ణితః. 26

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ద్వితీయః సర్గః.

ప్ర. అ. మమ=నాయొక్క, భుజబలవేగవేగితః=భుజబలముయొక్క వేగముచేత వేగము కలదిగా చేయబడిన, మహాన్=గొప్పదైన, శరః=బాణము, అస్య=వీనియొక్క, మహోరసి = గొప్ప వక్షఃస్థలముమీద, పతతు = పడుగాక. తనోః=వీని శరీరమునుండి, జీవితమ్ = జీవితమును, వ్యపనయతు=తొలగించుగాక. తతః = అటు పిమ్మట, విఘూర్ణితః = తిరిగిపోవు నట్లు చేయబడినవాడై, మహీమ్ = భూమిని గూర్చి, పతతు = పడుగాక.

తా. నా భుజబలవేగముచే వేగముగా ప్రయోగింపబడిన గొప్ప బాణము ఈ రాక్షసుని విశాలమైన వక్షఃస్థలముమీద పడుగాక. ఈతని శరీరమునుండి ప్రాణములను తొలగించుగాక. అప్పు డీతడు తిరిగిపోవుచు నేలమీద పడిపోవుగాక. 26

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో రెండవ సర్గ సమాప్తము.

అథ తృతీయః సర్గః

[విరాధునితో రాముడు సంభాషించుట, రామలక్ష్మణులు విరాధుని పై బాణములు ప్రయోగించుట. విరాధుడు సోదరులిద్దరిని ఎత్తికొని వనములోనికి పోవుట].

మూ. అథోవాచ పునర్వాక్యం విరాధః పూరయన్వనమ్,
పృచ్ఛతో మమ హి బ్రూతం కౌ యువాం క్వ గమిష్యథః.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, విరాధః = విరాధుడు, వనమ్ = వనమును, పూరయన్ = శబ్దముచేత నింపుచు, పునః = మరల, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను. పృచ్ఛతః = అడుగుచున్న, మమ = నాకు, బ్రూతమ్ = చెప్పండి. యువామ్ = మీరిద్దరు, కౌ = ఎవరు? క్వ = ఎక్కడికి, గమిష్యథః = వెళ్ళగలరు.

తా. పిమ్మట ఆ విరాధుడు అరణ్యము ప్రతిధ్వనించు నట్లు మరల ఇట్లు పలికెను- "నేను అడుగుచున్నాను; చెప్పుడు- మీరిద్దరు ఎవరు? ఎక్కడికి వెళ్లెదరు?" 1

మూ. తమువాచ తతో రామో రాక్షసం జ్వలితాననమ్,
పృచ్ఛన్తం సుమహాతేజా ఇక్ష్వాకుకులమాత్మనః. 2

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సుమహాతేజాః = చాల గొప్ప తేజస్సు గల, రామః = రాముడు, పృచ్ఛన్తమ్ = ప్రశ్నించుచున్న, జ్వలితాననమ్ = మండుచున్న ముఖము గల, తం రాక్షసమ్ = ఆ రాక్షసుని గూర్చి, ఆత్మనః = తన యొక్క, ఇక్ష్వాకుకులమ్ = ఇక్ష్వాకువంశమును, ఉవాచ = చెప్పెను.

తా. పిమ్మట, మహాతేజఃశాలి యైన రాముడు, ఆ విధముగా ప్రశ్నించు చున్న, ప్రజ్వలించుచున్న ముఖము గల ఆ రాక్షసునకు తన ఇక్ష్వాకువంశమును గూర్చి చెప్పెను. 2

మూ. క్షత్రియౌ వృత్తసంపన్నౌ విద్ధి నౌ వనగోచరౌ,
త్వాం తు వేదితుమిచ్ఛావః కస్త్వం చరసి దణ్డకాన్. 3

ప్ర. అ. నౌ = మమ్ములను, వృత్తసంపన్నౌ = సచ్చరిత్రముతో కూడిన, వనగోచరౌ = వనములో సంచరించుచున్న, క్షత్రియౌ = క్షత్రియులనుగా, విద్ధి = తెలుసుకొనుము. త్వాం తు = నిన్ను గూర్చి కూడ, వేదితుమ్ = తెలుసుకొనుటకు, ఇచ్ఛావః = కోరుచున్నాము. దణ్డకాన్ = దండకారణ్యమును, చరసి = సంచరించుచున్నావు; త్వమ్ = నీవు, కః = ఎవ్వడవు ?

తా. వనమునకు వచ్చి ఉన్న మేము మంచి వృత్తము (నడవడిక) గల క్షత్రియులము. నీ వెవరో కూడ తెలుసుకొన గోరుచున్నాము. దండకారణ్యములో సంచరించుచున్నావు. నీ వెవ్వరవు ? 3

మూ. తమువాచ విరాధస్తు రామం సత్యపరాక్రమమ్,
హన్త వక్ష్యామి తే రాజన్ నిబోధ మమ రాఘవ. 4

ప్ర. అ. విరాధస్తు = విరాధుడు, సత్యపరాక్రమమ్ = సత్య మైన పరాక్రమము గల, తం రామమ్ = రాముణ్ణి గూర్చి, ఉవాచ = పలికెను. హన్త = ఆహా! రాజన్ = రాజా ! రాఘవ = రామా ! తే = నీకు, వక్ష్యామి = చెప్పగలను, మమ = నాకు (నానుండి) నిబోధ = తెలిసికొనుము.

తా. విరాధుడు సత్యమైన పరాక్రమముగల రామునితో ఇట్లనెను- "రామా! నే నెవరో నీకు చెప్పెదను, వినుము". 4

మూ. పుత్రః కిల జవస్యాహం మాతా మమ శతహ్రదా,
విరాధ ఇతి మామాహుః పృథివ్యాం సర్వరాక్షసాః. 5

ప్ర. అ. అహమ్ = నేను, జవస్య = జవునియొక్క, పుత్రః కిల = పుత్రుడను కదా; శతహ్రదా = శతహ్రద, మమ = నాయొక్క, మాతా = తల్లి. పృథివ్యామ్ = భూమిపై ఉన్న, సర్వరాక్షసాః = సకలరాక్షసులు, మామ్ = నన్ను, విరాధః ఇతి = విరాధుడు అని, ఆహుః = అందురు.

తా. నేను జవుని పుత్రుడను. శతహ్రద నా తల్లి. భూమిమీద రాక్షసు లందరూ నన్ను విరాధు డని అందురు. 5

మూ. తపసా చాభిసంప్రాప్తా బ్రహ్మణో హి ప్రసాదజా,
శస్త్రేణావధ్యతా లోకేఽచ్ఛేద్యాభేద్యత్వమేవ చ. 6

ప్ర. అ. తపసా = తపస్సుచేత, బ్రహ్మణః = బ్రహ్మయొక్క, ప్రసాదజా = అనుగ్రహమువలన కలిగిన, లోకే = లోకమునందు, శస్త్రేణ = శస్త్రముచేత, అవధ్యతా = వధింప శక్యము కాకపోవుట, అభిసంప్రాప్తా = పొందబడినది. అచ్ఛేద్యాభేద్యత్వమేవ చ = ఛేదింప శక్యముకాకపోవుట, భేదింప శక్యముకాకపోవుట కూడ (పొందబడినవి).

తా. నేను తపస్సు చేసి, బ్రహ్మ అనుగ్రహముచే లోకములో ఎవ్వరిచేత ఛేదించుటకు గాని, భేదించుటకు గాని, చంపుటకు గాని శక్యము కాకుండుటను సంపాదించితిని. 6

మూ. ఉత్సృజ్య ప్రమదామేనామనపేక్షౌ యథాగతమ్,
త్వరమాణౌ పలాయేథాం న వాం జీవితమాదదే. 7

ప్ర. అ. ఏనామ్ = ఈ, ప్రమదామ్ = స్త్రీని, ఉత్సృజ్య = విడచి, అనపేక్షౌ = ఈమెపై అపేక్ష లేనివారై, త్వరమాణౌ = తొందరపడుచు, యథాగతమ్ = వచ్చినట్లే, పలాయేథామ్ = పారిపొండి. వామ్ = మీఇద్దరియొక్క, జీవితమ్ = జీవితమును, న ఆదదే = గ్రహించను.

తా. మీ రిద్దరూ ఈ స్త్రీపై ఆశ వదలుకొని, ఈమెను విడిచిపెట్టి, వచ్చిన దారినే శీఘ్రముగా పారిపొండి. మీ ప్రాణాలు తీయను. 7

మూ. తం రామః ప్రత్యువాచేదం కోపసంరక్తలోచనః,
రాక్షసం వికృతాకారం విరాధం పాపచేతసమ్. 8

ప్ర. అ. రామః = రాముడు, కోపసంరక్తలోచనః = కోపముచేత ఎఱ్ఱనైన నేత్రములు కలవాడై, వికృతాకారమ్ = వికృతమైన ఆకారము గలవాడు, పాపచేతసమ్ = పాపచిత్తము కలవాడు అయిన, తమ్ = ఆ, విరాధం రాక్షసమ్ = విరాధు డను రాక్షసుని గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. రాముడు కోపముతో కళ్ళు ఎఱ్ఱజేసి, వికృత మైన ఆకారము గల, దుష్టబుద్ధి యైన ఆ విరాధరాక్షసునితో ఇట్లు పలికెను. 8

మూ. క్షుద్ర ధిక్త్వాం తు హీనార్థం మృత్యుమన్వేషసే ధ్రువమ్,
రణే ప్రాప్స్యసి సంతిష్ఠ న మే జీవన్ విమోక్ష్యసే. 9

ప్ర. అ. క్షుద్ర = నీచుడా! హీనార్థమ్ = నీచకార్యములు చేయు, త్వామ్ = నిన్ను గూర్చి, ధిక్ = నింద అగుగాక. ధ్రువమ్ = నిశ్చయముగా, మృత్యుమ్ = మృత్యువును, అన్వేషసే = వెదకుచున్నావు. రణే = యుద్ధమునందు, ప్రాప్స్యసి = మృత్యువును పొందగలవు. జీవన్ = బ్రతికి యుండి, మే = నాకు (నానుండి), న విమోక్ష్యసే = విడుదల పొందవు.

తా. ఛీ! దుష్టకార్యము చేయ దలచిన నీచుడా! నీవు నిశ్చయముగా మృత్యువునే అన్వేషించుచున్నావు. యుద్ధములో నీకు మృత్యువు లభించగలదు. నిన్ను ప్రాణాలతో విడువను. 9

మూ. తతః సజ్యం ధనుః కృత్వా రామః సునిశితాన్ శరాన్,
సుశీఘ్రమభిసంధాయ రాక్షసం నిజఘాన హ. 10

ప్ర. అ. తతః = అటు పిమ్మట, రామః = రాముడు, ధనుః = ధనస్సును, సజ్యమ్ = నారితో కూడిన దానినిగా, కృత్వా = చేసి, సునిశితాన్ = చాల వాడి యైన, శరాన్ = బాణములను, సుశీఘ్రమ్ = చాల శీఘ్రముగా, అభిసంధాయ = సంధించి, రాక్షసమ్ = రాక్షసుని, నిజఘాన హ = కొట్టెను.

తా. పిదప రాముడు ధనస్సును ఎక్కుపెట్టి, శీఘ్రముగా చాల వాడి యైన బాణములు సంధించి, ఆ రాక్షసుని కొట్టెను. 10

మూ. ధనుషా జ్యాగుణవతా సప్త బాణాన్ ముమోచ హ,
రుక్మపుఙ్ఖాన్ మహావేగాన్ సుపర్ణానిలతుల్యగాన్. 11

ప్ర. అ. జ్యాగుణవతా = నారితో కూడిన, ధనుషా = ధనస్సుచేత, రుక్మపుఙ్ఖాన్ = బంగారు పొన్నులు గల, మహావేగాన్ = గొప్ప వేగము గల, సుపర్ణానిలతుల్యగాన్ = గరుత్మంతునితోను వాయువుతోను సమముగా వెళ్ల, సప్త బాణాన్ = ఏడు బాణములను, ముమోచ హ = విడిచెను.

తా. రాముడు ధనస్సుకు నారి కట్టి, బంగారు పొన్నులతో, మహావేగము గల, గరుత్మంతుడు వలె, వాయువు వలె ప్రయాణించే ఏడు బాణములు ప్రయోగించెను. 11

మూ. తే శరీరం విరాధస్య భిత్త్వా బర్హిణవాససః,
నిపేతుః శోణితాదిగ్ధా ధరణ్యాం పావకోపమాః. 12

ప్ర. అ. పావకోపమాః = అగ్నితో సమానమైన, తే = ఆ శరములు, బర్హిణవాససః = నెమలి పింఛము వస్త్రముగా గల, విరాధస్య = విరాధునియొక్క, శరీరమ్ = శరీరమును, భిత్త్వా = బ్రద్దలుకొట్టి శోణితాదిగ్ధాః = రక్తముచేత పూయబడినవై, ధరణ్యామ్ = నేలమీద, నిపేతుః = పడినవి.

తా. అగ్నితో సమాన మైన ఆ బాణములు, నెమలిపింఛమును వస్త్రముగా ధరించి ఉన్న ఆ విరాధుని శరీరమును చేదించి, రక్తముతో తడిసినవై నేలమీద పడినవి. 12

మూ. స విద్ధో న్యస్య వైదేహీం శూలముద్యమ్య రాక్షసః,
అభ్యద్రవత్సుసంక్రుద్ధస్తదా రామం సలక్ష్మణమ్. 13

ప్ర. అ. విద్ధః = కొట్టబడిన, సః రాక్షసః = ఆ రాక్షసుడు, తదా = అప్పుడు, వైదేహీమ్ = సీతను, న్యస్య = క్రింద ఉంచి, శూలమ్ = శూలమును, ఉద్యమ్య = ఎత్తి, సుసంక్రుద్ధః = చాలా కోపించినవాడై, సలక్షణమ్ = లక్ష్మణ సహితుడైన, రామమ్ = రాముని(కి), అభ్యద్రవత్ = ఎదురుగా పరుగెత్తెను.

తా. బాణముల దెబ్బ తిన్న ఆ రాక్షసుడు సీతను క్రిందికి దింపివేసి, శూలమును పైకెత్తి, చాల కోపముతో రామలక్ష్మణుల మీదికి పరుగెత్తెను. 13

మూ. స వినద్య మహానాదం శూలం శక్రధ్వజోపమమ్,
ప్రగృహ్యాశోభత తదా వ్యాత్తానన ఇవాన్తకః. 14

ప్ర. అ. తదా = అప్పుడు, సః = అతడు, మహానాదమ్ = గొప్ప నాదము కలుగునట్లుగా, వినద్య = అరచి, శక్రధ్వజోపమమ్ = ఇంద్రధ్వజముతో సమానమైన, శూలమ్ = శూలమును, ప్రగృహ్య = గ్రహించి, వ్యాత్తాననః = తెరవబడిన ముఖము గల, అన్తక ఇవ = మృత్యుదేవత వలె, అశోభత = ప్రకాశించెను.

తా. అప్పు డా రాక్షసుడు ఇంద్రధ్వజము వలె చాల పొడ వైన ఆ శూలమును పట్టుకొని, గొప్ప నాదము కలుగు నట్లు అరచుచు, నోరు తెరచుకొని వచ్చి మీద పడుచున్న, మృత్యుదేవత వలె ఉండెను. 14

మూ. అథ తౌ భ్రాతరౌ దీప్తం శరవర్షం వవర్షతుః,
విరాధే రాక్షసే తస్మిన్ కాలాన్తకయమోపమే. 15

ప్ర. అ. అథ = అటుపిమ్మట, తౌ = ఆ, భ్రాతరౌ = సోదరులు, కాలాన్తకయమోపమే = ప్రలయకాలము నందు, సంహారకు డైన యమునితో సమాను డైన, తస్మిన్ = ఆ, రాక్షసే = రాక్షసు డైన, విరాధే = విరాధునిమీద, దీప్తమ్ = ప్రజ్వలించుచున్న, శరవర్షమ్ = బాణవర్షమును, వవర్షతుః = వర్షించిరి.

తా. ప్రలయకాలమునందు సర్వసంహారకు డైన యముని వలె ఉన్న రాక్షసు డైన ఆ విరాధునిపై ఆ సోదరు లిద్దరు, ప్రజ్వలించుచున్న బాణవర్షము కురిపించిరి. 15

మూ. స ప్రహస్య మహారౌద్రః స్థిత్వా జృమ్భత రాక్షసః,
జృమ్భమాణస్య తే బాణాః కాయాన్నిష్పేతురాశుగాః. 16

ప్ర. అ. మహారౌద్రః = చాల భయంకరు డైన, సః రాక్షసః = ఆ రాక్షసుడు, ప్రహస్య = గట్టిగా నవ్వి, స్థిత్వా = నిలబడి, అజృమ్భత = ఆవులించెను. జృమ్భమాణస్య = ఆవులించుచున్న అతనియొక్క, కాయాత్ = శరీరమునుండి, ఆశుగాః = శీఘ్రముగా వెళ్లు, తే బాణాః = ఆ బాణములు, నిష్పేతుః = బైటకు వచ్చినవి.

తా. అతిభయంకరు డైన ఆ రాక్షసుడు, అట్టహాసము చేయుచు, నిలబడి, ఆవులించెను. అత డా విధముగా ఆవులించగానే, వాని శరీరమునుండి బాణము లన్నీ బైటకు వచ్చెను. 16

మూ. స్పర్శాత్తు వరదానేన ప్రాణాన్ సంరోధ్య రాక్షసః,
విరాధః శూలముద్యమ్య రాఘవావభ్యధావత. 17

ప్ర. అ. రాక్షసః = రాక్షసు డైన, విరాధః = విరాధుడు, వరదానేన = వర

దానముతో, స్పర్శాత్ తు = స్పర్శవలన (సంబంధమువలన), ప్రాణాన్ = ప్రాణములను, సంరోధ్య = నిలచునట్లుచేసి, శూలమ్ = శూలమును, ఉద్యమ్య = ఎత్తి, రాఘవౌ = రామలక్ష్మణులను గూర్చి, అభ్యధావత = పరుగెత్తెను.

తా. ఆ విరాధుడు, వరప్రభావమువలన, ప్రాణములు మాత్రము బైటకు పోకుండు నట్లు నిరోధించుకొని శూలమును ఎత్తి రామలక్ష్మణులమీదికి పరుగెత్తెను. 17

మూ. తచ్ఛూలం వజ్రసంకాశం గగనే జ్వలనోపమమ్,
ద్వాభ్యాం శరాభ్యాం చిచ్ఛేద రామః శస్త్రభృతాంవరః.

ప్ర. అ. శస్త్రభృతామ్ = శస్త్రధారులలో, వరః = శ్రేష్ఠుడైన, రామః = రాముడు, జ్వలనోపమమ్ = అగ్నితోసమానమైన, వజ్రసంకాశమ్ = వజ్రముతో సమానమైన, తత్ శూలమ్ = ఆ శూలమును, ద్వాభ్యామ్ = రెండు, శరాభ్యామ్ = బాణములచేత, గగనే = ఆకాశమునందు, చిచ్ఛేద = ఛేదించెను.

తా. శస్త్రధారులలో శ్రేష్ఠుడైన రాముడు వజ్రముతో సమానము, అగ్ని తుల్యము అయిన ఆ శూలమును రెండు బాణములచేత ఆకాశమునందే ఖండించెను.

మూ. తద్రామవిశిఖైశ్ఛిన్నం శూలం తస్యాపతద్భువి,
పపాతాశనినా చ్ఛిన్నం మేరోరివ శిలాతలమ్. 19

ప్ర. అ. రామవిశిఖైః = రాముని బాణములచేత, ఛిన్నమ్ = ఛేదించబడినదై, తత్ శూలమ్ = ఆ శూలము, భువి = నేలమీద, అపతత్ = పడెను. అశనినా = వజ్రాయుధముచేత, ఛిన్నమ్ = ఛేదించబడిన, మేరోః = మేరుపర్వతముయొక్క శిలాతలమ్ ఇవ = శిలవలె, పపాత = పడెను.

తా. రాముడు బాణములచేత ఛేదించిన ఆ శూలము నేలమీద పడెను. అది వజ్రముచేత ఛేదించబడిన మేరుపర్వతశిలాతలము వలె పడెను. 19

మూ. తౌ ఖడ్గౌ క్షిప్రముద్యమ్య కృష్ణసర్పావివోద్యతౌ,
తూర్ణమాపేతతుస్తస్య తదా ప్రహరతాం బలాత. 20

ప్ర. అ. తదా = అప్పుడు, తౌ = ఆ రామలక్ష్మణులు, ఉద్యతౌ = పైకి

లేచుచున్న, కృష్ణసర్పావివ = త్రాచుపాములవలె ఉన్న, ఖడ్గౌ = రెండుఖడ్గములను, క్షిప్రమ్ = శీఘ్రముగా, ఉద్యమ్య = ఎత్తి, తూర్ణమ్ = శీఘ్రముగా, తస్య = ఆతని సమీపమును గూర్చి, ఆపేతతుః = దుమికిరి. బలాత్ = బలమువలన, ప్రహరతామ్ = కొట్టిరి.

తా. అప్పుడు ఆ రామలక్ష్మణులు వెంటనే పైకి లేచుచున్న త్రాచుపాముల వలె ఉన్న రెండు ఖడ్గములను శీఘ్రముగా ఎత్తి, తొందరగా ఆ రాక్షసునిపైకి దుమికి బలముగా కొట్టిరి. 20

మూ. స వధ్యమానః సుభృశం భుజాభ్యాం పరిగృహ్య తౌ,
అప్రకమ్ప్యౌ నరవ్యాఘ్రౌ రౌద్రః ప్రస్థాతుమైచ్ఛత. 21

ప్ర. అ. వధ్యమానః = కొట్టబడుచున్న, రౌద్రః = భయంకరుడైన, సః = ఆ విరాధుడు, అప్రకమ్ప్యౌ=యుద్ధములో కదల్పశక్యము కానివారైన, నరవ్యాఘ్రౌ = నరులలో శ్రేష్ఠులైన, తౌ = ఆ రామలక్ష్మణులను, భుజాభ్యామ్ = భుజములతో, సుభృశమ్ = గట్టిగా, పరిగృహ్య = పట్టుకొని, ప్రస్థాతుమ్ = ప్రయాణ మగుటకు, ఐచ్ఛత = ఇచ్ఛయించెను.

తా. ఆ రామలక్ష్మణులు ఆ విధముగా కొట్టుచుండగా, ఆ విరాధుడు, యుద్ధములో కదల్ప శక్యము కాని ఆ నరశ్రేష్ఠులను బాహువులతో గట్టిగా పట్టుకొని వెళ్ళవలె నని సంకల్పించెను. 21

మూ. తస్యాభిప్రాయమాజ్ఞాయ రామో లక్ష్మణమబ్రవీత్,
వహత్వయమలం తావత్పథానేన తు రాక్షసః. 22

ప్ర. అ. తస్య=వానియొక్క, అభిప్రాయమ్=అభిప్రాయమును, ఆజ్ఞాయ = తెలుసుకొని, రామః = రాముడు, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను. అయం రాక్షసః = ఈ రాక్షసుడు, అనేన పథా = ఈ మార్గముచేత, అలమ్ = చక్కగా, వహతు తావత్ = మోయుగాక.

తా. రాము డాతని అభిప్రాయము తెలిసికొని లక్ష్మణునితో ఇట్లు పలికెను. ఈ రాక్షసుడు మనలను ఈ మార్గము మీదుగా మోసికొనిపోయిన మోసుకు పోనిచ్చెదము. 22

మూ. యథా చేచ్ఛతి సౌమిత్రే తథా వహతు రాక్షసః,
అయమేవ హి నః పన్థా యేన యాతి నిశాచరః. 23

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా! రాక్షసః = రాక్షసుడు, యథా = ఎట్లు, ఇచ్ఛతి = కోరుచున్నాడో, తథా = అట్లు, వహతు = మోయుగాక. నిశాచరః = ఈ రాక్షసుడు, యేన = ఏ మార్గముచేత, యాతి = వెళ్లుచున్నాడో, అయమేవ = ఇదే, నః = మనయొక్క, పన్థాః హి = మార్గముకదా.

తా. లక్ష్మణా! ఈ రాక్షసున కిష్టము వచ్చినట్లు మనలను మోసికొని పోనిమ్ము. ఈ రాక్షసుడు వెళ్లుచున్న దారిలోనే మనము వెళ్లవలసి ఉన్నది కదా.

మూ. స తు స్వబలవీర్యేణ సముత్క్షిప్య నిశాచరః,
బాలావివ స్కన్ధగతౌ చకారాతిబలోద్ధతః. 24

ప్ర. అ. అతిబలోద్ధతః = అధికమైన బలముచేత గర్వించిన, సః = ఆ, నిశాచరః తు = రాక్షసుడైతే, స్వబలవీర్యేణ = తన బలముచేతను వీర్యముచేతను, సముత్క్షిప్య = ఎత్తి, బాలావివ = చిన్నపిల్లలను వలె, స్కన్ధగతౌ = భుజములపై ఉన్నవారినిగా, చకార = చేసెను.

తా. అధికమైన బలముచేత గర్వించిన ఆ రాక్షసుడు, తన బలపరాక్రమములచేత ఆ రామలక్ష్మణులను పైకెత్తి చిన్న పిల్లలను వలె భుజములపై కూర్చుండపెట్టుకొనెను. 24

మూ. తావారోప్య తతః స్కన్ధం రాఘవౌ రజనీచరః,
విరాధో వినదన్ ఘోరం జగామాభిముఖో వనమ్. 25

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రజనీచరః = రాక్షసుడైన, విరాధః = విరాధుడు, తౌ రాఘవౌ = ఆ రామలక్ష్మణులను, స్కన్ధమ్ = భుజమును, ఆరోప్య = ఎక్కించుకొని, ఘోరమ్ = భయంకరముగా, వినదన్ = ధ్వనిచేయుచు, వనమ్ అభిముఖః = అరణ్యమునకు అభిముఖుడై, జగామ = వెళ్ళెను.

తా. పిమ్మట ఆ రాక్షసుడైన విరాధుడు, ఆ రామలక్ష్మణులను భుజముపై ఎక్కించుకొని, భయంకరముగా ధ్వని చేయుచు అరణ్యము వైపు వెళెను. 25

మూ. వనం మహామేఘనిభం ప్రవిష్టో
ద్రుమైర్మహద్భిర్వివిధై రుపేతమ్,
నానావిధైః పక్షికులై ర్విచిత్రం
శివాయుతం వ్యాలమృగై ర్వికీర్ణమ్. 26

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
తృతీయః సర్గః.

ప్ర. అ. మహామేఘనిభమ్ = గొప్ప మేఘముతో సమానమైనది, మహద్భిః = పెద్దదైన, వివిధైః = అనేకవిధములైన, ద్రుమైః = వృక్షములతో, ఉపేతమ్ = కూడినది, నానావిధైః = అనేకవిధములైన, పక్షికులైః = పక్షులసముదాయములచేత, విచిత్రమ్ = విచిత్రమైనది, శివాయుతమ్ = ఆడనక్కలతో కూడినదీ, వ్యాలమృగైః = మదించిన ఏనుగులతోను, మృగములతోను, వికీర్ణమ్ = వ్యాప్తమూ అయిన, వనమ్ = వనమును, ప్రవిష్టః = ప్రవేశించెను.

తా. అనేకవిధము లైన మహావృక్షములతో కూడినది, అనేకవిధము లైన పక్షిసముదాయములచేత విచిత్ర మైనది, ఆడ నక్కలతో నిండి యున్నది, మదించిన ఏనుగులతోను మృగాలతోను వ్యాప్తమూ అయిన అరణ్యములోనికి ఆ విరాధుడు ప్రవేశించెను. 26

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో
మూడవ సర్గ సమాప్తము.

చతుర్థః సర్గః

[రామలక్ష్మణులు విరాధుని చంపుట].

మూ. హ్రియమాణౌ తు కాకుత్స్థౌ దృష్ట్వా సీతా రఘూత్తమౌ,
ఉచ్చైఃస్వరేణ చుక్రోశ ప్రగృహ్య సుమహాభుజౌ. 1

ప్ర. అ. సీతా=సీత, ప్రగృహ్య=గ్రహించి, హ్రియమాణౌ=హరింపబడుచున్నవారు, సుమహాభుజౌ=గొప్పభుజములు కలవారు, కాకుత్స్థౌ=కకుత్స్థవంశసంజాతులు అయిన, రఘూత్తమౌ=రామలక్ష్మణులను, దృష్ట్వా=చూచి, ఉచ్చైఃస్వరేణ=ఉన్నతస్వరముతో, చుక్రోశ=అరచెను.

తా. మహాభుజులు, కాకుత్స్థవంశమునందు పుట్టినవారు అయిన రామలక్ష్మణులను విరాధుడట్లు పట్టుకొని తీసికొనిపోవుచుండగా, సీత చూచి బిగ్గరగా ఏడ్చెను.

మూ. ఏష దాశరథీ రామః సత్యవాన్ శీలవాన్ శుచిః,
రక్షసా రౌద్రరూపేణ హ్రియతే సహలక్ష్మణః. 2

ప్ర. అ. సత్యవాన్=సత్యవంతుడు, శీలవాన్=ఉత్తమశీలము కలవాడు, శుచిః=పరిశుద్ధుడు అయిన, ఏషః=ఈ, దాశరథిః=దశరథకుమారుడైన, రామః=రాముడు, సహలక్ష్మణః=లక్ష్మణునితో కూడ, రౌద్రరూపేణ=భయంకరమైన రూపము గల, రక్షసా=రాక్షసునిచేత, హ్రియతే=అపహరించబడుచున్నాడు.

తా. సత్యవంతుడు, మంచి శీలముకలవాడు, పరిశుద్ధుడు, అయిన ఈ దశరథకుమారుడైన రాముణ్ణి, లక్ష్మణసహితముగా భయంకరాకారము గల ఈ రాక్షసుడు హరించుచున్నాడు.

మూ. మామృక్షా భక్షయిష్యన్తి శార్దూలద్వీపినస్తథా,
మాం హరోత్సృజ కాకుత్థ్సౌ నమస్తే రాక్షసోత్తమ. 3

ప్ర. అ. మామ్=నన్ను, ఋక్షాః = ఎలుగుబంట్లు, తథా=మరియు, శార్దూలద్వీపినః=పెద్దపులులు చిరుతపులులు, భక్షయిష్యన్తి = భక్షించగలవు. రాక్షసోత్తమ = ఓః రాక్షసశ్రేష్ఠుడా! మామ్ = నన్ను, హర=అపహరించుము. కాకుత్థ్సౌ=రామలక్ష్మణులను, ఉత్సృజ=విడిచిపెట్టుము. తే=నీకు, నమః= నమస్కారము.

తా. నన్ను ఎలుగుబంట్లు, చిరుతపులులు, పెద్దపులులు భక్షించివేయును. ఓః రాక్షసోత్తమా! నీకు నమస్కారము. ఈ రామలక్ష్మణులను విడచి నన్ను తీసికొనిపొమ్ము. 3

మూ. తస్యాస్తద్వచనం శ్రుత్వా వైదేహ్యా రామలక్ష్మణౌ,
వేగం ప్రచక్రతుర్వీరౌ వధే తస్య దురాత్మనః. 4

ప్ర. అ. వీరౌ = వీరులైన, రామలక్ష్మణౌ = రామలక్ష్మణులు, తస్యాః వైదేహ్యాః=ఆ సీతయొక్క, తత్ వచనమ్ = ఆ వచనమును, శ్రుత్వా = విని, దురాత్మనః= = దురాత్ముడైన, తస్య=ఆ విరాధునియొక్క, వధే=వధయందు, వేగమ్ = వేగమును, ప్రచక్రతుః = చేసిరి.

తా. వీరులైన రామలక్ష్మణులు సీత మాటలు విని, ఆ దురాత్ముడైన విరాధుని చంపుటకు వేగముగా ప్రవర్తించిరి. 4

మూ. తస్య రౌద్రస్య సౌమిత్రిః సవ్యం బాహుం బభఞ్జ హ,
రామస్తు దక్షిణం బాహుం తరసా తస్య రక్షసః. 5

ప్ర. అ. సౌమిత్రిః = లక్ష్మణుడు, రౌద్రస్య = భయంకరుడైన, తస్య = ఆ విరాధునియొక్క, సవ్యం బాహుమ్=ఎడమ చేతిని, బభఞ్జ హ = విరిచివేసెను. రామః తు=రాముడైతే, తస్య రక్షసః=ఆ రాక్షసునియొక్క, దక్షిణమ్=కుడిదైన, బాహుమ్ = బాహువును, తరసా=బలముచేత, విరచెను.

తా. భయంకరుడైన ఆ రాక్షసుని ఎడమ భుజమును లక్ష్మణుడు ఛేదించెను. రాముడు అతని కుడి భుజమును బలపూర్వకముగా విరచెను.

మూ. స భగ్నబాహుః సంవిగ్నః పపాతాశు విమూర్ఛితః,
ధరణ్యాం మేఘసంకాశో వజ్రభిన్న ఇవాచలః. 6

ప్ర. అ. భగ్నబాహుః = విరగగొట్టబడిన బాహువులు గల, మేఘసంకాశః=మేఘముతో సమానుడైన, సః=ఆ రాక్షసుడు, సంవిగ్నః=దిగులు చెందినవాడై, విమూర్ఛితః= మూర్ఛచెందినవాడై, వజ్రభిన్నః = వజ్రముచేత భేదింపబడిన, అచలః ఇవ=మేఘము వలె, ఆశు=శీఘ్రముగా, ధరణ్యామ్=నేలపై, పపాత=పడెను.

తా. మేఘము వలె ఉన్న ఆ రాక్షసుడు బాహువులు విరిగిపోవుటచే దిగులు చెంది, మూర్ఛపోయి, వజ్రముచే ఛేదింపబడిన పర్వతము వలె నేలమీద కూలెను. 6

మూ. ముష్టిభిర్బాహుభిః పద్భిః సూదయన్తౌ తు రాక్షసమ్,
ఉద్యమ్యోద్యమ్య చాప్యేనం స్థణ్డిలే నిష్పిపేషతుః. 7

ప్ర. అ. రాక్షసమ్=ఆ రాక్షసుణ్ణి, ముష్టిభిః=పిడికిళ్లచేతను, బాహుభిః=బాహువులచేతను, పద్భిః = పాదములచేతను, సూదయన్తౌ = కుమ్ముచున్నవారై, (ఆ రామలక్ష్మణులు) ఏనమ్=వీనిని, ఉద్యమ్యోద్యమ్య=ఎత్తి ఎత్తి, స్థణ్డిలే=నేలమీద, నిష్పిపేషతుః=పిండిరి.

తా. రామలక్ష్మణులు ఆ రాక్షసుణ్ణి పిడికిళ్ళచేత, బాహువులచేత, పాదాలచేత కుమ్ముచు, ఎత్తి ఎత్తి నేలపై పడవేసి పిండివేసిరి. 7

మూ. స విద్ధో బహుభిర్బాణైః ఖడ్గాభ్యాం చ పరిక్షతః,
నిష్పిష్టో బహుధా భూమౌ న మమార స రాక్షసః. 8

ప్ర. అ. బహుభిః=అనేకమైన, బాణైః = బాణములచేత, విద్ధః = కొట్టబడినవాడు, ఖడ్గాభ్యామ్ = రెండు ఖడ్గములచేత, పరిక్షతః = చీల్చబడినవాడు, బహుధా = అనేకవిధములుగ, భూమౌ=నేలమీద, నిష్పిష్టః = నలగగొట్టబడినవాడు అయినను, సః రాక్షసః = ఆ రాక్షసుడు, న మమార=చావలేదు.

తా. అనేకబాణములచేత కొట్టినా, ఖడ్గాలతో పొడిచినా, నేలపై పడవేసి అనేకవిధముల నలిపివేసినా ఆ రాక్షసుడు చావలేదు. 8

మూ. తం ప్రేక్ష్య రామః సుభృశమవధ్యమచలోపమమ్,
భయేష్వభయదః శ్రీమానిదం వచనమబ్రవీత్. 9

ప్ర. అ. భయేషు = భయ హేతువు లున్నప్పుడు, అభయదః = అభయము నిచ్చు, శ్రీమాన్ = శ్రీమంతుడైన, రామః = రాముడు, అచలోపమమ్ = పర్వతముతో సమానుడైన, తమ్ = ఆ విరాధుని, సుభృశమ్ = మిక్కిలి, అవధ్యమ్ = చంపశక్యము కానివానినిగా, ప్రేక్ష్య = చూచి, ఇదమ్ = ఈ, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. భయమునకు తగు కారణము లేవైన కలిగి నప్పుడు అభయ మిచ్చేవాడు, శ్రీమంతుడు అయిన ఆ రాముడు, పర్వతము వంటి శరీరము గల ఆ విరాధుణ్ణి చంపుట అన్ని విధాలా శక్యము కాదను విషయము గ్రహించి ఇట్లు పలికెను. 9

మూ. తపసా పురుషవ్యాఘ్ర రాక్షసోఽయం న శక్యతే,
శస్త్రేణ యుధి నిర్జేతుం రాక్షసం నిఖనావహే 10

ప్ర. అ. పురుషవ్యాఘ్ర = పురుష శ్రేష్ఠుడవైన లక్ష్మణా! తపసా = తపోబలముచేత, అయం రాక్షసః = ఈ రాక్షసుడు, యుధి = యుద్ధమునందు, శస్త్రేణ = ఆయుధముచేత, నిర్జేతుమ్ = జయించుటకు, న శక్యతే = శక్యమైనవాడు కాడు. రాక్షసమ్ = ఈ రాక్షసుని, నిఖనావహే = పాతిపెట్టెదము.

తా. మనుష్యులలో శ్రేష్ఠుడ వైన లక్ష్మణా! ఈ విరాధుడు తపోబలమున్నవా డగుటచే ఈతనిని యుద్ధములో శస్త్రముచేత చంప శక్యము కాదు. అందుచేత వీనిని పాతివేయుదము. 10

మూ. కుఞ్జరస్యేవ రౌద్రస్య రాక్షసస్యాస్య లక్ష్మణ,
వనేఽస్మిన్ సుమహచ్ఛ్వభ్రం ఖన్యతాం రౌద్రవర్చసః. 11

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా! రౌద్రస్య = క్రూరుడైన, రౌద్రవర్చసః = భయంకరమైన కాంతి గల, అస్య రక్షసః = ఈ రాక్షసునకు, కుఞ్జరస్యేవ = ఏనుగునకు వలె, అస్మిన్ = ఈ, వనే = వనమునందు, సుమహత్ = చాల పెద్దదైన శ్వభ్రమ్ = గొయ్యి, ఖన్యతామ్ = త్రవ్వబడుగాక.

తా. లక్ష్మణా! క్రూరుడూ, భయంకరమైన పరాక్రమము కలవాడూ అయిన ఈ రాక్షసుని ఈ అరణ్యములో పాతిపెట్టుటకు, ఏనుగకొరకు చేసినట్లు పెద్ద గొయ్యి త్రవ్వుము. 11

మూ. ఇత్యుక్త్వా లక్ష్మణం రామః ప్రదరః ఖన్యతామితి,
తస్థౌ విరాధమాక్రమ్య కణ్ఠే పాదేన వీర్యవాన్. 12

ప్ర. అ. వీర్యవాన్ = పరాక్రమవంతుడైన, రామః = రాముడు, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, ఇతి = ఈ విధముగా, ప్రదరః = గొయ్యి, ఖన్యతామ్ = త్రవ్వబడుగాక, ఇతి = అని, ఉక్త్వా = పలికి, విరాధమ్ = విరాధుడ్ని, పాదేన = పాదముచేత, కణ్ఠే = కంఠమునందు, ఆక్రమ్య = ఆక్రమించి, తస్థౌ = నిలచెను.

తా. పరాక్రమవంతుడైన రాముడు ఈ విధముగా లక్ష్మణుని "గొయ్యి త్రవ్వుము" అని ఆజ్ఞాపించి ఆ విరాధుడ్ని కంఠముమీద కాలు వేసి త్రొక్కిపట్టి నిలబడెను. 12

మూ. తచ్ఛ్రుత్వా రాఘవేణోక్తం రాక్షసః ప్రశ్రితం వచః,
ఇదం ప్రోవాచ కాకుత్స్థం విరాధః పురుషర్షభమ్. 13

ప్ర. అ. రాక్షసః = రాక్షసుడైన, విరాధః = విరాధుడు, రాఘవేణ = రామునిచేత, ఉక్తమ్ = పలకబడిన, తత్ = ఆ వాక్యమును, శ్రుత్వా = విని, పురుషర్షభమ్ = పురుషశ్రేష్ఠుడైన, కాకుత్స్థమ్ = రాముణ్ణి గూర్చి, ఇదమ్ = ఈ, ప్రశ్రితమ్ = వినయముతో కూడిన, వచః = వచనమును, ప్రోవాచ = పలికెను.

తా. రాముడు పలికిన మాటలు విన్న విరాధుడు, పురుషశ్రేష్ఠుడైన ఆ రామునితో వినయపూర్వకముగా ఇట్లు పలికెను. 13

మూ. హతోఽహం పురుషవ్యాఘ్ర శక్రతుల్యబలేన వై,
మయా తు పూర్వం త్వం మోహాన్న జ్ఞాతః పురుషర్షభ.

ప్ర. అ. పురుషవ్యాఘ్ర = పురుషశ్రేష్ఠుడా! శక్రతుల్యబలేన = దేవేంద్రునితో సమానమైన బలము గల నీచేత, అహమ్ = నేను, హతః = చంపబడితిని. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా! మయా = నాచేత, మోహాత్ = అజ్ఞానమువలన, త్వమ్ = నీవు, పూర్వమ్ = ముందుగా, న జ్ఞాతః = తెలియబడలేదు.

తా. ఓ। పురుషశ్రేష్ఠుడా। దేవేంద్రునితో సమానమైన బలము గల నీవు నన్ను చంపినావు. అజ్ఞానముచే నేను, ముందుగా నీ వెవ్వరవో తెలిసికొనలేక పోయినాను.

మూ. కౌసల్యాసుప్రజాస్తాత రామ స్త్వం విదితో మయా,
వైదేహీ చ మహాభాగా లక్ష్మణశ్చ మహాయశాః. 15

ప్ర. అ. తాత = తండ్రీ। త్వమ్ = నీవు, కౌసల్యాసుప్రజాః = కౌసల్య యొక్క ఉత్తమసంతానమైన, రామః = రాముడవుగా, విదితః = తెలియబడితివి, మహాభాగా = మహాభాగ్యవంతురాలైన, వైదేహీ చ = సీత, మహాయశాః = గొప్ప కీర్తి గల, లక్ష్మణశ్చ = లక్ష్మణుడు కూడ, (తెలియబడినారు).

తా. తండ్రీ। నీవు కౌసల్యాసుపుత్రుడ వైన రాముడ వని తెలిసికొన్నాను. మహాభాగ్యవంతురాలైన సీతను, గొప్ప కీర్తి గల లక్ష్మణుని కూడ గుర్తించినాను.

మూ. అభిశాపాదహం ఘోరాం ప్రవిష్టో రాక్షసీం తనుమ్,
తుమ్బురుర్నామ గన్ధర్వః శప్తో వైశ్రవణేన హి. 16

ప్ర. అ. అహమ్ = నేను, అభిశాపాత్ = శాపమువలన, ఘోరామ్ = భయంకరమైన, రాక్షసీమ్ = రాక్షససంబంధమైన, తనుమ్ = శరీరమును, ప్రవిష్టః = ప్రవేశించినాను. వైశ్రవణేన = కుబేరునిచేత, శప్తః = శపింపబడిన, తుమ్బురుః నామ = తుంబురుడు అను పేరు గల, గన్ధర్వః = గంధర్వుడను.

తా. శాపమువలన నా కీ ఘోరమైన రాక్షసశరీరము వచ్చినది. నేను తుంబురు డను గంధర్వుడను. నన్ను కుబేరుడు శపించెను. 16

మూ. ప్రసాద్యమానశ్చ మయా సోఽబ్రవీన్మాం మహాయశాః,
యదా దాశరథీ రామస్త్వాం వధిష్యతి సంయుగే, 17
తదా ప్రకృతిమాపన్నో భవాన్ స్వర్గం గమిష్యతి.

ప్ర. అ. మయా = నాచేత, ప్రసాద్యమానః = అనుగ్రహింపచేసికొనబడిన వాడై, మహాయశాః = గొప్ప కీర్తి గల, సః = ఆ కుబేరుడు, మామ్ = నన్ను గూర్చి, అబ్రవీత్ = పలికెను. దాశరథిః = దశరథకుమారుడైన, రామః =

రాముడు, యదా = ఎప్పుడు, త్వామ్ = నిన్ను, సంయుగే = యుద్ధమునందు, వధిష్యతి = చంపగలడో, తదా = అప్పుడు, ప్రకృతిమ్ = సహజస్వరూపమును, ఆపన్నః = పొందినవాడవై, భవాన్ = నీవు, స్వర్గమ్ = స్వర్గమును గూర్చి, గమిష్యతి = వెళ్లగలవు.

తా. నేను వేడుకొనగా, మహాయశఃశాలియైన ఆ కుబేరు డిట్లు పలికెను. "దశరథకుమారుడైన రాముడు నిన్నెప్పుడు యుద్ధములో సంహరించునో అప్పుడు నీవు నీ సహజరూపము పొంది స్వర్గము చేరగలవు." 17

మూ. అనుపస్థీయమానో మాం స క్రుద్ధో వ్యాజహార హ, 18
ఇతి వైశ్రవణో రాజా రమ్భాసక్తమువాచ హ.

ప్ర. అ. సః = ఆ కుబేరుడు, అనుపస్థీయమానః = సేవార్థమై చేరబడని వాడై, క్రుద్ధః = కోపించినవాడై, మామ్ = నన్ను గూర్చి, వ్యాజహార = ఇట్లు పలికెను. రాజా = ప్రభువైన, వైశ్రవణః = కుబేరుడు, రమ్భాసక్తమ్ = రంభ యందు ఆసక్తుడనై ఉన్న నన్ను గూర్చి, ఇతి = ఇట్లు, వ్యాజహార హ = పలికెను (శపించెను).

తా. నేను రంభాసక్తుడనై ఆ కుబేరుని సేవించుటకు వెళ్లకపోవుటచేత, ఆతడు కోపించి నన్నీ విధముగా శపించి, పిదప అనుగ్రహించినాడు. 18

మూ. తవ ప్రసాదాన్ముక్తోఽహమభిశాపాత్సుదారుణాత్. 19
భువనం స్వం గమిష్యామి స్వస్తి వోఽస్తు పరంతప.

ప్ర. అ. తవ = నీయొక్క, ప్రసాదాత్ = అనుగ్రహమువలన, సుదారుణాత్ = చాల భయంకరమైన, అభిశాపాత్ = శాపమునుండి, అహమ్ = నేను, ముక్తః = విడువబడితిని. పరంతప = శత్రుసంహారకుడా! స్వమ్ = నా సంబంధమైన, భువనమ్ = లోకమును గూర్చి, గమిష్యామి = వెళ్లగలను. వః = మీకు, స్వస్తి = క్షేమము, అస్తు = అగుగాక.

తా. శత్రుసంహారకుడవైన ఓ! రామా! నీ అనుగ్రహమువలన, చాల భయంకరమైన ఈ శాపమునుండి విముక్తుడనైతిని. ఇక నా లోకానికి వెళ్లెదను. మీ కందరికీ క్షేమ మగుగాక. 19

మూ. ఇతో వసతి ధర్మాత్మా శరభఙ్గః ప్రతాపవాన్, 20
అధ్యర్ధయోజనే తాత మహర్షిః సూర్యసంనిభః,
తం క్షిప్రమధిగచ్ఛ త్వం స తే శ్రేయోఽభిధాస్యతి. 21

ప్ర. అ. తాత = తండ్రీ, ఇతః = ఇక్కడినుండి, అధ్యర్ధయోజనే = ఒకటిన్నర యోజనముల దూరమునందు, ధర్మాత్మా = ధర్మాత్ముడు, ప్రతాపవాన్ = ప్రతాపము కలవాడు, సూర్యసంనిభః = సూర్యునితో సమానుడు, అయిన, శరభఙ్గః = శరభంగు డను, మహర్షిః = మహర్షి, వసతి = నివసించుచున్నాడు. త్వమ్ = నీవు, క్షిప్రమ్ = శీఘ్రముగా, తమ్ = ఆ మహర్షిని, అధిగచ్ఛ = పొందుము. సః = ఆతడు, తే = నీకు, శ్రేయః = శ్రేయస్సును కలిగించు ఉపాయమును, అభిధాస్యతి = చెప్పగలడు.

తా. తండ్రీ! ధర్మాత్ముడు, ప్రతాపవంతుడు, సూర్యునితో సమానుడు అయిన శరభంగు డనే మహర్షి ఇక్కడికి ఒకటిన్నర యోజనముల దూరములో నివసించుచున్నాడు. నీవు ఆతని వద్దకు వెళ్లుము. నీ కాతడు శ్రేయస్సును కలిగించు ధర్మమును ఉపదేశించగలడు. 20, 21

మూ. అవటే చాపి మాం రామ నిక్షిప్య కుశలీ వ్రజ.
రక్షసాం గతసత్త్వానామేష ధర్మః సనాతనః. 22.
అవటే యే నిధీయన్తే తేషాం లోకాః సనాతనాః.

ప్ర. అ. రామ = రామా! మామ్ = నన్ను, అవటే = గోతిలో, నిక్షిప్య = ఉంచి, కుశలీ = క్షేమము కలవాడవై, వ్రజ = వెళ్లుము. గతసత్త్వానామ్ = పోయిన ప్రాణము గల, రక్షసామ్ = రాక్షసులకు, ఏషః = ఇది, సనాతనః = ప్రాచీనమైన, ధర్మః = ధర్మము. యే = ఎవరు, అవటే = గోతిలో, వినిక్షిప్యన్తే = ఉంచబడుతారో, తేషామ్ = వారికి, సనాతనాః = శాశ్వతములైన, లోకాః = లోకములు లభించును.

తా. రామా! నన్ను గోతిలో పాతిపెట్టి క్షేమముగా వెళ్లుము. మరణించిన రాక్షసులకు ఇది ప్రాచీనకాలమునుంచి వచ్చుచున్న ధర్మము. గోతిలో పాతబడే వారికి శాశ్వతములైన లోకములు లభించును. 22

మూ. ఏవముక్త్వా తు కాకుత్స్థం విరాధః శరపీడితః, 23
బభూవ స్వర్గసంప్రాప్తో న్యస్తదేహో మహాబలః.

ప్ర. అ. మహాబలః = గొప్ప బలము గల, విరాధః = విరాధుడు, కాకుత్స్థమ్ = రాముణ్ణి గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, శరపీడితః = శరముచేత పీడింపబడినవాడై, న్యస్తదేహః = విడువబడిన దేహము కలవాడై, స్వర్గసంప్రాప్తః = స్వర్గమును పొందినవాడు, బభూవ = అయెను.

తా. మహాబలవంతు డైన ఆ విరాధుడు రామునితో ఇట్లు పలికి, బాణము చేత కలిగిన బాధచే శరీరమును విడచి స్వర్గస్థు డయ్యెను. 23

మూ. తచ్ఛ్రుత్వా రాఘవో వాక్యం లక్ష్మణం వ్యాదిదేశ హ.
కుఞ్జరస్యేవ రౌద్రస్య రాక్షసస్యాస్య లక్ష్మణ,
వనేఽస్మిన్ సుమహాన్ శ్వభ్రః ఖన్యతాం రౌద్రకర్మణః,
ఇత్యుక్త్వా లక్ష్మణం రామః ప్రదరః ఖన్యతామితి,
తస్థౌ విరాధమాక్రమ్య కణ్ఠే పాదేన వీర్యవాన్.

ప్ర. అ. రాఘవః = రాముడు, తత్ వాక్యమ్ = ఆ వాక్యమును, శ్రుత్వా = విని, లక్ష్మణమ్ = లక్ష్మణుని, వ్యాదిదేశ హ = ఆజ్ఞాపించెను.

తా. రాముడు ఆ వాక్యమును విని లక్ష్మణుని ఇట్లు ఆజ్ఞాపించెను.
25, 26శ్లోకాలకు చూ. 11, 12, శ్లోకాలు. రౌద్రకర్మణః = భయంకర మైన కర్మ గల.

మూ. తతః ఖనిత్రమాదాయ లక్ష్మణః శ్వభ్రముత్తమమ్,
అఖనత్ పార్శ్వతస్తస్య విరాధస్య మహాత్మనః. 27

ప్ర. అ. తతః = అటుపిమ్మట, లక్ష్మణః = లక్ష్మణుడు, ఖనిత్రమ్ = గునపమును, ఆదాయ = గ్రహించి, మహాత్మనః = మహాత్ము డైన, తస్య విరాధస్య = ఆ విరాధునియొక్క, పార్శ్వతః = ప్రక్క, ఉత్తమమ్ = పెద్ద దైన, శ్వభ్రమ్ = గోతిని, అఖనత్ = త్రవ్వెను.

తా. పిమ్మట లక్ష్మణు డొక గునపముతో, మహాత్ము డైన ఆ విరాధునకు ప్రక్కనే ఒక పెద్ద గొయ్యి త్రవ్వెను. 27

మూ. తం ముక్తకణ్ఠముత్క్షిప్య శఙ్కుకర్ణం మహాస్వనమ్,
విరాధం ప్రాక్షిపచ్ఛ్వభ్రే నదన్తం భైరవస్వనమ్. 28

ప్ర. అ. ముక్తకణ్ఠమ్=విడవబడిన కంఠము గల, మహాస్వనమ్=గొప్ప ధ్వని గల, శఙ్కుకర్ణమ్ = మొనలు దేలిన (శంకువుల వంటి) చెవులు గల, భైరవస్వనమ్ = భయంకరమైన ధ్వని కలుగునట్లుగా, నదన్తమ్ = ధ్వనిచేయుచున్న, తం విరాధమ్ = ఆ విరాధుణ్ణి, శ్వభ్రే = గోతిలో, ప్రాక్షిపత్ = పడద్రోసెను.

తా. రాముడు మహాధ్వనిచేయుచున్న, మొనలు దేలిన చెవులు గల ఆ విరాధుని కంఠమునుండి కాలు తీసివేసెను. అప్పుడు అతిభయంకర మగు ధ్వని కలుగునట్లు అరచుచున్న ఆ విరాధుని లక్ష్మణుడు గోతిలోనికి పడద్రోసెను. 28

మూ. తమాహవే దారుణమాశువిక్రమౌ
స్థిరావుభౌ సంయతి రామలక్ష్మణౌ,
ముదాన్వితౌ చిక్షిపతుర్భయావహం
నదన్తముత్క్షిప్య బలేన రాక్షసమ్. 29

ప్ర. అ. ఆశువిక్రమౌ = శీఘ్రమైన పరాక్రమము కలవారు, సంయతి= యుద్ధమునందు, స్థిరౌ = స్థిరులు అయిన, రామలక్ష్మణౌ=రామలక్ష్మణులు, ఉభౌ =ఇద్దరూ, ముదా=సంతోషముతో, అన్వితౌ=కూడినవారై, ఆహవే= యుద్ధమునందు, దారుణమ్ = చాలక్రూరుడు, భయావహమ్ = భయమును కలిగించువాడు, నదన్తమ్ = ధ్వనిచేయుచున్నవాడు అయిన, తం రాక్షసమ్ = ఆ రాక్షసుని, బలేన = బలముచేత, ఉత్క్షిప్య = ఎత్తి, చిక్షిపతుః = (గోతిలోనికి) విసరివేసిరి.

తా. శీఘ్రమైన పరాక్రమము కలవారు, యుద్ధములో స్థిరులు అయిన ఆ రామలక్ష్మణు లిద్దరూ, సంతోషించుచు, యుద్ధములో క్రూరుడు, భయంకరుడు అయిన ఆ రాక్షసుడు అరచుచుండగా ఎత్తి గోతిలోనికి పడద్రోసిరి. 29

మూ. అవధ్యతాం ప్రేక్ష్య మహాసురస్య తౌ
శితేన శస్త్రేణ తదా నరర్షభౌ,
సమర్థ్య చాత్యర్థవిశారదావుభౌ
బిలే విరాధస్య వధం ప్రచక్రతుః. 30

ప్ర. అ. తదా=అప్పుడు, నరర్షభౌ=నరులలో శ్రేష్ఠులు, అత్యర్థవిశారదౌ =మిక్కిలి నేర్పుగలవారు, అయిన, తౌ ఉభౌ= ఆ రామలక్ష్మణు లిద్దరూ, శితేన = వాడియైన, శస్త్రేణ = ఆయుధముచేత, మహాసురస్య = మహాసురుడైన, తస్య విరాధస్య = ఆ విరాధునియొక్క, అవధ్యతామ్ = చంప శక్యము కాకుండుటను, ప్రేక్ష్య = చూచి, సమర్థ్య=బాగుగా ఆలోచించి, బిలే=గోతిలో, వధమ్=వధను, ప్రచక్రతుః = చేసిరి.

తా. చాల నేర్పు గల నరశ్రేష్ఠు లైన ఆ రామలక్ష్మణు లిద్దరూ, మహాసురు డైన ఆ విరాధుడు వాడి యైన ఆయుధములచేత వధింప శక్యము కానివాడు అను విషయమును తెలిసికొని, బాగుగా ఆలోచించి, గోతిలో పూడ్చిపెట్టుట ద్వారా ఆతనిని సంహరించిరి. 30

మూ. స్వయం విరాధేన హి మృత్యుమా(రా)త్మనః
ప్రసహ్య రామేణ యథార్థమీప్సితః,
నివేదితః కాననచారిణా స్వయం
న మే వధః శస్త్రకృతో భవేదితి. 31

ప్ర. అ. విరాధేన = విరాధునిచేత, స్వయమ్ = స్వయముగా, ఆత్మనః= తనయొక్క, మృత్యుః = మృత్యువు, యథార్థమ్ = నిజముగా, ప్రసహ్య = బలాత్కారముగా, రామేణ = రామునిచేత (నుండి), ఈప్సితః = కోరబడినది. కాననచారిణా = అడవిలో సంచరించుచున్న ఆ విరాధునిచేత, మే = నాకు, శస్త్ర కృతః = ఆయుధములచేత చేయబడిన, వధః = వధ, న భవేత్ = కలగదు, ఇతి = అని, స్వయమ్ = స్వయముగా, నివేదితః = తెలపబడినది.

తా. రాముడే బలాత్కారముగా తనను చంపవలె నని విరాధుడే స్వయముగా కోరుకొనుచుండెను. అందుచేతనే అడవిలో సంచరించే ఆ విరాధుడు నాకు శస్త్రములచేత మరణము రాదు అని స్వయముగా చెప్పెను. 32

మూ. తదేవ రామేణ నిశమ్య భాషితం
కృతా మతి స్తస్య బిలప్రవేశనే,
బిలం చ తేనాతిబలేన రక్షసా
ప్రవేశ్యమానేన వనం వినాదితమ్. 32

ప్ర. అ. తత్ = ఆ, భాషితమేవ = వాక్యమునే, నిశమ్య = విని, రామేణ =రామునిచేత, తస్య=ఆ రాక్షసునియొక్క, బిలప్రవేశనే = గోతిలో పడవేయుట యందు, మతిః = బుద్ధి, కృతా = చేయబడినది. బిలమ్ = బిలమును, ప్రవేశ్య మానేన = ప్రవేశపెట్టబడుచున్న, అతిబలేన = చాల బలము గల, తేన రక్షసా = అ రాక్షసునిచేత, వనమ్ = వనము, వినాదితమ్ = ధ్వనింప చేయబడినది.

తా. ఆ మాట విన్నతరవాతనే రాముడు ఆ రాక్షసుని గోతిలో కప్పివేయ వలె నని నిర్ణయించెను. ఆ విధముగా గోతిలో త్రోసివేయబడుచున్నప్పుడు అ రాక్షసుడు ఆ వనమును శబ్దముచే ప్రతిధ్వనింపచేసెను. 32

మూ. ప్రహృష్టరూపావివ రామలక్ష్మణౌ
విరాధముర్వ్యాం ప్రదరే నిపాత్య తమ్,
ననన్దతుర్వీతభయౌ మహావనే
శిలాభిరన్తర్దధతుశ్చ రాక్షసమ్. 33

ప్ర. అ. ప్రహృష్టరూపావివ=చాల సంతోషించినట్లున్న, రామలక్ష్మణౌ= రామలక్ష్మణులు, తం విరాధమ్ = ఆ విరాధుని, ఉర్వ్యామ్ = భూమిలో, ప్రదరే = గోతిలో, నిపాత్య = పడవేసి, వీతభయౌ = పోయిన భయము కల వారై, మహావనే = ఆ మహారణ్యమునందు, ననన్దతుః=సంతోషించిరి. రాక్షసమ్= రాక్షసుణ్ణి, శిలాభిః = శిలలచేత, అన్తర్దధతుశ్చ = కప్పివేసిరి.

తా. రామలక్ష్మణులు చాల సంతోషించుచు, ఆ విరాధుణ్ణి నేలపై గోతిలో పడవేసి, ఆ మహావనములో భయము లేనివారై ఆనందించిరి. ఆ రాక్షసుణ్ణి శిలలతో కప్పివేసిరి. 33

మూ. తతస్తు తౌ కాఞ్చనచిత్రకార్ముకౌ
నిహత్య రక్షః పరిగృహ్య మైథిలీమ్,
విజహ్రతుస్తౌ ముదితౌ మహావనే
దివి స్థితౌ చన్ద్రదివాకరావివ. 34

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
చతుర్థః సర్గః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, కాఞ్చనచిత్రకార్ముకౌ = బంగారముచేత చిత్రవర్ణము లైన ధనస్సులు గల, తౌ = ఆ రామలక్ష్మణులు, రక్షః=రాక్షసుని, నిహత్య = చంపి, మైథిలీమ్ = సీతను, పరిగృహ్య = తీసికొని, మహావనే = మహావనమునందు, ముదితౌ = ఆనందించుచున్నవారై, దివి = ఆకాశమునందు, స్థితౌ=ఉన్న, తౌ=ఆ, చన్ద్రదివాకరావివ=చంద్రసూర్యులు వలె, విజహ్రతుః= విహరించిరి.

తా. పిమ్మట బంగారముచేత చిత్రవర్ణము లైన ధనస్సులను ధరించిన ఆ రామలక్ష్మణులు ఆ రాక్షసుని సంహరించి, సీతను స్వీకరించి, సంతోషించుచు, ఆ మహావనములో, ఆకాశముమీద ఉన్న చంద్రసూర్యులు వలె విహరించిరి.

వి. ఇది గోరఖ్‌పూర్ ప్రతిలోని పాఠము. దాక్షిణాత్యపాఠం (వావిళ్లవారు ప్రచురించినది) కూడ ఇట్లే ఉండవచ్చును. ఈ వృత్తాంతంలో కొంత అనౌచిత్యము కనబడుతూన్నది. విరాధుడు రామలక్ష్మణులను భుజములపైకి ఎక్కించుకొని వెళ్లిపోయి నట్లు అప్పుడు రాముడు సీత విషయమే పట్టించుకొనకుండా మనం వెళ్లవలసినది కూడా ఆ వైపునకే కదా, ఈతడు మనలను మోసికొని పోతే అదీ మనకు మంచిదే అని అంటూ వాహనసౌఖ్యం లభించినందుకు సంతోషిస్తూన్నట్లు ఉండడం కొంతదూరం ఘనారణ్యంలోనికి వెళ్లిపోవడం ఇదంతా రాముని స్వభావానికి విరుద్ధంగా ఉన్నది. ఇంక సీత "అయ్యో! నన్ను మృగాలు భక్షించివేస్తాయి. వాళ్ళిద్దరినీ విడిచిపెట్టి నన్ను తీసికొని వెళ్లు" అనడం కూడా అనుచితంగానే ఉంది. ''వాళ్లతో పాటు నన్ను కూడా తీసికొనిపోయి చంపివెయ్యి'' అంటే కొంత యుక్తంగా ఉంటుందేమో. ఈ సర్గ చివరి 29-33 శ్లోకాలలో వాల్మీకి ముద్ర లేదు. ప్రాచ్యపాఠంలో కథ ఈ విధంగా ఉన్నది. విరాధుడు సీతను గ్రహించడంతో రాముడు విషణ్ణుడౌతాడు. లక్ష్మణుడు ఆయనకు ధైర్యం చెప్పి ఏడుబాణాలు ప్రయోగించగా అవి రాక్షసుని శరీరంలో దూరి బైటకు వచ్చేస్తాయి. విరాధుడు లక్ష్మణునిమీద ప్రయోగించిన శూలాన్ని రాముడు రెండు బాణాలతో ఆకాశంమీదనే ఖండించి ఒక్క బాణంతో వాని వక్షస్థలం చీల్చేస్తాడు. దానితో అతడు నేలపై పడిపోయి, తన పూర్వవృత్తాంతం తెలిపి, రాముని చేతుల్లో చావడానికై కావాలనే ఆతనికి కోపం కలిగించడానికి సీతను గ్రహించినటు చెప్పి, రాక్షసధర్మానుసారం తనను గోతిలో కప్పమని కోరి,

శరభంగముని విషయం చెప్పి స్వస్వరూపంతో స్వర్గలోకానికి వెళ్లిపోతాడు". దీనిలో పైన చూచిన అనౌచిత్యం లేదు. విరాధుణ్ణి చంపినది రాముడేకాని రామ లక్ష్మణు లిద్దరూ కలిసి కాదు అని సుందరకాండలో సీత మాటలను పట్టికూడ తెలుస్తుంది. 34

''బాలానందిని'' యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
అరణ్యకాండలో నాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చమః సర్గః

[*సీతాలక్ష్మణసమేతు డైన రాముడు శరభంగాశ్రమమునకు వెళ్ళుట. అక్కడ దేవతలను చూచుట. శరభంగమునితో సంభాషించుట. శరభంగముని బ్రహ్మలోకమునకు వెళ్ళుట.*]

మూ. హత్వా తు తం భీమబలం విరాధం రాక్షసం వనే,
తతః సీతాం పరిష్వజ్య సమాశ్వాస్య చ వీర్యవాన్, 1
అబ్రవీద్భ్రాతరం రామో లక్ష్మణం దీప్తతేజసమ్.

ప్ర. అ. వీర్యవాన్ = పరాక్రమవంతు డైన, రామః = రాముడు, భీమబలమ్ = భయంకర మైన బలము గల, రాక్షసమ్ = రాక్షసు డైన, తం విరాధమ్ = ఆ విరాధుణ్ణి, వనే = వనమునందు, హత్వా = చంపి, తతః = అటు పిమ్మట, సీతామ్ = సీతను, పరిష్వజ్య = కౌగలించుకొని, సమాశ్వాస్య చ = ఓదార్చి, దీప్తతేజసమ్ = ప్రజ్వలించుచున్న తేజస్సు గల, భ్రాతరమ్ = సోదరు డైన, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. పరాక్రమశాలి యైన రాముడు భయంకర మైన బలము గల రాక్షసు డైన ఆవిరాధుణ్ణి వనములో సంహరించి, సీతను కౌగలించుకొని, ఓదార్చి, తేజస్సుతో ప్రకాశించుచున్న సోదరు డైన లక్ష్మణునితో ఇట్లనెను. 1

మూ. కష్టం వనమిదం దుర్గం న చ స్మో వనగోచరాః, 2
అభిగచ్ఛామహే శీఘ్రం శరభఙ్గం తపోధనమ్.

ప్ర. అ. ఇదమ్ = ఈ, దుర్గమ్ = ప్రవేశింప శక్యము కాని. వనమ్ = వనము, కష్టమ్ = కష్టములను కలిగించునది. వనగోచరాః = వనములో నివసించే వాళ్లము, న చ స్మః = కాము. శీఘ్రమ్ = శీఘ్రముగా, తపోధనమ్ = మహర్షి యైన, శరభఙ్గమ్ = శరభంగుణ్ణి, అభిగచ్ఛామహే = పొందుదము.

తా. ఈ దుర్గమారణ్యము చాలా కష్టములకు నిలయమై ఉన్నది. మనము వనవాసమునకు అలవాటుపడినవాళ్ళము కాము. శరభంగమహర్షి దగ్గరకు శీఘ్రముగా వెళ్లెదము. 2

మూ. ఆశ్రమం శరభఙ్గస్య రాఘవోఽభిజగామ హ, 3
తస్య దేవప్రభావస్య తపసా భావితాత్మనః,
సమీపే శరభఙ్గస్య దదర్శ మహదద్భుతమ్. 4

ప్ర. అ. రాఘవః = రాముడు, శరభఙ్గస్య = శరభంగమహర్షియొక్క, ఆశ్రమమ్ = ఆశ్రమమును, అభిజగామ హ = చేరెను. దేవప్రభావస్య=దేవతల వంటి ప్రభావము కలవాడు, తపసా = తపస్సుచేత, భావితాత్మనః = పవిత్రము చేయబడిన మనస్సు కలవాడు అయిన, తస్య శరభఙ్గస్య = ఆ శరభంగముని యొక్క, సమీపే = సమీపమునందు, మహత్ = గొప్ప, అద్భుతమ్ = ఆశ్చర్యమును, దదర్శ = చూచెను.

తా. రాముడు శరభంగముని ఆశ్రమమును చేరి అచట దేవతల వంటి ప్రభావము గలవాడు, తపస్సుచేత పరిశుద్ధమైన మనస్సు కలవాడు, అయిన ఆ శరభంగుని సమీపమున ఒక గొప్ప ఆశ్చర్యకరమైన విషయము చూచెను.

మూ. విభ్రాజమానం వపుషా సూర్యవైశ్వానరప్రభమ్,
రథప్రవరమారూఢమాకాశే విబుధానుగమ్. 5

అసంస్పృశన్తం వసుధాం దదర్శ విబుధేశ్వరమ్,
సంప్రభాభరణం దేవం విరజోఽమ్బరధారిణమ్. 6
తద్విధైరేవ బహుభిః పూజ్యమానం మహాత్మభిః.

ప్ర. అ. వపుషా=శరీరముతో, విభ్రాజమానమ్ = ప్రకాశించుచున్నవాడు, సూర్యవైశ్వానరప్రభమ్ = సూర్యుని వంటి, అగ్ని వంటి కాంతి గలవాడు, రథప్రవరమ్ = శ్రేష్ఠమైన రథమును, ఆరూఢమ్ = ఎక్కినవాడు, ఆకాశే = ఆకాశమునందు, విబుధానుగమ్ = దేవతలు అనుచరులుగా కలవాడు, వసుధామ్ = భూమిని, అస్పృశన్తమ్ = స్పృశించనివాడు, సంప్రభాభరణమ్ = గొప్ప కాంతిగల ఆభరణములు కలవాడు, విరజోఽమ్బరధారిణమ్ = పరాగము లేని వస్త్రము

లను ధరించినవారు, తద్విధైరేవ = అట్టి విధముగానే ఉన్న, బహుభిః = అనేకు లైన, మహాత్మభిః = మహాత్ములచేత, పూజ్యమానమ్ = పూజింపబడుచున్నవాడు అయిన, దేవమ్ = త్రిలోకప్రభువైన, విబుధేశ్వరమ్ = దేవేంద్రుని, దదర్శ = చూచెను.

తా. అక్కడ త్రిలోకాధిపతియైన దేవేంద్రుని చూచెను. అతడు తేజోవంత మైన శరీరముతో సూర్యుడు వలె, అగ్ని వలె ప్రకాశించుచుండెను. ఆకాశముమీద నున్న ఒక రథమును అధిష్ఠించి ఉండెను. దేవతలు అనుచరులుగా అతని వెంట ఉండిరి. అతడు భూమిని స్పృశించక ఆకాశములోనే ఉండెను. పరాగము లేని వస్త్రములను ధరించి ఉన్న అతడు అలంకరించుకొన్న భూషణములు అత్యధిక ముగా ప్రకాశించుచుండెను. అ విధముగానే ఉన్న ఎందరో మహాత్ములు అతనిని పూజించుచుండిరి. 4, 5, 6

మూ. హరితైర్వాజిభిర్యుక్తమన్తరిక్షగతం రథమ్, 7
దదర్శాదూరతస్తస్య తరుణాదిత్యసంనిభమ్,
పాణ్డురాభ్రఘనప్రఖ్యం చన్ద్రమణ్డలసంనిభమ్. 8

ప్ర. అ. తస్య = ఆ దేవేంద్రునకు, అదూరతః = సమీపమునందు, హరితైః = ఆకుపచ్చని రంగు గల, వాజిభిః = గుఱ్ఱములచేత, యుక్తమ్ = కట్టబడినది, తరుణాదిత్యసంనిభమ్ = ముదిరిన సూర్యునితో సమానము, పాణ్డురాభ్రఘనప్రఖ్యమ్ = తెల్లని మేఘసముదాయముతో సమానము, చన్ద్రమణ్డలసంనిభమ్ = చంద్ర మండలముతో సమానము అయిన, అన్తరిక్షగతమ్ = ఆకాశమునందున్న, రథమ్ = రథమును, దదర్శ = చూచెను.

తా. ఆ దేవేంద్రునకు దగ్గరగా, ఆకాశముమీద ఆకుపచ్చని గుఱ్ఱములు కట్టిన రథమును చూచెను. అది ముదిరిన సూర్యుడు వలె, తెల్లని మేఘసముదా యము వలె, చంద్రమండలము వలె ప్రకాశించుచుండెను. 7, 8

మూ. అపశ్యద్విమలం ఛత్రం చిత్రమాల్యోపశోభితమ్,
చామరవ్యజనే చాగ్ర్యే రుక్మదణ్డే మహాధనే. 9
గృహీతే వరనారీభ్యాం ధూయమానే చ మూర్ధని.

ప్ర. అ. విమలమ్ = నిర్మలమైనది, చిత్రమాల్యోపశోభితమ్ = చిత్రములైన మాలికలచేత ప్రకాశింపచేయబడినది అయిన, ఛత్రమ్ = ఛత్రమును, అగ్ర్యే = శ్రేష్ఠమైనవి, రుక్మదణ్డే = బంగారు దండములు కలవి, మహాధనే = చాల విలువైనవి, వరనారీభ్యామ్ = ఇద్దరుఉత్తమస్త్రీలచేత, గృహీతే=గ్రహింపబడినవి, మూర్ధని = శిరస్సుమీద, ధూయమానే = కదల్చబడుచున్నవి అయిన, చామరవ్యజనే = చమరీమృగమునకు సంబంధించిన వింజామరలను, అపశ్యత్ = చూచెను.

తా. విచిత్రములైన పుష్పమాలలచే ప్రకాశింపచేయబడిన శ్వేతచ్ఛత్రమును, బంగారుదండములు గల, విలువైన రెండు వింజామరలను చూచెను. ఆ వింజామరలను ఇద్దరు ఉత్తమస్త్రీలు ఆ దేవేంద్రుని శిరస్సుపై వీచుచుండిరి. 9

మూ. గన్ధర్వామరసిద్ధాశ్చ బహవః పరమర్షయః, 10
అన్తరిక్షగతం దేవం గీర్భిరగ్ర్యాభిరైడయన్.

ప్ర. అ. గన్ధర్వామరసిద్ధాశ్చ=గంధర్వులు, అమరులు, సిద్ధులు, బహవః = అనేకులు, పరమర్షయః = గొప్పఋషులు, అన్తరిక్షగతమ్ = ఆకాశమునందున్న, దేవమ్ = ఆ దేవుని, అగ్ర్యాభిః = శ్రేష్ఠమైన, గీర్భిః = వాక్కులతో(వేద మంత్రములతో), ఐడయన్ = స్తుతించుచుండిరి.

తా. ఆకాశములో ఉన్న ఆ దేవేంద్రుని, గంధర్వులు, దేవతలు, సిద్ధులు చాలమంది మహర్షులు వైదికమంత్రములతో స్తుతించుచుండిరి. 10

మూ. సహ సంభాషమాణే తు శరభఙ్గేన వాసవే, 11
దృష్ట్వా శతక్రతుం తత్ర రామో లక్ష్మణమబ్రవీత్.

ప్ర. అ. వాసవే = దేవేంద్రుడు, శరభఙ్గేన=శరభంగమహర్షితో, సంభాషమాణే = మాటలాడుచుండగా, తత్ర = అక్కడ, శతక్రతుమ్ = దేవేంద్రుని, దృష్ట్వా = చూచి, రామః = రాముడు, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. అక్కడ శరభంగమహర్షితో సంభాషణము చేయుచున్న దేవేంద్రుని చూచి, రాముడు లక్ష్మణునితో ఇటు పలికెను. 11

మూ. రామోఽథ రథ ముద్దిశ్య భ్రాతు ర్దర్శయతాద్భుతమ్. 12
అర్చిష్మన్తం శ్రియా జుష్టమద్భుతం పశ్య లక్ష్మణ,
ప్రతపన్తమివాదిత్యమన్తరిక్షగతం రథమ్. 13

ప్ర. అ. అథ = అటు పిమ్మట, రామః = రాముడు, రథమ్ = రథమును, ఉద్దిశ్య = నిర్దేశించుచు, అద్భుతమ్ = ఆ ఆశ్చర్యమును, భ్రాతుః = సోదరునకు, దర్శయత = చూపెను. లక్ష్మణ = ఓ ! లక్ష్మణా ! అర్చిష్మన్తమ్ = కాంతులు గలది, శ్రియా = శోభతో, జుష్టమ్=కూడినది, అద్భుతమ్ = ఆశ్చర్యకరమైనది, ప్రతపన్తమ్=తపింపచేయుచున్న, ఆదిత్యమివ=సూర్యుడు వలె ఉన్నది అయిన, అన్తరిక్షగతమ్ = ఆకాశములో ఉన్న, రథమ్ = ఆ రథమును, పశ్య=చూడుము.

తా. పిదప రాముడు ఆ రథమును వ్రేలితో నిర్దేశించుచు ఆ ఆశ్చర్యకరమైన విషయమును తమ్మునికి చూపెను. "లక్ష్మణా ! ఆకాశములో, ప్రకాశించుచున్న సూర్యుడు వలె ఉన్న ఆ రథమును చూడుము. కాంతితో, శోభతో, ఇది చాలా ఆశ్చర్యకరముగా ఉన్నది".

మూ. యే హయాః పురుహూతస్య పురా శక్రస్య నః శ్రుతాః,
అన్తరిక్షగతా దివ్యాస్త ఇమే హరయో ధ్రువమ్. 14

ప్ర. అ. పురుహూతస్య=అనేకులచేత యాగములందు ఆహ్వానింపబడిన, శక్రస్య = దేవేంద్రునియొక్క, యే=ఏ, హయాః = అశ్వములు, నః = మనకు, పురా = పూర్వము, శ్రుతాః = వినబడినవో, తే = ఆ, హరయః = అశ్వములు, అన్తరిక్షగతాః = ఆకాశములో ఉన్న, దివ్యాః = దివ్యములైన, ఇమే = ఇవియే. ధ్రువమ్ = నిశ్చయము.

తా. అనేకులు యజ్ఞమునందు ఆహ్వానించు దేవేంద్రునకు ఏ అశ్వములు ఉన్నవని పూర్వము మనము విని యున్నామో, అకాశముమీద ఉన్న ఈ అశ్వములు ఆ దివ్యాశ్వములే; సందేహము లేదు. 14

మూ. ఇమే చ పురుషవ్యాఘ్ర యే తిష్ఠన్త్యభితో దిశమ్,
శతం శతం కుణ్డలినో యువానః ఖడ్గపాణయః. 15

విస్తీర్ణవిపులోరస్కాః పరిఘాయతబాహవః,
శోణాంశువసనాః సర్వే వ్యాఘ్రా ఇవ దురాసదాః, 16

ఉరోదేశేషు సర్వేషాం హారా జ్వలనసన్నిభాః,
రూపం బిభ్రతి సౌమిత్రే పఞ్చవింశతివార్షికమ్. 17

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా ! పురుషవ్యాఘ్ర = పురుషశ్రేష్ఠుడా ! దిశమ్ అభితః = ఆ దిక్కునందు అంతటా, యే = ఏ, శతం శతమ్ = నూర్గురు నూర్గురు చొప్పున గుంపులుగా ఉన్న, కుణ్డలినః = కుండలములు గలవారు, ఖడ్గపాణయః = ఖడ్గములు హస్తములందు కలవారు, విస్తీర్ణవిపులోరస్కాః = విశాలమైన పెద్దవైన వక్షఃస్థలములు కలవారు, పరిఘాయతబాహవః = పరిఘల వలె పొడవైన బాహువులు కలవారు, శోణాంశువసనాః = ఎఱ్ఱని కిరణములవంటి వస్త్రములు గలవారు అయిన, యువానః = యువకులు ఉన్నారో, ఇమే సర్వే = వీరందరూ, వ్యాఘ్రా ఇవ = పెద్దపులుల వలె, దురాసదాః = చేర శక్యముకానివారు. సర్వేషామ్ = అందరియొక్క, ఉరోదేశేషు = వక్షఃస్థలములందు, జ్వలనసన్నిభాః = అగ్నితో సమానములైన, హారాః = హారములు ఉన్నవి. పఞ్చవింశతివార్షికమ్ = ఇరువదియైదు సంవత్సరముల, రూపమ్ = రూపమును, బిభ్రతి = ధరించి ఉన్నారు.

తా. పురుషశ్రేష్ఠుడవైన లక్ష్మణా ! ఆ దిక్కునందు అంతటా, నూరుగురు నూరుగురు చొప్పున గుంపులుగా ఏర్పడి, కుండలములు అలంకరించుకొన్న యువకులు చేతులందు ఖడ్గములు ధరించి నిలచి ఉన్నారు. వాళ్లందరూ విశాలమైన పెద్ద వక్షఃస్థలములతో, పరిఘల (కోటగడియల) వలె పొడవైన బాహువులతో ఎఱ్ఱని కిరణముల వంటి వస్త్రములను ధరించి ఉన్నారు. వీళ్లందరూ కూడ పెద్దపులుల వలె ఎదిరింప శక్యము కానివారు. వీళ్ల అందరి వక్షఃస్థలముల పైన అగ్ని వంటి హారములు ప్రకాశించుచున్నవి. అందరూ ఇరువదియైదు సంవత్సరాల వయస్సు కలవారి ఆకారములో ఉన్నారు. 15, 16, 17

మూ. ఏతద్ధి కిల దేవానాం వయో భవతి నిత్యదా,
యథేమే పురుషవ్యాఘ్రా దృశ్యన్తే ప్రియదర్శనాః. 18

ప్ర. అ. ప్రియదర్శనాః = ఆనందకరమైన దర్శనము గల, ఇమే = ఈ, పురుషవ్యాఘ్రాః = పురుషశ్రేష్ఠులు, యథా = ఎటు, దృశ్యన్తే = చూడబడుచున్నారో,

ఏతత్ = ఇదే, దేవానామ్ = దేవతలయొక్క, వయః = వయస్సు, నిత్యదా = ఎల్లప్పుడూ, భవతి కిల = ఉండునట.

తా. చూచుటకు ఆనందమును కలిగించు ఈ పురుషశ్రేష్ఠులు ఎట్లు కనబడుచున్నారో ఈ వయస్సే దేవతలకు నిత్యము ఉండునట. 18

మూ. ఇహైవ సహ వైదేహ్యా ముహూర్తం తిష్ఠ లక్ష్మణ,
యావజ్జానామ్యహం వ్యక్తం క ఏష ద్యుతిమాన్ రథే. 19

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! వైదేహ్యా సహ = సీతతో కూడ, ముహూర్తమ్ = ముహూర్తకాలము, ఇహైవ = ఇక్కడనే, తిష్ఠ = ఉండుము. యావత్ = ఎంతలో, అహమ్ = నేను, రథే = రథమునందున్న, ఏషః = ఈ, ద్యుతిమాన్ = కాంతిమంతుడు, కః ఇతి = ఎవ్వడో, వ్యక్తమ్ = స్పష్టముగా, జానామి = తెలిసికొందునో.

తా. లక్ష్మణా ! రథములో ఉన్న ఈ కాంతిమంతుడు ఎవరో స్పష్టముగా తెలిసికొని వచ్చెదను; నీవు సీతతో కూడ ఇక్కడనే క్షణకాలము ఉండుము. 19

మూ. తమేవముక్త్వా సౌమిత్రిమిహైవ స్థీయతామితి,
అభిచక్రామ కాకుత్స్థః శరభఙ్గాశ్రమం ప్రతి. 20

ప్ర. అ. ఇహైవ = ఇక్కడనే, స్థీయతామ్ = ఉండబడుగాక (ఉందువుగాక) ఇతి = అని, తం సౌమిత్రిమ్ = ఆ లక్ష్మణుని గూర్చి, ఉక్త్వా = పలికి, కాకుత్స్థః = రాముడు, శరభఙ్గాశ్రమం ప్రతి = శరభంగముని ఆశ్రమమును గూర్చి, అభిచక్రామ = నడచి వెళ్లెను.

తా. రాముడు "నీవిక్కడే ఉండుము" అని లక్ష్మణునితో పలికి, శరభంగాశ్రమమువైపు వెళ్లెను. 20

మూ. తతః సమభిగచ్ఛన్తం ప్రేక్ష్య రామం శచీపతిః,
శరభఙ్గమనుజ్ఞాప్య విబుధానిదమబ్రవీత్. 21

ప్ర. అ. తతః = అటుపిమ్మట, శచీపతిః = దేవేంద్రుడు, సమభిగచ్ఛన్తమ్ = వచ్చుచున్న, రామమ్ = రాముని, ప్రేక్ష్య = చూచి, శరభఙ్గమ్ = శరభంగ

మునిని, అనుజ్ఞాప్య = అనుజ్ఞ ఇచ్చునట్లు చేసికొని, విబుధాన్ = దేవతలను గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. రాముడు అటు వైపు వచ్చుచున్నట్లు చూచి, దేవేంద్రుడు శరభంగ ముని అనుజ్ఞ గైకొని, ప్రక్క నున్న దేవతలతో ఇట్లు పలికెను. 21

మూ. ఇహోపయాత్యసౌ రామో యావన్మాం నాభిభాషతే,
నిష్ఠాం నయత తావత్తు తతో మా ద్రష్టుమర్హతి. 22

జితవన్తం కృతార్థం హి తదాహమచిరాదిమమ్,
కర్మ హ్యనేన కర్తవ్యం మహదన్యైః సుదుష్కరమ్. 23

ప్ర. అ. అసౌ = ఈ, రామః = రాముడు, ఇహ = ఇక్కడికి, ఉపయాతి = వచ్చుచున్నాడు. యావత్ = ఎంతలో, మామ్ = నన్ను (నాతో), నాభిభాషతే = మాటలాడడో, తావత్ = అంతలో, నిష్ఠామ్ = అతనికార్యసిద్ధిని, నయత = పొందించుడు. తతః = అటుపిమ్మట, మా = నన్ను, ద్రష్టుమ్ = చూచుటకు, అర్హతి = తగి యున్నాడు. జితవన్తమ్ = జయించినవాడు, కృతార్థమ్ = చేయబడిన కార్యము కలవాడు అయిన, ఇమమ్ = ఈతనిని, అహమ్ = నేను, అచిరాత్ = కొద్దికాలములో, తదా = అప్పుడు (ద్రక్ష్యామి=చూడగలను). అనేన=ఈతని చేత, అన్యైః = ఇతరులచేత, సుదుష్కరమ్ = ఏ మాత్రము చేయ శక్యము కాని, మహత్ = గొప్ప, కర్మ = పని, కర్తవ్యం హి = చేయబడవలసి యున్నది కదా.

తా. రాము డిటు వైపే వచ్చుచున్నాడు. అతడు నాతో మాటలాడుటకు పూర్వము ఈతనికి కార్యసిద్ధి కలుగు నట్లు చేయుడు. (ఈతని కార్యము పూర్తి అయేవరకు నే నీతనితో సంభాషించను అని భావము.) పిమ్మటనే ఇతడు నన్ను చూడవలెను. ఇతడు జయము సంపాదించి, కృతార్థు డైన పిమ్మట అచిరకాలములో ఇతనిని చూడగలను. ఇతడు ఇతరు లెవ్వరూ చెయజాలని కార్యము చేయవలసి యున్నది కదా.

వి. గోరఖ్‌పూర్ ప్రతిలోని ఈ శ్లోకాల సమన్వయం అసంబద్ధంగా ఉన్నది. ప్రాచ్యపాఠంగా స్పష్టంగా ఉన్నది:-

''యాస్యామ్యహమయం రామో యావన్మాం నాభిభాషతే,
కృతార్థమేనమచిరాద్ద్రష్టాస్మ్యహమరిన్దమమ్,
కర్మ హ్యనేన కర్తవ్యం మహద్దేవైః సుదుష్కరమ్,
నిష్ఠాం న యాతో యావద్ధి తావన్న ద్రష్టుమర్హతి."

"ఈ రాముడు నన్ను సమీపించి నాతో మాటలాడే లోపుగా నేను వెళ్ళిపోయెదను. ఈ శత్రుసంహారకుడు తన కర్తవ్యమును పూర్తిచేసికొన్న పిదప ఈతనిని అచిర కాలములో చూచెదను. దేవతలు కూడ చేయజాలని చాల కష్టమైన కార్యము ఇతడు చేయవలసి ఉన్నది. ఇతడు కార్యసమాప్తిని (నిష్ఠామ్) పొందకపూర్వము నే నీతనిని చూడగూడదు,''అని భావం స్పష్టంగా ఉన్నది. 22, 23

మూ. అథ వజ్రీ తమామన్త్ర్య మానయిత్వా చ తాపసమ్,
రథేన హయయుక్తేన యయౌ దివమరిన్దమః. 24

ప్ర. అ. అథ = అటు పిమ్మట, అరిన్దమః = శత్రుసంహారకుడైన, వజ్రీ = ఇంద్రుడు, తం తాపసమ్ = ఆ శరభంగమునిని, ఆమన్త్ర్య = వీడ్కోలు చెప్పి, మానయిత్వా = గౌరవించి, హయయుక్తేన = గుఱ్ఱములచేత కట్టబడిన, రథేన = రథముచేత, దివమ్ = స్వర్గలోకమును గూర్చి, యయౌ = వెళ్లెను.

తా. పిమ్మట శత్రుసంహారకుడైన ఇంద్రుడు ఆ శరభంగముని అనుజ్ఞ తీసికొని, ఆతనిని గౌరవించి, గుఱ్ఱములు కట్టిన రథము నెక్కి స్వర్గమునకు వెళ్లెను. 24

మూ. ప్రయాతే తు సహస్రాక్షే రాఘవః సపరిచ్ఛదః,
అగ్నిహోత్రముపాసీనం శరభఙ్గముపాగమత్. 25

ప్ర. అ. సహస్రాక్షే = దేవేంద్రుడు, ప్రయాతే = వెళ్లినవా డగుచుండగా, రాఘవః = రాముడు, సపరిచ్ఛదః = పరివారముతో కూడినవాడై, అగ్నిహోత్రమ్ = అగ్నిహోత్రమును గూర్చి, ఉపాసీనమ్ = కూర్చొని యున్న, శరభఙ్గమ్ = శరభంగమహర్షిని, ఉపాగమత్ = సమీపించెను.

తా. దేవేంద్రుడు వెళిపోయిన పిమ్మట రాముడు సీతాలక్ష్మణులతో కూడి,

అగ్నిహోత్రము చేసికొనుటకై కూర్చొని యున్న శరభంగమహర్షి వద్దకు వెళ్లెను. 25.

మూ. తస్య పాదౌ చ సంగృహ్య రామః సీతా చ లక్ష్మణః,
నిషేదు స్తదనుజ్ఞాతా లబ్ధవాసా నిమన్త్రితాః. 26

ప్ర. అ. రామః = రాముడు, సీతా చ = సీత, లక్ష్మణశ్చ=లక్ష్మణుడు, తస్య = ఆ మునీంద్రునియొక్క, పాదౌ = పాదములను, సంగృహ్య=స్పృశించి, లబ్ధవాసాః = పొందబడిన నివాసము గలవారై, నిమన్త్రితాః = ఆహ్వానింపబడిన వారై, తదనుజ్ఞాతాః=ఆతనిచేత అనుజ్ఞ ఇవ్వబడినవారై, నిషేదుః=కూర్చుండిరి.

తా. రాముడు, సీత, లక్ష్మణుడు ఆ శరభంగునకు పాదప్రణామము చేసి, అతని అనుజ్ఞ పొంది కూర్చుండిరి. ఆతడు వారిని ఆనాడు అక్కడ నివసించుటకై ఆహ్వానించెను. 26

మూ. తతః శక్రోపయానం తు పర్యపృచ్ఛత రాఘవః,
శరభఙ్గశ్చ తత్సర్వం రాఘవాయ న్యవేదయత్. 27

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రాఘవః=రాముడు, శక్రోపయానమ్= ఇంద్రుని రాకను గూర్చి, పర్యపృచ్ఛత = అడిగెను. శరభఙ్గశ్చ = శరభంగుడు కూడ, తత్ సర్వమ్ = దాని నంతను, రాఘవాయ = రామునకు, న్యవేదయత్= తెలిపెను.

తా. పిమ్మట రాముడు ఆ మునిని, "దేవేంద్రుడు ఎందుకు వచ్చినాడు" ? అని అడుగగా ఆతడు ఆ విషయమునంతా రామునకు ఇట్లు తెలిపెను. 27

మూ. మామేష వరదో రామ బ్రహ్మలోకం నినీషతి,
జితముగ్రేణ తపసా దుష్ప్రాపమకృతాత్మభిః. 28

ప్ర. అ. రామ=రామా! వరదః=వరముల నిచ్చు, ఏషః=ఈ ఇంద్రుడు, ఉగ్రేణ = ఉగ్ర మైన, తపసా = తపస్సుచేత, జితమ్ = జయించబడినదీ, అకృతాత్మభిః = జయించబడని మనస్సు కలవారిచేత, దుష్ప్రాపమ్ = పొంద శక్యము కానిది అయిన, బ్రహ్మలోకమ్ = బ్రహ్మలోకమును గూర్చి, మామ్=నన్ను, నినీషతి = తీసికొనిపోవ గోరుచున్నాడు.

తా. రామా! వరముల నిచ్చు ఈ ఇంద్రుడు, ఉగ్ర మైన తపస్సుచేత నేను సంపాదించిన, మనోనిగ్రహము లేనివారిచేత పొంద శక్యము కాని బ్రహ్మ లోకానికి నన్ను తీసికొనివెళ్లుటకై వచ్చినాడు. 28

మూ. అహం జ్ఞాత్వా నరవ్యాఘ్ర వర్తమానమదూరతః,
బ్రహ్మలోకం న గచ్ఛామి త్వామదృష్ట్వా ప్రియాతిథిమ్.

ప్ర. అ. నరవ్యాఘ్ర = నరులలో శ్రేష్ఠుడవైన ఓ రామా! అహమ్ = నేను, ప్రియాతిథిమ్ = ప్రియుడైన అతిథివైన, త్వామ్ = నిన్ను, అదూరతః = సమీపము నందే, వర్తమానమ్ = ఉంటూన్నవానినిగా, జ్ఞాత్వా = తెలిసికొని, అదృష్ట్వా = నిన్ను చూడకుండా, బ్రహ్మలోకమ్ = బ్రహ్మలోకమును గూర్చి, న గచ్ఛామి = వెళ్లుటలేదు.

తా. నరులలో శ్రేష్ఠుడ వైన ఓ రామా! నీవు దగ్గరనే ఉన్నట్లు తెలిసికొని నేను, ప్రియాతిథివైన నిన్ను చూడకుండగా బ్రహ్మలోకమునకు వెళ్లుటకు అంగీక రించలేదు. 29

మూ. త్వయాహం పురుషవ్యాఘ్ర ధార్మికేణ మహాత్మనా,
సమాగమ్య గమిష్యామి త్రిదివం చావరం పరమ్. 30

ప్ర. అ. పురుషవ్యాఘ్ర = పురుషశ్రేష్ఠుడా! అహమ్ = నేను, ధార్మికేణ = ధర్మాత్ముడవు, మహాత్మనా = మహాత్ముడవు అయిన, త్వయా = నీతో, సమా గమ్య = కలిసి, అవరమ్ = అటుపిమ్మట, పరమ్ = అత్యుత్తమమైన, త్రిదివమ్ = స్వర్గమైన బ్రహ్మలోకమును గూర్చి, గమిష్యామి = వెళ్లగలను.

తా. పురుషశ్రేష్ఠుడా! ధార్మికుడవు, మహాత్ముడవు అయిన నిన్ను కలిసిన పిమ్మట నేను అత్యుత్తమస్వర్గ మైన బ్రహ్మలోకమునకు వెళ్లగోరుచున్నాను. 30

మూ. అక్షయా నరశార్దూల జితా లోకా మయా శుభాః,
బ్రాహ్మ్యాశ్చ నాకపృష్ఠ్యాశ్చ ప్రతిగృహ్ణీష్వ మామకాన్.

ప్ర. అ. నరశార్దూల = నరశ్రేష్ఠుడా ! మయా = నాచేత, శుభాః = శుభ కరములైన, బ్రాహ్మ్యాః = బ్రహ్మకు సంబంధించినవి, నాకపృష్ఠ్యాశ్చ = స్వరము

నకు సంబంధించినవీ అయిన, లోకాః = లోకములు, జితాః = జయింపబడినవి. మామకాన్ = నా సంబంధ మైన ఆ లోకములను, ప్రతిగృహ్ణీష్వ = తీసికొనుము.

తా. ఓ! నరశ్రేష్ఠా! నేను తపస్సుచేత బ్రహ్మకు సంబంధించిన పుణ్యలోకములను, స్వర్గమునకు సంబంధించిన పుణ్యలోకములను జయించితిని. వాటిని నీ కిచ్చెదను, స్వీకరించుము. 31

మూ. ఏవముక్తో నరవ్యాఘ్రః సర్వశాస్త్రవిశారదః,
ఋషిణా శరభఙ్గేన రాఘవో వాక్యమబ్రవీత్. 32

ప్ర. అ. ఋషిణా = ఋషియైన, శరభఙ్గేన = శరభంగునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, నరవ్యాఘ్రః = నరశ్రేష్ఠుడైన, సర్వశాస్త్రవిశారదః = సకలశాస్త్రములందు పండితుడైన, రాఘవః = రాముడు, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. శరభంగమహర్షి మాటలు విని నరులలో శ్రేష్ఠుడు, సకలశాస్త్రములలో పండితుడు అయిన రాము డిట్లు పలికెను. 32

మూ. అహమేవాహరిష్యామి సర్వాన్ లోకాన్మహామునే,
ఆవాసం త్వహమిచ్ఛామి ప్రదిష్టమిహ కాననే. 33

ప్ర. అ. మహామునే = ఓ మహామునీ! అహమేవ = నేనే, సర్వాన్ = సమస్తమైన, లోకాన్ = పుణ్యలోకములను, ఆహరిష్యామి = సంపాదించుకొనెదను. తు = కాని, అహమ్ = నేను, ఇహ = ఇక్కడ, కాననే = అడవియందు, ప్రదిష్టమ్ = నీచే చూపబడిన, ఆవాసమ్ = నివాసస్థానమును, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. మహామునీ! నీవు చెప్పిన ఆ పుణ్యలోకము లన్నీ నేనే సంపాదించుకొనెదను. నీవు నా కీ వనములో ఏదైన నివాసయోగ్యమైన ప్రదేశమును చూపించిన చాలును. 33

మూ. రాఘవేణైవముక్తస్తు శక్రతుల్యబలేన వై,
శరభఙ్గో మహాప్రాజ్ఞః పునరేవాబ్రవీద్వచః. 34

ప్ర. అ. శక్రతుల్యబలేన = దేవేంద్రునితో సమానమైన బలము గల,

రాఘవేణ = రామునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, మహాప్రాజ్ఞః = గొప్ప బుద్ధి గల, శరభఙ్గః=శరభంగుడు, పునరేవ=మరల, వచః=వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. దేవేంద్రునితో సమానమైన బలము గల రాముని మాటలు విని, మహాబుద్ధిశాలియైన శరభంగముని మరల ఇట్లు పలికెను. 34

మూ. ఇహ రామ మహాతేజాః సుతీక్ష్ణో నామ ధార్మికః,
వసత్యరణ్యే నియతః స తే శ్రేయో విధాస్యతి. 35

ప్ర. అ. రామ = రామా! ఇహ = ఇక్కడ, అరణ్యే = అరణ్యమునందు, మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడు, ధార్మికః = ధార్మికుడు, నియతః = నియమవంతుడు అయిన, సుతీక్ష్ణో నామ = సుతీక్ష్ణు డను మహర్షి, వసతి = నివసించుచున్నాడు, సః=అతడు, తే=నీకు, శ్రేయః=శ్రేయస్సును, విధాస్యతి= చేయగలడు.

తా. రామా! ఈ అరణ్యమునందే, గొప్ప తేజస్సు కలవాడు, ధార్మికుడు, నియమవంతుడు అయిన సుతీక్ష్ణు డనే ముని నివసించుచున్నాడు. అతడు నీకు శ్రేయస్సు కలుగు ఉపాయము చెప్పగలడు. 35

మూ. సుతీక్ష్ణమభిగచ్ఛ త్వం శుచౌ దేశే తపస్వినమ్,
రమణీయే వనోద్దేశే స తే వాసం విధాస్యతి. 36

ప్ర. అ. త్వమ్ = నీవు, శుచౌ = పవిత్రమైన, దేశే = ప్రదేశమునందు, తపస్వినమ్ = మునియైన, సుతీక్ష్ణమ్ = సుతీక్ష్ణుని, అభిగచ్ఛ = చేరుము. సః = అతడు, రమణీయే = సుందరమైన, వనోద్దేశే = వనప్రదేశమునందు, తే = నీకు, వాసమ్ = నివాసమును, విధాస్యతి = ఏర్పరచగలడు.

తా. నీవు పవిత్ర మైన ప్రదేశములో నివసించుచున్న సుతీక్ష్ణమహర్షివద్దకు వెళ్లుము. అతడు అందమైన వనప్రదేశమునందు నీకు నివాసము నేర్పరచును. 36

మూ. ఇమాం మన్దాకినీం రామ ప్రతిస్రోతమనువ్రజ,
నదీం పుష్పోడుపవహాం తతస్తత్ర గమిష్యసి. 37

ప్ర. అ. రామ = రామా! పుష్పోడుపవహామ్ = తెప్పల వంటి పుష్పములను వహించుచున్న, ఇమామ్ = ఈ, మన్దాకినీమ్ నదీమ్=మందాకినీనదిని, ప్రతిస్రోతమ్ = ప్రవాహమునకు ఎదురుగా, అనువ్రజ=అనుసరించి వెళ్లుము. తతః= అటుపిమ్మట, తత్ర = సుతీక్ష్ణుని ఆశ్రమమునకు, గమిష్యసి = వెళ్లగలవు.

తా. చిన్న చిన్న తెప్పల వలె పుష్పసముదాయములు కొట్టుకొనిపోవుచు ప్రవహించుచున్న ఈ మందాకినీనది ప్రవాహమునకు ఎదురుగా నడచి వెళ్లినచో ఆ సుతీక్ష్ణాశ్రమము వచ్చును.

వి. దండకారణ్యములో మందాకినీప్రసక్తి ఎట్లు వచ్చినదో తెలియదు. ఈ శ్లోకము ప్రాచ్యపాఠములో లేదు. 37

మూ. ఏష పన్థా నరవ్యాఘ్ర ముహూర్తం పశ్య తాత మామ్,
యావజ్జహామి గాత్రాణి జీర్ణాం త్వచమివోరగః. 38

ప్ర. అ. నరవ్యాఘ్ర = పురుషశ్రేష్ఠుడా! ఏషః = ఇదే, పన్థాః=మార్గము. తాత = తండ్రీ! ముహూర్తమ్ = క్షణకాలముపాటు, మామ్ = నన్ను, పశ్య = చూడుము. యావత్ = ఎంతలో, జీర్ణామ్ = జీర్ణమైన, త్వచమ్ = చర్మను, ఉరగః ఇవ = సర్పము వలె, గాత్రాణి=అవయవములను, జహామి=విడతునో.

తా. ఓ నరశ్రేష్ఠా! సుతీక్ష్ణముని ఆశ్రమానికి వెళ్లే మార్గము ఇదే. తండ్రీ! ఒక్క ముహూర్తకాలము ఆగి నన్ను చూడుము. పాము కుబుసమును విడచి నట్లు నా శరీరమును విడిచి వేయుచున్నాను. 38

మూ. తతోఽగ్నిం స సమాధాయ హుత్వా చాజ్యేన మన్త్రవత్,
శరభఙ్గో మహాతేజాః ప్రవివేశ హుతాశనమ్. 39

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, సః శరభఙ్గః = ఆ శరభంగమహర్షి, అగ్నిమ్ = అగ్నిని, సమాధాయ = ఉంచి, ఆజ్యేన = నేతితో, మన్త్రవత్ = మంత్రపూర్వకముగా, హుత్వా చ = హోమము చేసి, హుతాశనమ్ = ఆ అగ్నిని, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. పిమ్మట, మహాతేజశ్శాలియైన ఆ శరభంగమహర్షి అగ్నిని నెలకొల్పి, మంత్రపూర్వకముగా ఆజ్యమును హోమముచేసి, ఆ అగ్నిలో ప్రవేశించెను. 39

మూ. తస్య రోమాణి కేశాంశ్చ తదా వహ్ని ర్మహాత్మనః,
జీర్ణాం త్వచం తదస్థీని యచ్చ మాంసం చ శోణితమ్.40

ప్ర. అ. తదా = అప్పుడు, వహ్నిః = అగ్ని, మహాత్మనః = మహాత్ముడైన, తస్య = ఆ శరభంగమహర్షియొక్క, రోమాణి=రోమములను, కేశాంశ్చ= కేశములను, జీర్ణామ్ = జీర్ణమైపోయిన, త్వచమ్ = చర్మను, తదస్థీని = ఆతని ఎముకలను, యత్ = ఏ, మాసమ్=మాంసము, శోణితం చ=రక్తమూ ఉన్నదో వాటిని, (కాల్చివేసెను).

తా. అప్పు డా అగ్ని, మహాత్ముడైన ఆ శరభంగమహర్షి రోమాలను, కేశములను, జీర్ణమైన చర్మమును, మాంసమును, రక్తమును కాల్చివేసెను. 40

మూ. స చ పావకసంకాశః కుమారః సమపద్యత,
ఉత్థాయాగ్నిచయాత్తస్మాచ్ఛరభఙ్గో వ్యరోచత. 41

ప్ర. అ. సః శరభఙ్గః = ఆ శరభంగమహర్షి, పావకసంకాశః=అగ్నితో సమానుడైన, కుమారః = కుమారుడుగా (కౌమారవయస్సులో ఉన్నవాడుగా) సమపద్యత = ఆయెను. తస్మాత్ = ఆ, అగ్నిచయాత్ = అగ్నిరాశినుండి, ఉత్థాయ = లేచి, వ్యరోచత = ప్రకాశించెను.

తా. ఆ శరభంగమహర్షి అగ్నితో సమానుడైన కౌమారవయస్కుడుగా మారిపోయి, ఆ అగ్నికుండమునుండి పైకి లేచి ప్రకాశించెను. 41

మూ. స లోకానాహితాగ్నీనామృషీణాం చ మహాత్మనామ్,
దేవానాం చ వ్యతిక్రమ్య బ్రహ్మలోకం వ్యరోహత. 42

ప్ర. అ. సః = ఆతడు, ఆహితాగ్నీనామ్ = ఆహితాగ్నులయొక్క, మహాత్మనామ్ = మహాత్ములైన, ఋషీణాం చ = ఋషులయొక్క, దేవానాం చ= దేవతలయొక్క, లోకాన్ = లోకములను, వ్యతిక్రమ్య=దాటి, బ్రహ్మలోకమ్= బ్రహ్మలోకమును, వ్యరోహత = ఎక్కెను.

తా. ఆ శరభంగముని ఆహితాగ్నులకు లభించు లోకములను, మహాత్ములైన ఋషీశ్వరులకు లభించు లోకములను, దేవతల లోకములను దాటి బ్రహ్మలోకములో ప్రవేశించెను. 42

మూ. స పుణ్యకర్మా భువనే ద్విజర్షభః
పితామహం సానుచరం దదర్శ హ,
పితామహశ్చాపి సమీక్ష్య తం ద్విజం
ననన్ద సుస్వాగతమిత్యువాచ హ. 43

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
పఞ్చమః సర్గః.

ప్ర. అ. పుణ్యకర్మా = పుణ్యమైన కర్మ గల, సః = ఆ, ద్విజర్షభః = బ్రాహ్మణశ్రేష్ఠుడు, భువనే = బ్రహ్మలోకమునందు, సానుచరమ్ = అనుచరులతో కూడిన, పితామహమ్ = బ్రహ్మదేవుణ్ణి, దదర్శ హ = చూచెను. పితామహశ్చాపి = బ్రహ్మదేవుడు కూడ, తం ద్విజమ్ = ఆ బ్రాహ్మణుణ్ణి, సమీక్ష్య = చూచి, ననన్ద = సంతోషించెను. సుస్వాగతమ్ ఇతి = మంచి స్వాగతము అని, ఉవాచ హ = పలికెను.

తా. పుణ్యకర్మ లాచరించిన ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు, బ్రహ్మలోకములో అనుచరులతో కూడిన బ్రహ్మదేవుని దర్శనము చేసెను. బ్రహ్మదేవుడు కూడ ఆ బ్రాహ్మణుని చూచి, సంతోషించి "సుస్వాగతము"అని పలికెను. 43

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో
ఐదవ సర్గ సమాప్తము.

అథ షష్ఠః సర్గః

[రాక్షసులు పెట్టు బాధలనుండి రక్షింపు మని మును లందరు రాముని ప్రార్థించగా రాముడు వాళ్ళకు అభయ మిచ్చుట.]

మూ. శరభఙ్గే దివం ప్రాప్తే మునిసంఘాః సమాగతాః,
అభ్యగచ్ఛన్త కాకుత్థ్సం రామం జ్వలితతేజసమ్. 1

ప్ర. అ. శరభఙ్గే=శరభంగుడు, దివమ్=స్వర్గమును, ప్రాప్తే=పొందినవాడగుచుండగా, మునిసంఘాః = మునుల సముదాయములు, సమాగతాః = ఒక్కచోట కలిసినవై, కాకుత్థ్సమ్=కకుత్థ్సవంశమునకు చెందినవాడు, జ్వలితతేజసమ్=ప్రజ్వలించుచున్న తేజస్సు కలవాడు అయిన, రామమ్=రాముణ్ణి, అభ్యగచ్ఛన్త=సమీపించినవి.

తా. శరభంగమహర్షి స్వర్గమునకు వెళ్లిన పిమ్మట అక్కడ నివసించుచున్న మునులు చాలమంది ఒక్కచోట చేరి, కకుత్థ్సవంశమునకు చెందినవాడు, ప్రజ్వలించుచున్న తేజస్సు కలవాడు అయిన రాముని వద్దకు వెళ్ళిరి.

మూ. వైఖానసా వాలఖిల్యాః సంప్రక్షాలా మరీచిపాః,
అశ్మకుట్టాశ్చ బహవః పత్రాహారాశ్చ తాపసాః. 2

దన్తోలూఖలినశ్చైవ తథైవోన్మజ్జకాః పరే,
గాత్రశయ్యా అశయ్యాశ్చ తథైవానవకాశికాః. 3

మునయః సలిలాహారా వాయుభక్షా స్తథా పరే,
ఆకాశనిలయాశ్చైవ తథా స్థణ్డిలశాయినః. 4

తథోర్ధ్వవాసినో దాన్తా స్తథార్ద్రపటవాససః,
సజపాశ్చ తపోనిష్ఠాస్తథా పఞ్చతపోన్వితాః. 5

సర్వే బ్రాహ్మ్యా శ్రియా యుక్తా దృఢయోగసమాహితాః,
శరభఙ్గాశ్రమే రామమభిజగ్ముశ్చ తాపసాః. 6

ప్ర. అ. వైఖానసాః = ప్రజాపతి నఖములనుండి పుట్టిన ఋషులు, వాలఖిల్యాః=ప్రజాపతి రోమములనుండి పుట్టిన ఋషులు, సంప్రక్షాలాః = ప్రజాపతి పాదప్రక్షాళనమువలన పుట్టిన ఋషులు, మరీచిపాః = చంద్రకిరణములను మాత్రమే త్రాగేవారు, అశ్మకుట్టాశ్చ = ధాన్యములను రాళ్లతో నలిపి తినువారు, పత్రాహారాః = ఆకులే ఆహారముగా గల, బహవః = చాలమంది, తాపసాశ్చ = మునులు, దన్తోలూఖలినశ్చైవ = దంతములే రోళ్లుగా ఉపయోగించువారు, తథైవ = మరియు, ఉన్మజ్జకాః = నీటిపై కంఠమువరకు తేలుచు తపస్సు చేసే, పరే= ఇతరులు, గాత్రశయ్యాః = చెయ్యి మోకాళ్లు మొదలైన అవయవములే శయ్యగా గలవారు, అశయ్యాః = శయ్య లేనివారు, తథైవ = మరియు, అనవకాశికాః = ఇటు అటు కదలుటకు అవకాశము లేని ఇరుకైన స్థలములలో కూర్చుండి తపస్సు చేయువారు, సలిలాహారాః = జలము మాత్రమే ఆహారముగాగల, మునయః = మునులు, తథా = అట్లే, వాయుభక్షాః = వాయువును మాత్రమే భక్షించు, అపరే = ఇతరులు, ఆకాశనిలయాశ్చైవ = ఆకాశములో నిలచి తపస్సు చేయువారు, తథా = మరియు, స్థణ్డిలశాయినః = కటికనేల మీద శయనించువారు, తథా = మరియు, ఊర్ధ్వవాసినః=పర్వతశిఖరాదులందే నివసించువారు, దాన్తాః=ఇంద్రియ నిగ్రహవంతులు, ఆర్ద్రపటవాససః = తడి బట్టలు కట్టుకొనే వారు, సజపాశ్చ = జపముతో కూడినవారు, తపోనిష్ఠాః = తపస్సునందు స్థైర్యము గలవారు. తథా = మరియు, పఞ్చతపోన్వితాః = పంచాగ్నిమధ్య తపస్సు చేయువారు అయిన, తాపసాః = మునులు, శరభఙ్గాశ్రమే = శరభంగముని ఆశ్రమములో, రామమ్ = రాముణ్ణి, అభిజగ్ముః = చేరిరి. సర్వే = వారందరూ కూడ, బ్రాహ్మ్యా = బ్రహ్మ (వైదికమైన) సంబంధమైన, శ్రియా = శోభతో, యుక్తాః = కూడినవారు, దృఢయోగసమాహితాః = దృఢముగా యోగమునందు నిలచి ఉన్నవారు.

తా. విఖనసధర్మశాస్త్రాదులను అనుసరించు వైఖానసులను వానప్రస్థులు, వాలఖిల్యసంప్రదాయమువారు, సంప్రక్షాలులు, చంద్రకిరణములను ఆహారముగా తీసికొనువారు, రాతిపై ధాన్యము నలిపి వాటిని తినువారు, ఆకులు మాత్రమే తినువారు, దంతములతో ధాన్యములను నమలి తినువారు, నీటిపై తేలుచు తపస్సు

చేసుకొనేవారు, చేతులు మోకాళ్లు మొదలైన అవయవములనే శయ్యగా ఉపయో గించి పండుకొనేవారు, శయ్యలు లేనివారు, అవకాశము లేని ఇరుకుచోట్ల కూర్చుండి తపస్సు చేసుకొనేవారు, జలముమాత్రమే ఆహారముగా తీసికొనువారు, గాలిమాత్రమే పీల్చి జీవించేవారు, ఆకాశముపై నిలచి తపస్సు చేసుకొనేవారు, గట్టి నేలమీద శయనించేవారు, బట్టలు పైపైపు బిగించి కట్టుకొనేవారు, ఇంద్రియ నిగ్రహవంతులు, తడిబట్టలు కట్టుకొనేవారు, జపము చేసేవారు, తపస్సులో స్థిర ముగా ఉండువారు, పంచాగ్నితపస్సు చేయువారు, ఈ విధముగ అనేకవిధముల తపస్సు చేయు మును లందరు శరభంగాశ్రమములో రాముని వద్దకు వచ్చిరి. వారిలో ప్రతి ఒక్కడు బ్రహ్మవర్చస్సుతో ప్రకాశించుచుండెను. ప్రతి ఒక్కడు యోగ మార్గములో సుస్థిరముగా ఉండెను. 2-6

మూ. అభిగమ్య చ ధర్మజ్ఞా రామం ధర్మభృతాం వరమ్,
ఊచుః పరమధర్మజ్ఞమృషిసంఘాః సమాగతాః. 7

ప్ర. అ. ధర్మజ్ఞాః = ధర్మముల నెరిగిన, సమాగతాః = ఒక్క చోట కలిసిన, ఋషిసంఘాః = ఋషిసముదాయములు, ధర్మభృతామ్ = ధర్మమును పోషించువారూ, వరమ్ = శ్రేష్ఠుడు, పరమధర్మజ్ఞమ్ = గొప్ప ధర్మవేత్త అయిన, రామమ్ = రాముణ్ణి, అభిగమ్య = సమీపించి, ఊచుః = పలికినవి.

తా. ఆ ధర్మవేత్తలైన ఋషు లందరూ గుంపుగా చేరి, ధర్మమును పోషించువారిలో శ్రేష్ఠుడు, ధర్మములు తెలిసినవాడు అయిన రామునివద్దకు వచ్చి ఇట్లు పలికిరి. 7

మూ. త్వమిక్ష్వాకుకులస్యాస్య పృథివ్యాశ్చ మహారథః,
ప్రధానశ్చాపి నాథశ్చ దేవానాం మఘవానివ. 8

ప్ర. అ. మహారథః = మహారథుడ వైన, త్వమ్ = నీవు, అస్య = ఈ, ఇక్ష్వాకుకులస్య = ఇక్ష్వాకుకులమునకు, పృథివ్యాశ్చ = భూమికిని, దేవానామ్ = దేవతలకు, మఘవానివ = దేవేంద్రుడు వలె, ప్రధానశ్చ = ప్రధానుడవు, నాథశ్చ = నాథుడవుకూడ.

తా. మహారథుడ వైన నీవు ఈ ఇక్ష్వాకువంశమునకు, భూమికి కూడ, దేవేంద్రుడు దేవతలకు వలె, ప్రధానమైనవాడవు, నాథుడవు(రక్షకుడవు)కూడ. 8

మూ. విశ్రుతస్త్రిషు లోకేషు యశసా విక్రమేణ చ,
పితృవ్రతత్వం సత్యం చ త్వయి ధర్మశ్చ పుష్కలః. 9

ప్ర. అ. (నీవు) త్రిషు = మూడు, లోకేషు = లోకములయందు, యశసా = కీర్తిచేతను, విక్రమేణ చ = పరాక్రమముచేతను, విశ్రుతః = ప్రసిద్ధుడవు. త్వయి = నీయందు, పితృవ్రతత్వమ్ = పితృభక్తి, సత్యం చ = సత్యము, పుష్కలః = పరిపూర్ణమైన, ధర్మశ్చ = ధర్మము కూడ (ప్రసిద్ధముగా నున్నవి).

తా. కీర్తిచేతను, పరాక్రమముచేతను గూడ నీవు మూడు లోకములందును ప్రసిద్ధుడవు. నీయందు సత్యము, పితృభక్తి, ధర్మము కూడ పరిపూర్ణముగా ఉన్నవి. 9

మూ. త్వామాసాద్య మహాత్మానం ధర్మజ్ఞం ధర్మవత్సలమ్,
అర్థిత్వాన్నాథ వక్ష్యామస్తచ్చ నః క్షన్తుమర్హసి. 10

ప్ర. అ. మహాత్మానమ్ = మహాత్ముడవు, ధర్మజ్ఞమ్ = ధర్మములు తెలిసిన వాడవు, ధర్మవత్సలమ్ = ధర్మమునందు ఆసక్తి కలవాడవు అయిన, త్వామ్ = నిన్ను, అర్థిత్వాత్ = యాచకత్వమువలన, ఆసాద్య = పొంది, వక్ష్యామః = చెప్పగలము. నాథ = ఓ! ప్రభూ! నః = మాయొక్క, తత్ = ఆ అర్థిత్వమును, క్షన్తుమ్ = క్షమించుటకు, అర్హసి = తగియున్నావు.

తా. నీవు మహాత్ముడవు. ధర్మములు తెలిసినవాడవు. ధర్మమునందు ఆసక్తి కలవాడవు. అట్టి నీవద్దకు మేము యాచకులముగా వచ్చి ఏమో చెప్ప దలచుకొన్నాము. ప్రభూ! నీవు మమ్ములను ఇట్లు యాచించుచున్నందుకు క్షమించ వలెను. 10

మూ. అధర్మః సుమహాన్నాథ భవేత్తస్య తు భూపతేః,
యో హరేద్బలిషడ్భాగం న చ రక్షతి పుత్రవత్. 11

ప్ర. అ. నాథ = ప్రభూ! యః = ఏ రాజు, బలిషడ్భాగమ్ = బలిలో ఆరవ భాగమును, హరేత్ = తీసుకొనునో, పుత్రవత్ = పుత్రులను వలె, న చ రక్షతి = రక్షించడో, తస్య = అట్టి, భూపతేః = రాజునకు, సుమహాన్ = చాల గొప్పదైన, అధర్మః = అధర్మము, భవేత్ = కలుగును.

తా. ప్రభూ ! ఏ రాజు బలి (పంట, తపస్సు మొదలగుదాని)లోని ఆరవ భాగమును పన్నుగా తీసికొనుచు కూడ ప్రజలను పుత్రులను రక్షించి నట్లు రక్షించడో ఆ రాజునకు చాల గొప్ప అధర్మము కలుగును. 11

మూ. యుఞ్జానః స్వానివ ప్రాణాన్ ప్రాణైరిష్టాన్ సుతానివ,
నిత్యయుక్తః సదా రక్షన్ సర్వాన్ విషయవాసినః, 12

ప్రాప్నోతి శాశ్వతీం రామ కీర్తిం స బహువార్షికీమ్,
బ్రహ్మణః స్థానమాసాద్య తత్ర చాపి మహీయతే. 13

ప్ర. అ. సర్వాన్ = సమస్తమైన, విషయవాసినః = దేశములో నివసించు వారిని, ప్రాణైః = ప్రాణములచేత, ఇష్టాన్ = ఇష్టులైన, సుతానివ = కుమారులను వలె, స్వాన్ = తన సంబంధమైన, ప్రాణాన్ = ప్రాణములను, యుఞ్జానః ఇవ = సమర్పించుచున్నాడా అన్నట్లు, నిత్యయుక్తః = నిత్యమూ ప్రయత్నశీలుడై, సదా = ఎల్లప్పుడూ, రక్షన్ = రక్షించుచు ఉన్న, సః = ఆ రాజు, శాశ్వతీమ్ = శాశ్వతమైన, బహువార్షికీమ్ = అనేక సంవత్సరములకు సంబంధించిన, కీర్తిమ్ = కీర్తిని, ప్రాప్నోతి = పొందును. బ్రహ్మణః = బ్రహ్మయొక్క, స్థానమ్ = స్థానమును, ఆసాద్య = పొంది, తత్ర చాపి = అక్కడ కూడ, మహీయతే = గౌరవించబడును.

తా. దేశములో ఉన్న ప్రజల నందరినీ, ప్రాణతుల్యులుగా, ఇష్టులైన కుమారులను వలె, తన ప్రాణములను అర్పించుటకు సిద్ధముగా ఉన్నాడా అన్నట్లు సర్వదా రక్షించుచు, నిత్యము జాగరూకుడై ఉండు రాజునకు అనేకసంవత్సరములు స్థిరముగా నిలచు కీర్తి లభించును. ఆతడు బ్రహ్మలోకమునకు వెళ్ళి అక్కడ కూడ పూజింపబడును. 12, 13

మూ. యత్కరోతి పరం ధర్మం మునిర్మూలఫలాశనః,
తత్ర రాజ్ఞశ్చతుర్భాగః ప్రజా ధర్మేణ రక్షతః. 14

ప్ర. అ. ప్రజాః = ప్రజలను, ధర్మేణ = ధర్మముచేత, రక్షతః = రక్షించుచున్న, రాజ్ఞః = రాజునకు, మూలఫలాశనః = మూలములను ఫలములను తిను,

మునిః = ముని, యతి = పి, పరమ్ = గొప్ప, ధర్మమ్ = ధర్మమును, కరోతి = చేయునో, తత్ర = దానియందు, చతుర్భాగః = నాల్గవ భాగము లభించును.

తా. ప్రజలను ధర్మానుసారముగా రక్షించు రాజునకు, మూలఫలములు భుజించుచు మునులు చేయు గొప్ప తపస్సులో నాల్గవభాగము లభించును. 14

మూ. సోఽయం బ్రాహ్మణభూయిష్ఠో వానప్రస్థగణో మహాన్,
త్వన్నాథోఽనాథవద్రామ రాక్షసైర్హన్యతే భృశమ్. 15

ప్ర. అ. రామ = రామా ! త్వన్నాథః = నీవు నాథుడుగా గల, బ్రాహ్మణభూయిష్ఠః = బ్రాహ్మణులు అధికముగా గల, మహాన్ = గొప్పదైన, సః అయమ్ = అట్టి ఈ, వానప్రస్థగణః = వానప్రస్థుల సముదాయము, అనాథవత్ = నాథుడు లేనిది వలె, రాక్షసైః = రాక్షసులచేత, భృశమ్ = మిక్కిలి, హన్యతే = పీడింపబడుచున్నది.

తా. రామా ! బ్రాహ్మణులు అధికసంఖ్యలో ఉన్న, పెద్దదైన ఈ వానప్రస్థుల సముదాయమునకు నీవు ప్రభువుగా ఉండగా కూడ రక్షకుడు లేనిదానిని వలె రాక్షసులు దీనిని ఎక్కువ పీడించుచున్నారు. 15

మూ. ఏహి పశ్య శరీరాణి మునీనాం భావితాత్మనామ్,
హతానాం రాక్షసైర్ఘోరైర్బహూనాం బహుధా వనే. 16

ప్ర. అ. ఏహి = రమ్ము. వనే = వనమునందు, ఘోరైః = భయంకరులైన, రాక్షసైః = రాక్షసులచేత, బహుధా = అనేకవిధములుగా, హతానామ్ = చంపబడిన, భావితాత్మనామ్ = పవిత్రము చేసికొనబడిన మనస్సు గల, బహూనామ్ = అనేకులైన, మునీనామ్ = మునులయొక్క, శరీరాణి = శరీరములను, పశ్య = చూడుము.

తా. ఈ అరణ్యములో భయంకరులైన రాక్షసులు, తపఃపవిత్రములైన మనస్సులు గల ఎందరో మునులను అనేకవిధముల చంపినారు. రమ్ము; వారి శరీరములను చూడుము. 16

మూ. పమ్పానదీనివాసానామనుమన్దాకినీమపి,
చిత్రకూటాలయానాం చ క్రియతే కదనం మహత్. 17

ప్ర. అ. పమ్పానదీనివాసానామ్ = పంపానదీప్రాంతమునందు నివసించే వారియొక్క, అనుమన్దాకినీమపి = మందాకినీనదీతీరమును అనుసరించి నివసించే వారియొక్క, చిత్రకూటాలయానాం చ = చిత్రకూటపర్వతప్రాంతము నివాసముగా కలవారియొక్క, మహత్ = అత్యధికమైన, కదనమ్ = సంహారము, క్రియతే = చేయబడుచున్నది.

తా. పంపానదీప్రాంతమునందు నివసించేవారిని, మందాకినీనదీప్రాంతమునందు నివసించేవారిని, చిత్రకూటపర్వతప్రాంతమునందు నివసించేవారిని చాల ఎక్కువగా చంపుచున్నారు. 17

మూ. ఏతే వయం న మృష్యామో విప్రకారం తపస్వినామ్,
క్రియమాణం వనే ఘోరం రక్షోభిర్భీమకర్మభిః. 18

ప్ర. అ. ఏతే వయమ్ = ఈ మేము, భీమకర్మభిః = భయంకరమైన కర్మ గల, రక్షోభిః = రాక్షసులచేత, వనే = వనమునందు, క్రియమాణమ్ = చేయబడుచున్న, తపస్వినామ్ = మునులయొక్క, ఘోరమ్ = భయంకరమైన, విప్రకారమ్ = అపకారమును, న మృష్యామః = సహింపలేకున్నాము.

తా. భయంకరమైన కర్మ చేయు రాక్షసులు వనములో చేయుచున్న మునుల ఘోరవినాశనమును మేము సహింపజాలకున్నాము. 18

మూ. తతస్త్వాం శరణార్థం చ శరణ్యం సముపస్థితాః,
పరిపాలయ నో రామ వధ్యమానాన్ నిశాచరైః. 19

ప్ర. అ. తతః = ఆ కారణమువలన, రామ = రామా ! శరణ్యమ్ = రక్షకుడవైన, త్వామ్ = నిన్ను, శరణార్థమ్ = రక్షణకొరకు, సముపస్థితాః = చేరినాము. నిశాచరైః = రాక్షసులచేత, వధ్యమానాన్ = చంపబడుచున్న, నః = మమ్ములను, పరిపాలయ = పాలించుము.

తా. రామా ! ఆ కారణముచేత, మేము రక్షకుడవైన నీవద్దకు రక్షణమును కోరుచు వచ్చినాము. రాక్షసులచే చంపబడుచున్న మమ్ములను పాలింపుము

మూ. పరా త్వత్తో గతిర్వీర పృథివ్యాం నోపపద్యతే,
పరిపాలయ నః సర్వాన్ రాక్షసేభ్యో నృపాత్మజ. 20

ప్ర. అ. వీర = వీరుడా! త్వత్తః = నీకంటె, పరా = గొప్పదైన, గతిః = గతి(రక్షణము), పృథివ్యామ్ = భూమియందు, నోపపద్యతే = కుదరదు. నృపాత్మజ = రాజకుమారా! నః = మమ్ములను, సర్వాన్ = అందరిని, రాక్షసేభ్యః = రాక్షసులనుండి, పరిపాలయ = రక్షించుము.

తా. ఓ! వీరుడా! నిన్ను మించిన రక్షకుడు ఈ పృథివిలో మరెవ్వరూ లభింపడు. ఓ! రాజకుమారా! మమ్ముల నందరినీ రాక్షసులనుండి రక్షించుము.

మూ. ఏతచ్ఛ్రుత్వా తు కాకుత్స్థస్తాపసానాం తపస్వినామ్,
ఇదం ప్రోవాచ ధర్మాత్మా సర్వానేవ తపస్వినః. 21

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, కాకుత్స్థః = రాముడు, తపస్వినామ్ = దీనులైన, తాపసానామ్ = మునులయొక్క, ఏతత్ = ఈ వాక్యమును, శ్రుత్వా తు = విని, సర్వానేవ = సమస్తమైన, తపస్వినః = మునులను గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, ప్రోవాచ = పలికెను.

తా. ధర్మాత్ముడైన రాముడు దీనులైన ఆ మునీశ్వరుల మాటలు విని, ఆ మునులందరిని ఉద్దేశించి ఇట్లు పలికెను. 21

మూ. నైవమర్హథ మాం వక్తుమాజ్ఞాప్యోఽహం తపస్వినామ్,
కేవలేన స్వకార్యేణ ప్రవేష్టవ్యం వనం మయా. 22

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, మామ్ = నన్ను గూర్చి, వక్తుమ్ = పలుకుటకు, న అర్హథ = తగరు. అహమ్ = నేను, తపస్వినామ్ = మునులకు, ఆజ్ఞాప్యః = ఆజ్ఞాపింపతగినవాడను. కేవలేన = కేవలమైన, స్వకార్యేణ = నా కార్యముచేతనే, మయా = నాచేత, వనమ్ = వనము, ప్రవేష్టవ్యమ్ = ప్రవేశింపదగినది.

తా. మీరు నన్ను ఇట్లు ప్రార్థించకూడదు. మునులు నన్ను ఆజ్ఞాపించవలెను. నేను నా కార్యము నిమిత్తమే ఈ వనములో ప్రవేశించవలసి యున్నది.

మూ. విప్రకారమపాక్రష్టుం రాక్షసైర్భవతామిమమ్,
పితుస్తు నిర్దేశకరః ప్రవిష్టోఽహమిదం వనమ్. 23

ప్ర. అ. అహమ్ = నేను, రాక్షసైః = రాక్షసులచేత, భవతామ్ =

మీయొక్క, ఇమమ్ = ఈ, విప్రకారమ్ = అవకారమును, అపాక్రష్టుమ్ = తొలగించుటకై, పితుః = తండ్రియొక్క, నిర్దేశకరః = ఆజ్ఞను చేయుచున్నవాడనై, ఇదమ్ = ఈ, వనమ్ = వనమును, ప్రవిష్టః = ప్రవేశించితిని.

తా. మీకు రాక్షసులు చేయుచున్న ఈ అపకారమును తొలగించుటకై నేను నా తండ్రిగారి ఆజ్ఞ ప్రకారము, ఈ అరణ్యములోనికి ప్రవేశించినాను. 23

మూ. భవతామర్థసిద్ధ్యర్థమాగతోఽహం యదృచ్ఛయా,
తస్య మేఽయం వనే వాసో భవిష్యతి మహాఫలః. 24

ప్ర. అ. అహమ్ = నేను, భవతామ్=మీయొక్క, అర్థసిద్ధ్యర్థమ్=కార్యసిద్ధికొఱకై, యదృచ్ఛయా=దైవవశముచేత, ఆగతః=వచ్చినాను. తస్య=అట్టి, మే = నాయొక్క, అయమ్ = ఈ, వనే వాసః = వననివాసము, మహాఫలః = గొప్ప ఫలము గలది, భవిష్యతి = కాగలదు.

తా. నేను నా అదృష్టవశముచే మీ కార్యమును సాధించుటకై వచ్చినాను. నా వనవాసమునకు చాల గొప్ప ఫలము లభించగలదు. 24

మూ. తపస్వినాం రణే శత్రూన్ హన్తుమిచ్ఛామి రాక్షసాన్,
పశ్యన్తు వీర్యమృషయః సభ్రాతుర్మే తపోధనాః. 25

ప్ర. అ. తపస్వినామ్ = మునులయొక్క, శత్రూన్ = శత్రువులైన, రాక్షసాన్ = రాక్షసులను, రణే = యుద్ధమునందు, హన్తుమ్ = చంపుటకు, ఇచ్ఛామి =కోరుచున్నాను. తపోధనాః = తపస్సే ధనముగా గల, ఋషయః=ఋషులు, సభ్రాతుః = సోదరునితో కూడిన, మే = నాయొక్క, వీర్యమ్ = పరాక్రమమును, పశ్యన్తు = చూచెదరుగాక.

తా. మునీశ్వరుల శత్రువులైన రాక్షసులను యుద్ధములో సంహరించవలెనని కోరుచున్నాను. తపస్సే ధనముగా గల ఋషు లందరు నా పరాక్రమమును, నా తమ్ముని పరాక్రమమును చూచెదరుగాక. 25

మూ. దత్త్వాభయం చాపి తపోధనానాం
ధర్మే ధృతాత్మా సహ లక్ష్మణేన,
తపోధనైశ్చాపి సహార్యదత్తః
సుతీక్ష్ణమేవాభిజగామ వీరః. 26

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకియే ఆదికావ్యే అరణ్యకాణ్డే
షష్ఠః సర్గః.

ప్ర. అ. ధర్మే = ధర్మమునందు, ధృతాత్మా = స్థిరముగా ఉంచబడిన బుద్ధి గల, వీరః = వీరుడైన రాముడు, తపోధనానామ్ = మునులకు, అభయమ్ = అభయమును, దత్వా=ఇచ్చి, సహ లక్ష్మణేన = లక్ష్మణునితో కూడ, తపోధనైశ్చాపి = మునులతో కూడినవాడై, సహార్యదత్తః = పూజ్యుడైన జనకునిచే ఇవ్వబడిన సీతతో కూడినవాడై, సుతీక్ష్ణమేవ=సుతీక్ష్ణమహర్షినే గూర్చి, అభిజగామ = వెళ్లెను.

తా. ధర్మమునందు స్థిరబుద్ధి గల, వీరుడైన ఆ రాముడు మునులకు అభయ మిచ్చి లక్ష్మణునితోను, ఆ మునులతోను కలిసి, సీతాసమేతుడై సుతీక్ష్ణ మహర్షివద్దకు వెళ్లెను. 26

''బాలానందిని'' యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
అరణ్యకాండలో ఆరవ సర్గ సమాప్తము.

అథ సప్తమః సర్గః

[సీతాలక్ష్మణసమేతుడైన రాముడు సుతీక్ష్ణమహర్షి ఆశ్రమమునకు వెళ్ళి, ఆయనతో సంభాషించి ఆ రాత్రి అక్కడనే నివసించుట.]

మూ. రామస్తు సహితో భ్రాత్రా సీతయా చ పరంతపః,
సుతీక్ష్ణస్యాశ్రమపదం జగామ సహ తైర్ద్విజైః. 1

ప్ర. అ. పరంతపః = శత్రుసంహారకుడైన, రామస్తు=రాముడు, భ్రాత్రా = సోదరునితోను, సీతయా చ = సీతతోను, సహితః = కూడినవాడై, తైః=ఆ, ద్విజైః సహ = మునులతో కూడ, సుతీక్ష్ణస్య = సుతీక్ష్ణునియొక్క, ఆశ్రమపదమ్ = ఆశ్రమమును గూర్చి, జగామ = వెళ్ళెను.

తా. శత్రుసంహారకుడైన రాముడు, సోదరునితోను, సీతతోను, ఆ మునులతోను కలిసి సుతీక్ష్ణుని ఆశ్రమమునకు వెళ్ళెను. 1

మూ. స గత్వా దీర్ఘమధ్వానం నదీస్తీర్త్వా బహూదకాః,
దదర్శ విమలం శైలం మహామేరుమివోన్నతమ్. 2

ప్ర. అ. సః = ఆ రాముడు, దీర్ఘమ్ = దీర్ఘమైన, అధ్వానమ్ = మార్గమును, గత్వా = ప్రయాణము చేసి, బహూదకాః = చాల ఉదకము గల, నదీః = నదులను, తీర్త్వా = దాటి, మహామేరుమివ = గొప్ప మేరుపర్వతము వలె, ఉన్నతమ్ = ఉన్నతమైన, విమలమ్ = నిర్మలమైన, శైలమ్ = పర్వతమును, దదర్శ = చూచెను.

తా. ఆ రాముడు చాల దూరము ప్రయాణము చేసి, ఉదకముతో నిండిన నదులను దాటి, మహామేరుపర్వతము వలె ఉన్నతమైన, నిర్మలమైన ఒక పర్వతమును చూచెను. 2

మూ. తత స్తమిక్ష్వాకువరౌ సతతం వివిధైర్ద్రుమైః,
కాననం తౌ వివిశతుః సీతయా సహ రాఘవౌ. 3

ప్ర. అ. తతః=అటుపిమ్మట, ఇక్ష్వాకువరౌ=ఇక్ష్వాకువంశములో శ్రేష్ఠులైన, తౌ రాఘవౌ=ఆ రామలక్ష్మణులు, సీతయా సహ=సీతతో కూడ, వివిధైః =అనేకవిధములైన, ద్రుమైః=వృక్షములతో, సతతమ్=నిండియున్న, కాననమ్ = అడవిని, వివిశతుః=ప్రవేశించిరి.

తా. పిమ్మట, ఇక్ష్వాకువంశజులలో శ్రేష్ఠులైన ఆ రామలక్ష్మణులు, సీతాసమేతులై, అనేకవిధములైన వృక్షాలతో దట్టముగా ఉన్న అడవిలో ప్రవేశించిరి.

మూ. ప్రవిష్టస్తు వనం ఘోరం బహుపుష్పఫలద్రుమమ్,
దదర్శాశ్రమమేకాన్తే చీరమాలాపరిష్కృతమ్. 4

ప్ర. అ. ఘోరమ్ = భయంకరమైన, బహుపుష్పఫలద్రుమమ్ = అనేక పుష్పవృక్షములు, ఫలవృక్షములూ గల, వనమ్ = వనమును, ప్రవిష్టః = ప్రవేశించిన ఆ రాముడు, ఏకాన్తే=ఒక ప్రక్క, చీరమాలాపరిష్కృతమ్=నారచీరల పంక్తులచే అలంకరించబడిన, ఆశ్రమమ్=ఆశ్రమమును, దదర్శ=చూచెను.

తా. భయంకరమైన ఆ వనము అనేక పుష్పవృక్షములతోను, ఫలవృక్షములతోను నిండి యుండెను. ఆ వనములో ప్రవేశించి రాముడు ఒక ప్రశాంతమైన ప్రదేశమునందు ఆశ్రమమును చూచెను. దాని చుట్టూ అక్కడక్కడ నారచీరలు పెట్టుటచే అందముగా ఉండెను. 4

మూ. తత్ర తాపసమాసీనం మలపఙ్కజధారిణమ్,
రామః సుతీక్ష్ణం విధివత్ తపోధనమభాషత. 5

ప్ర. అ. తత్ర = అక్కడ, రామః = రాముడు, మలపఙ్కజధారిణమ్= ముట్టికిచేత ఏర్పడిన పద్మాకారములైన చిహ్నములను ధరించిన, ఆసీనమ్ = కూర్చొని యున్న, తపోధనమ్ = తపస్సే ధనముగా గల, తాపసమ్ = మునియైన, సుతీక్ష్ణమ్ = సుతీక్ష్ణుని, విధివత్ = యథాశాస్త్రముగా చేరి, అభాషత = పలికెను.

తా. రాముడు ఆ ఆశ్రమములో కూర్చొని ఉన్న, తపస్సే ధనముగా గల సుతీక్ష్ణమహర్షిని యథాశాస్త్రముగా సమీపించి, అతనితో సంభాషణము చేసెను. ఆ ముని శరీరముమీద మురికిచేత పద్మాకారము లైన మచ్చలు ఏర్పడి ఉండెను.

మూ. రామోఽహమస్మి భగవన్ భవన్తం ద్రష్టుమాగతః,
తన్మాభివద ధర్మజ్ఞ మహర్షే సత్యవిక్రమ. 6

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా ! అహమ్ = నేను, రామః అస్మి = రాముడను; భవన్తమ్ = నిన్ను, ద్రష్టుమ్ = చూచుటకు, ఆగతః = వచ్చినాను. తత్ = ఆ కారణమువలన, ధర్మజ్ఞ = ధర్మములు తెలిసినవాడా ! సత్యవిక్రమ = సత్యమైన తపఃశక్తి గలవాడా ! మహర్షే = ఓ ! మహర్షీ ! మా = నన్ను గూర్చి, అభివద = మాటలాడుము.

తా. ఓ ! పూజ్యుడా ! నేను రాముడను. నిన్ను చూచుటకై వచ్చినాను. ధర్మములు తెలిసిన, సత్యమైన తపఃప్రభావము గల ఓ ! మహర్షీ ! నాతో మాటలాడుము. 6

మూ. స నిరీక్ష్య తతో ధీరో రామం ధర్మభృతాం వరమ్,
సమాశ్లిష్య చ బాహుభ్యామిదం వచనమబ్రవీత్. 7

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ధీరః = ధీరుడైన, సః = ఆ సుతీక్ష్ణమహర్షి, ధర్మభృతామ్ = ధర్మమును పోషించువారిలో, వరమ్ = శ్రేష్ఠుడైన, రామమ్ = రాముణ్ణి, నిరీక్ష్య = చూచి, బాహుభ్యామ్ = బాహువులతో, సమాశ్లిష్య చ = కౌగలించుకొని, ఇదమ్ = ఈ, వచసమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. తపోనిష్ఠుడైన ఆ సుతీక్ష్ణమహర్షి, ధర్మమును పోషించేవారిలో శ్రేష్ఠుడైన ఆ రాముణ్ణి చూచి, చేతులతో కౌగలించుకొని, ఇట్లు పలికెను. 7

మూ. స్వాగతం తే రఘుశ్రేష్ఠ రామ సత్యభృతాం వర,
ఆశ్రమోఽయం త్వయాక్రాన్తః సనాథ ఇవ సాంప్రతమ్.

ప్ర. అ. రఘుశ్రేష్ఠ = రఘువంశమునందు శ్రేష్ఠుడా ! సత్యభృతామ్ = సత్యపాలకులలో, వర = శ్రేష్ఠుడా ! రామ = రామా ! తే = నీకు, స్వాగతమ్ = స్వాగతము. సాంప్రతమ్ = ఇప్పుడు, త్వయా = నీచేత, ఆక్రాన్తః = ఆక్రమించ

బడిన (తొక్కబడిన), అయమ్ ఆశ్రమః = ఈ ఆశ్రమము, సనాథః ఇవ = రక్షకునితో కూడినది అయినది.

తా. రఘువంశీయులలో శ్రేష్ఠుడవు, సత్యపరిపాలకులలో అగ్రగణ్యుడవు అయిన రామా! నీకు స్వాగతము. నీవు తొక్కుటచేత నేడు ఈ ఆశ్రమమునకు రక్షకుడు లభించినట్లు అయినది. 8

మూ. ప్రతీక్షమాణస్త్వామేవ నారోహేఽహం మహాయశః,
దేవలోకమితో వీర దేహం త్యక్త్వా మహీతలే. 9
చిత్రకూటముపాదాయ రాజ్యభ్రష్టోఽసి మే శ్రుతః.

ప్ర. అ. మహాయశః = గొప్ప కీర్తి కలవాడా! వీర = వీరుడా! అహమ్ = నేను, త్వామేవ = నిన్నే, ప్రతీక్షమాణః = నిరీక్షించుచున్నవాడనై, మహీతలే = భూలోకమునందు, దేహమ్ = దేహమును, త్యక్త్వా = విడచి, ఇతః = ఇక్కడి నుండి, దేవలోకమ్ = స్వర్గలోకమును, నారోహే = ఎక్కుటలేదు. రాజ్యభ్రష్టః = రాజ్యభ్రష్టుడవై, చిత్రకూటమ్ = చిత్రకూటపర్వతమును, ఉపాదాయ = పొంది, అసి = ఉన్నావు అని, మే = నాకు, శ్రుతః = వినబడితివి.

తా. గొప్ప కీర్తిగల మహావీరుడవైన రామా! నేను నీకొరకే నిరీక్షించుచున్నాను. నీవు రాజ్యభ్రష్టుడవై చిత్రకూటపర్వతముమీద ఉన్నావని విని యుంటిని. అందుచేతనే భూలోకములో ఈ శరీరమును విడచి, స్వర్గానికి వెళ్లలేదు. 9

మూ. ఇహోపయాతః కాకుత్స్థ దేవరాజః శతక్రతుః, 10
ఉపాగమ్య చ మే దేవో మహాదేవః సురేశ్వరః,
సర్వాన్ లోకాన్ జితానాహ మమ పుణ్యేన కర్మణా. 11

ప్ర. అ. కాకుత్స్థ = రామా! శతక్రతుః = నూరు యజ్ఞములు చేసిన, దేవరాజః = దేవేంద్రుడు, ఇహ = ఇక్కడికి, ఉపయాతః = వచ్చినాడు. మహాదేవః = గొప్ప ప్రభువు, సురేశ్వరః = దేవతాప్రభువు అయిన, దేవః = ఆ దేవేంద్రుడు, ఉపాగమ్య = వచ్చి, మమ = నాయొక్క, పుణ్యేన కర్మణా = పుణ్యకర్మచేత, సర్వాన్ = సమస్తమైన, లోకాన్ = లోకములను, జితాన్ = జయింపబడినవాటినిగా, మే = నాకు, ఆహ = చెప్పినాడు.

తా. రామా! దేవతాప్రభువైన దేవేంద్రుడు ఇక్కడికి వచ్చినాడు. గొప్ప ప్రభువైన ఆ దేవేంద్రుడు నావద్దకు వచ్చి, నా పుణ్యకర్మలచేత నేను సకల లోకములను జయించి నట్లుగా చెప్పినాడు. 11

మూ. తేషు దేవర్షిజుష్టేషు జితేషు తపసా మయా,
మత్ప్రసాదాత్సభార్యస్త్వం విహరస్వ సలక్ష్మణః. 12

ప్ర. అ. మయా = నాచేత, జితేషు = జయింపబడిన, దేవర్షిజుష్టేషు = దేవతలచేతను ఋషులచేతను పొందబడిన, తేషు = ఆ లోకములలో, సభార్యః = భార్యాసహితుడవై, సలక్ష్మణః = లక్ష్మణసమేతుడవై, త్వమ్ = నీవు, మత్ప్రసాదాత్ = నా ప్రసాదమువలన, విహరస్వ = విహరించుము.

తా. నేను దేవతలకు, ఋషులకు నివాసములైన, ఆ లోకము లన్నీ సంతోషపూర్వకముగా నీ కిచ్చుచున్నాను. నేను తపస్సుచేత జయించిన ఆ లోకములలో నీవు సీతాలక్ష్మణసహితుడవై విహరింపుము. 12

మూ. తముగ్రతపసం దీప్తం మహర్షిం సత్యవాదినమ్,
ప్రత్యువాచాత్మవాన్ రామో బ్రహ్మాణమివ వాసవః. 13

ప్ర. అ. ఆత్మవాన్=బుద్ధిమంతుడైన, రామః=రాముడు, ఉగ్రతపసమ్= ఉగ్రమైన తపస్సు గలవాడు, సత్యవాదినమ్=సత్యమును పలుకువాడు, దీప్తమ్= ప్రజ్వలించుచున్నవాడు అయిన, తం మహర్షిమ్=ఆ మహర్షిని గూర్చి, వాసవః= దేవేంద్రుడు, బ్రహ్మాణమివ = బ్రహ్మను గూర్చి వలె, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. బుద్ధిశాలి యైన రాముడు, ఉగ్రమైన తపస్సుతో ప్రజ్వలించుచున్న, సత్యమును పలుకుచున్న ఆ సుతీక్ష్ణమహర్షితో, దేవేంద్రుడు బ్రహ్మదేవునితో పలికి నట్లు పలికెను. 13

మూ. అహమేవాహరిష్యామి స్వయం లోకాన్ మహామునే,
ఆవాసం త్వహమిచ్ఛామి ప్రదిష్టమిహ కాననే. 14

ప్ర. అ. తా. చూ. 5వ సర్గలో 33వశ్లోకం, స్వయమ్ = స్వయముగా.

మూ. భవాన్ సర్వత్ర కుశలః సర్వభూతహితే రతః,
ఆఖ్యాతం శరభఙ్గేన గౌతమేన మహాత్మనా. 15

ప్ర. అ. భవాన్ = నీవు, సర్వత్ర = అన్నిటియందు, కుశలః = నేర్పు గలవాడవు అని, సర్వభూతహితే = సకలప్రాణుల హితమునందు, రతః = ఆసక్తికలవాడ వని, గౌతమేన = గౌతమవంశమునకు చెందిన, మహాత్మనా = మహాత్ముడైన, శరభఙ్గేన = శరభంగునిచేత, ఆఖ్యాతమ్ = చెప్పబడినది.

తా. నీవు సర్వకార్యములందు నేర్పు గలవాడ వని, సకలప్రాణుల హితమును కోరువాడ వని గౌతమవంశజుడైన మహాత్ముడైన శరభంగముని చెప్పినాడు. 15

మూ. ఏవముక్తస్తు రామేణ మహర్షిర్లోకవిశ్రుతః,
అబ్రవీన్మధురం వాక్యం హర్షేణ మహతా యుతః. 16

ప్ర. అ. రామేణ = రామునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, లోకవిశ్రుతః = లోకములో ప్రసిద్ధుడైన, మహర్షిః = ఆ మహర్షి, మహతా = గొప్పదైన, హర్షేణ = సంతోషముతో, యుతః = కూడినవాడై, మధురమ్ = మధురమైన, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. లోకములో ప్రసిద్ధుడైన ఆ సుతీక్ష్ణమహర్షి రాముని మాటలు విని చాల సంతోషించుచు మధురముగా ఇట్లు పలికెను. 16

మూ. అయమేవాశ్రమో రామ గుణవాన్ రమ్యతామితి,
ఋషిసంఘానుచరితః సదా మూలఫలైర్యుతః. 17

ప్ర. అ. రామ = రామా! ఋషిసంఘానుచరితః = ఋషీశ్వరుల సముదాయములచేత సంచరింపబడిన, సదా = ఎల్లప్పుడును, మూలఫలైః = మూలములతోను ఫలములతోను, యుతః = కూడిన, అయమ్ = ఈ, ఆశ్రమః ఏవ = ఆశ్రమమే, గుణవాన్ = మంచి గుణములు గలది. రమ్యతామ్ = క్రీడింపబడుగాక (నీవు క్రీడించెదవు గాక) ఇతి = అని పలికెను.

తా. "రామా! ఈ ఆశ్రమములో ఋషులు సంచరించుచుందురు. మూలములు ఫలములు సర్వదా లభించును. అందుచేత మంచి గుణములు గల ఈ ఆశ్రమములోనే సుఖముగా నివసించుము." 17

మూ. ఇమమాశ్రమమాగమ్య మృగసంఘా మహీయసః,
అహత్వా ప్రతిగచ్ఛన్తి లోభయిత్వాఽకుతోభయాః. 18

ప్ర. అ. మహీయసః = పెద్దవైన, మృగసంఘాః = మృగసముదాయములు, ఇమమ్ = ఈ, ఆశ్రమమ్ = ఆశ్రమమును, ఆగమ్య = పొంది, లోభయిత్వా = భయపెట్టి, అహత్వా = చంపకుండగా, అకుతోభయాః = ఎవరినుండి భయము లేనివై, ప్రతిగచ్ఛన్తి = తిరిగి వెళ్ళుచుండును.

తా. "పెద్ద మృగములు గుంపులుగా వచ్చి, ఈ ఆశ్రమవాసులను భయపెట్టి, ఎట్టి భయము లేనివై తిరిగి వెళ్లిపోవుచుండును. కాని అవి ఎవరినీ చంపవు." 18

మూ. నాన్యో దోషో భవేదత్ర మృగేభ్యోఽన్యత్ర విద్ధి వై,
తచ్ఛ్రుత్వా వచనం తస్య మహర్షేర్లక్ష్మణాగ్రజః. 19
ఉవాచ వచనం ధీరో విగృహ్య సశరం ధనుః.

ప్ర. అ. అత్ర = ఇక్కడ, మృగేభ్యః = మృగములకంటె, అన్యత్ర = ఇతరములనుండి, అన్యః = మరొక, దోషః = దోషము, న భవేత్ = ఉండదు. విద్ధి వై = తెలుసుకొనుము. ధీరః = ధీరుడైన, లక్ష్మణాగ్రజః = రాముడు, తస్య మహర్షేః = ఆ మహర్షియొక్క, తత్ వచనమ్ = ఆ వచనమును, శ్రుత్వా = విని, సశరమ్ = బాణముతో కూడిన, ధనుః = ధనస్సును, విగృహ్య = గ్రహించి, వచనమ్ = వచనమును, ఉవాచ = పలికెను.

తా. "ఈ ఆశ్రమములో మృగములనుండి తప్ప మరి వేటినుండి అపాయము లేదు అను విషయము తెలిసికొనుము". ధీరుడైన రాముడు ఆ మహర్షి మాటలు విని, బాణముతో కూడిన ధనస్సును పట్టుకొని చూపుచు ఇట్లు పలికెను. 19

మూ. తానహం సుమహాభాగ మృగసంఘాన్ సమాగతాన్, 20
హన్యాం నిశితధారేణ శరేణానతపర్వణా.

ప్ర. అ. సుమహాభాగ = మహాభాగ్యవంతుడవైన ఓ మహర్షీ, సమాగతాన్ = వచ్చిన, తాన్ = ఆ, మృగసంఘాన్ = మృగసముదాయములను, నిశితధారేణ =

వాడియైన అంచుగల, నతపర్వణా = వంగిన కణుపులు గల, శరేణ = బాణముతో, హన్యామ్ = చంపుదును.

తా. మహాభాగ్యశాలివైన మహర్షీ! ఆ మృగసముదాయములు వచ్చినప్పుడు నేను వాడియైన అగ్రభాగము, వంగిన కణుపులు ఉన్న బాణముతో చంపవచ్చును.

మూ. భవాంస్తత్రాభిషజ్యేత కింస్యాత్కృచ్ఛ్రతరం తతః, 21
ఏతస్మిన్నాశ్రమే వాసం చిరం తు న సమర్థయే.

ప్ర. అ. తత్ర = ఆ మృగములయందు, భవాన్ = నీవు, అభిషజ్యేత = ఆసక్తి కలవాడవు కావచ్చును. తతః = దానికంటె, కృచ్ఛ్రతరమ్ = ఎక్కువ కష్టము కలిగించునది, కిం స్యాత్ = ఏమి ఉండును? (అందువలన) ఏతస్మిన్ = ఈ, ఆశ్రమే = ఆశ్రమమునందు, చిరమ్ = చిరకాలము, వాసమ్ = నివాసమును, న సమర్థయే = యుక్త మని భావించను.

తా. నేను ఆ విధముగా చంపే మృగములపై నీకు దయ ఉండవచ్చును. అట్టివాటిని చంపుటవలన కలుగు కష్టముకంటె అధికమైన కష్టము ఏ ముండును? అందుచే ఈ ఆశ్రమములో చిరకాలము ఉండుట మంచిది కాదని తలచు చున్నాను. 21

మూ. తమేవముక్త్వో పరమం రామః సన్ధ్యాముపాగమత్. 22
అన్వాస్య పశ్చిమాం సన్ధ్యాం తత్ర వాసమకల్పయత్.
సుతీక్ష్ణస్యాశ్రమే రమ్యే సీతయా లక్ష్మణేన చ. 23

ప్ర. అ. రామః = రాముడు, తమ్ = ఆ సుతీక్ష్ణుని గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, ఉపరమమ్ = విరమించి, సన్ధ్యామ్ = సంధ్యను, ఉపాగమత్ = పొందెను (ఉపాసించెను). పశ్చిమాం సన్ధ్యామ్ = సాయంకాలసంధ్యను, అన్వాస్య = ఉపాసించి, సీతయా = సీతతోను, లక్ష్మణేన చ = లక్ష్మణునితోను, సుతీక్ష్ణస్య = సుతీక్ష్ణునియొక్క, తత్ర = ఆ, రమ్యే = సుందరమైన, ఆశ్రమే = ఆశ్రమమునందు, వాసమ్ = నివాసమును, అకల్పయత్ = ఏర్పరచుకొనెను.

తా. రాముడు ఆ మహర్షితో ఇట్లు పలికి, విరమించి, సంధ్యోపాసన చేసెను. సాయంకాలసంధ్యోపాసనానంతరము రాముడు సీతాలక్ష్మణులతో కలిసి, రమ్యమైన ఆ సుతీక్ష్ణమహాముని ఆశ్రమములో నివాస మేర్పరచుకొనెను. 23

మూ. తతః శుభం తాపసయోగ్యమన్నం
స్వయం సుతీక్ష్ణః పురుషర్షభాభ్యామ్,
తాభ్యాం సుసత్కృత్య దదౌ మహాత్మా
సన్ధ్యానివృత్తౌ రజనీం సమీక్ష్య. 24

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
సప్తమః సర్గః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మహాత్మా = మహాత్ముడైన, సుతీక్ష్ణః = సుతీక్ష్ణమహర్షి, సన్ధ్యానివృత్తౌ = సంధ్యాకాలము గడచిన పిమ్మట, రజనీమ్ = రాత్రిని, సమీక్ష్య = చూచి, తాభ్యామ్ = ఆ, పురుషర్షభాభ్యామ్ = పురుషశ్రేష్ఠులకు, తాపసయోగ్యమ్ = మునులకు తగిన, అన్నమ్ = అన్నమును, సుసత్కృత్య = బాగుగా సత్కరించి, స్వయమ్ = స్వయముగా, దదౌ = ఇచ్చెను.

తా. పిమ్మట, మహాత్ముడైన ఆ సుతీక్ష్ణమహర్షి, సంధ్యాకాలము గడచి రాత్రి వచ్చిన దని తెలిసికొని, పురుషశ్రేష్ఠులైన ఆ రామలక్ష్మణులను సత్కరించి, మునులకు తగిన ఆహారమును స్వయముగా వారికి ఇచ్చెను. 24

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో
ఏడవ సర్గ సమాప్తము.

అథ అష్టమః సర్గః

[సీతాలక్ష్మణసమేతుడైన రాముడు ప్రాతఃకాలమునందు సుతీక్ష్ణ మహర్షి అనుమతి గైకొని ఆ ఆశ్రమమునుండి బయలుదేరి వెళ్ళుట.]

మూ. రామస్తు సహసౌమిత్రిః సుతీక్ష్ణేనాభిపూజితః,
పరిణామ్య నిశాం తత్ర ప్రభాతే ప్రత్యబుధ్యత. 1

ప్ర. అ. సహసౌమిత్రిః = లక్ష్మణునితో కూడిన, రామస్తు = రాముడు, సుతీక్ష్ణేన = సుతీక్ష్ణమహర్షిచేత, అభిపూజితః = పూజింపబడినవాడై, తత్ర = ఆ ఆశ్రమమునందు, నిశామ్ = రాత్రిని, పరిణామ్య = పరిణమింపచేసి (గడిపి), ప్రభాతే = ప్రాతఃకాలమునందు, ప్రత్యబుధ్యత = మేల్కాంచెను.

తా. లక్ష్మణసమేతుడైన రాముడు సుతీక్ష్ణుని ఆతిథ్యము స్వీకరించి, రాత్రి ఆ ఆశ్రమమునందు గడపి ప్రాతఃకాలమునందు మేల్కాంచెను. 1

మూ. ఉత్థాయ చ యథాకాలం రాఘవః సహసీతయా,
ఉపస్పృశ్య సుశీతేన తోయేనోత్పలగన్ధినా. 2

ప్ర. అ. రాఘవః = రాముడు, సహసీతయా = సీతతో కూడ, యథాకాలమ్ = కాలానుసారముగా, ఉత్థాయ చ = లేచి, సుశీతేన = చాల చల్లగా ఉన్న, ఉత్పలగన్ధినా = కలవల సువాసన గల, తోయేన = ఉదకముతో, ఉకస్పృశ్య = ఆచమనముచేసి (ప్రయాణోన్ముఖు డయ్యెను).

తా. రాముడు సీతతో కూడ కాలానుసారము మేల్కాంచి, చాల చల్లని, కలువల సువాసన గల ఉదకము ఆచమనము చేసి (ప్రయాణోన్ముఖు డయ్యెను.)

మూ. అథ తేఽగ్నిం సురాంశ్చైవ వైదేహీ రామలక్ష్మణౌ,
కాల్యం విధివదభ్యర్చ్య తపస్విశరణే వనే. 3

ఉదయన్తం దినకరం దృష్ట్వా విగతకల్మషాః
సుతీక్ష్ణమభిగమ్యేదం శ్లక్ష్ణం వచనమబ్రువన్. 4

ప్ర. అ. అథ = అటుపిమ్మట, వైదేహీ = సీత, రామలక్ష్మణౌ = రామలక్ష్మణులు, తే = వారందరు, కాల్యమ్ = ప్రాతఃకాలమునందు, అగ్నిమ్ = అగ్నిని, సురాంశ్చైవ = దేవతలను, తపస్విశరణే = మునులకు నివాసస్థానమైన, వనే = ఆ వనమునందు, విధివత్ = యథాశాస్త్రముగా, అభ్యర్చ్య = పూజించి, ఉదయన్తమ్ = ఉదయించుచున్న, దినకరమ్ = సూర్యుణ్ణి, దృష్ట్వా = చూచి, విగతకల్మషాః = పోయిన పాపము గలవారై, సుతీక్ష్ణమ్ = సుతీక్ష్ణుని, అభిగమ్య = సమీపించి, శ్లక్ష్ణమ్ = మృదువైన, ఇదమ్ = ఈ, వచనమ్ = వచనమును, అబ్రువన్ = పలికిరి.

తా. పిమ్మట సీతారామలక్ష్మణులు, మహర్షులకు నివాసమైన ఆ ఆశ్రమములో, ప్రాతఃకాలమునందు అగ్నిని, దేవతలను, యథాశాస్త్రముగా పూజించి, ఉదయించుచున్న సూర్యుణ్ణి చూచి, పాపరహితులై, సుతీక్ష్ణుని వద్దకు వెళ్ళి మధురముగా ఇట్లు పలికిరి. 3, 4

మూ. సుఖోషితాః స్మ భగవం స్త్వయా పూజ్యేన పూజితాః,
ఆపృచ్ఛామః ప్రయాస్యామో మునయ స్త్వరయ న్తి నః. 5

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా! పూజ్యేన = పూజింపదగిన, త్వయా = నీచేత, పూజితాః = సత్కరించబడినవారమై, సుఖోషితాః = సుఖముగా నివసించినవారము, స్మః = అయితిమి. ఆపృచ్ఛామః = వెళ్ళుటకు అనుజ్ఞ కోరుచున్నాము. ప్రయాస్యామః = వెళ్లెదము. మునయః = మునులు, నః = మమ్ములను, త్వరయన్తి = తొందరపెట్టుచున్నారు.

తా. మహామునీ! పూజ్యుడవైన నీ ఆతిథ్యము నందుకొని మేము సుఖముగా ఉంటిమి. మేము వెళ్లెదము అనుజ్ఞ ఇమ్ము. ఈ మునులు తొందరపెట్టుచున్నారు. 5

మూ. త్వరామహే వయం ద్రష్టుం కృత్స్నమాశ్రమమణ్డలమ్,
ఋషీణాం పుణ్యశీలానాం దణ్డకారణ్యవాసినామ్. 6

ప్ర. అ. వయమ్ = మేము, పుణ్యశీలానామ్ = పుణ్యమైన శీలము గల, దణ్డకారణ్యవాసినామ్ = దండకారణ్యములో నివసించు, ఋషీణామ్ = ఋషుల యొక్క, కృత్స్నమ్ = సమస్తమైన, ఆశ్రమమణ్డలమ్ = ఆశ్రమమండలమును, ద్రష్టుమ్ = చూచుటకు, త్వరామహే = తొందరపడుచున్నాము.

తా. దండకారణ్యములో నివసించుచున్న, పుణ్యస్వభావము గల ఋషుల ఆశ్రమములను అన్నింటిని చూడవలె నని మేము తొందరపడుచున్నాము. 6

మూ. అభ్యనుజ్ఞాతుమిచ్ఛామః సహైభిర్మునిపుఙ్గవైః,
ధర్మనిత్యైస్తపోదాన్తై ర్విశిఖైరివ పావకైః. 7

ప్ర. అ. ధర్మనిత్యైః = ధర్మమునందు స్థిరులు, తపోదాన్తైః = తపస్సు చేత ఆత్మనిగ్రహము కలవారు, విశిఖైః = జ్వాలలు లేని, పావకైరివ = అగ్నుల వలె ఉన్న, ఏభిః = ఈ, మునిపుఙ్గవైః = మునిశ్రేష్ఠులతో కూడ, అభ్యనుజ్ఞాతుమ్ = అనుజ్ఞ ఇచ్చుటకు, ఇచ్ఛామః = కోరుచున్నాము.

తా. ఎల్లప్పుడు ధర్మనిరతులు, తపస్సుచేత ఆత్మనిగ్రహము సంపాదించినవారు, జ్వాలలు లేని అగ్నుల వలె ఉన్నవారు అయిన ఈ మునిశ్రేష్ఠులకు మాకు కూడ అనుజ్ఞ ఇవ్వవలె నని కోరుచున్నాము. 7

మూ. అవిషహ్యతపో యావత్సూర్యో నాతివిరాజతే
అమార్గేణాగతాం లక్ష్మీం ప్రాప్యేవాన్వయవర్జితః, 8

తావదిచ్ఛామహే గన్తుమిత్యుక్త్వా చరణౌ మునేః
వవన్దే సహసౌమిత్రిః సీతయా సహ రాఘవః. 9

ప్ర. అ. అన్వయవర్జితః=సత్కులము లేనివాడు, అమార్గేణ=అన్యాయ మార్గముచేత, ఆగతామ్ = వచ్చిన, లక్ష్మీమ్ = లక్ష్మిని, ప్రాప్యేవ = పొంది వలె, సూర్యః = సూర్యుడు, యావత్ = ఎంతలో, అవిషహ్యతపః = సహింప శక్యము కాని ఎండ గలవాడై, నాతివిరాజతే = ఎక్కువగా ప్రకాశించదో, తావత్ = అంతలో, గన్తుమ్ = వెళ్ళుటకు, ఇచ్ఛామహే=కోరుచున్నాము, ఇతి= అని, ఉక్త్వా = పలికి, సీతయా సహ = సీతతో కూడిన, సహసౌమిత్రిః =

లక్ష్మణసమేతుడైన, రామః = రాముడు, మునేః = మునియొక్క, చరణౌ = పాదములను, వవన్దే = నమస్కరించెను.

తా. "అన్యాయముగా ఐశ్వర్యము లభించిన నీచవంశములో పుట్టినవాడు వలె, సూర్యుడు సహింపశక్యము కాని తాపముతో అధికముగా ప్రకాశించుటకు ముందుగానే మేము వెళ్ళవలె నని కోరుచున్నాము" అని పలుకుచు సీతాలక్ష్మణులతో కూడిన రాముడు ఆ సుతీక్ష్ణుని పాదములకు నమస్కరించెను. 8, 9

మూ. తౌ సంస్పృశన్తౌ చరణావుత్థాప్య మునిపుఙ్గవః,
గాఢమాశ్లిష్య సస్నేహమిదం వచనమబ్రవీత్. 10

ప్ర. అ. మునిపుఙ్గవః = ఆ మునిశ్రేష్ఠుడు, చరణౌ = పాదములను, సంస్పృశన్తౌ = స్పృశించుచున్న, తౌ = వారిద్దరిని, ఉత్థాప్య = లేవదీసి, గాఢమ్ = గాఢముగా, ఆశ్లిష్య = కౌగలించుకొని, సస్నేహమ్ = స్నేహపూర్వకముగా. ఇదమ్ = ఈ, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. ఆ సుతీక్ష్ణమహర్షి తన పాదములను స్పృశించి నమస్కరించుచున్న ఆ రామలక్ష్మణులను లేవదీసి, కౌగలించుకొని, స్నేహపూర్వకముగా ఇట్లు పలికెను. 10

మూ. అరిష్టం గచ్ఛ పన్థానం రామ సౌమిత్రిణా సహ,
సీతయా చానయా సార్ధం ఛాయయేవానువృత్తయా. 11

ప్ర. అ. రామ = రామా! సౌమిత్రిణా సహ = లక్ష్మణునితోను, ఛాయయేవ = నీడవలె, అనువృత్తయా = అనుసరించుచున్న, అనయా = ఈ, సీతయా సార్ధంచ = సీతతోను, అరిష్టమ్ = మంగళకరమైన, పన్థానమ్ = మార్గమును గూర్చి, గచ్ఛ = వెళ్ళుము .

తా. రామా! లక్ష్మణునితోను, నీడ వలె అనుసరించి వచ్చుచున్న ఈ సీతతోనుకలిసి శుభకర మైన మార్గమునందు ప్రయాణము చేయుము. 11

మూ. పశ్యాశ్రమపదం రమ్యం దణ్డకారణ్యవాసినామ్,
ఏషాం తపస్వినాం వీర తపసా భావితాత్మనామ్. 12

ప్ర. అ. వీర = వీరుడా! దణ్డకారణ్యవాసినామ్ = దండకారణ్యములో నివసించుచున్న, తపసా = తపస్సుచేత, భావితాత్మనామ్ = పవిత్రముచేసికొనబడిన మనస్సు గల, ఏషామ్ = ఈ, తపస్వినామ్ = మునులయొక్క, రమ్యమ్ = సుందరమైన, ఆశ్రమపదమ్ = ఆశ్రమమును, పశ్య = చూడుము.

తా. ఓ వీరుడా! తపస్సుచేత మనస్సును పరిశుద్ధముచేసికొని ఉన్న ఈ దండకారణ్యనివాసులైన మునుల రమ్యములైన ఆశ్రమములను చూడుము. 12

మూ. సుప్రాజ్యఫలమూలాని పుష్పితాని వనాని చ
ప్రశస్తమృగయూథాని శాన్తపక్షిగణాని చ. 13

పుల్లపఙ్కజఖణ్డాని ప్రసన్నసలిలాని చ
కారణ్డవవికీర్ణాని తటాకాని సరాంసి చ. 14

ద్రక్ష్యసే దృష్టిరమ్యాణి గిరిప్రస్రవణాని చ
రమణీయాన్యరణ్యాని మయూరాభిరుతాని చ. 15

ప్ర. అ. సుప్రాజ్యఫలమూలాని = చాల అధికమైన ఫలములు మూలములు గలవి, పుష్పితాని = పుష్పించినవి, ప్రశస్తమృగయూథాని = ప్రశస్తమైన మృగముల గుంపులు గలవి, శాన్తపక్షిగణాని చ = శాంతముగా ఉన్న పక్షి సముదాయములు కలవి అయిన, వనాని చ = వనములను, పుల్లపఙ్కజఖణ్డాని = వికసించిన పద్మసముదాయములు గల, ప్రసన్నసలిలాని చ = నిర్మలములైన ఉదకములు గల, కారణ్డవవికీర్ణాని = కారండవపక్షులచే వ్యాప్తములైన, తటాకాని = చిన్న చెరువులను, సరాంసి చ = పెద్ద సరస్సులను, దృష్టిరమ్యాణి = దృష్టికి రమ్యములైన, గిరిప్రస్రవణాని చ = సెలయేళ్ళను, మయూరాభిరుతాని = నెమళ్లచేత ధ్వనింపచేయబడిన, రమణీయాని = సుందరములైన, అరణ్యాని = అరణ్యములను, ద్రక్ష్యసే = చూదగలవు.

తా. నీవు ఈ ప్రాంతమునందు సంచరించుచు అనేకరమ్యప్రదేశములను చూడవచ్చును. ఇక్కడ వనములు ఫలములతోను మూలములతోను సమృద్ధములై పుష్పించి ఉండును. ప్రశస్తములైన మృగములు గుంపులు గుంపులుగా

తిరుగుచుండును. పక్షుల సముదాయములు శాంతములై సుఖముగా విహరించుచుండును. ఇక్కడ నున్న చిన్న చెరువులలోను, పెద్ద చెరువులలోను పద్మముల సముదాయములు వికసించి ఉండును. ఉదకములు నిర్మలములై ఉండును. కారండవము లను నీటిపక్షులు ఈ చెరువులలో విహరించుచుండును. కొండలమీద నుండి పడుచున్న జలపాతములు చూచుటకు రమ్యముగా ఉండును. నెమళ్ళ కూతలతో ప్రతిధ్వనించు అరణ్యములు మనోహరములుగా ఉండును. వీటి నన్నింటిని చూడుము. 13, 14, 15

మూ. గమ్యతాం వత్స సౌమిత్రే భవానపి చ గచ్ఛతు,
ఆగన్తవ్యం చ తే దృష్ట్వా పునరేవాశ్రమం ప్రతి. 16

ప్ర. అ. వత్స=వత్సా! రామా! గమ్యతామ్=వెళ్ళెదవుగాక. సౌమిత్రే= లక్ష్మణా, భవానపిచ = నీవుకూడ, గచ్ఛతు = వెళ్ళెదవుగాక. దృష్ట్వా = చూచి, పునరేవ = మరల, ఆశ్రమం ప్రతి = ఈ ఆశ్రమమును గూర్చి, తే=నీకు (వు), ఆగన్తవ్యమ్ = రావలెను.

తా. రామా! నీవు వెళ్లుము; లక్ష్మణా నీవు కూడ నెళ్లుము; వాటి నన్నింటిని చూచిన పిమ్మట మీరు మరల ఈ ఆశ్రమమునకు రావలెను. 16

మూ. ఏవముక్తస్తథేత్యుక్త్వా కాకుత్స్థః సహలక్ష్మణః,
ప్రదక్షిణం మునిం కృత్వా ప్రస్థాతుముపచక్రమే. 17

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, కాకుత్స్థః = రాముడు, సహలక్ష్మణః = లక్ష్మణసహితుడై, తథేతి = అట్లే చేసెదను అని, ఉక్త్వా = పలికి, మునిమ్=మునిని, ప్రదక్షిణం కృత్వా=ప్రదక్షిణము చేసి, ప్రస్థాతుమ్= బయలుదేరుటకు, ఉపచక్రమే = ఉపక్రమించెను.

తా. లక్ష్మణసహితుడైన రాముడు ఆ ముని మాటలు విని, "అట్లే చేసెదను"అని చెప్పి, ఆ మునికి ప్రదక్షిణనమస్కారములు చేసి, ప్రయాణమునకు సన్నద్ధుడయ్యెను. 17

మూ. తతః శుభతరే తూణీ ధనుషీ చాయతేక్షణా,
దదౌ సీతా తయోర్భ్రాత్రోః ఖడ్గౌ చ విమలౌ తతః. 18

ప్ర. అ. తతః=అటుపిమ్మట, ఆయతేక్షణా=విశాలములైన నేత్రములు గల, సీతా = సీత, తయోః = ఆ, భ్రాత్రోః = సోదరులకు, శుభతరే= చాల శుభకరములైన, తూణీ = అంబులపొదులను, ధనుషీ చ=ధనస్సులను, తతః= పిమ్మట, విమలౌ = నిర్మలములైన, ఖడ్గౌ చ = ఖడ్గములను, దదౌ = ఇచ్చెను.

తా. పిమ్మట, విశాలములైన నేత్రములు గల సీత ఆ సోదరులకు శుభ కరము లైన అంబులపొదులను, ధనస్సులను, నిర్మలములైన ఖడ్గములను ఇచ్చెను.

మూ. ఆబధ్య చ శుభే తూణీ చాపే చాదాయ సస్వనే,
నిష్క్రాన్తావాశ్రమాద్గన్తుముభౌ తౌ రామలక్ష్మణౌ. 19

ప్ర. అ. తౌ రామలక్ష్మణౌ = ఆ రామలక్ష్మణులు, ఉభౌ = ఇద్దరూ, శుభే = సుందరములైన, తూణీ = అంబులపొదులను, ఆబధ్య చ = కట్టుకొని, సస్వనే=ధ్వనితో కూడిన, చాపే చ=ధనస్సులను కూడ, ఆదాయ=గ్రహించి, గన్తుమ్ = వెళ్ళుటకు, ఆశ్రమాత్ = ఆశ్రమమునుండి, నిష్క్రాన్తే = బయలుదేరి నారు.

తా. ఆ రామలక్ష్మణులు, సుందరములైన అంబులపొదులు భుజములకు కట్టుకొని, ధ్వని చేయుచున్న ధనస్సులు చేతబట్టి ఆ ఆశ్రమమునుండి బయ ల్దేరిరి. 19

మూ. శీఘ్రం తౌ రూపసంపన్నావనుజ్ఞాతౌ మహర్షిణా,
ప్రస్థితౌ ధృతచాపాసీ సీతయా సహ రాఘవౌ. 20

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
అష్టమః సర్గః.

ప్ర. అ. రూపసంపన్నౌ = మంచి రూపముతో కూడిన, తౌ రాఘవౌ = ఆ రామలక్ష్మణులు, మహర్షిణా = మహర్షిచేత, అనుజ్ఞాతౌ = అనుజ్ఞ ఇవ్వబడిన వారై, ధృతచాపాసీ = ధరించబడిన ధనస్సు ఖడ్గములు కలవారై, సీతయా సహ = సీతతో కూడ, శీఘ్రమ్ = శీఘ్రముగా, ప్రస్థితౌ = ప్రయాణమైరి.

తా. మనోహరరూపసంపన్నులైన ఆ రామలక్ష్మణులు, ఆ సుతీక్ష్ణమహాముని అనుజ్ఞ పొంది, ధనస్సులను, ఖడ్గములను ధరించి, సీతాసమేతులై శీఘ్రముగా బయలుదేరిరి. 20

'బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో ఎనిమిదవ సర్గ సమాప్తము.

అథ నవమః సర్గః

[“మనకు ఏ అపకారమూ చేయనివారిని హింసించుట న్యాయము కాదు గాన నీవు అహింసావ్రతమును పాటించుట యుక్తము” అని సీత రాముని ప్రార్థించుట.]

మూ. సుతీక్ష్ణేనాభ్యనుజ్ఞాతం ప్రస్థితం రఘునన్దనమ్,
హృద్యయా స్నిగ్ధయా వాచా భర్తారమిదమబ్రవీత్. 1

ప్ర. అ. సుతీక్ష్ణేన = సుతీక్ష్ణునిచేత, అభ్యనుజ్ఞాతమ్ = అనుమతింపబడిన, ప్రస్థితమ్ = ప్రయాణమైన, భర్తారమ్ = భర్తయైన, రఘునన్దనమ్ = రాముణ్ణి గూర్చి, (సీత) హృద్యయా = మనోహరము, స్నిగ్ధయా = స్నేహపూర్ణము అయిన, వాచా = వాక్కుతో, ఇదమ్ = దీనిని, అబ్రవీత్ = పలికెను.

తా. సుతీక్ష్ణమహర్షి అనుమతి పొంది బయలుదేరిన భర్త యైన రామునితో సీత మనోహరములు, స్నేహభరితములు, అయిన మాటలు పలుకుచు ఇట్లనెను.

మూ. అయం ధర్మః సుసూక్ష్మేణ విధినా ప్రాప్యతే మహాన్,
నివృత్తేన తు శక్యోఽయం వ్యసనాత్కామజాదిహ. 2

ప్ర. అ. మహాన్ = గొప్పదైన, అయం ధర్మః = ఈ ధర్మము, సుసూక్ష్మేణ = చాల సూక్ష్మమైన, విధినా = విధానముచేత, ప్రాప్యతే = పొందబడును. అయమ్ = ఈ ధర్మము, కామజాత్ = కామమువలన కలిగిన, వ్యసనాత్ = వ్యసనమునుండి, నివృత్తేన = నివర్తించినవానిచేతనే, ఇహ = ఈ లోకమునందు, శక్యః = పొందశక్య మైనది.

తా. మహాధర్మసంపాదనము చాల సూక్ష్మమైన పద్ధతిని అవలంబించి చేయవచ్చును. కామజములైన వ్యసనములకు దూరముగా ఉన్నవాడే, ఈ లోకములో ఈ ధర్మమును సంపాదించగలడు. 2

మూ. త్రీణ్యేవ వ్యసనాన్యత్ర కామజాని భవన్త్యుత,
మిథ్యావాక్యం పరమకం తస్మాద్గురుతరావుభౌ. 3
పరదారాభిగమనం వినా వైరం చ రౌద్రతా.

ప్ర. అ. అత్ర = ఈ లోకములో, కామజాని = కామమువలన పుట్టిన, వ్యసనాని = వ్యసనములు, త్రీణ్యేవ = మూడే, ఉత = తప్పక, భవన్తి = ఉండును. మిథ్యావాక్యమ్ = అసత్యవాక్యము, పరమకమ్ = గొప్ప వ్యసనము. పరదారాభిగమనమ్ = పరభార్యాగమనము, వినా వైరమ్ = వైరము లేకుండా, రౌద్రతా = క్రూరత్వము అను, ఉభౌ = ఈ రెండు వ్యసనములు, తస్మాత్ = ఆ మిథ్యావాక్యముకంటె కూడ, గురుతరౌ = గొప్పవి (చాల పెద్దవి).

తా. కామమువలన కలుగు వ్యసనములు మూడు-వాటిలో అసత్యవాక్యము పలుకుట అనేది పెద్ద వ్యసనము. పరభార్యాగమనము, వైరము లేకుండగనే క్రూరముగా ప్రవర్తించుట అనే రెండూ దానికంటె కూడ చాల పెద్దవి. 3

మూ. మిథ్యావాక్యం న తే భూతం న భవిష్యతి రాఘవ, 4
కుతోఽభిలాషణం స్త్రీణాం పరేషాం ధర్మనాశనమ్.

ప్ర. అ. రాఘవ = రామా! మిథ్యావాక్యమ్ = అసత్యవాక్యము, తే = నీకు, న భూతమ్ = పూర్వ మెన్నడూ లేదు. న భవిష్యతి = మున్ముందు ఉండదు. ధర్మనాశనమ్ = ధర్మమును నశింపచేసే, పరేషామ్ = పరులయొక్క, స్త్రీణామ్ = స్త్రీలయొక్క, అభిలాషణమ్ = అభిలషించుట, కుతః = నీ కెట్లుండును?

తా. రామా! అసత్యవాక్యమును పూర్వ మెన్నడూ నీ వెరుగవు. ఇటుపైన కూడ అది నీకు ఉండదు. ధర్మనాశమునకు హేతువైన పరస్త్రీవాంఛ నీకు ఉండుట అసంభావ్యము. 4

మూ. తవ నాస్తి మనుష్యేన్ద్ర న చాభూత్తే కదాచన, 5
మనస్యపి తథా రామ న చైతద్విద్యతే క్వచిత్.

ప్ర. అ. మనుష్యేన్ద్ర = మనుష్యుల ప్రభువైన రామా! తవ = నీకు, ఏతత్ = పరదారాభిలాష, నాస్తి = లేదు. తే = నీకు, కదాచన = ఎన్నడును,

న అభూత్ చ = పూర్వము కలగలేదు. రామ = రామా ! తథా = అట్లే, మనస్యపి = మనస్సులో కూడ, క్వచిత్ = ఎక్కడను, న విద్యతే = లేదు.

తా. మనుష్యుల ప్రభువైన రామా ! పరదారాభిలాష పూర్వము నీ కెన్నడును కలుగలేదు. ఇప్పుడు కూడ లేదు. నీ మనస్సులో కూడ ఏ మూలలోను ఇది లేదు. 5.

మూ. స్వదారనిరతస్త్వం చ నిత్యమేవ నృపాత్మజ, 6
ధర్మిష్ఠః సత్యసంధశ్చ పితుర్నిర్దేశకారకః.

ప్ర. అ. నృపాత్మజ = రాజకుమారా ! త్వమ్ = నీవు, నిత్యమేవ = ఎల్లప్పుడు, స్వదారనిరతః = స్వభార్యయందే ఆసక్తి గలవాడవు. ధర్మిష్ఠః = ధర్మాత్ముడవు, సత్యసంధశ్చ = సత్యసంధుడవు, పితుః = తండ్రియొక్క, నిర్దేశకారకః = ఆజ్ఞను పాలించువాడవు.

తా. రాజకుమారా ! నీవు నిత్యము స్వభార్యయందు మాత్రమే ఆసక్తి గలవాడవు. ధర్మాత్ముడవు. సత్యసంధుడవు. తండ్రి ఆజ్ఞను పాలించువాడవు. 6

మూ. సత్యసంధ మహాభాగ శ్రీమన్ లక్ష్మణపూర్వజ,
త్వయి ధర్మశ్చ సత్యం చ త్వయి సర్వం ప్రతిష్ఠితమ్.

ప్ర. అ. సత్యసంధ = సత్యమైన ప్రతిజ్ఞ కలవాడా ! మహాభాగ = గొప్ప భాగ్యము గలవాడా! శ్రీమన్ = ఐశ్వర్యవంతుడా; లక్ష్మణపూర్వజ = రామా ! త్వయి = నీయందు, ధర్మశ్చ = ధర్మము, సత్యం చ = సత్యము ఉన్నవి. త్వయి = నీయందే, సర్వమ్ = సమస్తమూ, ప్రతిష్ఠితమ్ = నిలచి ఉన్నది.

తా. సత్యసంధుడవు, మహాభాగ్యవంతుడవు, శ్రీమంతుడవు అయిన ఓ ! రామా ! ధర్మము, సత్యమూ కూడ నీయందే ఉన్నది. ఇతర సద్గుణములు కూడ నీయందే స్థిరముగా ఉన్నవి. 7

మూ. తచ్చ సర్వం మహాబాహో శక్యం ధర్తుం జితేన్ద్రియైః, 8
తవ వశ్యేన్ద్రియత్వం చ జానామి శుభదర్శన.

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా! తత్ = ఆ, సర్వమ్

= సత్యసంధత్వాదికము అంతయు, జితేన్ద్రియైః = జయించబడిన ఇంద్రియ ములు కలవారిచేత, ధర్తుమ్=పాలించుటకు, శక్యమ్ = శక్య మైనది. శుభదర్శన = శుభకరమైన దర్శనము కలవాడా! తవ = నీయొక్క, వశ్యేన్ద్రియత్వమ్ = వశ్యములైన ఇంద్రియములు కలిగియుంటను, జానామి = నే నెరుగుదును.

తా. ఓ! మహాబాహూ! ఇంద్రియములను జయించినవారు మాత్రమే ఈ సత్యసంధత్వాదులను కాపాడుకొనగలరు. చూచువారికి శుభప్రదుడవైన రామా! నీవు ఇంద్రియములను వశములో ఉంచుకొన్నవాడవు అను విషయము నే నెరుగుదును. 8

మూ. తృతీయం యదిదం రౌద్రం పరప్రాణాభిహింసనమ్, 9
నిర్వైరం క్రియతే మోహాత్తచ్చ తే సముపస్థితమ్.

ప్ర. అ. నిర్వైరమ్ = వైరము లేకుండా, యత్ = ఏ, ఇదమ్ = ఈ, రౌద్రమ్=భయంకరమైన, పరప్రాణాభిహింసనమ్ = పరప్రాణములను హింసించుట, మోహాత్ = అజ్ఞానమువలన, క్రియతే = చేయబడుచున్నదో, తత్ = ఆ, తృతీయమ్ = మూడవ వ్యసనము, తే = నీకు, సముపస్థితమ్ = వచ్చిపడినది.

తా. వైర మేమీ లేకుండగనే, అజ్ఞానముచేత, పరులప్రాణములను తీయుట అను మూడవదైన భయంకరమైన వ్యసనము ఇప్పుడు నీకు ఆకస్మికముగా వచ్చినది. 9

మూ. ప్రతిజ్ఞాత స్త్వయా వీర దణ్డకారణ్యవాసినామ్. 10
ఋషీణాం రక్షణార్థాయ వధః సంయతి రక్షసామ్.

ప్ర. అ. వీర = వీరుడా! దణ్డకారణ్యవాసినామ్=దండకారణ్యములో నివసించుచున్న, ఋషీణామ్ = ఋషులయొక్క, రక్షణార్థాయ = రక్షణముకొరకు, సంయతి = యుద్ధమునందు, రక్షసామ్=రాక్షసులయొక్క, వధః=వధ, త్వయా = నీచేత, ప్రతిజ్ఞాతః = ప్రతిజ్ఞచేయబడినది.

తా. "దండకారణ్యములో నివసించు ఋషులను రక్షించుటకై యుద్ధములో రాక్షసులను సంహరించెదను"అని నీవు ప్రతిజ్ఞ చేసినావు. 10

మూ. ఏతన్నిమిత్తం చ వనం దణ్డకా ఇతి విశ్రుతమ్, 11
ప్రస్థితస్త్వం సహ భ్రాత్రా ధృతబాణశరాసనః.

ప్ర. అ. ఏతన్నిమిత్తమ్ = దీనికొరకే, త్వమ్ = నీవు, ధృతబాణశరాసనః = ధరించబడిన బాణములు ధనస్సు కలవాడవై, భ్రాత్రా సహ = సోదరునితో కూడ, దణ్డకాః ఇతి = దండకారణ్య మని, విశ్రుతమ్ = ప్రసిద్ధమైన, వనమ్ = వనమును గూర్చి, ప్రస్థితః = ప్రయాణ మైనావు.

తా. ఈ కార్యమును పూర్తిచేయుటకే నీవు సోదరునితో కలిసి, ధనుర్బాణములు ధరించి, దండకారణ్యమునకు బయలుదేరినావు. 11

మూ. తతస్త్వాం ప్రస్థితం దృష్ట్వా మమ చిన్తాకులం మనః, 12
త్వద్వృత్తం చిన్తయన్త్యా వై భవేన్నిశ్రేయసం హి తత్.

("నిశ్రేయసం హితమ్"అని గోరఖ్‌పూర్ ప్రతి పాఠము).

ప్ర. అ. తతః = అటుపిమ్మట. ప్రస్థితమ్ = బయలుదేరిన, త్వామ్ = నిన్ను, దృష్ట్వా = చూచి, మమ = నాయొక్క, మనః = మనస్సు, చిన్తాకులమ్ = చింతచేత వ్యాకుల మైనది. త్వద్వృత్తమ్ = నీ ప్రవర్తనను గూర్చి, చిన్తయన్త్యాః = ఆలోచించుచున్న, నాకు, హితమ్ = హితకరమైన, నిశ్రేయసమ్ = క్షేమము, భవేత్ వై = అగును కదా.

తా. నీవు ఆ విధముగా బయలుదేరుట చూచి నా మనస్సు చింతాకులమైనది. నీవు ఏ విధముగా ప్రవర్తింతువో, దానిలోని మంచిచెడ్డలను గూర్చి నేను ఆలోచించి నపుడే హితకరమైన క్షేమము కలుగును. అందుచే నేను ఆలోచించవలసి వచ్చినది.

వి. ప్రాచ్యపాఠంలో అన్వయం చక్కగా కుదురుతుంది.

"త్వాం చైవ ప్రస్థితం దృష్ట్వా రామ చిన్తాకులం మనః,
సర్వతశ్చిన్తయన్త్యా మే తవ నిఃశ్రేయసం నృప."

అని ఆ పాఠము. "నీవు అటు బయలుదేరుట చూడగానే, అన్ని కోణాలనుండీ

నీ శ్రేయస్సును గూర్చి ఆలోచింతే నా మనస్సు చింతాకుల మైనది" అని దాని భావము. 12

మూ. న హి మే రోచతే వీర గమనం దణ్డకాన్ ప్రతి,
కారణం తత్ర వక్ష్యామి వదన్త్యాః శ్రూయతాం మమ.

ప్ర. అ. వీర=ఓ! వీరుడా! దణ్డకాన్ ప్రతి=దండకారణ్యమును గూర్చి, గమనమ్=వెళ్లుట, మే=నాకు, న రోచతే=ఇష్టము కాదు. తత్ర=దానియందు, కారణమ్ = కారణమును, వక్ష్యామి = చెప్పెదను. మమ = నేను, వదన్త్యాః = చెప్పుచుండగా, శ్రూయతామ్ = వినబడుగాక.

తా. ఓ! వీరుడా! దండకారణ్యమునకు వెళ్లుట నా కిష్టము కాదు. అందుకు కారణము చెప్పెదను వినుము. 13

మూ. త్వం హి బాణధనుష్పాణిర్భ్రాత్రా సహ వనం గతః, 14
దృష్ట్వా వనచరాన్ సర్వాన్ కచ్చిత్కుర్యాః శరవ్యయమ్.

ప్ర. అ. బాణధనుష్పాణిః = బాణములు ధనస్సు హస్తమునందు గల, త్వమ్ = నీవు, భ్రాత్రా సహ = సోదరునితో కూడ, వనమ్ = వనమును గూర్చి, గతః = వెళ్లినవాడవై, సర్వాన్ = సమస్తమైన, వనచరాన్ = వనములో సంచరించే మృగాదులను, దృష్ట్వా = చూచి, శరవ్యయమ్ = బాణములవ్యయమును, కచ్చిత్కుర్యాః = చేయుదువు కదా.

తా. నీవు ధనుర్బాణములు ధరించి సోదరునితో అరణ్యములో ప్రవేశించి, అక్కడ ఉన్న మృగాదులను చూచి బాణప్రయోగము చేయుదువు కదా?

వి. "కచ్చిత్కుర్యాః"అను పాఠమునకు బదులు "కిం న కుర్యాః"అను ప్రాచ్యపాఠము బాగున్నది. 'కిం న కుర్యాః=చేయకుండా ఉందువా?'అని అర్థము. "కచ్చిత్ కామప్రవేదనే"అని చెప్పిన ప్రకారము అట్లు చేయుట యుక్తము; అట్లే చేసెదవు కదా?"అనే అర్థము వచ్చును. 14

మూ. క్షత్రియాణాం చ హి ధనుర్హుతాశస్యేన్ధనాని చ. 15
సమీపతః స్థితం తేజో బలముచ్ఛ్రయతే భృశమ్.

ప్ర. అ. క్షత్రియాణామ్ = క్షత్రియులకు, సమీపతః = సమీపమునందు, స్థితమ్ = ఉన్న, ధనుః = ధనస్సు, హుతాశస్య = అగ్నికి సమీపమునం దున్న, ఇన్ధనాని చ = కట్టెలు, భృశమ్ = మిక్కిలి, తేజః = తేజస్సును, బలమ్ = బలమును, ఉచ్ఛ్రయతే = పెంపొందించును.

తా. అగ్నికి సమీపమునం దున్న కట్టెలు ఆ అగ్ని తేజోబలములను వృద్ధిపొందించి నట్లు, ధనస్సు దగ్గర ఉన్నచో అది క్షత్రియుల తేజోబలములను వృద్ధిపొందించును. 15

మూ. పురా కిల మహాబాహో తపస్వీ సత్యవాక్ఛుచిః, 16
కస్మిం శ్చిదభవత్పుణ్యే వనే రతమృగద్విజే.

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా! పురా = పూర్వము, పుణ్యే = పుణ్యమైన, రతమృగద్విజే = ఆనందించుచున్న మృగములు, పక్షులు గల, కస్మింశ్చిత్ = ఒకానొక, వనే = వనమునందు, సత్యవాత్ = సత్యమైన వాక్కు గలవాడు, శుచిః = పవిత్రుడుఅయిన, తపస్వీ = ముని, అభవత్ కిల = ఉండెడివాడట.

తా. ఓ! మహాబాహూ పూర్వము, మృగములు, పక్షులు సుఖముగా నివసించుచున్న ఒకానొక పవిత్ర మైన ఆశ్రమములో, సత్యమునే పలుకు వాడు, పరిశుద్ధుడు అయిన ఒక ముని నివసించేవాడట. 16

మూ. తస్యైవ తపసో విఘ్నం కర్తుమిన్ద్రః శచీపతిః, 17
ఖడ్గపాణిరథాగచ్ఛదాశ్రమం భటరూపధృత్.

ప్ర. అ. అథ = పిమ్మట, శచీపతిః = శచీదేవి భర్త యైన, ఇన్ద్రః = ఇంద్రుడు, తస్యైవ = ఆ మహర్షియొక్క, తపసః = తపస్సునకు, విఘ్నమ్ = విఘ్నమును, కర్తుమ్ = చేయుటకు, భటరూపధృత్ = భటుని రూపమును ధరించినవాడై, ఖడ్గపాణిః = ఖడ్గము హస్తమునందు కలవాడై, ఆశ్రమమ్ = ఆ ఆశ్రమమును గూర్చి, ఆగచ్ఛత్ = వచ్చెను.

తా. ఒకనాడు, శచీపతి యైన ఇంద్రుడు అతని తపస్సుకు విఘ్నము

చేయుటకై, భటుని రూపముతో ఖడ్గమును చేతిలో ధరించి ఆ ఆశ్రమమునకు వచ్చెను. 17

మూ. తస్మింస్తదాశ్రమపదే నిశితః ఖడ్గ ఉత్తమః, 18
స న్యాసవిధినా దత్తః పుణ్యే తపసి తిష్ఠతః.

ప్ర. అ. తదా = అప్పుడు, తస్మిన్ ఆశ్రమపదే = ఆ ఆశ్రమమునందు, పుణ్యే = పుణ్యమైన, తపసి = తపస్సునందు, తిష్ఠతః = ఉంటున్న ఆ మునికి, నిశితః = వాడి యైన, ఉత్తమః = శ్రేష్ఠమైన, సః ఖడ్గః = ఆ ఖడ్గము, న్యాసవిధినా = న్యాసరూపమున, దత్తః = ఇవ్వబడినది. (కొంత కాలము దాచుటకై ఇచ్చిన వస్తువు న్యాసము).

తా. ఆ ఆశ్రమములో పుణ్యమైన తపస్సు చేయుచున్న ఆ మునీశ్వరునకు దేవేంద్రుడు వాడియైన, శ్రేష్ఠమైన ఖడ్గమును న్యాసముగా "దీనిని కొంత కాలము నీవద్ద ఉంచుము, మరలవచ్చి తీసికొందును" అని చెప్పి ఇచ్చినాడట. 18

మూ. స తచ్ఛస్త్రమనుప్రాప్య న్యాసరక్షణతత్పరః, 19
వనే తు విచరత్యేవ రక్షన్ ప్రత్యయమాత్మనః.

ప్ర. అ. సః తు = ఆమునీశ్వరుడైతే, తత్ = ఆ, శస్త్రమ్ = ఆయుధమును, అనుప్రాప్య = పొంది, ఆత్మనః = తనయొక్క, ప్రత్యయమ్ = నమ్మకమును (విశ్వాసయోగ్యత్వమును), రక్షన్ = రక్షించుచు, న్యాసరక్షణతత్పరః = న్యాసమును రక్షించుటయందు ఆసక్తి కలవాడై, వనే = వనమునందు, విచరత్యేవ = సంచరించుచుండెను.

తా. ఆ మునీశ్వరుడు ఆ ఆయుధము దొరికినది మొదలు తన విశ్వాస యోగ్యత్వమును నిరూపించుకొనుటకై ఆ న్యాసమును రక్షించుటకై అత్యంతము ఆసక్తితో ఆ వనములో (ఆ ఆయుధముతోనే) సంచరించుచుండెను. 19

మూ. యత్ర గచ్ఛత్యుపాదాతుం మూలాని చ ఫలాని చ, 20
న వినా యాతి తం ఖడ్గం న్యాసరక్షణతత్పరః.

ప్ర. అ. న్యాసరక్షణతత్పరః = న్యాసమును రక్షించుటయందు ఆసక్తి గలవాడై, మూలాని చ = మూలములను, ఫలాని చ = ఫలములను, ఉపాదా

తుమ్ = గ్రహించుటకు, యత్ర = ఎక్కడికి, గచ్ఛతి = వెళ్లునో, అత్రాపి, తం ఖడ్గం వినా = ఆ ఖడ్గము లేకుండా, న యాతి = వెళ్లడు.

తా. ఆ న్యాసమును రక్షించవలె ననే శ్రద్ధతో ఆ మునీశ్వరుడు, మూలములను ఫలములను గ్రహించుటకు ఎక్కడికి వెళ్ళినను ఆ ఖడ్గము లేకుండా వెళ్ళేవాడు కాదు. 20

మూ. నిత్యం శస్త్రం పరివహన్ క్రమేణ స తపోధనః, 21
చకార రౌద్రీం స్వాం బుద్ధిం త్యక్త్వా తపసి నిశ్చయమ్.

ప్ర. అ. నిత్యమ్ = నిత్యమూ, శస్త్రమ్ = ఆ ఆయుధమును, పరివహన్ = ధరించుచున్న, సః తపోధనః = ఆ మునీశ్వరుడు, తపసి = తపస్సునందు, నిశ్చయమ్ = నిశ్చయమును, త్యక్త్వా = విడచి, క్రమేణ = క్రమముచేత, స్వామ్ = తనసంబంధమైన, బుద్ధిమ్ = బుద్ధిని, రౌద్రీమ్ = క్రూరమైనదానినిగా, చకార = చేసెను.

తా. నిత్యమూ ఆయుధమును ధరించుచుండుటచేత ఆ మునీశ్వరునకు క్రమముగా తపస్సుపై శ్రద్ధ తగ్గిపోయెను. కాలక్రమమున ఆతని బుద్ధి కూడ క్రూరముగా అయ్యెను. 21

మూ. తతః స రౌద్రేఽభిరతః ప్రమత్తోఽధర్మకర్శితః, 22
తస్య శస్త్రస్య సంవాసాజ్జగామ నరకం మునిః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తస్య = ఆ, శస్త్రస్య = ఆయుధముయొక్క, సంవాసాత్ = సామీప్యమువలన, రౌద్రే = క్రూరకార్యమునందు, అభిరతః = ఆసక్తుడైన, సః మునిః = ఆ మునీశ్వరుడు, ప్రమత్తః = ఏమరిపాటుతో కూడినవాడై, అధర్మకర్శితః = అధర్మముచేత కృశింపచేయబడినవాడై, నరకమ్ = నరకమును, జగామ = వెళ్లెను.

తా. ఆ ఆయుధము దగ్గరఉండుటచే ఆ మునీశ్వరుడు తన కర్తవ్యమును మరచి, క్రూరమైన హింసయందు అభిరుచి కలిగినవాడై, అధర్మముచేత ధర్మము దుర్బలము కాగా, నరకమును పొందెను. 22

మూ. ఏవమేతత్పురా వృత్తం శస్త్రసంయోగకారణమ్, 23
అగ్నిసంయోగవద్ధేతుః శస్త్రసంయోగ ఉచ్యతే,
స్నేహాచ్చ బహుమానాచ్చ స్మారయే త్వాం న శిక్షయే.

ప్ర. అ. పురా = పూర్వము, ఏతత్ = ఈ, శస్త్రసంయోగకారణమ్ = శస్త్రముతో సంబంధము కారణముగా గల నరకపతనము, వృత్తమ్ = జరిగినది. శస్త్రసంయోగః = శస్త్రముతో సంబంధము, అగ్నిసంయోగవత్ = అగ్నితో సంబంధము వలె, హేతుః = అపాయమునకు హేతువుగా, ఉచ్యతే = చెప్పబడుచున్నది. స్నేహాచ్చ = స్నేహమువలన, బహుమానాచ్చ = గౌరవభావమువలనా, త్వామ్ = నిన్ను, స్మారయే = స్మరింపచేయుచున్నాను. న శిక్షయే = బోధించుటలేదు.

తా. ఈ విధముగ పూర్వము శస్త్రముతో సంబంధమువలన అపాయము కలిగినది. శస్త్రసంబంధము, అగ్నిసంబంధము వలె ప్రమాదమునకు హేతువు. నీపై నాకున్న ప్రేమచేతను, గౌరవభావముచేతను నీకు నేను ఈ విషయమును గుర్తుచేయుచున్నానే కాని నీకు తెలియని విషయముగా బోధించుటలేదు. 23, 24

మూ. న కథంచన సా కార్యా గృహీతధనుషా త్వయా,
బుద్ధిర్వైరం వినా హన్తుం రాక్షసాన్ దణ్డకాశ్రితాన్, 25
అపరాధం వినా హన్తుం లోకాన్ వీర న కామయే.

ప్ర. అ. గృహీతధనుషా = గ్రహింపబడిన ధనస్సు గల, త్వయా = నీచేత, వైరం వినా = వైరము లేకుండా, దణ్డకాశ్రితాన్ = దండకారణ్యమును ఆశ్రయించిన, రాక్షసాన్ = రాక్షసులను, హన్తుమ్ = చంపుటకు, సా బుద్ధిః = అట్టి ఆలోచన, కథంచన = ఏ విధముగాను కూడ, న కార్యా = చేయదగినది కాదు. వీర = వీరుడా! అపరాధం వినా = అపరాధము లేకుండా, లోకాన్ = జనులను, హన్తుమ్ = చంపుటకు, న కామయే = ఇచ్ఛగింపను.

తా. ధనస్సు ధరించిన నీకు, దండకారణ్యములో నివసించు రాక్షసులను, వాళ్లతో ఏ వైరము లేకుండగనే, చంపవలెనను ఆలోచన కలుగుట ఏ మాత్రము మంచిది కాదు. వీరుడా! ఏ అపరాధమూ చేయని జనులను చంపుట నాకు సంమతము కాదు. 25

మూ. క్షత్రియాణాం తు వీరాణాం వనేషు నిరతాత్మనామ్, 26
ధనుషా కార్యమేతావదార్తానాం త్వభిరక్షణమ్.

ప్ర. అ. వనేషు = వనములందు, నిరతాత్మనామ్ = ఆసక్తి గల మనస్సు గల, వీరాణామ్ = వీరులైన, క్షత్రియాణామ్ = క్షత్రియులకు, ఆర్తానామ్=పీడితులైనవారియొక్క, అభిరక్షణమ్ = రక్షించుట అను, ఏతావత్ = ఇంతమాత్రమే, ధనుషా = ధనస్సుచేత, కార్యమ్ = ప్రయోజనము.

తా. వనములో నివసించు కోరికతో వనములో ఉన్న వీరులైన క్షత్రియులకు ధనస్సువల్ల ప్రయోజనమేమనగా పీడకలిగినవారిని రక్షించుట మాత్రమే.

వి. ఇక్కడ ఉన్న 'వనేషు నిరతాత్మనామ్"అనే పాఠాన్ని పట్టి "వనములో నివసించే క్షత్రియులు ఆర్తత్రాణముకొరకు ధనస్సు పట్టుదురు"అను అర్థము వచ్చును. ఆ అర్థం చెప్పిన పక్షంలో సీత వాదంలోని బలం తగ్గిపోతుంది. అందుచేత ''అరణ్యంలో నివసించే క్షత్రియులు తమ ఎదుట ఎవరికైనా పీడ కలిగితే వాళ్లని రక్షించాలి''అని కొందరు వాఖ్యాతలు అర్థం చెప్పినారు. దీనికంటె-"క్షత్రియాణాం హి శూరాణాం స్వధర్మనిరతాత్మనామ్''అనే ప్రాచ్యపాఠం బాగున్నది. స్వధర్మం పాలించే క్షత్రియులకు ఆర్తరక్షణంకోసం ధనస్సు ఉపయోగపడాలి. ప్రస్తుతం నీవు క్షత్రియధర్మంలో లేవు కదా?"అని సీత అభిప్రాయం. సీత మాటలకు సమాధానం చెపుతూ శ్రీరాముడు ముందుగా ఈ మాటనే ఉట్టంకిస్తూ-"నువ్వే చెప్పినావు కదా క్షత్రియులు ఆర్తరక్షణం కోసం ఆయుధం పట్టాలి అని; ఆ పనే నేను చేస్తున్నాను"అని అంటాడు. అరణ్యంలో ఉన్నంతమాత్రంచేత నేను క్షత్రియధర్మాన్ని విడిచిపెట్టినట్లు కాదని రాముని అభిప్రాయం. 26

మూ. క్వ చ శస్త్రం క్వ చ వనం క్వ చ క్షాత్రం తపః క్వ చ
వ్యావిద్ధమిదమస్మాభిర్దేశధర్మస్తు పూజ్యతామ్.

ప్ర. అ. శస్త్రమ్ = ఆయుధము, క్వ చ = ఎక్కడ? వనం చ = వనము, క్వ = ఎక్కడ? క్షాత్రమ్ = క్షత్రియధర్మము, క్వ = ఎక్కడ; తపః చ = తపస్సు, క్వ=ఎక్కడ? ఇదమ్=ఇది, వ్యావిద్ధమ్=విరుద్ధమైనది. అస్మాభిః= మనచేత, దేశధర్మః = దేశధర్మము, పూజ్యతామ్ = పూజింపబడుగాక.

తా. ఆయుధ మెక్కడ, వనమెక్కడ! క్షత్రియధర్మ మెక్కడ, తపస్సెక్కడ! ఇదంతా పరస్పరవిరుద్ధముగా ఉన్నది. మనము ఇపుడు దేశధర్మమును పూజించవలెను. 27

మూ. తదార్య కలుషా బుద్ధిర్జాయతే శస్త్రసేవనాత్, 28
పునర్గత్వా త్వయోధ్యాయాం క్షత్రధర్మం చరిష్యసి.

ప్ర. అ. ఆర్య = ఓ పూజ్యుడా! తత్ = ఆ కారణమువలన, శస్త్రసేవనాత్ = ఆయుధము పట్టుటవలన, బుద్ధిః = బుద్ధి, కలుషా = మలినము, జాయతే = అగును. పునః = మరల, గత్వా = వెళ్ళి, అయోధ్యాయామ్ = అయోధ్యయందు, క్షత్రధర్మమ్ = క్షత్రియధర్మమును, చరిష్యసి = ఆచరించగలవు.

తా. ఓ! పూజ్యుడ వైన రామా! ఆయుధము పట్టుటవలన మనస్సు వికారము చెందును. నీవు తిరిగి అయోధ్యకు వెళ్ళిన పిమ్మట అక్కడ క్షత్రియ ధర్మమును పాలించవచ్చును లెమ్ము. 28

మూ. అక్షయా తు భవేత్ప్రీతిః శ్వశ్రూశ్వశురయోర్మమ, 29
యది రాజ్యం పరిత్యజ్య భవేస్త్వం నిరతో మునిః.

ప్ర. అ. త్వమ్ = నీవు, రాజ్యమ్ = రాజ్యమును, పరిత్యజ్య = విడచి, నిరతః = తపస్సునందు ఆసక్తి గల, మునిః = మునివిగా, భవేః యది = అయితే, మమ = నాయొక్క, శ్వశ్రూశ్వశురయోః = అత్తమామలకు, అక్షయా = అనంతమైన, ప్రీతిః = సంతోషము, భవేత్ = అగును.

తా. నీవు రాజ్యమును విడచిపెట్టి తపోనిరతుడవైన మునివి అయినచో నా అత్తమామలు, తమ వాక్యమును పరిపాలించితివి కదా అని చాలా సంతోషించెదరు. 29

మూ. ధర్మాదర్థః ప్రభవతి ధర్మాత్ప్రభవతే సుఖమ్, 30
ధర్మేణ లభతే సర్వం ధర్మసారమిదం జగత్.

ప్ర. అ. ధర్మాత్ = ధర్మమువలన, అర్థః = అర్థము, ప్రభవతి = పుట్టును. ధర్మాత్ = ధర్మమువలన, సుఖమ్ = సుఖము, ప్రభవతే = పుట్టును, ధర్మేణ =

ధర్మముచేత, సర్వమ్ = సమస్తమును, లభతే = పొందును, ఇదం జగత్ = ఈ జగత్తు, ధర్మసారమ్ = ధర్మమే సారముగా గలది.

తా. ధర్మము అర్థమునకు కారణము. ధర్మము సుఖము నిచ్చును. ధర్మముచే మానవుడు సమస్తమును పొందగలడు. ఈ జగత్తు సార మైనది ధర్మమే.

మూ. ఆత్మానం నియమైస్తైస్తైః కర్శయిత్వా ప్రయత్నతః, 31
ప్రాప్యతే నిపుణైర్ధర్మో న సుఖాల్లభ్యతే సుఖమ్.

ప్ర. అ. నిపుణైః = నేర్పు గలవారిచేత, ఆత్మానమ్ = తమను తాము, తైస్తైః = ఆ యా, నియమైః = నియమములచేత, ప్రయత్నతః = ప్రయత్నపూర్వకముగా, కర్శయిత్వా = కృశింపచేసి, ధర్మః = ధర్మము, ప్రాప్యతే = పొందబడును. సుఖాత్ = సుఖమువలన, సుఖమ్ = సుఖము, న లభ్యతే = పొందబడదు.

తా. నేర్పు గల బుద్ధిమంతులు ఆ యా నియమములచే తమను తాము ప్రయత్నపూర్వకముగ కృశింపచేసికొని, ధర్మమును ఆర్జించుచుందురు. సుఖము వలన సుఖము కలుగదు. (కష్టపడినవారికే సుఖము కలుగును.) 31

మూ. నిత్యం శుచిమతిః సౌమ్య చర ధర్మం తపోవనే, 32
సర్వం హి విదితం తుభ్యం త్రైలోక్యమపి తత్త్వతః.

ప్ర. అ. సౌమ్య = ఓ సౌమ్యుడా! నిత్యమ్ = ఎల్లప్పుడు, శుచిమతిః = పరిశుద్ధమైన బుద్ధి కలవాడవై, తపోవనే = తపోవనమునందు, ధర్మమ్ = ధర్మమును, చర = ఆచరింపుము. త్రైలోక్యమ్ = మూడు లోకములకు సంబంధించిన, సర్వమ్ అపి = సమస్తమూ, తుభ్యమ్ = నీకు, తత్త్వతః = యథార్థముగా, విదితం హి = తెలిసినదికదా.

తా. రామా! నిత్యము నిర్మల మైన బుద్ధితో తపోవనమునందు ధర్మము నాచరింపుము. మూడు లోకములలో ఉన్న సమస్తమును కూడ దాని యథార్థ స్వరూపములో నీ వెరుగుదువు గదా? 32

మూ. స్త్రీచాపలాదేతదుదాహృతం మే
ధర్మం చ వక్తుం తవ కః సమర్థః,
విచార్య బుద్ధ్యా తు సహానుజేన
యద్రోచతే తత్కురు మా చిరేణ. 33

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
నవమః సర్గః.

ప్ర. అ. స్త్రీచాపలాత్ = స్త్రీసహజమైన చపలత్వముచేత, ఏతత్ = ఇది, మే = నాకు (నాచేత), ఉదాహృతమ్ = చెప్పబడినది. తవ = నీకు, ధర్మమ్ = ధర్మమును, వక్తుమ్ = చెప్పుటకు, కః = ఎవడు, సమర్థః=సమర్థుడు? తు =కాని, బుద్ధ్యా = నీ బుద్ధిచేతను, అనుజేన సహ=నీ తమ్మునితోను, విచార్య=ఆలోచించి, యత్=ఏది, రోచతే = ఇష్టమగునో, తత్=దానిని, కురు=చేయుము. మా చిరేణ = ఆలస్యము వద్దు.

తా. స్త్రీసహజమైన చపలత్వముచేత ఇది చెప్పుచున్నాను కాని నీకు ధర్మమును బోధించగలవా రెవ్వరు? నీ బుద్ధిచేత పరిశీలించి, నీ తమ్మునితో కూడ ఆలోచించి ఎట్లు ఇష్టమో అట్లు చేయుము. ఆలస్యము చేయవద్దు. 33

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో
తొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ దశమః సర్గః

[“మునులను రక్షించుటకై రాక్షసవధ చేసెదను” అని నేను చేసిన ప్రతిజ్ఞను తప్పక పాలించవలెను అని శ్రీరాముడు చెప్పుట]

మూ. వాక్యమేతత్తు వైదేహ్యా వ్యాహృతం భర్తృభక్తయా,
శ్రుత్వా ధర్మే స్థితో రామః ప్రత్యువాచాథ మైథిలీమ్. 1

ప్ర. అ. భర్తృభక్తయా = భర్తయందు భక్తిగల, వైదేహ్యా = సీతచేత, వ్యాహృతమ్ = పలకబడిన, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, ధర్మే = ధర్మమునందు, స్థితః = ఉన్న, రామః = రాముడు, అథ = అటు పిమ్మట, మైథిలీమ్ = సీతనుగూర్చి, ప్రత్యువాచ = తిరిగిపలికెను.

తా. భర్తయందు (తనయందు) భక్తిగల సీత పలికిన మాటలు విని, ధర్మమునందు స్థిరముగా నిలచు రాముడు ఆమెతో ఇట్లనెను. 1

మూ. హితముక్తం త్వయా దేవి స్నిగ్ధయా సదృశం వచః,
కులం వ్యపదిశన్త్యా చ ధర్మజ్ఞే జనకాత్మజే. 2

ప్ర. అ. దేవి = ఓ! దేవీ! ధర్మజ్ఞే = ధర్మము ఎరిగినదానా! జనకాత్మజే = సీతా! కులమ్ = నీ సత్కులమును, వ్యపదిశన్త్యా = ప్రసిద్ధముచేయుచున్న, స్నిగ్ధయా = స్నేహము గల, త్వయా = నీచేత, హితమ్ = హితము, సదృశమ్ = నీకు తగినది అయిన, వచః = వచనము, ఉక్తమ్ = చెప్పబడినది.

తా. ధర్మములు తెలిసినదానవు, జనకుని కుమార్తెవు అయిన ఓ! సీతా! నామీద స్నేహముతో నీవు, నీ ఉత్తమకులము ప్రసిద్ధికి, నీకూ తగిన, హితమైన మాట చెప్పితివి. 2

మూ. కిం ను వక్ష్యామ్యహం దేవి త్వయైవోక్తమిదం వచః,
క్షత్రియైర్ధార్యతే చాపో నార్తశబ్దో భవేదితి. 3

ప్ర. అ. దేవి = ఓ! సీతా! అహమ్ = నేను, కిం ను = ఏమి, వక్ష్యామి = చెప్పుదును. ఆర్తశబ్దః = దుఃఖితులైనవారి శబ్దము, న భవేదితి = రాకూడదు అని, క్షత్రియైః = క్షత్రియులచేత, చాపః = ధనస్సు, ధార్యతే = ధరింపబడుచున్నది అని, ఇదమ్ = ఈ, వచః = వచనము, త్వయైవ = నీచేతనే, ఉక్తమ్ = పలకబడినది.

తా. "పీడితులైనవారి దీనాలాపములు వినబడకుండుటకే క్షత్రియులు ధనస్సు ధరించెదరు"అని నీవే చెప్పినావు కదా? ఇంక నేను చెప్పవలసిన దేమున్నది?. 3

మూ. తే చార్తా దణ్డకారణ్యే మునయః సంశితవ్రతాః,
మాం సీతే స్వయమాగమ్య శరణ్యాః శరణం గతాః. 4

ప్ర. అ. సీతే = సీతా! సంశితవ్రతాః = తీవ్రములైన నియమములు గల, శరణ్యాః = శరణు పొంద దగిన, దణ్డకారణ్యే = దండకారణ్యములోఉన్న, తే మునయః = ఆ మునులు, ఆర్తాః = దుఃఖితులై, స్వయమ్ = స్వయముగా, ఆగమ్య = వచ్చి, మామ్ = నన్ను, శరణం గతాః = శరణుపొందినారు.

తా. తీవ్రము లైన నియమములు గల దండకారణ్యవాసులైన మునులు తాము ఇతరులకు శరణము ఇవ్వగలిగినవారు. అట్టి మునులు దుఃఖితులై, స్వయముగ వచ్చి నన్ను శరణు పొందినారు. 4

మూ. వసన్తో ధర్మనిరతా వనే మూలఫలాశనాః,
న లభన్తే సుఖం భీతా రాక్షసైః క్రూరకర్మభిః. 5

ప్ర. అ. మూలఫలాశనాః = మూలములను ఫలములను తినుచు, ధర్మనిరతాః = ధర్మమునందు ఆసక్తులై, వనే = వనమునందు, వసన్తః = నివసించుచున్న మునులు, క్రూరకర్మభిః = క్రూరమైన కర్మలు గల, రాక్షసైః = రాక్షసుల చేత, భీతాః = భయపడినవారై, సుఖమ్ = సుఖమును, న లభన్తే = పొందుటలేదు.

తా. దుంపలు, ఫలములు తినుచు, ధర్మనిరతులై, వనములో నివసించు ఆ మునులు కూడ, క్రూరకర్మలు చేయు రాక్షసులకు భయపడి సుఖము పొందజాలకున్నారు. 5

మూ. కాలే కాలే చ నిరతా నియమైర్వివిధైర్వనే,
భక్ష్యన్తే రాక్షసైర్భీమైర్నరా మాంసోపజీవిభిః. 6

ప్ర. అ. కాలే కాలే = ఆ యా కాలములందు, వివిధైః = అనేకవిధములైన, నియమైః = నియమములచేత, నిరతాః = ఆసక్తులైన, నరాః = మునులు, వనే = వనమునందు, మాంసోపజీవిభిః = మాంసమును తినే, భీమైః = భయంకరులైన, రాక్షసైః = రాక్షసులచేత, భక్ష్యన్తే = భక్షించబడుచున్నారు.

తా. ఆ యా కాలములలో చేయదగిన అనేకవిధములైన నియమములను శ్రద్ధగా పాటించుచు వనములో నివసించు మునులను, మాంసభక్షకులైన భయంకర రాక్షసులు భక్షించివేయుచున్నారు. 6

మూ. తే భక్ష్యమాణా మునయో దణ్డకారణ్యవాసినః,
అస్మానభ్యవపద్యేతి మామాహుర్ద్విజసత్తమాః. 7

ప్ర. అ. భక్ష్యమాణాః = భక్షించబడుచున్న, దణ్డకారణ్యవాసినః = దండకారణ్యములో నివసించుచున్న, ద్విజసత్తమాః = ద్విజులలో శ్రేష్ఠులైన, తే మునయః = ఆ మునులు, అస్మాన్ = మమ్ములను, అభ్యవపద్య = అనుగ్రహింపుము, ఇతి = అని, మామ్ = నన్ను గూర్చి, ఆహుః = పలుకుచున్నారు (పలికిరి).

తా. దండకారణ్యములో నివసించు ద్విజశ్రేష్ఠులైన ఆ మునులు, భక్షింపబడుచున్నవారై, "మమ్ములను అనుగ్రహింపుము"అని నన్ను కోరినారు. 7

మూ. మయా తు వచనం శ్రుత్వా తేషామేవం ముఖాచ్చ్యుతమ్,
కృత్వా చరణశుశ్రూషాం వాక్యమేతదుదాహృతమ్. 8

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, తేషామ్ = వారియొక్క, ముఖాత్ = ముఖము నుండి, చ్యుతమ్ = వెలువడిన, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, మయా = నాచేత, చరణశుశ్రూషామ్ = పాదసేవను, కృత్వా = చేసి, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యము, ఉదాహృతమ్ = పలకబడినది.

తా. నేనీ విధముగ వారి ముఖమునుండి వెలువడిన మాటలు విని, వారి పాదసేవ చేసి, ఇటు పలికితిని. 8

మూ. ప్రసీదన్తు భవన్తో మే హ్రీరేషా హి మమాతులా,
యదీదృశైరహం విప్రైరుపస్థేయైరుపస్థితః. 9

ప్ర. అ. భవన్తః = మీరు, మే = నాకు, ప్రసీదన్తు = ప్రసన్ను లగుదురు గాక. అహమ్ = నేను, యత్ = ఏ కారణమువలన, ఉపస్థేయైః = సేవింపదగిన, ఈదృశైః = ఇట్టి, విప్రైః = బ్రాహ్మణులచేత, ఉపస్థితః = దగ్గరకు వచ్చి ప్రార్థింపబడుచున్నానో, అందువలన, ఏషా = ఇది, మమ = నాకు, అతులా = సాటి లేని, హ్రీః హి = సిగ్గు కదా?

తా. మీరు నన్ను అనుగ్రహింపుడు. నేనే స్వయముగ దగ్గరకు వెళ్ళి సేవింపదగిన ఇట్టి బ్రాహ్మణులు నా వద్దకు వచ్చి ప్రార్థించుచున్నా రనగా ఇది నాకు చాల సిగ్గుపడవలసిన విషయము. 9

మూ. కిం కరోమీతి చ మయా వ్యాహృతం ద్విజసంనిధౌ,
సర్వైరేతైః సమాగమ్య వాగియం సముదాహృతా. 10

ప్ర. అ. కిమ్ = ఏమి, కరోమి = చేయుదును, ఇతి = అని, మయా = నాచేత, ద్విజసంనిధౌ = ద్విజుల సమీపమునందు, వ్యాహృతమ్ = పలకబడినది. సర్వైః = సమస్తమైన, ఏతైః = వీరిచేత, సమాగమ్య = కలిసి, ఇయమ్ = ఈ, వాక్ = వాక్కు, సముదాహృతా = పలకబడినది.

తా. "నేను మీ కేమి చేయవలెను?" అని నేను ఆ ద్విజులను ప్రశ్నింపగా వారందరూ కలిసి ఇట్లు పలికిరి. 10

మూ. రాక్షసైర్దణ్డకారణ్యే బహుభిః కామరూపిభిః,
అర్దితాః స్మ దృఢం రామ భవాన్నస్తత్ర రక్షతు. 11

ప్ర. అ. రామ = రామా! దణ్డకారణ్యే = దండకారణ్యమునందు, బహుభిః = అనేకులైన, కామరూపిభిః = స్వేచ్ఛారూపము గల, రాక్షసైః = రాక్షసులచేత, దృఢమ్ = అధికముగా, అర్దితాః స్మ = పీడించబడుచున్నాము. భవాన్ = నీవు, తత్ర = ఆ విషయమున, నః = మమ్ములను, రక్షతు = రక్షించెదవుగాక.

తా. రామా! దండకారణ్యములో, స్వేచ్ఛానుసారముగా రూపములను

ధరించగల అనేకరాక్షసులు మమ్ములను చాల పీడించుచున్నారు. ఆ విషయమున నీవు మమ్ములను రక్షించుము. 11

మూ. హోమకాలేషు సంప్రాప్తాః పర్వకాలేషు చానఘ,
ధర్షయన్తి సుదుర్ధర్షా రాక్షసాః పిశితాశనాః. 12

ప్ర. అ. అనఘ=దోషములు లేనివాడా ! సుదుర్ధర్షాః = ఎదిరించుటకు ఏ మాత్రము శక్యము కాని, పిశితాశనాః = మాంసభక్షకులైన, రాక్షసాః=రాక్షసులు, హోమకాలేషు = హోమసమయములందు, పర్వకాలేషు = పూర్ణిమ, అమావాస్య మొదలైన పర్వకాలములయందు, సంప్రాప్తాః = వచ్చినవారై, ధర్షయన్తి =ఎదిరించుచున్నారు.

తా. దోషములు లేని రామా ! ఎదిరించుటకు ఏ మాత్రము శక్యము కాని పచ్చిమాంసము తినే రాక్షసులు హోమములుచేసే సమయములందు, పర్వకాలములందు వచ్చి మమ్ములను పీడించుచున్నారు. 12.

మూ. రాక్షసైర్ధర్షితానాం చ తాపసానాం తపస్వినామ్,
గతిం మృగయమాణానాం భవాన్నః పరమా గతిః. 13

ప్ర. అ. రాక్షసైః = రాక్షసులచేత, ధర్షితానామ్=ఎదిరింపబడిన, తపస్వినామ్=తపస్సు గల. తాపసానామ్ = దీనుల మైన, గతిమ్=గతిని (శరణమును). మృగయమాణానామ్ = వెదకుచున్న, నః = మాకు, భవాన్ = నీవు, పరమా = గొప్ప, గతిః = గతివి.

తా. తపస్సు చేసుకొనే మేము రాక్షసులచే పీడితులమై, దీనులమై రక్షకుని కొరకు వెదకుచున్నాము. అట్టి మాకు నీవే గతివి. 13

మూ. కామం తపఃప్రభావేన శక్తా హన్తుం నిశాచరాన్,
చిరార్జితం తు నేచ్ఛామస్తపః ఖణ్డయితుం వయమ్. 14

ప్ర. అ. వయమ్ = మేము, తపఃప్రభావేన=తపస్సుయొక్క ప్రభావము చేత, నిశాచరాన్ = రాక్షసులను, హన్తుమ్ = చంపుటకు, కామం శక్తాః = సమర్థులమే. తు = కాని, చిరార్జితమ్ = చిరకాలమునుండి సంపాదింపబడిన, తపః= తపస్సును, ఖణ్డయితుమ్ = ఖండించుటకు, నేచ్ఛామః = ఇష్టపడుట లేదు.

తా. తపఃప్రభావముచేత రాక్షసులను చంపుటకు మేమే సమర్థుల మను మాట నిజమే. కాని చిరకాలమునుండి సంపాదించుకొన్న తపస్సును వ్యయము చేయుట మా కిష్టము కాదు. 14

మూ. బహువిఘ్నం తపో నిత్యం దుశ్చరం చైవ రాఘవ,
తేన శాపం న ముఞ్చామో భక్ష్యమాణాశ్చ రాక్షసైః. 15

ప్ర. అ. రామ = రామా! తపః = తపస్సు, నిత్యమ్ = ఎల్లప్పుడూ, బహువిఘ్నమ్ = అనేకవిఘ్నములు కలది; దుశ్చరం చైవ = ఆచరించుటకు కష్టమైనది కూడ. తేన = ఆ కారణముచేత, రాక్షసైః = రాక్షసులచేత, భక్ష్యమాణాః = భక్షింపబడుచున్నవార మైనను, శాపమ్ = శాపమును, న ముఞ్చామః = విడచుటలేదు.

తా. రామా! తపస్సునకు నిత్యము ఎన్నో విఘ్నములు కలుగుచుండును. తపస్సు ఆచరించుట కూడ చాల కష్ట మైనది. అందుచేతనే రాక్షసులు మమ్ములను భక్షించివేయుచున్నా శాపము ఇవ్వజాల కున్నాము. 15

మూ. తదర్ద్యమానాన్రక్షోభిర్దణ్డకారణ్యవాసిభిః,
రక్ష నస్త్వం సహ భ్రాత్రా త్వన్నాథా హి వయం వనే.

ప్ర. అ. తత్ = ఆ కారణమువలన, దణ్డకారణ్యవాసిభిః = దండకారణ్యములో నివసించుచున్న, రక్షోభిః = రాక్షసులచేత, అర్ద్యమానాన్ = పీడించబడుచున్న, నః = మమ్ములను, సహ భ్రాత్రా = సోదరునితో కూడిన, త్వమ్ = నీవు, రక్ష = రక్షించుము. వయమ్ = మేము, వనే = వనమునందు, త్వన్నాథాః హి = నీవే నాథుడు కలవారము గదా.

తా. అందువలన సోదరసహితుడవైన నీవు, దండకారణ్యములో నివసించే రాక్షసులచేత బాధింపబడుచున్న మమ్ములను రక్షించుము. మాకు నీవే రక్షకుడవు కదా? 16

మూ. మయా చైతద్వచః శ్రుత్వా కార్త్స్న్యేన పరిపాలనమ్,
ఋషీణాం దణ్డకారణ్యే సంశ్రుతం జనకాత్మజే. 17

ప్ర. అ. జనకాత్మజే=సీతా! మయా చ=నాచేత, ఏతత్=ఈ, వచః= వాక్కును, శ్రుత్వా = విని, దణ్డకారణ్యే=దండకారణ్యమునందు, ఋషీణామ్= ఋషులయొక్క, కార్త్స్న్యేన = పరిపూర్ణముగా, పరిపాలనమ్ = పాలనము, సంశ్రుతమ్ = ప్రతిజ్ఞచేయబడినది.

తా. సీతా! నేను ఈ మాటలు విని దండకారణ్యములో నివసించే మును లను పూర్తిగా పాలించెద నని ప్రతిజ్ఞ చేసితిని. 17

మూ. సంశ్రుత్య చ న శక్ష్యామి జీవమానః ప్రతిశ్రవమ్,
మునీనామన్యథా కర్తుం సత్యమిష్టం హి మే సదా. 18

ప్ర. అ. సంశ్రుత్య = ప్రతిజ్ఞ చేసి, జీవమానః = జీవించి ఉండగా, మునీనామ్ = మునులయొక్క, ప్రతిశ్రవమ్ = ప్రతిజ్ఞను, అన్యథా = మరియొక విధముగా, కర్తుమ్=చేయుటకు, న శక్ష్యామి = సమర్థుదను కాను. సదా=ఎల్లప్పుడును, మే = నాకు, సత్యమ్ = సత్యము, ఇష్టం హి = ఇష్టము కదా.

తా. నేను ప్రతిజ్ఞ చేసి, మునులకు చేసిన ఆ ప్రతిజ్ఞను, నాలో ప్రాణాలు ఉండగా మరొకవిధముగా చేయజాలను. నాకు సత్యము చాల ఇష్ట మైనది కదా.

మూ. అప్యహం జీవితం జహ్యాం త్వాం వా సీతే సలక్ష్మణామ్,
న తు ప్రతిజ్ఞాం సంశ్రుత్య బ్రాహ్మణేభ్యో విశేషతః. 19

ప్ర. అ. సీతే = సీతా! అహమ్ = నేను, జీవితమపి = జీవితమునైనా, సలక్ష్మణామ్=లక్ష్మణునితో కూడిన, త్వాం వా=నిన్నైనా, జహ్యామ్=విడతును. తు = కాని, ప్రతిజ్ఞామ్ = ప్రతిజ్ఞను, విశేషతః = విశేషించి, బ్రాహ్మణేభ్యః = బ్రాహ్మణులకు, సంశ్రుత్య = ప్రతిజ్ఞ చేసి, న = విడువజాలను.

తా. సీతా! నేను ప్రాణాల నైనా, లక్ష్మణు నైనా, నిన్నైనా విడచిపెట్టె దను కాని, ప్రతిజ్ఞను మాత్రము, విశేషించి బ్రాహ్మణులకు చేసిన ప్రతిజ్ఞను మాత్రము, విడువజాలను. 19

మూ. తదవశ్యం మయా కార్యమృషీణాం పరిపాలనమ్,
అనుక్తేనాపి వైదేహి ప్రతిజ్ఞాయ తు కిం పునః. 20

ప్ర. అ. వైదేహి = సీతా! తత్ = ఆ కారణమువలన, మయా = నాచేత, అనుక్తేనాపి = అడగబడకపోయినను, ఋషీణామ్ = ఋషులయొక్క, పరిపాలనమ్ = పాలనము, కార్యమ్ = చేయదగినది. ప్రతిజ్ఞాయ = ప్రతిజ్ఞ చేసి, కిం పునః = చెప్పనేల ?

తా. సీతా! ఋషులు నన్ను అడగకపోయినా నేను వాళ్ళను పాలించవలెను. వారికి మాట ఇచ్చిన పిమ్మట వేరే చెప్పవలెనా ? 20

మూ. మమ స్నేహాచ్చ సౌహార్దాదిదముక్తం త్వయానఘే,
పరితుష్టోఽస్మ్యహం సీతే న హ్యనిష్టోఽనుశిష్యతే. 21

ప్ర. అ. అనఘే = దోషములు లేనిదానా! మమ = నాయొక్క, స్నేహాచ్చ = స్నేహమువలన, సౌహార్దాత్ = మంచి హృదయము కలిగియుండుట వలన, త్వయా = నీచేత, ఇదమ్ = ఇది, ఉక్తమ్ = పలకబడినది. సీతే = ఓ! సీతా! అహమ్ = నేను, పరితుష్టః = సంతోషించినవాడను, అస్మి = అయిఉన్నాను. అనిష్టః = ఇష్టుడు కానివాడు, న అనుశిష్యతే హి = ఉపదేశించబడడు కదా.

తా. దోషరహితురాల వైన ఓ! సీతా! నీకు నామీద ఉన్న స్నేహముచేత నీవు మంచి హృదయము కలదాన వగుటచేత ఇట్లు పలికినావు. చాలా సంతోషించుచున్నాను, ఇష్టుడు కానివారికి ఎవ్వరూ ఉపదేశము చేయరు కదా. 21

మూ. సదృశం చానురూపం చ కులస్య తవ చాత్మనః,
సధర్మచారిణీ మే త్వం ప్రాణేభ్యోఽపి గరీయసీ. 22

ప్ర. అ. తవ = నీయొక్క, కులస్య = కులమునకు, ఆత్మనః చ = నీకూ, సదృశమ్ = తగినది; అనుకూలం చ = అనుకూలముగా కూడ ఉన్నది. మే = నాయొక్క, సధర్మచారిణీ = కూడా ధర్మములను ఆచరించు పత్ని వైన, త్వమ్ = నీవు, ప్రాణేభ్యోఽపి = ప్రాణములకంటె కూడ, గరీయసీ = గొప్పదానవు.

తా. నీవు చెప్పినది నీకు, నీ వంశానికీ కూడ తగినదిగా, అనుకూలంగా ఉన్నది. నా సహధర్మచారిణి వైన నీవు నాకు ప్రాణములకంటె కూడ ఎక్కువదానవు. 22

మూ. ఇత్యేవముక్త్వా వచనం మహాత్మా
సీతాం ప్రియాం మైథిలరాజపుత్రీమ్;
రామో ధనుష్మాన్ సహ లక్ష్మణేన
జగామ రమ్యాణి తపోవనాని. 23

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
దశమః సర్గః.

ప్ర. అ. మహాత్మా = మహాత్ముడైన, రామః = రాముడు, ప్రియామ్ = ప్రియురాలు, మైథిలరాజపుత్రీమ్ = జనకమహారాజు కూతురు అయిన, సీతామ్ = సీతను గూర్చి, ఇత్యేవమ్ = ఇట్లు, వచనమ్ = వచనమును, ఉక్త్వా = పలికి, ధనుష్మాన్ = ధనస్సు ధరించినవాడై, సహ లక్ష్మణేన = లక్ష్మణునితో కూడ, రమ్యాణి = సుందరములైన, తపోవనాని = తపోవనములను గూర్చి, జగామ = వెళ్లెను.

తా. మహాత్ముడైన రాముడు, జనకమహారాజు పుత్రికయైన, తన ప్రియురాలు సీతతో ఇట్లు పలికి, ధనస్సు ధరించి, లక్ష్మణసమేతుడై, సుందరములైన తపోవనములకు వెళ్లెను. 23

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
అరణ్యకాండలో దశమసర్గ సమాప్తము.

అథ ఏకాదశః సర్గః

[పంచాప్సర స్తీర్థమాండకర్ణి మునుల కథ. రామాదులు వివిధాశ్రమములలో సంచరించి తిరిగి సుతీక్ష్ణమహర్షి ఆశ్రమమునకు వచ్చి కొంత కాలము అక్కడ నివసించుట. పిదప సుతీక్ష్ణుని అనుమతి గైకొని అగస్త్యభ్రాత ఆశ్రమమునకు, అగస్త్యుని ఆశ్రమమునకు వెళ్ళుట. అగస్త్య ప్రభావవర్ణనము.]

మూ. అగ్రతః ప్రయయౌ రామః సీతా మధ్యే సుమధ్యమా,
పృష్ఠతస్తు ధనుష్పాణిర్లక్ష్మణోఽనుజగామ హ. 1

ప్ర. అ. రామః = రాముడు, అగ్రతః = ఎదుట, ప్రయయౌ = నడచెను. సుమధ్యమా = అందమైన నడుముగల, సీతా = సీత, మధ్యే = మధ్యయందు నడచెను. ధనుష్పాణిః = ధనస్సు హస్తమునందు కలవాడై, లక్ష్మణః = లక్ష్మణుడు, పృష్ఠతః = వెనుక, అనుజగామ హ = అనుసరించి వెళ్ళెను.

తా. రాముడు ముందు నడచుచుండెను. అందమైన నడుము గల సీత మధ్య నడచుచుండగా, లక్ష్మణుడు ధనుర్ధారియై వారివెనుక అనుసరించి వెళ్లెను.

మూ. తౌ పశ్యమానౌ వివిధాన్ శైలప్రస్థాన్ వనాని చ,
నదీశ్చ వివిధా రమ్యా జగ్మతుః సీతయా సహ. 2

ప్ర. అ. తౌ = ఆ రామలక్ష్మణులు, వివిధాన్ = అనేకవిధములైన, శైల ప్రస్థాన్ = పర్వతముల చరియలను, వనాని చ = వనములను, వివిధాః = అనేక విధములైన, రమ్యాః = సుందరములైన, నదీశ్చ = నదులను, పశ్యమానౌ = చూచుచు, సీతయా సహ = సీతతో కూడ, జగ్మతుః = వెళ్లిరి.

తా. సీతాసమేతులైన ఆ రామలక్ష్మణులు అనేకవిధములైన కొండచరియలను, వనములను, రమ్యములైన అనేకనదులను చూచుచు వెళ్ళిరి. 2

మూ. సారసాంశ్చక్రవాకాంశ్చ నదీపులినచారిణః,
సరాంసి చ సపద్మాని యుక్తాని జలజైః ఖగైః. 3

ప్ర. అ. పులినచారిణః = నదుల ఇసుకతిన్నెలమీద సంచరించుచున్న, సారసాన్ = సారసపక్షులను, చక్రవాకాంశ్చ = చక్రవాకపక్షులను, సపద్మాని=పద్మములతో కూడిన, జలజైః=జలమునందు పుట్టిన (సంచరించు), ఖగైః = పక్షులతో, యుక్తాని = కూడిన, సరాంసి చ = సరస్సులను (చూచుచు వెళ్ళిరి).

తా. నదుల ఇసుకతిన్నెల మీద నివసించుచున్న సారసపక్షులను, చక్రవాకములను, పద్మములు, జలపక్షులు ఉన్న సరస్సులను (చూచుచు వెళ్ళిరి.) 3

మూ. యూథబద్ధాంశ్చ పృషతాన్ మదోన్మత్తాన్ విషాణినః,
మహిషాంశ్చ వరాహాంశ్చ నాగాంశ్చ ద్రుమవైరిణః. 4

ప్ర. అ. యూథబద్ధాన్ = గుంపులుగా ఏర్పడిన, పృషతాన్ = చుక్కల జింకలను, మదోన్మత్తాన్ = మదము చేత పిచ్చిఎక్కినవి వలె ఉన్న, విషాణినః= పెద్ద కొమ్ములు గల, మహిషాంశ్చ=దున్నపోతులను, వరాహాంశ్చ=వరాహములను, ద్రుమవైరిణః = వృక్షములకు శత్రువులైన, నాగాంశ్చ = గజములను (చూచుచు వెళ్ళిరి).

తా. గుంపులు గుంపులుగా సంచరించుచున్న చుక్కల జింకలను, చాల మత్తెక్కి ఉన్న, పెద్ద కొమ్ములు గల దున్నపోతులను, వరాహములను, వృక్షములను విరచివేయుచున్న గజములను (చూచుచు వెళ్ళిరి). 4

మూ. తే గత్వా దూరమధ్వానం లమ్బమానే దివాకరే,
దదృశుః సహితా రమ్యం తటాకం యోజనాయతమ్. 5

పద్మపుష్కరసంబాధం గజయూథైరలంకృతమ్,
సారసైర్హంసకాదమ్బైః సంకులం జలచారిభిః. 6

ప్ర. అ. సహితాః = కలిసి ప్రయాణము చేయుచున్న, తే=ఆ సీతారామలక్ష్మణులు, దూరమ్ = దూరమైన, అధ్వానమ్ = మార్గమును, గత్వా = వెళ్ళి,

దివాకరే = సూర్యుడు, లమ్బమానే = (పశ్చిమాకాశమునందు) ప్రేలాడుచుండగా, పద్మపుష్కరసంబాధమ్ = ఎఱ్ఱని తెల్లని పద్మములతో నిండినది, గజయూథైః = ఏనుగుల గుంపులచేత, అలంకృతమ్ = అలంకరింపబడినది, జలచారిభిః = జలముపై సంచరించు, సారసైః = సారసపక్షులచేతను, హంసకాదమ్బైః = హంసలచేతను, కాదంబపక్షులచేతను, సంకులమ్ = వ్యాకుల మైనదీ అయిన, యోజనాయతమ్ = ఒక యోజనము వైశాల్యము గల, రమ్యమ్ = సుందరమైన, తటాకమ్ = సరస్సును, దదృశుః = చూచిరి.

తా. కలిసి ప్రయాణము చేయుచున్న ఆ సీతారామలక్ష్మణులు, చాల దూరము ప్రయాణము చేసి, సూర్యుడు పశ్చిమమున ప్రేలాడుచుండగా, ఆ ప్రాంతమున ఒక యోజనము వైశాల్యము గల, రమ్య మైన సరస్సును చూచిరి. అది ఎఱ్ఱని పద్మములతోను తెల్లని పద్మములతోను నిండి యుండెను. దానిలో ఏనుగుల గుంపులు క్రీడించుచుండెను. సారసపక్షులు, హంసలు, కాదంబములు మొదలైన జలముపై సంచరించు పక్షులతో నిండి యుండెను. 5, 6

మూ. ప్రసన్నసలిలే రమ్యే తస్మిన్ సరసి శుశ్రువే,
గీతవాదిత్రనిర్ఘోషో న తు కశ్చన దృశ్యతే. 7

ప్ర. అ. ప్రసన్నసలిలే = నిర్మలమైన ఉదకము గల, రమ్యే = రమ్యమైన, తస్మిన్ = ఆ, సరసి = సరస్సునందు, గీతవాదిత్రనిర్ఘోషః = గీతవాద్యధ్వని, శుశ్రువే = వినబడెను. తు = కాని, కశ్చన = ఎవ్వడూ, న దృశ్యతే = చూడబడకుండెను.

తా. నిర్మలమైన ఉదకము గల ఆ రమ్యమైన సరస్సునుండి గీతవాద్యాదుల ధ్వని వినవచ్చుచుండెను కాని అక్కడ ఎవ్వరూ కనబడలేదు. 7

మూ. తతః కౌతూహలాద్రామో లక్ష్మణశ్చ మహాబలః,
మునిం ధర్మభృతం నామ ప్రష్టుం సముపచక్రమే. 8

ప్ర. అ. తతః = అటు పిమ్మట, రామః = రాముడు, మహాబలః = గొప్ప బలము గల, లక్ష్మణశ్చ = లక్ష్మణుడూ, కౌతూహలాత్ = వేడుకవలన, ధర్మ

భృతం నామ = ధర్మభృత్ అను పేరు గల, మునిమ్ = మునిని, ప్రష్టుమ్ = అడుగుటకు, సముపచక్రమే = ఉపక్రమించెను.

తా. పిమ్మట రాముడు, బలశాలి యైన లక్ష్మణుడు, వేడుకతో, ధర్మభృత్ అనే మునిని ఆ సంగీతకధ్వనిని గూర్చి ఇట్లు ప్రశ్నించిరి. 8

మూ. ఇదమత్యద్భుతం శ్రుత్వా సర్వేషాం నో మహామునే,
కౌతూహలం మహజ్జాతం కిమిదం సాధు కథ్యతామ్. 9
వక్తవ్యం యది చేద్విప్ర నాతిగుహ్యమపి ప్రభో.

ప్ర. అ. మహామునే = మహామునీ! అత్యద్భుతమ్ = చాల ఆశ్చర్యకరమైన, ఇదమ్ = ఈ గీతవాద్యధ్వనిని, శ్రుత్వా = విని, సర్వేషామ్ = సమస్తమైన, నః = మాకు, మహత్ = గొప్ప, కౌతూహలమ్ = వేడుక, జాతమ్ = పుట్టినది. ఇదమ్ = ఇది, కిమ్ = ఏమి? సాధు = బాగుగా, కథ్యతామ్ = చెప్పబడుగాక. ప్రభో = సమర్థుడవైన, విప్ర = ఓ! బ్రాహ్మణుడా, నాతిగుహ్యమపి యది చేత్ = చాల రహస్యము కానిచో, వక్తవ్యమ్ = చెప్పదగినది,

తా. మహామునీ! అత్యాశ్చర్యకరమైన ఈ సంగీతవాద్యధ్వని విని మాకందరికి వేడుక కలిగినది. ఇది ఏమో బాగుగా చెప్పుము. ఓ! సమర్థుడవైన బ్రాహ్మణుడా! ఇది అతిరహస్యవిషయము కానిచో చెప్పుము. 9

మూ. తేనైవముక్తో ధర్మాత్మా రాఘవేణ మునిస్తదా, 10
ప్రభవం సరసః కృత్స్నమాఖ్యాతుముపచక్రమే.

ప్ర. అ. తదా = అప్పుడు, తేన = ఆ, రాఘవేణ = రామునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, ధర్మాత్మా = ధర్మాత్ముడైన, మునిః = ముని, సరసః = సరస్సుయొక్క, కృత్స్నమ్ = సమస్తమైన, ప్రభవమ్ = పుట్టుకను గూర్చి, ఆఖ్యాతుమ్ = చెప్పుటకు, ఉపచక్రమే = ప్రారంభించెను.

తా. రాముని మాటలు విని ధర్మాత్ముడైన ఆ ముని, ఆ సరస్సుపుట్టుకకు సంబంధించిన విషయమును అంతా చెప్పుటకు ప్రారంభించెను. 10

మూ. ఇదం పఞ్చాప్సరో నామ తటాకం సార్వకాలికమ్, 11
నిర్మితం తపసా రామ మునినా మాణకర్ణినా.

ప్ర. అ. రామ = రామా! ఇదమ్ = ఇది, మాణ్డకర్ణినా=మాండకర్ణి అను పేరు గల, మునినా = మునిచేత, తపసా = తపస్సుచేత, నిర్మితమ్ = నిర్మింపబడిన, సార్వకాలికమ్=సర్వకాలములందు ఉండు, పఞ్చాప్సరః నామ=పంచాప్సరస్సు అను పేరు గల, తటాకమ్ = సరస్సు.

తా. రామా! ఇది సర్వకాలములందు ఒకే విధముగా ఉండే పంచాప్సరః సరస్సు అను పేరు గల సరస్సు. ఇది మాండకర్ణి అను ముని తపస్సుచేత నిర్మింపబడినది. 11

మూ. స హి తేపే తపస్తీవ్రం మాణ్డకర్ణిర్మహామునిః, 12
దశవర్షసహస్రాణి వాయుభక్షో జలాశ్రయః.

ప్ర. అ. మహామునిః = మహామునియైన, సః మాణ్డకర్ణిః=ఆ మాండకర్ణి, వాయుభక్షః = వాయువును మాత్రమే భక్షించుచు, జలాశ్రయః = జలమే ఆశ్రయముగా గలవాడై, దశవర్షసహస్రాణి = పదివేల సంవత్సరములు, తీవ్రమ్ = తీవ్రమైన, తపః = తపస్సు, తేపే = చేసెను.

తా. మహామునియైన ఆ మాండకర్ణి, వాయువును మాత్రమే భక్షించుచు, జలములో నివసించుచు, పదివేలసంవత్సరములు తీవ్రమైన తపస్సు చేసెను. 12

మూ. తతః ప్రవ్యథితాః సర్వే దేవాః సాగ్నిపురోగమాః, 13
అబ్రువన్ వచనం సర్వే పరస్పరసమాగతాః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సాగ్నిపురోగమాః=అగ్ని నాయకుడుగా గల, సర్వే = సమస్తమైన, దేవాః = దేవతలు, ప్రవ్యథితాః=వ్యథ చెందినవారై, సర్వే = వారందరు, పరస్పరసమాగతాః=పరస్పరము కలిసినవారై, వచనమ్= వచనమును, అబ్రువన్ = పలికిరి.

తా. అప్పుడు అగ్ని మొదలైన దేవత లందరు భయపడినవారై, ఒక్క చోట కలిసి, ఒకరితో ఒకరు ఇట్లు అనుకొనిరి. 13

మూ. అస్మాకం కస్యచిత్ స్థానమేష ప్రార్థయతే మునిః, 14
ఇతి సంవిగ్నమనసః సర్వే తే త్రిదివౌకసః.

ప్ర. అ. ఏషః మునిః = ఈ ముని, అస్మాకమ్ = మనలో, కస్య చిత్ = ఒకానొకనియొక్క, స్థానమ్ = స్థానమును, ప్రార్థయతే = కోరుచున్నాడు. ఇతి = ఈ విధముగా, సర్వే=సమస్తమైన, తే=ఆ, త్రిదివౌకసః=దేవతలు, సంవిగ్న మనసః = దిగులు చెందిన మనస్సు కలవారైరి.

తా. "ఈ ముని మనలో ఒకరి స్థానమును పొందవలెనని కోరుచున్నాడు" ఈ విధముగ ఆ దేవత లందరు మనస్సులో దిగులు చెందిరి. 14

మూ. తత్ర కర్తుం తపోవిఘ్నం దేవైః సర్వైర్నియోజితాః, 15
ప్రధానాప్సరసః పఞ్చ విద్యుచ్చలితవర్చసః.

ప్ర. అ. సర్వైః = సమస్తమైన, దేవైః = దేవతలచేత, తత్ర = ఆ మునియందు, తపోవిఘ్నమ్ = తపస్సుకు విఘ్నమును, కర్తుమ్=చేయుటకు, విద్యుచ్చలితవర్చసః = మెరపు వలె కదలుచున్న కాంతి గల, పఞ్చ=ఐదుగురు, ప్రధానాప్సరసః = ప్రధానమైన అప్సరః స్త్రీలు, నియోజితాః = నియమించ బడినారు.

తా. దేవత లందరూ కలిసి మెరుపు వలె తళుక్కు మనుచున్న శరీర కాంతి గల ఐదుగురు ప్రధానలైన అప్సరఃస్త్రీలను ఆ ముని తపస్సుకు విఘ్నము చేయుటకై నియమించిరి. 15

మూ. అప్సరోభిస్తతస్తాభిర్మునిర్దృష్టపరావరః, 16
నీతో మదనవశ్యత్వం సురాణాం కార్యసిద్ధయే.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, దృష్టపరావరః = చూడబడిన మంచి చెడుగులు గల, మునిః = ముని, తాభిః = ఆ, అప్సరోభిః = అప్సరః స్త్రీలచేత, సురాణామ్ = దేవతలయొక్క, కార్యసిద్ధయే = కార్యసిద్ధికొరకు, మదనవశ్యత్వమ్ = మన్మథునకు వశు డగుటను, నీతః = పొందించబడినాడు.

తా. పిమ్మట ఆ అప్సరఃస్త్రీలు, దేవతల కార్యము సిద్ధించుటకై మంచి చెడ్డల వివేకము గల ఆ మునిని మన్మథుని వశు డగు నట్లు చేసిరి. 16

మూ. తాశ్చైవాప్సరసః పఞ్చ మునేః పత్నీత్వమాగతాః, 17
తటాకే నిర్మితం తాసామస్మిన్నన్తర్హితం గృహమ్.

ప్ర. అ. తాః = ఆ, పఞ్చ = ఐదుగురు, అప్సరసః = అప్సరఃస్త్రీలు, మునేః = మునికి, పత్నీత్వమ్ = భార్యాత్వమును, ఆగతాః = పొందినారు. తాసామ్ = ఆ అప్సరః స్త్రీలయొక్క, గృహమ్ = గృహము, అస్మిన్ = ఈ, తటాకే = సరస్సునందు, అన్తర్హితమ్ = అంతర్హిత మగునట్లుగా, నిర్మితమ్ = నిర్మించ బడినది.

తా. ఆ ఐదుగురు అప్సరసలు ఆ మునికి భార్య లైరి. ఆ ముని వారి కొరకై ఈ సరస్సులో, పైకి కనబడకుండు నట్లు గృహము నిర్మించెను. 17

మూ. తత్రై వాప్సరసః పఞ్చ నివసన్త్యో యథాసుఖమ్, 18
రమయన్తి తపోయోగాన్మునిం యౌవనమాస్థితమ్.

ప్ర. అ. తత్రైవ = అక్కడే, పఞ్చ అప్సరసః = ఐదుగురు అప్సరఃస్త్రీలు, యథాసుఖమ్ = సుఖముగా, నివసన్త్యః = నివసించుచు, తపోయోగాత్ = తపః ప్రభావమువలన, యౌవనమ్ = యౌవనమును, ఆస్థితమ్ = అవలంబించిన, మునిమ్ = మునిని, రమయన్తి = ఆనందింపచేయుచున్నారు.

తా. ఆ ఐదుగురు అప్సరసలు సుఖముగా నివసించుచు, తపోబలము చేత యౌవనమును సంపాదించుకొన్న ఆ మునిని ఆనందింపచేయుచున్నారు. 18

మూ. తాసాం సంక్రీడమానానామేష వాదిత్రనిస్స్వనః, 19
శ్రూయతే భూషణోన్మిశ్రో గీతశబ్దో మనోహరః.

ప్ర. అ. సంక్రీడమానానామ్ = క్రీడించుచున్న, తాసామ్ = ఆ అప్సరసల యొక్క, ఏషః = ఈ, వాదిత్రనిస్స్వనః = వాద్యధ్వని, భూషణోన్మిశ్రః = అలంకారములతో కలసిన, మనోహరః = మనోహరమైన, గీతశబ్దః = పాటల ధ్వని, శ్రూయతే = వినబడుచున్నవి.

తా. ఆ అప్సరసలు క్రీడించుచుండుటచే ఈ వాద్యధ్వని, అలంకారముల ధ్వనితో కలిసిన మనోహరమైన గీతధ్వని వినబడుచున్నది. 19

మూ. ఆశ్చర్యమితి తస్యైతద్వచనం భావితాత్మనః, 20
రాఘవః ప్రతిజగ్రాహ సహ భ్రాత్రా మహాయశాః.

ప్ర. అ. మహాయశాః = గొప్ప కీర్తి గల, రాఘవః = రాముడు, సహ భ్రాత్రా = సోదరునితో కూడ, భావితాత్మనః=పవిత్రము చేసికొనబడిన మనస్సు గల, తస్య = ఆ మునియొక్క, ఏతత్ వచనమ్ = ఈ వచనమును, ఆశ్చర్య మితి = చాల ఆశ్చర్యకరముగా నున్నది అని, ప్రతిజగ్రాహ=స్వీకరించెను.

తా. పవిత్రమైన మనస్సు గల ఆ మునీశ్వరుని మాటలు విని మహాయశః శాలి యైన రాముడు, లక్ష్మణుడు కూడ "ఇది చాల ఆశ్చర్యకరముగా ఉన్నది" అని పలికిరి. 20

మూ. ఏవం కథయమానస్య దదర్శాశ్రమమణ్డలమ్, 21
కుశచీరపరిక్షిప్తం బ్రాహ్మ్యా లక్ష్మ్యా సమావృతమ్.

ప్ర. అ. ఏవమ్=ఇట్లు, కథయమానస్య = చెప్పుచుండగా, కుశచీర సమాక్షిప్తమ్ = కుశలచేతను, నారచీరలచేతను వ్యాప్త మైన, బ్రాహ్మ్యా=బ్రహ్మ సంబంధమైన, లక్ష్మ్యా = శోభతో, సమావృతమ్ = కూడిన, ఆశ్రమమణ్డలమ్ = ఆశ్రమమండలమును, దదర్శ = చూచెను.

తా. ఆ ముని ఆ విధముగ చెప్పుచుండగానే రాముడు ఆశ్రమమండల మును చూచెను. అది కుశలతోను, నారచీరలతోను వ్యాప్తమైయుండెను. అంతటా బ్రహ్మవర్చస్సుతో వెలుగొందుచుండెను. 21

మూ. ప్రవిశ్య సహ వైదేహ్యా లక్ష్మణేన చ రాఘవః, 22
ఉవాస మునిభిః సర్వైః పూజ్యమానో మహాయశాః.

ప్ర. అ. మహాయశాః = గొప్ప కీర్తి గల, రాఘవః=రాముడు, వైదేహ్యా సహ = సీతతోను, లక్ష్మణేన చ = లక్ష్మణునితోను, ప్రవిశ్య=ప్రవేశించి, సర్వైః = సమస్తమైన, మునిభిః = మునులచేత, పూజ్యమానః=పూజింపబడుచున్నవాడై, ఉవాస = నివసించెను.

తా. గొప్ప కీర్తి గల రాముడు సీతారామలక్ష్మణులతో ఆ ఆశ్రమము లోనికి ప్రవేశించి, అక్కడ నున్న మునులందరు పూజించుచుండగా నివ సించెను. 22

మూ. తదా తస్మిన్ స కాకుత్థ్సః శ్రీమత్యాశ్రమమణ్డలే, 23
ఉషిత్వా తు సుఖం తత్ర పూజ్యమానో మహర్షిభిః,
జగామ చాశ్రమాంస్తేషాం పర్యాయేణ తపస్వినామ్, 24
యేషాముషితవాన్ పూర్వం సకాశే స మహాస్త్రవిత్.

ప్ర. అ. సః కాకుత్థ్సః = ఆ రాముడు, తదా = అప్పుడు, శ్రీమతి = శోభాయుక్తమైన, తస్మిన్ = ఆ, ఆశ్రమమణ్డలే = ఆశ్రమమండలమునందు, సుఖమ్ = సుఖముగా, ఉషిత్వా = నివసించి, తత్ర = అక్కడ, పూజ్యమానః = పూజింపబడుచు, మహాస్త్రవిత్ = మహాస్త్రములను ఎరిగిన, సః = ఆ రాముడు, పూర్వమ్ = పూర్వము, యేషామ్ = ఎవరియొక్క, సకాశే = సమీపమునందు, ఉషితవాన్ = ఉండెనో, తేషామ్ = ఆ, తపస్వినామ్ = మునులయొక్క, ఆశ్రమాన్ = ఆశ్రమములను గూర్చి, పర్యాయేణ = క్రమముగ, జగామ = వెళ్లెను.

తా. ఆ రాముడు శోభాయుక్తమైన ఆ ఆశ్రమమండలములో మహర్షులచే పూజింపబడుచు కొంతకాలము నివసించెను. మహాస్త్రములలో ప్రవీణుడైన ఆ రాముడు, తాను ఏ మునుల సమీపమునందు పూర్వము నివసించెనో వారి ఆశ్రమములకు మరొక పర్యాయము వెళ్లెను. 23, 24

మూ. క్వచిత్పరిదశాన్ మాసానేకం సంవత్సరం క్వచిత్, 25
క్వచిచ్చ చతురో మాసాన్ పఞ్చ షట్చాపరాన్ క్వచిత్,
అపరత్రాధికం మాసాదప్యర్ధమధికం క్వచిత్, 26
త్రీన్ మాసానష్టమాసాంశ్చ రాఘవో న్యవసత్సుఖమ్.

ప్ర. అ. రాఘవః = రాముడు, క్వచిత్ = ఒక ఆశ్రమమునందు, పరిదశాన్ = పదికి దగ్గరగా ఉన్న, మాసాన్ = మాసములను, క్వచిత్ = ఒక ఆశ్రమమునందు, ఏకమ్ = ఒక, సంవత్సరమ్ = సంవత్సరమును, క్వచిత్ = ఒక ఆశ్రమమునందు, చతురః = నాలుగు, మాసాన్ = మాసములను, క్వచిత్ = కొన్ని ఆశ్రమములందు, పఞ్చ = ఐదు మాసములను, అపరాన్ = మరి కొన్ని, షట్చ = ఆరు మాసములను, అపరత్ర = మరి యొక ఆశ్రమమునందు, మాసాదపి = మాసము కంటె, అధికమ్ = అధికకాలమును, క్వచిత్ = ఒక ఆశ్రమము

నందు, అర్ధమ్ = సగము మాసము, అధికమ్ = అధికమైన కాలమును, త్రీన్ = మూడు, మాసాన్ = మాసములను, సుఖమ్ = సుఖముగా, న్యవసత్ = నివసించెను.

తా. రాముడు ఒక ఆశ్రమములో ఇంచుమించు పదిమాసములు, ఒక ఆశ్రమములో ఒక సంవత్సరము, ఒక ఆశ్రమములో నాలుగు మాసములు, ఒక ఆశ్రమములో ఐదు మాసములు, ఒక ఆశ్రమములో ఆరు మాసములు, ఒక ఆశ్రమములో ఒక మాసము కంటె ఎక్కువ కాలము, ఒక ఆశ్రమములో ఒకటి న్నర మాసములు, ఒక ఆశ్రమములో మూడు మాసములు, ఒక ఆశ్రమములో ఎనిమిది మాసములు సుఖముగా నివసించెను. 25, 26

మూ. తదా సంవసతస్తస్య మునీనామాశ్రమేషు వై, 27
రమతశ్చానుకూల్యేన యయుః సంవత్సరా దశ.

ప్ర. అ. తదా = అప్పుడు, తస్య = ఆ రాముడు, ఆశ్రమేషు = ఆశ్రమములయందు, వసతః = నివసించుచుండగా, రమతశ్చ = ఆనందించుచుండగా, దశ = పది, సంవత్సరాః = సంవత్సరములు, అనుకూల్యేన = అనుకూల్యముతో, యయుః = గడచినవి.

తా. రాముడు ఆ విధముగ ఆశ్రమములలో ఆనందముతో నివసించుచుండగా పది సంవత్సరములు అనుకూలముగా గడచిపోయినవి. 27

మూ. పరిసృత్య చ ధర్మజ్ఞో రాఘవః సహ సీతయా, 28
సుతీక్ష్ణస్యాశ్రమం శ్రీమాన్ పునరేవాజగామ హ.

ప్ర. అ. ధర్మజ్ఞః = ధర్మములను ఎఱిగిన, శ్రీమాన్ = శ్రీమంతుడైన, రాఘవః = రాముడు, సీతయా సహ = సీతతో కూడ, పరిసృత్య = సంచరించి, పునరేవ = మరల, సుతీక్ష్ణస్య = సుతీక్ష్ణమహర్షియొక్క, ఆశ్రమమ్ = ఆశ్రమమును గూర్చి, ఆజగామ హ = వచ్చెను.

తా. ధర్మము లన్నీ తెలిసిన, శోభావంతుడైన రాముడు సీతాసమేతుడై, ఆ యా ఆశ్రమములలో సంచరించుచు మరల సుతీక్ష్ణుని ఆశ్రమమునకు వచ్చెను. 28

మూ. స తమాశ్రమమాసాద్య మునిభిః ప్రతిపూజితః, 29
తత్రాపి న్యవసద్రామః కంచిత్కాలమరిందమః.

ప్ర. అ. అరిందమః = శత్రుసంహారకుడైన, సః రామః = ఆ రాముడు, తమ్ = ఆ, ఆశ్రమమ్ = ఆశ్రమమును, ఆసాద్య = పొంది, మునిభిః = మునుల చేత, ప్రతిపూజితః = పూజింపబడినవాడై, తత్రాపి = అక్కడ కూడ, కంచిత్ కాలమ్ = కొంత కాలము, న్యవసత్ = నివసించెను.

తా. శత్రుసంహారకుడైన రాముడు ఆ ఆశ్రమము చేరి, మునులచే పూజింపబడినవాడై, అక్కడ కూడ కొంతకాలము నివసించెను. 29

మూ. అథాశ్రమస్థో వినయాత్కదాచిత్తం మహామునిమ్, 30
ఉపాసీనః స కాకుత్స్థః సుతీక్ష్ణమిదమబ్రవీత్.

ప్ర. అ. అథ = అటు పిమ్మట, ఆశ్రమస్థః = ఆశ్రమములో ఉన్న, కాకుత్స్థః = రాముడు, కదాచిత్ = ఒకనాడు, మహామునిమ్ = మహామునియైన, సుతీక్ష్ణమ్ = సుతీక్ష్ణుని, ఉపాసీనః = సమీపమునందు కూర్చున్నవాడై, వినయాత్ = వినయమువలన, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. ఆశ్రమములో నివసించుచున్న రాముడు ఒకనాడు ఆ సుతీక్ష్ణమహా మునిసమీపమునందు కూర్చుండి వినయపూర్వకముగా ఇట్లు పలికెను. 30

మూ. అస్మిన్నరణ్యే భగవానగస్త్యో మునిసత్తమః, 31
వసతీతి మయా నిత్యం కథాః కథయతాం శ్రుతమ్.

ప్ర. అ. భగవాన్ = మాహాత్మ్యము గల, మునిసత్తమః = మునులలో శ్రేష్ఠుడైన, అగస్త్యః = అగస్త్యుడు, అస్మిన్ = ఈ, అరణ్యే = అరణ్యమునందు, వసతీతి = నివసించుచున్నాడు అని, నిత్యమ్ = ఎల్లప్పుడు, కథాః = కథలను, కథయతామ్ = చెప్పుచున్నవారినుండి, శ్రుతమ్ = వినబడినది.

తా. మాహాత్మ్యము కలవాడు, మునిశ్రేష్ఠుడు అయిన అగస్త్యుడు ఈ అరణ్యమునందే నివసించుచున్నాడని, ఆ యా కథలు చెప్పుచున్నవారినుండి నేను అప్పుడప్పుడు విన్నాను. 31

మూ. న తు జానామి తం దేశం వనస్యాస్య మహత్తయా, 32
కుత్రాశ్రమపదం పుణ్యం మహర్షేస్తస్య ధీమతః.

ప్ర. అ. తు = కాని, అస్య = ఈ, వనస్య=వనము, మహత్తయా = గొప్ప దగుటచేత, తం దేశమ్ = ఆ ప్రదేశమును, న జానామి = ఎరుగను. ధీమతః = బుద్ధిమంతుడైన, తస్య మహర్షేః = ఆ మహర్షియొక్క, పుణ్యమ్ = పవిత్రమైన, ఆశ్రమపదమ్ = ఆశ్రమస్థానము, కుత్ర = ఎక్కడ ఉన్నది ?

తా. ఈ అరణ్యము అతి విశాలమైన దగుటచేత ఆ ప్రదేశ మేదో నాకు తెలియలేదు. మహాబుద్ధిమంతుడైన ఆ మహర్షి పవిత్రమైన ఆశ్రమము ఎక్కడ ఉన్నది? 32.

మూ. ప్రసాదాత్తత్ర భవతః సానుజః సహ సీతయా, 33
అగస్త్యమభిగచ్ఛేయమభివాదయితుం మునిమ్.

ప్ర. అ. భవతః=నీయొక్క, ప్రసాదాత్=అనుగ్రహమువలన, సానుజః = తమ్మునితో కూడినవారనై, సహ సీతయా = సీతతో కూడ, మునిమ్=మునియైన, అగస్త్యమ్ = అగస్త్యుని, అభివాదయితుమ్ = నమస్కరించుటకు, తత్ర = అక్కడికి, అభిగచ్ఛేయమ్ = వెళ్లెదను.

తా. నీవు అనుగ్రహించినట్లయితే, తమ్మునితోను, సీతతోను కలసి ఆ అగస్త్యమహామునికి నమస్కరించుటకు అక్కడికి వెళ్లెదను. 33.

మూ. మనోరథో మహానేష హృది మే పరివర్తతే, 34
యద్యహం తం మునివరం శుశ్రూషేయమపి స్వయమ్.

ప్ర. అ. తమ్ = ఆ, మునివరమ్ = మునిశ్రేష్ఠుణ్ణి, స్వయమ్ = స్వయముగా, అహమ్ = నేను, శుశ్రూషేయమపి యది = సేవింపగలనా అని, ఏషః = ఈ, మహాన్ = గొప్ప, మనోరథః = మనోరథము, మే = నాయొక్క, హృది =హృదయమునందు, పరివర్తతే = దొర్లుచున్నది.

తా. మునులలో శ్రేష్ఠుడైన ఆ అగస్త్యుని ఏనాటైన స్వయముగా సేవించ కలుగుదునా అను గొప్ప కోరిక నా హృదయములో తిరుగాడుచున్నది. 34

మూ. ఇతి రామస్య స మునిః శ్రుత్వా ధర్మాత్మనో వచః. 35
సుతీక్ష్ణః ప్రత్యువాచేదం ప్రీతో దశరథాత్మజమ్.

ప్ర. అ. సః=ఆ, సుతీక్ష్ణః మునిః=సుతీక్ష్ణముని, ధర్మాత్మనః=ధర్మాత్ముడైన, రామస్య=రామునియొక్క, ఇతి = ఇట్లు, వచః = వాక్యమును, శ్రుత్వా = విని, ప్రీతః = సంతోషించినవాడై, దశరథాత్మజమ్ = రాముణ్ణి గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. ఆ సుతీక్ష్ణముని, ధర్మాత్ముడైన రాముని మాటలు విని, సంతోషించినవాడై, ఆ రామునితో ఇట్లు పలికెను. 35

మూ. అహమప్యేతదేవ త్వాం వక్తుకామః సలక్ష్మణమ్, 36
అగస్త్యమభిగచ్ఛేతి సీతయా సహ రాఘవ.

ప్ర. అ. రాఘవ= రామా! అహమపి=నేను కూడ, సలక్ష్మణమ్= లక్ష్మణునితో కూడిన, త్వామ్=నిన్ను గూర్చి, సీతయాసహ=సీతతో కూడ, అగస్త్యమ్= అగస్త్యుణ్ణిగూర్చి, అభిగచ్ఛ= వెళ్లుము, ఇతి = అని, ఏతదేవ = దీనినే, వక్తుకామః=చెప్పుటకు కోరికకలవాడను.

తా. రామా! "సీతతో కలిసి నీవు లక్ష్మణసమేతుడవై అగస్త్యుని వద్దకు వెళ్లుము" అని నేను కూడ ఈ విషయమే చెప్పవలె నని అనుకొనుచుంటిని. 36

మూ. దిష్ట్యా త్విదానీమర్థేఽస్మిన్ స్వయమేవ బ్రవీషి మామ్, 37
అహమాఖ్యామి తే వత్స యత్రాగస్త్యో మహామునిః.

ప్ర. అ. దిష్ట్యా= దైవముచేత, ఇదానీమ్= ఇప్పుడు, అస్మిన్ = ఈ, అర్థే= విషయమునందు, స్వయమేవ= స్వయముగానే, మామ్ = నన్నుగూర్చి, బ్రవీషి = మాటలాడుచున్నావు. వత్స= ఓ! వత్సా, మహామునిః = మహామునియైన, అగస్త్యః=అగస్త్యుడు, యత్ర= ఎక్కడ ఉన్నాడో, అహమ్=నేను, తే=నీకు, ఆఖ్యామి=చెప్పెదను.

తా. దైవవశముచేత నీవే స్వయముగ ఈ విషయమును గూర్చి నాతో ముచ్చటించినావు. నాయనా! అగస్త్యమహాముని నివసించు ప్రదేశమును నీకు చెప్పెదను. 37

మూ. యోజనాన్యాశ్రమాత్తాత యాహి చత్వారి వై తతః, 38
దక్షిణేన మహాన్ శ్రీమానగస్త్యభ్రాతురాశ్రమః.

ప్ర. అ. తాత = తండ్రీ! ఆశ్రమాత్ = ఈ ఆశ్రమమునుండి, చత్వారి = నాలుగు, యోజనాని = యోజనములు, యాహి = వెళ్లుము. తతః = పిమ్మట, దక్షిణేన = దక్షిణము వైపున, అగస్త్యభ్రాతుః = అగస్త్యుని సోదరునియొక్క. మహాన్ = గొప్ప, శ్రీమాన్ = శోభాయుక్తమైన, ఆశ్రమః = ఆశ్రమ మున్నది.

తా. నాయనా! ఈ ఆశ్రమమునుండి నాలుగు యోజనముల దూరము వెళ్లుము. అక్కడ దక్షిణపు దిశయందు అగస్త్యుని సోదరుని, గొప్ప, శోభాయుక్తమైన ఆశ్రమము కనబడును. 38

మూ. స్థలప్రాయే వనోద్దేశే పిప్పలీవనశోభితే, 39
బహుపుష్పఫలే రమ్యే నానాశకునినాదితే.

ప్ర. అ. పిప్పలీవనశోభితే = పిప్పలీవనముచేత ప్రకాశింపచేయబడినది, బహుపుష్పఫలే = అనేకమైన పుష్పములు, ఫలములు కలది, రమ్యే = రమ్యమైనది, నానాశకునినాదితే = అనేకపక్షులచేత ధ్వనింపచేయబడినది అయిన, స్థలప్రాయే = అధికముగా మెట్టగా ఉన్న, వనోద్దేశే = వనప్రదేశమునందు (ఆ ఆశ్రమమున్నది).

తా. ఆ ఆశ్రమము ఎక్కువ మెట్టగా ఉన్న అరణ్యప్రదేశములో ఉన్నది. ఆ ప్రదేశమునందు పిప్పలీవనము ఉండును. అనేక పుష్పములు, ఫలములు ఉండును. రమ్యమైన ఆ ప్రదేశమునందు అనేకవిధములైన పక్షులు ధ్వనిచేయుచుండును. 39

మూ. పద్మిన్యో వివిధాస్తత్ర ప్రసన్నసలిలాః శివాః, 40
హంసకారణ్డవాకీర్ణాశ్చక్రవాకోపశోభితాః,
తత్రైకాం రజనీం వ్యుష్య ప్రభాతే రామ గమ్యతామ్. 41

ప్ర. అ. తత్ర = అక్కడ, ప్రసన్నసలిలాః = నిర్మలమైన ఉదకము గలవి, శివాః = మంగళప్రదమైనవి, హంసకారణ్డవాకీర్ణాః = హంసలచేత, కారండపక్షులచేత వ్యాపమైనవి, చక్రవాకోపశోభితాః = చక్రవాకపక్షులచేత ప్రకాశింపచేయ

బడినవి అయిన, వివిధాః=అనేకవిధములైన, పద్మిన్యః=పద్మసరస్సులు ఉండును. రామ = రామా! తత్ర=ఆ ఆశ్రమమునందు, ఏకామ్=ఒక, రజనీమ్=రాత్రిని, వృష్య = ఉండి, ప్రభాతే = ప్రాతఃకాలమునందు, గమ్యతామ్ = వెళ్లెదవుగాక.

తా. అక్కడ నిర్మలమైన జలములతో మంగళప్రదములై, హంస-కారండవ-చక్రవాకాదిపక్షులతో వ్యాప్తములైన అనేకవిధములైన పద్మసరస్సులు ఉన్నవి. రామా! నీ పక్కడ ఒక్క రాత్రి ఉండి మరునాడు ఉదయముననే వెళ్లుము. 40, 41

మూ. దక్షిణాం దిశమాస్థాయ వనషణ్డస్య పార్శ్వతః,
తత్రాగస్త్యాశ్రమపదం గత్వా యోజనమన్తరమ్. 42

ప్ర. అ. వనషణ్డస్య=వృక్షముల గుంపుయొక్క, పార్శ్వతః=ప్రక్కన, దక్షిణామ్ = దక్షిణపు, దిశమ్ = దిక్కును, ఆస్థాయ = అవలంబించి, యోజనమ్ = ఒక యోజనము, అన్తరమ్ = దూరము, గత్వా = వెళ్ళి, తత్ర = అక్కడ, అగస్త్యాశ్రమపదమ్ = అగస్త్యుని ఆశ్రమస్థానము ఉన్నది.

తా. ఆ వృక్షముల గుంపుకు ప్రక్కన దక్షిణము వైపు ప్రయాణము చేసి ఒక యోజనముదూరము వెళ్ళినచో అక్కడ అగస్త్యుని ఆశ్రమ మున్నది. 42

మూ. రమణీయే వనోద్దేశే బహుపాదపసంవృతే,
రంస్యతే తత్ర వైదేహీ లక్ష్మణశ్చ సహ త్వయా, 43
స హి రమ్యో వనోద్దేశో బహుపాదపసంకులః.

ప్ర. అ. రమణీయే = సుందరమైన, బహుపాదపసంకులే = అనేకవృక్షములచే చుట్టబడిన, తత్ర = ఆ, వనోద్దేశే = వనప్రదేశమునందు, వైదేహీ=సీత, లక్ష్మణశ్చ = లక్ష్మణుడు, త్వయా సహ=నీతో కూడ, రంస్యతే=ఆనందించును. బహుపాదపసంకులః = అనేకవృక్షములతో నిండిన, సః = ఆ, వనోద్దేశః = వన ప్రదేశము, రమ్యః హి = చాల సుందర మైనది కదా.

తా. చుట్టూ అనేకవృక్షము లున్న ఆ సుందరమైన వనప్రదేశమునందు, నీవు, సీత, లక్ష్మణుడు కూడ ఆనందముగా ఉండగలరు. అనేకవృక్షములతో నిండి ఉండుటచే ఆ ప్రదేశము చాల రమ్యముగా ఉండును కదా? 43

మూ. యది బుద్ధిః కృతా ద్రష్టుమగస్త్యం-తం మహామునిమ్,
అద్యైవ గమనే బుద్ధిం రోచయస్వ మహాయశః.

ప్ర. అ. మహాయశః = గొప్ప కీర్తి కలవాడా ! మహామునిమ్ = మహా ముని యైన, తమ్ = ఆ, అగస్త్యమ్ = అగస్త్యుణ్ణి, ద్రష్టుమ్ = చూచుటకు, బుద్ధిః = బుద్ధి, కృతా యది = చేయబడినట్లయితే, అద్యైవ = ఇప్పుడే, గమనే = వెళ్లుట యందు, బుద్ధిమ్ = బుద్ధిని, రోచయస్వ = ఇష్టముకలదానిని చేయుము.

తా. గొప్ప కీర్తి గల రామా ! ఆ అగస్త్యమహామునిని చూడవలె నను అభిప్రాయ మున్నచో ఇప్పుడే బయలుదేరుటకు నిశ్చయించుకొనుము. 44

మూ. ఇతి రామో మునేః శ్రుత్వా సహ భ్రాత్రాభివాద్య చ, 45
ప్రతస్థేఽగస్త్యముద్దిశ్య సానుజః సీతయా సహ.

ప్ర. అ. రామః = రాముడు, మునేః = మునియొక్క, ఇతి = ఇట్లు పలికిన మాటలను, శ్రుత్వా = విని, సహ భ్రాత్రా = సోదరునితో కూడ, అభివాద్య చ = నమస్కరించి, సానుజః = తమ్మునితో కూడినవాడై, సీతయా సహ = సీతతో కూడ, అగస్త్యమ్ = అగస్త్యుని, ఉద్దిశ్య = ఉద్దేశించి, ప్రతస్థే = ప్రయాణ మాయెను.

తా. రాముడు ముని మాటలు విని, లక్ష్మణసహితుడై, ఆ మునికి నమస్కరించి, తమ్మునితోను, సీతతోను కలిసి అగస్త్యుని ఆశ్రమమునకు బయలుదేరెను.

మూ. పశ్యన్వనాని రమ్యాణి పర్వతాంశ్చాభ్రసన్నిభాన్, 46
సరాంసి సరితశ్చైవ పథి మార్గవశానుగాః,
సుతీక్ష్ణేనోపదిష్టేన గత్వా తేన పథా సుఖమ్, 47
ఇదం పరమసంహృష్టో వాక్యం లక్ష్మణమబ్రవీత్.

ప్ర. అ. రమ్యాణి = సుందరమైన, వనాని = వనములను, అభ్రసన్నిభాన్ = ఆకాశముతో సమానములైన, పర్వతాంశ్చ = పర్వతములను, సరాంసి = సరస్సులను, పథి = మార్గమునందు, మార్గవశానుగాః = మార్గము ననుసరించి ప్రవహించుచున్న, సరితశ్చ = నదులను, పశ్యన్ = చూచుచు, సుతీక్ష్ణేన = సుతీక్ష్ణుని చేత, ఉపదిష్టేన = చెప్పబడిన, తేన పథా = ఆ మార్గముచేత, యథాసుఖమ్ =

సుఖముగా, గత్వా = వెళ్ళి, పరమసంహృష్టః = చాల సంతోషించినవాడై, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, ఇదమ్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. రాముడు సుందరములైన వనములను, మేఘములతో సమానములైన పర్వతములను, సరస్సులను, మార్గమునందు ప్రవహించుచున్న నదులను చూచుచు సుతీక్ష్ణుడు చెప్పిన మార్గమునందు సుఖముగా ప్రయాణము చేసి, చాల సంతోషించుచు, లక్ష్మణునితో ఇట్లు పలికెను. 46, 47

మూ. ఏతదేవాశ్రమపదం నూనం తస్య మహాత్మనః, 48
అగస్త్యస్య మునేర్భ్రాతుర్దృశ్యతే పుణ్యకర్మణః.

ప్ర. అ. ఏతదేవ = ఇదే, మహాత్మనః = మహాత్ముడు, పుణ్యకర్మణః = పుణ్యమైన కర్మ కలవాడు, అగస్త్యస్య మునేః = అగస్త్యమునియొక్క, భ్రాతుః = సోదరుడూ అయిన, తస్య = ఆ మునీశ్వరునియొక్క, ఆశ్రమపదమ్ = ఆశ్రమముగా, దృశ్యతే = కనబడుచున్నది. నూనమ్ = నిశ్చయము.

తా. మహాత్ముడు, పుణ్యకర్మల నాచరించినవాడు అయిన ఆ అగస్త్యభ్రాత ఆశ్రమము ఇదే అయి ఉండును. నిశ్చయము. 48

మూ. యథా హి మే వనస్యాస్య జ్ఞాతాః పథి సహస్రశః, 49
సన్నతాః ఫలభారేణ పుష్పభారేణ చ ద్రుమాః.

ప్ర. అ. పథి = మార్గమునందు, ఫలభారేణ = ఫలభారముచేతను, పుష్పభారేణ చ = పుష్పభారముచేతను, సంనతాః = వంగిన, సహస్రశః = వేలకొలది, అస్య వనస్య = ఈ వనముయొక్క, ద్రుమాః = వృక్షములు, యథా హి = ఎట్లు, మే = నాకు, జ్ఞాతాః = తెలియబడినవో (చూడబడినవో) "దానిచే ఇది ఆ అగస్త్యభ్రాత ఆశ్రమమే" అని పూర్వశ్లోకముతో అన్వయము.

తా. ఫలభారముచేతను, పుష్పభారముచేతను వంగిన ఈ వనమునకు సంబంధించిన వేలకొలది వృక్షములు మార్గములో నాకు కనబడుచుండుటను బట్టి ఇది తప్పక అగస్త్యభ్రాత ఆశ్రమమే. 49

మూ. పిప్పలీనాం చ పక్వానాం వనాదస్మాదుపాగతః, 50
గన్ధోఽయం పవనోత్క్షిప్తః సహసా కటుకోదయః.

ప్ర. అ. సహసా=హటాత్తుగా, పవనోత్క్షిప్తః=వాయువుచేత ఎగురగొట్టబడిన, కటుకోదయః = వెగటుగా ఉన్న ఆవిర్భావము గల, పక్వానామ్ = పక్వమైన, పిప్పలీనామ్ = పిప్పళ్లయొక్క, అయం గన్ధః= ఈ వాసన, అస్మాత్ = ఈ, వనాత్ = వనమునుండి, ఉపాగతః = వచ్చినది.

తా. ఈ వనమునుండి పండిన పిప్పళ్ళ వెగటైన వాసన హటాత్తుగా గాలిచే ఎగురగొట్టబడినదై వచ్చుచున్నది. 50

మూ. తత్ర తత్ర చ దృశ్యన్తే సంక్షిప్తాః కాష్ఠసంచయాః, 51
లూనాశ్చ పథి దృశ్యన్తే దర్భా వైడూర్యవర్చసః.

ప్ర. అ. తత్ర తత్ర = అక్కడక్కడ, సంక్షిప్తాః = ప్రోగు చేయబడిన, కాష్ఠసంచయాః = కట్టెల ప్రోగులు, దృశ్యన్తే = చూడబడుచున్నవి. లూనాః = తెలవబడిన, వైడూర్యవర్చసః = వైడూర్యమణుల వంటి కాంతి గల, దర్భాశ్చ= దర్భలు కూడ, పథి = మార్గమునందు, దృశ్యన్తే = చూడబడుచున్నవి.

తా. అక్కడక్కడ ప్రోగులుగా పెట్టిన కట్టెలు కనబడుచున్నవి. మార్గమునందు త్రుంచబడిన, వైడూర్యమాణిక్యముల వలె అకుపచ్చగా ఉన్న దర్భలు కనబడుచున్నవి. 51

మూ. ఏతచ్చ వనమధ్యస్థం కృష్ణాభ్రశిఖరోపమమ్, 52
పావకస్యాశ్రమస్థస్య ధూమాగ్రం సంప్రదృశ్యతే.

ప్ర. అ. ఆశ్రమస్థస్య=ఆశ్రమములో ఉన్న, పావకస్య=అగ్నియొక్క, కృష్ణాభ్రశిఖరోపమమ్ = నల్లని మేఘము అగ్రభాగముతో సమానమైన, వనమధ్యస్థమ్ = వనమధ్యమునందున్న, ఏతత్ = ఈ, ధూమాగ్రమ్ = ధూమము యొక్క అగ్రభాగమ్, సంప్రదృశ్యతే = చూడబడుచున్నది.

తా. ఆశ్రమములోని అగ్నినుండి బయలుదేరిన ధూమము అగ్రభాగము, ఇదిగో, వనమధ్యమునందు కనబడుచున్నది. ఇది నల్లని మేఘము చివరి భాగము వలె ఉన్నది. 52

మూ. వివిక్తేషు చ తీర్థేషు కృతస్నానా ద్విజాతయః, 53
పుష్పోపహారం కుర్వన్తి కుసుమైః స్వయమార్జితైః.

ప్ర. అ. వివిక్తేషు = పవిత్రములైన, తీర్థేషు = తీర్థములందు, కృతస్నానాః = చేయబడిన స్నానము గల, ద్విజాతయః = ద్విజులు, స్వయమ్ = స్వయముగా, అర్జితైః = సంపాదించబడిన, కుసుమైః = పుష్పములతో, పుష్పోపహారమ్ = పుష్పబలిని, కుర్వన్తి = చేయుచున్నారు.

తా. ద్విజులు పవిత్రము లైన తీర్థములలో స్నానము చేసి, తాము స్వయముగా కోసికొని వచ్చిన పుష్పాలను దేవతలకు సమర్పించి పూజించుచున్నారు. 53

మూ. తత్సుతీక్ష్ణస్య వచనం యథా సౌమ్య మయా శ్రుతమ్, 54
అగస్త్యస్యాశ్రమో భ్రాతుర్నూనమేష భవిష్యతి.

ప్ర. అ. సౌమ్య = ఓ ! సౌమ్యుడా ! తత్ = ఆ కారణమువలన, సుతీక్ష్ణస్య = సుతీక్ష్ణునియొక్క, వచనమ్ = వచనము, మయా = నాచేత, యథా = ఎట్లు, శ్రుతమ్ = వినబడినదో, ఏషః = ఇది, నూనమ్ = నిశ్చయముగా, అగస్త్యస్య = అగస్త్యునియొక్క, భ్రాతుః = సోదరునియొక్క, ఆశ్రమః = ఆశ్రమము, భవిష్యతి = కాగలదు.

తా. సౌమ్యుడ వైన లక్ష్మణా ! అందువలన, నేను సుతీక్ష్ణునినుండి విని నట్లు ఇది తప్పక అగస్త్యుని సోదరుని ఆశ్రమమై ఉండును. 54

మూ. నిగృహ్య తపసా మృత్యుం లోకానాం హితకామ్యయా,
యస్య భ్రాత్రా కృతేయం దిక్శరణ్యా పుణ్యకర్మణా.

ప్ర. అ. యస్య=ఎవ్వనియొక్క, భ్రాత్రా=సోదరుడైన, పుణ్యకర్మణా= పుణ్యకర్మలు గల అగస్త్యునిచేత, లోకానామ్=ప్రజలయొక్క, హితకామ్యయా= హితమునందు కోరికచేత, తపసా = తపస్సుచేత, మృత్యుమ్ = మృత్యువును, నిగృహ్య = నిగ్రహించి, ఇయమ్ = ఈ, దిక్=దక్షిణదిక్కు, శరణ్యా= నివాస యోగ్యముగా, కృతా = చేయబడినదో (అట్టి ముని ఆశ్రమ మిదే).

తా. ఎవ్వని సోదరుడైన, పుణ్యాత్ముడైన అగస్త్యుడు లోకులకు హితము కోరుచు తపస్సుచేత మృత్యుదేవతను నిగ్రహించి ఈ దక్షిణదిక్కు మునులకు నివాసయోగ్య మగు నట్లు చేసెనో ఆ మునీశ్వరుని ఆశ్రమ మిదే అయి ఉండును.

మూ. ఇహైకదా కిల క్రూరో వాతాపిరపి చేల్వలః, 56
భ్రాతరౌ సహితావాస్తాం బ్రాహ్మణఘ్నౌ మహాసురౌ.

ప్ర. అ. ఏకదా = ఒకప్పుడు, ఇహ = ఈ ప్రాంతమునందు, బ్రాహ్మణఘ్నౌ = బ్రాహ్మణులను చంపేవారైన, క్రూరః = క్రూరుడైన, వాతాపిః = వాతాపి, ఇల్వలశ్చ = ఇల్వలుడు అనే, భ్రాతరౌ = సోదరులైన, మహాసురౌ = గొప్ప రాక్షసులు, సహితౌ = కలిసినవారై, ఆస్తాం కిల = ఉండి రట.

తా. ఒకానొకప్పుడు, ఈ ప్రాంతమునందు క్రూరులైన వాతాపి, ఇల్వలుడు అనే సోదరులైన బలవంతులైన రాక్షసులు ఉండేవారట. వాళ్ళు బ్రాహ్మణులను చంపుచుండేవారు. 56

మూ. ధారయన్ బ్రాహ్మణం రూపమిల్వలః సంస్కృతం వదన్,
ఆమన్త్రయతి విప్రాన్ స్మ శ్రాద్ధముద్దిశ్య నిర్ఘృణః.

ప్ర. అ. ఇల్వలః = ఇల్వలుడు, బ్రాహ్మణమ్ = బ్రాహ్మణసంబంధమైన, రూపమ్ = రూపమును, ధారయన్ = ధరించుచు, సంస్కృతమ్ = సంస్కృతముగా, వదన్ = మాటలాడుచు, నిర్ఘృణః = జాలిలేనివాడై, శ్రాద్ధముద్దిశ్య = శ్రాద్ధమును గూర్చి, విప్రాన్ = బ్రాహ్మణులను, ఆమన్త్రయతి స్మ = పిలచుచుండెను.

తా. ఇల్వలుడు బ్రాహ్మణరూపము ధరించి, నిర్దుష్టమైన భాషలో మాటలాడుచు, జాలి లేనివాడై, బ్రాహ్మణులను శ్రాద్ధమునందు భోక్తలనుగా ఆహ్వానించేవాడు. 57

మూ. భ్రాతరం సంస్కృతం కృత్వా తతస్తం మేషరూపిణమ్,
తాన్ ద్విజాన్ భోజయామాస శ్రాద్ధదృష్టేన కర్మణా.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మేషరూపిణమ్ = గొఱ్ఱె రూపములో ఉన్న, తం భ్రాతరమ్ = ఆ సోదరుడైన వాతాపిని, సంస్కృతమ్ = పాకముచేత

సంస్కరింపబడినవానినిగా, కృత్వా = చేసి, తతః = అటుపిమ్మట, శ్రాద్ధ దృష్టేన = శ్రాద్ధకల్పమునందు చూడబడిన, కర్మణా = కర్మచేత, తాన్ ద్విజాన్ = ఆ బ్రాహ్మణులను, భోజయామాస = భుజింపచేసెను.

తా గొఱ్ఱె రూపములో ఉన్న సోదరుడైన వాతాపిని వండి, శ్రాద్ధ కల్పమునందు చెప్పిన విధిప్రకారము ఆ బ్రాహ్మణులకు భోజనము పెట్టేవాడు.

మూ. తతో భుక్తవతాం తేషాం విప్రాణామిల్వలోఽబ్రవీత్, 59
వాతాపే నిష్క్రమస్వేతి స్వరేణ మహతా వదన్.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, తేషాం విప్రాణామ్ = ఆ బ్రాహ్మణులు, భుక్తవతామ్ = భుజించినవారగుచుండగా, ఇల్వలః = ఇల్వలుడు, మహతా = పెద్ద, స్వరేణ = స్వరముతో, వదన్ = అరచుచు, వాతాపే = వాతాపీ ! నిష్క్రమస్వ = బైటకు రమ్ము, ఇతి = అని, అబ్రవీత్ = వలికెను.

తా. ఆ బ్రాహ్మణులు భుజించిన పిమ్మట ఇల్వలుడు బిగ్గరగా అరచుచు "వాతాపీ బైటకు రమ్ము"అని పలుకుచుండేవాడు. 59

మూ. తతో భ్రాతుర్వచః శ్రుత్వా వాతాపిర్మేషవన్నదన్, 60
భిత్త్వా భిత్త్వా శరీరాణి బ్రాహ్మణానాం వినిష్పతత్.

ప్ర. అ. తతః = పిమ్మట, వాతాపిః = వాతాపి, భ్రాతుః = సోదరుని యొక్క, వచః = వచనమును, శ్రుత్వా = విని, మేషవత్ = గొఱ్ఱె వలె, నదన్ = అరచుచు, బ్రాహ్మణానామ్ = బ్రాహ్మణులయొక్క, శరీరాణి = శరీరములను, భిత్త్వా భిత్త్వా = బ్రద్దలుకొట్టి బ్రద్దలుకొట్టి, వినిష్పతత్ = బైటకు వచ్చేవాడు.

తా. పిమ్మట వాతాపి సోదరుని మాట విని, గొఱ్ఱె వలె అరచుచు, బ్రాహ్మణుల శరీరములను బ్రద్దలుకొట్టుకొని బైటకు వచ్చేవాడు. 60

మూ. బ్రాహ్మణానాం సహస్రాణి తైరేవం కామరూపిభిః, 61
వినాశితాని సంహత్య నిత్యశః పిశితాశనైః.

('తైః' అనే బహువచనం కుదరదు "....తాభ్యామేవం పరంతప........ పిశితాశయా"అనే ప్రాచ్యపాఠము బాగున్నది.

ప్ర. అ. పరంతప=శత్రువినాశకుడ వైన లక్ష్మణా! తాభ్యామ్=వారిద్దరి చేత, సంహత్య = కలిసి, పిశితాశయా = మాంసమునందు ఆశచేత, బ్రాహ్మణానామ్ = బ్రాహ్మణులయొక్క, సహస్రాణి = సహస్రములు. ఏవమ్ = ఈ విధముగ, నిత్యశః = నిత్యము, వినాశితాని = నశింపచేయబడినవి.

తా. శత్రుసంహారకుడ వైన లక్ష్మణా ! ఆ రాక్షసు లిద్దరూ కలిసి ఈ విధముగ నిత్యము చేయుచు మాంసముకొరకే వేలకొలది బ్రాహ్మణులను చంపి వేసిరి. 61

మూ. అగస్త్యేన తదా దేవైః ప్రార్థితేన మహర్షిణా, 62
అనుభూయ కిల శ్రాద్ధే భక్షితః స మహాసురః.

ప్ర. అ. తదా = అప్పుడు, దేవైః = దేవతలచేత, ప్రార్థితేన = ప్రార్థింప బడిన, మహర్షిణా = మహర్షియైన, అగస్త్యేన = అగస్త్యునిచేత, శ్రాద్ధే=శ్రాద్ధము నందు, అనుభూయ = అనుభవించి, సః మహాసురః=ఆ మహారాక్షసుడు, భక్షితః కిల = భక్షించబడినా డట.

తా. అప్పుడు దేవతలు ప్రార్థించగా అగస్త్యమహర్షి శ్రాద్ధములో ఆ మహాసురుణ్ణి తిని జీర్ణముచేసుకొన్నా డట. 62

మూ. తతః సంపన్నమిత్యుక్త్వా దత్త్వా హస్తావసేచనమ్, 63
భ్రాతరం నిష్క్రమస్వేతి చేల్వలః సోఽభ్యభాషత.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, సః ఇల్వలః = ఆ ఇల్వలుడు, సంపన్నమ్ = శ్రాద్ధము సంపన్న మైనట్లేనా ? ఇతి = అని, ఉక్త్వా = వలికి, హస్తావసేచనమ్ = ఉత్తరాపోశనమును, దత్త్వా=ఇచ్చి, నిష్క్రమస్వ = బైటకు రమ్ము, ఇతి = అని, భ్రాతరమ్ = సోదరుని గూర్చి, అభ్యభాషత=పలికెను.

తా. పిమ్మట ఇల్వలుడు శ్రాద్ధము సంపన్న మైనది కదా అని అగస్త్యుని ప్రశ్నించి, ఆతనికి ఉత్తరాపోశనము వడ్డించి, "బైటకు రమ్ము"అని సోదరుని పిలచెను. 63

మూ. స తం తథా భాషమాణం భ్రాతరం విప్రఘాతినమ్, 64
అబ్రవీత్ప్రహసన్ ధీమానగస్త్యో మునిసత్తమః.

ప్ర. అ. ధీమాన్=బుద్ధిమంతుడు, మునిసత్తమః=మునిశ్రేష్ఠుడు అయిన, అగస్త్యః=అగస్త్యుడు, భ్రాతరమ్=సోదరుని గూర్చి, తథా=అట్లు, భాషమాణమ్=పలుకుచున్న, విప్రఘాతినమ్=బ్రాహ్మణులను చంపిన, తమ్=ఆ ఇల్వలుణ్ణి గూర్చి, ప్రహసన్=నవ్వుచు, అబ్రవీత్=పలికెను.

తా. అప్పుడు బుద్ధిశాలి, మునిశ్రేష్ఠుడూ అయిన అగస్త్యుడు, ఆ విధముగ తన సోదరుని పిలుచుచున్న, బ్రాహ్మణహింసకుడైన ఆ ఇల్వలుని చూచి నవ్వుచు ఇట్లు పలికెను. 64

మూ. కుతో నిష్క్రమితుం శక్తిర్మయా జీర్ణస్య రక్షసః, 65
భ్రాతుస్తే మేషరూపస్య గతస్య యమసాదనమ్.

ప్ర. అ. మయా=నాచేత, జీర్ణస్య=జీర్ణముచేయబడినవాడు, రక్షసః=రాక్షసుడు, మేషరూపస్య=మేషరూపము ధరించినవాడు, యమసాదనమ్=యముని గృహమును గూర్చి, గతస్య=వెళ్ళినవాడు అయిన, తే భ్రాతుః=నీ సోదరునకు, నిష్క్రమితుమ్=బైటకు వచ్చుటకు, శక్తిః=శక్తి, కుతః=ఎక్కడిది ?

తా. మేషరూపమును ధరించిన రాక్షసుడైన, నీ సోదరుణ్ణి నేను జీర్ణము చేసికొన్నాను. ఆతడు యమలోకమునకు వెళ్ళిపోయినాడు. ఇంక పైకివచ్చే శక్తి వాని కెక్కడిది ? 65

మూ. అథ తస్య వచః శ్రుత్వా భ్రాతుర్నిధనసంశ్రయమ్, 66
ప్రధర్షయితుమారేభే మునిం క్రోధాన్నిశాచరః.

ప్ర. అ. అథ=అటు పిమ్మట, భ్రాతుః=సోదరునియొక్క, నిధన సంశ్రయమ్=మరణమునకు సంబంధించిన, తస్య=ఆ అగస్త్యునియొక్క, వచః=వాక్కును, శ్రుత్వా=విని, నిశాచరః=ఆ రాక్షసుడు, క్రోధాత్=కోపము వలన, ప్రధర్షయితుమ్=ఎదిరించుటకు, ఆరేభే=ప్రారంభించెను.

తా. ఇల్వలుడు తన సోదరుడు మరణించినట్లు ఆ అగస్త్యుడు చెప్పిన మాటలు విని, కోపముతో ఆతనిమీదికి వెళ్ళెను. 66

మూ. సోఽభిద్రవన్మునిశ్రేష్ఠం మునినా దీప్తతేజసా, 67
చక్షుషానలకల్పేన నిర్దగ్ధో నిధనం గతః.

ప్ర. అ. సః = ఆ రాక్షసుడు, మునిశ్రేష్ఠమ్ = మునిశ్రేష్ఠుడైన అగస్త్యుని గూర్చి, అభ్యద్రవత్ = చంపుటకై వెళ్ళెను. దీప్తతేజసా = ప్రకాశించుచున్న తేజస్సు గల, మునినా = మునిచేత, అనలకల్పేన = అగ్నితో సమాన మైన, చక్షుషా = నేత్రముచేత, నిర్దగ్ధః = కాల్చబడినవాడై, నిధనమ్ = మరణమును, గతః = పొందెను.

తా. ఆ రాక్షసుడు మునులలో శ్రేష్ఠుడైన ఆ అగస్త్యునిమీదికి దుమికెను. అప్పుడు ప్రజ్వలించుచున్న తేజస్సు గల ఆ మహాముని అగ్నితుల్యమైన నేత్రముతో కాల్చివేయగా ఆ రాక్షసుడు మరణించెను. 67

మూ. తస్యాయమాశ్రమో భ్రాతు స్తటాకవనశోభితః, 68
విప్రానుకమ్పయా యేన కర్మేదం దుష్కరం కృతమ్.

ప్ర. అ. తటాకవనశోభితః = సరస్సులచేతను వనములచేతను శోభింప చేయబడిన, అయమ్ = ఈ ఆశ్రమము, యేన = ఏ అగస్త్యునిచేత, విప్రానుకమ్పయా = బ్రాహ్మణులయందు జాలిచేత, ఇదమ్ = ఈ, దుష్కరమ్ = చేయ శక్యము కాని, కర్మ = కర్మ, కృతమ్ = చేయబడినదో, తస్య = అట్టి అగస్త్యుని యొక్క, భ్రాతుః = సోదరునియొక్క, ఆశ్రమః = ఆశ్రమము.

తా. తటాకములతోను, వనములతోను శోభించుచున్న ఈ ఆశ్రమము, బ్రాహ్మణులమీద దయచేత ఈ చేయశక్యము కాని పని చేసిన అగస్త్యుని సోదరుని ఆశ్రమము. 68

మూ. ఏవం కథయమానస్య తస్య సౌమిత్రిణా సహ, 69
రామస్యాస్తం గతః సూర్యః సంధ్యాకాలోఽభ్యవర్తత.

ప్ర. అ. తస్య రామస్య=ఆ రాముడు, సౌమిత్రిణా సహ=లక్ష్మణునితో, ఏవమ్ = ఇట్లు, కథయమానస్య=చెప్పుచుండగా, సూర్యః=సూర్యుడు, అస్తం గతః = అ స్తమించెను. సంధ్యాకాలః = సంధ్యాకాలము, అభ్యవర్తత=వచ్చెను.

తా. రాముడు లక్ష్మణునితో ఇట్లు అగస్త్యుని కథ చెప్పుచుండగా సూర్యు డస్తమించెను. సంధ్యాకాలము వచ్చెను. 69

మూ. ఉపాస్య పశ్చిమాం సంధ్యాం సహ భ్రాత్రా యథావిధి, 70
ప్రవివేశాశ్రమపదం తమృషిం సోఽభ్యవాదయత్.

ప్ర. అ. సః = రాముడు, సహ భ్రాత్రా = సోదరునితో కూడ, యథావిధి = యథాశాస్త్రముగా, పశ్చిమామ్ = పశ్చిమదిక్కునకు సంబంధించిన, సంధ్యామ్ = సంధ్యను, ఉపాస్య = ఉపాసించి, ఆశ్రమపదమ్ = ఆశ్రమమును, ప్రవివేశ = ప్రవేశించెను. తమ్ = ఆ, ఋషిమ్ = ఋషిని, అభ్యవాదయత్ = నమస్కరించెను.

తా. లక్ష్మణసమేతుడైన రాముడు సాయంసంధ్యను యథావిధిగా ఉపాసించి, ఆ ఆశ్రమములోనికి ప్రవేశించి, ఆ ఋషీశ్వరునికి అభివాదసము చేసెను.

మూ. సమ్యక్ ప్రతిగృహీతశ్చ మునినా తేన రాఘవః, 71
న్యవసత్తాం నిశామేకాం ప్రాశ్య మూలఫలాని చ.

ప్ర. అ. రాఘవః = రాముడు, తేన మునినా = ఆ మునిచేత, సమ్యక్ = బాగుగా, ప్రతిగృహీతః = ప్రతిగ్రహింపబడినవాడై, మూలఫలాని = దుంపలను, పండ్లను, ప్రాశ్య = భుజించి, తామ్ = ఆ, ఏకామ్ = ఒక, నిశామ్ = రాత్రిని, న్యవసత్ = నివసించెను.

తా. అగస్త్యభ్రాతయైన ఆ ముని రాముణ్ణి గౌరవపురస్సరముగా ప్రతిగ్రహించెను. రాముడు మూలములు, ఫలములు భుజించి ఆ రాత్రి అక్కడనే గడపెను. 71

మూ. తస్యాం రాత్ర్యాం వ్యతీతాయాం విమలే సూర్యమణ్డలే, 72
భ్రాతరం తమగస్త్యస్య హ్యామన్త్రియత రాఘవః.

ప్ర. అ. తస్యాం రాత్ర్యామ్ = ఆ రాత్రి, వ్యతీతాయామ్ = గడచినది దగుచుండగా, సూర్యమణ్డలే = సూర్యమండలము, విమలే = నిర్మలమైనదగుచుండగా, రాఘవః = రాముడు, అగస్త్యస్య = అగస్త్యునియొక్క, భ్రాతరమ్ = సోదరుడైన, తమ్ = ఆ మునిని, ఆమన్త్రయత = పీడ్కొనెను.

తా. ఆ రాత్రి గడచి సూర్యుడు ప్రకాశించుచుండగా, రాముడు అగస్త్య సోదరు డైన ఆ ముని అనుమతి తీసికొనెను. 72

మూ. అభివాదయే త్వాం భగవన్ సుఖమధ్యుషితో నిశామ్, 73
ఆమన్త్రయే త్వాం గచ్ఛామి గురుం తే ద్రష్టుమగ్రజమ్.

ప్ర. అ. భగవన్=పూజ్యుడా ! నిశామ్=రాత్రిని, సుఖమ్=సుఖముగా, అధ్యుషితః = నివసించినాను. త్వామ్ = నిన్ను, అభివాదయే = నమస్కరించు చున్నాను. త్వామ్ = నిన్ను, ఆమన్త్రయామి=వీడ్కొలుపుచున్నాను. తే=నీకు, గురుమ్ = పూజ్యుడైన, అగ్రజమ్ = నీ అన్నగారిని, ద్రష్టుమ్ = చూచుటకు, గచ్ఛామి = వెళ్లుచున్నాను.

తా. మహర్షీ ! రాత్రి నీ ఆశ్రమములో సుఖముగా నివసించినాను. నీకు అభివాదనము చేసి నీ అనుమతి కోరుచున్నాను. నీకు పూజ్యుడు, అన్నగారు అయిన అగస్త్యమహర్షిని చూచుటకు వెళ్ళెదను. 73

మూ. గమ్యతామితి తేనోక్తో జగామ రఘునన్దనః, 74
యథోద్దిష్టేన మార్గేణ వనం తచ్చావలోకయన్.

ప్ర. అ. గమ్యతామ్ = వెళ్ళెదవుగాక, ఇతి = అని, తేన = ఆ మునిచేత, ఉక్తః = పలకబడిన, రఘునన్దనః = రాముడు, తత్ = ఆ, వనమ్ = వనమును, అవలోకయన్ = చూచుచు, యథోద్దిష్టేన = చెప్పబడిన, మార్గేణ=మార్గముచేత, జగామ = వెళ్లెను.

తా. "అట్లే వెళ్లుము"అని ఆ ముని పలుకగా రాముడు, ఆ వనమును చూచుచు, చెప్పిన మార్గమును అనుసరించి వెళ్లెను. 74

మూ. నీవారాన్ పనసాం స్తాలాం స్తిమిశాన్ వఞ్జులాన్ ధవాన్,
చిరిబిల్వాన్ మధూకాంశ్చ బిల్వానపి చ తిన్దుకాన్.

ప్ర. అ. నీవారాన్ = నెవరుధాన్యములను, పనసాన్=పనసవృక్షములను, తాలాన్ = తాటిచెట్లను, తిమిశాన్ = తినాసపుచెట్లను, వఞ్జులాన్ = పొగరచెట్లను, ధవాన్ = చండ్రచెటను, చిరిబిల్వాన్ = కానుగచెటను, మధూకాంశ్చ = ఇప్ప

చెట్లను, బిల్వానపి చ = మారేడుచెట్లను, తిన్దుకాన్ = తుమ్మికిచెట్లను (దదర్శ = చూచెను.)

తా. రాముడు ఆ వనమునందు నెవరుధాన్యములు, పనసవృక్షములు, తాటిచెట్లు, తినాసపుచెట్లు, పొగడచెట్లు, చంద్రచెట్లు, కానుగచెట్లు, ఇప్పచెట్లు, మారేడుచెట్లు, తిమ్మికిచెట్లు చూచెను. 75

మూ. పుష్పితాన్ పుష్పితాగ్రాభిర్లతాభిరనువేష్టితాన్, 76
దదర్శ రామః శతశస్తత్ర కాన్తారపాదపాన్.

హస్తిహస్తైర్విమృదితాన్ వానరైరుపశోభితాన్, 77
మత్తైః శకునిసంఘైశ్చ శతశశ్చ ప్రణాదితాన్.

ప్ర. అ. రామః = రాముడు, హస్తిహస్తైః = ఏనుగుల తొండములచేత, విమృదితాన్ = నలగకొట్టబడినవి, వానరైః = కోతులచేత, ఉపశోభితాన్ = ప్రకాశింపచేయబడినవి, మత్తైః = మదించిన, శతశః = వందలకొలది, శకునిసంఘైశ్చ = పక్షుల గుంపులచేత, ప్రణాదితాన్ = ధ్వనింపచేయబడినవి, పుష్పితాన్ = పుష్పించినవి, పుష్పితాగ్రాభిః = పుష్పించిన అగ్రభాగములు గల, లతాభిః = లతలచేత, అనువేష్టితాన్ = చుట్టబడినవి అయిన, శతశః = వందలకొలది, కాన్తారపాదపాన్ = అడవిచెట్లను, దదర్శ = చూచెను.

తా. రామునకు అక్కడ వందల కొలది పుష్పించిన అడవిచెట్లు కనబడెను. పుష్పించిన అగ్రభాగములు గల లతలు ఆ చెట్లకు చుట్టుకొని ఉండెను. వాటిని ఏనుగులు తొండములతో మర్దించుచుండెను. వాటి కొమ్మలపై కోతులుకూర్చుండెను. వందలకొలది పక్షుల గుంపులు మదించి ఆ చెట్లపై ధ్వని చేయుచుండెను. 76,77

మూ. తతోఽబ్రవీత్సమీపస్థం రామో రాజీవలోచనః, 78
పృష్ఠతోఽనుగతం వీరం లక్ష్మణం లక్ష్మివర్ధనమ్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రాజీవలోచనః = పద్మముల వంటి నేత్రములు గల, రామః = రాముడు, పృష్ఠతః = వెనుకనే, అనుగతమ్ = అనుసరించి వచ్చుచున్న, వీరమ్ = వీరుడైన, లక్ష్మివర్ధనమ్ = లక్ష్మిని వృద్ధి పొందించు,

సమీపస్థమ్ = సమీపమునం దున్న, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి అబ్రవీత్ = పలికెను.

తా. పిమ్మట పద్మముల వంటి నేత్రములు గల రాముడు, తన వెనుకనే వచ్చుచు సమీపమునం దున్న, వీరుడు, లక్ష్మిని వృద్ధిపొందించువాడు అయిన లక్ష్మణునితో ఇట్లు పలికెను. 78

మూ. స్నిగ్ధపత్రా యథా వృక్షా యథా క్షాన్తా మృగద్విజాః, 79
ఆశ్రమో నాతిదూరస్థో మహర్షేర్భావితాత్మనః.

ప్ర. అ. వృక్షాః = వృక్షములు, యథా = ఎట్లు, స్నిగ్ధపత్రాః = నున్నని ఆకులు గలవో, మృగద్విజాః = మృగములు, పక్షులు, యథా = ఎట్లు, క్షాన్తాః = ఓర్పుతో ఉన్నవో, దీనిని పట్టి, భావితాత్మనః = పవిత్రముచేసికొనబడిన మనస్సు గల, మహర్షేః = మహర్షియొక్క, ఆశ్రమః = ఆశ్రమము, నాతిదూరస్థః = సమీపమునందే ఉన్నది.

తా. ఇక్కడ చెట్ల ఆకులు చక్కగా నిగనిగ లాడుచున్నవి. మృగములు పక్షులు కూడ పరస్పరస్నేహభావముతో ఉన్నవి. దీనిని పట్టి పరిశుద్ధ మైన మనస్సుగల అగస్త్యమహాముని ఆశ్రమము దగ్గరనే ఉన్న దని తోచుచున్నది.

మూ. అగస్త్య ఇతి విఖ్యాతో లోకే స్వేనైవ కర్మణా, 80
ఆశ్రమో దృశ్యతే తస్య పరిశ్రాన్తశ్రమాపహః.

ప్ర. అ. స్వేన = తన సంబంధమైన, కర్మణైవ = కర్మచేతనే, లోకే = లోకమునందు, అగస్త్యః ఇతి = అగస్త్యు డని (అగమును అనగా పర్వతమును నిలిపినవాడు అని), విఖ్యాతః = ఏ ముని ప్రసిద్ధుడో, తస్య = ఆ మునియొక్క పరిశ్రాన్తశ్రమాపహః = అలసినవారి అలసటను తొలగించు, ఆశ్రమః = ఆశ్రమము, దృశ్యతే = కనబడుచున్నది.

తా. వింధ్యపర్వతమును పైకి ఎగరకుండా అపుచేయుట అను పనిచేత ఏ మహాముని లోకములో "అగస్త్యుడు" అని ప్రసిద్ధి గాంచినాడో అట్టి మహాముని ఆశ్రమము, అదిగో, కనబడుచున్నది. ఇది అలసినవారి అలసటను తొలగించును.

మూ. ప్రాజ్యధూమాకులవనశ్చీరమాలాపరిష్కృతః, 81
ప్రశాన్తమృగయూథశ్చ నానాశకునినాదితః.

ప్ర. అ. ప్రాజ్యధూమాకులవనః = అధికమైన పొగచేత వ్యాకులమైన వనము గలది, చీరమాలాపరిష్కృతః = నారచీరల పంక్తిచే అలంకరించబడినది, ప్రశాన్తమృగయూథశ్చ = ప్రశాంతముగా ఉన్న మృగముల గుంపులు గలది, నానాశకునినాదితః = అనేకవిధములైన పక్షులచేత ధ్వనింపచేయబడినది అయిన (ఆశ్రమము కనబడుచున్నది.)

తా. ఈ ఆశ్రమమునకు దగ్గర నున్న వనము అధికమైన ధూమముచేత వ్యాకులముగా ఉన్నది. నారచీరల పంక్తులచేత అలంకరించిన ట్లున్నది. ఇక్కడ ఉన్న మృగముల గుంపులు ప్రశాంతముగా ఉన్నవి. అనేకపక్షులు ధ్వని చేయుచున్నవి. 81

మూ. తస్యేదమాశ్రమపదం ప్రభావాద్యస్య రాక్షసైః, 82
దిగియం దక్షిణా త్రాసాద్దృశ్యతే నోపభుజ్యతే.

ప్ర. అ. యస్య = ఏవనియొక్క, ప్రభావాత్ = ప్రభావమువలన, రాక్షసైః=రాక్షసులచేత, ఇయమ్=ఈ, దక్షిణా దిక్=దక్షిణదిక్కు, త్రాసాత్=భయమువలన, దృశ్యతే=చూడబడుచున్నదో, నోపభుజ్యతే=అనుభవించబడుట లేదో, తస్య=అట్టి అగస్త్యునియొక్క, ఆశ్రమపదమ్=ఆశ్రమస్థానము, ఇదమ్=ఇదే.

తా. ఏ అగస్త్యమహర్షి ప్రభావమువలన రాక్షసులు ఈ దక్షిణదిక్కు వైపు భయపడుచు చూచుచుందురో, ఇక్కడ నివసించుటకు సాహసించరో అట్టి అగస్త్య మహాముని ఆశ్రమము ఇదే. 82

మూ. యదా ప్రభృతి చాక్రాన్తా దిగియం పుణ్యకర్మణా, 83
తదా ప్రభృతి నిర్వైరాః ప్రశాన్తా రజనీచరాః.

ప్ర. అ. యదా ప్రభృతి = ఎప్పుడు మొదలుకొని, పుణ్యకర్మణా = పుణ్యమైన కర్మలు గల ఈ అగస్త్యునిచేత, ఇయం దిక్ = ఈ దిక్కు, ఆక్రాన్తా

ఆక్రమించబడినదో, తదా ప్రభృతి = అది మొదలు, రజనీచరాః = రాక్షసులు, నిర్వైరాః = వైరము లేనివారై, ప్రశాన్తాః = శాంతముగా ఉన్నారు.

. తా పుణ్యాత్ముడైన ఈ అగస్త్యముని నివసించుచున్నప్పటినుండి ఈ దక్షిణ దిగ్దేశమునం దున్న రాక్షసులు వైరము విడచి ప్రశాంతముగా ఉన్నారు. 83

మూ. నామ్నా చేయం భగవతో దక్షిణా దిక్ప్రదక్షిణా, 84
ప్రథితా త్రిషు లోకేషు దుర్ధర్షా క్రూరకర్మభిః.

ప్ర. అ. ప్రదక్షిణా = చాల సామర్థ్యము గల, ఇయమ్ = ఈ, దక్షిణా దిక్ = దక్షిణదిక్కు, భగవతః = పూజ్యుడైన ఈ అగస్త్యమహర్షియొక్క, నామ్నా = పేరుతో, త్రిషు = మూడు, లోకేషు = లోకములందు, ప్రథితా = ప్రసిద్ధమైనదై, క్రూరకర్మభిః = క్రూరమైన కర్మ కలవారిచేత, దుర్ధర్షా = ఎదిరింప శక్యము కానిది అయి ఉన్నది.

తా. మంచి సామర్థ్యము గల ఈ దక్షిణ దిక్కు, పూజ్యుడైన ఈ అగస్త్య మహాముని పేరుతో మూడు లోకములలోను ప్రసిద్ధి పొంది, క్రూరులచేత ఎదిరింప శక్యముకాకుండ ఉన్నది. 84

మూ. మార్గం నిరోద్ధుం నిరతో భాస్కరస్యాచలోత్తమః, 85
నిదేశం పాలయన్యస్య విన్ధ్యశ్శైలో న వర్ధతే.
అయం దీర్ఘాయుషస్తస్య లోకే విశ్రుతకర్మణః, 86
అగస్త్యస్యాశ్రమః శ్రీమాన్వినీతజనసేవితః.

ప్ర. అ. శ్రీమాన్ = శోభ కలది, వినీతజనసేవితః = వినయవంతులైన జనులచే సేవించబడినది అయిన, అయమ్ = ఈ ఆశ్రమము, భాస్కరస్య = సూర్యునియొక్క, మార్గమ్ = మార్గమును, నిరోద్ధుమ్ = అడ్డుకొనుటకు, నిరతః = ఆసక్తి గల, అచలోత్తమః = పర్వతములలో ఉత్తమ అయిన, విన్ధ్యః = వింధ్య పర్వతము, యస్య = ఎవనియొక్క, నిదేశమ్ = ఆజ్ఞను, పాలయన్ = పాలించుచు, న వర్ధతే = వృద్ధి పొందుటలేదో, తస్య = అట్టి, లోకే = లోకమునందు, విశ్రుతకర్మణః = ప్రసిద్ధమైన పనులు కలవాడు, దీర్ఘాయుషః = దీర్ఘాయుర్దాయవంతుడు అయిన, అగస్త్యస్య = అగస్త్యుని యొక్క, ఆశ్రమః = ఆశ్రమము.

తా. శోభాయుక్తము, వినయవంతులైన జనుల నివాసస్థానము అయిన ఈ ఆశ్రమము లోకములో ప్రసిద్ధమైన పనులు చేసినవాడు, దీర్ఘాయుర్దాయవంతుడు అయిన అగస్త్యమహాముని ఆశ్రమము. ఈ మహాముని ఆజ్ఞను పాలించుచునే, సూర్యుని మార్గమును అడ్డుకొనుటకై పెరుగుటకు ప్రారంభించిన పర్వతశ్రేష్ఠమైన వింధ్యము పెరగకుండా ఆగిపోయినది. 85, 86

మూ. ఏష లోకార్చితః సాధుర్హితే నిత్యరతః సతామ్, 87
అస్మానధిగతానేష శ్రేయసా యోజయిష్యతి.

ప్ర. అ. లోకార్చితః = లోకములచేత పూజింపబడినవాడు, సాధుః = సత్పురుషుడు అయిన, ఏషః = ఈ మహాముని, సతామ్ = సత్పురుషులయొక్క, హితే = హితమునందు, నిత్యరతః = నిత్యము ఆసక్తి కలవాడు. ఏషః = ఇతడు, అధిగతాన్ = దగ్గరకు చేరిన, అస్మాన్ = మనలను, శ్రేయసా = శ్రేయస్సుతో యోజయిష్యతి = కూర్చగలడు.

తా. ఈ అగస్త్యమహాముని జనులచే పూజింపబడినవాడు. సత్పురుషుడు. సత్పురుషులకు హితము చేయుటయందు ఆసక్తి కలవాడు. మనము ఆయన వద్దకు వెళ్ళినప్పుడు మనకు శ్రేయస్సు కలిగించగలడు. 87

మూ. ఆరాధయిష్యామ్యత్రాహమగస్త్యం తం మహామునిమ్, 88
శేషం చ వనవాసస్య సౌమ్య వత్స్యామ్యహం ప్రభో.

ప్ర. అ. ప్రభో = సమర్థుడా! వత్స = వత్సా! అహమ్ = నేను, అత్ర = ఇక్కడ, తమ్ = ఆ, మహామునిమ్ = మహామునియైన, అగస్త్యమ్ = అగస్త్యుణ్ణి, ఆరాధయిష్యామి = సేవించెదను. వనవాసస్య = వనవాసముయొక్క, శేషమ్ = మిగిలిన భాగమును, అహమ్ = నేను, వత్స్యామి = ఇక్కడ నివసించెదను.

తా. సమర్థుడవైన ఓ! లక్ష్మణా! నేను మహామునియైన అగస్త్యుని సేవించుచు మిగిలిన వనవాసకాలమును ఇక్కడనే గడపెదను. 88

మూ. అత్ర దేవాః సగన్ధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః, 89
అగస్త్యం నియతాహారం సతతం పర్యుపాసతే.

ప్ర. అ. సగన్ధర్వాః = గంధర్వులతో కూడిన, దేవాః = దేవతలు, సిద్ధాశ్చ=సిద్ధులు, పరమర్షయః=గొప్ప ఋషీశ్వరులు, అత్ర = ఇక్కడ, నియతాహారమ్ = నియతమైన, (నియమబద్ధమైన) ఆహారము గల, అగస్త్యమ్ =అగస్త్యుణ్ణి, సతతమ్ = ఎల్లప్పుడు, పర్యుపాసతే= సేవించుచుందురు.

తా. దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు ఈ ఆశ్రమమునకు వచ్చి, నియమానుసారము ఆహారము భుజించు ఈ అగస్త్యమహాముని సేవించుచుందురు. 89

మూ. నాత్ర జీవేన్మృషావాదీ క్రూరో వా యది వా శఠః, 90
నృశంసః కామవృత్తో వా మునిరేష తథావిధః.

ప్ర. అ. మృషావాదీ = అసత్యము పలుకువాడు కాని, క్రూరో వా = క్రూరుడు గాని, యది వా = లేక, శఠః=వంచకుడు, నృశంసః=మానవులను పీడించువాడు గాని, కామవృత్తో వా= స్వేచ్ఛగా ప్రవర్తించువాడు గాని, అత్ర = ఈ ఆశ్రమమునందు, న జీవేత్=జీవించదు. ఏషః మునిః= ఈ ముని, తథావిధః = అట్టివాడు.

తా. అసత్యము పలికేవాడు కాని, క్రూరుడు కాని, వంచకుడు గాని, మానవులను హింసించేవాడు కాని, స్వేచ్ఛగా ప్రవర్తించేవాడు గాని ఈ ఆశ్రమములో జీవించజాలడు. ఈ మహాముని ప్రభావము అలాంటిది. 90

మూ. అత్ర దేవాశ్చ యక్షాశ్చ నాగాశ్చ పతగైః సహ, 91
వసన్తి నియతాహారా ధర్మమారాధయిష్ణవః.

ప్ర. అ. దేవాశ్చ = దేవతలు, యక్షాశ్చ = యక్షులు, పతగైశ్చ సహ= పక్షులతో కూడ, నాగాశ్చ=నాగులు, నియతాహారాః = నియమిత మైన ఆహారము కలవారై, ధర్మమ్ = ధర్మమును, ఆరాధయిష్ణవః = ఆరాధించువారై, అత్ర = ఈ ఆశ్రమమునందు, వసన్తి = నివసించుచుందురు.

తా. దేవతలు, యక్షులు, నాగులు, పక్షులు కూడ నియమపూర్వకముగ, ఆహారమును భుజించుచు, (ఇంద్రియార్థములను అనుభవించుచు) ధర్మారాధన తత్పరులై నివసించుచుందురు. 91

మూ. అత్ర సిద్ధా మహాత్మానో విమానైః సూర్యసంనిభైః, 92
త్యక్తదేహా నవైర్దేహైః స్వర్యాతాః పరమర్షయః.

ప్ర. అ. మహాత్మానః = మహాత్ములైన, పరమర్షయః = మహర్షులు, అత్ర = ఈ ఆశ్రమమునందు, సిద్ధాః = తపఃసిద్ధులై, త్యక్తదేహాః = విడువబడిన దేహములు కలవారై, నవైః = నూతనములైన, దేహైః = దేహములతో, సూర్యసంనిభైః = సూర్యునితో సమానములైన, విమానైః = విమానములచేత, స్వర్యాతాః = స్వర్గమునకు వెళ్ళినారు.

తా. మహాత్ములైన మహర్షులు ఈ ఆశ్రమములో తపస్సిద్ధి సంపాదించుకొని, తమ పార్థివదేహములు విడచి నూతనములైన దేహములు ధరించి సూర్యుడువలె ప్రకాశించుచున్న విమానము లెక్కి స్వర్గమునకు వెళ్ళిరి. 92

మూ. యక్షత్వమమరత్వం చ రాజ్యాని వివిధాని చ, 93
అత్ర దేవాః ప్రయచ్ఛన్తి భూతైరారాధితాః శుభైః.

ప్ర. అ. శుభైః = పుణ్యాత్ములైన, భూతైః = ప్రాణులచేత, అత్ర = ఈ ఆశ్రమమమునందు, ఆరాధితాః = ఆరాధించబడిన, దేవాః = దేవతలు, యక్షత్వమ్ = యక్షత్వమును, అమరత్వం చ = దేవత్వమును, వివిధాని = అనేక విధములైన, రాజ్యాని చ = రాజ్యములను, ప్రయచ్ఛన్తి = ఇచ్చుచుందురు.

తా. పుణ్యాత్ములైన ఈ ఆశ్రమములో నివసించేవారు దేవతలను ఆరాధించినచో వారికి దేవతలు యక్షత్వమును, దేవత్వమును, అనేకవిధములైన రాజ్యములను ప్రసాదించుచుందురు. 93

మూ. ఆగతాః స్మాశ్రమపదం సౌమిత్రే ప్రవిశాగ్రతః, 94
నివేదయేహ మాం ప్రాప్తమృషయే సీతయా సహ.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ఏకాదశః సర్గః.

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా! ఆశ్రమపదమ్ = ఆశ్రమస్థానమును గూర్చి, ఆగతాః స్మ = వచ్చినాము. అగ్రతః = ముందు, ప్రవిశ = ప్రవే

శించుము. మామ్ = నన్ను, సీతయా సహ = సీతతో కూడ, ఇహ = ఇక్కడికి ప్రాప్తమ్ = వచ్చినవానినిగా, ఋషయే = అగస్త్యమహర్షికి, నివేదయ = తెలుపుము.

తా. లక్ష్మణా! ఆశ్రమము చేరినాము. నీవు ముందు ప్రవేశించి, నేను సీతా వచ్చినా మని అగస్త్యమహర్షికి తెలుపుము. 94

"బాలానం దిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో పదకొండవ సర్గ సమాప్తము.

అథ ద్వాదశః సర్గః

[సీతారామలక్ష్మణులు అగస్త్యాశ్రమములో ప్రవేశించుట. అగస్త్యుడు వారిని గౌరవించుట. రామునకు దివ్యాస్త్రము లిచ్చుట].

మూ. స ప్రవిశ్యాశ్రమపదం లక్ష్మణో రాఘవానుజః,
అగస్త్యశిష్యమాసాద్య వాక్యమేతదువాచ హ. 1

ప్ర. అ. రాఘవానుజః = రాముని తమ్ముడైన, సః లక్ష్మణః = ఆ లక్ష్మణుడు, ఆశ్రమపదమ్ = ఆశ్రమమును, ప్రవిశ్య = ప్రవేశించి, అగస్త్యశిష్యమ్ = అగస్త్యుని శిష్యుని, ఆసాద్య = సమీపించి, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యమును ఉవాచ హ = పలికెను.

తా. రాముని తమ్ముడు, లక్ష్మణుడు ఆశ్రమములో ప్రవేశించి, అగస్త్య మహాముని శిష్యుని వద్దకు వెళ్ళి ఇట్లు పలికెను. 1

మూ. రాజా దశరథో నామ జ్యేష్ఠస్తస్య సుతో బలీ,
రామః ప్రాప్తో మునిం ద్రష్టుం భార్యయా సహ సీతయా.

ప్ర. అ. దశరథో నామ = దశరథు డను పేరు గల, రాజా = రాజు ఉండెను. తస్య = ఆ దశరథుని యొక్క, జ్యేష్ఠః సుతః = జ్యేష్ఠకుమారుడు, బలీ = బలశాలి అయిన, రామః = రాముడు, భార్యయా = భార్య అయిన, సీతయా సహ = సీతతో కూడ, మునిమ్ = అగస్త్యమహామునిని, ద్రష్టుమ్ = చూచుటకు, ప్రాప్తః = వచ్చినాడు.

తా. దశరథమహారాజు పెద్ద కుమారుడు, మహాబలశాలీ అయిన రాముడు, భార్య యైన సీతతో, అగస్త్యమహామునిని చూచుటకై వచ్చినాడు. 2

మూ. లక్ష్మణో నామ తస్యాహం భ్రాతా త్వవరజో హితః,
అనుకూలశ్చ భక్తశ్చ యది తే శ్రోత్రమాగతః. 3

ప్ర. అ. అహం తు = నేనైతే, తస్య = ఆ రామునియొక్క, అవరజః = వెనుక పుట్టిన, లక్ష్మణో నామ = లక్ష్మణు డను పేరు గల, భ్రాతా = సోదరుడను. హితః = హితుడను. అనుకూలశ్చ = అనుకూలముగా ఉండువాడను. భక్తశ్చ = భక్తుడను. తే = నీయొక్క, శ్రోత్రమ్ = చెవిని, ఆగతో యది = పొంది ఉండవచ్చును.

తా. నేను ఆ రాముని తమ్ముడ నైన లక్ష్మణుడను. అతని హితము కోరువాడను. సర్వదా అతనికి అనుకూలముగా ప్రవర్తించు భక్తుడను. నీవు విని యుండవచ్చును. 3

మూ. తే వయం వనమత్యుగ్రం ప్రవిష్టాః పితృశాసనాత్,
ద్రష్టుమిచ్ఛామహే సర్వే భగవన్తం నివేద్యతామ్. 4

ప్ర. అ. తే వయమ్ = అట్టి మేము, పితృశాసనాత్ = తండ్రి ఆజ్ఞవలన, అత్యుగ్రమ్ = చాల భయంకరమైన, వనమ్ = వనమును, ప్రవిష్టాః = ప్రవేశించినాము. సర్వే = మేమందరము, భగవన్తమ్ = అగస్త్యమహామునిని, ద్రష్టుమ్ = చూచుటకు, ఇచ్ఛామహే = కోరుచున్నాము. నివేద్యతామ్ = ఆయనకు తెలుపబడుగాక.

తా. మేము తండ్రిగారి ఆజ్ఞచేత చాల భయంకరమైన అరణ్యములోనికి ప్రవేశించితిమి. మే మందరము అగస్త్యమహాముని దర్శనము చేయ గోరుచున్నాము. ఆయనకు తెలుపుము. 4

మూ. తస్య తద్వచనం శ్రుత్వా లక్ష్మణస్య తపోధనః,
తథేత్యుక్త్వాగ్నిశరణం ప్రవివేశ నివేదితుమ్. 5

ప్ర. అ. తపోధనః = అగస్త్యశిష్యుడైన ఆ ముని, తస్య లక్ష్మణస్య = ఆ లక్ష్మణుని యొక్క, తత్ వచనమ్ = ఆ మాటను, శ్రుత్వా = విని, తథేతి = అట్లే చెప్పెదను అని, ఉక్త్వా = పలికి, నివేదితుమ్ = తెలుపుటకు, అగ్నిశరణమ్ = అగ్నిగృహమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. లక్ష్మణుని మాటలు విని ఆ అగస్త్యశిష్యుడు "అట్లే చెప్పెదను" అని పలికి రాముని రాకను అగస్త్యునకు తెలుపుటకై అగ్నిగృహములోనికి వెళ్లెను. 5

మూ. స ప్రవిశ్య మునిశ్రేష్ఠం తపసా దుష్ప్రధర్షణమ్,
కృతాఞ్జలిరువాచేదం రామాగమనమఞ్జసా. 6
యథోక్తం లక్ష్మణేనైవ శిష్యోఽగస్త్యస్య సంమతః.

ప్ర. అ. అగస్త్యస్య = అగస్త్యునకు, సంమతః = ఇష్టుడైన, శిష్యః = శిష్యుడైన, సః = ఆ ముని, అఞ్జసా = శీఘ్రముగ, ప్రవిశ్య = ప్రవేశించి, కృతాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడై, లక్ష్మణేన=లక్ష్మణునిచేత, యథోక్తమేవ= ఎట్లు చెప్పబడినదో ఆ విధముగ, తపసా = తపస్సుచేత, దుష్ప్రధర్షణమ్ = ఎదిరింప శక్యము కాని, మునిశ్రేష్ఠమ్ = మునిశ్రేష్ఠుని గూర్చి, రామాగమనమ్= రాముని రాకను గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. అగస్త్యుని ప్రియశిష్యుడైన ఆ ముని శీఘ్రముగా అగ్నిగృహములో ప్రవేశించి, అంజలి ఘటించి, ఎవ్వరిచేత ఎదిరింప శక్యము కాని తపోబలము గల ఆ మునిశ్రేష్ఠునితో, లక్ష్మణుడు చెప్పిన విధముగ, రాముని రాకను గూర్చి ఇట్లు పలికెను. 6

మూ. పుత్రౌ దశరథస్యేమౌ రామో లక్ష్మణ ఏవ చ, 7
ప్రవిష్టావాశ్రమపదం సీతయా సహ భార్యయా.

ప్ర. అ. రామః = రాముడు, లక్ష్మణ ఏవ చ = లక్ష్మణుడు అను, దశరథస్య = దశరథునియొక్క, ఇమౌ = ఈ, పుత్రౌ = పుత్రులు, భార్యయా = రాముని భార్యయైన, సీతయా సహ = సీతతో కూడ, ఆశ్రమపదమ్ = ఆశ్రమమును, ప్రవిష్టౌ = ప్రవేశించినారు.

తా. దశరథుని పుత్రులైన ఈ రామలక్ష్మణులు, సీతతో కూడ ఆశ్రమమునకు వచ్చి ఉన్నారు. 7

మూ. ద్రష్టుం భవన్తమాయాతౌ శుశ్రూషార్థమరిందమౌ, 8
యదత్రానన్తరం తత్త్వమాజ్ఞాపయితుమర్హసి.

ప్ర. అ. అరిందమౌ = శత్రుసంహారకులైన ఆ రామలక్ష్మణులు, భవన్తమ్ = నిన్ను, ద్రష్టుమ్ = చూచుటకు, శుశ్రూషార్థమ్=నిన్ను సేవించుటకు, ఆయాతౌ = వచ్చినారు, అత్ర = ఈ విషయమునందు, యత్ = ఏది, అనన

రమ్=వెంటనే చేయ దగినదో, తత్=దానిని, త్వమ్=నీవు, ఆజ్ఞాపయితుమ్= ఆజ్ఞాపించుటకు, అర్హసి = తగి యున్నావు.

తా. శత్రుసంహారకు లైన ఆ రామలక్ష్మణులు నీ దర్శనముకొరకు, నీ సేవకొరకు వచ్చి ఉన్నారు. ఇప్పు డేమి చేయవలెనో ఆజ్ఞాపింపుము. 8

మూ. తతః శిష్యాదుపశ్రుత్య ప్రాప్తం రామం సలక్ష్మణమ్, 9
వైదేహీం చ మహాభాగామిదం వచనమబ్రవీత్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, శిష్యాత్ = శిష్యునినుండి, సలక్ష్మణమ్= లక్ష్మణునితో కూడిన, రామమ్ = రాముణ్ణి, ప్రాప్తమ్ = వచ్చినవానినిగా, ఉప శ్రుత్య = విని, మహాభాగామ్ = మహా భాగ్యవంతురాలైన, వైదేహీం చ = సీతను కూడ వచ్చిన దానినిగా విని, ఇదం వచనమ్ = ఈ వచనమును, అబ్రవీత్ = పలికెను

తా. అగస్త్యుడు లక్ష్మణసమేతుడైన రాముడు, మహాభాగ్యవంతురాలైన సీత వచ్చినా రని శిష్యునినుండి విని, ఇట్లు పలికెను. 9

మూ. దిష్ట్యా రామశ్చిరస్యాద్య ద్రష్టుం మాం సముపాగతః,10
మనసా కాఙ్క్షితం హ్యస్య మయా హ్యాగమనం ప్రతి.

ప్ర. అ. దిష్ట్యా = భాగ్యవశముచేత, రామః = రాముడు, చిరస్య = చిర కాలమునకు, మామ్ = నన్ను, ద్రష్టుమ్ = చూచుటకు, అద్య=ఇప్పుడు, సముపా గతః = వచ్చినాడు. అస్య = ఈతనియొక్క, ఆగమనం ప్రతి = ఆగమనమును గూర్చి, మయా = నాచేత, మనసా = మనస్సుచేత, కాఙ్క్షితం హి = కోరబడినది కదా.

తా. అదృష్టవశముచేత రాముడు ఇంత కాలమునకు నన్ను చూచుటకై నేడు వచ్చినాడు. ఆతడు వచ్చిన బాగుండు నని నేను కూడ మనస్సులో అను కొనుచున్నాను. 10

మూ. గమ్యతాం సత్కృతో రామః సభార్యః సహలక్ష్మణః,11
ప్రవేశ్యతాం సమీపం మే కిం చాసౌ న ప్రవేశితః.

ప్ర. అ. గమ్యతామ్ = వెళ్ళెదవుగాక. సభార్యః = భార్యతో కూడిన, సహలక్ష్మణః = లక్ష్మణునితో కూడిన, రామః = రాముడు, సత్కృతః = ఆదరించబడినవాడై, మే = నాయొక్క, సమీపమ్ = సమీపమును, ప్రవేశ్యతామ్ = ప్రవేశపెట్టబడుగాక, అసౌ = ఇతడు, కిమ్ = ఎందువలన, న ప్రవేశితః = ప్రవేశపెట్టబడలేదు ?

తా. వెంటనే వెళ్ళి భార్యతోను, లక్ష్మణునితోను కలిసి వచ్చిన ఆ రాముణ్ణి గౌరవించి, నా దగ్గరకు తీసికొని రమ్ము. నాకు తెలుపకుండగనే ఎందుకు తీసికొని రాలేదు ? 11

మూ. ఏవముక్తస్తు మునినా ధర్మజ్ఞేన మహాత్మనా, 12
అభివాద్యాబ్రవీచ్ఛిష్యస్తథేతి నియతాఞ్జలిః.

ప్ర. అ. ధర్మజ్ఞేన = ధర్మములు తెలిసినవాడు, మహాత్మనా = మహాత్ముడూ అయిన, మునినా = మునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః=పలకబడిన, శిష్యః = శిష్యుడు, నియతాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడై, అభివాద్య = నమస్కరించి, తథేతి = అట్లే చేసెదను అని, అబ్రవీత్ = పలికెను.

తా. ఆ శిష్యుడు ధర్మములు తెలిసినవాడు, మహాత్ముడు అయిన అగస్త్య మహాముని మాటలు విని, అంజలి ఘటించి- "అట్లే చేసెదను"అని పలికెను. 12

మూ. తతో నిష్క్రమ్య సంభ్రాన్తః శిష్యో లక్ష్మణమబ్రవీత్. 13
క్వాసౌ రామో మునిం ద్రష్టుమేతు ప్రవిశతు స్వయమ్.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, శిష్యః=శిష్యుడు, సంభ్రాన్తః=తొందరపడుచున్నవాడై, నిష్క్రమ్య = బైటకు వెళ్ళి, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను. అసౌ = ఈ, రామః=రాముడు, క్వ = ఎక్కడ ఉన్నాడు? మునిమ్ = మునిని, ద్రష్టుమ్ = చూచుటకు, ఏతు = వచ్చుగాక. స్వయమ్ = స్వయముగనే, ప్రవిశతు = ప్రవేశించుగాక.

తా. పిమ్మట శిష్యుడు తొందరగా బైటకు వచ్చి లక్ష్మణునితో ఇట్లు పలికెను. "రాము డెక్కడ ఉన్నాడు? మునిని చూచుటకు ఆతడె లోనికి వెళ్ళవచ్చును; ఇతరుల అనుమతి అవసరము లేదు". 13

మూ. తతో గత్వాऽऽశ్రమద్వారం శిష్యేణ సహ లక్ష్మణః, 14
దర్శయామాస కాకుత్థ్సం సీతాం చ జనకాత్మజామ్.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, లక్ష్మణః = లక్ష్మణుడు, శిష్యేణ సహ = శిష్యునితో కూడ, ఆశ్రమద్వారమ్ = ఆశ్రమద్వారమును గూర్చి, గత్వా = వెళ్ళి, కాకుత్థ్సమ్ = రాముణ్ణి, జనకాత్మజామ్ = జనకుని కూతురైన, సీతాం చ = సీతను, దర్శయామాస = చూపించెను.

తా. పిమ్మట లక్ష్మణుడు, శిష్యునితో కలిసి ఆశ్రమద్వారము వద్దకు వెళ్ళి అక్కడ ఉన్న రాముణ్ణి, జనకరాజపుత్రియైన సీతను చూపెను. 14

మూ. తం శిష్యః ప్రశ్రితో వాక్యమగస్త్యవచనం బ్రువన్,
ప్రావేశయద్యథాన్యాయం సత్కారార్హం సుసత్కృతమ్.

ప్ర. అ. శిష్యః = శిష్యుడు, ప్రశ్రితః = వినయవంతుడై, అగస్త్యవచనమ్ = అగస్త్యుని వచనమునుగా, వాక్యమ్ = వాక్యమును, బ్రువన్ = పలుకుచు, సత్కారార్హమ్ = సత్కరించుటకు తగిన, సుసత్కృతమ్ = బాగుగా సత్కరించబడిన, తమ్ = ఆ రాముణ్ణి, యథాన్యామ్ = న్యాయానుసారముగా, ప్రావేశయత్ = ప్రవేశపెట్టెను.

తా. ఆ శిష్యుడు సవినయముగా, అగస్త్యుడు చెప్పిన మాటలు చెప్పి, సత్కారములకు తగిన ఆ రాముణ్ణి, బాగుగా సత్కరించి, న్యాయానుసారముగా ఆశ్రమములోనికి ప్రవేశపెట్టెను. 15

మూ. ప్రవివేశ తతో రామః సీతయా సహలక్ష్మణః, 16
ప్రశాన్తహరిణాకీర్ణమాశ్రమం హ్యవలోకయన్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రామః = రాముడు, సీతయా = సీతతో, సహలక్ష్మణః = లక్ష్మణునితో కూడినవాడై, ప్రశాన్తహరిణాకీర్ణమ్ = శాంతమైన లేళ్లతో నిండిన, ఆశ్రమమ్ = ఆశ్రమమును, అవలోకయన్ = చూచుచు, ప్రవివేశ = ప్రవేశించెను.

మూ. స తత్ర బ్రహ్మణః స్థానమగ్నేః స్థానం తథైవ చ, 17
విష్ణోః స్థానం తథేన్ద్రస్య స్థానం చైవ వివస్వతః,

సోమస్థానం భగస్థానం స్థానం కౌబేరమేవ చ, 18
ధాతుర్విధాతుః స్థానే చ వాయోః స్థానం తథైవ చ,

నాగరాజస్య చ స్థానమనన్తస్య మహాత్మనః, 19
స్థానం తథైవ గాయత్ర్యా వసూనాం స్థానమేవ చ,

స్థానం చ పాశహస్తస్య వరుణస్య మహాత్మనః, 20
కార్తికేయస్య చ స్థానం ధర్మస్థానం చ పశ్యతి.

ప్ర. అ. సః = ఆ రాముడు, తత్ర = ఆ ఆశ్రమమునందు, బ్రహ్మణః = బ్రహ్మయొక్క, స్థానమ్ = స్థానమును, తథైవ చ = మరియు, అగ్నేః = అగ్నియొక్క, స్థానమ్ = స్థానమును, విష్ణోః = విష్ణువుయొక్క, స్థానమ్ = స్థానమును, తథా = మరియు, ఇన్ద్రస్య = ఇంద్రునియొక్క స్థానమును, వివస్వతః = సూర్యునియొక్క, స్థానం చైవ = స్థానమును, సోమస్థానమ్ = సోముని స్థానమును, భగస్థానమ్ = భగుని స్థానమును, కౌబేరమ్ = కుబేరుని సంబంధమైన, స్థానమేవ చ = స్థానమును, ధాతుః = ధాతయొక్క, విధాతుః = విధాతయొక్క, స్థానే చ = స్థానములను, తథైవ చ = మరియు, వాయోః = వాయువుయొక్క, స్థానమ్ = స్థానమును, నాగరాజస్య = నాగరాజైన, మహాత్మనః = మహాత్ముడైన, అనన్తస్య = అనంతునియొక్క, స్థానమ్ = స్థానమును, తథైవ = మరియు, గాయత్ర్యాః = గాయత్రియొక్క, స్థానమ్ = స్థానమును, వసూనామ్ = వసువులయొక్క, స్థానమేవ చ = స్థానమును, పాశహస్తస్య = పాశము హస్తమునందు గల, మహాత్మనః = మహాత్ముడైన, వరుణస్య = వరుణునియొక్క, స్థానం చ = స్థానమును, కార్తికేయస్య = కుమారస్వామియొక్క, స్థానం చ = స్థానమును, ధర్మస్థానం చ = యమధర్మరాజుయొక్క స్థానము, పశ్యతి = చూచెను.

రాముడు ఆ ఆశ్రమమునందు, బ్రహ్మ, అగ్ని, విష్ణువు, ఇంద్రుడు, వివస్వంతుడు, సోముడు, భగుడు, కుబేరుడు, ధాత, విధాత, వాయువు, నాగరాజు మహాత్ముడు అయిన ఆదిశేషుడు, గాయత్రి, వసువులు, పాశములు హస్తమునందు

గల మహాత్ముడైన వరుణుడు, కుమారస్వామి, యమధర్మరాజా— వీరి స్థానములను చూచుచు వెళ్లెను.

వి. రామాయణంలో వాల్మీకి అత్రి-భరద్వాజ-శరభంగ-సుతీక్ష్ణాదిమునుల ఆశ్రమాలను వర్ణించినాడు కాని ఇక్కడ వర్ణించినట్లుగా ఆ యా దేవతల స్థానాలు ఉన్నట్లు వర్ణించలేదు. ఈ ఘట్టంలో కూడా, అనేకఇతరఘట్టాలలో వలెనే, వాల్మీకి హృదయాన్ని విశదీకరిస్తూ గోవిందరాజులు ఇవన్నీ అగస్త్యుడు పూజించే ఆయా దేవతలను స్థాపించిన స్థానా లని వాఖ్యానించి శివుడు పూజానర్హుడు గాన ఆతని స్థానం చెప్పలే దనీ, కొందరు ఇప్పుడు శివుణ్ణి పూజిస్తున్నా రంటే అందుకు వారి తామస శాస్త్రాలమీద నమ్మకమే కారణ మనీ ప్రతిపాదించారు. "అత్ర పూజ్య దైవతేషు రుద్రస్యానుపాదానాత్ అపూజ్యత్వముక్తమ్. అధునా కైశ్చిత్ పూజ్య మానతా తు తామసశాస్త్రానురోధేనేతి బోధ్యమ్" (గోవిందరాజవ్యాఖ్య).

అప్పయ్యదీక్షితులు శ్రీరామాయణ తాత్పర్యసారసంగ్రహస్తోత్రంలో ఈ ఘట్టాన్నే నిర్దేశిస్తూ—"అగస్త్యాశ్రమంలోనికి ప్రవేశించే టప్పుడు రాముడు లక్ష్మణునితో సకలదేవతలు ఈ అగస్త్యుని ఆరాధిస్తూ ఉంటా రని చెప్పి ఉన్నాడు. ఇక్కడ చెప్పిన దేవతాస్థానాలు అగస్త్యుణ్ణి ఉపాసించడంకోసం వచ్చే దేవతలు ఏర్పరచుకొన్న స్థానాలే. వీటిలో రుద్రస్థానం చెప్పకపోవడాన్ని పట్టి బ్రహ్మ విష్ణ్వాదులే అగస్త్యోపాసకులు. శివుడు అగస్త్యుణ్ణి ఉపాసించేవాడు కాదు. అందుచేత అందరి దేవలకంటె శివుడే ఉత్కృష్టుడు అని సూచితం అవుతున్నది" అని ప్రతిపాదించారు. "తస్మాత్ బ్రహ్మవిష్ణ్వాదయ ఏవ అగస్త్యోపాసకాః న తు శివః ఇతి ద్యోతనేన శివస్యతదతిశయమహిమా వ్యఞ్జితః" (శ్రీ.రా.తా.సం.స్తోత్రం. 2) వివిధదేవతల స్థానాలను వర్ణించే ఈ నాలుగు శ్లోకాలూ కూడా ప్రాచ్యప్రతిలో లేకపోవుట గమనార్హం. 17—20

మూ. తతః శిష్యైః పరివృతో మునిరప్యభినిష్పతత్, 21
తం దదర్శాగ్రతో రామో మునీనాం దీప్తతేజసామ్.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, శిష్యైః = శిష్యులతో, పరివృతః = కూడిన, మునిరపి = అగస్త్యముని కూడ, అభినిష్పతత్ = శీఘ్రముగా ఎదురు వచ్చెను. రామః = రాముడు, దీప్తతేజసామ్ = ప్రజ్వలించుచున్న తేజస్సు గల,

మునీనామ్ = మునులయొక్క, అగ్రతః=ఎదుట, తమ్=ఆ అగస్త్యమహాముని, దదర్శ = చూచెను.

తా. పిమ్మట ఆ అగస్త్యుడు శిష్యగణపరివృతుడై శీఘ్రముగా రామునకు ఎదురు వచ్చెను. రాముడు ప్రజ్వలించుచున్న తేజస్సు గల ఆ మునుల ముందట నున్న ఆ మునిని చూచెను. 21

మూ. అబ్రవీద్వచనం వీరో లక్ష్మణం లక్ష్మివర్ధనమ్, 22
ఏష లక్ష్మణ నిష్క్రామత్యగస్త్యో భగవాన్ ఋషిః,
ఔదార్యేణావగచ్ఛామి నిధానం తపసామిమమ్. 23

ప్ర. అ. వీరః=వీరుడైన రాముడు, లక్ష్మివర్ధనమ్=లక్ష్మిని వృద్ధిచేయు, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను. లక్ష్మణ = లక్ష్మణా ! భగవాన్ = పూజ్యుడైన, ఏషః = ఈ, అగస్త్యః ఋషిః= అగస్త్యమహర్షి, నిష్క్రామతి = బైటకువచ్చుచున్నాడు. ఔదార్యేణ = తేజోవిశే షముచేత, ఇమమ్ = ఈతనిని, తపసామ్ = తపస్సులకు, నిధానమ్ = నిధియైన వానినిగా, అవగచ్ఛామి = తెలుసుకొనుచున్నాను.

తా. వీరుడైన రాముడు, లక్ష్మిని వృద్ధి పొందించు లక్ష్మణునితో ఇట్లు పలికెను. లక్ష్మణా ! ఇదిగో; పూజ్యుడైన అగస్త్యమహర్షి బైటకు వచ్చుచున్నాడు. తేజోవిశేషమును పట్టి ఇతడు తపస్సులకు నిధి యని భావించుచున్నాను. 23

మూ. ఏవముక్త్వా మహాబాహురగస్త్యం సూర్యవర్చసమ్,
జగ్రాహ పరమప్రీత స్తస్య పాదౌ పరంతపః. 24

ప్ర. అ. మహాబాహుః = గొప్ప బాహువులు కలవాడు, పరంతపః = శత్రుసంహారకుడు అయిన రాముడు, సూర్యవర్చసమ్ = సూర్యుని వంటి కాంతి గల, అగస్త్యమ్ = అగస్త్యుని గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, పరమ ప్రీతః = చాల సంతోషించినవాడై, తస్య = ఆ అగస్త్యునియొక్క, పాదౌ=పాద ములను, జగ్రాహ = గ్రహించెను.

తా. గొప్ప బాహువులు కలవాడు, శత్రుసంహారకుడు అయిన ఆ రాముడు

సూర్యునివంటి తేజస్సుగల అగస్త్యమహామునిని గూర్చి లక్ష్మణునితో ఇట్లు పలికి, చాల సంతోషముతో ఆ మహాముని పాదములు గ్రహించెను. 24

మూ. అభివాద్య తు ధర్మాత్మా తస్థౌ రామః కృతాఞ్జలిః,
సీతయా సహ వైదేహ్యా తదా రామః సలక్ష్మణః. 25

ప్ర. అ. తదా = అప్పుడు, ధర్మాత్మా = ధర్మాత్ముడు, రామః = మనోహరుడు అయిన, రామః = రాముడు, వైదేహ్యా = విదేహదేశాధిపతి కూతురైన, సీతయా = సీతతో కూడినవాడై, సలక్ష్మణః = లక్ష్మణునితో కూడినవాడై, అభివాద్య = నమస్కరించి, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలి కలవాడై, తస్థౌ = నిలచెను.

తా. అప్పుడు సీతాలక్ష్మణసమేతుడు, ధర్మాత్ముడు, సకలజనమనోభిరాముడు అయిన రాముడు అగస్త్యునకు అభివాదనము చేసి, అంజలి ఘటించి నిలచెను. 25

మూ. ప్రతిజగ్రాహ కాకుత్స్థమర్చయిత్వాసనోదకైః,
కుశలప్రశ్నముక్త్వా చ హ్యాస్యతామితి చాబ్రవీత్. 26

ప్ర. అ. ఆసనోదకైః = ఆసనముచేతను, ఉదకముచేతను, అర్చయిత్వా = పూజించి, కాకుత్స్థమ్ = రాముణ్ణి, ప్రతిజగ్రాహ = ప్రతిగ్రహించెను. కుశలప్రశ్నమ్ = కుశలప్రశ్నను, ఉక్త్వా = పలికి, ఆస్యతామ్ = కూర్చుందువుగాక, ఇతి చ = అని కూడ, అబ్రవీత్ = పలికెను.

తా. అగస్త్యుడు రామునకు ఆసనము, ఉదకము సమర్పించి, సగౌరవముగా ఆతనిని ప్రతిగ్రహించి, కుశలప్రశ్న వేసి, "కూర్చుండుము" అని పలికెను.

మూ. అగ్నిం హుత్వా ప్రదాయార్ఘ్యమతిథీన్ ప్రతిపూజ్య చ,
వానప్రస్థ్యేన ధర్మేణ స తేషాం భోజనం దదౌ. 27

ప్ర. అ. సః = అగస్త్యమహాముని, అగ్నిమ్ = అగ్నిని, హుత్వా = హోమము చేసి, అర్ఘ్యమ్ = అర్ఘ్యమును, ప్రదాయ = ఇచ్చి, అతిథీన్ = అతిథులను, ప్రతిపూజ్య చ = పూజించి, వానప్రస్థేన = వానప్రస్థాశ్రమమునకు సంబంధించిన,

ధర్మేణ = ధర్మముచేత, తేషామ్ = వారికి, భోజనమ్ = భోజనమును, దదౌ = ఇచ్చెను.

తా. అగస్త్యుడు అగ్నిహోమాదులు ముగించుకొని, అర్ఘ్యప్రదానాదులచేత అతిథులను పూజించి, వారికి వానప్రస్థధర్మానుసారముగ భోజనము పెట్టెను. 27

మూ. ప్రథమం చోపవిశ్యాథ ధర్మజ్ఞో మునిపుఙ్గవః,
ఉవాచ రామమాసీనం ప్రాఞ్జలిం ధర్మకోవిదమ్. 28

ప్ర. అ. అథ=అటు పిమ్మట, ధర్మజ్ఞః=ధర్మము నెరిగిన, మునిపుఙ్గవః = ఆ మునిశ్రేష్ఠుడు, ప్రథమమ్ = ముందుగా, ఉపవిశ్య = కూర్చుండి, ఆసీనమ్ =కూర్చొని ఉన్నవాడు, ప్రాఞ్జలిమ్=కట్టబడిన దోసిలి కలవాడు, ధర్మకోవిదమ్ = ధర్మములను ఎరిగినవాడు అయిన, రామమ్ = రాముణ్ణి గూర్చి, ఉవాచ = పలికెను.

తా. ధర్మములు తెలిసిన ఆ అగస్త్యుడు తాను ముందు కూర్చుండి, తన ప్రక్కనే అంజలి ఘటించి కూర్చొని ఉన్న, ధర్మకోవిదుడైన రామునితో ఇట్లు పలికెను. 28

మూ. అగ్నిం హుత్వా ప్రదాయార్ఘ్యమతిథిం ప్రతిపూజయేత్,
అన్యథా ఖలు కాకుత్స్థ తపస్వీ సముదాచరన్. 29
దుఃసాక్షీవ పరే లోకే స్వాని మాంసాని భక్షయేత్.

ప్ర. అ. అగ్నిమ్ = అగ్నిని, హుత్వా = హోమము చేసి, అర్ఘ్యమ్ = అర్ఘ్యమును, ప్రదాయ = ఇచ్చి, అతిథిమ్ = అతిథిని, ప్రతిపూజయేత్=పూజించవలెను. కాకుత్స్థ = రామా! అన్యథా = మరొక విధముగా, సముదాచరన్ = చేయుచున్న, తపస్వీ = మహర్షి, దుఃసాక్షీవ = అసత్యమైన సాక్ష్యము చెప్పినవాడు వలె, పరే లోకే=పరలోకమునందు, స్వాని=తన సంబంధమైన, మాంసాని = మాంసములను, భక్షయేత్ = భక్షించును.

తా. రామా! ముందుగా అగ్నిహోమము (వైశ్వదేవము) చేసి, పిమ్మట అతిథులకు అర్ఘ్య మిచ్చి పూజించవలెను. అట్లు కాక మరొక విధముగ చేయు ముని, అసత్యసాక్ష్యము చెప్పినవాడు వలె పరలోకములో తన మాంసమును భక్షించును. 29

మూ. రాజా సర్వస్య లోకస్య ధర్మచారీ మహారథః, 30
పూజనీయశ్చ మాన్యశ్చ భవాన్ ప్రాప్తః ప్రియాతిథిః.

ప్ర. అ. సర్వస్యలోకస్య = సమస్తలోకమునకు, రాజా = రాజువు, ధర్మచారీ = ధర్మమును ఆచరించేవాడవు, మహారథః = మహారథుడవు, పూజనీయశ్చ = పూజింపదగినవాడవు, మాన్యశ్చ = గౌరవించదగినవాడవు అయిన, భవాన్ = నీవు, ప్రియాతిథిః = ప్రియమైన అతిథివిగా, ప్రాప్తః = వచ్చినావు.

తా. నీవు సకలలోకములకు రాజువు. ధర్మాచరణశీలుడవు; మహారథుడవు; పూజింప దగినవాడవు. గౌరవింపదగినవాడవు. అట్టి నీవు మాకు ప్రియాతిథిగా వచ్చినావు. 30

మూ. ఏవముక్త్వా ఫలైర్మూలైః పుష్పైరన్యైశ్చ రాఘవమ్, 31
పూజయిత్వా యథాకామం పునరేవ తతోఽబ్రవీత్.

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, రాఘవమ్ = రాముణ్ణి, ఫలైః = ఫలములచేతను, మూలైః = మూలములచేతను, పుష్పైః = పుష్పములచేతను, అన్యైశ్చ = ఇతరవస్తువులచేతను, యథాకామమ్ = తన కోరిక తీరు నట్లు, పూజయిత్వా = పూజించి, తతః = అటు పిమ్మట, పునరేవ = మరల, అబ్రవీత్ = పలికెను.

తా. ఈ విధముగ పలికి, రామునకు ఫలములు, మూలములు, పుష్పములు, ఇతరవస్తువులు సమర్పించి తన కోరిక తీరు నట్లు పూజించి, మరల ఇట్లుపలికెను.

మూ. ఇదం దివ్యం మహచ్చాపం హేమరత్నవిభూషితమ్, 32
వైష్ణవం పురుషవ్యాఘ్ర నిర్మితం విశ్వకర్మణా,
అమోఘః సూర్యసంకాశో బ్రహ్మదత్తః శరోత్తమః. 33

ప్ర. అ. పురుషవ్యాఘ్ర = పురుషశ్రేష్ఠుడా! హేమరత్నవిభూషితమ్ = బంగారముచేతను, రత్నములచేతను అలంకరించబడిన, దివ్యమ్ = దివ్యమైన, మహత్ = గొప్పదైన, ఇదం చాపమ్ = ఈ ధనస్సు, వైష్ణవమ్ = విష్ణువుకు సంబంధించినది. విశ్వకర్మణా = విశ్వకర్మ చేత, నిర్మితమ్ = నిర్మించబడినది. సూర్యసంకాశః

= సూర్యునితో సమానమైన, అమోఘః = వ్యర్థము కాని, శరోత్తమః = ఉత్తమ మైన ఈ శరము, బ్రహ్మదత్తః = బ్రహ్మచేత ఇవ్వబడినది.

తా. పురుషులలో శ్రేష్ఠుడవైన రామా! బంగారముతోను, రత్నములతోను అలంకరించిన దివ్యమైన ఈ గొప్ప ధనస్సు విష్ణుదేవునిది. దీనిని విశ్వకర్మ నిర్మించెను. సూర్యునివంటి ఈ ఉత్తమమైన బాణము అమోఘమైనది. దీనిని బ్రహ్మ ఇచ్చెను. 32, 33

మూ. దత్తౌ మమ మహేన్ద్రేణ తూణీ చాక్షయసాయకౌ,
సంపూర్ణౌ నిశితైర్బాణైర్జ్వలద్భిరివ పావకైః, 34
మహారజతకోశోఽయమసిర్హేమవిభూషితః.

ప్ర. అ. అక్షయసాయకౌ = అక్షయ మైన బాణములు గలవి, నిశితైః = వాడియైన, జ్వలద్భిః = ప్రజ్వలించుచున్న, పావకైరివ = అగ్ని వలె ఉన్న, బాణైః = బాణములతో, సంపూర్ణౌ = నిండిన, తూణీ = అంబులపొదులు, మమ = నాకు, మహేన్ద్రేణ = మహేంద్రునిచేత, దత్తౌ = ఇవ్వబడినవి. మహారజతకోశః = బంగారపు ఒర గల, అయమ్ = ఈ, హేమవిభూషితః = బంగారముచేత అలంకరించబడిన, అసిః = ఖడ్గము (దేవేంద్రునిచేత ఇవ్వబడినది).

తా. మండుచున్న అగ్ని వలె వాడియైన బాణములతో నిండిన ఈ అక్షయ తూణీరములను, బంగారు ఒరలో ఉన్న ఈ సువర్ణాలంకృతమైన ఖడ్గమును దేవేంద్రుడు నా కిచ్చినాడు. 34

మూ. అనేన ధనుషా రామ హత్వా సంఖ్యే మహాసురాన్, 35
ఆజహార శ్రియం దీప్తాం పురా విష్ణుర్దివౌకసామ్.

ప్ర. అ. రామ = రామా! పురా = పూర్వము, విష్ణుః = విష్ణుమూర్తి, సంఖ్యే = యుద్ధమునందు, అనేన ధనుషా = ఈ ధనస్సుచేత, మహాసురాన్ = గొప్ప రాక్షసులను, హత్వా = చంపి, దివౌకసామ్ = దేవతలయొక్క, దీప్తామ్ = ప్రకాశించుచున్న, శ్రియమ్ = లక్ష్మిని, ఆజహార = తీసికొనివచ్చెను.

తా. రామా! పూర్వము విష్ణువు, ఈ ధనస్సుచేత, యుద్ధములో గొప్ప అసురులను చంపి, దేవతలకు ప్రకాశించుచున్న లక్ష్మిని తిరిగి సంపాదించి పెట్టెను. 35

మూ. తద్ధనుస్తౌ చ తూణీరౌ శరం ఖడ్గం చ మానద, 36
జయాయ ప్రతిగృహ్ణీష్వ వజ్రం వజ్రధరో యథా.

ప్ర. అ. మానద = గౌరవమును ఇచ్చువాడా ! తత్ = ఆ, ధనుః = ధనస్సును, తౌ = ఆ, తూణీరౌ = అంబులపొదులను, శరమ్ = శరమును, ఖడ్గం చ = ఖడ్గమును, వజ్రధరః = దేవేంద్రుడు, వజ్రం యథా = వజ్రమును వలె, జయాయ = జయముకొరకు, ప్రతిగృహ్ణీష్వ=స్వీకరించుము.

తా. ఆశ్రితుల మానమును కాపాడు రామా ! ఇంద్రుడు వజ్రాయుధమును ధరించి నట్లు, ఈ ధనస్సును, ఈ అంబులపొదులను, బాణమును, ఖడ్గమును జయమునిమిత్తమై స్వీకరించుము. 36

మూ. ఏవముక్త్వా మహాతేజాః సమస్తం తద్వరాయుధమ్, 37
దత్వా రామాయ భగవానగస్త్యః పునరబ్రవీత్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకియే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ద్వాదశః సర్గః.

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సుగల, భగవాన్ = భగవంతుడైన, అగస్త్యః = అగస్త్యుడు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా=పలికి, సమస్తమ్=సమస్తమైన, తత్ = ఆ, వరాయుధమ్ = శ్రేష్ఠ మైన ఆయుధమును, రామాయ = రామునకు, దత్వా=ఇచ్చి, పునః=మరల, అబ్రవీత్=పలికెను.

తా. మహాతేజఃశాలి, పూజ్యుడు అయిన అగస్త్యుడు ఇట్లు పలికి, శ్రేష్ఠములైన ఆ ఆయుధముల నన్నింటిని రామునకు ఇచ్చి మరల ఇట్లనెను. 37

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో
పన్నెండవ సర్గ సమాప్తము.

అథ త్రయోదశః సర్గః

[అగస్త్యుడు తనను చూచుటకై రాముడు వచ్చినందుకు సంతోషము ప్రకటించుట; సీతను ప్రశంసించుట; పంచవటిలో నివసింపుమని రామునకు చెప్పుట; రాముడు అక్కడికి ప్రయాణ మగుట].

మూ. రామ ప్రీతోఽస్మి భద్రం తే పరితుష్టోఽస్మి లక్ష్మణ,
అభివాదయితుం యన్మాం ప్రాప్తౌ స్థః సహ సీతయా. 1

ప్ర. అ. రామ = రామా! ప్రీతః = సంతోషించినవాడను, అస్మి = అయి ఉన్నాను. తే = నీకు, భద్రమ్ = మంగళ మగుగాక. లక్ష్మణ = లక్ష్మణా! పరితుష్టః అస్మి = సంతోషించినాను, యత్ = ఏ కారణమువలన, సీతయాసహ = సీతతో కూడ, మామ్ = నన్ను, అభివాదయితుమ్ = నమస్కరించుటకు, ప్రాప్తౌ స్థః = వచ్చినారో.

తా. రామా! చాలా సంతోషించుచున్నాను; నీకు మంగళ మగుగాక; లక్ష్మణా! సంతోషించుచున్నాను; మీ రిద్దరు సీతాసహితులై నాకు అభివాదనము చేయుటకు వచ్చినారు. 1

మూ. అధ్వశ్రమేణ వాం ఖేదో బాధతే ప్రచురశ్రమః,
వ్యక్తముత్కణ్ఠతే చాపి మైథిలీ జనకాత్మజా. 2

ప్ర. అ. అధ్వశ్రమేణ = మార్గశ్రమచేత, ప్రచురశ్రమః = అధికమైన శ్రమ గల, ఖేదః = ఖేదము, వామ్ = మీ ఇద్దరిని, బాధతే = బాధించుచున్నది. జనకాత్మజా = జనకుని కుమార్తెయైన, మైథిలీ చాపి = సీత కూడ, వ్యక్తమ్ = స్పష్టముగా, ఉత్కణ్ఠతే = విశ్రాంతిని కోరుచున్నది.

తా. చాల దూరము నడచుటవలనను, మార్గముతో కలిగిన ఇతర శ్రమల వలనను మీకు అలసట కలిగి మిమ్ములను బాధించు చుండును. జనకుని కూతు

రైన సీత కూడ అలసిపోయి విశ్రాంతి కోరుచున్న దని స్పష్టముగా తెలియు చున్నది. 2

మూ. ఏషా హి సుకుమారీ చ దుఃఖైశ్చ న విమానితా,
ప్రాజ్యదోషం వనం ప్రాప్తా భర్తృస్నేహప్రచోదితా. 3

ప్ర. అ. సుకుమారీ చ = సుకుమారురాలు, దుఃఖైశ్చ = దుఃఖములచేత, న విమానితా = బాధింపబడనిది అయిన, ఏషా = ఈమె, భర్తృస్నేహ ప్రచోదితా = భర్తయందు స్నేహముచేత ప్రేరేపించబడినదై, ప్రాజ్యదోషమ్ = అధికమైన దోషములు గల, వనమ్ = వనమును గూర్చి, ప్రాప్తా = వచ్చినది.

తా. సుకుమారురాలు, దుఃఖములచేత ఎన్నడూ బాధపడనిదీ అయిన ఈ సీత భర్తపై నున్న స్నేహముచేత ప్రేరితురాలై అత్యధికమైన దోషములు గల వనమునకు వచ్చినది. 3

మూ. యథైషా రమతే రామ ఇహ సీతా తథా కురు,
దుష్కరం కృతవత్యేషా వనే త్వామనుగచ్ఛతీ. 4

ప్ర. అ. రామ = రామా! ఏషా సీతా = ఈ సీత, ఇహ = ఇక్కడ, యథా = ఎట్లు, రమతే = ఆనందముగా ఉండునో, తథా = అట్లు, కురు = చేయుము. ఏషా = ఈమె, వనే = వనమునందు, త్వామ్ = నిన్ను, అనుగచ్ఛతీ = అనుసరించు చున్నదై, దుష్కరమ్ = చేయ శక్యము కాని పనిని, కృతవతీ = చేసినది.

తా. ఈ సీత ఇక్కడ సుఖముగా ఉండు నట్లు చూచుకొనుము. నీ వెను కనే అరణ్యమునకు వచ్చిన ఈమె ఎవ్వరూ చేయజాలని పని చేసినది. 4

మూ. ఏషా హి ప్రకృతిః స్త్రీణామాసృష్టే రఘునన్దన,
సమస్థమనురజ్యన్తి విషమస్థం త్యజన్తి చ. 5

ప్ర. అ. రఘునన్దన = రామా! ఆ సృష్టేః = సృష్టి మొదలు, ఏషా = ఇది స్త్రీణామ్ = స్త్రీలయొక్క, ప్రకృతిర్హి = స్వభావము కదా; సమస్థమ్ = చక్కని పరిస్థితిలో ఉన్న భర్తను (పై), అనురజ్యన్తి = అనురాగము చూపుదురు; విషమ స్థమ్ = కష్టములలో ఉన్నవానిని, త్యజన్తి చ = విడచుదురు.

తా. రామా! స్త్రీలు సుఖస్థితిలో ఉన్న భర్తపై అనురాగము చూపుదురు. కష్టాలలో ఉన్నవానిని విడచివేయుదురు. సృష్టి ప్రారంభమునుండి ఇది స్త్రీలలో ఉన్న స్వభావము. 5

మూ. శతహ్రదానాం లోలత్వం శస్త్రాణాం తీక్ష్ణతాం తథా,
గరుడానిలయోః శైఘ్ర్యమనుగచ్ఛన్తి యోషితః. 6

ప్ర. అ. యోషితః = స్త్రీలు, శతహ్రదానామ్ = మెరుపులయొక్క, లోలత్వమ్ = చంచలత్వమును, శస్త్రాణామ్ = ఆయుధములయొక్క, తీక్ష్ణతామ్ = తీక్ష్ణత్వమును, తథా = మరియు, గరుడానిలయోః = గరుత్మంతునియొక్క, వాయువుయొక్క, శైఘ్ర్యమ్ = వేగమును, అనుగచ్ఛన్తి = అనుసరించి ఉందురు.

తా. స్త్రీలలో మెరపుల కున్న చంచలత్వము, ఆయుధాల కున్న తీక్ష్ణత్వము, గరుత్మంతునికి, వాయువునకు ఉన్న వేగము ఉన్నవి. 6

మూ. ఇయం తు భవతో భార్యా దోషైరేతైర్వివర్జితా,
శ్లాఘ్యా చ వ్యపదేశ్యా చ యథా దేవీ హ్యరున్ధతీ. 7

ప్ర. అ. భవతః = నీయొక్క, భార్యా = భార్యయైన, ఇయం తు = ఈ సీత యైతే, ఏతైః = ఈ, దోషైః = దోషములతో, వివర్జితా = శూన్యురాలై, దేవీ = దేవియైన, అరున్ధతీ యథా = అరుంధతి వలె, శ్లాఘ్యా చ = శ్లాఘించ దగినది, వ్యపదేశ్యా చ = చెప్పుకొనదగినది.

తా. కాని నీ భార్యయైన సీత మాత్రము ఈ దోషము లేవీ లేనిదై, అరుంధతీదేవి వలె శ్లాఘించదగినది, చెప్పుకొనదగినది. 7

మూ. అలంకృతోఽయం దేశశ్చ యత్ర సౌమిత్రిణా సహ,
వైదేహ్యా చానయా రామ వత్స్యసి త్వమరిందమ. 8

ప్ర. అ. అరిందమ = శత్రుసంహారకుడవైన, రామ = రామా! సౌమిత్రిణా సహ = లక్ష్మణునితోను, అనయా = ఈ, వైదేహ్యా చ = సీతతోను, యత్ర = ఎక్కడ, వత్స్యసి = నివసించగలవో, అయమ్ = ఈ, దేశశ్చ = దేశము, అలంకృతః = అలంకరింపబడినది.

తా. శత్రుసంహారకుడవైన రామా! నీవు లక్ష్మణునితోను, సీతతోను కలిసి ఏ ప్రదేశములో నివసించెదవో ఆ ప్రదేశము అలంకరింపబడినది అగును.

మూ. ఏవముక్తః స మునినా రాఘవః సంయతాఞ్జలిః,
ఉవాచ ప్రశ్రితం వాక్యమృషిం దీప్తమివానలమ్. 9

ప్ర. అ. మునినా = అగస్త్యమహామునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడెన, సః = ఆ, రాఘవః = రాముడు, సంయతాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడై, దీప్తమ్ = ప్రజ్వలించుచున్న, అనలమివ = అగ్ని వలె ఉన్న, ఋషిమ్ = ఆ ఋషీశ్వరుని గూర్చి, ప్రశ్రితమ్ = వినయముతో కూడిన, వాక్యమ్ = వాక్యమును ఉవాచ = పలికెను.

తా. ఆ అగస్త్యమహాముని మాటలు విని రాముడు, అంజలి ఘటించి, ప్రజ్వలించుచున్న అగ్ని వలె ఉన్న ఆ మహర్షితో, వినయపూర్వకముగా ఇట్లు పలికెను. 9

మూ. ధన్యోఽస్మ్యనుగృహీతోఽస్మి యస్య మే మునిపుఙ్గవః,
గుణైః సభ్రాతృభార్యస్య వరదః పరితుష్యతి. 10

ప్ర. అ. సభ్రాతృభార్యస్య = సోదరునితోను భార్యతోను కూడిన, యస్య మే = ఏ నాయొక్క, గుణైః = గుణములచేత, వరదః = వరముల నిచ్చే, ముని పుఙ్గవః = మునిశ్రేష్ఠుడు, పరితుష్యతి = సంతోషించుచున్నాడో, అట్టి నేను, ధన్యః = ధన్యుడను, అస్మి = అయితిని. అనుగృహీతః = అనుగ్రహింపబడినవాడను, అస్మి = అయితిని.

తా. నా భార్య గుణములను, నా తమ్ముని గుణములను, నా గుణములను చూచి, వరములను ఇవ్వ సమర్థుడైన నీవంటి మునిశ్రేష్ఠుడు సంతోషించుటచేత నేను ధన్యుడను అయినాను. మీ అనుగ్రహమునకు పాత్రుడను అయినాను. 10

మూ. కిం తు వ్యాదిశ మే దేశం సోదకం బహుకాననమ్,
యత్రాశ్రమపదం కృత్వా వసేయం నిరతః సుఖమ్. 11

ప్ర. అ. కిం తు = కాని, యత్ర = ఎక్కడ, ఆశ్రమపదమ్ = ఆశ్రమ

మును, కృత్వా = నిర్మించుకొని, నిరతః = ఏకాగ్రచిత్తుడనై, సుఖమ్ = సుఖముగా, వసేయమ్ = నివసింతునో అట్టి, సోదకమ్ = ఉదకముతో కూడినది, బహుకాననమ్ = అధికమైన వనములు కలది అయిన, దేశమ్ = ప్రదేశమును, మే = నాకు, వ్యాదిశ = చెప్పుము.

తా. కాని నేను పర్ణశాల నిర్మించుకొని ఏకాగ్రచిత్తముతో, సుఖముగా నివసించుటకు యోగ్యమైన, ఉదకసమృద్ధి గల, అధికవృక్షము లున్న ప్రదేశ మేదో చెప్పుము. 11

మూ. తతోఽబ్రవీన్మునిశ్రేష్ఠః శ్రుత్వా రామస్య తద్వచః,
ధ్యాత్వా ముహూర్తం ధర్మాత్మా ధీరో ధీరతరం వచః.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, ధర్మాత్మా = ధర్మాత్ముడు, ధీరః = బుద్ధిమంతుడు అయిన, మునిశ్రేష్ఠః = ఆ మునిశ్రేష్ఠుడు, రామస్య = రాముని యొక్క, తత్ = ఆ, వచః = వాక్యమును, శ్రుత్వా = విని, ముహూర్తమ్ = ముహూర్తకాలముపాటు, ధ్యాత్వా = ధ్యానించి, ధీరతరమ్ = మిక్కిలి తెలివితో కూడిన, వచః = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. ధర్మాత్ముడు, బుద్ధిశాలి అయిన ఆ మునిశ్రేష్ఠుడు రాముని మాటలు విని, కొంచెము సేపు ఆలోచించి చాల తెలివైన మాట పలికెను. 12

మూ. ఇతో ద్వియోజనే తాత బహుమూలఫలోదకః,
దేశో బహుమృగః శ్రీమాన్ పఞ్చవట్యభివిశ్రుతః. 13

ప్ర. అ. తాత = తండ్రీ ! బహుమూలఫలోదకః = అధికమైన మూలములు, ఫలములు, ఉదకము గల, బహుమృగః = అనేకమృగములు గల, శ్రీమాన్ = శోభాయుక్తమైన, పఞ్చవట్యభివిశ్రుతః = పంచవటి అని ప్రసిద్ధమైన, దేశః = ప్రదేశము, ఇతః = ఇక్కడినుండి, ద్వియోజనే = రెండు యోజనముల దూరము నందున్నది.

తా. నాయనా ! ఇక్కడికి రెండు యోజనముల దూరములో పంచవటి అను ఒక చాల అందమైన ప్రదేశ మున్నది. అక్కడ మూలములు, ఫలములు, ఉదకము సమృద్ధిగా లభించును. అక్కడ అనేకమృగములు సంచరించుచుండును.

మూ. తత్ర గత్వాఽఽశ్రమపదం కృత్వా సౌమిత్రిణా సహ,
రంస్యసే త్వం పితుర్వాక్యం యథోక్తమనుపాలయన్.

ప్ర. అ. త్వమ్ = నీవు, సౌమిత్రిణా సహ = లక్ష్మణునితో కూడ, తత్ర = అక్కడికి, గత్వా = వెళ్లి, ఆశ్రమపదమ్ = ఆశ్రమస్థానమును, కృత్వా = నిర్మించుకొని, యథోక్తమ్ = చెప్పిన విధముగ, పితుః = తండ్రియొక్క, వాక్యమ్ = వాక్యమును, అనుపాలయన్ = పాలించుచు, రంస్యసే = విహరించగలవు.

తా. నీవు అక్కడికి లక్ష్మణునితో కలిసి వెళ్ళి, పర్ణశాల నిర్మించుకొని, నీ తండ్రిచెప్పిన మాటను పాలించుచు సుఖముగా నివసించవచ్చును. 14

మూ. కాలోఽయం గతభూయిష్ఠో యః కాల స్తవ రాఘవ.
సమయో యో నరేన్ద్రేణ కృతో దశరథేన తే, 15
తీర్ణప్రతిజ్ఞః కాకుత్స్థ సుఖం రాజ్యే నివత్స్యసి.

ప్ర. అ. రాఘవ = రామా ! తే = నీకు, దశరథేన నరేన్ద్రేణ = దశరథ మహారాజుచేత, యః = ఏది, సమయః = నిర్ణీతసమయముగా, కృతః = చేయబడినదో, యః = ఏది, తవ = నీయొక్క, కాలః = అరణ్యములో గడపవలసిన కాలమో, అయం కాలః = ఈ కాలము, గతభూయిష్ఠః = చాలవరకు గడచి పోయినది. కాకుత్స్థ = రామా ! తీర్ణప్రతిజ్ఞః = దాటబడిన ప్రతిజ్ఞ కలవాడవై, రాజ్యే = రాజ్యమునందు, సుఖమ్ = సుఖముగా, నివత్స్యసి = నివసించగలవు.

తా. రామా ! నీకు దశరథమహారాజు విధించిన అరణ్యనివాసకాలము చాలవరకు గడచిపోయినది. నీవు ప్రతిజ్ఞ పూర్తిచేసికొని రాజ్యములో సుఖముగ ఉండగలవు. 15

మూ. ధన్యస్తే జనకో రామ స రాజా రఘునన్దన. 16
యస్త్వయా జ్యేష్ఠపుత్రేణ యయాతిరివ తారితః,

ప్ర. అ. రఘునన్దన = రఘువంశమునకు ఆనందమును కలిగించు, రామ = రామా ! తే జనకః = నీ తండ్రియైన, సః = ఆ, రాజా = దశరథమహారాజు, ధన్యః = ధన్యుడు; యః = ఏ దశరథుడు, జ్యేష్ఠపుత్రేణ = జ్యేష్ఠపుత్రుడవైన,

త్వయా = నీచేత, యయాతిరివ = యయాతి వలె, తారితః = తరింపచేయ బడినాడో.

తా. రఘువంశమునకు ఆనందము కలిగించు రామా ! నీ తండ్రియైన దశరథమహారాజు ధన్యుడు. యయాతిని ఆతని జ్యేష్ఠపుత్రుడు తరింపచేసి నట్లు నీవు ఆ దశరథమహారాజును తరింపచేసినావు. 16

మూ. విదితో హ్యేష వృత్తాన్తో మమ సర్వ స్తవానఘ, 17
తపసశ్చ ప్రభావేణ స్నేహాద్దశరథస్య చ.

ప్ర. అ. అనఘ = దోషములు లేనివాడా ! తపసః = తపస్సుయొక్క, ప్రభావేణ = ప్రభావముచేతను, దశరథస్య = దశరథునియొక్క, స్నేహాత్ = స్నేహమువలనను, తవ = నీయొక్క, ఏషః = ఈ, సర్వః = సమస్తమైన, వృత్తాన్తః = వృత్తాంతము, మమ = నాకు, విదితః = తెలియబడినది.

తా. దోషరహితుడవైన శ్రీరామా ! తపఃప్రభావముచేతను, దశరథుని విషయమున నా కున్న స్నేహముచేతను నాకు నీ విషయ మంతా తెలిసినది. 17

మూ. హృదయస్థశ్చ తే ఛన్దో విజ్ఞాత స్తపసా మయా, 18
ఇహావాసం ప్రతిజ్ఞాయ మయా సహ తపోవనే,
అతశ్చ త్వామహం బ్రూమి గచ్ఛ పఞ్చవటీమితి. 19

ప్ర. అ. తే = నీయొక్క, హృదయస్థః = హృదయమునందున్న, ఛన్దః = కోరిక, మయా = నాచేత, తపసా = తపస్సుచేత, విజ్ఞాతః = తెలియబడినది. అతః = అందువలన, మయాసహ = నాతో కూడ, ఇహ = ఈ, తపోవనే = తపోవనమునందు, ఆవాసమ్ = నివాసమును, ప్రతిజ్ఞాయ = తెలిపి, పఞ్చవటీమ్ = పంచవటిని గూర్చి, గచ్ఛ = వెళ్లుము, ఇతి = అని, త్వామ్ = నిన్ను గూర్చి, అహమ్ = నేను, బ్రూమి = చెప్పుచున్నాను.

తా. తపోబలముచేత నేను నీ మనస్సులో ఉన్న అభిలాషను తెలుసుకొన్నాను. అందుచేతనే నాతో కూడ ఈ ఆశ్రమములో ఉండు మని మొదట చెప్పి, పంచవటికి వెళుమని చెప్పుచున్నాను. 18, 19

మూ. స హి రమ్యో వనోద్దేశో మైథిలీ తత్ర రంస్యతే,
స దేశః శ్లాఘనీయశ్చ నాతిదూరే చ రాఘవ. 20

ప్ర. అ. రాఘవ = రామా ! సః = ఆ, వనోద్దేశః = వనప్రదేశము, రమ్యః హి = రమ్యమైనది కదా. సః దేశః = ఆ ప్రదేశము, శ్లాఘనీయశ్చ = శ్లాఘించదగినది. నాతిదూరే చ = చాల దూరమునందు లేదు. మైథిలీ = సీత, తత్ర = అక్కడ, రంస్యతే = క్రీడించగలదు.

తా. రామా ! ఆ వనప్రదేశము సుందర మైనది. శ్లాఘింపదగినది. ఇక్కడికి చాల దగ్గరగా ఉన్నది. సీత అక్కడ ఆనందముతో నివసించగలదు. 20

మూ. గోదావర్యాః సమీపే చ మైథిలీ తత్ర రంస్యతే,
ప్రాజ్యమూలఫలశ్చైవ నానాద్విజగణాయుతః, 21
వివిక్తశ్చ మహాబాహో పుణ్యో రమ్యస్తథైవ చ.

ప్ర. అ. మైథిలీ = సీత, తత్ర = అక్కడ, గోదావర్యాః = గోదావరి యొక్క, సమీపే = సమీపమునందు. రంస్యతే = క్రీడించగలదు. ప్రాజ్యమూలఫలశ్చైవ = అధికమైన మూలములు, ఫలములు కలది. నానాద్విజగణాయుతః = అనేక విధములైన పక్షుల సముదాయముతో కూడినది. మహాబాహో = గొప్పబాహువులు కలవాడా ! వివిక్తశ్చ = జనసంచారము లేనిది. పుణ్యః = పుణ్యమైనది. తథైవచ = మరియు, రమ్యః = రమ్యమైనది.

తా. సీత, అక్కడ, గోదావరీసమీపమునందు క్రీడించగలదు. ఓ! మహాబాహూ ! ఆ ప్రదేశమునందు మూలములు, ఫలములు సమృద్ధిగా లభించును. అక్కడ అనేకవిధములైన పక్షులు గుంపులు గుంపులుగా తిరుగుచుండును. జనసంచారము లేక పుణ్యమై, రమ్యముగా ఉండును. 21

మూ. భవానపి సదారశ్చ శక్తశ్చ పరిరక్షణే, 22
అపి చాత్ర వసన్ రామ తాపసాన్ పాలయిష్యసి.

ప్ర. అ. రామ = రామా ! భవానపి = నీవు కూడ, సదారశ్చ = భార్యతో కూడినవాడవు. పరిరక్షణే = రక్షించుటయందు, శక్తశ్చ = సమర్థుడవు. అపి చ

= మరియు, అత్ర = ఇక్కడ, వసన్ = నివసించుచు, తాపసాన్ = మునులను, పాలయిష్యసి = పాలించగలవు.

తా. రామా! నీవు భార్యాసమేతుడవై రక్షించుకొనుటయందు సమర్థుడవు. మరియు నీవు ఇక్కడ నివసించినచో మునులను కూడ పాలించవచ్చును. 22

మూ. ఏతదాలక్ష్యతే వీర మధూకానాం మహద్వనమ్, 23
ఉత్తరేణాస్య గన్తవ్యం న్యగ్రోధమభిగచ్ఛతా.

ప్ర. అ. వీర = ఓ! వీరుడా! ఏతత్ = ఈ, మధూకానామ్ = ఇప్పచెట్లయొక్క, మహత్ = గొప్ప, వనమ్ = వనము, ఆలక్ష్యతే = చూడబడుచున్నది. అస్య = దీనికి, ఉత్తరేణ = ఉత్తరముగా, న్యగ్రోధమ్ = మఱ్ఱిచెట్టును గూర్చి, అభిగచ్ఛతా = ఎదురుగా వెళ్ళువాడుగా, గన్తవ్యమ్ = వెళ్లవలెని యున్నది.

తా. ఇదిగో! ఈ పెద్ద మధూకవృక్షముల వనము కనబడుచున్నది. దానికి ఉత్తరముగా, మఱ్ఱి చెట్టునకు ఎదురుగా వెళ్లవలెను. 23

మూ. తతః స్థలముపారుహ్య పర్వతస్యావిదూరతః, 24
ఖ్యాతః పఞ్చవటీత్యేవ నిత్యపుష్పితకాననః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, స్థలమ్ = మెట్టప్రదేశమును, ఉపారుహ్య = ఎక్కి, పర్వతస్య = పర్వతమునకు, అవిదూరతః = సమీపమునందు, పఞ్చవటీత్యేవ = పంచవటి అను, ఖ్యాతః = ప్రసిద్ధమైన, నిత్యపుష్పితకాననః = నిత్యము పుష్పించిన వనము (ఉన్నది).

తా. అక్కడనుండి, పర్వతమునకు దగ్గరగా, మెట్టమీదికి ఎక్కి (చూడగా), నిత్యము పుష్పించిన పంచవటి అను వనము ఉన్నది. 24

మూ. అగస్త్యేనైవముక్తస్తు రామః సౌమిత్రిణా సహ, 25
సత్కృత్యామన్త్రయామాస తమృషిం సత్యవాదినమ్.

ప్ర. అ. అగస్త్యేన = అగస్త్యునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, సౌమిత్రిణా సహ = లక్ష్మణునితో కూడిన, రామః = రాముడు, సత్య

వాదినమ్ = సత్యమును పలుకు, తమ్ = ఆ, ఋషిమ్ = ఋషిని, సత్కృత్య = సత్కరించి, ఆమన్త్రియామాస = వీడ్కొనెను.

తా. లక్ష్మణసమేతుడైన రాముడు, అగస్త్యుని మాటలు విని, సత్యమును పలుకు ఆ ఋషీశ్వరునకు నమస్కరించి, వెళ్లుటకు అనుమతి గైకొనెను. 25

మూ. తౌ తు తేనాభ్యనుజ్ఞాతౌ కృతపాదాభివన్దనౌ, 26
తదాశ్రమాత్పఞ్చవటీం జగ్మతుః సీతయా సహ.

ప్ర. అ. తేన = ఆ అగస్త్యునిచేత, అభ్యనుజ్ఞాతౌ = అనుమతింపబడిన, తౌ = ఆ రామలక్ష్మణులు, కృతపాదాభివన్దనౌ = చేయబడిన పాదాభివందనము గలవారై, సీతయా సహ = సీతతో కూడ, తదాశ్రమపదాత్ = అగస్త్యుని ఆశ్రమమునుండి, పఞ్చవటీమ్ = పంచవటినిగూర్చి, జగ్మతుః = వెళ్ళిరి.

తా. అగస్త్యమహాముని అనుజ్ఞ పొందిన ఆ రామలక్ష్మణులు ఆతనికి పాదాభివందనము చేసి, సీతాసమేతులై, ఆ అగస్త్యుని ఆశ్రమమునుండి పంచవటికి వెళ్ళిరి. 26

మూ. గృహీతచాపౌ తు నరాధిపాత్మజౌ
విషక్తతూణౌ సమరేష్వకాతరౌ,
యథోపదిష్టేన పథా మహర్షిణా
ప్రజగ్మతుః పఞ్చవటీం సమాహితౌ. 27

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
త్రయోదశః సర్గః.

ప్ర. అ. సమరేషు = యుద్ధములందు, అకాతరౌ = భయము లేనివారైన, నరాధిపాత్మజౌ = రాజకుమారులైన రామలక్ష్మణులు, గృహీతచాపౌ = గ్రహింపబడిన ధనస్సులు కలవారై, విషక్తతూణౌ = కట్టబడిన అంబులపొదులు కలవారై, సమాహితౌ = సావధానచిత్తులై, మహర్షిణా = మహర్షిచేత, యథోపదిష్టేన = చెప్పబడిన, పథా = మార్గముచేత, పఞ్చవటీమ్ = పంచవటిని గూర్చి, ప్రజగ్మతుః = వెళ్ళిరి.

తా. యుద్ధములలో భయము లేని రాజకుమారులైన ఆ రామలక్ష్మణులు, ధనస్సులు ధరించి, అంబులపొదులు కట్టుకొని, సావధానచిత్తులై, మహర్షి చెప్పిన మార్గమున పంచవటికి వెళ్ళుటకు ప్రయాణ మైరి. 27

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో పదమూడవ సర్గ సమాప్తము

అథ చతుర్దశః సర్గః

[*రాముడు పంచవటికి వెళ్ళుచు జటాయువును కలియుట. అతడు తనను గుఱించి సవిస్తరముగ రామునకు చెప్పుట.*]

మూ. అథ పఞ్చవటీం గచ్ఛన్నన్తరా రఘునన్దనః,
ఆససాద మహాకాయం గృధ్రం భీమపరాక్రమమ్. 1

ప్ర. అ. అథ = అటు పిమ్మట, రఘునన్దనః = రాముడు, పఞ్చవటీమ్= పంచవటిని గూర్చి, గచ్ఛన్=వెళ్ళుచు, అన్తరా=మధ్యయందు, మహాకాయమ్= పెద్ద శరీరము గల, భీమ పరాక్రమమ్ = భయంకరమైన పరాక్రమము గల, గృధ్రమ్ = గృధ్రమును, ఆససాద = పొందెను.

తా. పిమ్మట పంచవటికి వెళ్ళుచున్న రాముడు మార్గమధ్యమునందు, పెద్ద శరీరము గల, మహాపరాక్రమవంతుడైన గృధ్రమును (గ్రద్దను) చూచెను.

మూ. తం దృష్ట్వా తౌ మహాభాగౌ వటస్థం రామలక్ష్మణౌ,
మేనాతే రాక్షసం పక్షిం బ్రువాణౌ కో భవానితి. 2

ప్ర. అ. మహాభాగౌ = మహాభాగ్యవంతులైన, తౌ రామలక్షణౌ = ఆ రామలక్ష్మణులు, వటస్థమ్ = వటవృక్షముమీద ఉన్న, తం పక్షిమ్ = ఆ పక్షిని, దృష్ట్వా = చూచి, భవాన్ = నీవు, కః = ఎవ్వడవు, ఇతి = అని, బ్రువాణౌ = పలుకుచున్నవారై, రాక్షసమ్ = రాక్షసునిగా, మేనాతే = తలచిరి.

తా. మహాభాగ్యవంతులైన ఆ రామలక్ష్మణులు వటవృక్షముమీద ఉన్న ఆ గృధ్రమును చూచి, రాక్షసుడని తలచి, "నీవు ఎవ్వడవు?" అని ప్రశ్నించిరి.

మూ. స తౌ మధురయా వాచా సౌమ్యయా ప్రీణయన్నివ,
ఉవాచ వత్స మాం విద్ధి వయస్యం పితురాత్మనః. 3

ప్ర. అ. సః = ఆ పక్షి, తౌ = వారిద్దరిని, మధురయా = మధురము, సౌమ్యయా = మృదువు అయిన, వాచా = వాక్కుతో, ప్రీణయన్నివ = సంతోష పెట్టుచున్నవాడు వలె, ఉవాచ = పలికెను. వత్స = వత్సా! మామ్ = నన్ను, ఆత్మనః = నీయొక్క, వయస్యమ్ = మిత్రునిగా, విద్ధి = తెలుసుకొనుము.

తా. ఆ పక్షి మధురము, మృదువు అయిన వాక్కుతో ఆ రామలక్ష్మణులను సంతోషపెట్టుచు ఇట్లు పలికెను. "నాయనా! నేను నీ తండ్రి స్నేహితుడను అని తెలిసి కొనుము." 3

మూ. స తం పితృసఖం బుద్ధ్వా పూజయామాస రాఘవః,
స తస్య కులమవ్యగ్రమథ పప్రచ్ఛ నామ చ. 4

ప్ర. అ. సః రాఘవః = ఆ రాముడు, తమ్ = ఆ పక్షిని, పితృసఖమ్ = తన తండ్రి మిత్రునిగా, బుద్ధ్వా = తెలిసికొని, పూజయామాస = పూజించెను. అథ = అటుపిమ్మట, సః = ఆ రాముడు, అవ్యగ్రమ్ = తొందర లేకుండగా, తస్య = ఆ పక్షియొక్క, కులమ్ = కులమును, నామ చ = పేరును, పప్రచ్ఛ = అడిగెను.

తా. రాముడు ఆ పక్షి తన తండ్రిమిత్రుడని తెలిసికొని ఆతనిని పూజించెను. పిమ్మట తగు గౌరవము చూపుచు ఆ పక్షి కులమును, పేరును గూర్చి ప్రశ్నించెను. 4

మూ. రామస్య వచనం శ్రుత్వా సర్వభూతసముద్భవమ్,
ఆచచక్షే ద్విజస్తస్మై కులమాత్మానమేవ చ. 5

ప్ర. అ. ద్విజః = ఆ పక్షి, రామస్య = రామునియొక్క, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, సర్వభూతసముద్భవమ్ = సకలప్రాణుల ఉత్పత్తిని, కులమ్ = కులము, ఆత్మానమేవ చ = తనను గూర్చి, తస్మై = ఆ రామునకు, ఆచచక్షే = చెప్పెను.

తా. ఆ పక్షి రాముని వచనమును విని సకలభూతముల ఉత్పత్తిని, తన కులమును, పేరును రామునకు చెప్పెను. 5

మూ. పూర్వకాలే మహాబాహో యే ప్రజాపతయోఽ
తాన్మే నిగదతః సర్వానాదితః శృణు రాఘవ. 6

ప్ర. అ. మహాబాహో=గొప్ప బాహువులు కలవాడా ! రాఘవ=రామా ! పూర్వకాలే = పూర్వకాలమునందు, యే = ఏ, ప్రజాపతయః = ప్రజాపతులు, అభవన్ = ఉండిరో, తాన్ సర్వాన్ = వారి నందరినీ గూర్చి, మే = నేను, నిగదతః = చెప్పుచుండగా, ఆదితః = ప్రారంభమునుండీ, శృణు = వినుము.

తా. మహాబాహువైన రామా ! పూర్వము ఉన్న ప్రజాపతు లెవ్వరో వారి నందరినీ గూర్చి మొదటినుండీ చెప్పెదను; వినుము. 6

మూ. కర్దమః ప్రథమస్తేషాం విక్రీతస్తదనన్తరః
శేషశ్చ సంశ్రయశ్చైవ బహుపుత్రశ్చ వీర్యవాన్. 7

స్థాణుర్మరీచిరత్రిశ్చ క్రతుశ్చైవ మహాబలః
పులస్త్యశ్చాఙ్గిరాశ్చైవ ప్రచేతాః పులహస్తథా 8

దక్షో.వివస్వానపరోఽరిష్టనేమిశ్చ రాఘవ
కాశ్యపశ్చ మహాతేజాస్తేషామాసీచ్చ పశ్చిమః. 9

ప్ర. అ. రాఘవ = రామా ! తేషామ్=వారిలో, ప్రథమః= మొదటివాడు, కర్దమః = కర్దముడు. విక్రీతః=విక్రీతుడు, తదనన్తరః=అతని తరువాతివాడు. శేషశ్చ = శేషుడు, బహుపుత్రః = అనేకపుత్రులు గల, వీర్యవాన్ = పరాక్రమవంతుడైన, సంశ్రయశ్చైవ=సంశ్రయుడు, స్థాణుః=స్థాణువు, మరీచిః=మరీచి, అత్రిశ్చ = అత్రి, మహాబలః = గొప్ప బలము గల, క్రతుశ్చ = క్రతువు, పులస్త్యః = పులస్త్యుడు, అఙ్గిరాశ్చైవ = అంగిరసుడు, ప్రచేతాః = ప్రచేతసుడు, తథా = మరియు, పులహః = పులహుడు, దక్షః = దక్షుడు, అపరః = తరువాతివాడైన, వివస్వాన్ = వివస్వంతుడు (ఉండిరి). అరిష్టనేమిశ్చ = అరిష్టనేమి అను నామాంతరము గల, మహాతేజాః=గొప్ప తేజస్సుగల, కాశ్యపశ్చ=కాశ్యపుడు, తేషామ్=వారిలో, పశ్చిమః = చివరివాడు, ఆసీచ్చ = ఉండెను.

తా. ఆ ప్రజాపతులలో మొదటివాడు కర్దముడు, తరువాతివాడు విక్రీతుడు. పిమ్మట శేషుడు, చాలమంది పుత్రులు కలవాడు, వీర్యవంతుడు అయిన సంశ

యుడు, స్థాణువు, మరీచి, అత్రి, మహాబలశాలియైన క్రతువు, పులస్త్యుడు, అంగిరసుడు, ప్రచేతసుడు, పులహుడు, దక్షుడు, వివస్వంతుడు ఉండిరి. అరిష్టనేమి అను నామాంతరము గల, తేజఃశాలి యైన కాశ్యపుడు వారిలో చివరివాడుగా ఉండెను.

మూ. ప్రజాపతేస్తు దక్షస్య బభూవురితి విశ్రుతమ్,
షష్టిర్దుహితరో రామ యశస్విన్యో మహాయశః. 10

ప్ర. అ. మహాయశః = గొప్ప కీర్తి గల, రామ=రామా ! ప్రజాపతేః= ప్రజాపతియైన, దక్షస్య = దక్షునకు, షష్టిః = అరవైమంది, యశస్విన్యః = కీర్తి గల, దుహితరః = కుమార్తెలు, బభూవుఃఇతి = ఉండిరి అని, విశ్రుతమ్ = ప్రసిద్ధము.

తా. గొప్ప కీర్తి గల రామా ! ప్రజాపతియైన దక్షునకు కీర్తి గల అరవైమంది కుమార్తెలు ఉండేవా రని ప్రసిద్ధము. 10

మూ. కాశ్యపః ప్రతిజగ్రాహ తాసామష్టౌ సుమధ్యమాః,
అదితిం చ దితిం చైవ దనుమప్యథ కాళికామ్ 11
తామ్రాం క్రోధవశాం చైవ మనుం చాప్యనలామపి.

ప్ర. అ. కాశ్యపః = కాశ్యపుడు, తాసామ్ = వారిలో, అదితిం చ = అదితిని, దితిం చైవ = దితిని, దనుమపి = దనువును, అథ = మరియు, కాళికామ్ = కాళికను, తామ్రామ్ = తామ్రను, క్రోధవశాం చైవ=క్రోధవశను, మనుం చ = మనువును, అనలామపి=అనలను, అష్టౌ=ఎనమండుగురు, సుమధ్యమాః= అంద మైన నడుము గల స్త్రీలను, ప్రతిజగ్రాహ = స్వీకరించెను.

తా. కాశ్యపుడు వారిలో, అదితి, దితి, దనువు, కాళిక, తామ్ర, క్రోధవశ, మను, అనల అను ఎనమండుగురు కన్యలను వివాహమాడెను. 11

మూ. తాస్తు కన్యాస్తతః ప్రీతః కాశ్యపః పునరబ్రవీత్. 12
పుత్రాంస్త్రైలోక్యభర్తౄన్ వై జనయిష్యథ మత్సమాన్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ప్రీతః = సంతోషించిన, కాశ్యపః = కాశ్యపుడు, తాః కన్యాః = ఆ కన్యలను గూర్చి, పునః = మరల, అబ్రవీత్ =

పలికెను, త్రైలోక్యభర్తౄన్ = మూడు లోకములను పోషించు, మత్సమాన్ = నాతో సమానులైన, పుత్రాన్ = పుత్రులను, జనయిష్యథ = కనగలరు.

తా. పిమ్మట కాశ్యపుడు సంతోషించి, ఆ కన్యలతో "మీరు నాతో సమానులు, మూడు లోకములను పోషించేవారు అయిన కుమారులను కనండి" అని పలికెను. 12

మూ. అదితిస్తన్మనా రామ దితిశ్చ మనుజర్షభ, 13
కాళికా చ మహాబాహో శేషా స్త్వమనసోఽభవన్.

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గల, మనుజర్షభ = మనుష్యులలో శ్రేష్ఠుడవైన, రామ = రామా ! అదితిః = అదితి, తన్మనాః = ఆమాటయందు మనస్సు కలదిగా ఉండెను. దితిశ్చ = దితి, కాళికా చ = కాళిక కూడ, (అట్లే ఉండిరి). శేషాస్తు = మిగిలినవాళ్లు, అమనసః = మనస్సు లేనివాళ్లు, అభవన్ = అయిరి.

తా. మనుష్యులలో శ్రేష్ఠుడవు మహా బాహువూ అయిన రామా ! అదితి, దితి, కాళికా అనువారు కాశ్యపుని మాటపై శ్రద్ధ చూపిరి. ఇతరభార్యలు శ్రద్ధ చూపలేదు. 13

మూ. అదిత్యాం జజ్ఞిరే దేవా స్త్రయస్త్రింశదరిందమ, 14
ఆదిత్యా వసవో రుద్రా హ్యశ్వినౌ చ పరంతప.

ప్ర. అ. అరిందమ = శత్రువులను పీడించువాడా ! పరంతప = శత్రు వినాశకుడా ! అదిత్యామ్ = అదితియందు, ఆదిత్యాః = ఆదిత్యులు, వసవః = వసువులు, రుద్రాః = రుద్రులు, అశ్వినౌ = అశ్వినీదేవతలు అను, త్రయస్త్రింశత్ = ముప్పదిముగ్గురు, దేవాః = దేవతలు, జజ్ఞిరే = పుట్టిరి.

తా. శత్రుసంహారకుడవైన రామా ! అదితికి పన్నెండుగురు ఆదిత్యులు, ఎనమండుగురు వసువులు, పదకొండుగురు రుద్రులు, ఇద్దరు అశ్వినులు అను ముప్పదిముగ్గురు దేవతలు పుట్టిరి. 14

మూ. దితి స్త్వజనయత్పుత్రాన్ దైత్యాంస్తాత యశస్వినః, 15
తేషామియం వసుమతీ పురాసీత్సవనార్ణవా.

ప్ర. అ. తాత = తండ్రీ ! దితిస్తు = దితి, యశస్వినః = కీర్తిమంతులైన, దైత్యాన్ = దైత్యులను, పుత్రాన్ = పుత్రులనుగా, అజనయత్ = కనెను. సవనార్ణవా = వనములతోను అర్ణవములతోను కూడిన, ఇయమ్ = ఈ, వసుమతీ = భూమి, తేషామ్ = వారిదిగా, ఆసీత్ = అయి ఉండెను.

తా. దితికి కీర్తిమంతులైన దైత్యు లను పుత్రులు జనించిరి. వనముల తోను, సముద్రములతోను కూడిన ఈ భూమి పూర్వము ఈ దేవతలకు దైత్యులకు సంబంధించి ఉండెను. 15

మూ. దను స్త్వజనయత్పుత్రమశ్వగ్రీవమరిందమ. 16
నరకం కాలకం చైవ కాళికాపి వ్యజాయత.

ప్ర. అ. అరిందమ = శత్రుసంహారకుడా ! దనుః=దనువు, అశ్వగ్రీవమ్ = హయగ్రీవు డను, పుత్రమ్ = పుత్రుని, అజనయత్ = కనెను. కాళికాపి = కాళిక కూడ, నరకమ్ = నరకుని, కాలకం చైవ = కాలకుని, వ్యజాయత = కనెను.

తా. శత్రుసంహారకుడవైన రామా ! దనువు హయగ్రీవు డను పుత్రుని కనెను. కాళిక నరకుణ్ణి, కాలకుణ్ణి కనెను. 16

మూ. క్రౌఞ్చీం భాసీం తథా శ్యేనీం ధృతరాష్ట్రీం తథా శుకీమ్,
తామ్రాపి సుషువే కన్యాః పఞ్చైతా లోకవిశ్రుతాః.

ప్ర. అ. తామ్రాపి = తామ్ర కూడ, క్రౌఞ్చీమ్ = క్రౌంచిని, భాసీమ్ = భాసిని, తథా = మరియు, శ్యేనీమ్ = శ్యేనిని, ధృతరాష్ట్రీమ్ = ధృతరాష్ట్రిని, తథా = మరియు, శుకీమ్ = శుకిని, ఏతాః = ఈ, లోకవిశ్రుతాః = లోకమునందు ప్రసిద్ధలైన, పఞ్చ=ఐదుగురు, కన్యాః=కన్యలను, సుషువే=కనెను.

తా. తామ్ర కూడ, క్రౌంచి, భాసి, శ్యేని, ధృతరాష్ట్రి, శుకి అను లోక ప్రసిద్ధ లైన ఐదుగురు కన్యలను కనెను. 17

మూ. ఉలూకాన్ జనయత్ క్రౌఞ్చీ భాసీ భాసాన్ వ్యజాయత,
శ్యేనీ శ్యేనాంశ్చ గృధ్రాంశ్చ వ్యజాయత సుతేజసః,
ధృతరాష్ట్రీ తు హంసాంశ్చ కలహంసాంశ్చ సర్వశః, 19

ప్ర. అ. క్రౌఞ్చీ = క్రౌంచి, ఉలూకాన్ = గుడ్లగూబలను, జనయత్ = కనెను. భాసీ = భాసి, భాసాన్ = భాసపక్షులను, వ్యజాయత = కనెను. శ్యేనీ = శ్యేని, సుతేజసః = మంచి తేజస్సు గల, శ్యేనాంశ్చ = డేగలను, గృధ్రాంశ్చ = గ్రద్దలను, వ్యజాయత = కనెను. ధృతరాష్ట్రీ తు = ధృతరాష్ట్రి, హంసాంశ్చ = హంసలను, సర్వశః = సమస్తమైన, కలహంసాంశ్చ = కలహంసలను (కనెను).

తా. క్రౌంచి గుడ్లగూబలను, భాసి భాసపక్షులను, శ్యేని గొప్ప తేజస్సు గల డేగలను, గ్రద్దలను, ధృతరాష్ట్రి సమస్త మైన హంసలను, కనెను. 18 19

మూ. చక్రవాకాంశ్చ భద్రం తే విజజ్ఞే సాపి భామినీ,
శుకీ నతాం విజజ్ఞే తు నతాయా వినతా సుతా. 20

ప్ర. అ. సా = ఆ, భామినీ = స్త్రీ, చక్రవాకాంశ్చాపి = చక్రవాకపక్షులను కూడ, విజజ్ఞే = కనెను. తే = నీకు, భద్రమ్ = మంగళ మగుగాక. శుకీ = శుకి, నతామ్ = నతను, విజజ్ఞే = కనెను. వినతా = వినత, నతాయాః = నత యొక్క, సుతా = కుమార్తె.

తా. రామా ! నీకు మంగళ మగు గాక. ఆ ధృతరాష్ట్రి చక్రవాకపక్షులను కూడ కనెను. శుకి నతను కనెను. నత కుమార్తె వినత. 20

మూ. దశ క్రోధవశా రామ విజజ్ఞే హ్యాత్మసంభవాః,
మృగీం చ మృగమన్దాం చ హరిం భద్రమదామపి, 21

మాతఙ్గీమపి శార్దూలీం శ్వేతాం చ సురభిం తథా,
సర్వలక్షణసంపన్నాం సురసాం కద్రుకామపి. 22

ప్ర. అ. రామ = రామా ! క్రోధవశా = క్రోధవశ, మృగీం చ = మృగిని, మృగమన్దాం చ = మృగమందను, హరిమ్ = హరిని, భద్రమదామపి = భద్రమదను, మాతఙ్గీమపి = మాతంగిని, శార్దూలీమ్ = శార్దూలిని, శ్వేతామ్ = శ్వేతను, తథా = మరియు, సురభిమ్ = సురభిని, సర్వలక్షణసంపన్నామ్ = అన్ని లక్షణములతో కూడిన, సురసామ్ = సురసను, కద్రుకామపి = కద్రుకను, దశ = పదిమంది, ఆత్మసంభవాః = కుమార్తెలను, విజజ్ఞే = కనెను.

తా. రామా ! మృగి, మృగమంద, హరి, భద్రమద, మాతంగి, శార్దూలి, శ్వేత, సురభి, సర్వలక్షణసంపన్నురాలైన సురస, కద్రువ అను పదిమంది కుమార్తెలను క్రోధవశ కనెను. 21, 22

మూ. అపత్యం తు మృగాః సర్వే మృగ్యా నరవరోత్తమ,
ఋక్షాశ్చ మృగమన్దాయాః సృమరాశ్చమరా స్తథా. 23

ప్ర. అ. నరవరోత్తమ = నరశ్రేష్ఠులలో ఉత్తముడవైన రామా ! సర్వే = సమస్తమైన, మృగాః = లేళ్లు, మృగ్యాః = మృగియొక్క, అపత్యమ్ = సంతానము. ఋక్షాశ్చ = ఎలుగుబంట్లు, సృమరాః = సృమరములు, తథా = మరియు, చమరాశ్చ = చమరమృగములు, మృగమన్దాయాః = మృగమందయొక్క (సంతానము).

తా. రామా ! లేళ్లు అన్నీ మృగి సంతానము. ఎలుగుబంట్లు, సృమరములు చమరమృగములు మృగమంద సంతానము. 23

మూ. హర్యాశ్చ హరయోఽపత్యం వానరాశ్చ తరస్వినః,
తతస్త్విరావతీం నామ జజ్ఞే భద్రమదా సుతామ్. 24

ప్ర. అ. హరయః = సింహములు, తరస్వినః = బలము గల, వానరాశ్చ = వానరములు, హర్యాః = హరియొక్క, అపత్యమ్ = సంతానము. తతః = అటుపిమ్మట, భద్రమదా = భద్రమద, ఇరావతీం నామ = ఇరావతి అను పేరు గల, సుతామ్ = కుమార్తెను, జజ్ఞే = కనెను.

తా. సింహములు, బలము గల వానరములు హరి సంతానము. పిమ్మట భద్రమద ఇరావతి అను కుమార్తెను కనెను. 24

మూ. తస్యాస్త్వైరావతః పుత్రో లోకనాథో మహాగజః,
మాతఙ్గాస్త్వథ మాతఙ్గ్యా అపత్యం మనుజర్షభ. 25

ప్ర. అ. లోకనాథః = లోకములకు ప్రభువైన, ఐరావతః = ఐరావతమను, మహాగజః = మహాగజము, తస్యాః = ఆ ఇరావతియొక్క, పుత్రః = పుత్రుడు. మనుజర్షభ = మనుష్యులలో శ్రేష్ఠుడా ! అథ = మరియు, మాతఙ్గాః = ఏనుగులు, మాతఙ్గ్యాః = మాతంగియొక్క, అపత్యమ్ = సంతానము.

తా. మానవులలో శ్రేష్ఠుడ వైన రామా ! లోకములకు ప్రభు వైన ఐరావత మనే మహాగజము ఆ ఇరావతి పుత్రుడు. ఏనుగులు మాతంగి సంతానము. 25

మూ. గోలాఙ్గూలాంశ్చ శార్దూలీ వ్యాఘ్రాంశ్చాజనయత్సుతాన్,
దిశాగజాంశ్చ కాకుత్స్థ శ్వేతాప్యజనయత్సుతాన్. 26

ప్ర. అ. కాకుత్స్థ = రామా ! శార్దూలీ = శార్దూలి, గోలాఙ్గూలాంశ్చ = కొండముచ్చులను, వ్యాఘ్రాంశ్చ = పెద్దపులులను, సుతాన్ = పుత్రులనుగా, అజనయత్ = కనెను. శ్వేతాపి = శ్వేత, దిశాగజాంశ్చ = దిగ్గజములను, సుతాన్ = పుత్రులనుగా, అజనయత్ = కనెను.

తా. రామా ! శార్దూలికి కొండముచ్చులు, పెద్దపులులు పుత్రులుగా పుట్టిరి. శ్వేతకు దిగ్గజములు పుత్రులుగా పుట్టెను. 26

మూ. తతో దుహితరౌ రామ సురభిర్దేవ్యజాయత,
రోహిణీం నామ భద్రం తే గన్ధర్వీం చ యశస్వినీమ్. 27

ప్ర. అ. రామ = రామా : తతః = అటు పిమ్మట, సురభిః దేవీ = సురభి దేవి, రోహిణీం నామ = రోహిణి అను పేరు గలదానిని, యశస్వినీమ్ = కీర్తి గల, గన్ధర్వీం చ = గంధర్విని, దుహితరౌ = కుమార్తెలనుగా, అజాయత = కనెను. తే = నీకు, భద్రమ్ = మంగళ మగుగాక.

తా. రామా ! సురభి రోహిణి, కీర్తిమంతురాలైన గంధర్వి అను ఇద్దరు కుమార్తెలను కనెను. నీకు భద్ర మగుగాక. 27

మూ. రోహిణ్యజనయద్గా వై గన్ధర్వీ వాజినః సుతాన్,
సురసాఽజనయన్నాగాన్ రామ కద్రూస్తు పన్నగాన్. 28

ప్ర. అ. రామ = రామా ! రోహిణీ = రోహిణి, గాః = గోవులను, అజనయత్ = కనెను. గన్ధర్వీ = గంధర్వి, వాజినః = అశ్వములను, సుతాన్ = పుత్రులనుగా, కనెను. సురసా = సురస, నాగాన్ = చాల తలలు గల నాగములను, కద్రూస్తు = కద్రువు, పన్నగాన్ = సాధారణసర్పములను, అజనయత్ = కనెను.

తా. రామా ! రోహిణికి గోవులు, గంధర్వికి అశ్వములు, సురసకు అనేక శిరస్సులు గల నాగములు, కద్రుకు సాధారణసర్పములు సంతానముగ పుట్టెను.

మూ. మనుర్మనుష్యాన్ జనయద్రామ పుత్రాన్ యశస్వినః,
బ్రాహ్మణాన్ క్షత్రియాన్ వైశ్యాన్ శూద్రాంశ్చ మనుజర్షభ.

ప్ర. అ. మనుజర్షభ=మనుష్యులలో శ్రేష్ఠుడ వైన, రామ=రామా! మనుః = మనువు, బ్రాహ్మణాన్ = బ్రాహ్మణులను, క్షత్రియాన్ = క్షత్రియులను, వైశ్యాన్=వైశ్యులను, శూద్రాంశ్చ= శూద్రులను, యశస్వినః=కీర్తిగల, మనుష్యాన్ = ఈ మనుష్యులను, పుత్రాన్=పుత్రులనుగా, అజనయత్=కనెను.

తా. మనుష్యులలో శ్రేష్ఠుడ వైన రామా! మనువు బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అను కీర్తిమంతులైన మనుష్యులను పుత్రులనుగా కనెను. 29

మూ. సర్వాన్ పుణ్యఫలాన్ వృక్షాననలాపి వ్యజాయత,
వినతా చ శుకీపౌత్రీ కద్రూశ్చ సురసాస్వసా. 30

ప్ర. అ. అనలాపి = అనల, పుణ్యఫలాన్ = మంచి ఫలములు గల, సర్వాన్ = సమస్తమైన, వృక్షాన్ = వృక్షములను, వ్యజాయత = కనెను. వినతా చ=వినత, శుకీపౌత్రీ=శుకికి పౌత్రి (ఇక్కడ దౌహిత్రి అని అర్థము). కద్రూశ్చ = కద్రువు, సురసాస్వసా = సురస సోదరి.

తా. అనల మంచి ఫలముల నిచ్చు వృక్షములను అన్నింటిని కనెను. ఇపుడు శుకికి దౌహిత్రియైన వినతను గూర్చి, సురస సోదరి యైన కద్రువును గూర్చి చెప్పెదను.

మూ. కద్రూర్నాగం సహస్రాస్యం విజజ్ఞే ధరణీధరమ్,
ద్వౌ పుత్రౌ వినతాయాస్తు గరుడోఽరుణ ఏవ చ. 31

ప్ర. అ. కద్రూః = కద్రువ, సహస్రాస్యమ్ = వెయ్యి పడగలు గల, ధరణీధరమ్ = భూమిని మోయు, నాగమ్ = నాగమును, విజజ్ఞే = కనెను. వినతాయాస్తు=వినతకు, గరుడః = గరుడుడు, అరుణ ఏవ చ = అరుణుడు అను, ద్వౌ = ఇద్దరు, పుత్రౌ = పుత్రులు, (పుట్టిరి).

తా. కద్రువు భూమిని మోసే వేయి పడగలు గల నాగమును(ఆదిశేషుని) కనెను. వినతకు గరుడుడు, అరుణుడు అని ఇదరు పుత్రులు పుటిరి. 31

మూ. అస్మాజ్జాతోఽహ మరుణాత్సంపాతిస్తు మమాగ్రజః,
జటాయురితి మాం విద్ధి శ్యేనీపుత్రమరిందమ. 32

ప్ర. అ. అరిందమ = శత్రుసంహారకుడా ! అహమ్ = నేను, అస్మాత్ = ఈ, అరుణాత్ = అరుణునినుండి, జాతః = పుట్టితిని. సంపాతిః = సంపాతి, మమ = నాయొక్క, అగ్రజః = అన్న. శ్యేనీపుత్రమ్ = శ్యేనిపుత్రుడ నైన, మామ్ = నన్ను, జటాయురితి = జటాయువు అని, విద్ధి = తెలుసుకొనుము.

తా. శత్రుసంహారకుడవైన రామా ! నేను ఈ అరుణుని కుమారుడను. సంపాతి మా అన్నగారు. శ్యేని పుత్రుడనైన నా పేరు జటాయువు అని తెలిసికొనుము. 32

మూ. సోఽహం వాససహాయస్తే భవిష్యామి యదీచ్ఛసి,
ఇదం దుర్గం హి కాన్తారం మృగరాక్షససేవితమ్. 33
సీతాం చ తాత రక్షిష్యే త్వయి యాతే సలక్ష్మణే.

ప్ర. అ. సః అహమ్ = అట్టి నేను, ఇచ్ఛసి యది = నీవు కోరినట్లయితే, తే = నీకు, వాససహాయః = నివాసమునందు సహాయుడనుగా, భవిష్యామి = కాగలను. దుర్గమ్ = ప్రవేశింప శక్యము కాని, ఇదం కాన్తారమ్ = ఈ అరణ్యము, మృగరాక్షససేవితమ్ = మృగములచేతను, రాక్షసులచేతను సేవింపబడినది కదా. తాత = తండ్రీ ! సలక్ష్మణే = లక్ష్మణునితో కూడిన, త్వయి = నీవు, యాతే = వెళ్ళినవాడ వగుచుండగా, సీతామ్ = సీతను, రక్షిష్యే = రక్షించగలను.

తా. నీ కిష్ట మైనచో నేను నీకు వనవాసమునందు సహాయుడుగా ఉండెదను. ఎందుచేత ననగా- ప్రవేశింప శక్యము కాని ఈ అరణ్యము మృగములకు, రాక్షసులకు నివాసస్థానము. తండ్రీ ! నీవు, లక్ష్మణుడూ కూడ బైటకు వెళ్ళినప్పుడు నేను సీతను రక్షించుచుందును. 33

మూ. జటాయుషం తం ప్రతిపూజ్య రాఘవో
ముదా పరిష్వజ్య చ సంనతోఽభవత్,
పితుర్హి శుశ్రావ సఖిత్వమాత్మవాన్
జటాయుషా సంకథితం పునః పునః 34

ప్ర. అ. రాఘవః = రాముడు, తం జటాయుషమ్ = ఆ జటాయువును, ప్రతిపూజ్య=పూజించి, ముదా=సంతోషముతో, పరిష్వజ్య చ = కౌగలించుకొని, సంనతః = నమస్కరించువాడు, అభవత్ = ఆయెను. ఆత్మవాన్ = బుద్ధిశాలి యైన ఆ రాముడు, జటాయుషా = జటాయువుచేత, పునః పునః = మాటిమాటికి, సంకథితమ్ = చెప్పబడిన, పితుః = తండ్రియొక్క, సఖిత్వమ్=మిత్రత్వమును, శుశ్రావ = వినెను.

తా. రాముడు ఆ జటాయువును పూజించి, సంతోషముతో కౌగలించుకొని నమస్కరించెను. బుద్ధిశాలియైన ఆ రాముడు జటాయువునకు, తన తండ్రికి ఉన్న స్నేహమును గూర్చి ఆతడు మాటిమాటికి చెప్పగా వినెను. 34

మూ. స తత్ర సీతాం పరిదాయ మైథిలీం
సహైవ తేనాతిబలేన పక్షిణా,
జగామ తాం పఞ్చవటీం సలక్ష్మణో
రిపూన్ దిధక్షన్ శలభానివానలః. 35

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
చతుర్దశః సర్గః.

ప్ర. అ. సః = ఆ రాముడు, మైథిలీమ్ = మిథిలారాజపుత్రియైన, సీతామ్ సీతను, పరిదాయ = గ్రహించి, సలక్ష్మణః = లక్ష్మణసమేతుడై, అతిబలేన = గొప్ప బలము గల, తేన = ఆ, పక్షిణా సహైవ = పక్షితో కూడినవాడై, అనలః = అగ్ని, శలభానివ = మిడతలను వలె, రిపూన్ = శత్రువులను, దిధక్షన్ = కాల్చదలచినవాడై, తాం పఞ్చవటీమ్=ఆ పంచవటిని గూర్చి, జగామ=వెళ్ళెను.

తా. ఆ రాముడు, అగ్ని మిడతలను కాల్చినట్లు శత్రువులను కాల్చివేయ గోరుచున్నవాడై, సీతను వెంటబెట్టుకొని, లక్ష్మణసమేతుడై, ఆ జటాయువుకూడ వెంట రాగా, పంచవటికి వెళ్లెను. 35

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
అరణ్యకాండలో పదునాలవ సర్గ సమాప్తము.

అథ పఞ్చదశః సర్గః

[శ్రీరాముని ఆజ్ఞ ప్రకారము లక్ష్మణుడు పంచవటిలో ఒక సుందర మైన పర్ణశాలను నిర్మించుట. సీతాలక్ష్మణులతో రాముడు ఆ పర్ణశాలలో నివసించుట].

మూ. తతః పఞ్చవటీం గత్వా నానావ్యాళమృగాయుతామ్,
ఉవాచ భ్రాతరం రామః సౌమిత్రిం దీప్తతేజసమ్. 1

ప్ర. అ. తతః = అటు పిమ్మట, రామః = రాముడు, నానావ్యాళమృగాయుతామ్ = అనేకవిధములైన దుష్టసర్పములతోను, మృగములతోను కూడిన, పఞ్చవటీమ్ = పంచవటిని గూర్చి, గత్వా = వెళ్ళి, దీప్తతేజసమ్ = ప్రజ్వలించుచున్న తేజస్సు గల, భ్రాతరమ్ = సోదరుడైన, సౌమిత్రిమ్ = లక్ష్మణుని గూర్చి, ఉవాచ = పలికెను.

తా. పిమ్మట రాముడు అనేకవిధములైన దుష్టసర్పములతోను (లేదా మదించిన ఏనుగులతోను) ఇతర మృగములతోను వ్యాప్తమైన, పంచవటి చేరి, తేజస్సుతో ప్రకాశించుచున్న, సోదరుడైన లక్ష్మణునితో ఇట్లు పలకెను. 1

మూ. ఆగతాః స్మ యథోద్దిష్టమముం దేశం మహర్షిణా,
అయం పఞ్చవటీదేశః సౌమ్య పుష్పితకాననః. 2

ప్ర. అ. సౌమ్య = ఓ ! సౌమ్యుడా ! మహర్షిణా = మహర్షిచేత, యథోద్దిష్టమ్ = చెప్పబడిన విధముగ, అముమ్ = ఈ, దేశమ్ = ప్రదేశమును గూర్చి, ఆగతాః స్మ = వచ్చినాము. పుష్పితకాననః = పుష్పించిన అడవి గల, అయమ్ = ఈ, దేశః = ప్రదేశమే, పఞ్చవటీ = పంచవటి.

తా. ఓ! సౌమ్యుడా ! అగస్త్యమహర్షి చెప్పిన ప్రదేశమునకు వచ్చినాము, ఇక్కడ అరణ్యము అంతా పుష్పించి ఉన్నది. ఈ ప్రదేశమే పంచవటి. 2

మూ. సర్వతశ్చార్యతాం దృష్టిః కాననే నిపుణో హ్యసి,
ఆశ్రమః కతరస్మిన్నో దేశే భవతి సంమతః. 3

ప్ర. అ. కతరస్మిన్ = ఏ, దేశే = ప్రదేశమునందు, నః = మనయొక్క, ఆశ్రమః = ఆశ్రమము, సంమతః = ఇష్టము, భవతి = అగునో, కాననే = అడవి యందు, సర్వతః = అంతటా, దృష్టిః = దృష్టి, చార్యతామ్ = ప్రసరింపజేయ బడుగాక. నిపుణః = నేర్పరివి, అసి హి = అయి ఉన్నావు కదా.

తా. మనము ఏ ప్రదేశమునందు ఆశ్రమము నిర్మించుకొన్న బాగుండునో ఈ అరణ్యము నంతా పరికించుము. నీ వీ కార్యమునందు నేర్పు గలవాడవు కదా.

మూ. రమతే యత్ర వైదేహీ త్వమహం చైవ లక్ష్మణ,
తాదృశో దృశ్యతాం దేశః సంనికృష్టజలాశయః. 4

వనరామణ్యకం యత్ర స్థలరామణ్యకం తథా,
సంనికృష్టం చ యత్ర స్యాత్సమిత్పుష్పకుశోదకమ్. 5

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా! యత్ర = ఎక్కడ, వైదేహీ = సీత, రమతే = క్రీడించునో, త్వమ్ = నీవు, అహం చ = నేనూ, క్రీడింతుమో, యత్ర = ఎక్కడ, వనరామణ్యకమ్ = వనముయొక్క సౌందర్యము, తథా = మరియు, స్థలరామణ్యకమ్ = స్థలముయొక్క సౌందర్యము ఉండునో, యత్ర = ఎక్కడ, సమిత్పుష్పకుశోదకమ్ = సమిధలు, పుష్పములు, కుశలు, ఉదకము, సంని కృష్టమ్ = సమీపమునం దుండునో, తాదృశః = అట్టి, సంనికృష్టజలాశయః = సమీపమునందున్న జలస్థానము గల, దేశః = ప్రదేశము, దృశ్యతామ్ = చూడ బడుగాక.

తా. లక్ష్మణా! ఏ ప్రదేశమునందు సీత, నీవు నేను సుఖముగా నివసించ గలుగుదుమో, ఏ ప్రదేశమునందు వనసౌందర్యము, స్థలసౌందర్యము ఉండునో, ఏ ప్రదేశమునందు సమిధలు, పుష్పములు, కుశలు, ఉదకము దగ్గరగా ఉండునో, అట్టి, జలాశయమునకు దగ్గరగా ఉండు ప్రదేశమును చూడుము. 4,5

మూ. ఏవముక్తస్తు రామేణ లక్ష్మణః సంయతాఞ్జలిః,
సీతాసమక్షం కాకుత్స్థమిదం వచనమబ్రవీత్. 6

ప్ర. అ. రామేణ = రామునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, లక్ష్మణః = లక్ష్మణుడు, సంయతాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడై, సీతా సమక్షమ్ = సీత ఎదుట, కాకుత్థ్సమ్=రాముణ్ణి గూర్చి, ఇదమ్=ఈ, వచనమ్= వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. రాముని మాటలు విని లక్ష్మణుడు అంజలి ఘటించి, సీత సమక్షమున రామునితో ఇట్లు పలికెను. 6

మూ. పరవానస్మి కాకుత్థ్స త్వయి వర్షశతం స్థితే,
స్వయం తు రుచిరే దేశే క్రియతామితి మాం వద. 7

ప్ర. అ. కాకుత్థ్స= రామా! త్వయి = నీవు, వర్షశతమ్ = నూరు (అనేక) సంవత్సరములు, స్థితే=ఉండగా, పరవాన్=పరతంత్రుడను, అస్మి= అయిఉన్నాను. రుచిరే= అందమైన, దేశే= ప్రదేశమునందు, క్రియతామ్ = చేయబడుగాక, ఇతి = అని, మామ్ = నన్ను, వద = చెప్పుము.

తా. రామా! నీవు ఎన్ని సంవత్సరము లున్నను, నీవున్నంత కాలము నేను నీవు చెప్పినట్లు చేయవలసినవాడనే కాని స్వతంత్రుడను కాను. అందుచే నీవే ఒక రమ్యప్రదేశమును నిర్ణయించి అక్కడ ఆశ్రమము నిర్మించు మని నన్ను ఆజ్ఞాపించుము. 7

మూ. సుప్రీతస్తేన వాక్యేన లక్ష్మణస్య మహాత్మనః,
విమృశన్రోచయామాస దేశం సర్వగుణాన్వితమ్. 8

ప్ర. అ. మహాత్మనః = గొప్ప బుద్ధి గల, లక్ష్మణస్య = లక్ష్మణుని యొక్క, తేన వాక్యేన = ఆ వాక్యముచేత, సుప్రీతః = చాల సంతోషించినవాడై, (రాముడు) విమృశన్ = విమర్శించుచు, సర్వగుణాన్వితమ్ = సమస్తగుణములతో కూడిన, దేశమ్ = ప్రదేశమును, రోచయామాస = ఇష్టపడెను.

తా. రాముడు, మహాత్ము డైన లక్ష్మణుడు పలికిన ఆ మాటలకు సంతోషించి, బాగుగా విమర్శ చేసి, సకలగుణములతో కూడిన ఒక ప్రదేశమును ఎన్నుకొనెను. 8

మూ. స తం రుచిరమాక్రమ్య దేశమాశ్రమకర్మణి,
హస్తే గృహీత్వా హస్తేన రామః సౌమిత్రిమబ్రవీత్. 9

ప్ర. అ. సః రామః = ఆ రాముడు, తమ్ = ఆ, రుచిరమ్ = సుందరమైన, దేశమ్ = ప్రదేశమును, ఆశ్రమకర్మణి = ఆశ్రమకర్మయందు, (ఆశ్రమము నిమిత్తము), ఆక్రమ్య = ఆక్రమించి, హస్తేన = హస్తముతో, సౌమిత్రిమ్ = లక్ష్మణుని, హస్తే = హస్తమునందు, గృహీత్వా = పట్టుకొని, అబ్రవీత్ = పలికెను.

తా. ఆ రాముడు, రమ్యమైన ఆ ప్రదేశము ఆశ్రమమునకై ఉపయుక్తమని చెప్పుచు దానిపై నడచి వెళ్ళుచు, లక్ష్మణుని హస్తమును హస్తముతో గ్రహించి ఇట్లు పలికెను. 9

మూ. అయం దేశః సమః శ్రీమాన్ పుష్పితైస్తరుభిర్వృతః,
ఇహాశ్రమపదం సౌమ్య యథావత్కర్తుమర్హసి. 10

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా ! పుష్పితైః = పుష్పించిన, తరుభిః = వృక్షములతో, వృతః = కూడిన, అయం దేశః = ఈ ప్రదేశము, సమః = సమముగా ఉన్నది. శ్రీమాన్ = శోభాయుక్తమైనది. ఇహ = ఇక్కడ, యథావత్ = యథాశాస్త్రముగ, ఆశ్రమపదమ్ = ఆశ్రమస్థానమును, కర్తుమ్ = నిర్మించుటకు, అర్హసి = తగియున్నావు.

తా. సౌమ్యుడవైన ఓ లక్ష్మణా ! చుట్టూ పుష్పించిన వృక్షము లున్న, శోభాయుక్తమైన ఈ ప్రదేశము సమముగా ఎత్తుపల్లములు లేకుండగా ఉన్నది. ఇక్కడ యథావిధిగ పర్ణశాలను నిర్మింపుము. 10

మూ. ఇయమాదిత్యసంకాశైః పద్మైః సురభిగన్ధిభిః,
అదూరే దృశ్యతే రమ్యా పద్మినీ పద్మశోభితా. 11

ప్ర. అ. పద్మశోభితా = పద్మములచేత శోభింపచేయబడిన, రమ్యా = రమ్యమైన, ఇయం పద్మినీ = ఈ పద్మసరస్సు, ఆదిత్యసంకాశైః = సూర్యునితో సమానమైన, సురభిగన్ధిభిః = మంచి గంధము గల, పద్మైః = పద్మములతో, అదూరే = సమీపమునందు, దృశ్యతే = చూడబడుచున్నది.

తా. పద్మములతో శోభించుచున్న రమ్యమైన ఈ పద్మసరస్సు సూర్యుని వంటి సుగంధయుక్తములైన పద్మములతో సమీపమునందే కనబడుచున్నది. 11

మూ. యథాఖ్యాతమగస్త్యేన మునినా భావితాత్మనా,
ఇయం గోదావరీ రమ్యా పుష్పితైస్తరుభిర్వృతా. 12
హంసకారణ్డవాకీర్ణా చక్రవాకోపశోభితా.

ప్ర. అ. భావితాత్మనా = పరిశుద్ధమైన మనస్సు గల, అగస్త్యేన మునినా = అగస్త్యమునిచేత, యథా = ఎట్లు, ఆఖ్యాతమ్ = చెప్పబడినదో అట్లే, రమ్యా = సుందరమూ, పుష్పితైః = పుష్పించిన, తరుభిః = వృక్షములతో, వృతా = కూడినదీ, హంసకారణ్డవాకీర్ణా = హంసలచేతను కారండవపక్షులచేతను వ్యాప్తమూ, చక్రవాకోపశోభితా = చక్రవాకపక్షులచేత శోభింపచేయబడినది అయిన, ఇయం గోదావరీ = ఈ గోదావరీనది, చూడబడుచున్నది.

తా. పరిశుద్ధమైన మనస్సు గల అగస్త్యమహాముని చెప్పిన విధముగ, పుష్పించిన వృక్షములచేత ఆవరింపబడినదీ, హంసకారండవపక్షులచే వ్యాప్తమైనదీ, చక్రవాక పక్షులచేత ప్రకాశింపచేయబడినదీ అయిన, రమ్యమైన ఈ గోదావరీనది కూడ కనబడుచున్నది.

మూ. నాతిదూరే న చాసన్నే మృగయూథనిపీడితాః, 13
మయూరనాదితా రమ్యాః ప్రాంశవో బహుకన్దరాః,
దృశ్యన్తే గిరయః సౌమ్య పుల్లైస్తరుభిరావృతాః. 14

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా! మృగయూథనిపీడితాః = మృగముల గుంపులచేత పీడింపబడినవి, మయూరనాదితాః = నెమళ్ళచేత ధ్వనిచేయింపబడినవి, రమ్యాః = సుందరమైనవీ, ప్రాంశవః = ఎత్తైనవీ, బహుకన్దరాః = చాలా గుహలు కలవీ, పుల్లైః = వికసించిన, తరుభిః = వృక్షములచేత, ఆవృతాః = ఆవరింపబడినవి అయిన, గిరయః = పర్వతములు, నాతిదూరే = చాలదూరమునందు కాక, న చ ఆసన్నే = చాల దగ్గర కాక, దృశ్యన్తే = కనబడుచున్నవి.

తా. సౌమ్యుడా! మృగముల గుంపులతో నిండిన రమ్యములైన పర్వతములు కనబడుచున్నవి. అవి చాల దూరమునందు గాని, దగరకాని లేవు. నెమళ

ధ్వనులచేత ప్రతిధ్వనించుచున్నవి. ఇవి చాల ఎత్తుగా ఉన్నవి. వాటిలో అనేకము లైన గుహ లున్నవి. వాటికి నలుప్రైపులా వికసించిన వృక్షములు ఉన్నవి.13. 14

మూ. సౌవర్ణైరాజతైస్తామ్రైర్దేశే దేశే చ ధాతుభిః,
గవాక్షితా ఇవాభాన్తి గజాః పరమభక్తిభిః. 15

("పరమ భిత్తిభిః"అను వావిళ్ళవారి ప్రతిలోని పాఠము, తద్వ్యాఖ్యానము కూడ సంతృప్తికరంగా లేవు.)

ప్ర. అ. సౌవర్ణైః = బంగారువికారములు, రాజతైః = రజతవికారములు, తామ్రైః=రాగి వికారములు అయిన, ధాతుభిః=ధాతువులచేత, దేశే దేశే=ఆ యా ప్రదేశములందు, గవాక్షితాః = గవాక్షములు కలవిగా చేయబడిన ఈ పర్వతములు, పరమభక్తిభిః = మంచి వర్ణరచనలచేత, గజాః ఇవ = ఏనుగుల వలె, భాన్తి = ప్రకాశించుచున్నవి.

తా. ఈ పర్వతములు అన్ని ప్రదేశములందు, బంగారు ధాతువులచేతను, వెండి ధాతువులచేతను, రాగి ధాతువులచేతను గవాక్షితములై, అందమైన వర్ణ రచనలచేత ఏనుగులు వలె ప్రకాశించుచున్నవి.

వి. గవాక్ష మనగా ఆవు కన్నుల ఆకారములో ఉన్న రంధ్రాలు గల కిటికీ. పర్వతాలమీద అనేక ప్రదేశములలో బంగారు ధాతువుల రేఖలు, వెండి ధాతువుల రేఖలు, రాగి ధాతువుల రేఖలు గవాక్షముల ఆకారములలో కనబడు చున్నవి. ఏనుగులకు అలంకారార్థమై వాటి శరీరములమీద ఆ యా రంగులతో గీతలు తీర్చి గీయుదురు. దానికి "భక్తి"అని పేరు. అందుచేత ఈ విధముగ సువర్ణాది ధాతువులచేత గవాక్షితము లైన కొండలు, భక్తులచే అలంకరించిన ఏనుగుల వలె ఉన్నట్లు మహారాజాధిరాజైన రామునకు కనబడుట సహజము. 15

మూ. సాలైస్తాలైస్తమాలైశ్చ ఖర్జూరపనసామ్రకైః,
నివారైస్తిమిశైశ్చైవ పున్నాగైశ్చోపశోభితాః, 16

చూతైరశోకైస్తిలకైశ్చమ్పకైః కేతకైరపి,
పుష్పగుల్మలతోపేతై సైసైసరుభిరావృతాః, 17

చన్దనైః స్యన్దనైర్నీపైః పార్ణాసైర్లికుచైరపి,
ధవాశ్వకర్ణఖదిరైః శమీకింశుకపాటలైః. 18

ప్ర. అ. (ఈ పర్వతములు), సాలైః = మద్దిచెట్లచేతను, తాలైః = తాటి చెట్లచేతను, తమాలైశ్చ = తమాలవృక్షములచేతను, ఖర్జూరపనసామ్రకైః = ఖర్జూర-పనస-ఆమ్ర (మామిడి) వృక్షములచేతను, నివారైః = జలకంబ వృక్షములచేతను, తిమిశైశ్చైవ = నేమివృక్షములచేతను, పున్నాగైః = పున్నాగవృక్షములచేతను, ఉపశోభితాః = ప్రకాశింపచేయబడినవి. చూతైః = తియ్యమామిడి చెట్లచేత, అశోకైః = అశోకములచేత, తిలకైః = తిలకములచేత, చమ్పకైః = సంపెంగచెట్లచేత, కేతకైః = మొగలిచెట్లచేత, పుష్పగుల్మలతోపేతైః = పుష్పములతోను, పొదలతోను, లతలతోను కూడిన, తైస్తైః = ఆ యా, తరుభిః = వృక్షములచేత, ఆవృతాః = ఆవరింపబడినవి. చన్దనైః = చందనవృక్షములచేత, స్యన్దనైః = స్యందనములచేత, నీపైః = నీపవృక్షములచేత, పార్ణాసైః = పార్ణాస వృక్షములచేత, లికుచైరపి = నిమ్మచెట్లచేత, ధవాశ్వకర్ణఖదిరైః = ఉమ్మెత-ఇనుమద్ది-చండ్ర చెట్లచేత, శమీకింశుకపాటలైః = జమ్మిచెట్లచేత, మోదుగచెట్లచేత, గలిగొట్టు చెట్లచేత ఆవృతములై ఉన్నవి.

తా. ఈ పర్వతములు సాల-తాల-తమాల-పనస-ఆమ్ర-నివార-తిమిశ-పున్నాగ వృక్షములతో ప్రకాశించుచున్నవి. చూత-అశోక-తిలక-చంపక-కేతక వృక్షములచేతను, పువ్వులతో నిండిన పొదలు, లతలు చుట్టుకొన్న ఇతరవృక్షములచేతను ఆవరింపబడి యున్నవి. చందన-స్యందన-నీప-పార్ణాస-లికుచ-ధవ-అశ్వకర్ణ-ఖదిర-శమీ - కింశుక - పాటలవృక్షములచేత కూడ ఆవరింపబడి ఉన్నవి. 16-18

మూ. ఇదం పుణ్యమిదం మేధ్యమిదం బహుమృగద్విజమ్,
ఇహ వత్స్యామి సౌమిత్రే సార్ధమేతేన పక్షిణా. 19

ప్ర. అ. ఇదమ్ = ఇది, పుణ్యమ్ = పుణ్యమైనది. ఇదమ్ = ఇది, మేధ్యమ్ = పవిత్రమైనది. ఇదమ్ = ఇది, బహుమృగద్విజమ్ = అనేకమైన మృగములు పక్షులు కలది. ఏతేన = ఈ, పక్షిణా సార్ధమ్ = పక్షితో కూడ, ఇహ = ఇక్కడ, వత్స్యామి = నివసించెదను.

తా. లక్ష్మణా! ఇది పుణ్యమైనది; పవిత్రమైనది, అనేకమృగపక్షులతో నిండి యున్నది. అందుచేత ఈ జటాయువుతో కూడ ఇక్కడ నివసించెదను.

మూ. ఏవముక్తస్తు రామేణ లక్ష్మణః పరవీరహా,
అచిరేణాశ్రమం భ్రాతుశ్చకార సుమహాబలః. 20

ప్ర. అ. రామేణ = రామునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, పరవీరహా = శత్రువీరులను సంహరించు, సుమహాబలః = చాల గొప్ప బలము గల, లక్ష్మణుడు, భ్రాతుః = సోదరునకు, అచిరేణ = అల్పకాలముచేత (లో), ఆశ్రమమ్ = ఆశ్రమమును, చకార = నిర్మించెను.

తా. శత్రువీరులను సంహరించేవాడు, మహాబలశాలీ అయిన లక్ష్మణుడు రాముని మాటలు విని, ఆతనికొరకై అతిశీఘ్రముగ ఒక ఆశ్రమమును నిర్మించెను.

మూ. పర్ణశాలాం సువిపులాం తత్ర సంఘాతమృత్తికామ్,
సుస్తమ్భాం మస్కరైర్దీర్ఘైః కృతవంశాం సుశోభనామ్,

శమీశాఖాభిరాస్తీర్య దృఢపాశావపాశితామ్,
కుశకాశశరైః పర్ణైః సుపరిచ్ఛాదితాం తథా, 22

సమీకృతతలాం రమ్యాం చకార లఘువిక్రమః,
నివాసం రాఘవస్యార్థే ప్రేక్షణీయమనుత్తమమ్. 23

ప్ర. అ. లఘువిక్రమః = శీఘ్రమైన పరాక్రమము గల ఆ లక్ష్మణుడు, తత్ర = అక్కడ, సంఘాతమృత్తికామ్ = ఎత్తుగా చేయబడిన మట్టి గలది, సుస్తమ్భామ్ = మంచి స్తంభములు గలది, దీర్ఘైః = పొడవైన, మస్కరైః = వెదుళ్ళచేత, కృతవంశామ్ = చేయబడిన వెన్ను దూలము గలదీ, సుశోభనామ్ = బాగుగా ప్రకాశించునదీ, శమీశాఖాభిః = జమ్మికొమ్మలచేత, ఆస్తీర్య = పరచి, దృఢపాశావపాశితామ్ = దృఢమైన త్రాళ్లచేత కట్టబడినదీ, తథా = మరియు, కుశకాశశరైః = దర్భలచేత, రెల్లుగడ్డిచేత, పర్ణైః = ఆకులచేత, సుపరిచ్ఛాదితామ్ = బాగుగా కప్పబడినదీ, సమీకృతతలామ్ = సమముచేయబడిన తలముగలదీ, రమ్యామ్ = రమ్యమూ, సువిపులామ్ = చాలవిశాలమూ అయిన, పర్ణశాలామ్ =

పర్ణశాలను, రాఘవస్యార్థే = రామునికొరకై, అనుత్తమమ్ = శ్రేష్ఠమైన, ప్రేక్షణీయమ్ = చూడ ముచ్చట గొల్పు, నివాసమ్ = నివాసమునుగా, చకార = చేసెను.

తా. శీఘ్రమైన పరాక్రమము గల ఆ లక్ష్మణుడు, మట్టిని ఎత్తుగా చేసెను. మంచి స్తంభముల నిలిపెను. పొడవైన వెదుళ్లతో వెనుబద్ద ఏర్పాటు చేసెను. జమ్మికొమ్మలు పరచి దృఢమైన పాశములతో వాటిని కట్టి, దానిపై దర్భలు, రెల్లుగడ్డి, ఆకులు కప్పెను. నేలను సమము చేసెను. ఈ విధముగ విశాలముగాను, అందముగాను, చూడ ముచ్చట గొల్పునట్లుగాను ఉన్న పర్ణశాలను రాముని నివాసము కొరకై నిర్మించెను. 21-23

మూ. సహసా లక్ష్మణః శ్రీమాన్ నదీం గోదావరీం తదా,
స్నాత్వా పద్మాని చాదాయ సఫలః పునరాగతః. 24

ప్ర. అ. తదా = అప్పుడు, శ్రీమాన్ = శోభాయుక్తుడైన, లక్ష్మణః = లక్ష్మణుడు, సహసా = శీఘ్రముగా, గోదావరీం నదీమ్ = గోదావరి నదినిగూర్చి వెళ్ళి, స్నాత్వా = స్నానము చేసి, పద్మాని చ = పద్మములను, ఆదాయ = గ్రహించి, సఫలః = ఫలములతో కూడినవాడై, పునః = మరల, ఆగతః = వచ్చెను.

తా. శోభాసంపన్నుడైన ఆ లక్ష్మణుడు అప్పుడు గోదావరీనదికి వెళ్ళి, స్నానము చేసి, కొన్ని పద్మములు తీసికొని ఫలములు గూడ పట్టుకొని తిరిగి వచ్చెను. 24

మూ. తతః పుష్పబలిం కృత్వా శాన్తిం చ స యథావిధి,
దర్శయామాస రామాయ తదాశ్రమపదం కృతమ్. 25

ప్ర. అ తతః = అటు పిమ్మట, సః = అతడు, పుష్పబలిమ్ = పుష్పపూజను, కృత్వా = చేసి, యథావిధి = యథాశాస్త్రముగా, శాన్తిం చ = శాంతిని కూడ చేసి, కృతమ్ = నిర్మింపబడిన, తత్ = ఆ, ఆశ్రమపదమ్ = ఆశ్రమస్థానమును, రామాయ = రామునకు, దర్శయామాస = చూపెను.

తా. లక్ష్మణుడు, పిమ్మట, పుష్పములతో దేవతాపూజ చేసి, యథాశాస్త్రముగా శాంతికూడ చేసి, ఆశ్రమస్థానము సిద్ధమైనదని చెప్పి రామునకు చూపెను.

మూ. స తం దృష్ట్వా కృతం సౌమ్యమాశ్రమం సీతయా సహ,
రాఘవః పర్ణశాలాయాం హర్షమాహారయద్భృశమ్. 26

ప్ర. అ. సః రాఘవః=ఆ రాముడు, సీతయా సహ=సీతతో కూడ, తమ్=ఆ, కృతమ్=నిర్మింపబడిన, సౌమ్యమ్=సుందరమైన, ఆశ్రమమ్ = ఆశ్రమమును, సీతయా సహ = సీతతో కూడ, దృష్ట్వా=చూచి, పర్ణశాలాయామ్ = పర్ణశాలయందు, భృశమ్ = మిక్కిలి, హర్షమ్ = సంతోషమును, ఆహార యత్ = పొందెను.

తా. రాముడు సీతాసమేతుడై, లక్ష్మణుడు నిర్మించిన ఆ సుందరమైన ఆశ్రమమును చూచి, ఆ పర్ణశాలయందు చాల సంతోషమును పొందెను. 26

మూ. సుసంహృష్టః పరిష్వజ్య బాహుభ్యాం లక్ష్మణం తదా,
అతిస్నిగ్ధం చ గాఢం చ వచనం చేదమబ్రవీత్. 27

ప్ర. అ. తదా = అప్పుడు, సుసంహృష్టః = చాల సంతోషించినవాడై, లక్ష్మణమ్=లక్ష్మణుణ్ణి, బాహుభ్యామ్ = బాహువులతో, గాఢమ్=గాఢముగా, పరిష్వజ్య = కౌగలించుకొని, అతిస్నిగ్ధమ్=చాల స్నేహముతో కూడిన, ఇదమ్ ఈ, వచనమ్=వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. అప్పుడు రాముడు చాల సంతోషించి, బాహువులతో లక్ష్మణుని గాఢముగా కౌగలించుకొని, చాల స్నేహయుక్తమైన ఈ వచనమును పలికెను.

మూ. ప్రీతోఽస్మి తే మహత్కర్మ త్వయా కృతమిదం ప్రభో,
ప్రదేయో యన్నిమిత్తం తే పరిష్వఙ్గో మయా కృతః. 28

ప్ర. అ. ప్రభో = సమర్థువైన లక్ష్మణా! త్వయా = నీచేత, మహత్ = గొప్పదైన, కర్మ = పని, కృతమ్=చేయబడినది. తే=నీ విషయమునందు, ప్రీతః అస్మి=సంతోషించినాను. యన్నిమిత్తమ్ = దేని నిమిత్తమై, తే = నీకు, ప్రదేయః = ఇవ్వదగిన, పరిష్వఙ్గః = ఆలింగనము, మయా=నాచేత, కృతః = చేయబడినదో.

తా. లక్ష్మణా! నీవు సర్వసమర్థుడవు. నీవు చాల గొప్ప పని చేసితివి. నీ

విషయమున సంతోషించినాను. అందుచేతనే నీకు పారితోషికముగా ఇవ్వదగిన ఈ ఆలింగనమును నీ కిచ్చుచున్నాను. 28

మూ. భావజ్ఞేన కృతజ్ఞేన ధర్మజ్ఞేన చ లక్ష్మణ,
త్వయా నాథేన ధర్మాత్మా న సంవృత్తః పితా మమ. 29

ప్ర. అ. భావజ్ఞేన=భావమును ఎరిగినవాడవు, కృతజ్ఞేన = కార్యము తెలిసిన వాడవు, ధర్మజ్ఞేన చ=ధర్మములు తెలిసినవాడవు అయిన, నాథేన = రక్షకుడ వైన, త్వయా = నీచేత, మమ = నాయొక్క, ధర్మాత్మా = ధర్మాత్ముడైన, పితా=తండ్రి, న సంవృత్తః=మరణించలేదు.

తా. లక్ష్మణా! నీవు ఇతరుల భావము తెలిసికొనగలవాడవు, చేయదగిన కార్యములు తెలిసినవాడవు, ధర్మములు తెలిసినవాడవు. అట్టి నీవు నాకు రక్షకుడవుగా ఉండుటచే, ధర్మాత్ముడైన నా తండ్రి మరణించనట్లే. 29

మూ. ఏవం లక్ష్మణముక్త్వా తు రాఘవో లక్ష్మివర్ధనః,
తస్మిన్ దేశే బహుఫలే న్యవసత్ సుసుఖం వశీ. 30

ప్ర. అ. లక్ష్మివర్ధనః = ఐశ్వర్యమును వృద్ధి పొందించువాడు, వశీ = ఇంద్రియనిగ్రహవంతుడు అయిన, రాఘవః=రాముడు, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, బహుఫలే = అనేక ఫలములు గల, తస్మిన్ దేశే = ఆ దేశమునందు, సుసుఖమ్ = చాల సుఖముగా, న్యవసత్ = నివసించెను.

తా. లక్ష్మిని వృద్ధి పొందించువాడు, ఇంద్రియనిగ్రహవంతుడు అయిన రాముడు లక్ష్మణునితో ఇట్లు పలికి, అనేక ఫలములు గల ప్రదేశమునందు చాల సుఖముగ నివసించెను. 30

మూ. కంచిత్కాలం స ధర్మాత్మా సీతయా లక్ష్మణేన చ,
అన్వాస్యమానో న్యవసత్స్వర్గలోకే యథామరః. 31

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
పఞ్చదశః సర్గః.

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, సః = ఆ రాముడు, సీతయా = సీతచేత, లక్ష్మణేన చ = లక్ష్మణునిచేత, అన్వాస్యమానః = సేవింపబడుచున్నవాడై, స్వర్గలోకే = స్వర్గలోకమునందు, అమరః యథా = దేవేంద్రుడు వలె, కంచిత్ కాలమ్ = కొంచెము కాలము, న్యవసత్ = నివసించెను.

తా. ధర్మాత్ముడైన రాముడు ఆ ఆశ్రమములో సీత, లక్ష్మణుడు సేవింపగా స్వర్గలోకములో దేవేంద్రుడు నివసించినట్లు కొంతకాలము నివసించెను. 31

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో పదునైదవ సర్గ సమాప్తము.

అథ షోడశః సర్గః

[లక్ష్మణుడు హేమంత ఋతువును వర్ణించుట, భరతుని ప్రశంసించుట, రాముడు సీతాలక్ష్మణసమేతుడై గోదావరిలో స్నానము చేయుట].

మూ. వసతస్తస్య తు సుఖం రాఘవస్య మహాత్మనః,
శరద్వ్యపాయే హేమన్తఋతురిష్టః ప్రవర్తత. 1

ప్ర. అ. మహాత్మనః = మహాత్ముడైన, తస్య రాఘవస్య = ఆ రాముడు, సుఖమ్ = సుఖముగా, వసతః = నివసించుచుండగా, శరద్వ్యపాయే = శరత్కాలము గడచిన పిమ్మట, ఇష్టః = ఇష్టమైన, హేమన్తఋతుః = హేమంతఋతువు, ప్రవర్తత = ప్రారంభ మయ్యెను.

తా. మహాత్ముడైన ఆ రాముడు సుఖముగా నివసించుచుండగా, శరదృతువు గడచి, ఆనందకరమైన హేమంతఋతువు ప్రారంభ మయ్యెను. 1

మూ. స కదాచిత్ప్రభాతాయాం శర్వర్యాం రఘునన్దనః,
ప్రయయావభిషేకార్థం రమ్యాం గోదావరీం నదీమ్. 2

ప్ర. అ. కదాచిత్ = ఒక రోజున, సః రఘునన్దనః = ఆ రాముడు, శర్వర్యామ్ = రాత్రి, ప్రభాతాయామ్ = తెల్లవారిన దగుచుండగా, రమ్యామ్ = సుందరమైన, గోదావరీం నదీమ్ = గోదావరీనదిని గూర్చి, అభిషేకార్థమ్ = స్నానము కొరకు, ప్రయయౌ = వెళ్లెను.

తా. ఒకనాడు ఆ రాముడు రాత్రి గడచి తెల్లవారిన పిమ్మట స్నానము చేయుటకై సుందరమైన గోదావరీనదికి వెళ్లెను. 2

మూ. ప్రహ్వః కలశహస్తస్తం సీతయా సహ వీర్యవాన్,
పృష్ఠతోఽనువ్రజన్ భ్రాతా సౌమిత్రిరిదమబ్రవీత్. 3

ప్ర. అ. భ్రాతా=సోదరుడైన, వీర్యవాన్=పరాక్రమవంతుడైన, సౌమిత్రిః =లక్ష్మణుడు, ప్రహ్వః=వినీతుడై, కలశహస్తః=కలశము హస్తమునందు కలవాడై, పృష్ఠతః=వెనుకనే, సీతయా సహ=సీతతో కూడ, అనువ్రజన్=అనుసరించి వెళ్లుచు, ఇదమ్=ఈ వాక్యము, అబ్రవీత్=పలికెను.

తా. వీర్యవంతుడైన సోదరుడు లక్ష్మణుడు, సీత ఆ రాముని అనుసరించి వెళ్ళిరి. లక్ష్మణుడు చేతిలో కలశమును తీసికొని వెళ్లెను. అప్పు డాతడు చాల వినయముతో (రామునితో) ఇట్లు పలికెను. 3

మూ. అయం స కాలః సంప్రాప్తః ప్రియో యస్తే ప్రియంవద,
అలంకృత ఇవాభాతి యేన సంవత్సరః శుభః. 4

ప్ర. అ. ప్రియంవద=ప్రియముగా మాటలాడేవాడా! యః=ఏది, తే=నీకు, ప్రియః=ఇష్టమైనదో, సః అయం కాలః=అట్టి ఈ కాలము, సంప్రాప్తః=వచ్చినది. యేన=దేనిచేత, శుభః=మంగళప్రదమైన, సంవత్సరః=సంవత్సరము, అలంకృతః ఇవ=అలంకరింపబడినది వలె, ఆభాతి=ప్రకాశించుచున్నదో.

తా. ప్రియముగా మాటలాడు రామా! ఏ కాలము నీకు చాల ఇష్ట మైనదో, ఏ కాలము మంగళకర మైన సంవత్సరమును అలంకరించునట్లు ఉండునో అట్టి కాలము వచ్చినది. 4

మూ. నీహారపరుషో లోకః పృథివీ సస్యశాలినీ,
జలాన్యనుపభోగ్యాని సుభగో హవ్యవాహనః. 5

ప్ర. అ. లోకః=జనము, నీహారపరుషః=మంచుచేత బిరుసెక్కిన శరీరములు కలదై ఉన్నది. పృథివీ=భూమి, సస్యశాలినీ=సస్యములతో ప్రకాశించుచున్నది. జలాని=ఉదకములు, అనుపభోగ్యాని = అనుభవించుటకు శక్యము కాకుండా ఉన్నవి. హవ్యవాహనః=అగ్ని, సుభగః=మనోహరముగా ఉన్నది.

తా. ప్రాణుల శరీరాలు మంచుచేత బిరు సెక్కినవి. భూమి సస్యములతో ప్రకాశించుచున్నది. ఉదకములు స్నానాదులకు అనుకూలముగా లేవు. అగ్ని సుఖకరముగా ఉన్నది. 5

మూ. నవాగ్రయణపూజాభిరభ్యర్చ్య పితృదేవతాః,
కృతాగ్రయణకాః కాలే సన్తో విగతకల్మషాః. 6

ప్ర. అ. సన్తః = సత్పురుషులు, నవాగ్రయణపూజాభిః = (నూతన ధాన్యము భుజించుటకు ముందు చేయవలసిన) నూతనములైన ఆగ్రయణపూజల చేత, పితృదేవతాః = పితృదేవతలను, అభ్యర్చ్య = పూజించి, కాలే = తగిన కాలమునందు, కృతాగ్రయణాః = చేయబడిన ఆగ్రయణము కలవారై, విగతకల్మషాః = పోయిన పాపములు గలవారు.

తా. సత్పురుషులు నవాగ్రయణపూజలచేత, అనగా క్రొత్తధాన్యము తినుటకు ముందు చేయవలసిన ఆగ్రయణపూజలచేత, పితృదేవతలను పూజించి, ఆ విధముగ సకాలమున ఆగ్రయణము చేయుటచే పాపరహితులుగా ఉన్నారు. 6

మూ. ప్రాజ్యకామా జనపదాః సంపన్నతరగోరసాః,
విచరన్తి మహీపాలా యాత్రాస్థా విజిగీషవః. 7

ప్ర. అ. సంపన్నతరగోరసాః = చాల సమృద్ధముగా ఉన్న ఆవు పాడి గలవై, జనపదాః = పల్లెలు, ప్రాజ్యకామాః = అధికమైన (తీరిన) కోరిక కలవై ఉన్నవి. మహీపాలాః = రాజులు, విజిగీషవః = జయించ కోరుచున్నవారై, యాత్రాస్థాః = యాత్రలయందు ఉన్నవారై, విచరన్తి = సంచరించుచున్నారు.

తా. ఆవుల పాడి సమృద్ధముగా ఉండుటచేత పల్లెలు తీరిన కోరికలుకలవై సుఖముగా ఉన్నవి. రాజులు జయాభిలాషతో, యుద్ధయాత్రకు వెడలి సంచరించుచున్నారు. 7

మూ. సేవమానే దృఢం సూర్యే దిశమన్తకసేవితామ్,
విహీనతిలకేవ స్త్రీ నోత్తరా దిక్ ప్రకాశతే. 8

ప్ర. అ. సూర్యే = సూర్యుడు, అన్తకసేవితామ్ = యమునిచేత సేవింపబడిన, దిశమ్ = దిక్కును, దృఢమ్ = అధికముగా, సేవమానే = సేవించుచుండగా, ఉత్తరా దిక్ = ఉత్తరదిక్కు, విహీనతిలకా = తిలకములేని, స్త్రీవ = స్త్రీవలె, న ప్రకాశతే = ప్రకాశించుటలేదు.

తా. సూర్యుడు అంతకుడు సేవించు దిక్కును (దక్షిణదిక్కును)ఎక్కువగా సేవించుచుండుటచేత ఉత్తరదిక్కు తిలకములేని స్త్రీవలె ప్రకాశించుట లేదు. 8

మూ. ప్రకృత్యా హిమకోశాఢ్యో దూరసూర్యశ్చ సాంప్రతమ్,
యథార్థనామా సువ్యక్తం హిమవాన్ హిమవాన్ గిరిః. 9

ప్ర. అ. ప్రకృత్యా = స్వభావముచేత, హిమకోశాఢ్యః = హిమ (మంచు) సంపదతో నిండినదీ, సాంప్రతమ్ = ఇప్పుడు, దూరసూర్యశ్చ = దూరమైన సూర్యుడు కలదీ అయిన, హిమవాన్ గిరిః = హిమవత్పర్వతము, హిమవాన్ = మంచుకలదై, సువ్యక్తమ్ = స్పష్టముగా, యథార్థనామా = యథార్థమైన పేరు గలది.

తా. సహజముగానే సమృద్ధిగా మంచు కలదై, ఇప్పుడు సూర్యునకు దూరము కూడ అగుటచేత హిమవత్పర్వతము, అత్యధికమైన మంచుతో కప్పబడుటచే, దాని పేరు పూర్తిగా సార్థకమైనది. 9

మూ. అత్యన్తసుఖసంచారా మధ్యాహ్నే స్పర్శతః సుఖాః,
దివసాః సుభగాదిత్యాశ్ఛాయాసలిలదుర్భగాః. 10

ప్ర. అ. మధ్యాహ్నే = మధ్యాహ్నమునందు, స్పర్శతః = స్పర్శచేత, సుఖాః = సుఖకరములు, అత్యన్తసుఖసంచారాః = చాల సుఖముగా ఉన్న సంచారము కలవి అయిన, దివసాః = పగళ్లు, సుభగాదిత్యాః = సుఖకరమైన సూర్యుడు గలవి. ఛాయాసలిలదుర్భగాః = దుఃఖకరమైన నీడలు, నీళ్లు గలవి.

తా. పగళ్లు మధ్యాహ్నసమయమునందు సుఖస్పర్శ నిచ్చుచు, సంచరించుటకు సుఖకరముగా ఉన్నవి. సూర్యుడు సుఖకరముగాను, నీడలు, నీళ్ళు దుఃఖజనకములుగాను ఉన్నవి. 10

వి. ఇక్కడ ఉన్న ప్రాచ్యపాఠము బాగున్నది.

"ప్రత్యూషే దుఃఖసంచారా మధ్యాహ్నసమయే సుఖాః,
దివసాః సుభగాః పుణ్యాస్త్వరితా వ్యతియాన్తి నః."

"ఇప్పుడు పగటిభాగములలో ప్రాతఃకాలమునందు సంచారము దుఃఖకర

ముగా ఉన్నది. మధ్యాహ్నసమయమునందు సుఖకరముగా ఉన్నది. ఇట్టి పుణ్యమైన, అందమైన దివసములు, మనకు, శీఘ్రముగా గడచిపోవుచున్నవి" అని దీని భావము.

మూ. మృదుసూర్యాః సనీహారాః పటుశీతాః సమారుతాః,
శూన్యారణ్యా హిమధ్వస్తా దివసా భాన్తి సామ్ప్రతమ్. 11

ప్ర. అ. సామ్ప్రతమ్ = ఇప్పుడు, హిమధ్వస్తాః = మంచుచేత పీడింపబడిన, దివసాః = పగటిభాగములు, మృదుసూర్యాః = మృదువైన (తీవ్రముగా లేని) సూర్యుడు గలవై, సనీహారాః = మంచుతో కూడినవై, పటుశీతాః = సమర్థమైన చలిగలవై, సమారుతాః = వాయువుతో కూడినవై, శూన్యారణ్యాః = శూన్యమైన అరణ్యములు గలవై, భాన్తి = ప్రకాశించుచున్నవి.

తా. ఇప్పుడు మంచుచేత పీడింపబడిన పగటిభాగములలో సూర్యుడు తీక్ష్ణముగా లేడు. పొగమంచు కప్పి ఉన్నది. చలి అధికముగా ఉన్నది. గాలి అధికముగా వీచుచున్నది. అరణ్యము లన్నీ జంతుసంచారశూన్యములై ఉన్నవి.

మూ. నివృత్తాకాశశయనాః పుష్యనీతా హిమారుణాః,
శీతా వృద్ధతరాయామాస్త్రియామా యాన్తి సామ్ప్రతమ్.

ప్ర. అ. సామ్ప్రతమ్ = ఇప్పుడు, నివృత్తాకాశశయనాః = నివర్తించిన ఆకాశశయనము (బైట పండుకొనుట)గలవి, పుష్పహీనాః=పుష్పములతో శూన్యముగా ఉన్నవీ, హిమారుణాః = మంచుచేత అరుణవర్ణముగా (ధూసరవర్ణముగా) ఉన్నవి, శీతాః = చల్లనివి, వృద్ధతరాయామాః = చాల పెరిగిన దీర్ఘత్వము గలవి ఆయిన, పుష్యనీతాః = పుష్యమాసముచే పొందింపబడిన, త్రియామాః=రాత్రులు, యాన్తి = గడచుచున్నవి.

తా. ఇప్పుడు పుష్యమాసమునకు సంబంధించిన రాత్రులలో ఎవ్వరూ బైట పండుకొనుటలేదు. ఇవి మంచుచేత, చల్లగా ధూసరవర్ణముగా ఉన్నవి. వీటి దీర్ఘత్వము చాల పెరిగినది. ఈ విధముగ ఈ రాత్రులు గడచుచున్నవి. 12

మూ. రవిసంక్రాన్తసౌభాగ్యస్తుషారారుణమణ్డలః,
నిఃశ్వాసాన్ధ ఇవాదర్శశ్చన్ద్రమా న ప్రకాశతే. 13

ప్ర. అ. రవిసంక్రాన్తసౌభాగ్యః = సూర్యునియందు సంక్రమించిన సౌందర్యము కలవాడు, తుషారారుణమణ్డలః = పొగమంచుచేత ఎఱ్ఱగా నున్న మండలము గలవాడు అయిన, చన్ద్రమాః = చంద్రుడు, నిఃశ్వాసాన్ధః=నిట్టూర్పు చేత గ్రుడ్డిదైన, ఆదర్శ ఇవ = అద్దము వలె, న ప్రకాశతే = ప్రకాశించుటలేదు.

తా. ఇప్పుడు చంద్రుని సౌందర్యము సూర్యునకు సంక్రమించినది. చంద్రమండలము పొగమంచుచేత ఎఱ్ఱగా కనబడుచున్నది. అట్టి చంద్రమండలము నోటిగాలి తగులుటచేత గ్రుడ్డిదిగా (ప్రతిబింబము కనబడనదిగా) అయిపోయిన అద్దము వలె, ప్రకాశహీనమై ఉన్నది. 13

మూ. జ్యోత్స్నా తుషారమలినా పౌర్ణమాస్యాం న రాజతే,
సీతేవ చాతపశ్యామా లక్ష్యతే న తు శోభతే. 14

ప్ర. అ. పౌర్ణమాస్యామ్=పౌర్ణమాసియందు, తుషారమలినా=మంచుచేత మలినమైన, జ్యోత్స్నా=వెన్నెల, న రాజతే=ప్రకాశించుటలేదు. ఆతపశ్యామా= ఎండచేత నల్లబడిన, సీతేవ = సీత వలె, లక్ష్యతే = కనబడుచున్నది కాని, న తు శోభతే = శోభించుటలేదు.

తా. పూర్ణిమనాటి వెన్నెల కూడ మంచుచేత మలినమై, ప్రకాశవంతముగా లేదు. ఎండ తగులుటచే నల్లబడిన శరీరచ్ఛాయ గల సీత వలె ఈ వెన్నెల కనబడుచున్నది గాని శోభించుటలేదు. 14

మూ. ప్రకృత్యా శీతలస్పర్శో హిమవిద్ధశ్చ సామ్ప్రతమ్,
ప్రవాతి పశ్చిమో వాయుః కాలే ద్విగుణశీతలః. 15

('కాలే'కు బదులు "కల్యమ్"అను ప్రాచ్యపాఠము బాగున్నది)

ప్ర. అ. ప్రకృత్యా = స్వభావముచేత, శీతలస్పర్శః = చల్లని స్పర్శ గలది, సామ్ప్రతమ్=ఇప్పుడు, హిమవిద్ధశ్చ=మంచుచేత వ్యాప్తమైన, పశ్చిమః వాయుః = పశ్చిమవాయువు, కల్యమ్ = ప్రాతఃకాలమునందు, ద్విగుణశీతలః = రెట్టింపు చల్లనిదై, వాతి = వీచుచున్నది.

తా. సహజముగానే చల్లగా ఉంది, ఇప్పుడు మంచు కూడ కలియుటచే పశ్చిమవాయువు రెట్టింపు చల్లగా వీచుచున్నది. 15

మూ. బాష్పచ్ఛన్నాన్యరణ్యాని యవగోధూమవన్తి చ,
శోభన్తేఽభ్యుదితే సూర్యే నదద్భిః క్రౌఞ్చసారసైః. 16

ప్ర. అ. బాష్పచ్ఛన్నాని = ఆవిరివంటి మంచుచేత కప్పబడిన, యవగోధూమవన్తి చ = యవలు గోధుమలు గల, అరణ్యాని = అరణ్యములు, సూర్యే = సూర్యుడు, అభ్యుదితే = ఉదయించిన వా డగుచుండగా, నదద్భిః = ధ్వని చేయుచున్న, క్రౌఞ్చసారసైః = క్రౌంచపక్షులతోను సారసపక్షులతోను, శోభన్తే = ప్రకాశించుచున్నది.

తా. యవల చేలు, గోధుమల చేలు ఉన్న అరణ్యప్రదేశములు పొగ మంచుచేత కప్పబడినవి. సూర్యు డుదయించగానే అవి ధ్వనిచేయుచున్న క్రౌంచ పక్షులతోను, సారసపక్షులతోను అందముగా కనబడుచున్నవి. 16

మూ. ఖర్జూరపుష్పాకృతిభిః శిరోభిః పూర్ణతణ్డులైః,
శోభన్తే కించిదానమ్రాః శాలయః కనకప్రభాః. 17

ప్ర. అ. కనకప్రభాః = బంగారు కాంతి గల, శాలయః = వరిచేలు, ఖర్జూరపుష్పాకృతిభిః = ఖర్జూరపుష్పము వంటి ఆకారము గలవి, పూర్ణతణ్డులైః = తండులములతో నిండినవి అయిన, శిరోభిః = శిరస్సులతో, కించిత్ = కొంచెము, ఆనమ్రాః = వంగినవై, శోభన్తే = ప్రకాశించుచున్నవి

తా. బంగారు రంగు గల వరిచేలు ఖర్జూరపుష్పము వంటి ఆకారముగల, బియ్యముతో నిండిన శిరస్సులతో కొంచెము వంగి చూచుటకు అందముగా ఉన్నవి. 17

మూ. మయూఖైరుపసర్పద్భిర్హిమనీహారసంవృతైః,
దూరమభ్యుదితః సూర్యః శశాఙ్క ఇవ లక్ష్యతే. 18

ప్ర. అ. హిమనీహారసంవృతైః = చల్లని పొగమంచుచేత కప్పబడిన, ఉపసర్పద్భిః = ప్రసరించుచున్న, మయూఖైః = కిరణములతో, సూర్యః = సూర్యుడు, దూరమ్ = పైకి, అభ్యుదితః = వచ్చినవాడైనను, శశాఙ్కః ఇవ = చంద్రుడు వలె, లక్ష్యతే = కనబడుచున్నాడు.

తా. వ్యాపించుచున్న కిరణములు చల్లని పొగమంచుచేత కప్పబడి ఉండుటచే సూర్యుడు బాగా పైకి వచ్చిన తరవాత కూడ చంద్రుడు వలె కనబడుచున్నాడు. 18

మూ. అగ్రాహ్యవీర్యః పూర్వాహ్ణే మధ్యాహ్నే స్పర్శతః సుఖః,
సంరక్తః కించిదాపాణ్డురాతపః శోభతే క్షితౌ. 19

ప్ర. అ. పూర్వాహ్ణే = ప్రాతఃకాలసమయమునందు, అగ్రాహ్యవీర్యః = గ్రహింపబడని శక్తిగలది, మధ్యాహ్నే = మధ్యాహ్నమునందు, స్పర్శతః = స్పర్శచేత, సుఖః = సుఖకరము, సంరక్తః = ఎఱ్ఱగా ఉన్నది, కించిత్ = కొంచెము ఆపాణ్డుః = తెల్లగా నున్నది అయిన, ఆతపః = ఎండ, క్షితౌ = నేలపై, శోభతే = ప్రకాశించుచున్నది.

తా. ఎఱ్ఱగాను కొంచెము తెల్లగాను ఉన్న ఎండ నేలపై పడుచున్నది. ప్రాతఃకాలమునందు దీని వేడిమి తెలియుటలేదు మధ్యాహ్నమునందు ఇది సుఖకరముగా ఉన్నది. 19

మూ. అవశ్యాయనిపాతేన కించిత్ప్రక్లిన్నశాద్వలా,
వనానాం శోభతే భూమిర్నివిష్టతరుణాతపా. 20

ప్ర. అ. అవశ్యాయనిపాతేన = మంచు పడుటచేత, కించిత్ = కొంచెము, ప్రక్లిన్నశాద్వలా = తడసిన పచ్చిక బీడులు కలది, నివిష్టతరుణాతపా = ప్రసరించిన లేత ఎండ గలదీ అయిన, వనానామ్ = వనములయొక్క, భూమిః = భూమి, శోభతే = ప్రకాశించుచున్నది.

తా. ఈ వనప్రదేశములో ఉన్న పచ్చిక బైళ్ళపై మంచు పడుటచే అవి కొంచెము తడిగా ఉన్నవి. వాటిపై లేత ఎండ ప్రసరించుటచే ఈ ప్రదేశము చూచుటకు అందముగా ఉన్నది. 20

మూ. స్పృశంస్తు విమలం శీతముదకం ద్విరదః సుఖమ్,
అత్యన్తతృషితో వన్యః ప్రతిసంహరతే కరమ్. 21

ప్ర. అ. అత్యన్తతృషితః = మిక్కిలి దప్పికొన్న, వన్యః = వనమునకు సంబంధించిన, ద్విరదః = ఏనుగ, విమలమ్ = నిర్మలము, శీతమ్ = చల్లనిదీ

అయిన, ఉదకమ్ = ఉదకమును, సుఖమ్=సుఖముగా, స్పృశన్ = స్పృశించుచు, కరమ్ = తొండమును, ప్రతిసంహరతి = వెనుకకు లాగికొనుచున్నది.

తా. చాల దప్పి గొన్న ఈ అడవి ఏనుగు నిర్మలమైన చల్లని ఉదకమును సుఖముగా స్పృశించి వెంటనే తొండమును వెనుకకు లాగికొనుచున్నది.

మూ. ఏతే హి సముపాసీనా విహగా జలచారిణః,
నావగాహన్తి సలిలమప్రగల్భా ఇవాహవమ్. 22

ప్ర. అ. సముపాసీనాః = సమీపమునందు కూర్చొని ఉన్న, ఏతే = ఈ, జలచారిణః = నీటిలో సంచరించే, విహగాః = పక్షులు, అప్రగల్భాః=పిరికివాళ్ళు, ఆహవమ్ ఇవ = యుద్ధమును వలె, సలిలమ్ = ఉదకమును, నావగాహన్తి = ప్రవేశించుటలేదు.

తా. నీటికి దగ్గరనే కూర్చున్న ఈ నీటిపక్షులు పిరికివాళ్ళు యుద్ధములో ప్రవేశించనట్లు, నీటిలో ప్రవేశించుటలేదు.

మూ. అవశ్యాయతమోనద్ధా నీహారతమసా వృతాః,
ప్రసుప్తా ఇవ లక్ష్యన్తే విపుష్పా వనరాజయః. 27

ప్ర. అ. ("అవశ్యాయపరిక్లిన్నాః" అను ప్రాచ్యపాఠము బాగున్నది.) అవశ్యాయపరిక్లిన్నాః = మంచుచేత తడిసినవి, నీహారతమసా = చీకటి వంటి పొగమంచుచేత, ఆవృతాః = ఆవరింపబడినవి అయిన, విపుష్పాః = పుష్పములు లేని, వనరాజయః = వనపంక్తులు, ప్రసుప్తాః ఇవ = నిద్రపోవుచున్నవి వలె, లక్ష్యన్తే = కనబడుచున్నవి.

తా. మంచుకు తడిసి చీకటి వంటి పొగమంచుచేత కప్పబడిన, పుష్పశూన్యములైన వనపంక్తులు నిద్రించుచున్నట్లు ఉన్నవి. 23

మూ. బాష్పసంఛన్నసలిలా రుతవిజ్ఞేయసారసాః,
హిమార్ద్రవాలుకైస్తీరైః సరితో భాన్తి సామ్ప్రతమ్. 24

ప్ర. అ. సామ్ప్రతమ్ = ఇప్పుడు, బాష్పసంఛన్నసలిలాః = ఆవిరిచేత కప్పబడిన ఉదకము గల, రుతవిజ్ఞేయసారసాః = కూతలచేతనే తెలియదగిన

సారసపక్షులు గల, సరితః = నదులు, హిమార్ద్రవాలుకైః = మంచుచేత తడిసిన ఇసుక గల, తీరైః = తీరములతో, భాన్తి = ప్రకాశించుచున్నవి.

తా. నదులలోని నీటిపై ఆవిరి ఉండుటచేత నీరు కప్పబడిపోయి, ఆ నీటిలో ఉన్న సారసపక్షులు కూడ కంటికి కనబడుటలేదు. వాటి కూతలను పట్టి మాత్రమే అవి అక్కడ ఉన్నట్లు తెలియుచున్నది. అట్టి నదులు మంచుకు తడిసిన ఇసుక గల తీరములతో శోభించుచున్నవి. 24

మూ. తుషారపతనాచ్చైవ మృదుత్వాద్భాస్కరస్య చ,
శైత్యాదగాధస్థమపి ప్రాయేణ రసవజ్జలమ్. 25

ప్ర. అ. తుషారపతనాచ్చైవ = మంచు పడుటవలనను, భాస్కరస్య = సూర్యుడు, మృదుత్వాత్ = మృదువుగా (తీక్ష్ణము కాకుండగా) ఉండుటవలనను, శైత్యాత్ = శైత్యమువలనను, రసవత్ = రుచి గల, జలమ్ = జలము, అగాధస్థమపి = లోతుగా ఉన్నను, ప్రాయేణ = సాధారణముగా (అపేయమ్=త్రాగుటకు తగినదిగా లేదు.)

తా. మంచు పడుటవలనను, సూర్యుడు అంతగా వేడిగా లేకపోవుటవలనను, శీతముగా ఉండుటవలనను, లోతుగా ఉన్న నీరు కూడ చాలవరకు త్రాగ వీలుగా లేదు.

వి. ఇది ప్రాచీనవ్యాఖ్యానము "అపేయమ్"అనే పదం అధ్యాహారం తెచ్చుకొని అర్థం చెప్పినారు. ఇలాంటి జలము త్రాగుటకు తగనిది ఎందుచేత అగునో తెలియదు. వాస్తవానికి లోతైన కూపాదిజలం శీతకాలంలో వెచ్చగా ఉండి పేయంగానే ఉంటుంది కదా. అందుచేత "శైత్యాదగాగ్రస్థమపి"అనే గోరఖ్‌పూర్‌ప్రతిలోని పాఠము. ప్రాచ్యపాఠము బాగున్నది. పైన చెప్పిన కారణాలచేత సాధారణంగా త్రాగడానికి అనుకూలంగా ఉండని కొండపైన ఉండే జలం కూడ చల్లగా పేయముగా ఉండును. "అగాగ్రస్థమపి = కొండమీద ఉన్నదైనను, జలమ్ = జలము, ప్రాయేణ = సాధారణముగా (చాలవరకు), రసవత్ = మంచి రుచిగలది"అని అర్థము. 25

మూ. జరాజర్జరితైః పద్మైః శీర్ణకేసరకర్ణికైః,
నాళశేషై రిమధ్వస్తైర్న భాన్తి కమలాకరాః. 26

ప్ర. అ. కమలాకరాః = పద్మసరస్సులు, జరాజర్జరితైః = పలితనము చేత (వాడిపోవుటచేత) శిథిలముగా చేయబడిన, శీర్ణకేసరకర్ణికైః = రాలిపోయిన కింజల్కములు, మధ్యనున్న దుద్దులు గల, నాళశేషైః = కాడలే మిగిలినవిగా గల, హిమధ్వస్తైః = మంచుచేత నశింపచేయబడిన, పద్మైః = పద్మములతో, న భాన్తి = ప్రకాశించుటలేదు.

తా. పద్మసరస్సులలోని పద్మములు మంచుచేత నశింపచేయబడినవై, వాడి, శిథిలమైపోయినవి. పద్మాలలోని కింజల్కములు, దుద్దులు రాలిపోయినవి. కాడలు మాత్రము మిగిలినవి. అట్టి పద్మములతో పద్మసరస్సులు శోభావిహీనముగా ఉన్నవి. 26

మూ. అస్మింస్తు పురుషవ్యాఘ్రః కాలే దుఃఖసమన్వితః,
తపశ్చరతి ధర్మాత్మా త్వద్భక్త్యా భరతః పురే. 27

ప్ర. అ. అస్మిన్ కాలే = ఈ కాలమునందు, పురుషవ్యాఘ్రః = పురుషులలో శ్రేష్ఠుడు, ధర్మాత్మా = ధర్మాత్ముడూ అయిన, భరతః = భరతుడు, దుఃఖసమన్వితః = దుఃఖముతో కూడినవాడై, త్వద్భక్త్యా = నీయందు భక్తితో, పురే = పట్టణమునందు, తపః = తపస్సు, చరతి = ఆచరించుచున్నాడు.

తా. పురుషశ్రేష్ఠుడు, ధర్మాత్ముడు అయిన భరతుడు ఈ కాలములో కూడ దుఃఖించుచు, నీయందు భక్తితో, పట్టణములో, తపస్సు చేయుచున్నాడు.

మూ. త్యక్త్వా రాజ్యం చ మానం చ భోగాంశ్చ వివిధాన్ బహూన్
తపస్వీ నియతాహారః శేతే శీతే మహీతలే. 28

ప్ర. అ. రాజ్యం చ = రాజ్యమును, మానమ్ = మానమును, వివిధాన్ = అనేకవిధములైన, బహూన్ = అనేకవిధములైన, భోగాంశ్చ = భోగములను, త్యక్త్వా = విడచి, తపస్వీ = తపస్సు కలవాడై, నియతాహారః = నియతమైన ఆహారము కలవాడై, శీతే = చల్లని, మహీతలే = నేలమీద, శేతే = శయనించుచున్నాడు.

తా. ఆతడు రాజ్యమును, ఆత్మసంమానమును, వివిధములైన అనేక భోగములను విడచి, ఆహారనియమము పాటించుచు, తపస్సు ఆచరించుచు చల్లని నేలమీద శయనించుచున్నాడు. 28

మూ. సోఽపి వేళామిమాం నూనమభిషేకార్థముద్యతః,
వృతః ప్రకృతిభిర్నిత్యం ప్రయాతి సరయూం నదీమ్.

ప్ర. అ. సోఽపి = ఆ భరతుడు, ఇమాం వేళామ్ = ఈ సమయమును (సమయమునందు), అభిషేకార్థమ్ = స్నానముకొరకు, ఉద్యతః = ఉద్యుక్తుడై, ప్రకృతిభిః = మంత్రులతో, వృతః = కూడినవాడై, నిత్యమ్ = నిత్యము, సరయూం నదీమ్ = సరయూనదిని గూర్చి, ప్రయాతి = వెళ్లుచుండును. నూనమ్ = నిశ్చయము.

తా. ఆ భరతుడు కూడ నిత్యము ఇదే సమయమునందు స్నానార్థమై బయలుదేరి, మంత్రులతో కూడినవాడై, సరయూనదికి వెళ్ళుచుండును. 29

మూ. అత్యన్తసుఖసంవృద్ధః సుకుమారః సుఖోచితః,
కథం న్వపరరాత్రేషు సరయూమవగాహతే. 30

ప్ర. అ. అత్యన్తసుఖసంవృద్ధః = మిక్కిలి సుఖముగా పెరిగినవాడు, సుకుమారః = సుకుమారుడు, సుఖోచితః = సుఖాలకు అలవాటుపడినవాడు అయిన భరతుడు, అపరరాత్రేషు = రాత్రుల చివరి భాగములందు, కథం ను = ఎట్లు, సరయూమ్ = సరయూనదిని, అవగాహతే = ప్రవేశించుచున్నాడో కదా.

తా. భరతుడు చాల సుఖాలతో పెరిగినాడు, సుకుమారుడు, సుఖాలకు అలవాటుపడినాడు. అట్టి భరతుడు తెల్లవారుజాములందు సరయూస్నాన మెట్లు చేయుచున్నాడో కదా. 30

మూ. పద్మపత్రేక్షణో వీరః శ్యామో నిరుదరో మహాన్,
ధర్మజ్ఞః సత్యవాదీ చ హ్రీనిషేధో జితేన్ద్రియః. 31

ప్రియాభిభాషీ మధురో దీర్ఘబాహురరిందమః,
సంత్యజ్య వివిధాన్ భోగానార్యం సర్వాత్మనా శ్రితః. 32

ప్ర. అ. పద్మపత్రేక్షణః = పద్మము రేకుల వంటి నేత్రములు కలవాడు, వీరః = వీరుడు, శ్యామః = నల్లనివాడు, నిరుదరః = పొట్టలేనివాడు, (సన్నని నడుము గలవాడు), మహాన్ = గొప్పవాడు, ధర్మజ్ఞః = ధర్మము తెలిసినవాడు, సత్యవాదీ చ = సత్యమునే పలుకువాడు, హ్రీనిషేధః = సిగుచేత చెడ్డ కార్యముల

నుండి మరలువాడు (ఇది క్లిష్టార్థము "హ్రీనిషేవీ"అను ప్రాచ్యపాఠము బాగున్నది సిగ్గును సేవించువాడు, అనగా సిగ్గు గలవాడు అని అర్థము), జితేన్ద్రియః = జయింపబడిన ఇంద్రియములు కలవాడు, ప్రియాభిభాషీ = ప్రియముగా మాటలాడువాడు, మధురః = తీయని స్వభావము గలవాడు, దీర్ఘబాహుః = దీర్ఘములైన బాహువులు కలవాడు, అరిందమః = శత్రుసంహారకుడు అయిన భరతుడు, వివిధాన్ = అనేకవిధములైన, భోగాన్ = భోగములను, సంత్యజ్య = విడచి, సర్వాత్మనా = అన్ని విధముల, ఆర్యమ్ = పూజ్యుడవైన నిన్ను, శ్రితః = ఆశ్రయించినాడు.

తా. పద్మము రేకుల వంటి నేత్రములు గల భరతుడు వీరుడు. నల్లని శరీరకాంతి గలవాడు. మహాత్ముడైన ఆతని నడుము సన్నముగా ఉండును. ధర్మములు తెలిసినవాడు; సత్యమునే పలుకును; సిగ్గు గలవాడు; ఇంద్రియములను జయించినవాడు; ప్రియముగా మాటలాడును. ఆతని స్వభావము మధురమైనది. ఆతని బాహువులు చాల పొడవైనవి. శత్రువినాశకుడు. అట్టి భరతుడు అనేక విధములైన భోగములను, విడచి సర్వవిధముల పూజ్యుడవైన నిన్నే ఆశ్రయించినాడు. 31, 32

మూ. జితః స్వర్గస్తవ భ్రాత్రా భరతేన మహాత్మనా,
వనస్థమపి తాపస్యే యస్త్వామనువిధీయతే. 33

ప్ర. అ. యః = ఏ భరతుడు, వనస్థమపి = వనములో ఉన్నవాడవైనను, త్వామ్ = నిన్ను, తాపస్యే = తపశ్చరణమునందు, అనువిధీయతే = అనుసరించుచున్నాడో, అట్టి తవ భ్రాత్రా = నీ సోదరుడైన, మహాత్మనా = మహాత్ముడైన, భరతేన = భరతునిచేత, స్వర్గః = స్వర్గము, జితః = జయింపబడినది.

తా. భరతుడు నీవు అరణ్యములో ఉన్నా నిన్నే అనుకరించుచు తపస్సు చేయుచున్నాడు. అట్టి మహాత్ముడైన, నీ సోదరుడు, భరతుడు స్వర్గమును జయించినాడు. 33

మూ. న పిత్ర్యమనువర్తన్తే మాతృకం ద్విపదా ఇతి,
ఖ్యాతో లోకప్రవాదోఽయం భరతేనాన్యథా కృతః. 34

ప్ర. అ. ద్విపదాః = మానవులు, పిత్ర్యమ్ = తండ్రి స్వభావమును, న

అనువర్తన్తే = అనుసరించరు. మాతృకమ్ = తల్లి స్వభావమునే, అనుకరింతురు, ఇతి = అని, ఖ్యాతః = ప్రసిద్ధమైన, అయమ్ = ఈ, లోకప్రవాదః = లోకములోని ప్రవాదము, భరతేన = భరతునిచేత, అన్యథా = మరొకవిధముగా, కృతః = చేయబడినది.

తా. "మానవులు తండ్రి స్వభావమును అనుసరించరు; తల్లి స్వభావమును అనుకరింతురు"అని లోకములో ప్రసిద్ధముగా ఉన్న ఈ ప్రవాదమును (లోకోక్తిని) భరతుడు తారుమారుచేసినాడు; తల్లి స్వభావమును అనుసరించలేదు. 34

మూ. భర్తా దశరథో యస్యాః సాధుశ్చ భరతః సుతః,
కథం ను సామ్బా కైకేయీ తాదృశీ క్రూరశీలినీ. 35

ప్ర. అ. యస్యాః = ఎవతెకు, దశరథః = దశరథుడు, భర్తా = భర్తయో, సాధుః = సత్పురుషుడైన, భరతః = భరతుడు, సుతః = కుమారుడో, సా = అట్టి, అమ్బా = మన తల్లి, కైకేయీ = కైకేయి, తాదృశీ = అంతటి, క్రూరశీలినీ = క్రూరస్వభావము కలది, కథం ను = ఎట్లయినదో ?

తా. దశరథమహారాజు భర్తగా ఉండి, సత్పురుషుడైన భరతుణ్ణి కన్న మన తల్లి కైకేయికి అంతటి క్రూరస్వభావము ఎట్లు వచ్చెనో కదా ! 35

మూ. ఇత్యేవం లక్ష్మణే వాక్యం స్నేహాద్బ్రువతి ధార్మికే,
పరివాదం జనన్యాస్తమసహన్రాఘవోఽబ్రవీత్. 36

ప్ర. అ. ధార్మికే = ధార్మికుడైన, లక్ష్మణే = లక్ష్మణుడు, స్నేహాత్ = భ్రాతృస్నేహమువలన, ఇత్యేవమ్ = ఇట్లు, వాక్యమ్ = వాక్యమును, బ్రువతి = పలుకుచుండగా, రాఘవః = రాముడు, జనన్యాః = తల్లియొక్క, తమ్ = ఆ, పరివాదమ్ = నిందను, అసహన్ = సహించనివాడై, అబ్రవీత్ = పలికెను.

తా. ధర్మాత్ముడైన లక్ష్మణుడు సోదరులపై తన కున్న స్నేహమును పురస్కరించుకొని ఈ విధముగా మాటలాడుచుండగా, రాముడు తల్లియైన కైకేయి నిందను సహింప జాలక ఇట్లు పలికెను. 36

మూ. న తేఽమ్బా మధ్యమా తాత గర్హితవ్యా కథం చన,
తామేవేక్ష్వాకునాథస్య భరతస్య కథాం కురు. 37

ప్ర. అ. తాత = తండ్రీ ! మధ్యమా = మధ్యమురాలైన, అమ్బా = తల్లి, కథం చన = ఏ విధముగానూ కూడ, తే = నీకు, న గర్హితవ్యా = నిందింప దగినది కాదు. ఇక్ష్వాకునాథస్య = ఇక్ష్వాకువంశప్రభువైన, భరతస్య = భరతుని యొక్క, తాం కథామేవ = ఆ కథనే, కురు = చేయుము.

తా. నాయనా ! లక్ష్మణా ! నీ వెట్టి పరిస్థితులలోను మన మధ్యమమాతయైన కైకేయిని నిందించగూడదు. ఇక్ష్వాకువంశప్రభువైన భరతునకు సంబంధించిన ఆ మాటలే చెప్పుము. 37

మూ. నిశ్చితాపి హి మే బుద్ధిర్వనవాసే దృఢవ్రతా,
భరతస్నేహసంతప్తా బాలిశీక్రియతే పునః. 37

ప్ర. అ. మే = నాయొక్క, బుద్ధిః = బుద్ధి, నిశ్చితాపి = నిశ్చయము చేసి కొన్నదైనను, వనవాసే = వనవాసమువిషయమునందు, దృఢవ్రతా = దృఢమైన వ్రతము కలదైనను, భరతస్నేహసంతప్తా = భరతునియందు స్నేహముచేత పీడింపబడినదై, పునః = మరల, బాలిశీక్రియతే = మూఢము చేయబడుచున్నది.

తా. నేను వనవాసవ్రతము చేయవలె నని దృఢముగా నిశ్చయించుకొని వనవాసము చేయుచున్నాను. అయినను భరతుని స్నేహముచేత దుఃఖించుచు, "అయ్యో ! భరతుడు దగ్గర లేదు కదా"అని నా బుద్ధి చలించిపోవుచుండును. 38

మూ. సంస్మరామ్యస్య వాక్యాని ప్రియాణి మధురాణి చ,
హృద్యాన్యమృతకల్పాని మనఃప్రహ్లాదనాని చ. 39

ప్ర. అ. ప్రియాణి = ప్రియమైనవి, మధురాణి = మధురముగా ఉన్నవి, హృద్యాని = మనోహరములైనవి, అమృతకల్పాని=అమృతముతో సమానమైనవి, మనఃప్రహ్లాదనాని చ=మనస్సుకు ఆనందము కలిగించునవి అయిన, అస్య వాక్యాని = ఈతని మాటలను, సంస్మరామి = స్మరించుచున్నాను.

తా. భరతుని మాటలు చాల ప్రియముగా, మధురముగా ఉండును. హృదయమునకు హత్తుకొని, అమృతము వలె మనస్సుకు ఆనందము కలిగించేవిగా ఉండును. ఆ మాట లింకను నా మనస్సులో మెదులుచున్నవి. 39

మూ. కదా న్వహం సమేష్యామి భరతేన మహాత్మనా,
శత్రుఘ్నేన చ వీరేణ త్వయా చ రఘునన్దన. 40

ప్ర. అ. రఘునన్దన=లక్ష్మణా! అహమ్=నేను, మహాత్మనా=మహాత్ము డైన, భరతేన=భరతునితోను, వీరేణ=వీరుడైన, శత్రుఘ్నేన చ=శత్రుఘ్నుని తోను, త్వయా చ=నీతోను, కదా ను=ఎప్పుడు, సమేష్యామి=కలుసు కొందునో!

తా. లక్ష్మణా! నేను మహాత్ముడైన భరతునితోను, వీరుడైన శత్రుఘ్నుని తోను, నీతోను ఎప్పుడు కలిసి ఉండగలనో! 40

మూ. ఇత్యేవం విలపంస్తత్ర ప్రాప్య గోదావరీం నదీమ్,
చక్రేఽభిషేకం కాకుత్స్థః సానుజః సహ సీతయా. 41

ప్ర. అ. కాకుత్స్థః=రాముడు, తత్ర=అక్కడ, ఇత్యేవమ్=ఇట్లు, విలపన్=దుఃఖించుచు, గోదావరీం నదీమ్=గోదావరీనదిని, ప్రాప్య=పొంది, సానుజః=తమ్మునితో కూడినవాడై, సీతయా సహ=సీతతో కూడ, అభిషేకమ్ =స్నానమును, చక్రే=చేసెను.

తా. రాముడు అక్కడ ఈ విధముగ దుఃఖించుచు, గోదావరీనదిని చేరి, తమ్మునితోను, సీతతోను కలిసి, ఆ గోదావరీనదిలో స్నానము చేసెను. 41

మూ. తర్పయిత్వాథ సలిలైస్తే పితౄన్ దైవతాని చ,
స్తువన్తి స్మోదితం సూర్యం దేవతాశ్చ సమాహితాః. 42

ప్ర. అ. అథ=అటుపిమ్మట, తే=ఆ సీతారామలక్ష్మణులు, సలిలైః= ఉదకములచేత, పితౄన్=పితృదేవతలను, దైవతాని చ=దేవతలను, తర్ప యిత్వా=తృప్తి పొందించి, ఉదితమ్=ఉదయించిన, సూర్యమ్=సూర్యుణ్ణి, దేవతాశ్చ=ఇతరదేవతలను, సమాహితాః=సావధానచిత్తులై, స్తువన్తి స్మ= స్తుతించిరి.

తా. ఆ సీతారామలక్ష్మణులు గోదావరీజలములతో పితృతర్పణము, దేవతాతర్పణము చేసి, ఉదయించిన సూర్యుణ్ణి, ఇతరదేవతలను ఏకాగ్రచిత్తముతో స్తుతించిరి. 42

మూ. కృతాభిషేకః స రరాజ రామః
సీతాద్వితీయః సహ లక్ష్మణేన,
కృతాభిషేకో గిరిరాజపుత్ర్యా
రుద్రః సనన్దీ భగవానివేశః. 43

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
షోడశః సర్గః.

ప్ర. అ. సీతాద్వితీయః = సీతతో కూడిన, సః రామః = ఆ రాముడు, కృతాభిషేకః = చేయబడిన స్నానము గలవాడై, సహలక్ష్మణేన = లక్ష్మణునితో కూడినవాడై, గిరిరాజపుత్ర్యా = పార్వతీదేవితో, కృతాభిషేకః = చేయబడిన స్నానము గల, సనన్దీ = నందికేశ్వరునితో కూడిన, ఈశః = జగత్ప్రభు వైన, రుద్రః ఇవ = రుద్రుడు వలె, రరాజ = ప్రకాశించెను.

తా. సీతతో కలిసి స్నానము చేసిన లక్ష్మణసహితుడైన ఆ రాముడు, పార్వతీదేవితో కలసి స్నానము చేసిన, నందికేశ్వరసహితుడు అయిన, సకల లోకప్రభువైన, రుద్రుడు వలె ప్రకాశించెను. 43

'బాలానందిని''అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో
పదహారవ సర్గ సమాప్తము.

అథ సప్తదశః సర్గః

[రాముని పర్ణశాలవద్దకు శూర్పణఖ వచ్చి రాముణ్ణి గూర్చి తెలుసుకొని, తనను గూర్చి అతనికి తెలిపి, "నన్ను భార్యగా స్వీకరింపుము" అని అతనిని కోరుట].

మూ. కృతాభిషేకో రామస్తు సీతా సౌమిత్రిరేవ చ,
తస్మాద్ గోదావరీతీరాత్తతో జగ్ముః స్వమాశ్రమమ్. 1

ప్ర. అ. కృతాభిషేకః=చేయబడిన స్నానము గల, రామస్తు=రాముడు, సీతా = సీత, సౌమిత్రిరేవ చ = లక్ష్మణుడు, తతః = అటు పిమ్మట, తస్మాత్ = ఆ, గోదావరీతీరాత్ = గోదావరీతీరమునుండి, స్వమ్ = తమ సంబంధమైన, ఆశ్రమమ్ = ఆశ్రమమును గూర్చి, జగ్ముః = వెళ్ళిరి.

తా. స్నానము చేసిన పిమ్మట, రాముడు, సీత, లక్ష్మణుడు ఆ గోదావరీ తీరమునుండి తమ ఆశ్రమమునకు వెళ్ళిరి. 1

మూ. ఆశ్రమం తముపాగమ్య రాఘవః సహ లక్ష్మణః,
కృత్వా పౌర్వాహ్ణికం కర్మ పర్ణశాలాముపాగమత్. 2

ప్ర. అ. సహలక్ష్మణః = లక్ష్మణునితో గూడిన, రాఘవః=రాముడు, తమ్ = ఆ, ఆశ్రమమ్=ఆశ్రమమును, ఉపాగమ్య = చేరి, పౌర్వాహ్ణికమ్=పూర్వాహ్ణమునకు సంబంధించిన, కర్మ = కర్మను, కృత్వా = చేసి, పర్ణశాలామ్ = పర్ణశాలను, ఉపాగమత్ = చేరెను.

తా. లక్ష్మణసమేతుడైన రాముడు ఆ ఆశ్రమము చేరి, పూర్వాహ్ణమునందు చేయదగిన కర్మలు నిర్వర్తించుకొని పర్ణశాలకు వెళ్ళెను. 2

మూ. ఉవాస సుఖిత స్తత్ర పూజ్యమానో మహర్షిభిః,
లక్ష్మణేన సహ భ్రాత్రా చకార వివిధాః కథాః. 3

ప్ర. అ. మహర్షిభిః = మహర్షులచేత, పూజ్యమానః = పూజింపబడుచున్న వాడై, తత్ర = అక్కడ, సుఖితః = సుఖముకలవాడై, ఉవాస = నివసించెను,

భ్రాత్రా = సోదరుడైన, లక్ష్మణేన సహ = లక్ష్మణునితో కూడ, వివిధాః = అనేక విధములైన, కథాః = మాటలను, చకార = చేసెను.

తా. రాముడు మహర్షులచేత ఆదరింపబడుచు, ఆ ఆశ్రమమునందు సుఖముగా నివసించెను. సోదరుడైన లక్ష్మణునితో కలిసి అనేకవిధములైన సంభాషణలు చేయుచుండెను. 3

మూ. స రామః పర్ణశాలాయామాసీనః సహ సీతయా,
విరరాజ మహాబాహుశ్చిత్రయా చన్ద్రమా ఇవ. 4

ప్ర. అ. సీతయా సహ = సీతతో కూడ, పర్ణశాలాయామ్ = పర్ణశాల యందు, ఆసీనః = కూర్చొని ఉన్న, మహాబాహుః = గొప్ప బాహువులు గల, సః రామః = ఆ రాముడు, చిత్రయా = చిత్రానక్షత్రముతో కూడిన, చన్ద్రమాః ఇవ = చంద్రుడు వలె, విరరాజ = ప్రకాశించెను.

తా. సీతాసమేతుడై పర్ణశాలలో కూర్చొని ఉన్న మహాబాహువైన ఆ రాముడు, చిత్రానక్షత్రముతో కూడి యున్న చంద్రుడు వలె ప్రకాశించెను. 4

మూ. తథాసీనస్య రామస్య కథాసంసక్తచేతసః,
తం దేశం రాక్షసీ కాచిదాజగామ యదృచ్ఛయా. 5

ప్ర. అ. రామస్య = రాముడు, కథాసంసక్తచేతసః = సంభాషణలో ఆసక్తి గల చిత్తము కలవాడై, తథా = అట్లు, ఆసీనస్య = కూర్చొని యుండగా, కా చిత్ = ఒకానొక, రాక్షసీ = రాక్షసస్త్రీ, యదృచ్ఛయా = దైవవశముచేత, తం దేశమ్ = ఆ ప్రదేశమును గూర్చి, ఆజగామ = వచ్చెను.

తా. రాముడా విధముగ ఆసక్తమైన మనస్సుతో సంభాషణలో మునిగి యుండగా, దైవవశముచేత ఒక రాక్షసస్త్రీ ఆ ప్రదేశమునకు వచ్చెను. 5

మూ. సా తు శూర్పణఖా నామ దశగ్రీవస్య రక్షసః,
భగినీ రామమాసాద్య దదర్శ త్రిదశోపమమ్. 6

ప్ర. అ. రక్షసః = రాక్షసుడైన, దశగ్రీవస్య = రావణునియొక్క, భగినీ = సోదరియైన, శూర్పణఖా నామ = శూర్పణఖ అను పేరు గల, సా తు = ఆ

రాక్షసస్త్రీ, త్రిదశోపమమ్ = దేవతాపురుషునితో సమానుడైన, రామమ్ = రాముణ్ణి, ఆసాద్య = సమీపించి, దదర్శ = చూచెను.

తా. రావణు డనే రాక్షసుని సోదరియైన శూర్పణఖ అను పేరు గల ఆ రాక్షసి, దేవతాపురుషుడు వలె ఉన్న ఆ రామునికి దగ్గరగా వచ్చి ఆతనిని చూచెను. 6

మూ. సింహోరస్కం మహాబాహుం పద్మపత్రనిభేక్షణమ్,
ఆజానుబాహుం దీప్తాస్యమతీవ ప్రియదర్శనమ్. 7

గజవిక్రాన్తగమనం జటామణ్డలధారిణమ్,
సుకుమారం మహాసత్త్వం పార్థివవ్యఞ్జనాన్వితమ్. 8

రామమిన్దీవరశ్యామం కన్దర్పసదృశప్రభమ్,
బభూవేన్ద్రోపమం దృష్ట్వా రాక్షసీ కామమోహితా. 9

ప్ర. అ. సింహోరస్కమ్=సింహము వంటి వక్షఃస్థలము కలవాడు, మహాబాహుమ్ = బలిష్ఠమైన బాహువులు గలవాడు, పద్మపత్రనిభేక్షణమ్ = పద్మము రేకుల వంటి నేత్రములు కలవాడు, ఆజానుబాహుమ్ = మోకాళ్లవరకు పొడవైన బాహువులు కలవాడు, దీప్తాస్యమ్ = ప్రకాశించుచున్న ముఖము కలవాడు, అతీవ =మిక్కిలి, ప్రియదర్శనమ్=ఆనందకరమైన దర్శనము కలవాడు, గజవిక్రాన్తగమనమ్ = గజగమనము వంటి గమనము గలవాడు, జటామణ్డలధారిణమ్ = జటామండలమును ధరించినవాడు, సుకుమారమ్ = సుకుమారుడు, మహాసత్త్వమ్ = గొప్ప బలము గలవాడు, పార్థివవ్యఞ్జనాన్వితమ్ = రాజలక్షణములతో కూడినవాడు, ఇన్దీవరశ్యామమ్ = నల్లకలువ వలె శ్యామవర్ణము గలవాడు, కన్దర్పసదృశప్రభమ్=మన్మథునితో సమానమైన కాంతి గలవాడు; ఇన్ద్రోపమమ్=ఇంద్రునితో సమానుడు అయిన, రామమ్=రాముణ్ణి, దృష్ట్వా=చూచి, రాక్షసీ=ఆ శూర్పణఖ, కామమోహితా = కామముచేత మోహితురాలు, బభూవ = ఆయెను.

తా. బలిష్ఠమైన బాహువులు గల ఆ రాముని వక్షఃస్థలము సింహము వక్షఃస్థలము వలె విశాలముగా ఉండెను. నేత్రములు పద్మము రేకుల వలె ఉండెను. మోకాళ వరకు వ్రేలాడు దీర్ఘమైన బాహువులతో, తేజస్సుతో వెలుగొందుచున్న

ముఖముతో ఆ రాముడు చూచువారికి ఆనందము కలిగించుచుండెను. ఏనుగ వలె అందముగా, హుందాతనము ఉట్టిపడు నట్లు నడచే ఆ రాముడు జటామండలము ధరించి ఉండెను. సుకుమారుడు, మహాబలశాలీ అయిన ఆ రామునిలో మహారాజ లక్షణము లన్నీ కనబడు చుండెను. నల్లకలువ వంటి శరీరచ్ఛాయ గలిగి, మన్మ థునివంటి సౌందర్యముతో, మహేంద్రుడు వలె ఉన్న ఆ రాముణ్ణి చూడగానే ఆ శూర్పణఖ కామమోహితురా లయ్యెను. 7, 8, 9

మూ. సుముఖం దుర్ముఖీ రామం వృత్తమధ్యం మహోదరీ,
విశాలాక్షం విరూపాక్షీ సుకేశం తామ్రమూర్ధజా. 10

ప్రీతిరూపం విరూపా సా సుస్వరం భైరవస్వరా,
తరుణం దారుణా వృద్ధా దక్షిణం వామభాషిణీ. 11

న్యాయవృత్తం సుదుర్వృత్తా ప్రియమప్రియదర్శనా,
శరీరజసమావిష్టా రాక్షసీ వాక్యమబ్రవీత్. 12

ప్ర. అ. దుర్ముఖీ=చెడ్డ ముఖము కలది, మహోదరీ=పెద్ద పొట్ట గలది, విరూపాక్షీ=వికృతమైన నేత్రములు కలది, తామ్రమూర్ధజా=ఎఱ్ఱని కేశములు గలది, విరూపా=వికృతరూపము గలది, భైరవస్వరా=కటుస్వరము గలది, దారుణా వృద్ధా=భయంకరముగా ఉన్న వృద్ధురాలు, వామభాషిణీ=చెడ్డగా మాటలాడునది, సుదుర్వృత్తా=చాలా చెడ్డ నడవడిక గలది, అప్రియదర్శనా=అప్రియమైన దర్శనముగలది అయిన, రాక్షసీ=ఆ రాక్షసి, సుముఖమ్=అంద మైన ముఖము గలవాడు, వృత్తమధ్యమ్=సన్నని నడుము గలవాడు, విశాలాక్షమ్=విశాలములైన నేత్రములు కలవాడు, సుకేశమ్=మంచి జుట్టుకలవాడు, ప్రీతిరూపమ్=ఆనందమును కలిగించు రూపము కలవాడు, సుస్వరమ్=మధుర మైన కంఠధ్వని గలవాడు, తరుణమ్=యువకుడు, దక్షిణమ్ = (మాటలలో) నేర్పరి, న్యాయవృత్తమ్=న్యాయమైన ప్రవృత్తి గలవాడు, ప్రియమ్=చూచుటకు సంతోషము కలిగించువాడు అయిన, రామమ్=రాముణ్ణి గూర్చి, శరీరజసమావిష్టా =మన్మథునిచేత ఆవహింపబడినదై, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్= పలికెను.

తా. ఆ రాక్షసి రాముణి చూడగానే మన్మథునిచే ఆవహింపబడెను. ఆ

రాముని ముఖము చాల అందమైనది; ఆమె ముఖము వికృతముగా ఉన్నది. ఆతని నడుము సన్నగా నున్నది; ఆమె పొట్ట చాల పెద్దది. ఆతని నేత్రములు విశాల మైనవి; ఆమె నేత్రములు వికృతముగా ఉన్నవి. ఆతని జుట్టు నల్లగా అందముగా ఉన్నది; ఆమె జుట్టు ఎఱ్ఱగా ఉన్నది. చూచువారికి ఆనందము కలిగించే రూప మాతనిది; ఆమెది వికృతమైన రూపము. ఆతని కంఠధ్వని మధురమైనది. ఆమె కంఠధ్వని కర్ణకఠోరము. ఆతడు నవయౌవనవంతుడు; ఆమె వెగటు కలిగించు వృద్ధురాలు. ఆతడు మాటలలో నేర్పరి, ఆమె గ్రామ్యభాషలు మాట లాడును. ఆతని నడవడిక న్యాయసమ్మతమై ఉండును; ఆమె చాలా చెడ్డ నడత గలది. ఆతడు చూచువారికి ఆనందమును కలిగించును; ఆమె చూచువారికి ఏవగింపు కలి గించును. అట్టి ఆ రాక్షసి రామునితో ఇట్లు పలికెను. 10, 11, 12

మూ. జటీ తాపసరూపేణ సభార్యః శరచాపధృత్,
ఆగత స్త్వమిమం దేశం కథం రాక్షససేవితమ్, 13
కిమాగమనకృత్యం తే తత్త్వమాఖ్యాతుమర్హసి.

ప్ర. అ. త్వమ్ = నీవు, జటీ = జటాధారివై, సభార్యః=భార్యతో కూడిన వాడవై, శరచాపధృత్ = శరములను ధనస్సును ధరించినవాడవై, తాపసరూపేణ =మునివేషముచేత, రాక్షససేవితమ్ = రాక్షసులచేత సేవింపబడిన, ఇమం దేశమ్ = ఈ ప్రదేశమును గూర్చి, కథమ్ = ఎట్లు, ఆగతః = వచ్చినావు ? తే = నీయొక్క, ఆగమనకృత్యమ్ = రాకయొక్క పని, కిమ్ = ఏమి ? తత్త్వమ్ = యథార్థమును, ఆఖ్యాతుమ్ = చెప్పుటకు, అర్హసి = తగిఉన్నావు.

తా. నీవు భార్యాసమేతుడవై, ధనుర్బాణములు ధరించి, జటాధారివై, ముని వేషముతో, రాక్షసుల నివాసమైన ఈ ప్రదేశమునకు ఎందుకు వచ్చినావు ? నీవు ఇక్కడకు వచ్చిన పని ఏమి? యథార్థముగా చెప్పుము. 13

మూ. ఏవముక్తస్తు రాక్షస్యా శూర్పణఖ్యా పరంతపః, 14
ఋజుబుద్ధితయా సర్వమాఖ్యాతుముపచక్రమే.

ప్ర. అ. రాక్షస్యా=రాక్షసియైన, శూర్పణఖ్యా=శూర్పణఖచేత, ఏవమ్= ఇట్లు, ఉక్తః = పలుకబడిన, పరంతపః = శత్రుపీడకు డగు రాముడు, ఋజు

బుద్ధితయా=కుటిలత్వము లేని బుద్ధి కలవా డగుటచేత, సర్వమ్=సమస్తమును, ఆఖ్యాతుమ్ = చెప్పుటకు, ఉపచక్రమే = ఉపక్రమించెను.

తా. శత్రుపీడకుడైన రాముడు రాక్షసి యైన శూర్పణఖ మాటలు విని, ఋజుబుద్ధి కలవాడగుటచేత విషయము నంతను ఉన్నదున్నట్లు చెప్పుటకు ప్రారంభించెను. 14

మూ. అనృతం న హి రామస్య కదాచిదపి సంమతమ్, 15
విశేషేణాశ్రమస్థస్య సమీపే స్త్రీజనస్య చ.

ప్ర. అ. రామస్య = రామునకు, అనృతమ్ = అసత్యము, కదాచిదపి = ఎన్నడూ, న సంమతం హి = ఇష్టము కాదు కదా. ఆశ్రమస్థస్య = ఆశ్రమములో ఉండగాను, స్త్రీజనస్య = స్త్రీలయొక్క, సమీపే చ = సమీపమునందును, విశేషేణ = విశేషించి, న సంమతమ్ = సంమతము కాదు.

తా. రామునకు ఎన్నడూ అసత్యము ఇష్టము కాదు. విశేషించి, ఆతడు ఆశ్రమములో ఉన్నప్పుడు, స్త్రీల ఎదుట అసత్యము ఆతనికి ఇష్టము కాదు. 15

మూ. ఆసీద్దశరథో నామ రాజా త్రిదశవిక్రమః, 16
తస్యాహమగ్రజః పుత్రో రామో నామ జనైః శ్రుతః.

ప్ర. అ. త్రిదశవిక్రమః = దేవతలవంటి పరాక్రమము గల, దశరథో నామ = దశరథు డను పేరు గల, రాజా = రాజు, ఆసీత్ = ఉండెను. అహమ్ = నేను, తస్య = ఆతనియొక్క, అగ్రజః = జ్యేష్ఠుడనైన, పుత్రః = పుత్రుడను; రామో నామ = రాము డను పేరు గలవాడుగా, జనైః = జనులచేత, శ్రుతః = వినబడినవాడను.

తా. దేవతల వంటి పరాక్రమము గల, దశరథు డను రాజు ఉండెను. నేను ఆతని జ్యేష్ఠపుత్రుడను. నన్ను రాము డని జనులు అందురు. 16

మూ. భ్రాతాయం లక్ష్మణో నామ యవీయాన్మామనువ్రతః, 17
ఇయం భార్యా చ వైదేహీ మమ సీతేతి విశ్రుతా.

ప్ర. అ. అయమ్ = ఇతడు, లక్ష్మణో నామ=లక్ష్మణు డనే పేరు గల,

యవీయాన్ = చిన్నవాడైన, భ్రాతా = సోదరుడు, మామ్ = నన్ను, అనువ్రతః = అనుసరించి నియమమును పాటించువాడు. వైదేహీ = విదేహదేశరాజు కూతురైన, ఇయమ్ = ఈమె, మమ = నాయొక్క, భార్యా = భార్య. సీతేతి = సీత అని, విశ్రుతా = ప్రసిద్ధ మైనది.

తా. లక్ష్మణు డను పేరు గల ఇతడు నా తమ్ముడు. నన్ను అనుసరించి నియమపాలనము చేయుచున్నాడు. విదేహరాజపుత్రియైన ఈమె నా భార్య. ఈమె పేరు సీత. 17

మూ. నియోగాత్తు నరేన్ద్రస్య పితుర్మాతుశ్చ యన్త్రితః, 18
ధర్మార్థం ధర్మకాఙ్క్షీ చ వనం వస్తుమిహాగతః.

ప్ర. అ. నరేన్ద్రస్య = రాజైన, పితుః = తండ్రియొక్క, మాతుశ్చ = తల్లియొక్క, నియోగాత్ = ఆజ్ఞవలన, యన్త్రితః = నియమితుడనై, ధర్మకాఙ్క్షీ చ = ధర్మమును కోరుచున్నవాడనై, ధర్మార్థమ్ = ధర్మము నిమిత్తము, ఇహ = ఇక్కడ, వస్తుమ్ = నివసించుటకు, వనమ్ = వనమును గూర్చి, ఆగతః = వచ్చినాను.

తా. నేను రాజైన తండ్రి, తల్లి ఇచ్చిన ఆజ్ఞకు బద్ధుడనై ధర్మమును అనుసరించవలె నను కోరికతో, ధర్మముకొరకై ఇక్కడ నివసించుటకు ఈ వనమునకు వచ్చితిని. 18

మూ. త్వాం తు వేదితుమిచ్ఛామి కథ్యతాం క్వాసి కస్య వా, 19
న హి తావన్మనోజ్ఞాఙ్గీ రాక్షసీ ప్రతిభాసి మా.

ప్ర. అ. త్వామ్ = నిన్ను గూర్చి, వేదితుమ్ = తెలిసికొనుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను; కథ్యతామ్ = చెప్పబడుగాక. క్వ = ఎక్కడ, అసి = ఉన్నావు ? కస్య వా = ఎవనికి సంబంధించినదానవు ? మనోజ్ఞాఙ్గీ = సుందరమైన శరీరము గల నీవు, రాక్షసీ = రాక్షసస్త్రీగా, మా = నన్ను గూర్చి (నాకు), న ప్రతిభాసి = తోచుటలేదు.

తా. నీ వెవ్వరివో తెలిసికొనగోరుచున్నాను. ఎక్కడ నివసింతువు ?

ఎవరి భార్యవు ? చెప్పుము. ఇంత సుందరమైన శరీరము గల నీవు రాక్షస్త్రీ వని నాకు తోచుటలేదు.

వి. ఈ ప్రతిలో ఇంతకు ముందు ఎక్కడా శూర్పణఖ సుందరస్త్రీవేషము ధరించి వచ్చి నట్లు చెప్పలేదు. అందుచేత "న హి తావన్మనోజ్ఞాఙ్గీ" ఇత్యాది వాక్యము అసంగతంగా కనబడుతుంది. గోరఖ్‌పూర్ ప్రతిలో-"త్వం హి తావన్మ నోజ్ఞాఙ్గీ రాక్షసీ ప్రతిభాతి మే"అను పాఠ మున్నది. "మనోహర మైన శరీరము గల నీవు రాక్షసస్త్రీవి అయి ఉందు వని నాకు తోచుచున్నది"అని దాని అర్థము. ఇక్కడ రాముడు "మనోజ్ఞాఙ్గీ"అని పరిహాసపూర్వకముగా అని యుండును. ఈ పాఠము బాగున్నట్లు తోచుచున్నది.

ప్రాచ్యపాఠములో మాత్రము కథలో కొంత మార్పు ఉన్నది, రాముడు గోదావరిస్నానము చేసి వచ్చిన తరువాత జటాయువు వచ్చి, తాను తన బంధు మిత్రాదులను చూచుటకై మరొక ప్రాంతమునకు వెళ్ళుచున్నట్లు చెప్పి రామాదుల అనుమతి తీసికొనివెళ్ళను. పిమ్మట శూర్పణఖ లోకోత్తరసౌందర్యము గల స్త్రీ రూపముతో వచ్చి నట్లు మూడు నాలుగు శ్లోకాలలో వర్ణింపబడినది. కాని దానిలో ఈ శ్లోకం మాత్రం లేదు. 19

మూ. ఇహ వా కిం నిమిత్తం త్వమాగతా బ్రూహి తత్త్వతః, 20
సాబ్రవీద్వచనం శ్రుత్వా రాక్షసీ మదనార్దితా.

ప్ర. అ. ఇహ = ఇక్కడికి, కింనిమిత్తమ్ = ఎందునిమిత్తము, త్వమ్ = నీవు, ఆగతా వా = వచ్చినావో, తత్త్వతః = యథార్థముగా, బ్రూహి = చెప్పుము. వచనమ్ = ఈ వచనమును, శ్రుత్వా = విని, మదనార్దితా = మన్మథునిచేత పీడింపబడిన, సా రాక్షసీ = ఆ రాక్షసస్త్రీ, అబ్రవీత్ = పలికెను.

తా. "నీవు ఎందుకొరకై ఇక్కడకు వచ్చినావు? యథార్థముగా చెప్పుము". ఆ శూర్పణఖ రాముని మాటలు విని, మన్మథునిచేత పీడింపబడినదై ఇట్లు చెప్పెను. 20

మూ. శ్రూయతాం రామ వక్ష్యామి తత్త్వార్థం వచనం మమ. 21
అహం శూర్పణఖా నామ రాక్షసీ కామరూపిణీ
అరణ్యం విచరామీదమేకా సర్వభయంకరా. 22

ప్ర. అ. అహమ్ = నేను, శూర్పణఖా నామ = శూర్పణఖ అను పేరు గల, కామరూపిణీ = ఇచ్ఛానుసారము రూపము గల, రాక్షసీ = రాక్షసస్త్రీని. ఏకా = నే నొక్కదాననే, సర్వభయంకరా = అందరికీ భయముకలిగించుచు, ఇదమ్ = ఈ, అరణ్యమ్ = అరణ్యమును, విచరామి = సంచరించుచుందును.

తా. నేను శూర్పణఖ అను రాక్షసస్త్రీని; కోరిన రూపము ధరింప శక్తి గలదానను; నేను ఒక్కదానినే, అందరికీ భయము కలిగించుచు ఈ అరణ్యములో సంచరించుచుందును. 21,22

మూ. రావణో నామ మే భ్రాతా బలీయాన్ రాక్షసేశ్వరః,
వీరో విశ్రవసః పుత్రో యది తే శ్రోత్రమాగతః. 23

ప్ర. అ. బలీయాన్ = అధికబలము గలవాడు, వీరః = వీరుడు, విశ్రవసః = విశ్రవసునియొక్క, పుత్రః = పుత్రుడూ అయిన, రావణో నామ = రావణుడనే పేరు గల, రాక్షసేశ్వరః = రాక్షసరాజు, మే = నాయొక్క, భ్రాతా = సోదరుడు, తే = నీయొక్క, శ్రోత్రమ్ = చెవిని, ఆగతః యది = పొందిఉండవచ్చును.

తా. అధికబలశాలి, వీరుడు, విశ్రవసుని పుత్రుడు అయిన రావణుడనే రాక్షసరాజు నా సోదరుడు. నీ వాతనిని గూర్చి వినియే ఉందువు. 23

మూ. ప్రవృద్ధనిద్రశ్చ సదా కుమ్భకర్ణో మహాబలః,
విభీషణస్తు ధర్మాత్మా న తు రాక్షసచేష్టితః 24
ప్రఖ్యాతవీర్యౌ చ రణే భ్రాతరౌ ఖరదూషణౌ.

ప్ర. అ. సదా = ఎల్లప్పుడు, ప్రవృద్ధనిద్రః = వృద్ధి పొందిన నిద్ర గల, మహాబలః = గొప్ప బలము గల, కుమ్భకర్ణః చ = కుంభకర్ణుడు కూడ, నా సోదరుడు. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, విభీషణస్తు = విభీషణుడు కూడ నా సోదరుడు. తు = కాని, రాక్షసచేష్టితః = రాక్షసప్రవృత్తి కలవాడు, న = కాడు. రణే = యుద్ధమునందు, ప్రఖ్యాతవీర్యౌ = ప్రసిద్ధమైన వీర్యము గల, ఖరదూషణౌ చ = ఖరదూషణులు కూడ, భ్రాతరౌ = నా సోదరులు.

తా. ఎల్లప్పుడూ అత్యధికమైన నిద్ర గల, మహాబలవంతుడైన కుంభ

కర్ణుడు, ధర్మాత్ముడు రాక్షసప్రవృత్తి లేనివాడు అయిన విభీషణుడు నా సోదరులు. యుద్ధములో ప్రసిద్ధమైన పరాక్రమము గల ఖరదూషణులు కూడ నా సోదరులు. 24

మూ. తానహం సమతిక్రాన్తా రామ త్వా పూర్వదర్శనాత్, 25
సముపేతాస్మి భావేన భర్తారం పురుషోత్తమమ్.

ప్ర. అ. రామ = రామా ! అహమ్ = నేను, తాన్ = వాళ్లనందరినీ, సమతిక్రాన్తా = అతిక్రమించి ఉన్నాను. పూర్వదర్శనాత్ = మొట్టమొదటి దర్శనము నుండి, పురుషోత్తమమ్ = పురుషశ్రేష్ఠుడవైన, త్వా = నిన్ను, భర్తారమ్ = భర్తనుగా, భావేన = మనోభావముచేత, సముపేతా = పొందినదానను, అస్మి = అయినాను.

తా. రామా ! నేను వాళ్ళ నెవ్వరినీ లెక్కచేయను. తొలి సారిగ చూచినది మొదలు, పురుషులలో శ్రేష్ఠుడ వైన నిన్ను, మనోభావముచేత, భర్తగా పొందినాను. 25

మూ. అహం ప్రభావసంపన్నా స్వచ్ఛన్దబలగామినీ, 26
చిరాయ భవ మే భర్తా సీతయా కిం కరిష్యసి.

ప్ర. అ. అహమ్ = నేను, ప్రభావసంపన్నా = ప్రభావముతో కూడినదానను; స్వచ్ఛన్దబలగామినీ = బలముతో స్వేచ్ఛగా వెళ్లేదానను. చిరాయ = చాల కాలము, మే = నాకు, భర్తా = భర్తవుగా, భవ = అగుము. సీతయా = సీతతో, కిం కరిష్యసి = ఏమి చేసెదవు ?

తా. నేను గొప్ప ప్రభావము కలదానను. బలముతో స్వేచ్ఛగా ఇష్టము వచ్చిన చోటికి వెళ్ళగలను. చాల కాలముపాటు నాకు భర్తవుగా ఉండుము ఈ సీతతో నీ కేమి పని ? 26

మూ. వికృతా చ విరూపా చ న చేయం సదృశీ తవ, 27
అహమేవానురూపా తే భార్యా రూపేణ పశ్య మామ్.

ప్ర. అ. వికృతా చ = వికారముగా ఉన్నది, విరూపా చ = వికృతముగా ఉన్న రూపము కలది అయిన, ఇయమ్ = ఈ సీత, తవ = నీకు, న సదృశీ =

తగినది కాదు. తే = నీకు, అహమేవ = నేనే, అనురూపా = తగినదానను. మామ్ = నన్ను, భార్యారూపేణ = భార్యారూపముచేత, పశ్య = చూడుము.

తా. ఈ సీత ఆకారము, రూపము కూడ వికారముగా ఉన్నది. ఈమె నీకు తగినది కాదు. నేనే నీకు తగినదానను. నన్ను భార్యనుగా చూడుము. 27

మూ. ఇమాం విరూపామసతీం కరాళాం నిర్ణతోదరీమ్, 28
అనేన తే సహ భ్రాత్రా భక్షయిష్యామి మానుషీమ్.

ప్ర. అ. విరూపామ్ = వికృతమైన రూపము కలది, అసతీమ్ = చెడ్డ స్వభావము గలది, కరాళామ్ = భయంకరురాలు, నిర్ణతోదరీమ్ = అణిగిపోయిన కడుపు కలది అయిన, ఇమాం మానుషీమ్ = ఈ మనుష్యస్త్రీని, తే భ్రాత్రా సహ = నీ సోదరునితో కూడ, భక్షయిష్యామి = భక్షించెదను.

తా. ఈ మనుష్యస్త్రీ వికృతరూపము గలది. ఈమె స్వభావము చెడ్డది. భయంకరురాలు. ఈమె పొట్ట అణగి పోయి వికృతముగా ఉన్నది. నేను ఈమెను, నీ సోదరుని కూడ భక్షించివేసెదను. 28

మూ. తతః పర్వతశృఙ్గాణి వనాని వివిధాని చ, 29
పశ్యన్ సహ మయా కాన్త దణ్డకాన్విచరిష్యసి.

ప్ర. అ. కాన్త = మనోహరా! తతః = అటుపిమ్మట, పర్వతశృఙ్గాణి = పర్వతశిఖరములను, వివిధాని = అనేకవిధములైన, వనాని చ = వనములను, పశ్యన్ = చూచుచు, మయా సహ = నాతో కూడ, దణ్డకాన్ = దండకారణ్యమును, విచరిష్యసి = సంచరించగలవు.

తా. ఓ! మనోహరా! అటు పిమ్మట నీవు నాతో కలిసి పర్వతశిఖరములను, అనేకవిధములైన వనములను చూచుచు దండకారణ్యములో సంచరించవచ్చును. 29

మూ. ఇత్యేవముక్తః కాకుత్స్థః ప్రహస్య మదిరేక్షణామ్, 30
ఇదం వచనమారేభే వక్తుం వాక్యవిశారదః.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
సప్తదశః సర్గః.

ప్ర. అ. ఇత్యేవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, వాక్యవిశారదః = మాటలలో నేర్పరియైన, కాకుత్స్థః = రాముడు, ప్రహస్య = నవ్వి, మదిరేక్షణామ్ = ఆ స్త్రీని గూర్చి, ఇదం వచనమ్ = ఈ వచనమును, వక్తుమ్ = చెప్పుటకు, ఆరేభే = ప్రారంభించెను.

తా. మాటలలో నేర్పరి యైన రాముడు ఆ మాటలు విని, నవ్వుచు, ఆ రాక్షసస్త్రీతో ఈ విధముగ పలుకుటకు ప్రారంభించెను. 30

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్య కాండలో పదిహేడవ సర్గ సమాప్తము.

అథ అష్టాదశః సర్గః

[రామునిచేత నిరాకరింపబడిన శూర్పణఖ లక్ష్మణునివద్దకు వెళ్లి తనను భార్యగా స్వీకరింపుమని కోరుట. అతడు కూడ నిరాకరించగా సీతను చంపుటకు ఉద్యమించుట. లక్ష్మణు డామె ముక్కు చెవులు కోయుట.]

మూ. తతః శూర్పణఖాం రామః కామపాశావపాశితామ్,
స్వచ్ఛయా శ్లక్ష్ణయా వాచా స్మితపూర్వమథాబ్రవీత్. 1

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రామః = రాముడు, కామపాశావపాశితామ్ = మన్మథపాశముచేత కట్టబడిన, శూర్పణఖామ్ = శూర్పణఖను గూర్చి, స్వచ్ఛయా = పరిశుద్ధము, శ్లక్ష్ణయా = మృదువు అయిన, వాచా = వాక్కుతో, స్మితపూర్వమ్ = చిరునవ్వు పూర్వమునందు కలుగునట్లుగా, అథ = అనంతరము, అబ్రవీత్ = పలికెను.

తా. పిమ్మట రాముడు కామ (మన్మథుని) పాశముచేత బంధింపబడి ఉన్న ఆ శూర్పణఖతో, చిరునవ్వు నవ్వుచు, పరిశుద్ధము, మృదువు అయిన మాట ఈ విధముగా పలికెను.

మూ. కృతదారోఽస్మి భవతి భార్యేయం దయితా మమ,
త్వద్విధానాం తు నారీణాం సుదుఃఖా ససపత్నతా. 2

ప్ర. అ. భవతి = ఓ! పూజ్యురాలా! కృతదారః = వివాహము చేసికొన్న వాడనుగా, అస్మి = అయి ఉన్నాను. ఇయమ్ = ఈమె, మమ = నాకు, దయితా = ఇష్టురాలైన, భార్యా = భార్య. త్వద్విధానామ్ = నీవంటి, నారీణామ్ = స్త్రీలకు, ససపత్నతా = సవతికలిగియుండుట, సుదుఃఖా = చాల దుఃఖకర మైనది.

తా. పూజ్యురాలా! నాకు వివాహ మైనది. ఈమె నాకు చాల ఇష్టురాలైన భార్య. నీవంటి ఆడవారు సవతి ఉండుటను ఏ మాత్రము సహించజాలరు. 2

మూ. అనుజస్త్వేష మే భ్రాతా శీలవాన్ ప్రియదర్శనః,
శ్రీమానకృతదారశ్చ లక్ష్మణో నామ వీర్యవాన్. 3

ప్ర. అ. లక్ష్మణో నామ = లక్ష్మణు డను పేరు గల, ఏషః = ఇతడు, మే = నాయొక్క, అనుజః = తమ్ముడైన, భ్రాతా = సోదరుడు. శీలవాన్ = మంచి శీలము గలవాడు. ప్రియదర్శనః = సుఖకరమైన దర్శనము కలవాడు. శ్రీమాన్ = శోభాయుక్తుడు. అకృతదారశ్చ = వివాహము కానివాడు. వీర్యవాన్ = పరాక్రమవంతుడు.

తా. లక్ష్మణు డను పేరు గల ఈతడు నా తమ్ముడు. మంచి శీలము కలవాడు. చూచువారికి ఆనందము కలిగించువాడు. శోభ కలవాడు. వివాహము కానివాడు. పరాక్రమవంతుడు. 3

మూ. అపూర్వీ భార్యయా చార్థీ తరుణః ప్రియదర్శనః,
అనురూపశ్చ తే భర్తా రూపస్య చ భవిష్యతి. 4

ప్ర. అ. అపూర్వీ = పూర్వము భార్యాసౌఖ్యము తెలియనివాడు. భార్యయా = భార్యచేత, అర్థీ = కోరికగలవాడు, తరుణః = యువకుడు. ప్రియదర్శనః = ఆనందకరమైన దర్శనము గల వాడు. తే = నీయొక్క, రూపస్య = రూపమునకు, అనురూపః = తగిన, భర్తా = భర్తగా, భవిష్యతి = కాగలడు.

తా. ఇత డింతవరకు భార్యాసౌఖ్యము తెలియనివాడు. భార్య కావలె నను కోరిక గలవాడు. చూచుటకు అందమైన యువకుడు. ఇతడు నీ రూపమునకు తగిన భర్త కాగలడు. 4

మూ. ఏనం భజ విశాలాక్షి భర్తారం భ్రాతరం మమ,
అసపత్నా వరారోహే మేరుమర్కప్రభా యథా. 5

ప్ర. అ. విశాలాక్షి = విశాలమైన నేత్రములు గలదానా! వరారోహే = శ్రేష్ఠమైన కటిప్రదేశము గలదానా! ఏనమ్ = ఈ, మమ భ్రాతరమ్ = నా సోదరుని, అర్కప్రభా = సూర్యుని కాంతి, మేరుం యథా = మేరు పర్వతమును వలె, అసపత్నా = సవతి బాధ లేనిదానవై, భజ = సేవించుము.

తా. అందమైన కటిప్రదేశము గలట్టి విశాలాక్షీ! నా సోదరుడైన ఇతనిని

సూర్యుని కాంతి మేరుపర్వతమును ఆశ్రయించి నట్లు, సేవింపుము. నీకు సవతి బాధ ఉండదు. 5

మూ. ఇతి రామేణ సా ప్రోక్తా రాక్షసీ కామమోహితా,
విసృజ్య రామం సహసా తతో లక్ష్మణమబ్రవీత్. 6

ప్ర. అ. రామేణ = రామునిచేత, ఇతి = ఇట్లు, ప్రోక్తా = పలకబడిన, రాక్షసీ = ఆ రాక్షసి, కామమోహితా = కామముచేత మోహితురాలై, సహసా = వెంటనే, రామమ్ = రాముణ్ణి, విసృజ్య = విడచి, తతః = పిమ్మట, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. కామమోహితురాలైన ఆ రాక్షసస్త్రీ రాముని మాటలు విని, వెంటనే రాముణ్ణి విడచి లక్ష్మణుని వద్దకు వెళ్ళి ఇట్లు పలికెను. 6

మూ. అస్య రూపస్య తే యుక్తా భార్యాహం వరవర్ణినీ,
మయా సహ సుఖం సర్వాన్ దణ్డకాన్ విచరిష్యసి. 7

ప్ర. అ. తే = నీయొక్క, అస్య రూపస్య = ఈ రూపమునకు, వరవర్ణినీ = శ్రేష్ఠమైన వర్ణము గల, అహమ్ = నేను, యుక్తా = తగిన, భార్యా = భార్యను. మయా సహ = నాతోకూడ, సుఖమ్ = సుఖముగా, దణ్డకాన్ = దండకారణ్యమును, విచరిష్యసి = సంచరించగలవు.

తా. నీకున్న ఈ సౌందర్యానికి మంచి శరీరచ్ఛాయ గల నేనే తగిన భార్యను. నీవు నాతో కూడ కలిసి, దండకారణ్యములో సంచరించగలవు. 7

మూ. ఏవముక్తస్తు సౌమిత్రీ రాక్షస్యా వాక్యకోవిదః,
తతః శూర్పణఖీం స్మిత్వా లక్ష్మణో యుక్తమబ్రవీత్. 8

ప్ర. అ. రాక్షస్యా = ఆ రాక్షసస్త్రీచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలుకబడిన, వాక్యకోవిదః = వాక్యములను ఎరిగిన, సౌమిత్రిః = సుమిత్ర కుమారుడైన, లక్ష్మణః = లక్ష్మణుడు, తతః = ఆటుపిమ్మట, స్మిత్వా = చిరునవ్వు నవ్వి, శూర్పణఖీమ్ = శూర్పణఖను గూర్చి, యుక్తమ్ = యుక్తముగా, అబ్రవీత్ = పలికెను.

తా. ఆ రాక్షసస్త్రీ మాటలు విని, మాటలలో నేర్పరి, సుమిత్ర కుమారుడు అయిన లక్ష్మణుడు చిరునవ్వు నవ్వి, ఆమెతో యుక్తముగా ఇట్లు పలికెను. 8

మూ. కథం దాసస్య మే దాసీ భార్యా భవితుమిచ్ఛసి,
సోఽహమార్యేణ పరవాన్ భ్రాత్రా కమలవర్ణిని. 9

ప్ర. అ. కమలవర్ణిని = పద్మము వంటి వర్ణము గలదానా ! దాసస్య = దాసుడనైన, మే = నాయొక్క, భార్యా = భార్యవై, దాసీ = దాసీగా, భవితుమ్ = అగుటకు, కథమ్ = ఎట్లు, ఇచ్ఛసి = కోరుచున్నావు. సః అహమ్ = అట్టి నేను, ఆర్యేణ = పూజ్యుడైన అన్నగారిచేత(కి), పరవాన్ = పరాధీనుడనైన, భ్రాతా = సోదరుడను.

తా. పద్మము వంటి రంగు గలదానా ! నేను పూజ్యుడైన నా అన్నగారికి అధీనుడనైన సోదరుడను. దాసుడనైన నాకు భార్యవై నీవు కూడ దాసి వగుటకు కోరుచున్నావేమి ? 9

మూ. సమృద్ధార్థస్య సిద్ధార్థా ముదితామలవర్ణినీ,
ఆర్యస్య త్వం విశాలాక్షి భార్యా భవ యవీయసీ. 10

ప్ర. అ. విశాలాక్షి = విశాలమైన నేత్రములు గలదానా ! అమలవర్ణినీ = నిర్మలమైన వర్ణము గలదానవైన, త్వమ్ = నీవు, సమృద్ధార్థస్య = సమృద్ధమైన ప్రయోజనము గల, ఆర్యస్య = పూజ్యుడైన నా అన్నగారికి, యవీయసీ = చిన్న, భార్యా = భార్యవై, సిద్ధార్థా = సిద్ధించిన ప్రయోజనము కలదానవై, ముదితా = సంతోషించినదానవు, భవ = అగుము.

తా. ఓ ! విశాలాక్షీ ! నిర్మలమైన శరీరచ్ఛాయ గల నీవు, అన్ని విషయములందు సఫలుడైన మా అన్నగారి చిన్న భార్యవై, నీ కోరిక సిద్ధించగా, ఆనందించుము. 10

మూ. ఏనాం విరూపామసతీం కరాళాం నిర్ణతోదరీమ్,
భార్యాం వృద్ధాం పరిత్యజ్య త్వామేవైష భజిష్యతి. 11

ప్ర. అ. ఏషః = ఈ రాముడు, విరూపామ్ = వికృతరూపము కలది, అసతీమ్ = చెడది, కరాళామ్ = భయంకరురాలు, నిర్ణతోదరీమ్ = అణిగి పోయిన

ఉదరము గలది, వృద్ధామ్ = వృద్ధురాలు అయిన, ఏనామ్ = ఈ, భార్యామ్ = భార్యను, పరిత్యజ్య = విడచి, త్వామేవ = నిన్నే, భజిష్యతి = పొందగలడు.

తా. వికృతరూపముతో అణిగిపోయిన పొట్టతో భయంకరురాలుగా ఉన్న ఈ పెద్ద ముసలి భార్యను విడచి రాముడు నిన్నే పొందగలడు. 11

మూ. కో హి రూపమిదం శ్రేష్ఠం సంత్యజ్య వరవర్ణిని,
మానుషీషు వరారోహే కుర్యాద్భావం విచక్షణః. 12

ప్ర. అ. వరవర్ణిని = శ్రేష్ఠమైన వర్ణము గలదానా ! వరారోహే = అందమైన కటిప్రదేశము గలదానా ! విచక్షణః = బుద్ధిమంతుడైన, కో హి = ఎవడు, శ్రేష్ఠమ్ = శ్రేష్ఠమైన, ఇదం రూపమ్ = ఈ రూపమును, సంత్యజ్య = విడచి, మానుషీషు = మనుష్యస్త్రీలయందు, భావమ్ = అభిప్రాయమును, కుర్యాత్ = చేయును ?

తా. ఉత్తమమైన రంగు, అందమైన కటిప్రదేశము కలదానా ! శ్రేష్ఠమైన ఇట్టి సౌందర్యమును విడచి, బుద్ధిమంతు డెవడైనా మనుష్యస్త్రీలయందు ఆసక్తుడగునా ! 12

మూ. ఇతి సా లక్ష్మణేనోక్తా కరాళా నిర్ణతోదరీ,
మన్యతే తద్వచ స్తథ్యం పరిహాసావిచక్షణా. 13

ప్ర. అ. లక్ష్మణేన = లక్ష్మణునిచేత, ఇతి = ఇట్లు, ఉక్తా = పలకబడినదై, కరాళా = భయంకరురాలూ, నిర్ణతోదరీ = వంగిన కడుపు కలది, పరిహాసావిచక్షణా = పరిహాసమునందు నేర్పు లేనిదీ అయిన, సా = ఆ శూర్పణఖ, తద్వచః = ఆ లక్ష్మణుని వచనమును, తథ్యమ్ = యథార్థమునుగా, మన్యతే = తలచెను.

తా. భయంకరురాలు, వంగిన పొట్ట గలదీ అయిన ఆ శూర్పణఖ, లక్ష్మణుని మాటలు విని, పరిహాసమునందు నేర్పు లేని దగుటచే, అది నిజమే అని తలచెను. 13

మూ. సా రామం పర్ణశాలాయాముపవిష్టం పరంతపమ్,
సీతయా సహ దుర్ధర్షమబ్రవీత్కామమోహితా. 14

ప్ర. అ. కామమోహితా = కామముచేత మోహితురాలైన, సా = ఆమె, సీతయా సహ = సీతతో కూడ, పర్ణశాలాయామ్ = పర్ణశాలయందు, ఉపవిష్టమ్ = కూర్చొనియున్న, పరంతపమ్ = శత్రుసంహారకుడైన, దుర్ధర్షమ్ = ఎదిరింప శక్యము కాని, రామమ్ = రాముణ్ణి గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. కామమోహితురాలైన ఆ శూర్పణఖ, సీతాసమేతుడై పర్ణశాలలో కూర్చొని ఉన్న, శత్రుసంహారకుడు, ఎదిరింప శక్యము కానివాడు అయిన రాముని తో ఇట్లు పలికెను. 14

మూ. ఏనాం విరూపామసతీం కరాళాం నిర్ణతోదరీమ్,
వృద్ధాం భార్యామవష్టభ్య మాం న త్వం బహుమన్యసే. 15

ప్ర. అ. విరూపామ్ = వికృతరూపము గలది, అసతీమ్ = చెడ్డది, కరాళామ్ = భయంకరురాలుగా ఉన్నది. నిర్ణతోదరీమ్ = అణిగిపోయిన ఉదరము కలది, వృద్ధామ్ = వృద్ధురాలు అయిన, ఏనామ్ = ఈ, భార్యామ్ = భార్యను, అవష్టభ్య = ఊతగా గొని, త్వమ్ = నీవు, మామ్ = నన్ను, న బహుమన్యసే = గౌరవించుటలేదు.

తా. నీ భార్య వికృతరూపవంతురాలు. చెడ్డది. భయంకరురాలు. అణగిన పొట్ట గలది. వృద్ధురాలు. ఇట్టి భార్యను చూచుకొని నీవు నన్ను గౌరవించుటలేదు.

మూ. అద్యేమాం భక్షయిష్యామి పశ్యత స్తవ మానుషీమ్,
త్వయా సహ చరిష్యామి నిఃసపత్నా యథాసుఖమ్. 16

ప్ర. అ. తవ = నీవు. పశ్యతః = చూచుచుండగనే, అద్య = ఇప్పుడు, ఇమామ్ = ఈ, మానుషీమ్ = మనుష్యస్త్రీని, భక్షయిష్యామి = భక్షించెదను. నిఃసపత్నా = సవతిలేనిదాననై, త్వయా సహ = నీతో కూడ, యథాసుఖమ్ = సుఖముగా, చరిష్యామి = సంచరించెదను.

తా. నీవు చూచుచుండగనే ఇప్పుడు ఈ మనుష్యస్త్రీని భక్షించెదను. సవతి పోరు లేకుండగా చేసికొని నీతో సుఖముగా విహరించెదను. 16

మూ. ఇత్యుక్త్వా మృగశాబాక్షీమలాతసదృశేక్షణా,
అభ్యధావత్సుసంక్రుద్ధా మహోల్కా రోహిణీమివ. 17

ప్ర. అ. అలాతసదృశేక్షణా = కొరవి వంటి నేత్రములు గల ఆ శూర్ప ణఖ, ఇతి = ఇట్లు, ఉక్త్వా = పలికి, సుసంక్రుద్ధా = చాల కోపించినదై, మహోల్కా = పెద్ద ఉల్క (ఆకాశమునుండి పడే కొరవి), రోహిణీమివ = రోహిణిని వలె, మృగశాబాక్షీమ్ = లేడిపిల్ల వంటి నేత్రములు గల సీతను గూర్చి, అభ్యధావత్ = పరుగెత్తెను.

తా. కొరవి వంటి నేత్రములు గల ఆ శూర్పణఖ, ఇట్లు పలికి, మిక్కిలి కోపముతో, పెద్ద ఉల్క రోహిణిమీదకు వచ్చి నట్లు, లేడి కళ్ల వంటి కళ్లుగల సీతమీదకు పరుగెత్తెను. 17

మూ. తాం మృత్యుపాశప్రతిమామాపతన్తీం మహాబలః,
నిగృహ్య రామః కుపిత స్తతో లక్ష్మణమబ్రవీత్. 18

ప్ర. అ. మహాబలః = గొప్ప బలము గల, రామః = రాముడు, కుపితః = కోపించినవాడై, ఆపతన్తీమ్ = వచ్చి మీద పడుచున్న, మృత్యుపాశప్రతిమామ్ = మృత్యుపాశముతో సమానురాలైన, తామ్ = ఆమెను, నిగృహ్య = నిగ్రహించి, తతః = పిమ్మట, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. మహాబలశాలియైన రాముడు మృత్యుపాశము వలె వచ్చి మీద పడు చున్న, ఆమెను అడ్డుకొని, లక్ష్మణునితో ఇట్లు పలికెను. 18

మూ. క్రూరై రనార్యైః సౌమిత్రే పరిహాసః కథంచన,
న కార్యః పశ్య వైదేహీం కథంచిత్సౌమ్య జీవతీమ్. 19

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా! సౌమిత్రే = లక్ష్మణా! క్రూరైః = క్రూరు లైన, అనార్యైః = చెడ్డవాళ్లతో, కథంచన = ఏ విధముగాను కూడ, పరిహాసః = పరిహాసము, న కార్యః = చేయ దగినది కాదు, కథంచిత్ = ఎట్లో, జీవతీమ్ = జీవించి యున్న, వైదేహీమ్ = సీతను, పశ్య = చూడుము.

తా. సౌమ్యా! లక్ష్మణా! క్రూరులైన చెడ్డవారితో ఎన్నడూ పరిహాసము చేయకూడదు. వైదేహి ఈమెచేతిలో మరణించవలసినది, ఎట్లో జీవించి ఉన్నది, చూడుము. 19

మూ. ఇమాం విరూపామసతీమతిమత్తాం మహోదరీమ్,
రాక్షసీం పురుషవ్యాఘ్ర విరూపయితుమర్హసి. 20

ప్ర. అ. పురుషవ్యాఘ్ర = ఓ! పురుషశ్రేష్ఠుడా! విరూపామ్ = వికృత రూపము కలది, అసతీమ్=చెడ్డది, అతిమత్తామ్=మిక్కిలి మదించినది, మహోదరీమ్ = పెద్ద ఉదరముకలది అయిన, ఇమాం రాక్షసీమ్ = ఈ రాక్షసస్త్రీని, విరూపయితుమ్=విరూపము కల దానినిగా చేయుటకు, అర్హసి=తగియున్నావు.

తా. ఓ! పురుషశ్రేష్ఠుడా! ఈ రాక్షసస్త్రీ వికృతమైన రూపముతో, పెద్ద ఉదరముతో చాల మదించి ఉన్నది. చెడ్డ స్వభావము గలది. అందుచే ఈమె ఆకారమును అంగవిహీనమై వికృతముగా నుండు నట్లు చేయుము. 20

మూ. ఇత్యుక్తో లక్ష్మణస్తస్యాః క్రుద్ధో రామస్య పార్శ్వతః,
ఉద్ధృత్య ఖడ్గం చిచ్ఛేద కర్ణనాసం మహాబలః. 21

ప్ర. అ. ఇతి = ఇట్లు, ఉక్తః = పలకబడిన, మహాబలః = గొప్ప బలము గల, లక్ష్మణః = లక్ష్మణుడు, క్రుద్ధః = కోపించినవాడై, రామస్య = రాముని యొక్క, పార్శ్వతః = పార్శ్వమునుండి, ఖడ్గమ్=ఖడ్గమును, ఉద్ధృత్య = పైకి తీసి, తస్యాః = ఆమెయొక్క, కర్ణనాసమ్ = కర్ణములను, ముక్కును, చిచ్ఛేద= ఛేదించెను.

తా. మహాబలశాలి యైన లక్ష్మణుడు రాముని మాటలు విని, కోపించి, రాముని పార్శ్వమునందున్న ఖడ్గమును తీసికొని ఆమె ముక్కు, చెవులు కోసి వేసెను. 21

మూ. నికృత్తకర్ణనాసా తు విస్వరం సా వినద్య చ,
యథాగతం ప్రదుద్రావ ఘోరా శూర్పణఖా వనమ్. 22

ప్ర. అ. ఘోరా = భయంకరురాలైన, సా శూర్పణఖా = ఆ శూర్పణఖ, నికృత్తకర్ణనాసా = ఛేదింపబడిన చెవులు ముక్కు గలదై, విస్వరమ్ = వికృత స్వరము కలుగునట్లుగా, వినద్య చ = అరచి, యథాగతమ్ = వచ్చినట్లుగానే, వనమ్ = వనమును గూర్చి, ప్రదుద్రావ = పరుగెత్తెను.

తా. భయంకరురాలైన ఆ శూర్పణఖ, లక్ష్మణు డా విధముగా చెవులు, ముక్కు ఛేదించగా, వికృతస్వరముతో అరచుచు, వచ్చిన దారినే అడవిలోనికి పారిపోయెను. 22

మూ. సా విరూపా మహాఘోరా రాక్షసీ శోణితోక్షితా,
నసాద వివిధాన్నాదాన్ యథా ప్రావృషి తోయదః. 23

ప్ర. అ. విరూపా = వికృతమైన రూపము కలది, మహాఘోరా = చాల భయంకరముగా ఉన్నది, శోణితోక్షితా = రక్తముచేత తడపబడినది అయిన, సా రాక్షసీ = ఆ శూర్పణఖ, ప్రావృషి = వర్షకాలమునందు, తోయదః యథా = మేఘము వలె, వివిధాన్ = అనేకవిధములైన, నాదాన్ = ధ్వనులను, ననాద = అరచెను.

తా. అవయవములు ఛేదించుటచేత వికృతమైన ఆకారముతో చాల భయంకరముగా ఉన్న ఆ శూర్పణఖ, రక్తముతో తడియుచు, వర్షాకాలమేఘము వలె, అనేకవిధములైన ధ్వనులు కలుగు నట్లు అరచెను. 23

మూ. సా విక్షరన్తీ రుధిరం బహుధా ఘోరదర్శనా,
ప్రగృహ్య బాహూ గర్జన్తీ ప్రవివేశ మహావనమ్. 24

ప్ర. అ. ఘోరదర్శనా = భయంకరమైన దర్శనము గల, సా = ఆమె, బహుధా = అనేకవిధములుగ, రుధిరమ్ = రక్తమును, విక్షరన్తీ = స్రవించుచు, బాహూ = బాహువులను, ప్రగృహ్య = పట్టుకొని, గర్జన్తీ = గర్జించుచున్నదై, మహావనమ్ = మహారణ్యమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. చూచుటకు భయంకరముగా ఉన్న ఆ శూర్పణఖ అనేకవిధముల రక్తము స్రవించుచు, బాహువులు పట్టుకొని, గర్జించుచు, మహారణ్యములోనికి ప్రవేశించెను. 24

మూ. తతస్తు సా రాక్షససంఘసంవృతం
ఖరం జనస్థానగతం విరూపితా,

ఉపేత్య తం భ్రాతరముగ్రదర్శనం
పపాత భూమౌ గగనాద్యథాశనిః. 25

ప్ర. అ. తతః = అటుపిమ్మట, విరూపితా = విరూపము కలదిగా చేయబడి, సా = ఆమె, రాక్షససంఘసంవృతమ్ = రాక్షసుల సముదాయముచేత ఆవరింపబడినవాడు, జనస్థానగతమ్ = జనస్థానములో ఉన్నవాడు, ఉగ్రదర్శనమ్ = భయంకరమైన దర్శనము గలవాడు అయిన, భ్రాతరమ్ = సోదరుడైన, తం ఖరమ్ = ఆ ఖరుణ్ణి, ఉపేత్య = సమీపించి, గగనాత్ = ఆకాశమునుండి, అశనిః యథా = పిడుగు వలె, భూమౌ = భూమిమీద, పపాత = పడెను.

తా. ఈ విధముగ అంగవికారము కలుగునట్లు చేయబడిన ఆ శూర్పణఖ, జనస్థానములో రాక్షసుల సముదాయముతో కలిసి ఉన్న, చూచుటకు భయంకరుడైన, సోదరుడైన ఖరునివద్దకు వెళ్ళి ఆకాశమునుండి పిడుగు వలె నేలమీద ప్రాలెను. 25

మూ. తతః సభార్యం భయమోహమూర్ఛితా
సలక్ష్మణం రాఘవమాగతం వనమ్,
విరూపణం చాత్మని శోణితోక్షితా
శశంస సర్వం భగినీ ఖరస్య సా.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
అష్టాదశః సర్గః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ఖరస్య = ఖరునియొక్క, భగినీ = సోదరియైన, సా = ఆ శూర్పణఖ, భయమోహమూర్ఛితా = భయమోహములతో వ్యాప్తురాలై, శోణితోక్షితా = రక్తముచేత తడుపబడినదై, వనమ్ = వనమును గూర్చి, ఆగతమ్ = వచ్చిన, సభార్యమ్ = భార్యతో కూడిన, సలక్ష్మణమ్ = లక్ష్మణునితో కూడిన, రాఘవమ్ = రాముణ్ణి గూర్చి, ఆత్మని = తనయందు, విరూపణం చ = వికృతరూపము కలిగించుటనుగూర్చి, సర్వమ్ = సమస్తమును, శశంస = చెప్పెను.

తా. పిమ్మట, ఖరుని సోదరియైన ఆ శూర్పణఖ, భయమోహములతో వ్యాకులత చెందినదై, రక్తముతో తడిసినదై, రాముడు భార్యాలక్ష్మణులతో కలిసి అరణ్యమునకు వచ్చి నట్లును, తన అవయవములను ఛేదించినట్లును, అన్ని విషయములు ఆ ఖరునకు చెప్పెను.

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో పద్దెనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనవింశః సర్గః

[శూర్పణఖకు జరిగిన అవమానమును గూర్చి విని ఖరుడు రామాదులను చంప మని ఆదేశించి పదునలుగురు రాక్షసులను పంపుట.]

మూ. తాం తథా పతితాం దృష్ట్వా విరూపాం శోణితోక్షితామ్,
భగినీం క్రోధసంతప్తః ఖరః పప్రచ్ఛ రాక్షసః. 1

ప్ర. అ. తథా = ఆ విధముగా, పతితామ్ = నేలమీద పడిన, విరూపామ్ = అంగవిహీనమైన రూపము గల, శోణితోక్షితామ్ = రక్తముచేత తడపబడిన, తాం భగినీమ్ = ఆ సోదరిని, దృష్ట్వా = చూచి, రాక్షసః = రాక్షసుడైన, ఖరః = ఖరుడు, క్రోధసంతప్తః = క్రోధముచేత తపింపచేయబడినవాడై, పప్రచ్ఛ = అడిగెను.

తా. అంగవిహీనురాలై, రక్తము స్రవించుచు, ఆ విధముగా నేలపై పడిన సోదరియైన ఆ శూర్పణఖను చూచి రాక్షసుడైన ఖరుడు క్రోధముతో వ్యాకులుడై ప్రశ్నించెను.

మూ. ఉత్తిష్ఠ తావదాఖ్యాహి ప్రమోహం జహి సంభ్రమమ్,
వ్యక్తమాఖ్యాహి కేన త్వమేవంరూపా విరూపితా. 2

ప్ర. అ. ఉత్తిష్ఠ = లెమ్ము, ఆఖ్యాహి తావత్ = చెప్పుము; ప్రమోహమ్ = మోహమును, సంభ్రమమ్ = తొందరను, జహి = చంపుము; (విడిచిపెట్టుము). త్వమ్ = నీవు, కేన = ఎవనిచేత, ఏవంరూపా = ఇట్టి రూపము గలదానవుగా, విరూపితా = విరూపము కలదానవుగా చేయబడితివో, వ్యక్తమ్ = స్పష్టముగా, ఆఖ్యాహి = చెప్పుము.

తా. లెమ్ము, చెప్పుము. మోహమును, తొందరను విడచి, నీకు ఈ విధముగా అంగవైకల్యము కలిగించినవా డెవరో స్పష్టముగా చెప్పుము. 2

మూ. కః కృష్ణసర్పమాసీనమాశీవిషమనాగసమ్,
తుదత్యభిసమాపన్నమఙ్గుల్యగ్రేణ లీలయా. 3

ప్ర. అ. అభిసమాపన్నమ్ = సమీపమునందున్న, ఆశీవిషమ్ = కోరలలో విషము గల, అనాగసమ్ = అపరాధము లేని, ఆసీనమ్ = కూర్చొని ఉన్న, కృష్ణసర్పమ్ = త్రాచుపామును, కః = ఎవడు, లీలయా = లీలచేత, అఙ్గుల్యగ్రేణ = వ్రేలి కొనచేత, తుదతి = పీడించుచున్నాడు ?

తా. ఎట్టి బాధా కలిగించకుండా దగ్గర కూర్చొని ఉన్న, విషముతో నిండిన కోరలు గల త్రాచుపామును విలాసంగా వ్రేలి కొనతో పొడుచుచున్నవాడెవడు ? 3

మూ. కాలపాశం సమాసజ్య కణ్ఠే మోహాన్న జానతే,
యస్త్వామద్య సమాసాద్య పీతవాన్విషముత్తమమ్. 4

ప్ర. అ. యః = ఎవడు, అద్య = ఇప్పుడు, త్వామ్ = నిన్ను, సమాసాద్య = పొంది (స్పృశించి), ఉత్తమమ్ = ఉత్తమమైన, విషమ్ = విషమును, పీతవాన్ = త్రాగినాడో, అట్టి, కః = ఎవడు, కాలపాశమ్ = యమపాశమును, మోహాత్ = అజ్ఞానమువలన, కణ్ఠే = కంఠమునందు, సమాసజ్య = తగల్చుకొని, న జానతే = తెలుసుకొనకున్నాడు ?

తా. ఎవడు భయంకరమైన విషము త్రాగి, కాలపాశమును కంఠానికి తగల్చుకొని, అజ్ఞానమువలన తెలుసుకొనజాలకున్నాడో, నిన్ను అవమానించిన అట్టివాడు ఎవడు ? 4

మూ. బలవిక్రమసంపన్నా కామగా కామరూపిణీ,
ఇమామవస్థాం నీతా త్వం కేనాన్తకసమా గతా. 5

ప్ర. అ. బలవిక్రమసంపన్నా = బలముతోను పరాక్రమముతోను కూడిన దానవు, కామగా = స్వేచ్ఛగా సంచరించకలదానవు, కామరూపిణీ = స్వేచ్ఛా రూపము కలదానవు, అన్తకసమా = యమునితో సమానురాలవు అయిన, త్వమ్ = నీవు, గతా = వెళ్ళినదానవై, కేన = ఎవనిచేత, ఇమామ్ = ఈ, అవస్థామ్ = అవసను, నీతా = పొందించబడితివి ?

తా. నీవు బలపరాక్రమ సంపన్నురాలవు. స్వేచ్ఛగా సంచరించ గల దానవు. స్వేచ్ఛారూపము గలదానవు. యమునితో సమానురాలవు. అట్టి నీవు ఎవనివద్దకు వెళ్ళగా ఆతడు నీకు ఇట్టి అవస్థ కలిగించినాడు ? 5

మూ. దేవగన్ధర్వభూతానామృషీణాం చ మహాత్మనామ్,
కోఽయమేవం విరూపాం త్వాం మహావీర్యశ్చకార హ. 6

ప్ర. అ. దేవగన్ధర్వభూతానామ్ = దేవ-గంధర్వ-భూతములలోను, మహాత్మనామ్ = మహాత్ములైన, ఋషీణాం చ = ఋషులలోను, మహావీర్యః = గొప్ప పరాక్రమము గల, కః = ఎవడు, త్వామ్=నిన్ను, ఏవమ్=ఇట్లు, విరూపామ్= వికృతరూపము గలదానినిగా, చకార హ = చేసెను ?

తా. దేవ - గంధర్వ - భూతములలో గాని, మహాత్ములైన ఋషులలో గాని, మహాపరాక్రమవంతుడైన ఎవ్వడు నిన్ను ఈ విధముగ వికృతరూపము కలదానిని చేసినాడు ? 6

మూ. న హి పశ్యామ్యహం లోకే యః కుర్యాన్మమ విప్రియమ్,
అమరేషు సహస్రాక్షం మహేన్ద్రం పాకశాసనమ్. 7

ప్ర. అ. లోకే = లోకములో, యః = ఎవడు, మమ = నాకు, విప్రియమ్ = అపకారమును, కుర్యాత్ = చేయునో అట్టివానిని, అమరేషు=దేవతలలో, సహస్రాక్షమ్ = వేయి కన్నులు కలవాడు, పాకశాసనమ్ = పాకాసురుని సంహరించినవాడు అయిన, మహేన్ద్రమ్ = మహేంద్రుని కూడ, అహమ్ = నేను, న హి పశ్యామి = చూడను గదా.

తా. ఈ లోకములో నాకు అపకారము చేయగలిగిన వాడు ఎవ్వడూ నాకు కనబడడు. దేవతలలో సహస్రాక్షుడు, పాకాసురుని సంహరించినవాడు అయిన దేవేంద్రుడు కూడ నాకు అపకారము చేయ సాహసించడు. 7

మూ. అద్యాహం మార్గణైః ప్రాణానాదాస్యే జీవితాన్తకైః,
సలిలే క్షీరమాసక్తం నిష్పిబన్నివ సారసః. 8

ప్ర. అ. అద్య = ఇప్పుడు, అహమ్ = నేను, సలిలే = ఉదకమునందు, ఆసక్తమ్ = కలపబడిన, క్షీరమ్ = పాలను, నిష్పిబన్ = త్రాగుచున్న, సారసః

ఇవ = సారసపక్షి వలె, జీవితాన్తకైః = ప్రాణములను నశింపచేయు, మార్గణైః = బాణములచేత, ప్రాణాన్ = ప్రాణములను, ఆదాస్యే = గ్రహించగలను.

తా. ఉదకములో కలిపిన పాలను సారసపక్షి త్రాగి నట్లు, నేను ఇప్పుడు ప్రాణాంతకములైన బాణములచేత నిన్ను అవమానించిన వాని ప్రాణములను తీసివేసెదను. 8

మూ. నిహతస్య మయా సంఖ్యే శరసంకృత్తమర్మణః,
సఫేనం రుధిరం రక్తం మేదినీ కస్య పాస్యతి. 9

ప్ర. అ. మయా = నాచేత, సంఖ్యే = యుద్ధమునందు, నిహతస్య = చంపబడినవాడు, శరసంకృత్తమర్మణః = బాణములచేత ఛేదించబడిన మర్మ స్థానములు కలవాడు అయిన, కస్య = ఎవనియొక్క, సఫేనమ్ = నురుగుతో కూడిన, రక్తమ్ = ఎఱ్ఱని, రుధిరమ్ = రక్తమును, మేదినీ = భూమి, పాస్యతి = త్రాగగలదు ?

తా. నేను యుద్ధములో బాణములచేత మర్మస్థానములను ఛేదించి, సంహరించిన ఎవని నురుగుతో నిండిన ఎఱ్ఱని రక్తమును భూమి త్రాగుటకు కోరుచున్నది ?

మూ. కస్య పత్రరథాః కాయాన్మాంసముత్కృత్య సంగతాః,
ప్రహృష్టా భక్షయిష్యన్తి నిహతస్య మయా రణే. 10

ప్ర. అ. మయా = నాచేత, రణే = యుద్ధమునందు, నిహతస్య = చంపబడిన, కస్య = ఎవనియొక్క, కాయాత్ = శరీరమునుండి, పత్రరథాః = పక్షులు, సంగతాః = గుమిగూడినవై, ప్రహృష్టాః = సంతోషించినవై, మాంసమ్ = మాంసమును, ఉత్కృత్య = పెకలించి, భక్షయిష్యన్తి = భక్షించగలవు ?

తా. పక్షు లన్నీ గుమిగూడి, సంతోషించుచు, నాచేత చంపబడిన ఎవని శరీరమునుండి మాంసమును పెకలించి భక్షించవలెను ? 10

మూ. తం న దేవా న గన్ధర్వా న పిశాచా న రాక్షసాః,
మయాపకృష్టం కృపణం శక్తాస్త్రాతుమిహాహవే. 11

ప్ర. అ. ఇహ = ఇప్పుడు, ఆహవే = యుద్ధమునందు, మయా = నాచేత, అపకృష్టమ్ = ఈడ్చబడిన, తం కృపణమ్ = ఆ దీనుణ్ణి, త్రాతుమ్ = రక్షించుటకు, దేవాః = దేవతలు, న శక్తాః = సమర్థులు కారు. పిశాచాః = పిశాచములు, న = సమర్థులు కారు; గన్ధర్వాః = గంధర్వులు, న = కారు; రాక్షసాః = రాక్షసులు, న = కారు.

తా. నేనిప్పుడు యుద్ధములో ఎవనిని క్రిందికి పడవేసి ఈడ్చెదనో వానిని దేవతలు గాని, గంధర్వులు గాని, పిశాచములు గాని, రాక్షసులు గాని రక్షింప జాలరు. 11

మూ. ఉపలభ్య శనైః సంజ్ఞాం తం మే శంసితుమర్హసి,
యేన త్వం దుర్వినీతేన వనే విక్రమ్య నిర్జితా. 12

ప్ర. అ. దుర్వినీతేన = చెడ్డవాడైన, యేన = ఎవనిచేత, త్వమ్ = నీవు, విక్రమ్య = పరాక్రమించి, వనే = వనమునందు, నిర్జితా = జయింపబడితివో, తమ్ = వానిని గూర్చి, శనైః = మెల్లగా, సంజ్ఞామ్ = సంజ్ఞను, లబ్ధ్వా = పొంది, మే = నాకు, శంసితుమ్ = చెప్పుటకు, అర్హసి = తగి యున్నావు.

తా. నీవు మెల్లగా కోలుకొని, ఏ దురాత్ముడు నిన్ను పరాక్రమముచేత వనములో జయించినాడో చెప్పుము. 12

మూ. ఇతి భ్రాతుర్వచః శ్రుత్వా క్రుద్ధస్య చ విశేషతః,
తతః శూర్పణఖా వాక్యం సబాష్పమిదమబ్రవీత్. 13

ప్ర. అ. భ్రాతుః = సోదరునియొక్క, విశేషతః = విశేషించి, క్రుద్ధస్య = కోపించిన అతనియొక్క, ఇతి = ఇట్లు, వచః = వాక్యమును, శ్రుత్వా = విని, తతః = అటుపిమ్మట, శూర్పణఖా = శూర్పణఖ, సబాష్పమ్ = కన్నీటితో కూడి నట్లుగా, ఇదం వాక్యమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. శూర్పణఖ సోదరుని మాటలు, విశేషించి కోపించిన సోదరుని మాటలు విని, కన్నీళ్లు కార్చుచు ఇట్లు పలికెను. 13

మూ. తరుణౌ రూపసంపన్నౌ సుకుమారౌ మహాబలౌ,
పుణ్డరీకవిశాలాక్షౌ చీరకృష్ణాజినామ్బరౌ. 14

ఫలమూలాశనౌ దాన్తౌ తాపసౌ ధర్మచారిణౌ,
పుత్రౌ దశరథస్యాస్తాం భ్రాతరౌ రామలక్ష్మణౌ. 15

ప్ర. అ. తరుణౌ=యువకులు, రూపసంపన్నౌ=సౌందర్యముతో కూడిన వారు, సుకుమారౌ = సుకుమారులు, మహాబలౌ = గొప్ప బలము గలవారు, పుణ్డరీకవిశాలాక్షౌ = పద్మముల వంటి విశాలనేత్రములు గలవారు, చీరకృష్ణాజినామ్బరౌ = నారచీరలు కృష్ణాజినము వస్త్రములుగా కలవారు, ఫలమూలాశనౌ = ఫలములను దుంపలను తినువారు, దాన్తౌ = ఇంద్రియనిగ్రహవంతులు, తాపసౌ =మునులు, ధర్మచారిణౌ = ధర్మమును ఆచరించువారు, దశరథస్య=దశరథుని యొక్క, పుత్రౌ = పుత్రులు అయిన, రామలక్ష్మణౌ = రామలక్ష్మణు లను, భ్రాతరౌ = సోదరులు, ఆస్తామ్ = ఉండిరి (ఉన్నారు).

తా. దశరథుని కుమారులైన రామలక్ష్మణు లనే సోదరులు ఇద్దరు ఉన్నారు. వాళ్ళు యువకులు; అందమైనవాళ్ళు; సుకుమారులు; బలశాలులు; పద్మముల వలె విశాలములైన నేత్రములు కలవారు. వాళ్ళు నారచీరలను, కృష్ణాజినమును వస్త్రములుగా ధరించి, ఫలమూలములను మాత్రమే తినుచు ఇంద్రియ నిగ్రహముతో ధర్మము నాచరించుచున్న మునులు. 14, 15

మూ. గన్ధర్వరాజప్రతిమౌ పార్థివవ్యఞ్జనాన్వితౌ,
దేవౌ వా మానుషౌ వా తౌ న తర్కయితుముత్సహే. 16

ప్ర. అ. గన్ధర్వరాజప్రతిమౌ=గంధర్వరాజుతో సమానులు, పార్థివవ్యఞ్జనాన్వితౌ = రాజచిహ్నములతో కూడినవారు అయిన, తౌ = వారిరువురు, దేవౌ వా = దేవతలో, మానుషౌ వా = మనుష్యులో, తర్కయితుమ్ = ఊహించుటకు, న ఉత్సహే = సమర్థురాలను కాను.

తా. రాజలక్షణములు కలిగి యుండి గంధర్వరాజుతో సమానులైన ఆ ఇద్దరూ, దేవతలో మనుష్యులో నేను చెప్పజాలను. 16

మూ. తరుణీ రూపసంపన్నా సర్వాభరణభూషితా,
దృష్టా తత్ర మయా నారీ తయోర్మధ్యే సుమధ్యమా. 17

ప్ర. అ. తత్ర = అక్కడ, తయోః = వారిద్దరియొక్క, మధ్యే = మధ్య

యందు, తరుణీ = యువతి, రూపసంపన్నా = సౌందర్యసంపన్నురాలు, సర్వాభరణభూషితా = సకలాలంకారములచే అలంకరించబడినది, సుమధ్యమా = మంచి నడుముకలది అయిన, నారీ = స్త్రీ, దృష్టా = చూడబడినది.

తా. అక్కడ వారిరువురి మధ్య సౌందర్యవతి యైన ఒక యువతిని చూచితిని. అందమైన నడుము గల ఆమె సకలాలంకారములు అలంకరించుకొని ఉన్నది. 17

మూ. తాభ్యాముభాభ్యాం సంభూయ ప్రమదామధికృత్య తామ్,
ఇమామవస్థాం నీతాహం యథానాథా సతీ తథా. 18

ప్ర. అ. తామ్ = ఆ, ప్రమదామ్ అధికృత్య = స్త్రీని గూర్చి, తాభ్యామ్ = ఆ, ఉభాభ్యామ్ = ఇద్దరిచేత, అహమ్ = నేను, అనాథా సతీ యథా = రక్షకుడు లేనిది ఎట్లో, తథా = అట్లు, ఇమామ్ = ఈ, అవస్థామ్ = అవస్థను, నీతా = పొందింపబడితిని. 18

తా. ఆ స్త్రీ మూలమున వాళ్ళిద్దరూ కలిసి, రక్షకు లెవ్వరూ లేని స్త్రీకి చేసినట్లు నాకు ఇట్టి అవస్థను కలిగించినారు. 18

మూ. తస్యాశ్చానృజువృత్తాయా స్తయోశ్చ హతయోరహమ్,
సఫేనం పాతుమిచ్ఛామి రుధిరం రణమూర్ధని. 19

ప్ర. అ. అహమ్ = నేను, రణమూర్ధని = యుద్ధరంగము అగ్రభాగమునందు, అనృజువృత్తాయాః = కుటిలమైన ప్రవృత్తిగల, తస్యాః చ = ఆ స్త్రీయొక్క, హతయోః = చంపబడిన, తయోశ్చ = ఆ ఇద్దరియొక్క, సఫేనమ్ = నురుగుతో కూడిన, రుధిరమ్ = రక్తమును, పాతుమ్ = త్రాగుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. కుటిలమైన ప్రవృత్తి గల ఆ స్త్రీని, ఆ ఇద్దరినీ చంపగా, రణరంగము అగ్రభాగమునందు, వాళ్ల, నురుగుతో నిండిన క్రొత్త రక్తమును త్రాగవలెనని నేను కోరుచున్నాను. 19

మూ. ఏష మే ప్రథమః కామః కృతస్తాత త్వయా భవేత్,
తస్యాః స్తయోశ్చ రుధిరం పిబేయమహమాహవే. 20

ప్ర. అ. తాత = నాయనా ! మే = నాయొక్క, ఏషః = ఈ, ప్రథమః = మొట్టమొదటి, కామః = కోరిక, త్వయా = నీచేత, కృతః = చేయబడినది, భవేత్ = అగుగాక. అహమ్ = నేను, ఆహవే = యుద్ధమునందు, తస్యాః = ఆ స్త్రీయొక్క, తయోశ్చ = ఆ ఇద్దరియొక్క, రుధిరమ్ = రక్తమును, పిబేయమ్ = త్రాగుదును గాక.

తా. నాయనా ! నేను యుద్ధములో ఆ స్త్రీ రక్తమును, ఆ యువకు లిద్దరి రక్తమును త్రాగవలెను. నీవు నా మొట్టమొదటి కోరికను తీర్చవలెను. 20

మూ. ఇతి తస్యాం బ్రువాణాయాం చతుర్దశ మహాబలాన్,
వ్యాదిదేశ ఖరః క్రుద్ధో రాక్షసానన్తకోపమాన్, 21

ప్ర. అ. తస్యామ్ = ఆమె, ఇతి = ఇట్లు, బ్రువాణాయామ్ = పలుకుచుండగా, ఖరః = ఖరుడు, క్రుద్ధః = కోపించినవాడై, మహాబలాన్ = గొప్ప బలముగల, అన్తకోపమాన్ = యమునితో సమానులైన, చతుర్దశ రాక్షసాన్ = పదునలుగురు రాక్షసులను, వ్యాదిదేశ = ఆజ్ఞాపించెను.

తా. ఆమె మాటలు విని ఖరుడు కోపించినవాడై, మహాబలవంతులు, యమునితో సమానులు అయిన పదునలుగురు రాక్షసులను ఆజ్ఞాపించెను. 21

మూ. మానుషౌ శస్త్రసంపన్నౌ చీరకృష్ణాజినామ్బరౌ,
ప్రవిష్టౌ దణ్డకారణ్యం ఘోరం ప్రమదయా సహ. 22

ప్ర. అ. శస్త్రసంపన్నౌ = ఆయుధములతో కూడినవారు, చీరకృష్ణాజినామ్బరౌ = నారచీరలు, కృష్ణాజినములు వస్త్రములుగా కలవారు అయిన, మానుషౌ = ఇద్దరు మనుష్యులు, ప్రమదయా సహ = స్త్రీతో కూడ, ఘోరమ్ = భయంకరమైన, దణ్డకారణ్యమ్ = దండకారణ్యమును, ప్రవిష్టౌ = ప్రవేశించినారు.

తా. నారచీరలు, కృష్ణాజినములు వస్త్రములుగా ధరించిన ఇద్దరు మానవులు, శస్త్రములు ధరించి ఒక స్త్రీతో కూడ ఘోరమైన దండకారణ్యములో ప్రవేశించినారట. 22

మూ. తౌ హత్వా తాం చ దుర్వృత్తామపావర్తితుమర్హథ,
ఇయం చ రుధిరం తేషాం భగినీ మమ పాస్యతి. 23

ప్ర. అ. తౌ = వారిద్దరిని, దుర్వృత్తామ్ = చెడ్డ నడవడిక గల, తాం చ = ఆ స్త్రీని, హత్వా = చంపి, అపావర్తిరుమ్ = తిరిగి వచ్చుటకు, అర్హథ = తగుదురు. మమ = నాయొక్క, ఇయం భగినీ = ఈ సోదరి, తేషామ్ = వారియొక్క, రుధిరమ్ = రక్తమును, పాస్యతి = త్రాగగలదు.

తా. ఆ మానవు లిద్దరిని, చెడ్డ నడవడిక గల ఆ స్త్రీని చంపి తిరిగిరండి. నా సోదరి యైన ఈమె వాళ్ల రక్తము త్రాగగలదు. 23

మూ. మనోరథోఽయమిష్టోఽస్యా భగిన్యా మమ రాక్షసాః,
శీఘ్రం సంపాద్యతాం తౌ చ ప్రమథ్య స్వేన తేజసా. 24

ప్ర. అ. రాక్షసాః = రాక్షసులారా ! స్వేన = మీ సంబంధమైన, తేజసా = తేజస్సుచేత, తౌ = వాళ్ళిద్దరిని, శీఘ్రమ్ = శీఘ్రముగా, ప్రమథ్య = నశింపజేసి, అస్యాః = ఈ, మమ భగిన్యాః = నా సోదరియొక్క, ఇష్టః = ఇష్టమైన, మనోరథః = మనోరథము, శీఘ్రమ్ = శీఘ్రముగా, సంపాద్యతామ్=సంపాదింపబడుగాక.

తా. ఓ ! రాక్షసులారా ! మీ పరాక్రమముచేత ఆ మానవు లిద్దరినీ శీఘ్రముగా సంహరించి, ఈ నా సోదరి కిష్టమైన కోరికను తీర్చండి. 24

మూ. ఇతి ప్రతిసమాదిష్టా రాక్షసాస్తే చతుర్దశ,
తత్ర జగ్ముస్తయా సార్ధం ఘనా వాతేరితా యథా. 25

ప్ర. అ. ఇతి = ఇట్లు, ప్రతిసమాదిష్టాః = ఆజ్ఞాపింపబడిన, తే = ఆ, చతుర్దశ = పదునలుగురు, రాక్షసాః = రాక్షసులు, తయా సార్ధమ్ = ఆ శూర్పణఖతో కూడ, వాతేరితాః = వాయువుచేత ప్రేరేపింపబడిన, ఘనాః యథా = మేఘములువలె, తత్ర = అచటకు, జగ్ముః = వెళ్ళిరి.

తా. ఖరు డీ విధముగ ఆజ్ఞాపింపగా ఆ పదునలుగురు రాక్షసులు, గాలిచేత ఎగురగొట్టబడిన మేఘములు వలె ఆ శూర్పణఖతో కూడ వెళ్ళిరి. 25

మూ. తతస్తు తే తం సముదగ్రతేజసం
తథాపి తీక్ష్ణప్రదరా నిశాచరాః,

న శేకురేనం సహసా ప్రమర్దితుం
వనద్విపా దీప్తమివాగ్నిముత్థితమ్. 26

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ఏకోనవింశః సర్గః.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, తథా=అట్లు, తీక్ష్ణప్రదరాః = తీక్ష్ణమైన బాణములు కలవారైనను, తే నిశాచరాః = ఆ రాక్షసులు, వనద్విపాః = వనము నందలి ఏనుగులు, ఉత్థితమ్=లేచిన, దీప్తమ్=ప్రజ్వలించుచున్న, అగ్నిమ్ ఇవ = అగ్నిని వలె, సముదగ్రతేజసమ్ = తీక్ష్ణమైన తేజస్సుగల, తమ్ = ఆ, ఏనమ్ = ఈ రాముని, సహసా = శీఘ్రముగా, ప్రమర్దితుమ్ = కొట్టుటకు, న శేకుః = సమర్థులు కాలేదు.

తా. పిమ్మట ఆ రాక్షసులు, తమ వద్ద తీక్ష్ణములైన బాణము లున్నాకూడ, తీవ్రమైన తేజస్సు గల ఆ రాముణ్ణి, అరణ్యగజములు పైకి లేచి ప్రజ్వలించుచున్న అగ్నిని వలె, వెంటనే ఎదిరింపజాలక పోయిరి.

వి. ఈ శ్లోకం ఇక్కడ అసంగతంగా ఉన్నది. ఇంకా ఈ రాక్షసులకు శూర్పణఖ రాముణ్ణి చూపవలసి ఉన్నది. రాముడు బైటకు రావలసి ఉన్నది. ఈ లోపుగా ఈ శ్లోకములో వాళ్లు రాముణ్ణి ఎదిరించ జాలకపోయిరి అని చెప్పుట అసంగతము కదా? రాబోయే సర్గలోని కథను సూచించడం వెనుకటిసర్గ చివర జరుగుతుంది. కాని ఈ విధంగా ఉండదు. అందుచేతనే గోరఖ్‌పూర్‌ప్రతిలో ఈ శ్లోకంలేదు. ప్రాచ్యప్రతిలో ఇదే వృత్తములో సర్గాంతశ్లోకం ఉన్నది కాని "వాళ్ళు ఆమెతో వెళ్ళినారు"అని మాత్రమే మరల చెప్పబడినది. 26

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
అరణ్యకాండలో పందొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ వింశః సర్గః

[ఖరుడు పంపిన పదునలుగురు రాక్షసులను రాముడు సంహరించుట].

మూ. తతః శూర్పణఖా ఘోరా రాఘవాశ్రమమాగతా,
రాక్షసానాచచక్షే తౌ భ్రాతరౌ సహ సీతయా. 1

ప్ర. అ. తతః=అటు పిమ్మట, ఘోరా=భయంకరురాలైన, శూర్పణఖా = శూర్పణఖ, రాఘవాశ్రమమ్ = రాముని ఆశ్రమమును గూర్చి, ఆగతా=వచ్చినదై, రాక్షసాన్ = రాక్షసులనుగూర్చి, సహ సీతయా = సీతతో కూడ, భ్రాతరౌ సోదరులైన, తౌ = ఆ రామలక్ష్మణులను గూర్చి, ఆచచక్షే = చెప్పెను.

తా. పిమ్మట భయంకరురాలైన ఆ శూర్పణఖ రాముని ఆశ్రమమునకు వెళ్ళి సీతను, రామలక్ష్మణులను ఆ రాక్షసులకు చూపెను. 1

మూ. తే రామం పర్ణశాలాయాముపవిష్టం మహాబలమ్,
దదృశుః సీతయా సార్ధం వైదేహ్యా లక్ష్మణేన చ. 2

ప్ర. అ. తే=ఆ రాక్షసులు, వైదేహ్యా=విదేహరాజకుమారియైన, సీతయా సార్ధమ్ = సీతతోను, లక్ష్మణేన చ=లక్ష్మణునితోను, పర్ణశాలాయామ్=పర్ణశాలయందు, ఉపవిష్టమ్ = కూర్చున్న, మహాబలమ్ = గొప్ప బలము గల, రామమ్ = రాముణ్ణి, దదృశుః = చూచిరి.

తా. ఆ రాక్షసులు, జనకరాజపుత్రి యైన సీతతోను, లక్ష్మణునితోను పర్ణశాలలో కూర్చొని ఉన్న మహాబలశాలియైన రాముణ్ణి చూచిరి. 2

మూ. తాన్ దృష్ట్వా రాఘవః శ్రీమానాగతాన్ తాం చ రాక్షసీమ్,
అబ్రవీద్భ్రాతరం రామో లక్ష్మణం దీప్తతేజసమ్. 3

ప్ర. అ. శ్రీమాన్ = శోభగల, రాఘవః = రఘువంశ సంజాతుడైన,

రామః = రాముడు, ఆగతాన్ = వచ్చిన, తాన్ = ఆ రాక్షసులను, తాం రాక్షసీం చ = ఆ రాక్షసిని, దృష్ట్వా = చూచి, దీప్తతేజసమ్ = ప్రజ్వలించుచున్న కాంతి గల, భ్రాతరమ్ = సోదరుడైన, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. శ్రీమంతుడు, రఘువంశసంజాతుడు అయిన రాముడు వచ్చిన ఆ రాక్షసులను, ఆ రాక్షసిని చూచి, తేజస్సుతో ప్రజ్వలించుచున్న తమ్ముడైన లక్ష్మణునితో ఇట్లు పలికెను. 3

మూ. ముహూర్తం భవ సౌమిత్రే సీతాయాః ప్రత్యనన్తరః,
ఇమానస్యా వధిష్యామి పదవీమాగతానిహ. 4

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా! ముహూర్తమ్ = ముహూర్తకాలమును, సీతాయాః = సీతకు, ప్రత్యనన్తరః = సమీపమునందు ఉన్నవాడవు, భవ = ఆగుము. అస్యాః = ఈ రాక్షసియొక్క, పదవీమ్ = మార్గమును అనుసరించి, ఇహ = ఇక్కడికి, ఆగతాన్ = వచ్చిన, ఇమాన్ = ఈ రాక్షసులను, వధిష్యామి = చంపగలను.

తా. లక్ష్మణా! ముహూర్తకాలము పాటు సీత దగ్గర ఉండి ఆమెను రక్షించుము. ఈ రాక్షసిని అనుసరించి ఇక్కడికి వచ్చిన ఈ రాక్షసులను చంపెదను. 4

మూ. వాక్యమేతత్తతః శ్రుత్వా రామస్య విదితాత్మనః,
తథేతి లక్ష్మణో వాక్యం రామస్య ప్రత్యపూజయత్. 5

ప్ర. అ. తతః = అటు పిమ్మట, లక్ష్మణః = లక్ష్మణుడు, విదితాత్మనః = ప్రసిద్ధమైన బుద్ధి గల, రామస్య = రామునియొక్క, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, తథేతి = అటులనే చేసెదను అని, రామస్య = రామునియొక్క, వాక్యమ్ = వాక్యమును, ప్రత్యపూజయత్ = పూజించెను.

తా. పిమ్మట లక్ష్మణుడు, ప్రసిద్ధమైన బుద్ధి గల రాముని మాటలు విని, "అటులనే చేసెదను" అని పలుకుచు ఆ రాముని వాక్యమును గౌరవించెను. 5

మూ. రాఘవోఽపి మహచ్చాపం చామీకరవిభూషితమ్,
చకార సజ్యం ధర్మాత్మా తాని రక్షాంసి చాబ్రవీత్. 6

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, రాఘవోఽపి = రాముడు, చామీకర విభూషితమ్ = బంగారము చేత అలంకరించబడిన, మహత్ = గొప్పదైన, చాపమ్ = ధనస్సును, సజ్యమ్ = నారితో కూడినదానినిగా, చకార = చేసెను. తాని = ఆ, రక్షాంసి = రాక్షసులను గూర్చి, అబ్రవీత్ చ = పలికెను.

తా. ధర్మాత్ముడైన రాముడు బంగారముతో అలంకరించబడిన గొప్ప ధనస్సుకు నారి కట్టి, ఆ రాక్షసులతో ఇట్లు పలికెను. 6

మూ. పుత్రౌ దశరథస్యావాం భ్రాతరౌ రామలక్ష్మణౌ,
ప్రవిష్టౌ సీతయా సార్ధం దుశ్చరం దణ్డకావనమ్. 7

ప్ర. అ. అవామ్ = మేమిద్దరము, దశరథస్య = దశరథుని యొక్క, పుత్రౌ = పుత్రులము, భ్రాతరౌ = సోదరులము అయిన, రామలక్ష్మణౌ = రామ లక్ష్మణులము. సీతయా సార్ధమ్ = సీతతో కూడ, దుశ్చరమ్ = సంచరింప శక్యము కాని, దణ్డకావనమ్ = దండకారణ్యమును, ప్రవిష్టౌ = ప్రవేశించినాము.

తా. రామలక్ష్మణు లను పేర్లు గల మే మిద్దరము దశరథుని కుమారులము. సంచరించుటకు చాల కష్ట మైన ఈ దండకారణ్యములోనికి సీతతో కూడ ప్రవేశించినాము. 7

మూ. ఫలమూలాశనౌ దాన్తౌ తాపసౌ ధర్మచారిణౌ,
వసన్తౌ దణ్డకారణ్యే కిమర్థముపహింసథ. 8

ప్ర. అ. ఫలమూలాశినౌ = ఫలములను మూలములను తినుచున్నవారము. దాన్తౌ = ఇంద్రియనిగ్రహము కలవారము, ధర్మచారిణౌ = ధర్మమును ఆచరించుచున్నవారము, దణ్డకారణ్యే = దండకారణ్యమునందు, వసన్తౌ = నివసించుచున్నవారము, తాపసౌ = మునులము అయిన మమ్ము, కిమర్థమ్ = ఎందుకు. ఉపహింసథ = బాధపెట్టుచున్నారు

తా. ఫలములను మూలములను భుజించుచు, ఇంద్రియనిగ్రహముతో

ధర్మమును ఆచరించుచు దండకారణ్యములో తాపసులుగా నివసించుచున్న మమ్ము
లను మీ రెందుకు బాధించుచున్నారు? 8

మూ. యుష్మాన్ పాపాత్మకాన్ హన్తుం విప్రకారాన్మహాహవే,
ఋషీణాం తు నియోగేన ప్రాప్తోఽహం సశరాయుధః. 9

ప్ర. అ. అహమ్ = నేను, పాపాత్మకాన్ = పాపాత్ములు, విప్రకారాన్ = అపకారము చేయువారు అయిన, యుష్మాన్ = మిమ్ములను, ఆహవే = యుద్ధమునందు, హన్తుమ్ = చంపుటకు, సశరాయుధః = శరీరములతో ఆయుధములతో కూడినవాడనై, ఋషీణామ్ = ఋషులయొక్క, నియోగేన = ఆజ్ఞచేత, ప్రాప్తః = వచ్చినాను.

తా. హింస చేయు పాపాత్ములైన మిమ్ములను యుద్ధములో చంపుటకై నేను ఋషుల ఆజ్ఞచే బాణములు, ఆయుధములు ధరించి వచ్చినాను. 9

మూ. తిష్ఠతైవాత్ర సంతుష్టా నోపావర్తితుమర్హథ,
యది ప్రాణైరిహార్థో వా నివర్తధ్వం నిశాచరాః. 10

ప్ర. అ. సందుష్టాః = దుష్టులైన, నిశాచరాః = రాక్షసులారా! అత్రైవ = ఇక్కడనే, తిష్ఠత = నిలబడండి. ఉపావర్తితుమ్ = తిరిగి వెళ్లుటకు, న అర్హథ = తగరు. యది వా = లేక, ప్రాణైః = ప్రాణములతో, అర్థః = ప్రయోజనమున్నచో, నివర్తధ్వమ్ = మరలిపొండి.

తా. చాలా దుష్టులైన ఓ రాక్షసులారా! అక్కడనే నిలబడండి. తిరిగి వెళ్లకండి. ప్రాణాలమీద ఆశ ఉన్నచో తిరిగి వెళ్ళిపొండి. 10

మూ. తస్య తద్వచనం శ్రుత్వా రాక్షసాస్తే చతుర్దశ,
ఊచుర్వాచం సుసంక్రుద్ధా బ్రహ్మఘ్నాః శూలపాణయః.

ప్ర. అ. తస్య = రామునియొక్క. తత్ వచనమ్ = ఆ వచనమును, శ్రుత్వా = విని, బ్రహ్మఘ్నాః = బ్రహ్మహత్యలు చేసినవాళ్ళు, శూలపాణయః = శూలములు హస్తములందు కలవాళ్లు అయిన, తే = ఆ, చతుర్దశ రాక్షసాః = పదునలుగురు రాక్షసులు, సుసంక్రుద్ధాః = చాల కోపించినవారై, వాచమ్ = వాక్కును,

తా. శూలములు హస్తములలో ధరించిఉన్న, బ్రహ్మహత్యాపాతకులైన ఆ పదునలుగురు రాక్షసులు రాముని మాటలు విని, చాలా కోపించినవారై ఇట్లు పలికిరి. 11

మూ. క్రోధముత్పాద్య నో భర్తుః ఖరస్య సుమహాత్మనః,
త్వమేవ హాస్యసే ప్రాణానద్యాస్మాభిర్హతో యుధి. 12

ప్ర. అ. నః = మాయొక్క, భర్తుః = ప్రభువు, సుమహాత్మనః = చాల గొప్పవాడు అయిన, ఖరస్య = ఖరునకు, క్రోధమ్ = క్రోధమును, ఉత్పాద్య = పుట్టించి, అద్య = ఇప్పుడు, అస్మాభిః = మాచేత, యుధి = యుద్ధమునందు, హతః = చంపబడినవాడవై, త్వమేవ = నీవే, ప్రాణాన్ = ప్రాణములను, హాస్యసే = విడువగలవు.

తా. మా ప్రభువు, చాల గొప్పవాడు అయిన ఖరునకు కోపము కలిగించిన నీవే ఇప్పుడు మాచేత యుద్ధమునందు చంపబడి ప్రాణములు విడువగలవు.

మూ. కా హి తే శక్తిరేకస్య బహూనాం రణమూర్ధని,
అస్మాకమగ్రతః స్థాతుం కిం పునర్యోద్ధుమాహవే. 13

ప్ర. అ. బహూనామ్ = అనేకులమైన, అస్మాకమ్ = మాయొక్క, అగ్రతః = ఎదుట, రణమూర్ధని = రణాగ్రమునందు, స్థాతుమ్ = నిలచుటకు, ఏకస్య = ఒక్క, తే = నీకు, కా శక్తిః = ఏమి శక్తి ఉన్నది? ఆహవే = యుద్ధమునందు, యోద్ధుమ్ = యుద్ధముచేయుటకు, కిం పునః = చెప్పనేల?

తా. మా చాలామంది ముందు యుద్ధరంగాగ్రభాగమున నిలచుటకు ఏకాకివైన నీకు శక్తి ఎక్కడిది? నీవు రణములో మాతో యుద్ధము చేయుట కూడనా! 13

మూ. ఏహి బాహుప్రయుక్తైర్నః పరిఘైః శూలపట్టిసైః,
ప్రాణాంస్త్యక్షసి వీర్యం చ ధనుశ్చ కరపీడితమ్. 14

ప్ర. అ. ఏహి = రమ్ము. నః = మా యొక్క, బాహుప్రయుక్తైః = బాహువులచేత ప్రయోగింపబడిన, పరిఘైః = పరిఘలచేతను, శూలపట్టిసైః = శూలముల

చేతను, పట్టిసములచేతను, ప్రాణాన్ = ప్రాణములను, వీర్యం చ = పరాక్రమమును, కరపీడితమ్ = చేతిచేత పీడింపబడిన, ధనుశ్చ = ధనస్సును, త్యక్ష్యసి = విడువగలవు.

తా. మేము ప్రయోగించిన పరిఘలచేతను, శూలములచేతను, పట్టిసములచేతను నీ ప్రాణములను, పరాక్రమమును, చేతిలో ధరించిన ధనస్సును కూడ విడచి వేసెదవులే. రమ్ము. 14

మూ. ఇత్యేవముక్త్వా సంక్రుద్ధా రాక్షసాస్తే చతుర్దశ,
చిక్షిపుస్తాని శూలాని రాఘవం ప్రతి దుర్జయమ్. 15

ప్ర. అ. సంక్రుద్ధాః = కోపించిన, తే = ఆ, చతుర్దశ రాక్షసాః = పదునలుగురు రాక్షసులు, ఇత్యేవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, తాని శూలాని = ఆ శూలములను, దుర్జయమ్ = జయింప శక్యము కాని, రాఘవం ప్రతి = రాముణ్ణి గూర్చి, చిక్షిపుః = విసరిరి.

తా. ఆ పదునలుగురు రాక్షసులు కోపముతో ఇట్లు పలికి, శూలములను జయింపశక్యముకాని రాముని మీదికి ప్రయోగించిరి. 15

మూ. తాని శూలాని కాకుత్స్థః సమస్తాని చతుర్దశ,
తావద్భిరేవ చిచ్ఛేద శరైః కాఞ్చనభూషణైః. 16

తా. కాకుత్స్థః = రాముడు, చతుర్దశ = పదునాలుగు, తాని శూలాని = ఆ శూలములను, సమస్తాని = అన్నింటిని, తావద్భిః ఏవ = అన్నియే యైన, కాఞ్చనభూషణైః = బంగారు అలంకారములు గల, శరైః = బాణములచేత, చిచ్ఛేద = ఛేదించెను.

తా. ఆ పదునాలుగు శూలములను అన్నింటిని కూడ రాముడు బంగారు అలంకారము గల పదునాలుగు బాణములతో ఛేదించెను. 16

మూ. తతః పశ్చాన్మహాతేజా నారాచాన్ సూర్యసన్నిభాన్,
జగ్రాహ పరమక్రుద్ధశ్చతుర్దశ శిలాశితాన్. 17

ప్ర. అ. తతః పశ్చాత్ = అటు పిమ్మట, మహాతేజాః = గొప్ప తేజస్సు

గల రాముడు, పరమక్రుద్ధః = చాలా కోపించినవాడై, శిలాశితాన్ = ఛాతిపై సానబెట్టబడిన, సూర్యసన్నిభాన్ = సూర్యునితో సమానమైన, చతుర్దశ = పదునాలుగు, నారాచాన్ = నారాచబాణములను, జగ్రాహ = గ్రహించెను.

తా. పిమ్మట మహాతేజఃశాలియైన రాముడు చాల క్రుద్ధుడై, ఛాతిపై సానబెట్టిన, సూర్యుని వలె ప్రకాశించుచున్న పదునాలుగు నారాచబాణములు గ్రహించెను. 17

మూ. గృహీత్వా ధనురాయమ్య లక్ష్యానుద్దిశ్య రాక్షసాన్,
ముమోచ రాఘవో బాణాన్ వజ్రానివ శతక్రతుః. 18

ప్ర. అ. రాఘవః = రాముడు, ధనుః = ధనస్సును, గృహీత్వా = గ్రహించి, ఆయమ్య = వంచి, లక్ష్యాన్ = లక్ష్యమైన, రాక్షసాన్ = రాక్షసులను, ఉద్దిశ్య = ఉద్దేశించి, శతక్రతుః = దేవేంద్రుడు, వజ్రానివ = వజ్రములను వలె, బాణాన్ = బాణములను, ముమోచ = విడచెను.

తా. రాముడు ధనస్సు గ్రహించి, దానిని వంచి, రాక్షసులను గురి చూచి దేవేంద్రుడు వజ్రాయుధములను విడచి నట్లు బాణములను విడచెను.

మూ. రుక్మపుఙ్ఖాశ్చ విశిఖా దీప్తా హేమవిభూషితాః,
తే భిత్త్వా రక్షసాం వేగాద్వక్షాంసి రుధిరాప్లుతాః, 19
వినిష్పేతుస్తతో భూమౌ న్యమజ్జన్తాశనిస్వనాః.

ప్ర. అ. రుక్మపుఙ్ఖాః = బంగారు పొన్నులు గలవి, దీప్తాః = ప్రజ్వలించుచున్నవి, హేమవిభూషితాః = బంగారముచేత భూషింపబడినవి అయిన, తే విశిఖాః = ఆ బాణములు, వేగాత్ = వేగమువలన, రక్షసామ్ = రాక్షసులయొక్క, వక్షాంసి = వక్షః స్థలములను, భిత్త్వా = ఛేదించి, రుధిరాప్లుతాః = రక్తముచేత పూయబడినవై, తదా = అప్పుడు, వినిష్పేతుః = బైటకు వచ్చినవి. అశనిస్వనాః = ఉరుమువంటి ధ్వని గలవై, భూమౌ = నేలలో, న్యమజ్జన్ = భేదించుకొని మునిగిపోయినవి.

తా. బంగారు పొన్నులతో ప్రజ్వలించుచున్న, బంగారముచేత అలంకరింపబడిన ఆ బాణములు వేగముగా రాక్షసుల వక్షఃస్థలములను ఛేదించి, రక్తము

చేత తడపబడినవై, వాళ్ల శరీరములనుండి బైటకు వచ్చి, ఉరుమువంటి ధ్వనితో భూమిని భేదించుకొని దానిలో ప్రవేశించినవి. 19

మూ. తే భిన్నహృదయా భూమౌ ఛిన్నమూలా ఇవ ద్రుమాః,
నిపేతుః శోణితార్ద్రాఙ్గాః వికృతా విగతాసవః.

ప్ర. అ. తే = ఆ రాక్షసులు, భిన్నహృదయాః = బ్రద్దలు కొట్టబడిన హృదయములు కలవారై, శోణితార్ద్రాఙ్గాః = రక్తముచేత ఎఱ్ఱనైన శరీరములు కలవారై, వికృతాః = వికారము కలవారై, విగతాసవః = పోయిన ప్రాణములు కలవారై, ఛిన్నమూలాః = చేదింపబడిన మొదళ్లు గల, ద్రుమాః ఇవ = చెట్లువలె, భూమౌ = నేలపై, నిపేతుః = పడిపోయిరి.

తా. ఆ రాక్షసుల హృదయములు బ్రద్దలై పోయెను. శరీరములు రక్తముతో తడిసెను. ఈ విధముగ ఆ రాక్షసులు ప్రాణములు విడచి, వికృతరూపములతో మొదళ్లు నరికిన చెట్ల వలె నేలపై పడిరి. 20

మూ. తాన్ దృష్ట్వా పతితాన్ భూమౌ రాక్షసీ క్రోధమూర్ఛితా,
పరిత్రస్తా పునస్తత్ర వ్యసృజద్భైరవస్వనాన్-

ప్ర. అ. భూమౌ = నేలపై, పతితాన్ = పడిపోయిన, తాన్ = వాళ్ళను, దృష్ట్వా = చూచి, రాక్షసీ = ఆ శూర్పణఖ, క్రోధమూర్ఛితా = క్రోధముచే వ్యాప్తురాలై, పరిత్రస్తా = భయపడినదై, తత్ర = అక్కడ, పునః = మరల, భైరవస్వనాన్ = భయంకర ధ్వనులను, వ్యసృజత్ = విడచెను.

తా. శూర్పణఖ నేలపై పడిపోయిన ఆ రాక్షసులను చూచి, కోపభయములతో అక్కడ మరల భయంకరములైన ధ్వనులను చేయుచు అరచెను. 21

మూ. ఉపగమ్య ఖరం సా తు కించిత్సంశుష్కశోణితా, 22
పపాత పునరేవార్తా సనిర్యాసేవ సల్లకీ.

ప్ర. అ. కించిత్ = కొంచెము, సంశుష్కశోణితా = ఎండిన రక్తము గలదై, సనిర్యాసా = జిగురుతో కూడిన, సల్లకీ ఇవ = లతవలె ఉన్న, సా తు =

ఆ శూర్పణఖ, ఆర్తా = దుఃఖితురాలై, ఖరమ్ = ఖరుణ్ణి, ఉపగమ్య = పొంది, పునరేవ = మరల, పపాత = నేలమీద పడెను.

తా. ఆ శూర్పణఖ కొంచెము ఎండిన రక్తముతో చిగురు కారుచున్న లత వలె మరల ఖరునివద్దకు వచ్చి దుఃఖితురాలై నేలమీద పడెను. 22

మూ. భ్రాతుః సమీపే శోకార్తా ససర్జ నినదం ముహుః, 23
సస్వరం ముముచే బాష్పం విషణ్ణవదనా తదా.

ప్ర. అ. తదా = అప్పుడు, శోకార్తా = శోకముచేత పీడితురాలై, భ్రాతుః = సోదరునియొక్క, సమీపే = = సమీపమునందు, ముహుః = మాటిమాటికి, నినదమ్ = ధ్వనిని, ససర్జ = విడచెను. విషణ్ణవదనా = దిగులుచెందిన ముఖము గలదై, సస్వరమ్=స్వరముతో కూడినట్లుగా, బాష్పమ్ = కన్నీటిని, ముముచే= విడచెను.

తా. ఆమె సోదరుని దగ్గర బిగ్గరగా ఏడ్చుచు, దుఃఖపీడితురాలై, దిగులు చెందిన ముఖముతో కన్నీళ్ళు కార్చెను. 24

మూ. నిపాతితాన్ దృశ్య రణే తు రాక్షసాన్
ప్రధావితా శూర్పణఖా పునస్తతః,
వధం చ తేషాం నిఖిలేన రక్షసాం
శశంస సర్వం భగినీ ఖరస్య సా. 25

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
వింశః సర్గః.

ప్ర. అ. శూర్పణఖా = శూర్పణఖ, రణే = యుద్ధమునందు, నిపాతితాన్ = పడగొట్టబడిన, రాక్షసాన్ = రాక్షసులను, దృశ్య = చూచి, పునః = మరల, తతః = అక్కడినుండి, ప్రధావితా = పరుగెత్తినది. భగినీ = ఖరుని సోదరియైన ఆమె, రక్షసామ్ = ఆ రాక్షసులయొక్క, వధమ్ = వధను గూర్చి, సర్వమ్ = సమస్తమును, నిఖిలేన = పూర్తిగా, ఖరస్య = ఖరునకు, శశంస = చెప్పెను.

రా. శూర్పణఖ ఆ రాక్షసులు రణమునందు చంపబడుట చూచి మరల పరుగెత్తి వెళ్లి, ఆ రాక్షసు లందరు మరణించిన విషయమును పూర్తిగా ఖరునకు చెప్పెను. 25

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో
ఇరువదవ సర్గ సమాప్తము.

అథ ఏకవింశః సర్గః

[శూర్పణఖ రాక్షసుల వధను ఖరునకు తెలిపి, రామునివలన గొప్ప ఆపద సంభవించిన దని చెప్పుచు ఆతనిని యుద్ధానికై ప్రోత్సహించుట].

మూ. స పునః పతితాం దృష్ట్వా క్రోధాచ్ఛూర్పణఖాం ఖరః,
ఉవాచ వ్యక్తయా వాచా తామనర్థార్థమాగతామ్. 1

ప్ర. అ. సః ఖరః = ఆ ఖరుడు, పునః = మరల, పతితామ్ = నేలపై పడిన, శూర్పణఖామ్ = శూర్పణఖను, దృష్ట్వా = చూచి, అనర్థార్థమ్ = అనర్థము కొరకై, ఆగతామ్ = వచ్చిన, తామ్ = ఆమెను గూర్చి, వ్యక్తయా = స్పష్టమైన, వాచా = వాక్కుతో, క్రోధాత్ = కోపమువలన, ఉవాచ = పలికెను.

తా. ఆ ఖరుడు తనకు అనర్థము చేకూర్చుటకే మరల వచ్చి నేలమీద పడిన శూర్పణఖను చూచి, స్పష్టమైన మాటలో, కోపముతో ఇట్లు పలికెను. 1

మూ. మయాత్విదానీం శూరాస్తే రాక్షసా రుధిరాశనాః,
త్వత్ప్రియార్థం వినిర్దిష్టాః కిమర్థం రుద్యతే పునః. 2

ప్ర. అ. మయా = నాచేత, త్వత్ప్రియార్థమ్ = నీ ప్రియముకొరకు, ఇదానీమ్ = ఇప్పుడే, రుధిరాశనాః = రక్తము ఆహారముగా గల, శూరాః = శూరులైన, తే రాక్షసాః = ఆ రాక్షసులు, వినిర్దిష్టాః = ఆజ్ఞాపింపబడినారు. పునః = మరల, కిమర్థమ్ = ఎందుకు, రుద్యతే = రోదనము చేయబడుచున్నది?

తా. నీకు ప్రియము చేకూర్చుటకై ఇప్పుడేకదా నేను, రక్తము త్రాగే శూరులైన రాక్షసులను పంపినాను? ఎందుకు ఏడ్చుచున్నావు? 2

మూ. భక్తాశ్చైవానురక్తాశ్చ హితాశ్చ మమ నిత్యశః,
హన్యమానా న హన్యన్తే న న కుర్యుర్వచో మమ. 3

ప్ర. అ. (ఆ రాక్షసులు) భక్తాశ్చైవ = భక్తులు, అనురక్తాశ్చ = నాపై ప్రేమగలవారు, నిత్యశః = ఎల్లప్పుడు, మమ = నాకు, హితాశ్చ = హితులు, హన్యమానాః = చంపబడుచున్న వారైనను, న హన్యన్తే = చంపబడరు. మమ = నాయొక్క, వచః = వచనమును, న న కుర్యుః = చేయరు అన్న మాట లేదు.

తా. ఆ రాక్షసులు స్వామిభక్తులు; ప్రేమ కలవారు; ఎల్లప్పుడు నా హితము కోరువారు. ఎవరు ఎంత ప్రయత్నించినను చంప శక్యము కానివారు. వాళ్ళు నా ఆజ్ఞను నిర్వర్తించకుండు ప్రసక్తియే లేదు. 3

మూ. కిమేతచ్ఛ్రోతుమిచ్ఛామి కారణం యత్కృతే పునః,
హా నాథేతి వినర్దన్తీ సర్పవల్లుఠసి క్షితౌ. 4

ప్ర. అ. యత్కృతే = దేనినిమిత్తమై, హా నాథ ఇతి = "హా నాథా"అని, వినర్దన్తీ = అరచుచున్నదానవై, పునః = మరల, సర్పవత్ = సర్పము వలె, క్షితౌ = భూమిపై, లుఠసి = దొర్లుచున్నావో, ఏతత్ = ఈ, కారణమ్ = కారణము, కిమ్ = ఏమో, శ్రోతుమ్ = వినుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. నీవు మళ్ళీ వచ్చి "అయ్యో నాథా!"అని అరచుచు సర్పము వలె నేలమీద దొర్లుటకు కారణ మేమో తెలిసికొనగోరుచున్నాను. 4

మూ. అనాథవద్విలపసి నాథే తు మయి సంస్థితే,
ఉత్తిష్ఠోత్తిష్ఠ మాభైషీర్వైక్లబ్యం త్యజ్యతామిహ. 5

ప్ర. అ. నాథే = రక్షకుడనైన, మయి = నేను, సంస్థితే = ఉండగా, అనాథవత్ = రక్షకుడు లేనిదానవు వలె, విలపసి = విలపించుచున్నావు, ఉత్తిష్ఠ ఉత్తిష్ఠ = లెమ్ము లెమ్ము; మాభైషీః = భయపడకుము. ఇహ = ఇప్పుడు, వైక్లబ్యమ్ = మనోవైకల్యము, త్యజ్యతామ్ = విడువబడుగాక.

తా. నీకు రక్షకుడుగా నేను ఉండగా రక్షకుడు లేనిదానవు వలె ఏడ్చుచున్నా వేమి? లెమ్ము; లెమ్ము, భయపడకుము, అధైర్యమును విడువుము. 5

మూ. ఇత్యేవముక్తా దుర్ధర్షా ఖరేణ పరిసాన్త్వితా,
విమృజ్య నయనే సాస్రే ఖరం భ్రాతర మబ్రవీత్. 6

ప్ర. అ. ఇత్యేవమ్ = ఇట్లు, ఉక్తా = పలుకబడినదై, ఖరేణ = ఖరునిచేత, పరిసాన్త్వితా = ఓదార్చబడిన, దుర్ధర్షా = ఎదిరింప శక్యము కాని ఆ శూర్పణఖ, సాస్రైః = కన్నీళ్లతో కూడిన, నయనే = నేత్రములను, విమృజ్య = తుడుచుకొని, భ్రాతరమ్ = సోదరుడైన, ఖరమ్ = ఖరుణ్ణి గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. ఖరుడు ఈ విధముగ పలుకుచు ఓదార్చగా, ఎదిరింప శక్యము కాని ఆ శూర్పణఖ కన్నీళ్లు తుడుచుకొనుచు, సోదరుడైన ఆ ఖరునితో ఇట్లనెను. 6

మూ. అస్మీదానీమహం ప్రాప్తా హృతశ్రవణనాసికా,
శోణితౌఘపరిక్లిన్నా త్వయా చ పరిసాన్త్వితా. 7

ప్ర. అ. హృతశ్రవణనాసికా = హరించబడిన చెవులు, ముక్కు గల, అహమ్ = నేను, శోణితౌఘపరిక్లిన్నా = రక్తప్రవాహముచేత తడిసినదాననై, ఇదానీమ్ = ఇప్పుడు, ప్రాప్తా అస్మి = వచ్చి ఉన్నాను. త్వయా = నీచేత, పరిసాన్త్వితా చ = ఓదార్చబడితిని కూడ.

తా. ముక్కు చెవులు కోసివేయగా రక్తప్రవాహముతో తడియుచు నేను ఇప్పుడే నీవద్దకు వచ్చితిని. నీవు కూడ ఓదార్చితివి కదా. 7

మూ. ప్రేషితాశ్చ త్వయా వీర రాక్షసాస్తే చతుర్దశ,
నిహన్తుం రాఘవం క్రోధాన్మత్ప్రియార్థం సలక్ష్మణమ్. 8

ప్ర. అ. వీర = వీరుడా ! త్వయా = నీచేత, క్రోధాత్ = కోపమువలన, మత్ప్రియార్థమ్ = నా ప్రియముకొరకై, సలక్ష్మణమ్ = లక్ష్మణునితో గూడిన, రాఘవమ్ = రాముణ్ణి, నిహన్తుమ్ = చంపుటకు, తే = ఆ, చతుర్దశ = పదునలుగురు, రాక్షసాః = రాక్షసులు, ప్రేషితాః = పంపబడిరి.

తా. ఓ ! ఖరుడా ! నీవు అప్పుడు క్రుద్ధుడవై, నాకు ప్రియము చేయుటకై, రామలక్ష్మణులను చంపుటకు పదునలుగురు రాక్షసులను పంపితివి. 8

మూ. తే తు రామేణ సామర్షాః శూలపట్టిసపాణయః.
సమరే నిహతాః సర్వే సాయకైర్మర్మభేదిభిః. 9

ప్ర. అ. సామర్షాః = కోపముతో కూడిన, శూలపట్టిసపాణయః = శూల

ములు పట్టిసములు హస్తములందు గల, తే = ఆ, సర్వే = అందరూ, రామేణ = రామునిచేత, మర్మభేదిభిః = మర్మస్థలములను భేదించు, సాయకైః = బాణములతో, నిహతాః = చంపబడినారు.

తా. కోపముతో శూలములు, పట్టిసములు ధరించి వచ్చిన ఆ రాక్షసుల నందరినీ రాముడు, మర్మస్థానములను భేదించు బాణములతో హతమార్చినాడు. 9

మూ. తాన్ దృష్ట్వా పతితాన్ భూమౌ క్షణేనైవ మహాబలాన్,
రామస్య చ మహత్కర్మ మహాంస్త్రాసోఽభవన్మమ. 10

ప్ర. అ. క్షణేనైవ = క్షణకాలములోనే, భూమౌ = నేలపై, పతితాన్ = పడిన, మహాబలాన్ = గొప్ప బలము గల, తాన్ = ఆ రాక్షసులను, రామస్య = రామునియొక్క, మహత్ = గొప్పదైన, కర్మ చ = ఆ పనినీ, దృష్ట్వా = చూచి, మమ = నాకు, మహాన్ = గొప్ప, త్రాసః = భయము, అభవత్ = ఆయెను.

తా. క్షణకాలములోనే నేలపై ఆ మహాబలశాలులైన రాక్షసు లందరూ పడిపోవుటను, రాముని ఆ మహాకార్యమును చూడగానే నాకు గొప్ప భయము కలిగినది. 10

మూ. అహమస్మి సముద్విగ్నా విషణ్ణా చ నిశాచర,
శరణం త్వాం పునః ప్రాప్తా సర్వతోభయదర్శినీ. 11

ప్ర. అ. నిశాచర = ఖరుడా ! అహమ్ = నేను, సముద్విగ్నా = భయపడినదానను, విషణ్ణా చ = దిగులుచెందినదానను, అస్మి = అయితిని. సర్వతః = అన్ని వైపులనుండీ, భయదర్శినీ = భయమును చూచుచున్నదాననై, పునః = మరల, త్వామ్ = నిన్ను, శరణం ప్రాప్తా = శరణుజొచ్చితిని.

తా. ఓ ! ఖరుడా ! నేను చాల భయపడుచున్నాను. దిగులుచెంది ఉన్నాను. ఏ వైపునుండి యైనా ప్రమాదము వాటిల్లవచ్చు నను భయముతో మరల నీదగ్గరకు రక్షణము నిమిత్తము వచ్చినాను. 11

మూ. విషాదనక్రాధ్యుషితే పరిత్రాసోర్మిమాలిని,
కిం మాం న త్రాయసే మగ్నాం విపులే శోకసాగరే. 12

ప్ర. అ. విషాదనక్రాధ్యుషితే = దిగులు అను మొసలిచేత అధిష్ఠింపబడి నది, పరిత్రాసోర్మిమాలిని = భయ మను తరంగపంక్తి గలది అయిన, విపులే = విశాలమైన, శోకసాగరే = శోకసముద్రమునందు, మగ్నామ్ = మునిగిన, మామ్ = నన్ను, కిమ్ = ఎందువలన, న త్రాయసే = రక్షించవు ?

తా. నేను, విషాద మనే మొసలి, భయ మనే తరంగపంక్తులు గల విశాల మైన దుఃఖసముద్రములో మునిగి యున్నాను; నన్నెందుకు రక్షించవు ?

మూ. ఏతే చ నిహతా భూమౌ రామేణ నిశితైః శరైః,
యేఽపి మే పదవీం ప్రాప్తా రాక్షసాః పిశితాశనాః. 13

ప్ర. అ. పిశితాశనాః = మాంసమే ఆహారముగా గల, యే = ఏ, రాక్షసాః = రాక్షసులు, మే = నాయొక్క, పదవీమ్ = మార్గమును, ప్రాప్తాః = పొందినారో, ఏతే చ = వీళ్లు కూడ, రామేణ = రామునిచేత, భూమౌ = నేలమీద, నిశితైః = వాడియైన, శరైః = బాణములచేత, నిహతాః = చంపబడినారు.

తా. నాతో వచ్చిన మాంసభక్షకు లైన రాక్షసులను రాముడు వాడియైన బాణములచేత చంపి నేలపై పడవేసినాడు. 13

మూ. మయి తే యద్యనుక్రోశో యది రక్షస్సు తేషు చ,
రామేణ యది తే శక్తిస్తేజో వాస్తి నిశాచర, 14
దణ్డకారణ్యనిలయం జహి రాక్షసకణ్టకమ్.

ప్ర. అ. నిశాచర = ఓ ! ఖరుడా ! తే = నీకు, మయి = నాయందు, తేషు = ఆ, రక్షస్సు చ = రాక్షసులయందు, అనుక్రోశః = జాలి, అస్తి యది = ఉన్నట్లయితే, తే = నీకు, రామేణ = రామునితో, శక్తిః = శక్తి, తేజో వా = తేజస్సు, అస్తి యది = ఉన్నట్లయితే, దణ్డకారణ్యనిలయమ్ = దండకారణ్యములో నివసించి ఉన్న, రాక్షసకణ్టకమ్ = రాక్షసులకు ముల్లువంటి వాడైన రాముణ్ణి, జహి = చంపుము.

తా. ఓ ! ఖరుడా ! నీకు నాయందు, ఆ రాక్షసులయందు జాలి ఉన్న ట్లయితే, రాముణ్ణి ఎదిరించుటకు శక్తి, తేజస్సు ఉన్నట్లయితే, దండకారణ్యములో నివాస మేర్పరచుకొని ఉన్న, రాక్షసకంటకు డైన ఆ రాముణి చంపుము. 14

మూ. యది రామం మమామిత్రం న త్వమద్యవధిష్యసి, 15
తవ చైవాగ్రతః ప్రాణాంస్త్యక్ష్యామి నిరపత్రపా.

ప్ర. అ. మమ=నాయొక్క, అమిత్రమ్=శత్రువైన, రామమ్=రాముణ్ణి, త్వమ్ = నీవు, అద్య = ఇప్పుడు, న వధిష్యసి యది = చంపకపోయినట్లయితే, నిరపత్రపా = సిగ్గులేనిదాననై, తవ = నీయొక్క, అగ్రతః = ఎదుట, ప్రాణాన్ = ప్రాణములను, త్యక్ష్యామి = విడువగలను.

తా. నీవు నా శత్రువైన రాముణ్ణి ఇప్పుడు చంపకపోయినట్లయితే, నేను, ఏ మాత్రము సంకోచించక, నీ ఎదుటనే ప్రాణాలను విడువగలను. 15

మూ. బుద్ధ్యాహమనుపశ్యామి న త్వం రామస్య సంయుగే,
స్థాతుం ప్రతిముఖే శక్తః సబలశ్చ మహాత్మనః. 16

ప్ర. అ. త్వమ్ = నీవు, సబలశ్చ = సైన్యముతో కూడినవాడవై కూడ, సంయుగే = యుద్ధమునందు, మహాత్మనః = గొప్ప బలము గల, రామస్య = రామునియొక్క, ప్రతిముఖే = ఎదుట, స్థాతుమ్ = నిలచుటకు, న శక్తః = సమర్థుడవు కావు అని, అహమ్=నేను, బుద్ధ్యా = బుద్ధిచేత, అనుపశ్యామి=ఊహించుచున్నాను.

తా. నీవు సైన్యముతో కూడినవాడవైనా, యుద్ధములో, మహాపరాక్రమవంతుడైన రాముని ఎదుట నిలువజాల వని నా అభిప్రాయము. 16

మూ. శూరమానీవ శూరస్త్వం మిథ్యారోపితవిక్రమః,
మానుషౌ యో న శక్నోషి హన్తుం తౌ రామలక్ష్మణౌ. 17

ప్ర. అ. యః = ఏ నీవు, మానుషౌ = మనుష్యులైన, తౌ రామలక్ష్మణౌ = ఆ రామలక్ష్మణులను, హన్తుమ్ = చంపుటకు, న శక్నోషి=సమర్థుడవు కావో, త్వమ్ = అట్టి నీవు, శూరమానీ = శూరుడ నని అనుకొనుచు, శూరః ఇవ = శూరుడవు వలె, మిథ్యారోపితవిక్రమః=అసత్యముగా ఆరోపించుకొనబడిన పరాక్రమము గలవాడవు.

తా. నీవు మానవులైన రామలక్ష్మణులను కూడ చంపజాలకున్నావు. నీవు శూరుడ వని అనుకొనుచు, మహాశూరుడవు వలె నిజముగా లేని పరాక్రమము నీకున్నటు ఆరోపించుకొనుచున్నావు. 17

మూ. రామేణ యది తే శక్తిస్తేజో వాస్తి నిశాచర, 18
దణ్డకారణ్యనిలయం జహి తం కులపాంసన.

ప్ర. అ. కులపాంసన = కులమునకు అపకీర్తి తెచ్చిన, నిశాచర = ఓ ఖరుడా! రామేణ = రామునితో, తే = నీకు, శక్తిః = శక్తి గాని, తేజో వా = తేజస్సు కాని, అస్తి యది = ఉన్నట్లయితే, దణ్డకారణ్యనిలయమ్ = దండకారణ్యము నివాసస్థానముగా గల, తమ్ = ఆ రాముణ్ణి, జహి = చంపుము.

తా. కులము చెడ బుట్టిన ఓ ఖరుడా! నీకు రాముణ్ణి ఎదిరించే శక్తి గాని, తేజస్సు గాని ఉన్నచో దండకారణ్యములో నివాస మేర్పరచుకొని ఉన్న అతనిని చంపుము. 18

మూ. నిఃసత్వస్యాల్పవీర్యస్య వాసస్తే కీదృశ స్త్విహ. 19
అపయాహి జనస్థానా త్త్వరితః సహబాన్ధవః.

ప్ర. అ. నిఃసత్వస్య = బలము లేనివాడవు, అల్పవీర్యస్య = అల్పమైన పరాక్రమము కలవాడవు అయిన, తే = నీకు, ఇహ = ఇక్కడ, వాసః = నివాసము, కీదృశః = ఎట్టిది? సహబాన్ధవః = బంధువులతో కూడినవాడవై, త్వరితః = తొందర గలవాడవై, జనస్థానాత్ = జనస్థానమునుండి, అపయాహి = తొలగి పొమ్ము.

తా. నీవు దుర్బలుడవు; నీ పరాక్రమము అత్యల్పము. అట్టి నీకు ఇక్కడ నివాసమేమిటి? బంధువులతో కలిసి, శీఘ్రముగా ఈ జనస్థానమును విడచి పారి పొమ్ము. 19

మూ. రామతేజోభిభూతో హి త్వం క్షిప్రం వినశిష్యసి, 20
స హి తేజఃసమాయుక్తో రామో దశరథాత్మజః,
భ్రాతా చాస్య మహావీర్యో యేన చాస్మి విరూపితా. 21

ప్ర. అ. త్వమ్ = నీవు, రామతేజోభిభూతః = రాముని తేజస్సుచేత తిరస్కరించబడినవాడవై, క్షిప్రమ్ = శీఘ్రముగా, వినశిష్యసి హి = నశించగలవు. దశరథాత్మజః = దశరథకుమారుడైన, సః రామః = ఆ రాముడు, తేజఃసమాయుక్తః హి = తేజస్సుతో కూడినవాడు కదా. యేన = ఎవనిచేత, విరూపితా అస్మి

= వికృతరూపము కలదాననుగా చేయబడితినో, అట్టి, అస్య భ్రాతా చ = ఇతని సోదరుడు కూడ, మహావీర్యః = గొప్ప పరాక్రమము కలవాడు.

తా. నీవు రాముని తేజస్సుచేత తిరస్కరింపబడి శీఘ్రముగా నశించగలవు. దశరథకుమారుడైన ఆ రాముడు గొప్ప తేజస్సు కలవాడు. అతని సోదరుడు కూడ చాల పరాక్రమముగలవాడు. అతడే నా ముక్కుచెవులు చేదించినాడు. 21

మూ. ఏవం విలప్య బహుశో రాక్షసీ ప్రథితోదరీ,
కరాభ్యాముదరం హత్వా రురోద భృశదుఃఖితా. 22

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ఏకవింశః సర్గః.

ప్ర. అ. ప్రథితోదరీ = పెద్ద ఉదరము గల, రాక్షసీ = ఆ శూర్పణఖ, బహుశః = అనేకవిధములుగా, ఏవమ్ = ఇట్లు, విలప్య = విలపించి, భృశదుఃఖితా = మిక్కిలి దుఃఖించినదై, కరాభ్యామ్ = చేతులతో, ఉదరమ్ = ఉదరమును, హత్వా = బాదుకొని, రురోద = ఏడ్చెను.

తా. పెద్ద పొట్ట గల ఆ రాక్షసి ఇట్లు అనేకవిధముల విలపించుచు, చాల దుఃఖితురాలై, చేతులతో ఉదరము బాదుకొనుచు ఏడ్చెను. 22

'బాలానందిని'' అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో
ఇరువదిఒకటవ సర్గ సమాప్తము.

అథ ద్వావింశః సర్గః

[*ఖరదూషణులు పదునాలుగువేల రాక్షసులతో జనస్థానమునుండి పంచవటికి బయలుదేరుట*].

మూ. ఏవమాధర్షితః శూరః శూర్పణఖ్యా ఖర స్తతః,
ఉవాచ రక్షసాం మధ్యే ఖరః ఖరతరం వచః. 1

ప్ర. అ. తతః=అటుపిమ్మట, శూర్పణఖ్యా=శూర్పణఖచేత, ఏవమ్=ఇట్లు, రక్షసామ్=రాక్షసులయొక్క, మధ్యే=మధ్యయందు, ఆధర్షితః=అవమానింపబడిన, శూరః=శూరుడైన, ఖరః=ఖరుడు, ఖరః=ఉగ్రుడై, ఖరతరమ్=చాలకఠోరమైన, వచః=వచనమును, ఉవాచ=పలికెను.

తా. శూర్పణఖ ఆ విధముగ రాక్షసుల మధ్య అవమానించగా, శూరుడైన ఆ ఖరుడు చాల ఉగ్రుడై, అతిపరుషమైన వచనమును పలికెను. 1

మూ. తవావమానప్రభవః క్రోధోఽయమతులో మమ,
న శక్యతే ధారయితుం లవణామ్భ ఇవోల్బణమ్. 2

ప్ర. అ. తవ=నీయొక్క, అవమానప్రభవః=అవమానమువలన పుట్టిన, మమ=నాయొక్క, అతులః=సాటి లేని, అయం క్రోధః=ఈ కోపము, ఉల్బణమ్=తీవ్రమైన, లవణామ్భః ఇవ=ఉప్పునీరు వలె, ధారయితుమ్=ఇముడ్చుకొనుటకు, న శక్యతే=శక్యము కాదు.

తా. నీకు జరిగిన అవమానమువలన నాకు కలిగిన ఈ తీవ్రమైన కోపమును తగ్గించుకొనుట, త్రాగిన అతితీవ్రమైన ఉప్పునీరును ఇముడ్చుకొనుట ఎంత కష్టమో అంతకష్టముగా ఉన్నది. 2

మూ. న రామం గణయే వీర్యాన్మానుషం క్షణజీవితమ్,
ఆత్మదుశ్చరితైః ప్రాణాన్ హతో యోఽద్య విమోక్ష్యతి.

ప్ర. అ. మానుషమ్ = మానవుడు, క్షణజీవితమ్ = క్షణకాలము జీవితము కలవాడు అయిన, రామమ్ = రాముణ్ణి, వీర్యాత్ = పరాక్రమమువలన, న గణయే = లెక్కచేయను, యః = ఏ రాముడు, ఆత్మదుశ్చరితైః = తాను చేసిన చెడ్డ పనులచేత, హతః = చంపబడినవాడై, అద్య = ఇప్పుడు, ప్రాణాన్ = ప్రాణములను, విమోక్ష్యతి = విడువగలడో.

తా. అల్పాయుర్దాయవంతుడు, మానవుడు అయిన రాముని పరాక్రమమును నేను లెక్కచేయను. అతడు ఇప్పుడు, తను చేసిన పాపాలకు ఫలితముగా హతుడై ప్రాణాలను విడువగలడు. 3

మూ. బాష్పః సంహ్రియతామేష సంభ్రమశ్చ విముచ్యతామ్,
అహం రామం సహ భ్రాత్రా నయామి యమసాదనమ్. 4

ప్ర. అ. ఏషః = ఈ, బాష్పః = కన్నీరు, సంహ్రియతామ్ = నిలుపబడుగాక. సంభ్రమశ్చ = తొందర కూడ, విముచ్యతామ్ = విడువబడుగాక. అహమ్ = నేను, రామమ్ = రాముణ్ణి, భ్రాత్రా సహ = సోదరునితో కూడ, యమసాదనమ్ = యముని గృహమును, నయామి = పొందించెదను.

తా. కన్నీళ్ళు నిలుపుచేయుము, భయపడకుము. నేను రాముణ్ణీ, అతని సోదరుణ్ణీ కూడ యమలోకమునకు పంపెదను. 4

మూ. పరశ్వథహతస్యాద్య మన్దప్రాణస్య సంయుగే,
రామస్య రుధిరం రక్తముష్ణం పాస్యసి రాక్షసి. 5

ప్ర. అ. రాక్షసి = ఓ! శూర్పణఖా! అద్య = ఇప్పుడు, సంయుగే = యుద్ధమునందు, పరశ్వథహతస్య = గండ్రగొడ్డలిచేత చంపబడిన, మన్దప్రాణస్య = అల్పాయుర్దాయవంతుడైన, రామస్య = రామునియొక్క, రక్తమ్ = ఎఱ్ఱని, ఉష్ణమ్ = వేడియైన, రుధిరమ్ = రక్తమును, పాస్యసి = త్రాగగలవు.

తా. ఓ! శూర్పణఖా! అల్పాయుర్దాయవంతుడైన ఆ రాముణ్ణి నేను యుద్ధములో గండ్రగొడ్డలిచేత నరికివేసెదను. అప్పుడు నీవు గోరువెచ్చగానున్న అతని ఎఱ్ఱని రక్తమును త్రాగగలవు. 5

మూ. సా ప్రహృష్టా వచః శ్రుత్వా ఖరస్య వదనాచ్చ్యుతమ్,
ప్రశశంస పునర్మౌర్ఖ్యాద్భ్రాతరం రక్షసాం వరమ్. 6

ప్ర. అ. సా = ఆమె, ఖరస్య = ఖరునియొక్క, వదనాత్ = ముఖము నుండి, చ్యుతమ్ = జారిన, వచః = మాటను, శ్రుత్వా = విని, ప్రహృష్టా = చాలా సంతోషించినదై, మౌర్ఖ్యాత్ = మూర్ఖత్వమువలన, భ్రాతరమ్ = ఆ సోదరుణ్ణి, రక్షసామ్ = రాక్షసులలో, వరమ్ = శ్రేష్ఠుణ్ణిగా, పునః = మరల, ప్రశశంస = ప్రశంసించెను.

తా. ఖరుని నోటినుండి వెలువడిన ఆ మాటలు విని, ఆ శూర్పణఖ చాల సంతోషించుచు మూర్ఖురా లగుటచే, నీవు రాక్షసులలో శ్రేష్ఠుడవు అని అతనిని మరల ప్రశంసించెను. 6

మూ. తయా పరుషితః పూర్వం పునరేవ ప్రశంసితః,
అబ్రవీద్దూషణం నామ ఖరః సేనాపతిం తదా. 7

ప్ర. అ. తయా = ఆమెచేత, పూర్వమ్ = ముందుగా, పరుషితః = దూషింపబడినవాడై, పునరేవ = మరల, ప్రశంసితః = పొగడబడిన, ఖరః = ఖరుడు, తదా = అప్పుడు, దూషణం నామ = దూషణుడను పేరు గల, సేనాపతిమ్ = సేనాపతిని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. ఈ విధముగ శూర్పణఖచేత ముందు దూషింపబడి, మరల ప్రశంసింపబడిన ఆ ఖరుడు దూషణు డనే సేనాపతితో ఇట్లు పలికెను. 7

మూ. చతుర్దశ సహస్రాణి మమ చిత్తానువర్తినామ్,
రక్షసాం భీమవేగానాం సమరేష్వనివర్తినామ్. 8

ప్ర. అ. మమ = నాయొక్క, చిత్తానువర్తినామ్ = చిత్తమును అనుసరించేవారు, భీమవేగానామ్ = భయంకరమైన వేగము గలవారు, సమరేషు = యుద్ధములందు, అనివర్తినామ్ = వెనకకు మరలనివారు అయిన, రక్షసామ్ = రాక్షసులయొక్క, చతుర్దశ = పదునాలుగు, సహస్రాణి = సహస్రములు ఉన్నవి.

తా. నా ఇచ్ఛ ప్రకారము ప్రవర్తించే వాళ్ళు భయంకరమైన వేగము గల

వాళ్ళు, యుద్ధములో వెనుకంజ వేయనివాళ్ళు అయిన పదునాలుగువేలమంది రాక్షసు లున్నారు కదా. 8

మూ. నీలజీమూతవర్ణానాం లోకహింసావిహారిణామ్,
సర్వోద్యోగముదీర్ణానాం రక్షసాం సౌమ్య కారయ. 9

ప్ర. అ. సౌమ్య = ఓ ! సౌమ్యుడా ! నీలజీమూతవర్ణానామ్ = నల్లని మేఘము వంటి వర్ణము గలవాళ్ళు, లోకహింసావిహారిణామ్ = లోకహింసతో విహరించువాళ్లు, ఉదీర్ణానామ్ = గర్వము గలవాళ్లు అయిన, రక్షసామ్ = ఆ రాక్షసులయొక్క, సర్వోద్యోగమ్ = ఒక్కుమ్మడి ఉద్యమమును, కారయ = చేయించుము.

తా. సౌమ్యుడా! ఆ రాక్షసులు నల్ల మేఘము వంటి వర్ణము గలవారు. లోకులను హింసించుచు విహరించుచుందురు. గర్వము గలవారు. అట్టి ఆ రాక్షసులు ఒక్కుమ్మడిగ యుద్ధానికి సన్నద్ధు లగు నట్లు చేయుము. 9

మూ. ఉపస్థాపయ మే క్షిప్రం రథం సౌమ్య ధనూంషి చ,
శరాంశ్చిత్రాంశ్చ ఖడ్గాంశ్చ శక్తీశ్చ వివిధాః శితాః. 10

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా ! మే = నాకొరకు, రథమ్ = రథమును, ధనూంషి చ = ధనస్సులను, శరాన్ = బాణములను, చిత్రాన్ = చిత్రములైన, ఖడ్గాంశ్చ = ఖడ్గములను, వివిధాః = అనేకవిధములైన, శితాః = వాడియైన, శక్తీశ్చ = శక్తులను, క్షిప్రమ్ = శీఘ్రముగా, ఉపస్థాపయ = తీసికొని రమ్ము.

తా. సౌమ్యుడా ! నాకొరకై, రథమును, ధనస్సులను, బాణములను, చిత్రములైన ఖడ్గములను, వాడిగా ఉన్న అనేకవిధములైన శక్తులను శీఘ్రముగా ఏర్పరచుము. 10

మూ. అగ్రే నిర్యాతుమిచ్ఛామి పౌలస్త్యానాం మహాత్మనామ్,
వధార్థం దుర్వినీతస్య రామస్య రణకోవిద. 11

ప్ర. అ. రణకోవిద = యుద్ధములో సమర్థుడా! దుర్వినీతస్య = దుష్ట స్వభావము గల, రామస్య = రామునియొక్క, వధార్థమ్ = వధకొరకు, మహాత్మ

నామ్ = మహాత్ములైన, పౌలస్త్యానామ్ = రాక్షసులయొక్క, అగ్రే = అగ్రము నందు, నిర్యాతుమ్ = వెళ్ళుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. యుద్ధములో నిష్ణాతుడ వైన వాడా ! దుష్టబుద్ధి యైన రాముణ్ణి సంహరించుటకై, మహాత్ములైన రాక్షసుల సైన్యమునకు ముందు వెళ్లవలె నని కోరుచున్నాను. 11

మూ. ఇతి తస్య బ్రువాణస్య సూర్యవర్ణం మహారథమ్,
సదశ్వైః శబలైర్యుక్తమాచచక్షేఽథ దూషణః. 12

ప్ర. అ. తస్య = ఆ ఖరుడు, ఇతి = ఇట్లు, బ్రువాణస్య = చెప్పుచుండగా, అథ = అటుపిమ్మట, దూషణః = దూషణుడు, సూర్యవర్ణమ్ = సూర్యుని వంటి వర్ణము గల, మహారథమ్ = మహారథమును, శబలైః = విచిత్రవర్ణములైన, సదశ్వైః = ఉత్తమాశ్వములతో, యుక్తమ్ = కూర్చబడినదానినిగా, ఆచచక్షే = చెప్పెను.

తా. ఆ ఖరుడు అట్లు చెప్పుచుండగానే, "సూర్యునితో సమానమైన మహారథము విచిత్రవర్ణములైన అశ్వములు కూర్చి సిద్ధముగా ఉన్నది"అని దూషణుడు తెలిపెను. 12

మూ. తం మేరుశిఖరాకారం తప్తకాఞ్చనభూషణమ్,
హేమచక్రమసంబాధం వైదూర్యమయకూబరమ్. 13
మత్స్యైః పుష్పైర్ద్రుమైః శైలైశ్చన్ద్రసూర్యైశ్చ కాఞ్చనైః
మఙ్గలైః పక్షిసంఘైశ్చ తారాభిరభిసంవృతమ్, 14
ధ్వజనిస్త్రింశసంపన్నం కిఙ్కిణీకవిరాజితమ్,
సదశ్వయుక్తం సోఽమర్షాదారురోహ ఖరో రథమ్. 15

ప్ర. అ. సః ఖరః = ఆ ఖరుడు, మేరుశిఖరాకారమ్ = మేరుపర్వత శిఖరము వంటి ఆకారము గలది, తప్తకాఞ్చనభూషణమ్ = కరిగించిన బంగారు అలంకారములు కలది, హేమచక్రమ్ = బంగారు చక్రములు గలది, అసంబాధమ్ = ఇరుకు లేనిది, వైదూర్యమయకూబరమ్ = వైదూర్యమాణిక్యవికారమైన నొగ గలది, కాఞ్చనైః = బంగారువికారమైన, మత్స్యైః = మత్స్యములచేత, పుష్పైః = పుష్పములచేత, ద్రుమైః = వృక్షములచేత, శైలైః = పర్వతములచేత,

చన్ద్రసూర్యైశ్చ = చంద్రసూర్యులచేత, మఙ్గళైః = మంగళకరమైన, పక్షి సంఘైశ్చ = పక్షిసముదాయములచేత, తారాభిః = నక్షత్రములచేత, అభిసంవృతమ్ = చుట్టబడినది, ధ్వజనిస్త్రింశసంపన్నమ్ = ధ్వజములతోను, ఖడ్గముంతోను కూడినది, కిఙ్కిణీకవిరాజితమ్ = మువ్వలచేత ప్రకాశింపచేయబడినది, సదశ్వయుక్తమ్=మంచిగుఱ్ఱములతో కూర్చబడినది అయిన, రథమ్ = రథమును, అమర్షాత్ = కోపమువలన, ఆరురోహ = ఎక్కెను.

తా. ఆ ఖరుడు క్రుద్ధుడై, మంచి గుఱ్ఱములు కట్టిన మేరుపర్వతశిఖరము వలె ఉన్న ఆ రథమును ఎక్కెను. కరిగించి శుద్ధముచేసిన బంగారముచే అది అలంకృతమై ఉండెను. బంగారు చక్రములతో, వైదూర్యమాణిక్యవికార మైన నాగతో (కాడి కట్టే దూలము) విశాలముగా ఉండెను. ఆ రథము చుట్టూ బంగారముతో చేసిన మత్స్యములు, పుష్పములు, వృక్షములు, పర్వతములు, చంద్ర సూర్యులు, మంగళకరము లైన పక్షులు, నక్షత్రములు కూర్చబడి యుండెను. ధ్వజములు, ఖడ్గములు అమర్చబడియుండెను. చిరుగంటలచేత అలంకరింపబడెను. 13, 14, 15.

మూ. నిశామ్య తు రథస్థం తం రాక్షసా భీమవిక్రమాః,
తస్థుః సంపరివార్యైనం దూషణం చ మహాబలమ్. 16

ప్ర. అ. భీమవిక్రమాః=భయంకరమైన పరాక్రమము గల, రాక్షసాః= రాక్షసులు, రథస్థమ్ = రథమునందున్న, తమ్ = ఆతనిని, నిశామ్య = చూచి, ఏనమ్ = ఇతనిని, మహాబలమ్=గొప్ప బలము గల, దూషణం చ=దూషణుణ్ణి, సంపరివార్య = చుట్టి, తస్థుః = నిలచిరి.

తా. భయంకరమైన పరాక్రమము గల రాక్షసులు ఆ ఖరుడు రథముపై ఎక్కుట చూచి, ఆతనికిని, మహాబలుడైన దూషణునికిని చుట్టూ నిలచిరి. 16

మూ. ఖరస్తు తాన్ మహేష్వాసాన్ ఘోరవర్మాయుధధ్వజాన్,
నిర్యాతేత్యబ్రవీద్దృష్ట్వా రథస్థః సర్వరాక్షసాన్. 17

ప్ర. అ. రథస్థః=రథమునందున్న, ఖరస్తు=ఖరుడు, మహేష్వాసాన్= గొప్ప ధనస్సులు కలవారు, ఘోరవర్మాయుధధ్వజాన్ = భయంకరమైన కవచ

ములు, ఆయుధములు, ధ్వజములు గలవారు అయిన, తాన్ సర్వరాక్షసాన్ = ఆ సమస్తరాక్షసులను, దృష్ట్వా = చూచి, నిర్యాత = బయలుదేరండి, ఇతి = అని, అబ్రవీత్ = పలికెను.

తా. రథము నెక్కిన ఖరుడు గొప్ప ధనుస్సులను, భయంకరములైన కవచములను, ఆయుధములను, ధ్వజములను ధరించి ఉన్న ఆ రాక్షసుల నందరినీ చూచి "బయలుదేరండి"అని పలికెను. 17

మూ. తత స్త్రద్రాక్షసం సైన్యం ఘోరవర్మాయుధధ్వజమ్,
నిర్జగామ జనస్థానాన్మహానాదం మహాజవమ్. 18

ప్ర. అ. తతః = అటు పిమ్మట, ఘోరవర్మాయుధధ్వజమ్ = భయంకరములైన కవచములు, ఆయుధములు, ధ్వజములు గల, తత్ = ఆ, రాక్షసం సైన్యమ్ = రాక్షససైన్యము, మహానాదమ్ = గొప్ప ధ్వని గలదై, మహాజవమ్ = గొప్ప వేగము గలదై, జనస్థానాత్ = జనస్థానమునుండి, నిర్జగామ = బయలుదేరెను.

తా. పిమ్మట ఆ రాక్షససైన్యము, భయంకరములైన కవచములను, ఆయుధములను, ధ్వజములను ధరించి, గొప్ప ధ్వని చేయుచు, మహావేగముతో జనస్థానమునుండి బయలు దేరెను. 18

మూ. ముద్గరైః పట్టిసైః శూలైః సుతీక్ష్ణైశ్చ పరశ్వధైః,
ఖడ్గైశ్చక్రైశ్చ హస్తస్థైర్భ్రాజమానైశ్చ తోమరైః, 19

శక్తిభిః పరిఘైర్ఘోరైరతిమాత్రైశ్చ కార్ముకైః,
గదాసిముసలైర్వజ్రైర్గృహీతైర్భీమదర్శనైః. 20

రాక్షసానాం సుఘోరాణాం సహస్రాణి చతుర్దశ,
నిర్యాతాని జనస్థానాత్ఖరచిత్తానువర్తినామ్. 21

ప్ర. అ. గృహీతైః = గ్రహింపబడిన, హస్తస్థైః = హస్తములలో ఉన్న, ముద్గరైః = ముద్గరములతోను, పట్టిసైః = పట్టిసములతోను, శూలైః = శూలముల

తోను, సుతీక్ష్ణైః = చాల తీక్ష్ణమైన, పరశ్వధైః = గండ్రగొడ్డళ్లతోను, ఖడ్గైః = ఖడ్గములతోను, చక్రైశ్చ = చక్రములతోను, భ్రాజమానైః = ప్రకాశించుచున్న, తోమరైః = తోమరములతోను, శక్తిభిః = శక్తులతోను, ఘోరైః = భయంకరములైన, పరిఘైః = పరిఘలతోను, అతిమాత్రైః = అధిక ప్రమాణము గల. కార్ముకైః = ధనస్సులతోను, గదాసిముసలైః = గదలతోను, కత్తులతోను, రోకళ్లతోను, భీమదర్శనైః = భయంకరమైన దర్శనము గల, వజ్రైః = వజ్రములతోను, ఖరచిత్తానువర్తినామ్ = ఖరుని చిత్తమును అనుసరించు, సుఘోరాణామ్ = చాల భయంకరులైన, రాక్షసానామ్ = రాక్షసులయొక్క, చతుర్దశ సహస్రాణి = పదునాలుగు వేలు, జనస్థానాత్ = జనస్థానమునుండి, నిర్యాతాని = బయలుదేరినవి.

తా. ఖరుని ఆజ్ఞను పాలించు పదునాలుగువేలమంది భయంకరులైన రాక్షసులు చేతులలో ముద్గరములు, పట్టిసములు, శూలములు, చాల తీక్ష్ణములైన గండ్రగొడ్డళ్లు, ఖడ్గములు, చక్రములు, తోమరములు, శక్తులు, భయంకరములైన పరిఘలు, పెద్ద ధనస్సులు, గదలు, కత్తులు, రోకళ్లు, చూచుటకు భయంకరములుగా ఉన్న వజ్రాయుధములు ధరించి జనస్థానమునుండి బయలుదేరిరి. 19,20,21

మూ. తాంస్త్వభిద్రవతో దృష్ట్వా రాక్షసాన్ భీమవిక్రమాన్,
ఖరస్యాపి రథః కించిజ్జగామ తదనన్తరమ్. 22

ప్ర. అ. అభిద్రవతః = పరుగెత్తుచున్న, భీమవిక్రమాన్ = భయంకరమైన పరాక్రమము గల, తాన్ రాక్షసాన్ = ఆ రాక్షసులను, దృష్ట్వా = చూచి, కించిత్ = కొంచెము, తదనన్తరమ్ = వాళ్ళ వెనుకనే, ఖరస్య = ఖరునియొక్క, రథః అపి = రథము కూడ, జగామ = వెళ్లెను.

తా. పరుగెత్తుచున్న, భయంకరపరాక్రమవంతులైన ఆ రాక్షసులను చూచి, ఖరుని రథము కూడ, కొంచెము వాళ్ల వెనుకనే నడచెను. 22

మూ. తతస్తాన్ శబలానశ్వా న్తప్తకాఞ్చనభూషితాన్,
ఖరస్యమతిమాజ్ఞాయ సారథిః సమచోదయత్. 23

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సారథిః = సారథి, తప్తకాఞ్చనభూషి

తాన్ = కరిగింపబడిన బంగారముచేత అలంకరింపబడిన, శబలాన్ = చిత్ర వర్ణములు గల, తాన్ = ఆ, అశ్వాన్ = అశ్వములను, ఖరస్య = ఖరునియొక్క, మతిమ్ = బుద్ధిని, ఆజ్ఞాయ = తెలుసుకొని, సమచోదయత్ = తోలెను.

తా. పిమ్మట, సారథి, ఖరుని అభిప్రాయము తెలుసుకొని, కరిగించి శుద్ధి చేసిన బంగారముచేత అలంకరింపబడిన, చిత్రవర్ణములైన ఆ అశ్వములను తోలెను. 23

మూ. స చోదితో రథః శీఘ్రం ఖరస్య రిపుఘాతినః,
శబ్దేనాపూరయామాస దిశశ్చ ప్రదిశస్తదా. 24

ప్ర. అ. తదా = అప్పుడు, రిపుఘాతినః = శత్రువులను సంహరించు, ఖరస్య = ఖరునియొక్క, శీఘ్రమ్ = శీఘ్రముగా, చోదితః = ప్రేరేపింపబడిన, సః రథః = ఆ రథము, దిశశ్చ = దిక్కులను, ప్రదిశశ్చ = విదిక్కులను, శబ్దేన = శబ్దముచేత, ఆపూరయామాస = నింపెను.

తా. శీఘ్రముగా నడుపబడిన శత్రుసంహారకుడైన ఖరుని ఆ రథము, అప్పుడు, దిక్కులను, విదిక్కులను కూడ ధ్వనితో నింపెను. 24

మూ. ప్రవృద్ధమన్యుస్తు ఖరః ఖరస్వనో
రిపోర్వధార్థం త్వరితో యథాన్తకః,
అచూచుదత్సారథిమున్నదన్ ఘనం
మహాబలో మేఘ ఇవాశ్మవర్షవాన్. 25

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ద్వావింశః సర్గః.

ప్ర. అ. ప్రవృద్ధమన్యుః = అధికమైన కోపము గల, ఖరస్వనః = కటువైన ధ్వని గల, ఖరః = ఖరుడు, రిపోః = శత్రువుయొక్క, వధార్థమ్ = వధ నిమిత్తమై, త్వరితః = తొందరపడుచు, అన్తకః యథా = యముడు వలె, అశ్మ వర్షవాన్ = రాళ్ల వర్షము గల, మహాబలః = గొప్ప బలము గల, మేఘః ఇవ = మేఘము వలె, ఘనమ్ = అధికముగా, ఉన్నదన్ = అరచుచు, సారథిమ్ = సారథిని, అచూచుదత్ = ప్రేరేపించెను.

తా. పరుషమైన కంఠధ్వని గల ఆ ఖరుడు అధికమైన క్రోధముతో, శత్రువును చంపుటకై తొందరపడుచు, యముడు వలె, రాళ్ళు కురియుచున్న గొప్ప బలము గల మేఘము వలె బిగ్గరగా అరచుచు, సారథిని ప్రేరేపించెను.

'బాలానందిని''అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో ఇరువది రెండవ సర్గ సమాప్తము.

అథ త్రయోవింశః సర్గః

[భయంకరములైన శకునములను చూచికూడ వాటిని లెక్క చేయక ఖరుడు సైన్యముతో రాముని ఆశ్రమము వైపు వెళ్ళుట].

మూ. తత్ప్రయాతం బలం ఘోరమశివం శోణితోదకమ్,
అభ్యవర్షన్మహామేఘస్తుములో గర్దభారుణః. 1

ప్ర. అ. గర్దభారుణః = గాడిద వలె ధూసరవర్ణము గల, తుములః = వ్యాకులమైన, మహామేఘః = గొప్ప మేఘము, ప్రయాతమ్ = వెళ్లుచున్న, తత్ = ఆ, ఘోరమ్ = భయంకరమైన, బలమ్ = సైన్యమును గూర్చి, అశివమ్ = అమంగళమైన, శోణితోదకమ్ = రక్తరూపమైన జలమును, అభ్యవర్షత్ = వర్షించెను.

తా. గాడిదరంగులో ఉన్న వ్యాకులమైన మహామేఘము, బయలుదేరిన భయంకరమైన ఆ సైన్యముమీద అమంగళకరమైన రక్తమును వర్షించెను. 1

మూ. నిపేతుస్తురగాస్తస్య రథయుక్తా మహాజవాః,
సమే పుష్పచితే దేశే రాజమార్గే యదృచ్ఛయా. 2

ప్ర. అ. రథయుక్తాః = రథమునకు కట్టబడిన, మహాజవాః = గొప్ప వేగము గల, తస్య = ఆ ఖరునియొక్క, తురగాః = గుఱ్ఱములు, రాజమార్గే = రాజమార్గమునందు, పుష్పచితే = పుష్పములచేత వ్యాప్తమైన, సమే = సమమైన, దేశే = దేశమునందు, యదృచ్ఛయా = హటాత్తుగా, నిపేతుః = తొట్రుపడినవి.

తా. ఆ ఖరుని రథమునకు కట్టిన, మహావేగము గల గుఱ్ఱములు, రాజ వీధిలో, పువ్వులు చల్లిన సమప్రదేశమునందు కూడ హటాత్తుగా తొట్రుపడినవి.

మూ. శ్యామం రుధిరపర్యన్తం బభూవ పరివేషణమ్,
అలాతచక్రప్రతిమం పరిగృహ్య దివాకరమ్. 3

ప్ర. అ. దివాకరమ్=సూర్యుని, పరిగృహ్య=చుట్టి, శ్యామమ్=ఆ నల్లని, రుధిరపర్యన్తమ్=నెత్తురురంగు అంచు గల, అలాతచక్రప్రతిమమ్ = కొరవి త్రిప్పగా ఏర్పడు చక్రముతో సమానమైన, పరివేషణమ్=పరివేషణము (చుట్టూ కట్టిన గూడు), బభూవ=ఏర్పడెను.

తా. సూర్యుని చుట్టూ నల్లనిది, రక్తము వంటి రంగు గల అంచులుకలది, అలాతచక్రముతో (కొరవిని వేగముగా త్రిప్పుటచే ఏర్పడిన చక్రముతో సమానము) అయిన, గూడు కట్టెను. 3

మూ. తతో ధ్వజముపాగమ్య హేమదణ్డం సముచ్ఛ్రితమ్,
సమాక్రమ్య మహాకాయస్తస్థౌ గృధ్రః సుదారుణః. 4

ప్ర. అ. తతః=అటుపిమ్మట. మహాకాయః=పెద్ద శరీరము గల, సుదారుణః=చాల భయంకరమైన, గృధ్రః=గ్రద్ద, హేమదణ్డమ్ = బంగారు దండము గల, సముచ్ఛ్రితమ్=ఎత్తైన, ధ్వజమ్=ధ్వజమును, ఉపాగమ్య=చేరి, హేమదణ్డమ్=బంగారుదండమును, సమాక్రమ్య=ఆక్రమించి, తస్థౌ=నిలచెను.

తా. అంతలో పెద్ద శరీరము గల భయంకరమైన ఒక గ్రద్ద పైకి ఎగురవేయబడిన ధ్వజమువద్దకు వచ్చి, దాని బంగారుదండమును ఆక్రమించి నిలచెను. 4

మూ. జనస్థానసమీపే తు సమాగమ్య ఖరస్వనాః,
విస్వరాన్వివిధాంశ్చక్రుర్మాంసాదా మృగపక్షిణః. 5

ప్ర. అ. ఖరస్వనాః = పరుషమైన ధ్వని గల, మాంసాదాః=మాంసమును తినే, మృగపక్షిణః=మృగములు, పక్షులు, జనస్థానసమీపే=జనస్థానము సమీపమునందు, సమాగమ్య=గుమిగూడి, వివిధాన్=అనేకవిధములైన, విస్వరాన్=విపరీతధ్వనులను, చక్రుః=చేసినవి.

తా. పరుషమైన ధ్వనులు గల మాంసాహారులైన మృగములు, పక్షులు జనస్థానము సమీపమునందు గుమిగూడి, అనేకవిధములైన విపరీతధ్వనులు చేసెను.

మూ. వ్యాజహ్రుశ్చ ప్రదీప్తాయాం దిశి వై భైరవస్వనమ్,
అశివం యాతుధానానాం శివా ఘోరా మహాస్వనాః. 6

ప్ర. అ. ఘోరాః = భయంకరములైన, మహాస్వనాః = గొప్ప ధ్వని గల, శివాః = నక్కలు, ప్రదీప్తాయామ్ = మండుచున్న, దిశి = దిక్కునందు, భైరవస్వనమ్ = భయంకరమైన ధ్వని కలుగునట్లుగా, యాతుధానానామ్ = రాక్షసులకు, అశివమ్ = అమంగళమును, వ్యాజహ్రుః = పలికినవి.

తా. భయంకరములు, గొప్ప ధ్వని కలవి అయిన నక్కలు, మంటలు రేగుచున్న దిక్కు వైపు చేరి, భయంకరముగా అరచుచు, రాక్షసులకు అమంగళము రానున్నదని సూచించినవి. 6

మూ. ప్రభిన్నగిరిసంకాశాస్తోయశోణితధారిణః,
అనాకాశం తదాకాశం చక్రుర్భీమా వలాహకాః. 7

ప్ర. అ. ప్రభిన్నగిరిసంకాశాః = పగిలిన పర్వతములతో సమానములు, తోయశోణితధారిణః = రక్తమువంటి జలమును ధరించుచున్నవి, భీమాః = భయంకరములు అయిన, వలాహకాః = మేఘములు, తదా = అప్పుడు, ఆకాశమ్ = ఆకాశమును, అనాకాశమ్ = అవకాశము లేనిదానినిగా, చక్రుః = చేసినవి.

తా. బ్రద్దలైన పర్వతముల వలె ఉన్న భయంకరములైన మేఘములు, అప్పుడు, రక్తమువంటి జలముతో నిండినవై ఆకాశమును అవకాశము లేనిదానినిగా చేసినవి. 7

మూ. బభూవ తిమిరం ఘోరముద్ధతం రోమహర్షణమ్,
దిశో వా విదిశో వాపి న చ వ్యక్తం చకాశిరే. 8

ప్ర. అ. ఘోరమ్ = భయంకరము, ఉద్ధతమ్ = అత్యధికము, రోమహర్షణమ్ = రోమాంచము కలిగించునది అయిన, తిమిరమ్ = చీకటి, బభూవ = ఏర్పడెను. దిశో వా = దిక్కులు గాని, విదిశో వాపి = విదిక్కులు గాని, వ్యక్తమ్ = స్పష్టముగా, న చకాశిరే = ప్రకాశించలేదు.

తా. రోమాంచము కలిగించే భయంకరమైన చీకటి చాల దట్టముగా వ్యాపించెను. దిక్కులు గాని, విదిక్కులు గాని స్పష్టముగా ప్రకాశించలేదు. 8

మూ. క్షతజార్ద్రసవర్ణాభా సన్ధ్యాకాలం వినా బభౌ.
ఖరస్యాభిముఖా నేదు స్తదా ఘోరమృగాః ఖగాః, 9
కఙ్కగోమాయుగృధ్రాశ్చ చుక్రుశుర్భయశంసినః.

ప్ర. అ. కాలం వినా = కాలము కాకుండానే, క్షతజార్ద్రసవర్ణాభా = రక్తముతో సమానమైన వర్ణము కాంతి గల, సన్ధ్యా = సంధ్య, బభౌ = ప్రకాశించెను. తదా = అప్పుడు, ఘోరమృగాః = ఘోరములైన మృగములు, ఖగాః = పక్షులు, ఖరస్య = ఖరునకు, అభిముఖాః = అభిముఖమైనవై, నేదుః = ధ్వనిచేసినవి. కఙ్కగోమాయుగృధ్రాశ్చ = డేగలు, నక్కలు, గ్రద్దలు కూడ, భయశంసినః = భయమును సూచించుచు, చుక్రుశుః = అరచినవి.

తా. కాలము కాని కాలములో రక్తము వలె ఎఱ్ఱనైన సంధ్య ఏర్పడెను. భయంకరములైన మృగములు, పక్షులు ఖరునికి ఎదురుగా నిలచి అరచెను. డేగలు, నక్కలు, గ్రద్దలు కూడ రాబోయే భయమును సూచించుచు అరచినవి.

మూ. నిత్యాశుభకరా యుద్ధే శివా ఘోరనిదర్శనాః; 10
నేదుర్బలస్యాభిముఖం జ్వాలోద్గారిభిరాననైః.

ప్ర. అ. యుద్ధే = యుద్ధమునందు, నిత్యాశుభకరాః = తప్పక అశుభమును చేయు, ఘోరనిదర్శనాః = భయంకరమైన నిదర్శనము (దృష్టాంతము)గల, శివాః = నక్కలు, జ్వాలోద్గారిభిః = మంటలను కక్కుచున్న, ఆననైః = ముఖములతో, బలస్య = సైన్యమునకు, అభిముఖమ్ = అభిముఖముగా, నేదుః = ధ్వనిచేసినవి.

తా. నక్కలు కూసినచో యుద్ధములో తప్పక అమంగళము కలుగును. వాటి దృష్టాంతము చాల భయంకరముగా ఉండును. అట్టి నక్కలు మంటలు కక్కుచున్న నోళ్లతో, సైన్యమునకు ఎదురుగా తిరిగి అరచినవి. 10

మూ. కబన్ధః పరిఘాభాసో దృశ్యతే భాస్కరాన్తికే, 11
జగ్రాహ సూర్యం స్వర్భానురపర్వణి మహాగ్రహః,
ప్రవాతి మారుతః శీఘ్రం నిష్ప్రభోఽభూద్దివాకరః. 12

ప్ర. అ. భాస్కరాన్తికే = సూర్యుని సమీపమునందు, పరిఘాభాసః = ఇనుపగుదియవలె ఉన్న, కబన్ధః = మనిషి మొండెము, దృశ్యతే = కనబడెను. మహా

గ్రహః = గొప్ప గ్రహమైన, స్వర్భానుః = రాహువు, అపర్వణి = పర్వము కాని కాలమునందు, సూర్యమ్ = సూర్యుణ్ణి, జగ్రాహ = పట్టుకొనెను. మారుతః = గాలి, శీఘ్రమ్ = శీఘ్రముగా, ప్రవాతి = వీచెను. దివాకరః = సూర్యుడు, నిష్ప్రభః = కాంతి లేనివాడు, అభూత్ = ఆయెను.

తా. సూర్యుని దగ్గర ఇనుప గుదియవంటి మనిషి మొండెము కనబడెను. మహాగ్రహమైన రాహువు, పర్వము కాని కాలమునందు కూడ సూర్యుణ్ణి గ్రసించెను. గాలి వేగముగా వీచెను. సూర్యుని కాంతి తగ్గెను. 12

మూ. ఉత్పేతుశ్చ వినా రాత్రిం తారాః ఖద్యోతసప్రభాః,
సంలీనమీనవిహగా నళిన్యః శుష్కపఙ్కజాః, 13
తస్మిన్ క్షణే బభూవుశ్చ వినా పుష్పఫలైర్ద్రుమాః.

ప్ర. అ. ఖద్యోతసప్రభాః = మినుగురు పురుగులతో సమానమైన కాంతి గల, తారాః = నక్షత్రములు, వినా రాత్రిమ్ = రాత్రి కాకుండగనే, ఉత్పేతుః = బయలుదేరినవి (కనబడినవి). సంలీనమీనవిహగాః = అణగిన మీనములు, పక్షులు గల, నలిన్యః = పద్మసరస్సులు, శుష్కపఙ్కజాః = ఎండిన పద్మములు గలవి. తస్మిన్ = ఆ, క్షణే = క్షణమునందు, ద్రుమాః = వృక్షములు, పుష్పఫలైః వినా = పుష్పములు ఫలములు లేనివై, బభూవుశ్చ = అయినవి.

తా. రాత్రి కాకపోయినను మిణుగుడుపురుగుల వలె నక్షత్రములు మెరియ నారంభించినవి. పద్మసరస్సులలోని మీనములు, పక్షులు అణిగి కదలకుండ ఉండగా, పద్మాలు ఎండిపోయినవి. ఆ క్షణములో చెట్లనుండి పుష్పములు, ఫలములు రాలిపోయినవి. 13

మూ. ఉద్ధూతశ్చ వినా వాతం రేణుర్జలధరారుణః, 14
వీచీకూచీతి వాశ్యన్త్యో బభూవుస్తత్ర శారికాః.

ప్ర. అ. వినా వాతమ్ = వాయువు లేకుండగానే, జలధరారుణః = మేఘము వలె ఎఱ్ఱనైన, రేణుః = పరాగము, ఉద్ధూతః = ఎగరగొట్టబడినది. తత్ర = అక్కడ, శారికాః = గోరింకలు, వీచీకూచీతి = వీచీ కూచీ అని, వాశ్యన్త్యః = అరచుచున్నవై, బభూవుః = ఉండెను.

తా. గాలి లేకపోయినను మేఘము వలె ధూసరవర్ణమైన పరాగము పైకి ఎగిరెను. అక్కడ గోరింకలు పీచీ కూచీ అని కూయమొదలిడెను. 14

మూ. ఉల్కాశ్చాపి సనిర్ఘాతా నిపేతుర్ఘోరదర్శనాః, 15
ప్రచచాల మహీ సర్వా సశైలవనకాననా.

ప్ర. అ. ఘోరదర్శనాః = భయంకరమైన దర్శనము గల, సనిర్ఘాతాః = పిడుగులతో కూడిన, ఉల్కాశ్చాపి = ఉల్కలు కూడ, నిపేతుః = పడినవి. సశైలవనకాననా = శైలములతోను, వనములతోను, అడవులతోను కూడిన, సర్వా = సమస్తమైన. మహీ = భూమి. ప్రచచాల = కదలెను.

తా. చూచువారికి భయము కలిగించే ఉల్కలు (అగ్నిపిండము) ఉరుములతో క్రింద పడినవి. పర్వతములతో, చిన్న అడవులతో, పెద్ద అడవులతో సహా భూమి అంతా కంపించినది. 15

మూ. ఖరస్య చ రథస్థస్య నర్దమానస్య ధీమతః, 16
ప్రాకమ్పత భుజః సవ్యః స్వరశ్చాస్యావసజ్జత.

ప్ర. అ. రథస్థస్య = రథమునందు ఉన్న, నర్దమానస్య = అరచుచున్న, ధీమతః = బుద్ధిమంతుడైన, ఖరస్య = ఖరునియొక్క. సవ్యః = ఎడమ, భుజః = భుజము, ప్రాకమ్పత = కదలెను. అస్య = ఇతనియొక్క, స్వరశ్చ = కంఠస్వరము కూడ, అవసజ్జత = తడబడెను.

తా. రథముపై కూర్చుండి గర్జించుచున్న, బుద్ధిమంతుడైన ఆ ఖరుని ఎడమ భుజము అదిరెను. కంఠస్వరము తడబడెను. 16

మూ. సాస్రా సంపద్యతే దృష్టిః పశ్యమానస్య సర్వతః, 17
లలాటే చ రుజా జాతా న చ మోహాన్న్యవర్తత.

ప్ర. అ. సర్వతః = అన్ని వైపులా, పశ్యమానస్య = చూచుచున్న ఆతని యొక్క, దృష్టిః = దృష్టి, సాస్రా = కన్నీళ్లతో కూడినది, సంపద్యతే = అయ్యెను. లలాటే = లలాటమునందు, రుజా చ = పీడ కూడ, జాతా = పుట్టినది. మోహాత్ = అజ్ఞానమువలన, న చ న్యవర్తత = వెనుకకు మరలలేదు.

తా. నలు మూలల చూచుచున్నప్పుడు అతని కళ్ళు కన్నీళ్లతో నిండెను. నుదుటిపై నొప్పి కలిగెను. అయినను అతడు అజ్ఞానవశముచేత వెనుకకు మరలి వెళ్లలేదు. 17

మూ. తాన్సమీక్ష్య మహోత్పాతానుత్థితాన్ రోమహర్షణాన్, 18
అబ్రవీద్రాక్షసాన్ సర్వాన్ ప్రహసన్ స ఖరస్తదా.

ప్ర. అ. సః ఖరః = ఆ ఖరుడు, తదా = అప్పుడు, ఉత్థితాన్ = బయలుదేరిన, రోమహర్షణాన్ = రోమాంచమును కలిగించు, తాన్=ఆ, మహోత్పాతాన్ = గొప్ప ఉత్పాతములను (రాబోవు ఉపద్రవమును సూచించు దుఃశకునములను), సమీక్ష్య=చూచి, ప్రహసన్=నవ్వుచు, సర్వాన్ = సమస్తమైన, రాక్షసాన్ = రాక్షసులను గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. ఖరుడు అప్పుడు కనబడిన, భయంకరములైన ఆ మహోత్పాతములను చూచి నవ్వుచు, ఆ రాక్షసు లందరితో ఇట్లు పలికెను. 18

మూ. మహోత్పాతానిమాన్సర్వానుత్థితాన్ ఘోరదర్శనాన్, 19
న చిన్తయామ్యహం వీర్యాద్బలవాన్ దుర్బలానివ.

ప్ర. అ. ఉత్థితాన్ = బయలుదేరిన, ఘోరదర్శనాన్ = భయంకరమైన దర్శనము గల, ఇమాన్ = ఈ, మహోత్పాతాన్ = గొప్ప ఉత్పాతములను, సర్వాన్ = అన్నింటినీ, అహమ్ = నేను, వీర్యాత్ = పరాక్రమమువలన, బలవాన్ = బలవంతుడు, దుర్బలానివ = దుర్బలులను వలె, న చిన్తయామి = లెక్క చేయను.

తా. చూచుటకు భయంకరములుగా ఉన్న గొప్ప ఉత్పాతములు కనబడుచున్నవి. కాని నేను మహాపరాక్రమశాలి నగుటచే బలవంతుడు దుర్బలులను లెక్క చేయ నట్లు వీటి నన్నింటిని లెక్క చేయను. 19

మూ. తారా అపి శరైస్తీక్ష్ణైః పాతయామి నభఃస్థలాత్, 20
మృత్యుం మరణధర్మేణ సంక్రుద్ధో యోజయామ్యహమ్.

ప్ర. అ. అహమ్ = నేను, తారాః అపి = నక్షత్రములను కూడ, తీక్ష్ణైః =

తీక్ష్ణములైన, శరైః = బాణములచేత, నభస్తలాత్ = ఆకాశమునుండి, పాతయామి = పడవేసెదను. సంక్రుద్ధః = కోపించినవాడనై మృత్యుమ్ = మృత్యువును, మరణధర్మేణ = మరణధర్మముతో, యోజయామి = కూడు నట్లు చేసెదను.

తా. నేను తీక్ష్ణములైన బాణములతో నక్షత్రములను కూడ ఆకాశమునుండి రాల్చివేయగలను. కోపించినచో మృత్యుదేవతకు కూడ మృత్యువు కల్పించగలను.

మూ. రాఘవం తం బలోత్సిక్తం భ్రాతరం చాస్య లక్ష్మణమ్, 21
అహత్వా సాయకై స్తీక్ష్ణైర్నోపావర్తితుముత్సహే.

ప్ర. అ. బలోత్సిక్తమ్ = బలముచేత గర్వించిన, తం రాఘవమ్ = ఆ రాముణ్ణి, అస్య = ఈతనియొక్క, భ్రాతరమ్ = సోదరుడైన, లక్ష్మణం చ = లక్ష్మణుణ్ణి, తీక్ష్ణైః = తీక్ష్ణములైన, సాయకైః = బాణములచేత, అహత్వా = చంపక, ఉపావర్తితుమ్ = తిరిగి వచ్చుటకు, నోత్సహే = ఉత్సహింపను.

తా. బలముచేత గర్వించిన రాముణ్ణి, అతని సోదరుడైన లక్ష్మణుణ్ణి తీక్ష్ణములైన బాణములతో చంపకుండగా తిరిగి వచ్చుటకు ఇచ్ఛగింపను. 21

మూ. సకామా భగినీ మేఽస్తు పీత్వా తు రుధిరం తయోః, 22
యన్నిమిత్తస్తు రామస్య లక్ష్మణస్య విపర్యయః.

ప్ర. అ. రామస్య = రామునియొక్క, లక్ష్మణస్య = లక్ష్మణునియొక్క, విపర్యయః = విపరీతప్రవర్తన, యన్నిమిత్తః = ఎవ్వతె నిమిత్తముగా కలదో అట్టి, మే భగినీ = నా సోదరి, తయోః = వాళ్లయొక్క, రుధిరమ్ = రక్తమును, పీత్వా = త్రాగి, సకామా = తీరిన కోరిక గలది, అస్తు = అగుగాక.

తా. నా సోదరియైన ఏ శూర్పణఖవిషయమున రాముడు, లక్ష్మణుడు పెద్దగా ప్రవర్తించినారో అట్టి నా సోదరి వాళ్ల రక్తము త్రాగి తన కోరిక తీర్చుకొనుగాక. 22

మూ. న క్వచిత్ప్రాప్తపూర్వో మే సంయుగేషు పరాజయః, 23
యుష్మాకమేతత్ప్రత్యక్షం నానృతం కథయామ్యహమ్.

ప్ర. అ. మే = నాకు, సంయుగేషు = యుద్ధములలో, క్వచిత్ = ఎక్కడా కూడ, పరాజయః = పరాజయము, న ప్రాప్తపూర్వః = పూర్వ మెన్నడు పొంద బడలేదు. ఏతత్ = ఇది, యుష్మాకమ్ = మీకు, ప్రత్యక్షమ్ = ప్రత్యక్షమే. అహమ్ = నేను, అనృతమ్ = అసత్యమును, న కథయామి = చెప్పుటలేదు.

తా. నే నెన్నడూ యుద్ధములో పరాజయమును పొందలేదు. ఇది మీకందరికి తెలిసిన విషయమే కదా. నేను అసత్యము చెప్పుటలేదు. 23

మూ. దేవరాజమపి క్రుద్ధో మత్తైరావతయాయినమ్, 24
వజ్రహస్తం రణే హన్యాం కిం పునస్తౌ కుమానుషౌ.

ప్ర. అ. క్రుద్ధః = కోపగించినవాడనై, మత్తైరావతయాయినమ్ = మదించిన ఐరావతముమీద వెళ్ళే, వజ్రహస్తమ్ = వజ్రము హస్తమునందు గల, దేవరాజమపి = దేవేంద్రుని కూడ, రణే = యుద్ధమునందు, హన్యామ్ = చంపుదును. తౌ = ఆ, కుమానుషౌ = చెడ్డ మానవమాత్రులను, కిం పునః = చెప్పనేల?

తా. నేను కోపించినచో, మదించిన ఐరావతముమీద ఎక్కి సంచరించే, వజ్రాయుధధారియైన దేవేంద్రుని కూడ యుద్ధములో సంహరించగలను. ఈ క్షుద్ర మానవమాత్రుల విషయము చెప్పవలెనా?

మూ. సా తస్య గర్జితం శ్రుత్వా రాక్షసస్య మహాచమూః, 25
ప్రహర్షమతులం లేభే మృత్యుపాశావపాశితా.

ప్ర. అ. మృత్యుపాశావపాశితా = మృత్యుపాశముచేత బంధించబడిన, సా = ఆ, మహాచమూః = మహాసేన, తస్య రాక్షసస్య = ఆ రాక్షసుని యొక్క, గర్జితమ్ = గర్జితమును, శ్రుత్వా = విని, అతులమ్ = సాటి లేని, ప్రహర్షమ్ = సంతోషమును, లేభే = పొందెను.

తా. మృత్యుపాశముచేత బంధింపబడిన ఆ మహాసేన ఆ రాక్షసుని గర్జితమును విని, గొప్ప సంతోషమును పొందెను. 25

మూ. సమీయుశ్చ మహాత్మానో యుద్ధదర్శనకాఙ్క్షిణః,
ఋషయో దేవగన్ధర్వాః సిద్ధాశ్చ సహచారణైః.

ప్ర. అ. మహాత్మానః = మహాత్ములైన, ఋషయః = ఋషులు, దేవగన్ధర్వాః = దేవతలు గంధర్వులు, సిద్ధాశ్చ = సిద్ధులు, చారణైః సహ = చారణులతో కూడ, యుద్ధదర్శనకాఙ్క్షిణః = యుద్ధముయొక్క దర్శనమును కోరుచున్నవారై, సమీయుః = కలిసి వచ్చిరి.

తా. ఆ యుద్ధము చూడవలె నను అభిలాషతో మహాత్ములైన ఋషులు, దేవతలు, గంధర్వులు, సిద్ధులు, చారణులు కలిసివచ్చిరి 26

మూ. సమేత్య చోచుః సహితాస్తేఽన్యోన్యం పుణ్యకర్మణః, 27
స్వస్తి గోబ్రాహ్మణేభ్యోఽస్తు లోకానాం యేఽభిసంగతాః.

ప్ర. అ. ("లోకేభ్యశ్చైవ సర్వశః"అను ప్రాచ్యపాఠము బాగున్నది). పుణ్యకర్మణః=పుణ్యకర్మ గల, తే=వారు, సమేత్య=ఒక్కచోట చేరి, అన్యోన్యమ్=పరస్పరము, సహితాః = కలిసినవారై, గోబ్రాహ్మణేభ్యః=గోవులకు, బ్రాహ్మణులకు, లోకేభ్యశ్చ = సకలజనులకు, సర్వశః=అన్నివిధముల, స్వస్తి= క్షేమము, అస్తు = అగుగాక అని, ఊచుః = పలికిరి.

తా. పుణ్యాత్ములైన వారందరు ఒక్క చోట చేరి, ఒకరితో ఒకరు కలిసి, గోవులకు, బ్రాహ్మణులకు, సకలజనులకు అన్ని విధముల క్షేమ మగుగాక అని అనుకొనిరి. 27

మూ. జయతాం రాఘవః సంఖ్యే పౌలస్త్యాన్ రజనీచరాన్, 28
చక్రహస్తో యథా యుద్ధే సర్వానసురపుఙ్గవాన్.

ప్ర. అ. చక్రహస్తః=మహావిష్ణువు, యుద్ధే=యుద్ధమునందు, సర్వాన్=సమస్తమైన, అసురపుఙ్గవాన్=అసురశ్రేష్ఠులను, యథా=ఎట్లో అట్లు, రాఘవః=రాముడు, సంఖ్యే = యుద్ధమునందు, పౌలస్త్యాన్ = పులస్త్యవంశమునందు పుట్టిన, రజనీచరాన్ = రాక్షసులను, జయతామ్ = జయించుగాక.

తా. చక్రమును ధరించిన మహావిష్ణువు యుద్ధములో సమస్తమైన అసురులను జయించి నట్లు రాముడు, యుద్ధములో, పులస్త్యవంశీయులైన రాక్షసుల

మూ. ఏతచ్చాన్యచ్చ బహుశో బ్రువాణాః పరమర్షయః, 29
జాతకౌతూహలాస్తత్ర విమానస్థాశ్చ దేవతాః,
దదృశుర్వాహినీం తేషాం రాక్షసానాం గతాయుషామ్. 30

ప్ర. అ. ఏతచ్చ = దీనిని, అన్యచ్చ = మఱి ఇతరవిషయమును, బహుశః = అధికముగా, బ్రువాణాః = పలుకుచున్న, పరమర్షయః = గొప్ప ఋషులు, తత్ర = అక్కడ, విమానస్థాః = విమానములందున్న, దేవతాశ్చ = దేవతలు, జాతకౌతూహలాః = పుట్టిన కుతూహలము కలవారై, గతాయుషామ్ = గడచిన ఆయుర్దాయము గల, తేషామ్ = ఆ, రాక్షసానామ్ = రాక్షసులయొక్క, వాహినీమ్ = సేనను, దదృశుః = చూచిరి.

తా. ఈ విధముగాను, ఇంకను అనేక ఇతరవిషయములను చెప్పుకొనుచున్న మహర్షులు, విమానములపై ఉన్న దేవతలు, అధిక మైన కుతూహలముతో, ఆయుర్దాయము చెల్లిన ఆ రాక్షసుల సైన్యమును చూచిరి. 29, 30

మూ. రథేన తు ఖరో వేగాదుగ్రసైన్యో వినిస్సృతః,
తం దృష్ట్వా రాక్షసం భూయో రాక్షసాశ్చ వినిస్సృతాః.

ప్ర. అ. ఉగ్రసైన్యః = భయంకర మైన సైన్యము గల, ఖరః = ఖరుడు, రథేన = రథముచేత, వేగాత్ = వేగమువలన, వినిస్సృతః = బయలుదేరెను. తం రాక్షసమ్ = ఆ రాక్షసుణ్ణి, దృష్ట్వా = చూచి, భూయః = మరల, రాక్షసాః చ = రాక్షసులు కూడ, వినిస్సృతాః = బయలుదేరిరి.

తా. భయంకరమైన సైన్యముతో కూడిన ఖరుడు రథము నెక్కి బయలుదేరగా అతనిని చూచి ఇతరు లైన రాక్షసనాయకులు కూడ బయలుదేరిరి. 31

మూ. శ్యేనగామీ పృథుగ్రీవో యజ్ఞశత్రు ర్విహఙ్గమః,
దుర్జయః కరవీరాక్షః పరుషః కాలకార్ముకః, 32

మేఘమాలీ మహామాలీ సర్వాస్యో రుధిరాశనః,
ద్వాదశైతే మహావీర్యాః ప్రతస్థు రభితః ఖరమ్. 33

ప్ర. అ. శ్యేనగామీ = శ్యేనగామి, పృథుగ్రీవః = పృథుగ్రీవుడు, యజ్ఞ

శత్రుః = యజ్ఞశత్రువు, విహఙ్గమః = విహంగముడు, దుర్జయః = దుర్జయుడు, కరవీరాక్షః = కరవీరాక్షుడు, పరుషః = పరుషుడు, కాలకార్ముకః = కాలకార్ముకుడు, మేఘమాలీ = మేఘమాలి, మహామాలీ = మహామాలి, సర్పాస్యః = సర్పాస్యుడు, రుధిరాశనః = రుధిరాశనుడు, మహావీర్యాః = గొప్ప పరాక్రమము గల, ఏతే = ఈ, ద్వాదశ = పండ్రెండుగురు, ఖరమ్ అభితః = ఖరుని చుట్టూ ఉండి, ప్రతస్థుః = ప్రయాణ మైరి.

తా. శ్యేనగామి, పృథుగ్రీవుడు, యజ్ఞశత్రువు, విహంగముడు, దుర్జయుడు. కరవీరాక్షుడు, పరుషుడు, కాలకార్ముకుడు, మేఘమాలి, మహామాలి, సర్పాస్యుడు, రుధిరాశనుడు, అను మహాపరాక్రమవంతు లైన పన్నెండుగురు రాక్షసులు ఖరుని చుట్టూ చేరి బయలుదేరిరి. 32, 33

మూ. మహాకపాలిః స్థూలాక్షః ప్రమాథీ త్రిశిరా స్తథా,
చత్వార ఏతే సేనాన్యో దూషణం పరితో యయుః. 34

ప్ర. అ. మహాకపాలిః = మహాకపాలి, స్థూలాక్షః = స్థూలాక్షుడు, ప్రమాథీ = ప్రమాథి, తథా = మరియు, త్రిశిరాః = త్రిశిరస్సు, ఏతే = ఈ, చత్వారః = నలుగురు, సేనాన్యః = సేనానాయకులు, దూషణం పరితః = దూషణుని చుట్టూ చేరి, యయుః = వెళ్ళిరి.

తా. మహాకపాలి, స్థూలాక్షుడు, ప్రమాథి, త్రిశిరస్సు అను నలుగురు సేనానాయకులు దూషణుని చుట్టూ చేరి వెళ్ళిరి. 34

మూ. సా భీమవేగా సమరాభికామా
మహాబలా రాక్షసవీర సేనా,
తౌ రాజపుత్రౌ సహసాభ్యుపేతా
మాలా గ్రహాణామివ చన్ద్రసూర్యౌ. 35

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే త్రయోవింశః సర్గః.

ప్ర. అ. భీమవేగా = భయంకర మైన వేగము గలది, సమరాభికామా = యుద్ధమునందు ఆసక్తి గలది, మహాబలా = గొప్ప బలము గలది అయిన,

సా = ఆ, రాక్షసవీర సేనా = రాక్షసవీరుల సేన, సహసా = శీఘ్రముగా, గ్రహా ణామ్ = గ్రహములయొక్క, మాలా = పంక్తి, చన్ద్రసూర్యౌ ఇవ = చంద్ర సూర్యులను వలె, తౌ = ఆ, రాజపుత్రౌ = రాజపుత్రులను, అభ్యుపేతా = సమీ పించినది.

తా. గొప్ప బలము గల ఆ రాక్షసవీరుల సేన, యుద్ధమునందు ఆసక్తి గలదై, భయంకరమైన వేగముతో, గ్రహముల పంక్తి చంద్రసూర్యులను సమీ పించి నట్లు, అతిశీఘ్రముగ ఆ రాజపుత్రులను సమీపించెను. 35

"బాలానంచెని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్య కాండలో ఇరువదిమూడవ సర్గ సమాప్తము.

అథ చతుర్వింశః సర్గః

[*ఆ శకునములు చూచి రాముడు రాక్షసులకు వినాశము రానున్నదని, తనకు విజయము లభించనున్నదని తెలిసికొని "ఆ పర్వత గుహలోనికి సీతను తీసికొనివెళ్ళి అక్కడ ఆమెను రక్షించుచుండుము" అని లక్ష్మణుని ఆదేశించుట.*]

మూ. ఆశ్రమం ప్రతి యాతే తు ఖరే ఖరపరాక్రమే,
తానేవౌత్పాతికాన్ రామః సహ భ్రాత్రా దదర్శ హ. 1

ప్ర. అ. ఖరపరాక్రమే = తీవ్రమైన పరాక్రమము గల, ఖరే = ఖరుడు, ఆశ్రమం ప్రతి = ఆశ్రమమును గూర్చి, యాతే = ప్రయాణమైనవాడగుచుండగా, రామః = రాముడు, భ్రాత్రా సహ = సోదరునితో కూడ, ఔత్పాతికాన్ = ఉత్పాతమునకు సంబంధించిన, తానేవ = ఆ శకునములనే, దదర్శ హ = చూచెను.

తా. తీవ్ర మైన పరాక్రమము గల ఖరుడు తమ ఆశ్రమమునకు బయలుదేరి నపుడు కనబడిన ఆ ఉత్పాతములను రామలక్ష్మణులు కూడ చూచిరి.

మూ. తానుత్పాతాన్ మహాఘోరానుత్థితాన్ రోమహర్షణాన్,
ప్రజానామహితాన్ దృష్ట్వా రామో లక్ష్మణమబ్రవీత్. 2

ప్ర. అ. మహాఘోరాన్ = చాల భయంకరములు, రోమహర్షణాన్ = రోమాంచము కలిగించేవి, ప్రజానామ్ = ప్రజలకు, అహితాన్ = హితము కానివి అయిన, తాన్ = ఆ, ఉత్పాతాన్ = ఉత్పాతములను, దృష్ట్వా = చూచి, రామః = రాముడు, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. చాలా భయంకరములై రోమాంచమును కలిగించునవి, ప్రజలకు హితములు కానివి అయిన ఆ ఉత్పాతములను చూచి రాముడు లక్ష్మణునితో ఇటు పలికెను. 2

మూ. ఇమాన్ పశ్య మహాబాహో సర్వభూతాపహారిణః,
సముత్థితాన్ మహోత్పాతాన్ సంహర్తుం సర్వరాక్షసాన్. 3

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గల లక్ష్మణా : సర్వభూతాపహారిణః = సకలప్రాణులను సంహరించునవి, సర్వరాక్షసాన్ = సకలరాక్షసులను, సంహర్తుమ్ = సంహరించుటకు, సముత్థితాన్ = లేచినవి అయిన, ఇమాన్ ఈ, మహోత్పాతాన్ = గొప్ప ఉత్పాతములను, పశ్య = చూడుము.

తా. లక్ష్మణా: సకలభూతముల వినాశమును చేయ గల గొప్ప ఉత్పాతములు బయలుదేరినవి. ఇవి సకలరాక్షసుల వినాశమును సూచించుచున్నవి. వీటిని చూడుము. 3

మూ. అమీ రుధిరధారాస్తు విసృజన్తః ఖరస్వనాః,
వ్యోమ్ని మేఘా వివర్తన్తే పరుషా గర్దభారుణాః. 4

ప్ర. అ. రుధిరధారాః = రక్తధారలను, విసృజన్తః = విడచుచున్నవి, ఖరస్వనాః = పరుషమైన ధ్వని గలవి, పరుషాః = పరుషముగా ఉన్నవి, గర్దభారుణాః = గాడిదల వలె ఎఱ్ఱగా ఉన్నవి అయిన, అమీ = ఈ, మేఘాః = మేఘములు, వ్యోమ్ని = ఆకాశమునందు, వివర్తన్తే = దొర్లుచున్నవి.

తా. పరుషమైన ధ్వనులతో, గాడిద వలె దూసరవర్ణము కలిగి చూచుటకు వికృతములుగా ఉన్న ఈ మేఘములు రక్తధారలను వర్షించుచు ఆకాశముమీద దొర్లుచున్నవి. 4

మూ. సధూమాశ్చ శరాః సర్వే మమ యుద్ధాభినన్దితాః,
రుక్మపృష్ఠాని చాపాని వివేష్టన్తే చ లక్ష్మణ. 5

ప్ర. అ. ("మహాయుద్ధాభినన్దినః" అను ప్రాచ్యపాఠము బాగున్నది). యుద్ధాభినన్దినః = గొప్ప యుద్ధమునకై ఉత్సాహము చూపుచు, సర్వే = సమస్తమైన, మమ శరాః = నా బాణములు, సధూమాశ్చ = ధూమముతో కూడినవి. లక్ష్మణ = లక్ష్మణా! రుక్మపృష్ఠాని = బంగారు పృష్ఠభాగములు గల, చాపాని చ = ధనస్సులు కూడ, వివేష్టన్తే = దొరుచున్నవి.

తా. లక్ష్మణా! బాణము లన్నీ ధూమముతో కూడినవై మహాయుద్ధము నకై ఉత్సాహము చూపుచున్నవి. బంగారు పైభాగములు గల ధనస్సులు ఎగిరి పడుచున్నవి.. 5

మూ. యాదృశా ఇహ కూజన్తి పక్షిణో వనచారిణః,
అగ్రతో నో భయం ప్రాప్తం సంశయో జీవితస్య చ. 6

ప్ర. అ. ఇహ = ఇక్కడ, వనచారిణః = వనమునందు సంచరించు. పక్షిణః = పక్షులు, యాదృశాః = ఎట్టి విధము కలవై, కూజన్తి = కూయుచున్నవో, దానిని పట్టి, నః = మనకు, అగ్రతః = ఎదుటనే, భయమ్ = భయము, ప్రాప్తమ్ = వచ్చి ఉన్నది. జీవితస్య = జీవితముయొక్క, సంశయః చ = సంశయము కూడ వచ్చి ఉన్నది.

తా. అరణ్యములో సంచరించు పక్షులు కూసే పద్ధతిని పట్టి మనకు అపాయము దగ్గరలోనే రానున్నట్లు జీవితము కూడ సంశయాస్పదమై నట్లు తోచుచున్నది. 6

మూ. సంప్రహారస్తు సుమహాన్ భవిష్యతి న సంశయః,
అయమాఖ్యాతి మే బాహుః స్ఫురమాణో ముహుర్ముహుః.

సంనికర్షే తు నః శూర జయం శత్రోః పరాజయమ్,
సప్రభం చ ప్రసన్నం చ తవ వక్త్రం హి లక్ష్యతే.

ప్ర. అ. సుమహాన్ = చాల గొప్ప దైన, సంప్రహారస్తు = యుద్ధమైతే, భవిష్యతి = కాగలదు. సంశయః = సంశయము, న = లేదు. శూర = ఓ! శూరుడా! ముహుః ముహుః = మాటి మాటికి, స్ఫురమాణః = అదురుచున్న, అయమ్ = ఈ, మే బాహుః = నా బాహువు, సంనికర్షే = సమీపమునందు, నః = మనయొక్క, జయమ్ = జయమును, శత్రోః = శత్రువుయొక్క, పరాజయమ్ = పరాజయ మును, ఆఖ్యాతి = చెప్పుచున్నది. తవ = నీయొక్క, వక్త్రమ్ = ముఖము, సప్రభం చ = కాంతితో కూడినది గాను, ప్రసన్నం చ = ప్రసన్నముగాను, లక్ష్యతే హి = చూడబడుచున్నది కదా.

తా. ఓ! శూరుడా! చాల గొప్ప యుద్ధము జరుగ నున్నది. సందేహము

లేదు. మాటిమాటికి అదురు చున్న నా బాహువు మనకు జయము, శత్రువుకు పరాజయము సమీపమునందే ఉన్నట్లు చెప్పుచున్నది. నీ ముఖము కూడ కాంతిమంతమై, ప్రసన్నముగా కనబడుచున్నది. ఇది కూడ మన జయమును సూచించు చున్నది. 7, 8

మూ. ఉద్యతానాం హి యుద్ధార్థం యేషాం భవతి లక్ష్మణ,
నిష్ప్రభం వదనం తేషాం భవత్యాయుఃపరిక్షయః. 9

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా! యుద్ధార్థమ్ = యుద్ధముకొరకై, ఉద్యతానామ్ = ఉద్యుక్తులైన, యేషామ్ = ఎవరియొక్క, వదనమ్ = ముఖము, నిష్ప్రభమ్ = కాంతి లేనిది, భవతి = అగునో, తేషామ్ = వారియొక్క, ఆయుః పరిక్షయః = ఆయుర్దాయము యొక్క, క్షయము, భవతి = అగును.

తా. లక్ష్మణా! యుద్ధమునకై ఉద్యుక్తులైన ఎవరి ముఖము కాంతివిహీనమగునో వారి ఆయుర్దాయము క్షీణించిన దని అర్థము. 9

మూ. రక్షసాం నర్దతాం ఘోరః శ్రూయతే చ మహాధ్వనిః,
ఆహతానాం చ భేరీణాం రాక్షసైః క్రూరకర్మభిః. 10

ప్ర. అ. నర్దతామ్ = అరచుచున్న, రక్షసామ్ = రాక్షసులయొక్క, క్రూరకర్మభిః = క్రూరములైన కర్మలు గల, రాక్షసైః = రాక్షసులచేత, ఆహతానామ్ = ప్రయోగించబడిన, భేరీణాం చ = భేరీలయొక్క, ఘోరః = భయంకరమైన, మహాధ్వనిః = గొప్ప ధ్వని, శ్రూయతే చ = వినబడుచున్నది.

తా. రాక్షసుల అరపులు, క్రూరకర్మలు చేయు ఆ రాక్షసులు ప్రయోగించుచున్న భేరీల భయంకరమైన మహాధ్వని వినవచ్చుచున్నవి. 10

మూ. అనాగతవిధానం హి కర్తవ్యం శుభమిచ్ఛతా,
ఆపదం శఙ్కమానేన పురుషేణ విపశ్చితా. 11

ప్ర. అ. ఆపదమ్ = ఆపదను, శఙ్కమానేన = శంకించుచున్న, శుభమ్ = శుభమును, ఇచ్ఛతా = కోరుచున్న, విపశ్చితా = విద్వాంసుడైన, పురుషేణ = పురుషునిచేత, అనాగతవిధానమ్ = రాబోవుదానికి ప్రతిక్రియ, కర్తవ్యం హి =

తా. ఆపద రానున్న దని ఆశంక కలిగినపుడు, శుభమును కోరు బుద్ధి మంతుడైన పురుషుడు రాబోవుదానికి ప్రతిక్రియ చేసుకొనవలెను కదా! 11

మూ. తస్మాద్గృహీత్వా వైదేహీం శరపాణిర్ధనుర్ధరః,
గుహామాశ్రయ శైలస్య దుర్గాం పాదపసంకులామ్. 12

ప్ర. అ. తస్మాత్ = ఆ కారణమువలన, వైదేహీమ్ = సీతను, గృహీత్వా = గ్రహించి, శరపాణిః = బాణములు హస్తమునందు కలవాడవై, ధనుర్ధరః = ధనస్సును ధరించినవాడవై, శైలస్య = పర్వతముయొక్క, దుర్గామ్ = ప్రవేశింప శక్యము కాని, పాదపసంకులామ్ = వృక్షములచే వ్యాకులమైన, గుహామ్ = గుహను, ఆశ్రయ = ఆశ్రయించుము.

తా. అందుచేత నీవు ధనుర్బాణములు ధరించి, సీతను నీవెంట గైకొని వెళ్ళి, వృక్షములచేత వ్యాప్తమై ప్రవేశింప శక్యము కాని పర్వతగుహలో ఉండుము.

మూ. ప్రతికూలితు మిచ్ఛామి న హి వాక్యమిదం త్వయా,
శాపితో మమ పాదాభ్యాం గమ్యతాం వత్స మా చిరమ్.

ప్ర. అ. ఇదం వాక్యమ్ = ఈ వాక్యమును, త్వయా = నీచేత, ప్రతికూలితుమ్ = ప్రతికూలము చేయుటకు, న ఇచ్ఛామి = ఇష్టపడను. వత్స = వత్సా! మమ పాదాభ్యామ్ = నా పాదములచేత, శాపితః అసి = ఒట్టుపెట్టబడితివి. గమ్యతామ్ = వెళ్లెదవుగాక. చిరమ్ = ఆలస్యము, మా = వద్దు.

తా. "నేనే రాక్షసులను సంహరించెదను" మొదలైన మాటలు చెప్పి నా మాటకు నీవు అడ్డు చెప్పుట నా కిష్టము లేదు. నా పాదాలపై ఒట్టు పెట్టి చెప్పుచున్నాను. నాయనా! వెంటనే వెళ్లుము; ఆలస్యము చేయవద్దు. 13

మూ. త్వం హి శూరశ్చ బలవాన్ హన్యా హ్యేతాన్న సంశయః,
స్వయం తు హన్తుమిచ్ఛామి సర్వానేవ నిశాచరాన్. 14

ప్ర. అ. త్వమ్ = నీవు, శూరశ్చ = శూరుడవు, బలవాన్ = బలవంతుడవు. ఏతాన్ = ఈ రాక్షసులను, హన్యాః హి = చంపగలవు. తు = కాని, సర్వానేవ = సమస్తమైన, నిశాచరాన్ = రాక్షసులను, స్వయమ్ = స్వయముగా, హన్తుమ్ = చంపుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. నీవు శూరుడవు; బలవంతుడవు, అందుచేత నీవే ఈ రాక్షసులను చంపగలవు; సందేహము లేదు. కాని ఈ రాక్షసుల నందరినీ నేనే స్వయముగా చంపవలె నని కోరుచున్నాను. 14

మూ. ఏవముక్తస్తు రామేణ లక్ష్మణః సహ సీతయా,
శరానాదాయ చాపం చ గుహాం దుర్గాం సమాశ్రయత్. 15

ప్ర. అ. రామేణ = రామునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, లక్ష్మణః = లక్ష్మణుడు, శరాన్ = బాణములను, చాపం చ = ధనస్సును, ఆదాయ = గ్రహించి, సీతయా సహ = సీతతో కూడ, దుర్గామ్ = ప్రవేశింప శక్యము కాని, గుహామ్ = గుహను, సమాశ్రయత్ = ఆశ్రయించెను.

తా. లక్ష్మణుడు రాముని ఆజ్ఞ ప్రకారము, ధనుర్బాణములు ధరించి, సీతను వెంట తీసికొని, ప్రవేశింప శక్యము కాని గుహలోనికి ప్రవేశించెను. 15

మూ. తస్మిన్ ప్రవిష్టే తు గుహాం లక్ష్మణే సహ సీతయా,
హన్త నిర్యుక్తమిత్యుక్త్వా రామః కవచమావిశత్. 16

ప్ర. అ. తస్మిన్ = ఆ, లక్ష్మణే = లక్ష్మణుడు, సీతయా సహ = సీతతో కూడ, గుహామ్ = గుహను, ప్రవిష్టే = ప్రవేశించినవా డగుచుండగా, రామః = రాముడు, హన్త = అమ్మయ్య ! నిర్యుక్తమ్ = మంచిఉపాయము ! ఇతి = అని, ఉక్త్వా = పలికి, కవచమ్ = కవచమును, ఆవిశత్ = ప్రవేశించెను.

తా. లక్ష్మణుడు సీతతో గుహలో ప్రవేశించిన పిదప రాముడు "అమ్మయ్య! మంచి పని చేసితిని !" అని అనుకొనుచు కవచమును తొడుగుకొనెను. 16

మూ. స తేనాగ్నినికాశేన కవచేన విభూషితః,
బభూవ రామ స్తిమిరే విధూమోఽగ్నిరివోత్థితః. 17

ప్ర. అ. అగ్నినికాశేన = అగ్నితో సమానమైన, తేన = ఆ, కవచేన = కవచముచేత, విభూషితః = అలంకరించబడిన, సః రామః = ఆ రాముడు, తిమిరే = చీకటియందు, ఉత్థితః = పైకివెగసిన, విధూమః = ధూమము లేని, అగ్నిరివ = అగ్నివలె, బభూవ = ఉండెను.

తా అగ్నితో సమానమైన ఆ కవచముచేత అలంకృతుడై రాముడు, చీకట్లో ప్రజ్వలించుచున్న, ధూమము లేని అగ్ని వలె ప్రకాశించెను. 17

మూ. స చాపముద్యమ్య మహచ్ఛరానాదాయ వీర్యవాన్,
బభూవావస్థిత స్తత్ర జ్యాస్వనైః పూరయన్ దిశః. 18

ప్ర. అ. వీర్యవాన్ = పరాక్రమవంతుడైన, సః = ఆ రాముడు, మహత్ = గొప్పదైన, చాపమ్ = ధనస్సును, ఉద్యమ్య = ఎత్తి, జ్యాస్వనైః = నారి ధ్వనులచేత, దిశః = దిక్కులను, పూరయన్ = నింపుచు, తత్ర = అక్కడ, అవస్థితః = నిలచినవాడు, బభూవ = ఆయెను.

తా. పరాక్రమశాలియైన ఆ రాముడు గొప్ప ధనస్సును ఎత్తి, బాణములు గ్రహించి, టంకారధ్వనులచేత దిక్కులను నింపుచు అక్కడ నిలచెను. 18

మూ. తతో దేవాః సగన్ధర్వాః సిద్ధాశ్చ సహ చారణైః,
సమేయుశ్చ మహాత్మానో యుద్ధదర్శనకాఙ్క్షిణః. 19

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సగన్ధర్వాః = గంధర్వులతో గూడిన, దేవాః = దేవతలు, మహాత్మానః = మహాత్ములైన, సిద్ధాశ్చ = సిద్ధులు, చారణైః సహ = చారణులతో కూడ, యుద్ధదర్శనకాఙ్క్షిణః = యుద్ధముయొక్క దర్శనమును కోరుచు, సమేయుః = కలసివచ్చిరి.

తా. పిమ్మట, ఆయుద్ధమును చూచుటకై మహాత్ములైన దేవతలు, గంధర్వులు, సిద్ధులు, చారణులు కలిసి వచ్చిరి. 19

మూ. ఋషయశ్చ మహాత్మానో లోకే బ్రహ్మర్షిసత్తమాః,
సమేత్య చోచుః సహితా అన్యోన్యం పుణ్యకర్మణః. 20

ప్ర. అ. మహాత్మానః = మహాత్ములైన, ఋషయశ్చ = ఋషులు, లోకే = లోకమునందలి, బ్రహ్మర్షిసత్తమాః = శ్రేష్ఠులైన బ్రహ్మర్షులు వచ్చిరి. పుణ్యకర్మణః = పుణ్యకర్ములుగల వారందరు, సమేత్య = దగ్గరగా, అన్యోన్యమ్ = పరస్పరము, సహితాః = కలసినవారై, ఊచుః = ఇటు పలికిరి.

తా. మహాత్ములైన ఋషీశ్వరులు, లోకములో ఉన్న శ్రేష్ఠులైన బ్రహ్మర్షులు కూడ వచ్చిరి. ఆ పుణ్యాత్ము లందరు కలిసి ఒకరితో ఒకరు ఇట్లనిరి. 20

మూ. స్వస్తి గోబ్రాహ్మణేభ్యోఽస్తు లోకానాం యేఽభిసంగతాః,
జయతాం రాఘవో యుద్ధే పౌలస్త్యాన్ రజనీచరాన్, 21
చక్రహస్తో యథా యుద్ధే సర్వానసురపుఙ్గవాన్.

ప్ర. అ. తా.మూ. 23వ సర్గ శ్లో. 27, 28.

ఈ శ్లోకాలు ప్రాచ్యపాఠంలో ఇక్కడ లేవు.

మూ. ఏవముక్త్వా పునః ప్రోచురాలోక్య చ పరస్పరమ్, 22
చతుర్దశ సహస్రాణి రక్షసాం భీమకర్మణామ్,
ఏకశ్చ రామో ధర్మాత్మా కథం యుద్ధం భవిష్యతి. 23

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, ఆలోక్య చ = చూచి, పరస్పరమ్ = పరస్పరము, పునః = మరల, ప్రోచుః = పలికిరి. భీమకర్మణామ్ = భయంకరమైన పనులు గల, రక్షసామ్ = రాక్షసులయొక్క, చతుర్దశ = పదునాలుగు, సహస్రాణి = వేలు ఉన్నవి. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, రామశ్చ = రాముడు, ఏకః = ఒక్కడే; యుద్ధమ్ = యుద్ధము, కథమ్ = ఎట్లు, భవిష్యతి = కాగలదో .

తా. ఈ విధముగా పలికి ఆ దేవతాదులు పరస్పరము చూచుకొనుచు మరల ఇట్లు అనుకొనిరి. "భయంకరములైన పనులు చేయు రాక్షసులు పదునాలుగు వేలమంది ఉన్నారు. ధర్మాత్ముడైన రాము డొక్కడే ఉన్నాడు. యుద్ధము ఎట్లు జరుగునో కదా." 22, 23

మూ. ఇతి రాజర్షయః సిద్ధాః సగణాశ్చ ద్విజర్షభాః,
జాతకౌతూహలా స్తస్థుర్విమానస్థాశ్చ దేవతాః. 24

ప్ర అ. రాజర్షయః = రాజర్షులు, సగణాః = గణములతో కూడిన, సిద్ధాః = సిద్ధులు, ద్విజర్షభాః = ద్విజశ్రేష్ఠులు, విమానస్థాః = విమానములం

దున్న, దేవతాశ్చ = దేవతలు, ఇతి = ఇట్లు, జాతకౌతూహలాః = పుట్టిన వేడుక గలవారై, తస్థుః = ఉండిరి.

తా. రాజర్షులు, సిద్ధులు, గణములు, ద్విజశ్రేష్ఠులు, విమానాలలో ఉన్న దేవతలు ఈ విధముగా మాటలాడుకొనుచు, మిక్కిలి వేడుకతో నిలచి ఉండిరి.

మూ. ఆవిష్టం తేజసా రామం సంగ్రామశిరసి స్థితమ్,
దృష్ట్వా సర్వాణి భూతాని భయాద్వివ్యథిరే తదా. 25

ప్ర. అ. తదా = అప్పుడు, సంగ్రామశిరసి = యుద్ధమునకు అగ్రభాగమునందు, స్థితమ్ = నిలచియున్న, తేజసా = తేజస్సుచేత, ఆవిష్టమ్ = ఆవేశింపబడి ఉన్న, రామమ్ = రాముణ్ణి, దృష్ట్వా = చూచి, సర్వాణి = సమస్తమైన, భూతాని = ప్రాణులు, భయాత్ = భయమువలన, వివ్యథిరే = వ్యథ చెందినవి.

తా. ఆ సమయమునందు, యుద్ధము చేయుటకై నిలచిన ఆ రాముణ్ణి ఒక అద్భుతమైన తేజస్సు ఆవహించి ఉండెను. అట్టి ఆ రాముణ్ణి చూచి అక్కడనున్న ప్రాణు లన్నీ భయముతో కలత చెందెను. 25

మూ. రూపమప్రతిమం తస్య రామస్యాక్లిష్టకర్మణః,
బభూవ రూపం క్రుద్ధస్య రుద్రస్యేవ మహాత్మనః. 26

ప్ర. అ. అక్లిష్టకర్మణః = శ్రమపడకుండా పనిచేయు, తస్య రామస్య = ఆ రాముని యొక్క, అప్రతిమమ్ = సాటి లేని. రూపమ్ = రూపము, క్రుద్ధస్య = క్రుద్ధుడైన, మహాత్మనః = మహాత్ముడైన, రుద్రస్య = రుద్రునియొక్క, రూపమివ = రూపమువలె, బభూవ = ఉండెను.

తా. శ్రమపడకుండ పనులు చేయు రాముని సాటి లేని ఆ రూపము, కోపించిన మహాత్ముడైన రుద్రుని రూపము వలె ఉండెను. (పోల్చినచో ఆ రుద్రుని రూపముతో పోల్చవలెను కాని మరొకటి ఏదీ లేదని భావము). 26

మూ. తతో గమ్భీరనిర్హ్రాదం ఘోరవర్మాయుధధ్వజమ్,
అనీకం యాతుధానానాం సమన్తాత్ప్రత్యదృశ్యత. 27

ప్ర. అ. తతః = అటుపిమ్మట, గమ్భీరనిర్హ్రాదమ్ = గంభీరమైన ధ్వని

కలది, ఘోరవర్మాయుధధ్వజమ్ = భయంకరములైన కవచములు, ఆయుధ ములు, ధ్వజములు గలది అయిన, యాతుధానానామ్ = రాక్షసులయొక్క, అనీకమ్ = సేన, సమన్తాత్ = అంతటా, ప్రత్యదృశ్యత = చూడబడెను.

తా. ఇంతలో గంభీరమైన ధ్వని చేయుచు, భయంకరములైన కవచ ములు, ఆయుధములు, ధ్వజములు ధరించి వచ్చుచున్న రాక్షసుల సైన్యము నలుమూలల కనబడెను. 27

మూ. సింహనాదం విసృజతామన్యోన్యమభిగర్జతామ్
చాపాని విస్ఫారయతాం జృమ్భతామప్యభీక్ష్ణశః, 28

విప్రఘుష్టస్వనానాం చ దున్దుభీశ్చాపి నిఘ్నతామ్
తేషాం సుతుములః శబ్దః పూరయామాస తద్వనమ్. 29

ప్ర. అ. సింహనాదమ్ = సింహనాదమును, విసృజతామ్ = విడచుచున్న వాళ్ళు, అన్యోన్యమ్ = పరస్పరము, అభిగర్జతామ్ = ఎదురుగా నిలచి గర్జించు చున్న వాళ్లు, చాపాని = ధనస్సులను, విస్ఫారయతామ్ = చరచుచున్న వాళ్ళు, అభీక్ష్ణశః = ఎక్కువగా, జృమ్భతామపి = ఆవులించుచున్న వాళ్ళు, విప్రఘుష్ట స్వనానాం చ = అరపుల ధ్వనులు కలవాళ్లు, దున్దుభీశ్చ అపి = దుందుభులను, నిఘ్నతామ్ = కొట్టుచున్న వాళ్ల అయిన, తేషామ్ = వాళ్ళయొక్క, సుతుములః = చాల వ్యాకులమైన, శబ్దః = శబ్దము, తద్వనమ్ = ఆ వనమును, పూరయామాస = నింపెను.

తా. ఆ రాక్షసులలో కొందరు సింహనాదములు చేయగా, మరి కొందరు ఒకరి వైపు మరొకరు తిరిగి గర్జించుచుండిరి. కొందరు ధనుష్టంకారము చేయు చుండిరి. కొందరు ఎక్కువగా ఆవులించుచుండిరి. కొందరు చాల గట్టిగా అరచు చుండిరి. కొందరు దుందుభులు మ్రోగించుచుండిరి. ఈ విధముగ ఆ రాక్షసులు చేయు వ్యాకులమైన శబ్దము ఆ వనమును నింపివేసెను. 28, 29

మూ. తేన శబ్దేన విత్రస్తాః శ్వాపదా వనచారిణః,
దుద్రువుర్యత్ర నిఃశబ్దం పృష్ఠతో న వ్యలోకమన్. 30

ప్ర. అ. తేన శబ్దేన = ఆ ధ్వనిచేత, సంత్రస్తాః = భయపడిన, వన

చారిణః = వనమునందు సంచరించు, శ్వాపదాః = క్రూరమృగములు, యత్ర = ఎక్కడ, నిఃశబ్దమ్ = శబ్దము లేదో అక్కడికి, దుద్రువుః = పరుగెత్తినవి; పృష్ఠతః = వెనుకకు, న వ్యలోకయన్ = చూడలేదు.

తా. ఆ ధ్వనికి భయపడి వనములో సంచరించే క్రూరమృగములు, వెనుకకు తిరిగి చూడకుండా ధ్వని లేని చోటికి పారిపోయినవి. 30

మూ. తత్త్వనీకం మహాఘోరం రామం సముపసర్పత,
ధృతనానాప్రహరణం గమ్భీరం సాగరోపమమ్. 31

ప్ర. అ. మహాఘోరమ్ = చాల భయంకరము, ధృతనానాప్రహరణమ్ = ధరించబడిన అనేక విధములైన ఆయుధములు కలది, గమ్భీరమ్ = గంభీరము, సాగరోపమమ్ = సముద్రముతో సమానము అయిన, తత్ అనీకమ్ = ఆ సేన, రామమ్ = రాముణ్ణి, సముపసర్పత = చేరెను.

తా. సముద్రము వలె చాల గంభీరమై చాల భయంకరముగా ఉన్న ఆ సైన్యము అనేకవిధములైన ఆయుధములు ధరించి రాముణ్ణి సమీపించెను. 31

మూ. రామోఽపి చారయంశ్చక్షుః సర్వతో రణపణ్డితః,
దదర్శ ఖరసైన్యం తద్యుద్ధాభిముఖముత్థితమ్. 32

ప్ర. అ. రణపణ్డితః = యుద్ధమునందు పండితుడైన, రామోఽపి = రాముడు కూడ, చక్షుః = నేత్రమును (దృష్టిని), సర్వతః = అన్నివైపులా, చారయన్ = ప్రసరింపచేయుచు, యుద్ధాభిముఖమ్ = యుద్ధమునకు అభిముఖమైన, ఉత్థితమ్ = బయలుదేరి వచ్చిన, తత్ = ఆ, ఖరసైన్యమ్ = ఖరుని సైన్యమును, దదర్శ = చూచెను.

తా. యుద్ధములో చాల సమర్థుడైన రాముడు కూడ తన దృష్టిని అన్ని వైపులా ప్రసరింపచేసి, తనతో యుద్ధమునకై లేచి వచ్చిన ఖరుని సైన్యమును చూచెను. 32

మూ. వితత్య చ ధనుర్భీమం తూణ్యాశ్చోద్ధృత్య సాయకాన్,
క్రోధమాహారయత్తీవ్రం వధార్థం సర్వరక్షసామ్. 33

ప్ర. అ. భీమమ్ = భయంకరమైన, ధనుః = ధనస్సును, వితత్య = విస్తరింపచేసి, తూణ్యాః=అంబులపొదినుండి, సాయకాన్=బాణములను, ఉద్ధృత్య= ఎత్తి (పైకి తీసి), సర్వ రక్షసామ్ = సమస్తరాక్షసులయొక్క, వధార్థమ్ = వధకొరకు, తీవ్రమ్ = తీవ్రమైన, క్రోధమ్ = క్రోధమును, ఆహారయత్ = తెప్పించుకొనెను.

తా. రాముడు భయంకరమైన ధనస్సును ధారించి, అంబులపొది నుండి బాణములు పైకి తీసి, సకలరాక్షసుల వధకొరకై తీవ్రమైన క్రోధము తెప్పించుకొనెను. 33

మూ. దుష్ప్రేక్షః సోఽభవత్క్రుద్ధో యుగాన్తాగ్నిరివ జ్వలన్,
తం దృష్ట్వా తేజసావిష్టం ప్రాద్రవన్ వనదేవతాః. 34

ప్ర. అ. క్రుద్ధః = క్రుద్ధుడైన, సః = ఆ రాముడు, జ్వలన్=ప్రజ్వలించుచున్న, యుగాన్తాగ్నిరివ = ప్రలయకాలాగ్ని వలె, దుష్ప్రేక్షః = చూచుటకు శక్యము కానివాడు, అభవత్ = ఆయెను. తేజసా = తేజస్సుచేత, ఆవిష్టమ్ = ఆవేశింపబడిన, తమ్ = ఆ రాముణ్ణి, దృష్ట్వా = చూచి, వనదేవతాః = వనదేవతలు, ప్రాద్రవన్ = పారిపోయిరి.

తా. క్రుద్ధుడైన ఆ రాముడు, ప్రజ్వలించుచున్న ప్రలయకాలాగ్ని వలె చూచుటకు భయంకరుడుగా ఉండెను. గొప్ప తేజస్సుతో నిండి యున్న ఆ రాముణ్ణి చూచి భయపడి వనదేవతలు పారిపోయిరి. 34

మూ. తస్య క్రుద్ధస్య రూపం తు రామస్య దదృశే తదా,
దక్షస్యేవ క్రతుం హన్తుముద్యతస్య పినాకినః. 35

ప్ర. అ. తదా = అప్పుడు, క్రుద్ధస్య = కోపించిన, తస్య = ఆ రాముని యొక్క, రూపమ్=రూపము, దక్షస్య = దక్షునియొక్క, క్రతుమ్=యాగమును, హన్తుమ్ = ధ్వంసము చేయుటకు, ఉద్యతస్య = ఉద్యుక్తుడైన, పినాకినః ఇవ = శివుని రూపము వలె, దదృశే = చూడబడెను.

తా. కోపించిన ఆ రాముని రూపము, దక్షుని యజ్ఞముధ్వంసము చేయుటకు

ఉద్యమించి పినాక మను ధనస్సును హస్తమునందు ధరించిన రుద్రుని రూపము వలె ఉండెను. 35

మూ. ఆవిష్టం తేజసా రామం సంగ్రామశిరసి స్థితమ్,
దృష్ట్వా సర్వాణి భూతాని భయార్తాని ప్రదుద్రువుః. 36

ప్ర. అ. తేజసా = తేజస్సుచేత, అవిష్టమ్ = ఆవేశింపబడిన, సంగ్రామ శిరసి = యుద్ధాగ్రమునందు, స్థితమ్ = నిలచిన, రామమ్ = రాముణ్ణి, దృష్ట్వా = చూచి, సర్వాణి = సమస్తమైన, భూతాని = ప్రాణులు, భయార్తాని = భయముచేత పీడింపబడినవై, ప్రదుద్రువుః = పారిపోయినవి.

తా. అద్భుతమైన తేజస్సు ఆవరింపగా యుద్ధాగ్రభాగమునందు నిలచి ఉన్న ఆ రాముణ్ణి చూచి సకలభూతములు భయముచేత పీడితములై పారిపోయినవి. 36

మూ. తత్కార్ముకైరాభరణైర్ధ్వజైశ్చ
తైర్వర్మభిశ్చాగ్నిసమానవర్ణైః,
బభూవ సైన్యం పిశితాశనానాం
సూర్యోదయే నీలమివాభ్రబృన్దమ్. 37

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
చతుర్వింశః సర్గః.

ప్ర. అ. పిశితాశనానామ్ = రాక్షసులయొక్క, తత్ = ఆ, సైన్యమ్ = సైన్యము, కార్ముకైః = ధనస్సులచేతను, ఆభరణైః = ఆభరణములచేతను, ధ్వజైశ్చ = ధ్వజములచేతను, అగ్నిసమానవర్ణైః = అగ్నితో సమానమైన వర్ణము గల, తైః = ఆ, వర్మభిః = కవచములచేతను, సూర్యోదయే = సూర్యోదయ సమయమునందు, నీలమ్ = నల్లని, అభ్రబృన్దమివ = మేఘముల సముదాయము వలె, బభూవ = ఉండెను.

తా. ఆ రాక్షససైన్యము ధనస్సులతోను, ఆభరణములతోను, ధ్వజముల

తోను, అగ్నితో సమానమైన వర్ణము గల కవచములతోను నిండి యుండుటచేత సూర్యోదయసమయమునందు సూర్యకాంతి ప్రసరించుచున్న నల్లని మేఘసముదాయము వలె ఉండెను. 32

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో
ఇరువదినాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చవింశః సర్గః

[రాముడు యుద్ధానికి వచ్చిన రాక్షసులను సంహరించుట].

మూ. అవష్టబ్ధధనుం రామం క్రుద్ధం చ రిపుఘాతినమ్,
దదర్శాశ్రమమాగమ్య ఖరః సహ పురఃసరైః. 1

ప్ర. అ. ఖరః = ఖరుడు, పురఃసరైః సహ = తన ముందు నడచు సైనికులతో కూడ, ఆశ్రమమ్ = ఆశ్రమమును, అగమ్య = చేరి, అవష్టబ్ధధనుమ్ = నిలబెట్టబడిన ధనస్సు కలవాడు, క్రుద్ధమ్ = కోపించినవాడు, రిపుఘాతినమ్ = శత్రువులను సంహరించువాడు అయిన, రామమ్ = రాముణ్ణి, దదర్శ = చూచెను.

తా. ఖరుడు తన ముందు నడచి వచ్చు సైనికులతో కూడ కలసి ఆశ్రమము చేరి, అక్కడ క్రుద్ధుడై ధనస్సును నేలపై నిలబెట్టి పట్టుకొని ఉన్న శత్రు సంహారకుడైన రాముణ్ణి చూచెను. 1

మూ. తం దృష్ట్వా సశరం చాపముద్యమ్య ఖరనిస్స్వనమ్,
రామస్యాభిముఖం సూతం చోద్యతామిత్యచోదయత్. 2

ప్ర. అ. తమ్ = ఆ రాముణ్ణి, దృష్ట్వా = చూచి, ఖరనిస్స్వనమ్ = పరుషమైన ధ్వని గల, సశరమ్ = శరములతో కూడిన, చాపమ్ = ధనస్సును, ఉద్యమ్య = ఎత్తి, రామస్య = రామునకు, అభిముఖమ్ = ఎదురుగా, చోద్యతామ్ = తోలబడుగాక, ఇతి = అని, సూతమ్ = సారథిని, అచోదయత్ = ప్రేరేపించెను.

తా. ఖరుడు ఆ రాముణ్ణి చూచి, పరుషముగా ధ్వని చేయు, బాణసహితమైన ధనస్సును పైకి ఎత్తి "రథమును రాముని వద్దకు తీసికొని వెళ్ళుము"అని సారథిని ప్రేరేపించెను. 2

మూ. స ఖరస్యాజ్ఞయా సూతస్తురగాన్ సమచోదయత్,
యత్ర రామో మహాబాహురేకో ధూన్వన్ సితో ధనుః. 3

ప్ర. అ. సః సూతః = ఆ సారథి, ఖరస్య = ఖరునియొక్క, ఆజ్ఞయా = ఆజ్ఞచేత, మహాబాహుః = గొప్ప బాహువులు గల, ఏకః = ఒంటరిగా ఉన్న, రామః = రాముడు, యత్ర = ఎక్కడ, ధనుః = ధనస్సును, ధూన్వన్ = కదల్చును, స్థితః = నిలచెనో అక్కడికి, తురగాన్ = గుఱ్ఱములను, సమచోదయత్ = త్రోలెను.

తా. ఆ సారథి ఖరుని ఆజ్ఞ ననుసరించి, మహాబాహువైన రాముడు ధనస్సు కదల్చుచు ఏకాకిగా నిలచి ఉన్న ప్రదేశమునకు రథమును తీసికొనివెళ్లెను. 3

మూ. తం తు నిష్పతితం దృష్ట్వా సర్వే తే రజనీచరాః,
నర్దమానా మహానాదం సచివాః పర్యవారయన్. 4

ప్ర. అ. నిష్పతితమ్ = ముందుకు వచ్చిన, తమ్ = ఆ ఖరుణ్ణి, దృష్ట్వా = చూచి, సచివాః = మంత్రులైన, తే = ఆ, సర్వే = సమస్తమైన, రజనీచరాః = రాక్షసులు, మహానాదమ్ = గొప్ప ధ్వని కలుగు నట్లుగా, నర్దమానాః = ధ్వని చేయుచు, పర్యవారయన్ = అతని చుట్టు చేరిరి.

తా. ఖరుడు ముందుకు వచ్చుట చూచి అతని మంత్రులైన రాక్షసు లందరు బిగ్గరగా అరచుచు అతని చుట్టూ చేరిరి. 4

మూ. స తేషాం యాతుధానానాం మధ్యే రథగతః ఖరః,
బభూవ మధ్యే తారాణాం లోహితాఙ్గ ఇవోదితః. 5

ప్ర. అ. తేషాం యాతుధానానామ్ = ఆ రాక్షసులయొక్క, మధ్యే = మధ్యయందు, రథగతః = రథమునం దున్న, ఖరః = ఖరుడు, తారాణామ్ = నక్షత్రములయొక్క, మధ్యే = మధ్యయందు, ఉదితః = ఉదయించిన, లోహితాఙ్గ ఇవ = కుజుడు వలె, బభూవ = ఉండెను.

తా. ఆ రాక్షసుల మధ్య రథముపై ఉన్న ఆ ఖరుడు, నక్షత్రముల మధ్య ఉదయించిన కుజగ్రహము వలె ఉండెను. 5

మూ. తతః శరసహస్రేణ రామమప్రతిమౌజసమ్,
అర్దయిత్వా మహానాదం ననాద సమరే ఖరః. 6

ప్ర. అ. తతః = అటు పిమ్మట, ఖరః = ఖరుడు, సమరే = యుద్ధము నందు, శరసహస్రేణ = అనేకబాణములతో, అప్రతిమౌజసమ్ = సాటి లేని కాంతి గల, రామమ్ = రాముణ్ణి, అర్దయిత్వా = పీడించి, మహానాదమ్ = గొప్ప ధ్వని కలుగునట్లుగా, ననాద = అరచెను.

తా. పిమ్మట ఖరుడు సాటి లేని కాంతి గల రాముణ్ణి, యుద్ధమునందు, అనేక బాణములు ప్రయోగించి పీడించి బిగ్గరగా అరచెను. 6

మూ. తతస్తం భీమధన్వానం క్రుద్ధాః సర్వే నిశాచరాః,
రామం నానావిధైః శస్త్రైరభ్యవర్షన్త దుర్జయమ్. 7

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సర్వే=సమస్తమైన, క్రుద్ధాః=కోపించిన, నిశాచరాః = రాక్షసులు, భీమధన్వానమ్ = భయంకరమైన ధనస్సు గల, దుర్జయమ్ = జయింప శక్యము కాని, తం రామమ్ = ఆ రాముణ్ణి, నానావిధైః=అనేక విధములైన, శస్త్రైః = ఆయుధములచేత, అభ్యవర్షన్ = వర్షించిరి.

తా. పిమ్మట ఆ రాక్షసు లందరూ కూడ కోపముతో, భయంకరమైన ధనస్సు ధరించి ఉన్న, జయింప శక్యము కాని ఆ రామునిపై అనేకవిధములైన శస్త్రములు కురిపించిరి. 7

మూ. ముద్గరైః పట్టిసైః శూలైః ప్రాసైః ఖడ్గైః పరశ్వథైః,
రాక్షసాః సమరే రామం నిజఘ్నూ రోషతత్పరాః. 8

ప్ర. అ. రాక్షసాః = రాక్షసులు, రోషతత్పరాః = రోషావిష్టులై, ముద్గరైః = ముద్గరములచేత, పట్టిసైః=పట్టిసములచేత, శూలైః = శూలములచేత, ప్రాసైః = ప్రాసములచేత, ఖడ్గైః=ఖడ్గములచేత, పరశ్వథైః = గండ్రగొడ్డళ్లచేత, సమరే = యుద్ధమునందు, రామమ్ = రాముణ్ణి, నిజఘ్నుః = కొట్టిరి.

తా. రాక్షసులు రోషావేశముతో ఆ రాముణ్ణి, యుద్ధములో, ముద్గరములు, పట్టిసములు, శూలములు, ప్రాసలు, ఖడ్గములు, గండ్రగొడ్డళ్ళు మొదలైన ఆయుధాలతో కొట్టిరి. 8

మూ. తే వలాహకసంకాశా మహానాదా మహౌజసః,
అభ్యధావన్త కాకుత్స్థం రథైర్వాజిభిరేవ చ, 9
గజైః పర్వతకూటాభై రామం యుద్ధే జిఘాంసవః.

ప్ర. అ. వలాహకసంకాశాః = మేఘములతో సమానులు, మహానాదాః = గొప్ప ధ్వనులు కలవారు, మహౌజసః = గొప్ప తేజస్సు కలవారు అయిన, తే = ఆ రాక్షసులు, రథైః = రథములతోను, వాజిభిరేవ చ = గుఱ్ఱములతోను, పర్వతకూటాభైః = పర్వతశిఖరములతో సమానములైన, గజైః = ఏనుగులతోను, యుద్ధే = యుద్ధమునందు, జిఘాంసవః = (రాముణ్ణి) చంప దలచినవారై, రామమ్ = రాముణ్ణి గూర్చి, అభ్యధావన్త = పరుగెత్తిరి.

తా. మేఘాల వంటి ఆకారములు గల మహాతేజఃశాలు లైన ఆ రాక్షసులు, గొప్ప ధ్వని చేయుచు, యుద్ధములో రాముణ్ణి సంహరించవలె నను కోరికతో, రథములు, గుఱ్ఱములు, పర్వతశిఖరములవంటి ఏనుగులు ఎక్కి ఆ రాముని మీదకు వెళ్ళిరి. 9

మూ. తే రామే శరవర్షాణి వ్యసృజన్ రక్షసాం గణాః, 10
శైలేన్ద్రమివ ధారాభిర్వర్షమాణా వలాహకాః.

ప్ర. అ. తే = ఆ, రక్షసామ్ = రాక్షసులయొక్క, గణాః = గణములు, రామే = రామునిమీద, వర్షమాణాః = వర్షించుచున్న, వలాహకాః = మేఘములు, ధారాభిః = జలధారలచేత, శైలేన్ద్రమివ = పర్వతరాజునువలె, శరవర్షాని = బాణవర్షములను, వ్యసృజన్ = విడచినవి.

తా. ఆ రాక్షసగణములు వర్షించుచున్న మేఘము పర్వతరాజుపై జలధారలు కురిపించి నట్లు, రామునిపై బాణవర్షములను కురిపించిరి. 10

మూ. స తైః పరివృతో ఘోరైః రాఘవో రక్షసాం గణైః, 11
తిథిష్వివ మహాదేవో వృతః పారిషదాం గణైః.

ప్ర. అ. సః = ఆ, రాఘవః = రాముడు, ఘోరైః = భయంకరములైన, రక్షసాం గణైః = రాక్షసుల గణములచేత, మహాదేవః = రుద్రుడు, తిథిషు =

ఆ యా తిథులయందు, పారిషదామ్ = అనుచరులయొక్క, గణైరివ = గణముల చేత వలె, పరివృతః = చుట్టువారుకొనబడెను.

తా. ఆ యా తిథులలో ప్రమథగణములు మహాదేవుని చుట్టి నిలచి నట్లు, భయంకరులైన ఆ రాక్షసులు గుంపులు గుంపులుగా ఆ రాముని చుట్టి నిలచిరి.

మూ. తాని ముక్తాని శస్త్రాణి యాతుధానైః స రాఘవః,
ప్రతిజగ్రాహ విశిఖై ర్నద్యోఘానివ సాగరః. 12

ప్ర. అ. సః = ఆ, రాఘవః = రాముడు, యాతుధానైః = రాక్షసులచేత, ముక్తాని = విడువబడిన, తాని = ఆ, శస్త్రాణి = శస్త్రములను, సాగరః = సముద్రము, నద్యోఘానివ = నదీప్రవాహములను వలె, విశిఖైః = బాణములచేత, ప్రతిజగ్రాహ = స్వీకరించెను.

తా. ఆ రాక్షసులు ప్రయోగించిన ఆయుధములను రాముడు, బాణములు ప్రయోగించి, నదీప్రవాహములను సముద్రము స్వీకరించి నట్లు స్వీకరించెను. 12

మూ. స తైః ప్రహరణైర్ఘోరైర్భిన్నగాత్రో న వివ్యథే,
రామః ప్రదీప్తైర్బహుభిర్వజ్రైరివ మహాచలః. 13

ప్ర. అ. ఘోరైః = భయంకరములైన, తైః = ఆ, ప్రహరణైః = ఆయుధములచేత, భిన్నగాత్రః = బద్దలుకొట్టబడిన శరీరము గల, సః రామః = ఆ రాముడు, ప్రదీప్తైః = ప్రజ్వలించుచున్న, బహుభిః = అనేకమైన, వజ్రైః = వజ్రాయుధములచేత, మహాచల ఇవ = గొప్ప పర్వతము వలె, న వివ్యథే = వ్యథ చెందలేదు.

తా. భయంకరములైన ఆ ఆయుధములచేత శరీరమునకు చాల దెబ్బలు తగిలినా కూడ రాముడు, ప్రజ్వలించుచున్న వజ్రము లెన్ని ప్రయోగించినా మహాపర్వతము చలించ నట్లు, ఏ మాత్రము వ్యథ చెందలేదు. 13

మూ. స విద్ధః క్షతజాదిగ్ధః సర్వగాత్రేషు రాఘవః,
బభూవ రామః సంధ్యాభ్రై ర్దివాకర ఇవావృతః. 14

ప్ర. అ. విద్ధః = కొట్టబడినవాడై, సర్వగాత్రేషు = సమస్తఅవయవముల

యందు, క్షతజాదిగ్ధః = రక్తముచేత పూయబడిన, రాఘవః=రఘువంశసంజాతు డైన, సః రామః = ఆ రాముడు, సంధ్యాభ్రైః = సంధ్యాకాలమేఘములచేత, ఆవృతః = కప్పబడిన, దివాకరః ఇవ = సూర్యుడు వలె, బభూవ = ఉండెను.

తా. ఆయుధముల ప్రహారము తగులుటచేత అన్ని అవయవములందు రక్తము స్రవించుచున్న ఆ రాముడు సంధ్యాకాలమేఘములచే కప్పబడిన సూర్యుడు వలె ప్రకాశించెను. 14

మూ. విషేదుర్దేవగన్ధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః
ఏకం సహస్రైర్బహుభిస్తదా దృష్ట్వా సమావృతమ్. 15

ప్ర. అ. తదా = అప్పుడు, బహుభిః=అనేకములైన, సహస్రైః=సహస్ర ములచేత, సమావృతమ్ = కప్పబడిన, ఏకమ్ = ఏకాకియైన రాముణ్ణి, దృష్ట్వా= చూచి, దేవగన్ధర్వాః=దేవతలు, గంధర్వులు, సిద్ధాశ్చ=సిద్ధులు, పరమర్షయః= గొప్ప ఋషులు, విషేదుః = దిగులు చెందిరి.

తా. ఏకాకిగా ఉన్న రాముణ్ణి ఎన్నో వేలమంది రాక్షసులు చుట్టుముట్టుట చూచి, దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు విషాదము చెందిరి. 15

మూ. తతో రామః సుసంక్రుద్ధో మణ్డలీకృతకార్ముకః,
ససర్జ నిశితాన్ బాణాన్ శతశోఽథ సహస్రశః. 16

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రామః = రాముడు, సుసంక్రుద్ధః = చాల కోపించినవాడై, మణ్డలీకృతకార్ముకః = మండలాకారముగా వంచబడిన ధనస్సు కలవాడై, శతశః = వందలకొలది, అథ = మరియు, సహస్రశః = వేలకొలది, నిశితాన్ = వాడియైన, బాణాన్ = బాణములను, ససర్జ = విడచెను.

తా. పిమ్మట రాముడు చాల కోపించి, ధనస్సును మండలాకారముగా ఉండునట్లు వంచి, వందలకొలది, వేలకొలది, వాడియైన బాణాలను విడచెను. 16

మూ. దురావారాన్ దుర్విషహాన్ కాలదణ్డోపమాన్ రణే,
ముమోచ లీలయా రామః కఙ్కపత్రానజిహ్మగాన్. 17

ప్ర. అ. రామః = రాముడు, రణే = యుద్ధమునందు, దురావారాన్ =

= నివారింప శక్యము కానివి, దుర్విషహాన్ = సహింప శక్యము కానివి, కాల దణ్డోపమాన్ = యమదండముతో సమానమైనవి, అజిహ్మగాన్ = వక్రత్వము లేకుండా పోవునవి అయిన, కఙ్కపత్రాన్ = గ్రద్దరెక్కలు కట్టిన బాణములను, లీలయా = విలాసతో, ముమోచ = విడచెను.

తా. రాముడు, యుద్ధములో నివారింప శక్యము కానివి, సహించుటకు శక్యము కానివి, యమదండముతో సమానములూ, వంకరగా కాక తిన్నగా పోవునవి అయిన బాణాలను అనాయాసముగా ప్రయోగించెను. 17

మూ. తే శరాః శత్రుసైన్యేషు ముక్తా రామేణ లీలయా,
ఆదదూ రక్షసాం ప్రాణాన్ పాశాః కాలకృతా ఇవ. 18

ప్ర. అ. రామేణ = రామునిచేత, లీలయా = అనాయాసముగా, శత్రు సైన్యేషు = శత్రుసైన్యములమీద, ముక్తాః = విడువబడిన, తే శరాః = ఆ బాణములు, కాలకృతాః = యమునిచేత ప్రయోగింపబడిన, పాశాః ఇవ = పాశముల వలె, రక్షసామ్ = రాక్షసులయొక్క, ప్రాణాన్ = ప్రాణములను, ఆదదుః = గ్రహించినవి.

తా. రాముడు అనాయాసముగా శత్రుసైన్యములమీద విడచిన ఆ బాణములు, యముడు ప్రయోగించిన పాశముల వలె, రాక్షసుల ప్రాణములను హరించినవి. 18

మూ. భిత్త్వా రాక్షసదేహాంస్తాంస్తే శరా రుధిరాప్లుతాః,
అన్తరిక్షగతా రేజుర్దీప్తాగ్నిసమతేజసః. 19

ప్ర. అ. తే శరాః = ఆ బాణములు, తాన్ = ఆ, రాక్షసదేహాన్ = రాక్షసుల దేహములను, భిత్త్వా = భేదించి, రుధిరాప్లుతాః = రక్తముచేత పూయబడినవై, అన్తరిక్షగతాః = ఆకాశమును పొందినవై, దీప్తాగ్నిసమతేజసః = ప్రజ్వలించుచున్న అగ్నితో సమానమైన తేజస్సు గలవై, రేజుః = ప్రకాశించినవి.

తా. ఆ బాణములు రాక్షసుల దేహములను భేదించి బైటకు వచ్చి రక్తముచేత పూయబడినవై, ఆకాశమునందు ప్రజ్వలించుచున్న అగ్నితో సమానమైన తేజస్సుతో ప్రకాశించెను. 19

20)

మూ. అసంఖ్యేయాస్తు రామస్య సాయకాశ్చాపమణ్డలాత్,
వినిష్పేతురతీవోగ్రా రక్షఃప్రాణాపహారిణః. 20

ప్ర. అ. రామస్య = రామునియొక్క, చాపమండలాత్ = మండలాకారములో నున్న ధనస్సునుండి, అతీవ = మిక్కిలి, ఉగ్రాః = భయంకరములు, రక్షఃప్రాణాపహారిణః = రాక్షసుల ప్రాణములను అపహరించునవి అయిన, అసంఖ్యేయాః = లెక్కింప శక్యము కాని, సాయకాః = బాణములు, వినిష్పేతుః = బయల్వెడలినవి.

తా. మండలాకారముగా ఉన్న రాముని ధనస్సునుండి చాలా భయంకరములైన బాణములు లెక్కపెట్టుటకు శక్యము కాని సంఖ్యలో బయల్వెడలి, రాక్షసుల ప్రాణములను హరించెను. 20

మూ. తైర్ధనూంషి ధ్వజాగ్రాణి వర్మాణి చ శిరాంసి చ,
బాహూన్ సహస్తాభరణానూరూన్ కరికరోపమాన్. 21
చిచ్ఛేద రామః సమరే శతశోఽథ సహస్రశః.

ప్ర అ. రామః = రాముడు, సమరే = యుద్ధమునందు, తైః = ఆ బాణములచేత, శతశః = వందలకొలది, అథ = మరియు, సహస్రశః = వేలకొలది, ధనూంషి = ధనస్సులను, ధ్వజాగ్రాణి = ధ్వజముల అగ్రభాగములను, వర్మాణి చ = కవచములను, శిరాంసి చ = శిరస్సులను, సహస్తాభరణాన్ = హస్తాభరణములతో కూడిన, బాహూన్ = బాహువులను, కరికరోపమాన్ = ఏనుగ తొండముల వంటి, ఊరూన్ = తొడలను, చిచ్ఛేద = ఛేదించెను.

తా యుద్ధములో రాముడు ఆ బాణములతో, వందలకొలది, వేలకొలది, ధనస్సులను, ధ్వజముల అగ్రములను, కవచములను, శిరస్సులను, ఆభరణములతో కూడిన బాహువులను, ఏనుగ తొండముల వంటి తొడలను ఛేదించెను. 21

మూ. హయాన్ కాఞ్చనసన్నాహాన్ రథయుక్తాన్ ససారథీన్. 22
గజాంశ్చ సగజారోహాన్ సహయాన్ సాదినస్తథా,
పదాతీన్ సమరే హత్వా హ్యనయద్యమసాదనమ్. 23

ప్ర. అ. కాఞ్చనసంనాహాన్ = బంగారు అలంకారములు గల, రథయుక్తాన్ = రథమునకు కూర్చబడిన, ససారథీన్ = సారథులతో కూడిన, హయాన్ = గుఱ్ఱములను, సగజారోహాన్ = గజముల నెక్కిన పురుషులతో కూడిన, గజాంశ్చ = ఏనుగులను, తథా = మరియు, సహయాన్ = గుఱ్ఱములతో కూడిన, సాదినః = గుఱ్ఱములపై నున్న భటులను, పదాతీన్ = కాలిబంట్లను, సమరే = యుద్ధమునందు, హత్వా = చంపి, యమసాదనమ్ = యముని గృహమును, అనయత్ = పొందించెను.

తా. రాము డా యుద్ధములో బంగారు అలంకారములు గల, రథములకు కట్టిన అశ్వములను, రథసారథులను, గజములను, గజముల నెక్కిన యోధులను, గుఱ్ఱములను, వాటిపై ఎక్కిన యోధులను, కాలిబంట్లను చంపి యమలోకమునకు పంపెను. 22, 23

మూ. తతో నాళీకనారాచైస్తీక్ష్ణాగ్రైశ్చ వికర్ణిభిః,
భీమమార్తస్వరం చక్రుర్భిద్యమానా నిశాచరాః. 24

ప్ర. అ. తతః = అటు పిమ్మట, నాళీకనారాచైః = గొట్టముల వంటి బాణములచేతను, ఇనుపబాణములచేతను, తీక్ష్ణాగ్రైః = తీక్ష్ణమైన అగ్రభాగములు గల, వికర్ణిభిః = చివర వంపులు గల బాణములచేతను, భిద్యమానాః = భేదింపబడుచున్నవారై, నిశాచరాః = రాక్షసులు, భీమమ్ = భయంకరముగా, ఆర్తస్వరమ్ = దీనమైన స్వరమును, చక్రుః = చేసిరి.

తా. పిమ్మట ఆ రాక్షసులు నాళీకబాణములచేతను, నారాచములచేతను, తీక్ష్ణమైన అగ్రభాగములు గల వికర్ణిబాణములచేతను భేదింపబడుచున్నవారై, భయము కలుగు నట్లుగాను, దీనముగాను అరచిరి. 24

మూ. తత్సైన్యం నిశితైర్బాణైరర్దితం మర్మభేదిభిః,
రామేణ న సుఖం లేభే శుష్కం వనమివాగ్నినా. 25

ప్ర. అ. రామేణ = రామునిచేత, మర్మభేదిభిః = మర్మస్థానములను భేదించు, నిశితైః = వాడియైన, బాణైః = బాణములచేత, అర్దితమ్ = పీడింపబడిన,

తత్ సైన్యమ్ = ఆ సైన్యము, శుష్కమ్ = ఎండిపోయిన, వనమ్ = వనము, అగ్నినా ఇవ = అగ్ని చేత కాల్చబడి వలె, సుఖమ్ = సుఖమును, న లేభే = పొందలేదు.

తా. రాము డా విధముగ మర్మస్థానములను భేదించు బాణములతో పీడించగా ఆ సైన్యము, అగ్నిచేత కాల్చబడిన ఎండిపోయిన వనము వలె సుఖమును పొందలేదు. 25

మూ. కేచిద్భీమబలాః శూరాః శూలాన్ ఖడ్గాన్పరశ్వథాన్,
రామస్యాభిముఖం గత్వా చిక్షిపుః పరమాయుధాన్. 26

ప్ర. అ. భీమబలాః = భయంకరమైన బలము గల, కేచిత్ = కొందరు, శూరాః = శూరులు, రామస్య = రామునకు, అభిముఖమ్ = ఎదురుగా, గత్వా = వెళ్ళి, పరమాయుధాన్ = శ్రేష్ఠములైన ఆయుధములైన, శూలాన్ = శూలములను, ఖడ్గాన్ = ఖడ్గములను, పరశ్వథాన్ = గండ్రగొడ్డళ్లను, చిక్షిపుః = విసిరిరి.

తా. భయంకరమైన బలము గల కొందరు శూరులు, రామునకు ఎదురుగా వెళ్ళి, ఉత్తమాయుధములైన శూలములను, ఖడ్గములను, గండ్రగొడ్డళ్లను రాముని పై విసిరిరి. 26

మూ. తేషాం బాణైర్మహాబాహుః శస్త్రాణ్యావార్య రాఘవః,
జహార సమరే ప్రాణాంశ్చిచ్ఛేద చ శిరోధరాన్. 27

ప్ర. అ. మహాబాహుః = గొప్ప బాహువులుగల, రాఘవః = రాముడు, సమరే = యుద్ధమునందు, బాణైః = బాణములచేత, తేషామ్ = వాళ్లయొక్క, శస్త్రాణి = ఆయుధములను, ఆవార్య = నివారించి, ప్రాణాన్ = ప్రాణములను, జహార = హరించెను. శిరోధరాన్ = కంఠములను, చిచ్ఛేద = ఛేదించెను.

తా, మహాబాహువైన రాముడు బాణములచేత వాళ్ళు ప్రయోగించిన ఆయుధాలను నివారించి, యుద్ధములో వాళ్ళ కంఠములను ఖండించి, ప్రాణము లను హరించెను. 27

మూ. తే ఛిన్నశిరసః పేతుశ్ఛిన్నవర్మశరాసనాః,
సుపర్ణవాతవిక్షిప్తా జగత్యాం పాదపా యథా. 28

ప్ర. అ. తే = ఆ రాక్షసులు, ఛిన్నశిరసః = ఛేదింపబడిన శిరస్సులు కలవారై, ఛిన్నవర్మశరాసనాః = ఛేదింపబడిన కవచములు ధనస్సులు కలవారై, సుపర్ణవాతవిక్షిప్తాః = గరుత్మంతుని వాయువుచేత చిమ్మివేయబడిన, పాదపాః యథా = వృక్షములు వలె, జగత్యామ్ = భూమిపై, పేతుః = పడిరి.

తా. శిరస్సు తెగిపోయి, కవచములు, ధనస్సులు ముక్కముక్కలై పోగా ఆ రాక్షసులు గరుత్మంతుని వేగమువలన కలిగిన గాలిచే కదల్చివేయబడిన వృక్షముల వలె నేలమీద పడిపోయిరి. 28

మూ. అవశిష్టాశ్చ యే తత్ర విషణ్ణాశ్చ నిశాచరాః,
ఖరమేవాభ్యధావన్త శరణార్థం శరార్దితాః. 29

ప్ర. అ. తత్ర = అక్కడ, అవశిష్టాః = మిగిలిన, యే = ఏ, నిశాచరాః = రాక్షసులు కలరో వారు, శరార్దితాః = బాణములచేత పీడితులై, విషణ్ణాశ్చ = దిగులు చెందినవారై, ఖరమేవ = ఖరుణ్ణి గూర్చియే, శరణార్థమ్ = రక్షణము కొరకు, అభ్యధావన్త = పరుగెత్తిరి.

తా. అక్కడ మిగిలిన రాక్షసులు బాణముల దెబ్బలకు తట్టుకొనజాలక, దిగులు చెంది, రక్షింపు మని వేడుచు ఖరుని దగ్గరకు వెళ్ళిరి. 29

మూ. తాన్ సర్వాన్ పునరాదాయ సమాశ్వాస్య చ దూషణః,
అభ్యధావత కాకుత్థ్సం క్రుద్ధో రుద్రమివాన్తకః. 30

ప్ర. అ. దూషణః = దూషణుడు, తాన్ సర్వాన్ = వాళ్ళ నందరిని, సమాశ్వాస్య = ఓదార్చి, పునః = మరల, ఆదాయ = తీసికొని, క్రుద్ధః = కోపించినవాడై, అన్తకః = యముడు, రుద్రమివ = రుద్రుణ్ణి వలె, కాకుత్థ్సమ్ = రాముణ్ణి గూర్చి, అభ్యధావత = పరుగెత్తెను.

తా. దూషణుడు ఆ రాక్షసుల నందరిని ఓదార్చి, తన వెంటబెట్టుకొని, యముడు రుద్రునిమీదకు వెళ్ళినట్లు, కోపముతో రామునిమీదికి వెళ్ళెను. 30

మూ. నివృత్తాస్తు పునః సర్వే దూషణాశ్రయసంశ్రితాః,
రామమేవాభ్యధావన్త సాలతాలశిలాయుధాః. 31

ప్ర. అ. సర్వే = ఆ రాక్షసు లందరూ, దూషణాశ్రయసంశ్రయాః = దూషణుని ఆశ్రయమును పొందినవారై, పునః = మరల, నివృత్తాః = మరలిన వారై, సాలతాలశిలాయుధాః = మద్దిచెట్లు, తాటిచెట్లు, శిలలు ఆయుధములుగా గలవారై, రామమేవ = రాముణ్ణి గూర్చియే, అభ్యధావన్త = పరుగెత్తిరి.

తా. ఆ రాక్షసు లందరూ దూషణుని ఆశ్రయించి, మద్దిచెట్లు, తాటిచెట్లు శిలలు ఆయుధములుగా ధరించి రామునిమీదికి వెళ్ళిరి. 31

మూ. శూలముద్గరహస్తాశ్చ చాపహస్తా మహాబలాః,
సృజన్తః శరవర్షాణి శస్త్రవర్షాణి సంయుగే, 32
ద్రుమవర్షాణి ముఞ్చన్తః శిలావర్షాణి రాక్షసాః.

ప్ర. అ. శూలముద్గరహస్తాశ్చ=శూలములు, ముద్గరములు హస్తములందు కలవారు, చాపహస్తాః = ధనస్సులు హస్తములందు కలవారు, మహాబలాః=గొప్ప బలము గలవారు అయిన, రాక్షసాః = రాక్షసులు, సంయుగే = యుద్ధమునందు, శరవర్షాణి = బాణవర్షములను, శస్త్రవర్షాణి=ఆయుధముల వర్షములను, సృజన్తః =సృష్టించుచు, ద్రుమవర్షాణి = వృక్షముల వర్షములను, శిలావర్షాణి=శిలల వర్షములను, ముఞ్చన్తః = విడచుచు (యుద్ధము చేసిరి).

తా. గొప్ప బలము గల ఆ రాక్షసులు హస్తములలో శూలములు, ముద్గరములు, ధనస్సులు ధరించి, బాణవర్షము, ఆయుధముల వర్షము, వృక్షముల వర్షము, శిలల వర్షము కుపిరించుచు యుద్ధము చేసిరి. 32

మూ. తద్బభూవాద్భుతం యుద్ధం తుములం రోమహర్షణమ్, 33
రామస్య చ మహాఘోరం పునస్తేషాం చ రక్షసామ్.

ప్ర. అ. పునః = మరల, రామస్య = రామునకు, తేషాం రక్షసాం చ = ఆ రాక్షసులకు, తుములమ్ = వ్యాకులము, అద్భుతమ్ = ఆశ్చర్యకరము, రోమ

హర్షణమ్ = రోమాంచము కలిగించునది, మహాఘోరమ్ = చాల భయంకరము, అయిన, తత్ యుద్ధమ్ = ఆ యుద్ధము, బభూవ = ఆయెను.

తా. రామునకు, రాక్షసులకు మధ్య మరల మహాఘోరమైన యుద్ధము జరిగెను. వ్యాకులముగా జరిగిన ఆ యుద్ధము, ఆశ్చర్యకరముగాను, రోమాంచము కలిగించేదిగాను ఉండెను. 33

మూ. తే సమన్తాదభిక్రుద్ధా రాఘవం పునరభ్యయుః, 34
తైశ్చ సర్వా దిశో దృష్ట్వా ప్రదిశశ్చ సమావృతాః,
రాక్షసైరుద్యతప్రాసైః శరవర్షాభివర్షిభిః, 35
స కృత్వా భైరవం నాదమస్త్రం పరమభాస్వరమ్,
సంయోజయత గాన్ధర్వం రాక్షసేషు మహాబలః. 36

ప్ర. అ. తే = ఆ రాక్షసులు, అభిక్రుద్ధాః = కోపించినవారై, పునః = మరల, రాఘవమ్ = రాముణ్ణి, సమన్తాత్ = నలుమూలల, అభ్యయుః = చేరిరి. మహాబలః = గొప్ప బలము గల, సః = ఆ రాముడు, ఉద్యతప్రాసైః = ఎత్తబడిన ప్రాసలు కలవారు, శరవర్షాభివర్షిభిః = బాణవర్షమును వర్షించుచున్నవారు అయిన, తైః = ఆ రాక్షసులచేత, సర్వాః = సమస్తమైన, దిశః = దిక్కులను, ప్రదిశశ్చ = విదిక్కులను, సమావృతాః = కప్పబడినవాటినిగా, దృష్ట్వా = చూచి, భైరవమ్ = భయంకరమైన, నాదమ్ = ధ్వనిని, కృత్వా = చేసి, రాక్షసేషు = ఆ రాక్షసులయందు, పరమభాస్వరమ్ = మిక్కిలి ప్రకాశించుచున్న, గాన్ధర్వమ్ అస్త్రమ్ = గాంధర్వాస్త్రమును, సంయోజయత = ప్రయోగించెను.

తా. ఆ రాక్షసు లందరు చాల కోపముతో మరల రాముణ్ణి చుట్టుముట్టిరి. మహాబలశాలియైన ఆ రాముడు, ఆ రాక్షసు లందరు ప్రాసలను ధరించి, బాణ వర్షము కురిపించుచు దిక్కులను, విదిక్కులను పూర్తిగా కప్పివేసి ఉండుట చూచి, భయంకరముగ సింహనాదము చేసి, మిక్కిలి ప్రకాశించుచున్న గాంధ ర్వాస్త్రమును ఆ రాక్షసులపై ప్రయోగించెను. 34, 35, 36

మూ. తతః శరసహస్రాణి నిర్యయుశ్చాపమణ్డలాత్,
సర్వా దశ దిశో బాణైరావార్యన్త సమాగతైః. 37

ప్ర. అ. తతః = అటు పిమ్మట, చాపమణ్డలాత్ = ధనుర్మండలమునుండి, శరసహస్రాణి = వేలకొలది బాణములు, నిర్యయుః = బయలువెడలినవి. సమాగతైః = వచ్చిన, బాణైః = బాణములచేత, సర్వాః = సమస్తమైన, దశ = పది, దిశః = దిక్కులు, ఆవార్యన్త = కప్పబడినవి.

తా. అప్పుడు మండలాకారములో ఉన్న ధనస్సునుండి వేలకొలది బాణములు బయల్వెడలినవి. ఆ విధముగ బయలువెడలిన బాణములచేత, పది దిక్కులు కప్పివేయబడెను. 37

మూ. నాదదానం శరాన్ ఘోరాన్ న ముఞ్చన్తం శిలీముఖాన్,
వికర్షమాణం పశ్యన్తి రాక్షసాస్తే శరార్దితాః. 38

ప్ర. అ. శరార్దితాః = బాణములచేత పీడింపబడిన, తే రాక్షసాః = ఆ రాక్షసులు, ఘోరాన్ = భయంకరములైన, శరాన్ = శరములను, ఆదదానమ్ = గ్రహించువానిని, న పశ్యన్తి = చూడలేదు. శిలీముఖాన్ = బాణములను, ముఞ్చన్తమ్ = విడచుచున్నవానిని, న = చూడలేదు. వికర్షమాణమ్ = లాగుచున్న వానిని, చూడలేదు.

తా. బాణములచేత పీడితులైన ఆ రాక్షసులకు రాముడు బాణములు పైకి తీయుటగాని, వాటిని విడచుట గాని, ధనస్సు లాగుట గాని కనబడలేదు. 38

మూ. శరాన్ధకారమాకాశమావృణోత్సదివాకరమ్,
బభూవావస్థితో రామః ప్రవమన్నివ తాన్ శరాన్. 39

ప్ర. అ. శరాన్ధకారమ్ = బాణముల అంధకారము, సదివాకరమ్ = సూర్యునితో కూడిన, ఆకాశమ్ = ఆకాశమును, అవృణోత్ = ఆవరించెను. రామః = రాముడు, తాన్ = ఆ, శరాన్ = బాణములను, ప్రవమన్నివ = కక్కుచున్నాడా అన్నట్లు, అవస్థితః బభూవ = నిలచి ఉండెను.

తా. బాణాలవలన ఏర్పడిన చీకటి సూర్యునితో సహా ఆకాశమును కప్పివేసెను. రాముడు ఆ బాణములను తన నోటినుండి విడచుచున్నాడా అన్నట్లు నిలచి ఉండెను. 39

మూ. యుగపత్పతమానైశ్చ యుగపచ్చ హతైర్భృశమ్,
యుగపత్పతితైశ్చైవ వికీర్ణా వసుధా భవత్. 40

ప్ర. అ. వసుధా = భూమి, యుగపత్ = ఒక్కమారుగా, పతమానైశ్చ = పడుచున్న రాక్షసులచేతను, యుగపత్ = ఒక్కమారుగా, హతైశ్చ = చంపబడినవారిచేతను, యుగపత్ = ఒక్కమారుగా, పతితైశ్చైవ = పడినవారిచేతను, భృశమ్ = మిక్కిలి, వికీర్ణా = వ్యాప్తము, అభవత్ = ఆయెను.

తా. గుంపులు గుంపులుగా పడుచున్న రాక్షసులచేతను, గుంపులు గుంపులుగా చంపబడిన రాక్షసులచేతను, గుంపులు గుంపులుగా పడి ఉన్న రాక్షసులచేతను భూమి కప్పబడి ఉండెను. 40

మూ. నిహతాః పతితాః క్షీణాశ్ఛిన్నా భిన్నా విదారితాః,
తత్ర తత్ర స్మ దృశ్యన్తే రాక్షసాస్తే సహస్రశః. 41

ప్ర. అ. తే రాక్షసాః = ఆ రాక్షసులు, తత్ర తత్ర = అక్కడక్కడ, సహస్రశః = వేల కొలది, నిహతాః = చంపబడినవారై, పతితాః = పడిపోయినవారై, క్షీణాః = క్షీణించినవారై, ఛిన్నాః = చేదింపబడినవారై, భిన్నాః = బ్రద్దలుకొట్టబడినవారై, విదారితాః = చీల్చివేయబడినవారై, దృశ్యన్తే స్మ = కనబడిరి.

తా. అక్కడక్కడ రాక్షసులు వేల సంఖ్యలో చచ్చి పడి ఉండిరి. కొందరు అవయవములు తెగి ఉండిరి. కొందరు నరకబడి, కొందరు బ్రద్దలు కొట్టబడి, మరికొందరు చీల్చబడి పడి ఉండిరి. 41

మూ. సోష్ణీషైరుత్తమాఙ్గైశ్చ సాఙ్గదైర్బాహుభిస్తథా,
ఊరుభిర్జానుభిశ్ఛిన్నైర్నానారూపవిభూషణైః. 42

హయైశ్చ ద్విపముఖ్యైశ్చ రథైర్భిన్నైరనేకశః,
చామరైర్వ్యజనైశ్ఛత్రైర్ధ్వజైర్నానావిధైరపి. 43

రామస్య బాణాభిహతైర్విచిత్రైః శూలపట్టిసైః,
ఖడ్గైః ఖణ్డీకృతైః ప్రాసైర్వికీర్ణైశ్చ పరశ్వథైః. 44

చూర్ణితాభిః శిలాభిశ్చ శరైశ్చిత్రైరనేకశః,
విచ్ఛిన్నైః సమరే భూమిర్వికీర్ణాఽభూద్భయఙ్కరా. 45

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
పఞ్చవింశః సర్గః.

ప్ర. అ. సమరే = యుద్ధమునందు, సోష్ణీషైః = తలపాగలతో కూడిన, ఉత్తమాఙ్గైశ్చ = శిరస్సులతోను, తథా = మరియు, సాఙ్గదైః = బాహుపురులతో కూడిన, బాహుభిః = బాహువులతోను, ఛిన్నైః = తెగగొట్టబడిన, ఊరుభిః = తొడలతోను, జానుభిః = మోకాళ్లతోను, నానారూపవిభూషణైః = అనేకవిధములైన రూపములు గల అలంకారములతోను, అనేకశః = అనేకమైన, హయైశ్చ = గుఱ్ఱములతోను, ద్విపముఖ్యైశ్చ = ఉత్తమములైన ఏనుగులతోను, భిన్నైః = బ్రద్దలుకొట్టబడిన, రథైః = రథములతోను, చామరైః = చమరీమృగములకు సంబంధించిన, వ్యజనైః = వింజామరలతోను, ఛత్రైః = ఛత్రములతోను, నానావిధైః = అనేకవిధములైన, ధ్వజైః = ధ్వజములతోను, రామస్య = రాముని యొక్క, బాణాభిహతైః = బాణములచేత కొట్టబడిన, విచిత్రైః=విచిత్రములైన, శూలపట్టిసైః = శూలములతోను, పట్టిసములతోను, ఖణ్డీకృతైః = ముక్కలు చేయబడిన, ఖడ్గైః = ఖడ్గములతోను, ప్రాసైః = ప్రాసలతోను, వికీర్ణైః = చెల్లాచెదరై ఉన్న, పరశ్వథైః = గండ్రగొడ్డళ్లతోను, చూర్ణితాభిః = చూర్ణము చేయబడిన, శిలాభిశ్చ = శిలలతోను, అనేకశః = అనేకవిధములుగ, విచ్ఛిన్నైః = తెగగొట్టబడిన, శరైః = బాణములతోను, వికీర్ణా = వ్యాప్తమై యున్న, భూమిః = భూమి, భయంకరా = భయంకరముగా, అభూత్ = ఉండెను.

తా. రాముని బాణములచేత ఛేదింపబడిన తలపాగలతో కూడిన తలలు, బాహుపురులతో కూడిన బాహువులు, తొడలు, మోకాళ్లు, అనేక ఆకారములలో ఉన్న అలంకారములు, అనేక అశ్వములు, ఉత్తమగజములు, రథములు, చామరములు, ఛత్రములు, అనేకవిధములైన ధ్వజములు, విచిత్రములైన శూల

ములు, పట్టిసములు, ఖడ్గములు, ప్రాసలు, గండ్రగొడ్డళ్ల, చూర్ణమైపోయిన శిలలు, చిత్రములైన శరములు అంతటా పడి ఉండుటచే ఆ యుద్ధభూమి చాల భయంకరముగా ఉండెను. 42-45

'బాలానందిని''అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో ఇరువదియైదవ సర్గ సమాప్తము.

అథ షడ్వింశః సర్గః

[*రాముడు దూషణసహితులైన పదునాలుగువేలమంది రాక్షసులను చంపుట*].

మూ. దూషణస్తు స్వకం సైన్యం హన్యమానం నిరీక్ష్య సః,
సందిదేశ మహాబాహుర్భీమవేగాన్నిశాచరాన్, 1
రాక్షసాన్ పఞ్చసాహస్రాన్ సమరేష్వనివర్తినః.

ప్ర. అ. సః = ఆ, మహాబాహుః = గొప్ప బాహువులు గల, దూషణః = దూషణుడు, హన్యమానమ్ = చంపబడుచున్న, స్వకమ్ = తన సంబంధమైన, సైన్యమ్ = సైన్యమును, నిరీక్ష్య = చూచి, భీమవేగాన్ = భయంకరమైన వేగము గల వాళ్ళు, నిశాచరాన్ = రాత్రులందు సంచరించేవాళ్లు, సమరేషు = యుద్ధములందు, అనివర్తినః = వెనుకకు తిరగనివాళ్ళు అయిన, పఞ్చ సాహస్రాన్ = ఐదువేలమంది, రాక్షసాన్ = రాక్షసులను, సందిదేశ = ఆజ్ఞాపించిపంపెను.

తా. మహాబాహువైన ఆ దూషణుడు తన సైన్యము అంతా సంహరింపబడుట చూచి, భయంకరమైన వేగము కలవాళ్ళు, యుద్ధములో వెనుకకు మరలని వాళ్లు అయిన ఐదువేలమంది రాక్షసులను, రామునితో యుద్ధముచేయు దని ఆజ్ఞాపించెను. 1

మూ. తే శూలైః పట్టిసైః ఖడ్గైః శిలావర్షైర్ద్రుమైరపి, 2
శరవర్షైరవిచ్ఛిన్నం వవర్షుస్తం సమన్తతః.

ప్ర. అ. తే = ఆ రాక్షసులు, శూలైః = శూలముల చేతను, పట్టిసైః = పట్టిసములచేతను, ఖడ్గైః = ఖడ్గములచేతను, శిలావర్షైః = శిలావర్షములచేతను, ద్రుమైరపి = వృక్షములచేతను, శరవర్షైః = బాణవర్షములచేతను, అవిచ్ఛిన్నమ్ =

ఎడతెరిపి లేకుండా, సమన్తతః = నలు వైపుల, తమ్ = ఆ రాముణ్ణి, వవర్షుః = వర్షించిరి.

తా. ఆ రాక్షసు లందరు రాముణ్ణి చుట్టుముట్టి ఆతనిపై శూలములు, పట్టిసములు, ఖడ్గములు, శిలలు, వృక్షములు, బాణములు, అవిచ్ఛిన్నముగా కురిపించిరి. 2

మూ. స ద్రుమాణాం శిలానాం చ వర్షం ప్రాణహరం మహత్,
ప్రతిజగ్రాహ ధర్మాత్మా రాఘవస్తీక్ష్ణసాయకైః.

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, సః రాఘవః = ఆ రాముడు, ప్రాణహరమ్ = ప్రాణములను హరించే, మహత్ = గొప్పదైన, ద్రుమాణామ్ = వృక్షములయొక్క, శిలానాం చ = శిలలయొక్క, వర్షమ్ = వర్షమును, తీక్ష్ణసాయకైః = తీక్ష్ణములైన బాణములతో, ప్రతిజగ్రాహ = ఎదుర్కొని స్వీకరించెను.

తా. ధర్మాత్ముడైన ఆ రాముడు, ప్రాణములను హరించే గొప్పదైన ఆ వృక్షవర్షమును, శిలావర్షమును తీక్ష్ణములైన బాణములతో ఎదుర్కొనెను. 3

మూ. ప్రతిగృహ్య చ తద్వర్షం నిమీలిత ఇవర్షభః, 4
రామః క్రోధం పరం లేభే వధార్థం సర్వరక్షసామ్.

ప్ర. అ. రామః = రాముడు, నిమీలితః = కళ్ళుమూసుకొన్న, ఋషభః ఇవ = వృషభము వలె, తత్ = ఆ, వర్షమ్ = శస్త్రవర్షమును, ప్రతిగృహ్య = స్వీకరించి, సర్వరక్షసామ్ = సమస్తరాక్షసులయొక్క, వధార్థమ్ = వధకొరకు, పరమ్ = అధికమైన, క్రోధమ్ = క్రోధమును, లేభే = పొందెను. 4

తా. వృషభము వాన కురియుచున్నప్పుడు కళ్ళు మూసికొని దానిని స్వీకరించినట్లు, రాముడు ఆ ఆయుధవర్షమును స్వీకరించి ఆ సమస్తరాక్షసుల సంహారము నిమిత్తము గొప్ప క్రోధమును కనబర్చెను. 4

మూ. తతః క్రోధసమావిష్టః ప్రదీప్త ఇవ తేజసా, 5
శరైరవాకిరత్సైన్యం సర్వతః సహదూషణమ్.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, క్రోధసమావిష్టః=క్రోధముచేత ఆవిష్టుడై, తేజసా = తేజస్సుతో, ప్రదీప్త ఇవ = మండుచున్నవాడు వలె, సహదూషణమ్= దూషణునితో కూడిన, సైన్యమ్ = సైన్యమును, సర్వతః = అన్ని వైపులందు, శరైః = బాణములతో, అవాకిరత్ = వర్షించెను.

తా. పిమ్మట రాముడు క్రోధావేశముతో నిండి, తేజస్సుతో మండుచున్నట్లు కనబడుచు, ఆ దూషణుణ్ణి, ఆతని సైన్యమును నలువైపుల, బాణములతో నింపెను. 5

మూ. తతః సేనాపతిః క్రుద్ధో దూషణః శత్రుదూషణః, 6
శరైరశనికల్పైస్తం రాఘవం సమవాకిరత్.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, సేనాపతిః = సేనాపతీ, శత్రుదూషణః = శత్రువులను హింసించువాడు అయిన, దూషణః = దూషణుడు, క్రుద్ధః = కోపించినవాడై, అశనికల్పైః = వజ్రములతో సమానములైన, శరైః = బాణములతో, తం రాఘవమ్ = ఆ రాముణ్ణి, సమవాకిరత్ = చల్లి కప్పివేసెను.

తా. అపుడు, సేనాపతి, శత్రువులను హింసించువాడు అయిన దూషణుడు, క్రుద్ధుడై, వజ్రాయుధములవంటి బాణములతో ఆ రాముణ్ణి కప్పివేసెను. 6

మూ. తతో రామః సుసంక్రుద్ధః క్షురేణాస్య మహద్ధనుః, 7
చిచ్ఛేద సమరే వీరశ్చతుర్భిశ్చతురో హయాన్.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, సుసంక్రుద్ధః=చాల కోపించిన, సమరే = యుద్ధమునందు, వీరః = వీరుడైన, రామః = రాముడు, క్షురేణ = అర్ధచంద్ర బాణముచేత, అస్య = ఈ దూషణునియొక్క, మహత్ = గొప్పదైన, ధనుః = ధనస్సును, చతుర్భిః = నాలుగు బాణములచేత, చతురః = నాలుగు, హయాన్= గుఱ్ఱములను, చిచ్ఛేద = ఛేదించెను.

తా. అప్పుడు యుద్ధములో మహావీరుడైన రాముడు చాల కోపించి, అర్ధ చంద్రబాణముతో ఆ దూషణుని గొప్ప ధనస్సును ఛేదించి నాలుగు బాణములతో నాలుగు గుఱ్ఱములను చంపెను. 7

మూ. హత్వా చాశ్వాన్ శరై స్తీక్ష్ణైరర్ధచన్ద్రేణ సారథేః, 8
శిరో జహార తద్రక్షస్త్రిభిర్వివ్యాధ వక్షసి.

ప్ర. అ. తీక్ష్ణైః = తీక్ష్ణములైన, శరైః = బాణములచేత, అశ్వాన్ = గుఱ్ఱములను, హత్వా = చంపి, అర్ధచన్ద్రేణ = అర్ధచంద్రబాణముచేత, సారథేః = సారథియొక్క, శిరః = శిరస్సును, జహార = హరించెను. త్రిభిః = మూడు బాణములచేత, తత్ = ఆ, రక్షః = రాక్షసుని, వక్షసి = వక్షఃస్థలమునందు, వివ్యాధ = కొట్టెను.

తా. తీక్ష్ణములైన శరములచేత అశ్వములను చంపి, అర్ధచంద్రబాణము చేత సారథి శిరస్సు ఛేదించి, మూడు బాణములతో ఆ దూషణుని కొట్టెను. 8

మూ. స చ్ఛిన్నధన్వా విరథో హతాశ్వో హతసారథిః, 9
జగ్రాహ గిరిశృఙ్గాభం పరిఘం రోమహర్షణమ్,
వేష్టితం కాఞ్చనైః పట్టైర్దేవసైన్యప్రమర్దనమ్, 10

ఆయసైః శఙ్కుభిస్తీక్ష్ణైః కీర్ణం పరవసోక్షితమ్,
వజ్రాశనిసమస్పర్శం పరగోపురదారణమ్. 11

ప్ర. అ. ఛిన్నధన్వా = ఛేదింపబడిన ధనస్సు కలవాడు, విరథః = రథము లేనివాడు, హతాశ్వః = చంపబడిన అశ్వములు గలవాడు, హతసారథిః = చంపబడిన సారథి కలవాడు అయిన, సః = ఆ దూషణుడు, గిరిశృఙ్గాభమ్ = పర్వతశిఖరము వంటి కాంతి గలది, రోమహర్షణమ్ = రోమాంచమును కలిగించునది, కాఞ్చనైః = బంగారువికారమైన, పట్టైః = పట్టీలతో, వేష్టితమ్ = చుట్టబడినది, దేవసైన్యప్రమర్దనమ్ = దేవతలసైన్యమును మర్దించునది, తీక్ష్ణైః = తీక్ష్ణములైన, ఆయసైః = బంగారు వికారమైన, శఙ్కుభిః = మేకులతో, కీర్ణమ్ = వ్యాప్తమైనది, పరవసోక్షితమ్ = శత్రువుల వసచేత తడుపబడినది, వజ్రాశనిసమస్పర్శమ్ = వజ్రముతోను, పిడుగుతోను సమానమైన స్పర్శ గలది, పరగోపురదారణమ్ = శత్రువుల గోపురములను బద్దలుగొట్టినది అయిన, పరిఘమ్ = పరిఘను, జగ్రాహ = గ్రహించెను.

తా. ఈ విధముగ ఆ దూషణుని ధనస్సు విరిగిపోయెను. అశ్వములను, సారథిని రాముడు చంపివేయుటచే రథము లేకుండా పోయెను. అప్పు డా దూషణుడు రామునిపై ప్రయోగించుటకై, పర్వతశిఖరము వంటి చాల భయంకరమైన పరిఘను గ్రహించెను. దాని చుట్టూ బంగారు పట్టీలు, అంతటా ఇనుప మేకులు ఉండెను. దేవతల సైన్యమును కూడ అనేకపర్యాయములు మర్దించిన ఆ పరిఘకు శత్రువుల వస దట్టముగా అంటి ఉండెను. వజ్రముతోను, పిడుగుతోను సమానమైన స్పర్శ గల ఆ పరిఘ పూర్వము శత్రువుల గోపురములను బ్రద్దలు కొట్టెను. 9, 10, 11

మూ. తం మహోరగసంకాశం ప్రగృహ్య పరిఘం రణే,
దూషణోఽభ్యద్రవద్రామం క్రూరకర్మా నిశాచరః. 12

ప్ర. అ. క్రూరకర్మా = క్రూరమైన కర్మలు చేయు, నిశాచరః = రాక్షసుడైన, దూషణః = దూషణుడు, రణే = యుద్ధమునందు, మహోరగసంకాశమ్ = మహాసర్పముతో సమానమైన, తం పరిఘమ్ = ఆ పరిఘను, ప్రగృహ్య = గ్రహించి, రామమ్ = రాముణ్ణి గూర్చి, అభ్యద్రవత్ = పరుగెత్తెను.

తా. క్రూరమైన పనులు చేయు ఆ రాక్షసుడు, దూషణుడు, యుద్ధములో మహాసర్పము వలె ఉన్న ఆ పరిఘను తీసికొని రామునిమీదకు దుమికెను. 12

మూ. తస్యాభిపతమానస్య దూషణస్య స రాఘవః,
ద్వాభ్యాం శరాభ్యాం చిచ్ఛేద సహస్తాభరణౌ భుజౌ. 13

ప్ర. అ. సః రాఘవః = ఆ రాముడు, అభిపతమానస్య = మీదికి వచ్చుచున్న, తస్య దూషణస్య = ఆ దూషణునియొక్క, సహస్తాభరణౌ = హస్తాభరణములతో కూడిన, భుజౌ = భుజములను, ద్వాభ్యామ్ = రెండు, శరాభ్యామ్ = బాణములచేత, చిచ్ఛేద = ఛేదించెను.

తా. రాముడు తన మీదికి వచ్చుచున్న ఆ దూషణుని హస్తాలంకారసహితములైన రెండు భుజములను, రెండు బాణములతో ఛేదించెను. 13

మూ. భ్రష్టస్తస్య మహాకాయః పపాత రణమూర్ధని,
పరిఘశ్ఛిన్నహస్తస్య శక్రధ్వజ ఇవాగ్రతః. 14

ప్ర. అ. రణమూర్ధని = యుద్ధరంగము అగ్రభాగమునందు, ఛిన్న హస్తస్య = ఛేదించబడిన హస్తములు గల, తస్య = ఆ దూషణునియొక్క, మహాకాయః = పెద్ద ఆకారము గల, పరిఘః = పరిఘ, భ్రష్టః=జారినదై, శక్రధ్వజః ఇవ = ఇంద్రధ్వజము వలె, అగ్రతః = వాని ముందట, పపాత = పడెను.

తా. రణాగ్రమునందు ఆ దూషణుని హస్తములు ఛేదించివేయగానే పెద్ద ఆకారము గల ఆ పరిఘ క్రిందికి జారి, ఇంద్రధ్వజము వలె ఆతని ఎదుట పడెను. 14

మూ. స కరాభ్యాం వికీర్ణాభ్యాం పపాత భువి దూషణః,
విషాణాభ్యాం విశీర్ణాభ్యాం మనస్వీవ మహాగజః. 15

ప్ర. అ. సః దూషణః = ఆ దూషణుడు, వికీర్ణాభ్యామ్ = నేలపై విసిరివేయబడిన, కరాభ్యామ్ = చేతులతో, విశీర్ణాభ్యామ్=విరిగిపోయిన, విషాణాభ్యామ్ = దంతములతో, మనస్వీ = కోపము గల, మహాగజః ఇవ = గొప్ప ఏనుగ వలె, భువి = నేలమీద, పపాత = పడెను.

తా. చేతులు రెండూ నేలపై విసరివేయబడగా, ఆ దూషణుడు, దంతములు విరిగిపోయిన, మంచి పౌరుషము గల మహాగజము వలె నేలపై పడిపోయెను. 15

మూ. తం దృష్ట్వా పతితం భూమౌ దూషణం నిహతం రణే,
సాధుసాధ్వితి కాకుత్థ్సం సర్వభూతాన్యపూజయన్. 16

ప్ర. అ. రణే = యుద్ధమునందు, నిహతమ్ = చంపబడి, భూమౌ = నేలపై, పతితమ్ = పడిన, తం దూషణమ్ = ఆ దూషణుణ్ణి, దృష్ట్వా = చూచి, సర్వభూతాని = సకలప్రాణులు, కాకుత్థ్సమ్ = రాముణ్ణి, సాధు సాధు ఇతి = బాగు బాగు అని, అపూజయన్ = పూజించినవి.

తా. యుద్ధములో నిహతుడై నేలపై పడిపోయిన ఆ దూషణుణ్ణి చూచి, సకలభూతములు కూడ "బాగు! బాగు!"అని రాముణ్ణి ప్రశంసించిరి. 16

మూ. ఏతస్మిన్నన్తరే క్రుద్ధాస్త్రయః సేనాగ్రయాయినః,
సంహృత్యాభ్యద్రవన్ రామం మృత్యుపాశావపాశితాః, 17
మహాకపాలః స్థూలాక్షః ప్రమాథీ చ మహాబలః.

ప్ర. అ. ఏతస్మిన్ అన్తరే = ఈ మధ్యయందు, క్రుద్ధాః = కోపించిన, మహాకపాలః = మహాకపాలుడు, స్థూలాక్షః = స్థూలాక్షుడు, మహాబలః = గొప్ప బలము గల, ప్రమాథీ చ = ప్రమాథి అను, త్రయః = ముగ్గురు, సేనాగ్రయాయినః = సేనానాయకులు, మృత్యుపాశావపాశితాః = యమపాశముచేత బంధింపబడినవారై, సంహృత్య = కలిసి, రామమ్ = రాముణ్ణిగూర్చి, అభ్యద్రవన్ = ఎదురుగా పరుగెత్తిరి.

తా. ఇంతలో మహాకపాలుడు, స్థూలాక్షుడు, మహాబలశాలియైన ప్రమాథి అను ముగ్గురు సేనానాయకులు కలిసి, చావు మూడుటచే, రామునిమీదికి వెళ్ళిరి.

మూ. మహాకపాలో విపులం శూలముద్యమ్య రాక్షసః, 18
స్థూలాక్షః పట్టిసం గృహ్య ప్రమాథీ చ పరశ్వథమ్.

ప్ర. అ. మహాకపాలః = మహాకపాలుడు, విపులమ్ = పెద్దదైన, శూలమ్ = శూలమును, ఉద్యమ్య = ఎత్తి, స్థూలాక్షః = స్థూలాక్షుడను, రాక్షసః = రాక్షసుడు, పట్టిసమ్ = పట్టిసమును, గృహ్య = గ్రహించి, ప్రమాథీ చ = ప్రమాథి, పరశ్వథం చ = గండ్రగొడ్డలిని గ్రహించి (వెళ్ళిరి).

తా. మహాకపాలుడు పెద్ద శూలమును పైకెత్తి వెళ్లెను. స్థూలాక్షుడు పట్టిసమును, ప్రమాథి గండ్రగొడ్డలిని పట్టుకొని వెళ్ళిరి. 18

మూ. దృష్ట్వైవాపతతస్తూర్ణం రాఘవః సాయకైః శితైః, 19
తీక్ష్ణాగ్రైః ప్రతిజగ్రాహ సంప్రాప్తానతిథీనివ.

ప్ర. అ. రాఘవః = రాముడు, తూర్ణమ్ = శీఘ్రముగా, ఆపతతః = వచ్చుచున్న ఆ రాక్షసులను, దృష్ట్వైవ = చూడగానే, శితైః = వాడియైన, తీక్ష్ణాగ్రైః = తీక్ష్ణమైన అగ్రభాగములు గల, సాయకైః = బాణములతో, సంప్రాప్తాన్ = వచ్చిన, అతిథీనివ = అతిథులను వలె, ప్రతిజగ్రాహ = స్వీకరించెను.

తా. రాముడు శీఘ్రముగా వచ్చి మీద పడుచున్న ఆ రాక్షసులను తీక్ష్ణమైన అగ్రములతో వాడిగా ఉన్న బాణములను ప్రయోగించి, అతిథులను స్వీకరించి నట్లు స్వీకరించెను. 19

మూ. మహాకపాలస్య శిరశ్చిచ్ఛేద పరమేషుభిః, 20
అసంఖ్యేయైస్తు బాణౌఘైః ప్రమమాథ ప్రమాథినమ్.
స పపాత హతో భూమౌ విటపీవ మహాద్రుమః. 21

ప్ర. అ. పరమేషుభిః = ఉత్తములైన బాణములచేత, మహాకపాలస్య= మహాకపాలుని యొక్క, శిరః=శిరస్సును, చిచ్ఛేద=ఛేదించెను. అసంఖ్యేయైః= లెక్కింప శక్యము కాని, బాణౌఘైః = బాణసముదాయములచేత, ప్రమాథినమ్= ప్రమాథిని, ప్రమమాథ = చంపెను. సః = ఆ ప్రమాథి, హతః = చంపబడినవాడై, విటపీ=కొమ్మలు గల, మహాద్రుమః ఇవ=మహావృక్షము వలె, భూమౌ= నేలమీద, పపాత = పడెను.

తా. రాముడు ఉత్తములైన బాణములు ప్రయోగించి మహాకపాలుని శిరస్సు ఛేదించెను. లెక్కకు మించిన బాణసముదాయములచేత ప్రమాథిని చంపెను. ఆ ప్రమాథి కొమ్మలతో నిండి ఉన్న మహావృక్షము వలె, చచ్చి నేలపై పడెను. 20, 21

మూ. స్థూలాక్షస్యాక్షిణీ తీక్ష్ణైః పూరయామాస సాయకైః,
దూషణస్యానుగాన్ పఞ్చసహస్రాన్ కుపితః క్షణాత్. 22
బాణౌఘైః పఞ్చసాహస్రైరనయద్యమసాదనమ్.

ప్ర. అ. స్థూలాక్షస్య = స్థూలాక్షునియొక్క, అక్షిణీ = నేత్రములను, తీక్ష్ణైః = తీక్ష్ణములైన, సాయకైః = బాణములతో, పూరయామాస = నింపెను. కుపితః = కోపించినవాడై, పఞ్చసాహస్రైః = ఐదు వేల, బాణౌఘైః = బాణసముదాయములచేత, దూషణస్య = దూషణునియొక్క, పఞ్చసాహస్రాన్ =ఐదు వేల, అనుగాన్ = అనుచరులను, క్షణాత్ = క్షణకాలములో, యమసాదనమ్ = యమలోకమును, అనయత్ = పొందించెను.

తా. రాముడు స్థూలాక్షుని కళను తీక్ష్ణములైన బాణములతో నింపెను.

కోపించినవాడై, ఐదు వేల బాణములు ప్రయోగించి దూషణుని ఐదు వేలమంది అనుచరులను క్షణకాలములో యమలోకమునకు పంపెను. 22

మూ. దూషణం నిహతం దృష్ట్వా తస్య చైవ పదానుగాన్, 23
వ్యాదిదేశ ఖరః క్రుద్ధః సేనాధ్యక్షాన్ మహాబలాన్.

ప్ర. అ. దూషణమ్ = దూషణుణ్ణి, నిహతమ్ = చంపబడినవానినిగాను, తస్య = అతనియొక్క, పదానుగాన్ = అడుగులను అనుసరించి వెళ్లేవారిని కూడ (చంపబడినవారినిగా), దృష్ట్వా = చూచి, ఖరః = ఖరుడు, క్రుద్ధః = కోపించినవాడై, మహాబలాన్ = గొప్ప బలము గల, సేనాధ్యక్షాన్ = సేనానాయకులను, వ్యాదిదేశ = ఆజ్ఞాపించెను.

తా. దూషణుడు, ఆతని అనుచరులు మరణించుట చూచి, ఖరుడు కోపించి, గొప్ప బలము గల సేనానాయకులను ఆజ్ఞాపించెను. 23

మూ. అయం వినిహతః సంఖ్యే దూషణః సపదానుగః, 24
మహత్యా సేనయా సార్ధం యుద్ధ్వా రామం కుమానుషమ్,
శస్త్రైర్నానావిధాకారైర్హనధ్వం సర్వరాక్షసాః. 25

ప్ర. అ. అయం = ఈ, సపదానుగః = అనుచరులతో కూడిన, దూషణః = దూషణుడు, సంఖ్యే = యుద్ధమునందు, నిహతః = చంపబడినాడు. సర్వ రాక్షసాః = సకలరాక్షసులారా ! మహత్యా = గొప్ప, సేనయా సార్ధమ్ = సేనతో కూడ, యుద్ధ్వా = యుద్ధము చేసి, నానావిధైః = అనేకవిధములైన, శస్త్రైః = ఆయుధములచేత, కుమానుషమ్ = చెడ్డ మానవుడైన, రామమ్ = రాముణ్ణి, హనధ్వమ్ = చంపుడు.

తా. దూషణుడూ ఆతని అనుచరులు కూడ యుద్ధములో మరణించినారు. సకలరాక్షసులారా ! మీరు పెద్ద సైన్యముతో వెళ్ళి యుద్ధము చేసి, అనేకవిధములైన ఆకారములలో ఉన్న ఆయుధములు ప్రయోగించి, చెడ్డ మానవుడైన రాముణ్ణి చంపివేయుడు. 24, 25

మూ. ఏవముక్త్వా ఖరః క్రుద్ధో రామమేవాభిదుద్రువే,
శ్యేనగామీ పృథుగ్రీవో యజ్ఞశత్రుర్విహంగమః. 26

దుర్జయః కరవీరాక్షః పరుషః కాలకార్ముకః,
మేఘమాలీ మహామాలీ సర్పాస్యో రుధిరాశనః. 27

ద్వాదశైతే మహావీర్యా బలాధ్యక్షాః ససైనికాః,
రామమేవాభ్యధావన్త విసృజన్తః శరోత్తమాన్. 28

ప్ర. అ. ఖరః = ఖరుడు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, క్రుద్ధః = కోపించినవాడై, రామమేవ = రాముని వైపే, అభిదుద్రువే = పరుగెత్తెను. శ్యేనగామీ = శ్యేనగామి, పృథుగ్రీవః = పృథుగ్రీవుడు, యజ్ఞశత్రుః = యజ్ఞశత్రువు, విహంగమః = విహంగముడు, దుర్జయః = దుర్జయుడు, కరవీరాక్షః = కరవీరాక్షుడు, పరుషః = పరుషుడు, కాలకార్ముకః = కాలకార్ముకుడు, మేఘమాలీ = మేఘమాలి, మహామాలీ = మహామాలి, సర్పాస్యః = సర్పాస్యుడు, రుధిరాశనః = రుధిరాశనుడు అను, ఏతే = ఈ, మహావీర్యాః = గొప్ప పరాక్రమము గల, ద్వాదశ = పండ్రెండుగురు, బలాధ్యక్షాః = సేనానాయకులు, ససైనికాః = సైనికులతో కూడినవారై, శరోత్తమాన్ = ఉత్తమములైన శరములను, విసృజన్తః = విడుచుచు, రామమేవ = రాముణ్ణి గూర్చియే, అభ్యధావన్త = పరుగెత్తిరి.

తా. ఖరుడు ఈ విధముగా పలికి కోపముతో రాముని వైపే పరుగెత్తెను. శ్యేనగామి, పృథుగ్రీవుడు, యజ్ఞశత్రువు, విహంగముడు, దుర్జయుడు, కరవీరాక్షుడు, పరుషుడు, కాలకార్ముకుడు, మేఘమాలి, మహామాలి, సర్పాస్యుడు, రుధిరాశనుడు అను మహాపరాక్రమవంతులైన పన్నెండుగురు సేనానాయకులు, సైన్యములతో కూడి, ఉత్తమములైన బాణములు ప్రయోగించుచు, రాముని ఎదిరించిరి. 26-28

మూ. తతః పావకసంకాశైర్హేమవజ్రవిభూషితైః,
జఘాన శేషం తేజస్వీ తస్య సైన్యస్య సాయకైః. 29

ప్ర. అ. తేజస్వీ = తేజఃశాలియైన రాముడు, తతః = అటుపిమ్మట, పావకసంకాశైః = అగ్నితో సమానములు, హేమవజ్రవిభూషితైః = బంగారము చేతను, వజ్రములచేతను అలంకరింపబడినవి అయిన, సాయకైః = బాణముల చేత, తస్య = ఆ, సైన్యస్య = సైన్యముయొక్క, శేషమ్ = మిగిలిన భాగమును,

తా. పిమ్మట, తేజఃశాలియైన ఆ రాముడు అగ్నితో సమానములు, బంగారముచేతను, వజ్రములచేతను అలంకరింపబడినవి అయిన బాణములచేత మిగిలిన సైన్యమును సంహరించెను. 29

మూ. తే రుక్మపుఙ్ఖా విశిఖాః సధూమా ఇవ పావకాః,
నిజఘ్నుస్తాని రక్షాంసి వజ్రా ఇవ మహాద్రుమాన్. 30

ప్ర. అ. రుక్మపుఙ్ఖాః = బంగారు పొన్నులు కలవై, సధూమాః = ధూమముతో కూడిన, పావకాః ఇవ = అగ్నుల వలె ఉన్న, తే విశిఖాః = ఆ బాణములు, వజ్రాః = వజ్రములు, మహాద్రుమానివ = పెద్ద వృక్షములను వలె, తాని = ఆ, రక్షాంసి = రాక్షసులను, నిజఘ్నుః = చంపినవి.

తా. బంగారుపొన్నులతో, ధూమముతో కూడిన అగ్నుల వలె ఉన్న ఆ బాణములు మహావృక్షములను వజ్రాయుధములు పడగొట్టినట్లు ఆ రాక్షసులను చంపివేసినవి. 30

మూ. రక్షసాం తు శతం రామః శతేనైకేన కర్ణినామ్,
సహస్రం చ సహస్రేణ జఘాన రణమూర్ధని. 31

ప్ర. అ. రామః = రాముడు, రక్షసామ్ = రాక్షసులయొక్క, శతమ్ = శతమును, కర్ణినామ్ = కర్ణిబాణములయొక్క, ఏకేన శతేన = ఒక శతముచేతను, సహస్రమ్ = సహస్రమును, సహస్రేణ = సహస్రముచేతను, రణమూర్ధని = యుద్ధశిరస్సునందు, జఘాన = చంపెను.

తా. రాముడు ఆ రణరంగములో నూరుగురు రాక్షసులను నూరు కర్ణిబాణములచేత, వెయ్యిమంది రాక్షసులను వెయ్యి బాణములచేత సంహరించెను.

మూ. తైర్భిన్నవర్మాభరణాశ్ఛిన్నభిన్నశరాసనాః,
నిపేతుః శోణితాదిగ్ధా ధరణ్యాం రజనీచరాః. 32

ప్ర. అ. తైః = ఆ బాణములచేత, భిన్నవర్మాభరణాః = బ్రద్దలుకొట్టబడిన కవచములు ఆభరణములు గల, ఛిన్నభిన్నశరాసనాః = ఛేదింపబడిన, బ్రద్దలుకొట్టబడిన ధనస్సులు గల, రజనీచరాః = రాక్షసులు, శోణితాదిగ్ధాః = రక్తముచేత పూయబడినవారై, ధరణ్యామ్ = నేలపై, నిపేతుః = పడిరి.

తా. ఆ బాణములు రాక్షసుల కవచములను, ఆభరణములను బ్రద్దలు కొట్టెను. వాళ్ళ ధనస్సులను తెగగొట్టి బ్రద్దలుకొట్టెను. ఈ విధముగ ఆ రాక్షసులు రక్తముతో నిండిన దేహములతో నేలమీద పడిపోయిరి. 3

మూ. తైర్ముక్తకేశైః సమరే పతితైః శోణితోక్షితైః,
ఆస్తీర్ణా వసుధా కృత్స్నా మహావేదిః కుశైరివ. 33

ప్ర. అ. సమరే = యుద్ధమునందు, పతితైః = పడిపోయిన, ముక్తకేశైః = విడిపోయిన కేశబంధముగల, శోణితోక్షితైః = రక్తముచేత పూయబడిన, తైః = ఆ రాక్షసులచేత, కృత్స్నా = సమస్తమైన, వసుధా = భూమి, మహావేదిః = గొప్ప వేది, కుశైరివ = దర్భలచేత వలె, ఆస్తీర్ణా = పరవబడెను.

తా. విడిపోయిన జుట్టుతో, రక్తముచేత తడిసిన శరీరములతో, యుద్ధములో పడిపోయిన ఆ రాక్షసులు, కుశలు మహావేది చుట్టూ కప్పినట్లు, భూమిని కప్పివేసెను. 33

మూ. క్షణేన తు మహాఘోరం వనం నిహతరాక్షసమ్,
బభూవ నిరయప్రఖ్యం మాంసశోణితకర్దమమ్. 34

ప్ర. అ. నిహతరాక్షసమ్ = చంపబడిన రాక్షసులు గల, వనమ్ = ఆ వనము, క్షణేన = క్షణకాలములో, మహాఘోరమ్ = చాల భయంకరముగాను, మాంసశోణితకర్దమమ్ = మాంసము రక్తము అను బురద కలదిగాను, నిరయప్రఖ్యమ్ = నరకముతో సమానముగాను, బభూవ = అయ్యెను.

తా. రాక్షసుల నందరిని చంపివేయగా వాళ్ల మాంసములు, రక్తము అనే బురదతో నిండి చాల భయంకరముగా ఉన్న ఆ వనము, క్షణకాలములో నరకము వలె అయ్యెను. 34

మూ. చతుర్దశ సహస్రాణి రక్షసాం భీమకర్మణామ్,
హతాన్యేకేన రామేణ మానుషేణ పదాతినా. 35

ప్ర. అ. మానుషేణ = మానవుడు, పదాతినా = పాదములతో నడచువాడు అయిన, రామేణ = రామునిచేత, ఏకేన = ఒకనిచేతనే, భీమకర్మణామ్ =

భయంకరమైన కర్మ గల, రక్షసామ్ = రాక్షసులయొక్క, చతుర్దశ = పదు నాలుగు, సహస్రాణి = వేలు, హతాని = చంపబడినవి.

తా. ఏ వాహనమూ లేని మానవుడైన ఒక్క రాముడు ఈ విధముగ, భయంకరమైన కర్మ గల పదునాలుగువేలమంది రాక్షసులను చంపివేసెను. 35

మూ. తస్య సైన్యస్య సర్వస్య ఖరః శేషో మహారథః,
రాక్షసస్త్రిశిరాశ్చైవ రామశ్చ రిపుసూదనః. 36

("రామశ్చ రిపుసూదనః" అను పాఠమునకు బదులు "హతశేషౌ నిశాచరౌ" అను ప్రాచ్యపాఠము బాగున్నది.)

ప్ర. అ. సర్వస్య = సమస్తమైన, తస్య సైన్యస్య = ఆ సైన్యమునకు, మహారథః = మహారథుడైన, ఖరః = ఖరుడు, శేషః = మిగిలినవాడు. త్రిశిరాః = త్రిశిరస్సు అను, రాక్షసశ్చ = రాక్షసుడు కూడ, మిగిలినవాడు. నిశాచరౌ = ఆ ఇద్దరు రాక్షసులే, హతశేషౌ = చంపగా మిగిలినవాళ్ళు.

తా. ఆ మొత్తము సేన అంతలోను మహారథుడైన ఖరుడు, త్రిశిరస్సు అను రాక్షసుడు మిగిలిరి. అందరూ చావగా మిగిలినవాళ్ళు ఆ నిశాచరు లిద్దరు మాత్రమే. 36

మూ. శేషా హతా మహాసత్త్వా రాక్షసా రణమూర్ధని,
ఘోరా దుర్విషహాః సర్వే లక్ష్మణస్యాగ్రజేన తే. 37

ప్ర. అ. మహాసత్త్వాః = గొప్ప బలము గలవాళ్లు, ఘోరాః = భయంకరులు, దుర్విషహాః = సహింప శక్యము కానివాళ్లు, అయిన, సర్వే = సమస్తమైన, శేషాః = మిగిలిన, తే = వాళ్ళు, లక్ష్మణస్య = లక్ష్మణునియొక్క, అగ్రజేన = అన్నచేత, రణమూర్ధని = యుద్ధాగ్రభాగమునందు, హతాః = చంపబడినారు.

తా. ఈ ఇద్దరూ తప్ప మిగిలిన మహాబలవంతులు, భయంకరులు, సహింప శక్యము కానివాళ్ళు అయిన రాక్షసు లందరినీ రాముడు యుద్ధరంగము నందు హతమార్చెను. 37

మూ. తతస్తు తద్భీమబలం మహాహవే
సమీక్ష్య రామేణ హతం బలీయసా,

రథేన రామం మహతా ఖరస్తదా
సమాససాదేన్ద్రి ఇవోద్యతాశనిః. 38

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
షడ్వింశః సర్గః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ఖరః = ఖరుడు, మహాహవే = గొప్ప యుద్ధమునందు, బలీయసా = గొప్ప బలము గల, రామేణ = రామునిచేత, హతమ్ = చంపబడిన, తత్ = ఆ, భీమబలమ్ = భయంకరమైన సేనను, సమీక్ష్య = చూచి, తదా = అప్పుడు, ఉద్యతాశనిః = ఎత్తబడిన వజ్రాయుధము గల, ఇన్ద్రిః ఇవ = ఇంద్రుడు వలె, మహతా = గొప్ప, రథేన = రథముతో, రామమ్ = రాముణ్ణి, సమాససాద = చేరెను.

తా. ఆ మహాయుద్ధములో మహాబలశాలియైన రాముడు భయంకరమైన బలము గల రాక్షససైన్యమును అంతను చంపివేయుట చూచి, ఖరుడు పెద్ద రథమును అధిరోహించి, వజ్రాయుధమును ధరించిన దేవేంద్రుడు వలె భయంకరుడై, రామునిమీదికి వెళ్లెను. 38

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో ఇరువదిఆరవ సర్గ సమాప్తము.

అథ సప్తవింశః సర్గః

[రాముడు త్రిశిరస్సును సంహరించుట].

మూ. ఖరం తు రామాభిముఖం ప్రయాన్తం వాహినీపతిః,
రాక్షసస్త్రిశిరా నామ సంనిపత్యేదమబ్రవీత్. 1

ప్ర. అ. రామాభిముఖమ్ = రామునకు అభిముఖముగా, ప్రయాన్తమ్ = వెళ్లుచున్న, ఖరమ్ = ఖరుణ్ణి, వాహినీపతిః = సేనాపతియైన, త్రిశిరాః నామ = త్రిశిరస్సు అను పేరు గల, రాక్షసః = రాక్షసుడు, సంనిపత్య = నమస్కరించి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. రాముని వైపు వెళ్ళుచున్న ఖరుణ్ణి చూచి త్రిశిరస్సు అను సేనావతి యైన రాక్షసుడు ఆతనికి నమస్కరించి ఇట్లు పలికెను. 1

మూ. మాం నియోజయ విక్రాన్త సంనివర్తస్వ సాహసాత్,
పశ్య రామం మహాబాహుం సంయుగే వినిపాతితమ్. 2

ప్ర. అ. విక్రాన్త = ఓః పరాక్రమవంతుడా ః మామ్ = నన్ను, నియోజయ = నియమింపుము. సాహసాత్ = సాహసమునుండి, నివర్తస్వ=మరలుము. సంయుగే = యుద్ధమునందు, వినిపాతితమ్ = పడవేయబడిన, మహాబాహుమ్ = గొప్ప బాహువులు గల, రామమ్ = రాముణ్ణి, పశ్య=చూడుము.

తా. ఓః పరాక్రమవంతుడా ః నీవు నాకు ఆజ్ఞ ఇమ్ము. ఈ సాహసము నుండి విరమించుము. మహాబాహువైన రాముణ్ణి యుద్ధములో సంహరించెదను. చూడుము. 2

మూ. ప్రతిజానామి తే సత్యమాయుధం చాహమాలభే,
యథా రామం వధిష్యామి వధార్హం సర్వరక్షసామ్. 3

ప్ర. అ. అహమ్ = నేను, తే = నీకు, సత్యమ్=నిజముగా, ప్రతిజానామి = ప్రతిజ్ఞ చేయుచున్నాను. ఆయుధం చ = ఆయుధమును కూడ, ఆలభే = స్పృశించుచున్నాను. యథా = ఏమనగా, సర్వరక్షసామ్ = సకలరాక్షసులకు, వధార్హమ్ = చంపుటకు తగిన, రామమ్ = రాముణ్ణి, వధిష్యామి = వధించెదను.

తా. నీకు నిజముగా ప్రతిజ్ఞ చేసి, ఆయుధముపై ఒట్టు పెట్టి చెప్పుచున్నాను. ఏమనగా అందరు రాక్షసులకు చంపదగిన ఈ రాముణ్ణి చంపెదను.

మూ. అహం వాస్య రణే మృత్యురేష వా సమరే మమ,
వినివృత్య రణోత్సాహాన్ముహూర్తం ప్రాశ్నికో భవ. 4

ప్ర. అ. రణోత్సాహాత్ = యుద్ధోత్సాహమునుండి, వినివృత్య = మరలి, (నీవు), రణే = యుద్ధమునందు, అహమ్ = నేను, అస్య = ఈతనికి, మృత్యుః = మృత్యు వగుదునా, వా = లేక, సమరే = యుద్ధమునందు, ఏషః = ఇతడు, మమ = నాకు మృత్యు వగునా అని, ముహూర్తమ్=క్షణకాలము పాటు, ప్రాశ్నికః = ప్రశ్న వేసుకొనువాడవు, భవ = అగుము.

తా. నీవు ఈ యుద్ధోత్సాహమునుండి విరమించి, రణరంగములో నేను రామునకు మృత్యుదేవత అగుదునో లేక అతడు నాకే మృత్యుదేవత అగునో, ముహూర్తకాలము ప్రశ్నించుకొనుచు నిరీక్షించుము. 4

మూ. ప్రహృష్టో వా హతే రామే జనస్థానం ప్రయాస్యసి,
మయి వా నిహతే రామం సంయుగాయోపయాస్యసి. 5

ప్ర. అ. రామే=రాముడు, హతే=చంపబడినవాడగుచుండగా, ప్రహృష్టః = సంతోషించుచు, జనస్థానమ్ = జనస్థానమును గూర్చి, ప్రయాస్యసి వా = వెళ్లనైన వెళ్లెదవు. మయి = నేను, నిహతే = చంపబడినవాడ నగుచుండగా, సంయుగాయ = యుద్ధముకొరకు, రామమ్ = రాముణ్ణి గూర్చి, ఉపయాస్యసి వా = వెళ్ల నైన వెళ్లెదవు.

తా. నేనే రాముణ్ణి చంపినచో నీవు ఆనందముతో జనస్థానమునకు వెళ్ళవచ్చును. లేదా నన్నే అతడు సంహరించినచో నీవు రామునిపై యుద్ధానికి వెళ్లవచ్చును. 5

మూ. ఖరస్త్రిశిరసా తేన మృత్యులోభాత్ప్రసాదితః,
గచ్ఛ యుధ్యేత్యనుజ్ఞాతో రాఘవాభిముఖో యయౌ. 6

ప్ర. అ. ఖరః = ఖరుడు, తేన = ఆ, త్రిశిరసా = త్రిశిరస్సుచేత, మృత్యు లోభాత్ = మృత్యువునందు ఆసక్తివలన, ప్రసాదితః = అనుగ్రహింపచేసికొనబడినాడు. గచ్ఛ = వెళ్లుము, యుధ్య = యుద్ధము చేయుము, ఇతి = అని, అనుజ్ఞాతః = అనుజ్ఞ ఇవ్వబడినవాడై, త్రిశిరస్సు, రాఘవాభిముఖః = రామునకు అభిముఖుడై, యయౌ = వెళ్లెను.

తా. ఈ విధముగ త్రిశిరస్సు, చావు కోరుకొని, ఖరుణ్ణి అనుగ్రహింప చేసుకొనెను. "వెళ్ళుము, యుద్ధము చేయుము" అని ఖరుడు అనుమతింపగా ఆ త్రిశిరస్సు రాము డున్న ప్రదేశమునకు వెళ్లెను. 6

మూ. త్రిశిరాపి రథేనైవ వాజియుక్తేన భాస్వతా,
అభ్యద్రవద్రణే రామం త్రిశృఙ్గ ఇవ పర్వతః. 7

ప్ర. అ. త్రిశిరాపి = త్రిశిరస్సు కూడ, వాజియుక్తేన = గుఱ్ఱములు కట్టిన, భాస్వతా = ప్రకాశించుచున్న, రథేనైవ = రథముచేతనే, త్రిశృఙ్గః = మూడు శిఖరములు గల, పర్వతః ఇవ = పర్వతము వలె, రణే = యుద్ధమునందు, రామమ్ = రాముణ్ణి గూర్చి, అభ్యద్రవత్ = ఎదురుగా పరుగెత్తెను.

తా. త్రిశిరస్సు గుఱ్ఱములు కట్టిన, ప్రకాశించుచున్న రథము నెక్కి, మూడు శిఖరము లున్న పర్వతము వలె, రాముని ఎదిరించుచు వెళ్ళెను. 7

మూ. శరధారాసమూహాన్స మహామేఘ ఇవోత్సృజన్,
వ్యసృజత్సదృశం నాదం జలార్ద్రస్య తు దున్దుభేః. 8

ప్ర. అ. సః = అతడు, మహామేఘ ఇవ = పెద్ద మేఘమువలె, శరధారా సమూహాన్ = జలధారలవంటి శరముల సముదాయములను, ఉత్సృజన్ = విడచుచు, జలార్ద్రస్య = జలముచేత తడిసిన, దున్దుభేః = దుందుభికి, సదృశమ్ = సమానమైన, నాదమ్ = ధ్వనిని, వ్యసృజత్ = సృష్టించెను.

తా. ఆ త్రిశిరస్సు పెద్ద మేఘము వలె, జలధారల వంటి బాణసముదాయములను విడచుచు, నీటికి తడిసిన దుందుభి వంటి ధ్వనిని చేసెను. 8

మూ. ఆగచ్ఛన్తం త్రిశిరసం రాక్షసం ప్రేక్ష్య రాఘవః,
ధనుషా ప్రతిజగ్రాహ విధూన్వన్ సాయకాన్ శితాన్. 9

ప్ర. అ. రాఘవః = రాముడు, ఆగచ్ఛన్తమ్ = వచ్చుచున్న, రాక్షసమ్ = రాక్షసుడైన, త్రిశిరసమ్ = త్రిశిరస్సును, ప్రేక్ష్య = చూచి, శితాన్ = వాడియైన, సాయకాన్ = బాణములను, ధనుషా = ధనస్సుచేత, విధూన్వన్ = ప్రయోగించుచు, ప్రతిజగ్రాహ = స్వీకరించెను.

తా. రాముడు వచ్చుచున్న ఆ త్రిశిరోరాక్షసుని చూచి, ధనస్సుచేత వాడియైన బాణాలను ప్రయోగించుచు ఆతనిని స్వీకరించెను. 9

మూ. స సంప్రహారస్తుములో రామత్రిశిరసోర్మహాన్,
బభూవాతీవ బలినోః సింహకుఞ్జరయోరివ. 10

ప్ర. అ. రామత్రిశిరసోః = రామునియొక్క, త్రిశిరస్సుయొక్క, తుములః = వ్యాకులమైన, మహాన్ = గొప్పదైన, సః సంప్రహారః = ఆ యుద్ధము, అతీవ = మిక్కిలి, బలినోః = బలము గల, సింహకుఞ్జరయోః ఇవ = సింహము యొక్క ఏనుగయొక్క యుద్ధము వలె, బభూవ = ఆయెను.

తా. రామత్రిశిరస్సుల మధ్య జరిగిన తుములమైన ఆ గొప్ప యుద్ధము, చాల బలము గల సింహమునకు గజమునకు మధ్య జరిగిన యుద్ధము వలె ఉండెను 10

మూ. తతస్త్రిశిరసా బాణైర్లలాటే తాడితస్త్రిభిః,
అమర్షీ కుపితో రామః సంరబ్ధమిదమబ్రవీత్. 11

ప్ర. అ. తతః = అటుపిమ్మట, అమర్షీ = అధికమైన కోపము గల, రామః = రాముడు, త్రిశిరసా = త్రిశిరస్సుచేత, త్రిభిః = మూడు, బాణైః = బాణములచేత, లలాటే = లలాటమునందు, తాడితః = కొట్టబడినవాడై, కుపితః = కోపించినవాడై, సంరబ్ధతరమ్ = ఎక్కువ తొందరగా, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. పిమ్మట ఆ త్రిశిరస్సు క్రోధావిష్టుడైన ఆ రాముని లలాటముపై

మూడు బాణములు ప్రయోగించగా, రాముడు ఇంకను కుపితుడై, తొందరగా ఇట్లు పలికెను. 11

మూ. అహో విక్రమశూరస్య రాక్షసస్యేదృశం బలమ్,
పుష్పైరివ శరైర్యస్య లలాటేఽస్మి పరిక్షతః. 12

ప్ర. అ. అహో = ఆహా! విక్రమశూరస్య = పరాక్రమముచేత శూరుడైన, రాక్షసస్య = రాక్షసునియొక్క, బలమ్ = బలము, ఈదృశమ్ = ఇట్టిదికదా! యస్య = ఎవనియొక్క, శరైః = బాణములచేత, పుష్పైరివ = పుష్పములచేత వలె, లలాటే = లలాటమునందు, పరిక్షతః అస్మి = కొట్టబడితినో.

తా. "ఆహా! పరాక్రమముచేత శూరుడైన రాక్షసుని బలము ఏమి బలము! నీవు ప్రయోగించిన బాణములు నా లలాటము మీద పువ్వులు తగిలి నట్లు తగిలినవి!" 12

మూ. మమాపి ప్రతిగృహ్ణీష్వ శరాంశ్చాపగుణచ్యుతాన్,
ఏవముక్త్వా తు సంరబ్ధః శరానాశీవిషోపమాన్, 13
త్రిశిరోవక్షసి క్రుద్ధో నిజఘాన చతుర్దశ.

ప్ర. అ. మమ = నాయొక్క, చాపగుణచ్యుతాన్ = ధనస్సు నారినుండి బైటకు వచ్చిన, శరానపి = బాణములను కూడ, ప్రతిగృహ్ణీష్వ = గ్రహించుము. ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, సంరబ్ధః = వేగముతో కూడినవాడై, (రాముడు), క్రుద్ధః = కోపించినవాడై, ఆశీవిషోపమాన్ = సర్పములతో సమానములైన, చతుర్దశ = పదునాలుగు, శరాన్ = బాణములను, త్రిశిరోవక్షసి = త్రిశిరస్సు వక్షఃస్థలముమీద, నిచఖాన = పాతెను.

తా. "నా ధనస్సు నారినుండి వెలువడిన బాణములను కూడ స్వీకరించుము" అని పలికి రాముడు, క్రుద్ధుడై, వేగముగా, సర్పముల వంటి పదునాలుగు బాణములు ఆ త్రిశిరస్సు వక్షఃస్థలముమీద నాటెను. 13

మూ. చతుర్భిస్తురగానస్య శరైః సన్నతపర్వభిః, 14
న్యపాతయత తేజస్వీ చతురస్తస్య వాజినః.

ప్ర. అ. తేజస్వీ = తేజఃశాలియైన రాముడు, సన్నతపర్వభిః = వంగిన కణుపులు గల, చతుర్భిః = నాలుగు, శరైః = బాణములచేత, తస్య = అట్టి, అస్య = ఈ త్రిశిరస్సుయొక్క, తురగాన్ = శీఘ్రముగా నడచు, చతురః = నాలుగు, వాజినః = గుఱ్ఱములను, న్యపాతయత్ = పడగొట్టెను.

తా. తేజఃశాలియైన రాముడు వంగిన కణుపులు గల నాలుగు బాణముల చేత, ఆ త్రిశిరస్కుని శీఘ్రముగా నడచు నాలుగు గుఱ్ఱములను చంపెను. 14

మూ. అష్టభిః సాయకైః సూతం రథోపస్థాన్న్యపాతయత్, 15
రామశ్చిచ్ఛేద బాణేన ధ్వజం చాస్య సముచ్ఛ్రితమ్.

ప్ర. అ. రామః = రాముడు, అష్టభిః = ఎనిమిది, సాయకైః = బాణముల చేత, సూతమ్ = సారథిని, రథోపస్థాత్ = రథము పైభాగమునుండి, న్యపాతయత్ = పడగొట్టెను. బాణేన = ఒక బాణముచేత, అస్య = వీనియొక్క, సముచ్ఛ్రితమ్ = ఎత్తుగా ఎగురవేయబడిన, ధ్వజమ్ = ధ్వజమును, చిచ్ఛేద = ఛేదించెను.

తా. రాముడు ఎనిమిది బాణములు ప్రయోగించి సారథిని చంపి రథము పైభాగమునుండి క్రిందికి పడవేసెను. ఒక బాణముచేత ఎత్తుగా ఎగురుచున్న ధ్వజమును ఛేదించెను. 15

మూ. తతో హతరథాత్తస్మాదుత్పతన్తం నిశాచరమ్, 16
బిభేద రామస్తం బాణైర్హృదయే సోఽభవజ్జడః.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, రామః = రాముడు, తస్మాత్ = ఆ, హతరథాత్ = కొట్టబడిన రథమునుండి, ఉత్పతన్తమ్ = పైకి ఎగురుచున్న, తం నిశాచరమ్ = ఆ రాక్షసుణ్ణి, బాణైః = బాణములచేత, హృదయే = హృదయము నందు, బిభేద = బ్రద్దలుకొట్టెను. సః = అతడు, జడః = జడుడు, అభవత్ = ఆయెను.

తా. విరిగిపోయిన రథమునుండి ఆ రాక్షసుడు పైకి ఎగురబోగా రాముడు ఆతని వక్షస్థలమును బాణములచేత బ్రద్దలుకొట్టెను. అప్పుడు అతడు ఏమీ చేయ లేని స్థితిలో ఉండెను. 16

మూ. సాయకైశ్చాప్రమేయాత్మా సామర్ష స్తస్య రక్షసః, 17
శిరాంస్యపాతయద్రామో వేగవద్భిస్త్రిభిః శితైః.

ప్ర. అ. అప్రమేయాత్మా = ఊహింప శక్యము కాని బుద్ధి గల, రామః = రాముడు, సామర్షః = కోపముతో కూడినవాడై, వేగవద్భిః = వేగము గల, శితైః = వాడియైన, త్రిభిః = మూడు, సాయకైః = బాణములచేత, తస్య రక్షసః = ఆ రాక్షసునియొక్క, శిరాంసి = శిరస్సులను, అపాతయత్ = పడగొట్టెను.

తా. ఊహించుటకు కూడ శక్యము కాని బుద్ధి గల రాముడు, చాల కోపముతో, వేగము గల, వాడియైన మూడు బాణములతో ఆతని శిరస్సులను ఖండించెను. 17

మూ. స భూమౌ రుధిరోద్గారీ రామబాణాభిపీడితః, 18
న్యపతత్పతితైః పూర్వం స్వశిరోభిర్నిశాచరః.

ప్ర. అ. రామబాణాభిపీడితః = రాముని బాణములచేత పీడింపబడిన, సః నిశాచరః = ఆ రాక్షసుడు, రుధిరోద్గారీ = రక్తమును కక్కుచున్నవాడై, పూర్వమ్ = ముందుగా, పతితైః = క్రిందపడిన, స్వశిరోభిః = తన శిరస్సులతో కూడ, న్యపతత్ = పడెను.

తా. రాముని బాణములచేత పీడింపబడిన ఆ త్రిశిరస్సు రక్తమును చిమ్ముచు, తన శిరస్సులు ముందుగా నేలపై పడగా, పిదప తాను పడెను. 18

మూ. హతశేషాస్తతో భగ్నా రాక్షసాః ఖరసంశ్రయాః, 19
ద్రవన్తి స్మ న తిష్ఠన్తి వ్యాఘ్రత్రస్తా మృగా ఇవ.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ఖరసంశ్రయాః = ఖరుడు ఆశ్రయముగా గల, హతశేషాః = చంపబడగా మిగిలిన, రాక్షసాః = రాక్షసులు, భగ్నాః = ఓడిపోయినవారై, వ్యాఘ్రత్రస్తాః = పెద్దపులినుండి భయపడిన, మృగాః యథా = లేళ్లు వలె, ద్రవన్తి స్మ = పారిపోయిరి. న తిష్ఠన్తి = నిలవలేదు.

తా. చంపగా మిగిలిన ఖరుని అనుచరులైన రాక్షసులు ఓడిపోయి, పెద్దపులినుండి భయపడిన లేళు వలె, నిలబడకుండ పారిపోయిరి. 19

మూ. తాన్ ఖరో ద్రవతో దృష్ట్వా నివర్త్య రుషితః స్వయమ్,
రామమేవాభిదుద్రావ రాహుశ్చన్ద్రమసం యథా.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
సప్తవింశః సర్గః.

ప్ర. అ. రుషితః = కోపించిన, ఖరః = ఖరుడు, ద్రవతః = పారిపోవుచున్న, తాన్ = వాళ్ళను, దృష్ట్వా = చూచి, స్వయమ్ = స్వయముగా, నివర్త్య = మరల్చి, రాహుః = రాహువు, చన్ద్రమసం యథా = చంద్రుణ్ణిగూర్చి వలె, రామమేవ = రాముణ్ణి గూర్చియే, అభిదుద్రావ = పరుగెత్తెను.

తా. కోపించిన ఖరుడు పారిపోవుచున్న ఆ రాక్షసులను చూచి, స్వయముగా వాళ్లను వెనుకకు మరల్చి, రాహువు చంద్రునిమీదికి వెళ్ళి నట్లు రాముని మీదికి వెళ్లెను. 20

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో
ఇరువదివ ఏడవ సర్గ సమాప్తము.

అథ అష్టావింశః సర్గః

[ఖరునితో రాముడు ఘోరముగా పోరాడుట]

మూ. నిహతం దూషణం దృష్ట్వా రణే త్రిశిరసా సహ,
ఖరస్యాప్యభవత్త్రాసో దృష్ట్వా రామస్య విక్రమమ్. 1

ప్ర. అ. రణే = యుద్ధమునందు, త్రిశిరసా సహ = త్రిశిరస్సుతో కూడ, నిహతమ్ = చంపబడిన, దూషణమ్ = దూషణుణ్ణి, దృష్ట్వా = చూచి, రామస్య = రామునియొక్క, విక్రమమ్ = పరాక్రమమును, దృష్ట్వా = చూచి, ఖరస్యాపి = ఖరునకు కూడ, త్రాసః = భయము, అభవత్ = ఆయెను.

తా. యుద్ధములో దూషణుణ్ణీ, త్రిశిరస్సునూ చంపిన రాముని పరాక్రమము చూడగానే ఖరునకు కూడ భయము కలిగెను. 1

మూ. స దృష్ట్వా రాక్షసం సైన్యమవిషహ్యం మహాబలః,
హతమేకేన రామేణ త్రిశిరోదూషణావపి. 2

తద్బలం హతభూయిష్ఠం విమనాః ప్రేక్ష్య రాక్షసః,
ఆససాద ఖరో రామం నముచిర్వాసవం యథా. 3

ప్ర. అ. మహాబలః = గొప్ప బలము గల, రాక్షసః = రాక్షసుడైన, ఖరః = ఖరుడు, అవిషహ్యమ్ = సహింప శక్యము కాని, రాక్షసమ్ = రాక్షసులసంబంధమైన, సైన్యమ్ = సైన్యమును, ఏకేన = ఒక్క, రామేణ = రామునిచేత, హతమ్ = చంపబడినదానినిగా, త్రిశిరోదూషణావపి = త్రిశిరస్సును, దూషణునీ కూడ, (చంపబడినవారినిగా), దృష్ట్వా = చూచి, హతభూయిష్ఠమ్ = చాలవరకు చంపివేయబడిన, తత్ బలమ్ = ఆ సైన్యమును, ప్రేక్ష్య = చూచి, నముచిః = నముచిఅనే రాక్షసుడు, వాసవం యథా = దేవేంద్రుని వలె, రామమ్ = రాముణ్ణి, ఆససాద = సమీపించెను.

తా. మహాబలము గల ఆ రాక్షసుడు, ఖరుడు, ఎదిరింప శక్యము కాని ఆ రాక్షససైన్యమును, త్రిశిరోదూషణులను కూడ ఒక్క రాముడు సంహరించుట చూచి, సైన్యము చాలవరకు నశించిన దను విషయము గమనించి, నముచి దేవేంద్రుణ్ణి ఎదిరించి నట్లు రాముణ్ణి ఎదిరించుటకై వెళ్ళెను. 2,3

మూ. వికృష్య బలవచ్చాపం నారాచాన్ రక్తభోజనాన్,
ఖరశ్చిక్షేప రామాయ క్రుద్ధానాశీవిషానివ. 4

ప్ర. అ. ఖరః = ఖరుడు, బలవత్ = బలముతో, చాపమ్ = ధనస్సును, వికృష్య = లాగి, క్రుద్ధాన్ = కోపించిన, ఆశీవిషానివ = సర్పములు వలె ఉన్న, రక్తభోజనాన్ = రక్తము భోజనముగా గల, నారాచాన్ = నారాచబాణములను, రామాయ = రామునికొరకు, చిక్షేప = విసిరెను.

తా. ఖరుడు ధనస్సును బలముగా లాగి, కోపించిన సర్పముల వలె ఉన్న, రక్తమును భుజించు నారాచములను రామునిపై ప్రయోగించెను. 4

మూ. జ్యాం విధూన్వన్ సుబహుశః శిక్షయాస్త్రాణి దర్శయన్,
చచార సమరే మార్గాన్ శరై రథగతః ఖరః. 5

ప్ర. అ. రథగతః = రథమును పొందిన, ఖరః = ఖరుడు, సుబహుశః = అనేకవిధములుగ, జ్యామ్ = నారిని, విధూన్వన్ = లాగుచు, శిక్షయా = అభ్యాసముచేత, అస్త్రాణి = అస్త్రములను, దర్శయన్ = చూపుచు, సమరే = యుద్ధమునందు, శరైః = బాణములతో, మార్గాణి = మార్గములను, చచార = చేసెను.

తా. రథము నెక్కి యున్న ఆ ఖరుడు, ధనస్సు నారిని అనేకవిధముల లాగుచు, అభ్యాసపాటవముతో అస్త్రాలను ప్రదర్శించుచు, బాణములు విడచుచు అనేకవిధముల సంచరించెను. 5

మూ. స సర్వాశ్చ దిశో బాణైః ప్రదిశశ్చ మహారథః,
పూరయామాస తం దృష్ట్వా రామోఽపి సుమహద్ధనుః. 6

ప్ర. అ. మహారథః = మహారథుడైన, సః = ఆ ఖరుడు, సర్వాః = సమస్తమైన, దిశః = దిక్కులను, ప్రదిశశ్చ = విదిక్కులను, బాణైః = బాణముల

చేత, పూరయామాస = నింపెను, తమ్ = వానిని. దృష్ట్వా = చూచి, రామోఽపి = రాముడు కూడ, సుమహత్ = చాలగొప్పదైన, ధనుః = ధనస్సును, పూరయామాస = పూరించెను.

తా. మహారథుడైన ఆ ఖరుడు బాణములతో దిక్కులను, విదిక్కులను కూడ నింపివేసెను. రాముడు వానిని చూచి తన గొప్ప ధనస్సును ఎక్కుపెట్టెను.

మూ. స సాయకైర్దుర్విషహైః సస్ఫులిఙ్గైరివాగ్నిభిః,
నభశ్చకారావివరం పర్జన్య ఇవ వృష్టిభిః. 7

ప్ర. అ. సః = ఆ రాముడు, దుర్విషహైః = సహింప శక్యము కాని, సస్ఫులిఙ్గైః = అగ్నికణములతో కూడిన, అగ్నిభిః ఇవ = అగ్నుల వలె ఉన్న, సాయకైః = బాణములచేత, పర్జన్యః = మేఘము, వృష్టిభిః ఇవ = వర్షములచేత వలె, నభః = ఆకాశమును, అవివరమ్ = అవకాశము లేనిదానినిగా, చకార = చేసెను.

తా. రాముడు, నిప్పురవ్వలతో కూడిన అగ్నుల వలె సహింప శక్యము కాని బాణములచేత, మేఘము వర్షములచేత వలె, ఆకాశములో అవకాశము లేకుండ చేసెను. 7

మూ. తద్బభూవ శితైర్బాణైః ఖరరామవిసర్జితైః,
పర్యాకాశమనాకాశం సర్వతః శరసంకులమ్. 8

ప్ర. అ. ఖరరామవిసర్జితైః = ఖరునిచేత, రామునిచేత విడువబడిన, శితైః = వాడియైన, బాణైః = బాణములచేత, తత్ = ఆ, పర్యాకాశమ్ = చుట్టుప్రక్కల నున్న ఆకాశము, సర్వతః = అంతటా, శరసంకులమ్ = శరములచేత వ్యాకులమై, అనాకాశమ్ = అవకాశము లేనిదై, బభూవ = ఆయెను.

తా. ఖరుడు, రాముడు విడచిన వాడియైన బాణములచేత, అంతట నిండిన అక్కడి ఆకాశప్రాంతము అవకాశములేనిది అయ్యెను. 8

మూ. శరజాలావృతః సూర్యో న తదా స్మ ప్రకాశతే,
అన్యోన్యవధసంరమ్భాదుభయోః సంప్రయుధ్యతోః. 9

ప్ర. అ. అన్యోన్యవధసంరమ్భాత్ = పరస్పరము చంపుటకు పట్టుదలతో, ఉభయోః = వారిద్దరూ, సంప్రయుధ్యతోః = యుద్ధము చేయుచుండగా, తదా = అప్పుడు, శరజాలావృతః = బాణసముదాయముచేత కప్పబడిన, సూర్యః = సూర్యుడు, న ప్రకాశతే స్మ = ప్రకాశించలేదు.

తా. ఒకరి నొకరు చంపవలె నను పట్టుదలతో వారిద్దరు యుద్ధము చేయుచుండగా, బాణసముదాయముచేత కప్పబడిన సూర్యుడు ప్రకాశించలేదు. 9

మూ. తతో నాళీకనారాచై స్తీక్ష్ణాగ్రైశ్చ వికర్ణిభిః,
ఆజఘాన ఖరో రామం తోత్త్రైరివ మహాద్విపమ్. 10

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ఖరః = ఖరుడు, నాళీకనారాచైః = నాళీకబాణములచేతను, నారాచ బాణములచేతను, తీక్ష్ణాగ్రైః = తీక్ష్ణమైన అగ్రభాగములు గల, వికర్ణిభిః = వికర్ణిబాణములచేతను, రామమ్ = రాముణ్ణి, తోత్త్రైః = అంకుశములచేత, మహాద్విపమివ = గొప్ప ఏనుగును వలె, ఆజఘాన = కొట్టెను.

తా. పిదప ఖరుడు, రాముణ్ణి నాళీకబాణములతోను, నారాచబాణములతోను, తీక్ష్ణములైన అగ్రభాగములు గల వికర్ణిబాణములతోను, అంకుశములతో మహాగజమును కొట్టినట్లు కొట్టెను. 10

మూ. తం రథస్థం ధనుష్పాణిం రాక్షసం పర్యవస్థితమ్,
దదృశుః సర్వభూతాని పాశహస్తమివాన్తకమ్. 11

ప్ర. అ. రథస్థమ్ = రథముమీద ఉన్నవాడు, ధనుష్పాణిమ్ = ధనస్సు హస్తమునందు కలవాడు, పర్యవస్థితమ్ = నిలచి ఉన్నవాడు అయిన, తం రాక్షసమ్ = ఆ రాక్షసుణ్ణి, పాశహస్తమ్ = పాశము హస్తమునందు గల, అన్తకమ్ ఇవ = యముని వలె, సర్వభూతాని = సకలభూతములు, దదృశుః = చూచినవి.

తా. రథము నెక్కి, ధనస్సు ధరించి, యుద్ధానికి సిద్ధముగా ఉన్న ఆ ఖరుడు, అక్కడ ఉన్న ప్రాణు లందరికి పాశము చేతిలో ధరించిన యముడు వలె కనబడెను. 11

మూ. హన్తారం సర్వసైన్యస్య పౌరుషే పర్యవస్థితమ్,
పరిశ్రాన్తం మహాసత్త్వం మేనే రామం ఖర స్తదా. 12

ప్ర. అ. ఖరః = ఖరుడు, సర్వసైన్యస్య = సమస్తసైన్యమునకు(ను), హన్తారమ్ = చంపినవాడు, పౌరుషే = పౌరుషమునందు, పర్యవస్థితమ్ = నిలచిన వాడు, మహాసత్త్వమ్ = చాల బలము గలవాడు అయిన, రామమ్ = రాముణ్ణి, తదా = అప్పుడు, పరిశ్రాన్తమ్ = అలసినవానినిగా, మేనే = తలచెను.

తా. పౌరుషమును చూపి, సకలసైన్యమును చంపిన, మహాబలవంతుడైన రాముడు, అప్పుడు అలసి ఉండు నని ఖరుడు భావించెను. 12

మూ. తం సింహమివ విక్రాన్తం సింహవిక్రాన్తగామినమ్,
దృష్ట్వా నోద్విజతే రామః సింహః క్షుద్రమృగం యథా.

ప్ర. అ. ("సింహః క్షుద్రమృగం యథా" అనుటకు బదులు "సింహః సింహమివాపరమ్" అను ప్రాచ్యపాఠము బాగున్నది. మొదట ఖరుణ్ణి సింహముతో పోల్చి వెంటనే నీచమృగముతో పోల్చుట యుక్తముగా లేదు. అట్లు చేయదలచినచో ముందు సింహముతో పోల్చి ఉండగూడదు).

సింహమివ = సింహమువలె, విక్రాన్తమ్ = పరాక్రమించుచున్నవాడు, సింహవిక్రాన్తగామినమ్ = సింహము నడకతో నడచువాడు అయిన, తమ్ = ఆ ఖరుణ్ణి, దృష్ట్వా = చూచి, రామః = రాముడు, సింహః = సింహము, అపరం సింహమివ = మరియొక సింహమును చూచివలె, నోద్విజతే = భయపడలేదు.

తా. సింహము వలె నడచుచు, సింహపరాక్రమము వంటి పరాక్రమము చూపుచున్న ఆ ఖరుణ్ణి చూచి, రాముడు, ఒక సింహము మరొక సింహమును చూచి ఎట్లు భయపడదో అట్లే భయపడలేదు. 13

మూ. తతః సూర్యనికాశేన రథేన మహతా ఖరః,
ఆససాద రణే రామం పతఙ్గ ఇవ పావకమ్. 14

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ఖరః = ఖరుడు, సూర్యనికాశేన = సూర్యునితో సమానమైన, మహతా = గొప్పదైన, రథేన = రథముతో, రామమ్ = రాముణ్ణి, పతఙ్గః = మిడత, పావకమ్ ఇవ = అగ్నిని వలె, రణే = యుద్ధము నందు, ఆససాద = సమీపించెను.

తా. పిమ్మట ఖరుడు సూర్యునితో సమానమైన పెద్ద రథము నెక్కి, మిడత అగ్ని దగ్గరకు వెళ్ళి నట్లు, యుద్ధములో రామునిమీదికి వెళ్లెను. 14

మూ. తతోఽస్య సశరం చాపం ముష్టిదేశే మహాత్మనః,
ఖరశ్చిచ్ఛేద రామస్య దర్శయన్ పాణిలాఘవమ్. 15

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ఖరః = ఖరుడు, పాణిలాఘవమ్ = హస్త లాఘవమును, దర్శయన్ = చూపుచు, మహాత్మనః = మహాత్ముడైన, అస్య రామస్య = ఈ రాముని యొక్క, సశరమ్ = బాణముతో కూడిన, చాపమ్ = ధనస్సును, ముష్టిదేశే = పిడికిలిదగ్గర, చిచ్ఛేద = ఛేదించెను.

తా. పిమ్మట ఖరుడు తన నేర్పు చూపించుచు, మహాత్ముడైన ఆ రాముని బాణసహితమైన ధనస్సును పిడికిలి దగ్గర ఛేదించెను. 15

మూ. స పున స్త్వపరాన్ సప్త శరానాదాయ వర్మణి,
నిజఘాన ఖరః క్రుద్ధః శక్రాశనిసమప్రభాన్. 16

ప్ర. అ. సః ఖరః = ఆ ఖరుడు, క్రుద్ధః = కోపించినవాడై, పునః = మరల, శక్రాశనిసమప్రభాన్ = ఇంద్రుని వజ్రాయుధముతో సమానమైన కాంతి గల, అపరాన్ = ఇతరమైన, సప్త = ఏడు, శరాన్ = బాణములను, ఆదాయ = గ్రహించి, వర్మణి = కవచమునందు, నిజఘాన = కొట్టెను.

తా. ఆ ఖరుడు క్రుద్ధుడై మరల, ఇంద్రుని వజ్రాయుధము వంటి, మరి ఏడు బాణములు తీసికొని వాటితో రాముని కవచమును కొట్టెను. 16

మూ. తత స్తత్ప్రహతం బాణైః ఖరముక్తైః సుపర్వభిః,
పపాత కవచం భూమౌ రామస్యాదిత్యవర్చసః. 17

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ఖరముక్తైః = ఖరునిచేత విడువబడిన, సుపర్వభిః = మంచి కణుపులు గల, బాణైః = బాణములచేత, ప్రహతమ్ = కొట్టబడినదై, ఆదిత్యవర్చసః = సూర్యుని వంటి కాంతి గల, రామస్య = రాముని యొక్క, తత్ = ఆ, కవచమ్ = కవచము, భూమౌ = నేలమీద, పపాత = పడెను.

తా. మంచి కణుపులు గల బాణములను ప్రయోగించి ఖరుడు కొట్టగా, సూర్యుని వంటి కాంతి గల రాముని కవచము నేలపై పడెను. 17

మూ. తతః శరసహస్రేణ రామమప్రతిమౌజసమ్,
అర్దయిత్వా మహానాదం ననాద సమరే ఖరః. 18

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ఖరః = ఖరుడు, అప్రతిమౌజసమ్ = సాటి లేని కాంతి గల, రామమ్ = రాముణ్ణి, శరసహస్రేణ = వేయి బాణములచేత, అర్దయిత్వా = పీడించి, సమరే = యుద్ధమునందు, మహానాదమ్ = గొప్ప ధ్వని కలుగు నట్లుగా, ననాద = అరచెను.

తా. పిమ్మట ఖరుడు, సాటి లేని తేజస్సు గల రాముణ్ణి అనేకబాణముల చేత పీడించి, యుద్ధములో గట్టిగా అరచెను. 18

మూ. స శరైరర్దితః క్రుద్ధః సర్వగాత్రేషు రాఘవః,
రరాజ సమరే రామో విధూమోఽగ్నిరివ జ్వలన్. 19

ప్ర. అ. శరైః = బాణములచేత, సర్వగాత్రేషు = అన్ని అవయవముల యందు, అర్దితః = పీడింపబడిన, రాఘవః = రఘువంశసంజాతుడైన, సః రామః = ఆ రాముడు, క్రుద్ధః = కోపించినవాడై, విధూమః = ధూమము లేని, జ్వలన్ = మండుచున్న, అగ్నిరివ = అగ్ని వలె, సమరే = యుద్ధమునందు, రరాజ = ప్రకాశించెను.

తా. అన్ని అవయవములందు బాణములచేత కొట్టబడి, క్రుద్ధుడైన ఆ రాముడు, యుద్ధరంగములో, ధూమము లేని, ప్రజ్వలించుచున్న అగ్నివలె ప్రకాశించెను. 19

మూ. తతో గమ్భీరనిర్హ్రాదం రామః శత్రునిబర్హణః,
చకారాన్తాయ స రిపోః సజ్యమన్యన్మహద్ధనుః. 20

ప్ర. అ. తతః = అటుపిమ్మట, శత్రునిబర్హణః = శత్రువినాశకుడైన, సః రామః = ఆ రాముడు, రిపోః = శత్రువుయొక్క, అన్తాయ = అంతముకొరకు, గమ్భీరనిర్హ్రాదమ్ = గంభీరమైన ధ్వని కల, అన్యత్ = మరియొక, మహత్ =

గొప్పదైన, ధనుః = ధనస్సును, సజ్యమ్ = నారితో కూడినదానినిగా, చకార = చేసెను.

తా. పిమ్మట, శత్రుసంహారకుడైన రాముడు, ఆ శత్రువును సంహరించుటకై, గంభీరమైన ధ్వని గల మరి యొక గొప్ప ధనస్సునకు నారి కట్టెను. 20

మూ. సుమహద్వైష్ణవం యత్తదతిసృష్టం మహర్షిణా.
వరం తద్ధనురుద్యమ్య ఖరం సమభిధావత. 21

ప్ర. అ. తత్ = ప్రసిద్ధమైన, యత్ = ఏ, సుమహత్ = చాల పెద్దదైన, వైష్ణవమ్ = విష్ణుసంబంధమైన, ధనుః = ధనస్సు, మహర్షిణా = అగస్త్యమహర్షి చేత, అతిసృష్టమ్ = ఇవ్వబడినదో, వరమ్ = శ్రేష్ఠమైన, తత్ = దానిని, ఉద్యమ్య = ఎత్తి, ఖరమ్ = ఖరుణ్ణి, సమభిధావత = ఎదుర్కొనుటకు వెళ్లెను.

తా. అగస్త్యమహర్షి ఇచ్చిన, శ్రేష్ఠమైన, ఆ గొప్ప వైష్ణవధనస్సును గ్రహించి ఖరుణ్ణి ఎదిరించుటకు శీఘ్రముగా వెళ్ళెను. 21

మూ. తతః కనకపుఙ్ఖైస్తు శరైః సంనతపర్వభిః,
బిభేద రామః సంక్రుద్ధః ఖరస్య సమరే ధ్వజమ్. 22

ప్ర. అ. తతః=అటు పిమ్మట, రామః=రాముడు, సంక్రుద్ధః=కోపించినవాడై, కనకపుఙ్ఖైః=బంగారు పొన్నులు గల, సంనతపర్వభిః=వంగిన కణుపులు గల, శరైః = బాణములచేత, సమరే=యుద్ధమునందు, ఖరస్య=ఖరునియొక్క, ధ్వజమ్ = ధ్వజమును, బిభేద = భేదించెను.

తా. పిమ్మట రాముడు కుపితుడై, బంగారు పొన్నులు, వంగిన కణుపులు గల బాణములచేత, యుద్ధములో ఖరుని ధ్వజమును ఎగురగొట్టెను. 22

మూ. స దర్శనీయో బహుధా వికీర్ణః కాఞ్చనధ్వజః,
జగామ ధరణీం సూర్యో దేవతానామివాజ్ఞయా. 23

ప్ర. అ. బహుధా = అనేకవిధములుగ, వికీర్ణః = చిమ్మివేయబడిన, దర్శనీయః = సుందరమైన, సః = ఆ, కాఞ్చనధ్వజః = బంగారు ధ్వజము,

దేవతానామ్ = దేవతలయొక్క, ఆజ్ఞయా=ఆజ్ఞచేత, సూర్యః ఇవ = సూర్యుడు వలె, ధరణీమ్ = భూమిని, జగామ = పొందెను.

తా. ఎన్నో ముక్కలుగా ఖండింపబడి విసరివేయబడిన అందమైన ఆ బంగారు ధ్వజము దేవతల ఆజ్ఞచే సూర్యుడు నేలమీదికి వచ్చినాడా అన్నట్లు, నేలమీద పడెను. 23

మూ. తం చతుర్భిః ఖరః క్రుద్ధో రామం గాత్రేషు మార్గణైః,
వివ్యాధ యుధి మర్మజ్ఞో మాతఙ్గమివ తోమరైః. 24

ప్ర. అ. క్రుద్ధః=కోపించిన, మర్మజ్ఞః=మర్మస్థానములను లేదా యుద్ధ రహస్యములను ఎరిగిన, ఖరః=ఖరుడు, యుధి=యుద్ధమునందు, తం రామమ్= ఆ రాముణ్ణి, చతుర్భిః = నాలుగు, మార్గణైః = బాణములచేత, మాతఙ్గమ్ = ఏనుగును, తోమరైరివ = తోమరములచేత వలె, గాత్రేషు = అవయవములయందు, వివ్యాధ = కొట్టెను.

తా. మర్మస్థానములు తెలిసిన ఖరుడు కోపించి, యుద్ధములో, ఆ రాముణ్ణి నాలుగు బాణములతో, గజమును తోమరములతో కొట్టినట్లు, అవయవములమీద కొట్టెను. 24

మూ. స రామో బహుభిర్బాణైః ఖరకార్ముకనిఃసృతైః,
విద్ధో రుధిరసిక్తాఙ్గో బభూవ రుషితో భృశమ్. 25

ప్ర. అ. సః రామః = ఆ రాముడు, ఖరకార్ముకనిఃసృతైః = ఖరుని ధనస్సునుండి బయలుదేరిన, బహుభిః=అనేకమైన, బాణైః = బాణములచేత, విద్ధః = కొట్టబడినవాడై, రుధిరసిక్తాఙ్గః = రక్తముచేత తడపబడిన శరీరము గలవాడై, భృశమ్ = మిక్కిలి, రుషితః = కోపించినవాడు, బభూవ = ఆయెను.

తా. ఖరుని ధనస్సునుండి బయల్వెడలిన అనేకబాణములు తగిలి, రక్తముతో తడిసిన శరీరము గల ఆ రాముడు, చాల కోపము చెందెను. 25

మూ. స ధనుర్ధన్వినాం శ్రేష్ఠః ప్రగృహ్య పరమాహవే,
ముమోచ పరమేష్వాసః షట్ శరానభిలక్షితాన్. 26

ప్ర. అ. పరమాహవే = ఆ గొప్ప యుద్ధమునందు, ధన్వినామ్ = ధనుర్ధరులలో, శ్రేష్ఠః = శ్రేష్ఠుడు, పరమేష్వాసః = గొప్ప ధనస్సు కలవాడు అయిన, సః = ఆ రాముడు, ధనుః = ధనస్సును, ప్రగృహ్య = గ్రహించి, అభిలక్షితాన్ = గురిని గుర్తించిన, షట్ = ఆరు, శరాన్ = బాణములను, ముమోచ = విడచెను.

తా. ధనుర్ధరులలో శ్రేష్ఠుడు, గొప్ప ధనస్సు ధరించినవాడు అయిన ఆ రాముడు, ఆ మహాయుద్ధములో ధనస్సు ధరించి, బాగుగా గురి చూచి ఆరు బాణములు విడచెను. 26

మూ. శిరస్యేకేన బాణేన ద్వాభ్యాం బాహ్వోరథార్దయత్,
త్రిభిశ్చన్ద్రార్ధవక్త్రైశ్చ వక్షస్యభిజఘాన హ. 27

ప్ర. అ. ఏకేన = ఒక, బాణేన = బాణముచేత, శిరసి = శిరస్సునందు, అథ = పిమ్మట, ద్వాభ్యామ్ = రెండింటిచేత, బాహ్వోః = బాహువులమీద, అర్దయత్ = పీడించెను. త్రిభిః = మూడు, చన్ద్రార్ధవక్త్రైః = అర్ధచంద్రాకారమైన ముఖములు గల బాణములచేత, వక్షసి = వక్షఃస్థలముమీద, అభిజఘాన హ = కొట్టెను.

తా. ఆ ఖరుని శిరస్సుమీద ఒక బాణమును, బాహువులపై రెండు బాణములను, వక్షఃస్థలమునందు మూడు అర్ధచంద్రాకారబాణములను ప్రయోగించెను. 27

మూ. తతః పశ్చాన్మహాతేజా నారాచాన్ భాస్కరోపమాన్,
జిఘాంసూ రాక్షసం క్రుద్ధస్త్రయోదశ సమాదదే. 28

ప్ర. అ. తతః పశ్చాత్ = దాని తరువాత, మహాతేజాః = గొప్ప తేజస్సు గల రాముడు, క్రుద్ధః = కోపించినవాడై, రాక్షసమ్ = రాక్షసుడ్ని, జిఘాంసుః = చంప దలచినవాడై, భాస్కరోపమాన్ = సూర్యునితో సమానమైన, త్రయోదశ = పదమూడు, నారాచాన్ = నారాచబాణములను, సమాదదే = గ్రహించెను.

తా. మహాతేజశ్శాలియైన రాముడు అటు పిమ్మట, చాల కోపించి, ఆ రాక్షసుని చంపవలె నని నిశ్చయించుకొని సూర్యునివంటి కాంతి గల పదమూడు నారాచబాణములను గ్రహించెను. 28

మూ. రథస్య యుగమేకేన చతుర్భిశ్చతురో హయాన్,
షష్ఠేన తు శిరః సంఖ్యే ఖరస్య రథసారథేః. 29

త్రిభిస్త్రివేణుం బలవాన్ ద్వాభ్యామక్షం మహాబలః,
ద్వాదశేన తు బాణేన ఖరస్య సశరం ధనుః. 30

ఛిత్వా వజ్రనికాశేన రాఘవః ప్రహసన్నివ,
త్రయోదశేనేన్ద్రసమో బిభేద సమరే ఖరమ్. 31

ప్ర. అ. ఇన్ద్రసమః = ఇంద్రునితో సమానుడు, బలవాన్ = బలవంతుడు, మహాబలః = గొప్ప బలము గలవాడు అయిన, రాఘవః = రాముడు, సంఖ్యే = యుద్ధమునందు, ఏకేన = ఒక బాణముచేత, అస్య = ఖరునియొక్క, రథస్య = రథముయొక్క, యుగమ్ = కాడిని, చతుర్భిః = నాలుగు బాణములచేత, చతురః = నాలుగు, హయాన్ = అశ్వములను, షష్ఠేన = ఆరవ బాణముచేత, ఖరస్య = ఖరునియొక్క, రథసారథేః = రథము సారథియొక్క, శిరః = శిరస్సును, త్రిభిః = మూడింటిచేత, త్రివేణుమ్ = రథము ముందుభాగమును, ద్వాభ్యామ్ = రెండింటిచేత, అక్షమ్ = ఇరుసును, ద్వాదశేన = పండ్రెండవదైన, బాణేన = బాణముచేత, ఖరస్య = ఖరునియొక్క, సశరమ్ = బాణముతో కూడిన, ధనుః = ధనస్సును, ఛిత్వా = భేదించి, ప్రహసన్నివ = నవ్వుచున్నవాడువలె, సమరే = యుద్ధమునందు, వజ్రనికాశేన = వజ్రమువంటి, త్రయోదశేన = పదమూడవ బాణముచేత, ఖరమ్ = ఖరుణ్ణి, బిభేద = భేదించెను (కొట్టెను).

తా. దేవేంద్రునితో సమానుడు, బలవంతుడు, మహాబలశాలి అయిన రాముడు, యుద్ధములో ఒక బాణముచేత రథము కాడిని, నాలిగింటిచేత నాలుగు గుఱ్ఱాలను, ఆరవ బాణముచేత ఖరుని రథసారథి శిరస్సును, మూడింటిచేత రథము ముందు భాగమును, రెండింటిచేత ఇరుసును, పండ్రెండవ బాణముచేత ఖరుని బాణముతో కూడిన ధనస్సును భేదించెను. మరల యుద్ధములో నవ్వుచున్నాడా అన్నట్లు, వజ్రముతో సమానమైన పదమూడవ బాణముతో ఖరుణ్ణి కొట్టెను.

మూ. ప్రభగ్నధన్వా విరథో హతాశ్వో హతసారథిః,
గదాపాణిరవప్లుత్య తస్థౌ భూమౌ ఖరస్తదా. 32

ప్ర. అ. తదా = అప్పుడు, ప్రభగ్నధన్వా = విరిగిపోయిన ధనస్సు కల వాడు, విరథః = రథము లేనివాడు. హతాశ్వః = చంపబడిన అశ్వములు కల వాడు, హతసారథిః = చంపబడిన సారథి కలవాడు అయిన, ఖరః = ఖరుడు, గదాపాణిః = గద హస్తమునందు కలవాడై, అవప్లుత్య = క్రిందికి దుమికి, భూమౌ = నేలపై, తస్థౌ = నిలబడెను.

తా. ధనస్సు విరిగిపోయెను. రథము భగ్న మయ్యెను. గుఱ్ఱములు సారథి కూడ చచ్చెను. అపుడు ఆ ఖరుడు, చేతిలో గద ధరించి, రథమునుండి దుమికి నేలపై నిలచెను. 32

మూ. తత్కర్మ రామస్య మహారథస్య
సమేత్య దేవాశ్చ మహర్షయశ్చ,
అపూజయన్ ప్రాఞ్జలయః ప్రహృష్టా
స్తదా విమానాగ్రగతాః సమేతాః. 33

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకియే ఆదికావ్యే అరణ్యకాణ్డే
అష్టావింశః సర్గః.

ప్ర. అ. తదా = అప్పుడు, దేవాశ్చ = దేవతలు, మహర్షయశ్చ = మహర్షులు, సమేతాః = కలసినవారై, విమానాగ్రగతాః = విమానాగ్రములందు ఉన్నవారై, సమేత్య = వచ్చి, ప్రహృష్టాః = సంతోషించినవారై, ప్రాఞ్జలయః = కట్టబడిన దోసిళ్లు గలవారై, మహారథస్య = మహారథుడైన, రామస్య = రాముని యొక్క, తత్ కర్మ = ఆ పనిని, అపూజయన్ = పూజించిరి.

తా. దేవతలు, మహర్షులు కలిసి వచ్చి, విమానాగ్రములందు నిలచి, సంతోషించుచు, అంజలులు ఘటించి, మహారథుడైన రాముడు చేసిన ఆ కార్యమును ప్రశంసించిరి. 33

''బాలానందిని''అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో
ఇరువది ఎనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనత్రింశః సర్గః

[రాముడు ఖరుణ్ణి నిందించుట, ఖరుడు కూడ రాముణ్ణి నిందించి గదను ప్రయోగించుట; ఆ గదను రాముడు ఖండించుట]

మూ. ఖరం తు విరథం రామో గదాపాణిమవస్థితమ్,
మృదుపూర్వం మహాతేజాః పరుషం వాక్యమబ్రవీత్. 1

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, రామః = రాముడు, విరథమ్ = పోయిన రథము గల, గదాపాణిమ్ = గద హస్తమునందు గల, అవస్థితమ్ = నిలచి ఉన్న, ఖరమ్ = ఖరుణ్ణి గూర్చి, మృదుపూర్వమ్ = మృదువాక్యములు పూర్వమునందు కలుగునట్లుగా, పరుషమ్ = పరుషమైన, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. రథము నశించగా గద చేతిలో ధరించి నిలచి ఉన్న ఆ ఖరుణ్ణి చూచి మహాతేజఃశాలియైన రాముడు, పైకి మృదువుగా కనబడు పరుషవాక్యములను పలికెను. 1

మూ. గజాశ్వరథసంబాధే బలే మహతి తిష్ఠతా,
కృతం సుదారుణం కర్మ సర్వలోకజుగుప్సితమ్. 2

ప్ర. అ. గజాశ్వరథసంబాధే = గజములతోను, అశ్వములతోను, రథములతోను కిక్కిరిసి ఉన్న, మహతి = గొప్పదైన, బలే = సైన్యమునందు, తిష్ఠతా = ఉంటూన్న నీ చేత, సర్వలోకజుగుప్సితమ్ = అందరు జనుల చేతను అసహ్యించుకొనబడు, సుదారుణమ్ = చాల భయంకరమైన, కర్మ = కర్మ, కృతమ్ = చేయబడినది.

తా. నీవు గజ - అశ్వ - రథములతో నిండిన మహాసైన్యమునకు అధిపతివిగా ఉండి లోకు లందరూ నిందించే, చాల భయంకరమైన పని చేసితివి. 2

మూ. ఉద్వేజనీయో భూతానాం నృశంసః పాపకర్మకృత్,
త్రయాణామపి లోకానామీశ్వరోఽపి న తిష్ఠతి. 3

ప్ర. అ. భూతానామ్=ప్రాణులకు, ఉద్వేజనీయః = దుఃఖము కలిగించువాడు, పాపకర్మకృత్=పాపకర్మలు చేయువాడు అయిన, నృశంసః=క్రూరుడు, త్రయాణామ్ = మూడు, లోకానామ్=లోకములకు, ఈశ్వరోఽపి=ప్రభువైనను, న తిష్ఠతి = నిలవడు.

తా. ప్రాణులందరికి భయము కలిగించుచు, పాపకర్మలు ఆచరించు క్రూరుడు, మూడు లోకాలకు ప్రభువే అయినను చాల కాలము సుఖముగా జీవించజాలడు. 3

మూ. కర్మ లోకవిరుద్ధం తు కుర్వాణం క్షణదాచర,
తీక్ష్ణం సర్వజనో హన్తి సర్పం దుష్టమివాగతమ్. 4

ప్ర. అ. క్షణదాచర = రాక్షసుడా ! లోకవిరుద్ధమ్ = లోకమునకు విరుద్ధమైన, కర్మ = కర్మను, కుర్వాణమ్=చేయుచున్న, తీక్ష్ణమ్=క్రూరుణ్ణి, సర్వజనః = సకలజనము, ఆగతమ్ = వచ్చిన, దుష్టమ్ = దుష్టమైన, సర్పమివ = సర్పమును వలె, హన్తి = చంపివేయును.

తా. ఓ ! రాక్షసుడా ! లోకమునకు విరుద్ధముగా ఉన్న కర్మను చేయు క్రూరాత్ముణ్ణి, జనులు, తమ దగ్గరకు వచ్చిన దుష్టసర్పమును చంపివేసి నట్లు చంపివేయుదురు. 4

మూ. లోభాత్పాపాని కుర్వాణః కామాద్వా యో న బుధ్యతే,
భ్రష్టః పశ్యతి తస్యాన్తం బ్రాహ్మణీ కరకాదివ. 5

ప్ర. అ. లోభాత్ = దురాశవలనగాని, కామాద్వా = కామమువలనగాని, యః = ఎవడు, పాపాని = పాపములను, కుర్వాణః = చేయుచు, న బుధ్యతే = తెలుసుకొనడో, అతడు, భ్రష్టః = భ్రష్టుడై, కరకాత్ = వడగల్లును తిన్న, బ్రాహ్మణీవ = నలికెల్లపాము వలె, తస్య = చేసినదానియొక్క, అన్తమ్ = ఫలమును, పశ్యతి=చూచును.

తా. దురాశవలన గాని, కామమువలన గాని, పాపములు చేయుచు తన

తప్పిదమును గ్రహించనివాడు, భ్రష్టుడై వడగల్లు తిన్న నలికెళ్లపాము వలె, తను చేసిన పని ఫలమును అనుభవించును.

వి. వడగళ్లవాన కురిసి నపుడు ఆ జలఘనమును నలికెళ్లపాము తిన్నచో అది చచ్చిపోవు నను ప్రసిద్ధి యున్న దని వ్యాఖ్యాతలు వ్రాసినారు. ప్రాచ్యపాఠములో ఉత్తరార్ధము "భ్రష్టః పశ్యతి దుఃఖం స బ్రాహ్మణః పరవానివ"అని ఉన్నది. "పరాధీనుడైన, అనగా సేవావృత్తిలో ఉన్న బ్రాహ్మణుడు వలె భ్రష్టుడై అతడు దుఃఖము పొందును"అని దాని భావము. ఈ పాఠము బాగున్నది. పై పాఠములో 'తస్య' అనేదానికి పాపశబ్దముతో (పాపానామ్) సంబంధము కుదరదు గాన "చేసిన ఆ పనియొక్క"అనే అర్థం కల్పించవలసిఉన్నది. సేవావృత్తిలో ఉన్న బ్రాహ్మణుడు కూడ పాపాచరణముచేత భ్రష్టు డగును గాన ఆతనిని ఉపమానముగా చెప్పుట యుక్తముగా ఉన్నది. 5

మూ. వసతో దణ్డకారణ్యే తాపసాన్ ధర్మచారిణః,
కిం ను హత్వా మహాభాగాన్ ఫలం ప్రాప్స్యసి రాక్షస.

ప్ర. అ. రాక్షస = రాక్షసుడా ! దణ్డకారణ్యే = దండకారణ్యమునందు, వసతః = నివసించుచున్న, ధర్మచారిణః = ధర్మములను ఆచరించు, మహాభాగాన్ = గొప్ప పుణ్యాత్ములైన, తాపసాన్ = మునులను, హత్వా = చంపి, కిం ను = ఏమి, ఫలమ్ = ఫలమును, ప్రాప్స్యసి = పొందగలవు.

తా. రాక్షసా ! దండకారణ్యములో నివసించి ధర్మము నాచరించుచున్న, పుణ్యాత్ములైన మునులను చంపుటచే నీకు ఏమి ప్రయోజనము లభించును? 6

మూ. న చిరం పాపకర్మాణః క్రూరా లోకజుగుప్సితాః,
ఐశ్వర్యం ప్రాప్య తిష్ఠన్తి శీర్ణమూలా ఇవ ద్రుమాః. 7

ప్ర. అ. పాపకర్మాణః = పాపమైన కర్మ గల, లోకజుగుప్సితాః = లోకములో నిందితులైన, క్రూరాః = క్రూరులు, ఐశ్వర్యమ్ = ఐశ్వర్యమును, ప్రాప్య = పొంది, శీర్ణమూలాః = శిథిలమైన మొదళ్ళు గల, ద్రుమాః ఇవ = వృక్షములు వలె, చిరమ్ = చిరకాలము, న తిష్ఠన్తి = ఉండజాలరు.

తా. లోకములో అందరిచేత నిందింపబడే పాపాత్ములైన క్రూరులకు ఐశ్వ

ర్యము లభించినను, వాళ్లు, మొదళ్లు ఖలికిపోయిన చెట్ల వలె చాలకాలము నిలవ జాలరు. 7

మూ. అవశ్యం లభతే జన్తుః ఫలం పాపస్య కర్మణః,
ఘోరం పర్యాగతే కాలే ద్రుమాః పుష్పమివార్తవమ్. 8

ప్ర. అ. కాలే = తగినసమయము, పర్యాగతే = వచ్చిన దగుచుండగా, జన్తుః = ప్రాణి, పాపస్య = పాపమైన, కర్మణః = కర్మయొక్క, ఘోరమ్ = భయంకరమైన, ఫలమ్ = ఫలమును, ద్రుమాః = వృక్షములు, ఆర్తవమ్ = ఋతువుకు సంబంధించిన, పుష్పమివ = పుష్పమును వలె, అవశ్యమ్ = తప్పక, లభతే = పొందును.

తా. ప్రతి ప్రాణీ కూడ, సమయము వచ్చినపుడు, భయంకరమైన పాపకర్మఫలమును, ఆ యా ఋతువులు వచ్చి నప్పుడు వృక్షములు పుష్పములను పొంది నట్లు, తప్పక పొందును. 8

మూ. నచిరాత్ప్రాప్యతే లోకే పాపానాం కర్మణాం ఫలమ్,
సవిషాణామివాన్నానాం భుక్తానాం క్షణదాచర. 9

ప్ర. అ. క్షణదాచర = ఓ! రాక్షసుడా! లోకే = లోకమునందు, పాపానామ్ = పాపములైన, కర్మణామ్ = కర్మలయొక్క, ఫలమ్ = ఫలము, భుక్తానామ్ = తినబడిన, సవిషాణామ్ = విషముతో కూడిన, అన్నానామివ = అన్నముల ఫలము వలె, నచిరాత్ = అచిరకాలములో, ప్రాప్యతే = పొందబడును.

తా. రాక్షసుడా! లోకములో పాపకర్మల ఫలము, భుజించిన విషము కలిసిన పదార్థముల ఫలము వలె, అచిరకాలములోనే లభించును. 9

మూ. పాపమాచరతాం ఘోరం లోకస్యాప్రియమిచ్ఛతామ్,
అహమాసాదితో రాజా ప్రాణాన్ హన్తుం నిశాచర. 10

ప్ర. అ. నిశాచర = రాక్షసుడా! ఘోరమ్ = భయంకరమైన, పాపమ్ = పాపమును, ఆచరతామ్ = ఆచరించుచున్న వారియొక్క, లోకస్య = లోకమునకు, అప్రియమ్ = అప్రియమును, ఇచ్ఛతామ్ = కోరుచున్న వారియొక్క, ప్రాణాన్ =

ప్రాణములను, హన్తుమ్ = చంపుటకు, రాజా = రాజైన, అహమ్ = నేను, ఆసాదితః = పొందబడితిని.

తా. ఘోరమైన పాపమును ఆచరించేవారి ప్రాణములను, లోకమునకు అప్రియము చేయ గోరువారి ప్రాణములను నశింపచేయుటకై రాజునైన నన్ను (మునులు మొదలైనవారు) చేరిరి. 10

మూ. అద్య హి త్వా మయా ముక్తాః శరాః కాఞ్చనభూషణాః,
విదార్యాతిపతిష్యన్తి వల్మీకమివ పన్నగాః. 11

ప్ర. అ. అద్య = ఇప్పుడు, మయా = నాచేత, ముక్తాః = విడువబడిన, కాఞ్చనభూషణాః = బంగారు అలంకారములు గల, శరాః = బాణములు, పన్నగాః = సర్పములు, వల్మీకమివ = పుట్టను వలె, త్వా = నిన్ను, విదార్య = చీల్చి, అతిపతిష్యన్తి = పైకి పోగలవు.

తా. ఇప్పుడు నేను ప్రయోగించు బంగారు అలంకారములు గల బాణములు, సర్పములు పుట్టను చీల్చి నట్లు నిన్ను చీల్చి, బైటకు వెళ్లగలవు. 11

మూ. యే త్వయా దణ్డకారణ్యే భక్షితా ధర్మచారిణః,
తానద్య నిహతః సంఖ్యే ససైన్యోఽనుగమిష్యసి. 12

ప్ర. అ. త్వయా = నీచేత, దణ్డకారణ్యే = దండకారణ్యమునందు, యే = ఏ, ధర్మచారిణః = ధర్మమును ఆచరించు మునులు, భక్షితాః = భక్షింపబడినారో, తాన్ = వాళ్లను, అద్య = నేడు, సంఖ్యే = యుద్ధమునందు, నిహతః = చంపబడినవాడవై, ససైన్యః = సైన్యసహితుడవై, అనుగమిష్యసి = అనుసరించగలవు.

తా. ఇప్పుడు నాచేత యుద్ధములో చంపబడిన నీవు, సైన్యసమేతుడవై, ఇంతవరకు నీవు దండకారణ్యములో ఏ మునులను భక్షించినావో వారిని అనుసరించి వెళ్లగలవు. 12

మూ. అద్య త్వాం నిహతం బాణైః పశ్యన్తు పరమర్షయః,
నిరయస్థం విమానస్థా యే త్వయా హింసితాః పురా. 13

ప్ర. అ. పురా = పూర్వము, త్వయా = నీచేత, యే = ఎవరు, హింసితాః =

చంపబడినారో, అట్టి, పరమర్షయః = మహర్షులు, విమానస్థాః = విమానములలో ఉన్నవారై, అద్య = ఇప్పుడు, బాణైః = బాణములచేత, నిహతమ్=చంపబడిన, నిరయస్థమ్ = నరకములో ఉన్న, త్వామ్ = నిన్ను, పశ్యన్తు = చూచెదరుగాక.

తా. పూర్వము నీవు హింసించిన ముని లందరూ విమానములపై ఎక్కి, ఇపుడు బాణములచేత చంపబడి నరకములో ఉన్న నిన్ను చూచెదరుగాక. 13

మూ. ప్రహర త్వం యథాకామం కురు యత్నం కులాధమ,
అద్య తే పాతయిష్యామి శిరస్తాలఫలం యథా. 14

ప్ర. అ. కులాధమ = కులమునందు అధముడా ! త్వమ్ = నీవు, యథాకామమ్ = నీకు ఇష్టము వచ్చి నట్లు, ప్రహర=కొట్టుము. యత్నమ్=ప్రయత్నమును, కురు = చేయుము. అద్య = ఇప్పుడు, తే=నీయొక్క, శిరః=శిరస్సును, తాళఫలం యథా = తాటిపండును వలె, పాతయిష్యామి = పడగొట్టెదను.

తా. కులపాంసనుడా ! నీకు ఇష్టము వచ్చి నట్లు నన్ను కొట్టుము. ప్రయత్నము చేయుము. ఇప్పుడు నీ శిరస్సును తాటిపండును వలె క్రింద పడవేసెదను. 14

మూ. ఏవముక్తస్తు రామేణ ఖరః సంరక్తలోచనః,
ప్రత్యువాచ తతో రామం ప్రహసన్ క్రోధమూర్ఛితః. 15

ప్ర. అ. రామేణ = రామునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, ఖరః = ఖరుడు, సంరక్తలోచనః = ఎఱ్ఱనైన నేత్రములు కలవాడై, తతః = పిమ్మట, ప్రహసన్ = నవ్వుచు, క్రోధమూర్ఛితః = క్రోధముచేత ఆవహింపబడినవాడై, రామమ్ = రాముణ్ణి గూర్చి, ప్రత్యువాచ = తిరిగిపలికెను.

తా. రాముని మాటలు విన్న ఖరుడు ఎఱ్ఱబడిన నేత్రములు కలవాడై, క్రోధావేశముతో నవ్వుచు రామునితో ఇట్లు పలికెను. 15

మూ. ప్రాకృతాన్ రాక్షసాన్ హత్వా యుద్ధే దశరథాత్మజ,
ఆత్మనా కథమాత్మానమప్రశస్యం ప్రశంససి. 16

ప్ర. అ. దశరథాత్మజ=రామా! యుద్ధే=యుద్ధమునందు, ప్రాకృతాన్=

సామాన్యులైన, రాక్షసాన్ = రాక్షసులను, హత్వా = చంపి, అప్రశస్యమ్ = ప్రశంసింప తగని, ఆత్మానమ్ = తనను గూర్చి, ఆత్మనా = స్వయముగానే, కథమ్ = ఎట్లు, ప్రశంససి = ప్రశంసించుచున్నావు ?

తా. రామా ! యుద్ధములో సామాన్యులైన రాక్షసులను చంపి, ప్రశంసకు అనర్హుడవైన నిన్ను నీవే ఎందుకు ప్రశంసించుకొనుచున్నావు ? 16

మూ. విక్రాన్తా బలవన్తో వా యే భవన్తి నరర్షభాః,
కథయన్తి న తే కించిత్తేజసా స్వేన గర్వితాః. 17

ప్ర. అ. యే = ఏ, నరర్షభాః = నరశ్రేష్ఠులు, విక్రాన్తాః = పరాక్రమము కలవారు గాని, బలవన్తో వా = బలవంతులు గాని, భవన్తి = అగుదురో, తే = వాళ్ళు, స్వేన = తమ సంబంధమైన, తేజసా = తేజస్సుచేత, గర్వితాః = గర్వించిన వారై, కించిత్ = ఏమియు, న కథయన్తి = చెప్పరు.

తా. పరాక్రమవంతులు, బలశాలులు అయిన నరశ్రేష్ఠులు తమ ప్రభావమునకు గర్వించరు ; ఏమీ మాటలాడరు. 17

మూ. ప్రాకృతాస్త్వకృతాత్మానో లోకే క్షత్రియపాంసనాః,
నిరర్థకం వికత్థన్తే యథా రామ వికత్థసే. 18

ప్ర. అ. రామ = రామా ! లోకే = లోకమునందు, అకృతాత్మానః = వినయము లేని బుద్ధులు గల, ప్రాకృతాస్తు = సామాన్యులైన, క్షత్రియపాంసనాః = క్షత్రియాధములైతే, యథా = ఎట్లు, వికత్థసే = బడాయి చెప్పుకొనుచున్నావో, అట్లే, నిరర్థకమ్ = వ్యర్థముగా, వికత్థన్తే = విఱ్ఱవీగుచుందురు.

తా. వినయము లేని సామాన్యులైన క్షత్రియాధములు మాత్రము, నీ విపుడు ఎట్లు బడాయిలు చెప్పుకొనుచున్నావో, అట్లే బడాయిలు చెప్పుకొనుచుందురు. 18

మూ. కులం వ్యపదిశన్వీరః సమరే కోఽభిధాస్యతి,
మృత్యుకాలే హి సంప్రాప్తే స్వయమప్రస్తవే స్తవమ్. 19

ప్ర. అ. మృత్యుకాలే = మరణసమయము, సంప్రాప్తే = వచ్చియుండగా,

వీరః = వీరుడైన, కః = ఎవ్వడు, సమరే = యుద్ధమునందు, కులమ్ = కులమును, వ్యపదిశన్ = చెప్పుకొనుచు, అప్రస్తవే = ప్రస్తుతము కాని సమయమునందు, స్వయమ్ = స్వయముగా, స్తవమ్ = స్తోత్రమును, అభిధాస్యతి = చెప్పగలడు?

తా. వీరుడైన వా డెవ్వడైనా, యుద్ధములో మృత్యుసమయము ఆసన్నమైనపుడు, తన కులమును గూర్చి చెప్పుకొనుచు, సమయము కాని సమయమునందు తన్ను తానే పొగడుకొనునా! 19

మూ. సర్వథైవ లఘుత్వం తే కత్థనేన విదర్శితమ్,
సువర్ణప్రతిరూపేణ తప్తేనేవ కుశాగ్నినా. 20

ప్ర. అ. కత్థనేన = పొగడుకొనుటచేత, (నీచేత), తప్తేన = కాల్చబడిన, సువర్ణప్రతిరూపేణ = బంగారము వంటి రూపముగల, కుశాగ్నినా ఇవ = దర్భాగ్నిచేత వలె, సర్వథైవ = అన్ని విధముల, తే = నీయొక్క, లఘుత్వమ్ = లఘుత్వము, విదర్శితమ్ = చూపబడినది.

తా. దర్భను కాల్చగా ఆ దర్భ బంగారము వలె ఉన్నను ఎట్లు నిస్సారమో, అట్లే నీవు, బడాయి చెప్పుకొనుచు, అన్ని విధాల నీ తేలిక స్వభావమును చూపినావు! 20

మూ. నను మామిహ తిష్ఠన్తం పశ్యసి త్వం గదాధరమ్,
ధరాధరమివాకమ్ప్యం పర్వతం ధాతుభిశ్చితమ్. 21

ప్ర. అ. త్వమ్ = నీవు, గదాధరమ్ = గదను ధరించిన వాడను, ఇహ = ఇక్కడ, తిష్ఠన్తమ్ = నిలచి ఉన్నవాడను, ధాతుభిః = ధాతువులచే, చితమ్ = వ్యాప్తమైన, పర్వతమ్ = కణుపులు గల, ధరాధరమివ = పర్వతము వలె, అకమ్ప్యమ్ = కదల్చ శక్యముకానివాడను అయిన, మామ్ = నన్ను, పశ్యసినను = చూచుచున్నావు కదా!

తా. గద ధరించి, ధాతువులచేత వ్యాప్తమైన, దృఢములైన పర్వములు (కణుపులు)గల పర్వతము వలె, కదల్ప శక్యము కాని, ఇక్కడ నిలచి ఉన్న నన్ను చూచుచున్నావు కదా? 21

మూ. పర్యాప్తోఽహం గదాపాణిర్హన్తుం ప్రాణాన్ రణే తవ,
త్రయాణామపి లోకానాం పాశహస్త ఇవాన్తకః. 22

ప్ర. అ. పాశహస్తః=పాశము హస్తమునందు గల, అన్తకః=యముడు, త్రయాణామ్=మూడు, లోకానామపి ఇవ=లోకముల ప్రాణములను వలె, రణే =యుద్ధమునందు, తవ=నీయొక్క, ప్రాణాన్=ప్రాణములను, హన్తుమ్= చంపుటకు, గదాపాణిః=గద హస్తమునందు గల, అహమ్=నేను, పర్యాప్తః =చాలినవాడను.

తా. పాశమును హస్తమునందు ధరించిన యముడు ఏ విధముగా మూడు లోకముల ప్రాణములను హరింప సమర్థుడో అట్లే గద ధరించిన నేను నీ ప్రాణములు తీయుటకు సమర్థుడను. 22

మూ. కామం బహ్వపి వక్తవ్యం త్వయి వక్ష్యామి న త్వహమ్,
అస్తం గచ్ఛేద్ధి సవితా యుద్ధవిఘ్నస్తతో భవేత్. 23

ప్ర. అ. త్వయి=నీ విషయమునందు, బహు=చాలా, వక్తవ్యమపి కామమ్=తప్పక చెప్పదగి యున్నది. తు=కాని, అహమ్=నేను, న వక్ష్యామి =చెప్పను. సవితా=సూర్యుడు, అస్తం గచ్ఛేత్=అస్తమించును. తతః= అప్పుడు, యుద్ధవిఘ్నః=యుద్ధమునకు విఘ్నము, భవేత్=అగును.

తా. నీ విషయములో కూడ చాల చెప్పవలసి ఉన్నది కాని నే నేమీ చెప్పను. ఎందుచేత ననగా సూర్యుడు అస్తమించినచో యుద్ధానికి విఘ్నము వచ్చును. 23

మూ. చతుర్దశ సహస్రాణి రాక్షసానాం హతాని తే,
త్వద్వినాశాత్కరోమ్యేష తేషామశ్రుప్రమార్జనమ్. 24

ప్ర అ. తే=నీకు(నీచేత), రాక్షసానామ్=రాక్షసులయొక్క, చతుర్దశ =పదునాలుగు, సహస్రాణి=సహస్రములు, హతాని=చంపబడినవి, ఏషః= ఈ నేను, త్వద్వినాశాత్=నిన్ను చంపుటవలన, తేషామ్=వాళ్లయొక్క, అశ్రుప్రమారనమ్=కన్నీళ్లు తుడుచుటను, కరోమి=చేసెదను.

తా. నీవు పదునాలుగువేలమంది రాక్షసులను చంపితివి కదా. నే నిపుడు నిన్ను చంపి వాళ్ల (బంధువుల) కన్నీరు తుడిచెదను. 24

మూ. ఇత్యుక్త్వా పరమక్రుద్ధస్తాం గదాం పరమాఙ్గదః,
ఖరశ్చిక్షేప రామాయ ప్రదీప్తామశనిం యథా. 25

ప్ర. అ. పరమాఙ్గదః = శ్రేష్ఠము లైన బాహుపురులు గల, ఖరః = ఖరుడు, ఇతి = ఇట్లు, ఉక్త్వా = పలికి, పరమక్రుద్ధః = చాల కోపించినవాడై, ప్రదీప్తామ్ = ప్రజ్వలించుచున్న, అశనిం యథా = వజ్రాయుధము వలె ఉన్న, తాం గదామ్ = ఆ గదను, రామాయ = రామునకై, చిక్షేప = విసరెను.

తా. శ్రేష్ఠములైన బాహుపురులు ధరించి ఉన్న ఆ ఖరుడు ఇట్లు పలికి, చాలా కోపించినవాడై, ప్రజ్వలించుచున్న వజ్రాయుధము వలె ఉన్న ఆ గదను రామునిపైకి విసరెను. 25

మూ. ఖరబాహుప్రయుక్తా సా ప్రదీప్తా మహతీ గదా,
భస్మవృక్షాంశ్చ గుల్మాంశ్చ కృత్వాగాత్తత్సమీపతః. 26

ప్ర. అ. ఖరబాహుప్రయుక్తా = ఖరుని బాహువులచేత ప్రయోగింపబడిన, ప్రదీప్తా = ప్రజ్వలించుచున్న, మహతీ = గొప్పదైన, గదా = గద, వృక్షాంశ్చ = వృక్షములను, గుల్మాంశ్చ = పొదలను, భస్మ = భస్మగా, కృత్వా = చేసి, తత్సమీపతః = అతని సమీపమునుండి, అగాత్ = వెళ్లెను.

తా. ఖరుడు తన బాహువులతో ప్రయోగించిన, ఆ గొప్ప గద, మండుచు వృక్షములను, పొదలను భస్మము చేయుచు ఆతని వద్దనుండి రామునిమీదికి వెళ్ళెను. 26

మూ. తామాపతన్తీం జ్వలితాం మృత్యుపాశోపమాం గదామ్,
అన్తరిక్షగతాం రామశ్చిచ్ఛేద బహుధా శరైః. 27

ప్ర. అ. ఆపతన్తీమ్ = వచ్చి పడుచున్నది, జ్వలితామ్ = మండుచున్నది, మృత్యుపాశోపమామ్ = మృత్యుపాశముతో సమానమూ అయిన, తాం గదామ్ = ఆ గదను, అన్తరిక్షగతామ్ = ఆకాశములో ఉండగానే, రామః = రాముడు, శరైః = బాణములచేత, బహుధా = అనేకవిధములుగ, చిచ్ఛేద = ఛేదించెను.

తా. మండుచు, మృత్యుపాశము వలె వచ్చి మీద పడుచున్న ఆ గదను, రాముడు, అది ఆకాశములో ఉండగానే, బాణములతో చాల ముక్కలుగా ఖండించెను. 27

మూ. సా వికీర్ణా శరైర్భగ్నా పపాత ధరణీతలే,
గదా మన్త్రౌషధబలైర్వ్యాళీవ వినిపాతితా. 28

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ఏకోనత్రింశః సర్గః.

ప్ర. అ. శరైః = బాణములచేత, భగ్నా = విరగగొట్టబడిన, సా గదా = ఆ గద, మన్త్రౌషధబలైః = మంత్రౌషధముల బలములచేత, వినిపాతితా = పడగొట్టబడిన, వ్యాళీవ = ఆడ సర్పము వలె, వికీర్ణా = (ముక్కముక్కలుగా) చిమ్మబడినదై, ధరణీతలే = నేలమీద, పపాత = పడెను.

తా. బాణములచేత విరగగొట్టబడిన ఆ గద, మంత్రౌషధముల బలముచేత పడగొట్టబడిన ఆడ సర్పము వలె, ముక్కముక్కలుగా చిమ్మబడినదై నేలమీద పడెను. 28

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్య కాండలో ఇరువదితొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ త్రింశః సర్గః

[*రాముడు పరుషముగా మాటలాడగా ఖరుడు మరల రామునితో పరుషముగా మాటలాడి మద్దె చెట్టును విసరగా రాముడు దానిని ఖండించి ఖరుణ్ణి సంహరించుట. దేవతలు మునులు రాముణ్ణి స్తుతించుట*].

మూ. భిత్త్వా తు తాం గదాం బాణై రాఘవో ధర్మవత్సలః,
స్మయమానః ఖరం వాక్యం సంరబ్ధమిదమబ్రవీత్. 1

ప్ర. అ. ధర్మవత్సలః=ధర్మమునందు ఆసక్తి గల, రాఘవః=రాముడు, తాం గదామ్ = ఆ గదను, బాణైః=బాణములచేత, భిత్త్వా = విరుగగొట్టి, స్మయమానః = నవ్వుచు, సంరబ్ధమ్ = భ్రాంతిచెందిన, ఖరమ్ = ఖరుణ్ణిగూర్చి, ఇదం వాక్యమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. ధర్మమునందు ఆసక్తి గల రాముడు, బాణములచేత ఆ గదను విరుగగొట్టి, నవ్వుచు, నివ్వెరబోయిన ఆ ఖరునితో ఇట్లు పలికెను. 1

మూ. ఏతత్తే బలసర్వస్వం దర్శితం రాక్షసాధమ,
శక్తిహీనతరో మత్తో వృథా త్వమవగర్జసి. 2

ప్ర. అ. రాక్షసాధమ = ఓ ! రాక్షసాధమా ! తే = నీయొక్క, ఏతత్ = ఈ, బలసర్వస్వమ్ = బలముయొక్క సర్వస్వము (సమస్తధనము), దర్శితమ్= చూపబడినది. మత్తః = నాకంటె, శక్తిహీనతరః = చాలా శక్తివిహీనుడవైన, త్వమ్ = నీవు, వృథా = వ్యర్థముగా, అవగర్జసి = గర్జించుచున్నావు.

తా. రాక్షసాధమా! నీ కున్న బలము నంతా చూపించినావు! నీవు నాకంటె చాలా శక్తిహీనుడవు. అయినను వ్యర్థముగా గర్జించుచున్నావు. 2

మూ. ఏషా బాణవినిర్భిన్నా గదా భూమితలం గతా,
అభిధానప్రగల్భస్య తవ ప్రత్యయఘాతినీ. 3

ప్ర. అ. ఏషా = ఈ, గదా = గద, బాణవినిర్భిన్నా = బాణములచేత విరగగొట్టబడినదై, అభిధానప్రగల్భస్య = మాటలలో ప్రగల్భుడ వైన, తవ = నీయొక్క, ప్రత్యయఘాతినీ = నమ్మకమును వమ్ముచేసినదై, భూమితలమ్ = భూమిని, గతా = పొందినది.

తా. ఈ గద బాణములచేత బ్రద్దలుకొట్టబడినదై, మాటలలో ప్రగల్భుడ వైన నీ నమ్మకమును వమ్ముచేసి, నేలమీద పడిపోయినది. 3

మూ. యత్త్వయోక్తం వినష్టానామహమశ్రుప్రమార్జనమ్,
రాక్షసానాం కరోమీతి మిథ్యా తదపి తే వచః. 4

ప్ర. అ. అహమ్ = నేను, వినష్టానామ్ = మరణించిన, రాక్షసానామ్ = రాక్షసులయొక్క, అశ్రుప్రమార్జనమ్ = కన్నీళ్లు తుడుచుటను, కరోమీతి = చేసెదను అని, త్వయా = నీచేత, యత్ = ఏ వచనము, ఉక్తమ్ = పలకబడినదో, తే = నీయొక్క, తత్ = ఆ, వచః అపి = వచనము కూడ, మిథ్యా = అసత్యమే.

తా. "నేను వెళ్ళి మరణించిన రాక్షసుల కన్నీళ్లు తుడిచెదను"అని నీవు పలికిన మాట కూడ అసత్యమే కాగలదు. 4

మూ. నీచస్య క్షుద్రశీలస్య మిథ్యావృత్తస్య రక్షసః,
ప్రాణానహం హరిష్యామి గరుత్మానమృతం యథా. 5

ప్ర. అ. నీచస్య = నీచుడవు, క్షుద్రశీలస్య = దుష్టస్వభావము కలవాడవు, మిథ్యావృత్తస్య = చెడ్డ ప్రవృత్తి కలవాడవు, రక్షసః = రాక్షసుడవు అయిన నీయొక్క, ప్రాణాన్ = ప్రాణములను, అహమ్ = నేను, గరుత్మాన్ = గరుత్మంతుడు, అమృతం యథా = అమృతమును వలె, హరిష్యామి = హరించగలను.

తా. నీవు నీచుడవు. దుష్టస్వభావము కలవాడవు, చెడ్డ నడవడిక కల రాక్షసుడవు. అట్టి నీ ప్రాణములను, గరుత్మంతుడు అమృతమును హరించి నట్లు హరించగలను. 5

మూ. అద్య తే భిన్నకణ్ఠస్య ఫేనబుద్బుదభూషితమ్,
విదారితస్య మద్బాణైర్మహీ పాస్యతి శోణితమ్. 6

ప్ర. అ. అద్య = ఇప్పుడు, మద్బాణైః = నా బాణములచేత, విదారితస్య = చీల్చివేయబడిన, ఛిన్నకణ్ఠస్య=చేదించబడిన కంఠము గల, తే=నీయొక్క, ఫేనబుద్బుదభూషితమ్ = నురుగుచేతను, బుడగలచేతను అలంకరించబడిన, శోణితమ్ = రక్తమును, మహీ = భూమి, పాస్యతి = త్రాగగలదు.

తా. ఇప్పుడు నా బాణములచే చీల్చబడి, కంఠము తెగి పడిపోయెదవు. నురుగుచేత, బుడగలచేత అలంకరింపబడిన నీ రక్తమును భూమి త్రాగగలదు. 6

మూ. పాంసురూషితసర్వాఙ్గః స్రస్తన్యస్తభుజద్వయః,
స్వప్స్యసే గాం సమాలిఙ్గ్య దుర్లభాం ప్రమదామివ. 7

ప్ర. అ. పాంసురూషితసర్వాఙ్గః = పరాగములచేత పూయబడిన సకల దేహము కలవాడవై, స్రస్తన్యస్తభుజద్వయః = జారిపోవునట్లు పడవేయబడిన రెండు భుజములు కలవాడవై, దుర్లభామ్ = పొందుటకు శక్యము కాని, ప్రమదామివ = యువతిని వలె, గామ్=భూమిని, సమాలిఙ్గ్య=కౌగలించుకొని, స్వప్స్యసే = నిద్రించగలవు.

తా. దేహమంతా పరాగము పూసికొని, చేతులు రెండూ జారవిడచి, అతి కష్టముమీద లభించిన యువతిని వలె, భూమిని కౌగలించుకొని నిద్రించగలవు.

మూ. ప్రబద్ధనిద్రే శయితే త్వయి రాక్షసపాంసనే,
భవిష్యన్తి శరణ్యానాం శరణ్యా దణ్డకా ఇమే. 8

ప్ర. అ. రాక్షసపాంసనే = రాక్షసాధముడవైన, త్వయి = నీవు, ప్రబద్ధనిద్రే=కట్టబడిన నిద్ర గలవాడవై, శయితే=శయనించగా, ఇమే = ఈ,దణ్డకాః = దండకారణ్యములు, శరణ్యానామ్ = శరణు పొందదగిన ఋషుల, శరణ్యాః = రక్షకములుగా, భవిష్యన్తి = కాగలవు.

తా. రాక్షసాధముడవైన నీవు దీర్ఘనిద్ర వహించి శయనించిన పిమ్మట ఈ దండకారణ్యము, సర్వరక్షణసమర్థులైన మునులకు ఆశ్రయము కాగలదు. 8

మూ. జనస్థానే హతస్థానే తవ రాక్షస మచ్ఛరైః,
నిర్భయా విచరిష్యన్తి సర్వతో మునయో వనే. 9

తా. రాక్షస = ఓ! రాక్షసుడా! తవ = నీయొక్క, జనస్థానే=జనస్థానము, మచ్ఛరైః = నా బాణములచేత, హతస్థానే = కొట్టబడిన రాక్షస నివాసము కల దగుచుండగా, మునయః = మునులు, నిర్భయాః = భయము లేనివారై, సర్వత్ర = అంతటా, వనే = వనమునందు, విచరిష్యన్తి=సంచరించగలరు.

తా. ఓ రాక్షసుడా! నీ జనస్థానమునం దున్న రాక్షసనివాసము నన్నింటిని నేను బాణములచేత నశింపచేసిన పిమ్మట మునులు ఈ వనమునందు అంతటా నిర్భయముగా సంచరించగలరు. 9

మూ. అద్య విప్రసరిష్యన్తి రాక్షస్యో హతబాన్ధవాః,
బాష్పార్ద్రవదనా దీనా భయాదన్యభయావహాః. 10

ప్ర. అ. అన్యభయావహాః=ఇతరులకు భయము కలిగించు, రాక్షస్యః= = రాక్షసస్త్రీలు, హతబాన్ధవాః = చంపబడిన బంధువులు గలవారై,. బాష్పార్ద్ర వదనాః=కన్నీటితో తడిసిన ముఖములు కలవారై, భయాత్ = భయమువలన, దీనాః = దీనలై, అద్య = ఇప్పుడు, విప్రసరిష్యన్తి = పరుగెత్తెదరు.

తా. ఇంతవరకు ఇతరులకు భయము కలిగించే రాక్షసస్త్రీలు ఇప్పుడు బంధువులు మరణించుటచే కన్నీళ్లతో తడిసిన ముఖములతో, భయముచేత దీనలై పరుగెత్తగలరు. 10

మూ. అద్య శోకరసజ్ఞాస్తా భవిష్యన్తి నిరర్థకాః,
అనురూపకులాః పత్న్యో యాసాం త్వం పతిరీదృశః.

ప్ర. అ. యాసామ్ = ఏ స్త్రీలకు, ఈదృశః = ఇట్టివాడవైన, త్వమ్ = నీవు, పతిః = భర్తవో, అనురూపకులాః=నీకు తగిన కులమునందు పుట్టిన, తాః = ఆ, పత్న్యః = భార్యలు, అద్య=ఇప్పుడు, నిరర్థకాః=ప్రయోజనము లేని వారై, శోకరసజ్ఞాః=శోకము యొక్క రుచిని ఎరిగినవారు, భవిష్యన్తి=కాగలరు.

తా. నీకు తగిన కులములలో పుట్టి, ఇట్టి నిన్ను భర్తగా పొందిన నీ భార్య లందరు ఇపుడు తమ జీవితము ప్రయోజనరహిత మైపోవుటచేత దుఃఖము రుచిని తెలుసుకొనగలరు. 11

మూ. నృశంస నీచ క్షుద్రాత్మన్నిత్యం బ్రాహ్మణకణ్టక,
యత్కృతే శఙ్కితైరగ్నౌ మునిభిః పాత్యతే హవిః. 12

ప్ర. అ. నృశంశ = క్రూరుడా। నీచ=నీచుడా। క్షుద్రాత్మన్ = నీచబుద్ధి కలవాడా। నిత్యమ్ = ఎల్లప్పుడూ, బ్రాహ్మణకణ్టక = బ్రాహ్మణులకు కంటకమైన వాడా। యత్కృతే = ఏ నీ నిమిత్తమున, శఙ్కితైః = భయపడుచున్న, మునిభిః = మునులచేత, హవిః = హవిస్సు, అగ్నౌ = అగ్నియందు, పాత్యతే = వేయబడుచున్నదో.

తా. నీవు క్రూరుడవు. నీచుడవు. నీచబుద్ధివి. నిత్యము బ్రాహ్మణులను బాధించువాడవు. మునులు హవిస్సును అగ్నిలో హోమముచేయుచున్నప్పుడు నీకు భయపడుచున్నారు. 12

మూ. తమేవమభిసంరబ్ధం బ్రువాణం రాఘవం రణే,
ఖరో నిర్భర్త్సయామాస రోషాత్ఖరతరస్వరః. 13

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, రణే = యుద్ధమునందు, అభిసంరబ్ధమ్ = తొందరగా, బ్రువాణమ్=పలుకుచున్న, తం రాఘవమ్=ఆ రాముణ్ణి, రోషాత్= రోషమువలన, ఖరతరస్వరః= అధికముగా పరుషమైన స్వరముగలవాడై, ఖరః = ఖరుడు, నిర్భర్త్సయామా స = భయపెట్టెను.

తా. యుద్ధరంగములో ఈ విధముగా కోపావేశముతో మాటలాడుచున్న ఆ రాముణ్ణి చూచి, ఖరుడు, కోపమువలన ఇంకను పరుషమైన స్వరముతో ఇట్లు బెదిరించెను. 13

మూ. దృఢం ఖల్వవలిప్తోఽసి భయేష్వపి చ నిర్భయః,
వాచ్యావాచ్యం తతో హి త్వం మృత్యువశ్యో న బుధ్యసే.

ప్ర. అ. భయేష్వపి = భయసమయములందు కూడ, నిర్భయః = భయము లేని, త్వమ్ = నీవు, దృఢమ్=అధికముగా, అవలిప్తః అసి=గర్వించి ఉన్నావు. తతః = ఆ కారణములవలనే, మృత్యువశ్యః = మృత్యువునకు వశుడవైన నీవు, వాచ్యావాచ్యమ్=చెప్పదగిన దానిని, చెప్పదగనిదానిని, న బుధ్యసే= తెలుసుకొనజాలకున్నావు.

తా. నీకు చాల గర్వము కలిగినట్లున్నది. భయపడవలసిన సమయములో కూడ భయపడుటలేదు. అందుచేతనే, మృత్యువుకు వశుడవైన నీవు ఏమి మాటలాడవలెనో, ఏమి మాటలాడకూడదో తెలిసికొనజాలకున్నావు. 14

మూ. కాలపాశపరిక్షిప్తా భవన్తి పురుషా హి యే,
కార్యాకార్యం న జానన్తి తే నిరస్తషడిన్ద్రియాః. 15

ప్ర. అ. యే పురుషాః=ఏ పురుషులు, కాలపాశపరిక్షిప్తాః=కాలపాశము చేత చుట్టబడినవారు, భవన్తి=అగుదురో, తే = వారు, నిరస్తషడిన్ద్రియాః = చెడిన ఆరు ఇంద్రియములు కలవారై (మనస్సుతో జ్ఞానేంద్రియాలు ఆరు), కార్యాకార్యమ్ = కార్యాకార్యములను, న జానన్తి = ఎరుగరు.

తా. కాలపాశముచే చుట్టబెట్టబడిన పురుషులు ఆరు ఇంద్రియములు సరిగా పనిచేయక ఏది చేయదగినదో, ఏది చేయదగనిదో తెలియజాలరు. 15

మూ. ఏవముక్త్వా తతో రామం సంరుధ్య భ్రుకుటీం తతః,
స దదర్శ మహాసాలమవిదూరే నిశాచరః, 16
రణే ప్రహరణస్యార్థే సర్వతో హ్యవలోకయన్.

ప్ర. అ. సః నిశాచరః = ఆ రాక్షసుడు, రామమ్ = రాముణ్ణి గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, తతః = అటుపిమ్మట, భ్రుకుటీమ్=భ్రుకుటిని, సంరుధ్య = కట్టి, రణే = యుద్ధమునందు, ప్రహరణస్య అర్థే = ఆయుధము కొరకై, సర్వతః=నలువైపుల, అవలోకయన్ = చూచుచు, అవిదూరే = సమీపమునందు, మహాసాలమ్ = గొప్ప సాలవృక్షమును, దదర్శ=చూచెను.

తా. ఖరుడు రామునితో ఇట్లు పలికి, కోపముతో కనుబొమ్మలు విరచి, యుద్ధములో ఆయుధము నిమిత్తము నలుమూలల వెదకుచు, సమీపమునందే గొప్ప సాలవృక్షమును చూచెను. 16

మూ. స తముత్పాటయామాస సందశ్య దశనచ్ఛదమ్, 17
తం సముత్క్షిప్య బాహుభ్యాం వినద్య చ మహాబలః,
రామముద్దిశ్య చిక్షేప హతస్త్వమితి చాబ్రవీత్. 18

ప్ర. అ. సః = అతడు, దశనచ్ఛదమ్ = అధరోష్ఠమును, సందశ్య = కరచి, తమ్ = ఆ వృక్షమును, ఉత్పాటయామాస = పెకిలించెను. మహాబలః = గొప్ప బలము గల ఆ ఖరుడు, తమ్ = దానిని, బాహుభ్యామ్ = బాహువులచేత, సముత్క్షిప్య = ఎత్తి, వినద్య = బిగ్గరగా అరచి, రామమ్ ఉద్దిశ్య = రాముణ్ణి ఉద్దేశించి, చిక్షేప = విసిరెను. త్వమ్ = నీవు, హతః = చంపబడితివి, ఇతి = అని, అబ్రవీత్ చ = పలికెను కూడ.

తా. అతడు పెదవులు గట్టిగా బిగించి ఆ చెట్టును పెకిలించెను. మహా బలవంతుడైన ఆతడు దానిని రెండు చేతులతో ఎత్తి, బిగ్గరగా అరచుచు, రాముని పైకి విసిరి, "చచ్చినావు"అని అరచెను. 17, 18

మూ. తమాపతన్తం బాణౌఘైశ్ఛిత్త్వా రామః ప్రతాపవాన్,
రోషమాహారయత్తీవ్రం నిహన్తుం సమరే ఖరమ్. 19

ప్ర. అ. ప్రతాపవాన్ = ప్రతాపము గల, రామః = రాముడు, ఆపతన్తమ్ = వచ్చిపడుచున్న, తమ్ = ఆ వృక్షమును, బాణౌఘైః = బాణసముదాయములచేత, ఛిత్త్వా = ఛేదించి, సమరే = యుద్ధమునందు, ఖరమ్ = ఖరుణ్ణి, నిహన్తుమ్ = చంపుటకు, తీవ్రమ్ = తీవ్రమైన, రోషమ్ = కోపమును, ఆహారయత్ = తెప్పించు కొనెను.

తా. ప్రతాపవంతుడైన రాముడు మీద పడుచున్న ఆ సాలవృక్షమును బాణసముదాయములచేత ఖండించి, యుద్ధములో ఖరుణ్ణి చంపుటకు తీవ్రమైన రోషమును తెప్పించుకొనెను. 19

మూ. జాతస్వేదస్తతో రామో రోషాద్రక్తాన్తలోచనః,
నిర్బిభేద సహస్రేణ బాణానాం సమరే ఖరమ్. 20

ప్ర. అ. తతః = ఆటుపిమ్మట, జాతస్వేదః = పుట్టిన చెమట గలిగిన వాడు, రోషాత్ = రోషమువలన, రక్తాన్తలోచనః = ఎఱ్ఱనైన నేత్రాంతములు గల వాడు అయిన, రామః = రాముడు, బాణానామ్ = బాణముల యొక్క, సహస్రేణ = సహస్రముచేత, సమరే = యుద్ధమునందు, ఖరమ్ = ఖరుణ్ణి, నిర్బిభేద = భేదించెను.

తా. పిమ్మట బాగుగా చెమట పట్టి, రోషముతో ఎఱ్ఱనైన నేత్రాంతము

లతో ఉన్న రాముడు యుద్ధములో వేయి బాణములు ప్రయోగించి ఖరుని శరీరము బ్రద్దలుకొట్టెను. 20

మూ. తస్య బాణాన్తరాద్రక్తం బహు సుస్రావ ఫేనిలమ్,
గిరేః ప్రస్రవణస్యేవ తోయధారాపరిస్రవః. 21

ప్ర. అ. తస్య = ఆ ఖరునియొక్క, ఫేనిలమ్ = నురుగు గల, బహు = అత్యధికము అయిన, రక్తమ్ = రక్తము, బాణాన్తరాత్ = బాణముల రంధ్రముల నుండి, ప్రస్రవణస్య = ప్రస్రవణపర్వతము యొక్క, తోయధారాపరిస్రవః ఇవ = జలధారాస్రావము వలె, సుస్రావ = స్రవించెను.

తా. ఆతని శరీరముపై నాటిన బాణములు చేసిన రంధ్రములనుండి నురుగుతో కూడి అత్యధికమైన రక్తము, ప్రస్రవణపర్వతమునుండి జలధారాస్రావము వలె స్రవించెను. 21

మూ. విహ్వలః స కృతో బాణైః ఖరో రామేణ సంయుగే,
మత్తో రుధిరగన్ధేన తమేవాభ్యద్రవద్ద్రుతమ్. 22

ప్ర. అ. సంయుగే = యుద్ధమునందు, రామేణ = రామునిచేత, బాణైః = బాణములచేత; విహ్వలః = వ్యాకులుడుగా, కృతః = చేయబడిన, మత్తః = మదించిన, సః ఖరః = ఆ ఖరుడు, రుధిరగన్ధేన = రక్త దుర్గంధముతో, ద్రుతమ్ = శీఘ్రముగా, తం రామమేవ = ఆ రాముణ్ణే, అభ్యద్రవత్ = ఎదిరించి మీదికి పరుగెత్తెను.

తా. యుద్ధరంగమునందు రాముడు బాణములు ప్రయోగించి ఆ ఖరుణ్ణి చాల వ్యాకులుడగునట్లు చేసెను. మదించిన ఆ ఖరుడు, అప్పుడు, రక్తదుర్గంధముతో నిండి, ఆ రాముని మీదికి పరుగెత్తెను. 22

మూ. తమాపతన్తం సంరబ్ధం కృతాస్త్రో రుధిరాప్లుతమ్,
అపాసర్పద్ద్విత్రిపదం కించిత్త్వరితవిక్రమః. 23

ప్ర. అ. కృతాస్త్రః = చేయబడిన (నేర్వబడిన) అస్త్రములు గల, రామః = రాముడు, ఆపతన్తమ్ = వచ్చి మీద పడుచున్న, రుధిరాప్లుతమ్ = రక్తముచేత

పూయబడిన, సంరబ్ధమ్ = కోపావేశముతో ఉన్న, తమ్ = ఆతనిని(చూచి), త్వరిత విక్రమః = శీఘ్రమైన పాదవిన్యాసము గలవాడై, ద్విత్రిపదమ్ = రెండు మూడు అడుగులు, కించిత్ = కొంచెము, అపాసర్పత్ = దూరముగా తొలగెను.

తా. కోపావేశముతో మీదికి వచ్చుచున్న, రక్తముతో తడిసిన ఆ ఖరుణ్ణి చూచి, అస్త్రములందు నిపుణుడైన ఆ రాముడు శీఘ్రముగ అడుగులు వేసి రెండు మూడు అడుగులు, కొంచెము దూరము తొలగెను.

వి. "ప్రతిపదమ్"అను వావిళ్ళప్రతి పాఠమునకు బదులు "ద్విత్రి(త్ర)పదమ్" అను గోరఖ్‌పూర్‌ప్రతి పాఠము గ్రహింపబడినది. "ప్రతిపదమ్"అనుదాని అర్థము స్పష్టముగా లేదు. 'ఎదురుమార్గముగా'అను అర్థము ఎట్లు వచ్చినదో తెలియదు. "ప్రతిపదమ్ = ప్రతి అడుగునందు, త్వరితవిక్రమః = శీఘ్రమైన పాదన్యాసము కలవాడై"అని చెప్పుట యుక్తము. ప్రాచ్యపాఠము వేరుగా ఉన్నది.

"తమావత న్తం వేగేన దీప్తాస్యం రుధిరప్లుతమ్
అపసృత్య తతః స్థానాత్ దృష్ట్వా త్వరితవిక్రమః"

"ప్రజ్వలించుచున్న ముఖముతో వేగముగా మీదికి వచ్చుచున్న, రక్తముతో నిండిన వానిని చూచి తొందరగా అడుగులు వేసి ఆ స్థానమునుండి తొలగి......" అని అర్థము. 23

మూ. తతః పావకసంకాశం వధాయ సమరే శరమ్,
ఖరస్య రామో జగ్రాహ బ్రహ్మదణ్డమివాపరమ్. 24

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రామః = రాముడు, ఖరస్య = ఖరుని యొక్క, వధాయ = వధకొరకు, పావకసంకాశమ్ = అగ్నితో సమానమూ, అపరమ్ = రెండవ, బ్రహ్మదణ్డమివ = బ్రహ్మదండము వలె ఉన్నదీ అయిన, శరమ్ = బాణమును, సమరే = యుద్ధమునందు, జగ్రాహ = గ్రహించెను.

తా. పిమ్మట రాముడు, యుద్ధములో, ఖరుణ్ణి సంహరించుటకై అగ్నితో సమానము, రెండవ బ్రహ్మదండము వలె ఉన్నదీ అయిన శరమును గ్రహించెను.

మూ. స తం దత్తం మఘవతా సురరాజేన ధీమతా,
సందధే చాపి ధర్మాత్మా ముమోచ చ ఖరం ప్రతి. 25

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, సః = ఆ రాముడు, ధీమతా = బుద్ధిమంతుడు, మఘవతా = ఐశ్వర్యసంపన్నుడు అయిన, సురరాజేన = దేవేంద్రునిచేత, దత్తమ్ = ఇవ్వబడిన, తమ్ = ఆ బాణమును, సందధే = సంధించెను. ఖరం ప్రతి = ఖరుని గూర్చి, ముమోచ చ = విడచెను కూడ.

తా. రాముడు, ఐశ్వర్యసంపన్నుడూ, బుద్ధిమంతుడూ అయిన దేవేంద్రుడిచ్చిన ఆ బాణమును సంధించి ఖరునిపై ప్రయోగించెను. 25

మూ. స విముక్తో మహాబాణో నిర్ఘాతసమనిస్వనః,
రామేణ ధనురాయమ్య ఖరస్యోరస్యపాతయత్. 26

ప్ర. అ. రామేణ = రామునిచేత, ధనుః = ధనస్సును, ఆయమ్య = వంచి, ఖరస్య = ఖరునియొక్క, ఉరసి = వక్షఃస్థలమునందు, విముక్తః = విడువబడిన, నిర్ఘాతసమనిస్వనః = ఉరుముతో సమానమైన ధ్వని గల, సః బాణః = ఆ బాణము, అపాతయత్ = వానిని పడవేసెను.

తా. రాముడు ధనస్సును బాగా లాగి ఖరుని వక్షఃస్థలముమీద విడచిన ఆ బాణము, పిడుగుతో సమానమైన ధ్వనితో వెళ్ళి ఖరుణ్ణి నేలమీద పడవేసెను. 26

మూ. స పపాత ఖరో భూమౌ దహ్యమానః శరాగ్నినా,
రుద్రేణేవ వినిర్దగ్ధః శ్వేతారణ్యే యథాన్ధకః. 27

ప్ర. అ. శరాగ్నినా = బాణాగ్నిచేత, దహ్యమానః = కాల్చబడుచున్న, సః = ఆ, ఖరః = ఖరుడు, శ్వేతారణ్యే = శ్వేతారణ్యమునందు, రుద్రేణ = రుద్రునిచేత, వినిర్దగ్ధః = కాల్చబడిన, అన్ధకః యథా = అంధకాసురుడు వలె, భూమౌ = నేలమీద, పపాత = పడెను.

తా. ఆ బాణాగ్ని కాల్చివేయుచుండగా ఖరుడు, శ్వేతారణ్యమునందు రుద్రునిచే కాల్చబడిన అంధకాసురుడు వలె నేలపై పడిపోయెను. 27

మూ. స వృత్ర ఇవ వజ్రేణ ఫేనేన నముచిర్యథా,
బలోవేన్ద్రాశనిహతో నిపపాత హతః ఖరః. 28

ప్ర. అ. సః ఖరః = ఆ ఖరుడు, హతః = చంపబడినవాడై, వజ్రేణ =

వజ్రముచేత చంపబడిన, వృత్ర ఇవ = వృత్రాసురుడు వలె, ఫేనేన = నురుగు చేత చంపబడిన, నముచిర్యథా = నముచి అనే రాక్షసుడు వలె, ఇన్ద్రాశనిహతః = ఇంద్రుని వజ్రాయుధముచేత చంపబడిన, బలో వా = బలాసురుడు వలె, నిపపాత = పడెను.

తా. రామబాణముచేత చంపబడిన ఖరుడు, వజ్రముచేత చంపబడిన వృత్రాసురుడు వలె, నురుగుచేత చంపబడిన నముచి వలె, ఇంద్రుని వజ్రముచేత చంపబడిన బలాసురుడు వలె నేలపై పడెను. 28

మూ. తతో రాజర్షయః సర్వే సంగతాః పరమర్షయః,
సభాజ్య ముదితా రామమిదం వచనమబ్రువన్. 29

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సర్వే = సమస్తమైన, రాజర్షయః = రాజర్షులు, పరమర్షయః = పరమర్షులు, సంగతాః = కలిసినవారై, ముదితాః = సంతోషించినవారై, రామమ్ = రాముణ్ణి, సభాజ్య = గౌరవించి, ఇదమ్ = ఈ, వచనమ్ = వచనమును, అబ్రువన్ = పలికిరి.

తా. పిమ్మట రాజర్షులు, మహర్షులు అందరు కలిసి, సంతోషించుచు, రాముణ్ణి గౌరవించి, ఇట్లు పలికిరి. 29

మూ. ఏతదర్థం మహాతేజా మహేన్ద్రః పాకశాసనః,
శరభఙ్గాశ్రమం పుణ్యమాజగామ పురన్దరః. 30

ప్ర. అ. పాకశాసనః = పాకాసురుణ్ణి సంహరించిన, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, పురన్దరః = శత్రుపురసంహారకుడైన, మహేన్ద్రః = మహేంద్రుడు, ఏతదర్థమ్ = ఈ కార్యమునిమిత్తమే, పుణ్యమ్ = పుణ్యమైన, శరభఙ్గాశ్రమమ్ = శరభంగాశ్రమమును గూర్చి, ఆజగామ = వచ్చెను.

తా. పాకాసురుణ్ణి సంహరించినవాడు, శత్రుపురములను నశింపచేసిన వాడు, మహాతేజఃశాలీ అయిన దేవేంద్రుడు ఈ కార్యమునే గూర్చి పుణ్యమైన శరభంగాశ్రమమునకు వచ్చెను. 30

మూ. ఆనీతస్త్వమిమం దేశముపాయేన మహర్షిభిః,
ఏషాం వధార్థం క్రూరాణాం రక్షసాం పాపకర్మణామ్. 31

ప్ర. అ. క్రూరాణామ్ = క్రూరులు, పాపకర్మణామ్ = పాపకర్మ గల వారు, అయిన, ఏషామ్ = ఈ, రక్షసామ్ = రాక్షసులయొక్క, వధార్థమ్ = వధ కొరకే, త్వమ్ = నీవు, మహర్షిభిః = మహర్షులచేత, ఉపాయేన = ఉపాయముచేత, ఇమమ్ = ఈ, దేశమ్ = దేశమును గూర్చి, ఆనీతః = తీసికొనిరాబడితివి.

తా. క్రూరులు, పాపాత్ములూ అయిన ఈ రాక్షసులను వధించుటకొరకే నిన్ను మహర్షు లందరు, ఉపాయముచేత ఈ ప్రదేశమునకు తీసికొనివచ్చిరి. 31

మూ. తదిదం నః కృతం కార్యం త్వయా దశరథాత్మజ,
సుఖం ధర్మం చరిష్యన్తి దణ్డకేషు మహర్షయః. 32

ప్ర. అ. దశరథాత్మజ = రామా! నః = మాయొక్క, తత్ = ఆ, ఇదమ్ = ఈ, కార్యమ్ = కార్యము. కృతమ్ = చేయబడినది. మహర్షయః = మహర్షులు, దణ్డకేషు = దండకారణ్యములందు, సుఖమ్ = సుఖముగా, ధర్మమ్ = ధర్మమును, చరిష్యన్తి = ఆచరించగలరు.

తా. రామా! నీవు ఈ మా కార్యమును పూర్తిచేసినావు. మహర్షులు దండకారణ్యములో సుఖముగా ధర్మమును ఆచరించగలరు. 32

మూ. ఏతస్మిన్నన్తరే దేవాశ్చారణైః సహ సంగతాః,
దున్దుభీంశ్చాభినిఘ్నన్తః పుష్పవర్షం సమన్తతః. 33
రామస్యోపరి సంహృష్టా వవృషుర్విస్మితాస్తదా.

ప్ర. అ. ఏతస్మిన్ అన్తరే = ఇంతలో, దేవాః = దేవతలు, చారణైః సహ = చారణులతో, సంగతాః = కలిసినవారై, సంహృష్టాః = సంతోషించినవారై, దున్దుభీన్ = దుందుభులను, అభినిఘ్నన్తః = మ్రోగించుచున్నవారై, తదా = అప్పుడు, విస్మితాః = ఆశ్చర్యపడినవారై, రామస్య = రామునియొక్క, ఉపరి = పైన, సమన్తతః = నలుమూలలనుండి, పుష్పవర్షమ్ = పుష్పవర్షమును, వవృషుః = వర్షించిరి.

తా. ఇంతలో దేవతలు, చారణులు కలిసి వచ్చి, ఆశ్చర్యచకితులై, ఆనందించుచు, దుందుభులను మ్రోగించుచు, నలుమూలలనుండి రామునిమీద పుష్పవరము కురిపించిరి. 33

మూ. అర్ధాధికముహూర్తేన రామేణ నిశితైః శరైః, 34
చతుర్దశసహస్రాణి రక్షసాం భీమకర్మణామ్,
ఖరదూషణముఖ్యానాం నిహతాని మహాహవే. 35

ప్ర. అ. రామేణ = రామునిచేత, అర్ధాధికముహూర్తేన = అర్ధము అధికముగా గల ఒక ముహూర్తకాలముచేత (నందు), నిశితైః = వాడియైన, శరైః = బాణములచేత, మహాహవే = మహాయుద్ధమునందు, భీమకర్మణామ్ = భయంకరమైన కర్మలు గల, ఖరదూషణముఖ్యానామ్ = ఖరుడు, దూషణుడు మొదలైన, రక్షసామ్ = రాక్షసులయొక్క, చతుర్దశ = పదునాలుగు, సహస్రాణి = సహస్రములు, నిహతాని = చంపబడినవి.

తా. రాముడు మహాయుద్ధములో, వాడియైన బాణములచేత, భయంకరములైన పనులు చేయు ఖరుడు, దూషణుడు మొదలైన పదునాలుగువేల రాక్షసులను సార్ధముహూర్తకాలములో (ఒకటిన్నర ముహూర్తము, అనగా ఒక గంట పన్నెండు నిముషముల కాలములో) సంహరించెను. 34,35

మూ. అహో బత మహత్కర్మ రామస్య విదితాత్మనః,
అహో వీర్యమహో దాక్ష్యం విష్ణోరివ హి దృశ్యతే. 36
ఇత్యేవముక్త్వా తే సర్వే జగ్ముర్దేవా యథాగతమ్.

ప్ర. అ. విదితాత్మనః = ప్రసిద్ధమైన బుద్ధి గల, రామస్య = రాముని యొక్క, మహత్ = గొప్పదైన, కర్మ = పని, అహో బత = ఎంతటి ఆశ్చర్యకరము. వీర్యమ్ = పరాక్రమము, అహో = ఎంత ఆశ్చర్యకర మైనది. దాక్ష్యమ్ = నేర్పు, అహో = ఎంత ఆశ్చర్యకరమైనది। విష్ణోరివ = విష్ణువుయొక్క వీర్యము వలె దాక్ష్యము వలె, దృశ్యతే = కనబడుచున్నది. ఇత్యేవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, సర్వే = సమస్తమైన, తే దేవాః = ఆ దేవతలు, యథాగతమ్ = వచ్చినట్లుగానే, జగ్ముః = వెళ్ళిరి.

తా. "ప్రసిద్ధమైన బుద్ధి గల రాముడు చేసిన ఈ మహాకార్యము ఎంత ఆశ్చర్యకరము। ఈతని వీర్యము, నేర్పు కూడ విష్ణువు వీర్యము, నేర్పు వలె కనబడుచున్నది. ఎంత ఆశ్చర్యము। ఇట్లు పలికి ఆ దేవతలందరు వచ్చిన దారినే వెళ్ళిరి. 36

మూ. ఏతస్మిన్నన్తరే వీరో లక్ష్మణః సహ సీతయా, 37
గిరిదుర్గాద్వినిష్క్రమ్య స వివేశాశ్రమం సుఖీ.

ప్ర. అ. ఏతస్మిన్ అన్తరే = ఈ మధ్యసమయమునందు, వీరః = వీరుడైన, సః లక్ష్మణః = ఆ లక్ష్మణుడు, సీతయా సహ = సీతతో కూడ, గిరిదుర్గాత్ = పర్వతమునందలి ప్రవేశింప శక్యము కాని ప్రదేశమునుండి, వినిష్క్రమ్య = బైటకు వచ్చి, సుఖీ = సంతోషము కలవాడై. ఆశ్రమమ్ = ఆశ్రమమును, వివేశ = ప్రవేశించెను.

తా. ఇంతలో వీరుడైన ఆ లక్ష్మణుడు సీతతో కూడ పర్వతగుహనుండి బైటకు వచ్చి సంతోషించుచు ఆశ్రమములో ప్రవేశించెను. 37

మూ. తతో రామస్తు విజయీ పూజ్యమానో మహర్షిభిః, 38
ప్రవివేశాశ్రమం వీరో లక్ష్మణేనాభిపూజితః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, విజయీ = విజయవంతుడైన, వీరః = వీరుడైన, రామస్తు = రాముడు, మహర్షిభిః = మహర్షులచేత, పూజ్యమానః = పూజింపబడుచు, లక్ష్మణేన = లక్ష్మణునిచేత, అభిపూజితః = ఎదురుగా వచ్చి పూజింపబడినవాడై, ఆశ్రమమ్ = ఆశ్రమమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. పిమ్మట యుద్ధములో విజయమును పొందిన మహావీరుడైన రాముడు మహర్షులు పూజించుచుండగా, లక్ష్మణుడు ఎదురుగా వచ్చి అభినందించుచుండగా ఆశ్రమములో ప్రవేశించెను. 38

మూ. తం దృష్ట్వా శత్రుహన్తారం మహర్షీణాం సుఖావహమ్,
బభూవ హృష్టా వైదేహీ భర్తారం పరిషస్వజే.

ప్ర. అ. వైదేహీ = సీత, శత్రుహన్తారమ్ = శత్రువులను సంహరించినవాడు, మహర్షీణామ్ = మహర్షులకు, సుఖావహమ్ = సుఖము కలిగించినవాడు అయిన, తమ్ = ఆ, భర్తారమ్ = భర్తను, దృష్ట్వా = చూచి, హృష్టా = సంతోషించినది, బభూవ = అయెను. పరిషస్వజే = కౌగలించుకొనెను.

తా. శత్రువులను సంహరించి మహర్షులకు ఆనందము కలిగించిన భర్తను చూచి, సీత సంతోషించుచు అతని కౌగలించుకొనెను. 39

మూ. ముదా పరమయా యుక్తా దృష్ట్వా రక్షోగణాన్ హతాన్,
రామం చైవావ్యథం దృష్ట్వా తుతోష జనకాత్మజా.

ప్ర. అ. జనకాత్మజా = సీత, హతాన్ = చంపబడిన, రక్షోగణాన్ = రాక్షససముదాయములను, దృష్ట్వా = చూచి, పరమయా = గొప్పదైన, ముదా = సంతోషముతో, యుక్తా = కూడినదై, రామం చైవ = రాముణ్ణి కూడ, అవ్యథమ్ = బాధ లేనివానినిగా, దృష్ట్వా = చూచి, తుతోష = సంతోషించెను.

తా. సీత రామునిచే వధింపబడిన రాక్షసుల నందరిని చూచి చాల సంతోషించెను. రామునకు ఏ విధమైన వ్యథ కలుగకపోవుటను కూడ చూచి సంతోషించెను. 40

మూ. తతస్తు తం రాక్షససంఘమర్దనం
సభాజ్యమానం ముదితైర్మహర్షిభిః,
పునః పరిష్వజ్య శశిప్రభాననా
బభూవ హృష్టా జనకాత్మజా తదా. 41

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
త్రింశః సర్గః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, శశిప్రభాననా = చంద్రుని కాంతి వంటి కాంతి గల ముఖము గల, జనకాత్మజా = సీత, రాక్షససంఘమర్దనమ్ = రాక్షససముదాయమును సంహరించినవాడు, ముదితైః = సంతోషించిన, మహర్షిభిః = మహర్షులచేత, సభాజ్యమానమ్ = గౌరవింపబడుచున్నవాడు అయిన, తమ్ = ఆ రాముణ్ణి, పునః = మరల, పరిష్వజ్య = కౌగలించుకొని, తదా = అప్పుడు, హృష్టా = సంతోషించినది, బభూవ = ఆయెను.

తా. రాక్షససముదాయమును సంహరించుటచే ఆనందించుచున్న మహర్షులచేత గౌరవింపబడుచున్న రాముణ్ణి, చంద్రుని వంటి ముఖకాంతి గల సీత మరల మరల కౌగలించుకొని సంతోషముతో ఉండెను. 41

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో
ముప్పదవ సర్గ సమాప్తము.

అథ ఏకత్రింశః సర్గః

[*ఖరుడు మొదలైనవారి మరణమును అకంపనుడు చెప్పగా విని రావణుడు సీతను హరించుటకై ఉద్యమించుట, మారీచుని ఉపదేశముచే ఆ కార్యమునుండి విరమించుట*].

మూ. త్వరమాణస్తతో గత్వా జనస్థానాదకమ్పనః,
ప్రవిశ్య లఙ్కాం వేగేన రావణం వాక్యమబ్రవీత్. 1

ప్ర. అ. తతః = అటు పిమ్మట, అకమ్పనః = అకంపనుడు, త్వరమాణః = తొందరపడుచు, జనస్థానాత్ = జనస్థానమునుండి, గత్వా = వెళ్ళి, వేగేన = వేగముతో, లఙ్కామ్ = లంకను, ప్రవిశ్య = ప్రవేశించి, రావణమ్ = రావణుని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. పిమ్మట అకంపను డను రాక్షసుడు తొందరపడుచు, జనస్థానము నుండి బయలుదేరి, వేగముగా లంక చేరి, రావణునితో ఇట్లు పలికెను. 1

మూ. జనస్థానస్థితా రాజన్ రాక్షసా బహవో హతాః,
ఖరశ్చ నిహతః సంఖ్యే కథం చిదహమాగతః. 2

ప్ర. అ. రాజన్ = రాజా! జనస్థానస్థితాః = జనస్థానములో ఉన్న, బహవః = చాలమంది, రాక్షసాః = రాక్షసులు, హతాః = చంపబడినారు. సంఖ్యే = యుద్ధమునందు, ఖరశ్చ = ఖరుడు కూడ, నిహతః = చంపబడినాడు. అహమ్ = నేను, కథం చిత్ = ఎట్లో, ఆగతః = వచ్చినాను.

తా. రాజా! జనస్థానములో ఉన్న చాలామంది రాక్షసులు చంపబడినారు. యుద్ధములో ఖరుడు కూడ చంపబడినాడు. నేను మాత్రం ఎట్లో తప్పించుకొని వచ్చినాను. 2

మూ. ఏవముక్తో దశగ్రీవః క్రుద్ధః సంరక్తలోచనః,
అకమ్పనమువాచేదం నిర్దహన్నివ చక్షుషా. 3

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, దశగ్రీవః = రావణుడు, క్రుద్ధః = కోపించినవాడై, కోపసంరక్తలోచనః = కోపముచేత ఎఱ్ఱనైన నేత్రములు కలవాడై, చక్షుషా = నేత్రముతో, నిర్దహన్నివ = కాల్చుచున్నవాడువలె, అకమ్పనమ్ = అకంపనుణ్ణి గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. ఆ మాటలు విన్న రావణుడు కోపముతో ఎఱ్ఱనైన నేత్రములు కలవాడై చూపుతో కాల్చివేయుచున్నాడా అన్నట్లు చూచుచు, అకంపనునితో ఇట్లు పలికెను. 3

మూ. కేన రమ్యం జనస్థానం హతం మమ పరాసునా,
కో హి సర్వేషు లోకేషు గతిం నాధిగమిష్యతి. 4

ప్ర. అ. పరాసునా = పోయిన ప్రాణములు గల, కేన = ఎవనిచేత, మమ = నాయొక్క, రమ్యమ్ = రమ్యమైన, జనస్థానమ్ = జనస్థానము, హతమ్ = నశింపచేయబడినది? సర్వేషు = సమస్తమైన, లోకేషు = లోకములయందు, కః = ఎవ్వడు, గతిమ్ = గతిని, నాధిగమిష్యతి = పొందడు?

తా. రమ్యమైన నా జనస్థానమును పాడుచేసిన ఆ క్షీణాయుర్దాయవంతుడు ఎవడు? నాకు అపకారము చేసి ఏ లోకములోను గతిలేకుండా పోవలసిన అతడు ఎవడు? 4

మూ. న హి మే విప్రియం కృత్వా శక్యం మఘవతా సుఖమ్,
ప్రాప్తుం వైశ్రవణేనాపి న యమేన న విష్ణునా. 5

ప్ర. అ. మే = నాకు, విప్రియమ్ = అపకారమును, కృత్వా = చేసి, మఘవతా = దేవేంద్రునిచేత కూడ, సుఖమ్ = సుఖము, ప్రాప్తుమ్ = పొందుటకు, న శక్యం హి = శక్యము కాదు కదా ? వైశ్రవణేనాపి = కుబేరునిచేత నైనా, న = సుఖము పొంద శక్యముకాదు. యమేన = యమునిచేత, న = పొంద శక్యము కాదు. విష్ణునా = విష్ణువుచేత, న = పొంద శక్యము కాదు.

తా. నాకు అపకారము చేసి దేవేంద్రుడైనను, కుబేరుడైనను, యముడైనను, విష్ణువైనను సుఖముగా ఉండజాలడు కదా? 5

మూ. కాలస్య చాప్యహం కాలో దహేయమపి పావకమ్,
మృత్యుం మరణధర్మేణ సంయోజయితుముత్సహే. 6

ప్ర. అ. అహమ్ = నేను, కాలస్య చాపి = యమునకు కూడ, కాలః = యముడను. పావకమపి = అగ్నిని కూడ, దహేయమ్ = కాల్చివేయుదును. మృత్యుమ్=మృత్యువును, మరణధర్మేణ = మరణముతో, సంయోజయితుమ్ = = కూర్చుటకు, ఉత్సహే = ఉత్సహించెదను.

తా. నేను యమునకు కూడ యముడను. అగ్నిని కూడ కాల్చివేయగలను. మృత్యుదేవతకు కూడ మరణము కూర్చ సమర్థుడను. 6

మూ. దహేయమపి సంక్రుద్ధస్తేజసాదిత్యపావకౌ,
వాతస్య తరసా వేగం నిహన్తుమహముత్సహే. 7

ప్ర. అ. సంక్రుద్ధః = కోపించినవాడనై, తేజసా = తేజస్సుచేత, ఆదిత్యపావకౌ అపి = సూర్యాగ్నులను కూడ, దహేయమ్ = కాల్చివేయుదును. తరసా = వేగముచేత, వాతస్య = వాయువుయొక్క, వేగమ్ = వేగమును, నిహన్తుమ్= కొట్టుటకు, అహమ్ = నేను, ఉత్సహే = ఉత్సహింతును.

తా. నాకు కోపము వచ్చినచో తేజస్సుచేత సూర్యాగ్నులను కూడ కాల్చివేయగలను. వేగముచేత వాయువేగమును కూడ అణచివేయగలను. 7

మూ. తథా క్రుద్ధం దశగ్రీవం కృతాఞ్జలిరకమ్పనః,
భయాత్సన్దిగ్ధయా వాచా రావణం యాచతేఽభయమ్. 8

ప్ర. అ. అకమ్పనః = అకంపనుడు, కృతాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడై, తథా = ఆ విధముగా, క్రుద్ధమ్ = కోపించిన, రావణమ్ = రావణుణ్ణి. భయాత్ = భయమువలన, సందిగ్ధయా = సందేహముతో కూడిన, వాచా = వాక్కుతో, అభయమ్ = అభయమును, యాచతే = యాచించుచున్నాడు. (యాచించెను).

తా. అకంపనుడు అంజలి ఘటించి, భయముచేత తొట్రుపడుచున్న మాటలతో ఆ విధముగా కోపించిన దశకంఠుడైన రావణుణ్ణి అభయము ఇమ్మని ప్రార్థించెను. 8

మూ. దశగ్రీవోఽభయం తస్మై ప్రదదౌ రక్షసాం వరః,
స విస్రబ్ధోఽబ్రవీద్వాక్యమసందిగ్ధమకమ్పనః. 9

ప్ర. అ. రక్షసామ్ = రాక్షసులలో, వరః = శ్రేష్ఠుడైన, దశగ్రీవః = =రావణుడు, తస్మై = వానికొరకు, అభయమ్ = అభయమును, ప్రదదౌ = ఇచ్చెను. సః అకమ్పనః = ఆ అకంపనుడు, విస్రబ్ధః = విశ్వాసము కలవాడై, అసందిగ్ధమ్ = సందేహము లేని, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. రాక్షసశ్రేష్ఠుడైన రావణుడు అతనికి అభయ మిచ్చెను. అప్పుడు ఆ అకంపనుడు నమ్మకముతో, ఏ మాత్రము సందేహమునకు తావు లేని మాటలతో ఇట్లు చెప్పెను. 9

మూ. పుత్రో దశరథస్యాస్తి సింహసంహననో యువా,
రామో నామ వృషస్కన్ధో వృత్తాయతమహాభుజః. 10

ప్ర. అ. సింహసంహననః = సింహము ఆకారము వంటి ఆకారము కలవాడు, యువా = యువకుడు, దశరథస్య=దశరథునియొక్క, పుత్రః=పుత్రుడు, వృషస్కన్ధః = వృషభము వంటి మూపు గలవాడు, వృత్తాయతమహాభుజః = గుండ్రని, దీర్ఘమైన బలమైన భుజములు కలవాడు అయిన, రామో నామ = రాముడనువాడు, అస్తి = ఉన్నాడు.

తా. దశరథకుమారుడైన రాముడను ఒక యువకుడు ఉన్నాడు. అతని ఆకారము సింహము ఆకారము వలె గంభీరముగా ఉండును. అతని మూపు, వృషభము మూపువలె బలముగా ఉండును. బలిష్ఠములైన అతని భుజములు గుండ్రముగా, దీర్ఘముగా ఉండును. 10

మూ. వీరః పృథుయశాః శ్రీమా నతుల్యబలవిక్రమః,
హతం తేన జనస్థానం ఖరశ్చ సహ దూషణః. 11

ప్ర. అ. (ఆ రాముడు), వీరః = వీరుడు. పృథుయశాః = గొప్ప కీర్తి గలవాడు. అతుల్యబలవిక్రమః = సాటిలేని బలపరాక్రమములు కలవాడు. తేన = ఆ రామునిచేత, జనస్థానమ్ = జనస్థానము, హతమ్ = చంపబడినది. సహదూషణః = దూషనితో కూడిన, ఖరశ్చ = ఖరుడు కూడ, చంపబడినాడు.

తా. ఆ రాముడు గొప్ప వీరుడు, గొప్ప కీర్తి గలవాడు, శోభ గలవాడు. సాటి లేని బలపరాక్రమములు కలవాడు. అతడు జనస్థానములోని సర్వరాక్షసులను దూషణసహితుడైన ఖరుణ్ణి సంహరించినాడు. 11

మూ., అకమ్పనవచః శ్రుత్వా రావణో రాక్షసాధిపః,
నాగేన్ద్ర ఇవః నిఃశ్వస్య వచనం చేదమబ్రవీత్. 12

ప్ర. అ. రాక్షసాధిపః = రాక్షస రాజైన, రావణః = రావణుడు, అకమ్పనవచః = అకంపనుని వచనమును, శ్రుత్వా = విని, నాగేన్ద్రః ఇవ = మహాసర్పము వలె, నిఃశ్వస్య = నిట్టూర్చి, ఇదమ్ = ఈ, వచనం చ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. రాక్షసరాజైన రావణుడు అకంపనుని మాటలు విని, మహాసర్పము వలె నిట్టూర్చుచు ఇట్లు పలికెను. 12

మూ. స సురేన్ద్రేణ సంయుక్తో రామః సర్వామరైః సహ,
ఉపయాతో జనస్థానం బ్రూహి కచ్చిదకమ్పన. 13

ప్ర..అ. అకమ్పన = ఓః అకంపనుడాః సః రామః = ఆ రాముడు, సురేన్ద్రేణ = దేవేంద్రునితోను, సర్వామరైః సహ = సకలదేవతలతోను, సంయుక్తః = కూడినవాడై, జనస్థానమ్ = జనస్థానమును గూర్చి, ఉపయాతః కచ్చిత్ = వచ్చినాడా? బ్రూహి = చెప్పుము.

తా. అకంపనా! ఆ రాముడు దేవేంద్రునితోను, సకలదేవతలతోను కలిసి జనస్థానమునకు వచ్చినాడా? చెప్పుము. 13

మూ. రావణస్య పునర్వాక్యం నిశమ్య తదకమ్పనః,
ఆచచక్షే బలం తస్య విక్రమం చ మహాత్మనః. 14

ప్ర. అ. అకమ్పనః = అకంపనుడు, రావణస్య = రావణునియొక్క, తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, నిశమ్య = విని, మహాత్మనః = మహాత్ముడైన, తస్య = ఆ రామునియొక్క, బలమ్ = బలమును, విక్రమం చ = పరాక్రమమును గూర్చి, పునః = మరల, ఆచచక్షే = చెప్పెను.

తా. అకంపనుడు రావణుని మాటలు విని, మహాత్ముడైన ఆ రాముని బలమును, పరాక్రమమును గూర్చి మరల చెప్పెను. 14

మూ. రామో నామ మహాతేజాః శ్రేష్ఠః సర్వధనుష్మతామ్,
దివ్యాస్త్రగుణసంపన్నః పురన్దరసమో యుధి. 15

ప్ర. అ. రామో నామ = రాము డనగా, మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడు. సర్వధనుష్మతామ్ = సకలధనుర్ధరులలో, శ్రేష్ఠః = శ్రేష్ఠుడు. దివ్యాస్త్రగుణసంపన్నః = దివ్యములైన అస్త్రము లుండుట అనే వైశిష్ట్యముతో కూడినవాడు. యుధి = యుద్ధమునందు, పురన్దరసమః = దేవేంద్రునితో సమానుడు.

తా. రాము డనగా గొప్ప తేజస్సు కలవాడు. ధనుర్ధరు లందరిలోను శ్రేష్ఠుడు. దివ్యములైన అస్త్రములు కలిగియుండుట అనే వైశిష్ట్యము కలవాడు. యుద్ధములో దేవేంద్రునితో సమానుడు. 15

మూ. తస్యానురూపో బలవాన్ రక్తాక్షో దున్దుభిస్వనః,
కనీయాన్ లక్ష్మణో నామ భ్రాతా శశినిభాననః. 16

ప్ర. అ. బలవాన్ = బలవంతుడు, రక్తాక్షః = ఎఱ్ఱని నేత్రములు కలవాడు, దున్దుభిస్వనః = దుందుభి వంటి ధ్వని కలవాడు, శశినిభాననః = చంద్రునితో సమానమైన ముఖము గలవాడు, అయిన, లక్ష్మణో నామ = లక్ష్మణు డను వాడు, తస్య = ఆ రామునకు, అనురూపః = తగిన, కనీయాన్ = చిన్నవాడైన, భ్రాతా = సోదరుడు.

తా. ఆ రామునకు తగిన లక్ష్మణు డనే ఒక తమ్ము డున్నాడు. అతడు బలశాలి. ఎఱ్ఱని నేత్రములు, దుందుభిధ్వని వంటి గంభీరమైన కంఠధ్వని, చంద్రుని వంటి ముఖము కలవాడు. 16

మూ. స తేన సహ సంయుక్తః పావకేనానిలో యథా,
శ్రీమాన్ రాజవరస్తేన జనస్థానం నిపాతితమ్. 17

ప్ర. అ. శ్రీమాన్ = శోభకలవాడు, రాజవరః = రాజశ్రేష్ఠుడు అయిన, సః = ఆ రాముడు, అనిలః = వాయువు, పావకేన యథా = అగ్నితో వలె, తేన సహ = ఆ లక్ష్మణునితో, సంయుక్తః = కూడిఉన్నాడు. తేన = ఆ రామునిచేత, జనస్థానమ్ = జనస్థానము, నిపాతితమ్ = పడగొట్టబడినది.

తా. శ్రీమంతుడు, రాజశ్రేష్ఠుడూ అయిన ఆ రాముడు వాయువు అగ్నితో కలిసి ఉన్నట్లు కలిసి ఉన్నాడు. ఆ రాముడు జనస్థానమును నశింపచేసినాడు.

వి. రాక్షసులను చంపినది రాముడు గాన, రాముణ్ణి అగ్నితోను, లక్ష్మణుణ్ణి వాయువుతోను పోల్చుట యుక్తము. అందుచేత "రాజవరః = రాజులలో శ్రేష్ఠుడైన (రాజకుమారులలో శ్రేష్ఠుడైన) శ్రీమాన్ సః = శ్రీమంతుడైన ఆ లక్ష్మణుడు, వాయువు అగ్నితో చేరి నట్లు రామునితో కలిసి ఉన్నాడు. ఆ రాముడు జనస్థానాన్ని నశింపచేసినాడు"అని అర్థము చెప్పినచో యుక్తముగా ఉండును. 17

మూ. నైవ దేవా మహాత్మానో నాత్ర కార్యా విచారణా,
శరా రామేణ తూత్సృష్టా రుక్మపుఙ్ఖాః పతత్రిణః, 18
సర్పాః పఞ్చాననా భూత్వా భక్షయన్తి స్మ రాక్షసాన్.

ప్ర. అ. మహాత్మానః = మహాత్ములైన, దేవాః = దేవతలు, నైవ = కారు. అత్ర = ఈ విషయమునందు, విచారణా = సందేహము, న కార్యా = చేయదగినది కాదు. రామేణ = రామునిచేత, ఉత్సృష్టాః = విడువబడిన, రుక్మపుఙ్ఖాః = బంగారు పొన్నులు గల, పతత్రిణః = రెక్కలు గల, శరాః = బాణములు, పఞ్చాననాః = ఐదు ముఖములు గల, సర్పాః = సర్పములుగా, భూత్వా = అయి, రాక్షసాన్ = రాక్షసులను, భక్షయన్తి స్మ = భక్షించినవి.

తా. మహాత్ములైన దేవతలు ఎవ్వరూ జనస్థానమునకు రాలేదు. ఈ విషయములో సందేహము లేదు. రాముడు ప్రయోగించిన, బంగారు పొన్నులు, రెక్కలూ గల బాణములు ఐదు తలల సర్పములుగా మారి రాక్షసులను భక్షించి చేసినవి. 18

మూ. యేన యేన చ గచ్ఛన్తి రాక్షసా భయకర్శితాః, 19
తేన తేన స్మ పశ్యన్తి రామమేవాగ్రతః స్థితమ్
ఇత్థం వినాశితం తేన జనస్థానం తవానఘ. 20

ప్ర. అ. భయకర్శితాః = భయముచేత కృశింపచేయబడిన, రాక్షసాః = రాక్షసులు, యేన యేన = ఏ యే మార్గమున, గచ్ఛన్తి = వెళ్లుచుండిరో, తేన తేన ఆ యా మార్గముచేత, అగ్రతః = ఎదుట, స్థితమ్ = నిలచిన, రామమేవ = రాముణ్ణే, పశ్యన్తి స్మ = చూచుచుండిరి. అనఘ = దోషములు లేనివాడా! తేన = ఆ రాముని చేత, తవ = నీయొక్క, జనస్థానమ్ = జనస్థానము, ఇత్థమ్ = ఈ విధముగా, వినాశితమ్ = నశింపచేయబడినది.

తా. భయముచేత కృశించి రాక్షసులు ఏ మూలకు వెళ్ళినా ఆ మూలనే వాళ్లకు రాముడు ఎదుట నిలచి ఉన్నట్లు కనబడెను. దోషములు లేని రాక్షసరాజా! ఆ రాముడు నీ జనస్థానమును ఈ విధముగా నశింపచేసినాడు. 19, 20

మూ. అకమ్పనవచః శ్రుత్వా రావణో వాక్యమబ్రవీత్,
జనస్థానం గమిష్యామి హన్తుం రామం సలక్ష్మణమ్. 21

ప్ర. అ. అకమ్పనవచః = అకంపనుని వచనమును, శ్రుత్వా = విని, రావణః = రావణుడు, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. సలక్ష్మణమ్ = లక్ష్మణునితో కూడిన, రామమ్ = రాముణ్ణి, హన్తుమ్ = చంపుటకు, జనస్థానమ్ = జనస్థానమును గూర్చి, గమిష్యామి = వెళ్లగలను.

తా. అకంపనుని మాటలు విని రావణుడు- "రామలక్ష్మణులను చంపుటకై జనస్థానమునకు వెళ్లెదను"అని పలికెను. 21

మూ. అథైవముక్తే వచనే ప్రోవాచేదమకమ్పనః,
శృణు రాజన్ యథావృత్తం రామస్య బలపౌరుషమ్. 22

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, వచనే = వచనము, ఉక్తే = పలకబడిన దగుచుండగా, అకమ్పనః = అకంపనుడు, ఇదమ్ = ఈ వాక్యమును, ప్రోవాచ = పలికెను. రాజన్ = రాజా! యథావృత్తమ్ = యథార్థమైన, రామస్య = రాముని యొక్క, బలపౌరుషమ్ = బలమును పౌరుషమును, శృణు = వినుము.

తా. రావణుని వచనము విని అకంపనుడు ఇట్లు పలికెను. "రాజా! రాముని బలము పౌరుషము, యథార్థముగ ఎట్టివో వినుము." 22

మూ. అసాధ్యః కుపితో రామో విక్రమేణ మహాయశాః,
అపగాయాః సుపూర్ణాయా వేగం పరిహరేచ్ఛరైః. 23

ప్ర. అ. మహాయశాః = గొప్ప కీర్తి గల, రామః=రాముడు, విక్రమేణ = పరాక్రమముచేత, అసాధ్యః = జయింప శక్యము కానివాడు. కుపితః = కోపించిన ఆ రాముడు, సుపూర్ణాయాః = బాగా నిండి ఉన్న, అపగాయాః = నది యొక్క, వేగమ్ = వేగమును, శరైః = బాణములచేత, పరిహరేత్ = నిలిపి వేయును.

తా. గొప్ప కీర్తి గల రాముణ్ణి పరాక్రమముచేత జయించుట శక్యము కాని వని. అతడు కోపించినచో బాగా నిండి ఉన్న నది ప్రవాహమును కూడ బాణాలతో నిలిపివేయగలడు. 23

మూ. సతారగ్రహనక్షత్రం నభశ్చాప్యవసాదయేత్,
అసౌ రామస్తు సీదన్తీం శ్రీమానభ్యుద్ధరేన్మహీమ్. 24

ప్ర. అ. శ్రీమాన్ = శ్రీమంతుడైన, అసౌ రామస్తు = ఈ రాముడు, సతార గ్రహనక్షత్రం = తారలతో, గ్రహములతో, నక్షత్రములతో కూడిన, నభః చాపి = ఆకాశమును కూడా, అవసాదయేత్ = నశింపజేయగలడు. సీదన్తీమ్ = క్రుంగి పోవుచున్న, మహీమ్=భూమిని, అభ్యుద్ధరేత్ = ఎత్తగలడు.

తా. శ్రీమంతుడైన ఈ రాముడు తారలతోను, గ్రహములతోను, నక్షత్ర ములతోను కూడిన ఆకాశమును కూడ నశింపచేయగలడు. క్రుంగిపోవు చున్న భూమిని ఎత్తగలడు. 24

మూ. భిత్త్వా వేలాం సముద్రస్య లోకానాప్లావయేద్విభుః,
వేగం వాపి సముద్రస్య వాయుం వా విధమేచ్ఛరైః. 25

ప్ర. అ. విభుః = ప్రభువైన రాముడు, సముద్రస్య=సముద్రముయొక్క, వేలామ్ = తీరమును, భిత్త్వా = బద్దలు కొట్టి, లోకాన్ = లోకములను, ఆప్లావ

యేత్ = ముంచివేయును. సముద్రస్య = సముద్రముయొక్క, వేగం వాపి = వేగమునైనను, వాయుం వా = వాయువు నైనను, శరైః = బాణములచేత, విధమేత్ = నశింపచేయును.

తా. ప్రభువైన ఆ రాముడు సముద్రతీరమును బ్రద్దలు కొట్టి లోకముల నన్నింటినీ ముంచివేయ సమర్థుడు. సముద్రవేగమును, వాయువును కూడ బాణాలచేత నశింపచేయగలడు. 25

మూ. సంహృత్య వా పునర్లోకాన్ విక్రమేణ మహాయశాః,
శక్తః స పురుషవ్యాఘ్రః స్రష్టుం పునరపి ప్రజాః. 26

ప్ర. అ. మహాయశాః = గొప్ప కీర్తి గల, సః = ఆ, పురుషవ్యాఘ్రః = పురుషశ్రేష్ఠుడు, పునః = మరల, లోకాన్ = లోకములను, విక్రమేణ = పరాక్రమముచేత, సంహృత్య = సంహరించి, ప్రజాః = ప్రజలను, పునఃరపి = మరల, స్రష్టుమ్ = సృజించుటకు, శక్తః = సమర్థుడు.

తా. గొప్ప కీర్తి గల ఆ పురుషశ్రేష్ఠుడు పరాక్రమముచేత లోకముల నన్నింటిని సంహరించి మరల ప్రజలను సృజించుటకు కూడ సమర్థుడు. 26

మూ. న హి రామో దశగ్రీవ శక్యో జేతుం త్వయా యుధి,
రక్షసాం వాపి లోకేన స్వర్గః పాపజనైరివ. 27

ప్ర. అ. దశగ్రీవ = ఓ! రావణా! రామః = రాముడు, యుధి = యుద్ధమునందు, త్వయా = నీచేతగాని, రక్షసామ్ = రాక్షసులయొక్క, లోకేన వాపి = సముదాయముచేత గాని, జేతుమ్ = జయించుటకు, స్వర్గః = స్వర్గము, పాపజనైరివ = పాపాత్ములచేత వలె. న శక్యః = శక్యమైనవాడు కాదు.

తా. రావణా! రాముణ్ణి నీవు గాని, రాక్షసు లందరు కలిసి గాని యుద్ధములో, పాపాత్ములు స్వర్గమును ఎట్లు జయింప (పొంద) జాలరో అట్లే జయింపజాలరు. 27

మూ. న తం వధ్యమహం మన్యే సర్వైర్దేవాసురైరపి,
అయమస్య వధోపాయ స్తన్మమైకమనాః శృణు. 28

ప్ర. అ. సర్వైః = సమస్తమైన, దేవాసురైరపి = దేవాసురులచేత కూడ, తమ్ = ఆ రాముణ్ణి, వధ్యమ్=చంపశక్యమైనవానినిగా, అహమ్=నేను, న మన్యే =తలవను. అస్య = ఈతనియొక్క, వధోపాయః = వధకు ఉపాయము, అయమ్ = ఇది. తత్ = దానిని, మమ = నానుండి, ఏకమనాః=ఏకాగ్రచిత్తుడవై, శృణు = వినుము.

తా. సమస్తమైన దేవాసురులు కలిసినా కూడ అతనిని చంపుటకు శక్యమగు నని నేను అనుకొనను. ఈతనిని చంపుటకు ఇది ఒక ఉపాయ మున్నది. సావధానచిత్తుడవై వినుము. 28

మూ. భార్యా తస్యోత్తమా లోకే సీతా నామ సుమధ్యమా,
శ్యామా సమవిభక్తాఙ్గీ స్త్రీరత్నం రత్నభూషితా. 29

ప్ర. అ. లోకే = లోకమునందు, ఉత్తమా = ఉత్తమురాలు, శ్యామా = యౌవనమధ్యమునందు ఉన్నది, సమవిభక్తాఙ్గీ = సమముగా విభజింపబడిన అవయవములు కలదీ, స్త్రీరత్నమ్ = స్త్రీలలో రత్నము, రత్నభూషితా=రత్నములచేత భూషింపబడినదీ అయిన, సీతా నామ = సీత అను పేరు గల, సుమధ్యమా= మంచి నడుము గల స్త్రీ, తస్య = ఆ రామునియొక్క, భార్యా = భార్య.

తా. లోకములో ఉత్తమురాలైన సీత అనే మంచి నడుము గల ఒక వనిత అతని భార్య. ఆమె యౌవనమధ్యమునం దున్నది. ఆమె అవయవములు ఎచ్చు తగ్గులు లేకుండగా సమముగా విభజింపబడి యున్నవి. స్త్రీలలో రత్నమైన ఆమె రత్నములచేత అలంకరింపబడి ఉన్నది. 29

మూ. నైవ దేవీ న గన్ధర్వీ నాప్సరా నాపి దానవీ,
తుల్యా సీమన్తినీ తస్యా మానుషీషు కుతో భవేత్. 30

ప్ర. అ. తస్యాః = ఆమెకు. తుల్యా = సమానురాలైన, సీమన్తినీ = స్త్రీ, దేవీ = దేవతాస్త్రీ, నైవ = లేదు. గన్ధర్వీ = గంధర్వస్త్రీ, న = లేదు, అప్సరాః = అప్సరః స్త్రీ, న = లేదు, దానవీ అపి = దానవస్త్రీ కూడ, న= లేదు. మానుషీషు= మనుష్యస్త్రీలలో, కుతః = ఎట్లు, భవేత్ = ఉండును.

తా. ఆమెతో సమానమైన స్త్రీ దేవతాస్త్రీలలో కాని, గంధర్వస్త్రీలలో

గాని, అప్సరసలలో గాని, దానవస్త్రీలలో కాని లేదు. మనుష్యస్త్రీలలో ఎట్లు ఉండును? 30

మూ. తస్యాపహర భార్యాం త్వం ప్రమథ్య తు మహావనే,
సీతయా రహితః కామీ రామో హాస్యతి జీవితమ్. 31

ప్ర. అ. త్వమ్ = నీవు, మహావనే = మహావనమునందు, ప్రమథ్య = బలాత్కరించి, తస్య = ఆ రామునియొక్క, భార్యామ్ = భార్యను, అపహర = అపహరించుము. కామీ = కాముకుడైన, రామః = రాముడు, సీతయా = సీతతో, రహితః = శూన్యుడై, జీవితమ్ = జీవితమును, హాస్యతి = విడువగలడు.

తా. నీవు మహావనమునందు బలాత్కారముగా ఆతని భార్యను అపహరించుము. సీత మీద అత్యధికప్రేమ గల ఆ రాముడు, సీత లేకపోవుటచే ప్రాణములను విడువగలడు. 31

మూ. అరోచయత తద్వాక్యం రావణో రాక్షసాధిపః,
చిన్తయిత్వా మహాబాహురకమ్పనమువాచ హ. 32

ప్ర. అ. రాక్షసాధిపః=రాక్షసరాజైన, రావణః=రావణుడు, తత్ వాక్యమ్ =ఆ వాక్యమును, అరోచయత = ఇష్టపడెను. మహాబాహుః = గొప్ప బాహువులు గల ఆతడు, చిన్తయిత్వా= ఆలోచించి, అకమ్పనమ్ = అకంపనుని గూర్చి, ఉవాచ హ = పలికెను.

తా. రాక్షసరాజైన రావణునకు ఆ మాటలు ఇష్ట మయ్యెను. అప్పుడు ఆ మహాబాహువైన రావణుడు, ఆలోచించి అకంపనునితో ఇట్లు పలికెను. 32

మూ. బాఢం కాల్యం గమిష్యామి హ్యేకః సారథినా సహ,
ఆనయిష్యామి వైదేహీమిమాం హృష్టో మహాపురీమ్. 33

ప్ర. అ. బాఢమ్ = తప్పక, కాల్యమ్ = ప్రాతఃకాలమునందే, ఏకః = నేనొక్కడను, సారథినా సహ = సారథితో కూడ, గమిష్యామి = వెళ్ళగలను. హృష్టః = సంతోషించినవాడనై, వైదేహీమ్ = సీతను, ఇమాం పురీమ్ = ఈ పట్టణమును గూర్చి, ఆనయిష్యామి = తీసికొనివచ్చెదను.

తా. ప్రాతఃకాలమునందు నే నొక్కడనే సారథితో కూడ వెళ్ళి సీతను, ఆనందపూర్వకముగా ఈ మహాపురమునకు తీసికొనివచ్చెదను. 33

మూ. అథైవముక్త్వా ప్రయయౌ ఖరయుక్తేన రావణః,
రథేనాదిత్యవర్ణేన దిశః సర్వాః ప్రకాశయన్. 34

ప్ర. అ. రావణః = రావణుడు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, అథ = అటుపిమ్మట, ఖరయుక్తేన = గాడిదలతో కూర్చబడిన, ఆదిత్యవర్ణేన = సూర్యుని వంటి వర్ణము గల, రథేన = రథముచేత, సర్వాః = సమస్తమైన, దిశః = దిక్కులను, ప్రకాశయన్ = ప్రకాశింపచేయుచు, ప్రయయౌ = వెళ్ళెను.

తా. రావణుడు ఇట్లు పలికి, పిమ్మట సూర్యునివంటి వర్ణము గల గాడిదలు కట్టిన రథముచేత అన్ని దిక్కులను ప్రకాశింపచేయుచు వెళ్ళెను. 34

మూ. స రథో రాక్షసేన్ద్రస్య నక్షత్రపథగో మహాన్,
సంచార్యమాణః శుశుభే జలదే చన్ద్రమా ఇవ. 35

ప్ర. అ. రాక్షసేన్ద్రస్య=రావణునియొక్క, సంచార్యమాణః=సంచరింపచేయబడుచున్న, నక్షత్రపథగః = నక్షత్రమార్గమునందు వెళ్లుచున్న, మహాన్ = గొప్పదైన, సః = ఆ, రథః = రథము, జలదే = మేఘమునందు, చన్ద్రమాః ఇవ = చంద్రుడు వలె, శుశుభే = ప్రకాశించెను.

తా. నడుపబడి ఆకాశమార్గమునందు సంచరించు చున్న గొప్పదైన ఆ రావణుని రథము మేఘములోని చంద్రుడు వలె ప్రకాశించెను. 35

మూ. స మారీచాశ్రమం ప్రాప్య తాటకేయముపాగమత్,
మారీచేనార్చితో రాజా భక్ష్యభోజ్యైరమానుషైః. 36

ప్ర. అ. సః=ఆ రావణుడు, మారీచాశ్రమమ్ = మారీచుని ఆశ్రమమును, ప్రాప్య = పొంది, తాటకేయమ్ = మారీచుణ్ణి, ఉపాగమత్ = పొందెను. రాజా= రాజైన ఆ రావణుడు, అమానుషైః = మనుష్యులకు దుర్లభములైన, భక్ష్యభోజ్యైః =భక్ష్యములతోను, భోజ్యములతోను (భక్ష్యము లనగా పిండివంటలు. భోజ్యము లనగా అన్నాదులు), మారీచేన = మారీచునిచేత, అర్చితః = పూజింపబడెను.

తా. రావణుడు మారీచుని ఆశ్రమమునకు వెళ్ళి ఆతనిని కలిసెను. మారీచుడు రాజైన రావణుని మనుష్యులకు దుర్లభములైన భక్ష్యములను, భోజ్యములను ఇచ్చి పూజించెను. 36

మూ. తం స్వయం పూజయిత్వా తు ఆసనే నోదకేన చ,
అర్థోపహితయా వాచా మారీచో వాక్యమబ్రవీత్. 37

ప్ర. అ. మారీచః = మారీచుడు, తమ్ = ఆ రావణుణ్ణి, ఆసనేన = ఆసనముచేత, ఉదకేన చ = ఉదకముచేత, స్వయమ్ = స్వయముగా, పూజయిత్వా = పూజించి, అర్థోపహితయా = అర్థముతో కూడిన, వాచా = వాక్కుతో, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. మారీచుడు ఆ రావణునకు స్వయముగా ఆసనము, ఉదకము ఇచ్చి సత్కరించి అర్థముతో కూడిన వాక్కుతో ఇట్లు పలికెను. 37

మూ. కచ్చిత్సుకుశలం రాజన్ లోకానాం రాక్షసేశ్వర,
ఆశఙ్కే నాథ జానే త్వం యతస్తూర్ణమిహాగతః. 38

ప్ర. అ. రాక్షసేశ్వర = రాక్షసులకు ప్రభువైన, రాజన్ = రాజా! లోకానామ్ = ప్రజలకు, సుకుశలం కచ్చిత్ = బాగుగా క్షేమమే కదా. నాథ = ప్రభూ! యతః = ఏ కారణమువలన, త్వమ్ = నీవు, తూర్ణమ్ = శీఘ్రముగా, ఇహ = ఇక్కడికి, ఆగతః = వచ్చినావో, అందువలన, ఆశఙ్కే = సందేహించుచున్నాను. జానే = ఎరుగుదును.

తా. రాక్షసుల ప్రభువైన ఓ! రాజా! ప్రజ లందరికి క్షేమమే కదా! నీవు శీఘ్రముగా ఇక్కడికి వచ్చుటచే నాకు సంశయము కలుగుచున్నది. ఏదో తొందర పని ఉన్న దని నేను ఊహించుచున్నాను. 38

మూ. ఏవముక్తో మహాతేజా మారీచేన స రావణః,
తతః పశ్చాదిదం వాక్యమబ్రవీద్వాక్యకోవిదః. 39

ప్ర. అ. మారీచేన = మారీచునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలుకబడిన, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, వాక్యకోవిదః = మాటలలో నేర్పరి యైన,

సః = ఆ, రావణః = రావణుడు, తతః పశ్చాత్ = అటు పిమ్మట, ఇదమ్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. మహాతేజఃశాలి, మాటలలో నేర్పరి అయిన ఆ రావణుడు మారీచుని మాటలు విని పిమ్మట ఇట్లు పలికెను. 39

మూ. ఆరక్షో మే హతస్తాత రామేణాక్లిష్టకర్మణా.
జనస్థానమవధ్యం తత్సర్వం యుధి నిపాతితమ్, 40
తస్య మే కురు సాచివ్యం తస్య భార్యాపహారణే.

ప్ర. అ. తాత = తండ్రీ! అక్లిష్టకర్మణా = శ్రమపడకుండా పనులుచేయు, రామేణ = రామునిచేత, మే = నాయొక్క, ఆరక్షః = రక్షణచేసే సైన్యము, హతః = చంపబడినది. తత్ = ఆ, సర్వమ్ = సమస్తమైన, అవధ్యమ్ = చంపశక్యము కాని, జనస్థానమ్ = జనస్థానము, యుధి = యుద్ధమునందు, నిపాతితమ్ = పడ గొట్టబడినది. తస్య మే = అట్టి నాకు, తస్య = ఆ రామునియొక్క, భార్యాపహారణే = భార్యను హరించుటయందు, సాచివ్యమ్ = సాహాయ్యమును, కురు = చేయుము.

తా. మారీచుడా! శ్రమపడకుండా పనులు చేయు రాముడు దండకారణ్యమునందు రక్షణార్థమై నిలుపబడిన సైన్యమును చంపివేసినాడు. చంపుటకు శక్యము కాని ఆ జనస్థాన మంతా యుద్ధములో చంపబడినది. అందుచే ఆ రాముని భార్యను అపహరించుటలో నాకు సాహాయ్యము చేయుము. 40

మూ. రాక్షసేన్ద్రవచః శ్రుత్వా మారీచో వాక్యమబ్రవీత్. 41
ఆఖ్యాతా కేన సీతా సా మిత్రరూపేణ శత్రుణా,
త్వయా రాక్షసశార్దూల కో న నన్దతి నిన్దితః. 42

ప్ర. అ. రాక్షసేన్ద్రవచః = రావణుని వచనమును, శ్రుత్వా = విని, మారీచః = మారీచుడు, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. మిత్రరూపేణ = మిత్రు డనే రూపము గల, శత్రుణా = శత్రువైన, కేన = ఎవనిచేత, సా సీతా = ఆ సీత, ఆఖ్యాతా = చెప్పబడినది? రాక్షసశార్దూల = రాక్షసశ్రేష్ఠుడా! నిన్దితః = నిందింపదగిన, కః = ఎవడు, త్వయా = నీచేత, న నన్దతి = సంతోషించుట లేదు?

తా. రావణుని మాటలు విని మారీచుడు ఇటు పలికెను. రాక్షసులలో

శ్రేష్ఠుడవైన ఓ రావణా! నీకు సీతను గూర్చి చెప్పిన ఆ మిత్రుడు వలె కనబడే శత్రువు ఎవడు? నిన్ను చూచి కిట్టని ఆ దుష్టుడు ఎవడు? 42

మూ. సీతామిహానయస్వేతి కో బ్రవీతి బ్రవీహి మే,
రక్షోలోకస్య సర్వస్య కః శృఙ్గం ఛేత్తుమిచ్ఛతి. 43

ప్ర. అ. సీతామ్ = సీతను, ఇహ = ఇక్కడికి, ఆనయస్వ = తీసికొని రమ్ము, ఇతి = అని, కః = ఎవడు, బ్రవీతి = చెప్పుచున్నాడు? మే = నాకు, బ్రవీహి = చెప్పుము. కః = ఎవడు, సర్వస్య = సమస్తమైన, రక్షోలోకస్య = రాక్షససముదాయముయొక్క, శృఙ్గమ్ = శిఖరమును, ఛేత్తుమ్ = విరగగొట్టుటకు, ఇచ్ఛతి = కోరుచున్నాడు?

తా. "సీతను ఇక్కడికి తీసికొని రమ్ము" అని నీతో చెప్పినవాడెవడో నాకు చెప్పుము. సమస్త రాక్షససముదాయము శిఖరమును (గొప్పతనమును) భగ్నముచేయ దలచుచున్న అత డెవడు? 43

మూ. ప్రోత్సాహయతి కశ్చిత్త్వాం స చ శత్రురసంశయః,
ఆశీవిషముఖాద్దంష్ట్రాముద్ధర్తుం చేచ్ఛతి త్వయా. 44

ప్ర. అ. కశ్చిత్ = ఎవ్వడో, త్వామ్ = నిన్ను, ప్రోత్సాహయతి = ప్రోత్సహించుచున్నాడు. స చ = వాడు, శత్రుః = శత్రువు; అసంశయః = సంశయము లేదు. త్వయా = నీచేత, ఆశీవిషముఖాత్ = సర్పము నోటినుండి, దంష్ట్రామ్ = కోరను, ఉద్ధర్తుమ్ = ఊడపీకించుటకు, ఇచ్ఛతి = కోరుచున్నాడు.

తా. నిన్ను ఇందుకు ప్రోత్సహించుచున్నవా డెవ్వడో గాని అతడు నిస్సంశయముగ నీకు శత్రువు. అతడు నీచేత పాము నోటినుండి కోరను పీకించుటకు కోరుచున్నాడు. 44

మూ. కర్మణా కేన కేనాసి కాపథం ప్రతిపాదితః,
సుఖసుప్తస్య తే రాజన్ ప్రహృతం కేన మూర్ధని. 45

ప్ర. అ. కేన = ఎవ్వనిచేత, కేన = ఏ, కర్మణా = పనిచేత, కాపథమ్ = చెడు మార్గమును, ప్రతిపాదితః = పొందింపబడినవాడవు, అసి = అయితివి?

రాజన్ = రాజా ! సుఖసుప్తస్య=సుఖముగా నిద్రించిన, తే=నీయొక్క, మూర్ధని = శిరస్సుమీద, కేన= ఎవనిచేత, ప్రహృతమ్=కొట్టుట ?

తా. రాజా ! నిన్ను ఎవ్వడు, ఏ కార్యము నిమిత్తమై ఈ చెడు మార్గము పట్టించుచున్నాడు ? సుఖముగా నిద్రించుచున్న నీ తలపై ఎవడు కొట్టినాడు ?

మూ. విశుద్ధవంశాభిజనాగ్రహస్త
స్తేజోమదః సంస్థితదోర్విషాణః,
ఉదీక్షితుం రావణ నేహ యుక్తః
స సంయుగే రాఘవగన్ధహస్తీ. 46

ప్ర. అ. రావణ = రావణా ! విశుద్ధవంశాభిజనాగ్రహస్తః = పరిశుద్ధమైన వంశము, బంధుజనము అను తొండము గలది, తేజోమదః=తేజస్సు అనే మదము గలది, సంస్థితదోర్విషాణః = స్థిరముగా ఉన్న బాహువులనే దంతములు గలది అయిన, సః = ఆ, రాఘవగన్ధహస్తీ = రాముడనే మదగజము, సంయుగే= యుద్ధమునందు, ఉదీక్షితుమ్ = చూచుటకు, ఇహ=ఇప్పుడు, న యుక్తః=తగినది కాదు.

తా. రావణా ! రాము డనే మదగజమును యుద్ధములో కన్నెత్తి చూచుటకు కూడ శక్యముకాదు. పరిశుద్ధమైన వంశము బంధుజనము అనునవే దాని తొండము. తేజస్సే మదము. బలము గల బాహువులే దంతములు. 46

మూ. అసౌ రణాన్తఃస్థితిసంధివాలో
విదగ్ధరక్షోమృగహా నృసింహః,
సుప్తస్త్వయా బోధయితుం న యుక్తః
శరాఙ్గపూర్ణో నిశితాసిదంష్ట్రః. 47

ప్ర. అ. రణాన్తఃస్థితిసంధివాలః = రణమధ్యములో ఉండుట అను నడుమునకు చుట్టిన తోక గలది, విదగ్ధరక్షోమృగహా = నేర్పు గల రాక్షసు లనే లేళ్ళను చంపునది, శరాఙ్గపూర్ణః = బాణము లనెడు అవయవములతో నిండినది, నిశితాసిదంష్ట్రః = వాడియైన ఖడ్గమనే కోరలు కలది అయిన, సుప్తః = నిద్రించిన, అసౌ = ఈ, నృసింహః = నరుడనే (రాముడనే) సింహము, త్వయా = నీచేత, బోధయితుమ్ = లేపుటకు, న యుక్తః = యుక్తము కాదు.

తా. నిద్రించుచున్న రాము డనే ఈ సింహమును లేపుట నీకు మంచిది కాదు. రణమధ్యమునందు నిలుచుట అనునదే దీని నడుమునకు చుట్టుకొనిన తోక. ఇది శరము లనే గోళ్ళు మొదలైన అవయవములతో పరిపూర్ణముగా ఉన్నది. ఖడ్గములే దీని కోరలు. ఇది నేర్పు గల రాక్షసు లనే లేళ్లను చంపివేయగలదు.

మూ. చాపావహారే భుజవేగపఙ్కే
శరోర్మిమాలే సుమహాహవౌఘే.
న రామపాతాళముఖేఽతిఘోరే
ప్రస్కన్దితుం రాక్షసరాజ యుక్తమ్. 48

ప్ర. అ. రాక్షసరాజ=ఓ రాక్షసరాజా! చాపావహారే=ధనస్సే మొసలిగా కలది, భుజవేగపఙ్కే = భుజముల వేగమే బురదగా గలది, శరోర్మిమాలే = బాణములే తరంగపంక్తులుగా కలది, సుమహాహవౌఘే=చాలగొప్పదైన యుద్ధమే జలప్రవాహముగా గలది, అతిఘోరే = చాల భయంకరము అయిన, రామపాతాళముఖే = రాముడనే పాతాళపు ముఖమునందు, ప్రస్కన్దితుమ్ = జారిపడుటకు, న యుక్తమ్ = యుక్తము కాదు.

తా. రాక్షసరాజా! అతిభయంకరమైన రాముడనే పాతాళము ముఖమునందు జారిపడుట మంచిదికాదు. ధనస్సే దానిలోని మొసలి. భుజముల వేగమే పంకము. శరములే తరంగపంక్తులు. గొప్పయుద్ధమే దీనిలోని జలప్రవాహము. 48

మూ. ప్రసీద లఙ్కేశ్వర రాక్షసేన్ద్ర
లఙ్కాం ప్రసన్నో భవ సాధు గచ్ఛ,
త్వం స్వేషు దారేషు రమస్వ నిత్యం
రామః సభార్యో రమతాం వనేషు. 49

ప్ర. అ. లఙ్కేశ్వర = లంకాధీశా! రాక్షసేన్ద్ర = రాక్షసరాజా! ప్రసీద = అనుగ్రహించుము. సాధు = బాగుగా, లఙ్కామ్ = లంకను గూర్చి, గచ్ఛ= వెళ్ళుము. ప్రసన్నః = ప్రసన్నుడవు, భవ = అగుము. త్వమ్ = నీవు, నిత్యమ్= నిత్యమూ, స్వేషు = నీసంబంధమైన, దారేషు = భార్యలయందు, రమస్వ =

క్రీడించుము. రామః = రాముడు, సభార్యః = భార్యతో కూడినవాడై, వనేషు = వనములలో, రమతామ్ = క్రీడించుగాక.

తా. లంకాధిపతియైన రాక్షసరాజా ! అనుగ్రహించుము. బాగుగా లంకకు వెళ్లుము. ప్రసన్నుడవు అగుము. నీవు నిత్యము నీ భార్యలతో క్రీడించుము. రాముణ్ణి తన భార్యతో వనములలో సుఖముగా ఉండనిమ్ము. 49

మూ. ఏవముక్తో దశగ్రీవో మారీచేన స రావణః,
న్యవర్తత పురీం లఙ్కాం వివేశ చ గృహోత్తమమ్. 50

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ఏకత్రింశః సర్గః.

ప్ర. అ. మారీచేన = మారీచునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలుక బడిన, దశగ్రీవః = పది కంఠములు గల, సః రావణః = ఆ రావణుడు, లఙ్కాం పురీమ్ = లంకాపట్టణమును గూర్చి, న్యవర్తత = మరలెను. గృహోత్తమమ్ = గృహశ్రేష్ఠమును, వివేశ చ = ప్రవేశించెను కూడ.

తా. పది కంఠములు గల రావణుడు మారీచుని మాటలు విని, లంకకు తిరిగి వెళ్లి తన గృహములో ప్రవేశించెను.

వి. ఈ 50 శ్లోకాల సర్గ ప్రక్షిప్త మని తోస్తుంది. ఆకాశమార్గంలో ప్రయాణము చేయ గలిగిన శూర్పణఖకంటె ముందుగా అకంపనుడు రావణుని వద్దకు వెళ్ళి జనస్థానవృత్తాంతం నివేదించడం అసంగతము. అట్లు చేసినా విషయమును చెప్పి ఊరుకోవాలి. కాని రాముడు ప్రపంచకాన్నంతనీ సంహరించి మళ్ళీ సృష్టించగలడు ఇత్యాది విధంగా మాటలాడడం అయుక్తం. ' రాముడు అంతటివా డని మన వ్యాఖ్యాతలకు తెలియునేమో కాని ఆ రాక్షసుని కెట్లు తెలి సింది? వాని మాటలు వినగానే "సరే అలాగే చేస్తాను. వాని భార్యను అపహరిస్తాను" అని అంటూ రావణుడు మారీచుని దగ్గరికి వెళ్ళ మారీచుడు ఏమేమో చెప్పగానే మళ్లీ మాట్లాడకుండా వెళ్ళిపోతాడా ! మరొక విషయ మేమనగా శూర్పణఖ ప్రేరేపించగా రావణుడు మారీచుని ఆశ్రమానికి వచ్చినా డని చెప్పే సందర్భంలో 35వ సర్గలో 26 శ్లోకాలలో ఆశ్రమం వర్ణింపబడింది. ఆ వర్ణన రావణుడు

మారీచాశ్రమానికి మొదట వెళ్ళినప్పుడే ఉండాలి కదా ? ఈ సర్గ రచనలోను, శైలిలోను వాల్మీకి ముద్ర కనబడదు. 46-49 శ్లోకాలు చాలా సామాన్యశక్తి గల కవి రచనగా కనబడతాయి. ఎవరైన ఒక ప్రముఖవ్యక్తిని గాని, నగరాన్ని గాని, అరణ్యాన్ని గాని, సముద్రాన్ని గాని ప్రప్రథమంగా ప్రవేశపెట్టినపుడు సుదీర్ఘంగా వర్ణించడం వాల్మీకి రచనలో అంతలో కనబడుతుంది. శూర్పణఖ రావణునివద్దకు వెళ్ళినప్పుడు తొలి సారిగా రావణుణ్ణి పాఠకుల ముందు ఉంచుతున్నాడు కనుకనే వాల్మీకి అతని వర్ణనకై ఒక సర్గ పూర్తిగా వినియోగించినాడు. అకంపనవృత్తాంతమే నిజమైనపక్షంలో ఈ రావణవర్ణన అక్కడ ఉండేది. ఈ సర్గ ప్రాచ్యపాఠంలో లేదు. ఖరాదులు సంహరింపబడిన తరువాత శూర్పణఖయే రావణుని దగ్గరకు వెళ్ళినట్లు మాత్రమే ఉంది. అకంపనుని మాటల్లో విశేషార్థాలు చెప్పే వ్యాఖ్యాతల వ్యాఖ్యానాలు ఎంత అసంగతాలో వేరుగా చెప్పనిలేదు. 23వ శ్లోకంలో రాముడు నదీప్రవాహాన్ని కూడ ఆపివేయ గల దని చెప్పి వాల్మీకి కృష్ణావతారంలో జరగబోయే కథను సూచించినాడట. 24వ శ్లోక పూర్వార్థంలో త్రివిక్రమావతారం సూచింపబడినదట. ఉత్తరార్ధంలో వరాహావతారం సూచింపబడిన దట. 25వ శ్లోకంలో "రాముడు సముద్రజలముచేత లోకాన్ని ముంచును" అని చెప్పడంచేత రాముడే జగత్సంహర్త అనీ, "సముద్రాన్ని నిలుపుతాడు'' అని చెప్పడంచేత భవిష్యత్సేతుబంధనమూ సూచింపబడిన వట. 26వ శ్లోకంలో రాముడే పరమాత్మ దని సూచింపబడిసదట ! 50

''బాలానందిని'' యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
అరణ్యకాండలో ముప్పదిఒకటవ సర్గ సమాప్తము.

అథ ద్వాత్రింశః సర్గః

[శూర్పణఖ రావణునివద్దకు వెళ్ళుట]

మూ. తతః శూర్పణఖా దృష్ట్వా సహస్రాణి చతుర్దశ,
హతాన్యేకేన రామేణ రక్షసాం భీమకర్మణామ్. 1

దూషణం చ ఖరం చైవ హతం త్రిశిరసా సహ,
దృష్ట్వా పునర్మహానాదం ననాద జలదో యథా. 2

ప్ర. అ. తతః = అటుపిమ్మట, శూర్పణఖా = శూర్పణఖ, ఏకేన = ఒక్క, రామేణ = రామునిచేత, భీమకర్మణామ్ = భయంకరములైన కర్మలు గల, రక్షసామ్ = రాక్షసులయొక్క, చతుర్దశసహస్రాణి = పదునాలుగువేలను, హతాని = చంపబడినవాటినిగా, దృష్ట్వా = చూచి, దూషణం చ = దూషణుణ్ణి, ఖరం చైవ = ఖరుణ్ణి, త్రిశిరసా సహ = త్రిశిరస్సుతో కూడ, హతమ్ = చంపబడిన వానినిగా, దృష్ట్వా = చూచి, పునః = మరల, జలదః యథా = మేఘము వలె, మహానాదమ్ = గొప్ప ధ్వని కలుగు నట్లుగా, ననాద = ధ్వనిచేసెను.

తా. శూర్పణఖ, భయంకరములైన పనులు చేయు పదునాలుగు వేల మంది రాక్షసులను, త్రిశిరస్సును, దూషణుణ్ణి, ఖరుణ్ణి ఒక్క రాముడు చంపి వేయుట చూచి మేఘము వలె చాల బిగ్గరగా అరచెను. 1, 2

మూ. సా దృష్ట్వా కర్మ రామస్య కృతమన్యైః సుదుష్కరమ్,
జగామ పరమోద్విగ్నా లఙ్కాం రావణపాలితామ్. 3

ప్ర. అ. సా = ఆమె, అన్యైః = ఇతరులచేత, సుదుష్కరమ్ = ఏ మాత్రము చేయ శక్యము కాని, రామస్య = రామునియొక్క, కృతమ్ = చేయబడిన, కర్మ = పనిని, దృష్ట్వా = చూచి, పరమోద్విగ్నా = మిక్కిలి భయ

పడినదై, రావణపాలితామ్ = రావణునిచేత పాలింపబడిన, లఙ్కామ్ = లంకను గూర్చి, జగామ = వెళ్లెను.

తా. ఆమె ఇతరు లెవ్వరూ చేయజాలని, రాముడు చేసిన పని చూచి, చాల భయపడినదై రావణుడు పాలించుచున్న లంకకు వెళ్లెను. 3

మూ. సా దదర్శ విమానాగ్రే రావణం దీప్తతేజసమ్,
ఉపోపవిష్టం సచివైర్మరుద్భిరివ వాసవమ్. 4

ప్ర. అ. సా = ఆమె, మరుద్భిః = మరుత్తులచేత, వాసవమ్ ఇవ = దేవేంద్రుడు వలె, సచివైః = మంత్రులచేత, ఉపోపవిష్టమ్ = సమీపమునందు కూర్చుండి సేవింపబడుచున్న, దీప్తతేజసమ్ = ప్రజ్వలించుచున్న తేజస్సు గల, రావణమ్ = రావణుణ్ణి, విమానాగ్రే = భవనము పైభాగమునందు, దదర్శ = చూచెను.

తా. మరుత్తులను దేవతాగణముచేత సమీపమున కూర్చుండి సేవింపబడుచున్న దేవేంద్రుడు వలె సమీపమున కూర్చున్న మంత్రులచే సేవింపబడు చున్న ప్రజ్వలించుచున్న తేజస్సు గల రావణుణ్ణి, ఆ శూర్పణఖ రాజభవనాగ్రము నందు చూచెను. 4

మూ. ఆసీనం సూర్యసంకాశం కాఞ్చనే పరమాసనే,
రుక్మవేదిగతం ప్రాజ్యం జ్వలన్తమివ పావకమ్. 5

ప్ర. అ. సూర్యసంకాశమ్ = సూర్యునితో సమానుడు, కాఞ్చనే = బంగారు వికారమైన, పరమాసనే = గొప్ప ఆసనమునందు, ఆసీనమ్ = కూర్చున్నవాడు, రుక్మవేదిగతమ్ = బంగారు వేదియందున్న, ప్రాజ్యమ్ = అధికమైన ఆజ్యము గల, జ్వలన్తమ్ = ప్రజ్వలించుచున్న, పావకమ్ ఇవ = అగ్ని వలె ఉన్న (రావణుణ్ణి చూచెను).

తా. సూర్యునితో సమానుడైన ఆ రావణుడు బంగారు సింహాసనముమీద కూర్చుండెను. అధికమైన నెయ్యి హోమము చేయుటచే ప్రజ్వలించుచున్న, బంగారు వేదియందున్న అగ్ని వలె ప్రకాశించుచుండెను. 5

మూ. దేవగన్ధర్వభూతానామృషీణాం చ మహాత్మనామ్,
అజేయం సమరే శూరం వ్యాత్తాననమివాన్తకమ్. 6

ప్ర. అ. దేవగన్ధర్వభూతానామ్ = దేవతలకు, గంధర్వులకు, భూతములకు, మహాత్మనామ్ = మహాత్ములైన, ఋషీణాం చ = ఋషులకు, సమరే = యుద్ధమునందు, అజేయమ్ = జయింప శక్యము కానివాడు, శూరమ్ = శూరుడు, వ్యాత్తాననమ్ = తెరవబడిన నోరు గల, అన్తకమ్ ఇవ = యముడు వలె ఉన్న (రావణుని చూచెను).

తా. శూరుడైన ఆ రావణుణ్ణి, యుద్ధములో, దేవతలుగాని, గంధర్వులు గాని, భూతములు గాని, మహాత్ములైన ఋషులు గాని జయింపజాలరు. అతడు నోరు తెరచుకొని ఉన్న యముడు వలె ఉండెను. 6

మూ. దేవాసురవిమర్దేషు వజ్రాశనికృతవ్రణమ్,
ఐరావతవిషాణాగ్రైరుత్కృష్టకిణవక్షసమ్. 7

ప్ర. అ. దేవాసురవిమర్దేషు = దేవతలకు అసురులకు జరిగిన యుద్ధములందు, వజ్రాశనికృతవ్రణమ్ = వజ్రాయుధముచేత చేయబడిన గాయములు కలవాడు, ఐరావతవిషాణాగ్రైః = ఐరావతము దంతముల అగ్రభాగములచేత, ఉత్కృష్టకిణవక్షసమ్ = గీయుటచే ఏర్పడిన కాయలు గల వక్షస్థలము గల (రావణుని చూచెను). 7

తా. ఆ రావణునకు దేవాసురయుద్ధములలో అనేకపర్యాయముల వజ్ర ప్రహారముచేత గాయములు తగిలి యుండెను. ఐరావతము దంతాగ్రములచేత పొడవగా అతని శరీరము మీద తగిలిన దెబ్బలు కాయలు కాసి ఉండెను. 7

మూ. వింశద్భుజం దశగ్రీవం దర్శనీయపరిచ్ఛదమ్,
విశాలవక్షసం వీరం రాజలక్షణశోభితమ్. 8

ప్ర. అ. వింశద్భుజమ్ = ఇరువది భుజములు గలవాడు, దశగ్రీవమ్ = పది కంఠములు గలవాడు, దర్శనీయపరిచ్ఛదమ్ = అందమైన ఛత్రచామరాద్యుపకరణములు కలవాడు, విశాలవక్షసమ్ = విశాలమైన వక్షఃస్థలము గలవాడు,

వీరమ్ = వీరుడు, రాజలక్షణశోభితమ్ = రాజలక్షణములతో ప్రకాశించుచున్నవాడు అయిన (రావణుణ్ణి చూచెను).

తా. విశాలమైన వక్షఃస్థలము గల వీరుడైన ఆ రావణుడు ఇరువది భుజములతో, పది తలలతో రాజలక్షణములతో ప్రకాశించుచుండెను. అతని సమీపమునందున్న ఛత్రచామరాద్యుపకరణములు చాల సుందరముగా ఉండెను. 8

మూ. స్నిగ్ధవైడూర్యసంకాశం తప్తకాఞ్చనకుణ్డలమ్,
సుభుజం శుక్లదశనం మహాస్యం పర్వతోపమమ్. 9

ప్ర. అ. స్నిగ్ధవైడూర్యసంకాశమ్ = నున్నని వైడూర్యమాణిక్యముతో సమానుడు, తప్తకాఞ్చనకుణ్డలమ్ = పరిశుద్ధమైన బంగారు కుండలములు గలవాడు, సుభుజమ్ = అందమైన భుజములు కలవాడు, శుక్లదశనమ్ = తెల్లని దంతములు కలవాడు, మహాస్యమ్ = పెద్ద నోరు కలవాడు, పర్వతోపమమ్ = పర్వతముతో సమానుడు (అయిన రావణుని చూచెను).

తా. ఆ రావణుని శరీరకాంతి నున్నని వైడూర్యమాణిక్యము కాంతి వలె ఉండెను. అతడు కాల్చి శుద్ధము చేసిన బంగారము కుండలములను ధరించెను. అతని భుజములు అందముగా ఉండెను. దంతములు తెల్లగా ఉండెను. పెద్ద ముఖము గల అతడు పర్వతము వలె ఉండెను. 9

మూ. విష్ణుచక్రనిపాతైశ్చ శతశో దేవసంయుగే,
అన్యైః శస్త్రప్రహారైశ్చ మహాయుద్ధేషు తాడితమ్. 10

ప్ర. అ. దేవసంయుగే = దేవతాయుద్ధమునందు, శతశః = వందలకొలది, విష్ణుచక్రనిపాతైశ్చ = విష్ణుచక్రముయొక్క ప్రహారములచేతను, మహాయుద్ధేషు = మహాయుద్ధములయందు, అన్యైః = ఇతరములైన, శస్త్రప్రహారైశ్చ = ఆయుధముల ప్రహారములచేతను, తాడితమ్ = కొట్టబడిన (రావణుని చూచెను).

తా. దేవతలతో యుద్ధము చేసినపుడు విష్ణుచక్రముచేత తగిలిన దెబ్బల ఆనవాళ్ళు వందలకొలది అతని శరీరముపై ఉండెను. మహాయుద్ధములలో అతడు ఇతరములైన ఆయుధముల ప్రహారములను కూడ పొంది ఉండెను. 10

మూ. ఆహతాఙ్గం సమస్తైశ్చ దేవప్రహరణై స్తథా,
అక్షోభ్యాణాం సముద్రాణాం క్షోభణం క్షిప్రకారిణమ్. 11

ప్ర. అ. తథా = మరియు, సమస్తైః = సమస్తమైన, దేవప్రహరణైః = దేవతల ఆయుధములచేత, ఆహతాఙ్గమ్ = కొట్టబడిన శరీరము కలవాడు, అక్షోభ్యాణామ్ = క్షోభింప శక్యము కాని, సముద్రాణామ్ = సముద్రములకు, క్షోభణమ్ = క్షోభ చేయువాడు, క్షిప్రకారిణమ్ = శీఘ్రముగా పనులు చేయువాడు అయిన (రావణుని చూచెను).

తా. ఆ రావణుని శరీరము సమస్తదేవతల ఆయుధముల దెబ్బలు తిని ఉండెను. అతడు క్షోభింపచేయ శక్యము కాని సముద్రములను కూడ క్షోభింప చేయ సమర్థుడు. అతడు కార్యములను శీఘ్రముగా సాధించువాడు.

మూ. క్షేప్తారం పర్వతేన్ద్రాణాం సురాణాం చ ప్రమర్దనమ్,
ఉచ్ఛేత్తారం చ ధర్మాణాం పరదారాభిమర్శనమ్. 12

ప్ర. అ. పర్వతేన్ద్రాణామ్ = పర్వతశ్రేష్ఠములకు (ను), క్షేప్తారమ్ = విసిరివేయగలవాడు, సూరాణాం చ = దేవతలకు కూడ, ప్రమర్దనమ్ = సంహారకుడు, ధర్మాణామ్ = ధర్మములకు, ఉచ్ఛేత్తారమ్ = వినాశకుడు, పరదారాభిమర్శనమ్ = పరభార్యలను స్పృశించువాడు అయిన (రావణుని చూచెను).

తా. ఆ రావణుడు శ్రేష్ఠములైన పర్వతములను విసిరివేయగలవాడు. దేవతలను కూడ జయించినవాడు. ధర్మములను నశింపచేయువాడు, పరభార్యాగమనము చేయువాడు. 12

మూ. సర్వదివ్యాస్త్రయోక్తారం యజ్ఞవిఘ్నకరం సదా,
పురీం భోగవతీం ప్రాప్య పరాజిత్య చ వాసుకిమ్, 13
తక్షకస్య ప్రియాం భార్యాం పరాజిత్య జహార యః.

ప్ర. అ. సర్వదివ్యాస్త్రయోక్తారమ్ = సమస్తమైన దివ్యాస్త్రములను ప్రయోగించువాడు, సదా = ఎల్లప్పుడు, యజ్ఞవిఘ్నకరమ్ = యజ్ఞములకు విఘ్నము చేయువాడు అయిన (రావణుని చూచెను). యః = ఎవ్వడు, భోగవతీమ్ = భోగవతి అను, పురీమ్ = పట్టణమును, ప్రాప్య = పొంది, వాసుకిమ్ = వాసుకిని,

పరాజిత్య చ = ఓడించి, తక్షకస్య = తక్షకునియొక్క, ప్రియామ్ = ప్రియురాలైన, భార్యామ్ = భార్యను, పరాజిత్య = బలాత్కరించి, జహార = హరించెనో (అట్టి రావణుని చూచను).

తా. ఆ రావణుడు దివ్యాస్త్రములను అన్నింటిని ప్రయోగించుటకు సమర్థుడు. యజ్ఞములకు విఘ్నము చేయువాడు. భోగవతీనగరమునకు వెళ్ళి, వాసుకిని ఓడించి, తక్షకుని ప్రియురాలైన భార్యను బలాత్కారముగా హరించినాడు. 13

మూ. కైలాసపర్వతం గత్వా విజిత్య నరవాహనమ్, 14
విమానం పుష్పకం తస్య కామగం వై జహార యః.

ప్ర. అ. యః = ఏ రావణుడు, కైలాసపర్వతమ్ = కైలాసపర్వతమును గూర్చి, గత్వా = వెళ్ళి, నరవాహనమ్ = కుబేరుణ్ణి, విజిత్య = జయించి, తస్య = ఆతనియొక్క, కామగమ్ = ఇచ్ఛానుసారము ప్రయాణముచేయు, పుష్పకమ్ = పుష్పకమును, జహార = హరించెనో (అట్టి రావణుని చూచెను).

తా. ఆ రావణుడు కైలాసపర్వతమునకు వెళ్ళి, కుబేరుణ్ణి జయించి, ఆతనికి చెందిన, ఇచ్ఛానుసారము ప్రయాణము చేసే పుష్పకవిమానమును అపహరించెను. 14

మూ. వనం చైత్రరథం దివ్యం నళినీం నన్దనం వనమ్, 15
వినాశయతి యః క్రోధాద్దేవోద్యానాని వీర్యవాన్.

ప్ర. అ. వీర్యవాన్ = పరాక్రమవంతుడైన, యః = ఏ రావణుడు, దివ్యమ్ = దివ్యమైన, చైత్రరథమ్ = చైత్రరథ మనే, వనమ్ = వనమును, నళినీమ్ = పద్మసరస్సును, నన్దనం వనమ్ = నందనవనమును, దేవోద్యానాని = దేవతల ఇతరములైన ఉద్యానములను, క్రోధాత్ = క్రోధమువలన, వినాశయతి = నశింపచేయునో (ఆ రావణుని చూచెను).

తా. పరాక్రమవంతుడైన ఆ రావణుడు కోపము వచ్చి నప్పుడు చైత్రరథమను వనమును, పద్మసరస్సును, నందనవనమును, దేవతల ఇతరోద్యానములను నశింపచేయుచుండును. 15

మూ. చన్ద్రసూర్యౌ మహాభాగావుత్తిష్ఠన్తౌ పరంతపః, 16
నివారయతి బాహుభ్యాం యః శైలశిఖరోపమః.

ప్ర. అ. పరంతపః = శత్రువులను పీడించువాడు, శైలశిఖరోపమః = పర్వతశిఖరముతో సమానుడు అయిన, యః = ఏ రావణుడు, ఉత్తిష్ఠన్తౌ = పైకి లేచుచున్న, మహాభాగౌ = గొప్ప భాగ్యము గల, చన్ద్రసూర్యౌ = చంద్రసూర్యులను, బాహుభ్యామ్ = బాహువులచేత, నివారయతి=నివారించునో (అట్టి రావణుని చూచెను).

తా. శత్రువులను పీడించేవాడు, పర్వతశిఖరముతో సమానుడూ అయిన ఆ రావణుడు ఉదయించుచున్న, మహాభాగ్యవంతులైన చంద్రసూర్యులను బాహువులతో అడ్డుకొనగలడు. 16

మూ. దశవర్షసహస్రాణి తపస్తప్త్వా మహావనే, 17
పురా స్వయంభువే ధీరః శిరాంస్యుపజహార యః.

ప్ర. అ. ధీరః = ధీరుడైన, యః = ఏ రావణుడు, పురా = పూర్వము, మహావనే = మహారణ్యమునందు, దశవర్షసహస్రాణి = పదివేల సంవత్సరములు, తపః = తపస్సు, తప్త్వా = చేసి, స్వయంభువే = బ్రహ్మదేవునకు, శిరాంసి = శిరస్సులను, ఉపజహార = సమర్పించెనో.

తా. ధీరుడైన ఆ రావణుడు, పూర్వము, మహారణ్యములో పదివేల సంవత్సరములు తపస్సుచేసి బ్రహ్మదేవునకు శిరస్సులను సమర్పించెను. 17

మూ. దేవదానవగన్ధర్వపిశాచపతగోరగైః, 18
అభయం యస్య సంగ్రామే మృత్యుతో మానుషాదృతే.

ప్ర. అ. యస్య = ఎవనికి, సంగ్రామే = యుద్ధమునందు, మానుషాత్ ఋతే = మనుష్యునినుండి తప్ప, దేవదానవగన్ధర్వపిశాచపతగోరగైః = దేవతలచేత, దానవులచేత, గంధర్వులచేత, పిశాచములచేత, పక్షులచేత, సర్పములచేత, మృత్యుతః=మృత్యువునుండి, అభయమ్=అభయమో (అట్టి రావణుని చూచెను).

తా. ఆ రావణుడు, యుద్ధములో మనుష్యులనుండి తప్ప, దేవతలు, దాన

వులు, గంధర్వులు, పిశాచములు, పక్షులు, సర్పములు- వీటినుండి మరణము కలుగకుండ అభయమును సంపాదించి ఉండెను. 18

మూ. మన్త్రైరభిష్టుతం పుణ్యమధ్వరేషు ద్విజాతిభిః, 19
హవిర్ధానేషు యః సోమముపహన్తి మహాబలః.

ప్ర. అ. మహాబలః = గొప్ప బలము గల, యః = ఏ రావణుడు, అధ్వరేషు = యజ్ఞములయందు, హవిర్ధానేషు=హవిస్సు ఉంచే పాత్రలలో, ద్విజాతిభిః = బ్రాహ్మణులచేత, అభిష్టుతమ్ = తీసి ఉంచబడిన, మన్త్రైః=మంత్రములచేత, పుణ్యమ్ = పుణ్యమైన, సోమమ్ = సోమమును, ఉపహన్తి = నశింపచేయుచుండునో (అట్టి రావణుని చూచెను).

తా. మహాబలశాలియైన ఆ రావణుడు, యజ్ఞములయందు బ్రాహ్మణులు తీసి హవిస్సు ఉంచే పాత్రలలో పోసి మంత్రములచేత పవిత్రము చేసిన సోమమును దేవతలకు చెందకుండా నశింపచేయుచుండును. 19

మూ. ప్రాప్తయజ్ఞహరం క్రూరం బ్రహ్మఘ్నం దుష్టచారిణమ్,
కర్కశం నిరనుక్రోశం ప్రజానామహితే రతమ్.

ప్ర. అ. ప్రాప్తయజ్ఞహరమ్ = పూర్తికావచ్చిన యజ్ఞములను హరించువాడు, క్రూరమ్=క్రూరుడు, బ్రహ్మఘ్నమ్=బ్రాహ్మణులను చంపేవాడు, దుష్టచారిణమ్ = దుష్టముగా ప్రవర్తించువాడు, కర్కశమ్ = కఠినుడు, నిరనుక్రోశమ్ = జాలి లేనివాడు, ప్రజానామ్ = ప్రజలయొక్క, అహితే = హితముకాని కార్యమునందు, రతమ్ = ఆసక్తుడు అయిన (రావణుని చూచెను).

తా. ఆ రావణుడు పూర్తి కావచ్చిన యజ్ఞములను ధ్వంసము చేయును. క్రూరుడు. బ్రహ్మహత్యలు చేసినవాడు. దుష్టప్రవృత్తి కలవాడు. కఠినుడు. జాలి లేనివాడు. ప్రజలకు అహితమును చేయుటయందే ఆసక్తి కలవాడు. 20

మూ. రావణం సర్వభూతానాం సర్వలోకభయావహమ్, 21
రాక్షసీ భ్రాతరం శూరం సా దదర్శ మహాబలమ్.

ప్ర. అ. సా = ఆ, రాక్షసీ = శూర్పణఖ, సర్వభూతానామ్ = సకలభూతములకు, రావణమ్ = ఏడిపించేవాడు, సర్వలోకభయావహమ్ = సకలలోకములకు

భయము కలిగించువాడు, శూరమ్ = శూరుడు, మహాబలమ్ = గొప్ప బలము గలవాడు అయిన, భ్రాతరమ్ = సోదరుని, దదర్శ = చూచెను.

తా. ఆ శూర్పణఖ, సర్వభూతములను ఏడ్పించినవాడు, సకలలోకములకు భయము కలిగించినవాడు, శూరుడు, మహాబలశాలి అయిన సోదరుడైన రావణుణ్ణి చూచెను. 21

మూ. తం దివ్యవస్త్రాభరణం దివ్యమాల్యోపశోభితమ్, 22
ఆసనే సూపవిష్టం చ కాలకాలమివోద్యతమ్.

ప్ర. అ. దివ్యవస్త్రాభరణమ్ = దివ్యములైన వస్త్రములు అలంకారములు కలవాడు, దివ్యమాల్యోపశోభితమ్ = దివ్యములైన పుష్పమాలలచేత ప్రకాశింపచేయబడినవాడు, ఆసనే = ఆసనమునందు, సూపవిష్టమ్ = బాగుగా కూర్చున్నవాడు, ఉద్యతమ్ = బయలుదేరిన, కాలకాలమివ = కాలమునకు కాలుడు వలె ఉన్న, తమ్ = ఆ రావణుని (చూచెను).

తా. ఆ రావణుడు దివ్యములైన వస్త్రములు, అలంకారములు, పుష్పమాలలు ధరించి ఆసనముపై చక్కగా కూర్చుండి యుండెను. అతడు విజృంభించిన మృత్యుదేవతకు మృత్యుదేవత వలె ఉండెను. 22

మూ. రాక్షసేన్ద్రం మహాభాగం పౌలస్త్యకులనన్దనమ్, 23
రావణం శత్రుహన్తారం మన్త్రిభిః పరివారితమ్,
అభిగమ్యాబ్రవీద్వాక్యం రాక్షసీ భయవిహ్వలా. 24

ప్ర. అ. రాక్షసీ = శూర్పణఖ, భయవిహ్వలా = భయముచేత వ్యాకులురాలై, రాక్షసేన్ద్రమ్ = రాక్షసుల ప్రభువు, మహాభాగమ్ = గొప్ప భాగ్యము కలవాడు, పౌలస్త్యకులనన్దనమ్ = పౌలస్త్యవంశమునకు ఆనందము కలిగించువాడు, శత్రుహన్తారమ్ = శత్రువులకు సంహారకుడు, మన్త్రిభిః = మంత్రులచేత, పరివారితమ్ = చుట్టుకొనబడి ఉన్నవాడు అయిన, రావణమ్ = రావణుణ్ణి, అభిగమ్య = సమీపించి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. భయముతో వ్యాకులురాలైన ఆ శూర్పణఖ మంత్రులతో కూడియున్న,

రాక్షసుల ప్రభువు మహాభాగ్యవంతుడు, పౌలస్త్యవంశమునకు ఆనందకరుడు, శత్రుసంహారకుడు అయిన రావణునివద్దకు వెళ్ళి ఇట్లు పలికెను. 23. 24.

మూ. తమబ్రవీద్దీప్తవిశాలలోచనం
ప్రదర్శయిత్వా భయమోహమూర్ఛితా,
సుదారుణం వాక్యమభీతచారిణీ
మహాత్మనా శూర్పణఖా విరూపితా. 25

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకియే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ద్వాత్రింశః సర్గః.

ప్ర. అ. అభీతచారిణీ = నిర్భయముగా సంచరించునది, మహాత్మనా = మహాత్ముడైన లక్ష్మణునిచేత, విరూపితా = విరూపముకలదిగా చేయబడినది అయిన, శూర్పణఖా = శూర్పణఖ, భయమోహమూర్ఛితా = భయముతోను, మోహముతోను వ్యాప్తురాలై, ప్రదర్శయిత్వా = తన స్థితిని చూపి, దీప్తవిశాలలోచనమ్ = ప్రజ్వలించుచున్న విశాలములైన నేత్రములు గల, తమ్ = ఆ రావణుని గూర్చి, సుదారుణమ్ = చాల దారుణమైన, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. నిర్భయముగా సంచరించుటకు అలవాటుపడిన శూర్పణఖ, మహాత్ముడైన లక్ష్మణుడు వికృతరూపవంతురాలినిగా చేయుటచే భయమోహములతో నిండిన మనస్సు గలదై, తన దుఃస్థితిని చూపుచు, ప్రజ్వలించుచున్న విశాలనేత్రములు గల ఆ రావణునితో ఇట్లు పలికెను. 25

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో
ముప్పదిరెండవ సర్గ సమాప్తము.

అథ త్రయస్త్రింశః సర్గః

[శూర్పణఖ రావణుని నిందించుట].

మూ. తతః శూర్పణఖా దీనా రావణం లోకరావణమ్,
అమాత్యమధ్యే సంక్రుద్ధా పరుషం వాక్యమబ్రవీత్. 1

ప్ర. అ. తతః = అటుపిమ్మట, దీనా = దీనురాలైన, శూర్పణఖా = శూర్పణఖ, సంక్రుద్ధా = కోపించినదై, అమాత్యమధ్యే = మంత్రుల మధ్యయందు, లోకరావణమ్ = లోకములను ఏడ్పించు, రావణమ్ = రావణుని గూర్చి, పరుషమ్ = పరుషమైన, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. పిమ్మట దీనురాలైన శూర్పణఖ, లోకములను ఏడ్పించిన రావణునితో, మంత్రుల సమక్షమున, కోపముతో పరుషమైన వాక్యము పలికెను. 1

మూ. ప్రమత్తః కామభోగేషు స్వైరవృత్తో నిరఙ్కుశః,
సముత్పన్నం భయం ఘోరం బోద్ధవ్యం నావబుధ్యసే. 2

ప్ర. అ. ప్రమత్తః = చాల మదించినవాడవై, కామభోగేషు = కామముల భోగములయందు, స్వైరవృత్తః = స్వేచ్ఛగా ప్రవర్తించుచున్నవాడవై, నిరఙ్కుశః = అడ్డులేనివాడవై, బోద్ధవ్యమ్ = తెలిసికొన దగిన, సముత్పన్నమ్ = పుట్టిన, ఘోరమ్ = ఘోరమైన, భయమ్ = భయమును, నావబుధ్యసే = తెలిసికొనకున్నావు.

తా. నీవు చాల గర్వముతో, స్వేచ్ఛగా కామములను అనుభవించుచు, నిరంకుశముగా ప్రవర్తించుచు వచ్చిపడిన ఘోరమైన ఆపదను తెలిసికొనవలసి ఉండి కూడ తెలుసుకొనుటలేదు. 2

మూ. సక్తం గ్రామ్యేషు భోగేషు కామవృత్తం మహీపతిమ్,
లుబ్ధం న బహుమన్యన్తే శ్మశానాగ్నిమివ ప్రజాః. 3

ప్ర. అ. గ్రామ్యేషు = నీచములైన, భోగేషు = భోగములయందు, సక్తమ్ = ఆసక్తుడు, కామవృత్తమ్ = స్వేచ్ఛగా సంచరించువాడూ, లుబ్ధమ్ = దురాశకలవాడూ అయిన, మహీపతిమ్ = రాజును, ప్రజాః = ప్రజలు, శ్మశానాగ్నిమివ = శ్మశానములోని అగ్నిని వలె, న బహుమన్యన్తే = గౌరవించరు.

తా. స్వేచ్ఛగా ప్రవర్తించుచు, దురాశాపరుడై, నీచములైన భోగములలో ఆసక్తి గల రాజును ప్రజలు శ్మశానములో ఉన్న అగ్నిని వలె గౌరవించరు. 3

మూ. స్వయం కార్యాణి యః కాలే నానుతిష్ఠతి పార్థివః,
స తు వై సహ రాజ్యేన తైశ్చ కార్యైర్వినశ్యతి. 4

ప్ర. అ. యః = ఏ, పార్థివః = రాజు, కాలే = తగిన కాలమునందు, కార్యాణి = కార్యములను, స్వయమ్ = స్వయముగా, నానుతిష్ఠతి = ఆచరించడో, సః = అతడు, రాజ్యేన సహ = రాజ్యముతోను, తైః = ఆ, కార్యైశ్చ సహ = కార్యములతోను, వినశ్యతి = నశించును.

తా. రాజు తాను చేయవలసిన పనులను తగు సమయమునందు స్వయముగా చేయనిచో, ఆ రాజు, ఆతని పనులు, ఆతని రాజ్యము కూడ నశించును.

మూ. అయుక్తచారం దుర్దర్శమస్వాధీనం నరాధిపమ్,
వర్జయన్తి నరా దూరాన్నదీపఙ్కమివ ద్విపాః. 5

ప్ర. అ. అయుక్తచారమ్ = ఏర్పరుపబడని గూఢచారులు కలవాడు, దుర్దర్శమ్ = చూచుటకు శక్యము కానివాడు, అస్వాధీనమ్ = తన అధీనములో లేనివాడు అయిన, నరాధిపమ్ = రాజును, నరాః = నరులు, ద్విపాః = ఏనుగులు, నదీపఙ్కమివ = నదియందలి బురదను వలె, దూరాత్ = దూరమునుండియే, వర్జయన్తి = పరిహరింతురు.

తా. గూఢచారుల ద్వారా విషయములు తెలిసికొనక, ప్రజలు చూచుటకు అందుబాటులో లేక, తననే తాను అదుపులో ఉంచుకొన జాలని రాజును ప్రజలు నదిలోని బురదను ఏనుగులు దూరమునుండియే పరిహరించినట్లు, పరిహరింతురు. 5

మూ. యే న రక్షన్తి విషయమస్వాధీనా నరాధిపాః,
తే న వృద్ధ్యా ప్రకాశన్తే గిరయః సాగరే యథా. 6

ప్ర. అ. అస్వాధీనాః = తామే తమ అధీనములో లేని, యే = ఏ, నరాధిపాః = రాజులు, విషయమ్ = దేశమును, న రక్షన్తి = రక్షించరో, తే = వాళ్లు, వృద్ధ్యా = అభివృద్ధితో, సాగరే = సముద్రములో ఉన్న, గిరయః యథా = పర్వతముల వలె, న ప్రకాశన్తే = ప్రకాశించరు.

తా. తమను తామే అదుపులో ఉంచుకొనజాలక దేశమును రక్షించని రాజులు, సముద్రములో మునిగి ఉన్న పర్వతముల వలె, అభివృద్ధితో ప్రకాశింపజాలరు. 6

మూ. ఆత్మవద్భిర్విగృహ్య త్వం దేవగన్ధర్వదానవైః,
అయుక్తచారశ్చపలః కథం రాజా భవిష్యసి. 7

ప్ర. అ. త్వమ్ = నీవు, ఆత్మవద్భిః = బుద్ధిమంతులైన, దేవగన్ధర్వదానవైః = దేవతలతోను, గంధర్వులతోను, దానవులతోను, విగృహ్య = విరోధము చేసి, అయుక్తచారః = ఏర్పరచుకొనబడని గూఢచారులు కలవాడవై, చపలః = చపలుడవై, కథమ్ = ఎట్లు, రాజా = రాజువుగా, భవిష్యసి = కాగలవు?

తా. నీవు బుద్ధిమంతులైన దేవగంధర్వదానవులతో విరోధము పెట్టుకొన్నావు. కాని గూఢచారులను ఏర్పరచుకొనక చపలచిత్తుడవుగా ప్రవర్తించుచున్నావు. అట్టి నీవు రాజు ఎట్లు కాగలవు? 7

మూ. త్వం తు బాలస్వభావశ్చ బుద్ధిహీనశ్చ రాక్షస,
జ్ఞాతవ్యం తు న జానీషే కథం రాజా భవిష్యసి. 8

ప్ర. అ. రాక్షస = ఓ! రాక్షసుడా! త్వం తు = నీవైతే, బాలస్వభావశ్చ = బాలుల స్వభావము వంటి స్వభావము కలవాడవు. బుద్ధిహీనశ్చ = బుద్ధి లేనివాడవు. జ్ఞాతవ్యమ్ = తెలిసికొనదగిన దానిని, న జానీషే = తెలుసుకొనుటలేదు. కథం = ఎట్లు, రాజా = రాజువుగా, భవిష్యసి = కాగలవు?

తా. ఓ! రాక్షసా! నీవు చపలస్వభావము కలవాడవు. బుద్ధిహీనుడవు, తెలిసికొనదగిన విషయాలు తెలిసికొనుటలేదు. నీవు రాజు ఎటు ఆగుదువు? 8

మూ. యేషాం చారశ్చ కోశశ్చ నయశ్చ జయతాం వర,
అస్వాధీనా నరేన్ద్రాణాం ప్రాకృతైస్తే జనైః సమాః. 9

ప్ర. అ. జయతామ్=జయించువారిలో, వర = శ్రేష్ఠుడా ! యేషామ్=ఏ, నరేన్ద్రాణామ్ = రాజులకు, చారశ్చ = గూఢచారి, కోశశ్చ = ధనాగారము, నయశ్చ = నీతి, అస్వాధీనాః = స్వాధీనములు కావో, తే=వాళ్ళు, ప్రాకృతైః= సామాన్యులైన, జనైః = జనులతో, సమాః = సమానులు.

తా. జయించువారిలో శ్రేష్ఠుడవైన రావణా ! గూఢచారులను, కోశాగారమును, పరిపాలనావ్యవహారమును, ఏ రాజులు తమ అధీనములో ఉంచుకొనజాలరో ఆ రాజులు సామాన్యజనులతో సమానులు. 9

మూ. యస్మాత్పశ్యన్తి దూరస్థాన్ సర్వానర్థాన్నరాధిపాః,
చారేణ తస్మాదుచ్యన్తే రాజానో దీర్ఘచక్షుషః. 10

ప్ర. అ. నరాధిపాః = రాజులు, యస్మాత్ = ఏ కారణమువలన, దూరస్థాన్ = దూరమునందున్న, సర్వాన్ = సమస్తమైన, అర్థాన్ = విషయములను, చారేణ = గూఢచారి ద్వారా, పశ్యన్తి = చూచుచున్నారో, తస్మాత్=ఆ కారణమువలన, రాజానః = రాజులు, దీర్ఘచక్షుషః = దీర్ఘమైన దృష్టి కలవారుగా, ఉచ్యన్తే = చెప్పబడుచున్నారు.

తా. రాజులు దూరముగా ఉన్న విషయములను గూఢచారుల ద్వారా చూడగలుగుచున్నారు గాన రాజులు దీర్ఘదృష్టిగలవా రని చెప్పబడుదురు. 10

మూ. అయుక్తచారం మన్యే త్వాం ప్రాకృతైః సచివైర్వృతమ్,
స్వజనం తు జనస్థానం (నే)హతం యో నావబుద్ధ్యసే. 11

ప్ర. అ. అయుక్తచారమ్=సమకూర్చుకొనబడని గూఢచారులు గల,త్వామ్ = నిన్ను, ప్రాకృతైః = సామాన్యులైన, సచివైః = మంత్రులతో, వృతమ్ = కూడినవానినిగా, మన్యే = తలచుచున్నాను. యః = ఏ నీవు, జనస్థానే = జనస్థానమునందు, స్వజనమ్ = నీ జనమును, హతమ్ = చంపబడినదానినిగా, నావబుద్ధ్యసే = తెలుసుకొనుటలేదో.

తా. గూఢచారులను ఏర్పాటు చేసికొనకుండా ఉన్న నీ చుట్టూ ఉన్న మంత్రు లందరూ సామాన్యు లని తలచెదను. అందుచేతనే నీవు, జనస్థానములోని నీవాళ్ళందరూ చంపబడి రను విషయమును తెలుసుకొనలేకపోయితివి. 11

మూ. చతుర్దశ సహస్రాణి రక్షసాం క్రూరకర్మణామ్,
హతాన్యేకేన రామేణ ఖరశ్చ సహ దూషణః. 12

ప్ర. అ. ఏకేన = ఒక్క, రామేణ = రామునిచేత, క్రూరకర్మణామ్ = క్రూరమైన కర్మ గల, రక్షసామ్ = రాక్షసులయొక్క, చతుర్దశ = పదునాలుగు, సహస్రాణి = వేలు, హతాని = చంపబడినవి. సహదూషణః = దూషణునితో కూడిన, ఖరశ్చ = ఖరుడు కూడ (చంపబడినాడు).

తా. ఒక్క రాముడు, క్రూరమైన కర్మ గల పదునాలుగువేలమంది రాక్షసులను, ఖరదూషణులను కూడ చంపివేసినాడు. 12

మూ. ఋషీణామభయం దత్తం కృతక్షేమాశ్చ దణ్డకాః,
ధర్షితం చ జనస్థానం రామేణాక్లిష్టకర్మణా. 13

ప్ర. అ. అక్లిష్టకర్మణా = శ్రమపడకుండా పనిచేయు, రామేణ = రాముని చేత, ఋషీణామ్ = ఋషులకు, అభయమ్ = అభయము, దత్తమ్ = ఇవ్వబడినది. దణ్డకాః = దండకారణ్యము, కృతక్షేమాశ్చ = చేయబడిన క్షేమము గలవి. జనస్థానమ్ = జనస్థానము, ధర్షితం చ = ఎదిరింపబడినది.

తా. శ్రమపడకుండ కార్యములు సాధించు రాముడు ఋషీశ్వరులకు అభయము ఇచ్చినాడు. దండకారణ్యమునకు క్షేమము చేకూర్చినాడు. జనస్థానమును ఓడించినాడు. 13

మూ. త్వం తు లుబ్ధః ప్రమత్తశ్చ పరాధీనశ్చ రావణ,
విషయే స్వే సముత్పన్నం భయం యో నావబుధ్యసే. 14

ప్ర. అ. రావణ = రావణా ! త్వం తు = నీవైతే, లుబ్ధః = దురాశ కల వాడవు. ప్రమత్తః = మదించి ఉన్నావు. పరాధీనశ్చ = పరాధీనుడవు, యః = ఏ

నీవు, స్వే = తనసంబంధమైన, విషయే = దేశమునందు, ఉత్పన్నమ్ = పుట్టిన, భయమ్ = భయమును, నావబుధ్యసే = తెలుసుకొనుటలేదో.

తా. రావణా! నీవు దురాశాపరుడవు. మదించి యున్నావు. ఇతరుల అధీనములో ఉన్నావు. అందుచేతనే నీ దేశములో వచ్చిన భయమును తెలుసుకొనజాలకున్నావు. 14

మూ. తీక్ష్ణమల్పప్రదాతారం ప్రమత్తం గర్వితం శఠమ్,
వ్యసనే సర్వభూతాని నాభిధావన్తి పార్థివమ్. 15

ప్ర. అ. తీక్ష్ణమ్ = తీక్ష్ణమైనవాడు, అల్పప్రదాతారమ్ = అల్పముగా ఇచ్చేవాడు, ప్రమత్తమ్ = ఏమరిపాటుతో ఉన్నవాడు, గర్వితమ్ = గర్వించినవాడు, శఠమ్=రహస్యముగా అప్రియకార్యము చేయువాడు అయిన, పార్థివమ్=రాజును, వ్యసనే = వ్యసనము కలిగినప్పుడు, సర్వభూతాని = సమస్తభూతములు, నాభిధావన్తి = పరుగెత్తి వెళ్ళి చేరవు.

తా. తీక్ష్ణమైన స్వభావము కలవాడు, అల్పముగానే ఇచ్చేవాడు, ఏమరిపాటుతో ఉన్నవాడు, గర్వించినవాడు, శఠుడు అయిన రాజుకు ఏ మైన కష్టము కలిగినప్పుడు ఎవ్వరూ అతని వద్దకు వెళ్ళరు. 15

మూ. అతిమానినమగ్రాహ్యమాత్మసంభావితం నరమ్,
క్రోధినం వ్యసనే హన్తి స్వజనోఽపి మహీపతిమ్. 16

ప్ర. అ. అతిమానినమ్ = అధికమైన గర్వము గలవాడు, అగ్రాహ్యమ్= గ్రహింప(చేర) తగనివాడు, ఆత్మసంభావితం నరమ్ = తనను గొప్పవానినిగా తలచే నరుడు, క్రోధినమ్ = కోపము గలవాడు, అయిన, మహీపతిమ్ = రాజును, స్వజనోఽపి = స్వజనము కూడ, వ్యసనే = కష్టకాలమునందు, హన్తి = చంపును.

తా. చాల గర్వము గలవాడు, దగ్గరకు వెళ్లుటకు శక్యము కానివాడు, తనను తానే గొప్పగా భావించువాడు, కోపస్వభావుడు అయిన రాజును, ఆపత్కాలములో స్వజనమే చంపివేయును. 16

మూ. నానుతిష్ఠతి కార్యాణి భయేషు న బిభేతి చ,
క్షిప్రం రాజ్యాచ్చ్యుతో దీనస్తృణైస్తుల్యో భవిష్యతి. 17

ప్ర. అ. (ఏ రాజు), కార్యాణి = చేయవలసిన పనులను, నానుతిష్ఠతి = చేయడో, భయేషు = భయములందు, న బిభేతి చ = భయపడడో, (ఆ రాజు), క్షిప్రమ్ = శీఘ్రముగా, రాజ్యాత్ = రాజ్యమునుండి, చ్యుతః = భ్రష్టుడై, దీనః = దీనుడై, తృణైః = గడ్డిపరకలతో, తుల్యః = సమానుడు, భవిష్యతి = కాగలడు.

తా. భయపడవలసిన సమయములలో కూడ భయము చెందక, చేయవలసిన పనులు చేయని రాజు శీఘ్రముగా రాజ్యభ్రష్టుడై గడ్డిపరకతో సమానుడగును. 17

మూ. శుష్కైః కాష్ఠైర్భవేత్కార్యం లోష్టైరపి చ పాంసుభిః,
న తు స్థానాత్పరిభ్రష్టైః కార్యం స్యాద్వసుధాధిపైః. 18

ప్ర. అ. శుష్కైః = ఎండిన, కాష్ఠైః = కట్టెలచేతను, లోష్టైరపి = మట్టిబెడ్డలచేతను, పాంసుభిరపి చ = పరాగములచేతను కూడ, కార్యమ్ = కార్యము, భవేత్ = ఉండవచ్చును. తు = కాని, స్థానాత్ = స్థానమునుండి, పరిభ్రష్టైః = భ్రష్టులైన, వసుధాధిపైః = రాజులచేత, కార్యమ్ = కార్యము, న స్యాత్ = ఉండదు.

తా. ఎండిన కట్టెలు, మట్టిబెడ్డలు, బూడిద కూడ దేనికైన ఉపయోగించును కాని స్థానభ్రష్టులైన రాజులవలన ప్రయోజన మేమీ ఉండదు. 18

మూ. ఉపభుక్తం యథా వాసః స్రజో వా మృదితా యథా,
ఏవం రాజ్యాత్పరిభ్రష్టః సమర్థోఽపి నిరర్థకః. 19

ప్ర. అ. ఉపభుక్తమ్ = అనుభవించబడిన, వాసః = వస్త్రము, యథా = ఎట్లో, మృదితాః = నలిగిపోయిన, స్రజో వా = మాలికలు, యథా = ఎట్లో, ఏవమ్ = ఇట్లు, రాజ్యాత్ = రాజ్యమునుండి, పరిభ్రష్టః = భ్రష్టుడైన రాజు, సమర్థోఽపి = సమర్థుడే అయినను, నిరర్థకః = వ్యర్థుడు.

తా. రాజ్యభ్రష్టు డైన రాజు, ఎంత సమర్థు డైనను, కట్టి విడిచిన వస్త్రము వలె, నలిగిపోయిన పూల దండ వలె, వ్యర్థుడు. 19

మూ. అప్రమత్తశ్చ యో రాజా సర్వజ్ఞో విజితేన్ద్రియః,
కృతజ్ఞో ధర్మశీలశ్చ స రాజా తిష్ఠతే చిరమ్. 20

ప్ర. అ. యః రాజా = ఏ రాజు, అప్రమత్తః = ఏమరిపాటు లేనివాడో, సర్వజ్ఞః = అన్ని విషయములు తెలిసినవాడో, విజితేన్ద్రియః = జయించబడిన ఇంద్రియములు కలవాడో, కృతజ్ఞః = కృతజ్ఞుడో, ధర్మశీలశ్చ = ధర్మస్వభావము గలవాడో, సః రాజా = ఆ రాజు, చిరమ్ = చిరకాలము. తిష్ఠతి = ఉండును.

తా. ఏమరిపాటు లేక, అన్ని విషయములు తెలిసికొనుచు, ఇంద్రియ నిగ్రహముతో, కృతజ్ఞుడై, ధర్మస్వభావము గల రాజు చాల కాలము స్థిరముగా ఉండును. 20

మూ. నయనాభ్యాం ప్రసుప్తోఽపి జాగర్తి నయచక్షుషా,
వ్యక్తక్రోధప్రసాదశ్చ స రాజా పూజ్యతే జనైః. 21

ప్ర. అ. ("త్యక్తక్రోధోఽప్రమాదశ్చ"అను ప్రాచ్యపాఠము బాగున్నది. (ఏ రాజు), నయనాభ్యామ్ = నేత్రములచేత, ప్రసుప్తోఽపి = నిద్రపోవుచున్నను, నయచక్షుషా = నీతి అనే నేత్రముతో, జాగర్తి = మేల్కొని ఉండునో, త్యక్తక్రోధః = విడువబడిన క్రోధము గలవాడూ, అప్రమాదశ్చ = ఏమరిపాటు లేనివాడు అయిన, సః రాజా = ఆ రాజు, జనైః = జనులచేత, పూజ్యతే = పూజింపబడును.

తా. ఏ రాజు, కళ్ళు మూసుకొని నిద్రపోవుచున్నా నీతి అనే నేత్రముతో మేల్కొని ఉండునో, క్రోధమును విడచి, ఏమరిపాటు లేనివాడై ప్రవర్తించునో ఆతనిని జనులు పూజింతురు. 21

మూ. త్వం తు రావణ దుర్బుద్ధిర్గుణైరేతైర్వివర్జితః,
యస్య తేఽవిదితశ్చారై రక్షసాం సుమహాన్వధః. 22

ప్ర. అ. రావణ = రావణా! దుర్బుద్ధిః = దుర్బుద్ధివైన, త్వం తు = నీవైతే, ఏతైః = ఈ, గుణైః = గుణములతో, వివర్జితః = శూన్యుడవు, యస్య = ఏ, తే = నీకు, రక్షసామ్ = రాక్షసులయొక్క, సుమహాన్ = చాలగొప్పదైన, వధః = వధ, చారైః = గూఢచారులద్వారా, అవిదితః = తెలియబడలేదో

తా. రావణా ! దుర్బుద్ధి వైన నీలో ఈ గుణము లేవీ లేవు. రాక్షసుల వధను గూర్చిన విషయము కూడ నీవు గూఢచారుల ద్వారా తెలిసికొనలేకపోయి నావు. 22

మూ. పరావమన్తా విషయేషు సంగతో
న దేశకాలప్రవిభాగతత్త్వవిత్,
అయుక్తబుద్ధిర్గుణదోషనిశ్చయే
విపన్నరాజ్యో నచిరాద్విపత్స్యసే. 23

ప్ర. అ. పరావమన్తా=వరులను అవమానము చేసేవాడవు, విషయేషు = భోగములయందు, సంగతః = ఆసక్తుడవు, న దేశకాలప్రవిభాగతత్త్వవిత్ = దేశముయొక్క, కాలముయొక్క, విభాగమునందలి తత్త్వమును ఎరుగని వాడవు, గుణదోషనిశ్చయే = గుణములయొక్క దోషములయొక్క నిశ్చయమునందు, అయుక్తబుద్ధిః = కూర్చబడని బుద్ధి కలవాడవు అయిన నీవు, విపన్నరాజ్యః = నశించిన రాజ్యము కలవాడవై, నచిరాత్ = అనతికాలములో, విపత్స్యసే = ఆపద చెందగలవు.

తా. నీవు పరులను అవమానించుచు భోగములయందు సక్తుడవై ఉన్నావు. ఏ దేశమునందు, ఏ కాలమునందు ఏ పని చేయవలెనో తెలియక ఏది మంచిదో, ఏది చెడ్డదో నిర్ణయింప జాలని బుద్ధితో ప్రవర్తించుచున్నావు. అందుచే అతిశీఘ్ర కాలములో నీ రాజ్యము నశించును; నీవు ఆపదలలో చిక్కుకొనగలవు. 23

మూ. ఇతి స్వదోషాన్ పరికీర్తితాంస్తయా
సమీక్ష్య బుద్ధ్యా క్షణదాచరేశ్వరః,
ధనేన దర్పేణ బలేస చాన్వితో
విచిన్తయామాస చిరం స రావణః. 24

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
త్రయస్త్రింశః సర్గః.

ప్ర. అ. క్షణదాచరేశ్వరః = రాక్షసుల ప్రభువు, ధనేన = ధనముతోను, దర్పేణ = దర్పముతోను, బలేన చ = బలముతోను, అన్వితః = కూడిన, సః

రావణః = ఆ రావణుడు, ఇతి = ఈ విధముగా, తయా = ఆమెచేత, పరికీర్తితాన్ = చెప్పబడిన, స్వదోషాన్ = తన దోషములను, బుద్ధ్యా = బుద్ధితో, సమీక్ష్య = పరిశీలించి, చిరమ్ = చాలకాలము, విచిన్తయామాస = ఆలోచించెను.

తా. అత్యధికమైన ధనము, దర్పము, బలము గల రాక్షసరాజైన ఆ రావణుడు ఆమె వర్ణించి చెప్పిన తన దోషములను గూర్చి పరిశీలించి, కారణము ఏమై ఉండును అని చాలసేపు ఆలోచించెను. 24

''బాలానందిని''అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో ముప్పదిమూడవ సర్గ సమాప్తము.

అథ చతుస్త్రింశః సర్గః

[రావణుడు ప్రశ్నించగా శూర్పణఖ అతనికి సీతాలక్ష్మణసమేతుడైన రాముని గూర్చి చెప్పి, "సీతను భార్యగా చేసికొనుము" అని అతనిని ప్రోత్సహించుట.]

మూ. తతః శూర్పణఖాం దృష్ట్వా బ్రువన్తీం పరుషం వచః,
అమాత్యమధ్యే సంక్రుద్ధః పరిపప్రచ్ఛ రావణః. 1

ప్ర. అ. తతః = అటుపిమ్మట, అమాత్యమధ్యే = మంత్రుల మధ్యయందు, పరుషమ్ = పరుషమైన, వచః = వచనమును, బ్రువన్తీమ్ = పలుకుచున్న, శూర్పణఖామ్ = శూర్పణఖను, దృష్ట్వా = చూచి, సంక్రుద్ధః = కోపించినవాడై, రావణః = రావణుడు, పరిపప్రచ్ఛ = అడిగెను.

తా. అమాత్యుల సమక్షములో ఈ విధముగ పరుషమైన మాటలు పలుకుచున్న శూర్పణఖను చూచి, రావణుడు కోపముతో ఇట్లు పలికెను. 1

మూ. కశ్చ రామః కథంవీర్యః కింరూపః కింపరాక్రమః,
కిమర్థం దణ్డకారణ్యం ప్రవిష్టః సుదురాసదమ్. 2

ప్ర. అ. రామః = రాముడు, కః = ఎవడు ? కథంవీర్యః = ఎట్టి బలము కలవాడు ? కింరూపః = ఎట్టి రూపము కలవాడు ? కింపరాక్రమః = ఎట్టి పరాక్రమము కలవాడు ? సుదురాసదమ్ = ప్రవేశించుటకు చాల కష్టమైన, దణ్డకారణ్యమ్ = దండకారణ్యమును, కిమర్థమ్ = ఎందునిమిత్తము, ప్రవిష్టః = ప్రవేశించినాడు?

తా. ఆ రాముడు ఎవ్వడు? అతని బలము ఎట్టిది? అతని రూపము ఎట్లుండును ? అతని పరాక్రమము ఎట్టిది ? ప్రవేశించుటకు చాల కష్టమైన దండకారణ్యములోనికి ఎందుకు ప్రవేశించినాడు ? 2

మూ. ఆయుధం కిం చ రామస్య నిహతా యేన రాక్షసాః,
ఖరశ్చ నిహతః సంఖ్యే దూషణస్త్రిశిరాస్తథా. 3

ప్ర. అ. యేన=ఏ రామునిచేత, రాక్షసాః=రాక్షసులు, ఖరశ్చ=ఖరుడు, దూషణః = దూషణుడు, తథా = మరియు, త్రిశిరాః = త్రిశిరస్సు, సంఖ్యే = యుద్ధమునందు, నిహతాః = చంపబడినారో, రామస్య = అట్టి రామునియొక్క, ఆయుధమ్ = ఆయుధము, కిమ్ = ఏమి ?

తా. యుద్ధములో రాక్షసులను, ఖరుణ్ణి,దూషణుణ్ణి, త్రిశిరస్సును చంపిన ఆ రాముని ఆయుధము ఏమి ? 3

మూ. ఇత్యుక్తా రాక్షసేన్ద్రేణ రాక్షసీ క్రోధమూర్ఛితా,
తతో రామం యథాతత్త్వమాఖ్యాతుముపచక్రమే. 4

ప్ర. అ. రాక్షసేన్ద్రేణ = రావణునిచేత, ఇతి = ఇట్లు, ఉక్తా=పలకబడిన, క్రోధమూర్ఛితా=కోపముతో నిండిన, రాక్షసీ=శూర్పణఖ, తతః=అటుపిమ్మట, రామమ్ = రాముణ్ణి గూర్చి, యథాతత్త్వమ్=ఉన్నది ఉన్నట్లుగా, ఆఖ్యాతుమ్= చెప్పుటకు, ఉపచక్రమే = ఉపక్రమించెను.

తా. క్రోధావిష్టురాలైన ఆ శూర్పణఖ రావణుని మాటలు విని, రాముణ్ణి గూర్చి ఉన్నది ఉన్నట్లు చెప్పుటకు ప్రారంభించెను. 4

మూ. దీర్ఘబాహుర్విశాలాక్షశ్చీరకృష్ణాజినామ్బరః,
కన్దర్పసమరూపశ్చ రామో దశరథాత్మజః. 5

ప్ర. అ. దశరథాత్మజః = దశరథుని కుమారుడైన, రామః = రాముడు, దీర్ఘబాహుః = దీర్ఘమైన బాహువులు కలవాడు. విశాలాక్షః = విశాలములైన నేత్రములు కలవాడు. చీరకృష్ణాజినామ్బరః = నారచీరలు, కృష్ణాజినము వస్త్రములుగా కలవాడు. కన్దర్పసమరూపశ్చ = మన్మథునితో సమానమైన రూపము కలవాడు.

తా. దశరథుని కుమారుడైన రాముడు అజానుబాహువు, విశాలములైన నేత్రములు కలవాడు. నారచీరను, కృష్ణాజినమును వస్త్రముగా ధరించినవాడు. మన్మథునితో సమానమైన సౌందర్యము కలవాడు. 5

మూ. శక్రచాపనిభం చాపం వికృష్య కనకాఙ్గదమ్,
దీప్తాన్ క్షిపతి నారాచాన్ సర్పానివ మహావిషాన్. 6

ప్ర. అ. శక్రచాపనిభమ్ = ఇంద్రధనస్సుతో సమానమైన, కనకాఙ్గదమ్ = బంగారు కట్లు గల, చాపమ్ = ధనస్సును, వికృష్య = లాగి, మహావిషాన్ = గొప్ప విషము గల, సర్పానివ = సర్పముల వంటి, దీప్తాన్ = ప్రకాశించుచున్న, నారాచాన్ = నారాచబాణములను, క్షిపతి = చిమ్మును.

తా. ఇంద్రధనస్సు వలె ఉన్న, బంగారు కట్లు కట్టిన ధనస్సును లాగి, మహావిషము గల సర్పముల వలె ఉన్న, ప్రజ్వలించుచున్న నారాచబాణములను ప్రయోగించును. 6

మూ. నాదదానం శరాన్ఘోరాన్న ముఞ్చన్తం శిలీముఖాన్,
న కార్ముకం వికర్షన్తం రామం పశ్యామి సంయుగే. 7

ప్ర. అ. సంయుగే = యుద్ధమునందు, ఘోరాన్ = భయంకరములైన, శరాన్ = బాణములను, ఆదదానమ్ = గ్రహించుచున్న, రామమ్ = రాముణ్ణి, న పశ్యామి = చూడను. శిలీముఖాన్ = బాణములను, ముఞ్చన్తమ్ = విడచుచున్న వానిని, న = చూడను. కార్ముకమ్ = ధనస్సును, వికర్షన్తమ్ = లాగుచున్న వానిని, న = చూడను.

తా. రాముడు భయంకరములైన బాణములను ఎప్పుడు తీయుచుండెనో, ధనస్సును ఎప్పుడు లాగుచుండెనో, బాణాలను ఎప్పుడు ప్రయోగించుచుండెనో నాకు కనబడలేదు. 7

మూ. హన్యమానం తు తత్సైన్యం పశ్యామి శరవృష్టిభిః,
ఇన్ద్రేణేవోత్తమం సస్యమాహతం త్వశ్మవృష్టిభిః. 8

ప్ర. అ. ఇన్ద్రేణ = ఇంద్రునిచేత, అశ్మవృష్టిభిః = రాళ్ల వానలచేత, ఆహతమ్ = కొట్టబడిన, సస్యమివ = సస్యమును వలె, శరవృష్టిభిః = బాణవర్షముల చేత, హన్యమానమ్ = చంపబడుచున్న, తత్ సైన్యమ్ = ఆ సైన్యమును మాత్రమే, పశ్యామి = చూచుచున్నాను (చూచితిని).

తా. ఇంద్రుడు వర్షించిన రాళ్ళవానచే సస్యము నశించినట్లు బాణవర్షముచేత ఆ సైన్యము చచ్చుచుండుట మాత్రమే నాకు కనబడినది. 8

మూ. రక్షసాం భీమరూపాణాం సహస్రాణి చతుర్దశ,
నిహతాని శరై స్తీక్ష్ణైస్తేనైకేన పదాతినా. 9
అర్ధాధికముహూర్తేన ఖరశ్చ సహదూషణః.

ప్ర. అ. పదాతినా = పాదచారియైన, ఏకేన = ఒక్క, తేన = ఆ రాముని చేత, తీక్ష్ణైః = తీక్ష్ణములైన, శరైః = బాణములచేత, అర్ధాధికముహూర్తేన = సగము అధికముగా గల ఒక ముహూర్తకాలముచేత, భీమరూపాణామ్ = భయంకరమైన రూపముగల, రక్షసామ్ = రాక్షసులయొక్క, చతుర్దశ = పదునాలుగు, సహస్రాణి = సహస్రములు, నిహతాని = చంపబడినవి. సహదూషణః = దూషణునితో కూడిన, ఖరశ్చ = ఖరుడు కూడ, చంపబడినాడు.

తా. ఒంటరివాడైన ఆ రాముడు పాదచారిగా ఉండి, ఒకటిన్నర ముహూర్తముల కాలములో (1-12 గంటల కాలములో), భయంకరములైన రూపములు గల పదునాలుగువేల మంది రాక్షసులను, ఖరుణ్ణి, దూషణుణ్ణి వాడియైన బాణములచేత సంహరించినాడు. 9

మూ. ఋషీణామభయం దత్తం కృతక్షేమాశ్చ దణ్డకాః, 10
ఏకా కథంచిన్ముక్తాహం పరిధూయ మహాత్మనా,
స్త్రీవధం శఙ్కమానేన రామేణ విదితాత్మనా. 11

ప్ర. అ. ఋషీణామ్ = ఋషులకు, అభయమ్ = అభయము, దత్తమ్ = ఇవ్వబడినది. దణ్డకాః = దండకారణ్యము, కృతక్షేమాశ్చ = ఏర్పరుపబడిన క్షేమము గలవి. మహాత్మనా = మహాత్ముడు, విదితాత్మనా = ప్రసిద్ధమైన బుద్ధి గలవాడు, స్త్రీవధమ్ = స్త్రీవధను గూర్చి, శఙ్కమానేన = శంకించుచున్న వాడు అయిన, రామేణ = రామునిచేత, అహమ్ = నేను, ఏకా = ఒక్కదానను, పరిధూయ = తిరస్కరించి, కథంచిత్ = ఎట్లో, ముక్తా = విడువబడితిని.

తా. రాముడు ఋషులకు అభయ మిచ్చి దండకారణ్యమునకు క్షేమము కూర్చినాడు. మహాత్ముడు, ప్రసిద్ధమైన బుద్ధి గలవాడు అయిన ఆ రాముడు స్త్రీని

చంపుటకు శంకించి, ఎట్లో సన్యాకన్యదానిని మాత్రము తిరస్కరించి, చంప కుండ విడచినాడు. 10;11

మూ. భ్రాతా చాస్య మహాతేజా గుణవాంస్తుల్యవిక్రమః,
అనురక్తశ్చ భక్తశ్చ లక్ష్మణో నామ వీర్యవాన్. 12

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడు, గుణవాన్ = గుణవంతుడు, తుల్యవిక్రమః = రామునితో సమానమైన పరాక్రమము గలవాడు, అనురక్తశ్చ = అనురాగము గలవాడు, భక్తశ్చ = భక్తుడు, వీర్యవాన్ = బలవంతుడు అయిన, లక్ష్మణో నామ = లక్ష్మణు డను పేరు గలవాడు, అస్య = ఈ రాముని యొక్క, భ్రాతా = సోదరుడు.

తా. ఆ రామునకు ఆతనితో సమానమైన పరాక్రమము గలవాడు, గొప్ప తేజస్సు, సద్గుణములు కలవాడు, అన్నమీద ప్రేమభక్తులు కలవాడు, బలశాలి అయిన లక్ష్మణు డనే సోదరు డున్నాడు. 12

మూ. అమర్షీ దుర్జయో జేతా విక్రాన్తో బుద్ధిమాన్ బలీ,
రామస్య దక్షిణో బాహుర్నిత్యం ప్రాణో బహిశ్చరః. 13

ప్ర. అ. అమర్షీ = కోపముగలవాడు, దుర్జయః = జయింప శక్యముకాని వాడు, జేతా = జయించువాడు, విక్రాన్తః = పరాక్రమవంతుడు, బుద్ధిమాన్ = బుద్ధిగలవాడు, బలీ = బలశాలి అయిన ఆ లక్ష్మణుడు, నిత్యమ్ = ఎల్లప్పుడూ, రామస్య = రామునియొక్క, దక్షిణః బాహుః = కుడిచెయ్యి. బహిశ్చరః = బైట సంచరించు, ప్రాణః = ప్రాణము.

తా. చాల కోపము కలవాడు, జయింప శక్యముకానివాడు, జయించువాడు, పరాక్రమవంతుడు, బుద్ధిమంతుడు, బలశాలి అయిన ఆ లక్ష్మణుడు ఎల్లప్పుడు రామునకు కుడి చేయి వలె ఉండును. అతడు రాముని బైట సంచరించు ప్రాణము. 13

మూ. రామస్య తు విశాలాక్షీ పూర్ణేన్దుసదృశాననా.
ధర్మపత్నీ ప్రియా భర్తుర్నిత్యం ప్రియహితే రతా. 14

ప్ర అ. విశాలాక్షీ = విశాలములైన నేత్రములు కలది, పూర్ణేన్దుసదృశాననా = పూర్ణచంద్రునితో సమానమైన ముఖము కలది అయిన, రామస్య =

రామునియొక్క, ధర్మపత్నీ = ధర్మపత్ని, భర్తుః = భర్తకు, ప్రియా = ప్రియురాలు. నిత్యమ్ = ఎల్లప్పుడు, ప్రియహితే = ప్రియుని హితమునందు, రతా = ఆసక్తిగలది.

తా. రాముని భార్య విశాలములైన నేత్రములు, పూర్ణచంద్రుని వంటి ముఖము గలది. భర్తకు చాల ప్రియురాలు. ఆమె ఎల్లప్పుడు భర్త హితమునే కోరును. 14

మూ. సా సుకేశీ సునాసోరుః సురూపా చ యశస్వినీ,
దేవతేవ వనస్యాస్య రాజతే శ్రీరివాపరా. 15

ప్ర. అ. సుకేశీ = మంచి కేశములు గలది, సునాసోరుః = అందమైన ముక్కు తొడలు కలది, సురూపా చ = మంచి రూపము గలది, యశస్వినీ = కీర్తి గలది అయిన, సా = ఆమె, అస్య = ఈ, వనస్య = వనముయొక్క, దేవతేవ = దేవత వలె, అపరా = రెండవ, శ్రీరివ = లక్ష్మీదేవి వలె, రాజతే = ప్రకాశించుచున్నది.

తా. అందమైన జుట్టు, ముక్కు, తొడలు గల, సౌందర్యవతి యైన ఆ కీర్తిమంతురాలు జనస్థానమునకు దేవత వలె, రెండవ లక్ష్మీదేవి వలె ప్రకాశించుచున్నది. 15

మూ. తప్తకాఞ్చనవర్ణాభా రక్తతుఙ్గనఖీ శుభా,
సీతా నామ వరారోహా వైదేహీ తనుమధ్యమా. 16

ప్ర. అ. తప్తకాఞ్చనవర్ణాభా = కాల్చి శుద్ధిచేసిన బంగారము వర్ణము వంటి కాంతి గలది, రక్తతుఙ్గనఖీ = ఎఱ్ఱని ఎత్తైన గోళ్ళు గలది, శుభా = మంగళప్రదురాలు, వైదేహీ = విదేహరాజుకూతురు, తనుమధ్యమా = సన్నని నడుము కలది అయిన ఆమె, సీతా నామ = సీత అను పేరు గలది.

తా. ఆమె శరీరకాంతి శుద్ధమైన బంగారము వర్ణము వంటిది. మంగళప్రదురాలైన ఆమె గోళ్లు ఎఱ్ఱగాను, ఎత్తుగాను ఉండును. నడుము సన్నగా ఉండును. విదేహరాజకుమారి యైన ఆమె పేరు సీత. 16

మూ. నైవ దేవీ న గన్ధర్వీ న యక్షీ న చ కింనరీ,
నైవంరూపా మయా నారీ దృష్టపూర్వా మహీతలే. 17

ప్ర. అ. ఏవంరూపా = ఇట్టి రూపము గల, దేవీ = దేవతాస్త్రీ, మయా = నాచేత, నైవ దృష్టపూర్వా = పూర్వము చూడబడలేదు. గన్ధర్వీ = గంధర్వస్త్రీ, న = చూడబడలేదు. యక్షీ = యక్షస్త్రీ, న = చూడబడలేదు. కింనరీ = కింనర స్త్రీ, న = చూడబడలేదు. నారీ = మనుష్యస్త్రీ, మహీతలే = భూలోకములో, న = చూడబడలేదు.

తా. ఇట్టి సౌందర్యము గల దేవతాస్త్రీని గాని, గంధర్వస్త్రీని గాని, యక్ష స్త్రీని గాని, కింనరస్త్రీని గాని, భూలోకములో ఉండే మనుష్యస్త్రీని గాని నేనె న్నడూ చూడలేదు. 17

మూ. యస్య సీతా భవేద్భార్యా యం చ హృష్టా పరిష్వజేత్,
అతిజీవేత్స సర్వేషు లోకేష్వపి పురన్దరాత్. 18

ప్ర. అ. యస్య = ఎవనికి, సీతా = సీత, భార్యా = భార్యగా, భవేత్ = అగునో, హృష్టా = సంతోషించినదై, యమ్ = ఎవనిని, పరిష్వజేత్ = కౌగలించు కొనునో, సః = అతడు, సర్వేషు = సమస్తమైన, లోకేషు = లోకములయందు, పురన్దరాత్ అపి = దేవేంద్రునికంటె గూడ, అతిజీవేత్ = అతిశయించి జీవించును.

తా. సీతను భార్యగా పొందగలిగినవాడు, సీత ఆనందపూర్వకముగా ఎవ నిని కౌగలించుకొనునో అతడు, అన్ని లోకములలోను దేవేంద్రునికంటె కూడ గొప్పవాడుగా జీవించును. 18

మూ. సా సుశీలా వపుఃశ్లాఘ్యా రూపేణాప్రతిమా భువి,
తవానురూపా భార్యా స్యాత్త్వం చ తస్యాస్తథా పతిః. 19

ప్ర. అ. సుశీలా = మంచి శీలము కలది, వపుఃశ్లాఘ్యా = దేహముచేత శ్లాఘింపదగినది, రూపేణ = సౌందర్యముచేత, భువి = భూలోకమునందు, అప్రతిమా = సాటి లేనిది అయిన, సా = ఆమె, తవ = నీకు, అనురూపా = తగిన, భార్యా = భార్య, స్యాత్ = అగును. తథా = అట్లే, త్వమ్ = నీవు, తస్యాః = ఆమెకు తగిన, పతిః = భర్తవు అగుదువు.

తా. మంచి శీలము, శ్లాఘించదగిన శరీరము, భూలోకములో సాటి లేని రూపము గల ఆమె నీకు తగిన భార్య అగును. నీవు ఆమెకు తగిన భర్తవు అగుదువు. 19

మూ. తాం తు విస్తీర్ణజఘనాం పీనశ్రోణిపయోధరామ్,
భార్యార్థే తు తవానేతుముద్యతాహం వరాననామ్, 20
విరూపితాస్మి క్రూరేణ లక్ష్మణేన మహాభుజ.

ప్ర. అ. మహాభుజ = గొప్ప భుజములు కలవాడా! విస్తీర్ణజఘనామ్ = విశాలమైన జఘనము కలది, ప్రీనశ్రోణీవయోధరామ్ = బలిసిన కటిప్రదేశము, స్తనములూ కలది అయిన, తాం వరాననామ్ = సుందరమైన ముఖము గల ఆ సీతను, తవ = నీయొక్క, భార్యార్థే = భార్య అగుటకై, ఆనేతుమ్ = తీసికొని వచ్చుటకు, ఉద్యతా = ఉద్యుక్తురాలనైన, అహమ్ = నేను, క్రూరేణ = క్రూరుడైన, లక్ష్మణేన = లక్ష్మణునిచేత, విరూపితా అస్మి = విరూపము కలదానినిగా చేయబడితిని.

తా. గొప్ప భుజములు కలవాడా! విశాలమైన జఘనము, బలిసిన కటిప్రదేశము, స్తనములు, సుందరమైన ముఖము గల ఆ సీతను నీకు భార్యగా చేయుటకై తీసికొనివచ్చుటకు నేను ప్రయత్నము చేయగా, క్రూరుడైన లక్ష్మణుడు నన్ను అవయవములు ఖండించి విరూపను చేసినాడు. 20

మూ. తాం తు దృష్ట్వాద్య వైదేహీం పూర్ణచన్ద్రనిభాననామ్,
మన్మథస్య శరాణాం వై త్వం విధేయో భవిష్యసి.

ప్ర. అ. పూర్ణచన్ద్రనిభాననామ్ = పూర్ణచంద్రునితో సమానమైన ముఖము గల, తామ్ = ఆ, వైదేహీమ్ = సీతను, అద్య = ఇప్పుడు, దృష్ట్వా = చూచి, త్వమ్ = నీవు, మన్మథస్య = మన్మథునియొక్క, శరాణామ్ = బాణములకు, విధేయః = విధేయుడవు, భవిష్యసి = కాగలవు.

తా. పూర్ణచంద్రునితో సమానమైన ముఖము గల ఆ సీతను నీవు ఇప్పుడు చూచినచో మన్మథుని బాణములకు లొంగిపోవుదువు. 21

మూ. యది తస్యామభిప్రాయో భార్యార్థే తవ జాయతే, 22
శీఘ్రముద్ధ్రియతాం పాదో జయార్థమిహ దక్షిణః.

ప్ర. అ. తస్యామ్ = ఆమెయందు, తవ = నీకు, భార్యార్థే=భార్యగా చేసి కొనుటకై, అభిప్రాయః = అభిప్రాయము, జాయతే యది = పుట్టిన ట్లయితే, ఇహ = ఇప్పుడే, జయార్థమ్=జయమునిమిత్తము, దక్షిణః పాదః=కుడి పాదము, శీఘ్రమ్ = శీఘ్రముగా, ఉద్ధ్రియతామ్ = ఎత్తబడుగాక.

తా. ఆమెను భార్యగా పొందవలె నని నీకు అభిప్రాయము కలిగినచో, ఇప్పుడే శీఘ్రముగా, విజయమునిమిత్తమై కుడి పాదమును ఎత్తుము (బయలు దేరుము). 22

మూ. కురు ప్రియం తథా తేషాం రక్షసాం రాక్షసేశ్వర, 23
వధాత్తస్య నృశంసస్య రామస్యాశ్రమవాసినః.

ప్ర. అ. రాక్షసేశ్వర = రాక్షసరాజా : తథా = మఱియు, నృశంసస్య = క్రూరుడైన, ఆశ్రమవాసినః = ఆశ్రమములో నివసించుచున్న, తస్య రామస్య = ఆ రామునియొక్క, వధాత్ = వధవలన, తేషామ్ = ఆ, రక్షసామ్=రాక్షసులకు, ప్రియమ్ = ప్రియమును, కురు = చేయుము.

తా. రాక్షసరాజా! ఆశ్రమములో నివసించుచున్న, క్రూరుడైన ఆ రాముణ్ణి చంపుటచే ఆతనిచే చంపబడిన రాక్షసు లందరికి ప్రియము చేసినవాడవు కూడ అగుదువు. 23

మూ. తం శరైర్నిశితైర్హత్వా లక్ష్మణం చ మహారథమ్, 24
హతనాథాం సుఖం సీతాం యథావదుపభోక్ష్యసి.

ప్ర. అ. మహారథమ్=మహారథుడైన, తం=ఆ రాముని, లక్ష్మణం చ= ఆ లక్ష్మణునీ, నిశితైః = వాడియైన, శరైః = బాణములచేత, హత్వా = చంపి, హతనాథామ్ = చంపబడిన నాథుడు గల, సీతామ్ = సీతను, సుఖమ్ = సుఖముగ, యథావత్ = తగు విధముగ, ఉపభోక్ష్యసి = అనుభవించగలవు.

తా. మహారథుడైన రాముణి, లక్ష్మణుణి కూడ వాడియైన బాణాలచేత

చంపి, నీవు, నాథుడు మరణించిన సీతను సుఖముగా యథేష్టముగా అనుభవించ వచ్చును.

వి. పై రెండు శ్లోకాలు గోరఖ్‌పూర్ ప్రతిలో లేవు. 24

మూ. రోచతే యది తే వాక్యం మమైతద్రాక్షసేశ్వర, 25
క్రియతాం నిర్విశఙ్కేన వచనం మమ రావణ.

ప్ర. అ. రాక్షసేశ్వర = రాక్షసప్రభువైన, రావణ = రావణా ! మమ = నాయొక్క, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యము, తే = నీకు, రోచతే యది = ఇష్టమైన ట్లయితే, నిర్విశఙ్కేన = శంక లేని నీచేత, మమ = నాయొక్క, వచనమ్ = వచనము, క్రియతామ్ = చేయబడుగాక.

తా. రాక్షసరాజువైన రావణా ! నీకు నా మాట ఇష్టమైనచో, ఎట్టి సందేహమూ లేకుండా నేను చెప్పినట్లు చేయుము. 25

మూ. విజ్ఞాయేహాత్మశక్తిం చ హ్రియతామబలా బలాత్, 26
సీతా సర్వానవద్యాఙ్గీ భార్యార్థే రాక్షసేశ్వర.

ప్ర. అ. రాక్షసేశ్వర = రాక్షసరాజా ! ఆత్మశక్తిమ్ = నీ శక్తిని, విజ్ఞాయ = తెలుసుకొని, సర్వానవద్యాఙ్గీ = దోషములులేని అన్ని అవయవములు కలది, అబలా = దుర్బలురాలు అయిన, సీతా = సీత, భార్యార్థే = భార్యగా అగుటకు, బలాత్ = బలాత్కారమువలన, హ్రియతామ్ = అపహరించబడుగాక.

తా. రాక్షసరాజా ! నీవు మహాబలవంతుడ వను విషయమును కూడ గుర్తుంచుకొని, ఎట్టి దోషములు లేని సకలావయవములు గల, దుర్బలురాలైన సీతను బలాత్కారముగా [illegible]ంచి తీసికొని వచ్చి భార్యగా చేసికొనుము. 26

మూ. నిశమ్య రామేణ శరైరజిహ్మగై
ర్హతాన్ జనస్థానగతాన్ నిశాచరాన్,
ఖరం చ బుద్ధ్వా నిహతం చ దూషణం
త్వమత్ర కృత్యం ప్రతిపత్తుమర్హసి. 27

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
చతుస్త్రింశః సర్గః.

ప్ర. అ. రామేణ = రామునిచేత, అజిహ్మగైః = వంకర లేకుండా పోవునట్టి, శరైః = బాణములచేత, జనస్థానగతాన్ = జనస్థానములో ఉన్న, నిశాచరాన్ = రాక్షసులను, హతాన్ = చంపబడిన వానినిగా, నిశమ్య = విని, ఖరం చ = ఖరుణ్ణి, దూషణం చ = దూషణుణ్ణి, నిహతమ్ = చంపబడిన వానినిగా, బుద్ధ్వా = తెలిసికొని, త్వమ్ = నీవు, అత్ర = ఈ విషయమునందు, కృత్యమ్ = చేయదగిన పనిని, ప్రతిపత్తుమ్ = నిర్ణయించుటకు, అర్హసి = తగియున్నావు.

తా. వంకరగా కాక తిన్నగా పోవు బాణములచేత రాముడు జనస్థానములో ఉన్న రాక్షసులను ఖరదూషణులను కూడ సంహరించినాడన్న విషయము తెలిసికొని నీవు ఇప్పుడు ఏమి చేయవలెనో నిర్ణయించుకొనుము. 27

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో ముప్పది నాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చత్రింశః సర్గః

[రావణుడు సాగరము ప్రక్కనున్న జలప్రాయదేశము చూచుచు మారీచునివద్దకు వెళ్ళుట].

మూ. తతః శూర్పణఖావాక్యం తచ్ఛ్రుత్వా రోమహర్షణమ్,
సచివానభ్యనుజ్ఞాయ కార్యం బుద్ధ్వా జగామ హ. 1

ప్ర. అ. తతః = అటుపిమ్మట.(రావణుడు), రోమహర్షణమ్ = రోమాంచమును కలిగించు (భయంకరమైన) తత్ = ఆ, శూర్పణఖావాక్యమ్=శూర్పణఖ వాక్యమును, శ్రుత్వా = విని, సచివాన్ = మంత్రులను, అభ్యనుజ్ఞాయ=వెళ్లుటకు అనుమతించి, కార్యమ్ = చేయవలసిన పనిని, బుద్ధ్వా = తెలిసికొని, జగామ హ = వెళ్లెను.

తా. రావణుడు శూర్పణఖ చెప్పిన భయంకరమైన విషయమును విని, మంత్రులకు వెళ్లుటకై అనుమతి ఇచ్చి, చేయవలసిన కార్యమును నిర్ణయించుకొని వెళ్లెను. 1

మూ. తత్కార్యమనుగమ్యాథ యథావదవబుధ్య చ,
దోషాణాం చ గుణానాం చ సంప్రధార్య బలాబలమ్. 2

ఇతి కర్తవ్యమిత్యేవ కృత్వా నిశ్చయమాత్మనః,
స్థిరబుద్ధిస్తతో రమ్యాం యానశాలాం జగామ హ. 3

ప్ర. అ. అథ = అటుపిమ్మట, తత్ = ఆ, కార్యమ్ = కార్యమును, అనుగమ్య = ఆలోచించి, యథావత్ = తగిన రీతిగా, అవబుధ్య చ = తెలిసికొని, దోషాణామ్ = దోషములయొక్క, గుణానాం చ = గుణములయొక్క, బలాబలమ్ = బలాబలములను, సంప్రధార్య = నిర్ణయించుకొని, ఇతి = ఈ విధముగా, కర్తవ్యమ్ ఇత్యేవ = చేయవలెను అని. ఆత్మనః = తనయొక్క, నిశ్చయమ్ =

నిశ్చయమును, కృత్వా = చేసికొని, స్థిరబుద్ధిః = స్థిరమైన బుద్ధి కలవాడై, తతః = అటు పిమ్మట, యానశాలామ్ = వాహనముల శాలను గూర్చి, జగామ హ = వెళ్లెను.

తా. పిమ్మట రావణుడు ఆ కార్యమును గూర్చి బాగా ఆలోచించి, విషయమును ఉన్నదున్నట్లు గ్రహించెను. గుణములు అధికముగా ఉన్నవా దోషములు అధికముగా ఉన్నవా అని జాగ్రత్తగా పరిశీలించి "ఈ విధముగానే చేయవలెను" అని తన కర్తవ్యమును నిర్ణయించుకొని, స్థిరమైన బుద్ధితో వాహనశాలకు వెళ్లెను. 2, 3

మూ. యానశాలాం తతో గత్వా ప్రచ్ఛన్నో రాక్షసాధిపః,
సూతం సంచోదమామాస రథః సంయోజ్యతామితి. 4

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రాక్షసాధిపః = రావణుడు, ప్రచ్ఛన్నః = దాగి ఉన్నవాడై, యానశాలామ్ = వాహనశాలను గూర్చి, గత్వా = వెళ్ళి, రథః = రథము, సంయోజ్యతామ్ = కట్టబడుగాక, ఇతి = అని, సూతమ్ = సారథిని, సంచోదయామాస = ప్రేరేపించెను.

తా. పిమ్మట రావణుడు రహస్యముగా వాహనశాలకు వెళ్ళి, "రథమును కట్టుము"అని సారథిని ఆజ్ఞాపించెను. 4

మూ. ఏవముక్తః క్షణేనైవ సారథిర్లఘువిక్రమః,
రథం సంయోజయామాస తస్యాభిమతముత్తమమ్. 5

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, లఘువిక్రమః = శీఘ్రమైన గమనముగల, సారథిః = సారథి, తస్య = ఆతనికి, అభిమతమ్ = ఇష్టమైన, ఉత్తమమ్ = ఉత్తమమైన, రథమ్ = రథమును, క్షణేనైవ = క్షణకాలముచేతనే, సంయోజయామాస = కూర్చెను.

తా. రావణుని ఆజ్ఞ ప్రకారము, సారథి శీఘ్రముగా ప్రవర్తించుచు, ఆ రావణునికి ఇష్టమైన, ఉత్తమమైన రథమును క్షణకాలములో సిద్ధము చేసెను. 5

మూ. కాఞ్చనం రథమాస్థాయ కామగం రత్నభూషితమ్,
పిశాచవదనైర్యుక్తం ఖరైః కాఞ్చనభూషణైః. 6

మేఘప్రతిమనాదేన స తేన ధనదానుజః,
రాక్షసాధిపతిః శ్రీమాన్ యయౌ నదనదీపతిమ్. 7

ప్ర. అ. ధనదానుజః = కుబేరుని తమ్ముడు, శ్రీమాన్ = శోభాయుక్తుడు అయిన, సః రాక్షసాధిపతిః = ఆ రావణుడు, కాఞ్చనభూషణైః = బంగారు అలంకారములు గల, పిశాచవదనైః = పిశాచముల వంటి ముఖములు గల, ఖరైః = గాడిదలతో, యుక్తమ్ = కూర్చబడిన, కాఞ్చనమ్ = బంగారువికారమైన, కామగమ్ = ఇష్టానుసారము నడచు, రత్నభూషితమ్ = రత్నములచేత అలంకరించబడిన, రథమ్ = రథమును, ఆస్థాయ = అధిష్ఠించి, మేఘప్రతిమనాదేన = మేఘముతో సమానమైన ధ్వని గల, తేన = ఆ రథముచేత, నదనదీపతిమ్ = (పశ్చిమముఖముగా ప్రవహించు) నదములకు, (తూర్పుముఖముగా ప్రవహించు) నదులకు ప్రభువైన సముద్రమును గూర్చి, యయౌ = వెళ్ళెను.

తా. కుబేరుని తమ్ముడు, శ్రీమంతుడు అయిన రావణుడు ఆ బంగారు రథము నెక్కెను. రథికుని ఇష్టానుసారము ప్రయాణము చేయు ఆ రథము రత్నములచేత అలంకరింపబడెను. బంగారు అలంకారములు అలంకరించిన గాడిదలు దానికి కట్టబడెను. వాటి ముఖములు పిశాచముల ముఖములు వలె ఉండెను. మేఘధ్వనితో సమానమైన ధ్వని గల అట్టి రథము నెక్కి అతడు నదములకు, నదులకు భర్తయైన సముద్రము వైపు వెళ్లెను. 6, 7

మూ. స శ్వేతవాలవ్యజనః శ్వేతచ్ఛత్రో దశాననః,
స్నిగ్ధవైదూర్యసంకాశ స్తప్తకాఞ్చనకుణ్డలః. 8

వింశద్భుజో దశగ్రీవో దర్శనీయపరిచ్ఛదః,
త్రిదశారిర్మునీన్ద్రఘ్నో దశశీర్ష ఇవాద్రిరాట్, 9

కామగం రథమాస్థాయ శుశుభే రాక్షసేశ్వరః,
విద్యున్మణ్డలవాన్మేఘః సబలాక ఇవామ్బరే. 10

ప్ర. అ. శ్వేతవాలవ్యజనః = తెల్లని వింజామరలు కలవాడు, శ్వేతచ్ఛత్రః = తెల్లని ఛత్రము కలవాడు, దశాననః = పది ముఖములు కలవాడు, స్నిగ్ధవైదూర్యసంకాశః = నున్నని వైదూర్యమాణిక్యముతో సమానుడు, తప్తకాఞ్చన కుణ్డలః

= పరిశుద్ధమైన బంగారపు కుండలములు కలవాడు, వింశద్భుజః = నూరు భుజములు గలవాడు, దశగ్రీవః = పది కంఠములు కలవాడు, దర్శనీయపరిచ్ఛదః = అందమైన రాజచిహ్నములు కలవాడు, త్రిదశారిః = దేవతల శత్రువు, మునీన్ద్రఘ్నః = మునీంద్రులను చంపువాడు, దశశీర్షః = పది శిఖరములు గల, అద్రిరాడివ = పర్వతరాజు వలె ఉన్నవాడు అయిన, సః రాక్షసేశ్వరః = ఆ రావణుడు, కామగమ్ = ఇచ్ఛానుసారము వెళ్ళు. రథమ్ = రథమును, ఆస్థాయ = అధిష్ఠించి, అమ్బరే = ఆకాశమునందు, విద్యున్మణ్డలవాన్ = మెరుపుల మండలము గల, సబలాకః = కొంగలతో కూడిన, మేఘః ఇవ = మేఘము వలె, శుశుభే = ప్రకాశించెను.

తా. నున్నగా ఉన్న వైడూర్యమణి వంటి శరీరచ్ఛాయ గల ఆ రావణుడు శుద్ధమైన బంగారముతో చేసిన కుండలములు ధరించెను. అతని ప్రక్క నున్న శ్వేతచ్ఛత్రము, తెల్లని వింజామరలు మొదలైన రాజచిహ్నములు చూచుటకు మనోహరములై ఉండెను. ఇరువది భుజములు గల ఆ రావణుడు, పది ముఖములతో, పది కంఠములతో, పది శిఖరము లున్న పర్వతము వలె ప్రకాశించుచుండెను. దేవతల శత్రువు, మునులను హింసించువాడు అయిన ఆ రావణుడు ఇచ్ఛానుసారము ప్రయాణము చేసే రథమునెక్కి వెళ్ళుచు, ఆకాశమునందు, చుట్టూ మెరపుల మండలము ఉన్న, కొంగలతో కూడిన మేఘము వలె ప్రకాశించెను. 8,9,10

మూ. స శైలం సాగరానూపం వీర్యవానవలోకయన్,
నానాపుష్పఫలైర్వృక్షైరనుకీర్ణం సహస్రశః. 11

ప్ర. అ. వీర్యవాన్ = పరాక్రమవంతుడైన, సః = ఆ రావణుడు, శైలమ్ = పర్వతమును, సహస్రశః = వేలకొలది, నానాపుష్పఫలైః = అనేకవిధములైన పుష్పములు ఫలములు గల, వృక్షైః = వృక్షములచేత, అనుకీర్ణమ్ = వ్యాప్తమయిన, సాగరానూపమ్ = సముద్రము దగ్గర ఉన్న జలప్రాయప్రదేశమును, అవలోకయన్ చూచుచు, వెళ్లెను.

తా. పరాక్రమవంతుడైన ఆ రావణుడు పర్వతమును, అనేక విధములైన పుష్పములు, ఫలములు గల వేలకొలది చెట్లతో నిండి ఉన్న సముద్రతీరము వందలి జలప్రాయదేశమును చూచుచు వెళ్ళెను. 11

మూ. శీతమఙ్గలతోయాభిః పద్మినీభిః సమన్తతః,
విశాలై రాశ్రమపదై ర్వేదిమద్భిః సమావృతమ్. 13

ప్ర. అ. శీతమఙ్గలతోయాభిః = చల్లని. మంగళప్రదములైన ఉదకములు గల, పద్మినీభిః = పద్మసరస్సులచేతను, వేదిమద్భిః = వేదులు (అగ్నివేదులు) గల, విశాలైః = విశాలమైన, ఆశ్రమపదైః = ఆశ్రములచేతను, సమన్తతః = అంతటా, సమావృతమ్ = కప్పబడిన (సముద్రతీరమును చూచుచు వెళ్లెను).

తా. ఆ సముద్రతీరమునందు అంతటా, చల్లని మంగళకరములైన ఉదకములున్న పద్మసరస్సులు, యాగవేదికలతో కూడిన విశాలమునైన ఆశ్రమములు ఉండెను. 13

మూ. కదళ్యాఢకిసంబాధం నారికేళోపశోభితమ్,
సాలైస్తాలై స్తమాలైశ్చ పుష్పితై స్తరుభిర్వృతమ్. 14

ప్ర. అ. కదళ్యాఢకిసంబాధమ్ = అరటిచెట్లతోను, కందిచెట్లతోను ఇరుకుగా ఉన్నది, నారికేలోపశోభితమ్ = కొబ్బరిచెట్లచేత శోభింపచేయబడినది, పుష్పితైః = పుష్పించిన, సాలైః = మద్దిచెట్లతోను, తాలైః = తాళవృక్షములతోను, తమాలైః = తమాలవృక్షములతోను, తరుభిః = ఇతరవృక్షములతోను, వృతమ్ = కూడినదీ అయిన (సముద్రతీరమును చూచుచు వెళ్ళెను).

తా. ఆ సముద్రతీరమునందు అరటిచెట్లు, కందిచెట్లు దట్టముగా ఉండెను. అది కొబ్బరిచెట్లతో ప్రకాశించుచుండెను. ఆ ప్రదేశమునందు అంతటా పుష్పించిన మద్దిచెట్లు, తాటిచెట్లు, తమాలవృక్షములు ఇతరవృక్షములు వ్యాపించి ఉండెను. 14

మూ. నాగైః సుపర్ణైర్గన్ధర్వైః కిన్నరైశ్చ సహస్రశః,
అజైర్వైఖానసైర్మాషైర్వాలఖిల్యైర్మరీచిపైః,
అత్యన్తనియతాహారైః శోభితం పరమర్షిభిః,
జితకామైశ్చ సిద్ధైశ్చ చారణై రుపశోభితమ్. 16

ప్ర. అ. నాగైః = నాగులచేతను, సుపర్ణైః = పక్షులచేతను, గన్ధర్వైః =

గంధర్వ్యలచేతను, సహస్రశః = వేలకొలది, కిన్నరైశ్చ=కింనరులచేతను, అజైః = బ్రహ్మపుత్రులైన, వైఖానసైః = వైఖానసులచేతను, మాషైః = మాష గోత్రమువారిచేతను, మరీచిపైః = చంద్రకిరణములను త్రాగు, వాలఖిల్యైః = వాలఖిల్యులచేతను, అత్యన్త నియతాహారైః=మిక్కిలి నియమిత మైన ఆహారము గల, పరమర్షిభిః = గొప్ప ఋషులచేతను, శోభితమ్ = ప్రకాశింపచేయబడిన, జితకామైః = జయించబడిన కామములు గల, సిద్ధైశ్చ = సిద్ధులచేతను, చారణైః = చారణులచేతను, ఉపశోభితమ్ = ప్రకాశింపచేయబడిన (సముద్రప్రాంతమును చూచుచు వెళ్ళెను.)

తా. ఆ సముద్రతీరమునందు వేలకొలది నాగులు, పక్షులు, గంధర్వ్యులు, కింనరులు, బ్రహ్మపుత్రులైన వైఖానసులు, మాషగోత్రికులు, చంద్రకిరణములు మాత్రమే ఆహారముగా భుజించు వాలఖిల్యులు, ఎక్కువగా ఆహారనియమము పాటించు మహర్షులు, కామములను జయించిన సిద్ధులు, చారణులు నివసించుచు దానిని శోభింపచేయుచుండిరి. 16

మూ. దివ్యాభరణమాల్యాభిర్దివ్యరూపాభిరావృతమ్,
క్రీడారతివిధిజ్ఞాభిరప్సరోభిః సహస్రశః. 17

ప్ర. అ. దివ్యాభరణమాల్యాభిః = దివ్యములైన అలంకారములు, మాలికలు గల, దివ్యరూపాభిః = దివ్యమైన రూపము గల క్రీడారతివిధిజ్ఞాభిః = రతిక్రీడల విధానములను ఎరిగిన, సహస్రశః = వేలకొలది, అప్సరోభిః = అప్సరఃస్త్రీలచేత, ఆవృతమ్ = వ్యాప్తమైన (సముద్రతీరమును చూచుచు వెళ్ళెను.)

తా. ఆ సముద్రతీరమునందు దివ్యమైన రూపము గల అప్సరఃస్త్రీలు ఉండిరి. వాళ్ళు అందరూ దివ్యములైన అలంకారములు, పుష్పమాలలు ధరించిరి. అందరూ కూడ రతిక్రీడావిధానము లన్నీ బాగా తెలిసినవాళ్లు. 17

మూ. సేవితం దేవపత్నీభిః శ్రీమతీభిః శ్రియా వృతమ్,
దేవదానవసంఘైశ్చ చరితం త్వమృతార్థిభిః 18

ప్ర. అ. శ్రీమతీభిః = శోభ గల, దేవపత్నీభిః = దేవతల భార్యలచేత, సేవితమ్ = సేవింపబడినది, శ్రియా = శోభతో, వృతమ్ = కూడినది, అమృతార్థిభిః

=అమృతమును కోరు, దేవదానవసంఘైశ్చ=దేవతలయొక్క, దానవులయొక్క సంఘములచేత, చరితమ్ = సంచరించబడినది అయిన (సముద్రతీరమును చూచుచు వెళ్లెను).

తా. ఆ సముద్రతీరమునందు శోభావతులైన దేవభార్యలు నివసించుచుండిరి. శోభాయమానముగా ఉన్న తీరమునందు అమృతమునందు ఆసక్తి గల దేవదానవ సంఘములు సంచరించుచుండెను.

వి. "అమృతాశిభిః" అను పాఠమునకు బదులు "అమృతార్థిభిః" అను ప్రాచ్యపాఠము గ్రహింపబడినది. దానవులు అమృతమును తినలేదు గాన వారు అమృతాశులు కారు కదా. దేవతలు అమృతమును తిన్నవారే గావున వారికి కూడ "అమృతార్థిభిః" అన్న విశేషణము కుదరదు. అమృతోత్పత్తికి పూర్వము దేవ దానవులు ఈ తీరమున అమృతాభిలాషులై తిరిగేవారు అని అర్థం చెప్పవలెను.

మూ. హంసక్రౌఞ్చప్లవాకీర్ణం సారసైః సంప్రణాదితమ్,
వైడూర్యప్రస్తరం రమ్యం స్నిగ్ధం సాగరతేజసా. 18

ప్ర. అ. హంసక్రౌఞ్చప్లవాకీర్ణమ్ = హంసలతోను, క్రౌంచపక్షులతోను, కప్పలతోను వ్యాప్తమైనది, సారసైః = సారసపక్షులచేత, సంప్రణాదితమ్ = ధ్వనింపచేయబడినది, వైడూర్యప్రస్తరమ్=వైడూర్యమాణిక్యవికారములైన శిలా ఫలకములు కలది, రమ్యమ్ = సుందరము, సాగరతేజసా = సముద్రకాంతిచేత, స్నిగ్ధమ్ = నునుపుగా ఉన్నది అయిన (సముద్రతీరప్రాంతమును చూచుచు వెళ్లెను).

తా. సముద్రకాంతి ప్రసరించి నున్నగా ఉన్నట్లు కనబడుచున్న ఆ సముద్రతీరము హంసలతోను, క్రౌంచపక్షులతోను, కప్పలతోను నిండి యుండెను. సారసపక్షుల ధ్వనులతో ప్రతిధ్వనించుచుండెను. అక్కడ వైడూర్యమాణిక్య ముల వికారములైన శిలాఫలకము లుండెను. 18

మూ. పాణ్డురాణి విశాలాని దివ్యమాల్యయుతాని చ,
తూర్యగీతాభిజుష్టాని విమానాని సమన్తతః. 19

తపసా జితలోకానాం కామగాన్యభిసంపతన్,
గన్ధర్వాప్సరసశ్చైవ దదర్శ ధనదానుజః. 20

ప్ర. అ. అభిపతన్ = తొందరగా వెళ్ళుచున్న, ధనదానుజః=రావణుడు, తపసా = తపస్సుచేత, జితలోకానామ్ = జయింపబడిన స్వర్గాదిలోకములుకల వారియొక్క, పాణ్డరాణి = తెల్లనివి, విశాలాని=విశాలములు, దివ్యమాల్యయుతాని చ = దివ్యములైన మాలలతో కూడినవి, తూర్యగీతాభిజుష్టాని = వాద్యములతోను, గీతములతోను కూడినవి, కామగాని =: స్వేచ్ఛగా సంచరించునవి అయిన, విమానాని = విమానములను, సమన్తతః = అంతటా, గన్ధర్వాప్సరసశ్చైవ=గంధర్వులను, అప్సరఃస్త్రీలను, దదర్శ = చూచెను.

తా. తొందరగా ప్రయాణము చేయుచున్న ఆ రావణుడు మార్గమునందు అంతటా, గంధర్వులను, అప్సరఃస్త్రీలను, తపస్సుచేత స్వర్గాదిలోకములను జయించిన పుణ్యాత్ముల విశాలములైన విమానములను చూచెను. తెల్లగా ఉన్న ఆ విమానములు దివ్యములైన మాలలతో అలంకరింపబడి వాద్యగీతధ్వనులతో మారు మ్రోగుచుండెను. 19,20

మూ. నిర్యాసరసమూలానాం చన్దనానాం సహస్రశః,
వనాని పశ్యన్ సౌమ్యాని ఘ్రాణతృప్తికరాణి చ. 21

ప్ర. అ. నిర్యాసరసమూలానామ్=బంకయొక్క రసము మొదళ్లలో గల, చన్దనానామ్ = మంచిగంధపు చెట్లయొక్క, సౌమ్యాని=అందమైన, ఘ్రాణతృప్తికరాణి చ=ఘ్రాణేంద్రియమునకు తృప్తికలిగించు, సహస్రశః=వేలకొలది, వనాని = వనములను, పశ్యన్ = చూచుచు, వెళ్లెను.

తా. ఆ రావణుడు, సుందరములు, ఘ్రాణేంద్రియమునకు తృప్తి కలిగించేవి అయిన వేలకొలది చందనవృక్షముల వనములను చూచెను. ఆ వృక్షముల మొదళ్లలో పల్చని జిగురు కారుచుండెను. 21

మూ. అగురూణాం చ ముఖ్యానాం వనాన్యుపవనాని చ,
తక్కోలానాం చ జాత్యానాం ఫలినాం చ సుగన్ధినామ్.

ప్ర. అ. ముఖ్యానామ్ = శ్రేష్ఠములైన, అగురూణామ్=అగురువృక్షముల

యొక్క, వనాని = వనములను, ఉపవనాని చ = ఉద్యానవనములను, తక్కోలానామ్ = తక్కోలవృక్షములయొక్క, ఫలినామ్ = ఫలములు గల, సుగన్ధినామ్ = సువాసన గల, జాత్యానామ్ = జాజిచెట్లయొక్క వనములను చూచుచు వెళ్లెను.

తా. శ్రేష్ఠములైన అగురుచెట్లు, తక్కోలవృక్షములు, ఫలములున్న, మంచి సువాసన గల జాజిచెట్లు ఉన్న వనములను, ఉద్యానములను చూచుచు వెళ్ళెను.

మూ. పుష్పాణి చ తమాలస్య గుల్మాని మరిచస్య చ,
ముక్తానాం చ సమూహాని శుష్యమాణాని తీరతః. 23

ప్ర. అ. తమాలస్య = తమాలవృక్షముయొక్క, పుష్పాణి = పుష్పములను, మరిచస్య = మిరియముయొక్క, గుల్మాని = పొదలను, తీరతః = తీరమునందు, శుష్యమాణాని = ఎండుచున్న, ముక్తానామ్ = ముత్యములయొక్క, సమూహాని చ = సముదాయములను చూచుచు వెళ్లెను.

తా. ఆ ప్రాంతమునందు తమాలవృక్షముల పుష్పములు, మిరియపు తొంకలు, తీరముమీద ఎండుచున్న ముత్యముల ప్రోగులు ఉండెను. 23

మూ. శఙ్ఖానాం ప్రస్తరం చైవ ప్రవాళనిచయం తథా,
కాఞ్చనాని చ శైలాని రాజతాని చ సర్వశః. 24

ప్ర. అ. శఙ్ఖానామ్ = శంఖములయొక్క, ప్రస్తరం చైవ = సముదాయమును, తథా = మరియు, ప్రవాళనిచయమ్ = పగడముల సముదాయమును, సర్వశః = అన్ని వైపులా, కాఞ్చనాని = బంగారు వికారమైన, రాజతాని చ = వెండి వికారమైన, శైలాని = పర్వతములను, (చూచుచు వెళ్ళెను).

తా. అక్కడ శంఖాల సముదాయములు, పగడాల ప్రోగులు, నలువైపులందు బంగారు కొండలు, వెండి కొండలు ఉండెను. 24

మూ. ప్రస్రవాణి మనోజ్ఞాని ప్రసన్నాని హ్రదాని చ,
ధనధాన్యోపపన్నాని స్త్రీరత్నైః శోభితాని చ. 25
హస్త్యశ్వరథగాఢాని నగరాణ్యవలోకయన్.

ప్ర. అ. మనోజ్ఞాని = మనోహరములైన, ప్రస్రవాణి = సెలయేళ్లను,

ప్రసన్నాని = నిర్మలములైన, హ్రదాని చ = మడుగులను, ధనధాన్యోపపన్నాని = ధనధాన్యములతో కూడిన, స్త్రీరత్నైః = శ్రేష్ఠలైన స్త్రీలచేత, శోభితాని = శోభింప బడిన, హస్త్యశ్వరథగాఢాని = గజములతోను, అశ్వములతోను, రథములతోను కిక్కిరిసిఉన్న, నగరాణి = నగరములను, అవలోకయన్ = చూచుచు(వెళ్లెను).

తా. రావణుడు మార్గమధ్యమునందు మనోహరములైన సెలయేళ్ళను, నిర్మలములైన చెరువులను, ధనధాన్యసమృద్ధములు, ఉత్తమస్త్రీలతో శోభించు చున్నవి, గజములతోను, అశ్వములతోను, రథములతోను కిక్కిరిసి ఉన్నవి అయిన నగరములను చూచెను. 25

మూ. తం సమం సర్వతః స్నిగ్ధం మృదుసంస్పర్శమారుతమ్,
అనూపం సిన్ధురాజస్య దదర్శ త్రిదశోపమమ్. 26

ప్ర. అ. ("త్రిదివోపమమ్"అను గోరఖ్‌పూర్ ప్రతి పాఠము బాగున్నది) సర్వతః = అంతటా, సమమ్ = సమముగా ఉన్నది, స్నిగ్ధమ్ = సుందరము, మృదుసంస్పర్శమారుతమ్ = మృదువైన స్పర్శ గల వాయువు గలది, త్రిదివోపమమ్ = స్వర్గమువలె ఉన్న, సిన్ధురాజస్య = సముద్రముయొక్క, తమ్ అనూపమ్ = ఆ జలప్రాయప్రదేశమును, దదర్శ = చూచెను.

తా. సముద్రము దగ్గరనున్న ఆ జలప్రాయప్రదేశము అంతటా సమముగా, సుందరముగా ఉండెను. వాయువు స్పర్శానుకూలముగా ఉండెను. ఆ విధముగ అది స్వర్గలోకము వలె ఉండెను.

వి. ఇక్కడ ప్రాచ్యపాఠం వేరుగా ఉన్నది-

"స పశ్యన్నథ సంప్రాప్త ఆశ్రమం పుణ్యకర్మణః,
సిన్ధురాజస్య తు మునేర్జటామణ్డలధారిణః''.

''అతడు ఆ నగరాదులను చూచుచు పుణ్యాత్ముడు, జటామండలము ధరించినవాడు అయిన సింధురాజు అనే ముని ఆశ్రమమును చేరెను''అని అర్థము. 26

మూ. తత్రాపశ్యత్స మేఘాభం న్యగ్రోధమృషిభిర్వృతమ్ 27
సమన్తాద్యస్య తాః శాఖాః శతయోజనమాయతాః.

ప్ర. అ. తత్ర = అక్కడ, సః = ఆ రావణుడు, యస్య = దేనియొక్క, తాః శాఖాః = ఆ కొమ్మలు, సమన్తాత్ = నలుమూలల, శతయోజనమ్ = నూరు యోజనములు, ఆయతాః=పొడవైనవో, అట్టి, మేఘాభమ్=మేఘమువంటి కాంతి గల, ఋషిభిః వృతమ్=ఋషులతో కూడిన, న్యగ్రోధమ్=మఱ్ఱిచెట్టును, అపశ్యత్ = చూచెను.

తా. అక్కడ ఆతడు మేఘము వంటి కాంతి గల ఒక వటవృక్షమును చూచెను. దాని చుట్టూ నూరు యోజనముల పొడవైన శాఖలు ఉండెను. దానిపై ఎందరో ఋషులు నివసించుచుండిరి. 27

మూ. యస్య హస్తినమాదాయ మహాకాయం చ కచ్ఛపమ్, 28
భక్షార్థం గరుడః శాఖామాజగామ మహాబలః.

ప్ర. అ. మహాబలః = గొప్ప బలము గల, గరుడః = గరుత్మంతుడు, భక్షార్థమ్ = భక్షణమునిమిత్తము, హస్తినమ్ = గజమును, మహాకాయమ్ = పెద్ద దేహము గల, కచ్ఛపం చ = తాబేలును, ఆదాయ = గ్రహించి, యస్య = ఏ వటవృక్షముయొక్క, శాఖామ్ = శాఖనుగూర్చి, ఆజగామ = వచ్చెనో.

తా. పూర్వము మహాబలశాలియైన గరుత్మంతుడు ఈ వటవృక్షము కొమ్మపై కూర్చుండి తినుటకై పెద్ద గజమును, పెద్ద శరీరము గల తాబేలును తెచ్చుకొనెను. 28

మూ. తస్య తాం సహసా శాఖాం భారేణ పతగోత్తమః. 29
సుపర్ణః పర్ణబహులాం బభఞ్జ చ మహాబలః.

ప్ర. అ. పతగోత్తమః = పక్షులలో ఉత్తముడైన, మహాబలః = గొప్ప బలము గల, సుపర్ణః = ఆ గరుత్మంతుడు, తస్య = ఆ వృక్షముయొక్క, తాం శాఖామ్ = ఆ శాఖను. భారేణ = భారముచేత, సహసా = హటాత్తుగా, బభఞ్జ = విరచెను.

తా. పక్షులలో శ్రేష్ఠుడు, మహాబలశాలి అయిన ఆ గరుత్మంతుడు కూర్చున్న వెంటనే ఆ వృక్షము కొమ్మ, బరువుకు విరిగిపోయెను. 29

మూ. తత్ర వైఖానసా మాషా వాలఖిల్యా మరీచిపాః, 30
అజా బభూవుర్ధూమ్రాశ్చ సంగతాః పరమర్షయః.

ప్ర. అ. వైఖానసాః = వైఖానసులు, మాషాః = మాషగోత్రమువారు, మరీచిపాః = కిరణములు మాత్రము త్రాగు, వాలఖిల్యాః = వాలఖిల్యులు, అజాః = బ్రహ్మపుత్రులు, ధూమ్రాశ్చ = ధూమపానముచేయు, పరమర్షయశ్చ = గొప్ప ఋషీశ్వరులు, తత్ర = ఆ కొమ్మమీద, సంగతాః = కలసినవారై, బభూవుః = ఉండిరి.

తా. వైఖానసులు, మాషగోత్రమునకు చెందిన మహర్షులు, చంద్రకిరణములు మాత్రమే ఆహారముగా త్రాగు వాలఖిల్యులు, బ్రహ్మపుత్రులైన మహర్షులు తలక్రిందుగా వ్రేలాడుచు, ధూమమును త్రాగుచు తపస్సు చేసే మహర్షులు కలిసి ఆ కొమ్మను అంటిపెట్టుకొని ఉండిరి. 30

మూ. తేషాం దయార్థం గరుడస్తాం శాఖాం శతయోజనామ్, 31
జగామాదాయ వేగేన తౌ చోభౌ గజకచ్ఛపౌ.

ప్ర. అ. గరుడః = గరుత్మంతుడు, తేషామ్ = ఆ మహర్షుల, దయార్థమ్ = దయకొరకు, శతయోజనామ్ = నూరు యోజనముల పొడవైన, తాం శాఖామ్ = ఆ కొమ్మను, తౌ = ఆ, ఉభౌ = రెండు, గజకచ్ఛపౌ = గజమును తాబేలును, ఆదాయ = గ్రహించి, వేగేన = వేగముతో, జగామ = వెళ్ళెను.

తా. గరుత్మంతుడు ఆ మహర్షులమీద దయచేత, నూరు యోజనముల పొడవైన ఆ శాఖను, ఆ గజకచ్ఛపములు రెండింటిని తీసికొని వేగముగా వెళ్లెను. 31

మూ. ఏకపాదేన ధర్మాత్మా భక్షయిత్వా తదామిషమ్, 32
నిషాదవిషయం హత్వా శాఖయా పతగోత్తమః,
ప్రహర్షమతులం లేభే మోక్షయిత్వా మహామునీన్. 33

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, పతగోత్తమః = పక్షులలో ఉత్తముడైన ఆ గరుత్మంతుడు, తత్ = ఆ, ఆమిషమ్ = మాంసమును, ఏకపాదేన = ఒక్క పాదముచేత, భక్షయిత్వా = భక్షించి, శాఖయా = కొమ్మచేత, నిషాదవిష

యమ్ = నిషాదుల దేశమును, హత్వా = చంపి, మహామునీన్ = మహామునులను, మోక్షయిత్వా = విడిపింపచేసి, అతులమ్ = సాటి లేని, ప్రహర్షమ్ = ఆనంద మును, లేభే = పొందెను.

తా. ధర్మాత్ముడు, పక్షులలో ఉత్తముడూ అయిన ఆ గరుత్మంతుడు ఆ గజకచ్ఛపముల మాంసమును ఒక పాదముతో పట్టుకొని తిని, ఆ కొమ్మతో నిషాదులను (ఆటవికులను) చంపి, కొమ్మను ఆశ్రయించి ఉన్న మహామునులకు ఆపద కలగకుండు నట్లు వారిని విడిపించి చాల సంతోషించెను. 32, 33

మూ. స తేనైవ ప్రహర్షేణ ద్విగుణీకృతవిక్రమః,
అమృతానయనార్థం వై చకార మతిమాన్ మతిమ్. 34

ప్ర. అ. మతిమాన్ = బుద్ధిమంతుడైన, సః = ఆ గరుత్మంతుడు, తేనైవ ప్రహర్షేణ = ఆ ఆనందముచేతనే, ద్విగుణీకృతవిక్రమః = రెట్టింపు చేయబడిన పరాక్రమము కలవాడై, అమృతానయనార్థమ్ = అమృతమును తీసికొనివచ్చుటకు, మతిమ్ = ఆలోచనను, చకార = చేసెను.

తా. బుద్ధిమంతుడైన గరుత్మంతుడు ఆ సంతోషముచేత రెట్టింపు అయిన పరాక్రమముతో అమృతమును తీసికొనివచ్చుటకు నిర్ణయము చేసెను. 34

మూ. అయోజాలాని నిర్మథ్య భిత్త్వా రత్నమయం గృహమ్,
మహేన్ద్రభవనాద్గుప్తమాజహారామృతం తతః. 35

ప్ర. అ. అయోజాలాని = ఇనుపకటకటాలను, నిర్మథ్య = విరగగొట్టి, రత్నమయమ్ = రత్నవికారమైన, గృహమ్ = గృహమును, భిత్త్వా = భేదించి, తతః = ఆ, మహేన్ద్రభవనాత్ = మహేంద్రుని భవనమునుండి, గుప్తమ్ = దాచి ఉంచబడిన, అమృతమ్ = అమృతమును, ఆజహార = హరించెను.

తా. గరుత్మంతుడు ఇనుప కటకటాలను విరగగొట్టి, రత్నములతో నిర్మించిన గృహమును బ్రద్దలుకొట్టి, ఆ మహేంద్రభవనమునందు, రహస్యముగా దాచి ఉంచిన అమృతమును తీసికొనివచ్చెను. 35

మూ. తం మహర్షిగణైర్జుష్టం సువర్ణకృతలక్షణమ్,
నామ్నా సుభద్రం న్యగ్రోధం దదర్శ ధనదానుజః. 36

ప్ర. అ. ధనదానుజః = రావణుడు, మహర్షిగణైః = మహర్షుల సముదాయముచేత, జుష్టమ్ = పొందబడినది, సుపర్ణకృతలక్షణమ్ = గరుత్మంతునిచేత చేయబడిన గుర్తులు కలది, నామ్నా = పేరుచేత, సుభద్రమ్ = సుభద్ర మను, తం న్యగ్రోధమ్ = ఆ వటవృక్షమును, దదర్శ = చూచెను.

తా. రావణుడు సుభద్ర మనే ఆ న్యగ్రోధవృక్షమును చూచెను. గుంపులు గుంపులుగా మహర్షులు దానిని ఆశ్రయించి ఉండిరి. గరుత్మంతుడు దానిపై కొన్ని గుర్తులు ఏర్పడు నట్లు చేసెను. 36

మూ. తం తు గత్వా పరం పారం సముద్రస్య నదీపతేః,
దదర్శాశ్రమమేకాన్తే రమ్యే పుణ్యే వనాన్తరే. 37

ప్ర. అ. నదీపతేః = నదులకు ప్రభువైన, సముద్రస్య = సముద్రము యొక్క, తమ్ = ఆ, పరమ్ = అవతలఉన్న, పారమ్ = ఒడ్డును, గత్వా = పొంది, రమ్యే = సుందరము, పుణ్యే = పవిత్రము అయిన, వనాన్తరే = వనమధ్యమునందు, ఏకాన్తే = ఏకాంతప్రదేశమునందు, ఆశ్రమమ్ = ఆశ్రమమును, దదర్శ = చూచెను.

తా. రావణుడు నదుల ప్రభువైన సముద్రము అవతలి ఒడ్డు చేరి, అక్కడ సుందరము, పవిత్రము, ఏకాంతము అయిన వనమధ్యమునందు ఉన్న ఆశ్రమమును చూచెను. 37

మూ. తత్ర కృష్ణాజినధరం జటావల్కలధారిణమ్,
దదర్శ నియతాహారం మారీచం నామ రాక్షసమ్. 38

ప్ర. అ. తత్ర = అక్కడ, కృష్ణాజినధరమ్ = కృష్ణాజినమును ధరించినవాడు, జటావల్కలధారిణమ్ = జటలను, నారచీరను ధరించినవాడు, నియతాహారమ్ = నియమితమైన ఆహారము కలవాడు అయిన, మారీచం నామ = మారీచుడు అనే పేరు గల, రాక్షసమ్ = రాక్షసుణ్ణి, దదర్శ = చూచెను.

తా. రావణుడు అక్కడ, కృష్ణాజినమును, జటలను, నారచీరను ధరించి ఆహారనియమము పాటించుచు, మునివృత్తిలో ఉన్న మారీచు డనే రాక్షసుణ్ణి చూచెను. 38

మూ. స రావణః సమాగమ్య విధివత్తేన రక్షసా,
మారీచేనార్చితో రాజా సర్వకామైరమానుషైః. 39

ప్ర. అ. రాజా = రాజైన, సః రావణః = ఆ రావణుడు, సమాగమ్య = సమీపించి, రక్షసా = రాక్షసుడైన, తేన మారీచేన = ఆ మారీచునిచేత, అమానుషైః = మనుష్యసులభములు కాని, సర్వకామైః = సమస్తభోగ్యవస్తువులచేతను, విధివత్ = యథావిధిగా, అర్చితః = పూజింపబడెను.

తా. మారీచుడు తన ఆశ్రమమునకు వచ్చిన రాక్షసరాజైన ఆ రావణుని మనుష్యదుర్లభములైన సకలభోగ్యవస్తువులను సమర్పించి, యథావిధిగా గౌరవించెను. 39

మూ. తం స్వయం పూజయిత్వా తు భోజనేనోదకేన చ,
అర్థోపహితయా వాచా మారీచో వాక్యమబ్రవీత్. 40

ప్ర. అ. మారీచః = మారీచుడు, తమ్ = ఆతనిని, భోజనేన = భోజనముచేతను, ఉదకేన చ = ఉదకముచేతను, స్వయమ్ = స్వయముగా, పూజయిత్వా = పూజించి, అర్థోపహితయా = అర్థముతో కూడిన, వాచా = వాక్కుతో, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. మారీచుడు ఆ రావణునకు భోజనము, ఉదకము సమర్పించి స్వయముగా పూజించి, మంచి అర్థము గల మాటలు ఈ విధముగ పలికెను. 40

మూ. కచ్చిత్సుకుశలం రాజన్ లఙ్కాయాం రాక్షసేశ్వర,
కేనార్థేన పునస్త్వం వై తూర్ణమేవమిహాగతః. 41

ప్ర. అ. రాక్షసేశ్వర = రాక్షసప్రభువైన, రాజన్ = రాజా, లఙ్కాయామ్ = లంకయందు, సుకుశలం కచ్చిత్ = కుశలమే కదా ! త్వమ్ = నీవు, కేన = ఏ, అర్థేన = ప్రయోజనముచేత, తూర్ణమ్ = శీఘ్రముగా, ఏవమ్ = ఇట్లు, పునః = మరల, ఇహ = ఇక్కడికి, ఆగతః = వచ్చినావు ?

తా. రాక్షసరాజా ! లంకలో అంతా క్షేమమే కదా ! ఇంత శీఘ్రముగా నీవు మరల ఇక్కడకు ఎందుకు వచ్చినావు ?

వి. ఈ శ్లోకం ప్రాచ్యపాఠంలో లేదు. 41

మూ. ఏవముక్తో మహాతేజా మారీచేన స రావణః,
తతః పశ్చాదిదం వాక్యమబ్రవీద్వాక్యకోవిదః. 42

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
పఞ్చత్రింశః సర్గః.

ప్ర. అ. మారీచేన = మారీచునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, వాక్యకోవిదః = మాటలలో నేర్పరి యైన, సః రావణః = ఆ రావణుడు, తతః పశ్చాత్ = దాని పిమ్మట, ఇదమ్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. మహాతేజఃశాలీ, మాటలలో నేర్పరీ అయిన ఆ రావణుడు మారీచుని మాటలు విని ఇట్లు పలికెను. 42

వి. రావణుడు మారీచాశ్రమానికి వెళ్ళే దారిలో అనేకజనపదాలు దాటి, చాలా దూరం ప్రయాణం చేసి ఆ ఆశ్రమం చేరుకున్నట్లు ఈ సర్గలో వర్ణించబడింది. ఈ వర్ణన పట్టి చూడగా అవి దేవభూము లన్నట్లు కనబడుతుంది. లంక సముద్ర తీరంమీదనే ఉన్నట్లు సుందరకాండాదులలో ఉన్న వర్ణనలను పట్టి తెలుస్తూన్నది. అందుచేత మారీచుని ఆశ్రమం లంక పక్కనే ఉన్న సముద్రతీరంలో ఉన్న దని చెప్పడానికి వీలు లేదు. లంకకు దక్షిణంగా చాలాదూరంలో ఉన్న సముద్రతీరమా లేక హిమాలయాదులు దాటిన తరవాత ఉన్నట్లు భావించబడే ఉత్తరసముద్ర తీరమా ఏదని చెప్పవలెనో తెలియడంలేదు. గరుత్మంతుడు అమృతహరణం కోసం వెళ్లేటప్పుడు గజకచ్ఛపాలను భక్షించడానికై వటవృక్షంమీద వాలినట్లు, ఆ కొమ్మ విరిగిపోయినట్లూ, దానిని ఆశ్రయించుకొని ఉన్న మునులను ఏలాగో రక్షించినట్లు ఈ కథ మహాభారతంలో కూడా ఉంది. ఆ వటవృక్షం దక్షిణ సముద్రతీరంలో ఉందా ఉత్తరసముద్రతీరంలో ఉందా అనే విషయం అక్కడ కూడా స్పష్టంగా లేదు కాని అమృతమథనం కోసం దేవదానవాదులు మంతనాలు చేయడం మేరుపర్వతంమీద జరిగినట్లు చెప్పి తరవాత గరుడోత్పత్త్యాదులు వర్ణించడంచేత బహుశా భారతం ప్రకారం ఈ వటవృక్షం ఉతరసముద్రతీరంలో ఉన్న

దని చెప్పడానికి వీలున్నట్లు కనబడుతుంది. రావణుని మార్గాన్ని వర్ణించే ఈ ఘట్టంలో ప్రాచ్యపాఠంలో–

"ఉత్తరాంశ్చ కురూన్ పశ్యన్ పశ్యంశ్చైవ నగోత్తమాన్,
దేవదానవసంఘైశ్చ సేవితం హ్యమృతార్థిభిః.

అనే శ్లోకం ఉన్నది. ఉత్తరకురుదేశ మనగా కురుక్షేత్రానికి చాలా దూరాన ఉత్తరంగా ఉన్న దేశం. అది దేవభూమి అని సంప్రదాయం. అందుచే మారీచాశ్రమం హిమాలయాలు దాటి ఉత్తరాన ఉన్న దని ఊహించవచ్చును. ఏమైనా ఇంకా విజ్ఞులు పరిశీలించవలసిన విషయం.

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
అరణ్యకాండలో ముప్పదియైదవ సర్గ సమాప్తము.

అథ షట్త్రింశః సర్గః

[రావణుడు రాముని అపరాధమును వర్ణించి చెప్పి, అతని భార్యయైన సీతను హరించుటకు సాహాయ్యము చేయుమని మారీచుని కోరుట].

మూ. మారీచ శ్రూయతాం తాత వచనం మమ భాషతః,
ఆర్తోఽస్మి మమ చార్తస్య భవాన్హి పరమా గతిః. 1

ప్ర. అ. తాత = తండ్రీ! మారీచ = మారీచుడా! భాషతః = మాటలాడుచున్న, మమ = నాయొక్క, వచనమ్ = వచనము, శ్రూయతామ్=వినబడుగాక. ఆర్తః = దుఃఖితుడను, అస్మి = అయిఉన్నాను. ఆర్తస్య = దుఃఖితుడనైన, మమ = నాకు; భవాన్ = నీవు; పరమా = గొప్ప, గతిః హి = గతి కదా?

తా. తండ్రీ! మారీచా! నేను చెప్పుచున్న మాట వినుము. నేను ఆపదలో ఉన్నాను. నేను ఆపదలో ఉన్నపుడు నీవే నాకు గతివి కదా? 1

మూ. జానీషే త్వం జనస్థానే యథా భ్రాతా ఖరో మమ,
దూషణశ్చ మహాబాహుః స్వసా శూర్పణఖా చ మే. 2

త్రిశిరాశ్చ మహాతేజా రాక్షసః పిశితాశనః,
అన్యే చ బహవః శూరా లబ్ధలక్షా నిశాచరాః. 3

వసన్తి మన్నియోగేన రతివాసం చ రాక్షసాః,
బాధమానా మహారణ్యే మునీన్ వై ధర్మచారిణః. 4

ప్ర. అ. మమ = నాయొక్క, భ్రాతా = సోదరుడైన, ఖరః = ఖరుడు, మహాబాహుః = గొప్పబాహువులు గల, దూషణశ్చ = దూషణుడు, మే = నాయొక్క, స్వసా = సోదరియైన, శూర్పణఖా చ = శూర్పణఖ, మహాతేజాః = గొప్పతేజస్సు

గల, పిశితాశనః=మనుష్యమాంసమును తిను, రాక్షసః=రాక్షసుడైన, త్రిశిరాశ్చ =త్రిశిరస్సు, శూరాః=శూరులు, లబ్ధలక్షాః=లక్ష్యమును కొట్టుటకు సమర్థులు అయిన, అన్యే=ఇతరులైన, బహవః=అనేకులు, నిశాచరాః రాక్షసాః=నిశాచరులైన రాక్షసులు, మన్నియోగేన=నా ఆజ్ఞచేత మహారణ్యే=మహారణ్యమునందు, ధర్మచారిణః=ధర్మమును ఆచరించు, మునీన్=మునులను, బాధమానాః =బాధించుచు, జనస్థానే=జనస్థానమునందు, యథా=ఎట్లు, రతివాసం వసన్తి= ఆనందకర మగు నివాసము కలుగు నట్లుగా నివసించుచున్నారో, త్వమ్=నీవు, జానీషే=ఎరుగుదువు కదా?

తా. నా సోదరుడైన ఖరుడు, మహాబాహువైన దూషణుడు, నా సోదరియైన శూర్పణఖ మనుష్యమాంసమును భుజించు మహాతేజఃశాలియైన త్రిశిరస్సు, శూరులు, గురి తప్పకుండ ఆయుధములు ప్రయోగించగలవారు అయిన ఇంకా ఎందరో ఇతరరాక్షసులు, మహారణ్యములో ధర్మములు ఆచరించుచున్న మునులను బాధించుచు, నా ఆజ్ఞ ప్రకారము, జనస్థానములో సుఖముగా నివసించుచున్నారను విషయము నీకు తెలియును కదా? 2-4

మూ. చతుర్దశ సహస్రాణి రక్షసాం భీమకర్మణామ్,
శూరాణాం లబ్ధలక్షాణాం ఖరచిత్తానువర్తినామ్. 5

ప్ర. అ. భీమకర్మణామ్=భయంకరమైన కర్మలు చేయువారు, శూరాణామ్=శూరులు, లబ్ధలక్షాణామ్=లక్ష్యమును కొట్టగలవారు, ఖరచిత్తానువర్తినామ్ =ఖరుని చిత్తమును అనుసరించి ఉన్నవారు అయిన, రక్షసామ్=రాక్షసుల యొక్క, చతుర్దశ సహస్రాణి=పదునాలుగు సహస్రములు, నివసించుచున్నారు కదా?

తా. భయంకరములైన పనులు చేయువాళ్లు, శూరులు, గురి తప్పనివాళ్ళు, ఖరుని చిత్తమును అనుసరించి ప్రవర్తించువాళ్లు అయిన పదునాలుగువేలమంది రాక్షసులు అక్కడ ఉన్నారు కదా? 5

మూ. తే త్విదానీం జనస్థానే వసమానా మహాబలాః,
సంగతాః పరమాయత్తా రామేణ సహ సంయుగే. 6
నానాప్రహరణోపేతాః ఖరప్రముఖరాక్షసాః,

ప్ర. అ. జనస్థానే = జనస్థానమునందు, వసమానాః = నివసించుచున్న, మహాబలాః = గొప్ప బలము గల, తే = ఆ, ఖరప్రముఖరాక్షసాః = ఖరుడు మొదలైన రాక్షసులు, ఇదానీమ్ = ఇప్పుడు, పరమాయత్తాః = బాగుగా సన్నద్ధులై, నానాప్రహరణోపేతాః = అనేకవిధములైన ఆయుధములతో కూడినవారై, సంయుగే = యుద్ధమునందు, రామేణ సహ = రామునితో కూడ, సంగతాః = కలిసినారు.

తా. జనస్థానములో నివసించుచున్న, మహాబలులైన ఆ ఖరుడు మొదలైన రాక్షసులు బాగుగా సన్నద్ధులైన, అనేకవిధములైన ఆయుధములు ధరించి, ఈ మధ్య, రామునితో యుద్ధమునకు తలపడిరి. 6

మూ. తేన సంజాతరోషేణ రామేణ రణమూర్ధని, 7
అనుక్త్వా పరుషం కించిచ్ఛరైర్వ్యాపారితం ధనుః.

ప్ర. అ. సంజాతరోషేణ = పుట్టిన కోపము గల, తేన రామేణ = ఆ రామునిచేత, రణమూర్ధని = యుద్ధాగ్రమునందు, పరుషమ్ = పరుషముగా, కించిత్ = ఏమీ, అనుక్త్వా = పలకకుండా, ధనుః = ధనస్సు, శరైః = బాణములతో, వ్యాపారితమ్ = పనిచేయునట్లు చేయబడినది.

తా. కోపించిన ఆ రాముడు యుద్ధాగ్రమునందు ఏమీ పరుషముగా మాటలాడకుండా, బాణములను ధనుస్సుపై ఆరోపించెను. 7

మూ. చతుర్దశ సహస్రాణి రక్షసాముగ్రతేజసామ్, 8
నిహతాని శరైస్తీక్ష్ణైర్మానుషేణ పదాతినా.

ప్ర. అ. పదాతినా = పాదచారియైన, మానుషేణ = మానవుడైన ఆ రామునిచేత, ఉగ్రతేజసామ్ = ఉగ్రమైన తేజస్సు గల, రక్షసామ్ = రాక్షసులయొక్క, చతుర్దశ = పదునాలుగు, సహస్రాణి = సహస్రములు, తీక్ష్ణైః = వాడియైన, శరైః = బాణములచేత, నిహతాని = చంపబడినవి.

తా. మనుష్యమాత్రుడైన ఆ రాముడు పాదచారిగా ఉండి, వాడియైన బాణములచేత ఉగ్రమైన తేజస్సు గల పదునాలుగు వేలమంది రాక్షసులను చంపినారు. 8

మూ. ఖరశ్చ నిహతః సంఖ్యే దూషణశ్చ నిపాతితః, 9
హతశ్చ త్రిశిరాశ్చాపి నిర్భయా దణ్డకాః కృతాః.

ప్ర. అ. సంఖ్యే = యుద్ధమునందు, ఖరశ్చ = ఖరుడు, నిహతః = చంపబడినాడు. దూషణశ్చ = దూషణుడు, నిపాతితః = పడగొట్టబడినాడు. త్రిశిరాశ్చాపి = త్రిశిరస్సు కూడ, హతః = చంపబడినాడు. దణ్డకాః=దండకారణ్యము, నిర్భయాః=భయములేనిదిగా, కృతాః=చేయబడినది.

తా. రాముడు యుద్ధములో ఖరుణ్ణి దూషణుణ్ణి, త్రిశిరస్సును చంపి దండకారణ్యమును నిర్భయము చేసినాడు. 9

మూ. పిత్రా నిరస్తః క్రుద్ధేన సభార్యః క్షీణజీవితః, 10
స హన్తా తస్య సైన్యస్య రామః క్షత్రియపాంసనః.

ప్ర. అ. క్రుద్ధేన = కోపించి, పిత్రా = తండ్రిచేత, సభార్యః=భార్యాసహితుడుగా, నిరస్తః=వెడలగొట్టబడిన, క్షీణజీవితః=అల్పాయుష్కుడైన, క్షత్రియపాంసనః = క్షత్రియాధముడైన, సః రామః = ఆ రాముడు, తస్య సైన్యస్య=ఆ సైన్యమునకు, హన్తా=వినాశకుడు.

తా. తండ్రి కోపించి, భార్యాసహితుడైన ఆ రాముణ్ణి దేశమునుండి వెడలగొట్టినాడు. అతని ఆయుర్దాయము క్షీణించినది. క్షత్రియాధముడైన ఆ రాముడు, ఆ సైన్యమునంతా చంపివేసినాడు. 10

మూ. దుశ్శీలః కర్కశస్తీక్ష్ణో మూర్ఖో లుబ్ధోఽజితేన్ద్రియః, 11
త్యక్తధర్మో హ్యధర్మాత్మా భూతానామహితే రతః.

ప్ర. అ. (రాముడు) దుఃశీలః = చెడ్డ స్వభావము కలవాడు. కర్కశః= కఠినుడు. తీక్ష్ణః = తీక్ష్ణమైనవాడు. మూర్ఖః=మూర్ఖుడు. లుబ్ధః=దురాశాపరుడు. అజితేన్ద్రియః=జయింపబడని ఇంద్రియములు కలవాడు. త్యక్తధర్మః=విడువబడిన ధర్మము కలవాడు. అధర్మాత్మా=ధర్మాత్ముడు కానివాడు. భూతానామ్= ప్రాణులయొక్క, అహితే=కీడునందు, రతః=ఆసక్తి కలవాడు.

తా. రాముని స్వభావము చాల చెడది. అతడు కఠినుడు. తీక్ష్ణమైనవాడు.

లుబ్ధుడు. ఇంద్రియజయము లేనివాడు, ధర్మమును విడచిన అధర్మాత్ముడు. ప్రాణుల కీడును కోరేవాడు. 11

మూ. యేన వైరం వినారణ్యే సత్త్వమాశ్రిత్య కేవలమ్, 12
కర్ణనాసాపహరణాద్భగినీ మే విరూపితా,
తస్య భార్యాం జనస్థానాత్సీతాం సురసుతోపమామ్, 13
ఆనయిష్యామి విక్రమ్య సహాయస్తత్ర మే భవ.

ప్ర. అ. యేన = ఏ రామునిచేత, వైరం వినా = వైరమేమీ లేకుండగనే, కేవలమ్ = కేవలము, సత్త్వమ్ = బలమును, ఆశ్రిత్య = ఆశ్రయించి, కర్ణనాసాపహరణాత్ = చెవులను, ముక్కును కోయుటవలన, మే భగినీ = నా సోదరి, విరూపితా = విరూపము కలదిగా చేయబడినదో, తస్య = అట్టి రామునియొక్క, భార్యామ్ = భార్యయైన, సురసుతోపమామ్ = దేవకన్యతో సమానురాలైన, సీతామ్ = సీతను, విక్రమ్య = పరాక్రమము చూపి, జనస్థానాత్ = జనస్థానమునుండి, ఆనయిష్యామి = తీసికొనివచ్చెదను. తత్ర = దాని విషయమునందు, మే = నాకు, సహాయః = సహాయుడవుగా, భవ = అగుము.

తా. రాముడు ఎట్టి వైరకారణము లేకుండగా, బలము ఉన్నది కదా అని నా సోదరియైన శూర్పణఖ చెవులు, ముక్కు చేదించి ఆమెను వికృతరూపవతినిగా చేసినాడు. అతని భార్యయైన. దేవకన్యతో సమానురాలైన సీతను బలాత్కారముగా జనస్థానమునుండి తీసికొని రావలె నని అనుకొనుచున్నాను. ఈ కార్యమునందు నీవు నాకు సాహాయ్యము చేయవలెను. 12, 13

మూ. త్వయా హ్యహం సహాయేన పార్శ్వస్థేన మహాబల, 14
భ్రాతృభిశ్చ సురాన్ యుద్ధే సమగ్రాన్నాభిచిన్తయే,
తత్సహాయో భవ త్వం మే సమర్థో హ్యసి రాక్షస. 15

ప్ర. అ. మహాబల = గొప్ప బలము కలవాడా! సహాయేన = సహాయుడవుగా, పార్శ్వస్థేన = ప్రక్కన ఉన్న, త్వయా = నీచేతను, భ్రాతృభిశ్చ = సోదరులచేతను, యుద్ధే = యుద్ధమునందు, సమగ్రాన్ = సమస్తమైన, సురాన్ = దేవతలను కూడ, నాభిచిన్తయే = లెక్కచేయను, రాక్షస = ఓ మారీచా! తత్ =

ఆ కారణమువలన, త్వమ్ = నీవు, మే = నాకు, సహాయః = సహాయుడవు, భవ = అగుము. సమర్థః = సమర్థుడవు, అసి హి = అయిఉన్నావు కదా।

తా. ఓ! మహాబలవంతుడా! నీవు, నా సోదరులు సహాయులుగా నా ప్రక్క నిలచినచో దేవత లందరూ యుద్ధానికి వచ్చినా కూడా లెక్కచేయను. అందుచేత, ఓ! మారీచా! నీవు నాకు సాహాయ్యము చేయుము. నీవు అందుకు సమర్థుడవు. 14, 15

మూ. వీర్యే యుద్ధే చ దర్పే చ న హ్యస్తి సదృశ స్తవ,
ఉపాయజ్ఞో మహాన్ శూరః సర్వమాయావిశారదః. 16

ప్ర. అ. వీర్యే = వీర్యమునందు, యుద్ధే చ = యుద్ధమునందు, దర్పే చ = దర్పమునందు, తవ = నీకు, సదృశః = సమానుడు, నాస్తి హి = లేదు కదా! (నీవు), ఉపాయజ్ఞః = ఉపాయములెరిగినవాడవు, మహాన్ = గొప్పవాడవు, శూరః = శూరుడవు, సర్వమాయావిశారదః = సమస్తమైన మాయలలో నేర్పు గలవాడవు.

తా. వీర్యమునందు గాని, యుద్ధమునందు గాని, దర్పమునందు గాని నీకు పోల్చదగిన వారెవ్వరూ లేరు. నీవు చాలా గొప్పవాడవు. ఉపాయములు తెలిసిన వాడవు. శూరుడవు. సకలమాయలలో నేర్పు గలవాడవు. 16

మూ. ఏతదర్థమిహ ప్రాప్తస్త్వత్సమీపం నిశాచర,
శృణు తత్కర్మ సాహాయ్యే యత్కార్యం వచనాన్మమ.

ప్ర. అ. నిశాచర = మారీచా! ఏతదర్థమ్ = ఇందునిమిత్తమే, ఇహ = ఇక్కడికి, త్వత్సమీపమ్ = నీ సమీపమును గూర్చి, ప్రాప్తః = వచ్చినాను, మమ = నాయొక్క, వచనాత్ = వచనమువలన, సాహాయ్యే = సాహాయ్యమునిమిత్తము, యత్ = ఏది, కార్యమ్ = చేయదగినదో, తత్ కర్మ = ఆ పనిని, శృణు = వినుము.

తా. ఓ! మారీచా! ఇందుకోసమే నే నిచటికి, నీ దగ్గరకు వచ్చినాను. నా కోరిక ప్రకారము, నా సాహాయ్యముకొరకై నీవు చేయవలసిన కార్యమును వినుము. 17

మూ. సౌవర్ణస్త్వం మృగో భూత్వా చిత్రో రజతబిన్దుభిః,
అశ్రమే తస్య రామస్య సీతాయాః ప్రముఖే చర. 18

ప్ర. అ. త్వమ్ = నీవు, రజతబిన్దుభిః = వెండి చుక్కలచేత, చిత్రః = విచిత్రమైన, సౌవర్ణః = బంగారము వికారమైన, మృగః = మృగముగా, భూత్వా = అయి, తస్య రామస్య = ఆ రామునియొక్క, ఆశ్రమే = ఆశ్రమమునందు, సీతాయాః = సీతయొక్క, ప్రముఖే = ఎదుట, చర = సంచరించుము.

తా. నీవు వెండి చుక్కలున్న బంగారు లేడి రూపము గ్రహించి, రాముని ఆశ్రమములో, సీత ఎదుట సంచరించుము. 18

మూ. త్వాం తు నిఃసంశయం సీతా దృష్ట్వా తు మృగరూపిణమ్,
గృహ్యతామితి భర్తారం లక్ష్మణం చాభిధాస్యతి. 19

ప్ర. అ. సీతా = సీత, మృగరూపిణమ్ = మృగరూపము గల, త్వామ్ = నిన్ను, దృష్ట్వా = చూచి, గృహ్యతామ్ = పట్టుకొనబడుగాక, ఇతి = అని, భర్తారమ్ = భర్తను గూర్చి, లక్ష్మణం చ = లక్ష్మణుని గూర్చి, నిఃసంశయమ్ = నిస్సంశయముగా, అభిధాస్యతి = చెప్పగలదు.

తా. మృగరూపములో ఉన్న నిన్ను చూడగానే సీత "దీనిని పట్టుకొనుడు" అని భర్తను, లక్ష్మణుణ్ణి తప్పక కోరగలదు. 19

మూ. తతస్తయోరపాయే తు శూన్యే సీతాం యథాసుఖమ్,
నిరాబాధో హరిష్యామి రాహుశ్చన్ద్రప్రభామివ. 20

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తయోః = వారిద్దరియొక్క, అపాయే తు = దూరముగా తొలగుట జరుగగానే, శూన్యే = శూన్యమైన ప్రదేశమునందు, యథాసుఖమ్ = సుఖముగా, నిరాబాధః = బాధ లేనివాడనై, సీతామ్ = సీతను, రాహుః = రాహువు, చన్ద్రప్రభామివ = చంద్రకాంతిని వలె, హరిష్యామి = హరించెదను.

తా. రామలక్ష్మణు లిద్దరూ దూరముగా వెళ్ళిపోయిన పిమ్మట ఎట్టి ఆటంకమూ లేకుండగా, సుఖముగా, సీతను, రాహువు చంద్రకాంతిని హరించినట్లు హరించెదను. 20

మూ. తతః పశ్చాత్సుఖం రామే భార్యాహరణకర్శితే,
విస్రబ్ధం ప్రహరిష్యామి కృతార్థేనాన్తరాత్మనా. 21

ప్ర. అ. తతః పశ్చాత్ = అటు పిమ్మట, భార్యాహరణకర్శితే=భార్యను హరించుటచేత దుర్బలుడుగా చేయబడిన, రామే = రామునియందు, కృతార్థేన= కృతార్థమైన, అన్తరాత్మనా=మనస్సుతో, సుఖమ్=సుఖముగా, విస్రబ్ధమ్=నమ్మకముగా, ప్రహరిష్యామి = కొట్టెదను.

తా. రాముడు, భార్య హరింపబడుటచే దుర్బలుడైపోవును. అప్పుడు నేను చరితార్థమైన మనస్సుతో, సుఖముగా, నిర్భయముగా, రాముణ్ణి కొట్టివేయగలను.

మూ. తస్య రామకథాం శ్రుత్వా మారీచస్య మహాత్మనః,
శుష్కం సమభవద్వక్త్రం పరితప్తో బభూవ హ. 22

ప్ర. అ. రామకథామ్ = రాముని కథను, శ్రుత్వా = విని, మహాత్మనః = మహాత్ముడైన, తస్య మారీచస్య = ఆ మారీచునియొక్క, వక్త్రమ్ = ముఖము, శుష్కమ్ = ఎండినది, సమభవత్ = ఆయెను. పరితప్తః = భయపడినవాడుగా బభూవ హ = ఆయెను.

తా. రాముని పేరు వినగానే మహాత్ముడైన ఆ మారీచుని ముఖము వాడిపోయెను. ఆతడు చాల భయపడిపోయెను. 22

మూ. ఓష్ఠౌ పరిలిహన్ శుష్కౌ నేత్రైరనిమిషైరివ,
మృతభూత ఇవార్తస్తు రావణం సముదైక్షత. 23

ప్ర. అ. శుష్కౌ = ఎండిన, ఓష్ఠౌ = పెదవులను, పరిలిహన్=నాకుచు, అనిమిషైరివ=రెప్పపాటు లేనివానివలె ఉన్న, నేత్రైః=చూపులతో, మృతభూత ఇవ = చచ్చినవాడువలె అయి, ఆర్తస్తు = దీనుడై, రావణమ్ = రావణుని, సముదైక్షత = చూచెను.

తా. ఎండిపోయిన పెదవులు నాకుచు, మరణించినవాడువలె, దీనుడై, రెప్పపాటు లేని చూపులతో రావణుని వైపు చూచెను. 23

మూ. స రావణం త్రస్తవిషణ్ణచేతా
మహావనే రామపరాక్రమజ్ఞః,

కృతాఞ్జలి స్తత్త్వమువాచ వాక్యం
హితం చ తస్మై హితమాత్మనశ్చ. 24

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకియే ఆదికావ్యే అరణ్యకాణ్డే
షట్త్రింశః సర్గః.

ప్ర. అ. మహావనే = మహావనమునందు, రామపరాక్రమజ్ఞః = రాముని పరాక్రమమును ఎరిగిన, సః = ఆ మారీచుడు, త్రస్తవిషణ్ణచేతాః = భయపడిన, దుఃఖించుచున్న చిత్తముకలవాడై, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలికలవాడై, తస్మై = రావణునకు, హితమ్ = హితమైన, ఆత్మనశ్చ = తనకు కూడ, హితమ్ = హితమైన, తత్త్వమ్ = యథార్థమైన, వాక్యమ్ = వాక్యమును, రావణమ్ = రావణుని గూర్చి, ఉవాచ = పలికెను.

తా. మహావనములో రాముని పరాక్రమమును గూర్చి బాగా తెలిసికొనిన ఆ మారీచుని మనస్సు భయముతో క్రుంగిపోయెను. అతడు అంజలి ఘటించి ఆ రావణునితో, ఆతనికి, తనకూ కూడ హితమైన వాక్యమును ఇట్లు పలికెను. 24

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్య కాండలో ముప్పది ఆరవ సర్గ సమాప్తము.

అథ సప్తత్రింశః సర్గః

[మారీచుడు రాముని గుణప్రభావాదులను వర్ణించి చెప్పి సీతా హరణప్రయత్నమునుండి విరమింపుమని రావణునకు ఉపదేశించుట].

మూ. తచ్ఛ్రుత్వా రాక్షసేన్ద్రస్య వాక్యం వాక్యవిశారదః,
ప్రత్యువాచ మహాతేజా మారీచో రాక్షసేశ్వరమ్. 1

ప్ర. అ. రాక్షసేన్ద్రస్య = రావణునియొక్క, తత్ వాక్యమ్ = ఆ వాక్యమును, శ్రుత్వా = విని, వాక్యవిశారదః = మాటలలో నేర్పరి, మహాతేజాః = గొప్ప తేజస్సుకలవాడూ అయిన, మారీచః = మారీచుడు, రాక్షసేశ్వరమ్ = రావణున్ని గూర్చి, ప్రత్యువాచ = తిరిగిపలికెను.

తా. మాటలలో నేర్పరి మహాతేజఃశాలీ అయిన మారీచుడు, రావణుని మాటలు విని అతనితో ఇట్లు పలికెను. 1

మూ. సులభాః పురుషా రాజన్ సతతం ప్రియవాదినః,
అప్రియస్య తు పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః. 2

ప్ర. అ. రాజన్ = రాజా ! ప్రియవాదినః = ప్రియముగా మాటలాడు, పురుషాః = పురుషులు, సతతమ్ = ఎల్లప్పుడూ, సులభాః = సులభమైనవారు. అప్రియస్య = ప్రియము కానిది, తు = కాని, పథ్యస్య = పథ్యము అయినదానికి, వక్తా = చెప్పేవాడు, శ్రోతా చ = వినేవాడూ కూడ, దుర్లభః = దుర్లభుడు.

తా. రాజా ! ప్రియముగా మాటలాడేవాళ్లు ఎల్లప్పుడూ అనాయాసంగా లభించుదురు. ప్రియముకాని, కాని హితకరము అయిన విషయము చెప్పేవాళ్లు వినేవాళ్లూ కూడ చాల అరుదు. 2

మూ. న నూనం బుధ్యసే రామం మహావీర్యం గుణోన్నతమ్,
అయుక్తచారశ్చపలో మహేన్ద్రవరుణోపమమ్. 3

ప్ర. అ. అయుక్తచారః = ఏర్పరచుకొనబడని గూఢచారులు కలవాడవు, చపలః = చపలస్వభావము గలవాడవు అయిన నీవు, మహావీర్యమ్ = గొప్ప పరాక్రమము గలవాడు, గుణోన్నతమ్ = గుణములచేత ఉన్నతుడు, మహేన్ద్రవరుణోపమమ్ = మహేంద్రవరుణులతో సమానుడూ అయిన, రామమ్ = రాముణ్ణి గూర్చి, నూనమ్ = నిశ్చయముగా, న బుధ్యసే = తెలుసుకొనుటలేదు.

తా. చపలస్వభావుడవైన నీవు గూఢచారులను నియమించుటలో అశ్రద్ధ వహించుచున్నావు. అందుచేతనే గొప్ప పరాక్రమము కలవాడు, సద్గుణములచేత ఉత్తముడు, ఇంద్రవరుణులతో సమానుడూ అయిన రాముణ్ణి గూర్చి ఏమాత్రము తెలియకుండా ప్రవర్తించుచున్నావు. నిజము. 3

మూ. అపి స్వస్తి భవేత్తాత సర్వేషాం భువి రక్షసామ్,
అపి రామో సుసంక్రుద్ధః కుర్యాల్లోకమరాక్షసమ్. 4

ప్ర. అ. తాత = నాయనా! భువి = భూలోకమునందు, సర్వేషామ్ = సమస్తమైన, రక్షసామ్ = రాక్షసులకు, స్వస్తి = క్షేమము, అపి భవేత్ = అగును కదా। రామః = రాముడు, సుసంక్రుద్ధః = బాగుగా కోపించినవాడై, లోకమ్ = లోకమును, అరాక్షసమ్ = రాక్షసులు లేనిదానినిగా, అపి న కుర్యాత్ = చేయడు కదా!

తా. నాయనా! భూలోకములో రాక్షసులందరూ క్షేమముగా ఉందురా? రాముడు చాల కోపించి ఈ లోకములో రాక్షసులే లేకుండ చేయడు కదా! 4

మూ. అపి తే జీవితాన్తాయ నోత్పన్నా జనకాత్మజా,
అపి సీతానిమిత్తం చ న భవేద్వ్యసనం మమ. 5

ప్ర. అ. జనకాత్మజా = సీత, తే = నీయొక్క, జీవితాన్తాయ = జీవితముయొక్క అంతముకొరకు, అపి నోత్పన్నా = పుట్టలేదుకద. సీతానిమిత్తమ్ = సీతానిమిత్తముచేత, మమ = నాకు, వ్యసనమ్ = ఆపద, అపి న భవేత్ = కలుగదు కదా।

తా. సీత నీ ప్రాణములు తీయుటకే పుట్టలేదు కద! సీతమూలాన నాకు కూడ ముప్పు వాటిలదు కద। 5

మూ. అపి త్వామీశ్వరం ప్రాప్య కామవృత్తం నిరఙ్కుశమ్,
న వినశ్యేత్పురీ లఙ్కా త్వయా సహ సరాక్షసా. 6

ప్ర. అ. కామవృత్తమ్ = స్వేచ్ఛగా ప్రవర్తించువాడవు, నిరఙ్కుశమ్ = అడ్డు లేకుండా ఉన్నవాడవు అయిన, త్వామ్ = నిన్ను, ఈశ్వరమ్ = ప్రభువునుగా, ప్రాప్య = పొంది, సరాక్షసా = రాక్షసులతో కూడిన, పురీ లఙ్కా = లంకా పట్టణము, త్వయా సహ = నీతో కూడ, న వినశ్యేదపి = నశించదు కద।

తా. స్వేచ్ఛగా, నిరంకుశముగా ప్రవర్తించే నీవు రాజుగా ఉన్నందుకు లంకాపట్టణము, రాక్షసులతోను, నీతోను కూడ నశించదు కద। 6

మూ. త్వద్విధః కామవృత్తో హి దుఃశీలః పాపమన్త్రితః,
ఆత్మానం స్వజనం రాష్ట్రం స రాజా హన్తి దుర్మతిః. 7

ప్ర. అ. కామవృత్తః = స్వేచ్ఛగా ప్రవర్తించువాడు. దుఃశీలః = చెడ్డ స్వభావము కలవాడు, పాపమన్త్రితః = చెడ్డ ఆలోచన కలవాడు, దుర్మతిః = చెడ్డ బుద్ధి కలవాడు అయిన, త్వద్విధః = నీవంటి, సః రాజా = రాజు, ఆత్మానమ్ = తనను, స్వజనమ్ = స్వజనమును, రాష్ట్రమ్ = రాష్ట్రమును, హన్తి హి = నశింపచేయును కదా ?

తా. చెడ్డ స్వభావముతో స్వేచ్ఛగా ప్రవర్తించుచు, పాపపు ఆలోచనలు చెడ్డ బుద్ధి గల నీవంటి రాజు తనను, స్వజనమును, రాష్ట్రమును కూడ నశింప చేయును. 7

మూ. న చ పిత్రా పరిత్యక్తో నామర్యాదః కథంచన,
న లుబ్ధో న చ దుఃశీలో న చ క్షత్రియపాంసనః, 8

న చ ధర్మగుణైర్హీనః కౌసల్యానన్దవర్ధనః
న తీక్ష్ణో న చ భూతానాం సర్వేషామహితే రతః. 9

ప్ర. అ. కౌసల్యానన్దవర్ధనః = కౌసల్యయొక్క ఆనందమును వృద్ధి పొందించు ఆ రాముడు, పిత్రా = తండ్రిచేత, న చ పరిత్యక్తః = విడువబడలేదు. కథంచన = ఏ విధముగాను కూడ, అమర్యాదః = కట్టుబాటు లేనివాడు, న =

కాదు, లుబ్ధః = లోభముకలవాడు, న = కాదు. దుఃశీలః = చెడ్డ స్వభావము కలవాడు. న చ = కాదు. క్షత్రియపాంసనః చ = దుష్టక్షత్రియుడు కూడ, న = కాదు. ధర్మగుణైః = ధర్మముతోను, సద్గుణములతోను, హీనః = హీనుడు, న = కాదు. తీక్ష్ణః = తీక్ష్ణుడు, న = కాదు. సర్వేషామ్ = సమస్తమైన, భూతానామ్ = ప్రాణుల, అహితే = అహితమునందు, రతః = ఆసక్తుడు, న = కాదు.

తా. కౌసల్యాప్రియపుత్రుడైన రాముడు నీవు అనుకున్నట్లు తండ్రిచేత వెడలగొట్టబడలేదు. అతడు ఏ విధముగాను కట్టుబాట్లను అతిక్రమించేవాడు కాదు. అతడు లుబ్ధుడు గాని, దుష్టస్వభావవంతుడు గాని, దుష్టక్షత్రియుడు గాని, ధర్మము, సద్గుణములు లేనివాడు గాని, తీక్ష్ణుడు గాని, సకలభూతముల చెడును కోరువాడు గాని కాదు. 8, 9

మూ. వఞ్చితం పితరం దృష్ట్వా కైకేయ్యా సత్యవాదినమ్,
కరిష్యామీతి ధర్మాత్మా తాత ప్రవ్రజితో వనమ్. 10

ప్ర. అ. తాత = నాయనా! సత్యవాదినమ్ = సత్యమునే పలుకు, పితరమ్ = తండ్రిని, కైకేయ్యా = కైకేయి చేత, వఞ్చితమ్ = వంచింపబడినవానినిగా, దృష్ట్వా = చూచి, ధర్మాత్మా = ధర్మాత్ముడైన రాముడు, కరిష్యామి ఇతి = తండ్రి ఆజ్ఞను చేసెదను అని, వనమ్ = వనమును గూర్చి, ప్రవ్రజితః = వెళ్ళినాడు.

తా. నాయనా! సత్యవాదియైన తన తండ్రిని కైకేయి వంచించుట చూచి ధర్మాత్ముడైన రాముడు "తండ్రి ఆజ్ఞప్రకారము చేసెదను" అని పలికి వనమునకు వెళ్ళినాడు. 10

మూ. కైకేయ్యాః ప్రియకామార్థం పితుర్దశరథస్య చ,
హిత్వా రాజ్యం చ భోగాంశ్చ ప్రవిష్టో దణ్డకావనమ్. 11

ప్ర. అ. కైకేయ్యాః = కైకేయియొక్క, పితుః = తండ్రియైన, దశరథస్య చ = దశరథునియొక్క, ప్రియకామార్థమ్ = ప్రియమైన కోరికకొరకు, రాజ్యమ్ = రాజ్యమును, భోగాంశ్చ = భోగములను, హిత్వా = విడచి, దణ్డకావనమ్ = దండకావనమును, ప్రవిష్టః = ప్రవేశించినాడు.

తా. కైకేయికి, తండ్రియైన దశరథునకు ప్రియమైన కోరికను తీర్చుట నిమిత్తము రాజ్యమును, భోగములను విడచి దండకారణ్యములో ప్రవేశించినాడు.

మూ. న రామః కర్కశస్తాత నావిద్వాన్నాజితేన్ద్రియః,
అనృతం దుఃశ్రుతం చైవ నైవ త్వం వక్తుమర్హసి. 12

ప్ర. అ. తాత = నాయనా ! రామః = రాముడు, కర్కశః = కఠినుడు, న = కాడు. అవిద్వాన్ = అపండితుడు, న = కాడు. అజితేన్ద్రియః = ఇంద్రియములను జయించనివాడు, న = కాడు. త్వమ్ = నీవు, అనృతమ్ = అసత్యము, దుఃశ్రుతం చైవ = చెడ్డగా వినబడినదీ అయిన విషయమును, వక్తుమ్ = చెప్పుటకు, నార్హసి = తగవు.

తా. నాయనా ! రాముడు కఠినుడుగాని, అపండితుడు కాని, ఇంద్రియములను జయింపజాలనివాడు గాని కాడు. నీవు పొరబాటుగా విన్న అసత్యవిషయమును చెప్పకూడదు. 12

మూ. రామో విగ్రహవాన్ ధర్మః సాధుః సత్యపరాక్రమః,
రాజా సర్వస్య లోకస్య దేవానాం మఘవానివ. 13

ప్ర. అ. రామః = రాముడు, విగ్రహవాన్ = శరీరము గల, ధర్మః = ధర్మము. సాధుః = సత్పురుషుడు. సత్యపరాక్రమః = సత్యమైన పరాక్రమము కలవాడు. దేవానామ్ = దేవతలకు, మఘవానివ = ఇంద్రుడు వలె, సర్వస్య = సమస్తమైన, లోకస్య = లోకమునకు, రాజా = రాజు.

తా. రాముడు మూర్తీభవించిన ధర్మము, సత్పురుషుడు, సత్యమైన పరాక్రమము కలవాడు, దేవతలకు దేవేంద్రుడు వలె సకలలోకమునకు ప్రభువు.

మూ. కథం త్వం తస్య వైదేహీం రక్షితాం స్వేన తేజసా,
ఇచ్ఛసి ప్రసభం హర్తుం ప్రభామివ వివస్వతః. 14

ప్ర. అ. త్వమ్ = నీవు, తస్య = ఆ రామునియొక్క, స్వేన = తన సంబంధమైన, తేజసా = తేజస్సుచేత, రక్షితామ్ = రక్షింపబడిన, వైదేహీమ్ = సీతను, వివస్వతః = సూర్యునియొక్క, ప్రభామివ = కాంతిని వలె, ప్రసభమ్ = బలాత్కారముగా, హర్తుమ్ = హరించుటకు, కథమ్ = ఎట్లు, ఇచ్ఛసి = కోరుచున్నావు ?

తా. రాముని తేజస్సుచేత రక్షింపబడుచున్న ఆ సీతను, సూర్యునినుండి కాంతిని హరించుటకు కోరుచున్నట్లు, బలాత్కారముగా హరించుటకై నీకు కోరిక ఎట్లు కలిగినది ? 14

మూ. శరార్చిషమనాధృష్యం చాపఖడ్గేన్ధనం రణే,
రామాగ్నిం సహసా దీప్తం న ప్రవేష్టుం త్వమర్హసి. 15

ప్ర. అ. శరార్చిషమ్ = బాణములు అను జ్వాలలు కలది, అనాధృష్యమ్ = ఎదిరించ శక్యము కానిది, చాపఖడ్గేన్ధనమ్ = ధనస్సు, ఖడ్గము అను కట్టెలు కలది అయిన, రణే = యుద్ధరంగమునందు, దీప్తమ్ = మండుచున్న, రామాగ్నిమ్ = రాము డనే అగ్నిని, సహసా = శీఘ్రముగా, ప్రవేష్టుమ్ = ప్రవేశించుటకు, త్వమ్ = నీవు, న అర్హసి = తగవు.

తా. బాణము లనే మంటలతో, ధనస్సు, ఖడ్గము అను కట్టెలతో రణరంగములో ప్రజ్వలించుచున్న, ఎదిరింప శక్యము కాని రాము డనే అగ్నిలోనికి తొందరపడి దుమకుము. 15

మూ. ధనుర్వ్యాదితదీప్తాస్యం శరార్చిషమమర్షణమ్,
చాపబాణధరం తీక్ష్ణం, శత్రుసైన్యప్రహారిణమ్. 16

రాజ్యం సుఖం చ సంత్యజ్య జీవితం చేష్టమాత్మనః,
నాత్యాసాదయితుం తాత రామాన్తకమిహార్హసి. 17

ప్ర. అ. తాత = నాయనా ! ధనుర్వ్యాదితదీప్తాస్యమ్ = ధనస్సు, అనే తెరవబడిన మండుచున్న ముఖముకలవాడు, శరార్చిషమ్ = బాణములే జ్వాలలు కలవాడు, అమర్షణమ్ = కోపము కలవాడు, చాపబాణధరమ్ = చాపబాణములను ధరించినవాడు, తీక్ష్ణమ్ = తీక్ష్ణమైనవాడు, శత్రుసైన్యప్రహారిణమ్ = శత్రుసైన్యమును సంహరించువాడు అయిన, రామాన్తకమ్ = రాము డనే యముణ్ణి, ఆత్మనః = నీయొక్క, ఇష్టమ్ = ఇష్టమైన, రాజ్యమ్ = రాజ్యమును, సుఖం చ = సుఖమును, జీవితం చ = జీవితమును, సంత్యజ్య = విడచి, ఇహ = ఇప్పుడు, అత్యాసాదయితుమ్ = దగ్గరగా చేరుటకు, న అర్హసి = తగవు.

తా. నాయనా ! చాపబాణములు దరించిన రాము డనే యముడు ధనస్సు

అను ప్రజ్వలించుచున్న నోరు తెరచుకొని, బాణము లనే మంటలు కక్కుచు, మహాక్రోధముతో శత్రుసైన్యమును నశింపచేయుచుండును. నీవు నీకిష్టమైన రాజ్యమును, సుఖమును, జీవితమును విడచి, అతని దరిదాపులకు కూడ వెళ్ళుట మంచిది కాదు. 16, 17

మూ. అప్రమేయం హి తత్తేజో యస్య సా జనకాత్మజా,
న త్వం సమర్థస్తాం హర్తుం రామచాపాశ్రయాం వనే. 18

ప్ర. అ. సా = ఆ, జనకాత్మజా = సీత, యస్య = ఏ రాముని భార్యయో, తత్ = అది, (ఆ రాముడు), అప్రమేయమ్ = ఇంత అని చెప్పుటకు శక్యము కాని, తేజః హి = తేజస్సు కదా । వనే = వనమునందు, రామచాపాశ్రయామ్ = రాముని ధనస్సు ఆశ్రయముగా గల, తామ్ = ఆ సీతను, హర్తుమ్ = హరించుటకు, త్వమ్ = నీవు, సమర్థః = సమర్థుడవు, న = కాదు.

తా. సీత ఏ రాముని భార్యయో ఆ రాముడు ఇంత అని కొలచి చెప్పుటకు శక్యము కాని మహాతేజస్సు. అరణ్యములో రాముని ధనస్సును ఆశ్రయించి నివసించుచున్న ఆ సీతను నీవు హరించజాలవు. 18

మూ. తస్య సా నరసింహస్య సింహోరస్కస్య భామినీ,
ప్రాణేభ్యోఽపి ప్రియతరా భార్యా నిత్యమనువ్రతా. 19

ప్ర. అ. సా భామినీ = ఆ సీత, సింహోరస్కస్య = సింహము వంటి వక్షఃస్థలము గల, తస్య = ఆ, నరసింహస్య = నరులలో శ్రేష్ఠుడైన రాముని యొక్క, ప్రాణేభ్యోఽపి = ప్రాణములకంటె కూడ, ప్రియతరా = ఎక్కువ ప్రియమైన, భార్యా = భార్య. నిత్యమ్ = ఎల్లప్పుడు, అనువ్రతా = అతనినే అనుసరించుట అనువ్రతము కలది.

తా. ఆ సీత సింహమువంటి వక్షఃస్థలముగలవాడు, మానవులలో శ్రేష్ఠుడు అయిన రామునకు ప్రాణములకంటె కూడ ఎక్కువ ప్రియురాలైన భార్య. ఎల్లప్పుడు అతనిసే అనుసరించుట అనే వ్రతము గలది. 19

మూ. న సా ధర్షయితుం శక్యా మైథిల్యోజస్వినః ప్రియా,
దీప్తస్యేవ హుతాశనస్య శిఖా సీతా సుమధ్యమా. 20

ప్ర. అ. మైథిలీ = మిథిలకు సంబంధించినది, ఓజస్వినః = తేజశ్శాలి యైన రామునియొక్క, ప్రియా = ప్రియురాలు, సుమధ్యమా = సుందరమైన నడుము గలది అయిన, సా సీతా = ఆ సీత, దీప్తస్య = మండుచున్న, హుతాశనస్య=అగ్నియొక్క, శిఖా ఇవ = జ్వాలవలె, ధర్షయితుమ్=అవమానించుటకు, న శక్యా = శక్యమైనది కాదు.

తా. మిథిలారాజు కూతురు, తేజశ్శాలియైన రాముని ప్రియురాలు, చక్కని నడుము గలది అయిన ఆ సీతను, ప్రజ్వలించుచున్న అగ్నిజ్వాలను వలె ఎవ్వరూ ఎదిరించజాలరు. 20

మూ. కిముద్యమమిమం వ్యర్థం కృత్వా తే రాక్షసాధిప,
దృష్టశ్చేత్త్వం రణే తేన తదన్తం తవ జీవితమ్. 21

ప్ర. అ. రాక్షసాధిప = రాక్షసరాజా ! వ్యర్థమ్ = వ్యర్థమైన, ఇమమ్ = ఈ, ఉద్యమమ్ = ఉద్యమమును, కృత్వా = చేసి, తే = నీకు, కిమ్ = ఏమి, ప్రయోజనము ? త్వమ్ = నీవు, రణే = యుద్ధమునందు, తేన = ఆ రామునిచేత, దృష్టః చేత్ = చూడబడినట్లయితే, తవ=నీయొక్క, జీవితమ్ = జీవితము, తదన్తమ్ = అదే అంతము కలది.

వా. రావణా! వ్యర్థమైన ఈ కార్యము చేయుటకు ఎందుకు ఉద్యమించు చున్నావు? రాముడు నిన్ను రణరంగములో ఎప్పుడు చూచునో అప్పుడే నీ జీవితము అంతమగును. 21

మూ. జీవితం చ సుఖం చైవ రాజ్యం చైవ సుదుర్లభమ్,
యదీచ్ఛసి చిరం భోక్తుం మా కృథా రామవిప్రియమ్.

ప్ర. అ. జీవితం చ = జీవితమును, సుఖం చైవ = సుఖమును, సుదుర్లభమ్ = చాల కష్టముగా కాని లభించని, రాజ్యం చైవ = రాజ్యమును, చిరమ్= చిరకాలము, భోక్తుమ్=అనుభవించుటకు, ఇచ్ఛసి యది = (నీవు) కోరినట్లయితే, రామవిప్రియమ్ = రామునకు అపకారమును, మా కృథాః = చేయకుము.

తా. జీవితమును, సుఖమును, దుర్లభమైన ఈ రాజ్యమును చాల కాలము

పాటు అనుభవించవలె నని నీకు కోరిక ఉన్నచో రామునకు అపకారము చేయ
కుము. 22

మూ. స సర్వైః సచివైః సార్ధం విభీషణపురోగమైః,
మన్త్రయిత్వా తు ధర్మిష్ఠైః కృత్వా నిశ్చయమాత్మనః

దోషాణాం చ గుణానాం చ సంప్రధార్య బలాబలమ్,
ఆత్మనశ్చ బలం జ్ఞాత్వా రాఘవస్య చ తత్త్వతః. 24
హితాహితం వినిశ్చిత్య క్షమం త్వం కర్తు మర్హసి.

ప్ర. అ. సః త్వమ్ = అట్టి నీవు, ధర్మిష్ఠైః=ధర్మాత్ములైన, విభీషణపురోగమైః = విభీషణుడు మొదలుగాగల, సర్వైః = సమస్తమైన, సచివైః సార్ధమ్= మంత్రులతో కూడ, మన్త్రయిత్వా = ఆలోచించి, ఆత్మనః = నీయొక్క, నిశ్చయమ్ = నిశ్చయమును, కృత్వా = చేసి, దోషాణాం చ = దోషములయొక్క, గుణానాం చ = గుణములయొక్క, బలాబలమ్ = బలాబలమును, సంప్రధార్య= నిర్ణయించి, ఆత్మనశ్చ = నీయొక్క, రాఘవస్య చ = రామునియొక్క, బలమ్ = బలమును, తత్త్వతః = యథార్థముగా, జ్ఞాత్వా = తెలిసికొని, హితాహితమ్ హితమును అహితమును, వినిశ్చిత్య = నిశ్చయించి, క్షమమ్ = తగిన దానిని, కర్తుమ్ = చేయుటకు, అర్హసి = తగియున్నావు.

తా. అందుచేత నీవు విభీషణుడుమొదలైన ధర్మాత్ములైన మంత్రు లందరితో ఆలోచించి, నీ నిర్ణయము చేసికొని, గుణదోషముల బలాబలములను నిశ్చయించుకొని, నీ బల మెంతో రాముని బల మెంతో సరిగా తెలిసికొని, ఏది హితమో ఏది అహితమో నిర్ణయించుకొని తగు విధముగా చేయుము. 23, 24

మూ. అహం తు మన్యే తవ న క్షమం రణే,
సమాగమం కోసలరాజసూనునా,
ఇదం హి భూయః శృణు వాక్యముత్తమం
క్షమం చ యుక్తం చ నిశాచరేశ్వర. 25

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
సప్తత్రింశః సర్గః.

ప్ర. అ. నిశాచరేశ్వర = రాక్షసరాజా! అహం తు = నేనైతే, తవ = నీకు, రణే = యుద్ధమునందు, కోసలరాజసూనునా = రామునితో, సమాగమమ్ = కలియుటను, క్షమమ్ = యుక్తమైనదానినిగా, న మన్యే = తలవను.। ఉత్తమమ్ = ఉత్తమము, క్షమమ్ = తగినది, యుక్తం చ = యుక్తిసంమతము అయిన, ఇదం వాక్యమ్ = ఈ వాక్యమును, భూయః = మరల, శృణు = వినుము.

తా. రాక్షసరాజా ! నీవు యుద్ధములో రామునితో తలబడుట యుక్తము కాదనియే నా అభిప్రాయము. యుక్తియుక్తమైన, తగిన ఉత్తమమైన మాట ఒకటి చెప్పుచున్నాను ; మరల వినుము. 25

బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో ముప్పది ఏడవ సర్గ సమాప్తము.

అథ అష్టత్రింశః సర్గః

[రాముని పరాక్రమాదుల విషయమున తన అనుభవమును చెప్పుచు మారీచుడు రామునకు అపకారము చేయవద్దని రావణునకు ఉపదేశించుట]

మూ. కదాచిదప్యహం వీర్యాత్పర్యటన్ పృథివీమిమామ్,
బలం నాగసహస్రస్య ధారయన్ పర్వతోపమః. 1

నీలజీమూతసంకాశ స్తప్తకాఞ్చనకుణ్డలః,
భయం లోకస్య జనయన్ కిరీటీ పరిఘాయుధః. 2
వ్యచరం దణ్డకారణ్యమృషిమాంసాని భక్షయన్.

ప్ర. అ. కదాచిత్ = ఒకానొకప్పుడు, అహమపి = నేను కూడ, వీర్యాత్ = పరాక్రమమువలన, ఇమామ్ = ఈ, పృథివీమ్ = భూమిని, పర్యటన్ = తిరుగుచు, నాగసహస్రస్య = ఏనుగుల సహస్రముయొక్క, బలమ్ = బలమును, ధారయన్ = ధరించుచు, పర్వతోపమః = పర్వతముతో సమానుడనై, నీలజీమూతసంకాశః = నల్లని మేఘముతో సమానుడనై, తప్తకాఞ్చనకుణ్డలః = పరిశుద్ధమైన బంగారు కుండలములు కలవాడనై, కిరీటీ = కిరీటము కలవాడనై, పరిఘాయుధః = పరిఘ ఆయుధముగా కలవాడనై, లోకస్య = లోకమునకు, భయమ్ = భయమును, జనయన్ = పుట్టించుచు, ఋషిమాంసాని = ఋషుల మాంసములను, భక్షయన్ = భక్షించుచు, దణ్డకారణ్యే = దండకారణ్యమునందు, వ్యచరమ్ = సంచరించితిని.

తా. ఒకప్పుడు నేను పర్వతము వంటి శరీరముతో, వేయి ఏనుగుల బలముతో పరాక్రమశాలినై ఈ భూమిపై సంచరించితిని. నల్లటి మేఘము వలె ఉన్న నేను శుద్ధమైన బంగారు కుండలములు, కిరీటము ధరించి, పరిఘ అనే ఆయుధమును గ్రహించి, లోకములకు భయము కలిగించుచు, ఋషుల మాంసములు తినుచు దండకారణ్యములో సంచరించితిని. 1, 2

మూ. విశ్వామిత్రోఽథ ధర్మాత్మా మద్వ్రతస్తో మహామునిః 3
స్వయం గత్వా దశరథం నరేన్ద్రమిదమబ్రవీత్.

ప్ర. అ. అథ=అటుపిమ్మట, ధర్మాత్మా=ధర్మాత్ముడైన, విశ్వామిత్రః=విశ్వామిత్రుడనే, మహామునిః = మహాముని, మద్వ్రతస్తః = నానుండి భయపడినవాడై, స్వయమ్ = స్వయముగా, నరేన్ద్రమ్ = రాజైన, దశరథమ్ = దశరథుని గూర్చి, గత్వా = వెళ్లి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. అప్పుడు ధర్మాత్ముడైన విశ్వామిత్రు డనే మహాముని స్వయముగా దశరథమహారాజువద్దకు వెళ్ళి ఇట్లు పలికెను. 3

మూ. అద్య రక్షతు మాం రామః పర్వకాలే సమాహితః, 4
మారీచాన్మే భయం ఘోరం సముత్పన్నం నరేశ్వర.

ప్ర. అ. నరేశ్వర = రాజా ! మారీచాత్ = మారీచునినుండి, మే = నాకు, మహత్ = గొప్ప, భయమ్ = భయము, సముత్పన్నమ్ = పుట్టినది. అద్య = ఇప్పుడు, రామః = రాముడు, సమాహితః = సావధానచిత్తుడై, పర్వకాలే = పర్వకాలమునందు, మామ్ = నన్ను, రక్షతు = రక్షించుగాక.

తా. రాజా ! నాకు మారీచునినుండి ఘోరమైన భయము ఏర్పడినది. ఇప్పుడు, రాముడు సావధానచిత్తుడై పర్వకాలములో నన్ను రక్షించు నట్లు చేయుము. 4

మూ. ఇత్యేవముక్తో ధర్మాత్మా రాజా దశరథస్తదా, 5
ప్రత్యువాచ మహాభాగం విశ్వామిత్రం మహామునిమ్.

ప్ర. అ. ఇత్యేవమ్ = ఇట్లు, ఉక్తః=పలకబడిన, ధర్మాత్మా=ధర్మాత్ముడైన, రాజా = రాజైన, దశరథః=దశరథుడు, తదా=అప్పుడు, మహాభాగమ్= గొప్పభాగ్యము గల, మహామునిమ్ = మహామునియైన, విశ్వామిత్రమ్ = విశ్వామిత్రుని గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. ధర్మాత్ముడైన ఆ దశరథమహారాజు విశ్వామిత్రుని మాటలు విని, మహాభాగ్యవంతుడైన ఆ మహామునితో ఇటు పలికెను. 5

మూ. బాలో ద్వాదశవర్షోఽయమకృతాస్త్రశ్చ రాఘవః, 6
కామం తు మమ యత్సైన్యం మయా సహ గమిష్యతి.

ప్ర. అ. అయమ్ = ఈ, రాఘవః = రాముడు, బాలః = బాలుడు. అకృతాస్త్రశ్చ = అస్త్రములు నేర్వనివాడు. మమ = నాయొక్క, యత్ = ఏ, సైన్యమ్ = సైన్యమున్నదో, అది, కామమ్ = తప్పక, మయా సహ = నాతో కూడ, గమిష్యతి = వెళ్ళగలదు.

తా. ఈ రాముడు బాలుడు. అస్త్రములను ఇంకా నేర్వనివాడు. అందుచేత నేను సైన్యముతో తప్పక నీ వెంట వచ్చెదను. 6

మూ. బలేన చతురఙ్గేణ స్వయమేత్య నిశాచరాన్, 7
వధిష్యామి మునిశ్రేష్ఠ శత్రూంస్తే మనసేప్సితాన్.

ప్ర. అ. మునిశ్రేష్ఠ = మునులలో శ్రేష్ఠుడా ! చతురఙ్గేన = నాలుగు అంగములు గల, బలేన = సేనతో, స్వయమ్ = స్వయముగా, ఏత్య = వచ్చి, తే = నీయొక్క, శత్రూన్ = శత్రువులు, మనసా = నా మనస్సుచేత, ఈప్సితాన్ = (చంపబడుటకై) ఇష్టులు అయిన, నిశాచరాన్ = రాక్షసులను, వధిష్యామి = చంపగలను.

తా. ఓ ! మహామునీ! నేను చతురంగబలముతో స్వయముగా వచ్చి నీవు ఎవరిని చంపవలె నని చెప్పుదువో, నీ శత్రువులైన ఆ రాక్షసులను చంపెదను. 7

మూ. ఇత్యేవముక్తః స మునీ రాజానమిదమబ్రవీత్, 8
రామాన్నాన్యద్బలం లోకే పర్యాప్తం తస్య రక్షసః.

ప్ర. అ. ఇత్యేవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, సః మునిః = ఆ ముని, రాజానమ్ = రాజునుగూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను. రామాత్ = రామునికంటె, అన్యత్ = భిన్నమైన, బలమ్ = బలము, తస్య రక్షసః = ఆ రాక్షసునకు, లోకే = ఈలోకమునందు, న పర్యాప్తమ్ = సరిపోవునది కాదు.

తా. విశ్వామిత్రుడు ఆ మాటలు విని రాజుతో ఇట్లు పలికెను. "ఈ లోకములో రాముడు తప్ప మరియే ఇతరబలమూ కూడ ఆ రాక్షసుని చంపుటకు చాలదు." 8

మూ. దేవతానామపి భవాన్సమరేష్వభిపాలకః, 9
ఆసీత్తవ కృతం కర్మ త్రిలోకే విదితం నృప.

ప్ర. అ. నృప = రాజా ! భవాన్ = నీవు, సమరేషు = యుద్ధముల యందు, దేవానామపి = దేవతలకు కూడ, అభిపాలకః = రక్షకుడవు. కృతమ్ = చేయబడిన, తవ = నీ యొక్క, కర్మ = పని, త్రిలోకే = మూడు లోకములందూ, విదితమ్ ఆసీత్ = ప్రసిద్ధమైనది.

తా. ''రాజా ! నీవు యుద్ధములలో దేవతలను కూడ రక్షించినావు. నీవు పూర్వము చేసిన ఆ పని మూడులోకాలలోను ప్రసిద్ధి గాంచినది.'' 9

మూ. కామమస్తు మహత్సైన్యం తిష్ఠత్విహ పరంతప, 10
బాలోఽప్యేష మహాతేజాః సమర్థస్తస్య నిగ్రహే,
గమిష్యే రామమాదాయ స్వస్తి తేఽస్తు పరంతప. 11

ప్ర. అ. పరంతప = శత్రుసంహారకుడా, మహత్ = గొప్పదైన, సైన్యమ్ = సైన్యము, అస్తు కామమ్ = ఉండిన ఉండు గాక. ఇహ = ఇక్కడనే, తిష్ఠతు = ఉండుగాక, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, ఏషః = ఈ రాముడు, బాలోఽపి = చిన్నవాడైనా, తస్య = ఆ మారీచునియొక్క, నిగ్రహే = నిగ్రహించుటయందు, సమర్థః = సమర్థుడు. పరంతప = ఓః శత్రుసంహారకుడా ! రామమ్ = రాముణ్ణి, ఆదాయ = తీసికొని, గమిష్యే = వెళ్లగలను. తే = నీకు, స్వస్తి = క్షేమము, అస్తు = అగుగాక.

తా. ''శత్రుసంహారకుడవైన ఓః రాజాః నీ సైన్యము చాల గొప్పదే కావచ్చును, దానిని ఇక్కడనే ఉండనిమ్ము. మహాతేజఃశాలియైన ఈ రాముడు బాలుడే అయినా ఆ మారీచుణ్ణి నిగ్రహించుటకు సమర్థుడు. అందుచే రాముణ్ణి తీసి కొనివెళ్లెదను. నీకు క్షేమ మగుగాక.'' 10, 11

మూ. ఏవముక్త్వా తు స మునిస్తమాదాయ నృపాత్మజమ్,
జగామ పరమప్రీతో విశ్వామిత్రః స్వమాశ్రమమ్. 12

ప్ర. అ. సః = ఆ, విశ్వామిత్రః మునిః = విశ్వామిత్రమహర్షి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, పరమప్రీతః = చాలా సంతోషించినవాడై, తమ్ = ఆ, నృపాత్మజమ్ = రాజకుమారుణ్ణి, ఆదాయ = తీసికొని, స్వమ్ = తన సంబంధమైన, ఆశ్రమమ్ = ఆశ్రమమును గూర్చి, జగామ = వెళ్ళెను.

తా. ఆ విశ్వామిత్రమహర్షి ఇట్లు పలికి, చాల సంతోషించుచు, ఆ రాజకుమారుని తీసికొని తన ఆశ్రమమునకు వెళ్లెను. 12

మూ. తం తదా దణ్డకారణ్యే యజ్ఞముద్దిశ్య దీక్షితమ్,
బభూవోపస్థితో రామశ్చిత్రం విష్ఫారయన్ ధనుః. 13

ప్ర. అ. తదా = అప్పుడు, రామః = రాముడు, దణ్డకారణ్యే = దండకారణ్యమునందు, యజ్ఞమ్ = యజ్ఞమును, ఉద్దిశ్య = ఉద్దేశించి, దీక్షితమ్ = దీక్షవహించిన, తమ్ = ఆ విశ్వామిత్రుని, ఉపస్థితః = సమీపించినవాడై, చిత్రమ్ = చిత్రమైన, ధనుః = ధనస్సును, విష్ఫారయన్ = చరచుచు, బభూవ = ఉండెను.

తా. అప్పుడు చిత్రమైన ధనస్సును చరచుచు ఆ రాముడు యజ్ఞదీక్ష వహించిన ఆ విశ్వామిత్రుని దగ్గరనే ఉండెను. 13

మూ. అజాతవ్యఞ్జనః శ్రీమాన్ పద్మపత్రనిభేక్షణః,
ఏకవస్త్రధరో ధన్వీ శిఖీ కనకమాలయా. 14

శోభయన్ దణ్డకారణ్యం దీప్తేన స్వేన తేజసా,
అదృశ్యత తతో రామో బాలచన్ద్ర ఇవోదితః. 15

ప్ర. అ. తతః = అటుపిమ్మట (అప్పుడు), అజాతవ్యఞ్జనః = పుట్టని పురుషచిహ్నములుకలవాడు, శ్రీమాన్ = శ్రీమంతుడు, పద్మపత్రనిభేక్షణః = పద్మపత్రములతో సమానమైన నేత్రములు కలవాడు, ఏకవస్త్రధరః = ఒకే వస్త్రమును ధరించినవాడు, ధన్వీ = ధనుర్ధరుడు, శిఖీ = శిఖగలవాడు, కనకమాలయా = బంగారుమాలతో కూడినవాడు, దీప్తేన = ప్రజ్వలించుచున్న, స్వేన =

తనదైన, తేజసా=తేజస్సుచేత, దణ్డకారణ్యమ్=దండకారణ్యమును, శోభయన్=ప్రకాశింపచేయుచున్నవాడు అయిన, రామః=రాముడు, ఉదితః=ఉదయించిన, బాలచన్ద్రః ఇవ=బాలచంద్రుడు వలె, అదృశ్యత=చూడబడెను.

తా. పద్మపత్రముల వంటి నేత్రములు కలవాడు, శోభాసంపన్నుడు అయిన ఆ రామునకు ఆ నాటికి ఇంకను మీసము మొదలైన పురుషచిహ్నము లేవీ ఉదయించలేదు. ఆతడు బ్రహ్మచారి అగుటచే ఒకే వస్త్రము ధరించి ఉండెను. బంగారు మాల ధరించి, తలమీద జుట్టు ముడిపెట్టుకొని, ధనస్సును ధరించిన ఆతడు ప్రజ్వలించుచున్న తన తేజస్సుచేత ఆ దండకారణ్యము నంతా ప్రకాశింపచేయుచుండెను. అట్టి రాముడు ఉదయించిన బాలచంద్రుడు వలె కనబడుచుండెను. 14, 15

మూ. తతోఽహం మేఘసంకాశ స్తప్తకాఞ్చనకుణ్డలః,
బలీ దత్తవరో దర్పాదాజగామ తదాశ్రమమ్.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, మేఘసంకాశః=మేఘముతో సమానుడను, తప్తకాఞ్చనకుణ్డలః=పరిశుద్ధమైన బంగారు కుండలములు కలవాడను, బలీ=బలవంతుడను, దత్తవరః=ఇవ్వబడిన వరములు గలవాడను అయిన, అహమ్=నేను, దర్పాత్=దర్పము వలన, తదాశ్రమమ్ = ఆ విశ్వామిత్రుని, ఆశ్రమమును, ఆజగామ=చేరితిని.

తా. అప్పుడు, వరములను పొంది యుండుటచే మహాబలముతో గర్వించిన నేను మేఘముతో సమానమైన ఆకారముతో బంగారు కుండలములు ధరించి ఆ విశ్వామిత్రుని ఆశ్రమమునకు వెళ్ళితిని. 16

మూ. తేన దృష్టః ప్రవిష్టోఽహం సహసైవోద్యతాయుధః,
మాం తు దృష్ట్వా ధనుః సజ్యమసంభ్రాన్తశ్చకార సః. 17

ప్ర. అ. ఉద్యతాయుధః=ఎత్తబడిన ఆయుధము కలవాడనై, ప్రవిష్టః=ప్రవేశించిన, అహమ్=నేను, సహసైవ=వెంటనే, తేన=అతనిచేత, దృష్టః=చూడబడినాను. సః=అతడు, మామ్=నన్ను, దృష్ట్వా=చూచి, అసంభ్రాన్తః=

కంగారులేనివాడై, ధనుః = ధనస్సును, సజ్యమ్ = నారితో కూడినదానినిగా, చకార = చేసెను.

తా. నేను ఆయుధము ధరించి ఆశ్రమములోనికి ప్రవేశించుచుండగానే ఆ రాముడు నన్ను చూచి, ఏ మాత్రము భయపడక ధనస్సుకు నారి కట్టెను. 17

మూ. అవజానన్నహం మోహాద్బాలోఽయమితి రాఘవమ్,
విశ్వామిత్రస్య తాం వేదిమభ్యధావం కృతత్వరః. 18

ప్ర. అ. అహమ్ = నేను, మోహాత్ = అజ్ఞానమువలన, అయమ్ = ఇతడు, బాలః = బాలుడేకదా, ఇతి = అని, రాఘవమ్ = రాముణ్ణి, అవజానన్ = అవమానించుచు, కృతత్వరః = చేయబడిన తొందర కలవాడనై, విశ్వామిత్రస్య = విశ్వామిత్రునియొక్క, తామ్ = ఆ, వేదిమ్ = వేదిని గూర్చి, అభ్యధావమ్ = పరుగెత్తితిని.

తా. ఇతడు బాలుడే కదా అని అజ్ఞానముచేత రాముని విషయములో నిర్లక్ష్యభావముతో నేను తొందరగా విశ్వామిత్రుని యజ్ఞవేది దగ్గరకు వెళ్ళితిని.

మూ. తేన ముక్తస్తతో బాణః శితః శత్రునిబర్హణః,
తేనాహం త్వాహతః క్షిప్తః సముద్రే శతయోజనే. 19

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తేన = ఆ రామునిచేత, శత్రునిబర్హణః = శత్రువులను సంహరించు, శితః = వాడియైన, బాణః = బాణము, ముక్తః = విడువబడినది. అహమ్ = నేను, తేన = ఆ బాణముచేత, ఆహతః = కొట్టబడినవాడనై, శతయోజనే = నూరు యోజనముల దూరమునం దున్న, సముద్రే = సముద్రమునందు, ఆహతః = కొట్టబడినాను.

తా. అప్పుడు రాముడు శత్రువులను సంహరించు బాణము నొకదానిని నాపై ప్రయోగించెను. అది నన్ను నూరు యోజనముల దూరమునం దున్న సముద్రములో పడవేసెను. 19

మూ. నేచ్ఛతా తాత మాం హన్తుం తదా వీరేణ రక్షితః,
రామస్య శరవేగేన నిరస్తోఽహమచేతనః. 20

ప్ర. అ. తాత = నాయనా! తదా = అప్పుడు, మామ్ = నన్ను, హన్తుమ్ = చంపుటకు, నేచ్ఛతా = ఇష్టపడని, వీరేణ = వీరుడైన రామునిచేత, రక్షితః = రక్షింపబడితిని. రామస్య = రామునియొక్క, శరవేగేన = బాణముయొక్క వేగముచేత, అచేతనః = చైతన్యము లేని, అహమ్ = నేను, నిరస్తః = దూరముగా ఎగురగొట్టబడితిని.

తా. నాయనా! అప్పుడు రామునకు నన్ను చంపవలె నను ఇచ్ఛ లేక పోవుటచేత చంపకుండా రక్షించినాడు. నన్ను శరవేగముచేత స్పృహ కోల్పోవునట్లు చేసి దూరముగా ఎగురగొట్టినాడు.

మూ. పాతితోఽహం తదా తేన గమ్భీరే సాగరామ్భసి,
ప్రాప్య సంజ్ఞాం చిరాత్తాత లఙ్కాం ప్రతిగతః పురీమ్.21

ప్ర. అ. తాత = నాయనా! తదా = అప్పుడు, అహమ్ = నేను, గమ్భీరే = గంభీరమైన, సాగరామ్భసి = సముద్రజలమునందు, పాతితః = పడవేయబడితిని. చిరాత్ = చాలసమయమునకు, సంజ్ఞామ్ = సంజ్ఞను, ప్రాప్య = పొంది, లఙ్కాం పురీమ్ = లంకాపురమును, ప్రతిగతః = తిరిగి చేరితిని.

తా. నాయనా! ఆ విధముగా ఆ రాముడు నన్ను లోతైన సముద్రజలములో పడవేయగా, చాలసేపటికి స్పృహ వచ్చి నేను లంకాపురమును మరల చేరితిని.

మూ. ఏవమస్మి తదా ముక్తః సహాయాస్తు నిపాతితాః,
అకృతాస్త్రేణ బాలేన రామేణాక్లిష్టకర్మణా. 22

ప్ర. అ. తదా = అప్పుడు, అకృతాస్త్రేణ = నేర్వబడని అస్త్రములు గల, బాలేన = బాలుడైన, అక్లిష్టకర్మణా = శ్రమపడకుండా కార్యముసాధించు, రామేణ = రామునిచేత, ఏవమ్ = ఈ విధముగా, ముక్తః అస్మి = విడువబడితిని. సహాయాస్తు = నా సహాయులైన రాక్షసులైతే, నిపాతితాః = చంపబడినారు.

తా. అప్పటికి రాముడు బాలుడుగా ఉండుటచేత అస్త్రవిద్యను పూర్తిగా అభ్యసించలేదు. శ్రమపడకుండా కార్యములు నిర్వర్తించు అట్టి రాముడు నన్ను ఆ విధముగా విడచిపెట్టి నా సహాయుల నందరినీ మాత్రము సంహరించినాడు.22

మూ. తన్మయా వార్యమాణస్త్వం యది రామేణ విగ్రహమ్,
కరిష్యస్యాపదం ఘోరాం క్షిప్రం ప్రాప్స్యసి రావణ. 23

ప్ర. అ. రావణ = ఓ! రావణా; తత్ = ఆ కారణమువలన, మయా = నాచేత, వార్యమాణః = నివారింపబడుచున్న, త్వమ్=నీవు, రామేణ=రామునితో, విగ్రహమ్=విరోధమును, కరిష్యసి యది=చేసినట్లయితే, క్షిప్రమ్=శీఘ్రముగా, ఘోరామ్ = ఘోరమైన, ఆపదమ్ = అపదను, ప్రాప్స్యసి = పొందగలవు.

తా. రావణా! అందువలన, నేను నివారించుచున్నా వినక నీవు రామునితో విరోధము పెట్టుకొన్నచో, శీఘ్రముగానే ఘోరమైన ఆపద పొందగలవు. 23

మూ. క్రీడారతివిధిజ్ఞానాం సమాజోత్సవశాలినామ్,
రక్షసాం చైవ సంతాపమనర్థం చాహరిష్యసి. 24

ప్ర. అ. క్రీడారతివిధిజ్ఞానామ్ = క్రీడలయొక్క, రతియొక్క పద్ధతులను ఎరిగినవారు, సమాజోత్సవశాలినామ్ = సమాజముల ఉత్సవములతో ప్రకాశించువారు అయిన, రక్షసాం చైవ=రాక్షసులకు కూడ, సంతాపమ్=తాపమును, అనర్థం చ = కీడును, ఆహరిష్యసి = సంపాదించగలవు.

తా. రాక్షసు లందరూ అనేకవిధములైన ఆటలకు సంబంధించిన పద్ధతులను, రతికి సంబంధించిన పద్ధతులను తెలుసుకొని సుఖముగా ఉన్నారు. సమాజములుగా ఏర్పడి ఆ యా ఉత్సవములు చేసికొని ఆనందించుచున్నారు. అట్టి రాక్షసులకు కూడ కష్టమును, ఆపదను తెచ్చిపెట్టినవాడ వగుదువు. 24

మూ. హర్మ్యప్రాసాదసంబాధాం నానారత్నవిభూషితామ్,
ద్రక్ష్యసి త్వం పురీం లఙ్కాం వినష్టాం మైథిలీకృతే. 25

ప్ర. అ. హర్మ్యప్రాసాదసంబాధామ్ = మేడలతోను, ప్రాసాదములతోను ఇరుకుగా నున్న, నానారత్నవిభూషితామ్ = అనేకవిధములైన రత్నములచేత అలంకరించబడిన, లఙ్కాం పురీమ్ = లంకాపట్టణమును, త్వమ్ = నీవు, మైథిలీకృతే = సీత నిమిత్తమై, వినష్టామ్ = నశించినదానినిగా, ద్రక్ష్యసి=చూడగలవు.

తా. మేడలతోను, రాజభవనములతోను కిక్కిరిసి ఉన్న, అనేకరత్న

ములచేత అలంకరింపబడిన లంకాపట్టణము సీత మూలాన నశించుటను నీవు చూడగలవు. 25

మూ. అకుర్వన్తోఽపి పాపాని శుచయః పాపసంశ్రయాత్,
పరపాపైర్వినశ్యన్తి మత్స్యా నాగహ్రదే యథా. 26

ప్ర. అ. పాపాని = పాపములను, అకుర్వన్తోఽపి = చేయనివారైనా, శుచయః = పరిశుద్ధమైనవాళ్ళు, పాపసంశ్రయాత్ = పాపాత్ములయొక్క సంబంధమువలన, నాగహ్రదే = సర్పము లుండు మడుగులోని, మత్స్యాః యథా = మత్స్యములు వలె, పరపాపైః = ఇతరులు చేసిన పాపములచేత, వినశ్యన్తి = నశింతురు. 4

తా. ఏ పాపమూ ఎరుగని మంచివాళ్ళు కూడ, పాపాత్ములతో సంబంధము వలన, సర్పములు నివసించు మడుగులోని మత్స్యముల వలె, ఇతరుల పాపాల మూలమున నశించుచుందురు. 26

మూ. దివ్యచన్దనదిగ్ధాఙ్గాన్దివ్యాభరణభూషితాన్,
ద్రక్ష్యస్యభిహతాన్ భూమౌ తవ దోషాత్తు రాక్షసాన్. 27

ప్ర. అ. దివ్యచన్దనదిగ్ధాఙ్గాన్ = దివ్యమైన చందనముచేత పూయబడిన శరీరముకలవారు, దివ్యాభరణభూషితాన్ = దివ్యములైన ఆభరణములచేత అలంకరించబడినవారు అయిన, రాక్షసాన్ = రాక్షసులను, తవ = నీయొక్క, దోషాత్ = దోషమువలన, భూమౌ = భూమి మీద, అభిహతాన్ = చంపబడినవారినిగా, ద్రక్ష్యసి = చూడగలవు.

తా. దివ్యమైన చందనమును శరీరములకు పూసుకొని, దివ్యములైన అలంకారములతో అలంకరించుకొని సుఖముగా ఉన్న రాక్షసు లందరు నీవు చేసిన తప్పుకు ఫలితముగా మరణించి నేలపై పడి యుండుట చూడగలవు. 27

మూ. హృతదారాన్సదారాంశ్చ దశ విద్రవతో దిశః,
హతశేషానశరణాన్ ద్రక్ష్యసి త్వం నిశాచరాన్. 28

ప్ర. అ. హతశేషాన్ = చంపబడగా మిగిలిన, నిశాచరాన్ = రాక్షసులను,

హృతదారాన్ = హరింపబడిన భార్యలు కలవారై, సదారాంశ్చ = భార్యలతో కూడినవారై, అశరణాన్ = రక్షకుడు లేక, దశ దిశః = పది దిక్కులను గూర్చి, విద్రవతః = పారిపోవుచున్నవారినిగా, త్వమ్ = నీవు, ద్రక్ష్యసి = చూడగలవు.

తా. చావగా మిగిలిన రాక్షసులలో కొందరు హరింపబడిన భార్యలు కలవారై, కొందరు భార్యలతో కూడినవారై రక్షకులు లేక పది దిక్కులకు పారిపోవుచుండగా ఘూడగలవు. 28

మూ. శరజాలపరిక్షిప్తా మగ్నిజ్వాలాసమావృతామ్,
ప్రదగ్ధభవనాం లఙ్కాం ద్రక్ష్యసి త్వం న సంశయః. 29

ప్ర. అ. శరజాలపరిక్షిప్తామ్ = బాణముల సముదాయముచేత వ్యాపింపబడినది, అగ్నిజ్వాలాసమావృతామ్ = అగ్నిజ్వాలలచేత ఆవరింపబడినది, ప్రదగ్ధభవనామ్ = కాల్చబడిన భవనములు కలది అయిన, లఙ్కామ్ = లంకను, త్వమ్ = నీవు, ద్రక్ష్యసి = చూడగలవు. సంశయః = సంశయము, న = లేదు.

తా. ఈ లంకాపట్టణ మంతా బాణముల సముదాయముచేత చుట్టబడి అగ్నిజ్వాలలచేత కప్పబడి ఉండగా, ఈ పట్టణములోని భవనము లన్నీ మండిపోవుచుండగా చూడగలవు. సందేహము లేదు. 29

మూ. పరదారాభిమర్శాత్తు నాన్యత్పాపతరం మహత్,
ప్రమదానాం సహస్రం చ తవ రాజన్ పరిగ్రహః. 30

ప్ర. అ. పరదారాభిమర్శాత్ = పరభార్యాగమనముకంటె, పాపతరమ్ = ఎక్కువ పాపమైన, మహత్ = గొప్ప పాపము, అన్యత్ = మరి యొకటి, న = లేదు. రాజన్ = రాజా! ప్రమదానామ్ = స్త్రీలయొక్క, సహస్రమ్ = సహస్రము, తవ = నీయొక్క, పరిగ్రహః = భార్యలు కదా.

తా. పరభార్యాగమనమును మించిన మరొక పాప మేదీ లేదు. రాజా! నీకు వేలకొలది స్త్రీలు భార్యలుగా ఉన్నారు కదా! 30

మూ. భవ స్వదారనిరతః స్వకులం రక్ష రాక్షస,
మానమృద్ధిం చ రాజ్యం చ జీవితం చేష్టమాత్మనః. 31

ప్ర. అ. రాక్షస = రావణా! స్వదారనిరతః=నీ భార్యలయందు ఆసక్తి కలవాడవు, భవ = అగుము. స్వకులమ్=నీ కులమును, రక్ష=రక్షించుకొనుము. మానమ్ = గౌరవమును, ఋద్ధిం చ = ఐశ్వర్యమును, రాజ్యం చ = రాజ్యమును, ఆత్మనః = నీకు, ఇష్టమ్=ఇష్టమైన, జీవితం చ=జీవితమును, రక్షించుకొనుము.

తా. రావణా! నీవు భార్యలయందు మాత్రమే ఆసక్తి కలవాడవై నీకులమును, గౌరవమును, ఐశ్వర్యమును, రాజ్యమును, నీకత్యంతప్రియమైన నీ జీవితమును రక్షించుకొనుము. 31

మూ. కళత్రాణి చ సౌమ్యాని మిత్రవర్గం తథైవ చ,
యదీచ్ఛసి చిరం భోక్తుం మా కృథా రామవిప్రియమ్. 32

ప్ర. అ. సౌమ్యాని = సౌందర్యవతులైన, కళత్రాణి=భార్యలను, తథైవ చ = అట్లే, మిత్రవర్గమ్ = మిత్రుల సముదాయమును, చిరమ్ = చిరకాలము, భోక్తుమ్ = అనుభవించుటకు, ఇచ్ఛసి యది = ఇచ్ఛయించుచున్నచో, రామవిప్రియమ్ = రామునకు అపకారమును, మా కృథాః = చేయకుము.

తా. సౌందర్యవతులైన భార్యలతోను, మిత్రులతోను చాల కాలము సుఖముగా ఉండదలచినచో నీవు రామునకు అపకారము చేయకుము. 32

మూ. నివార్యమాణః సుహృదా మయా భృశం
ప్రసహ్య సీతాం యది ధర్షయిష్యసి,
గమిష్యసి క్షీణబలః సబాన్ధవో
యమక్షయం రామశరాత్తజీవితః. 33

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
అష్టత్రింశః సర్గః.

ప్ర. అ. సుహృదా = స్నేహితుడనైన, మయా = నాచేత, భృశమ్ = మిక్కిలి, నివార్యమాణః = నివారింపబడుచున్నను, సీతామ్ = సీతను, ప్రసహ్య = బలాత్కరించి, ధర్షయిష్యసి యది = అవమానించినచో, క్షీణబలః = క్షీణమైన సైన్యము కలవాడవై, సబాన్ధవః = బంధుసహితుడవై, రామశరాత్తజీవితః=

రాముని బాణములచేత గ్రహింపబడిన జీవితము కలవాడవై, యమక్షయమ్ = యమలోకమును గూర్చి, గమిష్యసి = వెళ్లగలవు.

తా. నేను నీ మంచి కోరి నివారించుచున్నా వినక సీతను బలాత్కారముగా అవమానించినచో నీవు నీ సైన్యమంతా నశించగా, రాముని బాణములు ప్రాణములను హరింపగా, బంధుసహితముగ యమలోకమునకు వెళ్లెదవు. 33

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
అరణ్యకాండలో ముప్పదియెనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనచత్వారింశః సర్గః

[మారీచుడు రావణునకు ఉపదేశించుట].

మూ. ఏవమస్మి తదా ముక్తః కథం చిత్తేన సంయుగే,
ఇదానీమపి యద్వృత్తం తచ్ఛృణుష్వ యదుత్తరమ్. 1

ప్ర. అ. తదా = అప్పుడు, తేన = ఆ రామునిచేత, సంయుగే = యుద్ధమునందు, కథంచిత్ = ఎట్లో, ఏవమ్ = ఈ విధముగా, ముక్తః అస్మి = విడువబడితిని. ఇదానీమపి = ఇప్పుడు కూడ, యత్ = ఏది, వృత్తమ్ = జరిగినదో, యత్ = ఏది, ఉత్తరమ్ = తరువాత జరిగినదో, తత్ = దానిని, శృణుష్వ = వినుము.

తా. ఈ విధముగా, రాము డా నాడు యుద్ధములో నన్ను ఎట్లో విడిచి పెట్టినాడు. దాని తరువాత ఈ మధ్యకాలమున ఏమి జరిగినదో వినుము. 1

మూ. రాక్షసాభ్యామహం ద్వాభ్యామనిర్విణ్ణస్తథా కృతః,
సహితో మృగరూపాభ్యాం ప్రవిష్టో దణ్డకావనమ్. 2

ప్ర. అ. తథాకృతః = ఆ విధముగా చేయబడినవాడనైనా, అనిర్విణ్ణః = వైరాగ్యము చెందని, అహమ్ = నేను, మృగరూపాభ్యామ్ = మృగరూపము గల, ద్వాభ్యామ్ = ఇద్దరు, రాక్షసాభ్యామ్ = రాక్షసులతో, సహితః = కూడినవాడనై, దణ్డకావనమ్ = దండకారణ్యమును, ప్రవిష్టః = ప్రవేశించితిని.

తా. రాము డా విధముగా చేసినా కూడ వైరాగ్యము చెందక నేను, మృగరూపము ధరించిన ఇద్దరు రాక్షసులతో కలిసి దండకారణ్యమునకు వెళ్ళితిని. 2

మూ. దీప్తజిహ్వో మహాకాయస్తీక్ష్ణదంష్ట్రో మహాబలః,
వ్యచరం దణ్డకారణ్యం మాంసభక్షో మహామృగః. 3

ప్ర. అ. దీప్త జిహ్వః = ప్రజ్వలించుచున్న జిహ్వగలది, మహాకాయః

= పెద్ద శరీరము కలది, తీక్ష్ణదంష్ట్రః=తీక్ష్ణములైన కోరలు గలది, మహాబలః= గొప్ప బలము గలది, మాంసభక్షః = మాంసమును భక్షించేది అయిన, మహామృగః = గొప్ప మృగముగా అయి, దణ్డకారణ్యమ్ = దండకారణ్యమును, వ్యచరమ్ = సంచరించితిని.

తా. మండుచున్న నాలుక, పెద్దదేహము, తీక్ష్ణములైన కోరలు, గొప్ప బలమూ గల మాంసమును భక్షించే ఒక మహామృగముగా అయి దండకారణ్యములో సంచరించితిని. 3

మూ. అగ్నిహోత్రేషు తీర్థేషు చైత్యవృక్షేషు రావణ,
అత్యన్తఘోరో వ్యచరం తాపసాన్ సంప్రధర్షయన్. 4

ప్ర. అ. రావణ = రావణా! అత్యన్తఘోరః = చాలభయంకరుడనై, అగ్నిహోత్రేషు = అగ్నిహోత్రములందు, తీర్థేషు=తీర్థములందు, చైత్యవృక్షేషు= చైత్యవృక్షముల సమీపములందు, తాపసాన్ = మునులను, సంప్రధర్షయన్ = ఎదిరించుచు, వ్యచరమ్ = సంచరించితిని.

తా. రావణా! నేను మిక్కిలి భయము కలిగించు రూపము దాల్చి, అగ్నిహోత్రములు జరుగు ప్రదేశములందు, పుణ్యతీర్థములందు, చైత్యవృక్షాల సమీపమునందు ఉండే మునులను ఎదిరించుచు సంచరించితిని. 4

మూ. నిహత్య దణ్డకారణ్యే తాపసాన్ ధర్మచారిణః,
రుధిరాణి పిబంస్తేషాం తథా మాంసాని భక్షయన్. 5

ప్ర. అ. దణ్డకారణ్యే = దండకారణ్యమునందు, ధర్మచారిణః = ధర్మమును ఆచరించుచున్న, తాపసాన్ = మునులను, నిహత్య = చంపి, తేషామ్ = వారియొక్క, రుధిరాణి = రక్తములను, పిబన్ = త్రాగుచు, తథా = మరియు, మాంసాని = మాంసములను, భక్షయన్ = భక్షించుచు ('రామమ్ ఆసాదయమ్' ''రాముణ్ణి సమీపించితిని'' అని ఏడవ శ్లోకముతో ఉన్న దానితో అన్వయము).

తా. దండకారణ్యములో తపస్సు చేసుకొనుచున్న మునులను చంపి వారి రక్తము త్రాగుచు, వారి మాంసములు భక్షించుచు రామునివద్దకు వెళ్ళితిని. 5

మూ. ఋషిమాంసాశనః క్రూరస్త్రాసయన్వనగోచరాన్,
తథా రుధిరమత్తోఽహం విచరన్ ధర్మదూషకః. 6

ప్ర. అ. అహమ్ = నేను, ఋషిమాంసాశనః = ఋషుల మాంసమును భుజించుచు, క్రూరః = క్రూరుడనై, వనగోచరాన్ = వనములో ఉన్నవారిని, త్రాసయన్ = భయపెట్టుచు, తథా = మరియు, రుధిరమత్తః = రక్తముచేత మదించినవాడనై, ధర్మదూషకః = ధర్మమును దూషించుచు, విచరన్ = సంచరించుచు, రాముని దగ్గరకు వెళ్ళితిని.

తా. నేను చాల క్రూరుడనై ఋషుల మాంసములు తినుచు, వనములో నివసించువాళ్లకు భయము కలిగించుచు, రక్తము త్రాగుటచే మదించి, ధర్మ కార్యములను పాడుచేయుచు సంచరించుచు రామునివద్దకు వెళ్ళితిని. 6

మూ. ఆసాదయం తదా రామం తాపసం ధర్మచారిణమ్,
వైదేహీం చ మహాభాగాం లక్ష్మణం చ మహారథమ్. 7

ప్ర. అ. తదా = అప్పుడు, ధర్మచారిణమ్ = ధర్మము నాచరించు, తాపసమ్ = మునియైన, రామమ్ = రాముణ్ణి, మహాభాగామ్ = గొప్ప భాగ్యము గల, వైదేహీం చ = సీతను, మహారథమ్ = మహారథుడైన, లక్ష్మణం చ = లక్ష్మణుణ్ణి, ఆసాదయమ్ = సమీపించితిని.

తా. అప్పుడు తాపసుడై ధర్మము ఆచరించుచున్న రాముడు, గొప్ప భాగ్యము గల సీత, మహారథుడైన లక్ష్మణుడు ఉన్న ప్రదేశమునకు వెళ్ళితిని. 7

మూ. తాపసం నియతాహారం సర్వభూతహితే రతమ్,
సోఽహం వనగతం రామం పరిభూయ మహాబలమ్,

తాపసోఽయమితి జ్ఞాత్వా పూర్వవైరమనుస్మరన్,
అభ్యధావం హి సంక్రుద్ధస్తీక్ష్ణశృఙ్గో మృగాకృతిః,
జిఘాంసురకృతప్రజ్ఞస్తం ప్రహారమనుస్మరన్. 9

ప్ర. అ. మృగాకృతిః = మృగముయొక్క ఆకారము కలవాడను, తీక్ష

శృఙ్గః = తీక్ష్ణమైన కొమ్ములు కలవాడను అయిన, సః అహమ్ = అట్టి నేను, పూర్వవైరమ్ = వెనుకటి వైరమును, అనుస్మరన్ = స్మరించుచు, తాపసమ్ = మునివృత్తిలో ఉన్నవాడు, నియతాహారమ్ = నియమబద్ధమైన ఆహారము కలవాడు, సర్వభూతహితే = సమస్తప్రాణుల హితమునందు, రతమ్ = ఆసక్తి కలవాడు. మహాబలమ్ = గొప్ప బలము గలవాడు అయిన, వనగతమ్ = వనములో ఉన్న, రామమ్ = రాముణ్ణి, అయమ్ = ఇతడు, తాపసః = మునియే కదా, ఇతి = అని, పరిభూయ = తిరస్కరించి, తం ప్రహారమ్ = ఆ దెబ్బను, అనుస్మరన్ స్మరించుచు, జిఘాంసుః = చంప దలచినవాడనై, సంక్రుద్ధః = కోపించినవాడనై, అభ్యధావమ్ = ఎదురుగా పరుగెత్తితిని.

తా. వాడియైన కొమ్ములు గల మృగము రూపము ధరించి ఉన్న నేను, ఆహారనియమము పాటించుచు, తాపసుడై సకలప్రాణుల హితమును కోరు, మహాబలశాలి అయిన రాముడు అరణ్యములో ఉండుట చూచి, "ఇతడు తాపసుడే కదా" అను అభిప్రాయముతో నిర్లక్ష్యము చేయుచు, పూర్వము అతనితో ఉన్న వైరమును, అతడు కొట్టిన దెబ్బను స్మరించుచు, చంపుటకై అతని మీదకు వెళ్ళితిని. 8, 9,

మూ. తేన ముక్తాస్త్రయో బాణాః శితాః శత్రునిబర్హణాః, 10
వికృష్య బలవచ్చాపం సుపర్ణానిలనిస్స్వనాః.

ప్ర. అ. తేన = ఆ రామునిచేత, చాపమ్ = ధనస్సును, బలవత్ = బలముగా, వికృష్య = లాగి, శత్రునిబర్హణాః = శత్రువులను సంహరించు, శితాః = వాడియైన, సుపర్ణానిలనిస్స్వనాః = గరుత్మంతుని (వేగమువలన కలిగిన) వాయువు వంటి ధ్వని గల, త్రయః = మూడు, బాణాః = బాణములు, ముక్తాః = విడువబడినవి.

తా. అప్పుడా రాముడు ధనస్సును గట్టిగా లాగి శత్రువులను సంహరించు మూడు వాడియైన బాణములు ప్రయోగించెను. అవి గరుత్మంతుడు వేగముగా వెళ్ళునపుడు కలుగు గాలి ధ్వని వంటి ధ్వని చేసెను. 10

మూ. తే బాణా వజ్రసంకాశాః సుముక్తా రక్తభోజనాః,
ఆజగ్ముః సహితాః సర్వే త్రయః సన్నతపర్వణః. 11

ప్ర. అ. వజ్రసంకాశాః = వజ్రాయుధముతో సమానములు, రక్తభోజనాః = రక్తము భోజనముగా కలవి, సంనతపర్వాణః = వంగిన కణుపులు గలవి అయిన, సర్వే = సమస్తమైన, తే త్రయః బాణాః = ఆ మూడు బాణములు, సుముక్తాః = బాగుగా విడువబడినవై, సహితాః = కలసినవై, ఆజగ్ముః = వచ్చినవి.

తా. వజ్రముతో సమానములు, రక్తము భుజించునవి, వంగిన కణుపులు గలవి అయిన ఆ మూడు బాణములు బాగుగా ప్రయోగింపబడినవై మా వైపు వచ్చినవి. 11

మూ. పరాక్రమజ్ఞో రామస్య శరో దృష్టభయః పురా,
సముద్భ్రాన్తస్తతోముక్తస్తావుభౌ రాక్షసౌ హతౌ. 12

ప్ర. అ. రామస్య = రామునియొక్క, శరః = బాణము, పురా = పూర్వము నందు, దృష్టభయః = (నాచేత) చూడబడిన భయము గలది. పరాక్రమజ్ఞః = రాముని పరాక్రమమును ఎరిగిన నేను, సముద్భ్రాన్తః = ఇటు అటు తిరిగితిని. తతః = ఆ కారణమువలన, ముక్తః = విడువబడితిని. తౌ = ఆ, రాక్షసౌ = రాక్షసులు, ఉభౌ = ఇద్దరూ, హతౌ = చంపబడినారు.

తా. రాముని బాణము ఎంత భయంకరమైనదో నేను పూర్వము చూచి ఉండుటచేత, అతని పరాక్రమమును ఎరిగినవాడ నగుటచేత, ఇటుఅటు తిరిగి పోయితిని. అందుచే నేను రక్షింపబడితిని గాని ఆ రాక్షసు లిద్దరూ మాత్రము చంపబడిరి.

వి. ఈ శ్లోకం అన్వయం క్లిష్టంగా ఉన్నది. దీనికన్న గోరఖ్‌పూర్ ప్రతిలోని పాఠం బాగున్నది.

"పరాక్రమజ్ఞో రామస్య శఠో దృష్టభయః పురా,
సముత్క్రాన్తస్తతో ముక్తస్తావుభౌ రాక్షసౌ హతౌ."

"రాముని పరాక్రమము తెలిసినవాడను, వంచన చేయ సమర్థుడను అయిన నేను పూర్వము రామునివలన భయము చూచి ఉన్నవాడ నగుటచేత అచటినుండి తొలగిపోయితిని. ఆ రాక్షసు లిద్దరూ మాత్రము మరణించినారు'' అని

మొదటి పాఠంలోని చిక్కంతా 'శరః' అనేదాన్ని "శరః" అని గ్రహించడంవలన వచ్చినది. ఈ ఘట్టంలో ప్రాచ్యపాఠంలో ఉన్న రెండు శ్లోకాలు బాగున్నవి.

''పరాక్రమజ్ఞో రామస్య తథా దృష్టభయః పురా
అపతన్తం శరం దృష్ట్వా మేఘగమ్భీరనిస్స్వనమ్.
తతోఽహం వేగవాంస్తత్ర వాతరంహా నిమేషతః
అపక్రాన్తః పరం పారం నివృత్తః సాగరాచ్ఛరః''

"రాముని పరాక్రమము తెలిసినవాడను, పూర్వము భయము చూచినవాడను అయిన నేను మేఘమువంటి గంభీరధ్వనితో వచ్చుచున్న ఆ బాణమును చూడగానే వాయువేగముతో, కనురెప్పపాటు కాలములో, సముద్రము అవతలి ఒడ్డునకు పారిపోయినాను. రాముని బాణము సముద్రముదాక వచ్చి అక్కడి నుండి వెనుకకు మరలినది'' అని వాటి భావము. ఇది రాముని బాణము ప్రభావానికి అనుగుణంగా ఉన్నది. 12

మూ. శరేణ ముక్తో రామస్య కథంచిత్ప్రాప్య జీవితమ్, 13
ఇహ ప్రవ్రాజితో యుక్తస్తాపసోఽహం సమాహితః.

ప్ర. అ. అహమ్ = నేను, రామస్య = రామునియొక్క, శరేణ = బాణముచేత, కథంచిత్ = ఎట్లో, ముక్తః = విడవబడినవాడనై, జీవితమ్ = జీవితమును, ప్రాప్య = పొంది, యుక్తః = యోగమార్గము నవలంబించినవాడనై, సమాహితః = ఏకాగ్రచిత్తము కలవాడనై, తాపసః = తాపసుడనై, ఇహ = ఇక్కడికి, ప్రవ్రాజితః = సంన్యసించి వచ్చినాను.

తా. నేను రాముని బాణమునుండి ఎట్లో తప్పించుకొని, ప్రాణాలు దక్కించుకొని, మనస్సును ఏకాగ్రము చేసికొని, యోగమార్గమును అవలంబించి, సంన్యాసినై ఇక్కడ నివసించుచున్నాను. 13

మూ. వృక్షే వృక్షే చ పశ్యామి చీరకృష్ణాజినామ్బరమ్, 14
గృహీతధనుషం రామం పాశహస్తమివాన్తకమ్.

ప్ర. అ. చీరకృష్ణాజినామ్బరమ్ = నారచీరలు, కృష్ణాజినము వస్త్రము

లుగా కలవాడు, గృహీతధనుషమ్ = గ్రహింపబడిన ధనస్సు కలవాడు అయిన, పాశహస్తమ్ = పాశము హస్తమునందు గల, అన్తకమివ = యముడు వలె ఉన్న, రామమ్ = రాముణ్ణి, వృక్షే వృక్షే = ప్రతి చెట్టు మీదా, పశ్యామి=చూచు చున్నాను.

తా. అది మొదలు ప్రతిచెట్టుమీదా, నారచీరలు, కృష్ణాజినము ధరించి, ధనస్సు చేత బూని, పాశము చేతిలో ధరించిన యముడు వలె ఉన్న రాముడే నాకు కనబడుచున్నాడు. 14

మూ. అపి రామసహస్రాణి భీతః పశ్యామి రావణ, 15
రామభూతమిదం సర్వమరణ్యం ప్రతిభాతి మే.

ప్ర. అ. రావణ = రావణా! భీతః = భయపడిన నేను, రామసహస్రాణ్యపి = వేలకొలది రాములను కూడా, పశ్యామి = చూచుచున్నాను. ఇదమ్ = ఈ, సర్వమ్ = సమస్తమైన, అరణ్యమ్=అరణ్యము, రామభూతమ్=రాముడుగా అయినదిగా, మే = నాకు, ప్రతిభాతి = కనబడుచున్నది.

తా. రావణా! భయభ్రాంతుడనైన నాకు వేలకొలది రాములు కనబడు చున్నారు. ఈ అరణ్య మంతా నాకు రామమయముగా కనబడుచున్నది. 15

మూ. రామమేవ హి పశ్యామి రహితే రాక్షసాధిప, 16
దృష్ట్వా స్వప్నగతం రామముద్భ్రమామి విచేతనః.

ప్ర. అ. రాక్షసాధిప = రావణా! రహితే=ఎవరూ లేని ప్రదేశమునందు, రామమేవ = రాముణ్ణే. పశ్యామి = చూచుచున్నాను. స్వప్నగతమ్ = స్వప్నము లోనికి వచ్చిన, రామమ్ = రాముణ్ణి, దృష్ట్వా = చూచి, విచేతనః = చైతన్యము లేనివాడనై, ఉద్భ్రమామి = భ్రాంతి చెందుచున్నాను.

తా ఓ! రాక్షసరాజా! ఎవ్వరూ లేని ప్రదేశములో కూడ నాకు రాముడే కనబడుచున్నాడు. స్వప్నములో రాముణ్ణి చూచి, ఉలికిపడి, స్పృహ కోల్పోవు చున్నాను. 16

మూ. రకారాదీని నామాని రామత్రస్తస్య రావణ, 17
రత్నాని చ రథాశ్చైవ త్రాసం సంజనయన్తి మే.

ప్ర. అ. రావణ = ఓ! రావణా! రామత్ర స్తస్య = రామునినుండి భయపడిన, మే = నాకు, రకారాదీని = రకారము ప్రారంభమునందు గల, నామాని = పేర్లు, రత్నాని = రత్నములు, రథాశ్చైవ = రథములు, త్రాసమ్ = భయమును, సంజనయ న్తి = పుట్టించుచున్నవి.

తా. రావణా! రామునివలన భయపడిన నాకు, రత్నములు, రథములు మొదలైన, రేఫతో ప్రారంభమయే పేర్లు వినగానే భయము కలుగుచున్నది. 17

మూ. అహం తస్య ప్రభావజ్ఞో న యుద్ధం తేన తే క్షమమ్, 18
బలిం వా నముచిం వాపి హన్యాద్ధి రఘునన్దనః.

ప్ర. అ. అహమ్ = నేను, తస్య = ఆ రామునియొక్క, ప్రభావజ్ఞః = ప్రభావము తెలిసినవాడను. తే = నీకు, తేన = ఆ రామునితో, యుద్ధమ్ = యుద్ధము, క్షమమ్ = తగినది, న = కాదు. రఘునన్దనః = రాముడు, బలిం వా = బలిచక్రవర్తినైనా, నముచిం వాపి = నముచినైనా, హన్యాద్ధి = చంపగలడు కదా.

తా. నాకు ఆ రాముని ప్రభావము తెలియును. అతనితో నీకు యుద్ధము తగదు. రాముడు బలిచక్రవర్తినైనా, నముచినైనా కూడ చంపగలడు. 18

మూ. రణే రామేణ యుధ్యస్వ క్షమాం వా కురు రాక్షస, 19
న తే రామకథా కార్యా యది మాం ద్రష్టుమిచ్ఛసి.

ప్ర. అ. రాక్షస = రావణా! రణే = యుద్ధమునందు, రామేణ = రామునితో, యుధ్యస్వ = యుద్ధము చేయుము. క్షమాం వా = ఓర్పునైనా, కురు = చేయుము. మామ్ = నన్ను, ద్రష్టుమ్ = చూచుటకు, ఇచ్ఛసి యది = నీవు కోరినట్లయితే, తే = నీకు, రామకథా = రాముని కథ, న కార్యా = చేయదగినది కాదు.

తా. రావణా ! నీవు రామునితో యుద్ధము చేయవలె నని ఉన్నచో యుద్ధము చేయుము; లేనిచో మానివేయుము. కాని నేను కొంతకాలము జీవించవలె నను అభిప్రాయము నీకు ఉన్నచో నా ఎదుట రాముని మాటలు చెప్పకుము.

మూ. బహవః సాధవో లోకే యుక్తా ధర్మమనుష్ఠితాః, 20
పరేషామపరాధేన వినష్టాః సపరిచ్ఛదాః.

ప్ర. అ. లోకే = లోకమునందు, యుక్తాః = యోగ్యులు, ధర్మమ్ = ధర్మమును, అనుష్ఠితాః=అనుష్ఠించినవారు అయిన, బహవః=చాలమంది, సాధవః = సత్పురుషులు, పరేషామ్ = ఇతరులయొక్క, అపరాధేన = అపరాధముచేత, సపరిచ్ఛదాః = పరివారసమేతులై, వినష్టాః = నశించినారు.

తా. లోకములో యోగ్యులై, ధర్మాచరణము చేయు ఎందరో సత్పురుషులు, ఇతరులు చేసిన అపరాధములకు, పరివారసమేతులై నశించినారు. 20

మూ. సోఽహం తవాపరాధేన వినశ్యేయం నిశాచర, 21
కురు యత్తే క్షమం తత్త్వమహం త్వా నానుయామి హ.

ప్ర. అ. నిశాచర = రావణా! సః అహమ్=అట్టి నేను, తవ=నీయొక్క, అపరాధేన = అపరాధముచేత, వినశ్యేయమ్ = నశింతును. తే = నీకు, యత్ = ఏది, క్షమమ్ = తగినదో, తత్ = దానిని, త్వమ్ = నీవు, కురు = చేయుము. అహమ్ = నేను, త్వా = నిన్ను, న అనుయామి హ = అనుసరించను.

తా. రావణా! నీవు చేసే అపరాధానికి నేను నశించవలసి ఉన్నది. అందుచే నీకు ఏది యుక్తమని తోచునో అది చేసికొనుము. నేను మాత్రము నీతో రాను. 21

మూ. రామశ్చ హి మహాతేజా మహాసత్త్వో మహాబలః, 22
అపి రాక్షసలోకస్య న భవేదన్తకో హి సః.

ప్ర. అ. రామశ్చ = రాముడు, మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడు. మహాసత్త్వః = గొప్ప ధైర్యము గలవాడు. మహాబలః=గొప్ప బలము గలవాడు. సః = ఆ రాముడు, రాక్షసలోకస్య = రాక్షససముదాయమునకు, అన్తకః=యముడుగా, న భవేదపి = కాడు కదా!

తా. గొప్ప తేజస్సు, ధైర్యము, బలము గల రాముడు అందరు రాక్షసుల పాలిటి మృత్యుదేవత కాడు కదా! 22

మూ. యది శూర్పణఖాహేతోర్జనస్థానగతః ఖరః, 23
అతివృత్తో హతః పూర్వం రామేణాక్లిష్టకర్మణా,
అత్ర బ్రూహి యథాతత్త్వం కో రామస్య వ్యతిక్రమః.

ప్ర. అ. జనస్థానగతః = జనస్థానములో ఉన్న, ఖరః = ఖరుడు, శూర్ప ణఖా హేతోః = శూర్పణఖ నిమిత్తమై, పూర్వమ్ = ముందుగా, అతివృత్తః = మర్యాదను ఉల్లంఘించినవాడై, అక్లిష్టకర్మణా = శ్రమ లేకుండా పనులు చేయు, రామేణ = రామునిచేత, హతః యది = చంపబడినట్లయితే, అత్ర = ఈ విష యమునందు, రామస్య = రామునియొక్క, వ్యతిక్రమః = పొరబాటు, కః=ఏమి? యథాతత్త్వమ్ = యథార్థముగా, బ్రూహి = చెప్పుము.

తా. జనస్థానములో ఉన్న ఖరుడు శూర్పణఖ మాట విని ముందుగా రామునకు అపకారము తలబెట్టగా, అప్పుడు, శ్రమపడకుండా కార్యములు సాధించు రాముడు ఆతనిని సంహరించినచో ఇందులో రాముని తప్పేమో నీవే యథార్థముగా చెప్పుము. 24

మూ. హితం వచో బన్ధుహితార్థినా మయా
యథోచ్యమానం యది నాభిపత్స్యసే,
సబాన్ధవస్త్యక్షసి జీవితం రణే
హతోఽద్య రామేణ శరైరజిహ్మగైః. 25

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ఏకోనచత్వారింశః సర్గః.

ప్ర. అ. బన్ధుహితార్థినా = బంధువుల హితమును కోరుచున్న, మయా = నాచేత, ఉచ్యమానమ్ = చెప్పబడుచున్న, వచః = వచనమును, యథా = చెప్పి నట్లు, నాభిపత్స్యసే యది = అంగీకరించకపోయినట్లయితే, సబాన్ధవః = బంధు సహితుడవైన నీవు, అద్య = ఇప్పుడు, రామేణ = రామునిచేత, అజిహ్మగైః = వక్రత్వము లేకుండా వెళ్లు, శరైః = బాణములచేత, హతః = చంపబడినవాడనై, రణే = యుద్ధమునందు, జీవితమ్=జీవితమును, త్యక్ష్యసి=విడువగలవు.

తా. రావణా! బంధువుల హితము కోరి నేను చెప్పుచున్న మాటలు విన నిచో, నీవు, నీ బంధువులూ కూడ రణరంగములో సూటిగా ప్రయాణము చేయు బాణములచేత రాముడు చంపివేయగా ప్రాణములు విడువగలరు. 25

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో
ముప్పదితొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ చత్వారింశః సర్గః

[*రావణుడు మారీచుని భయపెట్టి సీతను అపహరించుటకు సాహాయ్యము చేయవలె నని ఆజ్ఞాపించుట*].

మూ. మారీచస్య తు తద్వాక్యం క్షమం యుక్తం చ రావణః,
ఉక్తో న ప్రతిజగ్రాహ మర్తుకామ ఇవౌషధమ్. 1

ప్ర. అ. ఉక్తః = ఇట్లు పలకబడిన, రావణః = రావణుడు, మారీచస్య = మారీచునియొక్క, క్షమమ్ = యోగ్యము, యుక్తం చ = యుక్తియుక్తము అయిన, **తత్** = ఆ, వాక్యమ్ = వాక్యమును, మర్తుకామః = మరణించుటకు కోరిక గలవాడు, ఔషధమ్ ఇవ = ఔషధమును వలె, న ప్రతిజగ్రాహ = అంగీకరించలేదు.

తా. మారీచుడు ఈ విధముగా ఉపదేశింపగా రావణుడు తగినదీ, యుక్తి సంమతమూ అయిన అతని మాటను, మరణించ నున్నవాడు ఔషధమును నిరాకరించి నట్లు నిరాకరించెను. 1

మూ. తం పథ్యహితవక్తారం మారీచం రాక్షసాధిపః,
అబ్రవీత్పరుషం వాక్యమయుక్తం కాలచోదితః. 2

ప్ర. అ. రాక్షసాధిపః = రావణుడు, కాలచోదితః = కాలముచేత ప్రేరేపింపబడినవాడై, పథ్యహితవక్తారమ్ = మంచిని చేయు ఉపదేశవాక్యములు చెప్పిన, **తం** మారీచమ్ = ఆ మారీచుణ్ణి గూర్చి, అయుక్తమ్ = అయుక్తమైన, పరుషమ్ = పరుషమైన, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. రావణుడు కాలముచేత ప్రేరేపింపబడినవాడై, క్షేమకరములైన **హితవాక్యములు** చెప్పిన ఆ మారీచునితో పరుషములు, అయుక్తములు అయిన మాటలు పలికెను. 2

మూ. యత్కి్లైతదయుక్తార్థం మారీచ మయి కథ్యతే,
వాక్యం నిష్ఫలమత్యర్థముప్తం బీజమివోషరే. 3

ప్ర. అ. మారీచ = మారీచుడా! అయుక్తార్థమ్ = అయుక్తమైన అర్థము గల, యత్ = ఏ, ఏతత్ వాక్యమ్ = ఈ వాక్యము, మయి = నాయందు (నాతో), కథ్యతే = చెప్పబడుచున్నదో, అది, ఊషరే = చవటనేలయందు, ఉప్తమ్ = నాటబడిన, బీజమివ = విత్తనము వలె, అత్యర్థమ్ = మిక్కిలి, నిష్ఫలమ్ = వ్యర్థమైనది.

తా. మారీచుడా! నీ వేవో అయుక్తమైన అర్థము గల మాటలు నాతో చెప్పుచున్నావు! అవన్నీ చవటనేలలో వేసిన విత్తనము వలె వ్యర్థములు. 3

మూ. త్వద్వాక్యైర్న తు మాం శక్యం భేతుంరామస్య సంయుగే
పాపశీలస్య మూర్ఖస్య మానుషస్య విశేషతః. 4

ప్ర. అ. త్వద్వాక్యైః = నీ మాటలచేత, పాపశీలస్య = పాపస్వభావము కలవాడు, మూర్ఖస్య=మూర్ఖుడు, విశేషతః=విశేషించి, మానుషస్య=మానవుడూ అయిన, రామస్య = రామునకు, (రామునినుండి), మామ్ = నన్ను, సంయుగే= యుద్ధమునందు, భేతుమ్=భయపడుటకు (భయపెట్టుటకు), న శక్యమ్=శక్యము కాదు, ''భేత్తుమ్''అన్న దాక్షిణాత్యపాఠంలో అన్వయం కుదురుటలేదు).

తా. రాముడు పాపస్వభావము కలవాడు, మూర్ఖుడు. అన్నింటినీ మించి మానవమాత్రుడు. అట్టి రామునినుండి నీవు నీ మాటల ద్వారా నన్ను యుద్ధములో భయపెట్టజాలవు. 4

మూ. యస్త్యక్త్వా సుహృదో రాజ్యం మాతరం పితరం తథా,
స్త్రీవాక్యం ప్రాకృతం శ్రుత్వా వనమేకపదే గతః. 5

ప్ర. అ. యః=ఏ రాముడు, ప్రాకృతమ్=సాధారణమైన, స్త్రీవాక్యమ్= స్త్రీవాక్యమును, శ్రుత్వా = విని, సుహృదః = మిత్రులను, రాజ్యమ్ = రాజ్యమును, మాతరమ్ = తల్లిని, తథా = మరియు, పితరమ్ = తండ్రిని, త్యక్త్వా = విడచి, ఏకపదే = ఒక్క క్షణములో, వనమ్ = వనమును గూర్చి, గతః = వెళ్ళినాడో, (అతనినుండి భయపెటజాలవు).

తా. ఈ రాముడు ఒక ఆడదాని మాట విని, మిత్రులను, రాజ్యమును, తలిదండ్రులను విడచి హటాత్తుగా అరణ్యమునకు వెళ్ళిపోయినాడు. 5

మూ. అవశ్యం తు మయా తస్య సంయుగే ఖరఘాతినః, 6
ప్రాణైః ప్రియతరా సీతా హర్తవ్యా తవ సన్నిధౌ.

ప్ర. అ. సంయుగే = యుద్ధమునందు, ఖరఘాతినః = ఖరుణ్ణి చంపిన, తస్య = ఆతనియొక్క, ప్రాణైః = ప్రాణములచేత (కంటె), ప్రియతరా = ఎక్కువ ప్రియురాలైన, భార్యా = భార్యయైన, సీతా = సీత, తవ = నీయొక్క, సంనిధౌ = సమక్షమునందు, అవశ్యమ్ = తప్పక, మయా = నాచేత, హర్తవ్యా = హరించదగినది.

తా. యుద్ధములో ఖరుణ్ణి సంహరించిన ఆ రామునికి ప్రాణాలకంటె కూడ అధికముగా ప్రియురాలైన ఆతని భార్యను నేను నీ సాహాయ్యముతో హరించితీరెదను. 6

మూ. ఏవం మే నిశ్చితా బుద్ధిర్హృది మారీచ వర్తతే,
న వ్యావర్తయితుం శక్యా సేన్ద్రైరపి సురాసురైః. 7

ప్ర. అ. మారీచ = మారీచుడా! మే = నాయొక్క, బుద్ధిః = బుద్ధి, ఏవమ్ = ఇట్లు, నిశ్చితా = నిశ్చయింపబడినదై, హృది = హృదయమునందు, వర్తతే = ఉన్నది, సేన్ద్రైః = ఇంద్రునితో కూడిన, సురాసురైరపి = దేవాసురుల చేత కూడ, వ్యావర్తయితుమ్ = త్రిప్పుటకు, న శక్యా = శక్యమైనది కాదు.

తా. మారీచుడా! నా బుద్ధి, నా హృదయములో, ఈ విధముగా నిశ్చయింపబడి ఉన్నది. దీనిని సురాసురులు అందరు ఇంద్రునితో కలిసి వచ్చినా మార్చజాలరు. 7

మూ. దోషం గుణం వా సంపృష్టస్త్వమేవం వక్తుమర్హసి,
అపాయం వాప్యుపాయం వా కార్యస్యాస్య వినిశ్చయే. 8

ప్ర. అ. అస్య కార్యస్య = ఈ కార్యముయొక్క, వినిశ్చయే = నిశ్చయము
విషయమున, దోషమ్ = దోషమును గాని, గుణం వా = గుణమును గాని, అపా

యమ్=అపాయమును గాని, ఉపాయం వా=ఉపాయమును గాని, సంపృష్టః= అడగబడినట్లయితే, త్వమ్ = నీవు, ఏవమ్ = ఇట్లు, వక్తుమ్ = పలుకుటకు, అర్హసి = తగుదువు.

తా. ఈ కార్యమును నిర్ణయించే విషయములో దోష మేమి, గుణ మేమి అని గాని, ఉపాయ మేది, నష్ట మేది అని కాని నేను నిన్ను అడిగి యున్నట్లయితే నీ వీ విధముగా చెప్పుట యుక్తము (నేనట్లు అడగనప్పుడు నీ విట్లు మాట్లాడ కూడదు). 8

మూ. సంపృష్టేన తు వక్తవ్యం సచివేన విపశ్చితా,
ఉద్యతాఞ్జలినా రాజ్ఞే య ఇచ్ఛేద్భూతిమాత్మనః. 9

ప్ర. అ. యః = ఎవ్వడు, ఆత్మనః = తనకు, భూతిమ్ = ఐశ్వర్యమును, ఇచ్ఛేత్ = కోరునో, అట్టి, సంపృష్టేన = అడగబడిన, విపశ్చితా = పండితుడైన, సచివేన = మంత్రిచేత, ఉద్యతాఞ్జలినా = ఎత్తబడిన దోసిలి కలవాడై ఉండి, రాజ్ఞే = రాజునకు, వక్తవ్యమ్ = చెప్పదగినది.

తా. తన అభివృద్ధిని కోరు బుద్ధిమంతుడైన మంత్రి, రాజు ఏదైన అడిగి నప్పుడు దోసిలి కట్టి సవినయముగా సమాధానము చెప్పవలెను. 9

మూ. వాక్యమప్రతికూలం తు మృదుపూర్వం హితం శుభమ్,
ఉపచారేణ యుక్తం చ వక్తవ్యో వసుధాధిపః. 10

ప్ర. అ. వసుధాధిపః = రాజు, అప్రతికూలమ్ = ప్రతికూలము కానిది, మృదుపూర్వమ్=మృదువైన మాటలు పూర్వమునందు కలది, హితమ్=హితము, శుభమ్ = శుభకరము, ఉపచారేణ=వినయముతో, యుక్తమ్ = కూడినది అయిన, వాక్యమ్ = వాక్యమును, వక్తవ్యః = చెప్పదగినవాడు.

తా. రాజుతో చెప్పే మాటలు ప్రతికూలము కానివి, మృదువైనవి, హితములు, శుభకరములు, వినయముతో కూడినవి అయిఉండవలెను. 10

మూ. సావమర్దం తు యద్వాక్యం మారీచ హితముచ్యతే,
నాభినన్దతి తద్రాజా మానార్హో మానవర్జితమ్. 11

ప్ర. అ. మారీచ = మారీచా! మానవర్జితమ్ = గౌరవముతో శూన్యమైన, యత్ = ఏ, హితమ్=హితమైన, వాక్యమ్=వాక్యము, సావమర్దమ్=తిరస్కార పూర్వకముగా, ఉచ్యతే = చెప్పబడునో, తత్ = దానిని, మానార్హః = గౌరవమునకు తగిన, రాజా = రాజు, న అభినన్దతి = అభినందించదు.

తా. మారీచుడా! ఎంత హితమైన వాక్యమైనను, గౌరవభావము లేకుండగా, తిరస్కారబుద్ధితో చెప్పినచో, దానిని, గౌరవార్హుడైన రాజు అభినందించడు. 11

మూ. పఞ్చ రూపాణి రాజానో ధారయన్త్యమితౌజసః,
అగ్నేరిన్ద్రస్య సోమస్య వరుణస్య యమస్య చ. 12

ప్ర. అ. అమితౌజసః = అపరిమితమైన తేజస్సు గల, రాజానః=రాజులు అగ్నేః = అగ్నియొక్క, ఇన్ద్రస్య = ఇంద్రునియొక్క, సోమస్య = చంద్రుని యొక్క, వరుణస్య = వరుణుని యొక్క, యమస్య చ = యమునియొక్క, పఞ్చ = ఐదు, రూపాణి = రూపాలను, ధారయన్తి = ధరించుచున్నారు.

తా. అపరిమితమైన తేజస్సు గల రాజులలో అగ్ని, ఇంద్రుడు, చంద్రుడు వరుణుడు, యముడు అను ఐదుగురు దేవతల అంశములు ఉండును. 12

వి. "అగ్నేరిన్ద్రస్య సోమస్య యమస్య ధనదస్య చ"అని ప్రాచ్యపాఠము.

మూ. ఔష్ణ్యం తథా విక్రమం చ సౌమ్యం దణ్డం ప్రసన్నతామ్,
ధారయన్తి మహాత్మానో రాజానః క్షణదాచర. 13
తస్మాత్సర్వాస్వవస్థాసు మాన్యాః పూజ్యాశ్చ పార్థివాః.

ప్ర. అ. క్షణదాచర = ఓ! రాక్షసుడా! మహాత్మానః = మహాత్ములైన, రాజానః = రాజులు, ఔష్ణ్యమ్ = వేడిని, తథా = మరియు, విక్రమం చ = పరాక్రమమును, సౌమ్యమ్ = సౌమ్యత్వమును, దణ్డమ్ = దండమును, ప్రసన్నతామ్=ప్రసన్నత్వమును, ధారయన్తి=ధరించుచున్నారు. తస్మాత్=ఆకారణము వలన, పార్థివాః = రాజులు, సర్వాసు = సమస్తమైన, అవస్థాసు=అవస్థలయందు, మాన్యాః = గౌరవింపదగినవారు, పూజ్యాశ్చ = పూజింపదగినవారుకూడ.

తా. మారీచా! మహాత్ములైన రాజులలో అగ్నిదేవుని ఉష్ణత్వము, ఇంద్రుని పరాక్రమము, చంద్రుని సౌమ్యత్వము, యముని దండమును, వరుణుని ప్రసన్నత్వము ఉండును. అందుచేత రాజులను సర్వదా గౌరవించి పూజించవలెను.

వి. పైన చూపిన ప్రాచ్యపాఠము బాగున్నది. అక్కడ చెప్పిన దేవతల వరుసలో "ఉష్ణత్వము, పరాక్రమము, సౌమ్యత్వము, దండము, ప్రసన్నత్వము రాజులలో ఉండు"నని తాత్పర్యము. ఈ శ్లోకము ప్రాచ్యపాఠములో లేదు. ఆ దేవతల వలె రాజులు కూడ నిగ్రహానుగ్రహసమర్థు లని మరొక శ్లోక మున్నది.

మూ. త్వం తు ధర్మమవిజ్ఞాయ కేవలం మోహమాస్థితః, 14
అభ్యాగతం మాం దౌరాత్మ్యాత్పరుషం వక్తుమిచ్ఛసి.

ప్ర: అ. త్వం తు = నీవైతే, ధర్మమ్ = ధర్మమును, అవిజ్ఞాయ = తెలుసుకొనక, కేవలమ్ = కేవలము, మోహమ్ = అజ్ఞానమును, అస్థితః = అవలంబించినవాడవై, అభ్యాగతమ్ = నీ యింటికి వచ్చిన, మామ్ = నన్ను గూర్చి, దౌరాత్మ్యాత్ = దుష్టబుద్ధివలన, పరుషమ్ = పరుషముగా, వక్తుమ్ = పలుకుటకు, ఇచ్ఛసి = కోరుచున్నావు.

తా. కాని నీవు ఈ ధర్మమును గుర్తించక కేవలము అజ్ఞానముచేత దుష్టబుద్ధి కలవాడవై, నీ యింటికి వచ్చిన నాతో పరుషముగా మాటలాడుచున్నావు. 14

మూ. గుణదోషౌ న పృచ్ఛామి క్షమం చాత్మని రాక్షస,
మయోక్తం తవ చైతావత్సంప్రత్యమితవిక్రమ. 15

ప్ర. అ. రాక్షస = మారీచా! గుణదోషౌ = గుణదోషములను గాని, ఆత్మని = నా విషయమున, క్షమమ్ = ఏది తగును అను విషయమును గాని, న పృచ్ఛామి = అడుగుట లేదు. అమితవిక్రమ = కొలవ శక్యము కాని పరాక్రమము గలవాడా! సంప్రతి = ఇప్పుడు, తవ = నీకు, ఏతావత్ = ఇంత మాత్రము, మయా = నా చేత, ఉక్తమ్ = చెప్పబడినది.

తా. అపరిమిత మైన పరాక్రమము గల మారీచా! ఈ పని మంచిదా, చెడదా అని గాని, నాకి విషయమునందు సామర్థ్యము ఉన్నదా లేదా అని కాని

నేను నిన్ను అడుగుటలేదు. నేను నిన్ను అడిగిన దల్లా ఈ కార్యమునందు నాకు సాహాయ్యము చేయు మని మాత్రమే. 15

మూ. అస్మింస్తు త్వం మహాకృత్యే సాహాయ్యం కర్తుమర్హసి,
శృణు తత్కార్మ సాహాయ్యే యత్కార్యం వచనాన్మమ.

ప్ర. అ. అస్మిన్ = ఈ, మహాకృత్యే = గొప్ప కార్యమునందు, త్వమ్ = నీవు, సాహాయ్యమ్ = సాహాయ్యమును, కర్తుమ్ = చేయుటకు, అర్హసి = తగియున్నావు. మమ = నాయొక్క, వచనాత్ = వచనమువలన, సాహాయ్యే = సాహాయ్యమునందు, యత్ = ఏది, కార్యమ్ = చేయగగినదో, తత్ = ఆ, కర్మ = పనిని, శృణు = వినుము.

తా. నేను చేయ తలపెట్టిన ఈ మహాకార్యమునందు నీవు సాహాయ్యము చేయవలెను. నా ఆజ్ఞ ప్రకారము, నా సాహాయ్యమునకై నీవేమి చేయవలెనో వినుము. 16

మూ. సౌవర్ణస్త్వం మృగో భూత్వా చిత్రో రజతబిన్దుభిః,
ఆశ్రమే తస్య రామస్య సీతాయాః ప్రముఖే చర,
ప్రలోభయిత్వా వైదేహీం యథేష్టం గన్తుమర్హసి. 18

ప్ర. అ. త్వమ్ = నీవు, రజతబిన్దుభిః = వెండి చుక్కలచేత, చిత్రః = చిత్రమైన, సౌవర్ణః = బంగారము వికారమైన, మృగః = మృగముగా; భూత్వా = అయి, తస్య = ఆ, రామస్య = రామునియొక్క, ఆశ్రమే = ఆశ్రమమునందు, సీతాయాః = సీతయొక్క, ప్రముఖే = ఎదుట, చర = సంచరించుము. వైదేహీమ్ = సీతను, ప్రలోభయిత్వా = లోభపెట్టి, యథేష్టమ్ = నీకు ఇష్టము వచ్చినట్లు, గన్తుమ్ = వెళ్ళుటకు, అర్హసి = తగియున్నావు.

తా. నీవు వెండి చుక్కలచేత చిత్రవర్ణమైన బంగారు లేడి రూపము ధరించి, రాముని ఆశ్రమములో సీత ఎదుట సంచరించవలెను. ఆమెకు ఆసక్తి కలిగించి ఆటుపిమ్మట నీ కిష్టమైన చోటికి వెళ్ళిపోవచ్చును. 17,18

మూ. త్వాం తు మాయామృగం దృష్ట్వా కాఞ్చనం జాతవిస్మయా
ఆనయైనమితి క్షిప్రం రామం వక్ష్యతి మైథిలీ. 19

ప్ర. అ. మైథిలీ = సీత, కాఞ్చనమ్ = బంగారు, మాయామృగమ్ = మాయామృగమైన, త్వామ్ = నిన్ను, దృష్ట్వా = చూచి, జాతవిస్మయా = పుట్టిన ఆశ్చర్యము కలదై, ఏనమ్ = దీనిని, క్షిప్రమ్ = శీఘ్రముగా, ఆనయ = తీసికొని రమ్ము, ఇతి = అని, రామమ్ = రాముణ్ణి గూర్చి, వక్ష్యతి = చెప్పగలదు.

తా. బంగారు మాయామృగము రూపములో ఉన్న నిన్ను చూచి సీత, ఆశ్చర్యభరితురాలై, "ఈ మృగమును శీఘ్రముగా పట్టి తీసికొనిరమ్ము" అని రాముణ్ణి అడగగలదు. 19

మూ. అపక్రాన్తే తు కాకుత్స్థే దూరం యాత్వాప్యుదాహర,
హా సీతే లక్ష్మణేత్యేవం రామవాక్యానురూపకమ్. 20

ప్ర. అ. కాకుత్స్థే = రాముడు, అపక్రాన్తే = బైటకు వచ్చినవాడగుచుండగా, దూరమ్ = దూరముగా, యాత్వా = వెళ్ళి, రామవాక్యానురూపకమ్ = రాముని మాటలకు అనురూపముగా, హా సీతే = అయ్యో! సీతా! హా లక్ష్మణ = అయ్యో! లక్ష్మణా! ఇత్యేవమ్ = ఇట్లు, ఉదాహర అపి = పలుకుము కూడ.

తా. రాముడు ఆశ్రమమునుండి బైటకు వచ్చిన తరువాత, నీ వింకా దూరము వెళ్ళి, రాముని కంఠధ్వని ఏ విధముగా ఉండునో ఆ విధముగా "అయ్యో! సీతా! అయ్యో! లక్ష్మణా!'' అని అరపులు కూడ అరువుము. 20

మూ. తచ్ఛ్రుత్వా రామపదవీం సీతయా చ ప్రచోదితః,
అనుగచ్ఛతి సంభ్రాన్తః సౌమిత్రిరపి సౌహృదాత్. 21

ప్ర. అ. సౌమిత్రిరపి = లక్ష్మణుడు కూడ, తత్ = దానిని. శ్రుత్వా = విని, సీతయా చ = సీతచేత కూడ, ప్రచోదితః = ప్రేరేపించబడినవాడై, సంభ్రాన్తః = కంగారుపడుచున్నవాడై, సౌహృదాత్ = రామునిమీద నున్న ప్రేమవలన, రామపదవీమ్ = రాముని మార్గమును, అనుగచ్ఛతి = అనుసరించును.

తా. లక్ష్మణుడు కూడ ఆ అరపులు వినును. అప్పుడు సీత ప్రేరేపించగా ఆతడు కంగారుపడుచు, రామునిమీద ఉన్న ప్రేమవలన రాముడు వెళ్ళిన మార్గమునందు అతనిని వెదకుచు వెళును. 21

మూ. అపక్రాన్తే చ కాకుత్స్థే లక్ష్మణే చ యథాసుఖమ్,
ఆనయిష్యామి వైదేహీం సహస్రాక్షః శచీమివ. 22

ప్ర. అ. కాకుత్స్థే = రాముడు, లక్ష్మణే చ = లక్ష్మణుడు, అపక్రాన్తే = దూరముగా వెళ్ళిపోగా, వైదేహీమ్ = సీతను, సహస్రాక్షః = దేవేంద్రుడు, శచీమివ = శచీదేవినివలె, యథాసుఖమ్ = సుఖముగా, ఆనయిష్యామి = తీసికొని వచ్చెదను. 22

తా. రాముడు, లక్ష్మణుడు దూరముగా వెళ్లిపోయిన పిమ్మట, దేవేంద్రుడు శచీదేవిని వలె సీతను అనాయాసముగా తీసికొనివచ్చెదను. 22

మూ. ఏవం కృత్వా త్విదం కార్యం యథేష్టం గచ్ఛ రాక్షస,
రాజ్యస్యార్ధం ప్రయచ్ఛామి మారీచ తవ సువ్రత. 23

ప్ర. అ. రాక్షస = మారీచుడా! ఇదమ్ = ఈ, కార్యమ్ = కార్యమును, ఏవమ్ = ఇట్లు, కృత్వా = చేసి, యథేష్టమ్ = నీ ఇష్టము వచ్చినట్లుగా, గచ్ఛ = వెళ్లుము. సువ్రత = మంచి వ్రతములు కలవాడా! మారీచ = ఓ! మారీచా! తవ = నీకు, రాజ్యస్య = రాజ్యముయొక్క, అర్ధమ్ = అర్ధమును, ప్రయచ్ఛామి = ఇచ్చెదను.

తా. మంచి వ్రతములు గల ఓ! మారీచా! నీవు ఈ పని చేసిన పిమ్మట నీ కిష్టము వచ్చినట్లుగా వెళ్లిపోవచ్చును. నీకు నా రాజ్యములో సగము ఇచ్చెదను. 23

మూ. గచ్ఛ సౌమ్య శివం మార్గం కార్యస్యాస్య వివృద్ధయే,
అహం త్వానుగమిష్యామి సరథో దణ్డకావనమ్. 24

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా! అస్య = ఈ, కార్యస్య = కార్యముయొక్క, వివృద్ధయే = అభివృద్ధికొరకు, శివమ్ = మంగళకరమైన, మార్గమ్ = మార్గమును గూర్చి, గచ్ఛ = వెళ్ళుము. అహమ్ = నేను, సరథః = రథముతో కూడినవాడనై, దణ్డకావనమ్ = దండకావనమును గూర్చి, అనుగమిష్యామి = అనుసరించి వచ్చెదను.

తా. సౌమ్యుడా! ఈ కార్యమును సాధించుటకు వెళ్ళుము. నీ మార్గము మంగళకర మగుగాక! నేను రథము నెక్కి నీ వెనుకను వచ్చెదను. 24

మూ. ప్రాప్య సీతామయుద్ధేన వఞ్చయిత్వా తు రాఘవమ్,
లఙ్కాం ప్రతిగమిష్యామి కృతకార్యః సహ త్వయా.

ప్ర. అ. రాఘవమ్ = రాముణ్ణి, వఞ్చయిత్వా = వంచించి, సీతామ్ = సీతను, అయుద్ధేన = యుద్ధములేకుండగానే, ప్రాప్య = పొంది, కృతకార్యః = చేయబడిన కార్యము గలవాడనై, త్వయా సహ = నీతో కూడ, లఙ్కాం ప్రతి = లంకను గూర్చి, గమిష్యామి = వెళ్లగలను.

తా. ఈ విధముగ రాముణ్ణి వంచించి, యుద్ధము చేయకుండగనే సీతను పొంది, కృతకృత్యుడనై నీతో కలిసి లంకకు తిరిగి వెళ్ళెదను. 25

మూ. న చేత్కరోషి మారీచ హన్మి త్వామహమద్య వై,
ఏతత్కార్యమవశ్యం మే బలాదపి కరిష్యసి,
రాజ్ఞో హి ప్రతికూలస్థో న జాతు సుఖమేధతే. 26

ప్ర. అ. మారీచ = మారీచుడా! న కరోషి చేత్ = ఇట్లు చేయకపోయినచో, అహమ్ = నేను, అద్య వై = ఇప్పుడే, హన్మి = చంపివేయుదును. మే = నాయొక్క, ఏతత్ = ఈ, కార్యమ్ = కార్యమును, బలాదపి = బలాత్కారము వలననైనను, అవశ్యమ్ = అవశ్యము, కరిష్యసి = చేయగలవు. రాజ్ఞః = రాజునకు, ప్రతికూలస్థః = ప్రతికూలముగా ఉన్నవాడు, జాతు = ఎన్నడును, సుఖమ్ = సుఖముగా, న ఏధతే హి = వృద్ధి పొందడు కదా!

తా. మారీచా! నేను చెప్పినట్లు చేయకపోయినచో నిన్ను ఇప్పుడే చంపి వేసెదను. ఈ కార్యమును బలాత్కారముచేతనైనా నీచేత చేయించెదను. రాజునకు ప్రతికూలముగా ఉన్నవాడు సుఖముగా అభివృద్ధి చెందజాలడను విషయము తెలిసికొనుము. 26

మూ. ఆసాద్య తం జీవితసంశయస్తే
మృత్యుర్ధ్రువో హ్యద్య మయా విరుధ్య,
ఏతద్యథావత్ప్రతిగృహ్య బుద్ధ్యా
యదత్ర పథ్యం కురు తత్తథా త్వమ్. 27

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకియే ఆదికావ్యే అరణ్యకాణ్డే
చత్వారింశః సర్గః.

ప్ర. అ. తమ్ = ఆ రాముణ్ణి, ఆసాద్య = పొంది, తే = నీకు, జీవిత సంశయః = జీవితమునందు సంశయము. మయా = నాతో, విరుధ్య=విరోధము పెట్టుకొని, అద్య = ఇప్పుడు. మృత్యుః = మృత్యువు, ధ్రువః = నిశ్చితము. ఏతత్ = దీనిని, బుద్ధ్యా = బుద్ధిచేత, యథావత్ = తగు విధముగా, ప్రతిగృహ్య = గ్రహించి, అత్ర = ఈ విషయమునందు, యత్=ఏది, పథ్యమ్=హితమో, తత్ = దానిని, త్వమ్ = నీవు, తథా = అట్లు, కురు = చేయుము.

తా. నీవు రామునివద్దకు వెళ్ళినచో మరణించవచ్చును. మరణించక పోవచ్చును. నాతో విరోధము పెట్టుకొన్నచో ఇప్పుడే నీకు మరణము తప్పదు. అందుచేత ఈ విషయమునందు బాగుగా ఆలోచించుకొని నీకు ఏది హితమో ఆ పని చేయుము. 27

బాలానందిని''అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో
నలుబదవ సర్గ సమాప్తము.

అథ ఏకచత్వారింశః సర్గః

["నీకు వినాశము కలుగును" అని భయపెట్టుచు మారీచుడు మరల రావణునకు ఉపదేశించుట].

మూ. ఆజ్ఞప్తో రాజవద్వాక్యం ప్రతికూలం నిశాచరః,
అబ్రవీత్పరుషం వాక్యం మారీచో రాక్షసాధిపమ్. 1

("ఆజ్ఞప్తో రావణేనేత్థం ప్రతికూలం చ రాజవత్" అను గోరఖ్‌పూర్ ప్రతి పాఠము బాగున్నది).

ప్ర. అ. రావణేన = రావణునిచేత, ఇత్థమ్ = ఈవిధముగా, ప్రతికూలమ్ = ప్రతికూలముగా, రాజవత్ = రాజుగా, ఆజ్ఞప్తః = ఆజ్ఞాపించబడిన, మారీచః = మారీచుడు, రాక్షసాధిపమ్ = రావణుని గూర్చి, పరుషమ్ = పరుషమైన, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. ఈ విధముగా రావణుడు, రాజుగా తనకు ఇష్టము కాని పని చేయటకు ఆజ్ఞాపించగా, మారీచుడు ఆ రావణునితో పరుషమైన వాక్యము పలికెను. 1

మూ. కేనాయముపదిష్టస్తే వినాశః పాపకర్మణా,
సపుత్రస్య సరాష్ట్రస్య సామాత్యస్య నిశాచర. 2

ప్ర. అ. నిశాచర = రావణా! సపుత్రస్య = పుత్రసహితుడవు, సరాష్ట్రస్య = రాష్ట్రసహితుడవు, సామాత్యస్య = అమాత్యసహితుడవు అయిన, తే = నీ యొక్క, అయమ్ = ఈ, వినాశః = వినాశము, పాపకర్మణా = పాపాత్ముడైన, కేన = ఎవనిచేత, ఉపదిష్టః = ఉపదేశించబడినది?

తా. రావణా! నీవు, నీ పుత్రులు, నీ రాష్ట్రము, నీ అమాత్యులు— ఈ అందరూ నశించే పని నీకు ఏ పాపాత్ముడు ఉపదేశించినాడు? 2

మూ. కస్త్వయా సుఖినా రాజన్నాభినన్దతి పాపకృత్,
కేనేదముపదిష్టం తే మృత్యుద్వారముపాయతః. 3

ప్ర. అ. రాజన్ = ఓ ! రాజా ! కః = ఏ, పాపకృత్ = పాపాత్ముడు, సుఖినా = సుఖవంతుడవైన, త్వయా = నీచేత, నాభినన్దతి = సంతోషించుటలేదు? మృత్యుద్వారమ్ = మృత్యువునకు ద్వారమైన, ఇదమ్ = ఈ కార్యము, కేన = ఎవనిచేత, తే = నీకు, ఉపాయతః = ప్రయత్నపూర్వకముగా, ఉపదిష్టమ్ = ఉపదేశింపబడినది ?

తా. రాజా ! నీవు సుఖముగా ఉండుట చూచి ఏ పాపాత్ముడు సహించలేకున్నాడు ? మృత్యువునకు ద్వారమైన ఈ పని నీకు ప్రయత్నపూర్వకముగా ఉపదేశించినవాడు ఎవడు ? 3

మూ. శత్రవస్తవ నిఃశఙ్కం హీనవీర్యా నిశాచరాః,
ఇచ్ఛన్తి త్వాం వినశ్యన్తముపరుద్ధం బలీయసా. 4

ప్ర. అ. తవ = నీయొక్క, శత్రవః = శత్రువులు, హీనవీర్యాః = అల్పమైన పరాక్రమము కలవారు అయిన, నిశాచరాః = రాక్షసులు, త్వామ్ = నిన్ను, బలీయసా = అధికమైన బలము గలవానిచేత, ఉపరుద్ధమ్ = ఎదుర్కొనబడినవానినిగాను, వినశ్యన్తమ్ = నశించుచున్న వానినిగాను, ఇచ్ఛన్తి=కోరుచున్నారు. నిఃశఙ్కమ్=సందేహము లేదు.

తా. నిస్సందేహముగా, నీకు శత్రువులూ, అల్పపరాక్రమవంతులూ అయిన ఆ రాక్షసు లెవరో, నీవు అధికబలవంతుడైన ఆ రామునిచేతిలో నశించగా చూడవలె నని కోరుచున్నారు. 4

మూ. కేనేదముపదిష్టం తే క్షుద్రేణాహితవాదినా,
యస్త్వామిచ్ఛతి నశ్యన్తం స్వకృతేన నిశాచర. 5

ప్ర. అ. నిశాచర = రావణా; యః = ఎవడు, త్వామ్ = నిన్ను, స్వకృతేన = స్వయముగా చేసిన పనిచేత నశ్యన్తమ్ = నశించుచున్నవానినిగా, ఇచ్ఛతి = కోరుచున్నాడో, అటి, క్షుద్రేణ = నీచుడు, అహితవాదినా = అహితమును

చెప్పువాడు ఆయిన, కేన = ఎవనిచేత, ఇదమ్ = ఇది, తే = నీకు, ఉపదిష్టమ్= ఉపదేశించబడినది?

తా. రావణా! స్వకృతాపరాధముచేతనే నీవు నశించవలె నని కోరుచు, హితము కాని ఈ పని చేయు మని నీకు ఉపదేశించిన ఆ నీచుడు ఎవడు? 5

మూ. వధ్యాః ఖలు న హన్యన్తే సచివాస్తవ రావణ,
యే త్వాముత్పథమారూఢం న నిగృహ్ణన్తి సర్వశః. 6

ప్ర. అ. రావణ = రావణా! ఉత్పథమ్ = అమార్గమును, ఆరూఢమ్ = ఎక్కిన, త్వామ్ = నిన్ను, యే = ఎవరు, సర్వశః = అన్ని విధముల, న నిగృహ్ణన్తి = నిగ్రహించుటలేదో, అట్టి, తవ సచివాః = నీ మంత్రులు, వధ్యాః ఖలు = వధించతగినవారు కదా. న హన్యన్తే = చంపబడుటలేదు.

తా. రావణా! నీవు అమార్గములో వెళ్ళుచున్నప్పుడు నిన్ను అన్ని విధములా అడ్డగించుట నీ మంత్రుల కర్తవ్యము. అట్లు చేయకపోవుటచే ఆ మంత్రులు చంపదగినవారు. కాని వారిని అట్లు చంపుట జరగలేదు. 6

మూ. అమాత్యైః కామవృత్తో హి రాజా కాపథమాశ్రితః,
నిగ్రాహ్యః సర్వథా సద్భిర్న నిగ్రాహ్యో నిగృహ్యసే. 7

ప్ర. అ. కామవృత్తః = స్వేచ్ఛగా ప్రవర్తించుచు, కాపథమ్ = చెడ్డ మార్గమును, ఆశ్రితః = ఆశ్రయించిన, రాజా = రాజు, సద్భిః = మంచివారైన, అమాత్యైః = మంత్రులచేత, సర్వథా = అన్ని విధములా, నిగ్రాహ్యః హి=నిగ్రహింపదగినవాడు కదా. నిగ్రాహ్యః=ఆ విధముగా నిగ్రహింపబడదగిన నీవు, న నిగృహ్యసే = నిగ్రహింపబడుటలేదు.

తా. స్వేచ్ఛగా ప్రవర్తించుచు, అమార్గమును అవలంబించిన రాజును అన్ని విధాల ఉత్తము లైన మంత్రులు నిగ్రహించవలెను. కాని నిగ్రహించుటకు తగిన నిన్ను నీ మంత్రులు నిగ్రహించుటలేదు! 7

మూ. ధర్మమర్థం చ కామం చ యశశ్చ జయతాం వర,
స్వామిప్రసాదాత్సచివాః ప్రాప్నువన్తి నిశాచర. 8

ప్ర. అ. జయతామ్ = జయించేవారిలో, వర = శ్రేష్ఠుడా! నిశాచర = ఓ! రావణా! సచివాః = మంత్రులు, ధర్మమ్ = ధర్మమును, అర్థం చ = అర్థమును, కామం చ = కామమును, యశశ్చ = కీర్తిని, స్వామిప్రసాదాత్ = ప్రభువు యొక్క అనుగ్రహమునలననే, ప్రాప్నువన్తి = పొందుచున్నారో.

తా. విజయవంతులలో శ్రేష్ఠుడవైన ఓ! రావణా! మంత్రులకు ధర్మము, అర్థము, కామము, యశస్సు ప్రభువు వలననే లభించును. 8

మూ. విపర్యయే తు తత్సర్వం వ్యర్థం భవతి రావణ,
వ్యసనం స్వామివైగుణ్యాత్ప్రాప్నువన్తీతరే జనాః. 9

ప్ర. అ. రావణ = రావణా! విపర్యయే = విపరీతముగా ఉన్నప్పుడు, తత్ = అది, సర్వమ్ = అంతా, వ్యర్థం భవతి = వ్యర్థము అగును. స్వామివైగుణ్యాత్ = ప్రభువుయొక్క చెడ్డతనమువలన, ఇతరే జనాః = ఇతరులైన జనులు, వ్యసనమ్ = వ్యసనమును, ప్రాప్నువన్తి = పొందుదురు.

తా. రావణా! రాజు విపరీతముగా ప్రవర్తించినచో ఇదంతా వ్యర్థమై పోవును. ప్రభువు చెడ్డవాడైనచో ప్రజలందరూ కష్టముల పాలగుదురు. 9

మూ. రాజమూలో హి ధర్మశ్చ జయశ్చ జయతాం వర,
తస్మాత్సర్వాస్వవస్థాసు రక్షితవ్యా నరాధిపాః. 10

ప్ర. అ. జయతామ్ = జయించువారిలో, వర = శ్రేష్ఠుడా! ధర్మశ్చ = ధర్మము, జయశ్చ = జయము, రాజమూలః హి = రాజే మూలముగా కలది కదా, తస్మాత్ = ఆ కారణమువలన, సర్వాసు = సమస్తమైన, అవస్థాసు = అవస్థలయందు, నరాధిపాః = రాజులు, రక్షితవ్యాః = రక్షించదగినవారు.

తా. విజయవంతులలో శ్రేష్ఠుడవైన ఓ! రావణా! ధర్మానికీ, జయానికీ కూడ మూలము రాజే. అందుచే అన్ని పరిస్థితులలోను రాజును రక్షించుకొనవలెను. 10

మూ. రాజ్యం పాలయితుం శక్యం న తీక్ష్ణేన నిశాచర,
న చాపి ప్రతికూలేన నావినీతేన రాక్షస. 11

ప్ర. అ. రాక్షస = రాక్షసుడవైన, నిశాచర = రావణా ! తీక్ష్ణేన = తీక్ష్ణముగా ప్రవర్తించు రాజుచేత, రాజ్యమ్ = రాజ్యము, పాలయితుమ్ = పాలించుటకు, న శక్యమ్ = శక్యము కాదు. ప్రతికూలేన = ప్రతికూలముగా ప్రవర్తించువానిచేత, న = శక్యము కాదు. అవినీతేన = వినయము లేనివానిచేత కూడ, న = శక్యముకాదు.

తా. రావణా! తీక్ష్ణమైన స్వభావము కలవాడు గాని, ప్రజలకు ప్రతికూలముగా ప్రవర్తించువాడుగాని, వినయము లేనివాడు గాని రాజ్యమును పాలింపజాలడు. 11

మూ. యే తీక్ష్ణమన్త్రాః సచివా భజ్యన్తే సహ తేన వై,
విషమే తురగాః శీఘ్రా మన్దసారథయో యథా. 12

ప్ర. అ. యే = ఏ, సచివాః = మంత్రులు; తీక్ష్ణమన్త్రాః = తీక్ష్ణమైన ఆలోచనలు కలవారో, వాళ్లు, మన్దసారథయః = అసమర్థుడైన సారథి గల, శీఘ్రాః = వేగముగా పరుగెత్తు, తురగాః = గుఱ్ఱములు, విషమే యథా = విషమ ప్రదేశమునందు వలె, తేన సహ = ఆ రాజుతో కూడ, భజ్యన్తే వై = భగ్నులు అగుదురు.

తా. అసమర్థుడైన సారథి నడుపగా మహావేగముగా పరుగెత్తుచున్న గుఱ్ఱములు ఎగుడుదిగుడుగా ఉన్న ప్రదేశములో ఆ సారథితోపాటు దెబ్బతినును. అట్లే, తీక్ష్ణములైన ఆలోచనలు గల మంత్రులు తమ రాజుతో సహా నశింతురు.

మూ. బహవః సాధవో లోకే యుక్తా ధర్మమనుష్ఠితాః,
పరేషామపరాధేన వినష్టాః సపరిచ్ఛదాః. 13

ప్ర. అ. లోకే = లోకమునందు, యుక్తాః = సన్మార్గమునందున్నవారు, ధర్మమ్ = ధర్మమును, అనుష్ఠితాః = అనుసరించిఉన్నవారు అయిన, బహవః = అనేకులైన, సాధవః = సత్పురుషులు, పరేషామ్ = ఇతరులయొక్క, అపరాధేన = అపరాధముచేత, సపరిచ్ఛదాః = పరివారసమేతులై, వినష్టాః = నశించినారు.

తా. ఈ లోకములో, సన్మార్గమునందు నడచుచు, ధర్మమును ఆచరించుచు ఉన్న ఎందరో సత్పురుషులు ఇతరులు చేసిన అపరాధముల మూలమున సపరివారముగా నశించినారు. 13

మూ. స్వామినా ప్రతికూలేన ప్రజా స్తీక్ష్ణేన రావణ,
రక్ష్యమాణా న వర్ధన్తే మేషా గోమాయునా యథా. 14

ప్ర. అ. రావణ = రావణా! ప్రతికూలేన = ప్రతికూలమైనవాడు, తీక్ష్ణేన = తీక్ష్ణస్వభావము కలవాడు అయిన, స్వామినా = ప్రభువుచేత, రక్ష్యమాణాః = రక్షింపబడుచున్న, ప్రజాః = ప్రజలు, గోమాయునా = నక్కచేత రక్షింపబడుచున్న, మేషాః యథా = గొఱ్ఱెల వలె, న వర్ధన్తే = వృద్ధి పొందరు.

తా. రావణా! ప్రతికూలుడు, తీక్ష్ణస్వభావము గలవాడు అయిన ప్రభువు పరిపాలనలో ఉన్న ప్రజలు, నక్కచేత రక్షింపబడుచున్న గొఱ్ఱెల వలె వృద్ధి పొందరు. 14

మూ. అవశ్యం వినశిష్యన్తి సర్వే రావణ రాక్షసాః,
యేషాం త్వం కర్కశో రాజా దుర్బుద్ధిరజితేన్ద్రియః. 15

ప్ర. అ. రావణ = రావణా! యేషామ్ = ఏ రాక్షసులకు, కర్కశః = క్రూరుడవు, దుర్బుద్ధిః = దుర్బుద్ధి కలవాడవు, అజితేన్ద్రియః = జయింపబడని ఇంద్రియములు కలవాడవు అయిన, త్వమ్ = నీవు, రాజా = రాజువో, అట్టి, సర్వే = సమస్తమైన, రాక్షసాః = రాక్షసులు, అవశ్యమ్ = తప్పక, వినశిష్యన్తి = నశించగలరు.

తా. రావణా! ఏ రాక్షసులకు క్రూరుడవు, దుర్బుద్ధివి, ఇంద్రియములను జయింపజాలనివాడవు అయిన నీవు రాజుగా ఉన్నావో ఆ రాక్షసు లందరు, తప్పక నశించగలరు. 15

మూ. తదిదం కాకతాళీయం ఘోరమాసాదితం మయా,
అత్ర కిం శోచనీయస్త్వం ససైన్యో వినశిష్యసి. 16

ప్ర. అ. మయా = నాచేత, కాకతాళీయమ్ = కాకతాళీయముగా, ఘోరమ్ = భయంకరమైన, తత్ = ఆ, ఇదమ్ = ఇది, ఆసాదితమ్ = పొందబడినది. అత్ర = ఈ విషయమునందు, కిమ్ = ఏమున్నది ? త్వమ్ = నీవు, శోచనీయః = విచారించదగినవాడవు, ససైన్యః = సేనాసహితుడవై, వినశిష్యసి = నశించ గలవు.

తా. నాకు ఆకస్మికముగా ఇప్పు డీ ఆపద వచ్చి పడినది. ఇందుకు నాకేమీ విచారము లేదు. నిన్ను గూర్చియే నాకు విచారము. ఎందుచేత ననగా నీవు సైన్యముతో సహా నశించనున్నావు. 16

మూ. మాం నిహత్య తు రామస్తు న చిరాత్త్వాం వధిష్యతి,
అనేన కృతకృత్యోఽస్మి మ్రియేయమరిణా హతః. 17

ప్ర. అ. రామః = రాముడు, మామ్ = నన్ను, నిహత్య = చంపి, నచిరాత్ = కొద్ది కాలములో, త్వామ్ = నిన్ను, వధిష్యతి = చంపగలడు. అరిణా = శత్రువుచేత, హతః = చంపబడినవాడనై, మ్రియేయమ్ = మరణింతును; అనేన = ఈ కారణముచేత, కృతకృత్యః = కృతకృత్యుడను, అస్మి = అవుచున్నాను.

తా. నన్ను చంపిన కొంచెము కాలమునకే రాముడు నిన్ను కూడ చంపగలడు. నేను శత్రువు చేతిలో మరణించుటచే కృతార్థుదను అయ్యెదను. 17

మూ. దర్శనాదేవ రామస్య హతం మామవధారయ,
ఆత్మానం చ హతం విద్ధి హృత్వా సీతాం సబాన్ధవమ్.

ప్ర. అ. రామస్య = రామునియొక్క, దర్శనాదేవ = దర్శనమువలననే, మామ్ = నన్ను, హతమ్ = చంపబడినవానినిగా, అవధారయ = నిర్ధయించుకొనుము. సీతామ్ = సీతను, హృత్వా = హరించి, సబాన్ధవమ్ = బంధువులతో కూడిన, ఆత్మానమ్ = తనను, హతమ్ = చంపబడినవానినిగా, విద్ధి = తెలిసికొనుము.

తా. రాముడు నన్ను చూడగానే నేను చచ్చిపోవుదు నని నిర్ణయించుకొనుము. సీతను హరించిన వెంటనే నీవు కూడ, నీ బంధువులతో సహా చంపబడగల వను విషయము తెలిసికొనుము. 18

మూ. ఆనయిష్యసి చేత్సీతామాశ్రమాత్సహితో మయా,
నైవ త్వమసి నాహం చ నైవ లఙ్కా న రాక్షసాః. 19

ప్ర. అ. మయా = నాతో, సహితః = కూడినవాడవై, ఆశ్రమాత్ = ఆశ్రమమునుండి, సీతామ్ = సీతను, ఆనయిష్యసి చేత్ = తీసికొనివచ్చినటయితే,

త్వమ్ = నీవు, నైవ అసి = లేనట్లే, అహం చ = నేను కూడ, న = లేను. లఙ్కా = లంక, నైవ = లేదు. రాక్షసాః = రాక్షసులు, న = లేరు.

తా. నీవు నాతో కలిసి వెళ్ళి రాముని ఆశ్రమమునుండి సీతను తీసికొని వచ్చినట్లయితే, నీవు ఉండవు; నేనూ ఉండను; లంక ఉండదు; రాక్షసులు కూడ ఉండరు. 19

మూ. నివార్యమాణస్తు మయా హితైషిణా
న మృష్యసే వాక్యమిదం నిశాచర,
పరేతకల్పా హి గతాయుషో నరా
హితం న గృహ్ణన్తి సుహృద్భిరీరితమ్. 20

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ఏకచత్వారింశః సర్గః.

ప్ర. అ. నిశాచర = రావణా ! హితైషిణా = నీ హితమును కోరుచున్న, మయా = నాచేత, నివార్యమాణః = నివారింపబడుచున్నహెదవైనను, ఇదమ్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, న మృష్యసే = సహించుటలేదు. గతాయుషః = పూర్తియైన ఆయుర్దాయము గల, పరేతకల్పాః = మరణించినవారితో సమానులైన, నరాః = నరులు, సుహృద్భిః = స్నేహితులచేత; ఈరితమ్ = పలకబడిన, హితమ్ = హితమును, న గృహ్ణన్తి హి = గ్రహించరు కదా.

తా. రావణా! నీ హితమును కోరి నేను నిన్ను నివారించుచు పలుకుచున్న ఈ మాటలు నీవు అంగీకరించుట లేదు. ఆయువు మూడి, మరణించిన వారితో సమానులైన నరులు స్నేహితులు చెప్పిన హితవాక్యములను వినరు కదా ? 20

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
అరణ్యకాండలో నలుబదిఒకటవ సర్గ సమాప్తము.

అథ ద్విచత్వారింశః సర్గః

[మారీచుడు బంగారులేడి రూపము ధరించి రాముని ఆశ్రమము నకు వెళ్ళుట; సీత దానిని చూచుట.]

మూ. ఏవముక్త్వా తు వచనం మారీచో రావణం తతః,
గచ్ఛావేత్యబ్రవీద్దీనో భయాద్రాత్రించరప్రభోః. 1

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మారీచః = మారీచుడు, ఏవమ్ = ఇట్లు, వచనమ్ = వచనమును, ఉక్త్వా = పలికి, రాత్రించరప్రభోః = ఆ రాక్షసరాజు నుండి, భయాత్ = భయమువలన, దీనః = దీనుడై, గచ్ఛావ = వెళ్ళుదము, ఇతి = అని, రావణమ్ = రావణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. మారీచుడు ఈ విధముగా హితము ఉపదేశించి, పిమ్మట ఆ రావణునికి భయపడుచు, దీనుడై, ''వెళ్లుదము'' అని అతనితో పలికెను. 1

మూ. దృష్టశ్చాహం పునస్తేన శరచాపాసిధారిణా,
మద్వధోద్యతశస్త్రేణ వినష్టం జీవితం చ మే. 2

ప్ర. అ. అహమ్ = నేను, శరచాపాసిధారిణా = బాణములను, ధనస్సును, ఖడ్గమును ధరించిన, మద్వధోద్యతశస్త్రేణ = నన్ను వధించుటకు ఎత్తబడిన ఆయుధములు గల, తేన = ఆ రామునిచేత, పునః = మరల, దృష్టః = చూడబడినాను. మే = నాయొక్క, జీవితం చ = జీవితము, వినష్టమ్ = నశించినది.

తా. శరములు, ధనస్సు, ఖడ్గము ధరించిన ఆ రాముడు మరల నన్ను చూచి, నన్ను చంపుటకై ఆయుధము ఎత్తినాడా, ఇంక నేను మరణించినట్లే. 2

మూ. న హి రామం పరాక్రమ్య జీవన్ ప్రతినివర్తతే,
వర్తతే ప్రతిరూపోఽసౌ యమదణ్డహతస్య తే. 3

ప్ర. అ. రామమ్ = రాముణ్ణి గూర్చి, పరాక్రమ్య = పరాక్రమించి, జీవన్ = జీవించి, న ప్రతినివర్తతే హి = తిరిగి రాడు కదా ? యమదణ్డహతస్య = యమదండముచేత చంపబడిన నాయొక్క, అసౌ = ఈ, ప్రతిరూపః = ప్రతిబింబము మాత్రమే, తే = నీ ఎదుట, వర్తతే = ఉన్నది.

తా. రాముని విషయములో పరాక్రమము చూపినవాడు సజీవుడై తిరిగి వచ్చుట కల్ల. యముని దండముచే కొట్టబడి నే నెప్పుడో చనిపోయినాను. ఇప్పుడు నీ ఎదుట ఉన్నది నా బొమ్మ మాత్రమే. 3

మూ. కిం ను శక్యం మయా కర్తుమేవం త్వయి దురాత్మని,
ఏష గచ్ఛామ్యహం తాత స్వస్తి తేఽస్తు నిశాచర. 4

ప్ర. అ. త్వయి = నీవు, ఏవమ్ = ఇట్లు, దురాత్మని = దురాత్ముడవై యుండగా, మయా = నాచేత, కిమ్ = ఏమి, కర్తుమ్ = చేయుటకు, శక్యమ్ = శక్యమైనది ? తాత = నాయనా ! నిశాచర = రావణా ! ఏషః = ఈ, అహమ్ = నేను, గచ్ఛామి = వెళ్లెదను. తే = నీకు, స్వస్తి = క్షేమము, అస్తు = అగుగాక.

తా. నాయనా ! రావణా ! నీవు ఈ విధముగా దురాత్ముడవై ఉన్నప్పుడు నే నేమి చేయగలను ? ఇదిగో నేను వెళ్ళుచున్నాను. నీకు క్షేమ మగుగాక. 4

మూ. ప్రహృష్టస్త్వభవత్తేన వచనేన స రావణః,
పరిష్వజ్య సుసంశ్లిష్టమిదం వచనమబ్రవీత్. 5

ప్ర. అ. సః రావణః = ఆ రావణుడు, తేన వచనేన = ఆ మాటచేత, ప్రహృష్టః = చాలా సంతోషించినవాడు, అభవత్ = ఆయెను. సుసంశ్లిష్టమ్ = చాలా దగ్గర అగునట్లు (గాఢముగా), పరిష్వజ్య = కౌగలించుకొని, ఇదమ్ = ఈ, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. ఆ రావణుడు ఆ మాట విని చాలా సంతోషించి, మారీచుణ్ణి గాఢముగా కౌగలించుకొని ఇట్లు పలికెను. 5

మూ. ఏతచ్ఛౌణ్డీర్యయుక్తం తే మచ్ఛన్దవశవర్తినః,
ఇదానీమసి మారీచః పూర్వమన్యో నిశాచరః. 6

ప్ర. అ. మచ్ఛన్దవశవర్తినః = నా ఇచ్ఛకు వశమునందున్న, తే = నీయొక్క, ఏతత్ = ఈ వాక్యము, శౌణ్డీర్యయుక్తమ్ = దర్పముతో కూడినది. ఇదానీమ్ = ఇప్పుడు, మారీచః = మారీచుడవు, అసి = అయి ఉన్నావు. పూర్వమ్ = పూర్వము, అన్యః = మరియొక, రాక్షసః హి = రాక్షసుడవు కదా.

తా. నీవు నా ఇచ్ఛ ప్రకారము ప్రవర్తించుటచే ఇప్పుడు నీ మాటలు దర్పముతో కూడి ఉన్నవి. ఇప్పుడు నీవు నిజమైన మారీచుడవు. ఇంతకు ముందు నీవు మారీచుడవు వలె ప్రవర్తించలేదు. 6

మూ. ఆరుహ్యతామయం శీఘ్రం రథో రత్నవిభూషితః,
మయా సహ తథా యుక్తః పిశాచవదనైః ఖరైః. 7

ప్ర. అ. తథా = అట్లు, పిశాచవదనైః = పిశాచముఖములు గల, ఖరైః = గాడిదలతో, యుక్తః = కూర్చబడిన, రత్నవిభూషితః = రత్నములచేత అలంకరించబడిన, అయం రథః = ఈ రథము, శీఘ్రమ్ = శీఘ్రముగా, మయా సహ = నాతో కూడ, ఆరుహ్యతామ్ = ఎక్కబడుగాక.

తా. పిశాచముల ముఖముల వంటి ముఖములు గల గాడిదలు కట్టిన, రత్నాలంకృతమైన ఈ రథమును నాతో కూడ శీఘ్రముగా ఎక్కుము. 7

మూ. ప్రలోభయిత్వా వైదేహీం యథేష్టం గన్తుమర్హసి,
తాం శూన్యే ప్రసభం సీతామానయిష్యామి మైథిలీమ్. 8

ప్ర. అ. వైదేహీమ్ = సీతను, ప్రలోభయిత్వా = లోభపెట్టి, యథేష్టమ్ = నీకు ఇష్టము వచ్చినట్లు, గన్తుమ్ = వెళ్లుటకు, అర్హసి = తగియున్నావు. శూన్యే = శూన్యమైన ప్రదేశమునందు, మైథిలీమ్ = మిథిలానగరరాజకుమారియైన, తాం సీతామ్ = ఆ సీతను, ప్రసభమ్ = బలాత్కారముగా, ఆనయిష్యామి = తీసికొని వచ్చెదను.

తా. సీతను లోభపెట్టిన తరువాత నీవు నీ ఇష్టము వచ్చినట్లు వెళ్ళవచ్చును. అప్పుడు శూన్యముగా నున్న ఆ ఆశ్రమమునుండి నేను సీతను బలాత్కారముగా తీసికొనివచ్చెదను. 8

మూ. తతో రావణమారీచౌ విమానమివ తం రథమ్,
ఆరుహ్య యయతుః శీఘ్రం తస్మాదాశ్రమమణ్డలాత్. 9

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రావణమారీచౌ = ఆ రావణమారీచులు, తం రథమ్ = ఆ రథమును, విమానమివ=విమానమును వలె, ఆరుహ్య=ఎక్కి, తస్మాత్ = ఆ, ఆశ్రమమణ్డలాత్ = ఆశ్రమమండలమునుండి, శీఘ్రమ్= శీఘ్రముగా, యయతుః = వెళ్ళిరి.

తా. పిమ్మట ఆ రావణమారీచులు విమానము వలె ఉన్న ఆ రథము నెక్కి, ఆ ఆశ్రమమునుండి బయలుదేరి శీఘ్రముగా వెళ్ళిరి. 9

మూ. తథైవ తత్ర పశ్యన్తౌ పత్తనాని వనాని చ,
గిరీంశ్చ సరితః సర్వా రాష్ట్రాణి నగరాణి చ. 10

ప్ర. అ. తథైవ = అట్లే, తత్ర = అక్కడ, పత్తనాని = పట్టణములను, వనాని చ = వనములను, గిరీంశ్చ = పర్వతములను, సర్వాః = సమస్తమైన, సరితః = నదులను, రాష్ట్రాణి = రాష్ట్రములను, నగరాణి చ = నగరములను, పశ్యన్తౌ = చూచుచున్నవారై, వెళ్ళిరి.

తా. మార్గమధ్యమునందు పట్టణములు, అరణ్యములు. పర్వతములు, సమస్తమైన నదులు, రాష్ట్రములు, నగరములు చూచుచు వెళ్ళిరి. 10

మూ. సమేత్య దణ్డకారణ్యం రాఘవస్యాశ్రమం తతః,
దదర్శ సహ మారీచో రావణో రాక్షసాధిపః. 11

ప్ర. అ. సహమారీచః = మారీచునితో కూడిన, రాక్షసాధిపః = రాక్షస రాజైన, రావణః = రావణుడు, దణ్డకారణ్యమ్ = దండకారణ్యమును, సమేత్య= చేరి, తతః = అటుపిమ్మట, రాఘవస్య = రామునియొక్క, ఆశ్రమమ్ = ఆశ్రమ మును, దదర్శ = చూచెను.

తా. రాక్షసరాజైన రావణుడు, మారీచునితో కలిసి వెళ్ళి, దండకారణ్య మును, దానియందున్న రాముని ఆశ్రమమును చూచెను. 11

మూ. అవతీర్య రథాత్తస్మాత్తతః కాఞ్చనభూషణాత్,
హస్తే గృహీత్వా మారీచం రావణో వాక్యమబ్రవీత్. 12

ప్ర. అ. రావణః = రావణుడు, కాఞ్చనభూషణాత్ = బంగారు అలంకారములు గల, తస్మాత్ = ఆ, రథాత్ = రథమునుండి, అవతీర్య = దిగి, తతః = అటు పిమ్మట, మారీచమ్ = మారీచుణ్ణి, హస్తే = హస్తమునందు, గృహీత్వా = గ్రహించి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. రావణుడు బంగారు అలంకారములు గల ఆ రథమునుండి దిగి, మారీచుని చెయ్యి పట్టుకొని ఆతనితో ఇట్లు పలికెను. 12

మూ. ఏతత్తదాశ్రమపదం దృశ్యతే కదళీవృతమ్,
క్రియతాం తత్సఖే శీఘ్రం యదర్థం వయమాగతాః. 13

ప్ర. అ. సఖే = మిత్రుడా! కదళీవృతమ్ = అరటిచెట్లచేత ఆవరింపబడిన, ఏతత్ = ఈ, తత్ ఆశ్రమపదమ్ = ఆ ఆశ్రమము, దృశ్యతే = చూడబడుచున్నది. వయమ్ = మనము, యదర్థమ్ = ఏ కార్యము నిమిత్తమై, ఆగతాః = వచ్చినామో, తత్ = ఆ కార్యము, శీఘ్రమ్ = శీఘ్రముగా, క్రియతామ్ = చేయబడుగాక.

తా. మిత్రుడా! ఇదిగో చుట్టూ అరటి చెట్లు ఉన్న ఆశ్రమము కనబడుచున్నది. మనము వచ్చిన పని శీఘ్రముగా చేయుము. 13

మూ. స రావణవచః శ్రుత్వా మారీచో రాక్షసస్తదా,
మృగో భూత్వాఽఽశ్రమద్వారే రామస్య విచచార హ. 14

ప్ర. అ. తదా = అప్పుడు, సః = ఆ, రాక్షసః = రాక్షసుడైన, మారీచః = మారీచుడు, రావణవచః = రావణుని వచనమును, శ్రుత్వా = విని, మృగః = మృగముగా, భూత్వా = అయి, రామస్య = రామునియొక్క, ఆశ్రమద్వారే = ఆశ్రమద్వారమునందు, విచచార హ = సంచరించెను.

తా. అప్పుడు ఆ రాక్షసుడైన మారీచుడు రావణుని మాటలు విని, మృగరూపము ధరించి, రాముని ఆశ్రమద్వారమునందు సంచరించెను. 14

మూ. స తు తద్రూపమాస్థాయ మహదద్భుతదర్శనమ్,
మణిప్రవరశృఙ్గాగ్రః సితాసితముఖాకృతిః. 15

ప్ర. అ. సః = ఆ మారీచుడు, అద్భుతదర్శనమ్ = ఆశ్చర్యకరమైన దర్శనము గల, మహత్ = గొప్పదైన, తత్ = ఆ, రూపమ్ = రూపమును, ఆస్థాయ = గ్రహించి, మణిప్రవరశృఙ్గాగ్రః = శ్రేష్ఠములైన మణులు గల శృంగముల అగ్రములు కల, సితాసితముఖాకృతిః = తెల్లగాను నల్లగాను ఉన్న ముఖాకారము గల (మృగముగా అయ్యెను).

తా. ఆ మారీచుడు చూచుటకు ఆశ్చర్యకరముగా ఉన్న గొప్పదైన ఆ మృగరూపమును ధరించెను. దాని కొమ్ముల చివరి భాగములు శ్రేష్ఠములైన మణుల వలె ఉండెను. ముఖము కొంత భాగము తెల్లగాను, కొంత భాగము నల్లగాను ఉండెను. 15

మూ. రక్తపద్మోత్పలముఖ ఇన్ద్రనీలోత్పలశ్రవాః,
కించిదభ్యున్నతగ్రీవ ఇంద్రనీలదలాధరః. 16

ప్ర. అ. రక్తపద్మోత్పలముఖః = ఎఱ్ఱని పద్మము వంటి, నల్లకలువ వంటి ముఖముగల, ఇన్ద్రనీలోత్పలశ్రవాః = ఇంద్రనీలమాణిక్యము వంటి, నల్ల కలువ వంటి చెవులు గల, కించిత్ = కొంచెము, అభ్యున్నతగ్రీవః = ఎత్తైన కంఠము గల, ఇన్ద్రనీలదళాధరః = ఇంద్రనీలదలము వంటి క్రింది పెదవి గల (మృగముగా అయెను).

తా. దాని ముఖము ఒక చోట ఎఱ్ఱని పద్మము వలె, మరొక చోట నల్ల కలువ వలె ఉండెను. చెవులు ఇంద్రనీలముల వలె, నల్లకలువల వలె ఉండెను. మెడ కొంచెము ఎత్తుగాను క్రింది పెదవి ఇంద్రనీలదళము వలెను ఉండెను. 16

మూ. కున్దేన్దువజ్రసంకాశముదరం చాస్య భాస్వరమ్,
మధూకనిభపార్శ్వశ్చ పద్మకిఞ్జల్కసంనిభః, 17
వైడూర్యసంకాశఖుర స్తనుజఙ్ఘః సుసంహతః.

ప్ర. అ. అస్య = ఈ మృగముయొక్క, భాస్వరమ్ = ప్రకాశించుచున్న, ఉదరమ్ = ఉదరము, కున్దేన్దువజ్రసంకాశమ్ = మల్లిపూవుతోను, చంద్రునితోను,

వజ్రముతోను సమానముగా ఉండెను. (ఆ మృగము) మధూకనిభపార్శ్వశ్చ = ఇప్పపువ్వుతో సమానమైన పార్శ్వములు కలదిగాను, పద్మకిఞ్జల్కసంనిభః = పద్మముల కింజల్కములతో సమానముగాను, వైదూర్యసంకాశఖురః = వైదూర్య మాణిక్యములతో సమానమైన డెక్కలుకలదిగాను, తనుజఙ్ఘః = సన్నని పిక్కలు కలదిగాను, సుసంహతః = చక్కగా కుదిమట్టము గాను, ఉండెను.

తా. దాని ఉదరము మల్లిపూవు వలె, చంద్రుడు వలె, వజ్రము వలె ప్రకాశించుచుండెను. దాని పార్శ్వములు ఇప్పపువ్వు రంగులోను కొంతదేహము పద్మకింజల్కముల రంగులోను ఉండెను. డెక్కలు వైదూర్యమాణిక్యముల వలె ఉండెను. పిక్కలు సన్నముగా ఉండెను. ఈ విధముగ ఆ మృగము చక్కగా కూర్చిన అవయవములతో కుదిమట్టముగా ఉండెను. 17

మూ. ఇన్ద్రాయుధసవర్ణేన పుచ్ఛేనోర్ధ్వం విరాజతా, 18
మనోహరః స్నిగ్ధవర్ణో రత్నైర్నానావిధైర్వృతః.

ప్ర. అ. ఊర్ధ్వమ్ = పైకి, విరాజతా = ప్రకాశించుచున్న, ఇన్ద్రాయుధ సవర్ణేన = ఇంద్రాయుధముతో సమానమైన వర్ణము గల, పుచ్ఛేన = తోకతో కూడినదై, మనోహరః = మనోహరమై, స్నిగ్ధవర్ణః = మెరియుచున్న వర్ణము గలదై, నానావిధైః = అనేకవిధములైన, రత్నైః = రత్నములతో, వృతః = కూడినదై, ఉండెను.

తా. ఆ మృగము తోక ఇంద్రాయుధముతో సమానమైన వర్ణముతో పైకి లేచి ఉండెను. అనేకవిధములైన రత్నములతో మనోహరముగా నుండెను. దాని రంగు మెరయుచుండెను. 18

మూ. క్షణేన రాక్షసో జాతో మృగః పరమశోభనః, 19
వనం ప్రజ్వలయన్ రమ్యం రామాశ్రమపదం చ తత్.

ప్ర. అ. రాక్షసః = రాక్షసుడు, వనమ్ = వనమును, రమ్యమ్ = రమ్యమైన, తత్ రామాశ్రమపదమ్ = ఆ రాముని ఆశ్రమమును, ప్రజ్వలయన్ = ప్రకాశింప చేయుచు, క్షణేన = క్షణకాలముచేత, పరమశోభనః = చాలా అందమైన, మృగః = మృగముగా, జాతః = అయినాడు.

తా. ఆ మారీచుడు క్షణకాలములో చాల అందమైన మృగముగా మారి, ఆ వనమును రమ్యమైన, రాముని ఆశ్రమమును ప్రకాశింపచేసెను. 19

మూ. మనోహరం దర్శనీయం రూపం కృత్వా స రాక్షసః, 20
ప్రలోభనార్థం వైదేహ్యా నానాధాతువిచిత్రితమ్,
విచరన్ గచ్ఛతే తస్మాచ్ఛాద్వలాని సమన్తతః. 21

ప్ర. అ. సః రాక్షసః = ఆ రాక్షసుడు, నానాధాతువిచిత్రితమ్ = అనేక విధములైన ధాతువుల వర్ణములచే చిత్రితమైన, మనోహరమ్ = మనోహరము, దర్శనీయమ్ = సుందరమూ అయిన, రూపమ్ = రూపమును, కృత్వా = చేసి (ధరించి), వైదేహ్యాః = సీతయొక్క, ప్రలోభనార్థమ్ = ప్రలోభనముకొరకు, విచరన్ = సంచరించుచు, తస్మాత్ = ఆ ప్రదేశమునుండి, సమన్తతః = నలు వైపులా ఉన్న, శాద్వలాని = పచ్చికబీళ్లను గూర్చి, గచ్ఛతే = వెళ్ళుచుండెను.

తా. ఆ రాక్షసుడు అనేకవిధములైన ధాతువుల రంగుల వంటి రంగులచేత చిత్రింపబడిన, మనోహరము, చూడ ఇంపైనది అయిన రూపము ధరించి, సీతను లోభపెట్టుటకై ఇటు అటు తిరుగుచు, ఆ ప్రదేశమునుండి చుట్టుప్రక్కల నున్న పచ్చికబీళ్ళ వైపు వెళ్ళుచుండెను. 20, 21

మూ. రూప్యైర్బిన్దుశతైశ్చిత్రో భూత్వా స ప్రియదర్శనః,
విటపీనాం కిసలయాన్ భఙ్క్త్వాదన్ విచచార హ. 22

ప్ర. అ. సః = ఆ మృగము, రూప్యైః = వెండిరంగు గల, బిన్దుశతైః = వందలకొలది చుక్కలచేత, చిత్రః = చిత్రవర్ణము కలదిగా, భూత్వా = అయి, ప్రియదర్శనః = ఆనందకరమైన దర్శనము కలదై, విటపీనామ్ = చెట్లయొక్క, కిసలయాన్ = చిగుళ్లను, భఙ్క్త్వా = విరిచి, అదన్ = తినుచు, విచచార హ = సంచరించెను.

తా. వెండి వలె తెల్లగా నున్న వందలకొలది చుక్కలతో చిత్రవర్ణమై చూచువారికి ఆనందము కలిగించు ఆ మృగము, చెట్ల చిగుళ్ళు విరచి తినుచు సంచరించెను. 22

మూ. కదళీగృహకం గత్వా కర్ణికారానిత స్తతః,
సమాశ్రయన్మన్దగతిః సీతాసందర్శనం తథా. 23

ప్ర. అ. కదళీగృహకమ్ = అరటిచెట్ల తోపును గూర్చి, గత్వా = వెళ్ళి, కర్ణికారాన్ ఇతస్తతః = కర్ణికారవృక్షములకు ఇటు అటు, మన్దగతిః = మంద గమనము కలదై, తథా = అట్లే, సీతాసన్దర్శనమ్ = సీత దృష్టిపడు ప్రదేశమును, సమాశ్రయత్ = ఆశ్రయించెను.

తా. ఆ మృగము అరటితోపులోనికి వెళ్ళి, కర్ణికారవృక్షములకు ఇటు అటు మందముగా నడచుచు, సీత దృష్టి పడే ప్రదేశమునకు వెళ్లెను. 23

మూ. రాజీవచిత్రపృష్ఠః స విరరాజ మహామృగః,
రామాశ్రమపదాభ్యాశే విచచార యథాసుఖమ్. 24

ప్ర. అ. సః = ఆ, మహామృగః = గొప్ప మృగము, రాజీవచిత్రపృష్ఠః = పద్మము వలె చిత్రమైన పృష్ఠభాగము కలదై, విరరాజ = ప్రకాశించెను. రామాశ్రమపదాభ్యాశే = రాముని ఆశ్రమము సమీపమునందు, యథాసుఖమ్ = సుఖముగా, విచచార = సంచరించెను.

తా. పద్మమువలె ఆశ్చర్యకరమైన పృష్ఠభాగముతో ఆ గొప్ప మృగము చాల అందముగా ఉండెను. అది రాముని ఆశ్రమము సమీపమునందు సుఖముగా సంచరించెను. 24

మూ. పునర్గత్వా నివృత్తశ్చ విచచార మృగోత్తమః,
గత్వా ముహూర్తం త్వరయా పునః ప్రతినివర్తతే. 25

ప్ర. అ. మృగోత్తమః = ఆ శ్రేష్ఠమైన మృగము, గత్వా = వెళ్ళి, పునః = మరల, నివృత్తశ్చ = మరలినదై, విచచార = సంచరించెను. ముహూర్తమ్ = క్షణకాలముపాటు, గత్వా = బైటకు వెళ్ళి, పునః = మరల, త్వరయా = తొందరతో, ప్రతినివర్తతే = తిరిగివచ్చును.

తా. శ్రేష్ఠమైన ఆ మృగము ఒకసారి బైటకు వెళ్ళి, మరల తిరిగి వచ్చుచు సంచరించెను. క్షణకాలము బైటకు వెళ్ళి, వెంటనే తొందరగా తిరిగి వచ్చు చుండెను. 25

మూ. విక్రీడంశ్చ క్వచిద్భూమౌ పునరేవ నిషీదతి,
ఆశ్రమద్వారమాగమ్య మృగయూథాని గచ్ఛతి. 26

ప్ర. అ. విక్రీడంశ్చ = ఆడుకొనుచు, పునరేవ = మరల, క్వచిత్ = ఒకానొక చోట, భూమౌ = నేలమీద, పునరేవ = మరల, నిషీదతి = కూర్చుండును. ఆశ్రమద్వారమ్ = ఆశ్రమముయొక్క ద్వారమును, ఆగమ్య = చేరి, మృగయూథాని = లేళ్ల గుంపులను గూర్చి, గచ్ఛతి = వెళ్ళుచుండును.

తా. కొంతసేపు ఆడుకొని ఒక్క చోట నేలమీద కూర్చుండును. ఆశ్రమ ద్వారమువద్దకు వచ్చి మరల లేళ్లగుంపుల వైపు పరుగెత్తుచుండెను. 26

మూ. మృగయూథైరనుగతః పునరేవ నివర్తతే,
సీతాదర్శనమాకాఙ్క్షన్ రాక్షసో మృగతాం గతః, 27
పరిభ్రమతి చిత్రాణి మణ్డలాని వినిష్పతన్.

ప్ర. అ. మృగతామ్ = మృగత్వమును, గతః = పొందిన, రాక్షసః = రాక్షసుడు, సీతాదర్శనమ్ = సీతయొక్క దర్శనమును, ఆకాఙ్క్షన్ = కోరుచున్నదై, మృగయూథైః = లేళ్ళ గుంపులచేత, అనుగతః = అనుసరింపబడినదై, పునరేవ = మరల, నివర్తతే = తిరిగి వచ్చును. వినిష్పతన్ = శీఘ్రముగా వచ్చుచు, చిత్రాణి = చిత్రములైన, మణ్డలాని = మండలములను, పరిభ్రమతి = తిరుగుచుండును.

తా. మృగరూపము ధరించిన ఆ మారీచుడు, సీత తనను చూడవలె నని కోరుచు, లేళ్ళ గుంపులు వెంబడింపగా తిరిగి వెనుకకు వచ్చుచుండెను. హటాత్తుగా ఎగిరి గంతువేసి అందముగా, సుందరముగా తిరుగుచుండెను. 27

మూ. సముద్వీక్ష్య చ తే సర్వే మృగా హ్యన్యే వనేచరాః, 28
ఉపాగమ్య సమాఘ్రాయ విద్రవన్తి దిశో దశ.

ప్ర. అ. వనేచరాః = వనమునందు సంచరించుచున్న, అన్యే = ఇతరములైన, తే = ఆ, సర్వే = సమస్తమైన, మృగాః = మృగములు, సముద్వీక్ష్య = చూచి, ఉపాగమ్య = సమీపించి, సమాఘ్రాయ = వాసనచూచి, దశ దిశః = పది దిక్కులను గూర్చి, విద్రవన్తి = పారిపోవును.

తా. వనములో సంచరించే ఇతరములైన మృగము లన్నీ, ఈ మృగమును చూచి, సమీపించి, వాసనచూచి, పది దిక్కులకు పారిపోయెను. 28

మూ. రాక్షసః సోఽపి తాన్వన్యాన్మృగాన్మృగవధే రతః, 29
ప్రచ్ఛాదనార్థం భావస్య న భక్షయతి సంస్పృశన్.

ప్ర. అ. మృగవధే=మృగములను చంపుటయందు, రతః=ఆసక్తి గల, సః = ఆ, రాక్షసోఽపి=రాక్షసుడు కూడ, వన్యాన్=వనమునకు సంబంధించిన, తాన్ మృగాన్ = ఆ మృగములను, సంస్పృశన్ = స్పృశించుచు, భావస్య = తన స్వభావముయొక్క, ప్రచ్ఛాదనార్థమ్ = కప్పిపుచ్చుకొనుటకొరకు, న భక్షయతి = భక్షించుటలేదు.

తా. మృగములను చంపుటయందు ఆసక్తి కలవాడైనను, ఆ రాక్షసుడు, వాటిని స్పృశించి కూడ, తన స్వరూపమును కప్పిపుచ్చుకొనుటకు, వాటిని భక్షించలేదు. 29

మూ. తస్మిన్నేవ తతః కాలే వైదేహీ శుభలోచనా. 30
కుసుమావచయవ్యగ్రా పాదపానభ్యవర్తత.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తస్మిన్నేవ కాలే = ఆ సమయమునందే, శుభలోచనా = మంగళప్రదములైన నేత్రములు గల, వైదేహీ = సీత, కుసుమావచయవ్యగ్రా=పుష్పములను కోయుటయందు ఆసక్తురాలై, పాదపాన్=వృక్షములను, అభ్యవర్తత = సమీపించెను.

తా. మంగళకరములైన నేత్రములు గల సీత అదే సమయమునందు పుష్పములను కోయుటకై చెట్లవైపు వెళ్లెను. 30

మూ. కర్ణికారానశోకాంశ్చ చూతాంశ్చ మదిరేక్షణా, 31
కుసుమాన్యవచిన్వస్తీ చచార రుచిరాననా.

ప్ర. అ. మదిరేక్షణా=మదజనకములైన నేత్రములు గల, రుచిరాననా= సుందరమైన ముఖము గల ఆ సీత, కర్ణికారాన్ = కర్ణికారవృక్షములను, అశోకాంశ్చ = అశోకవృక్షములను, చూతాంశ్చ = చూతవృక్షములను, కుసుమాని= పుష్పములను, అవచిన్వస్తీ = కోయుచున్నదై, చచార = సంచరించెను.

తా. మత్తు కలిగించే నేత్రములు, అందమైన ముఖమూ గల ఆ సీత కర్ణికారవృక్షములనుంచి, అశోకవృక్షములనుంచి, చూతవృక్షములనుంచి పుష్పములు కోయుచు సంచరించెను. 31

మూ. అనర్హారణ్యావాసస్య సా తం రత్నమయం మృగమ్, 32
ముక్తామణివిచిత్రాఙ్గం దదర్శ పరమాఙ్గనా.

ప్ర. అ. అరణ్యావాసస్య = అరణ్యావాసమునకు, అనర్హా = తగని, సా = ఆ, పరమాఙ్గనా = ఉత్తమస్త్రీ యైన సీత, రత్నమయమ్ = రత్నవికారము, ముక్తామణివిచిత్రాఙ్గమ్ = ముత్యములచేతను, మణులచేతను విచిత్రమైన అవయవములు కలది అయిన, తం మృగమ్ = ఆ మృగమును, దదర్శ = చూచెను.

తా. అరణ్యావాసమునకు తగని ఆ సీత రత్నవికారము, ముత్యములచేతను, మణులచేతను విచిత్రమైన అవయవములు కలది అయిన ఆ మృగమును చూచెను. 32

మూ. సా తం రుచిరదన్తోష్ఠీ రూప్యధాతుతనూరుహమ్, 33
విస్మయోత్ఫుల్లనయనా సస్నేహం సముదైక్షత.

ప్ర. అ. రుచిరదన్తోష్ఠీ = అందమైన దంతములు, ఓష్ఠములు గల, సా = ఆ సీత, రూప్యధాతుతనూరుహామ్ = వెండివంటి, ధాతువులవంటి రోమములు గల, తమ్ = ఆ మృగమును, విస్మయోత్ఫుల్లనయనా = ఆశ్చర్యముచేత వికసించిన నేత్రములు కలదై, సస్నేహమ్ = స్నేహపూర్వకముగా, సముదైక్షత = చూచెను.

తా. అందమైన దంతములు, ఓష్ఠములు గల ఆ సీత, వెండి వలె, ధాతువుల వలె ఉన్న రోమములు గల ఆ మృగమును, ఆశ్చర్యముచేత వికసించిన నేత్రములతో స్నేహపూర్వకముగా చూచెను. 33

మూ. స చ తాం రామదయితాం పశ్యన్ మాయామయో మృగః,
విచచార పునశ్చిత్రం దీపయన్నివ తద్వనమ్.

ప్ర. అ. మాయామయః = మాయామయమైన, సః మృగశ్చ = ఆ మృగము కూడ, తాం రామదయితామ్ = ఆ రాముని భార్యను, పశ్యన్ = చూచుచు, తత్

వనమ్ = ఆ వనమును, దీపయన్నివ = ప్రకాశింపచేయుచున్నది వలె, పునః = మరల, చిత్రమ్ = చిత్రముగా, విచచార = సంచరించెను.

తా. ఆ మాయామృగము కూడ రాముని భార్య యైన సీతను చూచుచు, ఆ వనమును ప్రకాశింపచేయుచున్నట్లు మరల చిత్రవిచిత్రగతులతో సంచరించెను.

మూ: అదృష్టపూర్వం తం దృష్ట్వా నానారత్నమయం మృగమ్
విస్మయం పరమం సీతా జగామ జనకాత్మజా. 35

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ద్విచత్వారింశః సర్గః.

ప్ర. అ. అదృష్టపూర్వమ్=పూర్వము చూడబడని, నానారత్నమయమ్= అనేకరత్నవికారమైన తం మృగమ్ = ఆ మృగమును, దృష్ట్వా= చూచి, జనకాత్మజా = జనకుని కుమార్తెయైన, సీతా = సీత, పరమమ్ = గొప్ప, విస్మయమ్ = ఆశ్చర్యమును; జగామ = పొందెను.

తా. జనకనందిని యైన సీత, పూర్వ మెన్నడూ చూడని, అనేకరత్నముల వంటి రంగులు గల ఆ మృగమును చూచి చాల ఆశ్చర్యము పొందెను.

"వి. మృగాన్నీ దాని సంచారాన్నీ వర్ణిస్తూ వ్రాసిన ఈ సర్గలోని శ్లోకాలు (16-35) ప్రాచ్యప్రతిలో లేవు. 35

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో నలుబదిరెండవ సర్గ సమాప్తము.

అథ త్రిచత్వారింశః సర్గః

[ఆ మాయామృగమును చూచి లక్ష్మణునకు సందేహము కలుగుట. ఆ మృగమును సజీవముగా గాని, చంపి గాని తీసికొనిరమ్మని సీత రాముని కోరుట. రాముడు "సీతను రక్షించుచుండుము" అని లక్ష్మణుని ఆదేశించి ఆ మృగముకొరకు వెళ్ళుట]

మూ. సా తం సంప్రేక్ష్య సుశ్రోణీ కుసుమాని విచిన్వతీ,
హేమరాజతవర్ణాభ్యాం పార్శ్వాభ్యాముపశోభితమ్. 1

ప్రహృష్టా చానవద్యాఙ్గీ మృష్టహాటకవర్ణినీ,
భర్తారమపి చక్రన్ద లక్ష్మణం చైవ సాయుధమ్. 2

ప్ర. అ. సుశ్రోణీ = అందమైన కటిప్రదేశము గలది, అనవద్యాఙ్గీ = దోషములు లేని అవయవములు గలది, మృష్టహాటకవర్ణినీ = పరిశుద్ధమైన బంగారము చాయ గలది, కుసుమాని = పుష్పములను, విచిన్వతీ = కోయుచున్నది అయిన, సా = ఆ సీత, హేమరాజతపార్శ్వాభ్యామ్ = వెండి బంగారము వంటి పార్శ్వములచేత, ఉపశోభితమ్ = ప్రకాశింపచేయబడిన, తమ్ = ఆ మృగమును, సంప్రేక్ష్య = చూచి, ప్రహృష్టా = సంతోషించినదై, భర్తారమపి = భర్తను, సాయుధమ్ = ఆయుధముతో కూడిన, లక్ష్మణం చైవ = లక్ష్మణుణ్ణి, చక్రన్ద = పిలిచెను.

తా. అందమైన కటిప్రదేశము, దోషములు లేని అవయవములు, పరిశుద్ధమైన బంగారము వర్ణము వంటి వర్ణము గల ఆ సీత, పుష్పములను కోయుచు, వెండిరంగు బంగారురంగు గల పార్శ్వములతో ప్రకాశించుచున్న ఆ మృగమును చూచి, సంతోషించినదై, భర్తను, ఆయుధసహితుడైన లక్ష్మణుణ్ణి బిగ్గరగా పిలిచెను. 1, 2

మూ. తయాహూతౌ నరవ్యాఘ్రౌ వైదేహ్యా రామలక్ష్మణౌ,
వీక్షమాణౌ తు తౌ దేశం తదా దదృశతుర్మృగమ్. 3

ప్ర. అ. తయా = ఆ, వైదేహ్యా = సీతచేత, అహూతౌ = పిలవబడిన, నరవ్యాఘ్రౌ = నరశ్రేష్ఠులైన, తౌ రామలక్ష్మణౌ = ఆ రామలక్ష్మణులు, తం దేశమ్ = ఆ ప్రదేశమును, వీక్షమాణౌ = చూచుచున్నవారై, తదా = అప్పుడు, మృగమ్ = మృగమును, దదృశతుః = చూచిరి.

తా. అప్పుడు ఆ సీత పిలవగా రామలక్ష్మణులు ఆ ప్రదేశమును చూచుచు అక్కడ మృగమును చూచిరి. 3

మూ. శఙ్కమానస్తు తం దృష్ట్వా లక్ష్మణో రామమబ్రవీత్,
తమేవైనమహం మన్యే మారీచం రాక్షసం మృగమ్. 4

ప్ర. అ. తమ్ = ఆ మృగమును, దృష్ట్వా = చూచి, శఙ్కమానః = సందేహించుచున్నవాడై, లక్ష్మణః = లక్ష్మణుడు, రామమ్ = రాముణ్ణి గూర్చి, అబ్రవీత్ = పలికెను. అహమ్ = నేను, ఏనమ్ = ఈ, మృగమ్ = మృగమును, తమ్ = ఆ, మారీచమేవ = మారీచుణ్ణిగానే, మన్యే = తలచుచున్నాను.

తా. లక్ష్మణుడు ఆ మృగమును చూచి, శంకించుచు, రామునితో ఇట్లనెను "ఈ మృగము ఆ మారీచుడే అని తలచెదను." 4

మూ. చరన్తో మృగయాం హృష్టాః పాపేనోపాధినా వనే,
అనేన నిహతా రాజన్ రాజానః కామరూపిణా. 5

ప్ర. అ. రాజన్=రాజా, హృష్టాః=సంతోషించుచున్నవారై, మృగయాం చరన్తః = వేటాడుచున్న, రాజానః = రాజులు, కామరూపిణా = స్వేచ్ఛారూపము గల, అనేన = ఈ, పాపేన=పాపాత్మునిచేత, వనే=వనమునందు, ఉపాధినా= వేషముచేత, నిహతాః = చంపబడినారు.

తా. రామా! ఆనందముగా వేటాడుచున్న రాజులను, స్వేచ్ఛగా రూపమును ధరించ గల ఈ పాపాత్ముడు ఆ యా వేషములు ధరించి చంపినాడు.

వి. "ఉపధినా"అను పాఠమున్నచో యుక్తముగా ఉండును. "కపటము చేత"అని అర్థము. 5

మూ. అస్య మాయావిదో మాయామృగరూపమిదం కృతమ్,
భానుమత్పురుషవ్యాఘ్ర గన్ధర్వపురసన్నిభమ్. 6

ప్ర. అ. పురుషవ్యాఘ్ర = పురుషశ్రేష్ఠుడా ! మాయావిదః = మాయలను ఎరిగిన, అస్య = ఈ మారీచునియొక్క, భానుమత్ = కాంతి గలది, గన్ధర్వపుర సన్నిభమ్ = గంధర్వపురముతో సమానము అయిన, ఇదమ్ = ఈ, మాయా మృగరూపమ్ = మాయామృగరూపము, కృతమ్ = చేయబడినది.

తా. పురుషులలో శ్రేష్ఠుడవైన రామా! మాయలలో ఆరితేరిన ఈ మారీచుడు కాంతి గలది, ఇంద్రజాలికుడు నిర్మించు మాయానగరము వంటిదీ అయిన ఈ మాయామృగరూపమును నిర్మించినాడు. 6

మూ. మృగో హ్యేవంవిధో రత్నవిచిత్రో నాస్తి రాఘవ,
జగత్యాం జగతీనాథ మాయైషా హి న సంశయః. 7

ప్ర. అ. జగతీనాథ = భూమికి అధిపతివైన, రాఘవ = రామా ! జగత్యామ్ = భూమియందు, రత్నవిచిత్రః = రత్నములచేత విచిత్రమైన, ఏవంవిధః = ఈ విధమైన, మృగః = మృగము, నాస్తి హి = లేదు కదా ? ఏషా = ఇది, మాయా = మాయయే. సంశయః = సంశయము, న = లేదు.

తా. భూమండలమునకు ప్రభువైన రామా ! రత్నములవంటి బిందువుల చేత విచిత్రమైన ఇట్టి మృగము భూలోకములో ఉండదు. ఇది మాయయే. సంశయము లేదు. 7

మూ. ఏవం బ్రువాణం కాకుత్స్థం ప్రతివార్య శుచిస్మితా,
ఉవాచ సీతా సంహృష్టా చర్మణా హృతచేతనా. 8

ప్ర. అ. శుచిస్మితా = తెల్లని చిరునవ్వు గలది, చర్మణా = (ఆ మృగము యొక్క) చర్మముచేత, హృతచేతనా = హరించబడిన మనస్సుకలది, హృష్టా = సంతోషించినది అయిన, సీతా = సీత, ఏవమ్ = ఇట్లు, బ్రువాణమ్ = పలుకుచున్న, కాకుత్స్థమ్ = లక్ష్మణుని, ప్రతివార్య = నివారించి, ఉవాచ = పలికెను.

తా. అందమైన చిరునవ్వు గల ఆ సీత మనస్సును ఆ మృగముచర్మము ఆకర్షించుటచే ఆమె సంతోషించుచు, ఇట్లు పలుకుచున్న ఆ లక్ష్మణునికి అడ్డు తగిలి ఇట్లు పలికెను. 8

మూ. ఆర్యపుత్రాభిరామోఽసౌ మృగో హరతి మే మనః,
ఆనయైనం మహాబాహో క్రీడార్థం నో భవిష్యతి. 9

ప్ర. అ. ఆర్యపుత్ర = ఆర్యపుత్రా! అభిరామః = మనోహరమైన, అసౌ = ఈ, మృగః = మృగము, మే = నాయొక్క, మనః = మనస్సును, హరతి = హరించుచున్నది. మహాబాహో = గొప్ప బాహువులు కలవాడా! ఏనమ్ = దీనిని, ఆనయ = తీసికొనిరమ్ము. నః = మనయొక్క, క్రీడార్థమ్ = ఆటకొరకు, భవిష్యతి = కాగలదు.

తా. ఆర్యపుత్రా! సుందరమైన ఈ మృగము నా మనస్సును హరించుచున్నది. ఓ! మహాబాహూ! దీనిని పట్టి తీసికొనిరమ్ము. మనము దీనితో వినోదించవచ్చును. 9

మూ. ఇహాశ్రమపదేఽస్మాకం బహవః పుణ్యదర్శనాః,
మృగాశ్చరన్తి సహితాః సృమరాశ్చమరాస్తథా. 10

ప్ర. అ. అస్మాకమ్ = మనయొక్క, ఇహ = ఈ, ఆశ్రమపదే = ఆశ్రమమునందు, పుణ్యదర్శనాః = మంచి దర్శనము గల, బహవః = అనేకమైన, మృగాః = మృగములు, సృమరాః = సృమరములు, తథా = మరియు, చమరాః = చమర మృగములు, సహితాః = కలిసినవై, చరన్తి = సంచరించుచున్నవి.

తా. మన ఈ ఆశ్రమములో, చూచుటకు అందమైన ఎన్నో లేళ్ళు, సృమరములు, చమరములు గుంపులు గుంపులుగా తిరుగుచుండును. 10

మూ. ఋక్షాః పృషతసంఘాశ్చ వానరాః కిన్నరాస్తథా,
విచరన్తి మహాబాహో రూపశ్రేష్ఠా మనోహరాః. 11

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు కలవాడా! రూపశ్రేష్ఠాః = రూపముచేత శ్రేష్ఠములైన, మనోహరాః = మనస్సును ఆకర్షించు, ఋక్షాః = ఎలుగు

బంట్లు, పృషతసంఘాశ్చ = చుక్కల లేళ్ల గుంపులు, వానరాః = కోతులు, తథా = మరియు, కిన్నరాః = కిన్నరులు, విచరన్తి = సంచరించుచున్నవి.

తా. గొప్ప బాహువులు గల రామా! అందమైన రూపము గలవి, మనోహరములు అయిన ఎలుగుబంట్లు, చుక్కల లేళ్ళు, కోతులు, కిన్నరులు సంచరించుచుండును. 11

మూ. న చాస్య సదృశో రాజన్ దృష్టపూర్వో మృగో మయా,
తేజసా క్షమయా దీప్త్యా యథాయం మృగసత్తమః. 12

ప్ర. అ. రాజన్ = రాజా! అయమ్ = ఈ, మృగసత్తమః = శ్రేష్ఠమైన మృగము, యథా = ఎట్లో అట్లు, తేజసా = తేజస్సుచేతను, క్షమయా = ఓర్పుచేతను, దీప్త్యా = కాంతిచేతను, అస్య = దీనికి, సదృశః = సమానమైన, మృగః = మృగము, మయా = నాచేత న దృష్టపూర్వః = పూర్వము చూడబడలేదు.

తా. రాజా! ఈ శ్రేష్ఠమైన మృగము తేజస్సుచేతను, ఓరు చేతను, కాంతి చేతను ఏ విధముగా ఉన్నదో ఆవిధముగా ఉండే మరొక మృగమును నేనెన్నడూ చూడలేదు. 12

మూ. నానావర్ణవిచిత్రాఙ్గో రత్నబిన్దుసమాచితః,
ద్యోతయన్వనమవ్యగ్రం శోభతే శశిసన్నిభః. 13

ప్ర. అ. నానావర్ణవిచిత్రాఙ్గః = అనేకవిధములైన రంగులచేత విచిత్రమైన శరీరము గలది, రత్నబిన్దుసమాచితః = రత్నముల వంటి చుక్కలచేత వ్యాప్తమూ అయిన, శశిసన్నిభః = చంద్రునితో సమానమైన ఈ మృగము, అవ్యగ్రమ్ = కంగారు లేకుండా, వనమ్ = వనమును, ద్యోతయన్ = కాంతి కలదానినిగా చేయుచు, శోభతే = ప్రకాశించుచున్నది.

తా. దీని శరీరము అనేకవిధములైన రంగులతో విచిత్రముగా ఉన్నది. రత్నముల వంటి చుక్కలతో నిండి యున్నది. ఇది ఏ మాత్రము భయపడుట లేదు. చంద్రుడు వలె ఈ అరణ్యమును కాంతిభరితము చేయుచు ప్రకాశించుచున్నది. 13

మూ. అహో రూపమహో లక్ష్మీః స్వరసంపచ్చ శోభనా,
మృగోఽద్భుతో విచిత్రాఙ్గో హృదయం హరతీవ మే. 14

ప్ర. అ. రూపమ్ = రూపము, అహో=ఎంత ఆశ్చర్యకరముగా ఉన్నది! లక్ష్మీః = శోభ, అహో=ఎంత ఆశ్చర్యకరముగా ఉన్నది! స్వరసంపచ్చ = స్వరసంపద కూడ, శోభనా = బాగున్నది. అద్భుతః = ఆశ్చర్యకరము, విచిత్రాఙ్గః = విచిత్రమైన శరీరము గలది అయిన, మృగః = ఈ మృగము, మే = నాయొక్క, హృదయమ్ = హృదయమును, హరతీవ = హరించుచున్నట్లున్నది.

తా. ఏమి రూపము! ఏమి సౌందర్యము! ఏమి స్వరమాధుర్యము! విచిత్రమైన శరీరముతో ఆశ్చర్యకరముగా ఉన్న ఈ మృగము నా మనస్సును హరించుచున్నట్లు ఉన్నది. 14

మూ. యది గ్రహణమభ్యేతి జీవన్నేవ మృగస్తవ,
ఆశ్చర్యభూతం భవతి విస్మయం జనయిష్యతి. 15

ప్ర. అ. మృగః=మృగము, జీవన్నేవ=జీవించి ఉన్నదగుచునే, తవ= నీయొక్క, గ్రహణమ్ = గ్రహణమును, అభ్యేతి యది = పొందినట్లయితే, ఆశ్చర్యభూతమ్=ఆశ్చర్యకరము, భవతి=అగును. విస్మయమ్=ఆశ్చర్యమును, జనయిష్యతి = పుట్టించును.

తా. ఈ మృగము సజీవముగానే నీకు లభించినచో ఇది ఆశ్చర్యకరముగా ఉండును. చూచేవారందరికి ఆశ్చర్యము కలిగించును. 15

మూ. సమాప్తవనవాసానాం రాజ్యస్థానాం చ నః పునః,
అన్తఃపురవిభూషార్థో మృగ ఏష భవిష్యతి. 16

ప్ర. అ. ఏషః మృగః = ఈ మృగము, సమాప్తవనవాసానామ్=సమాప్తమైన వనవాసము గలవారము, పునః = మరల, రాజ్యస్థానామ్ = రాజ్యమునందు ఉన్నవారము అయిన, నః = మనయొక్క, అన్తఃపురవిభూషార్థః = అంతఃపురమునకు అలంకరణముకొరకు, భవిష్యతి = కాగలదు.

తా. మనము వనవాసము పూర్తిచేసికొని మరల రాజ్యమును పొందిన పిమ్మట, ఈ మృగము, మన అంతఃపురానికి అలంకారముగా ఉండగలదు. 16

మూ. భరతస్యార్యపుత్రస్య శ్వశ్రూణాం మమ చ ప్రభో,
మృగరూపమిదం వ్యక్తమాశ్చర్యం జనయిష్యతి. 17

ప్ర. అ. ప్రభో = ఓ!ప్రభూ! ఇదమ్ = ఈ, మృగరూపమ్ = మృగము యొక్క రూపము, భరతస్య = భరతునకు, ఆర్యపుత్రస్య = ఆర్యపుత్రునకు, శ్వశ్రూణామ్=అత్తగార్లకు, మమ చ=నాకు, వ్యక్తమ్=సత్యముగా, ఆశ్చర్యమ్= ఆశ్చర్యమును, జనయిష్యతి = పుట్టించగలదు.

తా. నాథా! ఈ మృగరూపము, భరతునకు, నీకు, అత్తలకు, నాకు కూడ తప్పక ఆశ్చర్యమును (ఆనందమును) కలిగించగలదు. 17

మూ. జీవన్న యది తేఽభ్యేతి గ్రహణం మృగసత్తమః,
అజినం నరశార్దూల రుచిరం మే భవిష్యతి. 18

ప్ర. అ. నరశార్దూల = నరులలో శ్రేష్ఠుడా! మృగసత్తమః = ఉత్తమమైన ఈ మృగము, జీవన్ = జీవించిఉన్నదై, తే = నీయొక్క, గ్రహణమ్=గ్రహణమును, న అభ్యేతి యది = పొందకపోయినచో, మే = నాకు, రుచిరమ్ = అందమైన, అజినమ్ = దీని చర్మము, భవిష్యతి = ఉండగలదు.

తా. మానవులలో శ్రేష్ఠుడవైన ఓ! రామా! ఉత్తమమైన ఈ మృగము సజీవముగా నీకు లభించనిచో అందమైన దీని చర్మము నాకు ఉండును. 18

మూ. నిహతస్యాస్య సత్త్వస్య జామ్బూనదమయత్వచి,
శష్పబృస్యాం వినీతాయామిచ్ఛామ్యహముపాసితుమ్. 19

ప్ర. అ. శష్పబృస్యామ్ = లేతగడ్డితో ఏర్పరుపబడిన ఆసనమునందు, వినీతాయామ్ = పరవబడిన, నిహతస్య = చంపబడిన, అస్య సత్త్వస్య = ఈ మృగముయొక్క, జామ్బూనదమయత్వచి = బంగారు చర్మమీద, అహమ్ = నేను, ఉపాసితుమ్ = కూర్చుండుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. ఈ మృగమును చంపివేసినచో దీని బంగారు చర్మను లేతగడ్డితో ఏర్పరచిన ఆసనముమీద పరచుకొని కూర్చుండవలె నని నాకు కోరిక ఉన్నది.

మూ. కామవృత్తమిదం రౌద్రం స్త్రీణామసదృశం మతమ్,
వపుషా త్వస్య సత్త్వస్య విస్మయో జనితో మమ. 20

ప్ర. అ. రౌద్రమ్ = భయంకరమైన, ఇదమ్ = ఈ, కామవృత్తమ్ = స్వేచ్ఛాప్రవృత్తి, స్త్రీణామ్ = స్త్రీలకు, అసదృశమ్ = తగనిదిగా, మతమ్ = చెప్పబడినది. తు = కాని, అస్య = ఈ, సత్త్వస్య = జంతువుయొక్క, వపుషా = శరీరముచేత, మమ = నాకు, విస్మయః = ఆశ్చర్యము, జనితః = పుట్టించబడినది.

తా. స్త్రీలకు భయంకరమైన ఇట్టి కోరిక తగ దను మాట నిజమే. కాని ఈ మృగము రూపమును చూడగానే నాకు ఆశ్చర్యము కలిగినది. 20

మూ. తేన కాఞ్చనవర్ణేన మణిప్రవరశృఙ్గిణా,
తరుణాదిత్యవర్ణేన నక్షత్రపథవర్చసా, 21
బభూవ రాఘవస్యాపి మనో విస్మయమాగతమ్.

ప్ర. అ. కాఞ్చనరూపేణ = బంగారు రూపము గలది, మణిప్రవరశృఙ్గిణా = శ్రేష్ఠములైన మణుల వంటి కొమ్ములు గలది, తరుణాదిత్యవర్ణేన = లేతసూర్యుని వంటి రంగు గలది, నక్షత్రపథవర్చసా = నక్షత్రమార్గము వంటి కాంతి గలది అయిన, తేన = ఆ మృగముచేత, రాఘవస్య = రామునియొక్క, మనః అపి = మనస్సు కూడ, విస్మయమ్ = ఆశ్చర్యమును, ఆగతమ్ = పొందినది.

తా. బంగారు రూపము, శ్రేష్ఠములైన మణుల వంటి కొమ్ములు, బాల సూర్యుని వంటి రంగు, నక్షత్రములతో కూడిన ఆకాశము వంటి తేజస్సు-వీటితో కూడిన ఆ మృగమును చూడగానే రామునకు కూడ ఆశ్చర్యము కలిగెను. 21

మూ. ఏవం సీతావచః శ్రుత్వా తం దృష్ట్వా మృగమద్భుతమ్ 22
లోభితస్తేన రూపేణ సీతయా చ ప్రచోదితః.
ఉవాచ రాఘవో హృష్టో భ్రాతరం లక్ష్మణం వచః: 23

ప్ర. అ. రాఘవః = రాముడు, ఏవమ్ = ఇట్లు, సీతావచః = సీతయొక్క వచనమును, శ్రుత్వా = విని, అద్భుతమ్ = ఆశ్చర్యకరమైన, తం మృగమ్ = ఆ మృగమును, దృష్ట్వా = చూచి, తేన రూపేణ = ఆ రూపముచేత, లోభితః = లోభ పెట్టబడినవాడై, సీతయా చ = సీతచేత కూడ, ప్రచోదితః = ప్రేరేపించ

బడినవారై, హృష్టః=సంతోషించినవారై, భ్రాతరమ్=సోదరుడైన, లక్ష్మణమ్= లక్ష్మణుని గూర్చి, వచః = వాక్కును, ఉవాచ = పలికెను.

తా. రాముడు సీత మాటలు విని, ఆశ్చర్యకరమైన ఆ మృగమును చూచి, దాని రూపముచేత ఆకర్షింపబడినవాడై, సీత కూడ ప్రేరేపింపగా, సంతోషముతో సోదరుడైన లక్ష్మణునితో ఇట్లు పలికెను. 22, 23

మూ. పశ్య లక్ష్మణ వైదేహ్యాః స్పృహాం మృగగతామిమామ్,
రూపశ్రేష్ఠతయా హ్యేష మృగోఽద్య న భవిష్యతి. 24

న వనే నన్దనోద్దేశే న చైత్రరథసంశ్రయే,
కుతః పృథివ్యాం సౌమిత్రే యోఽస్య కశ్చిత్సమో మృగః.

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణుడా! వైదేహ్యాః = సీతయొక్క, మృగగతామ్ = మృగమునకు సంబంధించిన, స్పృహామ్=ఆసక్తిని, పశ్య=చూడుము. సౌమిత్రే = లక్ష్మణా! అద్య = ఇప్పుడు, రూపశ్రేష్ఠతయా = రూపముచేత శ్రేష్ఠమగుటచే, ఏషః మృగః=ఈ మృగము, వనే=ఈ వనమునందు, న భవిష్యతి= ఉండదు; నన్దనోద్దేశే= నందనవనప్రాంతమునందు, న = ఉండదు; చైత్రరథ సంశ్రయే = చైత్రరథ మనే వనమునందు, న = ఉండదు. యః = ఏ మృగము, అస్య = దీనికి, సమః = సమానమైనదో అది, పృథివ్యామ్ = భూమియందు, కుతః = ఎట్లు ?

తా. లక్ష్మణా! సీతకు ఈ మృగమునందు ఎంత ఆసక్తి ఉన్నదో చూచితివా! ఇంత శ్రేష్ఠమైన రూపము గల మృగము ఈ వనములో మరేదీ ఉండదు. నందనవనములో గాని, చైత్రరథ మను ఉద్యానములో గాని ఉండదు. ఇంక భూలోకములో ఎట్లు ఉండును ? 24. 25

మూ. ప్రతిలోమానులోమాశ్చ రుచిరా రోమరాజయః,
శోభన్తే మృగమాశ్రిత్య చిత్రాః కనకబిన్దుభిః. 26

ప్ర. అ. ప్రతిలోమానులోమాః చ = ఎదురుతిరిగినవి వాలుగా ఉన్నవి అయినవి, రుచిరాః = అందమైనవి, కనకబిందుభిః = బంగారు రంగు చుక్కల

చేత, చిత్రాః = చిత్రములూ అయిన, రోమరాజయః = రోమముల పంక్తులు, మృగమ్ = మృగమును, ఆశ్రిత్య = ఆశ్రయించి, శోభన్తే = ప్రకాశించుచున్నవి.

తా. ఈ మృగము శరీరము మీద అందమైన రోమపంక్తులు కొన్ని చోట్ల ఎదురు తిరిగి ఉన్నవి; కొన్ని చోట్ల వాలుగా ఉన్నవి. బంగారపు చుక్కలచేత చిత్రముగా ఉన్నవి. 26

మూ. పశ్యాస్య జృమ్భమాణస్య దీప్తామగ్నిశిఖోపమామ్,
జిహ్వాం ముఖాన్నిస్సరన్తీం మేఘాదివ శతహ్రదామ్. 27

ప్ర. అ. జృమ్భమాణస్య = ఆవులించుచున్న, అస్య = దీనియొక్క, ముఖాత్ = ముఖమునుండి, నిస్సరన్తీమ్ = బయలుదేరుచున్న, దీప్తామ్ = ప్రకాశించుచున్న, అగ్నిశిఖోపమామ్ = అగ్నిజ్వాలతో సమానమైన, మేఘాత్ = మేఘమునుండి బయలుదేరుచున్న, శతహ్రదామ్ ఇవ = మెరుపు వలె ఉన్న, జిహ్వామ్ = జిహ్వను, పశ్య = చూడుము.

తా. ఇది ఆవులించినప్పుడు దీని నోటినుండి అగ్నిజ్వాల వలె ప్రకాశించుచున్న నాలుక పైకి వచ్చుచున్నది. ఇది మేఘమునుండి బైటకు వచ్చుచున్న మెరుపు వలె ఉన్నది; చూడుము. 27

మూ. మసారగల్లర్కముఖః శఙ్ఖముక్తానిభోదరః,
కస్య నామానిరూప్యోఽసౌ న మనో లోభయేన్మృగః. 28

ప్ర. అ. మసారగల్లర్కముఖః = ఇంద్రనీలమణివికారమైన పాత్ర వంటి ముఖము గలది, శఙ్ఖముక్తానిభోదరః = శంఖముతోను, ముత్యముతోను సమానమైన పొట్టగలది, అనిరూప్యః = వర్ణింప శక్యము కానిది అయిన, అసౌ మృగః = ఈ మృగము, కస్య నామ = ఎవనియొక్క, మనః = మనస్సును, న లోభయేత్ = లోభపెట్టదు ?

తా. వర్ణింప శక్యము కాని సౌందర్యము గల ఈ మృగము ముట్టి ఇంద్రనీలములు మాటిన పాత్ర వలె ఉన్నది. ఉదరము శంఖము వలె, ముత్యము వలె తెల్లగా నున్నగా ఉన్నది. అట్టి ఈ మృగము ఎవరి మనస్సును ఆకర్షించకుండా ఉండును ? 28

మూ. కస్య రూపమిదం దృష్ట్వా జామ్బూనదమయం ప్రభో,
నానారత్నమయం దివ్యం న మనో విస్మయం వ్రజేత్.

ప్ర. అ. ప్రభో = సమర్థుడ వైన లక్ష్మణా! జామ్బూనదమయమ్ = బంగారు వికారము, నానారత్నమయమ్ = అనేకరత్నముల వికారము, దివ్యమ్ = అద్భుతము అయిన, ఇదమ్ = ఈ, రూపమ్ = రూపమును, దృష్ట్వా = చూచి, కస్య = ఎవనియొక్క, మనః = మనస్సు, విస్మయమ్ = ఆశ్చర్యమును, న వ్రజేత్ = పొందకుండును.

తా. లక్ష్మణా! బంగారు వికారము, అనేకరత్నములతో నిండినది, అద్భుతము అయిన ఈ రూపమును చూచిన పిమ్మట ఎవనికి ఆశ్చర్యము కలుగదు?

మూ. మాంసహేతోరపి మృగాన్ విహారార్థం చ ధన్వినః,
ఘ్నన్తి లక్ష్మణ రాజానో మృగయాయాం మహావనే. 30

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా! రాజానః = రాజులు, మహావనే = మహావనమునందు, మృగయాయామ్ = వేటయందు, మాంసహేతోః = మాంసముకొరకు, ధన్వినః = ధనస్సుయొక్క, విహారార్థమ్ = విహారముకొరకు, మృగాన్ = మృగములను, ఘ్నన్తి = చంపుచున్నారు.

తా. లక్ష్మణా! రాజులు మహావనములో వేటాడుచు, మృగములను మాంసముకొరకు, ధనస్సును ఉపయోగించి వినోదము పొందుటకు, చంపుచుందురు.

మూ. ధనాని వ్యవసాయేన విచీయన్తే మహావనే,
ధాతవో వివిధాశ్చాపి మణిరత్నసువర్ణినః. 31

ప్ర. అ. మహావనే = మహావనమునందు, వ్యవసాయేన = ప్రయత్నము చేయుటచేత, ధనాని = ధనములు, మణిరత్నసువర్ణినః = మణులు, రత్నములు, బంగారము గల, వివిధాః = అనేకవిధములైన, ధాతవః = ధాతువులు, విచీయన్తే = ప్రోగుచేసికొనబడుచున్నవి.

తా. మహావనమునందు ఉద్యమము చేసి ధనములను, వివిధధాతువులను, మణులను, రత్నములను, బంగారమును ప్రోగుచేసికొనవలెను. 31

మూ. తత్సారమఖిలం నృణాం ధనం నిచయవర్ధనమ్,
మనసా చిన్తితం సర్వం యథా శుక్రస్య లక్ష్మణ. 32

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా! అఖిలమ్ = సమస్తమైన, తత్ = ఆ, సారమ్ = శ్రేష్ఠమైన, ధనమ్ = అరణ్యములో లభించు ధనము, నృణామ్ = మనుష్యులకు, మనసా = మనస్సుచేత, చిన్తితమ్ = ఆలోచించబడిన, సర్వమ్ = సమస్తమూ, శుక్రస్య యథా = శుక్రునకు ఎట్లో అట్లు, నిచయవర్ధనమ్ = కోశమును వృద్ధిపొందించును.

తా. లక్ష్మణా! అరణ్యములో లభించు సంపద అంతా, మనస్సుచేత ఆలోచించిన దంతా శుక్రుని కోశాగారమును అనాయాసముగా నింపి నట్లు, మానవుల కోశాగారమును నింపును.

వి. ఎవరైన గొంతెమ్మకోరికలు కోరుకొనగా అవి ఫలించవిచో, అతడు కోరిన వస్తు శుక్రుని ధనాగారములో చేరుచుండును అని పురాణాదిప్రసిద్ధి. 32

మూ. అర్థీ యేనార్థకృత్యేన సంవ్రజత్యవిచారయన్,
తమర్థమర్థశాస్త్రజ్ఞాః ప్రాహురర్థ్యాశ్చ లక్ష్మణ. 33

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా! అర్థీ = అర్థమునుకోరువాడు, యేన = ఏ, అర్థకృత్యేన = అర్థమునకు సంబంధించిన పనిచేత, అవిచారయన్ = ఆలోచించకుండగా, సంవ్రజతి = ముందుకు పోవునో, తమ్ = దానిని, అర్థశాస్త్రజ్ఞాః = అర్థశాస్త్రము తెలిసినవాళ్ళు, అర్థ్యాః = అర్థమును సంపాదించకలవాళ్ళు, అర్థమ్ = అర్థమునుగా, ప్రాహుః = చెప్పుదురు.

తా. లక్ష్మణా! ఏదైన ధనమును కోరు ఎవడు ఆ ధనమును సంపాదించుటకై, ముందువెనుకలాడక, ముందుకే పోవునో అతడు సంపాదించిన ధనమే ధన మని అర్థశాస్త్రజ్ఞులు, అర్థసంపాదననిపుణులు చెప్పుదురు. 33

మూ. ఏతస్య మృగరత్నస్య పరార్ధ్యే కాఞ్చనత్వచి,
ఉపవేక్ష్యతి వైదేహీ మయా సహ సుమధ్యమా. 34

ప్ర. అ. సుమధ్యమా = అందమైన నడుము గల, వైదేహీ = సీత,

ఏతస్య = ఈ, మృగరత్నస్య = శ్రేష్ఠమైన మృగముయొక్క, పరార్ధ్యే = శ్రేష్ఠమైన, కాఞ్చనత్వచి = బంగారు చర్మముమీద, మయా సహ = నాతో కూడ, ఉపవేక్ష్యతి = కూర్చుండగలదు.

తా. అందమైన నడుము గల సీత ఈ శ్రేష్ఠమృగము అమూల్యమైన బంగారు చర్మమీద నాతో కూడ కూర్చుండును. 34

మూ. న కాదళీ న ప్రియకీ న ప్రవేణీ న చావికీ,
భవేదేతస్య సదృశీ స్పర్శనేనేతి మే మతిః. 35

ప్ర. అ. స్పర్శనేన=స్పర్శచేత, కాదళీ = కదళీమృగముచర్మ, ఏతస్య= దీనికి, సదృశీ = సమానము, న భవేత్ = కాజాలదు, ప్రియకీ = ప్రియకమృగ చర్మ, న = కాదు, ప్రవేణీ = ప్రవేణి చర్మ, న = కాదు, ఆవికీ చ = గొఱ్ఱె చర్మ కూడ, న = కాదు, ఇతి = అని, మే = నాయొక్క, మతిః = అభిప్రాయము.

తా. కదళీమృగచర్మము గాని, ప్రియకమృగచర్మము గాని, ప్రవేణీ మృగచర్మము గాని, అవిచర్మము గాని మృదుస్పర్శవిషయమునందు దీనికి సాటి రాదని నా అభిప్రాయము. 35

మూ. ఏష చైవ మృగః శ్రీమాన్ యశ్చ దివ్యో నభశ్చరః,
ఉభావేతౌ మృగౌ దివ్యౌ తారామృగమహీమృగౌ. 36

ప్ర. అ. శ్రీమాన్ = శోభాయుక్తమైన, ఏషః = ఈ, మృగశ్చైవ = మృగము, నభశ్చరః = ఆకాశముపై సంచరించు, యశ్చ = ఏ, దివ్యః = శ్రేష్ఠమైన మృగ మున్నదో అది, దివ్యౌ = దివ్యములైన, ఏతౌ = ఈ, తారామృగమహీమృగౌ = నక్షత్రమండలములో (చంద్రునిలో) ఉన్న మృగము, భూమిమీద ఉన్న మృగము, ఉభౌ = ఈ రెండు మృగములే, మృగౌ = మృగములు.

తా. శోభాయుక్తమైన ఈ మృగము, దివ్యమైన ఆకాశమునందు సంచరించే మృగము, చంద్రునిపైన, భూమిమీద ఉన్న ఈ రెండు దివ్యమృగములే నిజమైన మృగములు. 36

మూ. యది వాయం తథా యన్మాం భవేద్వదసి లక్ష్మణ,
మాయైషా రాక్షసస్యేతి కర్తవ్యోఽస్య వధో మయా. 37

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా! ఏషా = ఇది, రాక్షసస్య = రాక్షసుని యొక్క, మాయా = మాయ, ఇతి = అని, మామ్ = నన్ను గూర్చి, యత్ = ఏ మాట, వదసి = చెప్పుచున్నావో, తథా = అట్లు, అయమ్ = ఇది, భవేద్యది వా = అయినను కూడ, మయా = నాచేత, అస్య = దీనియొక్క, వధః = వధ, కర్తవ్యః = చేయదగినది..

తా. లక్ష్మణా! నీవు చెప్పినట్లు ఇది రాక్షసుని మాయయే అయినను, నేను ఈ రాక్షసుని చంపివేయవలెను. 37

మూ. ఏతేన హి నృశంసేన మారీచేనాకృతాత్మనా,
వనే విచరతా పూర్వం హింసితా మునిపుఙ్గవాః. 38

ప్ర. అ. నృశంసేవ = క్రూరుడు, అకృతాత్మనా = దుష్టబుద్ధికలవాడు, వనే = వనమునందు, విచరతా = సంచరించుచున్నవాడు అయిన, ఏతేన = ఈ, మారీచేన = మారీచునిచేత, పూర్వమ్ = పూర్వము, మునిపుఙ్గవాః = మునిశ్రేష్ఠులు, హింసితాః = హింసింపబడినవారు.

తా. దుష్టబుద్ధి, క్రూరుడు అయిన ఈ మారీచుడు అరణ్యములో సంచరించుచు, పూర్వము ఎందరో మునీశ్వరులను చంపివేసినాడు. 38

మూ. ఉత్థాయ బహవో యేన మృగయాయాం జనాధిపాః,
నిహతాః పరమేష్వాసాస్తస్మాద్వధ్యస్త్వయం మృగః. 39

ప్ర. అ. యేన = ఏ కారణముచేత, పూర్వమ్ = పూర్వము, ఉత్థాయ = లేచి (ఎదిరించి), మృగయాయామ్ = వేటయందు, బహవః = అనేకులైన, పరమేష్వాసాః = గొప్ప ధనస్సు గల, జనాధిపాః = రాజులు, నిహతాః = చంపబడినారో, తస్మాత్ = ఆ కారణమువలన, అయం మృగః = ఈ మృగము, వధ్యః తు = చంపదగినదే.

తా. పూర్వము ఈ మృగము, ధనుర్ధరులై వేటకు వచ్చిన ఎందరో రాజులను ఎదిరించి వారిని చంపివేసినది. అందుచేత దీనిని చంపవలసి ఉన్నది. 39

మూ. పురస్తాదిహ వాతాపిః పరిభూయ తపస్వినః,
ఉదరస్థో ద్విజాన్ హన్తి స్వగర్భోఽశ్వతరీమివ. 40

ప్ర. అ. పురస్తాత్ = పూర్వము, ఇహ = ఈ ప్రాంతమునందు, వాతాపిః = వాతాపి, తపస్వినః = మునులను, పరిభూయ = తిరస్కరించి, ఉదరస్థః = ఉదరములో ఉన్నవాడై, అశ్వతరీమ్ = కంచరిగాడిదను, స్వగర్భః ఇవ = తన గర్భము వలె, ద్విజాన్ = ఆ బ్రాహ్మణులను, హన్తి = చంపెడివాడు.

తా. పూర్వము ఈ ప్రదేశమునందు, వాతాపి మునీశ్వరులను తిరస్కరించి వాళ్ళ ఉదరములో ప్రవేశించి, కంచరిగాడిదను దాని గర్భమునం దున్న శిశువు, గర్భమును చీల్చుకొని వచ్చుటచే చంపి నట్లు, ఆ బ్రాహ్మణులను, ఉదరములను చీల్చి బైటకు వచ్చి చంపుచుండెడివాడు. 40

మూ. స కదాచిచ్చిరాల్లోభాదాససాద మహామునిమ్,
అగస్త్యం తేజసా యుక్తం భక్షస్తస్య బభూవ హ, 41

ప్ర. అ. సః = ఆ వాతాపి, చిరాత్ = చిరకాలమునకు, కదాచిత్ = ఒక నాడు, లోభాత్ = దురాశవలన, తేజసా = తేజస్సుతో, యుక్తమ్ = కూడినవాడు, మహామునిమ్ = మహామునీ అయిన, అగస్త్యమ్ = అగస్త్యుని, ఆససాద = పొందెను. తస్య = ఆ అగస్త్యునకు, భక్షః = ఆహారముగా, బభూవ హ = అయ్యెను.

తా. చాల కాలానికి అత డొక రోజున మహాతేజఃశాలియైన అగస్త్య మహామునిని ఆహ్వానించి ఆతనికి ఆహారముగా ఆయెను. 41

మూ సముత్థానే చ తద్రూపం కర్తుకామం సమీక్ష్య తమ్,
ఉత్స్మయిత్వా తు భగవాన్ వాతాపిమిద మబ్రవీత్. 42

ప్ర. అ. సముత్థానే = తిరిగి లేచుట విషయమై, తత్ = ఆ, రూపమ్ = రూపమును, కర్తుకామమ్ = చేయుటకు కోరిక గల; తమ్ = ఆ, వాతాపిమ్ = వాతాపిని, సమీక్ష్య = చూచి, భగవాన్ = పూజ్యుడైన అగస్త్యుడు, ఉత్స్మయిత్వా = నవ్వి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. పూజ్యుడైన ఆ అగస్త్యుడు, ఆ వాతాపి మరల తన రూపము ధరించి లేచుటకై ప్రయత్నము చేయుచున్నట్లు చూచి, నవ్వుచు ఇట్లు పలికెను. 42

మూ. త్వయాఽవిగణ్య వాతాపే పరిభూతాః స్వతేజసా,
జీవలోకే ద్విజశ్రేష్ఠాసస్మాదసి జరాం గతః. 43

ప్ర. అ. వాతాపే = వాతాపీ! జీవలోకే = ఈ భూలోకమునందు, ద్విజ శ్రేష్ఠాః = శ్రేష్ఠులైన బ్రాహ్మణులు, త్వయా = నీచేత, అవిగణ్య = లెక్క చేయక, స్వతేజసా = తన బలముచేత, పరిభూతాః = తిరస్కరింపబడినారు. తస్మాత్ = ఆ కారణమువలన, జరాం గతః = జీర్ణించినవాడవు, అసి = అయితివి.

తా. వాతాపీ నీవు ఈ లోకములోని ఎందరో ఉత్తమబ్రాహ్మణులను, లెక్కచేయక, నీ బలముచేత అవమానించి చంపితివి. అందుచేతనే నీవిప్పుడు జీర్ణమైపోవుచున్నావు. 43

మూ. ఏవం తన్న భవేద్రక్షోవాతాపిరివ లక్ష్మణ
మద్విధం యోఽతిమన్యేత ధర్మనిత్యం జితేన్ద్రియమ్.44
భవేద్ధతోఽయం వాతాపిరగస్త్యేనేవ మా గతః.

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా! ఏవమ్ = ఇట్లు, వాతాపిరివ = వాతాపి వలె, తత్ = ఆ, రక్షః = రాక్షసుడు, న భవేత్ = ఉండడు. యః = ఏ రాక్షసుడు, ధర్మనిత్యమ్=ధర్మమునందు నిత్యము ప్రవర్తించువాడు, జితేన్ద్రియమ్= జితేంద్రియుడు అయిన, మద్విధమ్=నావంటివానినీ, అవమన్యేత=ఎదిరించునో, అయమ్ = అట్టి ఈ రాక్షసుడు, మా=నన్ను, గతః=పొందినవాడై, అగస్త్యేన= అగస్త్యునిచేత, వాతాపిరివ = వాతాపి వలె, హతః = చంపబడినవాడు, భవేత్= అగును.

తా. లక్ష్మణా! ఆ రాక్షసుడు కూడ వాతాపి వలె, ఇంక ఉండడు. నిత్యము ధర్మపరాయణుడు, జితేంద్రియుడు అయిన నావంటివానిని ఎదిరించి ఈ రాక్షసుడు నామీదకు వచ్చినచో, అగస్త్యుని చేతిలో వాతాపి మరణించి నట్లు మరణించగలడు. 44

మూ. ఇహ త్వం భవ సంనద్ధో యన్త్రితో రక్ష మైథిలీమ్, 45
అస్యామాయత్తమస్మాకం యత్కృత్యం రఘునన్దన.

ప్ర. అ. రఘునన్దన = లక్ష్మణా! త్వమ్ = నీవు, ఇహ = ఇక్కడ, సంనద్ధః = ఆయుధములుధరించి సిద్ధముగా ఉన్నవాడవు, భవ = అగుము.

యన్త్రితః = ఏకాగ్రచిత్తుడవై, మైథిలీమ్ = సీతను, రక్ష = రక్షించుము. అస్మాకమ్ = మనయొక్క, యత్ = ఏ, కృత్యమ్ = కృత్యము కలదో అది, అస్యామ్ = ఈమెయందు, ఆయత్తమ్ = అధీనమై ఉన్నది.

తా. లక్ష్మణా! నీవు ఆయుధములు ధరించి, సావధానచిత్తముతో సీతను రక్షించుము. మన కార్యము లన్నీ ఈమెమీదనే ఆధారపడి ఉన్నవి.

వి. ఈ శ్లోకములోని ఉత్తరార్ధం భావం ఏమిటో అస్పష్టంగా ఉన్నది. "మనము వచ్చిన రావణసంహారకార్యము ఈమెపై ఆధారపడి ఉన్నది'' అని విశేషార్థ మని వ్యాఖ్యాతలు వ్రాసినారు. 'విశేషార్థం మాట ఎలా గున్నా మామూలుగా పైకి చెప్పవలసిన భావం ఉండాలి కదా? అదేమిటి? ఈ విశేషార్థం కూడా అసంగతమే. "మన పని" పూర్తికావాలంటే సీతను లక్ష్మణుడు రక్షించకూడదు కదా? ప్రాచ్యప్రతిలో ఈ శ్లోకార్థము లేదు. 45

మూ. అహమేనం వధిష్యామి గ్రహీష్యామ్యపి వా మృగమ్, 46
యావద్గచ్ఛామి సౌమిత్రే మృగమానయితుం ద్రుతమ్.

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా! అహమ్ = నేను, ఏనమ్ = ఈ, మృగమ్ = మృగమును, వధిష్యామి = చంపగలను. అపి వా = లేక, గ్రహీష్యామి = గ్రహించగలను. మృగమ్ = మృగమును, ఆనయితుమ్ = తీసికొనివచ్చుటకు, ద్రుతమ్ = శీఘ్రముగా, యావద్గచ్ఛామి = వెళ్ళెదను.

తా. లక్ష్మణా! నే నీ మృగమును పట్టుకొనెదను, లేదా చంపివేసెదను. ఈ మృగమును తీసికొనివచ్చుటకై శీఘ్రముగా వెళ్లెదను. 46

మూ. పశ్య లక్ష్మణ వైదేహీం మృగత్వచి గతస్పృహామ్, 47
త్వచా ప్రధానయా హ్యేష మృగోఽద్య న భవిష్యతి.

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా! మృగత్వచి = మృగచర్మమునందు, గతస్పృహామ్ = పొందబడిన ఆసక్తి గల. వైదేహీమ్ = సీతను, పశ్య = చూడుము. ప్రధానయా = ప్రధానమైన, త్వచా = చర్మముచేత, ఏషః మృగః = ఈ మృగము, అద్య = ఇప్పుడు, న భవిష్యతి = ఉండదు.

తా. లక్ష్మణా! సీతకు ఈ మృగము చర్మమీద ఎంత ఆసక్తి ఉన్నదో చూడుము. దీని చర్మమే ప్రధానమైనది గాన ఈ మృగము ఇంక జీవించదు. 47

మూ. అప్రమత్తేన తే భావ్యమాశ్రమస్థేన సీతయా, 48
యావత్పృషతమేకేన సాయకేన నిహన్మ్యహమ్,
హత్వైతచ్చర్మ చాదాయ శీఘ్రమేష్యామి లక్ష్మణ. 49

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా! ఆశ్రమస్థేన = ఆశ్రమములో ఉన్న, తే = నీకు (నీచేత) సీతయా = సీతతో కూడ, అప్రమత్తేన = ఏమరిపాటులేకుండ, భావ్యమ్ = కావలెను. పృషతమ్ = ఈచుక్కల జింకను, ఏకేన = ఒక్క, బాణేన = బాణముచేత, అహమ్ = నేను, యావత్ నిహన్మి = చంపెదను. హత్వా = చంపి, ఏతచ్చర్మ = దీని చర్మను, ఆదాయ = గ్రహించి, శీఘ్రమ్ = శీఘ్రముగా, ఏష్యామి = రాగలను.

తా. నేనీ మృగమును ఒక్క బాణముచేత చంపి దీని చర్మను తీసికొని శీఘ్రముగా వచ్చెదను. అంతవరకు ఆశ్రమములో నీవు, సీతా కూడ ఏమరిపాటు లేకుండా ఉండవలెను. 49

మూ. ప్రదక్షిణేనాతిబలేన పక్షిణా
జటాయుషా చాతిబలేన లక్ష్మణ,
భవాప్రమత్తః పరిగృహ్య మైథిలీం
ప్రతిక్షణం సర్వత ఏవ శఙ్కితః. 50

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
త్రిచత్వారింశః సర్గః.

ప్ర.-అ. లక్ష్మణ = లక్ష్మణా! మైథిలీమ్ = సీతను, పరిగృహ్య = తీసికొని, (దగ్గర ఉంచుకొని), ప్రతిక్షణమ్ = ప్రతీక్షణమునందు, సర్వతః ఏవ = అంతటినుండీ, శఙ్కితః = శంకించుచున్నవాడవై, ప్రదక్షిణేన = చాల సమర్థుడు, అతిబలేన = చాల బలము కలవాడు, బుద్ధిమతా = బుద్ధిమంతుడుఅయిన, పక్షిణా = పక్షియైన, జటాయుషా = జటాయువుతో కూడ, అప్రమత్తః = ఏమరిపాటు లేనివాడవై, భవ = ఉండుము.

తా. నీవు సీతను ఇక్కడనే ఉంచుకొని, అపాయము ఏ వైపునుండైనా రావచ్చు నని శంకించుచు, చాల సమర్థుడు, మహాబలశాలి, బుద్ధిమంతుడు అయిన జటాయువుతో కలిసి ఏమరిపాటు లేకుండా ఉండుము.

'బాలానందిని''అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో నలుబదిమూడవ సర్గ సమాప్తము.

అథ చతుశ్చత్వారింశః సర్గః

[రాముడు మారీచుని చంపుట, మారీచుడు సీతాలక్ష్మణుల పేర్లు పెట్టి అరచుట చూచి రాముడు చింతాక్రాంతు డగుట.]

మూ. తథా తు తం సమాదిశ్య భ్రాతరం రఘునన్దనః,
బబన్ధాసిం మహాతేజా జామ్బూనదమయత్సరుమ్. 1

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, రఘునన్దనః = రాముడు, భ్రాతరమ్ = సోదరుడైన, తమ్ = ఆ లక్ష్మణుణ్ణి, తథా = అట్లు, సమాదిశ్య = ఆజ్ఞాపించి, జామ్బూనదమయత్సరుమ్ = బంగారు పిడి గల, అసిమ్ = ఖడ్గమును, బబన్ధ = కట్టెను.

తా. గొప్ప తేజస్సు గల ఆ రాముడు సోదరుడైన ఆ లక్ష్మణుణ్ణి ఈ విధముగా ఆజ్ఞాపించి బంగారు పిడి గల ఖడ్గమును నడుమునకు కట్టుకొనెను. 1

మూ. తతస్త్రివినతం చాపమాదాయాత్మవిభూషణమ్,
ఆబధ్య చ కలాపౌ ద్వౌ జగామోదగ్రవిక్రమః. 2

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ఉదగ్రవిక్రమః = అధికమైన పరాక్రమము గల రాముడు, త్రివినతమ్ = మూడు చోట్ల వంగిన, ఆత్మవిభూషణమ్ = తనకు అలంకారమైన, చాపమ్ = ధనస్సును, ఆదాయ = గ్రహించి, ద్వౌ = రెండు, కలాపౌ = అంబులపొదులను, ఆబధ్య = కట్టి, జగామ = వెళ్ళెను.

తా. పిమ్మట, అధికమైన పరాక్రమము గల ఆ రాముడు తన అలంకారము వంటి, మూడు వంపు లున్న ధనస్సును గ్రహించి, రెండు అంబుల పొదులను కట్టుకొని బయలుదేరెను. 2

మూ. తం వఞ్చయానో రాజేన్ద్రమాపతన్తం నిరీక్ష్య వై
బభూవాన్తర్హితస్త్రాసాత్పునః సందర్శనేఽభవత్ 3
బద్ధాసిర్ధనురాదాయ ప్రదుద్రావ యతో మృగః

ప్ర. అ. (మృగము), ఆపతన్తమ్=శీఘ్రముగా వచ్చుచున్న, రాజేన్ద్రమ్= రాజులలో శ్రేష్ఠుడైన, తమ్=ఆ రాముణ్ణి, నిరీక్ష్య = చూచి, వఞ్చయానః = ఆతనిని వంచించుచు, త్రాసాత్ = భయమువలన, అన్తర్హితః = అంతర్ధానము చెందినది, బభూవ = ఆయెను. పునః = మరల, సందర్శనే = చూపునందు, అభవత్ = ఉండెను. (రాముడు), బద్ధాసిః=కట్టబడిన ఖడ్గము కలవాడై, ధనుః=ధనస్సును, ఆధాయ = గ్రహించి, మృగః = మృగము, యతః = ఎటు వైపున ఉన్నదో అటువైపు, ప్రదుద్రావ = పరుగెత్తెను.

తా. తన వైపు శీఘ్రముగా వచ్చుచున్న రాజాధిరాజైన ఆ రాముణ్ణి చూచి భయపడి ఆ మృగము ఆతనిని వంచించుచు, కనబడకుండపోయెను. మరల కనబడెను. రాముడు ఖడ్గము బంధించి ధనస్సు ధరించి మృగ మున్న వైపునకు శీఘ్రముగా వెళ్లెను. 3

మూ. తం స్మ పశ్యతి రూపేణ ద్యోతమానమివాగ్రతః 4
అవేక్ష్యావేక్ష్య ధావన్తం ధనుష్పాణిర్మహావనే,
అతివృత్తమిషోః పాతాల్లోభయానం కదాచన 5

శఙ్కితం తు సముద్భ్రాన్తముత్పతన్తమివామ్బరే
దృశ్యమానమదృశ్యం చ వనోద్దేశేషు కేషు చిత్. 6
ఛిన్నాభ్రైరివ సంవీతం శారదం చన్ద్రమణ్డలమ్.

ప్ర. అ. ధనుష్పాణిః = ధనస్సు హస్తమునందు గల రాముడు, అవేక్ష్య అవేక్ష్య = తన వైపు చూచి చూచి, మహావనే=మహారణ్యములోనికి, ధావన్తమ్= పరుగెత్తుచున్న, తమ్ = దానిని, రూపేణ = రూపముతో, అగ్రతః = ఎదుట, పశ్యతి స్మ = చూచుచుండెను. కదాచన = ఒకప్పుడు, ఇషోః=బాణముయొక్క, పాతాత్ = పాతమునుండి, అతివృత్తమ్ = దాటిపోయినదై, లోభయానమ్=ఆశ కలించుచున్న (దానిని చూచెను). శఙ్కితమ్ = భయపడినదై , సముద్భ్రాన్తమ్=

కంగారు పడుచున్నదై, అమ్బరే = ఆకాశమునందు, ఉత్పతన్తమివ = ఎగురు చున్నది వలె ఉన్న ఆ మృగమును చూచెను. ఛిన్నాభ్రైః = ముక్కలు ముక్కలుగా ఉన్న మేఘములచేత, సంవీతమ్ = ఆవరింపబడినదై, శారదమ్ = శరత్కాలసంబంధమైన, చన్ద్రమణ్డలమ్ ఇవ = చంద్రమండలము వలె, క్వేషు చిత్ = కొన్ని, వనోద్దేశేషు = వనప్రదేశములందు, దృశ్యమానమ్ = కనబడు చున్నది, అదృశ్యం చ = కనబడకున్నదీ అయిన ఆ మృగమును చూచెను.

తా. ధనస్సును ధరించిన రామునకు, ఆ మృగము తనను చూచి చూచి, అరణ్యములోనికి పారిపోవుచున్నట్లు, మరు క్షణములో అది తన ముందటనే అద్భుత రూపముతో ప్రకాశించుచున్నట్లు కనబడెను. మరొక క్షణములో తనను లోభపెట్టుచు బాణము పడకుండా తప్పించుకొనుచున్నట్లు కనబడెను. మరొక క్షణమున అది భయపడి కంగారుతో ఆకాశములోనికి ఎగురుచున్నట్లు కనబడెను. మరొక క్షణమున ఆ మృగము మేఘము ముక్కల వెనుకనున్న శరత్కాలచంద్ర మండలము వలె కొన్ని వనప్రాంతములయందు కనబడి కనబడకుండా ఉండెను. 4,5,6

మూ. ముహూర్తాదేవ దదృశే ముహుర్దూరాత్ప్రకాశతే, 7
దర్శనాదర్శనాదేవ సోఽపాకర్షత రాఘవమ్,
సుదూరమాశ్రమస్యాస్య మారీచో మృగతాం గతః. 8

ప్ర. అ. మృగతామ్ = మృగత్వమును, గతః = పొందిన, సః మారీచః = ఆ మారీచుడు, ముహూర్తాదేవ = ఒక ముహూర్తమునందే, దదృశే = చూడ బడెను. ముహూర్తాత్ = మరొక ముహూర్తమున, దూరాత్ = దూరమునుండి, ప్రకా శతే = ప్రకాశించుచుండెను. ఈ విధముగా అతడు ఒక మాటు కనబడుచు, మరొక మాటు కనబడక, రాముణ్ణి ఆశ్రమమునుండి చాలదూరము తీసికొనిపోయెను.

తా. మృగరూపము ధరించిన ఆ మారీచుడు, ఒక క్షణములో దగ్గరగా కనబడి, మరుక్షణములో దూరమునందు ప్రకాశించెను. ఈ విధముగ ఒక మాటు కనబడుచు, ఒక మాటు కనబడక రాముణ్ణి ఆశ్రమమునుండి చాలా దూరము తీసి కొనిపోయెను. 7, 8

మూ. ఆసీత్ క్రుద్ధస్తు కాకుత్స్థో వివశస్తేన మోహితః,
అథావతస్థే సుశ్రాన్తశ్ఛాయామాశ్రిత్య శాద్వలే. 9

ప్ర. అ. తేన = దానిచేత, మోహితః = వంచింపబడిన, కాకుత్స్థః = రాముడు, వివశః = వివశుడై, క్రుద్ధః = కోపగించినవాడు, ఆసీత్ = ఆయెను. అథ = అటుపిమ్మట, సుశ్రాన్తః = చాల అలసిపోయినవాడై, ఛాయామ్ = నీడను, ఆశ్రిత్య = ఆశ్రయించి, శాద్వలే = పచ్చికబీడుమీద, అవతస్థే = ఉండెను.

తా. ఈ విధముగా ఆ మృగము వంచించుటచే ఏమీ చేయజాలని రామునకు కోపము వచ్చెను. పిదప అతడు చాల అలసిపోయి, నీడలో పచ్చికబీడుమీద కూర్చుండెను. 9

మూ. స తమున్మాదయామాస మృగరూపో నిశాచరః,
మృగైః పరివృతో వన్యైరదూరాత్ప్రత్యదృశ్యత. 10

ప్ర. అ. మృగరూపః = మృగరూపము గల, సః నిశాచరః = ఆ రాక్షసుడు, తమ్ = ఆ రాముణ్ణి, ఉన్మాదయామాస = భ్రాంతచిత్తునిగా చేసెను. వన్యైః = వనమునకు సంబంధించిన, మృగైః = మృగములచేత, పరివృతః = చుట్టువారుకొనబడినదై, అదూరాత్ = సమీపమునందే, అదృశ్యత = చూడబడెను.

తా. మృగరూపము ధరించిన ఆ రాక్షసుడు ఈ విధముగ రామునకు చిత్తవిభ్రాంతి కలిగించెను. ఇంతలో ఆ మృగము కొన్ని వన్యమృగములతో కలిసి సమీపమునందే కనబడెను. 10

మూ. గ్రహీతుకామం దృష్ట్వైనం పునరేవాభ్యధావత,
తత్క్షణాదేవ సంత్రాసాత్పునరన్తర్హితోఽభవత్. 11

ప్ర. అ. గ్రహీతుకామమ్ = పట్టుకొనుటకు కోరిక గల, ఏనమ్ = ఈ రాముణ్ణి, దృష్ట్వా = చూచి, పునరేవ = తిరిగి, అభ్యధావత = దగ్గరగా పరుగెత్తికొని వచ్చెను. తత్క్షణాదేవ = వెంటనే, పునరేవ = మరల, త్రాసాత్ = భయమువలన, అన్తర్హితః = అంతర్ధానము చెందినది, అభవత్ = ఆయెను.

తా. ఆ రాముడు తనను పట్టుకొనకోరుచున్నాడని చూచి, అతనికి దొరక

నున్నదా అన్నట్లు అతని వైపు పరుగెత్తి, మరల వెంటనే భయముతో కనబడ
కుండ పోయెను. 11

మూ. పునరేవ తతో దూరాద్వృక్షషణ్డాద్వినిఃసృతమ్,
దృష్ట్వా రామో మహాతేజాస్తం హన్తుం కృతనిశ్చయః. 12

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, రామః = రాముడు, పునరేవ = మరల, దూరాత్ = దూరమునందున్న, వృక్షషణ్డాత్ = వృక్షముల సమూహమునుండి, వినిస్సృతమ్ = బైటకు వచ్చిన, తమ్ = ఆ మృగమును, దృష్ట్వా = చూచి, హన్తుమ్ = చంపుటకు, కృతనిశ్చయః = చేయబడిన నిశ్చయము కలవాడు (ఆయెను).

తా. మహాతేజఃశాలియైన రాముడు మరల దూరముగా ఉన్న చెట్ల గుంపు నుండి బైటకు వచ్చుచున్న ఆ మృగమును చూచి దానిని చంపుటకు నిశ్చయించు కొనెను. 12

మూ. భూయస్తు శరముద్ధృత్య కుపితస్తత్ర రాఘవః,
సూర్యరశ్మిప్రతీకాశం జ్వలన్తమరిమర్దనః. 13

సంధాయ సుదృఢే చాపే వికృష్య బలవద్బలీ,
తమేవమృగముద్దిశ్య శ్వసన్తమివ పన్నగమ్. 14
ముమోచ జ్వలితం దీప్తమస్త్రం బ్రహ్మవినిర్మితమ్.

ప్ర. అ. తత్ర = ఆ సమయమునందు, భూయః = మిక్కిలి, కుపితః = కోపించిన, అరిమర్దనః = శత్రుసంహారకుడైన, బలీ = బలశాలియైన, రాఘవః = రాముడు, సూర్యరశ్మిప్రతీకాశమ్ = సూర్యకిరణముతో సమానమైన, జ్వలన్తమ్ = ప్రజ్వలించుచున్న, శరమ్ = బాణమును, ఉద్ధృత్య = పైకి తీసి, సుదృఢే = చాలదృఢమైన, చాపే = ధనస్సునందు, సంధాయ = సంధించి, బలవత్ = బలముగా, వికృష్య = లాగి, శ్వసన్తమ్ = బుసలుకొట్టుచున్న, పన్నగమ్ ఇవ = సర్పము వలెఉన్న, జ్వలితమ్ = మండుచున్న, దీప్తమ్ = ప్రకాశించుచున్న, బ్రహ్మనిర్మితమ్ = బ్రహ్మచేత నిర్మించబడిన, అస్త్రమ్ = అస్త్రమును, తమ్ = ఆ, మృగమేవ = మృగమునే, ఉద్దిశ్య = ఉద్దేశించి, ముమోచ = విడచెను.

తా. అప్పుడు, శత్రుసంహారకుడు, బలశాలి అయిన రాముడు చాల కోపించినవాడై, సూర్యకిరణము వలె ప్రకాశించుచున్న బాణమును పైకి తీసి, దానిని చాల దృఢమైన ధనస్సుపై ఎక్కుపెట్టి, గట్టిగా లాగి, బుసలుకొట్టుచున్న సర్పము వలె ఉన్న, ప్రజ్వలించుచు ప్రకాశించుచున్న బ్రహ్మాస్త్రమును ఆ లేడిపై ప్రయోగించెను. 13, 14

మూ. శరీరం మృగరూపస్య వినిర్భిద్య శరోత్తమః, 15
మారీచస్యైవ హృదయం బిభేదాశనిసన్నిభః.

ప్ర. అ. అశనిసన్నిభః = వజ్రాయుధముతో సమానమైన, శరోత్తమః = శ్రేష్ఠమైన ఆ బాణము, మృగరూపస్య = మృగరూపముయొక్క, శరీరమ్ = శరీరమును, వినిర్భిద్య = భేదించి, మారీచస్య = మారీచునియొక్క, హృదయమేవ = హృదయమునే, బిభేద = భేదించెను.

తా. వజ్రాయుధము వంటి ఆ శ్రేష్ఠమైన బాణము మృగరూపములో ఉన్న ఆ శరీరమును భేదించి మారీచుని హృదయమునే బ్రద్దలుకొట్టెను. 15

మూ. తాలమాత్రమథోత్ప్లుత్య న్యపతత్స శరాతురః, 16
వినదన్ భైరవం నాదం ధరణ్యామల్పజీవితః.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, సః = మారీచుడు, శరాతురః = బాణముచేత పీడితుడై, అల్పజీవితః = అల్పమైన జీవితము కలవాడై, భైరవం నాదమ్ = భయంకరమైన ధ్వనిని, వినదన్ = ధ్వనిచేయుచు, తాలమాత్రమ్ = తాటిచెట్టు ఎత్తు, ఉత్ప్లుత్య = ఎగిరి, ధరణ్యామ్ = భూమిమీద, న్యపతత్ = పడెను.

తా. ఆ మారీచుడు బాణముచేత పీడితుడై, అల్పమైన జీవితముతో, తాటిచెట్టు ఎత్తు ఎగిరి, భయంకరముగా ధ్వని చేయుచు నేలమీద పడెను. 16

మూ. మ్రియమాణస్తు మారీచో జహౌ తాం కృత్రిమాం తనుమ్,
స్మృత్వా తద్వచనం రక్షో దధ్యౌ కేన తు లక్ష్మణమ్,
ఇహ ప్రస్థాపయేత్సీతా శూన్యే తాం రావణో హరేత్ 18

ప్ర. అ. మారీచః = మారీచుడు, మ్రియమాణః = మరణించుచు, కృత్రి

మామ్ = కృత్రిమమైన, తామ్ = ఆ, తనుమ్ = శరీరమును, జహౌ = విడచెను. రక్షః = మారీచుడు, తద్వచనమ్ = ఆ రావణుని వచనమును; స్మృత్వా = స్మరించి, దధ్యౌ = ఆలోచించెను. సీతా = సీత, కేన = దేనిచేత, లక్ష్మణమ్ = లక్ష్మణుణ్ణి, ఇహ = ఇచటికి, ప్రస్థాపయేత్ = పంపివేయును. శూన్యే = శూన్యప్రదేశమునందున్న, తామ్ = ఆమెను, రావణః = రావణుడు, హరేత్ = హరించును.

తా. మారీచుడు మరణించుచు కృత్రిమమైన ఆ మృగరూపమును విడచి వేసెను. ఆతడు రావణుని మాటలు స్మరించుచు, ''నేను ఇపుడేమి చేసిన సీత లక్ష్మణుని ఇక్కడికి పంపివేయును? శూన్యప్రదేశమునం దున్న ఆమెను రావణుడు ఎట్లు హరించుటకు శక్య మగును?'' అని ఆలోచించెను. 17, 18

మూ. స ప్రాప్తకాలమాజ్ఞాయ చకార చ తతః స్వనమ్,
సదృశం రాఘవస్యేహ హా సీతే లక్ష్మణేతి చ. 19

ప్ర. అ. తతః = ఆటుపిమ్మట, సః = ఆ మారీచుడు, ప్రాప్తకాలమ్ = సమయమునకు తగిన ఉపాయమును, ఆజ్ఞాయ = తెలుసుకొని, ఇహ = ఇక్కడ రాఘవస్య = రామునకు, సదృశమ్ = తగిన (పోలిన), హా సీతే = అయ్యో! సీతా!, లక్ష్మణ = అయ్యో! లక్ష్మణా! ఇతిచ = అని, స్వనమ్ = ధ్వనిని, చకార = చేసెను.

తా. పిమ్మట ఆ మారీచుడు ఆ సమయమునకు తగిన ఉపాయమును ఆలోచించి, రాముని కంఠస్వరముతో సమానమైన స్వరముతో, ''అయ్యో! సీతా, అయ్యో! లక్ష్మణా!" అని అరచెను. 19

మూ. తేన మర్మణి నిర్విద్ధం శరేణానుపమేన హి,
మృగరూపం తు తత్త్యక్త్వా రాక్షసం రూపమాస్థితః. 20
చక్రే స సుమహాకాయం మారీచో జీవితం త్యజన్.

ప్ర. అ. సః మారీచః = ఆ మారీచుడు, తేన = ఆరామునిచేత, అనుపమేన = సాటిలేని, శరేణ = బాణముచేత, మర్మణి = మర్మప్రదేశమునందు, నిర్విద్ధమ్ = కొట్టబడిన, తత్ = ఆ, మృగరూపమ్ = మృగరూపమును, త్యక్త్వా = విడచి, రాక్షసం రూపమ్ = రాక్షసరూపమును, ఆస్థితః = గ్రహించినవాడై,

జీవితమ్ = జీవితమును, త్యజన్ = విడచుచు, సుమహాకాయమ్ = చాల పెద్ద శరీరమును, చక్రే = చేసెను.

తా. ఆ రాముడు సాటిలేని బాణముచేత మర్మస్థానమునందు కొట్టగా, మారీచుడు, ప్రాణములను విడచుచు, మృగరూపమును విడచి రాక్షసరూపము ధరించి, చాల పెద్ద శరీరముతో ఉండెను. 20

మూ. తం దృష్ట్వా పతితం భూమౌ రాక్షసం భీమదర్శనమ్,
రామో రుధిరసిక్తాఙ్గం చేష్టమానం మహీతలే
జగామ మనసా సీతాం లక్ష్మణస్య వచః స్మరన్. 22

ప్ర. అ. రామః = రాముడు, భూమౌ = నేలమీద, పతితమ్ = పడిన, భీమదర్శనమ్ = భయంకరమైన దర్శనము గల, రుధిరసిక్తాఙ్గమ్ = రక్తముచేత తడపబడిన శరీరము గల, మహీతలే = భూమియందు, చేష్టమానమ్ = దొర్లుచున్న, తం రాక్షసమ్ = ఆ రాక్షసుణ్ణి, దృష్ట్వా = చూచి, లక్ష్మణస్య = లక్ష్మణుని యొక్క, వచః = వచనమును, స్మరన్ = స్మరించుచు, మనసా = మనస్సుతో సీతామ్ = సీతను, జగామ = పొందెను.

తా. చూచుటకు భయంకరుడుగా ఉన్న ఆ రాక్షసుడు నేలమీదపడి, రక్తముచే తడిసిన శరీరముతో నేలపై దొర్లుచుండగా చూచి రాముడు లక్ష్మణుని మాటలు స్మరించుచు, సీతను గూర్చి ఆలోచించుటకు ప్రారంభించెను. 21,22

మూ. మారీచస్య తు మాయైషా పూర్వోక్తం లక్ష్మణేన తు,
తత్తథా హ్యాభవచ్చాద్య మారీచోఽయం మయా హతః.

ప్ర. అ. ఏషా = ఇది. మారీచస్య = మారీచునియొక్క, మాయా = = మాయ. లక్ష్మణేన = లక్ష్మణునిచేత, పూర్వోక్తమ్ = పూర్వము చెప్పబడిన, తత్ = అది, తథా = అట్లే, అభవత్ హి = అయినది కదా! మయా = నాచేత, హతః = చంపబడిన, అయమ్ = ఇతడు, మారీచః = మారీచుడు.

తా. "ఇది మారీచుని మాయయే, లక్ష్మణుడు ముందుగా ఏది చెప్పినాడో అదే సత్యమైనది. నేను చంపినవాడు మారీచుడే''. 23

మూ. హా సీతే లక్ష్మణేత్యేవమాక్రుశ్య చ మహాస్వరమ్,
మమార రాక్షసః సోఽయం శ్రుత్వా సీతా కథం భవేత్.
లక్ష్మణశ్చ మహాబాహుః కామవస్థాం గమిష్యతి,
ఇతి సంచిన్త్య ధర్మాత్మా రామో హృష్టతనూరుహః.

ప్ర. అ. సః = అట్టి, అయం రాక్షసః = ఈ రాక్షసుడు, హాసీతే = అయ్యో! సీతా!, లక్ష్మణ = అయ్యో లక్ష్మణా! ఇత్యేవమ్ = ఇట్లు, మహాస్వరమ్ = గొప్ప స్వరము కలుగునట్లుగా, ఆక్రుశ్య = అరచి, మమార = మరణించెను. శ్రుత్వా = ఇదివిని, సీతా = సీత, కథమ్ = ఎట్లు, భవేత్ = అగునో! మహాబాహుః = గొప్ప బాహువులు గల, లక్ష్మణశ్చ = లక్ష్మణుడు కూడ, కామ్ = ఏ, అవస్థామ్ = అవస్థను, గమిష్యతి = పొందగలడో! ధర్మాత్మా = ధర్మాత్ముడైన, రామః = రాముడు, ఇతి = ఇట్లు, సంచిన్త్య = ఆలోచించి, హృష్టతనూరుహః = గగుర్పొడిచిన రోమములు కలవాడు, (ఆయెను).

తా. "ఈ రాక్షసుడు "అయ్యో! సీతా!, అయ్యో! లక్ష్మణా!" అని గట్టిగా అరచి మరణించినాడు. ఇది విని సీత ఏమగునో! మహాబాహువైన లక్ష్మణుడు కూడ ఏ అవస్థ పొందునో" ధర్మాత్ముడైన రామునకు ఈ ఆలోచన కలగగానే అతని ఒడలు జలదరించెను. 24, 25

మూ. తత్ర రామం భయం తీవ్రమావివేశ విషాదజమ్,
రాక్షసం మృగరూపం తం హత్వా శ్రుత్వా చ తత్స్వరమ్.

ప్ర. అ. మృగరూపమ్ = మృగరూపము గల, రాక్షసమ్ = రాక్షసుని, హత్వా = చంపి, తత్స్వరమ్ = వానిస్వరమును, శ్రుత్వాచ = విని, తత్ర = అక్కడ, రామమ్ = రాముణ్ణి, విషాదజమ్ = దుఃఖమువలన కలిగిన, తీవ్రమ్ = తీవ్రమైన, భయమ్ = భయము, ఆవివేశ = ఆవేశించెను

తా. అక్కడ ఆ మృగమును చంపి, దాని స్వరమును విన్న రామునకు దుఃఖమువలన జనించిన గొప్ప భయము కలిగెను. 26

మూ. నిహత్య పృషతం చాన్యం మాంసమాదాయ రాఘవః,
త్వరమాణో జనస్థానం ససారాభిముఖస్తదా. 27

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
చతుశ్చత్వారింశః సర్గః.

ప్ర. అ. తదా = అప్పుడు, రాఘవః = రాముడు, అన్యమ్ = మరియొక, పృషతమ్ = చుక్కల జింకను, నిహత్య = చంపి, మాంసమ్ = మాంసమును, ఆదాయ = గ్రహించి, త్వరమాణః = తొందరపడుచు, జనస్థానమ్ = జనస్థానమును గూర్చి, అభిముఖః = అభిముఖుడై, ససార = వెళ్ళెను.

తా. అప్పుడు రాముడు మరొక చుక్కల లేడిని చంపి, దాని మాంసము తీసికొని, తొందరపడుచు, జనస్థానము వైపు వెళ్లెను. 27

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్య కాండలో నలుబది నాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చచత్వారింశః సర్గః

[పరుషవాక్యములు పలికి సీత పంపగా లక్ష్మణుడు రాముని వద్దకు వెళ్ళుట]

మూ. ఆర్తస్వరం తు తం భర్తుర్విజ్ఞాయ సదృశం వనే,
ఉవాచ లక్ష్మణం సీతా గచ్ఛ జానీహి రాఘవమ్. 1

ప్ర. అ. సీతా = సీత, వనే = వనమునందు, భర్తుః = భర్తయొక్క స్వరమునకు, సదృశమ్ = సమానమైన, తమ్ = ఆ, ఆర్తస్వరమ్ = దీనస్వరమును, విజ్ఞాయ = గుర్తించి, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, ఉవాచ = పలికెను. గచ్ఛ = వెళ్ళుము. రాఘవమ్ = రాముని గూర్చి, జానీహి = తెలిసికొనుము.

తా. వనమునుండి వినవచ్చుచున్న తన భర్త స్వరమువంటి ఆ దీనస్వరమును గుర్తించి సీత లక్ష్మణునితో ''వెళ్ళి రాముని కేమైనదో తెలిసికొనుము'' అని పలికెను. 1

మూ. న హి మే హృదయం స్థానే జీవితం వావతిష్ఠతి,
క్రోశతః పరమార్తస్య శ్రుతః శబ్దో మయా భృశమ్, 2
ఆక్రన్దమానం తు వనే భ్రాతరం త్రాతుమర్హసి.

ప్ర. అ. భృశమ్ = మిక్కిలి, క్రోశతః = అరచుచున్నవాడు, పరమార్తస్య = మిక్కిలి దుఃఖితుడు అయిన రామునియొక్క, శబ్దః = స్వరము, మయా = నాచేత, శ్రుతః = వినబడినది. మే = నాయొక్క, హృదయమ్ = హృదయము గాని, జీవితం వా = జీవితము కాని, స్థానే = స్థానమునందు, న అవతిష్ఠతిహి = ఉండుటలేదు. వనే = వనమునందు, ఆక్రన్దమానమ్ = అరచుచున్న, భ్రాతరమ్ = సోదరుని, త్రాతుమ్ = రక్షించుటకు, అర్హసి = తగియున్నావు.

తా. చాల దుఃఖముతో బిగ్గరగా అరచుచున్న రాముని అరపు విని నా

హృదయము కాని, ప్రాణములు కాని నిలచుటలేదు. అరణ్యములో అరచుచున్న నీ సోదరుని రక్షింపుము. 2

మూ. తం క్షిప్రమభిధావ త్వం భ్రాతరం శరణైషిణమ్, 3
రక్షసాం వశమాపన్నం సింహానామివ గోవృషమ్.

ప్ర. అ. సింహానామ్ = సింహములకు వశమైన, గోవృషమివ = ఎద్దును వలె, రక్షసామ్ = రాక్షసులకు, వశమ్ = వశమును, ఆపన్నమ్ = పొందిన, శరణైషిణమ్ = రక్షణమును కోరుచున్న, తం భ్రాతరమ్ = ఆ సోదరుని గూర్చి, క్షిప్రమ్ = శీఘ్రముగా, త్వమ్ = నీవు, అభిధావ = పరుగెత్తుము.

తా. ఎద్దు సింహాలకు వశమైపోయినట్లు రాక్షసులకు వశుడైపోయి నీ సోదరుడు, రక్షణ కోరుచున్నాడు. అతనివద్దకు శీఘ్రముగా వెళ్లుము. 3

మూ. న జగామ తథోక్తస్తు భ్రాతురాజ్ఞాయ శాసనమ్, 4
తమువాచ తతస్తత్ర కుపితా జనకాత్మజా.

ప్ర. అ. తథా = ఆ విధముగా, ఉక్తస్తు = పలకబడినవాడైనను, భ్రాతుః = సోదరునియొక్క, శాసనమ్ = ఆజ్ఞను, ఆజ్ఞాయ = తెలిసికొని, న జగామ = వెళ్లలేదు. తతః = అటుపిమ్మట, కుపితా = కోపించిన, జనకాత్మజా = సీత, తత్ర = అక్కడ, తమ్ = అతనిని గూర్చి, ఉవాచ = పలికెను.

తా. సీత ఆ విధముగా చెప్పినను లక్ష్మణుడు అన్నగారి ఆజ్ఞను స్మరించుచు వెళ్లలేదు. అప్పుడు సీత కుపితురాలై ఇట్లు పలికెను. 4

మూ. సౌమిత్రే మిత్రరూపేణ భ్రాతుస్త్వమసి శత్రువత్, 5
యస్త్వమస్యామవస్థాయాం భ్రాతరం నాభిపత్స్యసే.

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా ! యః = ఏ, త్వమ్ = నీవు, అస్యామ్ = ఈ, అవస్థాయామ్ = అవస్థయందు, భ్రాతరమ్ = సోదరుని, నాభిపత్స్యసే = పొందవో, అట్టి, త్వమ్ = నీవు, భ్రాతుః = నీ సోదరునికి, మిత్రరూపేణ = మిత్రరూపముతో ఉన్న, శత్రువత్ = శత్రువు వలె, అసి = అయి ఉన్నావు.

తా. లక్ష్మణా! ఇట్టి కష్టావస్థలో కూడ నీవు నీ సోదరునికి సాహాయ్యము చేయుటకు వెళ్ళుటలేదు! నీవు రామునకు పైకి మిత్రుడు వలె కనబడే శత్రువు. 5

మూ. ఇచ్ఛసి త్వం వినశ్యన్తం రామం లక్ష్మణ మత్కృతే, 6
లోభాత్త్వం మత్కృతే నూనం నానుగచ్ఛసి రాఘవమ్.

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా! త్వమ్ = నీవు, రామమ్ = రాముణ్ణి, వినశ్యన్తమ్ = నశించుచున్నవానినిగా, మత్కృతే = నానిమిత్తమై, ఇచ్ఛసి = కోరుచున్నావు. త్వమ్ = నీవు, మత్కృతే=నా నిమిత్తమై, లోభాత్ =ఆశవలన, రామమ్ = రాముణ్ణి, నానుగచ్ఛసి = అనుసరించుటలేదు. నూనమ్=సత్యము.

తా. లక్ష్మణా! నీకు నాపై ఆసక్తి ఉండుటచేత, రాముడు నశించవలెనని కోరుకొనుచున్నావు. నామీద ఉన్న ఆశవలననే రామునివద్దకు వెళ్లుటలేదు. 6

మూ. వ్యసనం తే ప్రియం మన్యే స్నేహో భ్రాతరి నాస్తి తే, 7
తేన తిష్ఠసి విశ్రబ్ధస్తమపశ్యన్ మహాద్యుతిమ్.

ప్ర. అ. తే = నీకు, వ్యసనమ్=(రామునికి కలుగు) వ్యసనమే, ప్రియమ్ = ఇష్టమైన దని, మన్యే = తలచెదను. తే = నీకు, భ్రాతరి = సోదరునియందు, స్నేహః = స్నేహము, నాస్తి = లేదు. తేన = ఆ కారణముచేతనే, మహాద్యుతిమ్ = గొప్ప కాంతిగల, తమ్=ఆ రాముణ్ణి, అపశ్యన్ = చూడనివాడవై, విశ్రబ్ధమ్ = నమ్మకముగా, తిష్ఠసి = ఉన్నావు.

తా. రామునకు కష్టము కలుగవలె ననియే నీవు కోరుకొనుచున్నావు. నీకు సోదరునిపై ప్రేమ లేదు. అందుచేతనే మహాతేజఃశాలియైన ఆతడు కనబడకపోవుటచే నమ్మకముగా ఉన్నావు. 7

మూ. కిం హి సంశయమాపన్నే తస్మిన్నిహ మయా భవేత్, 8
కర్తవ్యమిహ తిష్ఠన్త్యా యత్ప్రధానస్త్వమాగతః.

ప్ర. అ. త్వమ్ = నీవు, యత్ప్రధానః = ఏ రాముడు ప్రధానుడుగా కలవాడవై, ఇహ = ఇక్కడికి, ఆగతః = వచ్చినావో, తస్మిన్ = ఆ రాముడు, సంశయమ్ = సంశయమును, ఆపన్నే = పొందినవాడగుచుండగా, ఇహ = ఇపుడు,

తిష్ఠన్త్యా = ఉన్న, మయా = నాతో, కిమ్ = ఏమి, కర్తవ్యమ్ = చేయదగినది, భవేత్ = ఉండును?

తా. ప్రధానముగా ఏ రామునికొరకై నీవు ఇక్కడికి వచ్చినావో ఆ రామునకు ప్రాణసంశయము ఏర్పడిన పిమ్మట ఇపుడు ఇక్కడ నున్న నాతో నీకు ప్రయోజన మేమి? అనగా నీకు రాముణ్ణి రక్షించుట ప్రధానకర్తవ్యము కాని, నన్ను రక్షించుట కాదు. 8

మూ. ఇతి బ్రువాణాం వైదేహీం బాష్పశోకపరిప్లుతామ్, 9
అబ్రవీల్లక్ష్మణస్త్రస్తాం సీతాం మృగవధూమివ.

ప్ర. అ. ఇతి = ఇట్లు, బ్రువాణామ్ = పలుకుచున్నది, బాష్పశోకపరిప్లుతామ్ = కన్నీళ్లతోను శోకముతోను నిండినది, త్రస్తామ్ = భయపడిన, మృగవధూమివ = ఆడలేడి వలె ఉన్నది, వైదేహీమ్ = విదేహరాజకుమారి అయిన, సీతామ్ = సీతను గూర్చి, లక్ష్మణః = లక్ష్మణుడు, అబ్రవీత్ = పలికెను.

తా. విదేహరాజకుమారి యైన సీత కన్నీళ్లు కార్చుచు, దుఃఖాక్రాంతయై, ఆడలేడి వలె భయపడిపోయి, ఈ విధముగా పలుకుచుండగా లక్ష్మణుడు ఆమెతో ఇట్లనెను. 9

మూ. పన్నగాసురగన్ధర్వదేవమానుషరాక్షసైః, 10
అశక్యస్తవ వైదేహి భర్తా జేతుం న సంశయః.

ప్ర. అ. వైదేహి = సీతా! తవ = నీయొక్క, భర్తా = భర్త, పన్నగాసురగన్ధర్వదేవమానుషరాక్షసైః = పన్నగులచేత, అసురులచేత, గంధర్వులచేత, దేవతలచేత, మనుష్యులచేత, రాక్షసులచేత, జేతుమ్ = జయించుటకు, అశక్యః = శక్యమైనవాడు కాదు. సంశయః = సంశయము, న = లేదు.

తా. ఓ! సీతా పన్నగులు గాని, అసురులు గాని, గంధర్వులు గాని, దేవతలు గాని, మానవులు గాని, రాక్షసులు గాని, నీ భర్తను జయించజాలరు. సందేహము లేదు.

మూ. దేవి దేవమనుష్యేషు గన్ధర్వేషు పతత్రిషు 11
రాక్షసేషు పిశాచేషు కిన్నరేషు మృగేషు చ,

దానవేషు చ ఘోరేషు స న విద్యేత శోభనే 12
యో రామం ప్రతియుధ్యేత సమరే వాసవోపమమ్.

ప్ర. అ. శోభనే=మంగళప్రదురాలా ! దేవి=ఓ ! దేవీ ! సమరే=యుద్ధమునందు, వాసవోపమమ్=దేవేంద్రునితో సమానుడైన, రామమ్=రాముణ్ణి, యః=ఎవడు, ప్రతియుధ్యేత = ఎదిరించి యుద్ధము చేయనో అట్టివాడు, దేవమనుష్యేషు = దేవతలలోను మనుష్యులలోను, గన్ధర్వేషు = గంధర్వులలోను, పతత్రిషు = పక్షులలోను, రాక్షసేషు = రాక్షసులలోను, పిశాచేషు = పిశాచములలోను, కిన్నరేషు=కింనరులలోను, మృగేషుచ=మృగములలోను, ఘోరేషు=భయంకరులైన, దానవేషు = దానవులలోను, న విద్యేత = ఉండదు.

తా. మంగళప్రదురాలవైన ఓ ! దేవీ ! యుద్ధములో, దేవేంద్రునితో సమానుడైన రాముని ఎదిరించి యుద్ధము చేయగలవాడు దేవతలలో గాని, మనుష్యులలో గాని, గంధర్వులలో గాని, పక్షులలో గాని, రాక్షసులలో గాని, పిశాచాలలో గాని, కింనరులలో గాని, మృగాలలో గాని, భయంకరులైన దానవులలో గాని ఉండదు. 11, 12

మూ. అవధ్యః సమరే రామో నైవం త్వం వక్తుమర్హసి, 13
న త్వామస్మిన్వనే హాతుముత్సహే రాఘవం వినా.

ప్ర. అ. రామః = రాముడు, సమరే=యుద్ధమునందు, అవధ్యః = చంపశక్యము కానివాడు. త్వమ్ = నీవు, ఏవమ్ = ఇట్లు, వక్తుమ్ = వలుకుటకు, నార్హసి = తగవు. త్వామ్ = నిన్ను, రాఘవం వినా = రాముడు లేకుండా, అస్మిన్ = ఈ, వనే = వనమునందు, హాతుమ్ = విడచుటకు, న ఉత్సహే = ఇచ్ఛయించను.

తా. రాముణ్ణి యుద్ధములో ఎవ్వరూ సంహరించజాలరు. నీవు ఈ విధముగా మాటలాడుట తగదు. రాముడు లేనప్పుడు నిన్ను ఈ వనములో ఒంటరిగా విడచుట నా కిష్టము కాదు.

మూ. అనివార్యం బలం తస్య బలైర్బలవతామపి, 14
త్రిభిర్లోకైః సముద్యుక్తైః సేశ్వరైరపి సామరైః,

ప్ర. అ. బలవతామ్ = బలవంతులయొక్క, బలైరపి = సేనలచేత కూడ, సేశ్వరైః = ప్రభువుతో కూడిన, సామరైరపి = దేవతలతో కూడిన, సముద్యుక్తైః = దండెత్తి వచ్చిన, త్రిభిః లోకైః = మూడు లోకములచేతను కూడ, తస్య = ఆ రామునియొక్క, బలమ్ = బలము, అనివార్యమ్ = నివారింప శక్యము కానిది.

తా. బలవంతుల సైన్యము లన్నీ వచ్చినా, దేవేంద్రునితోను దేవతలతోను కలిసి మూడు లోకములు దండెత్తివచ్చినా రాముని బలమును ఎదుర్కొనజాలరు. 14

మూ. హృదయం నిర్వృతం తేఽస్తు సంతాపస్త్యజ్యతామయమ్,
ఆగమిష్యతి తే భర్తా శీఘ్రం హత్వా మృగోత్తమమ్.

ప్ర. అ. తే = నీయొక్క, హృదయమ్ = హృదయము, నిర్వృతమ్ = ఊరడిల్లినది, అస్తు = అగుగాక. అయమ్ = ఈ, సంతాపః = దుఃఖము, త్యజ్యతామ్ = విడువబడుగాక. తే భర్తా = నీ భర్త, మృగోత్తమమ్ = ఉత్తమమైన ఆ మృగమును, హత్వా = చంపి, శీఘ్రమ్ = శీఘ్రముగా, ఆగమిష్యతి = రాగలడు.

తా. నీ మనస్సునకు ఊరట కలుగుగాక. ఈ దుఃఖమును విడువుము. నీ భర్త ఆ మృగమును చంపి శీఘ్రముగా రాగలడు. 15

మూ. న చ తస్య స్వరో వ్యక్తం మాయయా కేన చిత్కృతః.
గన్ధర్వనగరప్రఖ్యా మాయా సా తస్య రక్షసః. 16

ప్ర. అ. (అది), తస్య = ఆ రామునియొక్క, స్వరః = స్వరము, న = కాదు. వ్యక్తమ్ = ఈ విషయము స్పష్టమే. కేన చిత్ = ఎవనిచేతనో, మాయయా = మాయచేత, కృతః = చేయబడినది. సా = అది, తస్య రక్షసః = ఆ రాక్షసుని యొక్క, గన్ధర్వనగరప్రఖ్యా = గంధర్వనగరము వంటి, మాయా = మాయ.

తా. నిజముగా అది రాముని స్వరము కాదు. ఇది ఎవరో మాయచేత అరచిన అరుపు. ఇది ఆ మారీచుడు చేసిన మాయ, ఇంద్రజాలికుడు చూపించే నగరము వంటిది. 16

మూ. న్యాసభూతాసి వైదేహి న్యస్తా మయి మహాత్మనా, 17
రామేణ త్వం వరారోహే న త్వాం త్యక్తుమిహోత్సహే.

ప్ర. అ. వరారోహే = ఉత్తమస్త్రీవైన, వైదేహి=సీతా! న్యాసభూతాసి= నీవు న్యాసముగా ఉన్నావు. మహాత్మనా = మహాత్ముడైన, రామేణ = రామునిచేత, మయి=నాయందు (వద్ద), న్యస్తా=రక్షించుటకై ఉంచబడితివి. ఇహ=ఇక్కడ, త్వామ్ = నిన్ను త్యక్తుమ్ = విడచుటకు, నోత్సహే = అంగీకరించను.

తా. సీతా! మహాత్ముడైన రాముడు రక్షింపు మని చెప్పి నాదగ్గర నిన్ను ఉంచినాడు. అందుచేత నీవు న్యాసముగా ఉన్నావు. అట్టి నిన్ను విడచుటకు నేను ఇష్టపడను. 17

మూ. కృతవైరాశ్చ వైదేహి వయమేతైర్నిశాచరైః, 18
ఖరస్య నిధనాదేవ జనస్థానవధం ప్రతి.

ప్ర. అ. వైదేహి = సీతా! ఖరస్య = ఖరునియొక్క, నిధనాదేవ = చావు వలన, జనస్థానవధం ప్రతి = జనస్థానమునం దున్నవారి సంహారమును గూర్చి, వయమ్ = మనము, ఏతైః = ఈ, నిశాచరైః = రాక్షసులతో, కృతవైరాః = చేయబడిన వైరము గలవారము.

తా. సీతా! జనస్థానములోని రాక్షసులను, ఖరుణ్ణి చంపుటచేత ఈ రాక్షసు లందరూ మనతో వైరము పూని ఉన్నారు. 18

మూ. రాక్షసా వివిధా వాచో విసృజన్తి మహావనే, 19
హింసావిహారా వైదేహి న చిన్తయితుమర్హసి.

ప్ర. అ, వైదేహి = సీతా! మహావనే = ఈ మహావనమునందు, హింసా విహారాః = హింసతో విహరించు, రాక్షసాః = రాక్షసులు, వివిధాః = అనేకవిధము లైన, వాచః = వాక్కులను, విసృజన్తి = విడచుచుందురు (చేయుచుందురు). చిన్తయితుమ్ = విచారించుటకు, నార్హసి = తగవు.

తా. సీతా! ఈ మహావనములో హింసావృత్తితో విహరించే రాక్షసులు అనేకవిధములైన అరపులతో, మాటలు పలుకుచుందురు. నీవు విచారించకూడదు.

మూ. లక్ష్మణేనైవముక్తా సా క్రుద్ధా సంరక్తలోచనా, 20
అబ్రవీత్పరుషం వాక్యం లక్ష్మణం సత్యవాదినమ్.

ప్ర. అ. లక్ష్మణేన=లక్ష్మణునిచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తా=పలుకబడిన, సా=ఆమె, క్రుద్ధా=కోపించినదై, సంరక్తలోచనా=ఎఱ్ఱనైన నేత్రములు కలదై, సత్యవాదినమ్=సత్యమును పలుకుచున్న, లక్ష్మణమ్=లక్ష్మణుని గూర్చి, పరుషమ్=పరుషమైన, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. సీత లక్ష్మణుని మాటలు విని చాల కోపించినదై, ఎఱ్ఱని నేత్రములు కలదై, సత్యము పలికిన ఆ లక్ష్మణునితో పరుషమైన వాక్యమును పలికెను. 20

మూ. అకార్యకరణారమ్భ నృశంస కులపాంసన, 21
అహం తవ ప్రియం మన్యే రామస్య వ్యసనం మహత్.

ప్ర. అ. అకార్యకరణారమ్భ=అకార్యము చేయుటకు ప్రారంభించుచున్నవాడా! నృశంస=క్రూరుడా! కులపాంసన=కులమును అపవిత్రము చేసినవాడా! రామస్య=రామునియొక్క, మహత్=గొప్పదైన, వ్యసనమ్=వ్యసనమును, తవ=నీకు, ప్రియమ్=ఇష్టమైనదానినిగా, అహమ్=నేను, మన్యే=తలచుచున్నాను.

తా. కులము చెడ బుట్టిన ఓ! క్రూరుడా! చేయగూడని పని చేయుటకు ప్రారంభించుచున్నావు, రామునకు పెద్ద కష్టము రావలెనని యే నీవు కోరుకొనుచున్నావని నా అభిప్రాయము. 21

మూ. రామస్య వ్యసనం దృష్ట్వా తేనైతాని ప్రభాషసే, 22
నైతచ్చిత్రం సపత్నేషు పాపం లక్ష్మణ యద్ భవేత్,
త్వద్విధేషు నృశంసేషు నిత్యం ప్రచ్ఛన్నచారిషు. 23

ప్ర. అ. లక్ష్మణ=లక్ష్మణా! రామస్య=రామునియొక్క, వ్యసనమ్=వ్యసనమును, దృష్ట్వా=చూచి, తేన=ఆ కారణముచేత, ఏతాని=ఈ మాటలు, భాషసే=పలుకుచున్నావు. నిత్యమ్=ఎల్లప్పుడు, ప్రచ్ఛన్నచారిషు=రహస్యముగా ప్రవర్తించు, నృశంసేషు=క్రూరులైన, త్వద్విధేషు=నీవంటి, సపత్నేషు=

శత్రువులయందు, పాపమ్ = పాపము, భవేత్ ఇతియత్ = ఉండు ననునది ఏది కలదో, ఏతత్ = ఇది, చిత్రమ్ = ఆశ్చర్యకరము, న = కాదు.

తా. లక్ష్మణా! ఇప్పుడు రామునకు ఆపద సంభవించినదను విషయము చూచుటచే నీ విట్లు మాటలాడుచున్నావు. రహస్యముగా ప్రవర్తించే నీవంటి క్రూరులైన శత్రువులు ఇట్టి పాపానికి ఒడికట్టుచున్నారనగా దీనిలో ఆశ్చర్యమేమీ లేదు. 22, 23

మూ. సుదుష్టస్త్వం వనే రామమేకమేకోఽనుగచ్ఛసి,
మమ హేతోః ప్రతిచ్ఛన్నః ప్రయుక్తో భరతేన వా 24

ప్ర. అ. సుదుష్టః = చాలా చెడ్డవాడవైన, త్వమ్ = నీవు, ఏకః = ఒంటరివాడవై, ప్రతిచ్ఛన్నః = కప్పబడినవాడవై, మమ హేతోః = నాకొరకు గాని, భరతేన = భరతునిచేత, ప్రయుక్తః వా = ప్రేరేపించబడి గాని, ఏకమ్ = ఒంటరియైన, రామమ్ = రాముణ్ణి, వనే = వనమునందు, అనుగచ్ఛసి = అనుసరించుచున్నావు.

తా. దుష్టబుద్ధి వైన నీవు ఒంటరిగా, నీ భావము పైకి ఏమీ తెలియనీయక, నా నిమిత్తమై, లేదా భరతుని ప్రేరణచేత, అరణ్యములో ఒంటరిగా ఉన్న రాముణ్ణి అనుసరించి వచ్చుచున్నావు. 24

మూ. తన్న సిధ్యతి సౌమిత్రే తవ వా భరతస్య వా,
కథమిన్దీవరశ్యామం పద్మపత్రనిభేక్షణమ్, 25
ఉపసంశ్రిత్య భర్తారం కామయేయం పృథగ్జనమ్.

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా! తవ వా = నీయొక్క గాని, భరతస్య వా = భరతునియొక్క గాని, తత్ = ఆ ఆలోచన, న సిధ్యతి = సిద్ధించదు. పద్మపత్రనిభేక్షణమ్ = పద్మపత్రములతో సమానమైన నేత్రములు కలవాడు, ఇన్దీవరశ్యామమ్ = నల్లకలువ వలె శ్యామవర్ణము కలవాడు అయిన, రాముణ్ణి, భర్తారమ్ = భర్తనుగా, ఉపసంశ్రిత్య = ఆశ్రయించి, పృథగ్జనమ్ = అన్యజనుణ్ణి, కథమ్ = ఎట్లు, కామయేయమ్ = కోరుదును.

తా. లక్ష్మణా! ఇది నీ వన్నాగ మైనను, భరతుని వన్నాగ మైనను,

ఇది సిద్ధించదు. పద్మపత్రముల వంటి నేత్రములు, నల్లకలువ వంటి శ్యామ వర్ణము గల రాముణ్ణి భర్తగా ఆశ్రయించిన నేను ఇతరజనుణ్ణి ఎట్లు కోరుదును?

మూ. సమక్షం తవ సౌమిత్రే ప్రాణాంస్త్యక్ష్యే న సంశయః,
రామం వినా క్షణమపి న హి జీవామి భూతలే.

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా! తవ = నీయొక్క, సమక్షమ్ = ఎదుటనే. ప్రాణాన్ = ప్రాణములను, త్యక్ష్యే = విడచెదను, సంశయః=సంశయము. న= లేదు. రామం వినా = రాముడు లేకుండా, క్షణమపి = క్షణకాలమైనా, భూతలే= భూతలమునందు, న జీవామి హి = జీవించను కదా.

తా. నీ ఎదుట నేను ప్రాణాలు విడచెదను; సందేహము లేదు. రాముడు లేకుండా ఈ భూతలముమీద క్షణకాలమైనా జీవించను కదా! 26

మూ. ఇత్యుక్తః పరుషం వాక్యం సీతయా రోమహర్షణమ్, 27
అబ్రవీల్లక్ష్మణః సీతాం ప్రాఞ్జలిర్విజితేన్ద్రియః.

ప్ర. అ. విజితేన్ద్రియః = జయింపబడిన ఇంద్రియములు గల, లక్ష్మణః = లక్ష్మణుడు, సీతయా = సీతచేత, ఇతి = ఇట్లు, రోమహర్షణమ్ = రోమాంచమును కలిగించే, పరుషమ్ = పరుషమైన, వాక్యమ్ = వాక్యమును, ఉక్తః = పలకబడినవాడై, ప్రాఞ్జలిః = ఎత్తబడిన దోసిలి కలవాడై, సీతామ్=సీతను గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. రోమాంచమును కలిగించే పరుషములైన సీత మాటలు విని, ఇంద్రియనిగ్రహవంతుడైన లక్ష్మణుడు అంజలి ఘటించి నమస్కరించుచు సీతతో ఇట్లు పలికెను. 27

మూ. ఉత్తరం నోత్సహే వక్తుం దైవతం భవతీ మమ, 28
వాక్యమప్రతిరూపం తు న చిత్రం స్త్రీషు మైథిలి.
స్వభావస్త్వేష నారీణామేవం లోకేషు దృశ్యతే. 29

ప్ర. అ. మైథిలి=సీతా; ఉత్తరమ్=సమాధానమును, వక్తుమ్=చెప్పుటకు, నోత్సహే = ఇచ్ఛయించను. భవతీ=నీవు, మమ=నాకు, దైవతమ్=దైవతము, అప్రతిరూపమ్ = సాటి లేని, వాక్యమ్ = ఈ వాక్యము, స్త్రీషు = స్త్రీలయందు,

చిత్రమ్ = ఆశ్చర్యకరమైనది, న = కాదు. ఏషః = ఇది, నారీణామ్ = స్త్రీల యొక్క, స్వభావస్తు = స్వభావము కదా? లోకేషు = లోకములలో, ఏవమ్ = ఇట్లే, దృశ్యతే = చూడబడుచున్నది.

తా. "సీతా! నీ మాటలకు బదులు చెప్పుటకు నాకిష్టము లేదు. నీవు నాకు దైవతము. సాటి లేని ఈ విధములైన మాటలు స్త్రీల విషయములో ఆశ్చర్యకరములు కావు. ఇది స్త్రీల స్వభావమే; ఇది లోకములో ప్రసిద్ధమైన విషయము."

మూ. విముక్తధర్మాశ్చపలా స్తీక్ష్ణా భేదకరాః స్త్రియః,
న సహే హీదృశం వాక్యం వైదేహి జనకాత్మజే. 30
శ్రోత్రయోరుభయోర్మే౽ద్య తప్తనారాచసంనిభమ్.

ప్ర. అ. స్త్రియః = స్త్రీలు, విముక్తధర్మాః = విడవబడిన ధర్మము కలవారు. చపలాః = చపలస్వభావము గలవారు. తీక్ష్ణాః = తీక్ష్ణమైన ప్రకృతి కలవారు, భేదకరాః = భేదమును పుట్టించువారు. జనకాత్మజే = జనకుని కుమార్తెవైన, వైదేహి = సీతా! మే = నాయొక్క, ఉభయోః = రెండు, శ్రోత్రయోః = చెవులలో, తప్తనారాచసంనిభమ్ = కాల్చబడిన నారాచబాణములతో సమానమైన, ఈదృశమ్ ఈ విధమైన, వాక్యమ్ = వాక్యమును, అద్య = ఇప్పుడు, న సహే హి = సహించజాలను.

తా. స్త్రీలు ధర్మమును పరిత్యజించి చపలస్వభావముతో తీక్ష్ణముగా ప్రవర్తించుచు భేదమును (విరోధమును) కలిగింతురు. జనకుని కుమార్తెవైన సీతా! కాల్చిన నారాచబాణముల వలె నా చెవులలో గుచ్చుకొనిన ఇట్టి పరుషవాక్యమును సహించజాలను. 30

మూ. ఉపశృణ్వన్తు మే సర్వే సాక్షిభూతా వనేచరాః, 31
న్యాయవాదీ యథా౽న్యాయముక్తో౽హం పరుషం త్వయా,

ప్ర. అ. న్యాయవాదీ = న్యాయమును చెప్పుచున్న, అహమ్ = నేను, త్వయా = నీచేత, యథా = ఎట్లు, పరుషమ్ = పరుషమైన, అన్యాయమ్ = అన్యాయమును, ఉక్తః = పలుకబడితినో, మే = నాకు, సాక్షిభూతాః = సాక్షులై, సర్వే = సమస్తమైన, వనేచరాః = వనములో నివసించు దేవతలు, ఉపశృణ్వన్తు = వినుదురు గాక.

తా. యుక్తముగా మాటలాడుచున్న నన్ను నీవు పరుషముగా, ధర్మ విరుద్ధముగా ఎట్లు నిందించుచున్నావో ఈ వనదేవతలందరూ నాకు సాక్షులుగా నిలచి విందురుగాక. 31

మూ. ధిక్ త్వామద్య ప్రణశ్య త్వం యన్మామేవం విశఙ్కసే,
స్త్రీత్వాద్దుష్టస్వభావేన గురువాక్యే వ్యవస్థితమ్. 32

ప్ర. అ. త్వామ్ = నిన్ను గూర్చి, ధిక్ = నింద అగుగాక. స్త్రీత్వాత్ = స్త్రీత్వమువలన, దుష్టస్వభావేన = దుష్టస్వభావముతో, త్వమ్ = నీవు, గురువాక్యే = అన్నగారి వాక్యమునందు, వ్యవస్థితమ్ = నిలిచిన, మామ్ = నన్ను, యత్ = ఏ కారణమువలన, ఏవమ్ = ఇట్లు, విశఙ్కసే = శంకించుచున్నావో, అందువలన, ప్రణశ్య = నశించుము.

తా. స్త్రీవగుటచే, దుష్టమైన స్వభావముతో నీవు, అన్నగారి ఆజ్ఞను పాటించుచున్న నన్ను ఈ విధముగా శంకించుచున్నావు। ఛీ! నీ విప్పుడు నశించెదవుగాక। 32

మూ. గమిష్యే యత్ర కాకుత్స్థః స్వస్తి తేఽస్తు వరాననే, 33
రక్షన్తు త్వాం విశాలాక్షి సమగ్రా వనదేవతాః.

ప్ర. అ. వరాననే = శ్రేష్ఠమైన ముఖము గలదానా! కాకుత్స్థః = రాముడు, యత్ర = ఎక్కడ ఉన్నాడో అక్కడికి, గమిష్యే = వెళ్ళగలను. తే = నీకు, స్వస్తి = క్షేమము, అస్తు = అగుగాక. విశాలాక్షి = విశాలమైన నేత్రములు కలదానా! త్వామ్ = నిన్ను, సమగ్రాః = సమస్తమైన, వనదేవతాః = వనదేవతలు, రక్షన్తు = రక్షించెదరుగాక.

తా. శ్రేష్ఠమైన ముఖము గల ఓ! సీతా! నేను రాముడున్న చోటుకు వెళ్లెదను. నీకు క్షేమ మగుగాక. ఓ! విశాలాక్షీ! నిన్ను వనదేవత లందరూ రక్షింతురుగాక. 33

మూ. నిమిత్తాని చ ఘోరాణి యాని ప్రాదుర్భవన్తి మే, 34
అపి త్వాం సహ రామేణ పశ్యేయం పునరాగతః.
న వేత్యేతన్న జానామి వైదేహి జనకాత్మజే, 35

ప్ర. అ. జనకాత్మజే = జనకుని కుమారెవైన, వైదేహి = సీతా! ఘోరాణి

= భయంకరములైన, యాని = ఏ, నిమిత్తాని = శకునములు, మే = నాకు, ప్రాదుర్భవన్తి = పుట్టుచున్నవో, వాటిని పట్టి, పునః = తిరిగి, ఆగతః = వచ్చినవాడనై, త్వామ్ = నిన్ను. రామేణ సహ = రామునితో కూడ, అపి పశ్యేయమ్ = చూచెదనా, న వా = చూడనా, ఇత్యేతత్ = అను ఈ విషయమును, న జానామి = ఎరుగను.

తా. జనకుని కుమార్తెవైన సీతా! నాకు కనబడుచున్న భయంకరములైన శకునములను పట్టి, నేను తిరిగి వచ్చి రాముడూ నువ్వూ క్షేమముగా కలిసి ఉండగా చూడగలనా చూడలేనా అని సందేహము కలుగుచున్నది. 34, 35

మూ. లక్ష్మణేనైవముక్తా సా రుదన్తీ జనకాత్మజా,
ప్రత్యువాచ తతో వాక్యం తీవ్రం బాష్పపరిప్లుతా. 36

ప్ర. అ. లక్ష్మణేన = లక్ష్మణునిచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తా = పలకబడిన, సా జనకాత్మజా = ఆ సీత, తతః = అటుపిమ్మట, రుదన్తీ = ఏడ్చుచున్నదై, బాష్పపరిప్లుతా = కన్నీళ్ళచేత వ్యాప్తురాలై, తీవ్రమ్ = తీవ్రమైన, వాక్యమ్= వాక్యమును, ప్రత్యువాచ = తిరిగిపలికెను

తా. లక్ష్మణుడు ఈ విధముగ పలుకగా ఆ మాటలు విని సీత, ఏడ్చుచు, కన్నీళ్ళతో నిండినదై పరుషమైన వాక్యములు పలికెను. 36

మూ. గోదావరీం ప్రవేక్ష్యామి వినా రామేణ లక్ష్మణ,
ఆబన్ధిష్యేఽథవా త్యక్ష్యే విషమే దేహమాత్మనః. 37

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా! రామేణ వినా = రాముడు లేకున్నచో, గోదావరీమ్=గోదావరిని, ప్రవేక్ష్యామి=ప్రవేశించెదను. అథవా=లేక, ఆబన్ధిష్యే = ఉరిపోసికొనెదను. విషమే = ఎత్తైన ప్రదేశమునందు, ఆత్మనః = నాయొక్క, దేహమ్ = దేహమును, త్యక్ష్యే = విడచెదను.

తా. లక్ష్మణా! రాముడు లేనిచో నేను గోదావరిలో పడెదను. లేదా ఉరి పోసుకొనెదను. లేదా ఎత్తునుండి దుమికి దేహము విడచెదను. 37

మూ. పిబామ్యహం విషం తీక్ష్ణం ప్రవేక్ష్యామి హుతాశనమ్,
న త్వహం రాఘవాదన్యం పదాపి పురుషం స్పృశే. 38

ప్ర. అ. అహమ్ = నేను, తీక్ష్ణమ్ = తీక్ష్ణమైన, విషమ్ = విషమును, పిబామి = త్రాగెదను. హుతాశనమ్ = అగ్నిని, ప్రవేక్ష్యామి = ప్రవేశించెదను. తు = కాని, అహమ్ = నేను, రాఘవాత్ = రామునికంటె, అన్యమ్ = ఇతరుడైన, పురుషమ్ = పురుషుణ్ణి, పదాపి = పాదముచేతకూడ, న స్పృశే = స్పృశించను.

తా. నేను తీక్ష్ణమైన విషమును త్రాగెదను. అగ్నిలో పడెదను. అంతేకాని రామునికంటె అన్యుడైన పురుషుణ్ణి పాదముతో కూడ స్పృశించను. 38

మూ. ఇతి లక్ష్మణమాక్రుశ్య సీతా దుఃఖసమన్వితా,
పాణిభ్యాం రుదతీ దుఃఖాదుదరం ప్రజఘాన హ. 39

ప్ర. అ. సీతా = సీత, ఇతి = ఇట్లు. లక్ష్మణమ్ = లక్ష్మణుణ్ణి, ఆక్రుశ్య = దూషించి, దుఃఖసమన్వితా = దుఃఖముతో కూడినదై, రుదతీ = ఏడ్చుచున్నదై, దుఃఖాత్ = దుఃఖమువలన, పాణిభ్యామ్ = చేతులతో, ఉదరమ్ = పొట్టను, ప్రజఘాన హ = బాదుకొనెను.

తా. దుఃఖాక్రాంతురాలైన ఆ సీత లక్ష్మణుణ్ణి ఈ విధముగా దూషించి, దుఃఖము చేత చేతులతో ఉదరము బాదుకొనుచు ఏడ్చెను. 39

మూ. తామార్తరూపాం విమనా రుదన్తీం,
సౌమిత్రిరాలోక్య విశాలనేత్రామ్,
ఆశ్వాసయామాస న చైవ భర్తు
స్తం భ్రాతరం కించిదువాచ సీతా. 40

ప్ర. అ. సౌమిత్రిః = లక్ష్మణుడు, విమనాః = దుఃఖించిన మనస్సు కలవాడై, ఆర్తరూపామ్ = చాల దుఃఖించుచున్నదీ, రుదన్తీమ్ = ఏడ్చుచున్నదీ అయిన, తామ్ = ఆ, విశాలనేత్రామ్ = విశాలములైన నేత్రములు గల సీతను, ఆలోక్య = చూచి ఆశ్వాసయామాస = ఓదార్చెను. సీతా = సీత. భర్తుః = భర్తయొక్క, భ్రాతరమ్ = సోదరుడైన, తమ్ = అతనిని గూర్చి, కించిత్ = ఏమీ, న ఉవాచ = పలకలేదు.

తా. విశాలనేత్రయైన ఆ సీత చాలా దుఃఖించుచు ఏడ్చుచుండగా చూచి

లక్ష్మణుడు దుఃఖించుచు ఓదార్చెను. కాని సీత తన భర్త సోదరుడైన లక్ష్మణునకు ఏమీ బదులు చెప్పలేదు. 40

మూ. తతస్తు సీతామభివాద్య లక్ష్మణః
కృతాఞ్జలిః కించిదభిప్రణమ్య చ,
అన్వీక్షమాణో బహుశశ్చ మైథిలీమ్
జగామ రామస్య సమీపమాత్మవాన్. 41

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
పఞ్చచత్వారింశః సర్గః.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, ఆత్మవాన్ = బుద్ధిమంతుడైన, లక్ష్మణః = లక్ష్మణుడు, సీతామ్ = సీతను, అభివాద్య = నమస్కరించి. కృతాఞ్జలిః = చేయబడిన దోసిలి కలవాడై, కించిత్ = కొంచెము, అభిప్రణమ్య = అభిముఖముగా వెళ్ళి నమస్కరించి, బహుశః = అనేక పర్యాయములు, మైథిలీమ్ = ఆ సీతను, అన్వీక్షమాణః = చూచుచు, రామస్య = రాముని యొక్క, సమీపమ్ = సమీపమును గూర్చి. జగామ = వెళ్లెను.

తా. పిమ్మట, బుద్ధిమంతుడైన లక్ష్మణుడు సీతకు అభివాదనము చేసి, అంజలి ఘటించి కొంచెము ఎదురుగా వెళ్ళి నమస్కరించి, మాటిమాటికి వెనుకకు తిరిగి సీతనే చూచుచు రాముని దగ్గరకు వెళ్ళెను. 41

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో
నలుబది యైదవ సర్గ సమాప్తము.

అథ షట్చత్వారింశః సర్గః

[రావణుడు సంన్యాసివేషములో సీతవద్దకు వెళ్ళి ఆమెను గూర్చి అడుగుట సీత అతనికి అతిథిసత్కారము చేయుట]

మూ. తయా పరుషముక్తస్తు కుపితో రాఘవానుజః,
స వికాఙ్క్షన్ భృశం రామం ప్రతస్థే నచిరాదివ. 1

ప్ర. అ. తయా = ఆసీతచేత, పరుషమ్ = పరుషముగా, ఉక్తః = పలుక బడిన, సః = ఆ, రాఘవానుజః = లక్ష్మణుడు. కుపితః = కోపించినవాడై, భృశమ్ = మిక్కిలి, వికాఙ్క్షన్ = (రాముణ్ణి చూడవలె నని) కోరుచు, నచిరాదివ = వెంటనే, రామమ్ = రాముణ్ణి గూర్చి, ప్రతస్థే = ప్రయాణమాయెను.

తా. సీత పరుషవాక్యములు విని లక్ష్మణుడు, కోపించినవాడై రాముణ్ణి చూడవలె నని ఎక్కువ ఆతురుడై వెంటనే ఆతనివద్దకు బయలుదేరెను. 1

మూ. తదాసాద్య దశగ్రీవః క్షిప్రమన్తరమాస్థితః,
అభిచక్రామ వైదేహీం పరివ్రాజకరూపధృత్. 2

ప్ర. అ. అన్తరమ్ = అవకాశమును, ఆస్థితః = అవలంబించి ఉన్న (ఎదురు చూచుచున్న), దశగ్రీవః = రావణుడు, తత్ = ఆ అవకాశమును, ఆసాద్య = పొంది, పరివ్రాజకరూపధృత్ = సంన్యాసివేషమును ధరించినవాడై, వైదేహీమ్ = సీతాదేవిని గూర్చి, అభిచక్రామ = వెళ్లెను.

తా. అవకాశముకొరకై వేచియున్న రావణుడు ఆ అవకాశమును పొంది సంన్యాసి రూపము ధరించి, సీత దగ్గరకు వెళ్ళెను. 2

మూ. శ్లక్ష్ణకాషాయసంవీతః శిఖీ ఛత్రీ ఉపానహీ,
వామే చాంసేఽవసజ్యాథ శుభే యష్టికమణ్డలూ. 3
పరివ్రాజకరూపేణ వైదేహీమన్వపద్యత.

ప్ర. అ. అథ = పిమ్మట, శ్లక్ష్ణకాషాయసంవీతః = మృదువైన కాషాయ

వస్త్రముచేత చుట్టబడినవాడై, శిఖీ = శిఖగలవాడై, ఛత్రీ = ఛత్రము గలవాడై, ఉపానహీ = పాదుకలు కలవాడై, వామే అంసే = ఎడమ బుజమునందు, శుభే = మంగళకరములైన, యష్టికమణ్డలూ = దండమును కమండలువును, ఆసజ్య = తగల్చి, పరివ్రాజకరూపేణ = సంన్యాసిరూపముతో, వైదేహీమ్ = సీతను, అన్వవద్యత = సమీపించెను.

తా. ఆ రావణుడు మృదువైన కాషాయవస్త్రమును, శిఖను, ఛత్రమును, పాదుకలను ధరించి, మంగళకరములైన దండకమండలములు ఎడమ బుజానికి తగల్చుకొని సంన్యాసివేషముతో సీత దగ్గరకు వెళ్ళెను. 3

మూ. తామాససాదాతిబలో భ్రాతృభ్యాం రహితాం వనే, 4
రహితాం చన్ద్రసూర్యాభ్యాం సన్ధ్యామివ మహత్తమః.

ప్ర. అ. అతిబలః = అధికమైన బలము గల ఆ రావణుడు, వనే = వనమునందు, భ్రాతృభ్యామ్ = (సోదరులైన) రామలక్ష్మణులతో, రహితామ్ = శూన్యురాలైన, తామ్ = ఆ సీతను, చన్ద్రసూర్యాభ్యామ్ = చంద్రసూర్యులతో, రహితామ్ = శూన్యురాలైన, సన్ధ్యామ్ = సంధ్యను, మహత్ = గొప్పదైన, తమః ఇవ = చీకటి వలె, ఆససాద = సమీపించెను.

తా. చాల బలవంతుడైన ఆ రావణుడు వనమునందు రామలక్ష్మణులు దగ్గర లేని ఆ సీతను, చంద్రసూర్యులు లేని సంధ్యను అంధకారము ఆవరించినట్లు, సమీపించెను. 4

మూ. తామపశ్యత్తతో బాలాం రామపత్నీం యశస్వినీమ్, 5
రోహిణీం శశినా హీనాం గ్రహవద్భృశదారుణః.

ప్ర. అ. తతః = పిమ్మట, భృశదారుణః = చాల క్రూరుడైన ఆ రావణుడు, యశస్వినీమ్ = కీర్తి గలది, రామపత్నీమ్ = రాముని భార్య, బాలామ్ = చిన్న వయస్సు కలదీ అయిన, తామ్ = ఆ సీతను, శశినా = చంద్రునితో, హీనామ్ = హీనురాలైన, రోహిణీమ్ = రోహిణిని, గ్రహవత్ = క్రూరగ్రహము వలె, అపశ్యత్ = చూచెను.

తా. చాల క్రూరుడైన ఆ రావణుడు కీర్తి కలది, రాముని భార్య, చిన్న

వయస్సులో ఉన్నది అయిన ఆ సీతను, చంద్రుడు దగ్గర లేనీ రోహిణిని క్రూర గ్రహము చూచి నట్లు చూచెను. 5

మూ. తముగ్రతేజఃకర్మాణం జనస్థానరుహో ద్రుమాః, 6
సమీక్ష్య సంప్రకమ్పన్తే న ప్రవాతి చ మారుతః.

ప్ర. అ. ఉగ్రతేజఃకర్మాణమ్ = ఉగ్రమైన తేజస్సు, కర్మ గల, తమ్ = అతనిని, సమీక్ష్య = చూచి, జనస్థానరుహః = జనస్థానమునందు మొలచిన, మహా ద్రుమాః = పెద్దవృక్షములు, సంప్రకమ్పన్తే = వణికిపోయినవి. మారుతః చ = వాయువు కూడ, న ప్రవాతి = వీచలేదు.

తా. ఉగ్రమైన తేజస్సు గలిగి భయంకరములైన పనులు చేయు ఆ రావణుణ్ణి చూచి జనస్థానములోని వృక్షాలన్నీ వణికిపోయినవి. గాలి కూడ వీచలేదు.

మూ. శీఘ్రస్రోతాశ్చ తం దృష్ట్వా వీక్షన్తం రక్తలోచనమ్. 7
స్తిమితం గన్తుమారేభే భయాద్గోదావరీ నదీ,

ప్ర. అ. శీఘ్రస్రోతాః = శీఘ్రముగా ప్రవహించు ప్రవాహముగల, గోదావరీనదీ = గోదావరీనది, రక్తలోచనమ్ = ఎఱ్ఱని నేత్రములు గల, వీక్షన్తమ్ = చూచుచున్న, తమ్ = వానిని, దృష్ట్వా = చూచి, భయాత్ = భయమువలన, స్తిమితమ్ = మందముగా, గన్తుమ్ = వెళ్లుటకు, ఆరేభే = ప్రారంభించెను.

తా. శీఘ్రముగా ప్రవహించుచున్న గోదావరీనది ఇటు నటు చూచుచున్న ఎఱ్ఱని నేత్రములు గల, ఆ రావణుణ్ణి చూచి, భయపడి మెల్లగా ప్రవహించ సాగెను. 7

మూ. రామస్య త్వన్తరప్రేప్సుర్దశగ్రీవస్తదన్తరే, 8
ఉపతస్థే చ వైదేహీం భిక్షురూపేణ రావణః,

ప్ర. అ. రామస్య = రామునియొక్క, అన్తరప్రేప్సుః = ఛిద్రమును (పొరబాటును) కోరుచున్న, దశగ్రీవః = పది కంఠములు గల, రావణః = రావణుడు, తదన్తరే = ఆ మధ్యయందు, భిక్షురూపేణ = సంన్యాసిరూపముతో, వైదేహీమ్ = సీతను, ఉపతస్థే = సమీపించెను.

తా. రామునిలో ఏదైన పొరబాటు దొరుకునా అని వేచి యున్న, ఆ పది తలల రావణుడు, ఆ అవకాశమును చూచుకొని, సంన్యాసిరూపముతో సీత దగ్గరకు వచ్చెను. 8

మూ. అభవ్యో భవ్యరూపేణ భర్తారమనుశోచతీమ్, 9
అభ్యవర్తత వైదేహీం చిత్రామివ శనైశ్చరః.

ప్ర. అ. అభవ్యః = అమంగళస్వభావుడైన రావణుడు, భర్తారమ్ = భర్తను గూర్చి, అనుశోచతీమ్ = విచారించుచున్న, వైదేహీమ్ = సీతను, భవ్య రూపేణ = మంగళప్రదమైన సంన్యాసిరూపముతో, శనైశ్చరః = శని, చిత్రామివ = చిత్రానక్షత్రమును వలె, అభ్యవర్తత = సమీపించెను.

తా. చెడ్డవాడైన ఆ రావణుడు, భర్తను గూర్చి విచారించుచున్న సీత దగ్గరకు మంగళప్రదమైన సంన్యాసివేషముతో, శని చిత్రానక్షత్రము దగ్గరకు వచ్చినట్లు వచ్చెను. 9

మూ. స పాపో భవ్యరూపేణ తృణైః కూప ఇవావృతః, 10
అతిష్ఠత్ప్రేక్ష్య వైదేహీం రామపత్నీం యశస్వినీమ్.

ప్ర. అ. కూపః = కూపము, తృణైరివ = తృణములచేత వలె, భవ్యరూపేణ = మంగళకరమైన రూపముచేత, ఆవృతః = కప్పబడిన, సః పాపః = ఆ పాతాత్ముడు, యశస్వినీమ్ = కీర్తి గలది, రామపత్నీమ్ = రాముని భార్యా అయిన, వైదేహీమ్ = సీతను, ప్రేక్ష్య = చూచి, అతిష్ఠత్ = నిలచెను.

తా. తృణములచేత కప్పబడిన కూపము వలె, మంగళకరమైన వేషముచేత కప్పబడిన ఆ పాపాత్ముడు, కీర్తి గలది, రాముని భార్యా అయిన సీతను చూచి నిలబడెను. 10

మూ. శుభాం రుచిరదన్తోష్ఠీం పూర్ణచన్ద్రనిభాననామ్, 11
ఆసీనాం పర్ణశాలాయాం బాష్పశోకాభిపీడితామ్,
స తాం పద్మపలాశాక్షీం పీతకౌశేయవాసినీమ్, 12
అభ్యగచ్ఛత వైదేహీం దుష్టచేతా నిశాచరః.

ప్ర. అ. దుష్టచేతాః = దుష్టమైన చిత్తము గల, సః నిశాచరః = ఆ రాక్షసుడు, శుభామ్ = మంగళప్రదురాలు, రుచిరదన్తోష్ఠీమ్ = అందమైన దంతములు ఓష్ఠములు కలది, పూర్ణచన్ద్రనిభాననామ్ = పూర్ణచంద్రుని వంటి ముఖము గలది, పర్ణశాలాయామ్ = పర్ణశాలలో, ఆసీనామ్ = కూర్చున్నది, బాష్పశోకాభిపీడితామ్ = కన్నీటిచేతను శోకముచేతను పీడింపబడినది, పద్మపలాశాక్షీమ్ = పద్మము రేకుల వంటి నేత్రములు కలది, పీతకౌశేయవాసినీమ్ = పచ్చని పట్టుబట్ట ధరించినది అయిన, తాం వైదేహీమ్ = ఆ సీతను, అభ్యగచ్ఛత = సమీపించెను.

తా. అందమైన దంతములు, ఓష్ఠములు, పూర్ణచంద్రుని వంటి ముఖము, పద్మము రేకుల వంటి నేత్రములు గల మంగళప్రదురాలైన ఆ సీత కన్నీరు కార్చుచు, దుఃఖాక్రాంతయై పర్ణశాలలో కూర్చొని ఉండెను. పచ్చని పట్టు బట్ట కట్టుకొనెను. దుష్టబుద్ధియైన ఆ రాక్షసుడు అట్టి సీతదగ్గరకు వెళ్ళెను. 11, 12

మూ. స మన్మథశరావిష్టో బ్రహ్మఘోషముదీరయన్, 13
అబ్రవీత్ప్రశ్రితం వాక్యం రహితే రాక్షసాధిపః.

ప్ర. అ. మన్మథశరావిష్టః = మన్మథుని బాణములచేత వ్యాపింపబడిన, సః రాక్షసాధిపః = ఆ రావణుడు, బ్రహ్మఘోషమ్ = వేద ఘోషను, ఉదీరయన్ = పలుకుచు, రహితే = జనశూన్యమైన ఆ ప్రదేశమునందు, ప్రశ్రితమ్ = వినయముతో కూడిన, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. మన్మథబాణములచేత పీడింపబడిన ఆ రావణుడు వేదఘోష చేయుచు, జనులెవ్వరూ లేని ఆ ప్రదేశమునందు వినయపూర్వకముగా సీతతో ఇట్లు పలికెను. 13

మూ. తాముత్తమాం స్త్రియం లోకే పద్మహీనామివ శ్రియమ్, 14
విభ్రాజమానాం వపుషా రావణః ప్రశశంస హ.

ప్ర. అ. లోకే = లోకమునందు, ఉత్తమామ్ = ఉత్తమురాలైన, స్త్రియమ్ = స్త్రీయైన, పద్మహీనామ్ = పద్మము లేని, శ్రియమ్ ఇవ = లక్ష్మీదేవి వలె ఉన్న, వపుషా = దేహముతో, విభ్రాజమానామ్ = ప్రకాశించుచున్న, తామ్ = ఆమెను, రావణః = రావణుడు, ప్రశశంస హ = ప్రశంసించెను.

తా. లోకములో ఉత్తమస్త్రీ యైన ఆ సీత శరీరసౌందర్యముతో పద్మము లేని లక్ష్మీదేవి వలె ప్రకాశించుచుండెను. రావణుడు ఆమెను ఇట్లు ప్రశంసించెను. 14

మూ. కా త్వం కాఞ్చనవర్ణాభే పీతకౌశేయవాసిని, 15
కమలానాం శుభాం మాలాం పద్మినీవ హి బిభ్రతీ.

ప్ర. అ. కాఞ్చనవర్ణాభే = బంగారము రంగు వంటి కాంతి గలదానా! పీతకౌశేయవాసిని = పచ్చని పట్టువస్త్రము ధరించినదానా! పద్మినీవ = పద్మలత వలె, కమలానామ్ = పద్మములయొక్క, శుభామ్ = అందమైన, మాలామ్ = మాలను, బిభ్రతీ = ధరించుచున్న, త్వమ్ = నీవు, కా = ఎవ్వతెవు?

తా. బంగారు శరీరచ్ఛాయతో, పచ్చని పట్టువస్త్రమును ధరించి ఉన్నదానా! పద్మలత వలె పద్మముల పంక్తిని, అనగా పద్మముల వంటి ముఖము, హస్తములు, పాదములు, నేత్రములు-వీటిని, ధరించిన నీవు ఎవ్వరవు? 15

మూ. హ్రీః కీర్తిః శ్రీః శుభా లక్ష్మీరప్సరా వా శుభాననే, 16
భూతిర్వా త్వం వరారోహే రతిర్వా స్వైరచారిణీ.

ప్ర. అ. శుభాననే = మంగళకరమైన ముఖము గలదానా! వరారోహే = శ్రేష్ఠమైన కటిప్రదేశము గలదానా! త్వమ్ = నీవు, హ్రీః = పార్వతివా? కీర్తిః = కీర్తివా? శుభా = మంగళకరమైన, శ్రీః = కాంతివా? లక్ష్మీః = లక్ష్మివా? అప్సరా వా = అప్సరఃస్త్రీవా? భూతిర్వా = భూతివా? స్వైరచారిణీ = స్వేచ్ఛగా సంచరించుచున్న, రతిర్వా = రతివా?

తా. శుభకరమైన ముఖము, శ్రేష్ఠమైన కటిప్రదేశము గలదానా! నీవు పార్వతివా? కీర్త్యధిష్ఠానదేవతవా? కాంత్యధిష్ఠానదేవతవా? మంగళప్రదురాలైన లక్ష్మివా? అప్సరసవా? ఐశ్వర్యాధిష్ఠానదేవతవా? స్వేచ్ఛగా సంచరించుచున్న రతీదేవివా? 16

మూ. సమాః శిఖరిణః స్నిగ్ధాః పాణ్డురా దశనాస్తథా, 17
విశాలే విమలే నేత్రే రక్తాన్తే కృష్ణతారకే.

ప్ర. అ. దశనాః=నీదంతములు, సమాః=సమములు, శిఖరిణః=కొనలు గలవి. స్నిగ్ధాః = నున్నగా ఉన్నవి. తథా = మరియు, పాణ్డురాః = తెల్లగా ఉన్నవి. నేత్రే=నేత్రములు, విశాలే=విశాలములు. విమలే=నిర్మలములు, రక్తాన్తే = ఎఱ్ఱని కొనలు గలవి. కృష్ణతారకే = నల్లని గ్రుడ్లు గలవి.

తా. నీ తెల్లని దంతములు సమములై, కొనలు దేరి, నున్నగా ఉన్నవి. విశాలములైన నీ నేత్రములు నిర్మలములుగా ఉన్నవి. ఏటి కొనలు ఎఱ్ఱగా ఉన్నవి. గ్రుడ్లు నల్లగా ఉన్నవి. 17

మూ. విశాలం జఘనం పీనమూరూ కరికరోపమౌ 18
ఏతావుపచితౌ వృత్తౌ సంహతౌ సంప్రవల్గితౌ
పీనోన్నతముఖౌ కాన్తౌ స్నిగ్ధౌ తాలఫలోపమౌ. 19
మణిప్రవేకాభరణౌ రుచిరౌ తే పయోధరౌ.

ప్ర. అ. విశాలమ్ = విశాలమైన, జఘనమ్ = జఘనము, పీనమ్ = బలిసి యున్నది. ఊరూ = తొడలు, కరికరోపమౌ = ఏనుగు తొండముతో సమానములు. తే = నీయొక్క, ఏతౌ = ఈ, మణిప్రవేకాభరణౌ = శ్రేష్ఠములైన మణులు ఆభరణముగా గల, పయోధరౌ = స్తనములు, ఉపచితౌ = చక్కగా పెరిగినవి, వృత్తౌ = గుండ్రముగా ఉన్నవి, సంహతౌ = కలిసిఉన్నవి, సంప్రవల్గితౌ = కదలుచున్నవి. పీనోన్నతముఖౌ=బలిసిన ఎత్తుగా ఉన్న ముఖములు గలవి. కాన్తౌ=మనోహరముగా ఉన్నవి, స్నిగ్ధౌ=కాంతిగలవి, తాలఫలోపమౌ= తాటిపండ్లతో సమానములు, రుచిరౌ = అందముగా ఉన్నవి.

తా. విశాలమైన నీ జఘనము బలిసి ఉన్నది. తొడలు ఏనుగతొండము వలె ఉన్నవి, శ్రేష్ఠములైన మణులచేత అలంకరింపబడిన అందమైన ఈ స్తనములు దగ్గరగా, గుండ్రముగా, పెరిగిఉన్నవి. కొంచెము కదలుచున్నవి. బలిసి ఎత్తుగా ఉన్న ముఖములతో మనోహరములై కాంతి గల ఈ స్తనములు తాటి పండ్ల వలె ఉన్నవి. 18, 19

మూ. చారుస్మితే చారుదతి చారునేత్రే విలాసిని 20
మనో హరసి మే కాన్తే నదీ కూలమివామ్బసా.
కరా నమితమధ్యాసి సుకేశీ సంహత స్తనీ. 21

ప్ర. అ. చారుస్మితే = అందమైన చిరునవ్వు కలదానా! చారుదతి = అందమైన దంతములు కలదానా। చారునేత్రే = అందమైన నేత్రములు కలదానా। విలాసిని = విలాసలు కలదానా। కాన్తే = సౌందర్యము కలదానా। నదీ = నది, అమ్బసా = నీటిచేత, కూలమివ = ఒడ్డును వలె, మే = నాయొక్క, మనః = మనస్సును, హరసి = హరించుచున్నావు, కరాన్తమితమధ్యా = పిడికిలిచేత కొలవదగిన నడుము గలదానవు, సుకేశీ = అందమైన కేశపాశము కలదానవు, సంహతస్తనీ = దగ్గరగా ఉన్న స్తనములు కలదానవు, అసి = అయి ఉన్నావు.

తా. అందమైన చిరునవ్వు, సుందరములైన దంతములు। చక్కని నేత్రములు గల విలాసవతి వైన ఓ। కాన్తా। నది నీటిప్రవాహముచేత ఒడ్డును హరించునట్లు నా మనస్సును హరించుచున్నావు. నీ నడుము పిడికిలితో కొలుచుటకు వీలుగా ఉన్నది. కేశపాశము చక్కగా ఉన్నది. స్తనములు దగ్గరగా కలిసి ఉన్నవి. 20, 21

మూ. నైవ దేవీ న గన్ధర్వీ న యక్షీ న చ కిన్నరీ,
నైవంరూపా మయా నారీ దృష్టపూర్వా మహీతలే. 22

ప్ర. అ. మయా = నాచేత, మహీతలే = ఈ భూతలమునందు, ఏవంరూపా = ఇట్టి రూపము గల, నారీ = మనుష్యస్త్రీ, న దృష్టపూర్వా = పూర్వమెన్నడూ చూడబడలేదు. దేవీ = దేవతాస్త్రీ, నైవ = చూడబడలేదు, గన్ధర్వీ = గంధర్వస్త్రీ, న = చూడబడలేదు, యక్షీ = యక్షస్త్రీ, న = చూడబడలేదు. కిన్నరీ = కింనరస్త్రీ, న = చూడబడలేదు.

తా. నేనీ భూతలమునందు ఇట్టి రూపము గల మనుష్యస్త్రీని పూర్వమెన్నడూ చూడలేదు. దేవతాస్త్రీని గాని, గంధర్వస్త్రీని గాని, యక్షస్త్రీని గాని, కింనరస్త్రీని గాని చూడలేదు. 22

మూ. రూపమగ్ర్యం చ లోకేషు సౌకుమార్యం వయశ్చ తే,
ఇహ వాసశ్చ కాన్తారే చిత్తమున్మాదయన్తి మే. 23

ప్ర. అ. లోకేషు = లోకములలో, అగ్ర్యమ్ = శ్రేష్ఠమైన, తే = నీయొక్క, రూపమ్ = రూపము, సౌకుమార్యమ్ = సౌకుమార్యము, వయశ్చ = వయస్సు,

ఇహ = ఈ, కాన్తారే = అడవియందు, వాసశ్చ = నివాసము, మే = నాయొక్క, చిత్తమ్ = మనస్సును, ఉన్మాదయన్తి = కలత పెట్టుచున్నవి.

తా. మూడు లోకములలో శ్రేష్ఠమైన రూపము, సౌకుమార్యము గల నీవు ఈ వయస్సునందు, ఈ అరణ్యములో నివసించుట చూచి నా మనస్సు కలత చెందుచున్నది. 23

మూ. సా ప్రతిక్రామ భద్రం తే నైవ వస్తుమిహార్హసి,
రాక్షసానామయం వాసో ఘోరాణాం కామరూపిణామ్. 24

ప్ర. అ. సా = అట్టినీవు, ప్రతిక్రామ = ఇక్కడినుండి వెళ్ళిపొమ్ము. తే = నీకు, భద్రమ్ = క్షేమ మగుగాక. ఇహ = ఇక్కడ, ఏవమ్ = ఈ విధముగా, వస్తుమ్ = నివసించుటకు, న అర్హసి = తగవు. అయమ్ = ఇది, ఘోరాణామ్ = భయంకరులు, కామరూపిణామ్ = స్వేచ్ఛారూపులూ అయిన, రాక్షసానామ్ = రాక్షసులయొక్క, వాసః = నివాసము.

తా. అట్టి నీవు ఇక్కడనుండి వెళ్ళిపొమ్ము. నీకు క్షేమ మగుగాక. నీవు ఇక్కడ నివసించకూడదు. ఇది స్వేచ్ఛానుసారము రూపమును ధరించగల భయంకరులైన రాక్షసుల నివాసస్థానము. 24

మూ. ప్రాసాదాగ్రాణి రమ్యాణి నగరోపవనాని చ,
సంపన్నాని సుగన్ధీని యుక్తాన్యాచరితుం త్వయా. 25

ప్ర. అ. ప్రాసాదాగ్రాణి = ప్రాసాదముల పైభాగములు, రమ్యాణి = సుందరములు, సంపన్నాని = ఐశ్వర్యసమృద్ధములు, సుగన్ధీని = మంచి సువాసనలు కలవి అయిన, నగరోపవనానిచ = నగరములలోని ఉద్యానములు, త్వయా = నీచేత, ఆచరితుమ్ = సంచరించుటకు, యుక్తాని = తగినవి.

తా. ప్రాసాదముల పైభాగములు, రమ్యములు, ఐశ్వర్యముతో నిండినవి, మంచి సువాసనలు కలవి అయిన నగరప్రాంతములం దున్న ఉద్యానములు నీవు సంచరించుటకు తగినవి. 25

మూ. వరం మాల్యం వరం భోజ్యం వరం వస్త్రం చ శోభనే,
భర్తారం చ వరం మన్యే త్వద్యుక్తమసితేక్షణే. 26

ప్ర. అ. అసితేక్షణే = నల్లని నేత్రములు కలదానా! శోభనే = సుందరీ! వరమ్ = శ్రేష్ఠమైన, మాల్యమ్ = మాలను, వరమ్ = శ్రేష్ఠమైన, భోజ్యమ్ = భోజ్యపదార్థమును, వరమ్ = శ్రేష్ఠమైన, వస్త్రమ్ = వస్త్రమును, వరమ్ = శ్రేష్ఠుడైన, భర్తారం చ = భర్తను, త్వద్యుక్తమ్ = నీకుతగినదానినిగా, మన్యే = తలంచుచున్నాను.

తా. నల్లని నేత్రములు గల సుందరీ! శ్రేష్ఠములైన పుష్పమాలలు, శ్రేష్ఠమైన ఆహారము, శ్రేష్ఠమైన వస్త్రము, శ్రేష్ఠుడైన భర్త నీకు ఉండుట యుక్తమని తలచెదను. 26

మూ. కా త్వం భవసి రుద్రాణాం మరుతాం వా వరాననే,
వసూనాం వా వరారోహే దేవతా ప్రతిభాసి మే. 27

ప్ర. అ. వరాననే = శ్రేష్ఠమైన ముఖము గలదానా! వరారోహే = సుందరమైన కటిప్రదేశము గలదానా! త్వమ్ = నీవు, కా భవసి = ఎవ్వతెవై ఉన్నావు? రుద్రాణామ్ = రుద్రులదానవా, మరుతాం వా = మరుత్తులదానవా, వసూనాం వా = వసువులదానవా? మే = నాకు, దేవతా = దేవతవుగా, ప్రతిభాసి = తోచుచున్నావు.

తా. శ్రేష్ఠమైన ముఖము, కటిప్రదేశము గలదానా! నీవెవ్వరవు? రుద్రులకు గాని, మరుత్తులకు గాని, వసువులకు గాని సంబంధించిన దానవా? నీవు నాకు దేవతాస్త్రీగానే కనబడుచున్నావు. 27

మూ. నేహ గచ్ఛన్తి గన్ధర్వా న దేవా న చ కిన్నరాః,
రాక్షసానామయం వాసః కథం ను త్వమిహాగతా. 28

ప్ర. అ. ఇహ = ఇక్కడికి, గన్ధర్వాః = గంధర్వులు, న గచ్ఛన్తి = రారు, దేవాః = దేవతలు, న = రారు, కిన్నరాః చ = కిన్నరులు కూడ, న = రారు, అయమ్ = ఇది, రాక్షసానామ్ = రాక్షసులయొక్క, వాసః = నివాసము. త్వమ్ = నీవు, కథమ్ = ఎట్లు, ఇహ = ఇక్కడికి, ఆగతా = వచ్చినావు?

తా. ఇది రాక్షసులు నివసించు ప్రదేశము. ఇక్కడికి గంధర్వులు గాని, దేవతలు గాని, కింనరులు గాని రారు, నీవెట్లు వచ్చినావు?

మూ. ఇహ శాఖామృగాః సింహా ద్వీపివ్యాఘ్రమృగా స్తథా,
యక్షాస్తరక్షవః కఙ్కాః కథం తేభ్యో న బిభ్యసి. 29

ప్ర. అ. ఇహ = ఇక్కడ, శాఖామృగాః = వానరములు, సింహాః = సింహములు, ద్వీపివ్యాఘ్రమృగాః = చిరుతపులులు, చుక్కలపులులు, మృగములు, తథా = అట్లే, యక్షాః = యక్షులు, తరక్షవః = పెద్దపులులు, కఙ్కాః = రాబందులు (ఉండును). తేభ్యః = వాటినుండి, కథమ్ = ఎట్లు, న బిభ్యసి = (నీవు) భయపడుటలేదు.

తా. ఇక్కడ కోతులు, సింహాలు, చారలపులులు, చుక్కలపులులు, యక్షులు, పెద్దపులులు, రాబందులు తిరుగు చుండును. వాటిని చూచి నీకు భయము కలుగుటలేదా ? 29

మూ. మదాన్వితానాం ఘోరాణాం కుఞ్జరాణాం తరస్వినామ్,
కథమేకా మహారణ్యే న బిభేషి వరాననే. 30

ప్ర. అ. వరాననే = శ్రేష్ఠమైన ముఖము గలదానా ! మహారణ్యే = ఈ మహారణ్యములో, మదాన్వితానామ్ = మదముతో కూడిన, ఘోరాణామ్ = భయంకరములైన, తరస్వినామ్ = బలము గల, కుఞ్జరాణామ్ = ఏనుగులకు, ఏకా = ఒంటరిదానవై ననీవు, కథమ్ = ఎట్లు, న బిభేషి = భయపడుటలేదు ?

తా. సుందరమైన ముఖము గలదానా, ఈ అరణ్యములో ఒంటరిగా ఉన్న నీవు భయంకరములైన, మదించిన మహాబలము గల ఏనుగులకు ఎట్లు భయపడకున్నావు ? 30

మూ. కాసి కస్య కుతశ్చిత్త్వం కిం నిమిత్తం చ దణ్డకాన్,
ఏకా చరసి కల్యాణి ఘోరాన్ రాక్షససేవితాన్. 31

ప్ర. అ. కల్యాణి = మంగళప్రదురాలా ! త్వమ్ = నీవు, కా అసి = ఎవరవు ? కస్య = ఎవని దానవు ? కుతశ్చిత్ = ఎక్కడినుండి వచ్చినావు ? రాక్షససేవితాన్ = రాక్షసులచేత సేవింపబడిన, ఘోరాన్ = భయంకరములైన, దణ్డకాన్ = దండకారణ్యమును, ఏకా = ఒంటరిదానవై, కిం నిమిత్తమ్ = ఎందువలన, చరసి = సంచరించుచున్నావు ?

తా. మంగళప్రదురాలా ! నీవు ఎవరవు ? ఎవరిదానవు ? ఎక్కడినుండి వచ్చినావు ? రాక్షసులకు ఆశ్రయమైన భయంకరమైన ఈ దండకారణ్యములో (ఒంటరిగా)ఎందుకు సంచరించుచున్నావు ? 31

మూ. ఇతి ప్రశస్తా వైదేహీ రావణేన దురాత్మనా,
ద్విజాతివేషేణ హి తం దృష్ట్వా రావణమాగతమ్. 32
సర్వైరతిథిసత్కారైః పూజయామాస మైథిలీ

ప్ర. అ. దురాత్మనా = దురాత్ముడైన, రావణేన = రావణునిచేత, ఇతి = ఇట్లు, ప్రశస్తా = ప్రశంసించబడిన, మైథిలీ = జనకుని కూతురైన, వైదేహీ = సీత, ద్విజాతివేషేణ = బ్రాహ్మణవేషముతో, ఆగతమ్ = వచ్చిన, తం రావణమ్ = ఆ రావణుని, దృష్ట్వా = చూచి, సర్వైః = సమస్తమైన, అతిథిసత్కారైః = అతిథి సత్కారములతో, పూజయామాస = పూజించెను.

తా. దురాత్ముడైన రావణుడు ఈ విధముగా ప్రశంసించగా, జనకరాజ నందినియైన సీత, బ్రాహ్మణవేషములో వచ్చిన ఆ రావణుని చూచి, సమస్తమైన అతిథిసత్కారములతో పూజించెను. 32

మూ. ఉపనీయాసనం పూర్వం పాద్యేనాభినిమన్త్ర్య చ, 33
అబ్రవీత్సిద్ధమిత్యేవ తదా తం సౌమ్యదర్శనమ్.

ప్ర. అ. తదా = అప్పుడు, పూర్వమ్ = ముందుగా, ఆసనమ్ = ఆసనమును, ఉపనీయ = సమర్పించి, పాద్యేన = పాద్యముతో, అభినిమన్త్ర్య చ = ఆమంత్రణము చేసి. సౌమ్యదర్శనమ్ = సౌమ్యమైన దర్శనము గల, తమ్ = ఆతనిని గూర్చి, సిద్ధమ్ ఇత్యేవ = సిద్ధమైన దని, అబ్రవీత్ = పలికెను.

తా. అప్పుడు సీత ఆతనికి ముందు ఆసన మిచ్చి, పాద్యము కూడ ఇచ్చి, సౌమ్యుడుగా కనబడుచున్న ఆతనితో ''ఆహారము కూడ సిద్ధముగా ఉన్నది" అని పలికెను. 33

మూ. ద్విజాతివేషేణ సమీక్ష్య మైథిలీ
సమాగతం పాత్రకుసుమ్భధారిణమ్,

అశక్యముద్వేష్టుమపాయదర్శనమ్
న్యమన్త్రయద్బ్రాహ్మణవత్తదాఙ్గనా. 24

ప్ర. అ. తదా = అప్పుడు, మైథిలీ = మిథిలారాజకుమారియైన, అఙ్గనా = సీత, ద్విజాతివేషేణ = బ్రాహ్మణవేషముతో, సమాగతమ్ = వచ్చినవాడు, పాత్రకుసుమ్భధారిణమ్ = కమండలమును కాషాయవస్త్రమును ధరించినవాడు, ఉద్వేష్టుమ్ = ద్వేషించుటకు, అశక్యమ్ = శక్యము కానివాడు, అపాయదర్శనమ్ = అపాయమునందు దృష్టి గలవాడు అయిన ఆతనిని, బ్రాహ్మణవత్ = బ్రాహ్మణుని వలె, న్యమన్త్రయత్ = ఆతిథ్యమునకై పిలచెను.

తా. కమండలమును కాషాయవస్త్రమును ధరించి బ్రాహ్మణవేషముతో వచ్చిన ఆ రావణుడు ద్వేషింపరాని ప్రశాంతుడైన వ్యక్తిగా కనబడుచుండెను. కాని ఆతడు సీతకు అపాయమునే తలబెట్టుచుండెను. అట్టి ఆ రావణుని చూచి ఆమె బ్రాహ్మణుణ్ణి ఎట్లు ఆతిథ్యమునకు నిమంత్రించవలెనో అట్లు నిమంత్రించెను. 34

మూ. ఇయం బృసీ బ్రాహ్మణ కామమాస్యతా
మిదం చ పాద్యం ప్రతిగృహ్యతామితి,
ఇదం చ సిద్ధం వనజాతముత్తమం
త్వదర్థమవ్యగ్రమిహోపభుజ్యతామ్. 35

ప్ర. అ. బ్రాహ్మణ = బ్రాహ్మణుడా! ఇయమ్ = ఇది, బృసీ = ఆసనము. కామమ్ = సుఖముగా, ఆస్యతామ్ = కూర్చుందువుగాక. ఇదమ్ = ఇది, పాద్యమ్ = పాద్యము, ప్రతిగృహ్యతామ్ = స్వీకరించబడుగాక. ఇతి = అని పలికెను. ఇదమ్ = ఇది, ఉత్తమమ్ = ఉత్తమమైన, వనజాతమ్ = వనములో పుట్టిన ఫలాదికము, త్వదర్థమ్ = నీకొరకు, సిద్ధమ్ = సిద్ధముగా ఉన్నది. ఇహ = ఇపుడు, అవ్యగ్రమ్ = తొందరలేకుండా, ఉపభుజ్యతామ్ = తినబడుగాక.

తా. ''ఓ! బ్రాహ్మణుడా! ఇదిగో మునులు కూర్చుండే ఆసనము. సుఖముగా కూర్చుండుము ఇదిగో పాద్యము. స్వీకరింపుము. నీవు తినుటకై ఉత్తమమైన వనములో లభించే ఫలాదికము సిద్ధముగా ఉన్నది. తొందర లేకుండా తినుము'' అని సీత పలికెను. 35

మూ. నిమన్త్ర్యమాణః ప్రతిపూర్ణభాషిణీం
నరేన్ద్రపత్నీం ప్రసమీక్ష్య మైథిలీమ్,
ప్రసహ్య తస్యాహరణే ధృతం మనః
సమర్పయత్స్వాత్మవధాయ రావణః. 36

ప్ర. అ. నిమన్త్ర్యమాణః = ఈ విధముగా నిమంత్రింపబడుచున్న, రావణః = రావణుడు, ప్రతిపూర్ణభాషిణీమ్ = నిండుగా మాటలాడుచున్న, నరేన్ద్రపత్నీమ్ = రాముని భార్యయైన, మైథిలీమ్ = సీతను, ప్రసమీక్ష్య = చూచి, స్వాత్మవధాయ = తన చావుకొరకే, ప్రసహ్య = బలాత్కరించి, తస్యాః = ఆమెయొక్క, హరణే = హరణమునందు, మనః = మనస్సును, ధృతమ్ = స్థిరముగా, సమర్పయత్ = సమర్పించెను.

తా. ఈ విధముగా నిండుగా మాటలాడుచు, ఆతిథ్యమును స్వీకరింపుమని పిలుచుచున్న ఆ సీతను చూచి రావణుడు ఆమెను బలాత్కారముగా అవహరింపవలెనని, తన చావునకే, మనస్సులో నిశ్చయముచేసుకొనెను. 36

మూ. తతః సువేషం మృగయాగతం పతిం
ప్రతీక్షమాణా సహలక్ష్మణం తదా,
వివీక్షమాణా హరితం దదర్శ త
న్మహద్వనం నైవ తు రామలక్ష్మణౌ. 37

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
షట్చత్వారింశః సర్గః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సువేషమ్ = సుందరమైన ఆకారము గలవాడు, మృగయాగతమ్ = వేటకొరకు వెళ్ళినవాడూ అయిన, సహలక్ష్మణమ్ = లక్ష్మణునితో కూడిన, పతిమ్ = భర్తను గూర్చి, ప్రతీక్షమాణా = నిరీక్షించుచున్న సీత, తదా = అప్పుడు, వివీక్షమాణా = నలువైపులా చూచుచు, హరితమ్ = ఆకుపచ్చని రంగు గల, తత్ = ఆ, మహత్ = గొప్పదైన, వనమ్ = వనమును, దదర్శ = చూచెను. రామలక్ష్మణౌ తు = రామలక్ష్మణులనైతే, నైవ = చూడలేదు.

తా. వేటకై వెళ్ళిన, సుందరమైన ఆకారము గల లక్ష్మణసమేతుడైన రామునికొరకై నిరీక్షించుచు, నలువైపులా చూచుచున్న సీతకు ఆకుపచ్చని ఆ మహారణ్యమే కనబడెను. రామలక్ష్మణులు మాత్రము కనబడలేదు. 37

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
అరణ్యకాండలో నలుబదిఆరవ సర్గ సమాప్తము.

అథ సప్తచత్వారింశః సర్గః

[సీత రాముణ్ణి గూర్చి తనను గూర్చి రావణునకు చెప్పి తాము వనమునకు ఎందుచేత వచ్చినారో చెప్పుట. నా పట్టపురాణివి కమ్మని రావణుడు ఆమెను కోరుట. సీత ఆతనిని నిందించుట].

మూ. రావణేన తు వైదేహీ తదా పృష్టా జిహీర్షుణా,
పరివ్రాజకరూపేణ శశంసాత్మానమాత్మనా. 1

ప్ర. అ. తదా = అప్పుడు, జిహీర్షుణా = అపహరించుటకు కోరుచున్న, పరివ్రాజకరూపేణ=సంన్యాసిరూపములో ఉన్న, రావణేన=రావణుని చేత, పృష్టా = అడగబడిన, వైదేహీ = సీత, ఆత్మానమ్ = తనను గూర్చి, ఆత్మనా = స్వయముగా, శశంస = చెప్పెను.

తా. తనను అపహరించుటకై కోరుచున్న, సంన్యాసిరూపము ధరించిన, రావణుడు ఇట్లు ప్రశ్నించగా సీత తనను గూర్చి తానే ఇట్లు చెప్పెను. 1

మూ. బ్రాహ్మణశ్చాతిథిశ్చాయమనుక్తో హి శపేత మామ్,
ఇతి ధ్యాత్వా ముహూర్తం తు సీతా వచనమబ్రవీత్. 2

ప్ర. అ. బ్రాహ్మణశ్చ = బ్రాహ్మణుడు, అతిథిశ్చ = అతిథీ అయిన, అయమ్ = ఇతడు, అనుక్తః = చెప్పబడనివాడై, మామ్ = నన్ను, శపేత హి = శపించును కదా. ఇతి = అని, ముహూర్తమ్=క్షణకాలము, ధ్యాత్వా=ఆలోచించి, సీతా = సీత, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. ''ఇతడు బ్రాహ్మణుడు, అతిథిగా కూడ వచ్చినాడు; నేను చెప్పనిచో శపించవచ్చును''అని క్షణకాలము ఆలోచించి సీత ఇట్లు పలికెను. 2

మూ. దుహితా జనకస్యాహం మైథిలస్య మహాత్మనః,
సీతా నామ్నాస్మి భద్రం తే రామభార్యా ద్విజోత్తమ. 3

ప్ర. అ. ద్విజోత్తమ = ఓ! బ్రాహ్మణశ్రేష్ఠుడా! అహమ్ = నేను, మైథిలస్య = మిథిలాధిపతి, మహాత్మనః = మహాత్ముడు అయిన, జనకస్య = జనకుని యొక్క, దుహితా = కుమార్తెను. నామ్నా = పేరుచేత, సీతా అస్మి = సీతను. రామభార్యా = రాముని భార్యను, తే = నీకు, భద్రమ్ = మంగళ మగుగాక.

తా. ఓ! బ్రాహ్మణోత్తమా! నేను మిథిలాధిపతియైన మహాత్ముడైన జనకుని కుమార్తెను. రాముని భార్యను. నా పేరు సీత. నీకు క్షేమ మగుగాక. 3

మూ. ఉషిత్వా ద్వాదశ సమా ఇక్ష్వాకూణాం నివేశనే,
భుఞ్జానా మానుషాన్ భోగాన్ సర్వకామసమృద్ధినీ. 4

ప్ర. అ. ద్వాదశ = పండ్రెండు, సమాః = సంవత్సరములు, ఇక్ష్వాకూణామ్ = ఇక్ష్వాకురాజులయొక్క, నివేశనే = గృహమునందు, ఉషిత్వా = ఉండి, మానుషాన్ = మనుష్యులకు లభ్యములైన, భోగాన్ = భోగములను, భుఞ్జానా = అనుభవించుచున్నదాననై, సర్వకామసమృద్ధినీ = సమస్తభోగముల సమృద్ధి కల దాననై (ఉంటిని).

తా. నేను సకలభోగములు సమృద్ధిగా లభింపగా, మనుష్యులు ఏ యే భోగములు అనుభవించగలరో ఆ భోగము లన్నీ అనుభవించుచు, పన్నెండు సంవత్సరములు ఇక్ష్వాకువంశీయుడైన దశరథుని గృహములో ఉంటిని. 4

మూ. తతస్త్రియోదశే వర్షే రాజామన్త్రియత ప్రభుః,
అభిషేచయితుం రామం సమేతో రాజమన్త్రిభిః. 5

ప్ర.అ. తతః = అటుపిమ్మట, ప్రభుః = ప్రభువైన, రాజా = దశరథమహారాజు, త్రయోదశే వర్షే = పదమూడవ సంవత్సరమునందు, రాజమన్త్రిభిః = రాజమంత్రులతో, సమేతః = కూడినవాడై, రామమ్ = రాముణ్ణి, అభిషేచయితుమ్ = అభిషిక్తునిచేయుటకు, అమన్త్రయత = ఆలోచించెను.

తా. పిదప, పదమూడవ సంవత్సరమునందు, ప్రభువైన దశరథమహారాజు, రామునకు పట్టాభిషేకము చేయవలె నని తన మంత్రులతో ఆలోచించెను.

మూ. తస్మిన్ సంభ్రియమాణే తు రాఘవస్యాభిషేచనే,
కైకేయీ నామ భర్తారమార్యా సా యాచతే వరమ్. 6

ప్ర. అ. రాఘవస్య = రామునియొక్క, తస్మిన్ = ఆ, అభిషేచనే = అభిషేకము, సంభ్రియమాణే = ఏర్పరుపబడుచున్న దగుచుండగా, కైకేయీ నామ = కైకేయిఅను, సా = ఆ, ఆర్యా = పూజ్యురాలు, వరమ్ = వరమును, యాచతే = యాచించెను.

తా. రామునకు రాజ్యాభిషేకము చేయుటకు ఏర్పాట్లు జరుగుచుండగా కైకేయి అనే మా అత్త వరమును కోరెను. 6

మూ. ప్రతిగృహ్య తు కైకేయీ శ్వశురం సుకృతేన మే,
మమ ప్రవ్రాజనం భర్తుర్భరతస్యాభిషేచనమ్. 7
ద్వావయాచత భర్తారం సత్యసన్ధం నృపోత్తమమ్.

ప్ర. అ. కైకేయీ = కైకేయి, మే శ్వశురమ్ = నా మామగారిని, సుకృతేన = (తాను ఆతనికి చేసిన) ఉపకారముచేత, ప్రతిగృహ్య = నిగ్రహించి, సత్యసన్ధమ్ = సత్యమైన ప్రతిజ్ఞగల, నృపోత్తమమ్ = రాజులలో శ్రేష్ఠుడైన, భర్తారమ్ = భర్తను, మమ భర్తుః = నా భర్తయొక్క, ప్రవ్రాజనమ్ = అడవికి పంపుట, భరతస్య = భరతునియొక్క, అభిషేచనమ్ = అభిషేకము అను, ద్వౌ = ఈ రెండింటిని, అయాచత = కోరెను.

తా. కైకేయి, తాను పూర్వము చేసిన ఉపకారమును చూపి మా మామగారిని నిర్బంధించి, నా భర్తయైన రాముణ్ణి అరణ్యమునకు పంపుట, భరతునకు రాజ్యాభిషేకము చేయుట అను రెండువరము లిమ్మని సత్యసంధుడు, తన భర్త అయిన ఆ దశరథ మహారాజును కోరెను. 7

మూ. నాద్య భోక్ష్యే న చ స్వప్స్యే న పాస్యే చ కథంచన 8
ఏష మే జీవితస్యాన్తో రామో యద్యభిషిచ్యతే.

ప్ర. అ. అద్య = ఇప్పుడు, రామః = రాముడు, అభిషిచ్యతే యది = అభిషేకించబడినట్లయితే, న భోక్ష్యే = భుజించను. న చ స్వప్స్యే = నిద్రించను.

కథంచన = ఏవిధముగాను కూడ, న పాస్యే చ = పానముచేయను. ఏషః = ఇదే, మే = నాయొక్క, జీవితస్య = జీవితముయొక్క, అన్తః = అంతము.

తా. "ఇప్పుడు రామునకు పట్టాభిషేకము చేసినచో, ఏమైనను నేను అన్నము తినను; నీరు త్రాగను; నిద్రపోను. ఇదే నా జీవితానికి అంతము''. 8

మూ. ఇతి బ్రువాణాం కైకేయీం శ్వశురో మే స మానదః, 9
అయాచతార్థైరన్వర్థైర్న చ యాచ్ఞాం చకార సా,

ప్ర. అ. ఇతి = ఇట్లు, బ్రువాణామ్ = పలుకుచున్న, కైకేయీమ్ = కైకేయిని, మానదః = గౌరవమును ఇచ్చువాడైన, సః = ఆ, మే శ్వశురః = నా మామగారు, అన్వర్థైః = యథార్థములైన, అర్థైః = ధనముంచేత, అయాచత = యాచించెను. సా = ఆమె, యాచ్ఞామ్ = ఆ యాచనను, న చ చకార = చేయలేదు.

తా. ఈ విధముగా పలుకుచున్న కైకేయి మాటలు విని, సత్కారములు చేయు నా మామగారు నిజమైన సుఖముల నిచ్చు ధనములను ఇచ్చెద నని చెప్పి ప్రార్థించెను. కాని ఆమె ఆ ప్రార్థనను వినలేదు. 9

మూ. మమ భర్తా మహాతేజా వయసా పఞ్చవింశకః, 10
అష్టాదశ హి వర్షాణి మమ జన్మని గణ్యతే.

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, మమ భర్తా = నా భర్త, వయసా = వయస్సుచేత, పఞ్చవింశకః = ఇరువదియైదు సంవత్సరములవాడు. మమ = నాకు, జన్మని = జన్మయందు (నుండి), అష్టాదశ = పద్దెనిమిది, వర్షాణి = సంవత్సరములు, గణ్యతే = లెక్కింపబడుచున్నది.

తా. ఆ నాటికి నా భర్త వయస్సు ఇరువదియైదు సంవత్సరాలు. నా వయస్సు పద్దెనిమిది సంవత్సరాలు.

వి. ఈ శ్లోకం ప్రాచ్యప్రతిలో లేదు. 10

మూ. రామేతి ప్రథితో లోకే గుణవాన్ సత్యవాన్ శుచిః, 11
విశాలాక్షో మహాబాహుః సర్వభూతహితే రతః.

ప్ర. అ. రామేతి = రాముడుఅని, లోకే = లోకమునందు, ప్రథితః = ప్రసిద్ధుడు, గుణవాన్ = గుణవంతుడు, సత్యవాన్ = సత్యవంతుడు, శుచిః = పరిశుద్ధుడు. విశాలాక్షః = విశాలములైన నేత్రములు కలవాడు, మహాబాహుః = గొప్ప బాహువులు కలవాడు. సర్వభూతహితే = సమస్తభూతముల హితమునందు, రతః = ఆసక్తుడు.

తా. రాముడనే పేరుతో లోకములో ప్రసిద్ధుడైన నా భర్త గుణవంతుడు. సత్యవంతుడు. మనోవాక్కాయములందు పరిశుద్ధమైనవాడు, విశాలములైన నేత్రములు, గొప్ప బాహువులు కలవాడు. సకలభూతములకు హితమును కూర్చుటకు ఆసక్తికలవాడు. 11

మూ. కామార్తస్తు మహాతేజాః పితా దశరథః స్వయమ్, 12
కైకేయ్యాః ప్రియకామార్థం తం రామం నాభ్యషేచయత్.

ప్ర. అ. కామార్తః = కామముచేత పీడితుడైన, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, పితా = తండ్రియైన, దశరథః = దశరథుడు, స్వయమ్ = స్వయముగా, కైకేయ్యాః = కైకేయియొక్క, ప్రియకామార్థమ్ = ఇష్టమైన కోరికకొరకు, తం రామమ్ = ఆ రాముణ్ణి, నాభ్యషేచయత్ = అభిషేకించలేదు.

తా. మహాతేజఃశాలియైన దశరథుడు కామార్తుడై, కైకేయికి ప్రియమును చేయుటకై, స్వయముగ రాముణ్ణి రాజ్యాభిషిక్తుని చేయలేదు. 12

మూ. అభిషేకాయ తు పితుః సమీపం రామమాగతమ్, 13
కైకేయీ మమ భర్తారమిత్యువాచ ధృతం వచః.

ప్ర. అ. అభిషేకాయ = అభిషేకముకొరకు, పితుః = తండ్రియొక్క, సమీపమ్ = సమీపమునుగూర్చి, ఆగతమ్ = వచ్చిన, మమ భర్తారమ్ = నా భర్తయైన, రామమ్ = రాముణ్ణిగూర్చి, ఇతి = ఇట్లు, ధృతమ్ = నిశ్చితమైన, వచః = వచనమును, ఉవాచ = పలికెను.

తా. నా భర్తయైన రాముడు అభిషేకము నిమిత్తము తండ్రి దగ్గరకు వెళ్ళినపుడు కైకేయి, నిశ్చితముగా ఇట్లు పలికెను. 13

మూ. తవ పిత్రా సమాజ్ఞప్తం మమేదం శృణు రాఘవ. 14
భరతాయ ప్రదాతవ్యమిదం రాజ్యమకణ్టకమ్.

ప్ర. అ. రాఘవ = రామా ! తవ = నీయొక్క, పిత్రా = తండ్రిచేత, సమాజ్ఞప్తమ్ = ఆజ్ఞాపించబడిన, ఇదమ్ = దీనిని, మమ = నాకు (నుండి), శృణు = వినుము. అకణ్టకమ్ = శత్రుబాధ లేని, ఇదం రాజ్యమ్ = ఈ రాజ్యము, భరతాయ = భరతునకు, ప్రదాతవ్యమ్ = ఇవ్వదగినది.

తా. "రామా ! నీ తండ్రి ఆజ్ఞాపించిన విషయమును వినుము శత్రుబాధ లేవీ లేని ఈ రాజ్యము భరతునకు ఇవ్వవలెను." 14

మూ. త్వయా హి ఖలు వస్తవ్యం నవ వర్షాణి పఞ్చ చ, 15
వనే ప్రవ్రజ కాకుత్స్థ పితరం మోచయానృతాన్.

ప్ర. అ. కాకుత్స్థ = రామా ! త్వయా = నీచేత, నవ పఞ్చ చ వర్షాణి = పదునాలుగు సంవత్సరములు, వనే = వనమునందు, వస్తవ్యమ్ఖలు = నివసించవలసి యున్నది; ప్రవ్రజ = అడవికి వెళ్ళుము. పితరమ్ = తండ్రిని, అనృతాత్ = అసత్యమునుండి, మోచయ = విడిపించుము.

తా. "రామా ! నీవు పదునాలుగు సంవత్సరములు అరణ్యములో నివసించవలెను, అందుచే నీవు వనమునకు వెళ్ళుము, నీ తండ్రిని అసత్యమునుండి కాపాడుము." 15

మూ. తథేత్యుక్త్వా చ తాం రామః కైకేయీమకుతోభయః, 16
చకార తద్వచస్తస్యా మమ భర్తా దృఢవ్రతః.

ప్ర. అ. అకుతోభయః = ఏ వైపునుండి భయము లేనివాడు, దృఢవ్రతః = దృఢమైన నియమము కలవాడు అయిన, మమ భర్తా = నా భర్తయైన, రామః = రాముడు, తథేతి = "అట్లే" అని, తామ్ = ఆ, కైకేయీమ్ = కైకేయిని గూర్చి, ఉక్త్వా = పలికి, తస్యాః = ఆమెయొక్క, తత్ = ఆ, వచః = వచనమును, చకార = చేసెను.

తా. దేనికీ భయపడని వాడు, దృఢమైన నిశ్చయము కలవాడు అయిన

నా భర్త, రాముడు, ''అట్లే చేసెదను''అని ఆమెతో చెప్పి ఆమె మాట ప్రకారము చేసెను. 16

మూ. దద్యాన్న ప్రతిగృహ్ణీయాత్సత్యం బ్రూయాన్న చానృతమ్,
ఏతద్బ్రాహ్మణ రామస్య ధ్రువం వ్రతమనుత్తమ.

ప్ర. అ. దద్యాత్ = ఇచ్చును; న ప్రతిగృహ్ణీయాత్ = ప్రతిగ్రహించడు, సత్యమ్ = సత్యమును, బ్రూయాత్ = పలుకును, అనృతమ్ = అసత్యమును, న చ = పలకడు. బ్రాహ్మణ = ఓ ! బ్రాహ్మణుడా ! ఏతత్ = ఇది, రామస్య = రామునియొక్క, ధ్రువమ్ = నిశ్చితమైన, అనుత్తమమ్ = శ్రేష్ఠమైన, వ్రతమ్ = నియమము.

తా. బ్రాహ్మణుడా ! రాముడు ఇతరులకు దానము చేయును కాని తా నెన్నడు ఇతరులనుండి ప్రతిగ్రహించడు. సత్యమే పలుకును. అసత్యమును పలకడు. ఇది రాముని అత్యుత్తమమైన, స్థిరమైన నియమము. 17

మూ. తస్య భ్రాతా తు ద్వైమాత్రో లక్ష్మణో నామ వీర్యవాన్,
రామస్య పురుషవ్యాఘ్రః సహాయః సమరేఽరిహా.

ప్ర. అ. తస్య రామస్య = ఆ రామునియొక్క, ద్వైమాత్రః భ్రాతా = సవతి తమ్ముడు, వీర్యవాన్ = పరాక్రమవంతుడు, పురుషవ్యాఘ్రః = పురుషశ్రేష్ఠుడు అయిన, లక్ష్మణో నామ = లక్ష్మణు డనువాడు, సమరే = యుద్ధమునందు, సహాయః = సహాయుడు.

తా. పరాక్రమశాలి, పురుషులలో శ్రేష్ఠుడు, యుద్ధములో శత్రుసంహారము చేయువాడు, అయిన లక్ష్మణుడు రామునకు సవతి తమ్ముడు. అతడు రామునకు యుద్ధములలో సాహాయ్యము చేయుచుండును. 18

మూ. స భ్రాతా లక్ష్మణో నామ ధర్మచారీ దృఢవ్రతః, 19
అన్వగచ్ఛద్ధనుష్పాణిః ప్రవ్రజన్తం మయా సహ.

ప్ర. అ. ధర్మచారీ = ధర్మమును ఆచరించువాడు, దృఢవ్రతః = దృఢమైన నియమము కలవాడు అయిన, లక్ష్మణో నామ = లక్ష్మణు డను పేరు గల,

సః భ్రాతా = ఆ సోదరుడు, ధనుష్పాణిః = ధనస్సు హస్తమునందు కలవాడై, మయా సహ = నాతో కూడ, ప్రవ్రజన్తమ్ = అరణ్యమునకు వెళ్లుచున్న రాముణ్ణి, అన్వగచ్ఛత్ = అనుసరించెను.

తా. ధర్మము ఆచరించువాడు, దృఢమైన నియమము కలవాడు అయిన లక్ష్మణు డనే పేరు గల సోదరుడు, నాతో కలిసి అరణ్యమునకు వెళ్ళుచున్న ఆ రాముని వెనుక, ధనస్సు ధరించి అరణ్యమునకు వచ్చెను. 19

మూ. జటీ తాపసరూపేణ మయా సహ సహానుజః, 20
ప్రవిష్టో దణ్డకారణ్యం ధర్మనిత్యో జితేన్ద్రియః.

ప్ర. అ. ధర్మనిత్యః = నిత్యము ధర్మమునందే ఆసక్తి గల వాడు, జితేన్ద్రియః = జయించబడిన ఇంద్రియములు కలవాడు అయిన ఆ రాముడు, జటీ = జటలు కలవాడై, మయా సహ = నా తోను, సహానుజః = తమ్మునితో కూడినవాడై, దణ్డకారణ్యమ్ = దండకారణ్యమును, ప్రవిష్టః = ప్రవేశించినాడు.

తా. నిత్యము ధర్మమును ఆచరించు స్వభావము గలవాడు, జితేంద్రియుడు అయిన రాముడు జటాధారియై, నాతోను, తమ్మునితోను కలిసి దండకారణ్యమునకు వచ్చినాడు. 20

మూ. తే వయం ప్రచ్యుతా రాజ్యాత్కైకేయ్యాస్తు కృతే త్రయః
విచరామో ద్విజశ్రేష్ఠ వనం గమ్భీరమోజసా.

ప్ర. అ. ద్విజశ్రేష్ఠ = బ్రాహ్మణశ్రేష్ఠుడా ! తే = అట్టి, వయమ్ = మేము, త్రయః = ముగ్గురము, కైకేయ్యాః కృతే = కైకేయి నిమిత్తమై, రాజ్యాత్ = రాజ్యమునుండి, ప్రచ్యుతాః = భ్రష్టులమై, ఓజసా = తేజస్సుచేత, గమ్భీరమ్ = గంభీరమైన, వనమ్ = వనమును, విచరామః = సంచరించుచున్నాము.

తా. బ్రాహ్మణశ్రేష్ఠుడా ! మేము ముగ్గురము కైకేయి మూలాన రాజ్యభ్రష్టులమై కేవలము బలసాహాయ్యముతో, ఈ గంభీరమైన వనములో సంచరించుచున్నాము.

మూ. సమాశ్వస ముహూర్తం తు శక్యం వస్తుమిహ త్వయా, 22
ఆగమిష్యతి మే భర్తా వన్యమాదాయ పుష్కలమ్.
రురూన్ గోధా వరాహాంశ్చ హత్వాదాయామిషాన్ బహూన్

ప్ర. అ. ముహూర్తమ్ = ముహూర్తకాలము పాటు, సమాశ్వస = విశ్రమించుము. త్వయా = నీచేత, ఇహ = ఇక్కడ, వస్తుమ్ = నివసించుటకు, శక్యమ్ = శక్యము, మే భర్తా = నా భర్త, రురూన్ = జింకలను, గోధాః = ఉడుములను, వరాహాంశ్చ = అడవిపందులను, హత్వా = చంపి, బహూన్ = అనేకమైన, ఆమిషాన్ = మాంసములను, ఆదాయ = గ్రహించి, పుష్కలమ్ = సమృద్ధముగా, వన్యమ్ = వనమునందు లభించు పదార్థజాతమును, ఆదాయ = గ్రహించి, ఆగమిష్యతి = రాగలడు.

తా. ఒక్క ముహూర్తము పాటు వేచి ఉండుము, నీవు ఇక్కడ నివసించవచ్చును. నా భర్త జింకలను, ఉడుములను, వరాహములను చంపి వాటి మాంసములను, ఇంకా ఇతరవన్యపదార్థములను సమృద్ధిగా తీసికొనివచ్చును.

మూ. స త్వం నామ చ గోత్రం చ కులం చాచక్ష్వ తత్త్వతః,
ఏకశ్చ దణ్డకారణ్యే కిమర్థం చరసి ద్విజ. 24

ప్ర. అ. ద్విజ = బ్రాహ్మణుడా ! సః త్వమ్ = ఆ ఈనీవు, నామచ = నీపేరును, గోత్రంచ = గోత్రమును, కులంచ = కులమును, తత్త్వతః = యథార్థముగా, ఆచక్ష్వ = చెప్పుము. ఏకః చ = ఒంటరిగా, దణ్డకారణ్యే = దండకారణ్యమునందు, కిమర్థమ్ = ఎందుకు, చరసి = సంచరించుచున్నావు ?

తా. బ్రాహ్మణుడా ! నీవు నీ పేరు, గోత్రము, కులము యథార్థముగా చెప్పుము; నీవు ఒంటరిగా దండకారణ్యములో ఎందుకు తిరుగుచున్నావు ? 24

మూ. ఏవం బ్రువన్త్యాం సీతాయాం రామపత్న్యాం మహాబలః
ప్రత్యువాచోత్తరం తీవ్రం రావణో రాక్షసాధిపః. 25

ప్ర. అ. రామపత్న్యామ్ = రాముని భార్యయైన, సీతాయామ్ = సీత, ఏవమ్ = ఇట్లు, బ్రువన్త్యామ్ = పలుకుచుండగా, మహాబలః = గొప్ప బలముగల, రాక్షసాధిపః = రాక్షసప్రభువైన, రావణః = రావణుడు, తీవ్రమ్ = తీవ్రమైన, ఉత్తరమ్ = బదులును, ప్రత్యువాచ = పలికెను.

తా. రాముని భార్యయైన సీత మాటలు విని, మహాబలశాలి రాక్షసప్రభువు అయిన రావణుడు తీవ్రమైన బదులు చెప్పెను. 25

మూ. యేన విత్రాసితా లోకాః సదేవాసురపన్నగాః,
అహం తు రావణో నామ సీతే రక్షోగణేశ్వరః. 26

ప్ర. అ. సీతే = సీతా ! అహమ్ = నేను, యేన = ఎవనిచేత, సదేవాసుర పన్నగాః = దేవతలతోను, అసురులతోను, పన్నగులతోను కూడిన, లోకాః = లోకములు, విత్రాసితాః = భయపెట్టబడినవో, అట్టి, రక్షోగణేశ్వరః = రాక్షస గణముల ప్రభువైన, రావణో నామ=రావణు డనువాడను.

తా. సీతా! నేను, దేవ-అసుర-పన్నగులతో సహా సకలలోకములను భయపెట్టిన, రాక్షసరాజైన రావణుడను. 26

మూ. త్వాం తు కాఞ్చనవర్ణాభాం దృష్ట్వా కౌశేయవాసినామ్,
రతిం స్వకేషు దారేషు నాధిగచ్ఛామ్యనిన్దితే. 27

ప్ర. అ. అనిన్దితే = నిందింపబడనిదానా ! కాఞ్చనవర్ణాభామ్ = బంగారు వర్ణముకాంతి గల, కౌశేయవాసినీమ్ = పట్టువస్త్రము ధరించిన, త్వామ్=నిన్ను, దృష్ట్వా = చూచి, స్వకేషు = నాసంబంధమైన, దారేషు=భార్యలయందు, రతిమ్ = ఆనందమును, నాధిగచ్ఛామి=పొందజాలకున్నాను.

తా. దోషములు లేనిదానా ! బంగారము రంగు కాంతిగలిగి, పట్టువస్త్రము ధరించి యున్న నిన్ను చూచిన పిమ్మట నా భార్యలనుండి ఆనందము పొంద లేకుండా ఉన్నాను. 27

మూ. బహ్వీనాముత్తమస్త్రీణామాహృతానామిత స్తతః,
సర్వాసామేవ భద్రం తే మమాగ్రమహిషీ భవ. 28

ప్ర. అ. ఇత స్తతః=ఇక్కడినుంచి అక్కడినుంచి, ఆహృతానామ్=తీసికొనిరాబడిన, బహ్వీనామ్ = అనేకమైన, సర్వాసామేవ = సమస్తమైన, ఉత్తమస్త్రీణామ్ = ఉత్తమమైన స్త్రీలలో, మమ = నాయొక్క, అగ్రమహిషీ = ప్రధానమైన పట్టపురాణివిగా, భవ = అగుము. తే=నీకు, భద్రమ్=మంగళ మగుగాక.

తా. నేను ఎందరో ఉత్తమస్త్రీలను అనేకప్రదేశముల్లనుండి తీసికొని వచ్చినాను. నీవు వాళ్ల అందరిలోను ప్రధానురాలైన పట్టమహిషివి అగుము. నీకు మంగళ మగుగాక. 28

మూ. లఙ్కానామ సముద్రస్య మమ మధ్యే మహాపురీ,
సాగరేణ పరిక్షిప్తా నివిష్టా నగమూర్ధని. 29

ప్ర. అ. లఙ్కా నామ = లంక అను పేరు గల, మమ = నాయొక్క, మహాపురీ = గొప్ప పట్టణము, సముద్రస్య = సముద్రముయొక్క, మధ్యే=మధ్య యందున్నది. సాగరేణ = సముద్రముచేత, పరిక్షిప్తా = చుట్టబడిన ఆ లంక, నగ మూర్ధని = పర్వతాగ్రము మీద, నివిష్టా = ఏర్పరుపబడినది.

తా. నా నగరము పేరు లంక. అది సముద్రమధ్యమునం దున్నది; నాల్గు ప్రక్కల సముద్ర మున్న ఆ పట్టణము పర్వతాగ్రమునందు నిర్మింపబడినది. 29

మూ. తత్ర సీతే మయా సార్ధం వనేషు విహరిష్యసి,
న చారణ్యస్య వాసస్య స్పృహయిష్యసి భామిని. 30

ప్ర. అ. సీతే = సీతా! తత్ర = అక్కడ, మయా సార్ధమ్=నాతో కూడ, వనేషు = ఉద్యానవనములందు, విహరిష్యసి = విహరించగలవు. భామిని = ఓ ! సీతా! ఆరణ్యస్య=అరణ్యమునకు సంబంధించిన, వాసస్య=నివాసమునకు, న చ స్పృహయిష్యసి = అభిలషించవు.

తా. సీతా ! అక్కడ నీవు నాతో కలిసి ఉద్యానములలో విహరించవచ్చును. అప్పు డింక అరణ్యవాసమునందు నీకు అభిలాష ఉండదు. 30

మూ. పఞ్చ దాస్యః సహస్రాణి సర్వాభరణభూషితాః,
సీతే పరిచరిష్యన్తి భార్యా భవసి మే యది. 31

ప్ర. అ. సీతే=సీతా ! మే=నాయొక్క, భార్యా = భార్యవు, భవసి యది = అయినట్లయితే, సర్వాభరణభూషితాః = సమస్తమైన ఆభరణములచేత అలంక రించబడిన, పఞ్చ సహస్రాణి = ఐదు వేల, దాస్యః = దాసీలు, పరిచరిష్యన్తి = సేవ చేయగలరు.

తా. సీతా ! నీవు నాకు భార్యవైనట్లయితే అన్ని విధముల అలంకారములు అలంకరించుకొని ఉన్న ఐదు వేలమంది దాసీలు నీకు సేవచేయగలరు. 31

మూ. రావణేనైవముక్తా తు కుపితా జనకాత్మజా,
ప్రత్యువాచానవద్యాఙ్గీ తమనాదృత్య రాక్షసమ్. 32

ప్ర. అ. రావణేన = రావణునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తా = పలకబడిన, అనవద్యాఙ్గీ = దోషములు లేని శరీరము గల, జనకాత్మజా = సీత, కుపితా = కోపించినదై, తమ్ = ఆ, రాక్షసమ్ = రాక్షసుణ్ణి, అనాదృత్య = అనాదరముచేసి, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. ఎట్టి దోషములూ లేని శరీరము గల సీత రావణుని మాటలు విని, కోపించినదై, ఆ రాక్షసుణ్ణి నిందించుచు, ఇట్లు పలికెను. 32

మూ. మహాగిరిమివాకమ్ప్యం మహేన్ద్రసదృశం పతిమ్,
మహోదధిమివాక్షోభ్యమహం రామమనువ్రతా. 33

ప్ర. అ. మహాగిరిమివ = మహాపర్వతము వలె, అకమ్ప్యమ్ = కదల్ప శక్యము కానివాడు, మహేన్ద్రసదృశమ్ = మహేంద్రునితో సమానుడు, మహోదధిమివ = మహాసముద్రము వలె, అక్షోభ్యమ్ = క్షోభపెట్ట శక్యము కానివాడు, పతిమ్ = నా భర్త అయిన, రామమ్ = రాముణ్ణి, అహమ్ = నేను, అనువ్రతా = అనుసరించిన వ్రతము కలదానను.

తా. నా భర్తయైన రాముడు మహాపర్వతము వలె కదల్ప శక్యము కాని వాడు. మహేంద్రుడు వంటివాడు. మహాసముద్రము వలె క్షోభింప చేయ శక్యము కానివాడు. నేను అట్టి రాముని విషయమునందే వ్రతము కలదానను. 33

మూ. సర్వలక్షణసంపన్నం న్యగ్రోధపరిమణ్డలమ్,
సత్యసన్ధం మహాభాగమహం రామమనువ్రతా. 34

ప్ర అ. అహమ్ = నేను, సర్వలక్షణసంపన్నమ్ = సకలలక్షణములతో కూడినవాడు, న్యగ్రోధపరిమణ్డలమ్ = వటవృక్షము వంటి వైశాల్యము కలవాడు, సత్యసన్ధమ్ = సత్యసంధుడు, మహాభాగమ్ = గొప్ప భాగ్యము కలవాడు అయిన, రామమ్ = రాముణ్ణి, అనువ్రతా = అనుసరించిన వ్రతము కలదానను.

తా. రాముడు సర్వలక్షణసంపన్నుడు. వటవృక్షము వలె ఆశ్రితులకు

సుఖము కలిగించువాడు. సత్యసంధుడు. మహాభాగ్యవంతుడు. నేను అట్టి రాముణ్ణి మాత్రమే అనుసరించుట అను వ్రతము కలదానను. 34

మూ. మహాబాహుం మహోరస్కం సింహవిక్రాన్తగామినమ్,
నృసింహం సింహసంకాశమహం రామమనువ్రతా. 35

ప్ర. అ. అహమ్ = నేను, మహాబాహుమ్ = గొప్ప బాహువులు కలవాడు, మహోరస్కమ్ = గొప్ప వక్షఃస్థలము కలవాడు. సింహవిక్రాన్తగామినమ్ = సింహమువంటి గమనము గలవాడు, నృసింహమ్ = మనుష్యులలో శ్రేష్ఠుడు, సింహ సంకాశమ్ = సింహముతో సమానుడు అయిన, రామమ్ = రాముణ్ణి, అనువ్రతా = అనుసరించిన వ్రతము కలదానను.

తా. రాముడు మహాబాహువు, విశాలమైన వక్షస్థలము గలవాడు. నరులలో శ్రేష్ఠుడు. సింహము వంటివాడు. సింహము వలె నడచువాడు. నేను అట్టి రాముని యందే వ్రతము కలదానను. 35

మూ. పూర్ణచన్ద్రాననం రామం రాజవత్సం జితేన్ద్రియమ్,
పృథుకీర్తిం మహాత్మానమహం రామమనువ్రతా. 36

ప్ర. అ. అహమ్ = నేను, పూర్ణచన్ద్రాననమ్ = పూర్ణచంద్రునివంటి ముఖము కలవాడు, రాజవత్సమ్ = రాజకుమారుడు, జితేన్ద్రియమ్ = జయించబడిన ఇంద్రియములు కలవాడు, పృథుకీర్తిమ్ = గొప్ప కీర్తి గలవాడు, మహాత్మానమ్ = మహాత్ముడూ అయిన, రామమ్ = రాముణ్ణి, అనువ్రతా = అనుసరించిన వ్రతము కలదానను.

తా. రాజకుమారుడైన రాముడు పూర్ణచంద్రునివంటి ముఖము కలవాడు. ఇంద్రియములను జయించినవాడు. గొప్ప కీర్తి గల మహాత్ముడు. అట్టి రాముని యందే నేను వ్రతము కలదానను. 36

మూ. త్వం పునర్జమ్బుకః సింహీం మామిచ్ఛసి సుదుర్లభామ్,
నాహం శక్యా త్వయా స్ప్రష్టుమాదిత్యస్య ప్రభా యథా. 37

ప్ర. అ. జమ్బుకః = నక్కవైన, త్వం పునః = నాకైతే, సుదుర్లభామ్ = ఏ మాత్రము లభ్యరాలు కాని, సింహీమ్ = ఆడ సింహమైన, మామ్ = నన్ను,

ఇచ్ఛసి = కోరుచున్నావు, ఆదిత్యస్య = సూర్యునియొక్క, ప్రభా యథా = కాంతి వలె, అహమ్ = నేను, త్వయా = నీచేత, ప్రష్టుమ్ = స్పృశించుటకు, న శక్యా = శక్యురాలను కాను.

తా. నక్కవైన నీవు ఏ మాత్రము లభ్యురాలు కాని ఆడ సింహమైన నన్ను కోరుచున్నావు. సూర్యుని కాంతిని వలె నన్ను నీవు స్పృశించజాలవు. 37

మూ. పాదపాన్ కాఞ్చనాన్నూనం బహూన్ పశ్యసి మన్దభాక్,
రాఘవస్య ప్రియాం భార్యాం యస్త్వమిచ్ఛసి రావణ. 38

ప్ర. అ. రావణ = రావణా! యః = ఏ, త్వమ్ = నీవు, రాఘవస్య = రామునియొక్క, ప్రియామ్ = ప్రియురాలైన, భార్యామ్ = భార్యను, ఇచ్ఛసి = కోరుచున్నావో, మన్దభాక్ = అల్పమైన ఆయుర్దాయాదులను పొందిన అట్టి నీవు, నూనమ్ = నిశ్చయముగా, కాఞ్చనాన్ = బంగారువికారమైన, పాదపాన్ = వృక్షములను, పశ్యసి = చూచుచున్నావు.

తా. రావణా! రాముని ప్రియురాలైన భార్యను కోరుచున్న మందమైన ఆయుర్దాయాదులు గల నీవు నిజముగా అనేకములైన బంగారు వృక్షములను చూచుచున్నావు. (మరణ మాసన్నమైన వారికి బంగారు వృక్షములు కనబడు నని ప్రసిద్ధి). 38

మూ. క్షుధితస్య హి సింహస్య మృగశత్రో స్తరస్వినః,
ఆశీవిషస్య వదనాద్దంష్ట్రామాదాతుమిచ్ఛసి. 39

ప్ర. అ. మృగశత్రోః = మృగముల శత్రువు, తరస్వినః = బలము కలది అయిన, క్షుధితస్య = ఆకలికొన్న, సింహస్య = సింహముయొక్క, ఆశీవిషస్య = సర్పముయొక్క, వదనాత్ = ముఖమునుండి, దంష్ట్రామ్ = కోరను, ఆదాతుమ్ = గ్రహించుటకు, ఇచ్ఛసి = కోరుచున్నావు.

తా. మృగాలకు శత్రువు చాలా బలము కలది అయిన ఆకలిగొన్న సింహము కోరను, మహాసర్పముకోరను లాగవలె నని కోరుచున్నావు. 39

మూ. మన్దరం పర్వతశ్రేష్ఠం పాణినా హర్తుమిచ్ఛసి,
కాలకూటం విషం పీత్వా స్వస్తిమాన్ గన్తుమిచ్ఛసి. 40

ప్ర. అ. పర్వతశ్రేష్ఠమ్=పర్వతములలో శ్రేష్ఠమైన, మన్దరమ్=మందర పర్వతమును, పాణినా = హస్తముతో, హర్తుమ్ = గ్రహించుటకు, ఇచ్ఛసి=కోరుచున్నావు. కాలకూటం విషమ్=కాలకూటవిషమును, పీత్వా = త్రాగి, స్వస్తిమాన్ = క్షేమవంతుడవై, గన్తుమ్ = వెళ్లుటకు, ఇచ్ఛసి=కోరుచున్నావు.

తా. నీవు, పర్వతములలో శ్రేష్ఠమైన మందరపర్వతమును హస్తముతో గ్రహించవలెనని కోరుచున్నావు. కాలకూటవిషము త్రాగి సుఖముగా ఉండవలెననుకొనుచున్నావు. 40

మూ. అక్షి సూచ్యా ప్రమృజసి జిహ్వయా లేక్షి చ క్షురమ్,
రాఘవస్య ప్రియాం భార్యాం యోఽధిగన్తుం త్వమిచ్ఛసి.

ప్ర. అ. యఃత్వమ్=ఏ నీవు, రాఘవస్య=రామునియొక్క, ప్రియామ్=ప్రియురాలైన, భార్యామ్ = భార్యను, అధిగన్తుమ్ = పొందుటకు, ఇచ్ఛసి=కోరుచున్నావో, అట్టి నీవు, సూచ్యా = సూదితో, అక్షి = నేత్రమును, ప్రమృజసి = తుడుచుకొనుచున్నావు. జిహ్వయా = నాలుకతో, క్షురమ్ = కత్తిని, లేక్షి = నాకుచున్నావు.

తా. రాముని ప్రియురాలైన భార్యను నీవు పొందవలెనని కోరుచున్నావనగా నీవు సూదితో నేత్రము తుడుకొనుచున్నావు, నాలుకతో మంగలి కత్తి నాకుచున్నావు. 41

మూ. అవసజ్య శిలాం కణ్ఠే సముద్రం తర్తుమిచ్ఛసి,
సూర్యాచన్ద్రమసౌ చోభౌ పాణిభ్యాం హర్తుమిచ్ఛసి. 42
యో రామస్య ప్రియాం భార్యాం ప్రధర్షయితుమిచ్ఛసి.

ప్ర. అ. యః = ఏ నీవు, రామస్య = రామునియొక్క, ప్రియామ్ = ప్రియురాలైన, భార్యామ్ = భార్యను, ప్రధర్షయితుమ్ = అవమానించుటకు, ఇచ్ఛసి = కోరుచున్నావో, అట్టి నీవు, కణ్ఠే = కంఠమునందు, శిలామ్ = శిలను, అవసజ్య = కట్టుకొని, సముద్రమ్ = సముద్రమును, తర్తుమ్ = దాటుటకు, ఇచ్ఛసి = కోరుచున్నావు, సూర్యాచన్ద్రమసౌ = సూర్యచంద్రులను, ఉభౌ = ఇద్దరినీ, పాణిభ్యామ్ = హస్తములచేత, హర్తుమ్ = హరించుటకు, ఇచ్ఛసి = కోరుచున్నావు.

తా. రాముని ప్రియురాలైన భార్యను అవమానింపదలచుచున్నా వనగా నీవు పెద్ద జాతిబండను మెడకు కట్టుకొని సముద్రము దాట గోరుచున్నావు. చేతులతో సూర్యచంద్రుల నిద్దరిని హరించ వలె నని కోరుచున్నావు. 42

మూ. అగ్నిం ప్రజ్వలితం దృష్ట్వా వస్త్రేణాహర్తుమిచ్ఛసి, 43
కాల్యాణవృత్తాం రామస్య యో భార్యాం హర్తుమిచ్ఛసి.

ప్ర. అ. యః = ఏ నీవు, రామస్య=రామునియొక్క, కల్యాణవృత్తామ్= మంగళకర మైన చరిత్ర గల, భార్యామ్ = భార్యను, హర్తుమ్ = హరించుటకు, ఇచ్ఛసి = కోరుచున్నావో అట్టి నీవు, ప్రజ్వలితమ్ = మండుచున్న, అగ్నిమ్ = అగ్నిని, దృష్ట్వా = చూచి, వస్త్రేణ = వస్త్రముచేత, ఆహర్తుమ్ = గ్రహించి తీసికొని వచ్చుటకు, ఇచ్ఛసి = కోరుచున్నావు.

తా. నీవు ఉత్తమచరిత్రవంతురాలైన రాముని భార్యను హరింపకోరుచున్నా వనగా, మండుచున్న అగ్నిని చూచి, దానిని వస్త్రములో మూటకట్టుకొనుటకు కోరుచున్నావు. 43

మూ. అయోముఖానాం శూలానామగ్రే చరితుమిచ్ఛసి, 44
రామస్య సదృశీం భార్యాం యోఽధిగన్తుం త్వమిచ్ఛసి.

ప్ర. అ. యః త్వమ్=ఏ నీవు, రామస్య=రామునియొక్క, సదృశీమ్= తగిన, భార్యామ్ = భార్యను, అధిగన్తుమ్=పొందుటకు, ఇచ్ఛసి=కోరుచున్నావో, అట్టి నీవు, అయోముఖానామ్ = ఇనుపకొనలు గల, శూలానామ్ = శూలముల యొక్క, అగ్రే = చివరి భాగముల మీద, చరితుమ్ = నడుచుటకు, ఇచ్ఛసి = కోరుచున్నావు.

తా. రామునికి తగిన అతని భార్యను పొందకోరుచున్నా వనగా, నీవు ఇనుప కొన లున్న శూలముల చివరి భాగముల మీద నడవవలె నని కోరు చున్నావు. 44

మూ. యదన్తరం సింహశృగాలయోర్వనే
యదన్తరం స్యన్దినికా సముద్రయోః.
సురాగ్ర్యసౌవీరకయోర్యదన్తరం
తదన్తరం వై తవ రామస్య చ. 45

ప్ర. అ. వనే = వనమునందు, సింహశృగాలయోః = సింహమునకు నక్కకు, యత్ = ఏ, అన్తరమ్ = భేద మున్నదో, స్యన్దినికాసముద్రయోః = లోదెకాలువకు సముద్రానికి, యత్ = ఏ, అన్తరమ్ = భేదమున్నదో, సురాగ్ర్య సౌవీరకయోః = అమృతమునకు (లేదా శ్రేష్ఠమైన మద్యమునకు) కడుగునీళ్లకు, యత్ = ఏ, అన్తరమ్ = భేదమున్నదో, తవ = నీకు, రాఘవస్య చ = రామునకు తత్ = ఆ, అన్తరమ్ = భేదమున్నది.

తా. వనములో నివసించే సింహానికి నక్కకి ఎంత భేదమో, చిన్న బోదికాలవకు సముద్రానికి ఎంత భేదమో, ఉత్తమమైన మద్యానికి కడుగునీళ్లకు ఎంత భేదమో, నీకూ రామునకూ కూడ అంత భేద మున్నది. 45

మూ. యదన్తరం కాఞ్చనసీసలోహయో
ర్యదన్తరం చన్దనవారిపఙ్కయోః,
యదన్తరం హస్తిబిడాలయోర్వనే
తదన్తరం దాశరథేస్తవైవ చ. 46

ప్ర. అ. కాఞ్చనసీసలోహయోః = బంగారమునకు, సీసమునకు, యత్ = ఏ, అన్తరమ్ = భేదమో, చన్దనవారిపఙ్కయోః = మంచిగంధమునీటికి బురదకు, యత్ = ఏ, అన్తరమ్ = భేదమో, దాశరథేః = రామునకు, తవైవ చ = నీకూ, తత్ = అదే, అన్తరమ్ = భేదము.

తా. బంగారానికి సీసానికి ఎంత భేదమో, మంచి గంధము నీటికి బురదకు ఎంత భేదమో, వనములో నివసించే ఏనుగకు పిల్లికి ఎంత భేదమో, నీకు రామునకు ఉన్న భేదము కూడ అంతే. 46

మూ. యదన్తరం వాయసవైనతేయయో
ర్యదన్తరం మద్గుమయూరయోరపి,
యదన్తరం సారసగృధ్రయోర్వనే
తదన్తరం దాశరథేస్తవైవ చ. 47

ప్ర. అ. వాయసవైనతేయయోః = కాకికి గరుత్మంతునికి, యత్ = ఏ, అన్తరమ్ = భేదమో, మద్గుమయూరయోరపి = నీటికాకికి నెమలికి, యత్ = ఏ,

అన్తరమ్=భేదమో, వనే=వనమునందు, సారసగృధ్రయోః=హంసకు, గ్రద్దకు, యత్ = ఏ, అన్తరమ్ = భేదమో, దాశరథేః = రామునకు, తవైవ చ = నీకూ, తత్ = ఆ, అన్తరమ్ = భేదమే.

తా. కాకికి గరుత్మంతునకూ ఎంత భేదమో, నీటికాకికీ నెమలికి ఎంత భేదమో, వనములో హంసకూ గ్రద్దకూ ఎంత భేదమో, రామునకూ నీకూ అంతే భేదము. 47

మూ. తస్మిన్సహస్రాక్షసమప్రభావే
రామే స్థితే కార్ముకబాణపాణౌ,
హృతాపి తేఽహం న జరాం గమిష్యే
వజ్రం యథా మక్షికయావగీర్ణమ్. 48

ప్ర. అ. హృతాపి = హరింపబడినదాననైనను, అహమ్ = నేను, సహస్రాక్షసమప్రభావే = దేవేంద్రునితో సమానమైన ప్రభావము గల, కార్ముకబాణపాణౌ=ధనస్సు బాణములూ హస్తములందు గల, తస్మిన్ = ఆ, రామే = రాముడు, స్థితే = నిలచియుండగా, మక్షికయా = ఈగచేత, అవగీర్ణమ్=మ్రింగబడిన, వజ్రం యథా = వజ్రము వలె, తే = నీకు, జరాం న గమిష్యే = జీర్ణము కాను.

తా. నీవు నన్ను అపహరించినా కూడ, ఇంద్రునితో సమానమైన ప్రభావము గల ఆ రాముడు ధనుర్బాణములు ధరించి నిలబడినచో ఈగ మింగిన వజ్రమునువలె నీవు నన్ను జీర్ణము చేసికొనజాలవు. 48

మూ. ఇతీవ తద్వాక్యమదుష్టభావా
సుదుష్టముక్త్వా రజనీచరం తమ్,
గాత్రప్రకమ్పాద్వ్యథితా బభూవ
వాతోద్ధతా సా కదలీవ తన్వీ. 49

ప్ర. అ. అదుష్టభావా = దుష్టము కాని భావము గల, తన్వీ = సన్నని శరీరము గల, సా = ఆసీత, సుదుష్టమ్ = చాలా దుష్టమైన, తం రజనీచరమ్ = ఆ రాక్షసుని గూర్చి, తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, ఇతి = ఇట్లు, ఉక్త్వా =

పలికి, గాత్రప్రకమ్పాత్ = శరీరముయొక్క వణకువలన, వాతోద్ధతా = గాలి చేత ఎగురకొట్టబడిన, కదలీవ = అరటిచెట్టు వలె, వ్యథితా = వ్యథ చెందినది, బభూవ = ఆయెను.

తా. పరిశుద్ధమైన మనోభావము గల ఆ సీత చాల దుష్టుడైన ఆ రాక్షసునితో ఇట్లు పలికి, గాలికి ఊపివేయబడిన అరటి చెట్టు వలె, శరీరము వణకి పోగా వ్యథ పొందెను. 49

మూ. తాం వేపమానాముపలక్ష్య సీతాం
స రావణో మృత్యుసమప్రభావః,
కులం బలం నామ చ కర్మ చాత్మనః
సమాచచక్షే భయకారణార్థమ్. 50

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
సప్తచత్వారింశః సర్గః.

ప్ర. అ. మృత్యుసమప్రభావః = మృత్యుదేవతతో సమానమైన ప్రభావము గల, సః = ఆ, రావణః = రావణుడు, వేపమానామ్ = వణకుచున్న, తామ్ = ఆమెను, ఉపలక్ష్య = చూచి, భయకారణార్థమ్ = భయముకొరకు, ఆత్మనః = తనయొక్క, కులమ్ = కులమును, బలం చ = బలమును, కర్మ చ = పనిని, సమాచచక్షే = చెప్పెను.

తా. మృత్యుదేవతతో సమానమైన ప్రభావము గల ఆ రావణుడు వణకి పోవుచున్న ఆ సీతను చూచి, ఆమెకు భయము కలిగించుటకై తన కులమును, బలమును, కర్మను గూర్చి చెప్పెను.

''బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
అరణ్యకాండలో నలుబదిఏడవ సర్గ సమాప్తము.

అథ అష్టచత్వారింశః సర్గః

[*రావణుడు తన పరాక్రమమును వర్ణించి చెప్పుట. సీత ఆతనిని భయపెట్టుట.*]

మూ. ఏవం బ్రువన్త్యాం సీతాయాం సంరబ్ధః పరుషం వచః,
లలాటే భ్రుకుటిం కృత్వా రావణః ప్రత్యువాచ హ. 1

ప్ర. అ. సీతాయామ్=సీత, ఏవమ్=ఇట్లు, బ్రువన్త్యామ్=చెప్పుచుండగా, రావణః=రావణుడు, సంరబ్ధః=కోపించినవాడై, లలాటే=లలాటమునందు, భ్రుకుటిమ్=భ్రుకుటిని, కృత్వా=చేసి, పరుషమ్ = పరుషమైన, వచః= వచనమును, ప్రత్యువాచ=తిరిగిపలికెను.

తా. రావణుడు సీత మాటలు విని, కుపితుడై, కనుబొమ్మలు విరచి పరుషముగా ఇట్లు పలికెను. 1

మూ: భ్రాతా వైశ్రవణస్యాహం సాపత్న్యో వరవర్ణిని,
రావణో నామ భద్రం తే దశగ్రీవః ప్రతాపవాన్. 2

ప్ర. అ. వరవర్ణిని=శ్రేష్ఠమైన శరీరవర్ణము గల సీతా! అహమ్=నేను, వైశ్రవణస్య = కుబేరునియొక్క, సాపత్న్యః భ్రాతా=సవతితమ్ముడను. దశగ్రీవః=పది కంఠములు గల, ప్రతాపవాన్=ప్రతాపవంతుడైన, రావణో నామ= రావణు డను ప్రసిద్ధి కలవాడను. తే=నీకు, భద్రమ్=మంగళ మగుగాక.

తా. సీతా! నీకు మంగళ మగుగాక. పది కంఠములు కలవాడను, ప్రతాపవంతుడను అయిన నేను కుబేరుని సవతి తమ్ముడను; రావణు డని ప్రసిద్ధి పొందినవాడను. 2

మూ. యస్య దేవాః సగన్ధర్వాః పిశాచపతగోరగాః,
విద్రవన్తి భయాద్భీతా మృత్యోరివ సదా ప్రజాః. 3

ప్ర. అ. ప్రజాః = ప్రజలు, మృత్యోరివ = మృత్యువుయొక్క భయము వలన వలె, యస్య = ఎవనియొక్క, భయాత్ = భయమువలన, భీతాః = భయపడినవారై, సగన్ధర్వాః = గంధర్వులతో కూడిన, దేవాః = దేవతలు, పిశాచపతగోరగాః = పిశాచములు, పతగములు, ఉరగములు, విద్రవన్తి = పారిపోవునో, (అట్టి రావణుడను).

తా. మృత్యువునకు భయపడి జనులు పారిపోవునట్లు, నన్ను చూచి భయపడి దేవతలు, గంధర్వులు, పిశాచములు, పతగములు, ఉరగములు దూరముగా పారిపోవుదురు. 3

మూ. యేన వైశ్రవణో రాజా ద్వైమాత్రః కారణాన్తరే,
దన్ద్వమాసాదితః క్రోధాద్రణే విక్రమ్య నిర్జితః. 4

ప్ర. అ. యేన = ఎవనిచేత, కారణాన్తరే = ఒకానొక కారణమునందు, క్రోధాత్ = కోపమువలన, ద్వన్ద్వమ్ ఆసాదితః = ద్వంద్వ యుద్ధమును పొందింపబడిన, ద్వైమాత్రః=సవతితల్లి కొడుకైన, వైశ్రవణః రాజా = కుబేరుడు, రణే= యుద్ధమునందు, విక్రమ్య = పరాక్రమించి, నిర్జితః = జయింపబడినాడో.

తా. నేను కారణాంతరములచే కోపించి, నా సవతితల్లి కుమారుడైన కుబేరునితో యుద్ధము చేసి పరాక్రమముచేత ఆతనిని జయించితిని. 4

మూ. యద్భయార్తః పరిత్యజ్య స్వమధిష్ఠానమృద్ధిమత్,
కైలాసం పర్వతశ్రేష్ఠమధ్యాస్తే నరవాహనః. 5

ప్ర. అ. నరవాహనః=కుబేరుడు, యద్భయార్తః=ఎవనినుండి భయమువలన పీడితుడై, ఋద్ధిమత్=ఐశ్వర్యసంపన్నమైన, స్వమ్=తన సంబంధమైన, అధిష్ఠానమ్ = స్థానమును, పరిత్యజ్య = విడచి, పర్వతశ్రేష్ఠమ్ = పర్వతములలో శ్రేష్ఠమైన, కైలాసమ్ = కైలాసమును, అధ్యాస్తే = అధిష్ఠించి యున్నాడో.

తా. కుబేరుడు నా భయముచే పీడితుడై ఐశ్వర్యసంపన్నమైన తన నివాసనగరమును విడచి పర్వతశ్రేష్ఠమైన కైలాసముమీద నివసించుచున్నాడు. 5

మూ. యస్య తత్పుష్పకం నామ విమానం కామగం శుభమ్,
వీర్యాదేవార్జితం భద్రే యేన యామి విహాయసమ్. 6

ప్ర. అ. భద్రే = మంగళప్రదురాలా ! యస్య = ఏ కుబేరునియొక్క, తత్ = ఆ, పుష్పకం నామ = పుష్పక మను పేరు గల, కామగమ్ = ఇచ్ఛానుసారము వెళ్లే, శుభమ్ = మంగళకరమైన, విమానమ్ = విమానము, వీర్యాదేవ = పరాక్రమమువలననే, (నాచేత), ఆర్జితమ్ = సంపాదింపబడినదో. యేన = ఏ విమానముచేత, విహాయసమ్ = ఆకాశమును గూర్చి, యామి = వెళ్లుచున్నానో.

తా. మంగళప్రదురాలా ! ఇచ్ఛానుసారము ప్రయాణము చేసే, మంగళప్రదమైన పుష్పకమను పేరు గల విమానము ఆ కుబేరునిదే. నేను దానిని పరాక్రమముచేత ఆతనినుండి సంపాదించి, దానిపై ఎక్కి ఆకాశమునందు సంచరించుచుందును. 6

మూ. మమ సంజాతరోషస్య ముఖం దృష్ట్వైవ మైథిలి,
విద్రవన్తి పరిత్రస్తాః సురాః శక్రపురోగమాః. 7

ప్ర. అ. మైథిలి = సీతా ! సంజాతరోషస్య = పుట్టిన కోపము గల, మమ = నాయొక్క, ముఖమ్ = ముఖమును, దృష్ట్వైవ = చూడగానే, పరిత్రస్తాః = భయపడినవారై, శక్రపురోగమాః = దేవేంద్రుడు నాయకుడుగా గల, సురాః = దేవతలు, విద్రవన్తి = పారిపోవుదురు.

తా. సీతా ! నాకు కోపము వచ్చి నట్లు చూడగానే, భయపడిపోయి, దేవేంద్రుడు మొదలైన దేవత లందరూ పారిపోవుదురు. 7

మూ. యత్ర తిష్ఠామ్యహం తత్ర మారుతో వాతి శఙ్కితః,
తీవ్రాంశుః శిశిరాంశుశ్చ భయాత్సంపద్యతే రవిః. 8

ప్ర. అ. అహమ్ = నేను, యత్ర = ఎక్కడ, తిష్ఠామి = ఉందునో, తత్ర = అక్కడ, మారుతః = వాయువు, శఙ్కితః = భయపడుచున్నవాడై, వాతి = వీచును. తీవ్రాంశుః = తీవ్రమైన కిరణములు గల, రవిః చ = సూర్యుడు కూడ, భయాత్ = భయమువలన, శిశిరాంశుః = చల్లని కిరణములు కలవాడుగా, సంపద్యతే = అగును.

తా. నేను నిలచి ఉన్న చోట వాయువు భయపడుచూ వీచును. తీవ్రములైన కిరణములు గల సూర్యుడు కూడ తన కిరణములను చల్లగా చేయును. 8

మూ. నిష్కమ్పపత్రాస్తరవో నద్యశ్చ స్తిమితోదకాః,
భవన్తి యత్ర యత్రాహం తిష్ఠామి విచరామి చ. 9

ప్ర. అ. అహమ్ = నేను, యత్ర యత్ర = ఎక్కడెక్కడ, తిష్ఠామి = నిలబడుదునో, విచరామి చ = సంచరించుదునో అక్కడ, తరవః=వృక్షములు, నిష్కమ్పపత్రాః = కదలని ఆకులు కలవిగాను, నద్యశ్చ = నదులు, స్తిమితోదకాః = నిశ్చలమైన ఉదకము కలవిగాను, భవన్తి = అగును.

తా. నేను ఎక్కడ ఉందునో, నేను ఎక్కడ సంచరింతునో అక్కడ చెట్లు ఆకులు కూడ కదల్చవు; నదులు మందముగా ప్రవహించును. 9

మూ. మమ పారే సముద్రస్య లఙ్కా నామ పురీ శుభా,
సంపూర్ణా రాక్షసైర్ఘోరైర్యథేన్ద్రస్యామరావతీ. 10

ప్ర. అ. ఘోరైః=భయంకరులైన, రాక్షసైః=రాక్షసులతో, సంపూర్ణా= నిండినదీ, లఙ్కా నామ = లంక అను పేరు గలదీ, శుభా = సుందరమైనదీ, ఇంద్రస్య = ఇంద్రునియొక్క, అమరావతీవ = అమరావతి వంటిదీ అయిన, మమ = నాయొక్క, పురీ = పట్టణము, సముద్రస్య = సముద్రముయొక్క, పారే = ఆవతలి ఒడ్డునందు ఉన్నది.

తా. సుందరమైన నా లంకాపట్టణము ఇంద్రుని అమరావతి వంటిది. భయంకరులైన రాక్షసులతో నిండిన ఆ పట్టణము సముద్రము ఆవలి ఒడ్డునం దున్నది. 10

మూ. ప్రాకారేణ పరిక్షిప్తా పాణ్డురేణ విరాజతా,
హేమకక్ష్యా పురీ రమ్యా వైడూర్యమయతోరణా. 11

ప్ర. అ. రమ్యా=సుందరమైన, పురీ=ఆ పట్టణము, పాణ్డురేణ=తెల్లని, విరాజతా = ప్రకాశించుచున్న, ప్రాకారేణ = ప్రాకారముచేత, పరిక్షిప్తా = చుట్టబడినది. హేమకక్ష్యా=బంగారు మేడలు గలది; వైడూర్యమయతోరణా=వైడూర్య మాణిక్యవికారమైన తోరణములు గలది.

తా. సుందరమైన ఆ లంకాపట్టణము చుట్టూ తెల్లగా ప్రకాశించుచున్న

ప్రాకారము, దానిలో బంగారు మేడలు, వైదూర్యమణివికారమైన తోరణములు ఉన్నవి. 11

మూ. హస్త్యశ్వరథసంబాధా తూర్యనాదవినాదితా,
సర్వకాలఫలైర్వృక్షైః సంకులోద్యానశోభితా. 12

ప్ర. అ. హస్త్యశ్వరథసంబాధా = గజములతోను, అశ్వములతోను, రథములతోను ఇరుకుగా ఉన్నది. తూర్యనాదవినాదితా = తూర్యముల ధ్వనులచేత ధ్వనింపచేయబడినది, సర్వకాలఫలైః = సర్వకాలములయందు ఫలములు గల, వృక్షైః = వృక్షములతో, సంకులోద్యానశోభితా = నిండిన ఉద్యానములచేత ప్రకాశింపచేయబడినది.

తా. నా లంకాపట్టణము ఏనుగులతోను, అశ్వములతోను, రథములతోను కిక్కిరిసి ఉండును. మంగళవాద్యముల ధ్వనులతో మారుమ్రోగుచుండును. అన్ని కాలములందు ఫలముల నిచ్చే వృక్షములతో నిండిన ఉద్యానవనములతో శోభించుచుండును. 12

మూ. తత్ర త్వం వసతీ సీతే రాజపుత్రి మయా సహ,
న స్మరిష్యసి నారీణాం మానుషీణాం మనస్విని. 13

ప్ర. అ. రాజపుత్రి = రాజకుమారీ ! మనస్విని = మానవంతురాలా ! సీతే = సీతా ! తత్ర = ఆ లంకాపట్టణమునందు, మయా సహ = నాతో కూడ, వసతీ = నివసించుచున్నదానవై, మానుషీణామ్ = మనుష్యజాతికి సంబంధించిన, నారీణామ్ = స్త్రీలకు (ను), న స్మరిష్యసి = స్మరించవు.

తా. రాజపుత్రివి, మానవంతురాలూ అయిన సీతా ! నీవు నాతో కలిసి ఆ లంకాపట్టణములో నివసించి నట్లయితే మనుష్యస్త్రీల నెవరినీ స్మరించవు. 13

మూ. భుఞ్జానా మానుషాన్ భోగాన్ దివ్యాంశ్చ వరవర్ణిని,
న స్మరిష్యసి రామస్య మానుషస్య గతాయుషః. 14

ప్ర. అ. వరవర్ణిని = శ్రేష్ఠమైన వర్ణము గల సీతా ! మానుషాన్ = మనుష్యులకు సంబంధించిన, భోగాన్ = భోగములను, దివ్యాంశ్చ = దివ్యములైన భోగము

లను, భుఞ్జానా = అనుభవించుచున్నదానవై, మానుషస్య = మానవుడు, గతాయుషః = గడచి పోయిన ఆయుర్దాయము కలవాడు అయిన, రామస్య = రామునకు, న స్మరిష్యసి = స్మరించవు.

తా. ఓ : సీతా ! మనుష్యులకు లభించే భోగాలను, దేవతలకు లభించే భోగాలను అనుభవించుచు నీవు ఆయుర్దాయము చెల్లిపోయిన సామాన్యమానవుడైన రాముణ్ణి స్మరించవు. 14

మూ. స్థాపయిత్వా ప్రియం పుత్రం రాజ్ఞా దశరథేన యః,
మన్దవీర్యః సుతో జ్యేష్ఠస్తతః ప్రస్థాపితో వనమ్. 15

ప్ర. అ. మన్దవీర్యః=మందమైన పరాక్రమము కలవాడు, జ్యేష్ఠః సుతః=జ్యేష్ఠకుమారుడు అయిన, యః = ఏ రాముడు, రాజ్ఞా = రాజైన, దశరథేన=దశరథునిచేత, ప్రియమ్ = ప్రియుడైన, పుత్రమ్=పుత్రుణ్ణి, స్థాపయిత్వా=స్థాపించి, తతః = అక్కడినుండి, వనమ్ = వనమును గూర్చి, ప్రస్థాపితః=పంపబడినాడో.

తా. రాముడు జ్యేష్ఠపుత్రుడే యైనను అల్పమైన పరాక్రమము కలవాడగుటచే, దశరథమహారాజు, తన ప్రియపుత్రుడైన భరతునకు రాజ్య మిచ్చి ఇతనిని అరణ్యమునకు పంపివేసినాడు. 15

మూ. తేన కిం భ్రష్టరాజ్యేన రామేణ గతచేతసా,
కరిష్యసి విశాలాక్షి తాపసేన తపస్వినా. 16

ప్ర. అ. విశాలాక్షి = విశాలమైన నేత్రములు కలదానా ! భ్రష్టరాజ్యేన=రాజ్యభ్రష్టుడు, గతచేతసా = పోయిన బుద్ధికలవాడు, తాపసేన = దీనుడు, తపస్వినా = ముని అయిన, తేన రామేణ = ఆ రామునితో, కిం కరిష్యసి = ఏమి చేయుదువు ?

తా. ఓ : విశాలనేత్రములు గల సీతా ! రాముడు రాజ్యభ్రష్టుడు, బుద్ధివిహీనుడు, దీనుడు, మునివృత్తిలో ఉన్నవాడు. అట్టివానితో నీవేమి చేసెదవు ? 16

మూ: సర్వరాక్షసభర్తారం కామాత్స్వయమిహాగతమ్,
న మన్మథశరావిష్టం ప్రత్యాఖ్యాతుం త్వమర్హసి. 17

ప్ర. అ. కామాత్ = కామమువలన, స్వయమ్ = స్వయముగా, ఇహ = ఇక్కడికి, ఆగతమ్ = వచ్చిన, మన్మథశరావిష్టమ్ = మన్మథబాణములచేత వ్యాప్తుడ నైన, సర్వరాక్షసభర్తారమ్ = సకలరాక్షసుల ప్రభువునైన నన్ను, త్వమ్ = నీవు, ప్రత్యాఖ్యాతుమ్ = ప్రత్యాఖ్యానము చేయుటకు, న అర్హసి = తగవు.

తా. సకలరాక్షసులకు ప్రభువునైన నేను, మన్మథబాణములచేత పీడించ బడినవాడనై కామముతో స్వయముగా నీవద్దకు వచ్చినాను. అట్టి నన్ను నీవు నిరాకరించకూడదు. 17

మూ. ప్రత్యాఖ్యాయ హి మాం భీరు పరితాపం గమిష్యసి,
చరణేనాభిహత్యేవ పురూరవసమూర్వశీ. 18

ప్ర. అ. భీరు = భయస్వభావము గలదానా ! మామ్ = నన్ను, ప్రత్యాఖ్యాయ = నిరాకరించి, పురూరవసమ్ = పురూరవుసుణ్ణి, చరణేన = పాదముచేత, అభిహత్య = తన్ని, ఊర్వశీవ = ఊర్వశి వలె, పరితాపమ్ = పశ్చాత్తాపమును, గమిష్యసి = పొందగలవు.

తా. సీతా ! పూర్వము ఊర్వశి కాళ్లమీద పడిన పురూరవసుణ్ణి నిరాకరించి పశ్చాత్తాపము చెంది నట్లు, నీవు కూడా నన్ను నిరాకరించినచో పశ్చాత్తాపము చెందగలవు. 18

మూ. అఙ్గుల్యా న సమో రామో మమ యుద్ధే స మానుషః,
తవ భాగ్యేన సంప్రాప్తం భజస్వ వరవర్ణిని. 19

ప్ర. అ. వరవర్ణిని = శ్రేష్ఠమైన శరీరవర్ణము గల సీతా ! మానుషః = మానవుడైన, సః రామః = ఆ రాముడు, యుద్ధే = యుద్ధమునందు, మమ = నా యొక్క, అఙ్గుల్యా = వ్రేలితో కూడ, సమః = సమానుడు, న = కాడు. తవ = నీయొక్క, భాగ్యేన = అదృష్టముచేత, సంప్రాప్తమ్ = లభించిన నన్ను, భజస్వ = పొందుము.

తా. సీతా ! మానవమాత్రుడైన ఆ రాముడు యుద్ధములో నా వ్రేలికి కూడ పోలడు. నేను నీ అదృష్టవశముచేత వచ్చినాను. అటి నన్ను అంగీకరించుము. 19

మూ. ఏవముక్తా తు వైదేహీ క్రుద్ధా సంరక్తలోచనా,
అబ్రవీత్పరుషం వాక్యం రహితే రాక్షసాధిపమ్. 20

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తా = పలకబడిన, వైదేహీ = సీత, క్రుద్ధా = కోపించినదై, సంరక్తలోచనా = ఎఱ్ఱనైన నేత్రములు గలదై, రహితే = జనులు లేని ఆ ప్రదేశమునందు, రాక్షసాధిపమ్ = రావణుని గూర్చి, పరుషమ్ = పరుషమైన, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. సీత ఆ మాటలు విని, కోపముచేత ఎఱ్ఱబడిన కన్నులు కలదై, జనశూన్యమైన ఆ ప్రదేశములో రాక్షసాధిపుడైన రావణునితో ఇట్లు పలికెను. 20

మూ. కథం వైశ్రవణం దేవం సర్వభూతనమస్కృతమ్,
భ్రాతరం వ్యపదిశ్య త్వమశుభం కర్తుమిచ్ఛసి. 21

ప్ర. అ. సర్వభూతనమస్కృతమ్ = సకలప్రాణులచేతను నమస్కరించబడిన, దేవమ్ = దేవుడైన, వైశ్రవణమ్ = కుబేరుణ్ణి, భ్రాతరమ్ = సోదరునిగా, వ్యపదిశ్య = చెప్పి, త్వమ్ = నీవు, అశుభమ్ = అశుభమైన కార్యమును, కర్తుమ్ = చేయుటకు, కథమ్ = ఎట్లు, ఇచ్ఛసి = ఇచ్ఛయించుచున్నావు?

తా. సకలప్రాణులచేత నమస్కరింపబడిన కుబేరుడు నా సోదరుడని చెప్పుకొనుచు నీవు ఈ అకార్యము చేయుటకు ఎట్లు పూనుకున్నావు? 21

మూ. అవశ్యం వినశిష్యన్తి సర్వే రావణ రాక్షసాః,
యేషాం త్వం కర్కశో రాజా దుర్బుద్ధిరజితేన్ద్రియః. 22

ప్ర. అ. రావణ = రావణా! కర్కశః = క్రూరుడవు, దుర్బుద్ధిః = చెడ్డబుద్ధి కలవాడవు, అజితేన్ద్రియః = జయింపబడని ఇంద్రియములు కలవాడవు అయిన, త్వమ్ = నీవు, యేషామ్ = ఏ రాక్షసులకు, రాజా = రాజువో, అట్టి, సర్వే = సమస్తమైన, రాక్షసాః = రాక్షసులు, అవశ్యమ్ = తప్పక, వినశిష్యన్తి = నశించగలరు.

తా. రావణా! క్రూరుడవు, దుర్బుద్ధివి, ఇంద్రియనిగ్రహము లేనివాడవు అయిన నీవు రాజుగా ఉన్న రాక్షసులందరూ నశించగలరు. 22

మూ. అపహృత్య శచీం భార్యాం శక్యమిన్ద్రస్య జీవితుమ్,
న చ రామస్య భార్యాం మామపనీయాస్తి జీవితమ్. 23

ప్ర. అ. ఇన్ద్రస్య = ఇంద్రునియొక్క, భార్యామ్ = భార్యయైన, శచీమ్ = శచీదేవిని, అపహృత్య = అపహరించి, జీవితుమ్ = జీవించుటకు, శక్యమ్ = శక్యమైనది. రామస్య = రామునియొక్క, భార్యామ్ = భార్యనైన. మామ్ = నన్ను, అపనీయ = అపహరించి, జీవితమ్ = జీవితము, నాస్తి = లేదు.

తా. ఇంద్రుని భార్యయైన శచీదేవిని అపహరించి యైనా జీవించవచ్చునేమో కాని, రాముని భార్యనైన నన్ను అపహరించినచో జీవితము లేదు. 23

మూ. జీవేచ్చిరం వజ్రధరస్య హస్తా
చ్ఛచీం ప్రధృష్యాప్రతిరూపరూపామ్,
న మాదృశీం రాక్షస దూషయిత్వా
పీతామృతస్యాపి తవాస్తి మోక్షః. 24

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
అష్టచత్వారింశః సర్గః.

ప్ర. అ. రాక్షస = రాక్షసుడా! అప్రతిరూపరూపామ్ = సాటి లేని రూపము గల, శచీమ్ = శచీదేవిని, వజ్రధరస్య = ఇంద్రునియొక్క, హస్తాత్ = హస్తమునుండి, ప్రధృష్య = బలాత్కారముగా లాగికొని, చిరమ్ = చిరకాలము, జీవేత్ = జీవించవచ్చును. మాదృశీమ్ = నావంటిదానిని, దూషయిత్వా = దూషించి, పీతామృతస్యాపి = త్రాగబడిన అమృతము కలవాడవైనను, తవ = నీకు, మోక్షః = విడుదల, న = లేదు.

తా. ఓ రాక్షసుడా! సాటి లేని సౌందర్యము గల శచీదేవిని వజ్రాయుధము ధరించిన ఇంద్రుని హస్తమునుండి బలాత్కారముగా అపహరించుకొనిపోయి కూడ చిరకాలము జీవించవచ్చునేమో! నావంటిదానిని దూషించినచో నీవు అమృతము తాగినా కూడ నీకు విడుదల ఉండదు. 24

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో నలుబది ఎనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోపఞ్చాశః సర్గః

[రావణుడు సీతను అపహరించుట. ఆమె విలపించుట. జటాయువు కనబడుట.]

మూ. సీతాయా వచనం శ్రుత్వా దశగ్రీవః ప్రతాపవాన్,
హస్తే హస్తం సమాహత్య చకార సుమహద్వపుః. 1

ప్ర. అ. ప్రతాపవాన్ = ప్రతాపవంతుడైన, దశగ్రీవః = రావణుడు, సీతాయాః = సీతయొక్క, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, హస్తే = హస్తమునందు, హస్తమ్ = హస్తమును, సమాహత్య = కొట్టి, సుమహత్ = చాల పెద్దదైన, వపుః = శరీరమును, చకార = చేసెను.

తా. ప్రతాపవంతుడైన రావణుడు సీత మాటలు విని, ఒక చేతిలో మరొక చేయి వేసి చరచి, శరీరమును పెద్దగా చేసెను. 1

మూ. స మైథిలీం పునర్వాక్యం బభాషే వాక్యకోవిదః,
నోన్మత్తయా శ్రుతౌ మన్యే మమ వీర్యపరాక్రమౌ. 2

ప్ర. అ. వాక్యకోవిదః = మాటలలో నేర్పరియైన, సః = అతడు, మైథిలీమ్ = సీతను గూర్చి, పునః = మరల, వాక్యమ్ = వాక్యమును, బభాషే = పలికెను. ఉన్మత్తయా = ఉన్మత్తురాలవైన నీచేత, మమ = నాయొక్క, వీర్యపరాక్రమౌ = వీర్యపరాక్రమములు, న శ్రుతౌ = వినబడలేదు అని, మన్యే = తలచెదను.

తా. మాటలలో నేర్పరియైన ఆ రావణుడు సీతతో మరల ఇట్లు పలికెను. నీకు పిచ్చిఉన్నది కాబోలు, అందుచేతనే నా వీర్యమును గూర్చి పరాక్రమమును గూర్చి నేను వర్ణించిచెప్పినా నీవు వినలేదని అనుకొనుచున్నాను. 2

మూ. ఉద్వహేయం భుజాభ్యాం తు మేదినీమమ్బరే స్థితః,
ఆపిబేయం సముద్రం చ హన్యాం మృత్యుం రణే స్థితః. 3

ప్ర. అ. అమ్బరే = ఆకాశమునందు, స్థితః = ఉన్నవాడనై, భుజాభ్యామ్ = భుజములతో, మేదినీమ్ = భూమిని, ఉద్వహేయమ్ = మోయగలను. సముద్రం చ = సముద్రమును కూడ, ఆపిబేయమ్ = త్రాగివేయుదును. రణే = యుద్ధమునందు, స్థితః = ఉన్నవాడనై, మృత్యుమ్ = మృత్యువును, హన్యామ్ = చంపుదును.

తా. ఆకాశమునందు నిలచి రెండు చేతులతో భూమిని ఎత్తి మోయుదును. సముద్రమును త్రాగుదును. యుద్ధరంగములో నిలచి మృత్యువును కూడ చంపుదును. 3

మూ. అర్కం రున్ధ్యాం శరైస్తీక్ష్ణైర్విభిన్ద్యాం హి మహీతలమ్,
కామరూపిణమున్మత్తే పశ్య మాం కామదం పతిమ్. 4

ప్ర. అ. అర్కమ్ = సూర్యుణ్ణి, రున్ధ్యామ్ = అడ్డుకొనెదను. తీక్ష్ణైః = తీక్ష్ణములైన, శరైః = బాణములచేత, మహీతలమ్ = భూమిని, విభిన్ద్యామ్ = బ్రద్దలు కొట్టెదను. ఉన్మత్తే = పిచ్చిదానా! కామదమ్ = కోరికలను ఇచ్చే, పతిమ్ = భర్తనైన, కామరూపిణమ్ = స్వేచ్ఛారూపము గల, మామ్ = నన్ను, పశ్య = చూడుము.

తా. సూర్యుణ్ణి అడ్డుకొందును. తీక్ష్ణములైన బాణములతో భూమిని బ్రద్దలు కొట్టుదును. పిచ్చిదానా! ఇచ్ఛానుసారము రూపము ధరించ గలిగినవాడను, నీ కోరికలన్నీ తీర్చగలవాడను అయిన నీ భర్తనైన నన్ను చూడుము. 4

మూ. ఏవముక్తవతస్తస్య సూర్యకల్పే శిఖిప్రభే,
క్రుద్ధస్య హరిపర్యన్తే రక్తే నేత్రే బభూవతుః. 5

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తవతః = పలికిన, క్రుద్ధస్య = కోపించిన, తస్య = ఆ రావణునియొక్క, సూర్యకల్పే = సూర్యునితో సమానములు, శిఖిప్రభే = అగ్ని వంటి కాంతి గలవి, హరిపర్యన్తే = శ్యామవర్ణము గల ప్రాంతములు గలవీ అయిన, నేత్రే = నేత్రములు, రక్తే = ఎఱ్ఱగా, బభూవతుః = అయినవి.

తా. కోపించి ఈ విధముగా మాటలాడుచున్న ఆ రావణుని, సూర్యుని వలె ఉన్నవి, అగ్నికాంతి వంటి కాంతి గలవి, నల్లని చివరి భాగములు గలవి అయిన నేత్రములు ఎఱ్ఱబడినవి. 5

మూ. సద్యః సౌమ్యం పరిత్యజ్య భిక్షురూపం చ సంమతమ్,
స్వం రూపం కాలరూపాభం భేజే వైశ్రవణానుజః. 6

ప్ర. అ. వైశ్రవణానుజః = రావణుడు, సద్యః = వెంటనే, సౌమ్యమ్ = సౌమ్యము, సంమతమ్ = పూజనీయము అయిన, భిక్షురూపమ్ = సంన్యాసిరూపమును, పరిత్యజ్య = విడచి, స్వమ్ = తన సంబంధమైన, కాలరూపాభమ్ = యముని రూపము వంటి, రూపమ్ = రూపమును, భేజే = పొందెను.

తా. ఆ రావణుడు సౌమ్యము, పూజనీయము అయిన సంన్యాసిరూపమును విడచి, యముని రూపము వంటి తన రూపమును గ్రహించెను. 6

మూ. సంరక్తనయనః శ్రీమాం స్తప్తకాఞ్చనభూషణః,
క్రోధేన మహతావిష్టో నీలజీమూతసంనిభః. 7
దశాస్యః కార్ముకీ బాణీ బభూవ క్షణదాచరః.

ప్ర. అ. మహతా = గొప్పదైన, క్రోధేన = క్రోధముచేత, ఆవిష్టః = ఆవహింపబడిన అతడు, సంరక్తనయనః = ఎఱ్ఱనైన నేత్రములు కలవాడు, శ్రీమాన్ = శోభ కలవాడు, తప్తకాఞ్చనభూషణః = పరిశుద్ధమైన బంగారు అలంకారములు కలవాడు, నీలజీమూతసన్నిభః = నల్లని మేఘముతో సమానుడు, దశాస్యః = పది తలలు కలవాడు, కార్ముకీ = ధనస్సు కలవాడు, బాణీ = బాణము కలవాడు, అయిన, క్షణదాచరః = రాక్షసుడుగా, బభూవ = అయెను.

తా. అధికమైన కోపముతో నిండిన అతడు పది తలలు గల రాక్షసుడుగా మారెను. శోభాయుక్తుడైన అతని నేత్రములు ఎఱ్ఱగా ఉండెను. అతడు బంగారు ఆభరణములు ధరించెను. నల్లని మేఘము వలె ఉండెను. ధనుర్బాణములు ధరించెను. 7

మూ. స పరివ్రాజకచ్ఛద్మ మహాకాయో విహాయ తత్, 8
ప్రతిపద్య స్వకం రూపం రావణో రాక్షసాధిపః.
సంరక్తనయనః క్రోధాజ్జీమూతనిచయప్రభః, 9
రక్తామ్బరధరస్తస్థౌ స్త్రీరత్నం ప్రేక్ష్య మైథిలీమ్.

ప్ర. అ. రాక్షసాధిపః = రాక్షసరాజైన, సః రావణః = ఆ రావణుడు, తత్ = ఆ, పరివ్రాజకచ్ఛద్మ = పరివ్రాజక కపటవేషమును, విహాయ = విడచి, స్వకమ్ = తనసంబంధమైన, రూపమ్ = రూపమును, ప్రతిపద్య = పొంది, క్రోధాత్ = కోపమువలన, సంరక్త నయనః = ఎఱ్ఱనైన నేత్రములు కలవాడై, జీమూత నిచయప్రభః = మేఘసముదాయము వంటి కాంతి గలవాడై, రక్తామ్బరధరః = ఎఱ్ఱని వస్త్రములు ధరించినవాడై, స్త్రీరత్నమ్ = స్త్రీలలో శ్రేష్ఠురాలైన, మైథిలీమ్ = సీతను, ప్రేక్ష్య = చూచి, తస్థౌ = నిలచెను.

తా. రాక్షసరాజైన ఆ రావణుడు ఆ కపటపరివ్రాజకరూపమును విడచి, పెద్ద శరీరము ధరించి, కోపముచేత ఎఱ్ఱనైన నేత్రములతో, మేఘసముదాయము వంటి శరీరకాంతితో, ఎఱ్ఱటి వస్త్రములు ధరించి, స్త్రీలలో శ్రేష్ఠురాలైన సీతను చూచుచు నిలబడెను. 8, 9

మూ. స తామసితకేశాన్తాం భాస్కరస్య ప్రభామివ, 10
వసనాభరణోపేతాం మైథిలీం రావణోఽబ్రవీత్.

ప్ర. అ. సః = ఆ, రావణః = రావణుడు, అసితకేశాన్తామ్ = నల్లని కేశపాశము కలది, భాస్కరస్య = సూర్యునియొక్క, ప్రభామివ = కాంతి వలె ఉన్నది. వసనాభరణోపేతామ్ = వస్త్రములతోను ఆభరణములతోను కూడినది అయిన, మైథిలీమ్ = సీతను గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. మంచి వస్త్రములను ఆభరణములను ధరించి, నల్లని కేశపాశము గలిగి, సూర్యకాంతి వలె ప్రకాశించుచున్న ఆ సీతతో రావణుడు ఇట్లు పలికెను.

మూ. త్రిషు లోకేషు విఖ్యాతం యది భర్తారమిచ్ఛసి, 11
మామాశ్రయ వరారోహే తవాహం సదృశః పతిః.

ప్ర. అ. వరారోహే = శ్రేష్ఠమైన కటిప్రదేశము గలదానా! త్రిషు లోకేషు = మూడు లోకములలో, విఖ్యాతమ్ = ప్రసిద్ధుడైన, భర్తారమ్ = భర్తను, ఇచ్ఛసి యది = (నీవు) కోరినట్లయితే, మామ్ = నన్ను, ఆశ్రయ = ఆశ్రయించుము. అహమ్ = నేను, తవ = నీకు, సదృశః = తగిన, పతిః = భర్తను.

తా. అందమైన కటిప్రదేశము గలదానా! నీకు మూడు లోకాలలో ప్రసిద్ధు

డైన భర్త కావాలని అనుకొన్నచో నన్ను ఆశ్రయించుము. నీకు భర్త అగుటకు తగినవాడను నేనే. 11

మూ. మాం భజస్వ చిరాయ త్వమహం శ్లాఘ్యః పతిస్తవ, 12
నైవ చాహం క్వచిద్భద్రే కరిష్యే తవ విప్రియమ్,
త్యజ్యతాం మానుషే భావో మయి భావః ప్రణీయతామ్.

ప్ర. అ. భద్రే = మంగళప్రదురాలా ! చిరాయ = చిరకాలము, మామ్ = నన్ను, భజస్వ = పొందుము. అహమ్ = నేను, తవ = నీకు, శ్లాఘ్యః = శ్లాఘించ దగిన, పతిః = భర్తను. అహమ్ = నేను, క్వచిత్ = ఎన్నడూ, తవ = నీకు, విప్రియమ్ = అపకారమును, న కరిష్యే చ = చెయ్యను. మానుషే = మానవుడైన రామునియందు, భావః = ప్రేమ, త్యజ్యతామ్ = విడవబడుగాక. మయి = నామీద, భావః = ప్రేమ, ప్రణీయతామ్ = చేయబడుగాక.

తా. నీవు చాల కాలము నా సహచరివిగా ఉండుము. నేను నీకు శ్లాఘింప తగిన భర్తను. ఓ ! మంగళప్రదురాలా ! నేను నీ కెన్నడూ అప్రియ మేదీ చేయను. మానవుడైన ఆ రామునినుంచి నీ మనస్సు మరల్చుము. నాపై ఉంచుము. 12, 13

మూ. రాజ్యాచ్చ్యుతమసిద్ధార్థం రామం పరిమితాయుషమ్,
కైర్గుణైరనురక్తాసి మూఢే పణ్డితమానిని. 14

యః స్త్రియా వచనాద్రాజ్యం విహాయ ససుహృజ్జనమ్,
అస్మిన్ వ్యాళానుచరితే వనే చరతి దుర్మతిః. 15

ప్ర. అ. మూఢే = మూఢురాలా ! పణ్డితమానిని = బుద్ధిమంతురాల నని అనుకొనుచున్నదానా ! దుర్మతిః = దుష్టబుద్ధి గల, యః = ఏ రాముడు, స్త్రియాః = స్త్రీయొక్క, వచనాత్ = వచనమువలన, ససుహృజ్జనమ్ = స్నేహితులతో కూడిన, రాజ్యమ్ = రాజ్యమును, విహాయ = విడచి, వ్యాళానుచరితే = క్రూరమృగములచే సంచరింపబడిన, అస్మిన్ = ఈ, వనే = వనమునందు, చరతి = సంచరించు చున్నాడో, అట్టి, రాజ్యాత్ = రాజ్యమునుండి, చ్యుతమ్ = భ్రష్టుడు, అసిద్ధార్థమ్ = సఫలము కాని ప్రయోజనము కలవాడు, పరిమితాయుషమ్ = పరిమితమైన ఆయు

ర్దాయము కలవాడు అయిన, రామమ్ = రాముణ్ణి గూర్చి, కైః = ఏ, గుణైః = గుణములచేత, అనురక్తా = అనురాగము కలదానవు, అసి = అయిఉన్నావు.

తా. తెలివిగలదాన నని అనుకొనే ఓ ! తెలివితక్కువదానా ! ఏ రాముడు బుద్ధివిహీనుడై స్త్రీ మాటలు విని రాజ్యమును, స్నేహితులను విడిచిపెట్టి క్రూర మృగములతో నిండిన ఈ అరణ్యములో తిరుగాడుచున్నాడో, అట్టి రాజ్యభ్రష్టుడూ, నిష్ప్రయోజనుడూ, అల్పాయుర్దాయవంతుడూ అయిన రాముణ్ణి ఏ గుణములు చూచి ప్రేమించుచున్నావు ? 14, 15

మూ. ఇత్యుక్త్వా మైథిలీం వాక్యం ప్రియార్హాం ప్రియవాదినీమ్,
అభిగమ్య సుదుష్టాత్మా రాక్షసః కామమోహితః, 16
జగ్రాహ రావణః సీతాం బుధః ఖే రోహిణీమివ.

ప్ర. అ. సుదుష్టాత్మా = మిక్కిలి దుష్టబుద్ధి గల, కామమోహితః = కామము చేత మోహితుడైన, రాక్షసః = రాక్షసుడైన, రావణః = రావణుడు, ప్రియార్హామ్ = ప్రియవచనములకు తగినదీ, ప్రియవాదినీమ్ = ప్రియముగా మాటలాడునదీ అయిన, మైథిలీమ్ = సీతను గూర్చి, ఇతి = ఇట్లు, ఉక్త్వా = పలికి, అభిగమ్య = సమీపించి, ఖే = ఆకాశమునందు, బుధః = బుధుడు, రోహిణీమివ = రోహిణిని వలె, సీతామ్ = ఆ సీతను, జగ్రాహ = పట్టుకొనెను.

తా. కామముచే ఒళ్ళు తెలియని ఆ రావణుడు, ప్రియమైన మాటలకే తగినది, ప్రియముగా మాటలాడేదీ అయిన సీతతో ఈ విధముగా పలికి, ఆకాశమునందు బుధుడు రోహిణిని సమీపించి నట్లు సమీపించి, ఆమెను పట్టుకొనెను.

మూ. వామేన సీతాం పద్మాక్షీం మూర్ధజేషు కరేణ సః, 17
ఊర్వోస్తు దక్షిణేనైవ పరిజగ్రాహ పాణినా

ప్ర. అ. సః = ఆతడు. పద్మాక్షీమ్ = పద్మముల వంటి నేత్రములు గల, సీతామ్ = సీతను, వామేన కరేణ = ఎడమచేతితో, మూర్ధజేషు = కేశములయందు, దక్షిణేన పాణినా = కుడిచేతితో, ఊర్వోః = తొడలయందు, ప్రతిజగ్రాహ = పట్టుకొనెను.

తా. ఆ రావణుడు పద్మముల వంటి నేత్రములు గల సీతను ఎడమ

చేతితో కేశపాశమునందు, కుడిచేతితోతొడలయందు పట్టుకొని లేవదీసికొని పోయెను. 17

మూ. తం దృష్ట్వా మృత్యుసంకాశం తీక్ష్ణదంష్ట్రం మహాభుజమ్,
ప్రాద్రవన్ గిరిసంకాశం భయార్తా వనదేవతాః.

ప్ర. అ. మృత్యుసంకాశమ్ = మృత్యువుతో సమానుడు, తీక్ష్ణదంష్ట్రమ్ = తీక్ష్ణములైన కోరలు గలవాడు, మహాభుజమ్ = గొప్ప భుజములు కలవాడు, గిరిసంకాశమ్ = పర్వతముతో సమానుడు అయిన, తమ్ = వానిని, దృష్ట్వా = చూచి, వనదేవతాః = వనదేవతలు, భయార్తాః = భయముచేత పీడింపబడినవై, ప్రాద్రవన్ = పారిపోయిరి.

తా. తీక్ష్ణములైన కోరలతో, పెద్ద భుజములతో, పర్వత మంత ఆకారముతో మృత్యువు వలె ఉన్న ఆ రావణుణ్ణి చూచి వనదేవతలు భయముచేత పీడింపబడి, పారిపోయిరి. 18

మూ. స చ మాయామయో దివ్యః ఖరయుక్తః ఖరస్వనః, 19
ప్రత్యదృశ్యత హేమాఙ్గో రావణస్య మహారథః.

ప్ర. అ. మాయామయః = మాయావికారము, దివ్యః = అద్భుతము, ఖరయుక్తః = గాడిదలతో కూర్చబడినది, ఖరస్వనః = పరుషమైన ధ్వని కలది, హేమాఙ్గః = బంగారు అవయవములు గలది అయిన, రావణస్య = రావణుని యొక్క, సః మహారథః = ఆ మహారథము, ప్రత్యదృశ్యత = చూడబడెను.

తా. మాయానిర్మితము, అద్భుతము, పరుషమైన ధ్వని గలది, బంగారు అవయవములు గలది అయిన, గాడిదలు కట్టిన రావణుని రథము అప్పుడు మరల కనబడెను. 19

మూ. తతస్తాం పరుషైర్వాక్యైర్భర్త్సయన్ స మహాస్వనః, 20
అఙ్కేనాదాయ వైదేహీం రథమారోపయత్తదా.

ప్ర. అ. తదా = అప్పుడు, మహాస్వనః = గొప్ప ధ్వని గల, సః = ఆ రావణుడు, తాం వైదేహీమ్ = ఆ సీతను, పరుషైః = పరుషములైన, వాక్యైః =

వాక్యములచేత, భర్త్సయన్ = భయపెట్టుచు, అఙ్కేన = ఒడిలో, ఆదాయ = గ్రహించి, రథమ్ = రథమును, ఆరోపయత్ = ఎక్కించెను.

తా. పెద్ద కంఠస్వరము గల ఆ రావణుడు పరుషములైన మాటలచేత ఆ సీతను భయపెట్టుచు, ఒడిలో కూర్చుండబెట్టుకొని రథము నెక్కించెను. 20

మూ. సా గృహీతా విచుక్రోశ రావణేన యశస్వినీ, 21
రామేతి సీతా దుఃఖార్తా రామం దూరగతం వనే.

ప్ర. అ. రావణేన=రావణునిచేత, గృహీతా=గ్రహింపబడిన, యశస్వినీ= కీర్తి గల, సా సీతా = ఆ సీత, దుఃఖార్తా = దుఃఖార్తురాలై, వనే = వనమునందు, దూరగతమ్ = దూరముగా వెళ్ళిన, రామమ్ = రాముణ్ణి గూర్చి, రామ ఇతి = రామా అని, విచుక్రోశ = అరచెను.

తా. రావణునిచేత పట్టుకొనబడిన కీర్తిమంతురాలైన ఆ సీత, దుఃఖపీడితురాలై, వనములో దూరముగా వెళ్ళిన రాముణ్ణి గూర్చి 'రామా ! 'అని అరచెను.

మూ. తామకామాం స కామార్తః పన్నగేన్ద్రవధూమివ, 22
వివేష్టమానామాదాయ ఉత్పపాతాథ రావణః.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, కామార్తః = కామపీడితుడైన, సః = ఆ, రావణః = రావణుడు, అకామామ్ = కామములేనిది, పన్నగేన్ద్రవధూమివ=ఆడ సర్పము వలె, వివేష్టమానామ్ = దొరలుచున్నదీ అయిన, తామ్ = ఆమెను, ఆదాయ = గ్రహించి, వేగేన = వేగముతో, ఉత్పపాత = ఎగిరెను.

తా. సీత విషయమై కామార్తుడైన ఆ రావణుడు, తనపై ఇచ్ఛ లేని ఆ సీత ఆడపాము వలె మెలికలు తిరిగిపోవుచుండగా ఆమెను పట్టుకొని ఆకాశము లోనికి ఎగిరెను.

మూ. తతః సా రాక్షసేన్ద్రేణ హ్రియమాణా విహాయసా, 23
భృశం చుక్రోశ మత్తేవ భ్రాన్తచిత్తా యథాతురా.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, రాక్షసేన్ద్రేణ = రావణునిచేత, విహాయసా = ఆకాశమార్గముచేత, హ్రియమాణా=హరించబడుచున్న, సా=ఆ సీత,

మత్తేవ = మదించినది వలె, భ్రాన్తచిత్తా = భ్రమచెందిన చిత్తము కలదై, ఆతురా యథా = రోగముతో బాధపడుచున్నది వలె, భృశమ్ = మిక్కిలి, చుక్రోశ = అరచెను.

తా. రావణునిచేత ఆకాశమార్గమునందు హరింపబడుచున్న ఆ సీత, మత్తెక్కినదాని వలె చిత్తభ్రమ చెందినదై, రోగపీడితురాలు వలె మిక్కిలి అరచెను. 23

మూ. హా లక్ష్మణ మహాబాహో గురుచిత్తప్రసాదక, 24
హ్రియమాణాం న జానీషే రక్షసా మామమర్షిణా.

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు కలవాడా! గురుచిత్తప్రసాదక = పెద్దల చిత్తమును ఆనందింపచేయువాడా! హా లక్ష్మణ = అయ్యో! లక్ష్మణా! అమర్షిణా = కోపము గల, రక్షసా = రాక్షసునిచేత, మామ్ = నన్ను, హ్రియమాణామ్ = హరించబడుచున్నదానినిగా, న జానీషే = ఎరుగవు.

తా. అయ్యో! లక్ష్మణా! గొప్ప బాహువులు కలవాడా! పెద్దల చిత్తమును ఆనందింపచేయువాడా! రాక్షసుడు కోపముచేత నన్ను అపహరించుకొనిపోవుచున్నట్లు నీకు తెలియదు కదా! 24

మూ. జీవితం సుఖమర్థాంశ్చ ధర్మహేతోః పరిత్యజన్, 25
హ్రియమాణామధర్మేణ మాం రాఘవ న పశ్యసి.

ప్ర. అ. జీవితమ్ = జీవితమును, సుఖమ్ = సుఖమును, అర్థాంశ్చ = ధనములను, ధర్మహేతోః = ధర్మము నిమిత్తమై, పరిత్యజన్ = విడచుచున్న, రాఘవ = రామా! అధర్మేణ = అధర్మాత్ముడైన రాక్షసునిచేత, హ్రియమాణామ్ = హరించబడుచున్న, మామ్ = నన్ను, న పశ్యసి = చూచుటలేదు.

తా. ధర్మముకొరకై జీవితమును, సుఖమును, సంపదలను విడచివేసిన రామా! అధర్మాత్ముడైన వీనిచే అపహరించబడుచున్న నన్ను నీవు చూచుటలేదు.

మూ. నను నామావినీతానాం వినేతాసి పరంతప, 26
కథమేవంవిధం పాపం న త్వం శాస్సి హి రావణమ్.

ప్ర. అ. పరంతప = శత్రుసంహారకుడా! అవినీతానామ్ = దుష్టులకు,

వినేతా = శిక్షకుడవు, అసి నను = అయి ఉన్నావు కదా। ఏవంవిధమ్ = ఇట్టి, పాపమ్ = పాపాత్ముడైన, రావణమ్ = రావణుణ్ణి, కథమ్=ఎట్లు, న హి శాస్సి = శిక్షించుటలేదు ?

తా॥ శత్రుసంహారకా। నీవు దుష్టులను శిక్షించేవాడవు కదా ? అట్టి నీవు, ఇట్టి పాపాత్ముడైన రావణుణ్ణి ఎందువలన శిక్షించుటలేదు ? 26

మూ. న ను సద్యోఽవినీతస్య దృశ్యతే కర్మణః ఫలమ్, 27
కాలోఽప్యఙ్గీభవత్యత్ర సస్యానామివ పక్తయే.

ప్ర. అ. అవినీతస్య = దుష్టమైన, కర్మణః = కర్మయొక్క, ఫలమ్ = ఫలము, సద్యః = వెంటనే, న దృశ్యతే ను = చూడబడదు కదా? సస్యానామ్ = సస్యములయొక్క, పక్తయే ఇవ = పాకముకొరకు వలె, అత్ర=దీని విషయము నందు, కాలోఽపి = కాలము కూడ, అఙ్గీభవతి = అంగ మగును.

తా. దుష్టకర్మ ఫలితము వెంటనే కనబడదు. సస్యముల పాకము చెందుటకు (పండుటకు)ఎట్లో అట్లే పాపము ఫలమును ఇచ్చుటలోకూడ కాలము అంగ మగును. కొంత కాలము తరవాత నైనా పాపఫలము అనుభవింపక తప్పదు. 27

మూ. త్వం కర్మ కృతవానేతత్కాలోపహితచేతనః, 28
జీవితాన్తకరం ఘోరం రామాద్వ్యసనమాప్నుహి.

ప్ర. అ. త్వమ్=నీవు, కాలోపహతచేతనః=కాలముచేత కొట్టబడిన బుద్ధి కలవాడవై, ఏతత్ = ఈ, కర్మ = కర్మను, కృతవాన్ = చేసినావు. రామాత్ = రామునివలన, జీవితాన్తకరమ్ = జీవితాంతమును కలిగించు, ఘోరమ్ = భయంకరమైన, వ్యసనమ్ = వ్యసనమును, ఆప్నుహి=పొందుము.

తా. రావణా। కాలముచేత విపరీతబుద్ధికలవాడవై, నీవు ఈ పని చేసినావు. అందుచేత రామునివలన నీకు ప్రాణములను తీయు ఘోరమైన ఆపద సంభవించుగాక. 28

మూ. హన్తేదానీం సకామాస్తు కైకేయీ సహ బాన్ధవైః, 29
హ్రియేత యదధర్మకామస్య ధర్మపత్నీ యశస్వినః.

ప్ర. అ. ధర్మకామస్య = ధర్మమునందు శ్రద్ధ కలవాడు, యశస్వినః = కీర్తి కలవాడు అయిన రామునియొక్క, ధర్మపత్నీ = ధర్మపత్నినైన నేను, యత్ = ఏ కారణమువలన, హ్రియే = హరించబడుచున్నానో, ఆ కారణమువలన, ఇదానీమ్ = ఇప్పుడు, కైకేయీ = కైకేయి, బాన్ధవైః సహ = బంధువులతో కూడ, సకామా = ఫలించిన కోరికగలది, అస్తు = అగుగాక. హన్త = అయ్యో!

తా. అయ్యో! ఈ నాటికి కైకేయి కోరిక, ఆమె బంధువుల కోరిక తీరినది. ఎందుచేతననగా ధర్మపరాయణుడు, కీర్తిశాలి అయిన రాముని ధర్మపత్నియైన నన్ను ఈ రాక్షసుడు హరించుచున్నాడు. 29

మూ. ఆమన్త్రయే జనస్థానే కర్ణికారాన్ సుపుష్పితాన్, 30
క్షిప్రం రామాయ శంసధ్వం సీతాం హరతి రావణః.

ప్ర. అ. జనస్థానే = జనస్థానమునందున్న, సుపుష్పితాన్ = బాగుగా పుష్పించిన, కర్ణికారాన్ = కర్ణికారవృక్షములను (కొండగోగుచెట్లను), ఆమన్త్రియే = పిలిచి కోరుచున్నాను. రావణః = రావణుడు, సీతామ్ = సీతను, హరతి = = హరించుచున్నాడు అని, క్షిప్రమ్ = శీఘ్రముగా, రామాయ = రామునకు, శంసధ్వమ్ = చెప్పుడు.

తా. "రావణుడు సీతను హరించుచున్నాడని శీఘ్రముగా రామునితో చెప్పండి'' అని జనస్థానమునందున్న బాగుగా పుష్పించిన కొండగోగుచెట్లను కోరుచున్నాను. 30

మూ. మాల్యవన్తం శిఖరిణం వన్దే ప్రస్రవణం గిరిమ్, 31
క్షిప్రం రామాయ శంస త్వం సీతాం హరతి రావణః.

ప్ర. అ. మాల్యవన్తమ్ = మంచిపుష్పములు గలది, శిఖరిణమ్ = ఉన్నతమైన శిఖరములు గలది అయిన, ప్రస్రవణం గిరిమ్ = ప్రస్రవణపర్వతమును, వన్దే = నమస్కరించుచున్నాను. రావణః = రావణుడు, సీతామ్ = సీతను, హరతి = హరించుచున్నాడు అని, త్వమ్ = నీవు, క్షిప్రమ్ = శీఘ్రముగా, రామాయ = రామునకు, శంస = చెప్పుము.

తా. పుష్పపంక్తులతో నిండి ఉన్నది, ఉన్నతమైన శిఖరములు కలది

అయిన ప్రస్రవణపర్వతానికి నమస్కరించుచున్నాను. రావణుడు సీతను హరించుచున్నా దని రామునితో శీఘ్రముగా చెప్పుము.

వి. ప్రాచ్యపాఠంలో "మాల్యవన్తమ్" బదులు "టఙ్కవన్తమ్" అని ఉన్నది. "ఏటవాలుగా ఉండే చరియలు గలది" అని అర్థము. ఈ పాఠము బాగున్నది. మాల్యవంత మనేది ఒక పర్వతానికి పేరు అవడం చేత అది కుదరక ఏదో అర్థం చెప్పవలసి వచ్చింది. 31

మూ. హంససారససంఘుష్టాం వన్దే గోదావరీం నదీమ్, 32
క్షిప్రం రామాయ శంస త్వం సీతాం హరతి రావణః.

ప్ర. అ. హంససారససంఘుష్టామ్ = హంసలచేతను, సారసపక్షుల చేతను ధ్వనిచేయించబడిన, గోదావరీం నదీమ్=గోదావరీనదిని, వన్దే=నమస్కరించుచున్నాను. రావణః = రావణుడు, సీతామ్ = సీతను, హరతి = హరించుచున్నాడు అని, త్వమ్ = నీవు, క్షిప్రమ్ = శీఘ్రముగా, రామాయ = రామునకు, శంస = చెప్పుము.

తా. హంస-సారసపక్షుల ధ్వనులతో నిండిన గోదావరీనదికి నమస్కరించుచున్నాను. రావణుడు సీతను హరించుచున్నా దని శీఘ్రముగా రామునకు చెప్పుము. 32

మూ. దైవతాని చ యాన్యస్మిన్ వనే వివిధపాదపే, 33
నమస్కరోమ్యహం తేభ్యో భర్తుః శంసన్తు మాం హృతామ్.

ప్ర. అ. వివిధపాదపే=అనేకవిధములైన వృక్షములు గల, అస్మిన్ వనే = ఈ వనమునందు, యాని = ఏ, దైవతాని = దైవతములు, సన్తి = ఉన్నవో, తేభ్యః = వాటికి, అహమ్ = నేను, నమస్కరోమి = నమస్కరించుచున్నాను. మామ్=నన్ను, హృతామ్=హరించబడినదానినిగా, భర్తుః=నా భర్తకు, శంసన్తు = చెప్పెదరుగాక.

తా. అనేకవిధములైన వృక్షములతో నిండిన ఈ వనములో ఉన్న దేవతలందరికీ నమస్కరించుచున్నాను. నన్ను రాక్షసుడు అపహరించినా దని మీరు రామునికి చెప్పుడు. 33

మూ.. యాని కాని చిదప్యత్ర సత్త్వాని నివసన్త్యత, 34
సర్వాణి శరణం యామి మృగపక్షిగణానపి.

ప్ర. అ. అత్ర = ఇక్కడ, యాని కాని చిత్ = ఏ కొన్ని, సత్త్వాని = ప్రాణులు, నివసన్తి = నివసించుచున్నవో, సర్వాణి = వాటినన్నింటినీ, మృగ పక్షిగణానపి = మృగములయొక్క పక్షులయొక్క గణములను, శరణమ్ = శరణమునుగా, యామి = పొందుచున్నాను.

తా. ఇక్కడ నివసించి ఉన్న అన్ని ప్రాణులను, మృగముల గణము లను, పక్షిగణములను కూడ నేను శరణువేడుచున్నాను. 34

మూ. హ్రియమాణాం ప్రియాం భర్తుః ప్రాణేభ్యోఽపి గరీయసీమ్,
వివశాపహృతా సీతా రావణేనేతి శంసత.

ప్ర. అ. ప్రాణేభ్యోఽపి = ప్రాణములకంటె కూడ, గరీయసీమ్ = గొప్ప దానను, హ్రియమాణామ్ = హరించబడుచున్నదానను, ప్రియామ్ = ప్రియురా లను అయిన నన్ను గూర్చి, వివశా = వివశురాలైన, సీతా = సీత, రావణేన = రావణునిచేత, అపహృతా ఇతి = అపహరించబడినది అని, భర్తుః = నా భర్తకు, శంసత = చెప్పుడు.

తా. అపహరించబడుచున్న, ప్రాణములకంటె కూడ అధికముగా ప్రియు రాలనైన, నన్ను గూర్చి నా భర్తతో- "ఏమీ చేయజాలని స్థితిలో ఉన్న సీతను రావణుడు అపహరించినాడు"అని చెప్పుడు. 35

మూ. విదిత్వా మాం మహాబాహురముత్రాపి మహాబలః, 36
ఆనేష్యతి పరాక్రమ్య వైవస్వతహృతామపి.

ప్ర. అ. మహాబలః = గొప్ప బలము గలవాడు, మహాబాహుః = గొప్ప బాహువులు గలవాడు అయిన రాముడు, వైవస్వతహృతామపి = యమునిచేత హరింపబడినదాననైనను, మామ్ = నన్ను, అముత్రాపి = పరలోకములో ఉన్నను, విదిత్వా = తెలిసికొని, పరాక్రమ్య = పరాక్రమించి, ఆనేష్యతి = తీసికొని వాగలడు.

తా. గొప్ప బాహువులు గలవాడు, మహాబలశాలీ అయిన రాముడు, నన్ను యముడు అపహరించినను పరలోకములో నున్నట్లు తెలిసినచో పరాక్రమముచేత తీసికొని రాగలడు. 36

మూ. సా తదా కరుణా వాచో విలపన్తీ సుదుఃఖితా, 37
వనస్పతిగతం గృధ్రం దదర్శాయతలోచనా.

ప్ర. అ. తదా = అప్పుడు, కరుణాః = కరుణతో నిండిన, వాచః = వాక్కులను, విలపన్తీ = విలపించుచున్న, ఆయతలోచనా = దీర్ఘములైన నేత్రములు గల, సా = ఆ సీత, సుదుఃఖితా = చాలా దుఃఖించినదై, వనస్పతిగతమ్ = వృక్షముపై నున్న, గృధ్రమ్ = జటాయువును, దదర్శ = చూచెను.

తా. జాలిగొల్పునట్లు విలపించు చాలదుఃఖార్తయైన, విశాలనేత్రియైన ఆ సీతకు ఆ ప్రాంతమునందు చెట్టుమీద నున్న జటాయువు కనబడెను. 37

మూ. సా తముద్వీక్ష్య సుశ్రోణీ రావణస్య వశం గతా, 38
సమాక్రన్దద్భయపరా దుఃఖోపహతయా గిరా.

ప్ర. అ. రావణస్య = రావణునియొక్క, వశమ్ = వశమును, గతా = పొందిన, సుశ్రోణీ = అందమైన కటిప్రదేశము గల, భయపరా = భయమునకు అధీనురాలైన, సా = ఆ సీత, తమ్ = వానిని, ఉద్వీక్ష్య = చూచి, దుఃఖోపహతయా = దుఃఖముచేత కొట్టబడిన, గిరా = వాక్కుతో, సమాక్రన్దత్ = బిగ్గరగా అరచెను.

తా. రావణునకు వశురాలై, భయాక్రాంతురాలైన, చక్కని కటిప్రదేశము గల ఆ సీత జటాయువును చూచి దుఃఖముచేత తొట్రుపడుచున్న మాటలతో ఆతనిని గూర్చి బిగ్గరగా అరచెను. 38

మూ. జటాయో పశ్య మామద్య హ్రియమాణామనాథవత్, 39
అనేన రాక్షసేన్ద్రేణ కరుణం పాపకర్మణా.

ప్ర. అ. జటాయో = జటాయూ, అద్య = ఇప్పుడు, అనేన = ఈ, పాపకర్మణా = పాపాత్ముడైన, రాక్షసేన్ద్రేణ = రాక్షసరాజుచేత, అనాథవత్ = అనాథురాలి వలె, కరుణమ్ = జాలి కలుగునట్లుగా, హ్రియమాణామ్ = హరింపబడుచున్న, మామ్ = నన్ను, పశ్య = చూడుము.

తా. ఓ! జటాయూ! పాపాత్ముడైన ఈ రావణుడు ఇప్పుడు జాలిగొలుపు స్థితిలో ఉన్న నన్ను అనాథురాలిని వలె తీసికొనిపోవుచున్నాడు; చూడుము। 39

మూ. నైష వారయితుం శక్య స్తవ క్రూరో నిశాచరః, 40
సత్త్వవాన్ జితకాశీ చ సాయుధశ్చైవ దుర్మతిః.

ప్ర. అ. క్రూరః = క్రూరుడు, సత్త్వవాన్ = బలవంతుడు, జితకాశీ = జయముతో ప్రకాశించుచున్నవాడు, సాయుధశ్చైవ = ఆయుధములతో కూడిన వాడు, దుర్మతిః = దుష్టబుద్ధి కలవాడు అయిన, ఏషః = ఈ, నిశాచరః = రాక్షసుడు, తవ = నీకు, వారయితుమ్ = నివారించుటకు, న శక్యః = శక్యమైనవాడు కాడు.

తా. ఈ రాక్షసుడు క్రూరుడు, బలవంతుడు, జయములను సంపాదించిన వాడు, ఆయుధము చేతిలో ఉన్న దుష్టబుద్ధి; అట్టి వీనిని నీవు నివారింపజాలవు.

మూ. రామాయ తు యథాతత్త్వం జటాయో హరణం మమ, 41
లక్ష్మణాయ చ తత్సర్వమాఖ్యాతవ్యమశేషతః.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ఏకోనపఞ్చాశః సర్గః.

ప్ర. అ. జటాయో = జటాయూ। మమ = నాయొక్క, హరణమ్ = అపహరణమును గూర్చి, యథాతత్త్వమ్ = యథార్థముగా, తత్ సర్వమ్ = అది అంతా, అశేషతః = పూర్తిగా, రామాయ = రామునకు, లక్ష్మణాయ చ = లక్ష్మణునకూ, ఆఖ్యాతవ్యమ్ = చెప్పదగినది.

తా. జటాయూ! నా అపహరణమునకు సంబంధించిన విషయము లన్నీ పూర్తిగా, ఉన్నది ఉన్నట్లుగా రామునకు, లక్ష్మణునకూ చెప్పుము. 41

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో
నలుబది తొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ పఞ్చాశః సర్గః

[సీతను హరించవద్దని జటాయువు రావణునకు ఉపదేశించుట. అట్లు కానిచో యుద్ధానికి రమ్మని పిలుచుట.]

మూ. తం శబ్దమవసుప్తస్తు జటాయురథ శుశ్రువే,
నిరీక్ష్య రావణం క్షిప్రం వైదేహీం చ దదర్శ సః. 1

ప్ర. అ. అవసుప్తః = నిద్రించిన, జటాయుః = జటాయువు, తం శబ్దమ్ = ఆ శబ్దమును, శుశ్రువే = వినెను. అథ = అటు పిమ్మట, సః = అతడు, క్షిప్రమ్ = శీఘ్రముగా. నిరీక్ష్య = పరిశీలించి, రావణమ్ = రావణుణ్ణి, వైదేహీం చ = సీతను, దదర్శ = చూచెను.

తా. సీత ఆర్తధ్వని నిద్రపోవుచున్న జటాయువునకు వినబడెను. అతడు వెంటనే పరిశీలించగా అతనికి సీత, రావణుడు కనబడిరి. 1

మూ. తతః పర్వతకూటాభ స్తీక్ష్ణతుణ్డః ఖగోత్తమః,
వనస్పతిగతః శ్రీమాన్ వ్యాజహార శుభాం గిరమ్. 2

ప్ర. అ. తతః = అటుపిమ్మట, పర్వతకూటాభః = పర్వతశిఖరమువంటివాడు, తీక్ష్ణతుణ్డః = తీక్ష్ణమైన ముట్టె కలవాడు, శ్రీమాన్ = శోభాయుక్తుడు అయిన, వనస్పతిగతః = చెట్టుమీద నున్న, ఖగోత్తమః = ఆ జటాయువు, శుభామ్ = మంగళకరమైన, గిరమ్ = మాటను, వ్యాజహార = పలికెను.

తా. పిమ్మట, పర్వతశిఖరము వంటి ఆకారము, తీక్ష్ణమైన ముట్టె కల శోభాయుక్తుడైన ఆ జటాయువు, చెట్టుమీదనే ఉండి మంగళకరమైన మాట పలికెను. 2

మూ. దశగ్రీవ స్థితో ధర్మే పురాణే సత్యసంశ్రయః,
జటాయుర్నామ నామ్నాహం గృధ్రరాజో మహాబలః. 3

ప్ర. అ. దశగ్రీవ = రావణా! అహమ్ = నేను, పురాణే ధర్మే = ప్రాచీన మైన ధర్మమునందు, స్థితః = ఉన్న, సత్యసంశ్రయః = సత్యమును ఆశ్రయించిన, మహాబలః = గొప్పబలము గల, గృధ్రరాజః = గృధ్రరాజును. నామ్నా = పేరుచేత, జటాయుర్నామ = జటాయు వని ప్రసిద్ధుడను.

తా. రావణా! నేను సనాతనధర్మమును పాటించుచు, సత్యవ్రతమును అవలంబించిన మహాబలశాలినైన గృధ్రరాజును; నా పేరు జటాయువు. 3

మూ. రాజా సర్వస్య లోకస్య మహేన్ద్రవరుణోపమః,
లోకానాం చ హితే యుక్తో రామో దశరథాత్మజః. 4

ప్ర. అ. దశరథాత్మజః = దశరథుని కుమారుడైన, రామః = రాముడు, సర్వస్య = సమస్తమైన, లోకస్య = లోకమునకు, రాజా = ప్రభువు, మహేన్ద్రవరుణోపమః = మహేంద్రునితోను వరుణునితోను సమానుడు, లోకానామ్ = లోకములయొక్క, హితే = హితమునందు, యుక్తః = ప్రయత్నము చేయువాడు.

తా. దశరథుని కుమారుడైన రాముడు సకలలోకములకు రాజు. మహేంద్రవరుణులవంటివాడు, లోకముల హితముకొరకై ప్రయత్నించువాడు. 4

మూ. తస్యైషా లోకనాథస్య ధర్మపత్నీ యశస్వినీ,
సీతా నామ వరారోహా యాం త్వం హర్తుమిహేచ్ఛసి. 5

ప్ర. అ. యామ్ = ఎవతెను, త్వమ్ = నీవు, ఇహ = ఇప్పుడు, హర్తుమ్ = హరించుటకై, ఇచ్ఛసి = కోరుచున్నావో, ఏషా = ఈమె, సీతా నామ = సీత అను పేరు గల, వరారోహా = సుందరమైన కటిప్రదేశము గల, యశస్వినీ = కీర్తి మంతురాలు లోకనాథస్య = లోకములకు ప్రభువైన, తస్య = ఆ రాముని యొక్క, ధర్మపత్నీ = ధర్మపత్ని.

తా. నీ విప్పుడు అపహరించుచున్న స్త్రీ సీత. కీర్తిమంతురాలైన ఈమె, లోకములకు ప్రభువైన ఆ రాముని ధర్మపత్ని. 5

మూ. కథం రాజా స్థితో ధర్మే పరదారాన్ పరామృశేత్,
రక్షణీయా విశేషేణ రాజదారా మహాబల. 6

ప్ర. అ. ధర్మే = ధర్మమునందు, స్థితః = ఉన్న, రాజా = రాజు, పరదారాన్ = పరభార్యను, కథమ్ = ఎట్లు, పరామృశేత్ = స్పృశించును ? మహాబల = గొప్ప బలము గలవాడా ! రాజదారాః = రాజభార్య. విశేషేణ = విశేషముచేత, రక్షణీయాః = రక్షించదగినది.

తా. ధర్మమార్గమునందు ఉన్న రాజు పరభార్యలను స్పృశించునా ? ఓ ! మహాబలుడా ! రాజభార్యలను విశేషించి బాగుగా రక్షించవలెను. 6

మూ. నివర్తయ మతిం నీచాం పరదారాభిమర్శనాత్
న తత్సమాచరేద్ధీరో యత్పరోఽస్య విగర్హయేత్, 7
యథాత్మనస్తథాన్యేషాం దారా రక్ష్యా విమర్శనాత్.

ప్ర. అ. నీచామ్ = నీచమైన, మతిమ్ = బుద్ధిని, పరదారాభిమర్శనాత్ = పరభార్యను స్పృశించుటనుండి, నివర్తయ = మరల్చుము. పరః = ఇతరుడు, అస్య = వీనియొక్క, యత్ = ఏ పనిని, విగర్హయేత్ = నిందించునో, తత్ = దానిని, ధీరః = ధీరుడు, న సమాచరేత్ = చేయగూడదు. ఆత్మనః = తనయొక్క భార్య, యథా = ఎట్లో, తథా = అట్లే, అన్యేషామ్ = ఇతరులయొక్క, దారాః = భార్య, విమర్శనాత్ = పరపురుషస్పర్శనుండి, రక్ష్యాః = రక్షించదగినది.

తా. పరభార్యాస్పర్శనుండి నీ నీచబుద్ధిని మరల్చుము. బుద్ధిమంతుడు ఇతరులు నిందించే ఏ పనీ చేయకూడదు. తన భార్యను పరపురుషస్పర్శనుండి రక్షించుకొనుచున్నట్లే ఇతరుల భార్యలను కూడ రక్షించవలెను. 7

మూ. అర్థం వా యది వా కామం శిష్టాః శాస్త్రేష్వనాగతమ్. 8
వ్యవస్యన్త్యను రాజానం ధర్మం పౌలస్త్యనన్దన.

ప్ర. అ. పౌలస్త్యనన్దన = రావణా ! శిష్టాః = శిష్టులు, శాస్త్రేషు = శాస్త్రములయందు, అనాగతమ్ = తెలియబడని, అర్థం వా = అర్థమునైనా, యది వా = లేక, కామమ్ = కామమునైనా, ధర్మమ్ = ధర్మమునైనా, రాజానమ్ అను = రాజును అనుసరించి, వ్యవస్యన్తి = నిశ్చయించుదురు.

తా. రావణా అర్థమును గూర్చి కాని, కామమును గూర్చి కాని, ధర్మమును గూర్చి గాని సందేహము కలిగి, ఆ సందేహము శాస్త్రముల ద్వారా నిర

యించుటకు శక్యము కానప్పుడు, శిష్టులు ఆ విషయమునందు రాజునే అనుసరించుచుందురు. 8

మూ. రాజా ధర్మస్య కామస్య ద్రవ్యాణాం చోత్తమో నిధిః, 9
ధర్మః శుభం వా పాపం వా రాజమూలం ప్రవర్తతే.

ప్ర. అ. ధర్మస్య = ధర్మమునకు, కామస్య = కామమునకు, ద్రవ్యాణాం చ = ద్రవ్యములకు, రాజా = రాజు, ఉత్తమః = ఉత్తమమైన, నిధిః = నిధి. ధర్మః = ధర్మమైనా, శుభం వా = శుభమైనా, పాపం వా = పాపమైనా, రాజమూలమ్ = రాజమూలముగానే, ప్రవర్తతే = ప్రవర్తించుచున్నది.

తా. ధర్మానికి, కామానికీ, ద్రవ్యాలకీ కూడ రాజే ఉత్తమమైన నిధి. ధర్మమైనా, పుణ్యమైనా, పాపమైనా, వీటికి రాజే మూలము. 9

మూ. పాపస్వభావశ్చపలః కథం త్వం రక్షసాం వర, 10
ఐశ్వర్యమభిసంప్రాప్తో విమానమివ దుష్కృతిః.

ప్ర. అ. రక్షసామ్ = రాక్షసులయొక్క, వర = నాయకుడా ! పాపస్వభావః = పాపస్వభావము కలవాడవు, చపలః = చపలుడవు అయిన, త్వమ్ = నీవు, దుష్కృతిః = పాపాత్ముడు, విమానమివ = (స్వర్గలోకమునకు వెళ్లే) విమానమును వలె, ఐశ్వర్యమ్ = ప్రభుత్వమును, కథమ్ = ఎట్లు, అభిసంప్రాప్తః = పొందినావు.

తా. రాక్షసుల నాయకుడా ! పాపస్వభావము కలవాడవు, చపలుడవు అయిన నీకు, పాపాత్మునకు స్వర్గారోహణము చేయుటకు ఉపయోగించే విమానము లభించి నట్లు ఐశ్వర్యము (రాజ్యాధికారము) ఎట్లు లభించినది. 10

మూ. కామం స్వభావో యో యస్య న శక్యః పరిమార్జితుమ్, 11
న హి దుష్టాత్మనామార్యమావసత్యాలయే చిరమ్.

ప్ర. అ. యః = ఏది, యస్య = ఎవనికి, స్వభావః = స్వభావమో అది, పరిమార్జితుమ్ = తుడిచివేయుటకు, కామమ్ = నిజముగా, న శక్యః = శక్యమైనది కాదు. దుష్టాత్మనామ్ = దుష్టబుద్ధులయొక్క, ఆలయే = గృహమునందు, చిరమ్ =

చిరకాలము, అర్యమ్ = మంచితనము (పుణ్యము), న వసతి హి = నివసించదు కదా.

తా. ఎవరిది ఎట్టి స్వభావమో దానిని మార్చుట చాల కష్టము. దుష్టాత్ముల గృహములలో పుణ్యము చాల కాలము ఉండదు కదా? పాపనివారకమైన పుణ్యము చేయజాలకపోవుట చేత వాళ్లు స్వాభావికమైన పాపప్రవృత్తినే చూపుచుందురు అని భావము. 11

మూ. విషయే వా పురే వా తే యదా రామో మహాబలః, 12
నాపరాధ్యతి ధర్మాత్మా కథం తస్యాపరాధ్యసి.

ప్ర. అ. మహాబలః = గొప్ప బలము గల, ధర్మాత్మా = ధర్మాత్ముడైన, రామః = రాముడు, యదా = ఎప్పుడు, తే = నీయొక్క, విషయే వా = దేశమునందు గాని, పురే వా = పట్టణమందు గాని, నాపరాధ్యతి = అపరాధము చేయుట లేదో, తస్య = అతని విషయమునందు, కథమ్ = ఎట్లు, అపరాధ్యసి = అపరాధము చేయుచున్నావు?

తా. మహాబలవంతుడు, ధర్మాత్ముడు అయిన రాముడు నీ దేశమునందు గాని, పురమునందు గాని ఏ అపరాధము చేయలేదు కదా; అట్టి రాముని విషయములో నీ వెందుకు అపరాధము చేయుచున్నావు? 12

మూ. యది శూర్పణఖాహేతోర్జనస్థానగతః ఖరః, 13
అతివృత్తో హతః పూర్వం రామేణాక్లిష్టకర్మణా,
అత్ర బ్రూహి యథాతత్త్వం కో రామస్య వ్యతిక్రమః 14
యస్య త్వం లోకనాథస్య భార్యాం హృత్వా గమిష్యసి.

ప్ర. అ. శూర్పణఖాహేతోః = శూర్పణఖకొరకై, జనస్థానగతః = జనస్థానములో ఉన్న, ఖరః = ఖరుడు, అతివృత్తః = మర్యాదను అతిక్రమించినవాడై, అక్లిష్టకర్మణా = శ్రమ లేకుండా పనులు చేయు, రామేణ = రామునిచేత, పూర్వమ్ = పూర్వము, హతః యది = చంపబడినట్లయితే, అత్ర = ఈ విషయమునందు, లోకనాథస్య = లోకముల ప్రభువైన, యస్య = ఎవనియొక్క, భార్యామ్ =

భార్యను, త్వమ్ = నీవు, హరిష్యసి = హరించగలవో (హరించుచున్నావో), అట్టి, రామస్య = రాముని యొక్క, వ్యతిక్రమః = పొరబాటు, కః = ఏమి? యథాతత్త్వమ్ = యథార్థముగా, బ్రూహి = చెప్పుము.

తా. శ్రమపడకుండా పనులు నిర్వహించు రాముడు, శూర్పణఖను పనికి వేసికొని వచ్చిన జనస్థాననివాసి యైన ఖరుణ్ణి ఇంతకు ముందు చంపినా డంటే దీనిలో ఆ రాముని దోష మేమున్న దని నీవు ఆతని భార్యను హరించుచున్నావు? యథార్థముగా చెప్పుము. 13, 14

మూ. క్షిప్రం విసృజ వైదేహీం మా త్వా ఘోరేణ చక్షుషా, 15
దహేద్దహనభూతేన వృత్రమిన్ద్రాశనిర్యథా.

ప్ర. అ. క్షిప్రమ్ = శీఘ్రముగా, వైదేహీమ్ = సీతను, విసృజ = విడిచి పెట్టుము. త్వా = నిన్ను, ఇన్ద్రాశనిః = ఇంద్రుని వజ్రాయుధము, వృత్రం యథా = వృత్రాసురుణ్ణి వలె, దహనభూతేన = అగ్నిగా అయిన, ఘోరేణ = ఘోర మైన, చక్షుషా = నేత్రముతో, మా దహేత్ = కాల్చకుండుగాక.

తా. వెంటనే సీతను విడిచి పెట్టుము. అట్లు కాకపోయినచో, ఇంద్రుని వజ్రాయుధము వృత్రాసురుణ్ణి కాల్చివేసి నట్లు ఈమె అగ్నిగా మారిన తీక్ష్ణమైన నేత్ర ముతో (దృష్టితో) నిన్ను కాల్చివేయగలదు. 15

మూ. సర్పమాశీవిషం బద్ధ్వా వస్త్రాన్తే నావబుధ్యసే, 16
గ్రీవాయాం ప్రతిసక్తం చ కాలపాశం న పశ్యసి.

ప్ర. అ. ఆశీవిషమ్ = కోరలలో విషము గల, సర్పమ్ = సర్పమును, వస్త్రాన్తే = బట్టకొంగునందు, బద్ధ్వా = కట్టి, నావబుధ్యసే = తెలిసికొనలేకున్నావు. గ్రీవాయామ్ = కంఠమునందు, ప్రతిసక్తమ్ = తగల్చబడిన, కాలపాశమ్ = కాల పాశమును, న పశ్యసి = చూచుటలేదు.

తా. కోరలలో విషము నిండి ఉన్న సర్పాన్ని బట్ట చెంగున కట్టుకొని తెలుసుకొనజాలకున్నావు. కంఠానికి తగిలి ఉన్న యమపాశాన్ని చూచుకొనుట లేదు. 16

మూ. స భారః సౌమ్య భర్తవ్యో యో నరం నావసాదయేత్, 17
తదన్నమపి భోక్తవ్యం జీర్యతే యదనామయమ్.

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా! యః = ఏది, నరమ్ = మనుష్యుని, నావసాదయేత్ = క్రుంగదీయదో, సః = ఆ, భారః = భారము, భర్తవ్యః = మోయదగినది. యత్ = ఏది, అనామయమ్ = రోగము లేకుండా, జీర్యతే = జీర్ణించునో, తత్ = అట్టి, అన్నమపి = అన్నము, భోక్తవ్యమ్ = తినదగినది.

తా. సౌమ్యుడా! ఏ బరువు మనిషిని క్రుంగదీయదో అట్టి భారమునే మోయవలెను. ఏది రోగము కలిగించకుండా జీర్ణించునో అట్టి అన్నమే తినవలెను. 17

మూ. యత్కృత్వా న భవేద్ధర్మో న కీర్తిర్న యశో భువి, 18
శరీరస్య భవేత్ఖేదః కస్తత్కర్మ సమాచరేత్.

ప్ర. అ. యత్ = ఏ పనిని, కృత్వా = చేసి(చేయగా), ధర్మః = ధర్మము, న భవేత్ = కలుగదో. భువి = భూమియందు, కీర్తిః = కీర్తి, న = కలుగదో, యశః = యశస్సు, న = కలగదో, శరీరస్య = శరీరమునకు, ఖేదః = దుఃఖము, భవేత్ = కలుగునో, తత్ = అట్టి, కర్మ = కర్మను, కః = ఎవడు, సమాచరేత్ = చేయును. (పుణ్యకర్మాదులు చేయుటవలన కలిగిన ప్రసిద్ధి కీర్తి. ఐశ్వర్యాదుల వలన కలిగిన ప్రసిద్ధి యశస్సు).

తా. ఏ పనులు చేయుటవలన ధర్మము కాని, భూలోకములో కీర్తి గాని, యశస్సు గాని కలగదో, దేనివలన శరీరమునకు ఖేదము కలుగునో అట్టి పని ఎవడు చేయును? 18

మూ. షష్టిర్వర్షసహస్రాణి మమ జాతస్య రావణ, 19
పితృపైతామహం రాజ్యం యథావదనుతిష్ఠతః.

ప్ర. అ. రావణ = రావణా! పితృపైతామహమ్ = తండ్రులకు, తాతలకు సంబంధించిన, రాజ్యమ్ = రాజ్యమును, యథావత్ = యథావిధిగా, అనుతిష్ఠతః = చేయుచున్న, జాతస్య = పుట్టిన, మమ = నాకు, షష్టిః = అరవై, వర్షసహస్రాణి = సంవత్సరములయొక్క సహస్రములు,

తా. రావణా! నేను పుట్టి అరువదివేల సంవత్సరము లైనది. నేను నా తండ్రినుండి, తాతలనుండి సంక్రమించిన రాజ్యమును యథావిధిగా పాలించుచున్నాను. 19

మూ. వృద్ధోఽహం త్వం యువా ధన్వీ సశరః కవచీ రథీ, 20
తథాప్యాదాయ వైదేహీం కుశలీ న గమిష్యసి.

ప్ర. అ. అహమ్ = నేను, వృద్ధః = ముసలివాడను. త్వమ్=నీవు, యువా = యువకుడవు, ధన్వీ = ధనుర్ధరుడవు, సశరః = బాణములతో కూడినవాడవు. కవచీ=కవచము కలవాడవు. రథీ=రథము కలవాడవు. తథాపి = అట్లయినను, వైదేహీమ్ = సీతను, ఆదాయ = గ్రహించి, కుశలీ = క్షేమవంతుడవై, న గమిష్యసి = వెళ్లవు.

తా. నేను ముసలివాడను. నీవు యువకుడవు. నీకు ధనుర్బాణములు, కవచము, రథము ఉన్నవి. అయినను సీతను తీసికొని నిన్ను క్షేమముగా వెళ్ళనీయను. 20

మూ. న శక్తస్త్వం బలాద్ధర్తుం వైదేహీం మమ పశ్యతః, 21
హేతుభిర్న్యాయసంయుక్తైర్ధ్రువాం వేదశ్రుతీమివ.

ప్ర. అ. మమ = నేను, పశ్యతః = చూచుచుండగా, త్వమ్ = నీవు, వైదేహీమ్ = సీతను, న్యాయసంయుక్తైః=న్యాయములతో కూడిన, హేతుభిః = హేతువులచేత, ధ్రువామ్ = స్థిరమైన, వేదశ్రుతీమివ = వేదమును వలె, బలాత్ = బలాత్కారముగా, హర్తుమ్ = హరించుటకు, న శక్తః = సమర్థుడవు కావు.

తా. న్యాయములతో కూడిన యుక్తులు చూపి స్థిరమైన ప్రామాణ్యము గల వేదమును (తార్కికులు మొదలైనవారు) ఎట్లు హరింపజాలరో అట్లే నేను చూచుచుండగా నీవు సీతను బలాత్కారముగా అపహరించజాలవు. లేదా వేదము పరమ ప్రమాణము. న్యాయసంమతము లైన హేతువులచేత కూడ దాని ప్రామాణ్యము స్థిరీకరింపబడినది. అట్టి వేదమును ఎట్లు నిరాకరించజాలరో అట్లే నీవు నేను చూచుచుండగా సీతను హరించజాలవు అని భావము. 21

మూ. యుద్ధ్యస్వ యది శూరోఽసి ముహూర్తం తిష్ఠ రావణ, 22
శయిష్యసే హతో భూమౌ యథాపూర్వం ఖరస్తథా.

ప్ర. అ. రావణ = రావణుడా ! శూరః అసి యది = శూరుడవు అయినట్లయితే, యుద్ధ్యస్వ = యుద్ధము చేయుము. ముహూర్తమ్ = ముహూర్తకాలమును, తిష్ఠ = నిలువుము. పూర్వమ్ = పూర్వము, ఖరః = ఖరుడు, యథా = ఎట్లో, తథా = అట్లే, హతః = చంపబడినవాడవై, భూమౌ = భూమియందు, శయిష్యసే = శయనించగలవు.

తా. రావణుడా ! నీవు శూరుడవైనచో ముహూర్తకాలముపాటు ఆగి నాతో యుద్ధము చేయుము. పూర్వము ఖరుడు హతుడైనట్లు హతుడవై, నేలమీద శయనించెదవు. 22

మూ. అసకృత్సంయుగే యేన నిహతా దైత్యదానవాః, 23
నచిరాచ్చీరవాసాస్త్వాం రామో యుధి వధిష్యతి.

ప్ర. అ. యేన = ఏ నీచేత, అసకృత్ = అనేకపర్యాయములు, సంయుగే = యుద్ధమునందు, దైత్యదానవాః = దైత్యులు దానవులు, నిహతాః = చంపబడినారో, త్వామ్ = అట్టి నిన్ను, నచిరాత్ = కొద్ది కాలములో, చీరవాసాః = నారచీరలను ధరించిన, రామః = రాముడు, యుధి = యుద్ధమునందు, వధిష్యతి = చంపగలడు.

తా. నీవు అనేకపర్యాయములు యుద్ధములో దైత్యులను సంహరించి ఉన్నావు. కాని, అట్టి నిన్నే, నారచీరలను ధరించి తాపసవృత్తిలో ఉన్న రాముడు కొద్ది కాలములోనే చంపగలడు. 23

మూ. కిం ను శక్యం మయా కర్తుం గతౌ దూరం నృపాత్మజౌ,
క్షిప్రం త్వం నశ్యసే నీచ తయోర్భీతో న సంశయః.

ప్ర. అ. మయా = నాచేత, కిం ను = ఏమి, కర్తుమ్ = చేయుటకు, శక్యమ్ = శక్యమైనది? నృపాత్మజౌ = రాజకుమారులు, దూరమ్ = దూరముగా, గతౌ = వెళ్ళినారు. నీచ = నీచుడా! తయోః = వారికి, భీతః = భయపడిన, త్వమ్ = నీవు, క్షిప్రమ్ = శీఘ్రముగా, నశ్యసే = నశించెదవు. సంశయః = సంశయము, న = లేదు.

తా. నేనేమి చేయగలను? ఆ రాజకుమారు లిద్దరూ దూరమునకు వెళ్ళిపోయినారు. వారిని వెంటనే తీసికొని రాజాలను. కాని, ఓ! నీచుడా! వారికి భయపడి పారిపోవుచున్న నీవు తప్పక నశించెదవు. సందేహము లేదు. 24

మూ. న హి మే జీవమానస్య నయిష్యసి శుభామిమామ్, 25
సీతాం కమలపత్రాక్షీం రామస్య మహిషీం ప్రియామ్.

ప్ర. అ. మే = నేను, జీవమానస్య=జీవించి ఉండగా, శుభామ్=మంగళప్రదురాలు, కమలపత్రాక్షీమ్=కమలపత్రముల వంటి నేత్రములు కలదీ, రామస్య = రామునియొక్క, ప్రియామ్ = ప్రియురాలూ, మహిషీమ్ = భార్యా అయిన, ఇమామ్ = ఈ, సీతామ్ = సీతను, న నయిష్యసి = తీసికొని వెళ్లవు.

తా. మంగళప్రదురాలు, కమలపత్రముల వంటి నేత్రములు కలది, రాముని ప్రియురాలైన పట్టమహిషి అయిన ఈ సీతను నేను జీవించి ఉండగా తీసికొని వెళ్లజాలవు. 25

మూ. అవశ్యం తు మయా కార్యం ప్రియం తస్య మహాత్మనః,
జీవితేనాపి రామస్య తథా దశరథస్య చ.

ప్ర. అ. మహాత్మనః = మహాత్ముడైన, తస్య=ఆ, రామస్య=రామునకు, తథా = మరియు, దశరథస్య చ = దశరథునకు, మయా = నాచేత, అవశ్యమ్= తప్పక, జీవితేనాపి = ప్రాణముచేత నైనా, ప్రియమ్ = ప్రియము, కార్యమ్ = చేయదగినది.

తా. మహాత్ముడైన ఆ రామునకూ, దశరథునకూ ప్రియమైన కార్యము నేను తప్పక నా ప్రాణాలు సమర్పించియైనా చేయవలెను. 26

మూ. తిష్ఠ తిష్ఠ దశగ్రీవ ముహూర్తం పశ్య రావణ. 27
యుద్ధాతిథ్యం ప్రదాస్యామి యథాప్రాణం నిశాచర,
వృన్తాదివ ఫలం త్వాం తు పాతయేయం రథోత్తమాత్. 28

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
పఞ్చాశః సర్గః.

ప్ర. అ. దశగ్రీవ = దశకంఠుడా! ముహూర్తమ్ = క్షణకాలముపాటు, తిష్ఠ తిష్ఠ = నిలువుము నిలువుము. రావణ = రావణా! పశ్య = చూడుము. నిశాచర = ఓ! రాక్షసుడా! యథాప్రాణమ్ = నా శక్తికి తగు నట్లుగా, యుద్ధాతిథ్యమ్ = యుద్ధమను ఆతిథ్యమును, ప్రదాస్యామి = ఇచ్చెదను. వృన్తాత్ = తొడిమినుండి, ఫలమివ = ఫలమును వలె, త్వామ్ = నిన్ను, రథోత్తమాత్ = శ్రేష్ఠమైన రథము నుండి, పాతయేయమ్ = క్రింద పడవేయుదును.

తా. దశకంఠుడా! ఆగుము; క్షణకాలము ఆగుము. రావణా! చూడుము. రాక్షసుడా! నీకు నా శక్తికొలది యుద్ధరూపమైన ఆతిథ్యము ఇచ్చెదను. నిన్ను నీ రథమునుంచి, తొడిమినుంచి పండు పడగొట్టి నట్లు పడగొట్టెదను. 27,28

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో ఏబదవ సర్గ సమాప్తము.

అథ ఏకపఞ్చాశః సర్గః

[*రావణునితో జటాయువు ఘోరముగా యుద్ధము చేయుట. రావణుడు అతనిని వధించుట*]

మూ. ఇత్యుక్తస్య యథాన్యాయం రావణస్య జటాయుషా,
క్రుద్ధస్యాగ్నినిభాః సర్వా రేజుర్వింశతిదృష్టయః. 1

ప్ర. అ. జటాయుషా = జటాయువుచేత, యథాన్యాయమ్ = న్యాయానుసారముగా, ఇతి = ఇట్లు, ఉక్తస్య = పలకబడిన, క్రుద్ధస్య = కోపగించిన, రావణస్య = రావణునియొక్క, సర్వాః = సమస్తమైన, వింశతిదృష్టయః = ఇరువది కళ్లు, అగ్నినిభాః = అగ్నితో సమానములై, రేజుః = ప్రకాశించినవి.

తా. జటాయువు పలికిన న్యాయసంమతములైన మాటలు వినగానే రావణునకు చాల కోపము వచ్చెను. ఆతని ఇరవై కళ్ళూ కూడ నిప్పు వలె ఎఱ్ఱబారెను. 1

మూ. సంరక్తనయనః కోపాత్ తప్తకాఞ్చనకుణ్డలః,
రాక్షసేన్ద్రోఽభిదుద్రావ పతగేన్ద్రమమర్షణః. 2

ప్ర. అ. తప్తకాఞ్చనకుణ్డలః=పరిశుద్ధమైన బంగారు కుండలములు గల, అమర్షణః = కోపస్వభావవంతుడైన, రాక్షసేన్ద్రః=రావణుడు, కోపాత్=కోపమువలన, సంరక్తనయనః = ఎఱ్ఱనైన నేత్రములు కలవాడై, పతగేన్ద్రమ్ = ఆ పక్షిరాజైన జటాయువును గూర్చి, అభిదుద్రావ = పరుగెత్తెను.

తా. పరిశుద్ధమైన బంగారు కుండలములు ధరించిన, కోపస్వభావుడైన ఆ రావణుడు కోపముచేత ఎఱ్ఱనైన నేత్రములతో ఆ జటాయువుమీదికి వేగముగా వెళ్లెను. 2

మూ. స సంప్రహారస్తుముల స్తయో స్తస్మిన్ మహావనే,
బభూవ వాతోద్ధతయోర్మేఘయోర్గగనే యథా. 3

ప్ర. అ. తస్మిన్ = ఆ, మహావనే = మహారణ్యమునందు, తయోః = ఆ ఇద్దరిమధ్య, తుములః = వ్యాకులమైన, సః సంప్రహారః = ఆ యుద్ధము, గగనే = ఆకాశమునందు, వాతోద్ధతయోః = వాయువుచేత ఎగరగొట్టబడిన, మేఘయోర్యథా = రెండు మేఘముల మధ్యయందు వలె, బభూవ = ఆయెను.

తా. ఆ మహాటవిలో ఆ ఇద్దరి మధ్య జరిగిన తీవ్రమైన యుద్ధము, ఆకాశమునందు గాలికి ఎగురగొట్టబడిన రెండు మేఘములు ఢీకొనుట వలె ఉండెను.

మూ. తద్బభూవాద్భుతం యుద్ధం గృధ్రరాక్షసయో స్తదా,
సపక్షయోర్మాల్యవతోర్మహాపర్వతయోర్యథా. 4

ప్ర. అ. తదా = అప్పుడు, తయోః = ఆ, గృధ్రరాక్షసయోః = జటాయు రావణులయొక్క, తత్ = ఆ, అద్భుతమ్ = ఆశ్చర్యకరమైన, యుద్ధమ్ = యుద్ధము, సపక్షయోః=రెక్కలతో కూడిన, మాల్యవతోః=మాల్యవంతము లను, మహాపర్వతయోః యథా = మహాపర్వతముల మధ్యయందు వలె, బభూవ = ఉండెను.

తా. ఆ జటాయురావణుల మధ్య జరుగుచున్న ఆశ్చర్యకరమైన ఆ యుద్ధము, రెక్కలున్న మాల్యవంతము లను రెండు మహాపర్వతముల మధ్య జరుగుచున్న యుద్ధము వలె ఉండెను.

వి. ఒక మాల్యవంతము మేరుసమీపాన ఉన్నది. ఒకటి దండకారణ్యంలో ఉన్నది. ఆ రెండింటికీ యుద్ధము జరుగుచున్నట్లున్న దని ఒక వ్యాఖ్యాత, దండకలో ఉన్న దానికీ, కిష్కింధాప్రాంతంలో ఉన్నదానికి జరుగుచున్న యుద్ధము వలె ఉన్న దని మరొక వ్యాఖ్యాత వ్రాసినారు. 4

మూ. తతో నాళీకనారాచై స్తీక్ష్ణాగ్రైశ్చ వికర్ణిభిః,
అభ్యవర్షన్మహాఘోరైర్గృధ్రరాజం మహాబలః. 5

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మహాబలః = గొప్ప బలము గల రావణుడు, తీక్ష్ణాగ్రైః = తీక్ష్ణములైన అగ్రభాగములు గల, మహాఘోరైః = చాల భయంకర

ములైన, నాళీకనారాచైః = నాళీకబాణములచేతను, నారాచబాణములచేతను, వికర్ణిభిః = వికర్ణిబాణములచేతను (వంకర ములుకుల బాణములు), గృధ్రరాజమ్ = జటాయువును, అభ్యవర్షత్ = వర్షించెను.

తా. పిమ్మట మహాబలశాలియైన రావణుడు తీక్ష్ణములైన అగ్రభాగములు గల భయంకరములైన నాళీకబాణములను, నారాచబాణములను, వికర్ణిబాణములను జటాయువుపై వర్షించెను. 5

మూ. స తాని శరజాలాని గృధ్రః పత్త్రిరథేశ్వరః,
జటాయుః ప్రతిజగ్రాహ రావణాస్త్రాణి సంయుగే. 6

ప్ర. అ. పత్త్రరథేశ్వరః = పక్షిరాజైన, సః = ఆ, గృధ్రః = గ్రద్దయైన, జటాయుః = జటాయువు, సంయుగే = యుద్ధమునందు, తాని = ఆ, శరజాలాని = బాణముల సముదాయములను, రావణాస్త్రాణి = రావణుని అస్త్రములను, ప్రతిజగ్రాహ = స్వీకరించెను.

తా. పక్షిరాజైన ఆ జటాయువు ఆ బాణసముదాయములను, రావణుని అస్త్రములను ధైర్యముగా ఎదుర్కొనెను. 6

మూ. తస్య తీక్ష్ణనఖాభ్యాం తు చరణాభ్యాం మహాబలః,
చకార బహుధా గాత్రే వ్రణాన్ పతగసత్తమః. 7

ప్ర. అ. మహాబలః = గొప్ప బలము గల, పతగసత్తమః = పక్షులలో శ్రేష్ఠమైన జటాయువు, తీక్ష్ణనఖాభ్యామ్ = తీక్ష్ణములైన గోళ్లు గల, చరణాభ్యామ్ = పాదములచేత, తస్య = వానియొక్క, గాత్రేషు = అవయవములయందు, బహుధా = అనేకవిధములుగ, వ్రణాన్ = వ్రణములను, చకార = చేసెను.

తా. గొప్ప బలము గల ఆ జటాయువు వాడియైన గోళ్లు ఉన్న పాదాలతో అతని శరీరముమీద అనేకవిధముల గాయములు కలుగునట్లు చీరెను. 7

మూ. అథ క్రోధాద్దశగ్రీవో జగ్రాహ దశ మార్గణాన్,
మృత్యుదణ్డనిభాన్ ఘోరాన్ శత్రుమర్దనకాఙ్క్షయా. 8

ప్ర. అ. అథ = అటుపిమ్మట, దశగ్రీవః = రావణుడు, క్రోధాత్ = కోపము

వలన, శత్రుమర్దనకాఙ్క్షయా = శత్రువును చంపుటయందు కోరికచేత, మృత్యుదణ్డనిభాన్ = మృత్యుదండముతో సమానములైన, ఘోరాన్ = భయంకరములైన, దశ మార్గణాన్ = పది బాణములను, జగ్రాహ = గ్రహించెను.

తా. పిమ్మట రావణుడు కోపించి, శత్రువును చంపవలె నని నిశ్చయించుకొని, మృత్యుదండము వలె భయంకరములైన పది బాణములు తీసెను. 8

మూ. స తైర్బాణైర్మహావీర్యః పూర్ణముక్తైరజిహ్మగైః,
బిభేద నిశితైస్తీక్ష్ణైర్గృధ్రం ఘోరైః శిలీముఖైః. 9

ప్ర. అ. మహావీర్యః = గొప్ప పరాక్రమము గల, సః = ఆ రావణుడు, పూర్ణముక్తైః = పూర్తిగా లాగి విడువబడిన, అజిహ్మగైః = తిన్నగా వెళ్లు, నిశితైః = వాడియైన, తీక్ష్ణైః = బాధను కలిగించు, ఘోరైః = భయంకరములైన, శిలీముఖైః = ఉక్కు కొనలు గల, తైః = ఆ, బాణైః = బాణములచేత, గృధ్రమ్ = జటాయువును, బిభేద = భేదించెను.

తా. గొప్ప పరాక్రమము గల ఆ రావణుడు, వాడిగా ఉన్నవి, బాధ కలిగించేవి, భయంకరములు, ఉక్కు కొనలు గలవి, తిన్నగా ఎగురునవి అయిన, ధనస్సును పూర్తిగా లాగి విడువబడిన ఆ బాణములతో జటాయువు శరీరము బ్రద్దలగు నట్లు కొట్టెను. 9

మూ. స రాక్షసరథే పశ్యన్ జానకీం బాష్పలోచనామ్,
అచిన్తయిత్వా తాన్ బాణాన్ రాక్షసం సమభిద్రవత్. 10

ప్ర. అ. సః = జటాయువు, రాక్షసరథే = రావణుని రథమునందు, బాష్పలోచనామ్ = కన్నీరు నేత్రములందు గల, జానకీమ్ = సీతను, పశ్యన్ = చూచుచున్నవాడై, తాన్ = ఆ, బాణాన్ = బాణములను, అచిన్తయిత్వా = లెక్కచేయక, రాక్షసమ్ = రాక్షసుణ్ణి గూర్చి, సమభిద్రవత్ = వేగముగా వెళ్లెను.

తా. కన్నీళ్లు కార్చుచు రావణుని రథమునందు కూర్చున్న సీతను చూచుచు, ఆ జటాయువు ఆ బాణాలను లెక్కచేయక వేగముగ రావణునిమీదికి వెళెను. 10

మూ. తతోఽస్య సశరం చాపం ముక్తామణివిభూషణమ్,
చరణాభ్యాం మహాతేజా బభఞ్జ పతగేశ్వరః. 11

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, పతగేశ్వరః = జటాయువు, అస్య = రావణునియొక్క, ముక్తామణివిభూషణమ్ = ముత్యములు మణులు అలంకారముగా గల, సశరమ్ = శరముతో కూడిన, చాపమ్ = ధనస్సును. చరణాభ్యామ్ = పాదములచేత, బభఞ్జ = విరచెను.

తా. పిమ్మట గొప్ప తేజస్సు గల ఆ జటాయువు, ముత్యములచేత, మణులచేత అలంకరించబడిన ఆ రావణుని ధనస్సును, బాణమును, పాదములచేత విరిచివేసెను. 11

మూ. తతోఽన్యద్ధనురాదాయ రావణః క్రోధమూర్ఛితః,
వవర్ష శరవర్షాణి శతశోఽథ సహస్రశః. 12

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రావణః = రావణుడు, క్రోధమూర్ఛితః = క్రోధముతో వ్యాప్తుడై, అన్యత్ = మరియొక, ధనుః = ధనస్సును, ఆదాయ = గ్రహించి, శతశః = వందలకొలది, అథ = మరియు, సహస్రశః = వేలకొలది, శరవర్షాణి = బాణముల వర్షములను, వవర్ష = వర్షించెను.

తా. అప్పుడు రావణుడు క్రోధావిష్టుడై మరియొక ధనస్సు గ్రహించి వందలకొలది, వేలకొలది బాణములను వర్షించెను. 12

మూ. శరైరావారిత స్తస్య సంయుగే పతగేశ్వరః,
కులాయముపసంప్రాప్తః పక్షీవ ప్రబభౌ తదా. 13

ప్ర. అ. తదా = అప్పుడు, సంయుగే = యుద్ధమునందు, తస్య = ఆతనియొక్క, శరైః = శరములచేత, ఆవారితః = కప్పబడిన, పతగేశ్వరః = జటాయువు, కులాయమ్ = గూడును, ఉపసంప్రాప్తః = పొందిన, పక్షీవ = పక్షివలె, ప్రబభౌ = ప్రకాశించెను.

ప్ర. అ. అప్పుడు యుద్ధమునందు ఆ రావణుని బాణములచే కప్పబడి జటాయువు గూడులో ఉన్న పక్షి వలె ప్రకాశించెను. 13

మూ. స తాని శరవర్షాణి పక్షాభ్యాంచ విధూయ చ,
చరణాభ్యాం మహాతేజా బభఞ్జాస్య మహద్ధనుః. 14

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, సః = ఆ జటాయువు, తాని = ఆ, శరవర్షాణి = బాణవర్షములను, పక్షాభ్యామ్ = రెక్కలచేత, విధూయ చ = ఎగరగొట్టి, అస్య = ఈతని యొక్క, మహత్ = గొప్పదైన, ధనుః = ధనస్సును, చరణాభ్యామ్ = పాదములచేత, బభఞ్జ = విరచెను.

తా. గొప్ప తేజస్సు గల ఆ జటాయువు, ఆ బాణవర్షములను రెక్కల చేత ఎగురగొట్టి ఆతని గొప్ప ధనస్సును పాదాలచేత విరచెను. 14

మూ. తచ్చాగ్నిసదృశం దీప్తం రావణస్య శరావరమ్,
పక్షాభ్యాం స మహావీర్యో వ్యాధునోత్పతగేశ్వరః. 15

ప్ర. అ. మహావీర్యః = గొప్ప పరాక్రమము గల, సః = ఆ, పతగేశ్వరః = జటాయువు, రావణస్య = రావణునియొక్క, అగ్నిసదృశమ్ = అగ్నితో సమానమైన, దీప్తమ్ = ప్రకాశించుచున్న, తత్ = ఆ, శరావరమ్ = కవచమును, పక్షాభ్యామ్ = రెక్కలచేత, వ్యాధునోత్ = పడగొట్టెను.

తా. గొప్ప పరాక్రమము గల ఆ జటాయువు, రావణుని, అగ్ని వలె ప్రకాశించుచున్న కవచమును రెక్కల చేత ఊడగొట్టి క్రింద పడవేసెను. 15

మూ. కాఞ్చనోరశ్ఛదాన్ దివ్యాన్ పిశాచవదనాన్ ఖరాన్,
తాంశ్చాస్య జవసంపన్నాన్ జఘాన సమరే బలీ. 16

ప్ర. అ. బలీ = బలవంతుడైన ఆ జటాయువు, కాఞ్చనోరశ్ఛదాన్ = బంగారు కవచములు కలవి, దివ్యాన్ = అద్భుతమైనవి, పిశాచవదనాన్ = పిశాచముల వంటి ముఖములు కలవి, జవసంపన్నాన్ = వేగముతో కూడినవీ అయిన, తాన్ = ఆ, ఖరాన్ చ = గాడిదలను కూడ, సమరే = యుద్ధమునందు, జఘాన = చంపెను.

తా. బలశాలియైన ఆ జటాయువు, బంగారు కవచములు ధరించినవి. ఆశ్చర్యకరములు, పిశాచముల ముఖముల వంటి ముఖములు కలవి, మంచి వేగము గలవి అయిన గాడిదలను యుద్ధములో చంపివేసెను. 16

మూ. వరం త్రివేణుసంపన్నం కామగం పావకార్చిషమ్,
మణిహేమవిచిత్రాఙ్గం బభఞ్జ చ మహారథమ్. 17

ప్ర. అ. వరమ్ = శ్రేష్ఠమైనది, త్రివేణుసంపన్నమ్ = నొగతో కూడి నది, కామగమ్ = స్వేచ్ఛగా వెళ్ళేది, పావకార్చిషమ్ = అగ్నివంటి తేజస్సు కలది, మణిహేమవిచిత్రాఙ్గమ్ = మణులచేతను, బంగారముచేతను విచిత్రమైన చక్రములు కలది అయిన, మహారథమ్ = గొప్ప రథమును, బభఞ్జ = విరచెను.

తా. శ్రేష్ఠమైనది, అందమైన నొగ కలది, మణులచేత, బంగారముచేత విచిత్రమైన చక్రములు కలది, రథికుని ఇష్టము ప్రకారము పోవునది అయిన మహారథమును విరుగగొట్టెను. 17

మూ. పూర్ణచన్ద్రప్రతీకాశం ఛత్త్రం చ వ్యజనైః సహ,
పాతయామాస వేగేన గ్రాహిభీ రాక్షసైః సహ. 18

ప్ర. అ. పూర్ణచన్ద్రప్రతీకాశమ్=పూర్ణచంద్రునితో సమానమైన, ఛత్త్రం చ = ఛత్రమును కూడ, వ్యజనైః సహ = వింజామరలతో కూడ, గ్రాహిభిః = ఆ ఛత్రాదులను పట్టుకొని ఉన్న, రాక్షసైః సహ = రాక్షసులతో కూడ, వేగేన= వేగముతో, పాతయామాస = పడదోసెను.

తా. పూర్ణచంద్రుని వంటి శ్వేతచ్ఛత్రమును, వింజామరలను, వాటిని పట్టుకొని ఉన్న రాక్షసులను కూడ వేగముతో క్రింద పడవేసెను. 18

మూ. సారథేశ్చాస్య వేగేన తుణ్డేనైవ మహచ్ఛిరః,
పునర్వ్యపాహరచ్ఛ్రీమాన్ పక్షిరాజో మహాబలః. 19

ప్ర. అ. పునః = ఇంకా, మహాబలః = మహాబలవంతుడైన, శ్రీమాన్= శోభాయుక్తుడైన, పక్షిరాజః = జటాయువు, అస్య = ఈ రావణునియొక్క, సారథేః = సారథియొక్క, మహత్ = గొప్పదైన, శిరః = శిరస్సును, వేగేన= వేగముతో, తుణ్డేనైవ = ముట్టిచేత, వ్యపాహరత్ = అపహరించెను.

తా. గొప్ప బలము కలవాడు, శోభాసంపన్నుడు అయిన జటాయువు గొప్ప వేగముతో, ఆ రావణుని సారథి శిరస్సును ముక్కుతో ఖండించెను. 19

మూ. స భగ్నధన్వా విరథో హతాశ్వో హతసారథిః,
అఙ్కే నాదాయ వైదేహీం పపాత భువి రావణః. 20

ప్ర. అ. భగ్నధన్వా = భగ్నమైన ధనస్సు కలవాడు, విరథః = రథము లేనివాడు, హతాశ్వః = చంపబడిన అశ్వములు కలవాడు, హతసారథిః = చంపబడిన సారథి కలవాడు అయిన, సః రావణః = ఆ రావణుడు, వైదేహీమ్ = సీతను, అఙ్కేన = ఒడిలో, ఆదాయ = గ్రహించి, భువి = నేలమీద, పపాత = పడెను.

తా. ఆ విధముగ జటాయువు ధనస్సును, రథమును విరిచివేసి, అశ్వాలను సారథిని చంపివేయగా రావణుడు సీతను ఒడిలో ఉంచుకొని నేలమీద పడెను. 20

మూ. దృష్ట్వా నిపతితం భూమౌ రావణం భగ్నవాహనమ్,
సాధుసాధ్వితి భూతాని గృధ్రరాజమపూజయన్. 21

ప్ర. అ. భగ్నవాహనమ్ = భగ్నమైన వాహనము కలవాడై, భూమౌ = నేలమీద, నిపతితమ్ = పడిన, రావణమ్ = రావణుని, దృష్ట్వా = చూచి, సాధు సాధు ఇతి = "బాగు బాగు"అని, భూతాని = ప్రాణులు, గృధ్రరాజమ్ = జటాయువును, అపూజయన్ = పూజించినవి.

తా. వాహనము భగ్నమైపోగా నేలమీద పడిపోయిన రావణుణ్ణి చూచి అక్కడ నున్న వారందరు "ఆహా! ఆహా! మంచి పని చేసితివి"అని అనుచు జటాయువును పూజించిరి. 21

మూ. పరిశ్రాన్తం తు తం దృష్ట్వా జరయా పక్షియూథపమ్,
ఉత్పపాత పునర్హృష్టో మైథిలీం గృహ్య రావణః. 22

ప్ర. అ. పక్షియూథపమ్ = పక్షిరాజైన, తమ్ = ఆ జటాయువును, జరయా = ముసలితనముచేత, పరిశ్రాన్తమ్ = అలసిపోయినవానినిగా, దృష్ట్వా = చూచి, రావణః = రావణుడు, హృష్టః = సంతోషించినవాడై, మైథిలీమ్ = సీతను, గృహ్య = గ్రహించి, పునః = మరల, ఉత్పపాత = ఆకాశములోనికి ఎగిరెను.

తా. ఆ జటాయువు ముసలితనముచేత అలసిపోయి నట్లు గమనించి రావణుడు సంతోషించుచు మరల ఆకాశములోనికి ఎగిరెను. 22

మూ. తం ప్రహృష్టం నిధాయాఙ్కే గచ్ఛన్తం జనకాత్మజామ్,
గృధ్రరాజః సముత్పత్య సమభిద్రుత్య రావణమ్, 23
సమావార్య మహాతేజా జటాయురిదమబ్రవీత్.

ప్ర. అ. గృధ్రరాజః = గృధ్రముల రాజు, మహాతేజాః=గొప్ప తేజస్సు గలవాడు అయిన, జటాయుః=జటాయువు, సముత్పత్య=ఎగిరి, ప్రహృష్టమ్= సంతోషించుచున్నవాడు, జనకాత్మజామ్ = సీతను, అఙ్కే=ఒడిలో, నిధాయ= ఉంచుకొని, గచ్ఛన్తమ్=వెళ్ళుచున్నవాడు అయిన, తం రావణమ్=ఆ రావణుణ్ణి, సమభిద్రుత్య = ఎదుటకు పరుగెత్తి వెళ్ళి, సమావార్య = అడ్డుకొని, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. ఆ రావణుడు సంతోషించుచు సీతను ఒడిలో ఉంచుకొని వెళ్ళిపోవుచుండగా, గొప్ప తేజస్సు గల గృధ్రరాజైన జటాయువు, ఎగిరి, అతనికి ఎదురుగా వెళ్ళి, అడ్డుకొని ఇట్లు పలికెను. 23

మూ. వజ్రసంస్పర్శబాణస్య భార్యాం రామస్య రావణ, 24
అల్పబుద్ధే హరస్యేనాం వధాయ ఖలు రక్షసామ్.

ప్ర. అ. అల్పబుద్ధే= అల్పమైన బుద్ధి గల, రావణ = రావణా! వజ్రసంస్పర్శబాణస్య=వజ్రాయుధము వంటి స్పర్శ గల బాణములు గల, రామస్య= రామునియొక్క, భార్యామ్ = భార్యయైన, ఏనామ్ = ఈ సీతను, రక్షసామ్ = రాక్షసులయొక్క, వధాయ = వధకొరకే, హరసి = హరించుచున్నావు.

తా. అల్పబుద్ధివైన రావణా! ఏ రాముని బాణముల ప్రహారము (దెబ్బ) వజ్రాయుధము ప్రహారము వంటిదో అట్టి రాముని భార్యయైన ఈ సీతను హరించుచున్నావు; ఇది రాక్షసుల వినాశమునకే దారితీయును. 24

మూ. సమిత్రబన్ధుః సామాత్యః సబలః సపరిచ్ఛదః, 25
విషపానం పిబస్యేతత్పిపాసిత ఇవోదకమ్.

ప్ర. అ. సమిత్రబన్ధుః=మిత్రులతోను బంధువులతోను కూడిన, సామాత్యః = మంత్రులతో కూడిన, సబలః = సైన్యముతో కూడిన, సపరిచ్ఛదః=పరివారముతో కూడిన నీవు, పిపాసితః = దప్పికొన్నవాడు, ఉదకమివ = ఉదకమును

వలె, ఏతత్ = ఈ సీతాపహరణ మనే, విషపానమ్ = విషమిశ్రమైన పానీయ మును, పిబసి = త్రాగుచున్నావు.

తా. నీ మిత్రులతో, బంధువులతో, అమాత్యులతో, సైన్యముతో, పరివార ముతో సహా నీవు సీతాపహరణ మనే ఈ విషము కలిసిన పానీయమును, దప్పి కొన్నవాడు ఉదకమును త్రాగినట్లు త్రాగుచున్నావు. 25

మూ. అనుబన్ధమజానన్తః కర్మణామవిచక్షణాః. 26
శీఘ్రమేవ వినశ్యన్తి యథా త్వం వినశిష్యసి.

ప్ర. అ. కర్మణామ్ = కర్మలయొక్క, అనుబన్ధమ్ = ఫలితమును, అజా నన్తః = ఎరుగనివారై, అవిచక్షణాః = బుద్ధిలేనివాళ్లు, యథా = ఎట్లు, శీఘ్రమేవ = శీఘ్రముగానే, వినశ్యన్తి = నశింతురో, అట్లే, త్వమ్ = నీవు, వినశిష్యసి = నశించగలవు.

తా. బుద్ధివిహీనులు తాము చేయు కర్మలకు ఎట్టి ఫలితము కలుగునో తెలుసుకొనక ఆ కర్మలు చేసి ఎట్లు నశింతురో అట్లే నీవు కూడ నశించగలవు.

మూ. బద్ధస్త్వం కాలపాశేన క్వ గతస్తస్య మోక్ష్యసే, 27
వధాయ బడిశం గృహ్య సామిషం జలజో యథా.

ప్ర. అ. త్వమ్ = నీవు, కాలపాశేన = యమపాశముచేత, వధాయ=వధ కొరకు, బద్ధః = కట్టబడినావు. సామిషమ్ = మాంసముతో కూడిన, బడిశమ్ = గేలమును, గృహ్య = మ్రింగి, జలజః యథా = చేప వలె, తస్య = ఆ కాలపాశ మునకు (నుండి), క్వ గతః = ఎక్కడికి వెళ్ళినవాడవై, మోక్ష్యసే = విడిపించు కొనగలవు;

తా. చివర మాంసపుముక్క కట్టిన గేలమును చేప మ్రింగినట్లు నీవు చచ్చుటకే యమపాశమును తగల్చుకొన్నావు; నీ వెక్కడికి వెళ్ళినా దానిని తప్పించుకొనలేవు. 27

మూ. న హి జాతు దురాధర్షౌ కాకుత్స్థౌ తవ రావణ, 28
ధర్షణం చాశ్రమస్యాస్య క్షమిష్యేతే తు రాఘవౌ.

ప్ర. అ. రావణ = రావణుడా ! దురాధర్షౌ = ఎదిరింప శక్యముకానివారు, కాకుత్స్థౌ=కకుత్స్థవంశమునందు పుట్టినవారు అయిన, రాఘవౌ=రామలక్ష్మణులు, తవ = నీయొక్క, అస్య ఆశ్రమస్య = ఈ ఆశ్రమముయొక్క, ధర్షణమ్ = అవమానమును, జాతు = ఎన్నడును, న క్షమిష్యేతే = సహించరు.

తా. రావణా ! ఎదిరింప శక్యముకాని, కాకుత్స్థవంశసంజాతులైన రామలక్ష్మణులు నీవు ఆశ్రమమునకు చేసిన అవమానమును ఎన్నటికీ సహించరు. 28

మూ. యథా త్వయా కృతం కర్మ భీరుణా లోకగర్హితమ్, 29
తస్కరాచరితో మార్గో నైవ వీరనిషేవితః.

ప్ర. అ. భీరుణా = పిరికివాడవైన, త్వయా = నీచేత, యథా = ఏ విధముగా, లోకగర్హితమ్ = లోకముచేత నిందితమైన, కర్మ = పని, కృతమ్ = చేయబడినదో, ఆ విధము, తస్కరాచరితః=దొంగలచేత అనుసరింపబడిన, మార్గః = మార్గము. వీరనిషేవితః = వీరులచేత సేవింపబడినది, నైవ = కాదు.

తా. పిరికివాడవైన నీవు లోకములో అందరిచేత నిందింపబడే పని చేసినావు. నీవు అవలంబించిన మార్గము దొంగలు అనుసరించునది. వీరులు అనుసరించేది కాదు. 29

మూ. యుధ్యస్వ యది శూరోఽసి ముహూర్తం తిష్ఠ రావణ,
శయిష్యసే హతో భూమౌ యథా భ్రాతా ఖరస్తథా.

(ప్రతిపదార్థతాత్పర్యాలకు 50 వ సర్గలోని 22 వ శ్లోకం చూడుడు).

మూ. పరేతకాలే పురుషో యత్కర్మ ప్రతిపద్యతే, 31
వినాశాయాత్మనోఽధర్మ్యం ప్రతిపన్నోఽసి కర్మ తత్.

ప్ర. అ. పురుషః = పురుషుడు, పరేతకాలే=మరణకాలమునందు, యత్ = ఏ, కర్మ = కర్మను, ప్రతిపద్యతే = పొందుతాడో, అధర్మ్యమ్ = ధర్మసంమతము కాని, తత్ కర్మ = ఆ కర్మను, ఆత్మనః = నీయొక్క, వినాశాయ = వినాశముకొరకు, ప్రతిపన్నః = పొందినవాడవు, అసి = అయి ఉన్నావు.

తా. చావు మూడినవాడే ఇట్టి ధర్మవిరుద్ధమైన పని చేయును. అందుచేత నీవు నీ నాశముకొరకే ఈ పాపకర్మ చేయుచున్నావు. 31

మూ. పాపానుబన్ధో వై యస్య కర్మణః కర్మ కో ను తత్, 32
కుర్వీత లోకాధిపతిః స్వయంభూర్భగవానపి.

ప్ర. అ. యస్య = ఏ, కర్మణః = కర్మయొక్క, పాపానుబన్ధః = పాపమైన ఫల ముండునో, తత్ = అట్టి, కర్మ = కర్మను, లోకాధిపతిః = లోకములకు అధిపతియైన, భగవాన్ = భగవంతుడైన, స్వయంభూరపి = సాక్షాత్తు బ్రహ్మయే యైనను, కః = ఎవ్వడు, కుర్వీత = చేయును.

తా. ఏ పని చేసినచో చివరికి చెడ్డ ఫలమే కలుగునో అట్టి కర్మను, సాక్షాత్తు సకలలోకముల అధిపతియైన భగవంతుడు బ్రహ్మదేవుని అంతటివాడైనా ఎవ్వడైనా చేయునా ? 32

మూ. ఏవముక్త్వా శుభం వాక్యం జటాయుస్తస్య రక్షసః, 33
నిపపాత భృశం పృష్ఠే దశగ్రీవస్య వీర్యవాన్.

ప్ర. అ. వీర్యవాన్ = పరాక్రమవంతుడైన, జటాయుః = జటాయువు, ఏవమ్ = ఇట్లు, శుభమ్ = మంగళకరమైన, వాక్యమ్ = వాక్యమును, ఉక్త్వా = పలికి, రక్షసః = రాక్షసుడైన, తస్య రావణస్య = ఆ రావణునియొక్క, పృష్ఠే = వీపుమీద, భృశమ్ = మిక్కిలి (ఆఘాతము కలుగునట్లు), నిపపాత = వ్రాలెను.

తా. పరాక్రమవంతుడైన జటాయువు ఆ రావణునితో ఇట్లు మంగళకరమైన మాటలు చెప్పి, అతడు వినకపోవుటచే, మహావేగముగా అతని వీపుమీద వ్రాలెను. 33

మూ. తం గృహీత్వా నఖైస్తీక్ష్ణైర్విదదార సమన్తతః, 34
అధిరూఢో గజారోహో యథా స్యాద్దుష్టవారణమ్.

ప్ర. అ. తమ్ = ఆ రావణుని, గృహీత్వా = పట్టుకొని, అధిరూఢః = ఏనుగుపైకి ఎక్కిన, గజారోహః = మావటీడు, దుష్టవారణమ్ = దుష్టమైన గజమును, యథా = ఎట్లు, స్యాత్ = అగునో(చేయునో) అట్లు, తీక్ష్ణైః = వాడియైన, నఖైః = గోళ్ళచేత, సమన్తతః = అంతటా, విదదార = చీల్చెను.

తా. ఆ రావణుని గట్టిగా పట్టుకొని, మావటీడు దుష్టమైన ఏనుగును ఎక్కి దానిని అంకుశముతో పొడిచినట్లు వాడియైన గోళ్లతో చీల్చెను. 34

మూ. విదదార నఖైరస్య తుణ్డం పృష్ఠే సమర్పయన్, 35
కేశాంశ్చోత్పాటయామాస నఖపక్షముఖాయుధః.

ప్ర. అ. అస్య=ఈతనియొక్క, పృష్ఠే=వీపునందు, తుణ్డమ్=ముక్కును, సమర్పయన్ = ఉంచుచు, నఖైః = గోళ్లతో, విదదార = చీల్చెను. నఖపక్షముఖాయుధః = గోళ్లు, రెక్కలు, ముక్కు ఆయుధములుగా కలవాడై, కేశాంశ్చ= కేశములను కూడ, ఉత్పాటయామాస = పెరికివేసెను.

తా. ముక్కుతో అతని వీపుమీద పొడుచుచు, గోళ్లతో చీరెను. గోళ్లు, రెక్కలు, ముక్కు ఆయుధాలుగా ఉపయోగించుచు అతని జుట్టు పీకివేసెను. 35

మూ. స తథా గృధ్రరాజేన క్లిశ్యమానో ముహుర్ముహుః, 36
అమర్షస్ఫురితోష్ఠః సన్ ప్రాకమ్పత చ రావణః.

ప్ర. అ. గృధ్రరాజేన=జటాయువుచేత, ముహుర్ముహుః=మాటిమాటికి, తథా = ఆ విధముగా, క్లిశ్యమానః = బాధింపబడుచున్నవాడై, సః రావణః = ఆ రావణుడు, అమర్షస్ఫురితోష్ఠః సన్ = కోపముతో కదలుచున్న పెదవులు కల వాడై, ప్రాకమ్పత = వణకెను.

తా. జటాయువు ఆ విధముగా మాటిమాటికి పీడింపగా, రావణుడు కోపముచేత పెదవులు అదరగా వణకెను. 36

మూ. పరిగృహ్య చ వైదేహీం వామేనాఙ్కేన రావణః, 37
తలేనాభిజఘానాశు జటాయుం క్రోధమూర్ఛితః.

ప్ర. అ. రావణః = రావణుడు, క్రోధమూర్ఛితః=క్రోధముచేత వ్యాప్తుడై, వామేన అఙ్కేన=ఎడమ చంకచేత, వైదేహీమ్=సీతను, పరిగృహ్య=గ్రహించి, ఆశు = శీఘ్రముగా, జటాయుమ్ = జటాయువును, తలేన = అరచేతితో, అభిజఘాన = కొట్టెను.

తా. రావణుడు, సీతను ఎడమచంకయందు ఉంచుకొని, కోపముతో నిండినవాడై, వెంటనే అరచేతితో ఆ జటాయువును కొట్టెను. 37

మూ. జటాయు స్తమభిక్రమ్య తుణ్డేనాస్య ఖగాధిపః, 38
వామబాహూన్ దశ తదా వ్యపాహరదరిందమః.

ప్ర. అ. తదా = అప్పుడు, ఖగాధిపః = పక్షిరాజైన, అరిందమః = శత్రుసంహారకుడైన, జటాయుః = జటాయువు, తమ్ = ఆ రావణుని, అభిక్రమ్య = ఆక్రమించి, తుణ్డేన = ముట్టెతో, అస్య = ఇతనియొక్క, దశ = పది. వామబాహూన్ = ఎడమ చేతులను, వ్యపాహరత్ = హరించెను.

తా. పక్షిరాజు, శత్రుసంహారకుడు అయిన జటాయువు, అప్పుడు, ఆ రావణునిపై ఆక్రమణము చేసి ఆతని పది ఎడమ భుజములను ముట్టెతో ఛేదించి వేసెను. 38

మూ. సంఛిన్నబాహోః సద్యైవ బాహవః సహసాభవన్, 39
విషజ్వాలావలీయుక్తా వల్మీకాదివ పన్నగాః.

ప్ర. అ. సంఛిన్నబాహోః = ఛేదించబడిన బాహువులు గల ఆతనియొక్క, బాహవః = బాహువులు, సద్యైవ = వెంటనే, వల్మీకాత్ = పుట్టనుండి, విషజ్వాలావలీయుక్తాః = విషజ్వాలల పంక్తులతో కూడిన, పన్నగాః ఇవ = సర్పములు వలె, సహసా = శీఘ్రముగా, అభవన్ = పుట్టినవి.

తా. ఈ విధముగ బాహువులు తెగి పడిపోయిన ఆ రావణుని శరీరము నుండి వెంటనే, పుట్టనుండి విషజ్వాలలు కక్కుచున్న సర్పములు పైకి వచ్చినట్లు శీఘ్రముగా బాహువులు మొలచి పైకి వచ్చినవి. 39

మూ. తతః క్రోధాద్దశగ్రీవః స తాముత్సృజ్య రావణః, 40
ముష్టిభ్యాం చరణాభ్యాం చ గృధ్రరాజమపోథయత్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, దశగ్రీవః = పది కంఠములు గల, రావణః = రావణుడు, తామ్ = సీతను, ఉత్సృజ్య = విడచి, ముష్టిభ్యామ్ = పిడికిళ్లతోను, చరణాభ్యాం చ = పాదములతోను, గృధ్రరాజమ్ = జటాయువును, క్రోధాత్ = కోపమువలన, అపోథయత్ = కుమ్మెను.

తా. పిమ్మట దశకంఠుడైన రావణుడు సీతను విడచి, కోపావిష్టుడై పిడికిళ్లతోను పాదాలతోను జటాయువును కుమ్మెను. 40

మూ. తతో ముహూర్తం సంగ్రామో బభూవాతులవీర్యయోః, 41
రాక్షసానాం చ ముఖ్యస్య పక్షిణాం ప్రవరస్య చ.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, అతులవీర్యయోః = సాటిలేని పరాక్రమము గల, రాక్షసానాం ముఖ్యస్య = రాక్షసరాజునకు, పక్షిణాం ప్రవరస్య = పక్షిశ్రేష్ఠునకు, ముహూర్తమ్ = ముహూర్తకాలముపాటు, సంగ్రామః = యుద్ధము, బభూవ = ఆయెను.

తా. పిదప, సాటి లేని పరాక్రమము గల ఆ రాక్షసరాజ-పక్షిరాజులమధ్య కొంత సేపు యుద్ధము జరిగెను. 41

మూ. తస్య వ్యాయచ్ఛమానస్య రామస్యార్థే స రావణః, 42
పక్షౌ పార్శ్వౌ చ పాదౌ చ ఖడ్గముద్ధృత్య సోఽచ్ఛినత్.

ప్ర. అ. సః = ఆ, రావణః = రావణుడు, ఖడ్గమ్ = ఖడ్గమును, ఉద్యమ్య = ఎత్తి, రామస్య = రామునియొక్క, అర్థే = ప్రయోజనము నుద్దేశించి, వ్యాయచ్ఛమానస్య = ఉద్యమించుచున్న, తస్య = ఆ జటాయువుయొక్క, పక్షౌ = రెక్కలను, పార్శ్వౌ చ = పార్శ్వములను, పాదౌ చ = పాదములను, అచ్ఛినత్ = ఛేదించెను.

తా. రావణుడు ఖడ్గము ఎత్తి, రాముని నిమిత్తమై పోరాడుచున్న ఆ జటాయువు రెక్కలను, పార్శ్వములను, పాదములను నరికివేసెను. 42

మూ. స చ్ఛిన్నపక్షః సహసా రక్షసా రౌద్రకర్మణా, 43
నిపపాత హతో గృధ్రః ధరణ్యామల్పజీవితః.

ప్ర. అ. రౌద్రకర్మణా = భయంకరమైన కర్మ గల, రక్షసా = రాక్షసునిచేత, ఛిన్నపక్షః = ఛేదించబడిన రెక్కలు గలవాడై, సః = ఆ, గృధ్రః = జటాయువు, హతః = కొట్టబడినవాడై, అల్పజీవితః = అల్పమైన జీవితము కలవాడై, ధరణ్యామ్ = నేలమీద, నిపపాత = పడెను.

తా. భయంకరమైన పనులు చేయు ఆ రావణుడు రెక్కలను ఛేదించివేయగా, జటాయువు, ఆ విధముగా కొట్టబడినవాడై, కొన ఊపిరితో నేలపై బడెను. 43

మూ. తం దృష్ట్వా పతితం భూమౌ క్షతజార్ద్రం జటాయుషమ్,
అభ్యధావత వైదేహీ స్వబన్ధుమివ దుఃఖితా. 44

ప్ర. అ. వైదేహీ = సీత, భూమౌ = నేలమీద, పతితమ్ = పడిన, క్షతజార్ద్రమ్=రక్తముచేత తడిసిన, తం జటాయుషమ్= ఆ జటాయువును, దృష్ట్వా =చూచి, దుఃఖితా = దుఃఖించినదై, స్వబన్ధుమివ=తన బంధువును గూర్చి వలె, అభ్యధావత = అతనివద్దకు పరుగెత్తి వెళ్ళెను.

తా. నేలపై బడి, రక్తముచే తడిసిన ఆ జటాయువును చూడగానే సీత దుఃఖార్తురాలై, తన బంధువువద్దకు వెళ్ళినట్లు అతని వద్దకు శీఘ్రముగా పరుగెత్తెను. 44

మూ. తం నీలజీమూతనికాశకాయం
సుపాణ్డురోరస్కముదారవీర్యమ్,
దదర్శ లఙ్కాధిపతిః పృథివ్యాం
జటాయుషం శాన్తమివాగ్నిదావమ్. 45

ప్ర. అ. లఙ్కాధిపతిః = రావణుడు, నీలజీమూతనికాశకాయమ్ = నల్లని మేఘముతో సమానమైన శరీరము కలవాడు, సుపాణ్డురోరస్కమ్=బాగుగా తెల్లనైన వక్షఃస్థలము కలవాడు, ఉదారవీర్యమ్ = గొప్ప పరాక్రమము గలవాడు, శాన్తమ్ = శాంతించిన, అగ్నిదావమివ = దావాగ్నివలె ఉన్నవాడు అయిన, తం జటాయుషమ్ = ఆ జటాయువును, పృథివ్యామ్ = నేలమీద, దదర్శ=చూచెను.

తా. రావణుడు నేలపై పడిఉన్న జటాయువును చూచెను. మహాపరాక్రమవంతుడైన ఆ జటాయువు మేఘముతో సమానమైన శరీరముతో తెల్లని వక్షస్థలముతో శాంతించిన దావాగ్ని వలె ఉండెను. 45

మూ. తతస్తు తం పత్త్రిరథం మహీతలే
నిపాతితం రావణవేగమర్దితమ్,
పునశ్చ సంగృహ్య శశిప్రభాననా
రురోద సీతా జనకాత్మజా తదా. 46

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ఏకపఞ్చాశః సర్గః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, శశిప్రభాననా = చంద్రునివంటి కాంతి గల ముఖము గల, జనకాత్మజా = జనకుని పుత్రియైన, సీతా = సీత, తదా = అప్పుడు, రావణవేగమర్దితమ్ = రావణుని వేగముచేత పీడింపబడినవాడు, మహీతలే = నేలమీద, నిపాతితమ్ = పడగొట్టబడినవాడు అయిన, తం పతత్త్రిరథమ్ = ఆ జటాయువును, పునః = మరల, పరిగృహ్య = పట్టుకొని, రురోద = ఏడ్చెను.

తా. పిమ్మట, చంద్రునివంటి ముఖము గల, జనకపుత్రియైన సీత, అప్పుడు, రావణుని వేగముచేత మర్దితుడై నేలమీద పడి యున్న ఆ జటాయువును మరల పట్టుకొని ఏడ్చెను. 46

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్య
కాండలో ఏబదియొకటవ సర్గ సమాప్తము.

అథ ద్విపఞ్చాశః సర్గః

[*రావణుడు సీతను అపహరించుట*].

మూ. సా తు తారాధిపముఖీ రావణేన నిరీక్ష్య తమ్,
గృధ్రరాజం వినిహతం విలలాప సుదుఃఖితా. 1

ప్ర. అ. తారాధిపముఖీ=చంద్రునివంటి ముఖము గల, సా తు=ఆ సీత, రావణేన = రావణునిచేత, వినిహతమ్ = చంపబడిన, తం గృధ్రరాజమ్ = ఆ జటాయువును, నిరీక్ష్య = చూచి, సుదుఃఖితా = చాల దుఃఖించినదై, విలలాప = విలపించెను.

తా. చంద్రునివంటి ముఖము గల సీత రావణునిచేత చంపబడిన ఆ జటాయువును చూచి, చాల దుఃఖించుచు విలపించెను. 1

మూ. నిమిత్తం లక్షణజ్ఞానం శకునస్వరదర్శనమ్,
అవశ్యం సుఖదుఃఖేషు నరాణాం ప్రతిదృశ్యతే. 2

ప్ర. అ. లక్షణజ్ఞానమ్ = ఆ యా లక్షణముల (కన్ను అదరుట మొదలైనవాటి) జ్ఞానము, శకునస్వరదర్శనమ్=పక్షుల స్వరముల జ్ఞానము, నరాణామ్ = మనుష్యులయొక్క, సుఖదుఃఖేషు = సుఖదుఃఖములందు, అవశ్యమ్=తప్పక, నిమిత్తమ్ = సూచకముగా, ప్రతిదృశ్యతే = చూడబడుచున్నది.

తా. లక్షణముల జ్ఞానము, కన్ను అదరుట, (అద్దములో తల కనబడకపోవుట మొదలైన లక్షణాల జ్ఞానము), పక్షుల స్వరములు వినబడుట మొదలైనవి మానవులకు రాబోవు సుఖదుఃఖములను తప్పక సూచించుచుండును. 2

మూ. నూనం రామ న జానాసి మహద్వ్యసనమాత్మనః,
ధావన్తి నూనం కాకుత్స్థం మదర్థం మృగపక్షిణః. 3

ప్ర. అ. రామ = రామా ! ఆత్మనః = నీయొక్క, మహత్ = గొప్పదైన, వ్యసనమ్ = వ్యసనమునుగూర్చి, న జానాసి = ఎరుగవు. నూనమ్ = నిశ్చయము. మదర్థమ్ = నా నిమిత్తమై, మృగపక్షిణః = మృగములు, పక్షులు, కాకుత్థ్సమ్ = రాముణ్ణి గూర్చి, ధావన్తి = పరుగెత్తుచున్నవి. నూనమ్ = నిశ్చయము.

తా. రామా ! నీకు కలిగిన ఈ గొప్ప ఆపదను గూర్చి నీకు తెలియదు కదా! (ఆయా శకునములనుపట్టి యైనా తెలుసుకొనజాలవా అని భావము), ఈ మృగములు, పక్షులు పరుగెత్తుచున్నవి; రామునకు నా విషయము చెప్పుటకే పరుగెత్తుచున్నవి. నిశ్చయము. 3

మూ. అయం హి పాపచారేణ మాం త్రాతుమభిసంగతః,
శేతే వినిహతో భూమౌ మమ భాగ్యాద్విహంగమః. 4

ప్ర. అ. మామ్ = నన్ను, త్రాతుమ్ = రక్షించుటకు, అభిసంగతః = వచ్చిన, అయమ్ = ఈ, విహంగమః = జటాయువు, మమ = నాయొక్క, భాగ్యాత్ = దురదృష్టమువలన, పాపచారేణ = పాపాత్ముడైన రావణునిచేత, వినిహతః = చంపబడినవాడై, భూమౌ = భూమిమీద, శేతే = శయనించిఉన్నాడు.

తా. నన్ను రక్షించుటకై వచ్చిన ఈ జటాయువు, నా దుర్భాగ్యవశము చేత ఈ పాపాత్మునిచే చంపబడి నేలపై పడి యున్నాడు. 4

మూ. త్రాహి మామద్య కాకుత్థ్స లక్ష్మణేతి వరాఙ్గనా,
సుసంత్రస్తా సమాక్రన్దచ్ఛృణ్వతాం తు యథాన్తికే. 5

ప్ర. అ. వరాఙ్గనా = ఉత్తమస్త్రీ యైన సీత, సుసంత్రస్తా = చాల భయ పడినదై, కాకుత్థ్స = రామా ! లక్ష్మణ = లక్ష్మణా : అద్య = ఇప్పుడు, మామ్ = నన్ను, త్రాహి = రక్షించుము, ఇతి = అని, అన్తికే = సమీపమునందు, శృణ్వతాం యథా = వినుచున్నారా అన్నట్లు, సమాక్రన్దత్ = అరచెను.

ప్ర. అ. ఉత్తమస్త్రీ యైన ఆ సీత చాల భయపడినదై, ''రామా ! లక్ష్మణా! ఇప్పుడు నన్ను రక్షించండి'' అని వారిద్దరు దగ్గర ఉన్నారా అన్నట్లు అరచెను.

మూ. తాం క్లిష్టమాల్యాభరణాం విలపన్తీమనాథవత్,
అభ్యధావత వైదేహీం రావణో రాక్షసాధిపః. 6

ప్ర. అ. క్లిష్టమాల్యాభరణామ్ = నలిగిపోయిన మాలలు ఆభరణములు కల, అనాథవత్ = అనాథురాలు వలె, విలపన్తీమ్ = విలపించుచున్న, తాం వైదేహీమ్ = ఆ సీతను గూర్చి, రాక్షసాధిపః = రాక్షసరాజైన, రావణః = రావణుడు, అభ్యధావత = తొందరగా వెళ్లెను.

తా. పుష్పమాలలు, అలంకారములు నలిగిపోయి, అనాథురాలు వలె ఏడ్చుచున్న ఆ సీత దగ్గరకు రాక్షసరాజైన రావణుడు శీఘ్రముగా వెళ్లెను. 6

మూ. తాం లతామివ వేష్టన్తీమాలిఙ్గన్తీం మహాద్రుమాన్,
ముఞ్చ ముఞ్చేతి బహుశః ప్రవదన్రాక్షసాధిపః. 7

క్రోశన్తీం రామ రామేతి రామేణ రహితాం వనే,
జీవితాన్తాయ కేశేషు జగ్రాహాన్తకసన్నిభః. 8

ప్ర. అ. అన్తకసన్నిభః = యమునితో సమానుడైన, రాక్షసాధిపః = రావణుడు, లతామివ = లతవలె, మహాద్రుమాన్ = పెద్దవృక్షములను, వేష్టన్తీమ్ = చుట్టుకొనుచున్నది, ఆలిఙ్గన్తీమ్ = వాటిని కౌగలించుకొనుచున్నది, వనే = వనమునందు, రామేణ = రామునితో, రహితామ్ = శూన్యయైనదీ, రామ రామేతి = రామా! రామా! అని, క్రోశన్తీమ్ = ఏడ్చుచున్నది అయిన, తామ్ = ఆ సీతను, ముఞ్చ ముఞ్చ ఇతి = (చెట్లను) విడువుము, విడువుము అని, బహుశః = అనేకపర్యాయములు, ప్రవదన్ = పలుకుచు, జీవితాన్తాయ = తన ప్రాణముల అంతముకొరకే, కేశేషు = కేశములయందు, జగ్రాహ = పట్టుకొనెను.

తా. ఆ వనములో రామునకు దూరమైన ఆ సీత రామా! రామా! అని విలపించుచు, అక్కడ నున్న మహావృక్షములను కౌగలించుకొని లత వలె వాటికి చుట్టబెట్టుకొనుచుండగా యముని వంటి ఆ రావణుడు "చెట్లు విడువుము, విడువుము" అని మాటిమాటికి అనుచు, చివరికి మరణము చెందుటకే ఆమెను జుట్టు పట్టుకొనెను. 7, 8

మూ. ప్రధర్షితాయాం సీతాయాం బభూవ సచరాచరమ్,
జగత్సర్వమమర్యాదం తమసాన్ధేన సంవృతమ్, 9
న వాతి మారుతస్తత్ర నిష్ప్రభోఽభూద్దివాకరః.

ప్ర. అ. సీతాయామ్ = సీత, ప్రధర్షితాయామ్ = అవమానించబడిన దగుచుండగా, సచరాచరమ్ = జంగమములతోను స్థావరములతోను కూడిన, సర్వమ్ =సమస్తమైన, జగత్ = జగత్తు, అమర్యాదమ్ = కట్టుబాట్లు లేనిదై, అన్ధేన తమసా = గ్రుడ్డి చీకటిచేత, సంవృతమ్ = కప్పబడినది, బభూవ = ఆయెను, తత్ర = అక్కడ, మారుతః = వాయువు, న వాతి = వీచలేదు. దివాకరః = సూర్యుడు, నిష్ప్రభః = కాంతిహీనుడు, అభూత్ = ఆయెను.

తా. ఆ విధముగా సీత అవమానింపబడగా స్థావరజంగమాత్మకమైన జగత్తు అంతా కట్టుబాట్లు లేనిదై కటిక చీకటిచేత కప్పబడెను. అప్పుడు గాలి సరిగా వీచలేదు. సూర్యుని కాంతి తగ్గెను. 9

మూ. దృష్ట్వా సీతాం పరామృష్టాం దీనాం దివ్యేన చక్షుషా, 10
కృతం కార్యమితి శ్రీమాన్ వ్యాజహార పితామహః.

ప్ర. అ. శ్రీమాన్ = శోభ గల, పితామహః = బ్రహ్మదేవుడు, దీనామ్ = దీనురాలైన, సీతామ్ = సీతను, పరామృష్టామ్ = స్పృశించబడిన దానినిగా, దివ్యేన = దివ్యమైన, చక్షుషా = నేత్రముచేత, దృష్ట్వా = చూచి, కార్యమ్ = కార్యము, కృతమ్ = చేయబడినది, ఇతి = అని, వ్యాజహార = పలికెను.

తా. దీనురాలైన ఆ సీతను రావణుడు స్పృశించినట్లు దివ్యదృష్టితో చూచి, శోభాయుక్తుడైన బ్రహ్మదేవుడు-''తలచిన పని పూర్తి అయినట్లే''అని అనెను. 10

మూ. ప్రహృష్టా వ్యథితాశ్చాసన్ సర్వే తే పరమర్షయః, 11
దృష్ట్వా సీతాం పరామృష్టాం దణ్డకారణ్యవాసినః.
రావణస్య వినాశం చ ప్రాప్తం బుద్ధ్వా యదృచ్ఛయా.

ప్ర. అ. దణ్డకారణ్యవాసినః = దండకారణ్యమునందు నివసించు, సర్వే = సమస్తమైన, తే = ఆ, పరమర్షయః = మహర్షులు, సీతామ్ = సీతను, పరామృష్టామ్ = స్పృశించబడినదానినిగా, దృష్ట్వా = చూచి, యదృచ్ఛయా = దైవవశముచేత, రావణస్య = రావణునియొక్క, వినాశం చ = వినాశమును కూడ, ప్రాప్తమ్ = వచ్చినదానినిగా, బుద్ధ్వా = తెలుసుకొని, ప్రహృష్టాః = సంతోషించినవారు, వ్యథితాశ్చ = వ్యథచెందినవారుకూడ, ఆసన్ = అయిరి.

తా. దండకారణ్యములో నివసించే మహర్షు లందరు సీతను రావణుడు పట్టి తీసికొనిపోవుట చూచి, దైవవశముచేత ఇంతకాలానికి రావణుని వినాశము రానున్న దని కూడ తెలిసికొని సంతోషమును, దుఃఖమును కూడ పొందిరి. 11,12

మూ. స తు తాం రామ రామేతి రుదన్తీం లక్ష్మణేతి చ,
జగామాదాయ చాకాశం రావణో రాక్షసేశ్వరః. 13

ప్ర. అ. రాక్షసేశ్వరః = రాక్షసుల ప్రభువైన, సః రావణః = ఆ రావణుడు, రామ రామేతి = రామా! రామా! అనీ, లక్ష్మణేతి చ = లక్ష్మణా అనీ, రుదన్తీమ్ = ఏడ్చుచున్న, తామ్ = ఆ సీతను, ఆదాయ = గ్రహించి, ఆకాశమ్ = ఆకాశమును గూర్చి, జగామ = వెళ్ళెను.

తా. రాక్షసరాజైన రావణుడు, "రామా! రామా!" అని, "లక్ష్మణా!" అని ఏడ్చుచున్న ఆ సీతను గ్రహించి ఆకాశమార్గమునందు వెళ్ళిపోయెను. 13

మూ. తప్తాభరణజుష్టాఙ్గీ పీతకౌశేయవాసినీ,
రరాజ రాజపుత్రీ తు విద్యుత్సౌదామినీ యథా. 14

ప్ర. అ. తప్తాభరణజుష్టాఙ్గీ = పరిశుద్ధమైన బంగారు ఆభరణములతో కూడిన అవయవములు కలది, పీతకౌశేయవాసినీ = పచ్చని పట్టువస్త్రము ధరించినదీ అయిన, రాజపుత్రీ = ఆ రాజకుమారి యైన సీత, విద్యుత్ = మెరయుచున్న, సౌదామినీ యథా = మెరుపు వలె, రరాజ = ప్రకాశించెను.

తా. అన్ని అవయవములందు శుద్ధమైన బంగారు ఆభరణములు ధరించి, పచ్చని పట్టుచీర కట్టుకొని ఉన్న ఆ సీత మెరుస్తూన్న మెరుపు వలె ప్రకాశించెను. 14

మూ. ఉద్ధూతేన చ వస్త్రేణ తస్యాః పీతేన రావణః,
అధికం పరిబభ్రాజ గిరిర్దీప్త ఇవాగ్నినా. 15

ప్ర. అ. తస్యాః = ఆమెయొక్క, ఉద్ధూతేన = ఎగురగొట్టబడిన, పీతేన = పచ్చని, వస్త్రేణ = వస్త్రముచేత, రావణః = రావణుడు, అగ్నినా = అగ్నిచేత, దీప్తః = ప్రకాశింపచేయబడిన, గిరిరివ = పర్వతము వలె, అధికమ్ = అధికముగా, పరిబభ్రాజ = ప్రకాశించెను.

తా. సీత శరీరముమీద ఉన్న పచ్చని వస్త్రము గాలికి ఎగురుచుండగా, ఆ రావణుడు అగ్నిచేత ప్రకాశింపచేయబడిన పర్వతము వలె అధికముగా ప్రకాశించెను. 15

మూ. తస్యాః పరమకల్యాణ్యాస్తామ్రాణి సురభీణి చ,
పద్మపత్రాణి వైదేహ్యా అభ్యకీర్యన్త రావణమ్. 16
(చ్యుతాని పద్మపత్రాణి రావణం సమావాకిరన్)

ప్ర. అ. పరమకల్యాణ్యాః = చాల మంగళప్రదురాలైన, తస్యాః = ఆ, వైదేహ్యాః = సీతయొక్క, తామ్రాణి = ఎఱ్ఱనైన, సురభీణి = పరిమళించుచున్న, పద్మపత్రాణి = పద్మముల రేకులు, చ్యుతాని = జారినవై, రావణమ్ = రావణుని, సమవాకిరన్ = చిమ్మినవి.

తా. అధికముగ మంగళప్రదురాలైన ఆ సీత కొప్పులోనుండి రాలిన పరిమళించుచున్న ఎఱ్ఱని పద్మపత్రములు ఆ రావణునిమీద చల్లినట్లు పడినవి. 16

మూ. తస్యాః కౌశేయముద్ధూతమాకాశే కనకప్రభమ్,
బభౌ చాదిత్యరాగేణ తామ్రమభ్రమివాతపే. 17

ప్ర. అ. తస్యాః = ఆమెయొక్క, ఆకాశే = ఆకాశమునందు, ఉద్ధూతమ్ = ఎగురగొట్టబడిన, కనకప్రభమ్ = బంగారు కాంతి గల, కౌశేయమ్ = పట్టుచీర, ఆతపే = ఎండయందు, ఆదిత్యరాగేణ = సూర్యుని ఎరుపుచేత, తామ్రమ్ = ఎఱ్ఱనైన, అభ్రమివ = మేఘము వలె, బభౌ = ప్రకాశించెను.

తా. సీత ధరించిన, ఆకాశముపై గాలికి ఎగురుచున్న, బంగారు వన్నెగల పట్టుచీర, ఎండలో సూర్యుని కాంతి ప్రసరించిన మేఘము వలె ఉండెను.

మూ. తస్యాస్తత్సునసం వక్త్రమాకాశే రావణాఙ్కగమ్,
న రరాజ వినా రామం వినాళమివ పఙ్కజమ్. 18

ప్ర. అ. ఆకాశే = ఆకాశమునందు, రావణాఙ్కగమ్ = రావణుని అంకమునందున్న, సునసమ్ = అందమైన నాసిక గల, తస్యాః వక్త్రమ్ = ఆ సీత ముఖము, రామం వినా = రాముడు లేకుండుటచే, వినాళమ్ = కాడలేని, పఙ్కజమ్ ఇవ = పద్మము వలె, న రరాజ = ప్రకాశించలేదు.

తా. ఆకాశమార్గమునందు రావణుని అంకముమీద నున్న సుందరమైన నాసిక గల ఆమె ముఖము, రాముడు లేకపోవుటచేత, కాడ లేని పద్మము వలె కాంతివిహీనమై ఉండెను. 18

మూ. బభూవ జలదం నీలం భిత్త్వా చన్ద్ర ఇవోదితః,
సులలాటం సుకేశాన్తం పద్మగర్భాభమవ్రణమ్. 19

శుక్లైః సువిమలైర్దన్తైః ప్రభావద్భిరలంకృతమ్,
తస్యాస్తద్విమలం వక్త్రమాకాశే రావణాఙ్కగమ్. 20

రుదితం వ్యపమృష్టాస్రం చన్ద్రవత్ప్రియదర్శనమ్,
సునాసం చారుతామ్రోష్ఠమాకాశే హాటకప్రభమ్. 21

ప్ర. అ. సులలాటమ్ = అందమైన లలాటము కలది, సుకేశాన్తమ్ = అందమైన కేశాంతములు కలది, పద్మగర్భాభమ్ = పద్మము గర్భమువంటి కాంతి గలది, అవ్రణమ్ = వ్రణములు లేనిది, శుక్లైః = తెల్లనివి, సువిమలైః = మిక్కిలి నిర్మలములైనవి, ప్రభావద్భిః = కాంతి గలవి అయిన, దన్తైః = దంతములచేత, అలంకృతమ్ = అలంకరించబడినది, రుదితమ్ = రోదనము చేసినది, వ్యపమృష్టాస్రమ్ = తుడవబడిన కన్నీళ్లు కలది, చన్ద్రవత్ = చంద్రుడు వలె, ప్రియదర్శనమ్ = ఆనందకరమైన దర్శనము కలది, సునాసమ్ = అందమైన ముక్కు గలది, చారుతామ్రోష్ఠమ్ = అందమైన ఎఱ్ఱని పెదవులు కలది, ఆకాశే = ఆకాశమునందు, హాటకప్రభమ్ = బంగారము వంటి కాంతి గలది, ఆకాశే = ఆకాశమునందు, రావణాఙ్కగమ్ = రావణుని ఒడిలో ఉన్నది అయిన, తస్యాః = ఆమెయొక్క, తత్ = ఆ, విమలమ్ = నిర్మలమైన, వక్త్రమ్ = ముఖము, నీలమ్ = నల్లనైన, జలదమ్ = మేఘమును, భిత్త్వా = చేదించుకొని, ఉదితః = ఉదయించిన, చన్ద్రః ఇవ = చంద్రుడు వలె, బభూవ = ఉండెను.

తా. ఆసమయమున రావణుని అంకమునందున్న నిర్మలమైన సీత ముఖము నల్లని మేఘమును చేదించుకొని పైకి వచ్చిన చంద్రబింబము వలె ఉండెను. అందమైన లలాటము, చక్కని ముంగురులు గల ఆ ముఖము మొటిమలులేనిదై, పద్మము మధ్య భాగము వలె ప్రకాశించుచుండెను. తెల్లగా, నిర్మలములుగా ఉన్న, కాంతిమంతములైన దంతములతో ఒప్పుచుండెను. ఏడుచుటచే కారుచున్న కన్నీళ్లు

తుడవబడి యుండెను. చంద్రబింబము వలె చూచుటకు ఆనందజనకమై చక్కని ముక్కు, అందమైన ఎఱ్ఱని పెదవులు గల ఆ ముఖము ఆకాశమునందు బంగారము వలె ప్రకాశించుచుండెను. 19, 20, 21

మూ. రాక్షసేన సమాధూతం తస్యాస్తద్వదనం శుభమ్,
శుశుభే న వినా రామం దివా చన్ద్ర ఇవోదితః. 22

ప్ర. అ. రాక్షసేన=రాక్షసునిచేత, సమాధూతమ్=కదల్చబడిన, తస్యాః = సీతయొక్క, శుభమ్ = మంగళకరమైన, తత్ = ఆ, ముఖమ్ = ముఖము, రామం వినా = రాముడు లేక, దివా = పగలు, ఉదితః = ఉదయించిన, చన్ద్రః ఇవ = చంద్రుడు వలె, న శుశుభే = ప్రకాశించలేదు.

తా. రాక్షసునిచేత భయకంపితమైపోవునట్లు చేయబడిన ఆ సీత ముఖము రాముడు దగ్గర లేకపోవుటచే, పగటి చంద్రుడు వలె కాంతివిహీనమై ఉండెను.

మూ. సా హేమవర్ణా నీలాఙ్గం మైథిలీ రాక్షసాధిపమ్,
శుశుభే కాఞ్చనీ కాఞ్చీ నీలం మణిమివాశ్రితా. 23

ప్ర. అ. నీలాఙ్గమ్ = నల్లని శరీరము గల, రాక్షసాధిపమ్ = రావణుణ్ణి, ఆశ్రితా=ఆశ్రయించి ఉన్న, హేమవర్ణా = బంగారు రంగు గల, సా మైథిలీ = ఆ సీత, నీలమ్ = నల్లని, మణిమ్ = మణిని (ఆశ్రయించిన), కాఞ్చనీ=బంగారు వికారమైన, కాఞ్చీ ఇవ = వడ్డాణము వలె, శుశుభే = ప్రకాశించెను.

తా. నల్లని శరీరము గల రావణుని సమీపమునందున్న బంగారు రంగు గల సీత, ఇంద్రనీలమాణిక్యము దగ్గర ఉన్న బంగారు వడ్డాణము వలె ప్రకాశించెను. 23

మూ. సా పద్మగౌరీ హేమాభా రావణం జనకాత్మజా,
విద్యుద్ఘనమివావిశ్య శుశుభే తప్తభూషణా. 24

ప్ర. అ. పద్మగౌరీ = పద్మము వలె పచ్చగా నున్నది, హేమాభా = బంగారము వంటి కాంతి గలది, తప్తభూషణా = పరిశుద్ధమైన (బంగారు)అలంకా

రములు గలది అయిన, సా జనకాత్మజా = ఆ సీత, రావణమ్ = రావణుని, ఆవిశ్య = సమీపించి, ఘనమ్ = మేఘమును, ఆవిశ్య = ప్రవేశించి (సమీపించి), విద్యుదివ = మెరుపు వలె, శుశుభే = ప్రకాశించెను.

తా. పద్మము వలె పచ్చగా బంగారము వంటి కాంతితో ప్రకాశించుచు, పరిశుద్ధమైన బంగారు అలంకారములు ధరించి ఆ సీత, రావణుని సమీపము నందు, మేఘములో ప్రవేశించి ఉన్న మెరుపు వలె ప్రకాశించుచుండెను. 24

మూ. తస్యా భూషణఘోషేణ వైదేహ్యా రాక్షసాధిపః,
బభౌ సచపలో నీలః సఘోష ఇవ తోయదః. 25

ప్ర. అ. రాక్షసాధిపః = రావణుడు, తస్యాః వైదేహ్యాః = ఆ సీతయొక్క, భూషణఘోషేణ = అలంకారముల ధ్వనిచేత, సచపలః = మెరుపుతో కూడిన, సఘోషః = ధ్వనితో కూడిన, నీలః = నల్లని, తోయదః ఇవ = మేఘము వలె, బభౌ = ప్రకాశించెను.

తా. సీత అలంకారములు ధ్వనిచేయుటచేత ఆమెతో కూడిన ఆ రావణుడు మెరపుతో కూడిన, ధ్వని చేయుచున్న నల్లని మేఘము వలె ఉండెను. 25

మూ. ఉత్తమాఙ్గాచ్చ్యుతా తస్యాః పుష్పవృష్టిః సమన్తతః,
సీతాయా హ్రియమాణాయాః పపాత ధరణీతలే. 26

ప్ర. అ. హ్రియమాణాయాః = హరింపబడుచున్న, తస్యాః సీతాయాః = ఆ సీతయొక్క, ఉత్తమాఙ్గాత్ = శిరస్సునుండి, చ్యుతా = జారిన, పుష్పవృష్టిః = పుష్పముల వర్షము, సమన్తతః = నలువైపులా, ధరణీతలే = భూమిమీద, పపాత = పడెను.

తా. హరింపబడుచున్న సీత కేశపాశమునుండి జారిన పుష్పముల వర్షము అంతటా నేలమీద పడెను. 26

మూ. సా తు రావణవేగేన పుష్పవృష్టిః సమన్తతః,
సమాధూతా దశగ్రీవం పునరేవాభ్యవర్తత. 27

ప్ర. అ. సమన్తతః = నలుమూలల పడిన, సా పుష్పవృష్టిః = ఆ పుష్ప

వర్షము, రావణవేగేన=రావణుని వేగముచేత, సమాధూతా=ఎగురగొట్టబడినదై, పునః = మరల, దశగ్రీవమేవ = రావణుని గూర్చియే, అభ్యవర్తత=వచ్చెను.

తా. నలుమూలలా రాలిన ఆ పుష్పములు, రావణుని వేగముచేత ఎగిరి మరల ఆ రావణునివైపే వెళ్లెను. 27

మూ. అభ్యవర్తత పుష్పాణాం ధారా వైశ్రవణానుజమ్,
నక్షత్రమాలా విమలా మేరుం నగమివోన్నతమ్. 28

ప్ర. అ. పుష్పాణామ్ = పుష్పములయొక్క, ధారా = పంక్తి, విమలా = స్వచ్ఛమైన, నక్షత్రమాలా = నక్షత్రపంక్తి, ఉన్నతమ్=ఎత్తైన, మేరుం నగమివ = మేరుపర్వతమును వలె, వైశ్రవణానుజమ్ = రావణుని, అభ్యవర్తత = వెళ్ళి చేరెను.

తా. నిర్మలమైన నక్షత్రపంక్తి ఉన్నతమైన మేరుపర్వతము వైపు వెళ్ళి నట్లు, పుష్పముల పంక్తి రావణుని వైపు వెళ్లెను. 28

మూ. చరణాన్నూపురం భ్రష్టం వైదేహ్యా రత్నభూషితమ్,
విద్యున్మణ్డలసంకాశం పపాత మధురస్వనమ్. 29

ప్ర. అ. వైదేహ్యాః=సీతయొక్క, చరణాత్=పాదమునుండి, భ్రష్టమ్= జారిన, రత్నభూషితమ్ = రత్నములచేత అలంకరించబడిన, నూపురమ్=నూపురము, విద్యున్మణ్డలసంకాశమ్ = మెరుపుమండలముతో సమానమైనదై, మధుర స్వనమ్ = మధురమైన ధ్వని గలదై, పపాత = పడెను.

తా. సీత పాదమునుండి జారిపోయిన, రత్నములచేత అలంకరింపబడిన నూపురము, మెరపు చక్రమువలె, మధురముగా ధ్వనిచేయుచు పడెను. 29

మూ. తరుప్రవాళరక్తా సా నీలాఙ్గం రాక్షసేశ్వరమ్,
ప్రాశోభయత వైదేహీ గజం కక్ష్యేవ కాఞ్చనీ. 30

ప్ర. అ. తరుప్రవాళరక్తా = వృక్షముల చిగురు వలె ఎఱ్ఱనైన, సా వైదేహీ = ఆ సీత, నీలాఙ్గమ్=నల్లని శరీరము గల, రాక్షసేశ్వరమ్=రావణుణ్ణి,

కాఞ్చనీ = బంగారువికారమైన, కక్ష్యా = నడుముత్రాడు, గజమివ = ఏనుగును వలె, ప్రాశోభయత = ప్రకాశింపచేసెను.

తా. చెట్ల చిగురు వలె ఎఱ్ఱగా ఉన్న ఆ సీత, నల్లని శరీరము గల రావణుణ్ణి, బంగారు నడుముత్రాడు ఏనుగును ప్రకాశింపచేసి నట్లు ప్రకాశింప చేసెను. 30

మూ. తాం మహోల్కామివాకాశే దీప్యమానాం స్వతేజసా,
జహారాకాశమావిశ్య సీతాం వైశ్రవణానుజః. 31

ప్ర. అ. వైశ్రవణానుజః=రావణుడు, మహోల్కామివ = గొప్ప అగ్ని పిండము వలె, స్వతేజసా = తన తేజస్సుతో, ఆకాశే = ఆకాశమునందు, దీప్యమానామ్=ప్రకాశించుచున్న, తాం సీతామ్=ఆ సీతను, ఆకాశమ్=ఆకాశమును, ఆవిశ్య = ప్రవేశించి, జహార = అపహరించెను.

తా. సీత తన తేజస్సుతో ఆకాశములో పెద్ద అగ్నిపిండము వలె ప్రకాశించుచుండెను. అట్టి సీతను రావణుడు ఆకాశమార్గమునందు అపహరించెను. 31

మూ. తస్యాస్తాన్యగ్నివర్ణాని భూషణాని మహీతలే,
సఘోషాణ్యవకీర్యన్త క్షీణాస్తారా ఇవామ్బరాత్. 32

ప్ర. అ. తస్యాః = ఆమెయొక్క, అగ్నివర్ణాని = అగ్నియొక్క వర్ణము వంటి వర్ణము గల, తాని భూషణాని = ఆ అలంకారములు, సఘోషాణి = ధ్వనితో కూడినవై, అమ్బరాత్ = ఆకాశమునుండి, క్షీణాః = పడిపోయిన, తారాః ఇవ = నక్షత్రములువలె, మహీతలే = నేలమీద, అవకీర్యన్త = చిమ్మబడినవి.

తా. అగ్ని వంటి రంగు గల ఆ సీత అలంకారములు, ఆకాశమునుండి, జారిపోయిన నక్షత్రముల వలె నేలపై నలుమూలలా విసిరివేసినట్లు పడిపోయినవి. 32

మూ. తస్యాః స్తనాన్తరాద్భ్రష్టో హారస్తారాధిపద్యుతిః,
వైదేహ్యా నిపతన్భాతి గఙ్గేవ గగనాచ్చ్యుతా. 33

ప్ర. అ. తస్యాః వైదేహ్యాః=ఆ సీతయొక్క, స్తనాన్తరాత్=వక్షస్థలము

నుండి, భ్రష్టః = జారిపోయిన, తారాధిపద్యుతిః = చంద్రుని వంటి కాంతి గల, హారః = హారము, నిపతన్ = క్రింద పడుచు, గగనాత్ = ఆకాశమునుండి, చ్యుతా = జారిన, గఙ్గేవ = గంగ వలె, భాతి = ప్రకాశించెను.

తా. ఆమె వక్షఃస్థలమునుండి జారి క్రిందికి పడిపోవుచున్న, చంద్రుని వంటి కాంతిగల ముత్యాల హారము ఆకాశమునుండి క్రిందికి పడుచున్న గంగ వలె ప్రకాశించెను. 33

మూ. ఉత్పాతవాతాభిహతా నానాద్విజగణాయుతాః,
మా భైరితి విధూతాగ్రా వ్యాజహ్రురివ పాదపాః. 34

ప్ర. అ. ఉత్పాతవాతాభిహతాః=రావణుడు పైకి ఎగురుటవలన కలిగిన గాలిచే కొట్టబడిన, నానాద్విజగణాయుతాః = అనేకములైన పక్షి సముదాయములతో కూడిన, పాదపాః = వృక్షములు, విధూతాగ్రాః = కదల్పబడిన అగ్ర భాగములు గలవై, మాభైః ఇతి = భయపడకుము అని, వ్యాజహ్రుః ఇవ = పలికినట్లున్నవి.

తా. రావణుడు పైకి ఎగురుటచే కలిగిన గాలికి కదలిన, అనేకపక్షులతో కూడిన వృక్షములు, చివరి కొమ్మలు ఊగుటచే, ''భయపడకుము'' అని సీతను ఓదార్చుచున్నవా అన్నట్లున్నవి. 34

మూ. నలిన్యో ధ్వస్తకమలా స్త్రస్తమీనజలేచరాః,
సఖీమివ గతోచ్ఛ్వాసామన్వశోచన్త మైథిలీమ్. 35

ప్ర. అ. ధ్వస్తకమలాః = నశించిన పద్మములు కలవి, త్రస్తమీనజలేచరాః = భయపడిన మీనములు ఇతరజలచరములు కలవి అయిన, నలిన్యః = పద్మసరస్సులు, గతోచ్ఛ్వాసామ్=పోయిన శ్వాసలు గల, సఖీమివ=సఖురాలిని వలె, మైథిలీమ్ = సీతను గూర్చి, అన్వశోచన్త = దుఃఖించినవి.

తా. అప్పుడు పద్మసరస్సులలోని పద్మాలు ఎండిపోయినవి. మీనములు, ఇతర జలచరములు భయపడుచుండెను. అట్టి పద్మసరస్సులు మూర్ఛ చెందిన సఖురాలిని గూర్చి దుఃఖించి నటు సీతను గూర్చి దుఃఖించినవి. 35

మూ. సమన్తాదభిసంపత్య సింహవ్యాఘ్రమృగద్విజాః,
అన్వధావం స్తదా రోషాత్సీతాం ఛాయానుగామినః. 36

ప్ర. అ. తదా = అప్పుడు, సింహవ్యాఘ్రమృగద్విజాః = సింహములు, వ్యాఘ్రములు, లేళ్లు, పక్షులు, సమన్తాత్ = నలుమూలలా, అభిసంపత్య=గుంపులుగా చేరి, రోషాత్ = కోపమువలన, ఛాయానుగామినః = నీడను అనుసరించుచున్నవై, సీతామ్ = సీతను, అన్వధావన్ = అనుసరించి పరుగెత్తినవి.

తా. అప్పుడు సింహములు, వ్యాఘ్రములు, లేళ్లు, పక్షులు, గుంపులుగా చేరి, రావణునిమీద కోపముతో, నీడను అనుసరించి, సీత వెనుక పరుగెత్తి వెళ్లినవి. 36

మూ. జలప్రపాతాస్రముఖాః శృఙ్గైరుచ్ఛ్రితబాహుభిః,
సీతాయాం హ్రియమాణాయాం విక్రోశన్తీవ పర్వతాః.

ప్ర. అ. సీతాయామ్ = సీత, హ్రియమాణాయామ్ = హరించబడుచున్నదగుచుండగా, పర్వతాః = పర్వతములు, జలప్రపాతాస్రముఖాః = జలపాతములనే కన్నీళ్లు ముఖములందు కలవై, శృఙ్గైః = శిఖరములనే, ఉచ్ఛ్రితబాహుభిః= ఎత్తబడిన బాహువులతో కూడినవై, విక్రోశన్తీవ = ఏడ్చుచున్నట్లుండెను.

తా. హరించబడుచున్న సీతను చూచి, పర్వతములు జలపాతము లనే కన్నీళ్లు కార్చుచు, శిఖరములనే బాహువులు పైకి ఎత్తి ఏడ్చుచున్నట్లు ఉండెను.

మూ. హ్రియమాణాం తు వైదేహీం దృష్ట్వా దీనో దివాకరః,
ప్రతిధ్వస్తప్రభః శ్రీమానాసీత్పాణ్డరమణ్డలః. 38

ప్ర. అ. హ్రియమాణామ్ = హరించబడుచున్న, వైదేహీమ్ = సీతను, దృష్ట్వా = చూచి, శ్రీమాన్ = శోభగల, దివాకరః = సూర్యుడు, దీనః = దీనుడై, ప్రతిధ్వస్తప్రభః = నశించిన కాంతి కలవాడై, పాణ్డరమణ్డలః = తెల్లని మండలము కలవాడుగా, ఆసీత్ = ఆయెను.

తా. కాంతి గల సూర్యుడు కూడ హరింపబడుచున్న సీతను చూచి దీనుడై, కాంతివిహీను డగుటచే అతని మండలము తెల్లగా కనబడుచుండెను. 38

మూ. నాస్తి ధర్మః కుతః సత్యం నార్జవం నానృశంసతా,
యత్ర రామస్య వైదేహీం భార్యాం హరతి రావణః. 39
ఇతి సర్వాణి భూతాని గణశః పర్యదేవయన్.

ప్ర. అ. యత్ర = ఎప్పుడు, రామస్య = రామునియొక్క, భార్యామ్ = భార్యయైన, వైదేహీమ్ = సీతను, రావణః = రావణుడు, హరతి = హరించుచున్నాడో, అట్టి సమయమునందు, ధర్మః = ధర్మము, నాస్తి = లేదు. సత్యమ్ = సత్యము, కుతః = ఎట్లు ? ఆర్జవమ్ = ఋజుత్వము, న = లేదు. అనృశంసతా = అక్రూరత్వము కూడ, న = లేదు, ఇతి = అని, సర్వాణి = సమస్తమైన, భూతాని = ప్రాణులు, గణశః = గుంపులుగా చేరి, పర్యదేవయన్ = విచారించినవి.

తా. "రాముని భార్యయైన సీతనే రావణుడు అపహరించుకొనిపోవుచున్నాడనగా ఇంక ధర్మ మనేది లేదు. సత్యానికి స్థాన మేది ? ఋజుత్వానికి కాని, మంచితనానికి కాని చోటులేదు" అని అనుకొనుచు సమస్తభూతములు గుంపులు గుంపులుగా చేరి విచారించిరి. 39

మూ. విత్రస్తకా దీనముఖా రురుదుర్మృగపోతకాః, 40
ఉద్వీక్ష్యోద్వీక్ష్య నయనై రాస్రపాతావిలేక్షణాః.

ప్ర. అ. మృగపోతకాః = లేడి పిల్లలు, విత్రస్తకాః = భయపడినవై, దీనముఖాః = దీనములైన ముఖములుకలవై, అస్రపాతావిలేక్షణాః = కన్నీళ్లు కారుటచే వ్యాకులమైన చూపులు కలవై, నయనైః = నేత్రములతో, ఉద్వీక్ష్యోద్వీక్ష్య = పైకి చూచి చూచి, రురుదుః = ఏడ్చినవి.

తా. అక్కడ నున్న లేడి పిల్లలు భయపడిపోయెను. వాటి ముఖములు దీనములుగా ఉండెను. కన్నీళ్లు కార్చుటచే వాటి చూపులు వ్యాకులము లయ్యెను. అవి మాటిమాటికి కళ్లు పైకి ప్రసరింపచేసి చూచుచుండెను. 40

మూ. సుప్రవేపితగాత్రాశ్చ బభూవుర్వనదేవతాః, 41
విక్రోశన్తీం దృఢం సీతాం దృష్ట్వా దుఃఖం తథా గతామ్.

ప్ర. అ. తథా = ఆవిధముగా, దుఃఖమ్ = దుఃఖమును, గతామ్ = పొందిన, దృఢమ్ = అధికముగా, విక్రోశన్తీమ్ = అరచుచున్న, సీతామ్ = సీతను, దృష్ట్వా =

చూచి, వనదేవతాః = వనదేవతలు, సుప్రవేపితగాత్రాశ్చ = బాగా వణకుచున్న దేహములు కలవి, బభూవుః = అయినవి.

తా. ఆ విధముగా దుఃఖాక్రాంతురాలై బిగ్గరగా ఏడ్చుచున్న ఆ సీతను చూచి వనదేవతలు వణకిపోయినవి. 41

మూ. తాం తు లక్ష్మణ రామేతి క్రోశన్తీం మధురస్వరమ్, 42
అవేక్షమాణాం బహుశో వైదేహీం ధరణీతలమ్,
స తామాకులకేశాన్తాం విప్రమృష్టవిశేషకామ్, 43
జహారాత్మవినాశాయ దశగ్రీవో మనస్వినీమ్.

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! రామ = రామా ! ఇతి = అని, మధుర స్వరమ్ = మధురమైన స్వరము కలుగునట్లుగా, క్రోశన్తీమ్ = ఏడ్చుచున్నది, బహుశః = అనేకపర్యాయములు, ధరణీతలమ్ = భూమిని, అవేక్షమాణామ్ = చూచుచున్నది, ఆకులకేశాన్తామ్ = వ్యాకులమైన కేశాంతములు గలది, విప్రమృష్ట విశేషకామ్ = చెరిగిపోయిన తిలకము కలది, మనస్వినీమ్ = ఉత్తమమైన మనస్సు కలదీ అయిన, తాం వైదేహీమ్ = ఆ సీతను, సః దశగ్రీవః = ఆ రావణుడు, ఆత్మవినాశాయ = తన వినాశముకొరకే, జహార = హరించెను.

తా. అప్పుడు ఆ సీత "రామా ! లక్ష్మణా ! "అని మధురమైన స్వరముతో విలపించుచుండెను. రామలక్ష్మణు లెక్కడనైనా వచ్చుచున్నారేమో అని మాటిమాటికి నేలవైపు చూచుచుండెను. ఆమె జుట్టు ముడి విడిపోయెను. తిలకము చెరిగిపోయెను. అట్టి ఉత్తమ మనస్సు గల సీతను ఆ రావణుడు తన వినాశము కొరకే అపహరించుకొనిపోయెను. 44, 45

మూ. తతస్తు సా చారుదతీ శుచిస్మితా
వినాకృతా బన్ధుజనేన మైథిలీ,
అపశ్యతీ రాఘవలక్ష్మణావుభౌ
వివర్ణవక్త్రా భయభారపీడితా. 44

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ద్విపఞ్చాశః సర్గః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, చారుదతీ = అందమైన దంతములు కలది, శుచిస్మితా = తెల్లని చిరునవ్వు గలది, బన్ధుజనేన వినా = బంధుజనులు లేకుండా, కృతా = చేయబడినది అయిన, మైథిలీ = సీత, రాఘవలక్ష్మణౌ = రామలక్ష్మణులను, ఉభౌ = ఇద్దరినీ, అపశ్యతీ = చూడనిదై, వివర్ణవక్త్రా = చెడిన రంగు గల ముఖము గలదై, భయభారపీడితా = భయభారముచేత పీడింపబడెను.

తా. అందమైన పలువరుస, తెల్లని చిరునవ్వూ గల ఆ సీత బంధువులకు దూరముచేయబడి, రామలక్ష్మణులను ఇద్దరినీ కూడ చూడక వెలవెలబారిన ముఖముతో భయభారముచేత పీడింపబడెను.

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో ఏబదిరెండవ సర్గ సమాప్తము.

అథ త్రిపఞ్చాశః సర్గః

[సీత రావణుని నిందించుట]

మూ. ఖముత్పతన్తం తం దృష్ట్వా మైథిలీ జనకాత్మజా,
దుఃఖితా పరమోద్విగ్నా భయే మహతి వర్తినీ. 1

ప్ర. అ. జనకాత్మజా = జనకుని కుమార్తెయైన, మైథిలీ = సీత, ఖమ్ = ఆకాశమును గూర్చి, ఉత్పతన్తమ్ = ఎగురుచున్న, తమ్ = రావణుని, దృష్ట్వా = చూచి, పరమోద్విగ్నా = చాల దిగులు చెందినదై, మహతి = గొప్ప, భయే = భయమునందు, వర్తినీ = ఉంటూన్నదై, దుఃఖితా = దుఃఖితురాలు అయ్యెను.

తా. జనకుని కుమార్తెయైన సీత, ఆకాశములో ఎగురుచున్న ఆ రావణుని చూచి, చాల దిగులు చెంది, అత్యధికముగా భయపడుచు దుఃఖితురాలయ్యెను. 1

మూ. రోషరోదనతామ్రాక్షీ భీమాక్షం రాక్షసాధిపమ్,
రుదన్తీ కరుణం సీతా హ్రియమాణేద మబ్రవీత్. 2

ప్ర. అ. హ్రియమాణా = హరించబడుచున్న, సీతా = సీత, కరుణమ్ = దీనముగా, రుదన్తీ = ఏడ్చుచున్నదై, రోషరోదనతామ్రాక్షీ = రోషముచేతను, ఏడ్పుటచేతను ఎఱ్ఱనైన నేత్రములు కలదై, భీమాక్షమ్ = భయంకరములైన నేత్రములు గల, రాక్షసాధిపమ్ = రావణుని గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. రావణునిచేత హరించబడుచున్న సీత రోషముచేతను, ఏడ్పుటచేతను ఎఱ్ఱనైన నేత్రములు గలదై, భయంకరములైన నేత్రములు గల రావణునితో ఇట్లు పలికెను.

మూ. న వ్యపత్రపసే నీచ కర్మణానేన రావణ,
జ్ఞాత్వా విరహితాం యన్మాం చోరయిత్వా పలాయసే. 3

ప్ర. అ. నీచ = నీచుడవైన, రావణ = రావణా ! విరహితామ్ = ఒంటరిగా ఉన్న, మామ్ = నన్ను, చోరయిత్వా = అపహరించి, పలాయసే ఇతి యత్ = పారిపోవుచున్నావుకదా; అనేన = ఈ, కర్మణా = పనిచేత, న వ్యపత్రపసే = సిగ్గుపడుటలేధా ?

తా. ఓ ! నీచుడవైన రావణా! రామలక్ష్మణులు లేక ఒంటరిగా ఉన్న నన్ను ఈ విధముగా అపహరించుకొని పారిపోవుచున్నావే; ఈ పనికి నీకు సిగ్గు కలుగుట లేదా ! 3

మూ. త్వయైవ నూనం దుష్టాత్మన్ భీరుణా హర్తుమిచ్ఛతా,
మమాపవాహితో భర్తా మృగరూపేణ మాయయా. 4

ప్ర. అ. దుష్టాత్మన్ = దుష్టబుద్ధి కలవాడా ! హర్తుమ్ = హరించుటకు, ఇచ్ఛతా = కోరుచున్న, భీరుణా = పిరికిపందవైన, త్వయైవ = నీచేతనే, మమ = నాయొక్క, భర్తా = భర్త, మాయయా = మాయచేత, మృగరూపేణ = మృగ రూపముచేత, అపవాహితః = దూరముగా తీసికొనిపోబడినాడు.

తా. దుష్టబుద్ధి కలవాడా ! నన్ను హరించవలె నను ఉద్దేశ్యముతో పిరికి పందవైన నీవే మాయచేత మృగరూపము కల్పించి, నా భర్త దూరముగా వెళ్లి పోవు నట్లు చేసినావు. 4

మూ. యో హి మాముద్యతస్త్రాతుం సోఽప్యయం వినిపాతితః,
గృధ్రరాజః పురాణోఽసౌ శ్వశురస్య సఖా మమ. 5

ప్ర. అ. యః = ఏ, గృధ్రరాజః = జటాయువు, అద్య = ఇప్పుడు, మామ్ = నన్ను, త్రాతుమ్ = రక్షించుటకు, ఉద్యతః = ఉద్యమించినాడో, మమ శ్వశురస్య = నా మామగారియొక్క, పురాణః = ప్రాచీనుడైన, సఖా = స్నేహితు డైన, సః అయమ్ = అట్టి, అసౌ అపి = ఇతడు కూడ, వినిపాతితః = పడగొట్ట బడినాడు.

తా. నా మామగారి ప్రాచీనమిత్రుడైన ఆ జటాయువు నన్ను రక్షించుటకు రాగా ఆతనిని కూడ పడగొట్టినావు. 5

మూ. పరమం ఖలు తే వీర్యం దృశ్యతే రాక్షసాధమ,
విశ్రావ్య నామధేయం హి యుద్ధే నాస్మి జితా త్వయా. 6

ప్ర. అ. రాక్షసాధమః = రాక్షసాధముడా : తే వీర్యమ్ = నీ పరాక్రమము, పరమమ్ = చాల గొప్పదిగా, దృశ్యతే ఖలు = చూడబడుచున్నదికదా। నామ దేయమ్ = పేరును, విశ్రావ్య = వినిపించి, త్వయా = నీచేత, యుద్ధే = యుద్ధము నందు, జితా = జయింపబడినదానను, నాస్మి హి = కాను కదా।

తా. రాక్షసాధమా ! నీ పరాక్రమము చాల గొప్పది వలె కనబడుచున్నది. నీవు నీ పేరును గొప్పగా చెప్పుకొని నన్ను రామునితో యుద్ధము చేసి జయించ జాలక అపహరించుకొనిపోవుచున్నావు। 6

మూ. ఈదృశం గర్హితం కర్మ కథం కృత్వా న లజ్జసే,
స్త్రియాశ్చ హరణం నీచ రహితే చ పరస్య చ. 7

ప్ర. అ. నీచ = నీచుడా। రహితే = శూన్యప్రదేశమునందు, పరస్య చ = పరునియొక్క, స్త్రియాః = స్త్రీయొక్క, హరణమ్ = హరణ మనే, ఈదృశమ్ = ఇట్టి, గర్హితమ్ = నింద్యమైన, కర్మ = పనిని, కృత్వా = చేసి, కథమ్ = ఎట్లు, న లజ్జసే = సిగ్గుపడుట లేదు ?

తా. నీచుడా : శూన్యప్రదేశములో ఉన్న పరస్త్రీని అపహరించుట అనే ఇట్టి నింద్యమైన పని చేయుటకు నీకు సిగ్గు కలుగుటలేదా ? 7

మూ. కథయిష్యన్తి లోకేషు పురుషాః కర్మ కుత్సితమ్,
సునృశంసమధర్మిష్ఠం తవ శౌణ్డీర్యమానినః. 8

ప్ర. అ. శౌణ్డీర్యమానినః = శూరుడ ననే అభిమానము గల, తవ = నీయొక్క, సునృశంసమ్ = చాల క్రూరము, అధర్మిష్ఠమ్ = ధర్మవిరుద్ధము, కుత్సితమ్ = నింద్యము అయిన, కర్మ = ఈ పనిని, లోకేషు = లోకములలో, పురుషాః = పురుషులు, కథయిష్యన్తి = చెప్పుకొనగలరు.

తా. గొప్ప శూరుడ ననే గర్వము గల నీవు చేసిన ఈ క్రూరము, ధర్మ విరుద్ధము, నీచము అయిన ఈ కర్మను గూర్చి లోకములలో జనులు నిందా పూర్వకముగా చెప్పుకొందురు. 8

మూ. ధిక్తే శౌర్యం చ సత్త్వం చ యత్త్వం కథితవాంస్తదా,
కులాక్రోశకరం లోకే ధిక్తే చారిత్రమీదృశమ్. 9

ప్ర. అ. యత్ = దేనిని గూర్చి, త్వమ్ = నీవు, తదా = అప్పుడు, కథితవాన్ = చెప్పినావో, తే = నీయొక్క, శౌర్యమ్=అట్టి శౌర్యమును గూర్చి, సత్త్వం చ = బలమును గూర్చి, ధిక్ = నింద అగుగాక. లోకే=లోకమునందు, కులాక్రోశకరమ్=కులమునకు నిందను కలిగించు, తే=నీయొక్క, ఈదృశమ్= ఇట్టి, చారిత్రమ్ = చరిత్రను గూర్చి, ధిక్ = నింద అగుగాక.

తా. అప్పుడు నీవు నీ శౌర్యబలములను గూర్చి గొప్పగా చెప్పినావు. అట్టి నీ శౌర్యబలములను గూర్చి నింద అగుగాక. ఛీ! ఇట్టి నీ చరిత్రము నీ కులమునకే కళంకము తెచ్చుచున్నది. 9

మూ. కిం కర్తుం శక్యమేవం హి యజ్జవేనైవ ధావసి,
ముహూర్తమపి తిష్ఠస్వ న జీవన్ ప్రతియాస్యసి. 10

ప్ర. అ. కిమ్ = ఏమి, కర్తుమ్ = చేయుటకు, శక్యమ్ = శక్యము? యత్ = ఎందువలన అనగా, ఏవమ్ = ఈ విధముగా, జవేనైవ = వేగముతోనే, ధావసి = పారిపోవుచున్నావు. ముహూర్తమపి = ముహూర్తకాలమైనా, తిష్ఠస్వ= ఆగుము, జీవన్ = జీవించుచున్నవాడవై, న ప్రతియాస్యసి = తిరిగి వెళ్లవు.

తా. నీ వీ విధముగా మహావేగముతో పారిపోవుచుండగా ఏమి చేయ గలను? ముహూర్తకాలము పాటు ఆగుము. ప్రాణాలతో తిరిగి వెళ్లవు. 10

మూ. న హి చక్షుష్పథం ప్రాప్య తయోః పార్థివపుత్రయోః,
ససైన్యోఽపి సమర్థస్త్వం ముహూర్తమపి జీవితుమ్. 11

ప్ర. అ. తయోః = ఆ, పార్థివపుత్రయోః = రాజకుమారులయొక్క, చక్షుష్పథమ్=నేత్రమార్గమును, ప్రాప్య=పొంది, త్వమ్=నీవు, ససైన్యోఽపి=

సైన్యసహితుడవైనను, ముహూర్తమపి = ముహూర్తకాలమైనను, జీవితుమ్ = జీవించుటకు, న సమర్థః హి = సమర్థుడవు కాదు కదా ?

తా. ఆ రామలక్ష్మణుల కంట బడినచో, నీవు, సైన్యముతో వచ్చినా కూడ, ఒక్క ముహూర్తము కూడ జీవించజాలవు. 11

మూ. న త్వం తయోః శరస్పర్శం సోఢుం శక్తః కథంచన,
వనే ప్రజ్వలితస్యేవ స్పర్శమగ్నేర్విహంగమః. 12

ప్ర. అ. వనే = వనమునందు, ప్రజ్వలితస్య = మండుచున్న, అగ్నేః = అగ్నియొక్క, స్పర్శమ్ = స్పర్శను, విహంగమః ఇవ = పక్షి వలె, త్వమ్ = నీవు, తయోః = ఆ ఇద్దరియొక్క, శరస్పర్శమ్ = బాణముల స్పర్శను, సోఢుమ్ = సహించుటకు, కథంచన = ఏ విధముగాను కూడ, న శక్తః = సమర్థుడవు కాదు.

తా. అరణ్యములో మండుచున్న అగ్ని స్పర్శను పక్షి ఏ విధముగ సహింపజాలదో అట్లే నీవు ఆ రామలక్ష్మణుల బాణముల స్పర్శను ఏ విధముగానూ కూడ సహించజాలవు. 12

మూ. సాధు కుర్వాత్మనః పథ్యం సాధు మాం ముఞ్చ రావణ,
మత్ప్రధర్షణరుష్టో హి భ్రాత్రా సహ పతిర్మమ. 13
విధాస్యతి వినాశాయ త్వం మాం యది న ముఞ్చసి.

ప్ర. అ. రావణ = రావణుడా ! సాధు = బాగుగా, ఆత్మనః = నీకు, పథ్యమ్ = హితమైన పనిని, కురు = చేయుము. మామ్ = నన్ను, సాధు = బాగుగా, ముఞ్చ = విడచి వేయుము. త్వమ్ = నీవు, మామ్ = నన్ను, న ముఞ్చసి యది = విడవకపోయినట్లయితే, మత్ప్రధర్షణరుష్టః = నా అవమానముచేత కోపించిన, మమ పతిః = నా భర్త, భ్రాత్రా సహ = సోదరునితో కూడినవాడై, వినాశాయ = నీ వినాశమునకు, విధాస్యతి = ఉపాయముచేయగలడు.

తా. రావణుడా ! మంచితనముతో నన్ను విడిచిపెట్టుము. అది నీకు హితకరమైనది. నీవు నన్ను విడవకపోయినచో, నన్ను అవమానించుటచేత కోపించిన నా భర్త, సోదరునితో కలిసి, నిన్ను నశింపచేయుటకై ఉపాయములను అవలంబించగలడు. 13

మూ. యేన త్వం వ్యవసాయేన బలాన్మాం హర్తుమిచ్ఛసి, 14
వ్యవసాయః స తే నీచ భవిష్యతి నిరర్థకః.

ప్ర. అ. నీచ = నీచుడా ! త్వమ్ = నీవు, యేన = ఏ, వ్యవసాయేన = ఉద్యమముచేత, మామ్ = నన్ను, బలాత్ = బలాత్కారముగా, హర్తుమ్ = హరించుటకు, ఇచ్ఛసి = కోరుచున్నావో, తే = నీయొక్క, సః = ఆ, వ్యవసాయః = ప్రయత్నము, నిరర్థకః = వ్యర్థము. భవిష్యతి = కాగలదు.

తా. నీచుడా ! నీవు ఏ ప్రయత్నము చేసి నన్ను బలాత్కారముగా హరించుటకు కోరుచున్నావో, నీవు చేసే ఆ ప్రయత్నమంతా వ్యర్థము కాగలదు.

మూ. న హ్యహం తమపశ్యన్తీ భర్తారం విబుధోపమమ్, 15
ఉత్సహే శత్రువశగా ప్రాణాన్ ధారయితుం చిరమ్.

ప్ర. అ. అహమ్ = నేను, విబుధోపమమ్ = దేవతలతో సమానుడైన, భర్తారమ్ = భర్తయైన, తమ్ = ఆ రాముణ్ణి, అపశ్యన్తీ = చూడనిదాననై, శత్రువశగా = శత్రువుల వశమునం దున్నదాననై, చిరమ్ = చిరకాలము, ప్రాణాన్ = ప్రాణములను, ధారయితుమ్ = ధరించుటకు, న ఉత్సహే హి = ఉత్సాహవంతురాలను గాను కదా.

తా. దేవతలతో సమానుడైన నా భర్తయైన రాముణ్ణి చూడకుండగా, శత్రువుల చేత చిక్కి నేను చిరకాలము ప్రాణములు ధరించజాలను కదా ! 15

మూ. న నూనం చాత్మనః పథ్యం శ్రేయో వా సమవేక్షసే, 16
మృత్యుకాలే యథా మర్త్యో విపరీతాని సేవతే.

ప్ర అ. మర్త్యః = మానవుడు, మృత్యుకాలే = మృత్యుసమయమునందు, యథా = ఎట్లు, విపరీతాని = విపరీతకార్యములను, సేవతే = సేవించునో ఆ విధముగా, ఆత్మనః = నీయొక్క, పథ్యమ్ = హితమును గాని, శ్రేయో వా = శ్రేయస్సును గాని, న సమవేక్షసే = చూచుటలేదు.

తా. మరణకాలము ఆసన్నమైనప్పుడు మానవుడు విపరీతముగా ప్రవర్తించును. అందుచేతనే నీవు నీ హిత మేదో, శ్రేయస్సు ఏదో తెలుసుకొనలేకున్నావు. 16

మూ. ముమూర్షూణాం హి సర్వేషాం యత్పథ్యం తన్న రోచతే,
పశ్యామ్యద్య హి కణ్ఠే త్వాం కాలపాశావపాశితమ్. 17

ప్ర. అ. ముమూర్షూణామ్ = చచ్చుటకు సిద్ధముగా ఉన్న, సర్వేషామ్= అందరికీ, యత్ = ఏది, పథ్యమ్ = పథ్యమో, తత్ = అది, న రోచతే=ఇష్టము కాదు. అద్య = ఇప్పుడు, త్వామ్ = నిన్ను, కణ్ఠే= కంఠమునందు, కాలపాశావపాశితమ్=యమపాశముచేత కట్టబడినవానినిగా, పశ్యామి హి = చూచుచున్నాను కదా ?

తా. చచ్చుటకు సిద్ధముగా ఉన్నవాళ్లెవ్వరికీ పథ్యమైనది ఇష్టముగా ఉండదు. నీ కంఠమునకు యమపాశము బిగించబడిఉన్నదని నేను ఊహించుచున్నాను. 17

మూ. యథా చాస్మిన్ భయస్థానే న బిభేషి దశానన, 18
వ్యక్తం హిరణ్మయాన్ హి త్వం సంపశ్యసి మహీరుహాన్.

ప్ర. అ. దశానన = రావణుడా! త్వమ్=నీవు, అస్మిన్ = ఈ, భయస్థానే = భయమునకు హేతువైన విషయమునందు; యథా = ఎట్లు, న బిభేషి=భయపడుటలేదో, హిరణ్మయాన్ = బంగారువికారమైన, మహీరుహాన్=వృక్షములను, సంపశ్యసి = చూచుచున్నావు; వ్యక్తమ్ = స్పష్టము.

తా. రావణా! భయపడవలసిన ఇట్టి స్థితిలో నీవు భయపడకపోవుటను బట్టి చూడగా, నీవు, బంగారు వృక్షములను చూచుచున్నావనుట స్పష్టము. 18

మూ. నదీం వైతరణీం ఘోరాం రుధిరౌఘనివాహినీమ్, 19
అసిపత్రవనం చైవ భీమం పశ్యసి రావణ.

ప్ర. అ. రావణ = రావణుడా! రుధిరౌఘనివాహినీమ్ = రక్తప్రవాహముతో ప్రవహించు, ఘోరామ్= భయంకరమైన, వైతరణీం నదీమ్= వైతరణీ నదిని, భీమమ్=భయంకరమైన, అసిపత్రవనం చైవ=అసిపత్రవనమును, పశ్యసి = చూచుచున్నావు.

తా. రావణుడా! నీవు మరణించి, నరకములో రక్తప్రవాహముతో ప్రవ

హించు భయంకరమైన వైతరణీనదిని, భయంకరమైన అంతటా కత్తులు పరచిన అసిపత్రవనమును చూడగలవు. 19

మూ. తప్తకాఞ్చనపుష్పాం చ వైడూర్యప్రవరచ్ఛదామ్, 20
ద్రక్ష్యసే శాల్మలిం తీక్ష్ణామాయసైః కణ్టకైశ్చితామ్.

ప్ర. అ. తప్తకాఞ్చనపుష్పామ్=శుద్ధమైన బంగారము వంటి పుష్పములు కలది, వైడూర్యప్రవరచ్ఛదామ్ = శ్రేష్ఠమైన వైడూర్యమణుల వంటి ఆకులు కలది, ఆయసైః = ఇనుము వికారమైన, కణ్టకైః = ముళ్ళతో, చితామ్ = వ్యాప్తమైనదీ, తీక్ష్ణామ్ = తీక్ష్ణమూ అయిన, శాల్మలిమ్ = శాల్మలీవృక్షమును, ద్రక్ష్యసే = చూడగలవు.

తా. ఆ నరకములో బంగారు రంగు పుష్పములు, వైడూర్యమణుల వంటి ఆకులు ఉన్న, శాల్మలీవృక్షమును (బూరుగుచెట్టు) చూడగలవు. దాని నిండా ఇనుప ముళ్లు గుచ్చి ఉండుటచే అది చాల తీక్ష్ణముగా ఉండును. 20

మూ. న హి త్వమీదృశం కృత్వా తస్యాలీకం మహాత్మనః, 21
ధరితుం శక్ష్యసి చిరం విషం పీత్వేవ నిర్ఘృణః.

ప్ర. అ. నిర్ఘృణః = జాలి లేని, త్వమ్ = నీవు, మహాత్మనః = మహాత్ముడైన, తస్య = ఆ రామునకు, ఈదృశమ్=ఇట్టి, అలీకమ్=అపకారమును, కృత్వా = చేసి, విషమ్ = విషమును, పీత్వేవ = త్రాగి వలె, చిరమ్ = చిరకాలము, ధరితుమ్ = జీవించుటకు, న శక్ష్యసి = సమర్థుడవు కాజాలవు.

తా. క్రూరుడవైన నీవు, మహాత్ముడైన ఆ రామునకు ఇట్టి అపకారము చేసిన పిమ్మట, విషము త్రాగినవాడు వలె చాల కాలము జీవించజాలవు. 21

మూ. బద్ధస్త్వం కాలపాశేన దుర్నివారేణ రావణ, 22
క్వ గతో లప్స్యసే శర్మ భర్తుర్మమ మహాత్మనః.

ప్ర. అ. రావణ = రావణుడా ! త్వమ్ = నీవు, దుర్నివారేణ = నివారింప శక్యము కాని, కాలపాశేన = కాలపాశముచేత, బద్ధః = కట్టబడినావు. మమ = నాయొక్క, భర్తుః = భర యైన, మహాత్మనః = మహాత్ముడైన రామునినుండి, క్వ

= ఎక్కడికి, గతః = వెళ్ళినవాడవై, శర్మ = సుఖమును, లప్స్యసే = పొందగలవు?

తా. రావణుడా : నీవు నివారింప శక్యము కాని కాలపాశముచేత కట్టబడి ఉన్నావు. నీవు ఎక్కడికి పోయినను, మహాత్ముడైన నా భర్తనుండి తప్పించుకొని సుఖముగా ఉండజాలవు. 22

మూ. నిమేషాన్తరమాత్రేణ వినా భ్రాత్రా మహావనే, 23
రాక్షసా నిహతా యేన సహస్రాణి చతుర్దశ,
స కథం రాఘవో వీరః సర్వాస్త్రకుశలో బలీ. 24
న త్వాం హన్యాచ్ఛరైస్తీక్ష్ణైరిష్టభార్యాపహారిణమ్.

ప్ర. అ. యేన = ఏ రామునిచేత, మహావనే = మహారణ్యమునందు, భ్రాత్రా వినా = సోదరుడు లేకుండా, నిమేషాన్తరమాత్రేణ = రెప్పపాటు సమయములో, చతుర్దశ సహస్రాణి = పదునాలుగు వేలు, రాక్షసాః = రాక్షసులు, నిహతాః = చంపబడినారో, వీరః = వీరుడు, సర్వాస్త్రకుశలీ = సర్వాస్త్రములయందు నేర్పు గలవాడు, బలీ = బలవంతుడు అయిన, సః = అట్టి, రాఘవః = రాముడు, ఇష్టభార్యాపహారిణమ్ = ఇష్టురాలైన భార్యను అపహరించిన, త్వామ్ = నిన్ను, తీక్ష్ణైః = తీక్ష్ణములైన, శరైః = బాణములచేత, కథమ్ = ఎట్లు, న హన్యాత్ = చంపకుండును ?

తా. ఏ రాముడు, మహారణ్యములో, సోదరుని సహాయము కూడ లేకుండగా రెప్పపాటు కాలములో, పదునాలుగు వేలమంది రాక్షసులను చంపినాడో, అట్టి మహావీరుడు, బలశాలి, సర్వాస్త్రములందు నేర్పుకలవాడూ అయిన రాముడు తన ప్రియురాలైన భార్యను అపహరించిన నిన్ను, తీక్ష్ణములైన బాణాలతో చంపకుండా ఉండునా ? 23, 24

మూ. ఏతచ్చాన్యచ్చ పరుషం వైదేహీ రావణాఙ్కగా. 25
భయశోకసమావిష్టా కరుణం విలలాప హ.

ప్ర. అ. రావణాఙ్కగా = రావణుని అంకమును పొందిన, వైదేహీ = సీత, భయశోకసమావిష్టా = భయముతోను శోకముతోను కూడినదై, ఏతత్ చ = దీనిని,

అన్యచ్చ = ఇతరమునూ, పరుషమ్=పరుషవాక్యమును (పలుకుచు), కరుణమ్= దీనముగా, విలలాప హ = విలపించెను.

తా. రావణుని ఒడిలో ఉన్న సీత ఈ పరుషవాక్యములను, పరుషములైన మరి కొన్ని మాటలను పలుకుచు, భయముచేతను, శోకముచేతను ఆవేశింపబడి నదై, దీనముగా ఏడ్చెను. 25

మూ. తథా భృశార్తాం బహు చైవ భాషిణీం
విలాపపూర్వం కరుణం చ భామినీమ్,
జహార పాపః కరుణం వివేష్టతీం
నృపాత్మజామాగతగాత్రవేపథుమ్. 26

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
త్రిపఞ్చాశః సర్గః.

ప్ర. అ. తథా=ఆ విధముగా, భృశార్తామ్=మిక్కిలి దుఃఖించుచున్నది, విలాపపూర్వమ్ = విలాపపూర్వకముగాను, కరుణం చ = దీనముగాను, బహు చైవ = అధికముగా, భాషిణీమ్ = మాటలాడుచున్నది, కరుణమ్ = జాలికొలుపునట్లుగా, వివేష్టతీమ్ = మెలికలు తిరుగుచున్నది, నృపాత్మజామ్ = రాజకుమారి, ఆగతగాత్రవేపథుమ్ = పొందబడిన శరీరకంపము గలది అయిన, భామినీమ్ = సీతను, పాపః = పాపాత్ముడైన రావణుడు, జహార = హరించెను.

తా. రాజకుమారియైన సీత ఆ విధముగా చాల దుఃఖితురాలై దీనముగా విలపించుచు ఏమేమో అధికముగా మాటలాడుచుండెను. జాలి గొలుపు నట్లు మెలికలు తిరిగిపోవుచుండెను. ఆమె శరీరము వణకిపోవుచుండెను. అట్టి సీతను ఆ పాపాత్ముడు హరించెను. 26

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్య
కాండలో ఏబదిమూడవ సర్గ సమాప్తము.

అథ చతుఃపఞ్చాశః సర్గః

[సీత తన ఆభరణములను మూటకట్టి ఐదుగురు వానరుల మధ్య జారవిడచుట, రావణుడు సీతను తన అంతఃపురములో ఉంచుట. ఎనమండుగురు గూఢచారులను జనస్థానమునకు పంపుట.]

మూ. హ్రియమాణా తు వైదేహీ కంచిన్నాథమపశ్యతీ,
దదర్శ గిరిశృఙ్గస్థాన్ పఞ్చ వానరపుఙ్గవాన్. 1

ప్ర. అ. హ్రియమాణా = హరించబడుచున్న, వైదేహీ = సీత, నాథమ్ = రక్షకుణ్ణి, కంచిత్ = ఎవనినీ, అపశ్యతీ = చూడనిదై, గిరిశృఙ్గస్థాన్ = పర్వత శిఖరముమీద ఉన్న, పఞ్చ = ఐదుగురు, వానరపుఙ్గవాన్ = వానరశ్రేష్ఠులను, దదర్శ = చూచెను.

తా. ఈ విధముగా అపహరింపబడుచున్న సీతకు రక్షకు లెవ్వరూ కనబడలేదు. ఇంతలో ఆమెకు పర్వతశిఖరముమీద ఉన్న ఐదుగురు వానరశ్రేష్ఠులు కనబడిరి. 1

మూ. తేషాం మధ్యే విశాలాక్షీ కౌశేయం కనకప్రభమ్,
ఉత్తరీయం వరారోహా శుభాన్యాభరణాని చ, 2
ముమోచ యది రామాయ శంసేయురితి భామినీ.

ప్ర. అ. విశాలాక్షీ = విశాలములైన నేత్రములు గల, వరారోహా = సుందరమైన కటిప్రదేశము గల, భామినీ = సీత, కనకప్రభమ్ = బంగారు కాంతి గల, కౌశేయమ్ = పట్టుదైన, ఉత్తరీయమ్ = ఉత్తరీయమును, శుభాని = మంగళకరములైన, ఆభరణాని చ = ఆభరణములను, రామాయ = రామునకు, శంసేయుః యది = చెప్పిన చెప్పవచ్చును, ఇతి = అని ఆలోచించి, తేషామ్ = వారియొక్క, మధ్యే = మధ్యయందు, ముమోచ = విడచెను.

తా. విశాలములైన నేత్రములు శ్రేష్ఠమైన కటిప్రదేశము గల ఆ సీత, "ఈ వానరులు రామునకు చెప్పిన చెప్పవచ్చును" అని ఆలోచించి, బంగారు కాంతి గల, ఉత్తరీయముగా ఉన్న పట్టువస్త్రమును, మంగళకరములైన ఆభరణములను వారి మధ్య విడచెను.

మూ. వస్త్రముత్సృజ్య తన్మధ్యే నిక్షిప్తం సహభూషణమ్, 3
సంభ్రమాత్తు దశగ్రీవస్తత్కర్మ న స బుద్ధవాన్.

ప్ర. అ. సహభూషణమ్ = భూషణములతో కూడిన, వస్త్రమ్ = వస్త్రము, ఉత్సృజ్య = పీకితీసి, తన్మధ్యే = ఆ వానరుల మధ్యయందు, నిక్షిప్తమ్ = ఉంచబడినది. సః దశగ్రీవః = ఆ రావణుడు, సంభ్రమాత్ = తొందరవలన, తత్ = ఆ, కర్మ = పనిని, న బుద్ధవాన్ = తెలిసికొనలేదు.

తా. అలంకారములతో కూడ ఆ వస్త్రమును తీసి ఆమె ఆ వానరుల మధ్య విడచెను. రావణుడు తొందరలో ఉండుటచే ఆమె చేసిన పనిని గుర్తించలేదు. 3

మూ. పిఙ్గాక్షాస్తాం విశాలాక్షీం నేత్రైరనిమిషైరివ, 4
విక్రోశన్తీం తథా సీతాం దదృశుర్వానరర్షభాః.

ప్ర. అ. పిఙ్గాక్షాః = పచ్చని నేత్రములు గల, వానరర్షభాః = వానరశ్రేష్ఠులు, విశాలాక్షీమ్ = విశాలములైన నేత్రములు కల, తథా = ఆవిధముగా, విక్రోశన్తీమ్ = ఏడ్చుచున్న, తాం సీతామ్ = ఆ సీతను, అనిమిషైరివ = రెప్పపాటు లేనివి వలె ఉన్న, నేత్రైః = నేత్రములతో, దదృశుః = చూచిరి.

తా. పచ్చని నేత్రములు గల ఆ వానరశ్రేష్ఠులు, ఆ విధముగా ఏడ్చుచున్న విశాలాక్షియైన ఆ సీతను రెప్పపాటు లేని కండ్లతో చూచిరి. 4

మూ. స చ పమ్పామతిక్రమ్య లఙ్కామభిముఖః పురీమ్, 5
జగామ రుదతీం గృహ్య వైదేహీం రాక్షసేశ్వరః.

ప్ర. అ. సః రాక్షసేశ్వరః = ఆ రావణుడు, పమ్పామ్ = పంపానదిని, అతిక్రమ్య = దాటి, లఙ్కాం పురీమ్ = లంకాపట్టణమును గూర్చి, అభిముఖః = అభిముఖుడై, రుదతీమ్ = ఏడ్చుచున్న, వైదేహీమ్ = సీతను, గృహ్య = గ్రహించి, జగామ = వెళ్లెను.

తా. ఆ రావణుడు ఏడ్చుచున్న ఆ సీతను తీసికొని, పంపానదిని దాటి లంకాపురాభిముఖుడై వెళ్లెను. 5

మూ. తాం జహార సుసంహృష్టో రావణో మృత్యుమాత్మనః, 6
ఉత్సఙ్గేనేవ భుజగీం తీక్ష్ణదంష్ట్రాం మహావిషామ్.

ప్ర. అ. రావణః = రావణుడు, సుసంహృష్టః = చాలా సంతోషించినవాడై, ఆత్మనః = తనకు, మృత్యుమ్ = మృత్యుదేవతయైన, తామ్ = ఆ సీతను, తీక్ష్ణదంష్ట్రామ్ = తీక్ష్ణములైన కోరలుగలది, మహావిషామ్ = గొప్ప విషము గలది అయిన, భుజగీమ్ = ఆడసర్పమును, ఉత్సఙ్గేనేవ = ఒడిచేత వలె, జహార = అపహరించెను.

తా. రావణుడు తనకు మృత్యుదేవతయైన ఆ సీతను, తీక్ష్ణములైన కోరలు, గొప్ప విషమూ గల ఆడసర్పమును ఒడిలో ఉంచుకొని తీసికొనివెళ్ళినట్లు, సంతోషించుచు తీసికొని వెళ్ళెను. 6

మూ. వనాని సరితః శైలాన్ సరాంసి చ విహాయసా, 7
స క్షిప్రం సమతీయాయ శరశ్చాపాదివ చ్యుతః.

ప్ర. అ. సః = అతడు, చాపాత్ = ధనస్సునుండి, చ్యుతః = జారిన, శరః ఇవ = బాణము వలె, క్షిప్రమ్ = శీఘ్రముగా, వనాని = వనములను, సరితః = నదులను, శైలాన్ = పర్వతములను, సరాంసి చ = సరస్సులను, విహాయసా = ఆకాశముచేత, సమతీయాయ = దాటెను.

తా. ధనస్సునుండి వెడలిన బాణము వలె అతడు అతివేగముగా వనములను, నదులను, పర్వతములను, సరస్సులను ఆకాశమార్గమున దాటివెళ్లెను. 7

మూ. తిమినక్రనికేతం తు వరుణాలయమక్షయమ్, 8
సరితాం శరణం గత్వా సమతీయాయ సాగరమ్.

ప్ర. అ. తిమినక్రనికేతమ్ = తిములకు, మొసళ్లకు స్థానమైన, అక్షయమ్ = అనంతమైన, సరితాం శరణమ్ = నదులకు శరణమైన, వరుణాలయమ్ = సముద్రమును, గత్వా = చేరి, సాగరమ్ = ఆ సముద్రమును, సమతీయాయ = దాటెను.

తా. తిమింగిలాలకు, మొసళ్లకు నివాసస్థానము, అనంతము, నదు లన్నీ ప్రవేశించే స్థానమూ అయిన సముద్రమును సమీపించి దానిని దాటెను. 8

మూ. సంభ్రమాత్పరివృత్తోర్మి రుద్ధమీనమహోరగః, 9
వైదేహ్యాం హ్రియమాణాయాం బభూవ వరుణాలయః.

ప్ర. అ. వైదేహ్యామ్ = సీత, హ్రియమాణాయామ్ = హరింపబడుచున్నదగుచుండగా, వరుణాలయః = సముద్రము, సంభ్రమాత్ = తొట్రుపాటువలన, పరివృత్తోర్మిః = దొర్లుచున్న తరంగములు కలదిగాను, రుద్ధమీనమహోరగః = నిశ్చలములైన మీనములు, మహాసర్పములు కలదిగాను, బభూవ = అయెను.

తా. వైదేహిని రావణుడు హరించుట చూచి సముద్రము కూడ కంగారుపడెను. దాని తరంగములు అస్తవ్యస్తములుగా దొర్లెను. మీనములు, మహాసర్పములు కదలకుండా పడియుండెను. 9

మూ. అన్తరిక్షగతా వాచః సస్సృజుశ్చారణాస్తదా, 10
ఏతదన్తో దశగ్రీవ ఇతి సిద్ధాస్తదాబ్రువన్.

ప్ర. అ. తదా = అప్పుడు, అన్తరిక్షగతాః = ఆకాశమునందున్న, చారణాః = చరణులు, దశగ్రీవః = రావణుడు, ఏతదన్తః = ఇదే అంతము గలవాడు, ఇతి = అని, వాచః = వాక్కులను, సస్సృజుః = పలికిరి. తదా = అప్పుడు, సిద్ధాః = సిద్ధులుకూడ, అబ్రువన్ = అట్లే పలికిరి.

తా. అప్పుడు చారణులు, సిద్ధులు ఆకాశమునందు చేరి "దీనితో రావణుడు అంతము నొందును'' అని పలికిరి. 10

మూ. స తు సీతాం వివేష్టన్తీమఙ్కేనాదాయ రావణః, 11
ప్రవివేశ పురీం లఙ్కాం రూపిణీం మృత్యుమాత్మనః.

ప్ర. అ. సః రావణః = ఆ రావణుడు, ఆత్మనః = తనయొక్క, రూపిణీమ్ = రూపము గల, మృత్యుమ్ = మృత్యువైన, వివేష్టన్తీమ్ = మెలికలు తిరుగుచున్న, సీతామ్ = సీతను, అఙ్కేన = అంకముచేత, ఆదాయ = గ్రహించి, లఙ్కాం పురీమ్ = లంకాపట్టణమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. ఆ రావణుడు, శరీరము దాల్చిన తన మృత్యువైన, మెలికలు తిరిగిపోవుచున్న ఆ సీతను చంక బెట్టుకొని లంకాపురములో ప్రవేశించెను. 11

మూ. సోఽభిగమ్య పురీం లఙ్కాం సువిభక్తమహాపథామ్, 12
సంరూఢకక్ష్యాబహుళం స్వమన్తఃపురమావిశత్.

ప్ర. అ. సః = ఆతడు, సువిభక్తమహాపథామ్ = చక్కగా వేరుగా ఏర్పరుపబడిన విశాలమార్గములు గల, లఙ్కాం పురీమ్ = లంకాపట్టణమును, అభిగమ్య = చేరి, సంరూఢకక్ష్యాబహులమ్ = జనముతో నిండిన అనేకములైన వాకిళ్ల గల, స్వమ్ అన్తఃపురమ్ = తన అంతఃపురమును, అవిశత్ = ప్రవేశించెను.

తా. రావణుడు విశాలముగా ఏర్పరచిన మార్గములు గల లంకానగరమును ప్రవేశించి, జనులతో నిండిన వాకిళ్ల గల అంతఃపురములో ప్రవేశించెను.

మూ. తత్ర తామసితాపాఙ్గాం శోకమోహపరాయణామ్, 13
నిదధే రావణః సీతాం మయో మాయామివాసురీమ్.

ప్ర. అ. రావణః = రావణుడు, అసితాపాఙ్గామ్ = నల్లని నేత్రాంతములు కలది, శోకమోహపరాయణామ్ = శోకమువలన కలిగిన మోహమునకు వశురాలు అయిన, తాం సీతామ్ = ఆ సీతను, మయః = మయుడు, అసురీమ్ = అసురుల సంబంధమైన, మాయామివ = మాయను వలె, తత్ర = అక్కడ, నిదధే = ఉంచెను.

తా. మయుడు అసురుల మాయను ఒక్క చోట ఉంచినట్లు రావణుడు నల్లని నేత్రాంతములు కల, శోకమువలన కలిగిన మూర్ఛలో ఉన్న, సీతను ఆ అంతఃపురములో ఉంచెను. 13

మూ. అబ్రవీచ్చ దశగ్రీవః పిశాచీర్ఘోరదర్శనాః, 14
యథా నేమాం పుమాన్ స్త్రీ వా సీతాం పశ్యత్యసంమతః.

ప్ర. అ. దశగ్రీవః = రావణుడు, ఘోరదర్శనాః = భయంకరమైన దర్శనము గల, పిశాచీః = పిశాచస్త్రీలను గూర్చి, అబ్రవీచ్చ = పలికెను. అసంమతః = అనుజ్ఞ ఇవ్వబడని, పుమాన్ = పురుషుడు గాని, స్త్రీ వా = స్త్రీ గాని, ఇమామ్ = ఈ, సీతామ్ = సీతను, యథా = ఎట్లు, న పశ్యతి = చూడదో, అట్లు ఉండుడు.

తా. ''నా అనుజ్ఞ లేకుండగా ఎవ్వరైనా పురుషుడు గాని, స్త్రీ గాని ఈ సీతను చూడకుండా రక్షించండి''అని రావణుడు చూచుటకు భయము కలిగించు పిశాచస్త్రీలను ఆదేశించెను. 14

మూ. ముక్తామణిసువర్ణాని వస్త్రాణ్యాభరణాని చ, 15
యద్యదిచ్ఛేత్తదేవాస్యా దేయం మచ్ఛన్దతో యథా.

ప్ర. అ. ముక్తామణిసువర్ణాని = ముత్యములు, మణులు, సువర్ణము, వస్త్రాణి = వస్త్రములు, ఆభరణాని చ = ఆభరణములు, యత్ యత్ = దేనిని దేనిని, ఇచ్ఛేత్ = కోరునో, తదేవ = అది, అస్యాః = ఈమెకు, మచ్ఛన్దతో యథా = నా కోరిక ప్రకారము ఇచ్చి నట్లే, దేయమ్ = ఇవ్వదగినది.

తా. ముత్యము, మణులు, బంగారము, వస్త్రములు, ఆభరణములు ఏవేవి ఈమె అడుగునో వాటి నన్నింటినీ నేను అడిగినపుడు ఇచ్చినట్లు వెంటనే ఇవ్వవలెను. 15

మూ. యా చ వక్ష్యతి వైదేహీం వచనం కించిదప్రియమ్, 16
అజ్ఞానాద్యది వా జ్ఞానాన్న తస్యా జీవితం ప్రియమ్.

ప్ర. అ. యా చ = ఎవ్వతె, అజ్ఞానాత్ = అజ్ఞానమువలన గాని, జ్ఞానాత్ = జ్ఞానమువలనగాని, వైదేహీమ్ = సీతను గూర్చి, కించిత్ = ఏదైన, అప్రియమ్ = అప్రియమైన, వచనమ్ = వచనమును, వక్ష్యతి = పలుకగలదో, తస్యాః = ఆమెకు, జీవితమ్ = జీవితము, అప్రియమ్ = ప్రియము కాదు.

తా. ఏ స్త్రీ యైనా, తెలిసి గాని తెలియక గాని సీతతో అప్రియమైన మాట మాటలాడినచో, ఆ స్త్రీకి తన జీవితమునందు ఇష్టము లేదనియే అర్థము.

మూ. తథోక్త్వా రాక్షసీస్తాస్తు రాక్షసేన్ద్రః ప్రతాపవాన్, 17
నిష్క్రమ్యాన్తః పురాత్తస్మాత్కిం కృత్యమితి చిన్తయన్,
దదర్శాష్టౌ మహావీర్యాన్ రాక్షసాన్ పిశితాశనాన్. 18

ప్ర. అ. ప్రతాపవాన్ = ప్రతాపవంతుడైన, రాక్షసేన్ద్రః = రావణుడు, తాః = ఆ, రాక్షసీః = రాక్షసస్త్రీలను గూర్చి, తథా = అటు, ఉక్త్వా = పలికి,

తస్మాత్ = ఆ, అన్తఃపురాత్ = అంతఃపురమునుండి, నిష్క్రమ్య = బైటకు వెడలి, కిమ్ = ఏమి, కృత్యమ్ = చేయవలసిన పని అని, చిన్తయన్ = ఆలోచించుచు, మహావీర్యాన్ = గొప్ప పరాక్రమము గల, పిశితాశనాన్ = నరమాంసమును భక్షించు, అష్టౌ = ఎనమండుగురు, రాక్షసాన్ = రాక్షసులను, దదర్శ = చూచెను.

తా. ప్రతాపవంతుడైన రావణుడు ఆ స్త్రీలను ఆ విధముగా ఆదేశించి, అంతఃపురమునుండి బైటకు వచ్చి, ఇప్పుడు ఇంక చేయవలసినది ఏమి అని ఆలోచించి, గొప్ప పరాక్రమము గల నరమాంసభక్షకులైన ఎనమండుగురు రాక్షసులతో ఇట్లు పలికెను. 17, 18

మూ. స తాన్ దృష్ట్వా మహావీర్యో వరదానేన మోహితః,
ఉవాచైతానిదం వాక్యం ప్రశస్య బలవీర్యతః. 19

ప్ర. అ. మహావీర్యః = గొప్ప పరాక్రమము గల, వరదానేన = వరదానముచేత, మోహితః = మోహము చెందిన (గర్వితుడైన), సః = రావణుడు, బలవీర్యతః = బలముచేతను, పరాక్రమము చేతను, ప్రశస్య = ప్రశంసించి, ఏతాన్ = వీళ్లను గూర్చి, ఇదమ్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. గొప్ప పరాక్రమము గల రావణుడు బ్రహ్మనుండి వరములను పొంది ఉండుటచే తన నెవ్వరూ ఏమీ చేయజాలరు గదా అను భ్రాంతితో కూడినవాడై, ఆ రాక్షసులను చూచి, వాళ్ల బలమును, పరాక్రమమును కొనియాడుచు ఇట్లు పలికెను. 19

మూ. నానాప్రహరణాః క్షిప్రమితో గచ్ఛత సత్వరాః,
జనస్థానం హతస్థానం భూతపూర్వం ఖరాలయమ్. 20

ప్ర. అ. నానాప్రహరణాః = అనేకవిధములైన ఆయుధములు కలవారై, సత్వరాః = తొందరతో కూడినవారై, ఇతః = ఇక్కడినుండి, క్షిప్రమ్ = శీఘ్రముగా, హతస్థానమ్ = చంపబడినవారికి స్థానమైన, ఖరాలయమ్ = ఖరుని నివాసముగా, భూతపూర్వమ్ = పూర్వమునందున్న, జనస్థానమ్ = జనస్థానమును గూర్చి, గచ్ఛత = వెళండి.

తా. మీరు తొందరగా అనేక విధములైన ఆయుధములు ధరించి, పూర్వము ఖరునకు నివాసస్థానమై ఇప్పుడు శూన్యముగా ఉన్న జనస్థానమునకు వెంటనే వెళ్ళుడు. 20

మూ. తత్రోష్యతాం జనస్థానే శూన్యే నిహతరాక్షసే,
పౌరుషం బలమాశ్రిత్య త్రాసముత్సృజ్య దూరతః. 21

ప్ర. అ. పౌరుషమ్ = పౌరుషమును, బలమ్ = బలమును, ఆశ్రిత్య = ఆశ్రయించి, త్రాసమ్ = భయమును, దూరతః = దూరముగా, ఉత్సృజ్య = విడచి, నిహతరాక్షసే = చంపబడిన రాక్షసులు గల, శూన్యే = శూన్యమైన, తత్ర = ఆ, జనస్థానే = జనస్థానమునందు, ఉష్యతామ్ = నివాసముచేయబడుగాక.

తా. మీరు పౌరుషమును, బలమును చూపుచు, భయమును దూరముగా విడచి, రాక్షసు లందరూ రామునిచేత చంపబడుటచేత శూన్యముగా ఉన్న ఆ జనస్థానములో నివసించవలెను. 21

మూ. బలం హి సుమహద్యన్మే జనస్థానే నివేశితమ్,
సదూషణఖరం యుద్ధే హతం రామేణ సాయకైః. 22

ప్ర. అ. మే = నాయొక్క, సుమహత్ = చాల పెద్దదైన, యత్ = ఏ, బలమ్ = సేన, జనస్థానే = జనస్థానమునందు, నివేశితమ్ = ఉంచబడినదో, సదూషణఖరమ్ = దూషణునితోను ఖరునితోను కూడిన ఆ సైన్యము, రామేణ = రామునిచేత, సాయకైః = బాణములచేత, హతమ్ = చంపబడినది.

తా. నేను జనస్థానములో ఉంచిన మహాసైన్యమును, ఖరదూషణులతో సహా రాముడు యుద్ధములో బాణములచేత సంహరించినాడు. 22

మూ. తతః క్రోధో మమాపూర్వో ధైర్యస్యోపరి వర్ధతే,
వైరం చ సుమహజ్జాతం రామం ప్రతి సుదారుణమ్. 23

ప్ర. అ. తతః = అందువలన, మమ = నాకు, అపూర్వః = పూర్వము నందు లేని, క్రోధః = క్రోధము, ధైర్యస్య = ధైర్యముయొక్క, ఉపరి = పైన, వర్తతే = వృద్ధిపొందుచున్నది. రామం ప్రతి = రాముని గూర్చి, సుమహత్ =

చాల గొప్పదైన, సుదారుణమ్ = చాల భయంకరమైన, వైరం చ = వైరము కూడ, జాతమ్ = ఏర్పడినది.

తా. ఆ కారణముచేత నాకు చిత్తస్థైర్యముచేత అపుకొనుటకు శక్యము కాని, పూర్వమెన్నడూ గలుగని కోపము పెరుగుచున్నది. రామునితో అతిభయంకరమైన గొప్ప వైరము ఏర్పడినది. 23

మూ. నిర్యాతయితుమిచ్ఛామి తచ్చ వైరమహం రిపోః,
న హి లప్స్యామ్యహం నిద్రామహత్వా సంయుగే రిపుమ్.

ప్ర. అ. అహమ్ = నేను, రిపోః = శత్రువుయొక్క, తత్ = ఆ, వైరమ్ = వైరమును, నిర్యాతయితుమ్ = తీర్చుకొనుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను. సంయుగే = యుద్ధమునందు, రిపుమ్ = శత్రువును, అహత్వా = చంపకుండగా, అహమ్ = నేను, నిద్రామ్ = నిద్రను, న లప్స్యామి హి = పొందను కదా.

తా. శత్రువుపై కలిగిన ఆ పగ తీర్చుకొనవలె నని కోరుచున్నాను. యుద్ధములో ఆ శత్రువును చంపనంతవరకు నాకు నిద్ర పట్టదు. 24

మూ. తం త్విదానీమహం హత్వా ఖరదూషణఘాతినమ్,
రామం శర్మోపలప్స్యామి ధనం లబ్ధ్వేవ నిర్ధనః. 25

ప్ర. అ. అహమ్ = నేను, ఇదానీమ్ = ఇప్పుడు, ఖరదూషణఘాతినమ్ = ఖరదూషణులను చంపిన, తమ్ = ఆ, రామమ్ = రాముణ్ణి, హత్వా = చంపి, నిర్ధనః = నిర్ధనుడు, ధనమ్ = ధనమును, లబ్ధ్వా ఇవ = పొందివలె, శర్మ = సుఖమును, ఉపలప్స్యామి = పొందగలను.

తా. ఖరదూషణులను చంపిన ఆ రాముణ్ణి చంపిన పిదపనే నేను ఇప్పుడు, ధనము లేనివాడు ధనము పొంది సంతోషించి నట్లు సంతోషించగలను. 25

మూ. జనస్థానే వసద్భిస్తు భవద్భి రామమాశ్రితా,
ప్రవృత్తిరుపనేతవ్యా కిం కరోతీతి తత్త్వతః. 26

ప్ర. అ. జనస్థానే = జనస్థానమునందు, వసద్భిః = నివసించుచున్న, భవద్భిః = మీచేత, కిం = ఏమి, కరోతి ఇతి = చేయుచున్నాడో, రామమ్ = రాముణ్ణి ఆశ్రితా = ఆశ్రయించిన, ప్రవృత్తిః = వృత్తాంతము, తత్త్వతః = యథార్థముగా, ఉపనేతవ్యా = తీసికొనిరాదగినది.

తా. మీరు జనస్థానములో నివసించుచు, అక్కడ రాముడు ఏమి చేయుచున్నాడో చూచుచు, ఆతనికి సంబంధించిన వృత్తాంతమును యథార్థముగా నాకు తెలుపవలెను. 26

మూ. అప్రమాదాచ్చ గన్తవ్యం సర్వైరపి నిశాచరైః,
కర్తవ్యశ్చ సదా యత్నో రాఘవస్య వధం ప్రతి. 27

ప్ర. అ. నిశాచరైః = రాక్షసులైన, సర్వైరపి = మీ అందరిచేత, అప్రమాదాత్ = ఏమరిపాటు లేకుండా, గన్తవ్యమ్ = వెళ్లదగినది. రాఘవస్య = రాముని యొక్క, వధం ప్రతి = వధను గూర్చి, సదా = ఎల్లప్పుడూ, యత్నః = ప్రయత్నము, కర్తవ్యశ్చ = చేయదగినది.

తా. మీరందరు చాల జాగరూకతతో అక్కడికి వెళ్ళి రాముని చంపుటకై అన్ని వేళలా నిరంతరప్రయత్నము చేయవలెను. 27

మూ. యుష్మాకం చ బలజ్ఞోఽహం బహుశో రణమూర్ధని,
అతశ్చాస్మిన్ జనస్థానే మయా యూయం నియోజితాః. 28

ప్ర. అ. అహమ్ = నేను, రణమూర్ధని = రణాగ్రమునందు, బహుశః = అనేకపర్యాయములు, యుష్మాకమ్ = మీయొక్క, బలజ్ఞః = బలమును ఎరిగినవాడను. అతశ్చ = ఆ కారణమువలననే, యూయమ్ = మీరు, అస్మిన్ = ఈ, జనస్థానే = జనస్థానమునందు, మయా = నాచేత, నియోజితాః = నియమించబడినారు.

తా. నేను అనేకపర్యాయములు రణరంగములో మీరు చూపిన పరాక్రమమును చూచి ఉన్నాను. అందుచేతనే మిమ్ములను జనస్థానానికి పంపుచున్నాను.

మూ. తతః ప్రియం వాక్యముపేత్య రాక్షసా
మహార్థమష్టావభివాద్య రావణమ్,
విహాయ లజ్కాం సహితాః ప్రతస్థిరే
యతో జనస్థానమలక్ష్యదర్శనాః. 29

ప్ర. అ. తతః = అటుపిమ్మట, అష్టౌ = ఎనమండుగురు, రాక్షసాః = రాక్షసులు, ప్రియమ్ = ప్రియము, మహార్థమ్ = గొప్ప అర్థము గలదీ అయిన, వాక్యమ్ = వాక్యమును, ఉపేత్య = పొంది, రావణమ్ = రావణుని, అభివాద్య = నమస్కరించి, లజ్కామ్ = లంకను, విహాయ = విడచి, సహితాః = కలిసినవారై, అలక్ష్యదర్శనాః = కనబడని దర్శనము గలవారై, జనస్థానమ్ = జనస్థానము, యతః = ఎటువైపున ఉన్నదో అటువైపు, ప్రతస్థిరే = ప్రయాణమైరి.

తా. పిమ్మట ఆ ఎనమండుగురు రాక్షసులు, ప్రియము, మంచి అర్థము కలదీ అయిన రావణుని మాట విని, రావణునకు నమస్కరించి, లంకను విడచి, అందరూ కలిసి, మాయచే ఇతరు లెవ్వరికీ కనబడనివారై, జనస్థానము వైపు వెళ్ళిరి. 29

మూ. తతస్తు సీతాముపలభ్య రావణః
సుసంప్రహృష్టః పరిగృహ్య మైథిలీమ్,
ప్రసజ్య రామేణ చ వైరముత్తమం
బభూవ మోహాన్ముదితః సరాక్షసః. 30

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
చతుఃపఞ్చాశః సర్గః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రాక్షసః = రాక్షసుడైన, సః రావణః = ఆ రావణుడు, సీతామ్ = సీతను, ఉపలభ్య = పొంది, మైథిలీమ్ = సీతను, పరిగృహ్య = గ్రహించి, సుసంప్రహృష్టః = చాలా సంతోషించినవాడై, రామేణ = రామునితో, ఉత్తమమ్ = అధికమైన, వైరమ్ = వైరమును, ప్రసజ్య = ఏర్పరచుకొని, మోహాత్ = అజ్ఞానమువలన, ముదితః = సంతోషించినవాడు, బభూవ = అయెను.

తా. రావణుడు ఈ విధముగ సీతను పొంది, ఆమెను 'పొందితిని కదా' అని చాల సంతోషించుచు, రామునితో గొప్ప వైరము పెట్టుకొని కూడ అజ్ఞానము చేత ఆనందించుచుండెను. 30

''బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
అరణ్యకాండలో ఏబదియైదవ సర్గ సమాప్తము.

అథ షట్పఞ్చాశః సర్గః

[రావణుడు సీతకు తన అంతఃపురమునంతా చూపి "నాకు భార్యవగుము" అని కోరుట].

మూ. సందిశ్య రాక్షసాన్ ఘోరాన్ రావణోఽష్టౌ మహాబలాన్,
ఆత్మానం బుద్ధివైక్లబ్యాత్ కృతకృత్యమమన్యత. 1

ప్ర. అ. రావణః = రావణుడు, మహాబలాన్ = గొప్ప బలము గల, అష్టౌ = ఎనమండుగురు, రాక్షసాన్ = రాక్షసులను, సందిశ్య = ఆదేశించి, బుద్ధివైక్లబ్యాత్ = బుద్ధిహీనత్వమువలన, ఆత్మానమ్ = తనను, కృతకృత్యమ్ = చేయవలసిన పను లన్నీ పూర్తిచేసుకొన్నవానినిగా, అమన్యత = తలచెను.

తా. రావణుడు గొప్ప బలము గల, భయంకరులైన ఎనమండుగురు రాక్షసులను ఇట్లు ఆదేశించి, బుద్ధివిహీను డగుటచే "కృతకృత్యుడను అయినాను" అని భావించెను. 1

మూ. స చిన్తయానో వైదేహీం కామబాణైః ప్రపీడితః,
ప్రవివేశ గృహం రమ్యం సీతాం ద్రష్టుమభిత్వరన్. 2

ప్ర. అ. సః = అతడు, వైదేహీమ్ = సీతను గూర్చి, చిన్తయానః = ఆలోచించుచు, కామబాణైః = మన్మథబాణములచేత, ప్రపీడితః = పీడింపబడిన వాడై, సీతామ్ = సీతను, ద్రష్టుమ్ = చూచుటకు, అభిత్వరన్ = తొందరపడుచు, రమ్యమ్ = సుందరమైన, గృహమ్ = గృహమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. ఆ రావణుడు సీతను గూర్చి ఆలోచించుచు, మన్మథబాణములచేత పీడింపబడినవాడై, ఆమెను చూచుటకు తొందరపడుచు, సుందరమైన అంతఃపురములో ప్రవేశించెను. 2

మూ. స ప్రవిశ్య తు తద్వేశ్మ రావణో రాక్షసాధిపః,
అపశ్యద్రాక్షసీమధ్యే సీతాం శోకపరాయణామ్. 3

ప్ర. అ. రాక్షసాధిపః = రాక్షసరాజైన, సః రావణః = ఆ రావణుడు, తత్ = ఆ, వేశ్మ = గృహమును, ప్రవిశ్య = ప్రవేశించి, రాక్షసీమధ్యే = రాక్షసస్త్రీల మధ్యయందు, శోకపరాయణామ్ = దుఃఖమునకు అధీనురాలైన, సీతామ్ = సీతను, అపశ్యత్ = చూచెను.

తా. రాక్షసరాజైన ఆ రావణుడు గృహములో ప్రవేశించి, శోకముతో నిండి యున్న సీతను రాక్షసస్త్రీల మధ్య చూచెను. 3

మూ. అశ్రుపూర్ణముఖీం దీనాం శోకభారాభిపీడితామ్,
వాయువేగై రివాక్రాన్తాం మజ్జన్తీం నావమర్ణవే. 4

మృగయూథపరిభ్రష్టాం మృగీం శ్వభిరివావృతామ్,
అధోముఖముఖీం సీతామభ్యేత్య చ నిశాచరః. 5

తాం తు శోకపరాం దీనామవశాం రాక్షసాధిపః,
స బలాద్దర్శయామాస గృహం దేవగృహోపమమ్. 6

ప్ర. అ. అశ్రుపూర్ణముఖీమ్ = కన్నీళ్లతో నిండిన ముఖము గలది, దీనామ్ = దీనురాలు, శోకభారాభిపీడితామ్ = దుఃఖభారముచేత పీడింపబడినది, వాయువేగైః = వాయువుయొక్క వేగములచేత, సమాక్రాన్తామ్ = ఆక్రమింప బడినదై, అర్ణవే = సముద్రమునందు, మజ్జన్తీమ్ = మునిగిపోవుచున్న, నావమివ = ఓడ వలె ఉన్నది, మృగయూథపరిభ్రష్టామ్ = లేళ్ల గుంపునుండి తప్పిపోయినదై, శ్వభిః = కుక్కలచేత, ఆవృతామ్ = చుట్టబడిన, మృగీమివ = ఆడలేడి వలె ఉన్నది, అధోముఖముఖీమ్ = క్రిందికి వంచబడిన ముఖము గలది అయిన, సీతామ్ = సీతను, నిశాచరః = ఆ రాక్షసుడు, అభ్యేత్య = సమీపించి, శోకపరామ్ = శోకమునకు అధీనురాలు, దీనామ్ = దీనురాలు, అవశామ్ = తన వశములో లేనిది అయిన, తామ్ = ఆమెను (కు), సః రాక్షసాధిపః = ఆ రావణుడు, బలాత్ = బలాత్కారమువలన, దేవగృహోపమమ్ = దేవతాగృహముతో సమానమైన, గృహమ్ = గృహమును, దర్శయామాస = చూపించెను.

తా. దుఃఖభారముచేత క్రుంగిపోతూన్న దీనురాలైన ఆ సీత ముఖము కన్నీళ్లతో నిండి యుండెను. వాయువేగమునకు ఇటు అటు కొట్టుకొని సముద్రములో మునిగిపోతూన్న ఓడ వలె ఉండెను. లేళ్ల గుంపునుండి విడిపోగా, కుక్కలు చుట్టుముట్టిన ఆడలేడి వలె ఉండెను. తల క్రిందికి వంచి కూర్చుండెను. ఈ విధముగా దీనురాలై, దుఃఖముతో నిండి తన వశము తప్పి ఉన్న ఆ సీతను సమీపించి రాక్షసుడైన ఆ రావణుడు ఆమెను బలాత్కారముగా తీసికొనివెళ్ళి, దేవతల గృహముతో సమానమైన తన గృహమును ఆమెకు చూపించెను. 4, 5, 6

మూ. హర్మ్యప్రాసాదసంబాధం స్త్రీసహస్రనిషేవితమ్,
నానాపక్షిగణైర్జుష్టం నానారత్నసమన్వితమ్, 7

దాన్తకైస్తాపనీయైశ్చ స్ఫాటికై రాజతైరపి,
వజ్రవైడూర్యచిత్రైశ్చ స్తమ్భైర్దృష్టిమనోహరైః, 8
దివ్యదున్దుభినిర్హ్రాదం తప్తకాఞ్చనతోరణమ్.

ప్ర. అ. హర్మ్యప్రాసాదసంబాధమ్ = మేడలతోను ప్రాసాదములతోను ఇరుకుగా ఉన్నది, స్త్రీసహస్రనిషేవితమ్ = స్త్రీల సహస్రములచేత సేవింపబడినది, నానాపక్షిగణైః = అనేకవిధములైన పక్షుల సముదాయములచేత, జుష్టమ్ = పొందబడినది, నానారత్నసమన్వితమ్ = అనేకవిధములైన రత్నములతో కూడినది, దాన్తకైః = దంతసంబంధమైనవి, తాపనీయైః చ = సువర్ణమయములు, స్ఫాటికైః = స్ఫటికమాణిక్య వికారములు, రాజతైరపి=రజతవికారములు, వజ్రవైడూర్యచిత్రైః = వజ్రములచేతను, వైడూర్యములచేతను చిత్రవర్ణములైన, దృష్టిమనోహరైః = చూచుటకు మనోహరములుగా ఉన్న, స్తమ్భైః = స్తంభములతో కూడినది, దివ్యదున్దుభినిర్హ్రాదమ్ = శ్రేష్ఠములైన దుందుభుల ధ్వని గలది, తప్తకాఞ్చనతోరణమ్ = శుద్ధమైన బంగారముతో నిర్మించిన ముఖద్వారములు కలది అయిన (గృహమును చూపించెను).

తా. ఆతని గృహము (అంతఃపురము) మేడలతోను, ప్రాసాదములతోను కిక్కిరిసి ఉండెను. అక్కడ వేలకొలది స్త్రీలు నివసించుచుండిరి. అనేకవిధములైన పక్షులు అక్కడ ఉండెను. అది అనేకవిధములైన రత్నములతో నిండి యుండెను. చూచుటకు అందముగా ఉన్న ఆ గృహ సంభములు బంగారము

తోను, వెండితోను నిర్మింపబడెను. వాటిపై దంతముతో నగిషీలు చెక్కి స్ఫటిక
ములు, వజ్రములు, వైడూర్యములు మాటుటచే అవి చిత్రవిచిత్రములుగా ఉండెను.
బంగారు ముఖద్వారములు గల ఆ గృహము దివ్యములైన దుందుభుల ధ్వను
లతో మారుమ్రోగుచుండెను. 7, 8

మూ. సోపానం కాఞ్చనం చిత్రమారురోహ తయా సహ, 9
దాన్తకా రాజతాశ్చైవ గవాక్షాః ప్రియదర్శనాః,
హేమజాలావృతాశ్చాసన్ తత్ర ప్రాసాదపఙ్క్తయః. 10

ప్ర. అ. కాఞ్చనమ్ = బంగారువికారమైన, చిత్రమ్ = ఆశ్చర్యకరమైన,
సోపానమ్ = మెట్లమార్గమును, తయా సహ = ఆమెతో కూడ, ఆరురోహ =
ఎక్కెను. తత్ర = అక్కడ, దాన్తకాః = దంతవికారములు, రాజతాశ్చ=రజత
వికారములు, ప్రియదర్శనాః=ఆనందమును కలిగించు దర్శనము కలవి అయిన,
గవాక్షాః = కిటికీలు, హేమజాలావృతాః=బంగారు వలచేత కప్పబడిన, ప్రాసాద
పఙ్క్తయః = ప్రాసాదముల పంక్తులు, ఆసన్ = ఉండెను.

తా. ఆతడు ఆమెతో కూడ కలిసి, బంగారు వికారమైన ఆశ్చర్యజనక
మైన సోపానమార్గమును ఎక్కెను. అక్కడ దంతముతోను, వెండితోను
నిర్మించిన కిటికీలు చూచుటకు ముచ్చట గొలిపేవిగా ఉండెను. బంగారు వల
కప్పి అలంకరింపబడిన ప్రాసాదముల పంక్తులు కనబడుచుండెను. 9, 10

మూ. సుధామణివిచిత్రాణి భూమిభాగాని సర్వశః,
దశగ్రీవః స్వభవనే ప్రాదర్శయత మైథిలీమ్. 11

ప్ర. అ. దశగ్రీవః = రావణుడు, స్వభవనే = తన గృహమునందు,
సర్వశః = అన్నివైపులందు, సుదామణివిచిత్రాణి = సున్నముచేతను, మణుల
చేతను విచిత్రములుగా ఉన్న, భూమిభాగాని = అంతస్తులను, మైథిలీమ్=సీతను,
(కు), ప్రాదర్శయత = చూపెను.

తా. రావణుడు సీతకు తన అంతఃపురభవనములో ఉన్న అన్ని అంత
స్తులను చూపించెను. ఆ అంతస్తు లన్నీ సున్నము వేసి మణులు అలంకరించుటచే
ఆశ్చర్యకరములుగా ఉండెను. 11

మూ. దీర్ఘికాః పుష్కరిణ్యశ్చ నానావృక్షసమన్వితాః,
రావణో దర్శయామాస సీతాం శోకపరాయణామ్. 12

ప్ర. అ. రావణః = రావణుడు, దీర్ఘికాః = దిగుడుబావులను, నానావృక్ష సమన్వితాః = అనేకవిధములైన వృక్షములతో కూడిన, పుష్కరిణ్యశ్చ = సరస్సులను, శోకపరాయణామ్ = శోకమునకు అధీనురాలైన, సీతామ్ = సీతను (కు), దర్శయామాస = చూపించెను.

తా. రావణుడు దుఃఖాక్రాంతురాలైన సీతకు దిగుడుబావులను, చుట్టూ చెట్లు ఉన్న చెరువులను చూపించెను. 12

మూ. దర్శయిత్వా తు వైదేహ్యాః కృత్స్నం తద్భవనోత్తమమ్,
ఉవాచ వాక్యం పాపాత్మా సీతాం లోభితుమిచ్ఛయా. 13

ప్ర. అ. పాపాత్మా = పాపాత్ముడైన రావణుడు, కృత్స్నమ్ = సమస్తమైన, తత్ = ఆ, భవనోత్తమమ్ = శ్రేష్ఠమైన గృహమును, వైదేహ్యాః = సీతకు, దర్శయిత్వా = చూపించి, సీతామ్ = సీతను, ఇచ్ఛయా = కోరికచేత, లోభితుమ్ = లోభపెట్టుటకు, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. పాపాత్ముడైన ఆ రావణుడు శ్రేష్ఠమైన ఆ భవనమునంతా సీతకు చూపి, ఆమెకు కోరిక పుట్టించవలె నను అభిప్రాయముతో ఇట్లు పలికెను. 13

మూ. దశ రాక్షసకోట్యశ్చ ద్వావింశతిరథాపరాః,
తేషాం ప్రభురహం సీతే సర్వేషాం భీమకర్మణామ్, 14
వర్జయిత్వా జరావృద్ధాన్ బాలాంశ్చ రజనీచరాన్.

ప్ర. అ. సీతే = సీతా, జరావృద్ధాన్ = ముసలితనముచేత వృద్ధులు, బాలాంశ్చ = బాలులు అయిన, రజనీచరాన్ = రాక్షసులను, వర్జయిత్వా=విడిచి, దశ = పది, రాక్షసకోట్యశ్చ = రాక్షసుల కోటులు, అథ = మరియు, అపరాః= ఇంకను, ద్వావింశతిః = ఇరువదిరెండు కోట్లు ఉన్నవి. భీమకర్మణామ్ = భయంకరమైన కర్మగల, తేషామ్ = వారికి, సర్వేషామ్ = అందరికీ, అహమ్ = నేను, ప్రభుః = ప్రభువును.

తా. సీతా! ముసలివాళ్లు, బాలులు అయిన రాక్షసులు కాక మొత్తము ముప్పదిరెండు కోట్లమంది రాక్షసు లున్నారు. భయంకరములైన పనులు చేయు వారి కందరికీ నేను ప్రభువును. 14

మూ. సహస్రమేకమేకస్య మమ కార్యపురఃసరమ్, 15
యదిదం రాజతన్త్రం మే త్వయి సర్వం ప్రతిష్ఠితమ్,
జీవితం చ విశాలాక్షి త్వం మే ప్రాణైర్గరీయసీ. 16

ప్ర. అ. ఏకస్య = ఒక్క, మమ = నాకు, ఏకమ్ = ఒక, సహస్రమ్ = సహస్రము, కార్యపురఃసరమ్ = కార్యములందు ముందునకు వచ్చునది. యత్ = ఏ, ఇదమ్ = ఈ, రాజ్యతన్త్రమ్ = రాజ్యవ్యవహారమున్నదో, సర్వమ్ = అది అంతా, జీవితం చ = జీవితమూ త్వయి = నీయందు, ప్రతిష్ఠితమ్ = నిలచి ఉన్నది. విశాలాక్షి = విశాలములైన నేత్రములు గలదానా! త్వమ్ = నీవు, మే = నాయొక్క, ప్రాణైః = ప్రాణములచేత, గరీయసీ = గొప్పదానవు.

తా. నాకు ఏ చిన్న పని పడినను వెయ్యిమంది ముందుకు వచ్చుచుందురు. ఓ! విశాలనేత్రములు గల సీతా! సమస్తమైన ఈ రాజ్యసంవిధానము, నా జీవితమూ కూడ నీమీద ఆధారపడి యున్నవి. నీవు నా ప్రాణములకంటె కూడ గొప్పదానవు. 15, 16

మూ. బహ్వీనాముత్తమస్త్రీణాం మమ యోఽసౌ పరిగ్రహః,
తాసాం త్వమీశ్వరా సీతే మమ భార్యా భవ ప్రియే. 17

ప్ర. అ. సీతే = సీతా! బహ్వీనామ్ = అనేకులైన, ఉత్తమస్త్రీణామ్ = ఉత్తమస్త్రీలయొక్క, యః = ఏ, అసౌ = ఈ, పరిగ్రహః = సంపాదనము కలదో, తాసామ్ = వాళ్లకు, త్వమ్ = నీవు, ఈశ్వరీ = ప్రభువుగా, భవ = అగుము. ప్రియే = ప్రియురాలా! మమ = నాయొక్క, భార్యా = భార్యవు, భవ = అగుము.

తా. సీతా! నేను సంపాదించుకొని వచ్చిన బహుసంఖ్యలో ఉన్న ఉత్తమ స్త్రీలకు నీవు ప్రభువుగా ఉండుము. ప్రియురాలా! నా భార్యవు అగుము. 17

మూ. సాధు కిం తేఽన్యయా బుద్ధ్యా రోచయస్వ వచో మమ,
కామాభితప్తస్య మమ ప్రసాదం కరుమర్హసి. 18

ప్ర. అ. తే = నీకు, అన్యయా = మరి యొక, బుద్ధ్యా = ఆలోచనచేత, కిమ్ = ఏమి ప్రయోజనము ? సాధు = మంచిదైన, మమ వచః = నా వచనమును; రోచయస్వ = ఇష్టమైనదానినిగా చేసికొనుము. కామాభితప్తస్య = కామముచేత తపింపచేయబడిన, మమ = నాయొక్క. ప్రసాదమ్ = అనుగ్రహమును, కర్తుమ్= చేయుటకు, అర్హసి = తగియున్నావు.

తా. నీవు మరొక ఆలోచన ఎందుకు చేసెదవు ? నేను చెప్పిన మంచి మాటను అంగీకరించుము. కామముచేత తప్తుడనైన నన్ను అనుగ్రహించుము.18

మూ. పరిక్షిప్తా సముద్రేణ లఙ్కేయం శతయోజనా,
నేయం ధర్షయితుం శక్యా సేన్ద్రైరపి సురాసురైః. 19

ప్ర. అ. శతయోజనా = నూరు యోజనముల ప్రమాణము గల, ఇయమ్ = ఈ, లఙ్కా = లంక, సముద్రేణ = సముద్రముచేత, పరిక్షిప్తా=చుట్టబడినది. సేన్ద్రైః = ఇంద్రునితో కూడిన, సురాసురైరపి=సురులచేత అసురులచేత కూడ, ఇయమ్ = ఈ లంక, ధర్షయితుమ్ = ఎదిరించుటకు, న శక్యా = శక్యమైనది కాదు.

తా. నూరు యోజనముల ప్రమాణము గల ఈ లంక చుట్టూ సముద్రమున్నది. అందుచేత సురాసురులు దేవేంద్రునితో కలసి దండెత్తివచ్చినా దీనిని జయించజాలరు. 19

మూ. న దేవేషు న యక్షేషు న గన్ధర్వేషు పక్షిషు,
అహం పశ్యామి లోకేషు యో మే వీర్యసమో భవేత్.20

ప్ర. అ. లోకేషు = లోకములలో, యః = ఎవడు, మే=నాకు వీర్యసమః = పరాక్రమముచేత సమానుడు, భవేత్ = అగునో, అట్టివానిని, అహమ్= నేను, దేవేషు = దేవతలలో, న పశ్యామి = చూడను. యక్షేషు = యక్షులలో, న = చూడను. గన్ధర్వేషు = గంధర్వులలో, న = చూడను. పక్షిషు = పక్షులలో, న = చూడను.

తా. మూడు లోకములలోను దేవతలలో కాని యక్షులలో కాని గంధ

ర్వులలో గాని, పక్షులలో గాని పరాక్రమముచేత నాతో సమానుడు ఎవ్వడూ లేడు. 20

మూ. రాజ్యభ్రష్టేన దీనేన తాపసేన గతాయుషా,
కిం కరిష్యసి రామేణ మానుషేణాల్పతేజసా. 21

ప్ర. అ. రాజ్యభ్రష్టేన = రాజ్యమునుండి భ్రష్టుడు, దీనేన = దీనుడు, తాపసేన = మునివృత్తిలో ఉన్నవాడు, గతాయుషా = గడచిన ఆయుర్దాయము గలవాడు, మానుషేణ = మానవుడు, అల్పతేజసా = అల్పమైన తేజస్సు కలవాడు అయిన, రామేణ = రామునితో, కిం కరిష్యసి = ఏమి చేయగలవు ?

తా. రాముడు రాజ్యభ్రష్టుడు, దీనుడు. మునివృత్తిలో ఉన్నవాడు. మానవ మాత్రుడు. అల్పమైన తేజస్సు కలవాడు. అతని ఆయుస్సు తీరిపోయినది. అట్టి రామునితో ఏమి చేసెదవు ? 21

మూ. భజస్వ సీతే మామేవ భర్తాహం సదృశస్తవ,
యౌవనం హ్యధ్రువం భీరు రమస్వేహ మయా సహ.

ప్ర. అ సీతే = సీతా ! మామేవ = నన్నే, భజస్వ = పొందుము. అహమ్ = నేను, తవ = నీకు, సదృశః = తగిన, భర్తా = భర్తను. భీరు = భయస్వభావము కలదానా। యౌవనమ్ = యౌవనము, అధ్రువం హి = అస్థిరము కదా. ఇహ = ఇక్కడ, మయా సహ = నాతో కూడ, రమస్వ = క్రీడించుము.

తా. ఓ! సీతా। నన్ను చేరుము. నేనే నీకు తగిన భర్తను. ఓ! భయస్వభావము కలదానా। యౌవనము స్థిరముగా ఉండేది కాదు కదా? ఇక్కడ నాతో కూడ రమించుము. 22

మూ. దర్శనే మా కృథా బుద్ధిం రాఘవస్య వరాననే,
కాస్య శక్తిరిహాగన్తుమపి సీతే మనోరథైః. 23

ప్ర. అ. వరాననే = శ్రేష్ఠమైన ముఖము కలదానా। రాఘవస్య = రాముని యొక్క, దర్శనే = దర్శనమునందు, బుద్ధిమ్ = బుద్ధిని? మా కృథాః = చేయకుము.

సీతే = సీతా ! అస్య = ఈతనికి, మనోరథైరపి = మనోరథములంచేత కూడ, ఇహ = ఇక్కడికి, ఆగన్తుమ్ = వచ్చుటకు, శక్తిః = శక్తి, కా = ఏమిటి ?

తా. సుందరమైన ముఖము గలదానా ! రాముడు నీకు కనబడగలడని కూడ ఆశ పడకుము. ఓ! సీతా ! ఆతడు ఇక్కడికి ఊహచేత కూడ రాజాలడు..

మూ. న శక్యో వాయురాకాశే పాశైర్బన్ధుం మహాజవః,
దీప్యమానస్య వాప్యగ్నేర్గ్రహీతుం విమలాం శిఖామ్. 24

ప్ర. అ. మహాజవః = గొప్ప వేగము గల, వాయుః = వాయువు, ఆకాశే = ఆకాశమునందు, పాశైః = పాశములంచేత, బన్ధుమ్ = బంధించుటకు, న శక్యః = శక్యమైనది కాదు. దీప్యమానస్య = ప్రజ్వలించుచున్న, అగ్నేః = అగ్నియొక్క, విమలామ్ = నిర్మలమైన, శిఖామ్ = జ్వాలను, గ్రహీతుమ్ = గ్రహించుటకు (శక్యము కాదు).

తా. మహావేగము గల వాయువును ఆకాశమునందు బంధించుట శక్యము కాదు. అగ్ని ప్రజ్వలించుచుండగా దాని నిర్మలమైన జ్వాలను పట్టుకొనుట కూడ శక్యము కాదు.

మూ. త్రయాణామపి లోకానాం న తం పశ్యామి శోభనే,
విక్రమేణ నయేద్యస్త్వాం మద్బాహుపరిపాలితామ్. 25

ప్ర. అ. శోభనే = మంగళప్రదురాలా ! త్రయాణామ్ = మూడు, లోకానామపి = లోకములలోకూడ, యః = ఎవడు, మద్బాహుపరిపాలితామ్ = నా బాహువులంచేత పాలింపబడిన, త్వామ్ = నిన్ను, విక్రమేణ = పరాక్రమముచేత, నయేత్ = తీసికొని వెళ్లునో, తమ్ = అట్టివానిని, న పశ్యామి = చూడను.

తా. మంగళకరురాలా ! నా రక్షణలో ఉన్న నిన్ను తీసికొని వెళ్ళగలిగినవా డెవ్వడూ, ఈ మూడు లోకములలో కూడ లేడు. 25

మూ. లఙ్కాయాం సుమహద్రాజ్యమిదం త్వమనుపాలయ,
త్వత్ప్రేష్యా మద్విధాశ్చైవ దేవాశ్చాపి చరాచరాః. 26

ప్ర. అ. త్వమ్ = నీవు, లఙ్కాయామ్ = లంకయందు, సుమహత్ =

చాల పెద్దదైన, ఇదమ్ = ఈ, రాజ్యమ్ = రాజ్యమును, అనుపాలయ = అంగీకరించుము. మద్విధాః = నావంటివారు, దేవాశ్చాపి = దేవతలు, చరాచరాః = స్థావరజంగమములు, త్వత్ప్రేష్యాః = నీకు కింకరులు అగుదురు.

తా. నీవు లంకలో చాల గొప్పదైన రాజ్యమును స్వీకరించినట్లయితే, నావంటివాళ్లు, దేవతలు, స్థావరములు, జంగమములు కూడ నీకు కింకరు లగుదురు. 26

మూ. అభిషేకోదకక్లిన్నా తుష్టా చ రమయస్వ మామ్,
దుష్కృతం యత్ పురా కర్మ వనవాసేన తద్గతమ్, 27
యశ్చ తే సుకృతో ధర్మస్తస్యేహ ఫలమాప్నుహి.

ప్ర. అ. అభిషేకోదకక్లిన్నా = రాజ్యాభిషేకజలముచేత తడిసినదానవై, తుష్టా చ=సంతోషించినదానవై, మామ్=నన్ను, రమయస్వ=రమింపచేయుము. పురా = పూర్వమునందలి, యత్ = ఏ, దుష్కృతమ్ = చెడ్డదైన, కర్మ = కర్మ ఉండెనో, తత్ = అది, వనవాసేన = వనవాసముచేత, గతమ్=పోయినది. తే= నీయొక్క, యః=ఏ, సుకృతః=బాగుగా చేయబడిన, ధర్మః=ధర్మము గలదో, తస్య= దానియొక్క, ఫలమ్= ఫలమును, ఇహ= ఇక్కడ, ఆప్నుహి = పొందుము.

తా. రాజ్యాభిషేకము చేయించుకొన్న ఉదకముచేత తడిసినదానవై, ఆనందించుచు నన్ను ఆనందింపచేయుము. నీవు పూర్వము చేసిన పాపమంతా వనవాసదుఃఖమును అనుభవించుటచేత తొలగిపోయినది. ఇంక చేసిన పుణ్యమునకు ఫలితమును అనుభవించుము. 27

మూ. ఇహ మాల్యాని సర్వాణి దివ్యగన్ధాని మైథిలి, 28
భూషణాని చ ముఖ్యాని సేవస్వ చ మయా సహ.

ప్ర. అ. మైథిలి = సీతా ! ఇహ = ఇక్కడ, దివ్యగన్ధాని = దివ్యమైన సువాసన గల, సర్వాణి = సమస్తమైన, మాల్యాని = మాలలను, ముఖ్యాని = ముఖ్యములైన, భూషణాని చ = అలంకారములను, మయా సహ = నాతో కూడ, సేవస్వ = సేవించుము.

తా. సీతా ! నీవు ఇక్కడ నాతో కలిసి, దివ్యమైన సువాసన గల అన్ని పుష్పమాలలను, శ్రేష్ఠములైన అలంకారములను ధరించి ఆనందించుము. 28

మూ. పుష్పకం నామ సుశ్రోణి భ్రాతుర్వైశ్రవణస్య మే, 29
విమానం సూర్యసంకాశం తరసా నిర్జితం మయా.

ప్ర. అ. సుశ్రోణి = అందమైన కటిప్రదేశము గలదానా ! మే = నా యొక్క, భ్రాతుః = సోదరుడైన, వైశ్రవణస్య = కుబేరునియొక్క, పుష్పకం నామ = పుష్పక మనే పేరు గల, సూర్యసంకాశమ్ = సూర్యునితో సమానమైన, విమానమ్ = విమానము, తరసా = బలముచేత, మయా = నాచేత, నిర్జితమ్ = జయింపబడినది.

తా. అందమైన కటిప్రదేశము గల ఓ ! సీతా ! నా సోదరుడైన కుబేరునికి చెందిన సూర్యుని వంటి కాంతి గల పుష్పక మనే విమానమును నేను పరాక్రమముచేత జయించితిని. 29

మూ. విశాలం రమణీయం చ తద్విమానమనుత్తమమ్, 30
తత్ర సీతే మయా సార్ధం విహరస్వ యథాసుఖమ్.

ప్ర. అ. సీతే = సీతా ! అనుత్తమమ్ = శ్రేష్ఠమైన, తత్ = ఆ, విమానమ్ = విమానము, విశాలమ్ = విశాలమైనది. రమణీయం చ = అందమైనది. తత్ర = దానియందు, మయా సార్ధమ్ = నాతో కూడ, యథాసుఖమ్ = సుఖముగా, విహరస్వ = విహరించుము.

తా. సీతా ! చాల శ్రేష్ఠమైన ఆ విమానము విశాలమైనది; సుందరమైనది. నీవు నాతో కలిసి సుఖముగా దానియందు విహరించుము. 30

మూ. వదనం పద్మసంకాశమమలం చారుదర్శనమ్,
శోకార్తం తు వరారోహే న భ్రాజతి వరాననే. 31

ప్ర. అ. వరారోహే = శ్రేష్ఠమైన కటిప్రదేశము కలదానా ! వరాననే = సుందరమైన ముఖము కలదానా ! పద్మసంకాశమ్ = పద్మముతో సమానము, అమలమ్ = నిర్మలము, చారుదర్శనమ్ = అందమైన దర్శనము గలది అయిన,

వదనమ్ = నీ ముఖము, శోకార్తమ్ = దుఃఖముచేత పీడితమై, న భ్రాజతి = ప్రకాశించుటలేదు.

తా. శ్రేష్ఠమైన కటిప్రదేశము, అందమైన ముఖము గల ఓ! సీతా! పద్మముతో సమానము, నిర్మలము, చూడ ముచ్చట గొల్పునది అయిన నీ ముఖము దుఃఖముచేత పీడింపబడుటచే ప్రకాశహీనముగా ఉన్నది. 39

మూ. ఏవం వదతి తస్మిన్ సా వస్త్రాన్తేన వరాఙ్గనా,
పిధాయేన్దునిభం సీతా ముఖమశ్రూణ్యవర్తయత్. 32

ప్ర. అ. తస్మిన్ = అతడు, ఏవమ్ = ఇట్లు, వదతి = పలుకుచుండగా, వరాఙ్గనా = ఉత్తమ స్త్రీ అయిన, సా సీతా = ఆ సీత, ఇన్దునిభమ్ = చంద్రునితో సమానమైన, ముఖమ్ = ముఖమును, వస్త్రాన్తేన = వస్త్రాంతముచేత, పిధాయ = కప్పి, అశ్రూణి = కన్నీళ్లను, అవర్తయత్ = ప్రవర్తింపచేసెను.

తా. ఆ రావణుని మాటలు విని, స్త్రీలలో శ్రేష్ఠురాలైన ఆ సీత, చంద్రుని వంటి ముఖము చీరకొంగుతో కప్పుకొని కన్నీళ్లు కార్చెను. 32

మూ. ధ్యాయన్తీం తామివాస్వస్థాం దీనాం చిన్తాహతప్రభామ్,
ఉవాచ వచనం పాపో రావణో రాక్షసేశ్వరః.

ప్ర. అ. పాపః = పాపాత్ముడైన, రాక్షసేశ్వరః = రాక్షసరాజైన, రావణః = రావణుడు, ధ్యాయన్తీమివ = ధ్యానముచేయుచున్నది వలె ఉన్నదీ, అస్వస్థామ్ = అస్వస్థురాలు, దీనామ్ = దీనురాలు, చిన్తాహతప్రభామ్ = విచారముచేత కొట్టబడిన కాంతి గలది అయిన, తామ్ = ఆ సీతను గూర్చి, వచనమ్ = వచనమును, ఉవాచ = పలికెను.

తా. దీనురాలైన ఆ సీత వికలమైన మనస్సుతో ఏదో ధ్యానము చేయుచున్నదా అన్నట్లు ఉండెను చింతతో కాంతివిహీనురాలైన అట్టి సీతతో పాపాత్ముడైన ఆ రాక్షసరాజు రావణుడు ఇట్లు పలికెను. 33

మూ. అలం వ్రీడేన వైదేహి ధర్మలోపకృతేన చ, 34
ఆర్షోఽయం దైవనిష్యన్దో యస్త్వామభిగమిష్యతి.

ప్ర. అ. వైదేహి = సీతా ! ధర్మలోపకృతేన = ధర్మలోపముచేత ఏర్పడిన, వ్రీడేన = సిగ్గుచేత, అలమ్ = చాలును. యః = ఏది, త్వామ్ = నిన్ను, అధిగమిష్యతి = పొందనున్నదో, అయమ్ = ఈ, దైవనిష్యన్దః = దైవసంబంధము, ఆర్షః = ఋషిప్రోక్తమైనది.

తా. 'సీతా ! ధర్మలోపము కలుగ నున్న దని సిగ్గుపడవద్దు. నీకు దైవవశముచేత లభింప నున్న ఈ సంబంధము ధర్మశాస్త్రిలలో ఋషులచేత అంగీకరింపబడినదే.

వి. ఈ శ్లోకమునకు అర్థము సరిగా లేదు. వ్యాఖ్యాతలు ఏవేవో వ్యాఖ్యానించినారు. కొన్ని పరిస్థితులలో స్త్రీ పునర్వివాహము చేసికొనవచ్చు నని ధర్మశాస్త్రిలలో ఋషులు చెప్పినారు గాన ఇది శాస్త్రసమ్మతమే అని భావ మన్నట్లు కొందరు వ్యాఖ్యాతలు వ్రాసినారు. 'నిష్యన్ద' శబ్దానికి "సంబంధము" అనే అర్థం ఎక్కడ ఉన్నదో తెలియదు. ఇట్లే ఇతరవ్యాఖ్యాతల వ్యాఖ్యానములు కూడా ఏవో వ్రాయాలని వ్రాసినట్లు ఉన్నవి. ప్రాచ్యపాఠము బాగున్నది—

''అలం వ్రీడేన వైదేహి ధర్మతాపకృతేన చ,
హర్షోఽయం దేవి విస్పష్టో యస్త్వాముపగమిష్యతి.''

పూర్వార్థమునకు వెనుక చెప్పిన అర్థమే. దేవి = ఓ ! దేవీ ! యః = ఏ సంతోషము, త్వామ్ = నిన్ను, ఉపగమిష్యతి = పొందగలదో, అయం హర్షః = ఈ సంతోషము, విస్పష్టః = స్పష్టమైనదే. నీకు ఆనందము ఎంతో కలుగ నున్నదనే విషయము సుస్పష్టము. ఇంక ధర్మలోపభయంచేత సిగ్గు పడడం మంచిది కాదు అని భావము. 34

మూ. ఏతౌ పాదౌ మయా స్నిగ్ధౌ శిరోభిః పరిపీడితౌ, 35
ప్రసాదం కురు మే క్షిప్రం వశ్యో దాసోఽహమస్మి తే.

ప్ర. అ. ఏతౌ = ఈ, స్నిగ్ధౌ = సుందరములైన, పాదౌ = పాదములు, మయా = నాచేత, శిరోభిః = శిరస్సులచేత, పరిపీడితౌ = పీడింపబడినవి. క్షిప్రమ్ = శీఘ్రముగా, ప్రసాదమ్ = అనుగ్రహమును, కురు = చేయుము. అహమ్ =

నేను, తే = నీకు, వశ్యః = వశుడైన, దాసః = దాసుడను, అస్మి = అయి ఉన్నాను.

తా. సుందరమైన నీ పాదములను స్పృశించి నమస్కరించుచున్నాను. నా మీద శీఘ్రముగా అనుగ్రహము చూపుము. నేను నీకు వశుడనైన దాసుడను. 35

మూ. ఇమాః శూన్యా మయా వాచః శుష్యమాణేన భాషితాః,
న చాపి రావణః కాంచిన్మూర్ధ్నా స్త్రీం ప్రణమేత హి.

ప్ర. అ. శుష్యమాణేన = కామపీడితుడనైన, మయా = నాచేత, ఇమాః = ఈ, శూన్యాః = శూన్యమైన, వాచః = వాక్కులు, భాషితాః = పలకబడినవి. రావణః = రావణుడు, కాంచిత్ స్త్రియమ్ = ఏ స్త్రీని కూడ, మూర్ధ్నా = శిరస్సుతో, న ప్రణమేత హి = నమస్కరించడుకదా.

తా. కామపీడితుడనైన నేను ఈ శూన్యములైన (నావంటివాడు చెప్ప కూడని) మాటలు చెప్పుచున్నాను. రావణుడు ఏ స్త్రీకి నమస్కరించడు కదా.

వి. శూన్యాః = అనేదాని అర్థం సరిగా కుదరడం లేదు.

"నేమాః శూన్యాః కృథా వాచః శుష్యమాణేన భాషితాః"

అనే ప్రాచ్యపాఠం బాగున్నది. ''శుష్యమాణేన = ఎండిపోవుచున్న (కామ పీడితుడనైన) నాచేత, భాషితాః = పలకబడిన, ఇమాః వాచః = ఈ వాక్కులను, శూన్యాః = శూన్యమైనవాటినిగా, న కృథాః = చేయకుము". అని అర్థము. ఈ పాఠంలో కూడా 'న'కు బదులు 'మా' ఉంటే బాగుండును. 36

మూ. ఏవముక్త్వా దశగ్రీవో మైథిలీం జనకాత్మజామ్, 37
కృతాన్తవశమాపన్నో మమేయమితి మన్యతే.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
పఞ్చపఞ్చాశః సర్గః.

ప్ర. అ. దశగ్రీవః = రావణుడు, జనకాత్మజామ్ = జనకుని కుమార్తె యైన, మైథిలీమ్ = సీతను గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, కృతాన్తవశమ్

= యముని వశమును, ఆపన్నః = పొందినవాడై, ఇయమ్ = ఈమె, మమ = నాది, ఇతి = అని, మన్యతే = తలచుచుండెను.

తా. రావణుడు సీతతో ఇట్లు పలికి, యమునకు వశుడై పోవుటచే ''ఈమె ఇంక నాకు చెందినదే'' అని సంతోషించుచుండెను. 37

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో ఏబదియైదవ సర్గ సమాప్తము.

అథ షట్పఞ్చాశః సర్గః

[సీత రామునిపై తన కున్న నిశ్చలప్రేమభక్తులను ప్రకటించి రావణుని నిందించుట. రాక్షసస్త్రీలు ఆమెను అశోకవాటికకు తీసికొని పోయి భయపెట్టుట].

మూ. సా తథోక్తా తు వైదేహీ నిర్భయా శోకకర్శితా,
తృణమన్తరతః కృత్వా రావణం ప్రత్యభాషత. 1

ప్ర. అ. తథా = అట్లు, ఉక్తా = పలకబడిన, శోకకర్శితా = శోకముచేత కృశింపచేయబడిన, సా వైదేహీ = ఆ సీత, నిర్భయా = భయము లేనిదై, తృణమ్ = గడ్డిపరకను, అన్తరతః = మధ్యయందు, కృత్వా = ఉంచి, రావణమ్ = రావణునిగూర్చి, ప్రత్యభాషత = సమాధానము చెప్పెను.

తా. శోకముతో కృశించి ఉన్న ఆ సీత ఆ రావణుని మాటలు విని, ఏ మాత్రమూ భయము లేనిదై, మధ్యలో గడ్డిపరక ఉంచి రావణునకు ఇట్లు సమాధానము చెప్పెను. 1

మూ. రాజా దశరథో నామ ధర్మసేతురివాచలః,
సత్యసన్ధః పరిజ్ఞాతో యస్య పుత్రః స రాఘవః. 2

ప్ర. అ. దశరథో నామ = దశరథు డనే పేరు గల, రాజా = రాజు, అచలః = స్థిరమైన, ధర్మసేతురివ = ధర్మమును నిలుపు సేతువు వంటివాడు గాను, సత్యసన్ధః = సత్యమైన ప్రతిజ్ఞ కలవాడుగాను, పరిజ్ఞాతః = ప్రసిద్ధుడు. సః రాఘవః = ఆ రాముడు, యస్య = ఎవనియొక్క, పుత్రః = పుత్రుడో.

తా. దశరథు డనే రాజు ధర్మమును నిలుపు స్థిరమైన సేతువు వంటివాడు అనీ, సత్యసంధు డనీ ప్రసిద్ధుడు. శ్రీరాముడు ఆతని పుత్రుడే. 2

మూ. రామో నామ స ధర్మాత్మా త్రిషు లోకేషు విశ్రుతః,
దీర్ఘబాహుర్విశాలాక్షో దైవతం హి పతిర్మమ. 3

ప్ర. అ. త్రిషు = మూడు, లోకేషు = లోకములయందు, విశ్రుతః = ప్రసిద్ధుడు, దీర్ఘబాహుః = దీర్ఘములైన బాహువులు కలవాడు, విశాలాక్షః = విశాలములైన నేత్రములు కలవాడు, రామో నామ = రాము డను పేరు గలవాడు అయిన, సః = ఆ, ధర్మాత్మా = ధర్మాత్ముడు, మమ=నాయొక్క, పతిః = భర్త, దైవతమ్ = నాకు దైవతము.

తా. మూడు లోకాలలోను ప్రసిద్ధుడు, దీర్ఘములైన బాహువులు విశాలములైన నేత్రములు కలవాడు అయిన, రాము డను పేరు గల ఆ ధర్మాత్ముడు నా భర్త. అతడే నా దైవము. 3

మూ ఇక్ష్వాకూణాం కులే జాతః సింహస్కన్ధో మహాద్యుతిః,
లక్ష్మణేన సహ భ్రాత్రా యస్తే ప్రాణాన్ హరిష్యతి. 4

ప్ర. అ. ఇక్ష్వాకూణామ్ = ఇక్ష్వాకురాజుల, కులే=కులమునందు, జాతః = పుట్టినవాడు, సింహస్కన్ధః = సింహమువంటి మూపు కలవాడు, మహాద్యుతిః = గొప్ప కాంతి గలవాడు, భ్రాత్రా = సోదరుడైన, లక్ష్మణేన సహ = లక్ష్మణునితో కూడిన, యః = ఏ రాముడు, తే = నీయొక్క, ప్రాణాన్ = ప్రాణములను, హరిష్యతి = హరించగలడో.

తా. ఇక్ష్వాకువంశమునందు పుట్టినవాడు, సింహము వంటి మూపు గలవాడు, గొప్ప కాంతి గలవాడు అయిన ఆ రాముడు సోదరుడైన లక్ష్మణునితో కలిసి నీ ప్రాణములను తీసివేయగలడు. 4

మూ. ప్రత్యక్షం యద్యహం తస్య త్వయా స్యాం ధర్షితా బలాత్,
శయితా త్వం హతః సంఖ్యే జనస్థానే యథా ఖరః. 5

ప్ర. అ. అహమ్ = నేను, త్వయా = నీచేత, తస్య=అతనికి, ప్రత్యక్షమ్ = ఎదుట, బలాత్ = బలాత్కారముగా, ధర్షితా = అవమానితురాలను, స్యాం యది = అయి ఉన్నట్లయితే, త్వమ్ = నీవు, జనస్థానే = జనస్థానమునందు, ఖరః

యథా = ఖరుడు వలె, హతః = చంపబడినవాడవై, శయితా = శయనించెడి వాడవు.

తా. నీవు నన్ను ఆ రాముని సమక్షంలో అవమానించి ఉన్నట్లయితే, జనస్థానంలో ఖరుడు వలె, హతుడవై నేలమీద పడి యుండెడివాడవు. 5

మూ. య ఏతే రాక్షసాః ప్రోక్తా ఘోరరూపా మహాబలాః,
రాఘవే నిర్విషాః సర్వే సుపర్ణే పన్నగా యథా. 6

ప్ర. అ. ఘోరరూపాః = ఘోరమైన రూపము గలవారు, మహాబలాః = గొప్ప బలము గలవారు అయిన, యే = ఏ, ఏతే = ఈ, రాక్షసాః = రాక్షసులు, ప్రోక్తాః = చెప్పబడినారో, సర్వే = వాళ్ళందరూ, సువర్ణే = గరుత్మంతుని విషయమునందు, పన్నగాః యథా = సర్పముల వలె, రాఘవే = రాముని విషయమునందు, నిర్విషాః = విషము లేనివారు.

తా. భయంకరమైన రూపములు గల మహాబలవంతులైన రాక్షసులను గూర్చి నీవేమో వర్ణించి చెప్పినావు. కాని ఈ రాక్షసు లందరూ, గరుత్మంతుని ముందు సర్పములు విషశూన్యము లైనట్లు, రాముని ముందు నిర్వీర్యులు. 6

మూ. తస్య జ్యావిప్రముక్తాస్తే శరాః కాఞ్చనభూషణాః,
శరీరం విధమిష్యన్తి గఙ్గాకూలమివోర్మయః. 7

ప్ర. అ. తస్య = ఆ రామునియొక్క, జ్యావిప్రముక్తాః = నారినుండి విడువబడిన, కాఞ్చనభూషణాః = బంగారు అలంకారములు గల, శరాః = బాణములు, ఊర్మయః = తరంగములు, గఙ్గాకూలమివ = గంగాతీరమును వలె, తే శరీరమ్ = నీ శరీరమును, విధమిష్యన్తి = హింసించగలవు.

తా. బంగారముచేత అలంకరింపబడిన బాణములు ఆ రాముని ధనస్సునుండి బయలుదేరి వచ్చి, గంగాతరంగములు గంగాతీరమును కూలద్రోసినట్లు, నీ శరీరమును హింసించగలవు. 7

మూ. అసురైర్వా సురైర్వా త్వం యద్యవధ్యోఽసి రావణ,
ఉత్పాద్య సుమహద్వైరం జీవంస్తస్య న మోక్ష్యసే. 8

ప్ర. అ. రావణ = రావణుడా ! త్వమ్ = నీవు, అసురైర్వా = అసురుల చేతగాని, సురైర్వా = దేవతలచేత గాని, అవధ్యః = చంప శక్యము కానివాడవు, అసి యది = అయినను, సుమహత్ = చాలా గొప్పదైన, వైరమ్ = వైరమును, ఉత్పాద్య = పుట్టించి, జీవన్ = జీవించుచున్నవాడవై, తస్య=ఆతనికి, న మోక్ష్యసే = విడువబడవు.

తా. రావణుడా ! నిన్ను అసురులు గాని, సురులు గాని చంపలేక పోవచ్చును. కాని రామునితో ఇంత గొప్ప వైరము పెట్టుకొని నీవు ప్రాణాలతో బైటపడవు. 8

మూ. స తే జీవితశేషస్య రాఘవోఽన్తకరో బలీ,
పశోర్యూపగతస్యేవ జీవితం తవ దుర్లభమ్. 9

ప్ర. అ. బలీ = బలవంతుడైన, సః రాఘవః = ఆ రాముడు, తే = నీ యొక్క, జీవితశేషస్య = మిగిలిన జీవితముయొక్క, అన్తకరః = అంతమును చేయువాడు. యూపగతస్య = యూపస్తంభమును పొందిన, పశోరివ = పశువునకు వలె, తవ = నీకు, జీవితమ్ = జీవితము, దుర్లభమ్ = దుర్లభము.

తా. మహాబలవంతుడైన ఆ రాముడు నీ మిగిలిన ఆయుర్దాయమును అంతము చేయగలడు. యూపస్తంభానికి కట్టిన పశువునకు వలె నీకు జీవితము ఇంక దక్కదు. 9

మూ. యది పశ్యేత్స రామస్త్వాం రోషదీప్తేన చక్షుషా,
రక్షస్త్వమద్య నిర్దగ్ధో గచ్ఛేః సద్యః పరాభవమ్. 10

ప్ర. అ. రక్షః = రాక్షసుడా ! సః రామః = ఆ రాముడు, రోషదీప్తేన = రోషముచేత మండుచున్న, చక్షుషా = నేత్రముతో, త్వామ్=నిన్ను, పశ్యేద్యది= చూచినట్లయితే, అద్య = ఇప్పుడు, సద్యః = వెంటనే, త్వమ్ = నీవు, నిర్దగ్ధః = కాల్చబడినవాడవై, పరాభవమ్ = పరాభవమును, గచ్ఛేః = పొందెదవు.

తా. ఓ ! రాక్షసుడా ! ఆ రాముడు నిన్ను కోపముచేత ప్రజ్వలించుచున్న చూపుతో చూచినట్లయితే, నీవు ఇప్పుడే వెంటనే, కాల్చబడినవాడవై పరాభవమును పొందెదవు. 10

మూ. యశ్చన్ద్రం నభసో భూమౌ పాతయేన్నాశయేత వా,
సాగరం శోషయేద్వాపి స సీతాం మోచయేదిహ. 11

ప్ర. అ. యః = ఏ రాముడు, చన్ద్రమ్ = చంద్రుణ్ణి, నభసః = ఆకాశము నుండి, భూమౌ = నేలమీద, పాతయేత్ = పడవేయగలడో, వా = లేక, నాశయేత్ = నశింపచేయగలడో, సాగరమ్ = సముద్రమును, శోషయేద్వాపి = ఎండింప చేయగలడో, సః = ఆ రాముడు, ఇహ = ఇప్పుడు, సీతామ్ = సీతను, మోచయేత్ = విడిపించును

తా. ఏ రాముడు చంద్రుణ్ణి ఆకాశమునుండి క్రిందికి పడగొట్టగలడో, లేదా నశింపచేయగలడో, సముద్రమును కూడ ఎండింపచేయగలడో ఆ రాముడే ఇప్పుడు సీతను విడిపించగలడు. 11

మూ. గతాయుస్త్వం గతశ్రీకో గతసత్త్వో గతేన్ద్రియః,
లఙ్కా వైధవ్యసంయుక్తా త్వత్కృతేన భవిష్యతి. 12

ప్ర. అ. త్వమ్ = నీవు, గతాయుః = గడచిన ఆయుర్దాయము కలవాడవు. గతశ్రీకః = పోయిన ఐశ్వర్యము గలవాడవు. గతసత్త్వః = పోయిన బలము గలవాడవు. గతేన్ద్రియః = నశించిన ఇంద్రియములు గలవాడవు. త్వత్కృతేన = నీవు చేసిన పనిచేత, లఙ్కా = లంక, వైధవ్యసంయుక్తా = వైధవ్యముతో కూడినది, భవిష్యతి = కాగలదు.

తా. నీ ఆయుస్సు మూడినది. నీ ఐశ్వర్యము అంతమొందినది. నీ బలము నశించినది. నీ ఇంద్రియములు పాడయినవి. నీవు చేసిన పనికి లంక వైధవ్యమును పొందనున్నది. 12

మూ. న తే పాపమిదం కర్మ శుభోదర్కం భవిష్యతి,
యాహం నీతా వినాభావం పతిపార్శ్వాత్త్వయా వనే.

ప్ర. అ. తే = నీయొక్క, ఇదమ్ = ఈ, కర్మ = పని, శుభోదర్కమ్ = శుభమైన భవిష్యత్ఫలము గలది, న భవిష్యతి = కాదు. యా = ఏ, అహమ్ = నేను, త్వయా = నీచేత, వనే = వనమునందు, పతిపార్శ్వాత్ = భర్తదగ్గరనుండి, వినాభావమ్ = వియోగమును, నీతా = పొందించబడితినో.

తా. నీవు వనములో భర్త దగ్గర నున్న నాకు భర్తతో వియోగము కల్పించినావు. నీవు చేసిన ఈ పాపకర్మ నీకు భవిష్యత్తునందు శుభఫలమును ఇవ్వదు. 13

మూ. స హి దైవతసంయుక్తో మమ భర్తా మహాద్యుతిః,
నిర్భయో వీర్యమాశ్రిత్య శూన్యే వసతి దణ్డకే. 14

ప్ర. అ. మహాద్యుతిః = గొప్ప కాంతి గలవాడైన, మమ = నాయొక్క, భర్తా = భర్తయైన, సః = ఆ రాముడు, వీర్యమ్ = వీర్యమును, ఆశ్రిత్య = ఆశ్రయించి, నిర్భయః = భయములేనివాడై, దైవతసంయుక్తః = దైవముతో మాత్రమే కూడినవాడై, శూన్యే = శూన్యమైన, దణ్డకే = దండకారణ్యమునందు, వసతి = నివసించుచున్నాడు.

తా. మహాతేజఃశాలియైన నా భర్త తన పరాక్రమముపైననే ఆధారపడి, నిర్భయుడై, దైవము తప్ప మరెవ్వరి సహాయము లేనివాడై, స్వజనులు ఎవ్వరూ లేని దండకారణ్యములో నివసించుచున్నాడు. 14

మూ. స తే దర్పం బలం వీర్యముత్సేకం చ తథావిధమ్,
అపనేష్యతి గాత్రేభ్యః శరవర్షేణ సంయుగే. 15

ప్ర. అ. సః = అతడు, సంయుగే = యుద్ధమునందు, శరవర్షేణ = బాణవర్షముచేత, తే = నీయొక్క, గాత్రేభ్యః = అవయవములనుండి, దర్పమ్ = గర్వమును, బలమ్ = బలమును, వీర్యమ్ = పరాక్రమమును, తథావిధమ్ = అట్టి, ఉత్సేకం చ = ఎవ్వరినీ లెక్కచేయకుండుటను, అపనేష్యతి = తొలగించగలడు.

తా. నా భర్త యుద్ధములో బాణవర్షము వర్షించి నీ అవయవములలో (శరీరములో) ఉన్న గర్వమును, బలమును, పరాక్రమమును, ఎవ్వరినీ లెక్క చేయని అహంభావమును కడిగివేయగలడు. 15

మూ. యదా వినాశో భూతానాం దృశ్యతే కాలచోదితః
తదా కార్యే ప్రమాద్యన్తి నరాః కాలవశం గతాః. 16

ప్ర. అ. భూతానామ్ = ప్రాణులకు, యదా = ఎప్పుడు, కాలచోదితః = కాలముచేత చేయబడిన, వినాశః = వినాశము, దృశ్యతే = చూడబడుచున్నదో, తదా = అప్పుడు, నరాః = నరులు, కాలవశమ్ = కాలమునకు వశమును, గతాః = పొందినవారై, కార్యే = కార్యమునందు, ప్రమాద్యన్తి = ప్రమాదము చెందుదురు.

తా. ప్రాణులకు (నరులకు) కాలమువలన కలగవలసిన వినాశము దాపు రించినప్పుడు, ఆ నరులు కాలమునకు లొంగిపోయి తాము చేయవలసిన కార్యము లందు పొరబాట్లు చేయుచుందురు. 16

మూ. మాం ప్రధృష్య స తే కాలః ప్రాప్తోఽయం రాక్షసాధమ,
ఆత్మనో రాక్షసానాం చ వధాయాన్తఃపురస్య చ. 17

ప్ర. అ. రాక్షసాధమ = ఓ ! రాక్షసాధముడా ! మామ్ = నన్ను, ప్రధృష్య = అవమానించి, ఆత్మనః = నీయొక్క, రాక్షసానాం చ = రాక్షసులయొక్క, అన్తఃపురస్య చ = అంతఃపురముయొక్క, వధాయ = వధకొరకు, సః కాలః = ఆ కాలము, తే = నీకు, ప్రాప్తః = వచ్చినది.

తా. రాక్షసాధముడా ! నన్నీవిధముగా అవమానించుటచేత, నువ్వు, రాక్షసులు, నీ అంతఃపురమూ నశించే అట్టి కాలము నీకు ప్రాప్తించినది. 17

మూ. న శక్యా యజ్ఞమధ్యస్థా వేదీ స్రుగ్భాణ్డమణ్డితా,
ద్విజాతిమన్త్రపూతా చ చణ్డాలేనావమర్దితుమ్. 18

ప్ర. అ. యజ్ఞమధ్యస్థా = యజ్ఞమధ్యమునందు ఉన్నది, స్రుగ్భాణ్డమణ్డితా = స్రుక్కుచేతను, ఇతరపాత్రలచేతను అలంకరింపబడినది, ద్విజాతిమన్త్రపూతా చ = బ్రాహ్మణుల మంత్రముచేత పవిత్రము చేయబడినదీ అయిన, వేదీ = వేదిక, చణ్డాలేన = చండాలునిచేత, అవమర్దితుమ్ = త్రొక్కుటకు, న శక్యా = శక్యమైనది కాదు.

తా. చుట్టూ స్రుక్కులు, ఇతరపాత్రలు పరిచి ఉన్నది, బ్రాహ్మణుల మంత్రములచేత పవిత్రము చేయబడినది అయిన, యజ్ఞశాలామధ్యమునం దున్న వేదికను చండాలుడు త్రొక్కజాలడు. 18

మూ. తథాహం ధర్మనిత్యస్య ధర్మపత్నీ పతివ్రతా,
త్వయా స్ప్రష్టుం న శక్యాస్మి రాక్షసాధమ పాపినా. 19

ప్ర. అ. రాక్షసాధమ = రాక్షసాధముడా ! తథా = అట్లే, ధర్మనిత్యస్య = ధర్మమునందు స్థిరుడైన రామునియొక్క, ధర్మపత్నీ = ధర్మపత్నిని, పతివ్రతా = పతివ్రతను అయిన, అహమ్ = నేను, పాపినా = పాపాత్ముడవైన, త్వయా = నీచేత, స్ప్రష్టుమ్ = స్పృశించుటకు, శక్యా = శక్యమైనదానను, నాస్మి = కాను.

తా. రాక్షసాధముడా ! ధర్మమునందు స్థిరమైన రాముని ధర్మపత్నిని, పతివ్రతను అయిన నన్ను, ఆ విధముగనే, పాపాత్ముడవైన నీవు స్పృశింపజాలవు. 19

మూ. క్రీడన్తీ రాజహంసేన పద్మషణ్డేషు నిత్యదా,
హంసీ సా తృణషణ్డస్థం కథం పశ్యేత మద్గుకమ్. 20

ప్ర. అ. పద్మషణ్డేషు = పద్మసమూహములందు, నిత్యదా = ఎల్లప్పుడు, రాజహంసేన = రాజహంసతో, క్రీడన్తీ = క్రీడించుచున్న, సా హంసీ = ఆ ఆడహంస, తృణషణ్డస్థమ్ = తృణసముదాయములో ఉన్న, మద్గుకమ్ = నీటికాకిని, కథమ్ = ఎట్లు, పశ్యేత = చూచును ?

తా. పద్మాల వనములో నిత్యమూ రాజహంసతో క్రీడించే ఆడహంస నీటిగడ్డిలో తిరిగే నీటికాకిని చూచుటకు కూడ ఇష్టపడునా ? 20

మూ. ఇదం శరీరం నిఃసంజ్ఞం బన్ధ వా ఘాతయస్వ వా,
నేదం శరీరం రక్ష్యం మే జీవితం వాపి రాక్షస, 21
న తు శక్ష్యామ్యుపక్రోశం పృథివ్యాం ధాతుమాత్మనః.

ప్ర. అ. రాక్షస = రాక్షసుడా ! నిస్సంజ్ఞమ్ = సంజ్ఞ లేని, ఇదమ్ = ఈ, శరీరమ్ = శరీరమును, బన్ధ వా = బంధించుము, వా = లేదా, ఘాతయస్వ = నశింపచేయుము మే = నాకు, ఇదమ్ = ఈ, శరీరమ్ = శరీరము గాని, జీవితం వా = జీవితము గాని, రక్ష్యమ్ = రక్షింపదగినది, న = కాదు. తు = కాని, పృథివ్యామ్ = భూలోకమునందు, ఆత్మనః = నాకు, ఉపక్రోశమ్ = నిందను, ధాతుమ్ = కలిగించుకొనుటకు, న శక్ష్యామి = సమరురాలను కాను.

తా. రాక్షసుడా! జడమైన ఈ శరీరమును నీ కిష్టమైనచో బంధించుము, లేదా చంపించివేయుము. ఈ శరీరమును కాని, ప్రాణాలను కాని రక్షించుకొన వలె నని నాకు కోరిక లేదు. ఈ భూలోకములో నాకు అవకీర్తి కలిగే పని మాత్రము చేయను. 21

మూ. ఏవముక్త్వా తు వైదేహీ క్రోధాత్సుపరుషం వచః, 22
రావణం మైథిలీ తత్ర పునర్నోవాచ కించన.

ప్ర. అ. వైదేహీ = విదేహరాజకుమారియైన, మైథిలీ = సీత, క్రోధాత్ = కోపమువలన, రావణమ్ = రావణునిగూర్చి, ఏవమ్ = ఇట్లు, సుపరుషమ్ = చాలా పరుషమైన, వచః = వచనమును, ఉక్త్వా = పలికి, తత్ర = అప్పుడు, పునః = మరల, కించన = ఏమీ, నోవాచ = పలకలేదు.

తా. జనకరాజపుత్రియైన సీత రావణునితో ఈ విధముగా కోపముతో నిండిన, చాల పరుషమలైన మాటలు పలికి, మరల ఏమీ మాటలాడక ఊర కుండెను. 22

మూ. సీతాయా వచనం శ్రుత్వా పరుషం రోమహర్షణమ్, 23
ప్రత్యువాచ తతః సీతాం భయసందర్శనం వచః.

ప్ర. అ. సీతాయాః = సీతయొక్క, పరుషమ్ = పరుషమూ, రోమహర్షణమ్ = రోమాంచమును కలిగించేదీ అయిన, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, (రావణుడు), తతః = అటుపిమ్మట, సీతామ్ = సీతను గూర్చి, భయసందర్శనమ్ = భయమును చూపే, వచః = వాక్యమును, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. సీత పలికిన పరుషములూ, రోమాంచమును కలిగించేవి అయిన ఆ మాటలు విని రావణుడు ఆమెను భయపెట్టుచు ఇట్లు పలికెను. 23

మూ. శృణు మైథిలి మద్వాక్యం మాసాన్ ద్వాదశ భామిని, 24
కాలేనానేన నాభ్యేషి యది మాం చారుహాసిని,
తతస్త్వాం ప్రాతరాశార్థం సూదాశ్ఛేత్స్యన్తి లేశశః. 25

ప్ర. అ. మైథిలి = మిథిలానగరరాజకుమారియైన, భామిని = ఓ! సీతా!

మద్వాక్యమ్ = నామాటను, శృణు = వినుము. ద్వాదశ=పంౘెండు, మాసాన్= మాసములను, (మాసములు) (అవధి). చారుహాసిని = అందమైన చిరునవ్వు గలదానా ! అనేన = ఈ, కాలేన = కాలముచేత, మామ్ = నన్ను, నాభ్యేషి యది = చేరకపోయినట్లయితే, తతః = అటుపిమ్మట, సూదాః = వంటవాళ్లు, త్వామ్ = నిన్ను, ప్రాతరాశార్థే = ప్రాతఃకాల భోజనము నిమిత్తము, లేశశః = ముక్కలు ముక్కలుగా, ఛేత్స్యన్తి = ఛేదించగలరు.

తా. ఓ ! సీతా ! నేను చెప్పుచున్నది వినుము. నీకు పన్నెండుమాసాలు అవధి ఇచ్చుచున్నాను. అందమైన చిరునవ్వు గలదానా ! ఈ సమయము లోగా నీవు నన్ను చేరకపోయినచో వంటవాళ్లు ప్రాతఃకాలమునందు తినే అల్పాహారము నిమిత్తము నిన్ను ముక్కముక్కలుగా ఛేదించివేయగలరు.

వి. ఈ ఒకటిన్నరశ్లోకాలు ప్రాచ్యప్రతిలో లేవు. 24-25

మూ. ఇత్యుక్త్వా పరుషం వాక్యం రావణః శత్రురావణః,
రాక్షసీశ్చ తతః క్రుద్ధ ఇదం వచనమబ్రవీత్. 26

ప్ర. అ. శత్రురావణః = శత్రువులను ఏడ్పించిన, రావణః = రావణుడు, ఇతి = ఇట్లు, పరుషమ్ = పరుషమైన, వాక్యమ్ = వాక్యమును, ఉక్త్వా = పలికి, తతః = అటుపిమ్మట, క్రుద్ధః = కోపించినవాడై, రాక్షసీః = రాక్షసస్త్రీలను గూర్చి, ఇదమ్ = ఈ, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. శత్రువులను ఏడ్పించే ఆ రావణుడు సీతతో ఈ విధముగా పరుషముగా పలికి, చాల కోపించినవాడై రాక్షసస్త్రీలతో ఇట్లు పలికెను. 26

మూ. శీఘ్రమేవ హి రాక్షస్యో వికృతా ఘోరదర్శనాః,
దర్పమస్యా వినేష్యధ్వం మాంసశోణితభోజనాః. 27

ప్ర. అ. వికృతాః = వికృతరూపము గలవాళ్లు, ఘోరదర్శనాః = భయంకరమైన దర్శనము కలవాళ్లు, మాంసశోణితభోజనాః = మాంసము రక్తము భోజనముగా కలవాళ్ళు అయిన, రాక్షస్యః = రాక్షసస్త్రీలారా ! శీఘ్రమేవ = శీఘ్రముగా, అస్యాః = ఈమెయొక్క, దర్పమ్ = గర్వమును, వినేష్యధ్వమ్ = తొలగించండి.

తా. వికృతములైన ఆకారములతో చూచుటకు భయంకరంగా ఉండే

మాంసరక్తములను భుజించే రాక్షసస్త్రీలలారా ! ఈమె గర్వమును శీఘ్రముగా పోగొట్టండి. 27

మూ. వచనాదేవ తాస్తస్య సుఘోరా రాక్షసీగణాః,
కృతప్రాఞ్జలయో భూత్వా మైథిలీం పర్యవారయన్. 28

ప్ర. అ. సుఘోరాః=చాల భయంకరములైన, తాః=ఆ, రాక్షసీగణాః= రాక్షసస్త్రీ గణములు, తస్య= అతనియొక్క, వచనాదేవ= మాటవలననే, కృత ప్రాఞ్జలయః = చేయబడిన నమస్కారము కలవి, భూత్వా= అయి, మైథిలీమ్ = సీతను, పర్యవారయన్ = చుట్టి నిలచినవి.

తా. భయంకరలైన ఆ రాక్షసస్త్రీలు రావణుని మాట వినిన వెంటనే ఆతనికి సవినయముగా నమస్కరించి సీతను చుట్టి నిలచిరి. 28

మూ. స తాః ప్రోవాచ రాజా తు రావణో ఘోరదర్శనః,
ప్రచాల్య చరణోత్కర్షైర్దారయన్నివ మేదినీమ్. 29

ప్ర. అ. ఘోరదర్శనః = భయంకరమైన దర్శనము గల, రాజా= రాజైన, సః రావణః= ఆ రావణుడు, చరణోత్కర్షైః= పాదములచే లాగుటచేత, మేదినీమ్= భూమిని, ప్రచాల్య= కదల్చి, దారయన్నివ = చీల్చుచున్నవాడు వలె, తాః= ఆ రాక్షసస్త్రీలను గూర్చి, ప్రోవాచ= పలికెను.

తా. చూచుటకు భయంకరుడైన రాక్షసరాజైన ఆ రావణుడు పాదాఘాతములచేత భూమిని కదల్చి చీల్చివేయుచున్నాడా అన్నట్లు కనబడుచు ఆ రాక్షసస్త్రీలతో ఇట్లు పలికెను. 29

మూ. అశోకవనికామధ్యే మైథిలీ నీయతామియమ్,
తత్రేయం రక్ష్యతాం గూఢం యుష్మాభిః పరివారితా. 30

ప్ర. అ. ఇయం మైథిలీ= ఈ సీత, అశోకవనికామధ్యే = అశోకవన మధ్యమునందు, నీయతామ్= తీసికొనివెళ్ళబడుగాక. తత్ర= అక్కడ, ఇయమ్ = ఈమె, యుష్మాభిః= మీచేత, పరివారితా= చుట్టుకొనబడినదై, గూఢమ్= రహస్యముగా, రక్ష్యతామ్ = రక్షింపబడుగాక.

తా. మీరు ఈ సీతను అశోకవనమధ్యమునకు తీసికొని వెళ్ళి, అక్కడ ఈమె చుట్టూ ఉంటూ, ఈమెను రహస్యముగా దాచి ఉంచి రక్షించండి. 30

మూ. తత్రైనాం తర్జనైర్ఘోరైః పునః సాన్త్వైశ్చ మైథిలీమ్,
ఆనయధ్వం వశం సర్వా వన్యాం గజవధూమివ. 31

ప్ర. అ. తత్ర = అక్కడ, సర్వాః = మీరందరూ, ఏనాం మైథిలీమ్ = ఈ సీతను, ఘోరైః = భయంకరములైన, తర్జనైః = భయపెట్టుటచేతను, పునః = మరల, సాన్త్వైశ్చ = బ్రతిమాలుకొనుటచేతను, వన్యామ్ = వనసంబంధమైన, గజవధూమివ = ఆడ ఏనుగను వలె, వశమ్ = వశమును, ఆనయధ్వమ్ = తీసికొనిరండి.

తా. అక్కడ మీరందరూ ఈ సీతను, వనములోని ఆడ ఏనుగును వలె, తీవ్రములైన భయపెట్టే మాటలచేతను, మంచి మాటలచేతను లొంగదీయండి.

మూ. ఇతి ప్రతిసమాదిష్టా రాక్షస్యో రావణేన తాః,
అశోకవనికాం జగ్ముర్మైథిలీం పరిగృహ్య తు. 32

సర్వకాలఫలైర్వృక్షైర్నానాపుష్పఫలైర్వృతామ్,
సర్వకాలమదైశ్చాపి ద్విజైః సముపసేవితామ్. 33

ప్ర. అ. రావణేన = రావణునిచేత, ఇతి = ఇట్లు, ప్రతిసమాదిష్టాః = ఆజ్ఞాపింపబడిన, తాః = ఆ, రాక్షస్యః = రాక్షసస్త్రీలు, మైథిలీమ్ = సీతను, ప్రతిగృహ్య = తీసికొని, సర్వకాలఫలైః = సర్వకాలములందు ఫలములు గల, నానాపుష్పఫలైః = అనేకవిధములైన పుష్పములు ఫలములు గల, వృక్షైః = వృక్షములతో, వృతామ్ = కూడినది, సర్వకాలమదైః = అన్ని కాలములందు మదము గల, ద్విజైః = పక్షులచేత, సముపసేవితామ్ = సేవించబడిన, అశోకవనికామ్ = అశోకవనమును గూర్చి, జగ్ముః = వెళ్లిరి.

తా. ఆ రాక్షసస్త్రీలు రావణుని ఆజ్ఞను అనుసరించి, సీతను తీసికొని అశోకవనమునకు వెళ్ళిరి. ఆ అశోకవనము అన్ని కాలములలోనూ ఫలములు ఇచ్చే వృక్షములతోను, అనేకవిధములైన పువ్వులతో, పండతో నిండిన వృక్షములతోను

అందముగా ఉండెను. ఆ వనమునందు అన్ని కాలములందును మదించి ఉండు పక్షులు నివసించుచుండెను. 32-33

మూ. సా తు శోకపరీతాఙ్గీ మైథిలీ జనకాత్మజా,
రాక్షసీవశమాపన్నా వ్యాఘ్రీణాం హరిణీ యథా. 34

ప్ర. అ. శోకపరీతాఙ్గీ=శోకముతో వ్యాప్తమైన శరీరము గల, జనకాత్మజా =జనకుని కుమార్తె యైన, సా మైథిలీ=ఆ సీత, హరిణీ=ఆడలేడి, వ్యాఘ్రీణాం యథా = ఆడపెద్దపులులకు వలె, రాక్షసీవశమ్ = రాక్షసస్త్రీల వశమును, ఆపన్నా = పొందినది.

తా. శోకముతో నిండిన శరీరము గల, జనకనందిని యైన ఆ సీత ఆడ లేడి ఆడ పెద్దపులుల వశమైపోయి నట్లు రాక్షసస్త్రీల వశమై పోయెను. 34

మూ. శోకేన మహతా గ్రస్తా మైథిలీ జనకాత్మజా,
న శర్మ లభతే భీరుః పాశబద్ధా మృగీ యథా. 35

ప్ర. అ. మహతా = గొప్పదైన, శోకేన = శోకముచేత, గ్రస్తా = ఆవహింపబడిన, భీరుః = భయస్వభావముగల, జనకాత్మజా=జనకుని కుమార్తెయైన, మైథిలీ = సీత, పాశబద్ధా = పాశములచేత కట్టబడిన, మృగీ యథా = ఆడ లేడి వలె, శర్మ = సుఖమును, న లభతే = పొందలేదు.

తా. జనకుని కుమార్తె యైన, భయస్వభావము గల ఆ సీత గొప్ప శోకముచేత ఆవహింపబడినదై పాశములచే కట్టబడిన ఆడ లేడి వలె ఏ మాత్రము సుఖము పొందకుండెను. 35

మూ. న విన్దతే తత్ర తు శర్మ మైథిలీ
విరూపనేత్రాభిరతీవ తర్జితా,
పతిం స్మరన్తీ దయితం చ దేవరం
విచేతనాభూద్భయశోకపీడితా ,36

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకియే ఆదికావ్యే అరణ్యకాణ్డే
షట్పఞ్చాశః సర్గః.

ప్ర. అ. విరూపనేత్రాభిః = వికృతమైన నేత్రములు గల రాక్షసస్త్రీలచేత, అతీవ = మిక్కిలి, తర్జితా = భయపెట్టబడినదై, మైథిలీ = సీత, తత్ర = అక్కడ, శర్మ = సుఖమును, న విన్దతే = పొందలేదు. దయితమ్ = ప్రియుడైన, పతిమ్ = భర్తను, దేవరం చ = మరదిని, స్మరన్తీ = స్మరించుచున్నదై, భయశోకపీడితా = భయముచేతను, శోకముచేతను పీడింపబడినదై, విచేతనా = చైతన్యము లేనిది, అభూత్ = ఆయెను.

తా. వికృతములైన నేత్రములు గల ఆ రాక్షసస్త్రీలు ఎక్కువగా భయపెట్టుటచే జనకుని కూతురైన ఆ సీత సుఖము లేనిదై ఉండెను. ప్రియుడైన భర్తను, మరిదిని స్మరించుచు భయశోకములచేత పీడింపబడినదై స్పృహ కోల్పోయి పడి యుండెను. 36

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో ఏబదిఆరవ సర్గ సమాప్తము.

అథ సప్తపఞ్చాశః సర్గః

[మాయామృగమును చంపి తిరిగివచ్చుచున్న రాముడు మార్గములో కొన్ని అపశకునములు చూచి చింతించుట. తనవద్దకు వచ్చిన లక్ష్మణుని నిందించుచు సీత విషయమున భయము చెందుట].

మూ. రాక్షసం మృగరూపేణ చరన్తం కామరూపిణమ్,
నిహత్య రామో మారీచం తూర్ణం పథి న్యవర్తత. 1

ప్ర. అ. రామః = రాముడు, మృగరూపేణ=మృగరూపముతో, చరన్తమ్ = సంచరించుచున్న, కామరూపిణమ్ = స్వేచ్ఛారూపము గల, రాక్షసమ్ = రాక్షసుడైన, మారీచమ్ = మారీచుణ్ణి, నిహత్య = చంపి, తూర్ణమ్ = శీఘ్రముగా, పథి = మార్గమునందు, న్యవర్తత = మరలెను.

తా. మృగరూపముతో సంచరించుచున్న, ఇష్టానుసారము రూపము ధరించ గలిగిన రాక్షసుడైన ఆ మారీచుణ్ణి చంపి రాముడు శీఘ్రముగా వెనుకకు మరలి వచ్చుచుండెను. 1

మూ. తస్య సంత్వరమాణస్య ద్రష్టుకామస్య మైథిలీమ్,
క్రూరస్వనోఽథ గోమాయుర్వినవాదాస్య పృష్ఠతః. 2

ప్ర. అ. మైథిలీమ్ = సీతను, ద్రష్టుకామస్య = చూచుటకు కోరుచున్న, తస్య = ఆ రాముడు, సంత్వరమాణస్య = తొందరపడుచుండగా, అథ = అటు పిమ్మట, క్రూరస్వనః = క్రూరమైన ధ్వని గల, గోమాయుః = నక్క, అస్య = ఈ రామునియొక్క, పృష్ఠతః = వెనుక, వినవాద = అరచెను.

తా. రాముడు సీతను చూడవలె నని తొందరగా వచ్చుచుండగా అతని వెనుక క్రూరమైన ధ్వని గల నక్క అరచెను. 2

మూ. స తస్య స్వరమాజ్ఞాయ దారుణం రోమహర్షణమ్,
చిన్తయామాస గోమాయోః స్వరేణ పరిశఙ్కితః. 3

ప్ర. అ. సః = రాముడు, తస్య గోమాయోః = ఆ నక్కయొక్క, దారుణమ్ = భయంకరము, రోమహర్షణమ్ = రోమాంచమును కలిగించేది అయిన, స్వరమ్ = స్వరమును, ఆజ్ఞాయ = విని, స్వరేణ = దాని స్వరముచేత, పరిశఙ్కితః = శంకించుచున్నవాడై, చిన్తయామాస = ఆలోచించెను.

తా. భయంకరము, రోమాంచము కలిగించేదీ అయిన ఆ నక్క కూత విని, రాముడు ఆ కూతకు శంకించుచు ఇట్లు ఆలోచించెను. 3

మూ. అశుభం బత మన్యేఽహం గోమాయుర్వాశ్యతే యథా,
స్వస్తి స్యాదపి వైదేహ్యా రాక్షసైర్భక్షణం వినా 4

ప్ర. అ. బత = అయ్యో! గోమాయుః = నక్క, యథా = ఎట్లు, వాశ్యతే = ధ్వనిచేయుచున్నదో, (దానిచేత), అహమ్ = నేను, అశుభమ్ = అశుభమును, మన్యే = ఊహించుచున్నాను. రాక్షసైః = రాక్షసులచేత, భక్షణం వినా = భక్షణము లేకుండగా, వైదేహ్యాః = సీతకు, స్వస్తి = క్షేమము, స్యాదపి = అగునా?

తా. అయ్యో! ఈ నక్క కూయుట చూడగా అశుభము ఏదో జరుగనున్నదని అనిపించుచున్నది. సీతను రాక్షసు లెవ్వరూ భక్షించివేయకుండగా ఆమె క్షేమముగా ఉండునా! 4

మూ. మారీచేన తు విజ్ఞాయ స్వరమాలమ్బ్య మామకమ్,
విక్రుష్టం మృగరూపేణ లక్ష్మణః శృణుయాద్యది. 5

స సౌమిత్రిః స్వరం శ్రుత్వా తాం చ హిత్వా చ మైథిలీమ్,
తయేహ ప్రహితః క్షిప్రం మత్సకాశమిహేష్యతి. 6

ప్ర. అ. మృగరూపేణ = మృగరూపము గల, మారీచేన = మారీచునిచేత, విజ్ఞాయ = తెలిసికొని, మామకమ్ = నా సంబంధమైన, స్వరమ్ = స్వరమును, ఆలమ్బ్య = అవలంబించి, విక్రుష్టమ్ = అరపును, లక్ష్మణః = లక్ష్మణుడు, శృణుయాద్యది = విన్నట్లయితే, సః సౌమిత్రిః = ఆ లక్ష్మణుడు, స్వరమ్ =

స్వరమును, శ్రుత్వా = విని, తాం మైథిలీమ్ = ఆ సీతను, హిత్వా చ = విడచి, తయా = ఆమెచేత, ఇహ = ఇచటికి, ప్రహితః = పంపబడినవాడై, క్షిప్రమ్ = శీఘ్రముగా, ఇహ = ఇప్పుడు, మత్సకాశమ్ = నా సమీపమును గూర్చి, ఏష్యతి = రాగలడు.

తా. మృగరూపమును ధరించి ఉన్న ఆ మారీచుడు కావలె నని నా స్వరముతో చేసిన అరపును లక్ష్మణుడు విని యుండవచ్చును. లక్ష్మణుడు ఆ స్వరమును విని, సీతచేత పంపబడినవాడై, ఆమెను విడచి, శీఘ్రముగా నా దగ్గరకు వచ్చును. 5. 6

మూ. రాక్షసైః సహితైర్నూనం సీతాయా ఈప్సితో వధః,
కాఞ్చనశ్చ మృగో భూత్వా వ్యపనీయాశ్రమాత్తు మామ్,
దూరం నీత్వా తు మారీచో రాక్షసోఽభూచ్ఛరాహతః,
హా లక్ష్మణ హతోఽస్మీతి యద్వాక్యం వ్యాజహార హ. 8

ప్ర. అ. యత్ = ఏ కారణమువలన, మారీచః = మారీచుడు, కాఞ్చనః మృగః = బంగారు లేడిగా, భూత్వా = అయి, మామ్ = నన్ను, ఆశ్రమాత్ = ఆశ్రమమునుండి, వ్యపనీయ = తొలగించి, దూరమ్ = దూరముగా, నీత్వా = తీసికొనివెళ్లి, శరాహతః = బాణముచేత కొట్టబడినవాడై, రాక్షసః = రాక్షసుడుగా, అభూత్ = ఆయెనో, హా లక్ష్మణ = అయ్యో ! లక్ష్మణా ! హతః అస్మి = చంపబడితిని, ఇతి = అని, వాక్యమ్ = వాక్యమును, వ్యాజహార = పలికెనో, (అందువలన), సహితైః = కలిసిన, రాక్షసైః = రాక్షసులచేత, సీతాయాః = సీతయొక్క, వధః = వధ, ఈప్సితః = చేయ తలపెట్టబడినది, నూనమ్ = నిశ్చయము.

తా. రాక్షసు లందరూ కలిసి సీతను చంపవలె నని ఉపాయము పన్నినారు. సందేహము లేదు. అందుచేతనే మారీచుడు బంగారు లేడి రూపము ధరించి, నన్ను ఆశ్రమమునుండి దూరముగా తీసికొనిపోయి, బాణముచేత చంపబడినప్పుడు "అయ్యో ! లక్ష్మణా ! చచ్చితిని" అని పలికినాడు. 7, 8

మూ. అపి స్వస్తి భవేత్తాభ్యాం రహితాభ్యాం మహావనే,
జనస్థాననిమిత్తం హి కృతవైరోఽస్మి రాక్షసైః, 9
నిమిత్తాని చ ఘోరాణి దృశ్యన్తేఽద్య బహూని చ

ప్ర. అ. మహావనే = మహావనమునందు, రహితాభ్యామ్=(నాతో) శూన్యులైన, తాభ్యామ్ = వారిద్దరికీ, స్వస్తి = క్షేమము, అపి భవేత్=అగునా ? జనస్థాన నిమిత్తమ్ = జనస్థానము నిమిత్తము, రాక్షసైః = రాక్షసులతో, కృతవైరః = చేయబడిన వైరము కలవాడను, అస్మి హి = అయి ఉన్నాను కదా ! అద్య = ఇప్పుడు, ఘోరాణి = భయంకరములైన, బహూని = అనేకములైన, నిమిత్తాని చ = శకునములు కూడ, దృశ్యన్తే = చూడబడుచున్నవి.

తా. మహావనములో, నేను దగ్గర లేని సమయమునందు ఆ సీతాలక్ష్మణులు క్షేమముగా ఉందురా ? జనస్థానము మూలమున నాకు రాక్షసులతో వైరమేర్పడినది కదా ! ఇప్పుడు భయంకరములైన అనేక అపశకునములు కూడా కనబడుచున్నవి. 9

మూ. ఇత్యేవం చిన్తయన్రామః శ్రుత్వా గోమాయునిస్స్వనమ్,
ఆత్మనశ్చాపనయనాన్మృగరూపేణ రక్షసా,
ఆజగామ జనస్థానం రాఘవః పరిశఙ్కితః. 11

ప్ర. అ. రాఘవః = రఘువంశమునందు పుట్టిన, రామః = రాముడు, గోమాయునిస్స్వనమ్ = నక్క కూతను, శ్రుత్వా = విని, ఇత్యేవమ్ = ఇట్లు, చిన్తయన్ = చింతించుచు, మృగరూపేణ = మృగరూపము గల, రక్షసా = రాక్షసునిచేత, ఆత్మనః = తనయొక్క, అపనయనాత్ = దూరముగా తొలగించుటవలన, పరిశఙ్కితః = శంకించుచున్నవాడై, జనస్థానమ్ = జనస్థానమును గూర్చి, ఆజగామ = వచ్చెను.

తా. రఘువంశసంజాతుడైన ఆ రాముడు నక్క కూత విని ఈ విధముగా ఆలోచించుచు, ఆ రాక్షసుడు మృగరూపము ధరించి తనను దూరముగా తీసికొనిపోయినందుకు శంకాకులమైన మనస్సుతో జనస్థానము వైపు వెళ్లెను. 10;11

మూ. తం దీనమనసో దీనమాసేదుర్మృగపక్షిణః,
సవ్యం కృత్వా మహాత్మానం ఘోరాంశ్చ సస్సృజుః స్వనాన్.

ప్ర. అ. దీనమనసః = దీనమైన మనస్సు గల, మృగపక్షిణః = మృగములు, పక్షులు, దీనమ్ = దీనుడైన, మహాత్మానమ్ = మహాత్ముడైన, తమ్ = ఆ

రాముణ్ణి, సవ్యమ్ కృత్వా = ఎడమ ప్రక్కగా తిరుగుచు, ఆసేదుః = సమీపించి నవి. ఘోరాన్ = ఘోరములైన, స్వరాన్ = స్వరములను, సస్రుజుశ్చ = విడిచి నవి.

తా. మృగములూ, పక్షులూ, దీనమైన మనస్సుతో కూడినవై, దీనుడైన ఆ మహాత్మునకు ఎడమ వైపుగా తిరుగుచు సమీపించి ఘోరముగా ధ్వని చేసి నవి. 12

మూ. తాని దృష్ట్వా నిమిత్తాని మహాఘోరాణి రాఘవః,
న్యవర్తతాథ త్వరితో జవేనాశ్రమమాత్మనః. 13

ప్ర. అ. రాఘవః = రాముడు, మహాఘోరాణి = చాలా భయంకరములైన, తాని నిమిత్తాని = ఆ శకునములను, దృష్ట్వా = చూచి, అథ = అటుపిమ్మట, త్వరితః = తొందరపడుచున్నవాడై, జవేన = వేగముతో, ఆత్మనః = తనయొక్క, ఆశ్రమమ్ = ఆశ్రమమును గూర్చి, న్యవర్తత = మరలెను.

తా. రాముడు చాల భయంకరములైన ఆ శకునములను చూచి, తొందర పడుచు, వేగముగా తన ఆశ్రమము వైపు మరలి వచ్చెను. 13

మూ. సీతాం స తు వరారోహాం లక్ష్మణం చ మహాబలమ్,
ఆజగామ జనస్థానం చిన్తయన్నేవ రాఘవః. 14

ప్ర. అ. సః రాఘవః = ఆ రాముడు, వరారోహామ్ = శ్రేష్ఠమైన కటి ప్రదేశము గల, సీతామ్ = సీతను గూర్చి, మహాబలమ్ = గొప్ప బలము గల, లక్ష్మణం చ = లక్ష్మణుని గూర్చి, చిన్తయన్నేవ = ఆలోచించుచునే, జనస్థానమ్ = జనస్థానమును గూర్చి, ఆజగామ = వచ్చెను.

తా. ఆ రాముడు సుందరమైన కటిప్రదేశము గల సీతను గూర్చి, మహా బలవంతుడైన లక్ష్మణుని గూర్చి ఆలోచించుచు జనస్థానము వైపు వచ్చెను. 14

మూ. తతో లక్ష్మణమాయాన్తం దదర్శ విగతప్రభమ్,
తతోఽవిదూరే రామేణ సమీయాయ స లక్ష్మణః, 15
విషణ్ణః సువిషణ్ణేన దుఃఖితో దుఃఖభాగినా.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ఆయాన్తమ్=వచ్చుచున్న, విగతప్రభమ్ = పోయిన కాంతి గల, లక్ష్మణమ్ = లక్ష్మణుని, దదర్శ = చూచెను. తతః = అటు పిమ్మట, విషణ్ణః = దిగులుచెందినవాడు, దుఃఖితః = దుఃఖితుడు అయిన, సః లక్ష్మణః = ఆ లక్ష్మణుడు, సువిషణ్ణేన = మిక్కిలి దిగులు చెందిన, దుఃఖ భాగినా = దుఃఖమును పొందిన, రామేణ=రామునితో, అవిదూరే=కొద్ది దూరమునందు, సమియాయ = కలిసెను.

తా. పిమ్మట దిగులు చెంది, దుఃఖాక్రాంతుడై ఉన్న ఆ లక్ష్మణుడు, చాల దుఃఖితుడై, దిగులు చెంది యున్న రాముణ్ణి కొద్ది దూరమునందే కలిసికొనెను. 15

మూ. సంజగర్హేఽథ తం భ్రాతా జ్యేష్ఠో లక్ష్మణమాగతమ్, 16
విహాయ సీతాం విజనే వనే రాక్షససేవితే.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, జ్యేష్ఠః భ్రాతా = అన్నగారైన రాముడు, రాక్షససేవితే = రాక్షసులచేత సేవింపబడిన, విజనే = విజనమైన, వనే = వనమునందు, సీతామ్ = సీతను, విహాయ = విడచి, ఆగతమ్=వచ్చిన, తం లక్ష్మణమ్ = ఆ లక్ష్మణుణ్ణి, సంజగర్హే = నిందించెను.

తా. అప్పుడు జ్యేష్ఠసోదరుడైన రాముడు రాక్షసులకు నివాసమైన ఆ విజనమైన వనమునందు సీతను ఒంటరిగా విడిచి వచ్చిన ఆ లక్ష్మణుని నిందించెను. 16

మూ. గృహీత్వా చ కరం సవ్యం లక్ష్మణం రఘునన్దనః, 17
ఉవాచ మధురోదర్కమిదం పరుషమార్తవత్.

ప్ర. అ. రఘునన్దనః = రాముడు, ఆర్తవత్ = దుఃఖపీడితుడై, సవ్యం కరమ్ = కుడి చేతిని, గృహీత్వా = గ్రహించి, మధురోదర్కమ్ = మధురమైన భావిఫలము గల, పరుషమ్ = పరుషమైన, ఇదమ్ = ఈ వాక్యమును, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, ఉవాచ = పలికెను.

తా. రాముడు చాల దుఃఖించుచు, లక్ష్మణుని కుడి చెయ్యి తన చేతితో పట్టుకొని, భవిష్యత్తులో మంచి ఫలము గల పరుషమైన వాక్యమును ఇట్లు పలికెను. 17

మూ. అహో లక్ష్మణ గర్హ్యం తే కృతం యస్త్వం విహాయ తామ్,
సీతామిహాగతః సౌమ్య కచ్చిత్స్వస్తి భవేదిహ.

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా ! లక్ష్మణ = లక్ష్మణా ! యః త్వమ్ = ఏ నీవు, తామ్ = ఆ, సీతామ్ = సీతను, విహాయ = విడచి, ఇహ = ఇక్కడికి, ఆగతః = వచ్చినావో, తే = అట్టి నీకు, (నీచేత), గర్హ్యమ్ = నిందింపదగిన పని, కృతమ్ = చేయబడినది. ఇహ = ఇప్పుడు, స్వస్తి = క్షేమము, భవేత్ కచ్చిత్ = అగునా? అహో = అయ్యో !

తా. సౌమ్యుడవైన లక్ష్మణా ! నీవు సీతను విడచి ఇక్కడికి వచ్చినావు; అయ్యో ! నీ వెంత పెద్ద పని చేసితివి! ఇప్పుడు అంతా క్షేమముగా ఉండునా! 18

మూ. న మేఽస్తి సంశయో వీర సర్వథా జనకాత్మజా, 19
వినష్టా భక్షితా వాపి రాక్షసైర్వనచారిభిః,
అశుభాన్యేవ భూయిష్ఠం యథా ప్రాదుర్భవన్తి మే. 20

ప్ర. అ. వీర = ఓ ! వీరుడా ! మే = నాకు, భూయిష్ఠమ్ = అధికముగా, అశుభాన్యేవ = అశుభములే, యథా = ఎట్లు, ప్రాదుర్భవన్తి = కనబడుచున్నవో, దానిని పట్టి, జనకాత్మజా = సీత, సర్వథా = అన్ని విధములా, వినష్టా = నశించినది గాని, వనచారిభిః = వనములో సంచరించు, రాక్షసైః = రాక్షసులచేత, భక్షితా వాపి = భక్షింపబడినది గాని, అయి ఉండును. మే = నాకు, సంశయః = సంశయము, నాస్తి = లేదు.

తా. ఓ ! లక్ష్మణా! నాకు అన్నీ అశుభమైన శకునములే కనబడుచున్నవి. వీటిని బట్టి, అన్ని విధాలా, సీత నశించియేనా ఉండును, లేదా వనములో సంచరించే రాక్షసులచేత భక్షింపబడి ఉండును. నా కేమీ సందేహము లేదు. 19, 20

మూ. అపి లక్ష్మణ సీతాయాః సామగ్ర్యం ప్రాప్నుయావహే,
జీవన్త్యాః పురుషవ్యాఘ్ర సుతాయా జనకస్య వై. 21

ప్ర. అ. పురుషవ్యాఘ్ర = పురుషశ్రేష్ఠుడవైన, లక్ష్మణ = లక్ష్మణా ! జీవన్త్యాః = జీవించి యున్న, జనకస్య సుతాయాః = జనకపుత్రియైన, సీతాయాః

= సీతయొక్క, సామగ్ర్యమ్ = పరిపూర్ణత్వమును, అపి ప్రాప్నుయావహే = పొందుదుమా?

తా. పురుషశ్రేష్ఠుడవైన లక్ష్మణా! జనకరాజపుత్రియైన సీతను, ప్రాణాలతో, ఎట్టి అపాయమూ లేని పరిపూర్ణశరీరముతో చూడగలుగుతామా? 21

మూ. యథా వై మృగసంఘాశ్చ గోమాయుశ్చైవ భైరవమ్,
వాశ్యన్తే శకునాశ్చాపి ప్రదీప్తా మభితో దిశమ్, 22
అపి స్వస్తి భవేత్తస్యా రాజపుత్ర్యా మహాబల.

ప్ర. అ. మహాబల = గొప్ప బలము గలవాడా! మృగసంఘాశ్చ = మృగముల గుంపులు, గోమాయుశ్చ = నక్క, శకునాశ్చాపి = పక్షులు, ప్రదీప్తామ్ = మండుచున్న, దిశమ్ అభితః = దిక్కు వైపు, యథా = ఎట్లు, భైరవమ్ = భయంకరముగా, వాశ్యన్తే = అరచుచున్నవో, (దీనిని బట్టి), రాజపుత్ర్యాః = రాజపుత్రియైన, తస్యాః = ఆ సీతకు, స్వస్తి = క్షేమము, అపి భవేత్ = అగునా?

తా. మంటలు మండుచున్న దిక్కు వైపు తిరిగి మృగాల గుంపులు, నక్క, పక్షులు భయంకరముగా అరచుచున్నవి. దీనిని బట్టి రాజకుమారియైన సీత క్షేమముగా ఉండునా అని సందేహము కలుగుచున్నది. 22

మూ. ఇదం హి రక్షో మృగసంనికాశం
ప్రలోభ్య మాం దూరమనుప్రయాన్తమ్,
హతం కథంచిన్మహతా శ్రమేణ
స రాక్షసోఽభూన్మ్రియమాణ ఏవ. 23

ప్ర. అ. మృగసంనికాశమ్ = మృగముతో సమానమైన, ఇదం రక్షః = ఈ రాక్షసుడు, అనుప్రయాన్తమ్ = అనుసరించి వెళ్లుచున్న, మామ్ = నన్ను, దూరమ్ = దూరముగా, ప్రలోభ్య = లోభ పెట్టి తీసికొనిపోయి, మహతా = గొప్ప, శ్రమేణ = శ్రమచేత, కథంచిత్ = ఎటులనో, హతమ్ = చంపబడినాడు. సః = ఆ మృగము, మ్రియమాణ ఏవ = చచ్చుచుండగానే, రాక్షసః = రాక్షసుడుగా, అభూత్ = అయెను.

తా. మృగరూపములో ఉన్న ఆ రాక్షసుడు అనుసరించి వెళ్లిన నన్ను

లోభపెట్టి చాల దూరము తీసికొనిపోయినాడు. ఆ మృగమును చాల శ్రమచేత ఎటులనో చంపితిని. అది చావగానే రాక్షసుడుగా మారిపోయినది. 23

మూ. మనశ్చ మే దీనమిహాప్రహృష్టం
చక్షుశ్చ సవ్యం కురుతే వికారమ్,
అసంశయం లక్ష్మణ నాస్తి సీతా
హృతా మృతా వా పథి వర్తతే వా. 24

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకియే ఆదికావ్యే అరణ్యకాణ్డే
సప్తపఞ్చాశః సర్గః.

ప్ర. అ. ఇహ = ఈ సమయమునందు, దీనమ్=దీనమైన, మే మనశ్చ= నా మనస్సు కూడ, అప్రహృష్టమ్ = సంతోషము లేకుండా ఉన్నది. సవ్యం చక్షుశ్చ= ఎడమ కన్ను కూడ, వికారమ్ = వికారమును, కురుతే = చేయుచున్నది. లక్ష్మణ = లక్ష్మణా! అసంశయమ్ = నిస్సంశయముగా, సీతా=సీత, నాస్తి = (ఆశ్రమములో) లేదు. హృతా=హరింపబడి ఉండవలెను, మృతా వా= లేదా మరణించి ఉండవలెను. పథి= మార్గమధ్యమునందు, వర్తతే వా= ఉండవలెను.

తా. నా మనస్సు ఇప్పుడు, దైన్యముతో నిండినదై సంతోషవిహీనముగా ఉన్నది. నా ఎడమ కన్ను కూడ అదరుచున్నది. లక్ష్మణా! సీత ఆశ్రమములో ఉండదు. సందేహము లేదు. హరింపబడి ఉండవలె; లేదా మరణించి ఉండవలె; లేదా హరింపబడుచు మార్గమధ్యములో ఉండవలె. 24

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
అరణ్యకాండలో ఏబదిఏడవ సర్గ సమాప్తము.

అథ అష్టపఞ్చాశః సర్గః

[అనేకవిధాల ఆలోచనలతో రాముడు లక్ష్మణునితో ఆశ్రమము చేరుట. అక్కడ సీతను కానక దుఃఖాక్రాంతు డగుట.]

మూ. స దృష్ట్వా లక్ష్మణం దీనం శూన్యే దశరథాత్మజః,
పర్యపృచ్ఛత ధర్మాత్మా వైదేహీమాగతం వినా. 1

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, సః దశరథాత్మజః = ఆ రాముడు, శూన్యే = జనశూన్యమైన ఆ అరణ్యమునందు, వైదేహీం వినా = సీత లేకుండగా, ఆగతమ్ = వచ్చిన, దీనమ్ = దీనుడైన, లక్ష్మణమ్ = లక్ష్మణుణ్ణి, దృష్ట్వా = చూచి, పర్యపృచ్ఛత = అడిగెను.

తా. ధర్మాత్ముడైన ఆ రాముడు ఆ శూన్యారణ్యములో, సీత లేకుండా వచ్చిన దీనుడైన లక్ష్మణుణ్ణి చూచి, ఇట్లు అడిగెను. 1

మూ. ప్రస్థితం దణ్డకారణ్యం యా మామనుజగామ హ,
క్వ సా లక్ష్మణ వైదేహీ యాం హిత్వా త్వమిహాగతః. 2

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా! దణ్డకారణ్యమ్ = దండకారణ్యమును గూర్చి. ప్రస్థితమ్ = ప్రయాణమైన, మామ్ = నన్ను, యా = ఏ సీత, అనుజగామ హ = అనుసరించి వచ్చెనో, యామ్ = ఏ సీతను, హిత్వా = విడచి, త్వమ్ = నీవు, ఇహ = ఇక్కడికి, ఆగతః = వచ్చినావో, సా వైదేహీ = ఆ సీత, క్వ = ఎక్కడ?

తా. ఏ సీత దండకారణ్యానికి బయలుదేరిన నా వెనుకనే వచ్చినదో, ఏ సీతను నీవు విడిచి వచ్చినావో ఆ సీత ఎక్కడ ఉన్నది? 2

మూ. రాజ్యభ్రష్టస్య దీనస్య దణ్డకాన్ పరిధావతః,
క్వ సా దుఃఖసహాయా మే వైదేహీ తనుమధ్యమా. 3

ప్ర. అ. రాజ్యభ్రష్టస్య = రాజ్యభ్రష్టుడనై, దణ్డకాన్ = దండకారణ్యమును గూర్చి, పరిధావతః = పరుగెత్తుచున్న, దీనస్య = దీనుడ నైన, మే = నాకు, దుఃఖసహాయా = దుఃఖసమయమునందు సహాయురాలుగా నిలచిన, తనుమధ్యమా = సన్నని నడుము గల, సా వైదేహీ = ఆ సీత, క్వ = ఎక్కడ ?

తా. రాజ్యభ్రష్టుడనై నేను దీనుడనై దంధకారణ్యానికి శీఘ్రముగా పోవుచున్న సమయమునందు నాకు దుఃఖసమయమునందు సహాయురాలుగా నిలచిన ఆ సన్నని నడుము గల సీత ఎక్కడ ? 3

మూ. యాం వినా నోత్సహే వీర ముహూర్తమపి జీవితుమ్,
క్వ సా ప్రాణసహాయా మే సీతా సురసుతోపమా. 4

ప్ర. అ. వీర = వీరుడా ! యాం వినా = ఎవ్వతె లేకుండగా, ముహూర్తమపి = ముహూర్తకాలము కూడ, జీవితుమ్ = జీవించుటకు, నోత్సహే = ఇచ్ఛయించనో, సా = అట్టి, సురసుతోపమా = దేవతా కుమారితో సమానురాలైన, మే = నాయొక్క, ప్రాణసహాయా = ప్రాణములకు సహాయభూతురాలైన, సీతా = సీత, క్వ = ఎక్కడ ?

తా. ఓ ! వీరుడవైన లక్ష్మణా ! ఎవ్వతె లేనిచో నేను ముహూర్తకాలము కూడ జీవించలేనో అట్టి దేవతాస్త్రీతో సమానురాలు, నా ప్రాణాలకు సహాయభూతురాలు అయిన సీత ఎక్కడ ? 4

మూ. పతిత్వమమరాణాం వా పృథివ్యాశ్చాపి లక్ష్మణ,
తాం వినా తపనీయాభాం నేచ్ఛేయం జనకాత్మజామ్. 5

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! తపనీయాభామ్ = బంగారు వర్ణము గల, తామ్ = ఆ, జనకాత్మజాం వినా = సీత లేకుండా, అమరాణామ్ = దేవతలయొక్క, పతిత్వమ్ = ఆధిపత్యమును గాని, పృథివ్యాశ్చ = భూమియొక్క అధిపత్యమును గాని, నేచ్ఛేయమ్ = కోరను.

తా. లక్ష్మణా ! బంగారు రంగు గల ఆ సీత లేకుండా నాకు దేవతాధిపత్యము కాని, భూలోకరాజ్యము గాని ఇష్టము కాదు. 5

మూ. కచ్చిజ్జీవతి వైదేహీ ప్రాణైః ప్రియతరా మమ,
కచ్చిత్ప్రవ్రాజనం సౌమ్య న మే మిథ్యా భవిష్యతి. 6

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా ! మమ = నాకు, ప్రాణైః = ప్రాణములతో, ప్రియతరా = ఎక్కువ ఇష్టురాలైన, వైదేహీ = సీత, జీవతి కచ్చిత్ = జీవించి ఉన్నది కదా ! మే = నాయొక్క, ప్రవ్రాజనమ్ = అడవికి పంపుట, మిథ్యా = అసత్యము (వ్యర్థము), న భవిష్యతి కచ్చిత్ = కాదు కదా !

తా. ఓ ! సౌమ్యుడా ! నాకు ప్రాణములకంటె కూడ ప్రియురాలైన సీత జీవించి ఉండునుకదా ! నేను చేసిన ఈ అరణ్యనివాసము వ్యర్థముకాదు కదా!

మూ. సీతానిమిత్తం సౌమిత్రే మృతే మయి గతే త్వయి,
కచ్చిత్సకామా సుఖితా కైకేయీ సా భవిష్యతి. 7

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా ! సీతానిమిత్తమ్ = సీతకొరకై, మయి = నేను, మృతే = మరణించినవాడ నగుచుండగా, త్వయి = నీవు, గతే = వెళ్ళిన వాడవగుచుండగా, సా కైకేయీ = ఆ కైకేయి, సకామా = తీరిన కోరిక గలదై, సుఖితా = సుఖించినది, భవిష్యతి కచ్చిత్ = అగునా !

తా. లక్ష్మణా ! సీత కోసమై నేను మరణించగా, నీవు తిరిగి అయోధ్య చేరగా, కైకేయి కోరిక తీరి ఆనందించునా ఏమి ? 7

మూ. సపుత్రరాజ్యాం సిద్ధార్థాం మృతపుత్రా తపస్వినీ,
ఉపస్థాస్యతి కౌసల్యా కచ్చిత్సౌమ్య న కేకయీమ్. 8

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా ! మృతపుత్రా = మరణించిన పుత్రుడు గల, తపస్వినీ = దీనురాలైన, కౌసల్యా = కౌసల్య, సపుత్రరాజ్యామ్ = పుత్రునితోను రాజ్యముతోను కూడిన, సిద్ధార్థామ్ = సిద్ధించిన ప్రయోజనము గల, కేకయీమ్ = కైకేయిని, న ఉపస్థాస్యతి కచ్చిత్ = సేవించదు కదా !

తా. లక్ష్మణా ! పుత్రుడు మరణించగా దీనురాలైన కౌసల్య, పుత్రవంతు రాలై రాజ్యమును సంపాదించి కోరిక సిద్ధించిన కైకేయిని సేవించవలసి ఉండునా!

మూ. యది జీవతి వైదేహీ గమిష్యామ్యాశ్రమం పునః,
సువృత్తా యది వా వృత్తా ప్రాణాంస్త్యక్ష్యామి లక్ష్మణ. 9

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! వైదేహీ = సీత, జీవతి యది = జీవించి ఉన్నట్లయితే, పునః = మరల, ఆశ్రమమ్ = ఆశ్రమమును గూర్చి, గమిష్యామి = వెళ్లగలను. యది వా = లేక, సువృత్తా = మంచి చరిత్రగల ఆమె, వృత్తా = మరణించినచో, ప్రాణాన్ = ప్రాణములను, త్యక్ష్యామి = విడచెదను.

తా. లక్ష్మణా ! సీత జీవించి ఉన్నట్లయితే తిరిగి ఆశ్రమానికి వెళ్లెదను. ఉత్తమమైన చరిత్ర గల ఆమె మరణించినచో ప్రాణములు విడచెదను. 9

మూ. యది మామాశ్రమగతం వైదేహీ నాభిభాషతే,
పునః ప్రహసితా సీతా వినశిష్యామి లక్ష్మణ. 10

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! ఆశ్రమగతమ్ = ఆశ్రమమునకు వెళ్ళిన, మామ్ = నన్ను, వైదేహీ = జనకుని కుమార్తె యైన, సీతా = సీత, ప్రహసితా = నవ్వుచున్నదై, పునః = మరల, నాభిభాషతే యది = పలకరించకపోయినట్లయితే, వినశిష్యామి = నశించెదను.

తా. లక్ష్మణా ! నేను ఆశ్రమమునకు వెళ్ళ సరికి, జనకరాజనందనయైన సీత నవ్వుచూ నన్ను పలకరించకపోయినట్లయితే నేను మరణించెదను. 10

మూ. బ్రూహి లక్ష్మణ వైదేహీ యది జీవతి వా న వా,
త్వయి ప్రమత్తే రక్షోభిర్భక్షితా వా తపస్వినీ. 11

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! వైదేహీ = సీత, జీవతి వా = జీవించి ఉన్నదా; న వా = లేదా? త్వయి = నీవు, ప్రమత్తే = ఏమరుపాటు చెంది ఉండగా, తపస్వినీ = దీనురాలైన ఆమె, రక్షోభిః = రాక్షసులచేత, భక్షితా వా = భక్షింపబడినదా? బ్రూహి = చెప్పుము.

తా. లక్ష్మణా ! సీత జీవించి ఉన్నదా లేదా? నీవు ఏమరి ఉండగా దీనురాలైన ఆమెను రాక్షసులు భక్షించివేసినారా ? చెప్పుము. 11

మూ. సుకుమారీ చ బాలా చ నిత్యం చాదుఃఖదర్శినీ,
మద్వియోగేన వైదేహీ వ్యక్తం శోచతి దుర్మనాః. 12

ప్ర. అ. సుకుమారీ చ=సుకుమారురాలు, బాలా చ=చిన్న వయస్సులో ఉన్నది, నిత్యమ్ = నిత్యము, అదుఃఖదర్శినీ = దుఃఖమును చూడనిదీ అయిన, వైదేహీ = సీత, దుర్మనాః = దుఃఖించిన మనస్సు కలదై, మద్వియోగేన = నా వియోగముచేత, శోచతి = దుఃఖించుచున్నది. వ్యక్తమ్ = స్పష్టము.

తా. సుకుమారురాలు, చిన్నవయస్సులో ఉన్నది, ఎన్నడూ (వియోగ) దుఃఖమును చూడనిదీ అయిన సీత నా వియోగము మనస్సును పీడించగా దుఃఖించుచుండును; సత్యము. 12

మూ. సర్వథా రక్షసా తేన జిహ్మేన సుదురాత్మనా,
వదతా లక్ష్మణేత్యుచ్చైస్తవాపి జనితం భయమ్. 13

ప్ర. అ. జిహ్మేన = వక్రస్వభావము గలవాడు, సుదురాత్మనా = చాల దుష్టబుద్ధి గలవాడు అయిన, లక్ష్మణ ఇతి = లక్ష్మణా అని, ఉచ్చైః = గట్టిగా, వదతా = పలికిన, తేన రక్షసా = ఆ రాక్షసునిచేత, సర్వథా=అన్ని విధములా, తవాపి = నీకు కూడా, భయమ్ = భయము, జనితమ్ = పుట్టించబడినది.

తా. వక్రస్వభావము గల దుర్బుద్ధియైన ఆ రాక్షసుడు "లక్ష్మణా" అని గట్టిగా అరచినపుడు, బహుశా నీకు కూడ భయము కలిగి యుండును. 13

మూ. శ్రుతస్తు శఙ్కే వైదేహ్యా స స్వరః సదృశో మమ,
త్రస్తయా ప్రేషితస్త్వం చ ద్రష్టుం మాం శీఘ్రమాగతః.

ప్ర. అ. వైదేహ్యా=సీతచేత, మమ=నా స్వరమునకు, సదృశః=సమానమైన, సః=ఆ, స్వరః = స్వరము, శ్రుతః = వినబడినది అని, శఙ్కే=ఊహించుచున్నాను. త్రస్తయా = భయపడిన ఆమెచేత, ప్రేషితః = పంపబడినవాడవై, త్వం చ = నీవు, మామ్ = నన్ను, ద్రష్టుమ్ = చూచుటకు, శీఘ్రమ్ = శీఘ్రముగా, ఆగతః = వచ్చినావు.

తా. నా కంఠస్వరము వంటి స్వరమును విని భయపడిన సీత పంపగా నీవు నన్ను చూచుటకై శీఘ్రముగా వచ్చి ఉంటా వని ఊహించుచున్నాను. 14

మూ. సర్వథా తు కృతం కష్టం సీతాముత్సృజతా వనే,
ప్రతికర్తుం నృశంసానాం రక్షసాం దత్తమన్తరమ్. 15

ప్ర. అ. సీతామ్ = సీతను, వనే = వనమునందు, ఉత్సృజతా = విడచిన నీచేత, సర్వథా = అన్ని విధములా, కష్టమ్ = దుఃఖకర మైన పని, కృతమ్ = చేయబడినది. ప్రతికర్తుమ్ = ప్రతీకారము చేయుటకు, నృశంసానామ్ = క్రూరులైన, రక్షసామ్ = రాక్షసులకు, అన్తరమ్ = అవకాశము, దత్తమ్ = ఇవ్వబడినది.

తా. నీవు సీతను వనములో ఒంటరిగా విడచి వచ్చుటచే చాల దుఃఖమును కలిగించు పని చేసినావు. క్రూరులైన రాక్షసులకు మన విషయమున ప్రతిక్రియ చేయుటకు అవకాశము ఇచ్చిన ట్లయినది. 15

మూ. దుఃఖితాః ఖరఘాతేన రాక్షసాః పిశితాశనాః,
తైః సీతా నిహతా ఘోరైర్భవిష్యతి న సంశయః. 16

ప్ర. అ. పిశితాశనాః = నరమాంసభక్షకులైన, రాక్షసాః = రాక్షసులు, ఖరఘాతేన = ఖరుని సంహారముచేత, దుఃఖితాః = దుఃఖించి యున్నారు. ఘోరైః = భయంకరులైన, తైః = వాళ్లచేత, సీతా = సీత, నిహతా = చంపబడినది, భవిష్యతి = కాగలదు. సంశయః = సంశయము, న = లేదు.

తా. నరమాంసమును భక్షించే రాక్షసు లందరూ నేను ఖరుణ్ణి చంపుటచేత దుఃఖితులై ఉన్నారు. క్రూరులైన వాళ్లు సీతను చంపి ఉందురు. సందేహము లేదు. 16

మూ. అహోఽస్మిన్వ్యసనే మగ్నః సర్వథా శత్రుసూదన,
కిం న్విదానీం కరిష్యామి శఙ్కే ప్రాప్తవ్యమీదృశమ్. 17

ప్ర. అ. శత్రుసూదన = శత్రుసంహారకుడా ! సర్వథా = అన్నివిధాల, అస్మిన్ = ఈ, వ్యసనే = దుఃఖమునందు, మగ్నః = మునిగినాను. ఇదానీమ్ = ఇప్పుడు, కిం ను కరిష్యామి = ఏమి చేయుదును ? ఈదృశమ్ = ఇట్టి, దుఃఖము, ప్రాప్తవ్యమ్ = పొందదగి ఉన్నది అని, శఙ్కే = ఊహించుచున్నాను. అహో = అయ్యో !

తా. శత్రుసంహారకుడవైన ఓ లక్ష్మణా ! అయ్యో ! నేను అన్ని విధాలా ఈ వ్యసనములో మునిగి పోయినాను. ఇప్పుడు ఏమి చేయుదును ? నాకు ఇట్టి కష్టము రావలసి ఉన్నది కాబోలు. 17

మూ. ఇతి సీతాం వరారోహాం చిన్తయన్నేవ రాఘవః,
అజగామ జనస్థానం త్వరయా సహ లక్ష్మణః. 18

ప్ర. అ. రాఘవః = రాముడు, ఇతి = ఇట్లు, వరారోహామ్ = శ్రేష్ఠమైన కటిప్రదేశము గల, సీతామ్ = సీతను గూర్చి, చిన్తయన్నేవ = ఆలోచించుచు, సహ లక్ష్మణః = లక్ష్మణసమేతుడై, త్వరయా = తొందరతో, జనస్థానమ్ = జనస్థానమును గూర్చి, అజగామ = వచ్చెను.

తా. రాముడు, అందమైన కటిప్రదేశము గల సీతను గూర్చి ఈ విధముగా ఆలోచించుచునే, లక్ష్మణసమేతుడై, తొందరగా జనస్థానము చేరెను. 18

మూ. విగర్హమాణోఽనుజమార్తరూపం
క్షుధా శ్రమాచ్చైవ పిపాసయా చ,
వినిశ్శ్వసన్ శుష్కముఖో వివర్ణః
ప్రతిశ్రయం ప్రాప్య సమీక్ష్య శూన్యమ్. 19

స్వమాశ్రమం సంప్రవిగాహ్య వీరో
విహారదేశాననుసృత్య కాంశ్చిత్,
ఏతత్తదిత్యేవ నివాసభూమౌ
ప్రహృష్టరోమా వ్యథితో బభూవ 20

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
అష్టపఞ్చాశః సర్గః.

ప్ర. అ. వీరః = వీరుడైన రాముడు, ఆర్తరూపమ్ = మిక్కిలి దుఃఖితుడైన, అనుజమ్ = తమ్ముణ్ణి, విగర్హమాణః = నిందించుచు, క్షుధా = ఆకలిచేతను, శ్రమాచ్చైవ = అలసటవలనను, పిపాసయా చ = దప్పికచేతను, వినిఃశ్వసన్ = నిట్టూర్చుచు, శుష్కముఖః = ఎండిన ముఖము గలవాడై, వివర్ణః = మారిపోయిన శరీరచ్ఛాయ గలవాడై, ప్రతిశ్రయమ్ = ఆశ్రమప్రాంతమును, ప్రాప్య = పొంది, శూన్యమ్ = శూన్యమైనదానినిగా, సమీక్ష్య = చూచి, స్వమ్ = తన సంబంధమైన, ఆశ్రమమ్ = ఆశ్రమమును, సంప్రవిగాహ్య = ప్రవేశించి, కాంశ్చిత్ = కొన్ని,

విహారదేశాన్ = విహారప్రదేశములను, అనుసృత్య = అనుసరించి, నివాసభూమౌ = నివాసస్థానమునందు, (చూచి), ఏతత్ = ఇది, తదేవ = అదే, ఇతి = అని నిశ్చయించుకొని, ప్రహృష్టరోమా = గగుర్పొడిచిన రోమములు కలవాడై, వ్యథితః = వ్యథచెందినవాడుగా, బభూవ = ఆయెను.

తా. ఆ రాముడు మిక్కిలి దుఃఖించుచున్న తమ్ముణ్ణి నిందించుచు ఆశ్రమము వైపు వెళ్ళెను. ఆకలిచేత, అలసటచేత, దాహముచేత ఆతని ముఖము ఎండిపోయెను. శరీరము రంగు వాడిపోయెను. ఆతడు నిట్టూర్చుచు, ఆశ్రమ సమీపప్రాంత మంతా శూన్యముగా ఉన్నట్లు చూచి తన ఆశ్రమములో ప్రవేశించెను. అక్కడినుండి తాము విహరించుచుండు కొన్ని ప్రదేశములకు వెళ్లెను. అచటినుండి మరల నివాసస్థానమునకు వచ్చెను. సీత ఎక్కడా కనబడకపోవుటచే, "నేను అనుకొనినట్లే జరిగినది"అని అనుకొనుచు, శరీరము గగుర్పాటు చెంద, చాల దుఃఖించెను. 20

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో ఏబదిఎనిమిదవ సర్గ సమాప్తము

అథ ఏకోనషష్టితమః సర్గః

[రామలక్ష్మణుల సంభాషణము]

మూ. అథాశ్రమాదుపావృత్తమన్తరా రఘునన్దనః,
పరిపప్రచ్ఛ సౌమిత్రిం రామో దుఃఖార్దితం పునః. 1

ప్ర. అ. అథ = అటుపిమ్మట, రఘునన్దనః = రఘువంశమునకు ఆనంద వర్ధనుడైన, రామః = రాముడు, దుఃఖార్దితమ్ = దుఃఖముచేత పీడింపబడినవాడు, ఆశ్రమాత్ = ఆశ్రమమునుండి, ఉపావృత్తమ్ = తిరిగి వచ్చినవాడు అయిన, సౌమిత్రిమ్ = లక్ష్మణుణ్ణి, అన్తరా = మార్గమధ్యమునందు, పునః = మరల, పరిపప్రచ్ఛ = అడిగెను.

తా. రఘువంశమునకు ఆనందవర్ధనుడైన రాముడు, ఆశ్రమమునుండి వచ్చిన, దుఃఖార్తుడైన లక్ష్మణుణ్ణి, మార్గమధ్యములో, మరల ఇట్లు ప్రశ్నించెను.

మూ. తమువాచ కిమర్థం త్వమాగతోఽపాస్య మైథిలీమ్,
యదా సా తవ విశ్వాసాద్వనే విరహితా మయా. 2

ప్ర. అ. తమ్ = అతనిని గూర్చి, ఉవాచ = పలికెను. తవ = నీయొక్క, విశ్వాసాత్ = విశ్వాసమువలన, మయా = నాచేత, సా = ఆమె, వనే = వనమునందు, యదా = ఎప్పుడు, విరహితా = విడువబడినదో, మైథిలీమ్ = సీతను, కిమర్థమ్ = ఎందువలన, అపాస్య = విడచి, త్వమ్ = నీవు, ఆగతః = వచ్చినావు ?

తా. నేను నీమీద ఉన్న విశ్వాసముచేత సీతను అడవిలో విడచి వచ్చినాను కదా, అలాంటప్పుడు నీ వామెను విడచి ఎందుకు వచ్చినావు ? 2

మూ. దృష్ట్వైవాభ్యాగతం త్వాం మే మైథిలీం త్యజ్య లక్ష్మణ,
శఙ్కమానం మహత్పాపం యత్సత్యం వ్యథితం మనః.

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! మైథిలీమ్ = సీతను, త్యక్త్వా = విడచి, అభ్యాగతమ్ = వచ్చిన, త్వామ్ = నిన్ను, దృష్ట్వైవ = చూడగానే, మనః = నా మనస్సు, మహత్ = గొప్ప, పాపమ్ = పాపమును, శఙ్కమానమ్ = శంకించుచున్నదై, వ్యథితమ్ ఇతి యత్ = వ్యథ చెందిన దను విషయ మేది గలదో, అది, సత్యమ్ = సత్యము.

తా. లక్ష్మణా ! సీతను విడచి వచ్చుచున్న నిన్ను చూడగానే నా మనస్సు గొప్ప పాపమును శంకించుచు నిజముగానే వ్యథ చెందినది. 3

మూ. స్ఫురతే నయనం సవ్యం బాహుశ్చ హృదయం చ మే,
దృష్ట్వా లక్ష్మణ దూరే త్వాం సీతావిరహితం పథి. 4

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! సీతావిరహితమ్ = సీతతో శూన్యుడవైన, త్వామ్ = నిన్ను, దూరే = దూరమునందు, పథి = మార్గమునందు, దృష్ట్వా = చూచి, మే = నాయొక్క, సవ్యమ్ = ఎడమదైన, నయనమ్ = నేత్రము, బాహుశ్చ = బాహువు, స్ఫురతే = అదురుచున్నది. మే = నాయొక్క, హృదయం చ = హృదయము కూడ, అదరుచున్నది.

తా. లక్ష్మణా ! సీత లేకుండా వచ్చుచున్న నిన్ను మార్గమునందు దూరముగా చూడగానే నా ఎడమ కన్ను, ఎడమ బుజము అదిరినవి. హృదయము కంపించినది. 4

మూ. ఏవముక్తస్తు సౌమిత్రిర్లక్ష్మణః శుభలక్షణః,
భూయో దుఃఖసమావిష్టో దుఃఖితం రామమబ్రవీత్. 5

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, సౌమిత్రిః = సుమిత్ర కుమారుడైన, శుభలక్షణః = శుభమైన లక్షణములు గల, లక్ష్మణః = లక్ష్మణుడు, భూయః = మరల, దుఃఖసమావిష్టః = దుఃఖముచేత ఆవరింపబడినవాడై, దుఃఖితమ్ = దుఃఖించుచున్న, రామమ్ = రాముణ్ణి గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. సుమిత్ర కుమారుడు, శుభలక్షణములు కలవాడు అయిన లక్ష్మణుడు రాముని మాటలు విని, ఇంకను అధికముగా దుఃఖించుచు, దుఃఖాక్రాంతుడైన రామునితో ఇటు పలికెను. 5

మూ. న స్వయం కామకారేణ తాం త్యక్త్వాహమిహాగతః,
ప్రచోదిత స్తయైవోగ్రైస్త్వత్సకాశమిహాగతః. 6

ప్ర. అ. అహమ్ = నేను, తామ్ = ఆమెను, స్వయమ్ = స్వయముగా, త్యక్త్వా = విడచి, కామకారేణ = స్వేచ్ఛాచరణముచేత, ఇహ = ఇక్కడికి, న ఆగతః = రాలేదు. తయైవ = ఆమెచేతనే, ఉగ్రైః = తీవ్రములైన మాటలచేత, ప్రచోదితః = ప్రేరేపించబడినవాడనై, ఇహ = ఇక్కడికి, త్వత్సకాశమ్ = నీ సమీపమును గూర్చి, ఆగతః = వచ్చినాను.

తా. నేను నా అంతట నేనుగా ఆమెను విడచి, నా యిష్టము ప్రకారము ప్రవర్తించుచు ఇక్కడికి రాలేదు. తీవ్రములైన మాటలు పలికి ఆమె నన్ను ప్రేరేపించుటచే నేను ఇక్కడికి, నీ దగ్గరకు వచ్చినాను. 6

మూ. ఆర్యేణేవ పరాక్రుష్టం హా సీతే లక్ష్మణేతి చ,
పరిత్రాహీతి యద్వాక్యం మైథిల్యాస్తచ్ఛ్రుతిం గతమ్. 7

ప్ర. అ. హా సీతే = అయ్యో సీతా! హా లక్ష్మణ = అయ్యో లక్ష్మణా, ఇతి చ = అని, పరిత్రాహి ఇతి = రక్షించుము అని, యత్ = ఏ, వాక్యము, ఆర్యేణేవ = పూజ్యుడవైన నీచేత వలె, పరాక్రుష్టమ్ = అరవబడినదో, తత్ = అది, మైథిల్యాః = సీతయొక్క, శ్రుతిమ్ = చెవిని, గతమ్ = పొందినది.

తా. "అయ్యో! సీతా!" "అయ్యో! లక్ష్మణా!" అనీ, "రక్షించుము"అనీ వాక్యము నీవే పలికినట్లుగా సీత చెవికి వినబడినది. 7

మూ. సా తమార్తస్వరం శ్రుత్వా తవ స్నేహేన మైథిలీ,
గచ్ఛ గచ్ఛేతి మామాహ రుదన్తీ భయవిహ్వలా. 8

ప్ర. అ. సా మైథిలీ = ఆ సీత, తమ్ = ఆ, ఆర్తస్వరమ్ = దుఃఖితస్వరమును, శ్రుత్వా = విని, రుదన్తీ = ఏడ్చుచు, తవ స్నేహేన = నీమీద నున్న ప్రేమచేత, భయవిహ్వలా = భయముచేత వ్యాకులురాలై, గచ్ఛ గచ్ఛ ఇతి = వెళ్లుము వెళ్లుము అని, మామ్ = నన్ను గూర్చి, ఆహ = పలికెను.

తా. సీత ఆ దీనస్వరమును వినగానే నీపై ఉన్న ప్రేమచేత భయక్రాంతురాలై, ఏడ్చుచు, ''వెళ్లుము వెళ్లుము''అని నాతో పలికెను. 8

మూ. ప్రచోద్యమానేన మయా గచ్ఛేతి బహుశ స్తయా,
ప్రత్యుక్తా మైథిలీ వాక్యమిదం త్వత్ప్రత్యయాన్వితమ్. 9

ప్ర. అ. గచ్ఛ ఇతి = వెళ్లుము అని, తయా = ఆమెచేత, బహుశః = అనేకపర్యాయములు, ప్రచోద్యమానేన = ప్రేరేపింపబడుచున్న, మయా = నాచేత, మైథిలీ = సీత, త్వత్ప్రత్యయాన్వితమ్ = నీమీద(నాకున్న) నమ్మకముతో కూడిన, ఇదమ్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ప్రత్యుక్తా = పలకబడినది.

తా. ''వెళ్లుము వెళ్లుము''అని ఆమె అనేకపర్యాయములు ప్రేరేపించగా నేను నీ విషయమునందు నాకున్న విశ్వాసమును ప్రకటించుచు ఇట్లు పలికితిని. 9

మూ. న తత్పశ్యామ్యహం రక్షో యదస్య భయమావహేత్,
నిర్వృతా భవ నాస్త్యేతత్కేనాప్యేతదుదాహృతమ్. 10

ప్ర. అ. అస్య = ఈ రామునకు, యత్ = ఏ రాక్షసుడు, భయమ్ = భయమును, ఆవహేత్ = కలిగించునో, తత్ = అట్టి, రక్షః = రాక్షసుణ్ణి, అహమ్ = నేను, న పశ్యామి = చూడను. నిర్వృతా = సుఖము గలదానవు, భవ = అగుము. ఏతత్ = ఇది, నాస్తి = లేదు. కేనాపి = ఎవనిచేతనో, ఏవమ్ = ఇట్లు, ఉదాహృతమ్ = పలకబడినది.

తా. రామునకు భయము కలిగించ గల రాక్షసుడు ఉంటా దని నేను తలవను. నీవు నిర్భయముగా ఉండుము. ఇదంతా అసత్యము. ఎవ్వడో ఈ విధముగా అరచినాడు. 10

మూ. విగర్హితం చ నీచం చ కథమార్యోఽభిధాస్యతి,
త్రాహీతి వచనం సీతే యస్త్రాయేత్త్రిదశానపి. 11

ప్ర. అ. సీతే = సీతా ! యః = ఏ అన్నగారు, త్రిదశానపి = దేవతలను కూడ, త్రాయేత్ = రక్షించునో, ఆర్యః = అట్టి మా అన్నగారు, విగర్హితమ్ = నింద్యము, నీచం చ = నీచమూ అయిన, త్రాహి ఇతి = రక్షించుము అని, వచనమ్ = వచనమును, కథమ్ = ఎట్లు, అభిధాస్యతి = పలుకును ?

తా. సీతా ! దేవతలను కూడా రక్షింప సమర్థుడైన మా అన్నగారు,

నింద్యము, నీచము అయిన "రక్షించుము రక్షించుము" అను మాట ఎన్నడైనా వలుకునా ? 11

మూ. కింనిమిత్తం తు కేనాపి భ్రాతురాలమ్బ్య మే స్వరమ్,
రాక్షసేనేరితం వాక్యం త్రాహి త్రాహీతి శోభనే. 12

ప్ర. అ. శోభనే = శుభప్రదురాలా ! కిం నిమిత్తం తు = ఏ కారణము చేతనో, కేనాపి రాక్షసేన = ఎవ్వడో రాక్షసునిచేత, మే భ్రాతుః = నా సోదరుని యొక్క, స్వరమ్ = స్వరమును, ఆలమ్బ్య = గ్రహించి, త్రాహి త్రాహి ఇతి = రక్షించుము రక్షించుము అని, వాక్యమ్ = వాక్యము, ఈరితమ్ = వలకబడినది.

తా. మంగళప్రదురాలా ! ఎవ్వడో రాక్షసుడు, ఎందుచేతనో నా సోదరుని కంఠస్వరముతో "రక్షించుము రక్షించుము" అను వాక్యము పలికినాడు. 12

మూ. విస్వరం వ్యాహృతం వాక్యం లక్ష్మణ త్రాహి మామితి,
న భవత్యా వ్యథా కార్యా కునారీజనసేవితా. 13

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! మామ్ = నన్ను, త్రాహి = రక్షించుము, ఇతి = అని, విస్వరమ్ = విపరీతస్వరము గల, వాక్యమ్ = వాక్యము, వ్యాహృతమ్ = వలకబడినది. భవత్యా = నీచేత, కునారీజనసేవితా = సామాన్యస్త్రీజనముచేత సేవింపబడిన, వ్యథా = వ్యథ, న కార్యా = చేయదగినది కాదు.

తా. "లక్ష్మణా ! నన్ను రక్షించుము" అని విపరీతస్వరముతో ఎవ్వరో అరచినారు. నీవు సాధారణస్త్రీ వలె వ్యథ చెందకూడదు. 13

మూ. అలం వైక్లబ్యమాలమ్బ్య స్వస్థా భవ నిరుత్సుకా,
న సోఽస్తి త్రిషు లోకేషు పుమాన్వై రాఘవం రణే,

జాతో వా జాయమానో వా సంయుగే యః పరాజయేత్,
న జయ్యో రాఘవో యుద్ధే దేవైః శక్రపురోగమైః. 15

ప్ర. అ. వైక్లబ్యమ్ = వ్యాకులత్వమును, ఆలమ్బ్య = అవలంబించి, అలమ్ = చాలును, నిరుత్సుకా = తొందర లేనిదానవై, స్వస్థా భవ = స్వస్థురాలవు అగుము. యః = ఎవడు, సంయుగే రణే = తీవ్రమైన యుద్ధము

నందు, రాఘవమ్ = రాముణ్ణి, పరాజయేత్ = ఓడించునో, సః = అట్టి, పుమాన్ = పురుషుడు, త్రిషు లోకేషు = మూడు లోకములందూ కూడ, జాతో వా = పుట్టి ఉన్నవాడు కాని, జాయమానో వా=పుట్ట నున్నవాడు గాని, నాస్తి= లేడు. రాఘవః = రాముడు, శక్రపురోగమైః = దేవేంద్రుడు మొదలైన, దేవైః = దేవతలచేత, యుద్ధే = యుద్ధమునందు, న జయ్యః = జయింప శక్యము కాని వాడు.

తా. మనస్సు కలత చెందనీయకుము. ఏమైనదా అని చింతించకుము. స్వస్థురాలవై ఉండుము. యుద్ధములో రాముణ్ణి ఓడించగలిగినవాడు ఇంతవరకు పుట్టి ఉండలేదు. ఇకపైన పుట్టడు. దేవేంద్రుడు మొదలైన దేవతలు కూడ రాముణ్ణి యుద్ధములో జయించజాలరు. 14, 15

మూ. ఏవముక్తా తు వైదేహీ పరిమోహితచేతనా,
ఉవాచాశ్రూణి ముఞ్చన్తీ దారుణం మామిదం వచః. 16

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తా = పలకబడిన, వైదేహీ = సీత, పరిమోహితచేతనా = మోహింపచేయబడిన బుద్ధి గలదై, అశ్రూణి = కన్నీళ్ళను, ముఞ్చన్తీ = విడచుచున్నదై, మామ్ = నన్ను గూర్చి, ఇదం వచః = ఈ వచనమును, ఉవాచ = పలికెను.

తా. నా మాటలు వినిన పిమ్మట గూడ సీత మోహము చెందిన మనస్సుతో కన్నీళ్ళు కార్చుచు అతిక్రూరమైన మాటలు ఇట్లు పలికెను. 16

మూ. భావో మయి తవాత్యర్థం పాప ఏవ నివేశితః,
వినష్టే భ్రాతరి ప్రాప్తుం న చ త్వం మామవాప్స్యసి. 17

ప్ర. అ. భ్రాతరి = సోదరుడు, వినష్టే = నశించినవాడగుచుండగా, ప్రాప్తుమ్ = పొందుటకు, మయి=నాయందు, అత్యర్థమ్ = మిక్కిలి, పాపః ఏవ = పాపమైన, తవ = నీయొక్క, భావః = భావము, నివేశితః = ఉంచబడినది. త్వమ్ = నీవు, మామ్ = నన్ను, న చ అవాప్స్యసి = పొందవు.

తా. నీ సోదరుడు మరణించిన తరువాత నన్ను పొందవలెనని నా విషయమునందు చాల పాపమైన భావముతో ఉన్నావు. కాని నీవు నన్నెన్నటికీ పొందజాలవు

మూ. సంకేతాద్భరతేన త్వం రామం సమనుగచ్ఛసి,
క్రోశన్తం హి యథాత్యర్థం నైవమభ్యవపద్యసే. 18

ప్ర. అ. అత్యర్థమ్ = మిక్కిలి, క్రోశన్తమ్ = అరచుచున్న ఆ రాముణ్ణి, యథా = ఎట్లు, ఏవమ్ = ఈ విధముగా, నాభ్యవపద్యసే = పొందుటలేదో, దానిని పట్టి, త్వమ్ = నీవు, భరతేన = భరతునితో, సంకేతాత్ = సంకేతమువలన, రామమ్ = రాముణ్ణి, నాభ్యవపద్యసే = చేరుట లేదు.

తా. రాముడు అంతగా అరచుచున్నా కూడ నీవు ఆతనివద్దకు వెళ్ళుటలేదనగా నీవు భరతునితో ఏవో ఏర్పాట్లు చేసికొనుటచేతనే అట్లు చేయుచున్నావు.

మూ. రిపుః ప్రచ్ఛన్నచారీ త్వం మదర్థమనుగచ్ఛసి,
రాఘవస్యాన్తరప్రేప్సుస్తథైనం నాభిపద్యసే. 19

ప్ర. అ. ప్రచ్ఛన్నచారీ = రహస్యముగా సంచరించుచున్న, రిపుః = శత్రువైన, త్వమ్ = నీవు, రాఘవస్య = రామునియొక్క, అన్తరప్రేప్సుః = అవకాశమును (ఛిద్రమును) అన్వేషించుచున్నవాడవై, మదర్థమ్ = నాకొరకే, అనుగచ్ఛసి = అనుసరించి వచ్చుచున్నావు. తథా = అట్లు(ఆ కారణముచేతనే), ఏనమ్ = ఈ రాముణ్ణి, నాభిపద్యసే = పొందుటలేదు.

తా. ఎప్పుడు అవకాశము దొరకునా అని చూచుచు, నా నిమిత్తమై అనుసరించి వచ్చుచున్నావు. నీవు రాముని ప్రచ్ఛన్నశత్రువు. అందుచేతనే ఆతనివద్దకు వెళ్ళుటలేదు. 19

మూ. ఏవముక్తో హి వైదేహ్యా సంరబ్ధో రక్తలోచనః,
క్రోధాత్ప్రస్ఫురమాణోష్ఠ ఆశ్రమాదభినిర్గతః. 20

ప్ర. అ. వైదేహ్యా = సీతచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడినవాడనై, సంరబ్ధః = తొందరపడుచు, క్రోధాత్ = కోపమువలన, రక్తలోచనః = ఎఱ్ఱనైన నేత్రములు కలవాడనై, స్ఫురమాణోష్ఠః = కదలుచున్న పెదవులు కలవాడనై, ఆశ్రమాత్ = ఆశ్రమమునుండి, అభినిర్గతః = బయలుదేరితిని.

తా. నేను సీత మాటలు విని, కోపముచేత ఎఱ్ఱనైన నేత్రములతో, కదలుచున్న పెదవులతో తొందరగా ఆశ్రమమునుండి బయలుదేరివచ్చితిని. 20

మూ. ఏవం బ్రువాణం సౌమిత్రిం రామః సంతాపమోహితః,
అబ్రవీద్దుష్కృతం సౌమ్య తాం వినా యత్త్వమాగతః.

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, బ్రువాణమ్ = పలుకుచున్న, సౌమిత్రిమ్ = లక్ష్మణుని గూర్చి, సంతాపమోహితః = దుఃఖముచేత మోహితుడైన, రామః = రాముడు, అబ్రవీత్ = పలికెను. సౌమ్య = సౌమ్యుడా ! యత్ = ఏ కారణము వలన, త్వమ్ = నీవు, తాం వినా = సీత లేకుండగా, ఆగతః = వచ్చినావో, ఆ కారణమువలన, దుష్కృతమ్ = చెడ్డ పని, కృతమ్ = చేయబడినది.

తా. దుఃఖముతో నిండి యున్న రాముడు లక్ష్మణుని మాటలు విని ఇట్లు పలికెను. "లక్ష్మణా ! నీవు సీతను విడచి వచ్చితివి; నీవు చేసిన పని మంచిది కాదు." 21

మూ. జానన్నపి సమర్థం మాం రక్షసాం వినివారణే,
అనేన క్రోధవాక్యేన మైథిల్యా నిస్సృతో భవాన్. 22

ప్ర. అ. మామ్ = నన్ను, రక్షసామ్ = రాక్షసులయొక్క, వినివారణే = నివారించుటయందు, సమర్థమ్ = సమర్థునిగా, జానన్నపి = ఎరిగినవాడవైనను, భవాన్ = నీవు, మైథిల్యాః = సీతయొక్క, అనేన = ఈ, క్రోధవాక్యేన = కోపముతో కూడిన వాక్యముచేత, నిస్సృతః = వచ్చివేసినావు !

తా. రాక్షసులను నివారించుటలో నేను సమర్థుడ ననే విషయము తెలిసి ఉండి కూడ నీవు సీత కోపముతో ఏమేమో అన్నది కదా అని వచ్చివేసినావు. 22

మూ. న హి తే పరితుష్యామి త్యక్త్వా యద్యాసి మైథిలీమ్,
క్రుద్ధాయాః పరుషం శ్రుత్వా తాం విహాయ త్వమాగతః.

ప్ర. అ. మైథిలీమ్=సీతను, త్యక్త్వా=విడచి, యద్యాసి=వచ్చుచున్నావే, తే = నీకు, న పరితుష్యామి = సంతోషించను. త్వమ్=నీవు క్రుద్ధాయాః=కోపించిన ఆమెయొక్క, పరుషమ్ = పరుషవాక్యమును, శ్రుత్వా = విని, తామ్ = ఆమెను, విహాయ = విడచి, ఇహ = ఇక్కడికి, ఆగతః = వచ్చినావు.

తా. నీవు సీతను విడచి వచ్చేసినావు ! ఈ విషయము నాకేమాత్రము

సంతోషజనకముగా లేదు. ఆమె కోపములో ఏమో పరుషముగా మాటలాడినదని ఆమెను విడచివచ్చినావా ! 23

మూ. సర్వథా త్వవినీతం తే సీతయా యత్ప్రచోదితః,
క్రోధస్య వశమాపన్నో నాకరోః శాసనం మమ. 24

ప్ర. అ. సీతయా = సీతచేత, ప్రచోదితః = ప్రేరేపింపబడినవాడవై, క్రోధస్య = కోపముయొక్క, వశమ్ = వశమును, ఆగతః = పొందినవాడవై, మమ = నాయొక్క, శాసనమ్ = శాసనమును, నాకరోః ఇతి యత్ = చేయలేదనునది ఏది కలదో, ఇది, సర్వథా = అన్నివిధములా, తే = నీయొక్క, అవినీతమ్ = పొరబాటు.

తా. సీత ప్రేరేపింపగా, నీవు కోపమునకు వశుడవై పోయి నా ఆజ్ఞప్రకారము చేయలేదు. నీవు అన్ని విధములా పెద్ద తప్పు చేసినావు. 24

మూ. అసౌ హి రాక్షసః శేతే శరేణాభిహతో మయా,
మృగరూపేణ యేనాహమాశ్రమాదపవాహితః. 25

ప్ర. అ. మృగరూపేణ = మృగరూపము గల, యేన = ఎవనిచేత, అహమ్ = నేను, ఆశ్రమాత్ = ఆశ్రమమునుండి, అపవాహితః = తొలగించబడితినో, అసౌ రాక్షసః = ఈ రాక్షసుడు, మయా = నాచేత, శరేణ = బాణముచేత, అభిహతః = కొట్టబడినవాడై, శేతే = శయనించి ఉన్నాడు.

తా. మృగరూపము ధరించి నన్ను ఆశ్రమమునుండి దూరముగా తీసికొనిపోయిన ఈ రాక్షసుణ్ణి నేను బాణముచేత కొట్టివేయగా వీడిక్కడ పడి ఉన్నాడు.

మూ. వికృష్య చాపం పరిధాయ సాయకం
సలీలబాణేన చ తాడితో మయా,
మార్గీం తనుం త్యజ్య సవిక్లబస్వరో
బభూవ కేయూరధరః స రాక్షసః. 26

ప్ర. అ. మయా = నాచేత, చాపమ్ = ధనస్సును, వికృష్య = లాగి, సాయకమ్ = బాణమును, పరిధాయ = ప్రయోగించి, సలీలబాణేన = విలాసముతో

కూడిన బాణముచేత, తాడితః = కొట్టబడిన, సః = ఆ మృగము, మార్గీమ్ = మృగసంబంధమైన, తనుమ్ = శరీరమును, త్యజ్య = విడచి, సవిక్లబస్వరః = దీనస్వరము కలవాడైన, కేయూరధరః = బాహుపురులు ధరించిన, రాక్షసః = రాక్షసుడుగా, బభూవ = ఆయెను.

తా. నేను ధనస్సును లాగి, బాణమును సంధించి అనాయాసముగా బాణముతో కొట్టగా ఆ మృగము, మృగశరీరము విడచి, దీనముగా అరచుచు, బాహుపురులు మొదలైన అలంకారములు ధరించిన రాక్షసుడుగా మారినది. 26

వి. ఈ శ్లోకంలోని 'సలీలబాణేన' ఇత్యాదులు అంతగా ప్రకరణోచితములుగా లేవు. ఇది ప్రాచ్యపాఠంలో లేదు.

మూ. శరాహతేనైవ తదార్తయా గిరా
స్వరం సమాలమ్బ్య సుదూరసుశ్రవమ్,
ఉదాహృతం తద్వచనం సుదారుణం
త్వమాగతో యేన విహాయ మైథిలీమ్. 27

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ఏకోనషష్టితమః సర్గః.

ప్ర. అ. తదా = అప్పుడు, శరాహతేనైవ = శరముచేత కొట్టబడిన ఆ రాక్షసునిచేత, ఆర్తయా = దీనమైన, గిరా = వాక్కుతో, సుదూరసుశ్రవమ్ = చాలదూరమువరకు బాగుగా వినశక్యమైన, స్వరమ్ = స్వరమును, సమాలమ్బ్య = అవలంబించి, సుదారుణమ్ = చాల దారుణమైన, తత్ = ఆ, వచనమ్ = వచనము, ఉదాహృతమ్ = పలకబడినది. యేన = దేనిచేత, త్వమ్ = నీవు, మైథిలీమ్ = సీతను, విహాయ = విడచి, ఇహ = ఇక్కడికి, ఆగతః = వచ్చినావో.

తా. నేను బాణముచేత కొట్టగా, అప్పుడాతడు దుఃఖభరితమైన వాక్కుతో చాల దూరమువరకు వినబడే స్వరమును అవలంబించి, దారుణమైన ఆ వచనము పలికినాడు. అది వినియే నీవు సీతను విడిచి వచ్చినావు. 27

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో ఏబదితొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ షష్టితమః సర్గః

[రాముడు సీతను గూర్చి వృక్షములను, జంతువులను అడుగుచు, విలపించుచు సీతను అన్వేషించుట].

మూ. భృశమావ్రజమానస్య తస్యాధో వామలోచనమ్,
ప్రాస్ఫురచ్చాస్ఖలద్రామో వేపథుశ్చాస్య జాయతే. 1

ప్ర. అ. ఆవ్రజమానస్య=నడచుచున్న, తస్య=ఆ రాముని యొక్క, వామలోచనమ్ = ఎడమకన్ను, అధః = క్రింది భాగమునందు, భృశమ్ = మిక్కిలి, ప్రాస్ఫురత్ = అదరెను. రామః = రాముడు, ప్రాస్ఖలచ్చ = తొట్రుపడెను. అస్య = ఈతనికి, వేపథుశ్చ = కంపము కూడ, జాయతే = కలిగెను.

తా. నడచి వెళ్ళుచున్న రాముని ఎడమ కన్ను క్రింది భాగమునందు అదరెను. ఆతని పాదములు తడబడెను. ఆతనికి వణకు పుట్టెను. 1

మూ. ఉపాలక్ష్య నిమిత్తాని సోఽశుభాని ముహుర్ముహుః,
అపి క్షేమం ను సీతాయా ఇతి వై వ్యాజహార చ 2

ప్ర. అ. సః = ఆ రాముడు, అశుభాని = అశుభములైన, నిమిత్తాని = నిమిత్తములను, ఉపాలక్ష్య = చూచి, సీతాయాః = సీతకు, క్షేమమ్ అపి ను = క్షేమము అయి ఉండునా అని, ముహుర్ముహుః = మాటిమాటికి, వ్యాజహార చ = = పలికెను.

తా. రాముడు ఆ అశుభశకునములు చూచి, "సీత క్షేమముగానే ఉండి ఉండునా"అని మాటిమాటికి పలుకుచు వాపోయెను. 2

మూ. త్వరమాణో జగామాథ సీతాదర్శనలాలసః,
శూన్యమావసథం దృష్ట్వా బభూవోద్విగ్నమానసః. 3

ప్ర. అ. అథ = అటుపిమ్మట, త్వరమాణః = తొందరపడుచున్నవాడై, సీతాదర్శనలాలసః = సీతను చూచుటయందు ఆసక్తి కలవాడై, జగామ = వెళ్లెను. శూన్యమ్ = శూన్యమైన, ఆవసథమ్ = గృహమును, దృష్ట్వా = చూచి, ఉద్విగ్నమానసః = దుఃఖించిన మనస్సు కలవాడు, బభూవ = ఆయెను.

తా. సీతను చూడవలెనను ఆసక్తితో తొందరపడుచు వెళ్లిన రాముడు పర్ణశాల శూన్యముగా ఉండుట చూడగానే అతని మనస్సు దిగులు చెందెను. 3

మూ. ఉద్భ్రమన్నివ వేగేన విక్షిపన్రఘునన్దనః,
తత్ర తత్రోటజస్థానమభివీక్ష్య సమన్తతః. 4

దదర్శ పర్ణశాలాం చ రహితాం సీతయా తదా,
శ్రియా విరహితాం ధ్వస్తాం హేమన్తే పద్మినీమివ. 5

ప్ర. అ. రఘునన్దనః = రాముడు, వేగేన = వేగముచేత, ఉద్భ్రమన్నివ = తిరిగిపోవుచున్నవాడు వలె, విక్షిపన్ = హస్తపాదాదులు విసరుచు, తత్ర తత్ర = అక్కడక్కడ, ఉటజస్థానమ్ = పర్ణశాలాస్థానమును, సమన్తతః = నలు వైపులా, అభివీక్ష్య = చూచి, తదా = అప్పుడు, సీతయా = సీతతో, రహితామ్ = శూన్యమైనదీ, హేమన్తే = హేమంత ఋతువునందు, ధ్వస్తామ్ = నశించిన, పద్మినీమివ = పద్మలతవలె, శ్రియా = శోభతో, విరహితామ్ = శూన్యమూ అయిన, పర్ణశాలామ్ = పర్ణశాలను, దదర్శ = చూచెను.

తా. రాముడు వేగముగా తిరిగిపోవుచున్నాడా అన్నట్లు హస్తపాదాదులు విసరివేయుచు, పర్ణశాల ఉన్న ప్రదేశమును అంతా వెదకెను. అతనికి సీత లేని పర్ణశాల కనబడెను. అది హేమంతర్తువులో పద్మము లన్నీ నశించగా శోభా విహీన మైన పద్మలత వలె కాంతివిహీనమై ఉండెను. 4, 5

మూ. రుదన్తమివ వృక్షైశ్చ మ్లానపుష్పమృగద్విజమ్,
శ్రియా విహీనం విధ్వస్తం సంత్యక్తవనదేవతమ్ 6

విప్రకీర్ణాజినకుశం విప్రవిద్ధబృసీకటమ్,
దృష్ట్వా శూన్యం నిజస్థానం విలలాప పునః పునః. 7

ప్ర. అ. వృక్షైః = వృక్షములచేత, రుదన్తమివ = ఏడ్చుచున్నట్లున్నది, మ్లానపుష్పమృగద్విజమ్ = వాడిపోయిన పుష్పములు, మృగములు, పక్షులు కలది, శ్రియా = శోభతో, విహీనమ్ = శూన్యమైనదీ, విధ్వస్తమ్ = చేడిపోయినది, సంత్యక్తవనదేవతమ్ = విడువబడిన వనదేవతలు కలది, విప్రకీర్ణాజినకుశమ్ = చెల్లాచెదరుచేయబడిన కృష్ణాజినములు దర్భలు కలది, విప్రవిద్ధబృసీకటమ్ = చిమ్మివేయబడిన దర్భాసనములు చాపలు కలది, శూన్యమ్ = శూన్యమూ అయిన, నిజస్థానమ్ = తన నివాసస్థానమును, దృష్ట్వా = చూచి, పునః పునః = మాటి మాటికి, విలలాప = విలపించెను.

తా. రాముని ఆశ్రమములో ఉన్న వృక్షములు ఏడ్చుచున్నట్లు కనబడు చుండెను. పుష్పములు వాడిపోయెను. మృగములు, పక్షులు దీనములై ఉండెను. ఆ ప్రాంతమంతా శోభావిహీనమై పాడుపడి ఉండెను. వనదేవతలు ఆ ప్రదేశమును విడచి వెళ్ళిపోయిరి. కృష్ణాజినములు, దర్భలు, దర్భాసనములు, చాపలు చెల్లా చెదరుగా పడి ఉండెను. ఈ విధముగా శూన్యముగా ఉన్న ఆ ప్రదేశమును చూచి రాముడు మాటిమాటికి విలపించెను. 6,7

మూ. హృతా మృతా వా నష్టా వా భక్షితా వా భవిష్యతి,
నిలీనాప్యథవా భీరురథవా వనమాశ్రితా. 8

ప్ర. అ. భీరుః = భయస్వభావము గల సీత, హృతా = హరించబడినదో, మృతా వా = మరణించినదో, నష్టా వా = తప్పిపోయినదో, భక్షితా వా = భక్షించ బడినదో, భవిష్యతి = కాగలదు (అయి ఉండును). అథవా = లేక, నిలీనా = దాగినదో, అథవా = లేక, వనమ్ = వనమును, ఆశ్రితా = ఆశ్రయించినదో.

తా. భయస్వభావము గల సీతను ఎవరో హరించి ఉందురు. లేదా ఆమె మరణించి ఉండును. లేదా తప్పిపోయి ఉండును. లేదా ఎవరో ఆమెను భక్షించి ఉందురు. లేదా ఎక్కడనైనా దాగియుండును. లేదా వనములోనికి వెళ్ళియుండును.

మూ. గతా విచేతుం పుష్పాణి ఫలాన్యపి చ వా పునః,
అథవా పద్మినీం యాతా జలార్థం వా నదీం గతా. 9

ప్ర. అ. అపివా = లేదా, పుష్పాణి = పుష్పములను, పలాని చ = పలములను, విచేతుమ్ = కోయుటకు, గతా = వెళ్ళినదా? అథవా = లేక, పద్మి

నీమ్ = పద్మసరస్సును గూర్చి, యాతా = వెళ్ళినదా? జలార్థమ్ = నీటికొరకై, నదీమ్ = నదిని గూర్చి, గతా = వెళ్ళినదా?

తా. లేదా ఆమె పుష్పములు, ఫలములు కోయుటకై వెళ్ళి యుండును, లేదా పద్మసరస్సుకు వెళ్ళి యుండును. లేదా నీటికొరకై నదికి వెళ్ళి ఉండును. 9

మూ. యత్నాన్మృగయమాణస్తు నాససాద వనే ప్రియామ్,
శోకరక్తేక్షణః శోకాదున్మత్త ఇవ లక్ష్యతే. 10

ప్ర. అ. యత్నాత్ = ప్రయత్నమువలన, మృగయమాణః తు = వెదకుచున్నవాడైనను, వనే = వనమునందు, ప్రియామ్ = ప్రియురాలిని, నాససాద = పొందలేదు. శోకరక్తేక్షణః = శోకముచేత ఎఱ్ఱనైన నేత్రములు గలవాడై, శోకాత్ = శోకమువలన, ఉన్మత్త ఇవ = పిచ్చివాడు వలె, లక్ష్యతే = కనబడుచున్నాడు (చుండెను).

తా. రాముడు ప్రయత్నపూర్వకముగా ఎంత వెదకినను వనములో ప్రియురాలు కనబడక దుఃఖముచేత కళ్ళు ఎఱ్ఱబడగా, అప్పుడు శోకముతో పిచ్చివాడు వలె కనబడుచుండెను. 10

మూ. వృక్షాద్వృక్షం ప్రధావన్ స గిరేరద్రిం నదాన్నదీమ్,
బభూవ విలపన్రామః శోకార్ణవపరిప్లుతః. 11

ప్ర. అ. రామః = రాముడు, వృక్షాత్ = ఒక వృక్షమునుండి, వృక్షమ్ = మరొక వృక్షమును గూర్చి, గిరేః = ఒక పర్వతమునుండి, అద్రిమ్ = మరొక పర్వతమును గూర్చి, నదాత్ = కాలవనుండి, నదీమ్ = నదినిగూర్చి, ప్రధావన్ = పరుగెత్తుచు, విలపన్ = విలపించుచు, శోకార్ణవపరిప్లుతః = శోకసముద్రములో తేలుచున్నవాడు, బభూవ = ఆయెను

తా. రాముడు ఒక చెట్టుదగ్గరనుంచి మరొక చెట్టుదగ్గరకు ఒక పర్వతమునుండి మరొక పర్వతమువద్దకు, ఒక కాలువనుండి మరొక కాలువ దగ్గరికి పరుగెత్తుచు, విలపించుచు, శోకసముద్రములో తేలుచుండెను. 11

మూ. అపి కాచిత్త్వయా దృష్టా సా కదమ్బప్రియా ప్రియా,
కదమ్బ యది జానీషే శంస సీతాం శుభాననామ్. 12

ప్ర. అ. కదమ్బ = కదంబవృక్షమా! కదమ్బప్రియా = కదంబపుష్పములు ప్రియములుగా గల, ప్రియా = నా ప్రియురాలైన, సా = ఆ, కాచిత్ = ఒకానొక స్త్రీ, త్వయా = నీచేత, అపి దృష్టా = చూడబడినదా! జానీషే యది = నీవు ఎరిగి ఉన్నట్లయితే, శుభాననామ్ = మంగళకరమైన ముఖము గల, సీతామ్ = సీతను గూర్చి, శంస = చెప్పుము.

తా. కదంబవృక్షమా! నీ వెవరినైన ఒక స్త్రీని చూచినావా! ఆమె కదంబ పుష్పములమీద చాల ప్రేమ గలది; నా ప్రియురాలు. నీకు తెలిసినట్లయితే శుభమైన ముఖము గల సీతను గూర్చి చెప్పుము. 12

మూ. స్నిగ్ధపల్లవసంకాశా పీతకౌశేయవాసినీ,
శంసస్వ యది వా దృష్టా బిల్వ బిల్వోపమ స్తనీ. 13

ప్ర. అ. బిల్వ = బిల్వవృక్షమా! స్నిగ్ధపల్లవసంకాశా = నిగనిగలాడుచున్న చిగురుతో సమానమైనది, పీతకౌశేయవాసినీ = పసుపువచ్చని పట్టుచీర ధరించినది, బిల్వోపమ స్తనీ = బిల్వఫలముల వంటి స్తనములుకంది అయిన నా ప్రియురాలు, యది వా దృష్టా = చూడబడినదా, శంసస్వ = చెప్పుము.

తా. ఓ! బిల్వవృక్షమా! బిల్వఫలముల వంటి స్తనములు గల నా ప్రియురాలిని చూచినచో చెప్పుము. ఆమె శరీరకాంతి చిగురు వలె మెరయుచుండును. ఆమె పసుపువచ్చ రంగు పట్టు చీర కట్టుకొని ఉన్నది. 13

మూ. అథవార్జున శంస త్వం ప్రియాం తామర్జునప్రియామ్,
జనకస్య సుతా భీరుర్యది జీవతి వా న వా. 14

ప్ర. అ. అథ వా = లేదా, అర్జున = ఓ! అర్జున (మద్ది) వృక్షమా! త్వమ్ = నీవు, అర్జునప్రియామ్ = అర్జునవృక్షములు ప్రియములుగా గల, తాం ప్రియామ్ = ఆ ప్రియురాలిని గూర్చి, శంస = చెప్పుము. భీరుః = భయస్వభావము గల, జనకస్య సుతా = జనకుని కుమార్తె, యది జీవతి వా = జీవించి ఉన్నదా, న వా = లేదా (చెప్పుము).

తా. అరునవృక్షమా! నా ప్రియురా లెక్కడ ఉన్నదో నీవె నా చెప్పుము..

ఆమెకు అర్జునవృక్షము లన్న చాల ప్రేమ. భయస్వభావము గల ఆ జనకరాజ పుత్రి జీవించి ఉన్నదో లేదో చెప్పుము.

మూ. కకుభః కకుభోరూం తాం వ్యక్తం జానాతి మైథిలీమ్,
యథా పల్లవపుష్పాఢ్యో భాతి హ్యేష వనస్పతిః. 15

ప్ర. అ. ఏషః = ఈ, వనస్పతిః = వృక్షము, పల్లవపుష్పాఢ్యః = చిగుళ్ళతోను పుష్పములతోను నిండినదై, యథా = ఎట్లు, భాతి = ప్రకాశించుచున్నదో (దీనినిపట్టి), కకుభః = కకుభవృక్షము, కకుభోరూమ్ = కకుభవృక్షము వంటి తొడలు గల, తామ్ = ఆ, మైథిలీమ్ = సీతను, వ్యక్తమ్ = నిశ్చయముగా, జానాతి = ఎరిగి ఉన్నది.

తా. ఈ కకుభవృక్షము పూవులతోను, చిగుళ్ళతోను నిండి ప్రకాశించుచున్నది. దీనికి కకుభవృక్షము మానువంటి తొడలు గల సీతను గూర్చి తప్పక తెలిసి ఉండును. 15

మూ. భ్రమరైరుపగీతశ్చ యథా ద్రుమవరో హ్యయమ్,
ఏష వ్యక్తం విజానాతి తిలకస్తిలకప్రియామ్. 16

ప్ర. అ. ద్రుమవరః = వృక్షములలో శ్రేష్ఠమైన, అయమ్ = ఈ, తిలకః = తిలకవృక్షము, యథా = ఎట్లు, భ్రమరైః = తుమ్మెదలచేత, ఉపగీతః = సమీపమునందే ఉండి గానమును వినిపింప చేయబడుచున్నదో (దానిని పట్టి), ఏషః = ఈ వృక్షము, తిలకప్రియామ్ = తిలకము ప్రియముగా గల సీతను, వ్యక్తమ్ = నిశ్చయముగా, విజానాతి = ఎరుగును.

తా. వృక్షములలో శ్రేష్ఠమైన ఈ తిలకవృక్షమువద్దకు చేరి తుమ్మెదలు పాడుచున్నవి. దీనిని పట్టి ఈ వృక్షమునకు తిలకముపై ఎక్కువ ప్రేమ గల సీత తప్పక తెలిసి ఉండును. 16

మూ. అశోక శోకాపనుద శోకోపహతచేతసమ్, 17
త్వన్నామానం కురు క్షిప్రం ప్రియాసందర్శనేన మామ్.

ప్ర. అ. శోకాపనుద = శోకమును తొలగించు, అశోక = అశోకవృక్షమా!
ప్రియాసందర్శనేన = నా ప్రియురాలిని చూపుటచేత, శోకోపహతచేతసమ్ =

శోకముచేత పీడింపబడిన చిత్తము గల, మామ్ = నన్ను, క్షిప్రమ్ = శీఘ్రముగా, త్వన్నామానమ్ = నీ పేరు గలవానినిగా, కురు = చేయుము.

తా. శోకమును తొలగించు అశోకవృక్షమా! శోకముచేత పీడింపబడిన మనస్సు గల నాకు నా ప్రియురాలిని చూపించి, శీఘ్రముగా, నీ పేరుగలవానినిగా, అనగా అశోకుణ్ణిగా (శోకము లేనివానినిగా) చేయుము. 17

మూ. యది తాల త్వయా దృష్టా పక్వతాలఫలస్తనీ,
కథయస్వ వరారోహాం కారుణ్యం యది తే మయి. 18

ప్ర. అ. తాల=తాలవృక్షమా! పక్వతాలఫలస్తనీ=పక్వమైన తాటిపండ్ల వంటి స్తనములు గల సీత, త్వయా = నీచేత, దృష్టా యది = చూడబడినట్లయితే, తే = నీకు, మయి = నాయందు, కారుణ్యం యది = జాలి ఉన్నట్లయితే, వరారోహామ్ = సుందరమైన కటిప్రదేశము గల ఆమెను గూర్చి, కథయస్వ = చెప్పుము.

తా. ఓ! తాలవృక్షమా! పక్వమైన తాలఫలముల వంటి స్తనములు గల సీతను నీవు చూచినావా? నీకు నాపై దయ ఉన్నచో, అందమైన కటిప్రదేశము గల ఆమె జాడ తెలుపుము. 18

మూ. యది దృష్టా త్వయా సీతా జమ్బు జమ్బూఫలోపమామ్,
ప్రియాం యది విజానీషే నిఃశఙ్కం కథయస్వ మే. 19

ప్ర. అ. జమ్బు = జంబూవృక్షమా! (నేరేడుచెట్టు), త్వయా=నీచేత, సీతా = సీత, యది దృష్టా = చూడబడినదా? జమ్బూఫలోపమామ్ = నేరేడు పండ్ల వలె (నున్నగా) ఉన్న శరీరముగల, ప్రియామ్ = ప్రియురాలిని, జానీషే యది = నీవు ఎరిగి ఉన్నట్లయితే, మే = నాకు, నిఃశఙ్కమ్=నిఃసందేహముగా, కథయస్వ = చెప్పుము.

తా. ఓ! జంబూవృక్షమా! నీవు సీతను చూచినావా? నేరేడిపండు వలె నున్నగా మెరయుచున్న శరీరము గల సీతను గూర్చి నీకు తెలిసినచో నిఃసంశయముగా నాకు చెప్పుము. 19

మూ. అహో త్వం కర్ణికారాద్య సుపుష్పైః శోభసే భృశమ్,
కర్ణికారప్రియా సాధ్వీ శంస దృష్టా ప్రియా యది. 20

ప్ర. అ. కర్ణికార ! కర్ణికారవృక్షమా ! త్వమ్ = నీవు, అద్య = ఇప్పుడు, సుపుష్పైః = అందమైన పుష్పములతో, భృశమ్ = మిక్కిలి, శోభసే = శోభించుచున్నావు. అహో = ఏమి సౌందర్యము ! కర్ణికారప్రియా = కర్ణికారపుష్పము ప్రియముగా గల, సాధ్వీ = పతివ్రతయైన. ప్రియా = నా ప్రియురాలు, దృష్టా యది = చూడబడినట్లయితే, శంస = చెప్పుము.

తా. ఓ ! కర్ణికారవృక్షమా ! నీవు ఇప్పుడు మంచి పుష్పములతో ఎంత ప్రకాశించుచున్నావు ! కర్ణికారపుష్పములపై మక్కువ గల పతివ్రత యైన నా ప్రియురాలిని నీవు చూచినావా ? చెప్పుము. 20

మూ. చూతనీపమహాసాలాన్ పనసాన్ కురవాన్ ధవాన్,
దాడిమానసనాన్ గత్వా దృష్ట్వా రామో మహాయశాః. 21
మల్లికా మాధవీశ్చైవ చమ్పకాన్ కేతకీస్తథా,
పృచ్ఛన్రామో వనే భ్రాన్తః ఉన్మత్త ఇవ లక్ష్యతే. 22

ప్ర. అ. మహాయశాః = గొప్ప కీర్తి గల, రామః = మనోహరుడైన, రామః = రాముడు, వనే = ఆ వనమునందు, చూతనీవమహాసాలాన్ = చూత వృక్షములను, నీపవృక్షములను, పెద్దమద్దిచెట్లను, పనసాన్ = పనసవృక్షములను, ధవాన్ = చండ్రచెట్లను, దాడిమాన్ = దానిమ్మచెట్లను, అనసాన్ = వేగిసచెట్లను, మల్లికాః = మల్లికాలతలను, మాధవీశ్చైవ = మాధవీలతలను, చమ్పకాన్ = సంపంగి చెట్లను. తథా = మరియు, కేతకీః = మొగలిచెట్లను, దృష్ట్వా = చూచి, గత్వా = వాటివద్దకు వెళ్ళి, పృచ్ఛన్ = అడుగుచు. భ్రాన్తః = తిరుగుచున్నవాడై, ఉన్మత్తః ఇవ = పిచ్చివాడు వలె, లక్ష్యతే = కనబడుచుండెను.

తా. గొప్ప కీర్తి గలవాడు, అందరికి మనోహరుడు అయిన రాముడు, ఆ వనములో ఇటు అటు తిరుగుచు, మామిడిచెట్లను, నీపవృక్షములను, పెద్ద సాలవృక్షములను, పనసచెట్లను, గోరింటచెట్లను. చండ్రచెట్లను, దానిమ్మచెట్లను, వేగిసచెట్లను, మల్లికాలతలను మాధవీలతలను, సంపెంగచెట్లను, మొగలిపొదలను చూచి, వాటి దగ్గరకు వెళ్ళి ప్రశ్నించుచు, పిచ్చివాడు వలె కనబడెను. 22

మూ. అథవా మృగశాబాక్షీం మృగ జానాసి మైథిలీమ్,
మృగవిప్రేక్షణీ కాన్తా మృగీభిః సహితా భవేత్. 23

ప్ర. అ. అథవా = లేదా, మృగ = మృగమా ! మృగశాబాక్షీమ్ = మృగ శిశువు నేత్రముల వంటి నేత్రములు గల, మైథిలీమ్ = సీతను, జానాసి = ఎరుగుదువా ? మృగవిప్రేక్షణీ = మృగముల వంటి నేత్రములు గల, కాన్తా = ఆ సీత, మృగీభిః = ఆడలేళ్ళతో, సహితా = కూడినది, భవేత్ = అయిఉండును.

తా. లేదా ఈ మృగమును అడిగెదను, ఓ ! మృగమా ! లేదిపిల్ల కళ్ళ వంటి కళ్లు గల, సీతను ఎరుగుదువా ? మృగము నేత్రముల వంటి నేత్రములు గల సీత మృగాలలో కలిసిపోయి యుండును. 24

మూ. గజ సా గజనాసోరూర్యది దృష్టా త్వయా భవేత్,
తాం మన్యే విదితాం తుభ్యమాఖ్యాహి వరవారణ. 25

ప్ర. అ. గజ = ఓ ! గజమా ! గజనాసోరూః = ఏనుగుతొండము వంటి తొడలు గల, సా = ఆ సీత, త్వయా = నీచేత, దృష్టా = చూడబడినది, యది భవేత్ = కావచ్చును. తామ్ = ఆమెను, తుభ్యమ్ = నీకు, విదితామ్ = తెలియబడినదానినిగా, మన్యే = తలచెదను. వరవారణ = ఓ ! శ్రేష్ఠమైన గజమా ! ఆఖ్యాహి = చెప్పుము.

తా. ఓ ! గజమా ! ఏనుగు తొండము వంటి తొడలు గల ఆ సీతను నీవు చూచి ఉండవచ్చును. ఓ ! శ్రేష్ఠమైన గజమా ! నీకు ఆమె తెలియు నని తలచెదను. అందుచేత చెప్పుము. 25

మూ. శార్దూల యది సా దృష్టా ప్రియా చన్ద్రనిభాననా,
మైథిలీ మమ విస్రబ్ధం కథయస్వ న తే భయమ్. 26

ప్ర. అ. శార్దూల = ఓ ! శార్దూలమా (పెద్దపులి), చన్ద్రనిభాననా = చంద్రునితో సమానమైన ముఖము గల, ప్రియా = ప్రియురాలైన, సా మైథిలీ = ఆ సీత, దృష్టా యది = చూడబడినట్లయితే, విస్రబ్ధమ్ = నమ్మకముగా, మమ = నాకు, కథయస్వ = చెప్పుము. తే = నీకు, భయమ్ = భయము, న = లేదు.

తా. ఓ ! వ్యాఘ్రమా ! చంద్రునితో సమానమైన ముఖము గలది, నా

ప్రియురాలూ అయిన ఆ సీతను చూచినచో నిఃసందేహముగా చెప్పుము. నీకేమీ భయము లేదు. 25

మూ. కిం ధావసి ప్రియే దూరే దృష్టాసి కమలేక్షణే,
వృక్షైరాచ్ఛాద్య చాత్మానం కిం మాం న ప్రతిభాషసే.

ప్ర. అ. కమలేక్షణే = పద్మముల వంటి నేత్రములు గల, ప్రియే = ప్రియురాలా ! దూరే = దూరమునందు, కిమ్ = ఎందువలన, ధావసి = పరుగెత్తుచున్నావు ? దృష్టా = చూడబడినదానవు, అసి = అయినావు, ఆత్మానమ్ = తనను, వృక్షైః = వృక్షములచేత, ఆచ్ఛాద్య = కప్పికొని, మామ్ = నన్ను గూర్చి, కిమ్ = ఎందువలన, న ప్రతిభాషసే = వలుకుటలేదు ?

తా. పద్మముల వంటి నేత్రములు గల ఓ ప్రియురాలా ! దూరముగా పారిపోవుచున్నా వేమి ? నాకు కనబడితివిలే! చెట్ల చాటున దాగి యుండి నాకు బదులుచెప్పుట లేదేమి ? 26

మూ. తిష్ఠ తిష్ఠ వరారోహే న తేఽస్తి కరుణా మయి,
నాత్యర్థం హాస్యశీలాసి కిమర్థం మాముపేక్షసే. 27

ప్ర. అ. వరారోహే = సుందరమైన కటిప్రదేశము గలదానా ! తిష్ఠ తిష్ఠ = ఆగుము ఆగుము. తే = నీకు, మయి = నాయందు, కరుణా = కరుణ, నాస్తి = లేదా ? అత్యర్థమ్ = మిక్కిలి, హాస్యశీలా = హాస్యస్వభావము గలదానవు, నాసి = కావు. మామ్ = నన్ను, కిమర్థమ్ = ఎందుకు, ఉపేక్షసే = ఉపేక్షించుచున్నావు ?

తా. సుందరమైన కటిప్రదేశము గల ఓ ! సీతా ! ఆగుము, ఆగుము. నామీద జాలి లేదా ? నీకెప్పుడూ ఇంత పరిహాసము చేసే స్వభావము లేదుకదా! ఇప్పుడు నన్ను ఎందుకు ఉపేక్షించుచున్నావు ? 27

మూ. పీతకౌశేయకేనాసి సూచితా వరవర్ణిని,
ధావన్త్యపి మయా దృష్టా తిష్ఠ యద్యస్తి సౌహృదమ్. 28

ప్ర. అ. వరవర్ణిని = శ్రేష్ఠమైన శరీరవర్ణము గలదానా ! పీతకౌశేయ

కేన=పచ్చని పట్టుచీరచేత, సూచితా = సూచింపబడినదానవు, అసి = అయితివి. ధావన్త్యపి = పరుగెత్తుచున్నదానవైనను, మయా=నాచేత, దృష్టా=చూడబడితివి, సౌహృదమ్ = స్నేహము, అస్తి యది = ఉన్నట్లయితే, తిష్ఠ = నిలబడుము.

తా. శ్రేష్ఠమైన శరీరచ్ఛాయ గల ఓ! సీతా! నీ పచ్చని పట్టుచీరను బట్టి గుర్తించినానులే. నీవు పరుగెత్తుచున్నను చూచినాను. నా మీద నీకేమైన ప్రేమ ఉన్నచో ఆగుము. 28

మూ. నైవ సా నూనమథవా హింసితా చారుహాసినీ,
కృచ్ఛ్రప్రాప్తం న మాం నూనం యథోపేక్షితుమర్హతి.

ప్ర. అ. అథవా = లేదా, సా = ఆమె, నైవ = కాదు. చారుహాసినీ = అందమైన నవ్వు గల ఆ సీత, హింసితా = హింసించబడినది. నూనమ్ = నిశ్చయము. యథా = ఎట్లు, (ఎందువలన అనగా) కృచ్ఛ్రప్రాప్తమ్ = కష్టమును పొందిన, మామ్ = నన్ను, ఉపేక్షితుమ్ = ఉపేక్షించుటకు, నార్హతి = తగదు. నూనమ్ = నిశ్చయము.

తా. లేదా, ఆ కనబడినది సీత అయి ఉండదు. సుందరమైన చిరునవ్వు గల ఆమెను ఎవ్వరో చంపివేసి ఉందురు. ఎందుచేత ననగా ఇట్లు కష్టములో నన్ను ఆమె ఉపేక్షించదు. నిజము. 29

మూ. వ్యక్తం సా భక్షితా బాలా రాక్షసైః పిశితాశనైః,
విభజ్యాఙ్గాని సర్వాణి మయా విరహితా ప్రియా. 30

ప్ర. అ. మయా = నాతో, విరహితా=శూన్యురాలైన, ప్రియా=నాప్రియురాలైన, సా బాలా = చిన్న వయస్సులో ఉన్న ఆ సీత, వ్యక్తమ్ = స్పష్టముగా (నిజముగా), సర్వాణి = సమస్తమైన, అఙ్గాని = అవయవములను, విభజ్య = విభజించి (ఖండించి), పిశితాశనైః = పచ్చిమాంసమును తిను, రాక్షసైః = రాక్షసులచేత, భక్షితా = భక్షింపబడినది.

తా. చిన్న వయస్సులో ఉన్న నా ప్రియురాలిని, నేను దగ్గర లేకుండుటచే, పచ్చి మాంసము తినే రాక్షసులు, ఆమె అవయవము లన్నింటినీ ఖండించి తినివేసి ఉందురు. సందేహము లేదు. 30

మూ. నూనం తచ్చుభదన్తోష్ఠం సునాసం చారుకుణ్డలమ్,
పూర్ణచన్ద్రనిభం గ్రస్తం ముఖం నిష్ప్రభతాం గతమ్. 31

ప్ర. అ. నూనమ్ = నిశ్చయముగా, శుభదన్తోష్ఠమ్ = సుందరములైన దంతములు, పెదవులు గలది, సునాసమ్ = అందమైన ముక్కు గలది, చారుకుణ్డలమ్ = అందమైన కుండలములు గలది, పూర్ణచన్ద్రనిభమ్ = పూర్ణచంద్రునితో సమానమూ అయిన, తత్ = ఆ, ముఖమ్ = ముఖము, గ్రస్తమ్ = మ్రింగివేయబడినదై, నిష్ప్రభతామ్ = కాంతి లేనిదగుటను, గతమ్ = పొందినది.

తా. అందమైన దంతములు, పెదవులు, ముక్కు, కుండలములూ గలది, పూర్ణచంద్రునితో సమానమూ అయిన ఆ ముఖము రాక్షసులు మ్రింగివేయునపుడు కాంతివిహీనమై పోయి ఉండును. నిజము. 31

మూ. సా హి చమ్పకవర్ణాభా గ్రీవా గ్రైవేయశోభితా,
కోమలా విలపన్త్యాస్తు కాన్తాయా భక్షితా శుభా. 32

ప్ర. అ. విలపన్త్యాః = విలపించుచున్న, కాన్తాయాః = నా ప్రియురాలి యొక్క, చమ్పకవర్ణాభా = చంపకపుష్పముయొక్క వర్ణమువంటి కాంతి గలది, గ్రైవేయశోభితా = కంఠాలంకారముచేత ప్రకాశింప చేయబడినది, కోమలా = కోమలమూ, శుభా = సుందరమూ అయిన, సా గ్రీవా = ఆ కంఠము, భక్షితా = భక్షింపబడినది.

తా. నా ప్రియురాలు విలపించుచుండగా, బంగారు రంగు గలదై, కంఠాభరణములచేత అలంకరింపబడి, అందముగా ఉన్న కోమలమైన ఆమె కంఠమును రాక్షసులు భక్షించి ఉందురు. 32

మూ. నూనం విక్షిప్యమాణౌ తౌ బాహూ పల్లవకోమలౌ,
భక్షితౌ వేపమానాగ్రౌ సహస్తాభరణాఙ్గదౌ. 33

ప్ర. అ. విక్షిప్యమాణౌ = తొందరగా కదల్చబడుచున్నవీ, పల్లవకోమలౌ = చిగురు వలె కోమలములూ, వేపమానాగ్రౌ = వణకుచున్న అగ్రభాగములు కలవి, సహస్తాభరణాఙ్గదౌ = కంకణములతోను బాహుపురులతోను కూడినవీ అయిన, తౌ బాహూ = ఆ బాహువులు, నూనమ్ = నిశ్చయముగా, భక్షితౌ = భక్షింపబడినవి.

తా. చిగురు వలె కోమలముగా ఉన్న ఆమె బాహువులు కంకణములచేత, బాహుపురులచేత అలంకరింపబడి ఉన్నవి. వ్రేళ్ళు వణకిపోవుచున్న, ఆ బాహువులను ఆమె ఇటు నటు వేగముగా కదల్చుచుండగా వాటిని రాక్షసులు భక్షించి ఉందురు. నిజము. 33

మూ. మయా విరహితా బాలా రక్షసాం భక్షణాయ వై,
సార్థేనేవ పరిత్యక్తా భక్షితా బహుబాన్ధవా. 34

ప్ర. అ. బాలా = బాలయైన సీత, రక్షసామ్ = రాక్షసులయొక్క, భక్షణాయ వై = భక్షణముకొరకే, మయా = నాచేత, విరహితా = శూన్యురాలైనది. బహుబాన్ధవా = చాలమంది బంధువులు గల ఆ సీత, సార్థేన = వర్తకుల గుంపుచేత, పరిత్యక్తా ఇవ = విడువబడినది వలె, భక్షితా = భక్షించబడినది.

తా. రాక్షసులు భక్షించుటకే నేను సీతను వదలివెళ్ళినట్లు అయినది. ఎందరో బంధువు లున్న సీత కూడ వర్తకుల గుంపు విడచి వెళ్ళిపోయిన స్త్రీ వలె రాక్షసులచేత భక్షింపబడినది. 34

మూ హా లక్ష్మణ మహాబాహో పశ్యసి త్వం ప్రియాం క్వచిత్,
హా ప్రియే క్వ గతా భద్రే హా సీతేతి పునః పునః. 35

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గల, హా! లక్ష్మణ = అయ్యో! లక్ష్మణా! త్వమ్ = నీవు, క్వచిత్ = ఎక్కడనైనా, ప్రియామ్ = ప్రియురాలిని, పశ్యసి = చూచుచున్నావా? భద్రే = మంగళప్రదురాలైన, హా ప్రియే = అయ్యో ప్రియురాలా! క్వ = ఎక్కడికి, గతా = వెళ్ళినావు? హా సీతే = అయ్యో! సీతా! ఇతి = అని, పునః పునః = మాటిమాటికి (విలపించెను).

తా. "అయ్యో! మహాబాహువైన లక్ష్మణా! నీకు నా ప్రియురాలు ఎక్కడనైనా కనబడుచున్నదా? అయ్యో! మంగళప్రదురాలవైన ప్రియురాలా! ఎక్కడికి వెళ్ళినావు? అయ్యో! సీతా!" అని మాటి మాటికి అనుచు విలపించెను. 35

మూ. ఇత్యేవం విలపన్రామః పరిధావన్వనాద్వనమ్,
క్వచిదుద్భ్రమతే వేగాత్క్వచిద్విభ్రమతే బలాత్, 36
క్వచిన్మత్త ఇవాభాతి కాన్తాన్వేషణతత్పరః.

ప్ర. అ. రామః = రాముడు, ఇత్యేవమ్ = ఈ విధముగా, విలపన్ = విల పించుచు, వనాత్ = ఒక వనమునుండి, వనమ్ = మరొక వనమును గూర్చి, పరి ధావన్ = పరుగెత్తుచు, క్వచిత్ = ఒకచోట, వేగాత్ = దుఃఖవేగమువలన, ఉద్భ్రమతే = తిరిగిపోవుచున్నాడు (తిరిగిపోవుచుండెను). క్వచిత్ = ఒకచోట, బలాత్ = దుఃఖప్రభావమువలన, విభ్రమతే = భ్రాంతి చెందుచున్నాడు (చెందు చుండెను). క్వచిత్ = మరొకచోట, కాన్తాన్వేషణతత్పరః = భార్యయొక్క, వెద కుటయందు ఆసక్తి కలవాడై, మత్తః ఇవ = మదించినవాడు వలె, ఆభాతి = ప్రకాశించుచుండెను.

తా. రాముడీ విధముగా విలపించుచు ఒక వనమునుండి మరొక వనము నకు తిరుగుచు, ఒక చోట దుఃఖవేగమువలన తిరిగిపోవుచున్నట్లు అయిపోయెను. మరొక చోట దుఃఖబలమువలన భ్రాంతి చెందుచుండెను. మరొక చోట భార్యను వెదకుటలో లగ్నమైన మనస్సుతో ఉన్మత్తుడు వలె అగుచుండెను. 36

మూ. స వనాని నదీః శైలాన్ గిరిప్రస్రవణాని చ, 37
కాననాని చ వేగేన భ్రమత్యపరిసంస్థితః.

ప్ర. అ. సః = ఆ రాముడు, వనాని = వనములను, నదీః = నదులను, శైలాన్ = పర్వతములను, గిరిప్రస్రవణాని చ = పర్వతముల జలపాతములను, కాననాని చ = అడవులను, అపరిసంస్థితః = ఒక్కచోట నిలబడనివాడై, వేగేన = వేగముతో, భ్రమతి = తిరుగుచుండెను.

తా. ఆ రాముడు ఒక్క చోట నిలకడ లేక, చాల వేగముగా, వనములకు, నదులవద్దకు, పర్వతములవద్దకు, పర్వతములపై ఉన్న సెలయేళ్ళవద్దకు, దట్ట మైన అడవులకు వెళ్ళి ఇటు అటు తిరుగుచుండెను. 37

మూ. తథా స గత్వా విపులం మహద్వనం
పరీత్య సర్వం త్వథ మైథిలీం ప్రతి,
అనిష్ఠితాశః స చకార మార్గణే
పునః ప్రియాయాః పరమం పరిశ్రమమ్. 38

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
షష్టితమః సర్గః.

ప్ర. అ. సః = ఆ రాముడు, విపులమ్ = విశాలమైన, మహత్ = గొప్ప దైన, వనమ్ = వనమును గూర్చి, తథా = ఆ విధముగా, గత్వా = వెళ్ళి, సర్వమ్ = సమస్తమైన వనమును, పరీత్య = వెదకి, మైథిలీం ప్రతి = సీతను గూర్చి, అనిశ్చితాశః = స్థిరము కాని ఆశ కలవాడై, సః = అతడు, పునః = మరల, ప్రియాయాః = ప్రియురాలియొక్క, మార్గణే = అన్వేషణమునందు, పరమమ్ = గొప్ప, పరిశ్రమమ్ = పరిశ్రమను, చకార = చేసెను.

తా. రాముడా విధముగా విశాలమైన మహావనములో ప్రవేశించి, అంతటా వెదకి, సీత విషయమున ఆశ శిథిలము కాగా, ఆమెను వెదకుటకై మరల గొప్ప ప్రయత్నము చేసెను. 38

వి. ఈ సర్గలో వర్ణించిన రామవిలాపము ప్రాచ్యప్రతిలో లేదు. లేక పోవుటయే యుక్తము.

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో అరువదవ సర్గ సమాప్తము.

అథ ఏకషష్టితమః సర్గః

[రామలక్ష్మణులు సీతను వెదకుట. ఆమె కనబడకపోవుటచే రాముడు విలపించుట].

మూ. దృష్ట్వాశ్రమపదం శూన్యం రామో దశరథాత్మజః,
రహితాం పర్ణశాలాం చ ప్రవిద్ధాన్యాసనాని చ. 1

అదృష్ట్వా తత్ర వైదేహీం సంనిరీక్ష్య చ సర్వశః,
ఉవాచ రామః ప్రాక్రుశ్య ప్రగృహ్యా రుచిరౌ భుజౌ. 2

ప్ర. అ. దశరథాత్మజః = దశరథకుమారుడైన, రామః = రాముడు, శూన్యమ్ = శూన్యమైన, ఆశ్రమపదమ్ = ఆశ్రమమును, రహితామ్ = సీతతో శూన్యమైన, పర్ణశాలాం చ = పర్ణశాలను, ప్రవిద్ధాని = విసరివేయబడిన, ఆసనాని చ = ఆసనములను, దృష్ట్వా = చూచి, తత్ర = అక్కడ, వైదేహీమ్ = సీతను, అదృష్ట్వా = చూడక, సర్వశః = అన్ని వైపులా, సంనిరీక్ష్య చ = చూచి, ప్రాక్రుశ్య = అరచి, రుచిరౌ = అందమైన, భుజౌ = (లక్ష్మణుని) భుజములను, ప్రగృహ్యా = గ్రహించి, ఉవాచ = పలికెను.

తా. దశరథకుమారుడైన రాముడు శూన్యముగా ఉన్న ఆశ్రమప్రాంతమును. సీతలేని పర్ణశాలను, చెల్లాచెదరుగా పడి ఉన్న ఆసనములను చూచి, అక్కడ సీతను కానక. అన్ని వైపులా చూచి, బిగ్గరగా అరచుచు, లక్ష్మణుని అందమైన భుజములు పట్టుకొని ఇట్లు పలికెను. 1, 2

మూ. క్వ ను లక్ష్మణ వైదేహీ కం వా దేశమితో గతా,
కేనాహృతా వా సౌమిత్రే భక్షితా కేన వా ప్రియా. 3

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! వైదేహీ = సీత, క్వ ను = ఎక్కడ ఉన్నదో;

ఇతః = ఇక్కడినుండి, కం వా దేశమ్ = ఏ ప్రదేశమును గూర్చి, గతా = వెళ్ళినదో। సౌమిత్రే = లక్ష్మణా। కేన=ఎవనిచేత, ఆహృతా వా=హరింపబడినదో! ప్రియా = ప్రియురాలు, కేన వా = ఎవనిచేత, భక్షితా = భక్షింపబడినదో।

తా. లక్ష్మణా। సీత ఎక్కడ ఉన్నదో। ఇక్కడినుండి ఏ ప్రదేశమునకు వెళ్ళినదో। ఓ। సౌమిత్రీ। ఆమెను ఎవరు హరించినారో। నా ప్రియురాలిని ఎవరు భక్షించినారో! 3

మూ. వృక్షేణావార్య యది మాం సీతే హసితుమిచ్ఛసి,
అలం తే హసితేనాద్య మాం భజస్వ సుదుఃఖితమ్. 4

ప్ర. అ. సీతే = సీతా! వృక్షేణ=వృక్షముచేత, ఆవార్య = దాగి, మామ్ = నన్ను. హసితుమ్ = పరిహసించుటకు, ఇచ్ఛసి యది = ఇచ్ఛయించుచున్నట్లయితే, తే = నీయొక్క, హసితేన = పరిహాసముచేత, అలమ్ = చాలును. అద్య = ఇప్పుడు, సుదుఃఖితమ్ = చాల దుఃఖించుచున్న, మామ్=నన్ను, భజస్వ = పొందుము.

తా. సీతా! నాతో పరియాచక మాడుటకై చెట్ల వెనుక దాగి యున్నావా? ఇంక ఈ పరిహాసము చాలును. చాల దుఃఖాక్రాంతుడనైన నన్ను పొందుము. 4

మూ. యైః సహ క్రీడసే సీతే విశ్వస్తైర్మృగపోతకైః,
ఏతే హీనాస్త్వయా సౌమ్యే ధ్యాయన్త్యాస్రావిలేక్షణాః. 5

ప్ర. అ. సౌమ్యే = సౌమ్యురాలవైన, సీతే = సీతా। విశ్వస్తైః = నీయందు నమ్మిక గల, యైః = ఏ, మృగపోతకైః సహ = లేడిపిల్లలతో, క్రీడసే = ఆడుకొనుచున్నావో, ఏతే = ఇవి, త్వయా=నీతో, హీనాః = శూన్యములైనవై, అస్రావిలేక్షణాః = కన్నీళ్ళచేత వ్యాకులమైన నేత్రములు కలవై, ధ్యాయన్తి = ఏమో ఆలోచించుచున్నవి.

తా. సౌమ్యురాల వైన ఓ। సీతా। నమ్మిక గల ఏ లేడిపిల్లలతో నీవు ఆడుకొనుచుండేదానవో ఆ లేడిపిల్లలు, నీవు కనబడకపోవుటచే, కన్నీళ్ళతో నిండిన కళ్ళతో విచారగ్రస్తములై నిలచి ఉన్నవి. 5

మూ. సీతయా రహితోఽహం వై న హి జీవామి లక్ష్మణ,
వృతం శోకేన మహతా సీతాహరణజేన మామ్. 6
పరలోకే మహారాజో నూనం ద్రక్ష్యతి మే పితా.

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా! సీతయా = సీతతో, రహితః = శూన్యుడ నైన, అహమ్ = నేను. న హి జీవామి = జీవించను. సీతాహరణజేన = సీతను హరించుటవల్ల కలిగిన, మహతా = గొప్ప, శోకేన = శోకముతో, వృతమ్ = కూడిన, మామ్ = నన్ను, మహారాజః = మహారాజైన, మే పితా = నా తండ్రి, నూనమ్ = తప్పక, పరలోకే = పరలోకమునందు, ద్రక్ష్యతి = చూడగలడు.

తా. లక్ష్మణా! నేను సీత లేకుండగా జీవించను కదా. సీతను హరించుట వలన కలిగిన గొప్ప శోకముతో బాధపడుచున్న నన్ను నా తండ్రియైన దశరథ మహారాజు తప్పక పరలోకములో చూడగలడు. 6

మూ. కథం ప్రతిజ్ఞాం సంశ్రుత్య మయా త్వమభియోజితః, 7
అపూరయిత్వా తం కాలం మత్సకాశమిహాగతః.
కామవృత్తమనార్యం మాం మృషావాదినమేవ చ, 8
ధిక్త్వామితి పరే లోకే వ్యక్తం వక్ష్యతి మే పితా.

ప్ర. అ. మామ్ = నన్ను గూర్చి, మయా = నాచేత, అభియోజితః = ఆజ్ఞాపింపబడిన, త్వమ్ = నీవు, ప్రతిజ్ఞామ్ = ప్రతిజ్ఞను, సంశ్రుత్య = (ప్రతిజ్ఞ) చేసి, తం కాలమ్ = ఆ కాలమును, అపూరయిత్వా = నింపక, మత్సకాశమ్ = నా సమీపమును గూర్చి, కథమ్ = ఎట్లు, ఇహ = ఇక్కడికి, ఆగతః = వచ్చినావు? కామవృత్తమ్ = స్వేచ్ఛాప్రవృత్తిగలవాడవు, అనార్యమ్ = చెడ్డవాడవు, మృషావాదినమేవ చ = అసత్యముగా మాటలాడువాడవు అయిన, త్వామ్ = నిన్ను గూర్చి, ధిక్ = నింద అగుగాక, ఇతి = అని, పరే లోకే = పరలోకమునందు, మే పితా = నా తండ్రి, వ్యక్తమ్ = సత్యముగా, వక్ష్యతి = పలకగలడు.

తా. "నేను ఆజ్ఞాపించగా అక్కడే చేసెద నని ప్రతిజ్ఞ చేసి, ఆ కాలమును పూర్తిచేయకుండగా ఇక్కడికి నాదగ్గరకు ఎట్లు వచ్చినావు! ఛీ! నీవు స్వేచ్ఛగా ప్రవర్తించేవాడవు. గౌరవమునకు అనర్హుడవు. అసత్యము పలుకువాడవు'' అని పరలోకములో నా తండ్రి నన్ను నిందించును. 7, 8

మూ. వివశం శోకసంతప్తం దీనం భగ్నమనోరథమ్, 9
మామిహోత్సృజ్య కరుణం కీర్తిర్నరమివానృజుమ్,
క్వ గచ్ఛసి వరారోహే మా మోత్సృజ సుమధ్యమే, 10
త్వయా విరహితశ్చాహం మోక్ష్యే జీవితమాత్మనః.

ప్ర. అ. వరారోహే = శ్రేష్ఠమైన కటిప్రదేశము గలదానా! వివశమ్ = నా వశములో లేనివాడను, శోకసంతప్తమ్ = శోకముచేత పీడింపబడినవాడను, దీనమ్ = దీనుడను, భగ్నమనోరథమ్ = భగ్నమైన మనోరథము కలవాడను అయిన, మామ్ = నన్ను, కీర్తిః = కీర్తి, అనృజుమ్ = ఋజుస్వభావము లేని, నరమివ = మనుష్యుణ్ణి వలె, ఇహ = ఇక్కడ, కరుణమ్ = దీనునిగా, ఉత్సృజ్య = విడచి, క్వ గచ్ఛసి = ఎక్కడికి వెళ్ళుచున్నావు? సుమధ్యమే = మంచి నడుము గలదానా! మా = నన్ను, మా ఉత్సృజ = విడువకుము. త్వయా = నీతో, విరహితః = శూన్యుడనైన, అహమ్ = నేను, ఆత్మనః = నాయొక్క, జీవితమ్ = జీవితమును, మోక్ష్యే = విడువగలను.

తా. అందమైన కటిప్రదేశము, సుందరమైన నడుము గల సీతా! శోకముచేత పీడింపబడి, వశము తప్పి, దీనుడనై, మనోరథము లన్నీ భగ్నమై పోయిన నన్ను, ఇక్కడ, కుటిలస్వభావము గలవానిని కీర్తి విడచి నట్లు, దీనునిగా విడచివేసి ఎక్కడకు వెళ్ళుచున్నావు! నన్ను విడువకుము. నీవు నన్ను విడచి నచో నా జీవితమునే విడచెదను. 9, 10

మూ. ఇతీవ విలపన్ రామః సీతాదర్శనలాలసః, 11
న దదర్శ సుదుఃఖార్తో రాఘవో జనకాత్మజామ్.

ప్ర. అ. సీతాదర్శనలాలసః = సీతయొక్క దర్శనమునందు ఆసక్తి గలవాడు, సుదుఃఖార్తః = అధికముగా దుఃఖముచేత పీడితుడు, రాఘవః = రఘు వంశమునకు చెందినవాడు అయిన, రామః = రాముడు, ఇతీవ = ఇట్లు, విలపన్ = విలపించుచు, జనకాత్మజామ్ = సీతను, న దదర్శ = చూడలేదు.

తా. సీతను చూడవలె నను తీవ్రాభిలాష గల, రఘువంశసంజాతుడైన ఆ రాముడు దుఃఖముతో చాల బాధపడుచు, ఈ విధముగా విలపించుచుండెను.

మూ. అనాసాదయమానం తం సీతాం దశరథాత్మజమ్, 12
పఙ్కమాసాద్య విపులం సీదన్తమివ కుఞ్జరమ్,
లక్ష్మణో రామమత్యర్థమువాచ హితకామ్యయా. 13

ప్ర. అ. సీతామ్ = సీతను, అనాసాదయమానమ్ = పొందనివాడు, దశరథాత్మజమ్ = దశరథుని కుమారుడు, విపులమ్ = అధికమైన, పఙ్కమ్ = బురదను, ఆసాద్య = పొంది, సీదన్తమ్ = నశించుచున్న, కుఞ్జరమ్ ఇవ = ఏనుగు వలె ఉన్న, తం రామమ్ = ఆ రాముని గూర్చి, లక్ష్మణః = లక్ష్మణుడు, అత్యర్థమ్ = మిక్కిలి, హితకామ్యయా = హితమునందు కోరికచేత, ఉవాచ = పలికెను.

తా. దశరథకుమారుడైన ఆ రాముడు సీత కనబడకపోవుటచే, అతివిశాలమైన బురదలో మునిగిపోవుచున్న ఏనుగ వలె బాధపడుచుండగా, లక్ష్మణుడు, అతని హితమును కోరుచు ఇట్లు పలికెను. 12, 13

మూ. మా విషాదం మహాబాహో కురు యత్నం మయా సహ,
ఇదం చ హి వనం శూర బహుకన్దరశోభితమ్. 14

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు కలవాడా; విషాదమ్ = దుఃఖమును, మా = పొందకుము. మయా సహ = నాతో కలిసినవాడవై, యత్నమ్ = ప్రయత్నమును, కురు = చేయుము. శూర = ఓ! శూరుడా! ఇదమ్ = ఈ, వనమ్ = వనము, బహుకన్దరశోభితం హి = అనేకములైన గుహలచేత ప్రకాశింపచేయబడినది కదా!

తా. ఓ! మహాబాహూ! విషాదము చెందకుము. నాతో కలిసి ప్రయత్నము చేయుము. ఓ! శూరుడా! ఈ వనములో ఎన్నో గుహలు ఉన్నవి కదా!

మూ. ప్రియకాననసంచారా వనోన్మత్తా చ మైథిలీ,
సా వనం వా ప్రవిష్టా స్యాన్నళినీం వా సుపుష్పితామ్. 15

ప్ర. అ. ప్రియకాననసంచారా = ఇష్టమైన అరణ్యసంచారము గలది, వనోన్మత్తా చ = జలమునందు అత్యాసక్తి గలది అయిన, సా మైథిలీ = ఆ సీత, వనం వా = వనమును గాని, సుపుష్పితామ్ = బాగుగా పుష్పించిన, నళినీం వా = పద్మసరస్సును గాని, ప్రవిష్టా = ప్రవేశించినది, స్యాత్ = అయియుండును.

తా. సీతకు అరణ్యములో సంచరించుట అనగా చాల ఇష్టము. జలము నందు కూడ ఆమెకు అధికమైన ఆసక్తి. అందుచేత ఆమె వనమునకు వెళ్ళి యుండును; లేదా పుష్పాలతో నిండిన పద్మసరస్సునకు వెళ్ళి యుండును. 15

మూ. సరితం వాపి సంప్రాప్తా మీనవఞ్జులసేవితామ్,
స్నాతుకామా నిలీనా స్యాద్ధాసకామా వనే క్వచిత్. 16

ప్ర. అ. స్నాతుకామా = స్నానము చేయుటకు ఇచ్ఛ గలదై, మీనవఞ్జులసేవితామ్ = మీనములచేత, నీటిప్రబ్బలిచెట్లచేత సేవింపబడిన, సరితం వాపి = నదినైనా, సంప్రాప్తా = పొందియుండును. హాసకామా = పరిహాసమునందు కోరికగలదై, క్వచిత్ = ఎక్కడనైనా, నిలీనా వా = దాగినదైనా, స్యాత్ = అయి ఉండవచ్చును.

తా. ఆమె స్నానముచేయుటకై, మీనములతోను, నీటి ప్రబ్బలిపొదలతోను నిండిన నదికైనా వెళ్ళి ఉండవచ్చును, లేదా పరిహాసము చేయుటకై ఎక్కడనైనా దాగి యైనా ఉండవచ్చును. 16

మూ. విత్రాసయితుకామా వా లీనా స్యాత్కాననే క్వచిత్,
జిజ్ఞాసమానా వైదేహీ త్వాం మాం చ పురుషర్షభ, 17
తస్యాహ్యన్వేషణే శ్రీమన్ క్షిప్రమేవ యతావహై.

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా : వైదేహీ = సీత, త్వాం చ = నిన్ను, మాం చ = నన్ను, విత్రాసయితుకామా వా = భయపెట్టు కోరిక గలదై, జిజ్ఞాసమానా = తెలుసుకొనదలచుచున్నదై, కాననే = అడవియందు, క్వచిత్ = ఎక్కడనో, లీనా = అణగినది, స్యాత్ = అయి ఉండును. శ్రీమన్ = ఓః శ్రీమంతుడా! తస్యాః = ఆమెయొక్క, అన్వేషణే = వెదకుటయందు, క్షిప్రమేవ = శీఘ్రముగా, యతావహై = ప్రయత్నించెదము.

తా. పురుషులలో శ్రేష్ఠుడవైన రామా! మన మేమి చేసెదమో చూచుటకై, మనలను భయపెట్టుటకై, సీత, అడవిలో ఎక్కడనైన దాగియుండును. ఓ! శ్రీమంతుడా! మనము వెంటనే ఆమెను వెదకుటకు ప్రయత్నము చేసెదము. 17

మూ. వనం సర్వం విచినువో యత్ర సా జనకాత్మజా, 18
మన్యసే యది కాకుత్స్థ మా స్మ శోకే మనః కృథాః.

ప్ర. అ. కాకుత్స్థ = రామా! మన్యసే యది=నీవు తలచినచో, సా=ఆ, జనకాత్మజా = సీత, యత్ర = ఎచట నున్నదో, సర్వమ్ = సమస్తమైన, వనమ్ = వనమును, విచినుమః = వెదకెదము. శోకే = శోకమునందు, మనః = మనస్సును, మా స్మ కృథాః=చేయకుము.

తా. రామా : నీవు సరే అన్నచో ఈ వనమునంతా వెదకి సీత ఎక్కడ ఉన్నదో చూచెదము. నీ మనస్సును దుఃఖవశము చేయకుము. 18

మూ. ఏవముక్తస్తు సౌహార్దాల్లక్ష్మణేన సమాహితః, 19
సహ సౌమిత్రిణా రామో విచేతుముపచక్రమే.

ప్ర. అ. లక్ష్మణేన = లక్ష్మణునిచేత, సౌహార్దాత్ = ప్రేమవలన, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడినవాడై, రామః = రాముడు, సమాహితః = సమాధానము పొందినవాడై, సౌమిత్రిణా సహ = లక్ష్మణునితో కూడ, విచేతుమ్ = అన్వేషించుటకు, ఉపచక్రమే = ప్రారంభించెను.

తా. లక్ష్మణుడు స్నేహపూర్వకముగా పలికిన ఈ మాటలు విని రాముడు కొంత సమాధానము చెంది, అతనితో కలిసి సీతను వెదకుటకు ప్రారంభించెను.

మూ. తౌ వనాని గిరీంశ్చైవ సరితశ్చ సరాంసి చ, 20
నిఖిలేన విచిన్వానౌ సీతాం దశరథాత్మజౌ.

ప్ర. అ., తౌ దశరథాత్మజౌ = ఆ దశరథకుమారులు, వనాని = వనములను, గిరీన్ చైవ = పర్వతములను, సరితశ్చ = నదులను, సరాంసి చ = సరస్సులను, నిఖిలేన = పూర్తిగా, సీతామ్ = సీతను, విచిన్వానౌ = వెదకుచు, (ఆమెను పొందలేదు).

తా. దశరథకుమారులైన ఆ రామలక్ష్మణులు సీతకోసమై వనములు, పర్వతములు, నదులు, సరస్సులు, అన్ని చోట్లా వెదకిరి. 20

మూ. తస్య శైలస్య సానూని గుహాశ్చ శిఖరాణి చ, 21
నిఖిలేన విచిన్వానౌ నైవ తామభిజగ్మతుః.

ప్ర. అ. తస్య శైలస్య = ఆ పర్వతముయొక్క, సానూని=చరియలను,

గుహాశ్చ = గుహలను, శిఖరాణి చ = శిఖరములను, నిఖిలేన = పూర్తిగా, విచిన్వానౌ = వెదకుచున్నవారై, తామ్ = ఆమెను, నైవ అభిజగ్మతుః = పొంద లేదు.

తా. ఆ పర్వతము చరియలు, గుహలు, శిఖరములు అంతటా వెదకినా కూడ రామలక్ష్మణులకు సీత కనబడలేదు. 21

మూ. విచిత్య సర్వతః శైలం రామో లక్ష్మణమబ్రవీత్, 22
నేహ పశ్యామి సౌమిత్రే వైదేహీం పర్వతే శుభామ్.

ప్ర. అ. రామః = రాముడు, సర్వతః=అంతటా, శైలమ్=పర్వతమును, విచిత్య = వెదకి, లక్ష్మణమ్=లక్ష్మణుని గూర్చి, అబ్రవీత్=పలికెను. సౌమిత్రే =లక్ష్మణా ! ఇహ = ఈ, పర్వతే = పర్వతమునందు, శుభామ్ = మంగళప్రదు రాలైన, వైదేహీమ్ = సీతను, న పశ్యామి = చూడను.

తా. రాముడు ఆ పర్వతముమీద అంతటా వెదకి లక్ష్మణునితో ఇట్లు పలికెను. "లక్ష్మణా ! ఈ పర్వతముమీద ఎక్కడా మంగళప్రదురాలైన సీత కన బడుటలేదు." 22

మూ. తతో దుఃఖాభిసంతప్తో లక్ష్మణో వాక్యమబ్రవీత్, 23
విచరన్ దణ్డకారణ్యం భ్రాతరం దీప్తతేజసమ్.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, దుఃఖాభిసంతప్తః=దుఃఖముచేత పీడితు డైన, లక్ష్మణః = లక్ష్మణుడు, దణ్డకారణ్యమ్ = దండకారణ్యమును, విచరన్= సంచరించుచు, (వెదకుచు), దీప్తతేజసమ్ = ప్రజ్వలించుచున్న తేజస్సు గల, భ్రాతరమ్ = సోదరుడైన రాముణ్ణి గూర్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. పిదప దుఃఖాక్రాంతుడైన లక్ష్మణుడు దండకారణ్యములో వెదకుచు, తేజస్సుతో ప్రజ్వలించుచున్న సోదరుడైన రామునితో ఇట్లు పలికెను. 23

మూ. ప్రాప్స్యసి త్వం మహాప్రాజ్ఞ మైథిలీం జనకాత్మజామ్,
యథా విష్ణుర్మహాబాహుర్బలిం బద్ధ్వా మహీమిమామ్.

ప్ర. అ. మహాప్రాజ్ఞ = గొప్ప బుద్ధి గలవాడా ! త్వమ్ = నీవు, జనకాత్మజామ్ = జనకుని కుమార్తె యైన, మైథిలీమ్ = సీతను, మహాబాహుః = గొప్ప బాహువులు గల, విష్ణుః = విష్ణువు, బలిమ్ = బలిచక్రవర్తిని, బద్ధ్వా = బంధించి, ఇమామ్ = ఈ, మహీం యథా = భూమిని వలె, ప్రాప్స్యసి = పొందగలవు.

తా. మహాబుద్ధిశాలివైన రామా ! మహాబాహువైన విష్ణుమూర్తి బలిచక్రవర్తిని బంధించి ఈ భూమిని పొందినట్లు నీవు జనకరాజకుమారి యైన సీతను పొందగలవు. 24

మూ. ఏవముక్తస్తు సౌహార్దాల్లక్ష్మణేన స రాఘవః, 25
ఉవాచ దీనయా వాచా దుఃఖాభిహతచేతనః

ప్ర. అ. లక్ష్మణేన = లక్ష్మణునిచేత, సౌహార్దాత్ = స్నేహమువలన, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, సః రాఘవః = ఆ రాముడు, దుఃఖాభిహతచేతనః = దుఃఖముచేత కొట్టబడిన మనస్సు కలవాడై, దీనయా = దీనమైన, వాచా = వాక్కుతో, ఉవాచ = పలికెను.

తా. లక్ష్మణుడు స్నేహపూర్వకముగా పలికిన మాటలు విని, ఆ రాముడు దుఃఖముతో నిండిన మనస్సుతో, దీనముగా ఇట్లు పలికెను. 25

మూ. వనం సర్వం సువిచితం పద్మిన్యః ఫుల్లపఙ్కజాః, 26
గిరిశ్చాయం మహాప్రాజ్ఞ బహుకన్దరనిర్ఝరః,
న హి పశ్యామి వైదేహీం ప్రాణేభ్యోఽపి గరీయసీమ్. 27

ప్ర. అ. మహాప్రాజ్ఞ = గొప్ప బుద్ధి గలవాడా ! సర్వమ్ = సమస్తమైన, వనమ్ = వనము, సువిచితమ్ = బాగుగా వెదకబడినది. ఫుల్లపఙ్కజాః = వికసించిన పద్మములు గల, పద్మిన్యః = పద్మసరస్సులు, వెదకబడినవి. బహుకన్దరనిర్ఝరః = అనేకమైన గుహలు, సెలయేళ్ళు గల, అయమ్ = ఈ, గిరిశ్చ = పర్వతము కూడ (వెదకబడినది). ప్రాణేభ్యోఽపి = ప్రాణములకంటె కూడ, గరీయసీమ్ = గొప్పదైన, వైదేహీమ్ = సీతను, న హి పశ్యామి = చూడను

తా. బుద్ధిశాలివైన లక్ష్మణా! వన మంతా వెదకినాము. వికసించిన పద్మము లున్న పద్మసరస్సులు, అనేకములైన గుహలు, సెలయేళ్ళు ఉన్న ఈ పర్వతము కూడ వెదకినాము. కాని నా ప్రాణములకంటె కూడ గొప్పదైన సీత కనబడుటలేదు. 27

మూ. ఏవం స విలపన్రామః సీతాహరణకర్శితః,
దీనః శోకసమావిష్టో ముహూర్తం విహ్వలోఽభవత్. 28

ప్ర. అ. సీతాహరణకర్శితః = సీతయొక్క హరణముచేత కృశింపచేయ బడిన, సః రామః = ఆ రాముడు, ఏవమ్ = ఇట్లు, విలపన్ = విలపించుచు, దీనః = దీనుడై, శోకసమావిష్టః = శోకముచేత వ్యాప్తుడై, ముహూర్తమ్ = ముహూర్త కాలముపాటు, విహ్వలః = వ్యాకులుడు, అభవత్ = ఆయెను.

తా. సీతాహరణముచేత కృశించిపోయిన ఆ రాముడు ఈ విధముగా విలపించుచు, దీనుడై, దుఃఖాక్రాంతుడై ముహూర్తకాలముపాటు వ్యాకులత చెందెను.

మూ. సంతప్తో హ్యవసన్నాఙ్గో గతబుద్ధిర్విచేతనః,
నిషసాదాతురో దీనో నిఃశ్వస్యాశీతమాయతమ్. 29

ప్ర. అ. సంతప్తః = తపింపచేయబడినవాడై, అవసన్నాఙ్గః = కృశించిన దేహముకలవాడై, గతబుద్ధిః = పోయిన బుద్ధిబలము గలవాడై, విచేతనః = తొలగిన చైతన్యము కలవాడై, ఆతురః = పీడితుడై, దీనః = దీనుడై, అశీతమ్ = వేడిగాను, ఆయతమ్ = దీర్ఘముగాను, నిఃశ్వస్య = నిట్టూర్చి, నిషసాద = కూర్చుండెను.

తా. అప్పుడు రాముడు సంతాపము చెంది యుండెను. శరీరము కృశించెను. బుద్ధి సరిగా పనిచేయకుండెను. స్పృహ కూడ తప్పుచుండెను. ఈ విధముగ రాముడు దుఃఖపీడితుడై, దీనుడై, వేడిగా, దీర్ఘముగా నిట్టూర్చి కూర్చుండి పోయెను.

మూ. బహుళం స తు నిఃశ్వస్య రామో రాజీవలోచనః,
హా ప్రియేతి విచుక్రోశ బహుశో బాష్పగద్గదః. 30

ప్ర. అ. రాజీవలోచనః = కమలలోచనుడైన, సః రామః = ఆ రాముడు, బహుశమ్ = అధికముగా, నిఃశ్వస్య = నిట్టూర్చి, బాష్పగద్గదః = కన్నీటిచేత డగ్గుత్తిక కలవాడై, హా ప్రియేతి = అయ్యో ! ప్రియురాలా ! అని, బహుశః = అనేక పర్యాయములు, విచుక్రోశ = అరచెను.

తా. పద్మములవంటి నేత్రములు గల రాముడు మాటిమాటికి నిట్టూర్చుచు, బాష్పముచేత డగ్గుత్తిక చెందిన కంఠముతో "అయ్యో ! ప్రియురాలా !" అని అనేక పర్యాయములు అరచెను.

మూ. తం తతః సాన్త్వయామాస లక్ష్మణః ప్రియబాన్ధవః,
బహుప్రకారం ధర్మజ్ఞః ప్రశ్రితం ప్రశ్రితాఞ్జలిః. 31

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ప్రియబాన్ధవః = ప్రియమైన బంధువులు గలవాడు, ధర్మజ్ఞః = ధర్మములు తెలిసినవాడు అయిన, లక్ష్మణః = లక్ష్మణుడు, ప్రశ్రితాఞ్జలిః = కట్టబడిన దోసిలి గలవాడై, ప్రశ్రితమ్ = వినయముతో కూడు నట్లుగా, బహుప్రకారమ్ = అనేకవిధముల, తమ్ = ఆ రాముణ్ణి, సాన్త్వయామాస = ఓదార్చెను.

తా. అప్పుడు, బంధువులమీద ప్రేమ గలవాడు, ధర్మములను ఎరిగిన వాడు అయిన లక్ష్మణుడు, అంజలి ఘటించి, వినయపూర్వకముగా, అనేకవిధముల, ఆ రాముణ్ణి ఓదార్చెను. 31

మూ. అనాదృత్య తు తద్వాక్యం లక్ష్మణోష్ఠపుటాచ్చ్యుతమ్,
అపశ్యంస్తాం ప్రియాం సీతాం ప్రాక్రోశత్స పునః పునః.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ఏకషష్టితమః సర్గః.

ప్ర. అ. సః తు = ఆ రాముడైతే, లక్ష్మణోష్ఠపుటాత్ = లక్ష్మణుని పెద వులనుండి, చ్యుతమ్ = వచ్చిన, తత్ వాక్యమ్ = ఆ వాక్యమును, అనాదృత్య = ఆదరించక, ప్రియామ్ = ప్రియురాలైన, తాం సీతామ్ = ఆ సీతను, అపశ్యన్ = చూడనివాడై, పునః పునః = మాటిమాటికి, ప్రాక్రోశత్ = విలపించెను.

తా. కాని రాముడు లక్ష్మణుడు పలికిన మాటలు లెక్కచేయక, ప్రియురాలైన ఆ సీత కనబడకపోవుటచే మాటిమాటికి విలపించెను. 32

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో అరవదియొకటవ సర్గ సమాప్తము.

అథ ద్విషష్టితమః సర్గః

[రాముడు సీతకొరకై విలపించుట]

మూ. సీతామపశ్యన్ ధర్మాత్మా శోకోపహతచేతనః,
విలలాప మహాబాహూ రామః కమలలోచనః. 1

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడు, మహాబాహుః = గొప్ప బాహువులు కలవాడు, కమలలోచనః = కమలముల వంటి నేత్రములు కలవాడు అయిన, రామః = రాముడు, సీతామ్ = సీతను, అపశ్యన్ = చూడనివాడై, శోకోపహత చేతనః = శోకముచేత కొట్టబడిన బుద్ధి కలవాడై, విలలాప = విలపించెను.

తా. ధర్మాత్ముడు, మహాబాహువు, పద్మనేత్రుడు అయిన రాముడు సీత కనబడకపోవుటచేత దుఃఖముచే కొట్టబడిన బుద్ధికలవాడై విలపించెను. 1

మూ. పశ్యన్నివ చ తాం సీతామపశ్యన్మదనార్దితః,
ఉవాచ రాఘవో వాక్యం విలాపాశ్రయదుర్వచమ్. 2

ప్ర. అ మదనార్దితః = మన్మథునిచేత పీడితుడైన, రాఘవః = రాముడు, తామ్ = ఆ, సీతామ్ = సీతను, అపశ్యన్ = చూడకపోయినను, పశ్యన్నివ = చూచుచున్నవాడు వలె, విలాపాశ్రయదుర్వచమ్ = విలాపమును ఆశ్రయించుటచేత పలుకుటకు కష్టముగా ఉన్న, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. మన్మథునిచేత పీడితుడైన రాముడు సీత కనబడకపోయినను కన బడుతున్న దని భావించుచు విలపించుటచే పైకి స్పష్టముగా రాని మాటలు ఇట్లు పలికెను. 2

మూ. త్వమశోకస్య శాఖాభిః పుష్పప్రియతయా ప్రియే,
ఆవృణోషి శరీరం తే మమ శోకవివర్ధినీ. 3

ప్ర. అ. ప్రియే = ప్రియురాలా ! త్వమ్ = నీవు, పుష్పప్రియతయా = పుష్పములు ప్రియములుగా కలదాన వగుటచేత, మమ = నాయొక్క, శోకవివర్ధినీ = శోకమును వృద్ధి పొందించుచు, అశోకస్య = అశోకవృక్షముయొక్క, శాఖాభిః = కొమ్మలచేత, తే = నీయొక్క, శరీరమ్ = శరీరమును, అవృణోషి = కప్పుకొనుచున్నావు.

తా. ప్రియురాలా ! నీవు పుష్పములపై అధికప్రీతి కలదాన వగుటచేత నీ శరీరమును అశోకవృక్షము కొమ్మలచేత కప్పుకొనుచున్నావు. దానివలన నా శోకము వృద్ధి పొందుచున్నది. 3

మూ. కదళీస్కన్దసదృశౌ కదళ్యా సంవృతావుభౌ,
ఊరూ పశ్యామి తౌ దేవి నాసి శక్తా విగూహితుమ్. 4

ప్ర. అ. దేవి = దేవీ ! కదలీస్కన్దసదృశౌ = అరటిస్తంభములతో సమానములు, కదళ్యా = అరటిచెట్టుచేత, సంవృతౌ = కప్పబడినవి అయిన, తే ఊరూ = నీ తొడలను, పశ్యామి = చూచుచున్నాను. విగూహితుమ్ = కప్పుటకు, శక్తా = సమర్థురాలవు, నాసి = కావు.

తా. ఓ! సీతా ! అరటిస్తంభాలతో సమానములైన నీ రెండు తొడలను అరటిచెట్లు కప్పివేయునట్లు చేసినావు కాని నాకు అవి కనబడిపోయినవి. వాటిని దాచలేకపోయినావు. 4

మూ. కర్ణికారవనం భద్రే హసన్తీ దేవి సేవసే,
అలం తే పరిహాసేన మమ బాధావహేన వై. 5

ప్ర. అ దేవి = ఓ ! దేవీ ! భద్రే = మంగళప్రదురాలా ! హసన్తీ = నవ్వుచు, కర్ణికారవనమ్ = కర్ణికారవృక్షవనమును, సేవసే = సేవించుచున్నావు. మమ = నాకు, బాధావహేన = బాధకలిగించు, తే పరిహాసేన = నీ పరిహాసము చేత, అలమ్ = చాలును.

తా. మంగళప్రదురాలవైన ఓ ! దేవీ ! నీవు నవ్వుచు కర్ణికారవృక్షముల గుంపులోనికి వెళుచున్నావు. నాకు బాధ కలిగించే ఈ పరిహాస మింక చాలును.

మూ. పరిహాసేన కిం సీతే పరిశ్రాన్తస్య మే ప్రియే,
అయం స పరిహాసో౽పి సాధు దేవి న రోచతే. 6

ప్ర. అ. ప్రియే = ప్రియురాలా ! సీతే = సీతా ! పరిశ్రాన్తస్య = అలసి ఉన్న, మే = నాకు, పరిహాసేన = పరిహాసముచేత, కిమ్ = ఏమి ప్రయోజనము. దేవి = ఓ ! దేవీ ! అయమ్ = ఈ. సః = అట్టి, పరిహాసో౽పి = పరిహాసము కూడ, సాధు = బాగుగా, న రోచతే = నాకు ఇష్ట మగుట లేదు.

తా. ప్రియురాలవైన ఓ ! సీతా ! నేను అలసిపోయి ఉన్నప్పుడు పరిహాసము చేసి ఏమి ప్రయోజనము ? ఓ ! దేవీ ! పరిహాసమే యైనా నీవు చేయుచున్న ఈ పని నాకు ఇష్టము కాదు. 6

మూ. విశేషేణాశ్రమస్థానే హాసో౽యం న ప్రశస్యతే,
అవగచ్ఛామి తే శీలం పరిహాసప్రియం ప్రియే, 7
ఆగచ్ఛ త్వం విశాలాక్షి శూన్యో౽యముటజస్తవ.

ప్ర. అ. విశేషేణ = విశేషముచేత, ఆశ్రమస్థానే = ఆశ్రమస్థానమునందు, అయమ్ = ఈ, హాసః = పరిహాసము, న ప్రశస్యతే = ప్రశస్తముకాదు. ప్రియే = ప్రియురాలా ! తే = నీయొక్క, పరిహాసప్రియమ్ = పరిహాసము ప్రియముగా గల, శీలమ్ = స్వభావమును, అవగచ్ఛామి = ఎరుగుదును. విశాలాక్షి = విశాలములైన నేత్రములు కలదానా ! త్వమ్ = నీవు, ఆగచ్ఛ = రమ్ము. తవ = నీయొక్క, అయమ్ ఉటజః = ఈ పర్ణశాల, శూన్యః = శూన్యముగా ఉన్నది.

తా. ప్రియురాలా ! నీకు పరిహాసము చేయుట చాల ఇష్ట మని నాకు తెలియును. కాని ఇట్టి పరిహాసము, విశేషించి ఆశ్రమములో ప్రశస్తము కాదు. అందుచే ఓ ! విశాలాక్షీ ! నీవు రమ్ము. నీ పర్ణశాల శూన్యముగా ఉన్నది. 7

మూ. సువ్యక్తం రాక్షసైః సీతా భక్షితా వా హృతాపి వా, 8
న హి సా విలపన్తం మాముపసంప్రైతి లక్ష్మణ.

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! సీతా = సీత, సువ్యక్తమ్ = నిశ్చితముగా, రాక్షసైః = రాక్షసులచేత, భక్షితా వా = భక్షింపబడినది గాని, హృతాపి వా =

హరింపబడినది గాని అయి ఉండును. సా=ఆమె, విలపన్తమ్=విలపించుచున్న, మామ్=నన్ను, న ఉపసంప్రైతి హి=చేరుటలేదు కదా।

తా. లక్ష్మణా! నిశ్చితముగా సీతను రాక్షసులు భక్షించి ఉందురు. లేదా హరించి ఉందురు. అట్లు కానిచో నే నిట్లు విలపించుచుండగా ఆమె రాకుండా ఉండునా? 8

మూ. ఏతాని మృగయూథాని సాశ్రునేత్రాణి లక్ష్మణ, 9
శంసన్తీవ హి వైదేహీం భక్షితాం రజనీచరైః.

ప్ర. అ. లక్ష్మణ=లక్ష్మణా। సాశ్రునేత్రాణి = కన్నీళ్ళతో కూడిన నేత్రములు గల, ఏతాని=ఈ, మృగయూథాని=లేళ్ల గుంపులు, వైదేహీమ్= సీతను, రజనీచరైః=రాక్షసులచేత, భక్షితామ్=భక్షింపబడినదానినిగా, శంసన్తీవ=చెప్పుచున్నట్లున్నవి.

ప్ర. అ. లక్ష్మణా। కన్నీళ్ళు కార్చుచున్న ఈ లేళ్ల గుంపులు, సీతను రాక్షసులు భక్షించినా రని చెప్పుచున్నవా అన్నట్లు ఉన్నవి. 9

మూ. హా మమార్యే క్వ యాతాసి హా సాధ్వి వరవర్ణిని, 10
హా సకామా త్వయా దేవీ కైకేయీ సా భవిష్యతి.

ప్ర. అ. హా=అయ్యో! మమ=నాయొక్క, ఆర్యే = పూజ్యురాలా। క్వ=ఎక్కడికి, యాతా అసి=వెళ్ళినావు? హా సాధ్వి=అయ్యో పతివ్రతా। వరవర్ణిని=శ్రేష్ఠమైన వర్ణము గలదానా। హా=అయ్యో। త్వయా=నీచేత, దేవీ=దేవియైన, సా=ఆ, కైకేయీ=కైకేయి, అద్య=ఇప్పుడు, సకామా= తీరిన కోరిక గలది, భవిష్యతి=కాగలదు.

తా. అయ్యో! ఆర్యురాలా। ఎక్కడికి పోయినావు? అయ్యో!, పతివ్రతా! శ్రేష్ఠమైన దేహచ్ఛాయ గలదానా। అయ్యో। ఇప్పుడు నీకి ఆపద సంభవించుటచే ఆ కైకేయీదేవి కోరిక తీరినది. 10

మూ. సీతయా సహ నిర్యాతో వినా సీతాముపాగతః, 11
కథం నామ ప్రవేక్ష్యామి శూన్యమన్తఃపురం పునః.

ప్ర. అ. సీతయా సహ = సీతతో కూడ, నిర్యాతః = బయలుదేరివెళ్ళిన నేను, వినా సీతామ్ = సీత లేకుండగా, ఉపాగతః = వచ్చినవాడనై (తిరిగి అయోధ్య చేరినవాడనై), శూన్యమ్=శూన్యమైన, అన్తఃపురమ్=అంతఃపురమును, పునః = మరల, కథం నామ = ఎట్లు, ప్రవేక్ష్యామి = ప్రవేశించెదను ?

తా. సీతతో కలిసి బయలుదేరి వెళ్ళిన నేను ఆమె లేకుండా అయోధ్య చేరి శూన్యమైన అంతఃపురములో మరల ఎట్లు కాలు పెట్టగలను ? 11

మూ. నిర్వీర్య ఇతి లోకో మాం నిర్దయశ్చేతి వక్ష్యతి, 12
కాతరత్వం ప్రకాశం హి సీతాపనయనేన మే.

ప్ర. అ. లోకః = లోకము, మామ్ = నన్ను గూర్చి, నిర్వీర్యః ఇతి = పరాక్రమవిహీనుడు అని, నిర్దయశ్చేతి = దయ లేనివాడు అని, వక్ష్యతి = పలకగలదు. సీతాపనయనేన = సీతాపహారముచేత, మే = నాయొక్క, కాతరత్వమ్= పిరికివాడ నగుట, ప్రకాశం హి = స్పష్టము కదా ?

తా. నేను పరాక్రమము లేనివాడ ననీ, దయ లేనివాడ ననీ లోకులు చెప్పుకొందురు. సీతను కోల్పోవుటచేత నేను పిరికివాడ ననే విషయము స్పష్టమే కదా ! 12

మూ. నివృత్తవనవాసశ్చ జనకం మిథిలాధిపమ్, 13
కుశలం పరిపృచ్ఛన్తం కథం శక్ష్యే నిరీక్షితుమ్.

ప్ర. అ. నివృత్తవనవాసశ్చ = పూర్తియైన వనవాసము గలవాడనై, కుశలమ్ = క్షేమమును, పరిపృచ్ఛన్తమ్ = ప్రశ్నించుచున్న, మిథిలాధిపమ్=మిథిలా ప్రభువైన, జనకమ్ = జనకమహారాజును, నిరీక్షితుమ్ = చూచుటకు, కథమ్ = ఎట్లు, శక్ష్యే = సమర్థుడ నగుదును ?

తా. నేను వనవాసము పూర్తి చేసికొని వెళ్ళిన పిమ్మట మిథిలాధిపతి యైన జనకమహారాజు వచ్చి "క్షేమమా ?" అని ప్రశ్నించునపుడు అతని ముఖము ఎట్లు చూడగలను ? 13

మూ. విదేహరాజో నూనం మాం దృష్ట్వా విరహితం తయా, 14
సుతాస్నేహేన సంతప్తో మోహస్య వశమేష్యతి.

ప్ర. అ. విదేహరాజః = జనకమహారాజు, తయా = ఆ సీతతో, విరహితమ్ = శూన్యుడనైన, మామ్ = నన్ను, దృష్ట్వా = చూచి, సుతాస్నేహేన = కుమార్తె యందలి ప్రేమచేత, సంతప్తః = పీడింపబడినవాడై, మోహస్య = మోహము యొక్క, వశమ్ = వశమును, ఏష్యతి = పొందగలడు. నూనమ్ = నిశ్చయము.

తా. సీత నా ప్రక్క లేకుండుట చూచి, జనకమహారాజు పుత్రికయందలి ప్రేమచేత దుఃఖితుడై తప్పక మూర్ఛ చెందును. 14

మూ. అథవా న గమిష్యామి పురీం భరతపాలితామ్, 15
స్వర్గోఽపి సీతయా హీనః శూన్య ఏవ మతో మమ.

ప్ర. అ. అథవా = లేదా, భరతపాలితామ్ = భరతునిచేత పాలింపబడిన, పురీమ్ = అయోధ్యానగరమును గూర్చి, న గమిష్యామి = వెళ్ళను. సీతయా = సీతతో, హీనః = శూన్యమైన, స్వర్గోఽపి = స్వర్గము కూడ, మమ = నాకు, శూన్యః ఏవ = శూన్యమైనదిగానే, మతః = తలపబడినది.

తా. లేదా నేను భరతుడు పాలించుచున్న అయోధ్యానగరమునకు వెళ్లనే వెళ్ళను. సీత లేని స్వర్గము కూడ నాకు శూన్యప్రదేశమువంటిదే. 15

మూ. మామిహోత్సృజ్య హి వనే గచ్ఛాయోధ్యాం పురీం శుభామ్,
న త్వహం తాం వినా సీతాం జీవేయం హి కథంచన.

ప్ర. అ. మామ్ = నన్ను, ఇహ = ఈ, వనే = వనమునందు, ఉత్సృజ్య = విడచి, శుభామ్ = మంగళకరమైన, అయోధ్యాం పురీమ్ = అయోధ్యానగరమును గూర్చి, గచ్ఛ = వెళ్లుము. అహం తు = నేనైతే, తాం సీతాం వినా = ఆ సీత లేకుండగా, కథంచన = ఏ విధముగాను కూడ, న జీవేయం హి = జీవించను కదా ?

తా. లక్ష్మణా ! నన్ను ఈ వనములోనే విడిచిపెట్టి నీవు మంగళకరమైన అయోధ్యానగరమునకు వెళ్ళిపొమ్ము. సీత లేకుండా నేను ఏవిధముగానూ కూడ జీవించజాలను. 16

మూ. గాఢమాశ్లిష్య భరతో వాచ్యో మద్వచనాత్త్వయా, 17
అనుజ్ఞాతోఽసి రామేణ పాలయేతి వసుంధరామ్.

ప్ర. అ. భరతః = భరతుడు, గాఢమ్ = గాఢముగా, ఆశ్లిష్య = కౌగలించుకొని, మద్వచనాత్ = నా మాటవలన, త్వయా = నీచేత, వాచ్యః = చెప్పదగినవాడు. వసున్ధరామ్ = భూమిని, పాలయేతి = పాలించుము అని, రామేణ = రామునిచేత, అనుజ్ఞాతః = అనుజ్ఞ ఇవ్వబడినవాడవు, అసి = అయితివి.

తా. భరతుణ్ణి గాఢముగా కౌగలించుకొని "రాజ్యము ఏలుము అని రాముడు నీకు అనుమతి ఇచ్చినాడు" అని నా మాటగా అతనికి చెప్పుము. 17

మూ. అమ్బా చ మమ కైకేయీ సుమిత్రా చ త్వయా విభో,
కౌసల్యా చ యథాన్యాయమభివాద్యా మమాజ్ఞయా,
రక్షణీయా ప్రయత్నేన భవతా సోక్తకారిణా. 19

ప్ర. అ. విభో = సమర్థుడవైన లక్ష్మణా ! మమ=నాయొక్క, అమ్బా= తల్లియైన, కైకేయీ = కైకేయి, సుమిత్రా చ=సుమిత్ర, కౌసల్యా చ=కౌసల్య, త్వయా = నీచేత, మమ = నాయొక్క, ఆజ్ఞయా = ఆజ్ఞచేత, యథాన్యాయమ్ = న్యాయానుసారముగా, అభివాద్యాః = అభివాదనము చేయదగినవారు. ఉక్తకారిణా = చెప్పిన పని చేయు, భవతా = నీచేత, సా = ఆ కౌసల్య, ప్రయత్నేన = ప్రయత్నముచేత, రక్షణీయా = రక్షింపదగినది.

తా. సమర్థుడవైన లక్ష్మణా! నీవు, నా ఆజ్ఞప్రకారము తల్లియైన కైకేయికి, సుమిత్రకు, కౌసల్యకు న్యాయానుసారము అభివాదనము చేయవలెను. నీవు కౌసల్య చెప్పిన పనులు చేయుచు ఆమెను ప్రయత్నపూర్వకముగా రక్షించవలెను. 18, 19

మూ. సీతాయాశ్చ వినాశోఽయం మమ చామిత్రకర్శన,
విస్తరేణ జనన్యా మే వినివేద్యస్త్వయా భవేత్. 20

ప్ర. అ. అమిత్రకర్శన = శత్రువులను నశింపచేయువాడా ! సీతాయాశ్చ = సీతయొక్క, మమ చ = నాయొక్క, అయమ్ = ఈ, వినాశః = వినాశము, త్వయా = నీచేత, మే = నాయొక్క, జనన్యాః = తల్లికి, విస్తరేణ = విస్తారపూర్వకముగా, వినివేద్యః = తెలుపదగినది, భవేత్ = అగును.

తా. శత్రుసంహారకుడవైన లక్ష్మణా ! నేను, సీత ఏ విధముగా వినాశము పొందినామో ఈ విషయ మంతా నా తల్లికి సవిసరముగా తెలుపవలెను. 20

మూ. ఇతి విలపతి రాఘవే సుదీనే
వనముపగమ్య తయా వినా సుకేశ్యా,
భయవికలముఖస్తు లక్ష్మణోఽపి
వ్యథితమనా భృశమాతురో బభూవ. 21

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ద్విషష్టితమః సర్గః.

ప్ర. అ. సుదీనే = చాల దీనుడైన, రాఘవే = రాముడు, వనమ్ = వనమును, ఉపగమ్య = పొంది, సుకేశ్యా = అందమైన కేశములు గల, తయా వినా = ఆ సీత లేకుండ, ఇతి = ఇట్లు, విలపతి = విలపించుచుండగా, లక్ష్మణోఽపి = లక్ష్మణుడు కూడ, భయవికలముఖః = భయముచేత వికలమైన ముఖము గలవాడై, వ్యథితమనాః = వ్యథచెందిన మనస్సు కలవాడై, భృశమ్ = మిక్కిలి, ఆతురః = పీడితుడు, బభూవ = ఆయెను.

తా. చాల దైన్యము పొందిన రాముడు అరణ్యములో సీత కనబడుకుండుటచే, ఈ విధముగా విలపించుచుండగా, లక్ష్మణునకు కూడ భయముచేత ముఖము వాడిపోయెను; మనస్సు వ్యథ చెందెను. ఈ విధముగ ఆతడు కూడ చాల దుఃఖార్తుడయ్యెను. 21

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో అరవదిరెండవ సర్గ సమాప్తము.

అథ త్రిషష్టితమః సర్గః

[రాముడు విలపించుట]

మూ. స రాజపుత్రః ప్రియయా విహీనః
శోకేన మోహేన చ పీడ్యమానః,
విషాదయన్ భ్రాతరమార్తరూపో
భూయో విషాదం ప్రవివేశ తీవ్రమ్. 1

ప్ర. అ. ప్రియయా = ప్రియురాలితో, విహీనః = శూన్యుడైన, సః రాజపుత్రః = ఆ రాజకుమారుడైన రాముడు, శోకేన=శోకము చేతను, మోహేన చ= మోహముచేతను, పీడ్యమానః = పీడించబడుచున్నవాడై, ఆర్తరూపః = చాల ఆర్తుడై, భ్రాతరమ్ = సోదరుడైన లక్ష్మణుని, విషాదయన్ = దుఃఖము కలవానిని చేయుచు, భూయః = మరల, తీవ్రమ్ = తీవ్రమైన, విషాదమ్=దుఃఖమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. ప్రియురాలు లేని ఆ రాముడు శోకముచేత, మోహము చేత పీడింపబడుచున్నవాడై, చాలా దుఃఖించుచు, సోదరుడైన లక్ష్మణునకు కూడ దుఃఖము కలిగించుచు, మరల తీవ్రమైన దుఃఖమును పొందెను. 1

మూ. స లక్ష్మణం శోకవశాభిపన్నం
శోకే నిమగ్నో విపులే తు రామః,
ఉవాచ వాక్యం వ్యసనానురూప
ముష్ణం వినిఃశస్య రుదన్ సశోకమ్. 2

ప్ర. అ. విపులే=అధికమైన, శోకే=శోకమునందు, నిమగ్నః=మునిగిన, సః రామః=ఆ రాముడు, సశోకమ్=శోకముతో కూడినట్లుగా, రుదన్=ఏడ్చుచు, శోకవశాభిపన్నమ్ = శోకమునకు వశత్వమును పొందిన, లక్ష్మణమ్ = లక్ష్మణుని

గూర్చి, ఉష్ణమ్ = వేడిగా, వినిఃశ్వస్య = నిట్టూర్చి, వ్యసనానురూపమ్=దుఃఖమునకు తగిన, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. అధికమైన శోకములో మునిగిపోయిన ఆ రాముడు దుఃఖముతో ఏడ్చుచు, వేడి నిట్టూర్పులు విడచుచు, దుఃఖమునకు వశుడైన లక్ష్మణునితో, దుఃఖమును ప్రకటించు విధమున ఇట్లు పలికెను. 2

మూ. న మద్విధో దుష్కృతకర్మకారీ
మన్యే ద్వితీయోఽస్తి వసున్ధరాయామ్,
శోకేన శోకో హి పరమ్పరాయా
మా మేతి భిన్దన్ హృదయం మనశ్చ. 3

ప్ర. అ. వసున్ధరాయామ్=భూమియందు, మద్విధః=నావంటి, దుష్కృతకర్మకారీ = పాపకర్మలు చేసినవాడు, ద్వితీయః = రెండవవాడు, నాస్తి = లేదు అని, మన్యే=తలచెదను. శోకేన=ఒక శోకముతో, శోకః = మరియొక శోకము, పరమ్పరాయాః = పరంపరవలన, హృదయమ్ = హృదయమును, మనశ్చ = మనస్సును, భిన్దన్ = భేదించుచు, మామ్ = నన్ను, ఏతి హి = పొందుచున్నది కదా.

తా. ఈ భూమిలో పాపకర్మలు ఆచరించినవాడు నావంటివాడు మరియొక డెవడూ లేడని తలచెదను. ఎందుచేత ననగా ఒక శోకము తరువాత మరియొక శోకము, అవిచ్ఛిన్నముగా, నా హృదయమును మనస్సును భేదించుచు వచ్చుచున్నది. 3

మూ. పూర్వం మయా నూనమభీప్సితాని
పాపాని కర్మాణ్యసకృత్కృతాని,
తత్రాయమద్యాపతితో విపాకో
దుఃఖేన దుఃఖం యదహం విశామి. 4

ప్ర. అ. మయా = నాచేత, పూర్వమ్ = పూర్వము, నూనమ్ = నిశ్చయముగా, అభీప్సితాని = ఇష్టమైన, పాపాని కర్మాణి = పాపకర్మలు, అసకృత్ = మాటిమాటికి, కృతాని = చేయబడినవి, తత్ర = ఆ విషయమునందు, అద్య =

ఇప్పుడు, విపాకః = పరిపాకము, ఆపతితః = వచ్చినది. యత్ = ఏ కారణము వలన, అహమ్ = నేను, దుఃఖేన = ఒక దుఃఖముచేత, దుఃఖమ్ = మరియొక దుఃఖమును, విశామి = ప్రవేశించుచున్నానో.

తా. పూర్వజన్మలో నేను అనేకపర్యాయములు, ఇష్టమువచ్చినట్లు పాప కర్మలు చేసి ఉన్నాను, సందేహము లేదు. దాని ఫలితమే ఇప్పుడు వచ్చి పడి నది. అందుచేతనే నేను కష్టముమీద కష్టము అనుభవించుచున్నాను. 4

మూ. రాజ్యప్రణాశః స్వజనైర్వియోగః
పితుర్వినాశో జననీవియోగః,
సర్వాణి మే లక్ష్మణ శోకవేగ
మాపూరయన్తి ప్రవిచిన్తితాని. 5

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! రాజ్యప్రణాశః = రాజ్యనాశము, స్వజనైః = బంధుజనులతో, వియోగః = వియోగము, పితుః = తండ్రియొక్క, వినాశః = మరణము, జననీవియోగః = తల్లియొక్క వియోగము, సర్వాణి = ఇవి అన్నీ, ప్రవిచిన్తితాని = ఆలోచించబడినవై, మే = నాయొక్క, శోకవేగమ్ = శోకము యొక్క వేగమును, ఆపూరయన్తి = నింపుచున్నవి.

తా. లక్ష్మణా ! రాజ్యము పోయినది. బంధుజనులు దూరమైనారు, తండ్రి మరణించినాడు. తల్లికి దూరమైనాను. వీటిని అన్నింటినీ గూర్చి ఆలోచించు చుండగా ఇది నా దుఃఖావేగమును పెంచుచున్నది. 5

మూ. సర్వం తు దుఃఖం మమ లక్ష్మణేదం
శాన్తం శరీరే వనమేత్య శూన్యమ్,
సీతావియోగాత్పునరప్యుదీర్ణం
కాష్ఠైరివాగ్నిః సహసా ప్రదీప్తః. 6

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా : ఇదమ్ = ఈ, సర్వమ్ = సమస్తమైన, దుఃఖమ్ = దుఃఖము, శూన్యమ్ = జనశూన్యమైన, వనమ్ = వనమును, ఏత్య = పొంది, శరీరే = శరీరమునందు, శాన్తమ్ = శాంతించినది. సీతావియోగాత్ = సీతావియోగమువలన, కాష్ఠైః = కట్టెలచేత, సహసా = వెంటనే, ప్రదీప్తః = ప్రజ్వ

లించుచున్న, అగ్నిః = ఇవ = అగ్ని వలె, పునరపి=మరల, ఉదీర్ణమ్ = అధిక మైనది.

తా. లక్ష్మణా ! జనశూన్యమైన అరణ్యములో ప్రవేశించిన పిమ్మట ఆ దుఃఖము అంతా నా శరీరములో శాంతించినది. కాని ఇప్పుడు సీతావియోగము కలుగుటచే ఆ దుఃఖ మంతా మరల, కట్టెలు వేయుటచే వెంటనే అగ్ని ప్రజ్వలించి నట్లు, మరల విజృంభించినది. 6

మూ. సా నూనమార్యా మమ రాక్షసేన
బలాద్ధృతా ఖం సముపేత్య భీరుః,
అపస్వరం సస్వరవిప్రలాపా
భయేన విక్రన్దితవత్యభీక్ష్ణమ్. 7

ప్ర. అ. మమ=నాయొక్క, భీరుః=భయస్వభావముగల, సా ఆర్యా= ఆ పూజ్యురాలైన సీత, రాక్షసేన= రాక్షసునిచేత, బలాత్ = బలాత్కారముగా, హృతా = హరించబడినదై, ఖమ్ = ఆకాశమును, సముపేత్య = పొంది, సస్వర విప్రలాపా=స్వరముతో కూడిన ఏడ్పు గలదై, భయేన=భయముచేత, అభీక్ష్ణమ్ =మిక్కిలి, అపస్వరమ్=వికృతస్వరము కలుగునట్లుగా, ఆక్రన్దితవతీ=అరచి నది. నూనమ్=నిశ్చయము.

తా. నా ప్రియురాలు, భయస్వభావముకలది, పూజ్యురాలూ అయిన ఆ సీతను రాక్షసుడు బలాత్కారముగా హరించగా, ఆమె ఆకాశమును పొంది, సస్వరముగా విలపించుచు, భయముతో, వికృతస్వరముతో మిక్కిలి ఏడ్చి ఉండును. నిశ్చయము. 7

మూ. తౌ లోహితస్య ప్రియదర్శనస్య
సదోచితావుత్తమచన్దనస్య,
వృత్తౌ స్తనౌ శోణితపఙ్కదిగ్ధౌ
నూనం ప్రియాయా మమ నాభిభాతః. 8

ప్ర. అ. లోహితస్య = ఎఱ్ఱనిది, ప్రియదర్శనస్య = చూచుటకు ప్రియ ముగా ఉండునది అయిన, ఉత్తమచన్దనస్య = ఉత్తమమైన మంచిగంధమునకు,

సదా = ఎల్లప్పుడు, ఉచితౌ = అలవాటుపడినవీ, వృత్తౌ = వర్తులాకారముగా ఉన్నవీ అయిన, మమ ప్రియాయాః = నా ప్రియురాలియొక్క, తౌ స్తనౌ = ఆ స్తనములు, నూనమ్ = నిశ్చయముగా, శోణితపఙ్కదిగ్ధౌ = రక్తపంకముచేత పూయబడినవై, నాభిభాతః = ప్రకాశించుటలేదు.

తా. వర్తులములైన నా ప్రియురాలి ఆ స్తనములు ఎల్లప్పుడు, చూచుటకు అందముగా ఉండు ఎట్టివి, ఉత్తమమైన మంచిగంధము పూసికొనుటకు అలవాటు పడినవి. అట్టి స్తనములు రక్తపు బురదచేత పూయబడి, ప్రకాశహీనములై ఉండి యుండును. సత్యము। 8.

మూ. తచ్ఛ్లక్ష్ణ సువ్యక్తమృదుప్రలాపం
తస్యా ముఖం కుఞ్చితకేశభారమ్,
రక్షోవశం నూనముపాగతాయా
న భ్రాజతే రాహుముఖే యథేన్దుః. 9

ప్ర. అ. రక్షోవశమ్ = రాక్షసుల వశమును, ఉపాగతాయాః = పొందిన, తస్యాః = ఆమెయొక్క, శ్లక్ష్ణసువ్యక్త మృదుప్రలాపమ్ = మధురములు, బాగ స్పష్టములు, మృదువులు అయిన మాటలు గలది, కుఞ్చితకేశభారమ్ = ముడవబడిన కేశపాశము గలది అయిన, తత్ ముఖమ్ = ఆ ముఖము, రాహుముఖే = రాహువు ముఖమునందు, ఇన్దుః యథా = చంద్రుడు వలె, న భ్రాజతే = ప్రకాశించుటలేదు. నూనమ్ = నిశ్చయము.

తా. సీత రాక్షసుల వశమైపోయి ఉండును. అందుచేత మధురములు, సుస్పష్టములు, మృదువులు అయిన మాటలు పలికేదీ, ముడిచిన కేశపాశము గలదీ అయిన ఆమె ముఖము రాహువు నోట్లో చిక్కిన చంద్రబింబము వలె కాంతి విహీనమై యుండును. 9

మూ. తాం హారపాశస్య సదోచితాయా
గ్రీవాం ప్రియాయా మమ సువ్రతాయాః,
రక్షాంసి నూనం పరిపీతవన్తి
విభిద్య శూన్యే రుధిరాశనాని. 10

ప్ర. అ. సదా=ఎల్లప్పుడూ, హారపాశస్య=హారమునకు, ఉచితాయాః= అలవాటుపడినది, సువ్రతాయాః = మంచి నియమము కలదీ అయిన, మమ ప్రియాయాః = నా ప్రియురాలియొక్క, తాం గ్రీవామ్ = ఆ కంఠమును, రుధిరాశనాని = రక్తమును భుజించు, రక్షాంసి=రాక్షసులు, శూన్యే=శూన్యప్రదేశమునందు, విభిద్య=విరగగొట్టి, నూనమ్=తప్పక, పరిపీతవన్తి=త్రాగి యుండును.

తా. ఉత్తమమైన నియమములను పాటించు నా ప్రియురాలు ఎల్లప్పుడూ హారములు ధరించుటకు అలవాటు పడినది. అట్టి ఆమె కంఠమును, రక్తము త్రాగే రాక్షసులు నులిమివేసి రక్తము త్రాగియుందురు. 10

మూ. మయా విహీనా విజనే వనే యా
రక్షోభిరాహృత్య వికృష్యమాణా,
నూనం నినాదం కురరీవ దీనా
సా ముక్తవత్యాయతకాన్తనేత్రా. 11

ప్ర. అ. యా = ఏ సీత, విజనే వనే = జనులు లేని వనమునందు, మయా = నాతో, విహీనా = శూన్యరాలై ఉన్నదో, సా = ఆ, ఆయతకాన్తనేత్రా = దీర్ఘమైన సుందరమైన నేత్రములు గల సీత, రక్షోభిః = రాక్షసులచేత, ఆహృత్య=హరించి, వికృష్యమాణా=లాగబడుచున్నదై, దీనా=దీనురాలై, కురరీవ = గోరింక వలె, నూనమ్ = నిశ్చయముగ, నినాదమ్ = ధ్వనిని, ముక్తవతీ = విడచినది.

తా. విశాలములైన సుందరమైన నేత్రములు గల ఆ సీతను నేను దగ్గర లేనిసమయమునందు రాక్షసులు ఆ విజనమైన వనమునుండి అపహరించి లాగినప్పుడు ఆమె దీనురాలై, గోరింక వలె అరచిఉండును. నిశ్చయము. 11

మూ. అస్మిన్మయా సార్ధముదారశీలా
శిలాతలే పూర్వముపోపవిష్టా,
కాన్తస్మితా లక్ష్మణ జాతహాసా
త్వామాహ సీతా బహువాక్యజాతమ్. 12

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! ఉదారశీలా=ఉత్తమమైన శీలము గలది,

కాన్తస్మితా = మనోహరమైన చిరునవ్వు గలదీ అయిన, సీతా = సీత, అస్మిన్ = ఈ, శిలాతలే = శిలాఫలకముమీద, మయాసార్థమ్ = నాతో కూడ, పూర్వమ్ = పూర్వము, ఉపోపవిష్టా = నా దగ్గరగా కూర్చున్నదై, జాతహాసా = పుట్టిన నవ్వు గలదై, త్వామ్ = నిన్ను గూర్చి, బహువాక్యజాతమ్ = అనేక వాక్యముల సముదాయమును, ఆహ = పలికినది.

తా. లక్ష్మణా ! ఉత్తమశీలము సుందరమైన చిరునవ్వు గల సీత, పూర్వము, ఈ శిలాఫలకముపై నాతో కూడ, నా సమీపమున కూర్చుండి, నవ్వుచు, నీతో ఎన్నో మాటలు మాటలాడుచుండేది. 12

మూ. గోదావరీయం సరితాం వరిష్ఠా
ప్రియా ప్రియాయా మమ నిత్యకాలమ్,
అప్యత్ర గచ్ఛేదితి చిన్తయామి
నైకాకినీ యాతి హి సా కదా చిత్. 13

ప్ర. అ. సరితామ్ = నదులలో, వరిష్ఠా = గొప్పదైన, ఇయం గోదావరీ = ఈ గోదావరి. మమ ప్రియాయాః = నా ప్రియురాలికి, నిత్యకాలమ్ = ఎల్లప్పుడూ, ప్రియా = ఇష్టమైనది. అత్ర = ఈ నదికి, గచ్ఛేదపి = వెళ్ళి ఉండవచ్చును, ఇతి = అని, చిన్తయామి = ఊహించుచున్నాను. సా = ఆమె, ఏకాకినీ = ఒంటరిదై, కదాచిత్ = ఎన్నడూ, న యాతి హి = వెళ్లదు కదా !

తా. నదులలో శ్రేష్ఠమైన ఈ గోదావరీనది నా ప్రియురాలికి, సర్వదా, చాల ఇష్టమైనది. ఆమె ఆ నదికి వెళ్ళి యుండునా అని ఆలోచించుచున్నాను. కాని ఆమె ఒంటరిగా ఎన్నడూ వెళ్లదు కదా ! 13

మూ. పద్మాననా పద్మవిశాలనేత్రా
పద్మాని వానేతుమభిప్రయాతా,
తదస్య యుక్తం న హి సా కదాచి
న్మయా వినా గచ్ఛతి పఙ్కజాని. 14

ప్ర. అ. పద్మాననా = పద్మమువంటి ముఖము గలది, పద్మవిశాలనేత్రా = పద్మముల వలె విశాలములైన నేత్రములు గలది అయిన సీత, పద్మాని =

పద్మములను, ఆనేతుమ్ = తీసికొనివచ్చుటకు, అభిప్రయాతా వా = వెళ్ళి యుండునా ? తదపి = అది కూడ, అయుక్తమ్ = యుక్తము కాదు. సా = ఆమె, కదాచిత్ = ఎప్పుడూ, మయా వినా = నేను లేకుండా, పఙ్కజాని = పద్మములను గూర్చి, న గచ్ఛతి హి = వెళ్ళదు కదా !

తా. పద్మము వంటి ముఖము, పద్మము వంటి విశాలనేత్రములు గల సీత పద్మాలు తీసికొనివచ్చుటకు వెళ్ళి యుండునా ! అది కూడ యుక్తము కాదు. ఎందుచేతనగా ఆమె ఎన్నడూ నేను దగ్గర లేకుండా పద్మాలకోసము వెళ్లదు.

మూ. కామం త్విదం పుష్పితవృక్షషణ్డం
నానావిధైః పక్షిగణైరుపేతమ్,
వనం ప్రయాతా ను తదప్యయుక్త
మేకాకినీ సాతిబిభేతి భీరుః. 15

ప్ర. అ. కామమ్ = మిక్కిలి, పుష్పితవృక్షషణ్డమ్ = పుష్పించిన వృక్ష సముదాయము గలది. నానావిధైః = అనేకవిధములైన, పక్షిగణైః = పక్షిసముదాయములతో, ఉపేతమ్ = కూడినదీ అయిన, ఇదమ్ = ఈ, వనమ్ = వనమును గూర్చి, ప్రయాతా ను = వెళ్ళినదా ? తదపి = అది కూడ, అయుక్తమ్ = యుక్తము కాదు. భీరుః = భయస్వభావము గల, సా = ఆమె, ఏకాకినీ = ఒంటరిదై, అతిబిభేతి = చాలభయపడును.

తా. అనేక విధములైన పక్షుల సముదాయములతో కూడిన ఈ వనములోని వృక్షముల గుంపులు చక్కగా పూసి ఉన్నవి. ఈ వనములోనికి వెళ్ళి యుండునా ? అదీ యుక్తము కాదు ఎందుచేత ననగా, అసలే భయస్వభావము గల ఆమె ఒంటరిగా చాల భయపడును. 15

మూ. ఆదిత్య భో లోకకృతాకృతజ్ఞ
లోకస్య సత్యానృతకర్మసాక్షిన్,
మమ ప్రియా సా క్వ గతా హృతా వా
శంసస్వ మే శోకవశస్య నిత్యమ్. 16

ప్ర. అ. లోకకృతాకృతజ్ఞ = లోకముయొక్క చేయబడిన కర్మను చేయ

బడని కర్మను ఎఱిగినవాడా ! లోకస్య = లోకముయొక్క, సత్యానృతకర్మ సాక్షిన్ = సత్యకర్మకు, అసత్యకర్మకు సాక్షియైనవాడా ! ఆదిత్య = సూర్యుడా ! మమ = నాయొక్క, ప్రియా = ప్రియురాలైన, సా = ఆ సీత, క్వ = ఎక్కడికి, గతా = వెళ్ళినది ? హృతా వా = హరింపబడినదా ? నిత్యమ్ = ఎల్లప్పుడు, శోకవశస్య = శోకమునకు వశుడనైన, మే = నాకు, శంసస్వ = చెప్పుము.

తా. ఓ ! సూర్యుడా ! లోకములో ఎవరేమి చేసినారో, ఎవరేమి చేయలేదో నీకు తెలియును. లోకుల సత్యమునకు, అసత్యమునకు నీవు సాక్షివి. అందుచే నా ప్రియురాలు ఎక్కడికైనా వెళ్ళినదా, లేదా ఎవరైనా ఆమెను హరించినారా అను విషయమును నిత్యమూ శోకమునకు వశుడనైన నాకు చెప్పుము. 16

మూ. లోకేషు సర్వేషు చ నాస్తి కించి
ద్యత్తే న నిత్యం విదితం భవేత్తత్,
శంసస్వ వాయో కులశాలినీం తాం
హృతా మృతా వా పథి వర్తతే వా. 17

ప్ర. అ. వాయో = ఓ ! వాయుదేవుడా ! సర్వేషు = సమస్తమైన, లోకేషు = లోకములయందు, యత్ = ఏది, నిత్యమ్ = ఎల్లప్పుడూ, తే = నీకు, విదితమ్ = తెలియబడినది, న భవేత్ = కాదో, తత్ = అది, కించిత్ = ఏదీ, నాస్తి = లేదు. కులశాలినీమ్ = కులముచేత ప్రకాశించుచున్న, తామ్ = ఆ సీతను గూర్చి, శంసస్వ = చెప్పుము. హృతా = హరింపబడినదా ? మృతా వా = మరణించినదా ? పథి = మార్గమునందు, వర్తతే వా = ఉన్నదా ?

తా. ఓ ! వాయుదేవా ! అన్ని లోకములలోను, నీకు తెలియనిది ఏదీ లేదు. అందుచేత సత్కులమందు జనించిన సీతను గూర్చి చెప్పుము. ఆమె నెవరైనా హరించినారా ? లేక మరణించినదా ? దారిలో ఉన్నదా ? 17

మూ. ఇతీవ తం శోకవిధేయదేహం
రామం విసంజ్ఞం విలపన్తమేవమ్,
ఉవాచ సౌమిత్రిరదీనసత్త్వో
న్యాయ్యే స్థితః కాలయుతం చ వాక్యమ్. 18

ప్ర. అ. ఇతీవ = ఈ విధముగా, శోకవిధేయదేహమ్ = శోకమునకు లొంగిపోయిన దేహము గలవాడు, విసంజ్ఞమ్ = సంజ్ఞ లేనివాడు, ఏవమ్ = ఇట్లు, విలపన్తమ్ = విలపించుచున్నవాడు అయిన, తం రామమ్ = ఆ రాముఢ్ణి గూర్చి, అదీనసత్త్వః = దీనము కాని బుద్ధి గలవాడు, న్యాయే = న్యాయమునందు, స్థితః = ఉన్నవాడు అయిన, సౌమిత్రిః = లక్ష్మణుడు, కాలయుతమ్ = కాలముతో కూడిన, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. ఈ విధముగ శరీరము శోకమునకు లొంగిపోగా, సంజ్ఞ కోల్పోయి, ఇట్లు విలపించుచున్న రామునితో, బుద్ధియందు దైన్యము లేనివాడు, న్యాయమార్గము ననుసరించువాడు అయిన లక్ష్మణుడు కాలమునకు తగిన వాక్యము పలికెను. 18

మూ. శోకం విముఞ్చార్య ధృతిం భజస్వ
సోత్సాహతా చాస్తు విమార్గణేఽస్యాః,
ఉత్సాహవన్తో హి నరా న లోకే
సీదన్తి కర్మస్వతిదుష్కరేషు. 19

ప్ర. అ. ఆర్య = పూజ్యుడా! శోకమ్ = దుఃఖమును, విముఞ్చ = విడువుము. ధృతిమ్ = ధైర్యమును, భజస్వ = పొందుము. అస్యాః = సీతయొక్క, విమార్గణే = వెదకుటయందు, సోత్సాహతా = ఉత్సాహముతో కూడియుండుట, అస్తు = అగుగాక, లోకే = లోకమునందు, ఉత్సాహవన్తః = ఉత్సాహము గల, నరాః = మనుష్యులు, అతిదుష్కరేషు = చేయుటకు చాల కష్టమైన, కర్మసు = పనులయందు, న సీదన్తి హి = క్రుంగిపోరు కదా?

తా. పూజ్యుడవైన రామా! దుఃఖమును విడచి ధైర్యము అవలంబింపుము. సీతను వెదకుటకై ఉత్సాహము చూపుము. లోకములో ఉత్సాహవంతులైన మనుష్యులు చాల కష్టమైన పనులు చేయవలసివచ్చినా కూడ దిగులుచెందరు. 19

మూ. ఇతీవ సౌమిత్రిముదగ్రపౌరుషం
బ్రువన్తమార్తో రఘువంశవర్ధనః,
న చిన్తయామాస ధృతిం విముక్తవా
న్పునశ్చ దుఃఖం మహదభ్యుపాగమత్. 20

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
త్రిషష్టితమః సర్గః.

ప్ర. అ. ఆర్తః = దుఃఖితుడైన, రఘువంశవర్ధనః = రాముడు, ఇతీవ = ఇట్లు, బ్రువన్తమ్ = పలుకుచున్న, ఉదగ్రపౌరుషమ్ = అధికమైన పౌరుషము గల, సౌమిత్రిమ్ = లక్ష్మణుని గూర్చి, న చిన్తయామాస = ఆలోచించలేదు. ధృతిమ్ = ధైర్యమును, విముక్తవాన్ = విడచినాడు. పునశ్చ = మరల, మహత్ = గొప్ప, దుఃఖమ్ = దుఃఖమును, అభ్యుపాగమత్ = పొందెను.

తా. దుఃఖార్తుడైన రాముడు ఈ విధముగా పలుకుచున్న గొప్ప పౌరుషము గల లక్ష్మణుని మాటలు లెక్కచేయలేదు. ధైర్యమును కోల్పోయి మరల గొప్ప దుఃఖమును పొందెను.

వి. ఈ సర్గ ప్రాచ్యపాఠములో లేదు. దీనిలో కవితాసౌందర్యము మృగ్యము. పదగుంపనలో అందము లేదు. వాల్మీకి ముద్ర లేదు. గోదావరికిగాని పద్మాలు తీసికొనివచ్చుటకు గాని సీత వెళ్ళియుండదని దీనిలో చెప్పిన రాముడు రాబోవు సర్గలో లక్ష్మణుని గోదావరి దగ్గర ఉన్నదేమో చూడు మని అక్కడికి పంపుచున్నాడు. వెనుకటి (60-62) సర్గలలో రాముడు ఉన్మత్తుడు వలె చెట్లను చేమలను, మృగాలను, పక్షులను సీతను గూర్చి అడిగినట్లు, సీత కనబడి నట్లు భావించి ఏవేవో ఉన్మత్తప్రలాపములు చేసినట్లు వర్ణించిన శ్లోకాలు కూడ ప్రాచ్య పాఠములో లేవు. అవి లేకుండుటయే సమంజసము. వాటివలన రాముని ధీరోదాత్తత్వానికి లోపము కలుగుచున్నది. వెదకి వెదకి నిరాశ చెందిన పిమ్మట కొన్నాళ్ళకి ఇలాంటి ఉన్మాదము కలగవచ్చునేమో కాని ఆ అల్పకాలములో కలుగదు. 20

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
అరణ్యకాండలో అరువదిమూడవ సర్గ సమాప్తము.

అథ చతుఃషష్టితమః సర్గః

[రామలక్ష్మణులు మరల సీతకై అన్వేషించుట. మృగములు చేసిన సంకేతములను బట్టి దక్షిణదిక్కు వైపు వెళ్ళుట. రాముడు పర్వతముమీద కోపము చూపుట. అక్కడ పడియున్న సీత తలలోని పువ్వులను, అలంకారముల ముక్కలను, యుద్ధచిహ్నములను చూచి రాముడు దేవాదులతో కూడిన మూడు లోకములమీద కోపమును చూపుట]

మూ. స దీనో దీనయా వాచా లక్ష్మణం వాక్యమబ్రవీత్
శీఘ్రం లక్ష్మణ జానీహి గత్వా గోదావరీం నదీమ్,
అపి గోదావరీం సీతా పద్మాన్యానయితుం గతా.

ప్ర. అ. సః=ఆ రాముడు, దీనః = దీనుడై, దీనయా = దీనమైన, వాచా = వాక్కుతో, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. లక్ష్మణ=లక్ష్మణా ! శీఘ్రమ్ = శీఘ్రముగా, గోదావరీం నదీమ్ = గోదావరీనదిని గూర్చి, గత్వా=వెళ్ళి, సీతా=సీత, పద్మాని=పద్మములను, ఆనయితుమ్ = తీసికొనివచ్చుటకు, గోదావరీమ్ = గోదావరిని గూర్చి, అపి గతా = వెళ్ళినదా అని, జానీహి = తెలిసికొనుము.

తా. దీనుడైన రాముడు దీనమైన కంఠస్వరముతో లక్ష్మణునితో ఇట్లు పలికెను. "లక్ష్మణా ! శీఘ్రముగా గోదావరీనదికి వెళ్ళి సీత పద్మములను తీసికొనివచ్చుటకై గోదావరికి వెళ్ళినదేమో చూచి రమ్ము" 1

మూ. ఏవముక్తస్తు రామేణ లక్ష్మణః పరవీరహా, 2
నదీం గోదావరీం రమ్యాం జగామ లఘువిక్రమః.

ప్ర. అ. రామేణ = రామునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలుకబడిన,

పరవీరహా = శత్రువీరులను సంహరించు, లక్ష్మణః = లక్ష్మణుడు, లఘువిక్రమః = శీఘ్రమైన నడక గలవాడై, రమ్యామ్ = సుందరమైన, గోదావరీం నదీమ్ = గోదావరినదిని గూర్చి, జగామ = వెళ్ళెను.

తా. శత్రువీరసంహారకుడైన లక్ష్మణుడు రాముని మాటలు విని, శీఘ్రముగా నడచి సుందరమైన గోదావరినదికి వెళ్లెను. 2

మూ. తాం లక్ష్మణ స్తీర్థవతీం విచిత్వా రామమబ్రవీత్, 3
నైనాం పశ్యామి తీర్థేషు క్రోశతోఽన శృణోతి మే.

ప్ర. అ. లక్ష్మణః = లక్ష్మణుడు, తీర్థవతీమ్ = రేవులు గల, తామ్ = ఆ గోదావరిని, విచిత్వా = వెదకి, రామమ్ = రాముణ్ణి గూర్చి, అబ్రవీత్ = పలికెను. ఏనామ్ = ఈమెను, తీర్థేషు = రేవులలో, న పశ్యామి = చూడను. మే = నేను, క్రోశతః = బిగ్గరగా అరచినను, న శృణోతి = (ఆమె) వినుట లేదు.

తా. లక్ష్మణుడు రేవులు గల ఆ గోదావరీనదిని వెదకి వచ్చి రామునితో ఇట్లు పలికెను. "రేవులలో ఎక్కడా నాకు సీత కనబడలేదు. నేను బిగ్గరగా పిలచినా జవాబు లేదు". 3

మూ. కం ను వా దేశమాపన్నా వైదేహీ క్లేశనాశినీ, 4
న హ్యహం వేద తం దేశం యత్ర సా జనకాత్మజా.

ప్ర. అ క్లేశనాశినీ = క్లేశములను నశింపచేయు, వైదేహీ = సీత, కం వా = ఏ, దేశమ్ = ప్రదేశమును, ఆపన్నా ను = పొందినదో। సా = ఆ, జనకాత్మజా = సీత, యత్ర = ఎక్కడ ఉన్నదో, తం దేశమ్ = ఆ ప్రదేశమును, అహమ్ = నేను, న వేద హి = ఎరుగను.

తా. క్లేశములను తొలగించు సీత ఏ ప్రదేశమునకు వెళ్ళినదో। ఆ సీత ఉన్న చోటు నాకు తెలియుటలేదు. 4

మూ. లక్ష్మణస్య వచః శ్రుత్వా దీనః సంతాపమోహితః 5
రామః సమభిచక్రామ స్వయం గోదావరీం నదీమ్,
స తాముపస్థితో రామః క్వ సీతేత్యేవమబ్రవీత్. 6

ప్ర. అ. రామః = రాముడు, లక్ష్మణస్య = లక్ష్మణునియొక్క, వచః =

వచనమును, శ్రుత్వా = విని, దీనః = దీనుడై, సంతాపమోహితః = తాపము చేత మోహితుడై, స్వయమ్ = స్వయముగా, గోదావరీం నదీమ్ = గోదావరీనదిని గూర్చి, సమభిచక్రామ = వెళ్ళెను. సః రామః = ఆ రాముడు, తామ్ = ఆ నదిని, ఉపస్థితః = సమీపించినవాడై, సీతే = సీతా ! క్వ = ఎక్కడ ఉన్నావు, ఇత్యేవమ్ = అని, అబ్రవీత్ = పలికెను.

తా. రాముడు లక్ష్మణుని మాటలు విని, దీనుడై, సంతాపముచేత మోహము చెంది స్వయముగా గోదావరీనది వైపు వెళ్లెను. ఆ నది దగ్గరకు వెళ్ళి రాముడు "సీతా ఎక్కడ ఉన్నావు?'' అని కేక వేసెను. 5,6

మూ. భూతాని రాక్షసేన్ద్రేణ వధార్హేణ హృతామితి,
న తాం శశంసూ రామాయ తథా గోదావరీ నదీ. 7

ప్ర. అ. వధార్హేణ = వధకు తగిన, రాక్షసేన్ద్రేణ = రావణునిచేత, హృతామ్ = అపహరింపబడిన, తామ్ = ఆమెను గూర్చి, ఇతి = ఈ విధముగా (అపహరించబడినట్లుగా), భూతాని = అక్కడ నున్న భూతములు, తథా = మరియు, గోదావరీ నదీ = గోదావరీనదియు, రామాయ = రామునకు, న శశంసుః = చెప్పలేదు.

తా. చంపదగిన ఆ రావణుడు, సీతను అపహరించినాడు అని అక్కడ ఉన్న భూతములు గాని, గోదావరీనది గాని రామునకు చెప్పలేదు. 7

మూ. తతః ప్రబోధితా భూతైః శంస చాస్మై ప్రియామితి,
న తు సాభ్యవదత్సీతాం పృష్టా రామేణ శోచతా. 8

ప్ర. అ. తతః = పిమ్మట, శోచతా = దుఃఖించుచున్న, రామేణ = రాముని చేత, పృష్టా = అడగబడిన, సా = ఆ గోదావరినది, ప్రియామ్ = ప్రియురాలిని గూర్చి, అస్మై = ఈతనికి, శంస = చెప్పుము, ఇతి = అని, భూతైః = భూతములచేత, ప్రబోధితా = ప్రేరేపింపబడిన దైనను, సీతామ్ = సీతను గూర్చి, నాభ్యవదత్ = చెప్పలేదు.

తా. దుఃఖించుచున్న రాముడు అడిగినను, "రామునకు ఆతని ప్రియురాలిని గూర్చి చెప్పుము" అని భూతములు ప్రేరేపించినను ఆ గోదావరీనది సీతను

గూర్చి రామునకు చెప్పలేదు. 8

మూ. రావణస్య తు తద్రూపం కర్మాణి చ దురాత్మనః,
ధ్యాత్వా భయాత్తు వైదేహీం సా నదీ న శశంస తామ్.

ప్ర. అ. సా నదీ = ఆ నది, దురాత్మనః = దురాత్ముడైన, రావణస్య = రావణునియొక్క, తత్ = ఆ, రూపమ్ = రూపమును, కర్మాణి చ = పనులను, ధ్యాత్వా = స్మరించి, భయాత్ = భయమువలన, తాం వైదేహీమ్ = ఆ సీతను గూర్చి, న శశంస = చెప్పలేదు. 9

తా. దురాత్ముడైన ఆ రావణుని ఆ రూపము, పనులు గుర్తుకు రాగానే భయపడినదై ఆ గోదావరినది సీతను గూర్చి చెప్పలేదు.

మూ. నిరాశస్తు తయా నద్యా సీతాయా దర్శనే కృతః,
ఉవాచ రామః సౌమిత్రిం సీతాదర్శనకర్శితః. 10

ప్ర. అ. సీతాదర్శనకర్శితః = సీత కనబడకపోవుటచేత కృశించిన, రామః = రాముడు, తయా నద్యా = ఆ నదిచేత, సీతాయాః = సీతయొక్క, దర్శనే = దర్శనమువిషయమున, నిరాశః = ఆశలేనివాడుగా, కృతః = చేయబడినవాడై, సౌమిత్రిమ్ = లక్ష్మణుని గూర్చి, ఉవాచ = పలికెను.

తా. సీత కనబడకపోవుటచేత కృశించి ఉన్న రాముడు సీత కనబడే విషయమున ఆ నది కూడ నిరాశ కలిగించగా, లక్ష్మణునితో ఇట్లనెను. 10

మూ. ఏషా గోదావరీ సౌమ్య కించిన్న ప్రతి భాషతే
కిం ను లక్ష్మణ వక్ష్యామి సమేత్య జనకం వచః, 11
మాతరం చైవ వైదేహ్యా వినా తామహమప్రియమ్.

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా ! ఏషా గోదావరీ = ఈ గోదావరీనది, కించిత్ = ఏమీ, న ప్రతిభాషతే = బదులు చెప్పుటలేదు. లక్ష్మణ = లక్ష్మణా ! జానకీం వినా = జానకి లేకుండగా, అహమ్ = నేను, జనకమ్ = జనకుని, సమేత్య = కలసి, మాతరం చైవ = తల్లిని కూడ కలిసి, అప్రియమ్ = అప్రియమైన, కిం ను = ఏమి, వచనమ్ = మాటను, వక్ష్యామి = చెప్పుదును ?

తా. సౌమ్యుడా! ఈ గోదావరీనది ప్రత్యుత్తర మేమీ ఇచ్చుటలేదు. లక్ష్మణా! సీత లేకుండా వెళ్ళిన నేను జనకమహారాజును, తల్లిని కలిసి వారితో అప్రియమైన వార్త ఎట్లు చెప్పుదును?

వి. "లక్ష్మణస్య వచః శ్రుత్వా" (6వ శ్లోకం) మొదలు "ఏషా గోదావరీ" (11వ శ్లోకం) వరకు ఉన్న శ్లోకాలు ప్రాచ్యపాఠంలో లేవు. 11

మూ. యా మే రాజ్యవిహీనస్య వనే వన్యేన జీవతః, 12
సర్వం వ్యపనయేచ్ఛోకం వైదేహీ క్వ ను సా గతా.

ప్ర. అ. రాజ్యవిహీనస్య = రాజ్యము లేనివాడను, వనే = వనమునందు, వన్యేన = వనమునందు లభించే దానితో, జీవతః = జీవించుచున్నవాడను అయిన, మే = నాయొక్క, సర్వమ్ = సమస్తమైన, శోకమ్ = శోకమును, యా వైదేహీ = ఏ సీత, వ్యపనయేత్ = తొలగించునో, సా = ఆమె, క్వ = ఎక్కడికి, గతా ను = వెళ్ళినదో కదా.

తా. రాజ్యము కోల్పోయి, వనములో లభించే దానితో వనములో జీవితము గడపుచున్న నా శోకము నంతను తొలగించే సీత ఎక్కడికి పోయినదో!

మూ. జ్ఞాతిపక్షవిహీనస్య రాజపుత్రీమపశ్యతః, 13
మన్యే దీర్ఘా భవిష్యన్తి రాత్రయో మమ జాగ్రతః.

ప్ర. అ. జ్ఞాతిపక్షవిహీనస్య = బంధువర్గముతో శూన్యుడను, రాజపుత్రీమ్ = రాజకుమారియైన సీతను, అపశ్యతః = చూడనివాడను అయిన, జాగ్రతః = మేల్కొనియున్న, మమ = నాకు, రాత్రయః = రాత్రులు, దీర్ఘాః = దీర్ఘములుగా, భవిష్యన్తి = కాగలవు అని, మన్యే = తలచెదను.

తా. బంధువు లెవ్వరూ దగ్గర లేని నాకు సీత కూడ కనబడకపోయినచో రాత్రులందు నిద్ర పట్టక ఆ రాత్రులు చాల దీర్ఘములుగా కనబడు నని అనుకొను చున్నాను. 13

మూ. మన్దాకినీం జనస్థానమిమం ప్రస్రవణం గిరిమ్, 14
సర్వాణ్యనుగమిష్యామి యది సీతా హి దృశ్యతే.

("మన్దాకినీమ్"కిబదులు "గోదావరీమ్" అను ప్రాచ్యపాఠము యుక్తము. జనస్థానములో మందాకిని ఉండదు కదా).

ప్ర. అ. గోదావరీమ్ = గోదావరిని, జనస్థానమ్ = జనస్థానమును, ఇమమ్ = ఈ, ప్రస్రవణం గిరిమ్ = ప్రస్రవణపర్వతమును, సర్వాణి = అన్నింటినీ, అనుగమిష్యామి = వెదకెదను. సీతా = సీత, యది హి దృశ్యతే = కనబడునేమో !

తా. గోదావరీనదిని, జనస్థానమును, ఈ ప్రస్రవణపర్వతమును అన్నింటిని వెదకెదను. సీత కనబడునేమో ! 14

మూ. ఏతే మృగా మహావీర్య మామీక్షన్తే ముహుర్ముహుః, 15
వక్తుకామా ఇవ హి మే ఇఙ్గితాన్యుపలక్షయే.

ప్ర. అ. మహావీర్య = గొప్ప పరాక్రమము గల లక్ష్మణా ! ఏతే = ఈ, మృగాః = మృగములు, ముహుర్ముహుః = మాటిమాటికి, మామ్ = నన్ను, ఈక్షన్తే = చూచుచున్నవి. ఇఙ్గితాని = వాటి ముఖాద్యాకారములను, ఉపలక్షయే = చూచుచున్నాను ; మే = నాకు, వక్తుకామా ఇవ = ఏమో చెప్పుటకు కోరిక గలవివలె ఉన్నవి.

తా. పరాక్రమశాలివైన లక్ష్మణా ! ఈ మృగములు మాటిమాటికి నాకేసి చూచుచున్నవి. వీటి ముఖాదివికారములు చూడగా నాతో ఏమో చెప్పవలె ననుకొనుచున్నట్లు ఉన్నవి. 15

మూ. తాం స్తు దృష్ట్వా నరవ్యాఘ్రో రాఘవః ప్రత్యువాచ హ,
క్వ సీతేతి నిరీక్షన్వై బాష్పసంరుద్ధయా దృశా.

ప్ర. అ. నరవ్యాఘ్రః = నరులలో శ్రేష్ఠుడైన, రాఘవః = రాముడు, తాన్ = ఆ మృగములను, దృష్ట్వా = చూచి, బాష్పసంరుద్ధయా = బాష్పముచేత అడ్డుకొనబడిన, దృశా = దృష్టితో, నిరీక్షన్ = అంతటా పరిశీలించుచు, సీతా = సీత, క్వ = ఎక్కడ, ఇతి = అని, ప్రత్యువాచ హ = తిరిగి పలికెను.

తా. నరులలో శ్రేష్ఠుడైన రాముడు ఆ మృగములను చూచి, కన్నీటిచేత

కప్పబడిన దృష్టితో నలుమూలలా పరికించుచు, "సీత ఎక్కడ ఉన్నది'' అని ప్రశ్నించెను. 16

మూ. ఏవముక్తా నరేన్ద్రేణ తే మృగాః సహసోత్థితాః 17
దక్షిణాభిముఖాః సర్వే దర్శయన్తో నభస్తలమ్,
మైథిలీ హ్రియమాణా సా దిశం యామన్వపద్యత, 18
తేన మార్గేణ ధావన్తో నిరీక్షన్తే నరాధిపమ్.

ప్ర. అ. నరేన్ద్రేణ = రాజైన రాముని చేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తాః = పలకబడిన, మృగాః = మృగములు, సహసా = శీఘ్రముగా, ఉత్థితాః = లేచినవై, సర్వే = అన్నియు, దక్షిణాభిముఖాః = దక్షిణదిక్కునకు అభిముఖమైనవై, నభస్తలమ్ = ఆకాశమును, దర్శయన్తః = చూపుచున్నదై, హ్రియమాణా = హరించబడుచున్న, మైథిలీ = సీత, యామ్ = ఏ, దిశమ్ = దిక్కును, అన్వపద్యత = పొందెనో, తేన మార్గేణ = ఆ మార్గముచేత, ధావన్తః = పరుగెత్తుచున్నవై, నరాధిపమ్ = రాముణ్ణి, నిరీక్షన్తే = చూచుచున్నవి.

తా. రాముని ప్రశ్న విని ఆ మృగము లన్నీ వెంటనే లేచి, దక్షిణాభిముఖములై, ఆకాశమును చూపుచు, హరింపబడిన సీత ఏ దిక్కునకు వెళ్ళినదో ఆ మార్గమునందు పరుగెత్తుచు, రాముని వైపు చూచుచుండెను. 17,18

మూ. యేన మార్గం చ భూమిం చ నిరీక్షన్తే స్మ తే మృగాః,
పునర్నదన్తో గచ్ఛన్తి లక్ష్మణేనోపలక్షితాః.

ప్ర. అ. తే మృగాః = ఆ మృగములు, యేన = ఏ కారణముచేత, మార్గం చ = ఆకాశమార్గమును. భూమిం చ = భూమినీ, నిరీక్షన్తే స్మ = చూచుచుండెనో, పునశ్చ = మరల, నదన్తః = అరచుచు, గచ్ఛన్తి = వెళ్ళుచున్నవో, (ఆ కారణము చేత), లక్ష్మణేన = లక్ష్మణునిచేత, ఉపలక్షితాః = గుర్తించబడినవి.

తా. ఆ మృగములు ఆకాశమార్గమును, భూమినీ చూచుచు మరల అరచుచు అటు వైపు వెళ్ళుచుండుటచే లక్ష్మణుడు వాటి అభిప్రాయమును గ్రహించెను.

మూ. తేషాం వచనసర్వస్వం లక్షయామాస చేఙ్గితమ్, 20
ఉవాచ లక్ష్మణో జ్యేష్ఠం ధీమాన్ భ్రాతరమార్తవత్.

ప్ర. అ. ధీమాన్ = బుద్ధిమంతుడైన, లక్ష్మణః = లక్ష్మణుడు, తేషామ్ = ఆ మృగములయొక్క, వచనసర్వస్వమ్ = మాటల సారమైన, ఇఙ్గితమ్ = చేష్టను, లక్షయామాస = గుర్తించెను. ఆర్తవత్ = ఆర్తుడై, జ్యేష్ఠం భ్రాతరమ్ = అన్న గారిని గూర్చి, ఉవాచ = పలికెను.

తా. ఆ మృగముల చేష్టలే వాటి మాటల సారము. దానిని గుర్తించిన బుద్ధిశాలి యైన లక్ష్మణుడు, దీనుడై, అన్నగారితో ఇట్లు పలికెను. 20

మూ. క్వ గతేతి త్వయా పృష్టా యథేమే సహసోత్థితాః 21
దర్శయన్తి క్షితిం చైవ దక్షిణాం చ దిశం మృగాః,
సాదు గచ్ఛావహే దేవ దిశమేతాం హి నైరృతిమ్ 22
యది స్యాదాగమః కశ్చిదార్యా వా సాథ లక్ష్యతే.

ప్ర. అ. దేవ = ఓ ! ప్రభూ, ఇమే = ఈ, మృగాః = మృగములు, క్వ = ఎక్కడికి, గతా = వెళ్ళినవి, ఇతి = అని, త్వయా = నీచేత, పృష్టాః = అడగబడినవై, సహసా = వెంటనే, ఉత్థితాః = లేచినవై, క్షితిం చైవ = భూమిని, దక్షిణాం దిశమ్ = దక్షిణదిక్కును, యథా = ఎట్లు, దర్శయన్తి = చూపుచున్నవో, (దానిని పట్టి), ఏతామ్ = ఈ, నైరృతిం దిశమ్ = నైరృతిదిక్కును గూర్చి, సాదు = బాగుగా, గచ్ఛావహే = వెళ్ళుదము. కశ్చిత్ = ఏదైన, ఆగమః = వార్త, యది స్యాత్ = ఉండవచ్చును. అథ = లేదా, సా = ఆ, ఆర్యా వా = ఆర్యురాలైనా, లక్ష్యతే = చూడబడును.

తా. ప్రభూ ! "సీత ఎక్కడికి వెళ్ళినది ?" అని నీవు అడిగినప్పుడు ఈ మృగములు వెంటనే లేచి, నేలను, దక్షిణ దిక్కును చూపుచున్నవి. అందుచేత మనము ఈ నైరృతిదిక్కు వైపు వెళ్లదము. మన కేమైన జాడ తెలియవచ్చు. లేదా పూజ్యురాలైన సీతయే కనబడవచ్చును. 21,22

మూ. బాఢమిత్యేవ కాకుత్స్థః ప్రస్థితో దక్షిణాం దిశమ్, 23
లక్ష్మణానుగతః శ్రీమాన్వీక్షమాణో వసున్ధరామ్.

ప్ర. అ. శ్రీమాన్ = శోభాయుక్తుడైన, కాకుత్స్థః = రాముడు, బాఢమిత్యేవ = తప్పక అటే అని, లక్ష్మణానుగతః = లక్ష్మణునిచేత అనుసరించబడినవాడై,

వసున్ధరామ్=భూమిని, వీక్షమాణః=చూచుచు, దక్షిణాం దిశమ్=దక్షిణదిక్కును గూర్చి, ప్రస్థితః=ప్రయాణమైనాడు.

తా. శ్రీమంతుడైన రాముడు, తప్పక అట్లే చేసెదము అని పలికి, లక్ష్మణుడు వెంట రాగా, నేలను పరిశీలనగా చూచుచు, దక్షిణదిక్కు వైపు ప్రయాణ మాయెను. 23

మూ. ఏవం సంభాషమాణౌ తావన్యోన్యం భ్రాతరావుభౌ, 24
వసున్ధరాయాం పతితపుష్పమార్గమపశ్యతామ్.

ప్ర. అ. ఏవమ్=ఇట్లు, అన్యోన్యమ్=పరస్పరము, సంభాషమాణౌ=మాటలాడుకొనుచున్న, ఉభౌ=ఇద్దరు, భ్రాతరౌ=సోదరులు, వసున్ధరాయామ్=నేలపై, పతితపుష్పమార్గమ్=రాలిన పువ్వులు గల మార్గమును, అపశ్యతామ్=చూచిరి,

తా. ఆ సోదరు లిద్దరూ పరస్పరము ఇట్లు మాటలాడుకొనుచు వెళ్ళు చుండగా వారికి నేలమీద రాలిన పువ్వులతో నిండిన మార్గము కనబడెను. 24

మూ. తాం పుష్పవృష్టిం పతితాం దృష్ట్వా రామో మహీతలే,
ఉవాచ లక్ష్మణం వీరో దుఃఖితో దుఃఖితం వచః.

ప్ర. అ. వీరః=వీరుడైన, రామః=రాముడు, మహీతలే=నేలమీద, పతితామ్=పడిన, తాం పుష్పవృష్టిమ్=ఆ పుష్పవర్షమును, దృష్ట్వా=చూచి, దుఃఖితః=దుఃఖించుచున్నవాడై, దుఃఖితమ్=దుఃఖించుచున్న, లక్ష్మణమ్=లక్ష్మణుని గూర్చి, వచః=వచనమును, ఉవాచ=పలికెను.

తా. వీరుడైన రాముడు నేలమీద రాలి యున్న ఆ పుష్పముల వర్షమును చూచి, దుఃఖించుచు, దుఃఖితుడై ఉన్న లక్ష్మణునితో ఇట్లు పలికెను. 25

మూ. అభిజానామి పుష్పాణి తానీమానీహ లక్ష్మణ, 26
పినద్ధానీహ వైదేహ్యా మయా దత్తాని కాననే.

ప్ర. అ. లక్ష్మణ=లక్ష్మణా ! ఇహ=ఇపుడు, తాని=ఆ, ఇమాని=ఈ, పుష్పాణి=పుష్పములను, అభిజానామి=గుర్తించుచున్నాను, ఇహ=ఈ,

కాననే = అడవియందు, మయా = నాచేత, దత్తాని = ఇవ్వబడిన ఈ పుష్పములు, వైదేహ్యా = సీతచేత, పినద్ధాని = కట్టబడినవి.

తా. లక్ష్మణా ! ఈ పుష్పములు అవే. నేను వీటిని గుర్తుపట్టగలను. నేను అడవిలో సీత కివ్వగా ఆమె కట్టుకొన్నది. 26

మూ. మన్యే సూర్యశ్చ వాయుశ్చ మేదినీ చ యశస్వినీ, 27
అభిరక్షన్తి పుష్పాణి ప్రకుర్వన్తో మమ ప్రియమ్.

ప్ర. అ. సూర్యశ్చ = సూర్యుడు, వాయుశ్చ = వాయువు, యశస్వినీ = కీర్తి గల, మేదినీ చ = భూమి, మమ = నాకు, ప్రియమ్ = ప్రియమును, ప్రకుర్వన్తః = చేయుచున్నవై, పుష్పాణి = పుష్పములను, అభిరక్షన్తి = రక్షించుచున్నవి అని, మన్యే = తలచుచున్నాను.

తా. సూర్యుడు, వాయువు, కీర్తి గల భూమి నాకు ప్రియము చేయుటకై ఈ పుష్పములను కాపాడుచున్నా యని తలచెదను. 27

మూ. ఏవముక్త్వా మహాబాహుం లక్ష్మణం పురుషర్షభః, 28
ఉవాచ రామో ధర్మాత్మా గిరిం ప్రస్రవణాకులమ్.

ప్ర. అ. పురుషర్షభః = పురుషశ్రేష్ఠుడు, ధర్మాత్మా = ధర్మాత్ముడూ అయిన, రామః = రాముడు, మహాబాహుమ్ = గొప్ప బాహువులు గల, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, ప్రస్రవణాకులమ్ = జలప్రవాహములతో వ్యాకులముగా నున్న, గిరిమ్ = పర్వతమును గూర్చి, ఉవాచ = పలికెను.

తా. పురుషులలో శ్రేష్ఠుడు, ధర్మాత్ముడూ అయిన రాముడు, మహాబాహువైన లక్ష్మణునితో ఇట్లు పలికి, సెలయేళ్ళతో నిండిన ఆ పర్వతముతో ఇట్లనెను.

మూ. కచ్చిత్ క్షితిభృతాం నాథ దృష్టా సర్వాఙ్గసున్దరీ, 29
రామా రమ్యే వనోద్దేశే మయా విరహితా త్వయా.

ప్ర. అ. క్షితిభృతాం నాథ = ఓ ! పర్వతప్రభువా ! రమ్యే = సుందరమైన, వనోద్దేశే = వనప్రాంతమునందు. మయా = నాతో, విరహితా = శూన్యురాలైన, సర్వాఙ్గసున్దరీ = అన్ని అవయవములయందు సుందరియైన, రామా =

స్త్రీ, త్వయా = నీచేత, కచ్చిత్ దృష్టా = చూడబడినదా ?

తా. పర్వతరాజా ! రమ్యమైన ఈ వనప్రాంతమునందు, నాతో విరహము పొందినదీ, సుందరములైన అన్ని అవయవములు కలదీ అయిన స్త్రీని ఎవరి నైన చూచినావా ? 29

మూ. క్రుద్ధోఽబ్రవీద్గిరిం తత్ర సింహః క్షుద్రమృగం యథా,
తాం హేమవర్ణాం హేమాభాం సీతాం దర్శయ పర్వత,
యావత్సానూని సర్వాణి న తే విధ్వంసయామ్యహమ్.

ప్ర. అ. తత్ర = అప్పుడు, సింహః = సింహము, క్షుద్రమృగం యథా = నీచమైన మృగమును గూర్చి వలె, గిరిమ్ = పర్వతమును, క్రుద్ధః = క్రుద్ధుడై, అబ్రవీత్ = పలికెను. పర్వత = పర్వతమా ! అహమ్ = నేను, తే = నీయొక్క, సర్వాణి = సమస్తమైన, సానూని = చరియలను, యావత్ = ఎంతలో, న విధ్వంసయామి = నశింపచేయనో, అంతలో, హేమవర్ణామ్ = బంగారు వర్ణము గలది, హేమాభామ్ = బంగారు కాంతి గలది అయిన, సీతామ్ = సీతను, దర్శయ = చూపుము.

తా. అప్పుడు రాముడు సింహము క్షుద్రమృగముమీద కోపించి నట్లు ఆ పర్వతము మీద కోపించి ఇట్లనెను :- ఓ ! పర్వతమా ! నేను నీ చరియల నన్నింటినీ ధ్వంసము చేయుటకు ముందే బంగారు వర్ణము, బంగారము వంటి కాంతి గల నా సీతను చూపించుము. 30, 31

మూ. ఏవముక్తస్తు రామేణ పర్వతో మైథిలీం ప్రతి,
శంసన్నివ తతః సీతాం నాదర్శయత రాఘవే. 32

ప్ర. అ. రామేణ = రామునిచేత, మైథిలీం ప్రతి = సీతను గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, పర్వతః = పర్వతము, తతః = అటుపిమ్మట, సీతామ్ = సీతను గూర్చి, శంసన్నివ = (ప్రతిధ్వనిచే) చెప్పుచున్నాడా అన్నట్లుండెను. రాఘవే = రామునియందు, (రామునకు), నాదర్శయత = తనను చూపలేదు.

తా. రాముడు సీతను గూర్చి ఈ విధముగా అడగగా, ఆ పర్వతము ప్రతిధ్వనిచే సీతను గూర్చి చెప్పుచున్నదా అన్నట్లు కనబడెను గాని రామునకు తాను

మాత్రము (మనుష్యరూపమున) కనబడలేదు. లేదా సీతను చూపలేదు. 32

మూ. తతో దాశరథీ రామ ఉవాచ చ శిలోచ్చయమ్,
మమ బాణాగ్నినిర్దగ్ధో భస్మీభూతో భవిష్యసి. 33
అసేవ్యః సతతం చైవ నిస్తృణద్రుమపల్లవః.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, దాశరథిః = దశరథకుమారుడైన, రామః = రాముడు, శిలోచ్చయమ్ = పర్వతమును గూర్చి. ఉవాచ చ = పలికెను. మమ = నాయొక్క, బాణాగ్నినిర్దగ్ధః = బాణాగ్నిచేత కాల్చబడినదానవై, భస్మీభూతః = భస్మముగా మారిపోయినదానవై, సతతమ్ = ఎల్లప్పుడు, అసేవ్యః = సేవించుటకు తగనిదానవై, నిస్తృణద్రుమపల్లవః = తృణములు, వృక్షములు, చిగుళ్ళులేనిదానవై, భవిష్యసి = కాగలవు.

తా. పిమ్మట దశరథకుమారుడైన రాముడు ఆ పర్వతముతో ఇట్లు పలికెను. నిన్ను నా బాణాగ్నిచేత కాల్చివేసి భస్మముచేసెదను. తృణములు గాని, వృక్షములు గాని, చిగుళ్ళు గాని లేక ఎవ్వరూ దరిచేరుటకు అనర్హము కాగలవు.

మూ. ఇమాం వా సరితం చాద్య శోషయిష్యామి లక్ష్మణ, 34
యది నాఖ్యాతి మే సీతామార్యాం చన్ద్రనిభాననామ్.

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! ఆర్యామ్ = పూజ్యురాలు, చన్ద్రనిభాననామ్ = చంద్రునితో సమానమైన ముఖము గలదీ అయిన, సీతామ్ = సీతను, మే = నాకు, నాఖ్యాతి = చెప్పకపోయినచో, అద్య = ఇప్పుడు, ఇమామ్ = ఈ, సరితం వా = నదినైనా, శోషయిష్యామి = ఎండింపచేసెదను.

తా. లక్ష్మణా! చంద్రుని వంటి ముఖము గల ఆర్యురాలైన సీత విషయము ఇప్పుడు ఈ నది చెప్పకపోయినచో దీనిని ఎండింపచేసెదను. 34

మూ. ఏవం స రుషితో రామో దిధక్షన్నివ చక్షుషా, 35
దదర్శ భూమౌ నిష్క్రాన్తం రాక్షసస్య పదం మహత్,
త్రస్తాయా రామకాఙ్క్షిణ్యాః ప్రధావన్త్యా ఇతస్తతః, 36
రాక్షసేనానువృతాయా మైథిల్యాశ్చ పదాన్యథ.

ప్ర. అ. ఏవమ్ = ఎట్లు, రుషితః = కోపించినవాడై, చక్షుషా = నేత్రము చేత, దిధక్షన్నివ = కాల్చదలుచుచున్న వాడు వలె ఉన్న, రామః = రాముడు, భూమౌ = నేలమీద, నిష్క్రాన్తమ్ = ఏర్పడిన, రాక్షసస్య = రాక్షసునియొక్క, మహత్ = పెద్దదైన, పదమ్ = పాదచిహ్నమును, అథ = పిమ్మట, త్రస్తాయాః = భయపడినది, రామకాఙ్క్షిణ్యాః = రాముణ్ణి కోరుచున్నదీ, ఇత స్తతః = ఇటు అటూ, ప్రధావన్త్యాః = పరుగెత్తుచున్నదీ, రాక్షసేన = రాక్షసునిచేత, అనువృత్తాయాః = వెంబడించబడినదీ అయిన, మైథిల్యాః = సీతయొక్క, పదాని చ = పాదచిహ్నములను, దదర్శ = చూచెను.

తా. ఈ విధముగా క్రుద్ధుడై, నేత్రములతో కాల్చివేయనున్నాడా అన్నట్లున్న ఆ రామునకు నేలమీద, రాక్షసుని ఒక పెద్ద అడుగు, రాక్షసుడు వెంబడించగా, భయపడి, రామునికొరకై ఎదురుచూచుచు, ఇటు అటు పరుగెత్తిన సీత అడుగులు కనబడెను. 35, 36

మూ. స సమీక్ష్య పరిక్రాన్తం సీతాయా రాక్షసస్య చ, 37
భగ్నం ధనుశ్చ తూణీ చ వికీర్ణం బహుధా రథమ్,
సంభ్రాన్తహృదయో రామః శశంస భ్రాతరం ప్రియమ్. 38

ప్ర. అ. సః రామః = ఆ రాముడు, సీతాయాః = సీతయొక్క, రాక్షసస్య చ = రాక్షసునియొక్క, పరిక్రాన్తమ్ = నడచిన ఆనవాలును, భగ్నమ్ = విరిగిన, ధనుశ్చ = ధనస్సును, తూణీ చ = అంబులపొదులను, బహుధా = అనేకవిధములుగా, వికీర్ణమ్ = చిమ్మబడి ఉన్న, రథమ్ = రథమును, సమీక్ష్య = చూచి, సంభ్రాన్త హృదయః = భయముచెందిన హృదయము కలవాడై, ప్రియమ్ = ప్రియుడైన, భ్రాతరమ్ = సోదరుని గూర్చి, శశంస = ఇట్లు చెప్పెను.

తా. సీత, రాక్షసుడు నడచిన అడుగు జాడలను, విరిగిన ధనస్సును, అంబులపొదులను, ముక్కముక్కలై పడి ఉన్న రథమును చూడగానే రాముని హృదయము కంపించిపోయెను. అప్పుడాతడు తన ప్రియసోదరునితో ఇట్లనెను. 37, 38

మూ. పశ్య లక్ష్మణ వైదేహ్యాః శీర్ణాః కనకబిన్దవః,
భూషణానాం హి సౌమిత్రే మాల్యాని వివిధాని చ, 39

ప్ర. అ. సౌమిత్రే = సుమిత్రాకుమారుడవైన, లక్ష్మణ = లక్ష్మణా! పశ్య = చూడుము. వైదేహ్యాః = సీతయొక్క, భూషణానామ్ = అలంకారములయొక్క, కనకబిన్దవః = బంగారుముక్కలు, శీర్ణాః = జారిపడినవి. వివిధాని = అనేకవిధములైన, మాల్యాని = మాలలుకూడ (జారిపడినవి).

తా. సుమిత్రానందనుడవైన లక్ష్మణా! సీత అలంకారములనుండి చిన్న చిన్న బంగారపు ముక్కలు, అనేకవిధములైన పుష్పమాలలు రాలి పడినవి; చూడుము. 39

మూ. తప్తబిన్దునికాశైశ్చ చిత్రైః క్షతజబిన్దుభిః,
అవృతం పశ్య సౌమిత్రే సర్వతో ధరణీధరమ్. 40

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా! తప్తబిన్దునికాశైః = బంగారము చుక్కలతో సమానములైన, చిత్రైః = చిత్రములైన, క్షతజబిన్దుభిః = రక్తబిందువులచేత, సర్వతః = అంతటా, అవృతమ్ = కప్పబడిన, ధరణీధరమ్ = పర్వతమును, పశ్య = చూడుము.

తా. లక్ష్మణా! ఈ పర్వతముమీద అంతటా బంగారు చుక్కల వంటి, చిత్రములైన (చిన్నా పెద్దవిగా ఉన్న) రక్తబిందువులు పడి ఉన్నవి; చూడుము.

మూ. మన్యే లక్ష్మణ వైదేహీ రాక్షసైః కామరూపిభిః,
భిత్వా భిత్వా విభక్తా వా భక్షితా వా భవిష్యతి. 41

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా! వైదేహీ = సీత, కామరూపిభిః = కామరూపము గల, రాక్షసైః = రాక్షసుల చేత, భిత్వా భిత్వా = ఛేదించిఛేదించి, విభక్తా వా = విడగొట్టబడినది గాని, భక్షితా వా = భక్షింపబడినది గాని, భవిష్యతి = కాగలదు (అయి ఉండును) అని, మన్యే = తలచుచున్నాను.

తా. లక్ష్మణా! ఇష్టము ప్రకారము రూపము ధరించ గల రాక్షసులు సీతను కోసి కోసి విడగొట్టియుందురు; లేదా భక్షించియుందురు అని తలచెదను.

మూ. తస్యా నిమిత్తం వైదేహ్యా ద్వయోర్వివదమానయోః,
బభూవ యుద్ధం సౌమిత్రే ఘోరం రాక్షసయోరిహ. 42

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా ! తస్యాః = ఆ, వైదేహ్యాః నిమిత్తమ్ = సీత నిమిత్తమై, వివదమానయోః = కలహము చేయుచున్న, ద్వయోః = ఇద్దరు, రాక్షసయోః = రాక్షసులకు, ఇహ = ఇక్కడ, ఘోరమ్ = ఘోరమైన, యుద్ధమ్ = యుద్ధము, బభూవ = ఆయెను.

తా. లక్ష్మణా ! ఆ సీతకొరకై కలహించిన ఇద్దరు రాక్షసులకు ఇక్కడ ఘోరమైన యుద్ధము జరిగి ఉండును. 42

మూ. ముక్తామణిమయం చేదం తపనీయవిభూషితమ్,
ధరణ్యాం పతితం సౌమ్య కస్య భగ్నం మహద్ధనుః. 43

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా ! కస్య = ఎవనిదో, ఇదమ్ = ఈ, ముక్తామణిమయమ్ = ముత్యముల రత్నముల వికారమైనది, తపనీయవిభూషితమ్ = బంగారముచేత అలంకరించబడినదీ, అయిన, మహత్ ధనుః = గొప్ప ధనస్సు, భగ్నమ్ = విరగగొట్టబడినదై, ధరణ్యామ్ = నేలమీద, పతితమ్ = పడినది.

తా. సౌమ్యుడా ! పొదిగిన ముత్యములతోను రత్నములతోను నిండినది, బంగారముచేత అలంకరింపబడినది అయిన ఈ పెద్ద ధనస్సు, ఎవరిదో, భగ్నమై నేలమీద పడి యున్నది. 43

మూ. తరుణాదిత్యసంకాశం వైదూర్యగుళికాచితమ్,
విశీర్ణం పతితం భూమౌ కవచం కస్య కాఞ్చనమ్. 44

ప్ర. అ. తరుణాదిత్యసంకాశమ్ = బాలసూర్యునితో సమానము, వైదూర్యగుళికాచితమ్ = వైదూర్యమణులచేత పొదగబడినది, కాఞ్చనమ్ = బంగారు వికారము, కస్య = ఎవనిదో, విశీర్ణమ్ = విరిగిపోయిన, కవచమ్ = కవచము, భూమౌ = నేలపై, పతితమ్ = పడినది.

తా. బాలసూర్యునితో సమానమై, వైదూర్యమణులు పొదిగిన, ఈ బంగారు కవచ మెవ్వరిదో భగ్నమై నేలమీద పడి ఉన్నది. 44

మూ. ఛత్రం శతశలాకం చ దివ్యమాల్యోపశోభితమ్,
భగ్నదణ్డమిదం కస్య భూమౌ సమ్యఙ్నిపాతితమ్. 45

ప్ర. అ. శతశలాకం చ=నూరు ఊచలు గలది, దివ్యమాల్యోపశోభితమ్ = దివ్యములైన పుష్పమాలలచేత శోభింపచేయబడినది, భగ్నదణ్డమ్=విరుగగొట్టబడిన దండము గలది అయిన, ఇదం ఛత్రమ్= ఈ ఛత్రము, కస్య= ఎవనిదో, సమ్యక్ = బాగుగా, భూమౌ = నేలమీద, నిపాతితమ్ = పడవేయబడినది.

తా. దివ్యములైన పుష్పమాలలచేత అలంకృతమైన ఈ నూరు ఊచల ఛత్రము, ఎవ్వరిదో, దండము పూర్తిగా విరిగిపోగా నేలమీద పడి ఉన్నది. 45

మూ. కాఞ్చనోరశ్ఛదాశ్చేమే పిశాచవదనాః ఖరాః,
భీమరూపా మహాకాయాః కస్య వా నిహతా రణే. 46

ప్ర. అ. కాఞ్చనోరశ్ఛదాః = బంగారు కవచములు గలవి, పిశాచవదనాః = పిశాచముల వంటి ముఖములు గలవి, భీమరూపాః=భయంకరములైన రూపములు గలవి, మహాకాయాః = పెద్ద శరీరములు గలవి, రణే= యుద్ధమునందు, నిహతాః = చంపబడినవి అయిన, ఇమే= ఈ, ఖరాః = గాడిదలు, కస్య వా = ఎవరివో.

తా. బంగారు కవచములు, పిశాచముఖముల వంటి ముఖములు, భయంకరమైన రూపము, పెద్ద శరీరము గల ఈ గాడిదలు యుద్ధములో చంపబడినవి. ఇవి ఎవరివో ! 46

మూ. దీప్తపావకసంకాశో ద్యుతిమాన్ సమరధ్వజః,
అపవిద్ధశ్చ భగ్నశ్చ కస్య సాంగ్రామికో రథః. 47

ప్ర. అ. దీప్తపావకసంకాశః=మండుచున్న అగ్నితో సమానము, ద్యుతిమాన్ = కాంతి గలది, సమరధ్వజః = యుద్ధధ్వజము గలది, అయిన, కస్య వా = ఎవనిదో, సాంగ్రామికః = యుద్ధసంబంధమైన, రథః = రథము, భగ్నః = విరగగొట్టబడినది, అపవిద్ధశ్చ= పడగొట్టబడినది.

తా. ప్రజ్వలించుచున్న అగ్నివలె ప్రకాశించుచున్నది, యుద్ధములో నాయకుని సూచించు ధ్వజముతో కూడినది, యుద్ధములో ఉపయోగింపబడేదీ అయిన ఈ రథ మెవరిదో విరుగగొట్టి దూరముగా పడవేయబడినది. 47

మూ. రథాక్షమాత్రా విశిఖా స్తపనీయవిభూషణాః,
కస్యేమేఽభిహతా బాణాః ప్రకీర్ణా ఘోరకర్మణః. 48

ప్ర. అ. రథాక్షమాత్రాః = రథముయొక్క ఇరుసు ప్రమాణము వంటి ప్రమాణము గలవి, విశిఖాః=శ్రేష్ఠమైన అగ్రభాగము గలవి, తపనీయవిభూషణాః = బంగారు అలంకారము గలవి; అభిహతాః=కొట్టబడినవి అయిన, ఇమే బాణాః = ఈ బాణములు, ఘోరకర్మణః = ఘోరమైన కర్మ గల, కస్య = ఎవనివో, ప్రకీర్ణాః = చిమ్మబడి యున్నవి.

తా. భయంకరమైన పని చేయువానివి ఎవనివో ఈ బాణములు కొట్టబడినవై చెల్లాచెదరుగ పడి ఉన్నవి. ఇవి రథము ఇరుసుప్రమాణములో ఉన్నవి. వీటి అగ్రములు చాల తీక్ష్ణములుగా ఉన్నవి. వీటిపై బంగారు నగిషీ చెక్కబడినది.

వి. "రథాక్షమాత్రాః"అనునపుడు రథము ఇరుసు ఎంత పొడవు ఉండునో అంత పొడవున్న వనే అర్థము గ్రహించి "నాలుగువందల అంగుళముల పొడవున్నవి"అని వ్యాఖ్యాతలు అర్థము వ్రాసినారు. బాణము దాదాపు 33 అడుగుల పొడవు ఉండుట అసంభావ్యము కదా. చిన్న అంగుళ మేమో అనుకొన్నను, అది చాల ఎక్కువపొడవే అగును. అందుచేత వాటి లావు రథము ఇరుసంత ఉన్నదని చెప్పిన బాగుండును. 48

మూ. శరావరౌ శరైః పూర్ణౌ విధ్వస్తౌ పశ్య లక్ష్మణ,
ప్రతోదాభీశుహస్తో వై కస్యాయం సారథిర్హతః. 49

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! శరైః = బాణములతో, పూర్ణౌ = నిండిన, విధ్వస్తౌ = నశింపచేయబడిన, శరావరౌ = అంబులపొదులను, పశ్య = చూడుము. ప్రతోదాభీశుహస్తః = కొరడా, కళ్లెములు హస్తములందు గల, హతః = చంపబడిన, అయం సారథిః = ఈ సారథి, కస్య = ఎవరివాడో !

తా. లక్ష్మణా ! బాణములతో నిండిన ఈ రెండు అంబులపొదులు ధ్వంసముచేయబడి ఉన్నవి; చూడుము. ఈతడు ఎవరిసారథియో చచ్చి పడి ఉన్నాడు. ఈతని చేతులలో కొరడా, కళ్లెములు ఉన్నవి. 49

మూ. కస్యేమౌ పురుషవ్యాఘ్ర శయాతే నిహతౌ యుధి,
చామరగ్రాహిణౌ సౌమ్య సోష్ణీషమణికుణ్డలౌ. 50

ప్ర. అ. పురుషవ్యాఘ్ర=పురుషశ్రేష్ఠుడా! సౌమ్య = సౌమ్యుడా। సోష్ణీష మణికుణ్డలౌ=తలపాగలతోను మణికుండలములతోను కూడిన, ఇమౌ= ఈ, చామర గ్రాహిణౌ = చామరములను పట్టువారు, కస్య = ఎవరివారో, యుధి = యుద్ధము నందు, నిహతౌ = చంపబడినవారై, శయాతే=శయినించిఉన్నారు.

తా. పురుషులలో శ్రేష్ఠుడవైన ఓ! సౌమ్యుడా। తలపాగాలు, కుండల ములు ధరించిన ఈ చామరగ్రాహులు ఎవరివారో; యుద్ధములో చంపబడి పడి ఉన్నారు.

వి. పై శ్లోకాలలో ఉన్న "కస్య'' అనేదానిని ప్రశ్నార్థకంగా గ్రహించి ''ఎవరిది?''అను అర్థము తీసికొనుటకంటె 'కస్య' అనేదానిని ''కస్యాపి"అనే అర్థంలో(ఎవరిదో) గ్రహించి వ్యాఖ్యానించుట యుక్త మని తోచి అట్లు చేసినాము. "ఇది ఎవరిది?'' అని లక్ష్మణుని ప్రశ్నించినచో అతనికి మాత్రము ఏమి తెలియును? 50

మూ. పదవీ పురుషస్యైషా వ్యక్తం కస్యాపి రక్షసః,
వైరం శతగుణం పశ్య మమేదం జీవితాన్తకమ్. 51

ప్ర. అ. ఏషా=ఇది, వ్యక్తమ్ = స్పష్టముగా, కస్యాపి = ఎవ్వడో, పురుషస్య = పురుషుడైన, రక్షసః = రాక్షసునియొక్క, పదవీ = మార్గము. మమ = నాయొక్క, జీవితాన్తకమ్=జీవితమునకు నాశకమైన, శతగుణమ్=వందరెట్లైన, ఇదం వైరమ్ = ఈ వైరమును, పశ్య = చూడుము.

తా. ఇది ఎవ్వడో పురుషుడైన రాక్షసుని మార్గ మనేది స్పష్టము. నా జీవితానికే ముప్పు తెచ్చిన ఈ వైరము ఏ విధముగా నూరు రెట్లు పెరిగిపోయినదో చూడుము। 51

వి. 43వ శ్లోకంనుంచి 51వ శ్లోకం వరకు ఉన్న 9 శ్లోకాలు ప్రాచ్య పాఠంలో లేవు. ఈ రథాదులు కనబడిన పిమ్మట ప్రక్కనే పడిఉన్న జటాయువు కూడ వెంటనే కనబడాలికదా! 51వ శ్లోకంలో రాముడు ''నాకు ప్రాణాంతకర మైన వైరము ఏర్పడినదే''అని వాపోవుట అనుచితము.

మూ. సుఘోరహృదయైః సౌమ్య రాక్షసైః కామరూపిభిః,
హృతా మృతా వా సీతా సా భక్షితా వా తపస్వినీ, 52
న ధర్మస్త్రాయతే సీతాం హ్రియమాణాం మహావనే.

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా ! తపస్వినీ = దీనురాలైన, సా సీతా = ఆ సీత, సుఘోరహృదయైః = చాల ఘోరమైన హృదయము గల, కామరూపిభిః = స్వేచ్ఛానుసారము రూపము గల, రాక్షసైః = రాక్షసులచేత, హృతా వా = హరించబడినది గాని, భక్షితా వా = భక్షింపబడినది గాని అయి ఉండును. మృతా వా = లేదా మరణించి ఉండును. మహావనే = మహావనమునందు, హ్రియమాణామ్ = హరింపబడుచున్న, సీతామ్ = సీతను, ధర్మః = ధర్మము, న త్రాయతే = రక్షించుటలేదు.

తా. సౌమ్యుడవైన లక్ష్మణా ! దీనురాలైన సీతను ఘోరమైన మనస్సు గల, స్వేచ్ఛానుసారము రూపము ధరించగలిగిన రాక్షసులు హరింపగా ఆమె మరణించి యుండ వచ్చును; లేదా ఆమెను వాళ్ళు భక్షించి ఉండవచ్చును. మహారణ్యములో అపహరింపబడుచుండగా ఆ సీతను ధర్మము కాపాడలేకపోయినది ::

మూ. భక్షితాయాం హి వైదేహ్యాం హృతాయామపి లక్ష్మణ, 53
కే హి లోకే ప్రియం కర్తుం శక్తాః సౌమ్య మహేశ్వరాః.

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా, లక్ష్మణ = లక్ష్మణా! వైదేహ్యామ్ = సీత, భక్షితాయామ్ = భక్షింపబడినా, హృతాయామపి = హరించబడినా, మమ = నాకు, లోకే = ఈ లోకమునందు, కే ఈశ్వరాః = ఏ దేవతలు, ప్రియమ్ = ప్రియమును, కర్తుమ్ = చేయుటకు, శక్తాః = సమర్థులు?

తా. సౌమ్యుడవైన లక్ష్మణా! సీత భక్షింపబడినా, హరింపబడినా, ఇంక ఈ లోకములో నాకు ఏ దేవతలు ప్రియము చేయగలరు ? ఇది తీరని నష్టము కదా ? 53

మూ. కర్తారమపి లోకానాం శూరం కరుణవేదినమ్, 54
అజ్ఞానాదవమన్యేరన్ సర్వభూతాని లక్ష్మణ.

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! లోకానామ్ = లోకములకు, కర్తారమపి =

కర్తయైనను, శూరమ్ = శూరుడైనను, కరుణవేదినమ్=దయ చూపువానిని, సర్వ భూతాని = అన్ని భూతములు, అజ్ఞానాత్ = అజ్ఞానమువలన, అవమన్యేరన్ = అవమానించును.

తా. లక్ష్మణా! దయావరుడైనవానిని చూచి, ఆత డెంత శూరుడైనా, లోకములను సృజింప సమర్థుడైనా, అన్ని భూతములు అజ్ఞానమువలన అవమానించును. 54

మూ. మృదుం లోకహితే యుక్తం దాన్తం కరుణవేదినమ్, 55
నిర్వీర్య ఇతి మన్యన్తే నూనం మాం త్రిదశేశ్వరాః.

ప్ర. అ. మృదుమ్ = మెత్తనివాడను, లోకహితే = లోకహితమునందు, యుక్తమ్ = ప్రయత్నము చేయువాడను, దాన్తమ్ = ఇంద్రియనిగ్రహము కలవాడను, కరుణవేదినమ్ = కరుణ చూపువాడను అయిన, మామ్ = నన్ను, త్రిదశేశ్వరాః = దేవతల ప్రభువులు, నిర్వీర్యః ఇతి = పరాక్రమహీనుడు అని, మన్యన్తే = తలచుచున్నారు, నూనమ్ = నిశ్చయము.

తా. ఇంద్రియనిగ్రహవంతుడనై, దయావరుడనై నేను లోకమునకు హితము చేకూర్చవలె నని ప్రయత్నించుచు, మెత్తగా ఉండుటచేత దేవత లందరూ "ఇతడు పరాక్రమశూన్యుడు"అని అనుకొనుచున్నారు!

మూ. మాం ప్రాప్య హి గుణో దోషః సంవృత్తః పశ్య లక్ష్మణ
అద్యైవ సర్వభూతానాం రక్షసామభవాయ చ,
సంహృత్యైవ శశిజ్యోత్స్నాం మహాన్ సూర్య ఇవోదితః
సంహృత్యైవ గుణాన్ సర్వాన్ మమ తేజః ప్రకాశతే.

ప్ర. అ. లక్ష్మణ=లక్ష్మణా! మామ్=నన్ను, ప్రాప్య=పొంది, గుణః= గుణము, దోషః = దోషముగా, సంవృత్తః = అయినది, పశ్య = చూడుము. శశిజ్యోత్స్నామ్ = చంద్రుని వెన్నెలను, సంహృత్యైవ = అణచివేసి, ఉదితః = ఉదయించిన, మహాన్ = గొప్ప, సూర్యః ఇవ = సూర్యుడు వలె, మమ తేజః= నా తేజస్సు, సర్వాన్ = సమస్తమైన, గుణాన్ = గుణములను, సంహృత్యైవ = అణగద్రొక్కి, అద్యైవ = ఇప్పుడే, సర్వభూతానామ్ = సకలభూతములయొక్క,

రక్షసాం చ = రాక్షసులయొక్క, అభవాయ = వినాశముకొరకు, ప్రకాశతే = ప్రకాశించుచున్నది.

తా. లక్ష్మణా ! చూచితివా ; నాలో ఉన్న గుణము కూడ ఎట్లు దోషముగా మారినదో ! గొప్ప ప్రకాశము గల సూర్యుడు చంద్రుని వెన్నెలను అణచివేసి ఉదయించి నట్లు ఇప్పుడే నా తేజస్సు మృదుత్వము మొదలైన గుణాలను అన్నింటినీ అణగ ద్రొక్కి విజృంభించి సకలభూతములను, రాక్షసులను నశింపచేయ గలదు. 56, 57

మూ. నైవ యక్షా న గన్ధర్వా న పిశాచా న రాక్షసాః, 58
కింనరా వా మనుష్యా వా సుఖం ప్రాప్స్యన్తి లక్ష్మణ.

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! యక్షాః = యక్షులు, సుఖమ్ = సుఖమును, నైవ ప్రాప్స్యన్తి = పొందరు, యక్షాః = యక్షులు, న = పొందరు, పిశాచాః = పిశాచములు, న = పొందవు. రాక్షసాః = రాక్షసులు, న = పొందరు. కింనరా వా = కింనరులు గాని, మనుష్యా వా = మనుష్యులు గాని, పొందరు.

తా. లక్ష్మణా ! ఇప్పుడు యక్షులను గాని, గంధర్వులను గాని, పిశాచములను గాని, రాక్షసులను గాని, కింనరులను గాని, మానవులను గాని సుఖముగా ఉండనివ్వను. 58

మూ. మమాస్త్రబాణసంపూర్ణమాకాశం పశ్య లక్ష్మణ, 59
నిఃసంపాతం కరిష్యామి హ్యద్య త్రైలోక్యచారిణామ్.

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! మమ = నాయొక్క, అస్త్రబాణసంపూర్ణమ్ = అస్త్రములతోను బాణములతోను నిండిన, ఆకాశమ్ = ఆకాశమును, అద్య = ఇప్పుడు, త్రైలోక్యచారిణామ్ = మూడు లోకములందు సంచరించు దేవతాదులకు, నిఃసంపాతమ్ = ఎగిరే చోటులేనిదానినిగా, కరిష్యామి = చేసెదను. పశ్య = చూడుము.

తా. లక్ష్మణా ! ఆకాశమును నా అస్త్రములతోను, బాణములతోను నింపివేసి మూడు లోకములలో సంచరించే దేవతాదులకు ఎగురుటకు అవకాశము లేకుండా చేసెదను, చూడుము. 59

మూ. సంనిరుద్ధగ్రహగణమావారితనిశాకరమ్, 60
విప్రణష్టానలమరుద్భాస్కరద్యుతిసంవృతమ్,
వినిర్మథితశైలాగ్రం శుష్యమాణజలాశయమ్, 61
ధ్వస్తద్రుమలతాగుల్మం విప్రణాశితసాగరమ్,
త్రైలోక్యం తు కరిష్యామి సంయుక్తం కాలకర్మణా. 62

ప్ర. అ. త్రైలోక్యమ్ = మూడు లోకముల సముదాయమును, సంనిరుద్ధగ్రహగణమ్ = అడ్డుకొనబడిన గ్రహముల సముదాయము గలదానినిగాను, ఆవారితనిశాకరమ్ = నివారింపబడిన చంద్రుడు కలదానిని గాను, విప్రణష్టానలమరుద్భాస్కరద్యుతి = నశించిన అగ్ని, వాయువు, సూర్యప్రకాశము కలదానినిగాను, సంవృతమ్ = చీకటిచేత కప్పబడినదానినిగాను, వినిర్మథితశైలాగ్రమ్ = మథింపబడిన పర్వతశిఖరములు కలదానినిగాను, శుష్యమాణజలాశయమ్ = ఎండిపోయిన జలస్థానములు కలదానినిగాను, ధ్వస్తద్రుమలతాగుల్మమ్ = నశింపచేయబడిన వృక్షములు, లతలు, పొదలు కలదానినిగాను, విప్రణాశితసాగరమ్ = నశింపచేయబడిన సముద్రము గలదానినిగాను, కాలకర్మణా = ప్రలయకాలముయొక్క కర్మతో, సంయుక్తమ్ = కూడినదానినిగాను, కరిష్యామి = చేయగలను.

తా. గ్రహగతులు నిలిచిపోవునట్లు చేసెదను. చంద్రుడు ఉదయించకుండ చేసెదను. అగ్నిని, వాయువును, సూర్యతేజస్సును నశింపచేసి అంధకారము క్రమ్ముకొనునట్లు చేసెదను. పర్వతశిఖరములను పడగొట్టెదను. సరస్సులు, నదులు మొదలైన జలాశయములు ఎండిపోవునట్లు చేసెదను. వృక్షములను, లతలను, పొదలను నశింపచేసెదను. సముద్రమును ఇంకింపచేసెదను. ఈ విధముగ ముల్లోకములలో ప్రళయము సృష్టించెదను. 60, 61, 62

మూ. స తాం కుశలినీం సీతాం ప్రదాస్యన్తి మమేశ్వరాః,
అస్మిన్ ముహూర్తే సౌమిత్రే మమ ద్రక్ష్యన్తి విక్రమమ్.

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా ! ఈశ్వరాః = దేవతలు, తాం సీతామ్ = ఆ సీతను, కుశలినీమ్ = క్షేమముగా ఉన్నదానినిగా, మమ = నాకు, న ప్రదాస్యన్తి =

ఇవ్వకపోయినచో, అస్మిన్ = ఈ, ముహూర్తే = ముహూర్తమునందు, మమ = నాయొక్క, విక్రమమ్ = పరాక్రమమును, ద్రక్ష్యన్తి = చూడగలరు.

తా. లక్ష్మణా। దేవతలు సీతను క్షేమముగా నాకు అప్పగించనిచో ఈ క్షణమునందే నా పరాక్రమ మెట్టిదో చూపించెదను. 63

మూ. నాకాశముత్పతిష్యన్తి సర్వభూతాని లక్ష్మణ,
మమ చాపగుణోన్ముక్తైర్బాణజాలైర్నిరన్తరమ్. 64

ప్ర. అ. లక్ష్మణ=లక్ష్మణా। సర్వభూతాని=అన్ని భూతములు, మమ= నాయొక్క, చాపగుణోన్ముక్తైః = ధనస్సు నారిచేత విడవబడిన, బాణజాలైః = బాణముల సముదాయములచేత, నిరన్తరమ్ = అవకాశము లేకుండా ఉన్న, ఆకాశమ్ = ఆకాశమును గూర్చి, న ఉత్పతిష్యన్తి = ఎగరవు.

తా. లక్ష్మణా। నా ధనస్సునుండి వెలువడిన బాణములచేత దట్టముగా కప్పివేయబడిన ఆకాశములోనికి ఇంక ఏ ప్రాణులు కూడ ఎగురజాలవు. 64

మూ. అర్దితం మమ నారాచైర్ధ్వస్తభ్రాన్తమృగద్విజమ్,
సమాకులమమర్యాదం జగత్పశ్యాద్య లక్ష్మణ. 65

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా। అద్య = ఇప్పుడు, మమ = నాయొక్క, నారాచైః = నారాచబాణములచేత, అర్దితమ్ = పీడించబడినది, ధ్వస్తభ్రాన్తమృగద్విజమ్ = నశించిన భయపడిన మృగములు పక్షులు కలది, సమాకులమ్ = వ్యాకులమైనది, అమర్యాదమ్ = కట్టుబాట్లు లేనిది అయిన, జగత్ = జగత్తును, పశ్య = చూడుము.

తా. లక్ష్మణా। ఇప్పుడు ఈ జగత్తును అంతా నా నారాచబాణములచేత పీడించెదను. మృగములను పక్షులను భయపడునట్లు చేసి నశింపచేసెదను. ఈ జగత్తును వ్యాకుల మయ్యేటట్లు చేసి కట్టుబాట్లు అన్నీ తారుమారు చేసెదను. చూడుము. 65

మూ. ఆకర్ణపూర్ణైరిషుభిర్జీవలోకం దురావరైః,
కరిష్యే మైథిలీహేతోరపిశాచమరాక్షసమ్. 66

ప్ర. అ. మైథిలీహేతోః = సీతనిమిత్తమై, జీవలోకమ్ = ఈ జగత్తును, ఆకర్ణపూర్ణైః = కర్ణాంతమువరకు లాగబడిన, దురావర్త్యైః = నివారింప శక్యము కాని, ఇషుభిః = బాణములచేత, అపిశాచమ్ = పిశాచములు లేనిదానినిగాను, అరాక్షసమ్ = రాక్షసులు లేని దానినిగాను, కరిష్యే = చేసెదను.

తా. సీత కారణముగ చెవి వరకు నారి లాగి విడవబడిన, నివారింప శక్యము కాని బాణములు ప్రయోగించి, ఈ జగత్తులో పిశాచాలు కాని, రాక్షసులు కాని లేకుండు నట్లు చేసెదను. 66

మూ. మమ రోషప్రయుక్తానాం సాయకానాం బలం సురాః,
ద్రక్ష్యన్త్యద్య విముక్తానామతిదూరాతిగామినామ్. 67

ప్ర. అ. విముక్తానామ్ = విడువబడినవి, మమ = నాయొక్క, రోష ప్రయుక్తానామ్ = రోషముచేత ప్రేరింపబడినవి, అతిదూరాతిగామినామ్ = చాల దూరము ప్రయాణించునవి అయిన, సాయకానామ్ = బాణములయొక్క, బలమ్ = బలమును, సురాః = దేవతలు, అద్య = ఇప్పుడు, ద్రక్ష్యన్తి = చూడగలరు.

తా. నా రోషము ప్రేరేపింపగా నేను ప్రయోగించిన, చాల దూరము ప్రయాణించ గల నా బాణముల బల మెట్టిదో ఇప్పుడు దేవతలు తెలిసికొన గలరు. 67

మూ. నైవ దేవా న దైతేయా న పిశాచా న రాక్షసాః,
భవిష్యన్తి మమ క్రోధాత్త్రైలోక్యే విప్రణాశితే. 68

ప్ర. అ. మమ = నాయొక్క, క్రోధాత్ = క్రోధమువలన, త్రైలోక్యే = మూడు లోకముల సముదాయము, విప్రణాశితే = నశింపచేయబడినదగుచుండగా, దేవాః = దేవతలు, నైవ భవిష్యన్తి = ఉండరు. దైతేయాః = దైత్యులు, న = ఉండరు. పిశాచాః = పిశాచములు, న = ఉండరు. రాక్షసాః = రాక్షసులు, న = ఉండరు.

తా. నా క్రోధముచేత మూడు లోకములు నశించిన పిమ్మట దేవతలు గాని, దైత్యులు గాని, పిశాచములు గాని, రాక్షసులు గాని ఉండరు. 68

మూ. దేవదానవయక్షాణాం లోకా యే రక్షసామపి
బహుధా న భవిష్యన్తి బాణౌఘైః శకలీకృతాః. 69

ప్ర. అ. దేవదానవయక్షాణామ్ = దేవతలయొక్క, దానవులయొక్క, యక్షులయొక్క, రక్షసామపి = రాక్షసులయొక్క యే = ఏ, లోకాః = లోకములున్నవో, అవి, బాణౌఘైః = బాణముల సముదాయములచేత, బహుధా = అనేక విధములుగ, శకలీకృతాః = ముక్కలు చేయబడినవై, న భవిష్యన్తి = ఉండవు.

తా. నా బాణసముదాయములచేత ముక్కలు చేయబడినవై దేవలోకము, దానవలోకము, యక్షులలోకము, రాక్షసులలోకము కూడ నశించిపోగలవు. 69

మూ. నిర్మర్యాదానిమాన్ లోకాన్ కరిష్యామ్యద్య సాయకైః,
హృతాం మృతాం వా సౌమిత్రే న దాస్యన్తి మమేశ్వరాః.

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా! హృతామ్=హరించబడినదైనా, మృతాం వా = మరణించినదైనా, నా ప్రియురాలిని, ఈశ్వరాః = దేవతలు, మమ = నాకు, న దాస్యన్తి = ఇవ్వకపోయినచో, అద్య = ఇప్పుడు, సాయకైః = బాణములచేత, ఇమాన్ = ఈ, లోకాన్ = లోకములను, నిర్మర్యాదాన్ = కట్టుబాట్లు లేనివాటినిగా, కరిష్యామి = చేసెదను.

తా. లక్ష్మణా! సీత మరణించినా, హరింపబడినా ఆమెను దేవతలు నాకివ్వనిచో ఇప్పుడు బాణములచేత ఈ లోకముల వ్యవస్థలను ఛిన్నాభిన్నము చేసెదను. 70

మూ. తథారూపాం హి వైదేహీం న దాస్యన్తి యది ప్రియామ్,
నాశయామి జగత్సర్వం త్రైలోక్యం సచరాచరమ్. 71

ప్ర. అ. తథారూపామ్ = అట్టి, ప్రియామ్=ప్రియురాలైన, వైదేహీమ్= సీతను, న దాస్యన్తి యది = ఇవ్వకపోయినట్లయితే, సర్వమ్ = సమస్తమైన, సచరాచరమ్ = జంగమస్థావరములతో కూడిన, త్రైలోక్యమ్=మూడులోకముల రూపమైన, జగత్ = జగత్తును, నాశయామి = నశింపచేసెదను.

తా. నా ప్రియురాలైన సీత హరింపబడినా, మరణించినా, ఆమెను నాకు అప్పగించకున్నచో స్థావరజంగమాత్మకమైన, మూడు లోకముల రూపములో ఉన్న జగత్తు నంతనూ నశింపచేసెదను. 71

మూ. ఇత్యుక్త్వా రోషతామ్రాక్షో రామో నిష్పీడ్య కార్ముకమ్,
శరమాదాయ సందీప్తం ఘోరమాశీవిషోపమమ్. 72
సంధాయ ధనుషి శ్రీమాన్ రామః పరపురంజయః,
యుగాన్తాగ్నిరివ క్రుద్ధ ఇదం వచనమబ్రవీత్. 73

ప్ర. అ. రామః = లోకాభిరాముడు, శ్రీమాన్ = శోభ కలవాడు, పరపురంజయః = శత్రుపురములను జయించువాడు అయిన, రామః = రాముడు, ఇతి = ఇట్లు, ఉక్త్వా = పలికి, రోషతామ్రాక్షః = రోషముచేత ఎఱ్ఱనైన నేత్రములు కలవాడై, కార్ముకమ్ = ధనస్సును, నిష్పీడ్య=దృఢముగా పట్టి, ఆశీవిషోపమమ్ = సర్పము వంటి, ఘోరమ్ = భయంకరమైన, సందీప్తమ్ = మండుచున్న, శరమ్ = బాణమును, ఆదాయ = గ్రహించి, ధనుషి = ధనస్సుమీద, సంధాయ= సంధించి, యుగాన్తాగ్నిరివ = ప్రలయకాలాగ్ని వలె, క్రుద్ధః = కోపించినవాడై, ఇదమ్ = ఈ, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. లోకాభిరాముడు, శ్రీమంతుడు, శత్రుపురములను జయించువాడు అయిన రాముడు ఇట్లు పలికి, రోషముచేత ఎరుపెక్కిన నేత్రములు కలవాడై, ధనస్సును దృఢముగా పట్టుకొని, సర్పము వంటి భయంకరమైన, ప్రజ్వలించుచున్న బాణమును గ్రహించి, దానిని ధనస్సుమీద సంధించి, ప్రలయకాలాగ్ని వలె మండిపడుచు ఇట్లు పలికెను. 72, 73

మూ. యథా జరా యథా మృత్యుర్యథా కాలో యథా విధిః,
నిత్యం న ప్రతిహన్యన్తే సర్వభూతేషు లక్ష్మణ, 74
తథాహం క్రోధసంయుక్తో న నివార్యోఽస్మి సర్వథా.

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! సర్వభూతేషు = సకలభూతములయందు, జరా = ముసలితనము, యథా = ఎట్లు, మృత్యుః = మృత్యువు, యథా = ఎట్లు, కాలః = కాలము, యథా = ఎట్లు, విధిః = దైవము, యథా = ఎట్లు, నిత్యమ్ = ఎల్లప్పుడూ, న ప్రతిహన్యన్తే = అడ్డుకొనబడవో, తథా = అట్లే, క్రోధసంయుక్తః = క్రోధముతో కూడిన, అహమ్=నేను సర్వథా=అన్ని విధములా, న నివార్యః = నివారింప శక్యము కానివాడనుగా, అస్మి = అయి ఉన్నాను.

తా. లక్ష్మణా ! ముసలితనమును, మృత్యువును, కాలమును, దైవమును

భూతములలో ఎవ్వరూ కూడ ఏ విధముగా అతిక్రమింపజాలరో కోపము వచ్చిన నన్ను కూడ ఎవ్వరూ, ఏ విధముగానూ కూడ అడ్డుకొనజాలరు. 74

మూ. పురేవ మే చారుదతీమనిన్దితాం
దిశన్తి సీతాం యది నాద్య మైథిలీమ్,
సదేవగన్ధర్వమనుష్యపన్నగం
జగత్సశైలం పరివర్తయామ్యహమ్. 75

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకియే ఆదికావ్యే అరణ్యకాణ్డే
చతుఃషష్టితమః సర్గః.

ప్ర. అ. చారుదతీమ్ = అందమైన దంతములు గలది, అనిన్దితామ్ = నిందించబడనిది, మైథిలీమ్ = మిథిలారాజకుమారి అయిన, సీతామ్ = సీతను, పురేవ = పూర్వమునందు వలె, అద్య = ఇప్పుడు, మే = నాకు, న దిశన్తి యది = (దేవతలు)ఇవ్వకపోయినట్లయితే, అహమ్ = నేను, సదేవగన్ధర్వమనుష్యపన్నగమ్ = దేవతలతోను, గంధర్వులతోను, మనుష్యులతోను, పన్నగులతోనుకూడిన, సశైలమ్ = పర్వతములతో కూడిన, జగత్ = జగత్తును, పరివర్తయామి = త్రిప్పెదను.

తా. అందమైన దంతములు కలది, దోషములు లేనిది, జనకరాజకుమారి అయిన సీతను నా కిప్పుడు పూర్వ మున్న రూపములో అప్పగించకపోయినచో దేవతలతోను, గంధర్వులతోను, మనుష్యులతోను, పన్నగులతోను కూడిన, పర్వత సహితమైన ఈ జగత్తు నంతా తలక్రిందుచేసెదను. 75

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో
అరువదినాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చషష్టితమః సర్గః

[లక్ష్మణుడు రామునకు బోధించి కోపమును చల్లార్చుట].

మూ. తప్యమానం తదా రామం సీతాహరణకర్శితమ్,
లోకానామభవే యుక్తం సాంవర్తకమివానలమ్. 1

వీక్షమాణం ధనుః సజ్యం నిఃశ్వసన్తం పునః పునః,
దగ్ధుకామం జగత్సర్వం యుగాన్తే చ యథా హరమ్. 2

అదృష్టపూర్వం సంక్రుద్ధం దృష్ట్వా రామం స లక్ష్మణః,
అబ్రవీత్ప్రాఞ్జలిర్వాక్యం ముఖేన పరిశుష్యతా. 3

ప్ర. అ. తథా = అట్లు, తప్యమానమ్ = తపింపచేయబడుచున్నవాడు, రామమ్ = లోకాభిరాముడు, సీతాహరణకర్శితమ్ = సీతయొక్క హరణముచేత కృశింపచేయబడినవాడు, సాంవర్తకమ్ = ప్రళయకాలసంబంధమైన, అనలమివ = అగ్ని వలె, లోకానామ్ = లోకములయొక్క, అభవే = లేకపోవుటయందు (వినాశనమునందు), యుక్తమ్ = ఉద్యుక్తుడు, సజ్యమ్ = నారితో కూడిన, ధనుః = ధనస్సును, వీక్షమాణమ్ = చూచుచున్నవాడు, పునః పునః = మాటిమాటికి, నిఃశ్వసన్తమ్ = నిట్టూర్పుచున్నవాడు, యుగాన్తే = యుగాంతమునందు, హరం యథా = ఈశ్వరుడు వలె, సర్వమ్ = సమస్తమైన, జగత్ = జగత్తును, దగ్ధుకామమ్ = కాల్చుటకు కోరిక గలవాడు, అదృష్టపూర్వమ్ = పూర్వ మెన్నడూ ఆ విధముగా చూడబడని వాడు, సంక్రుద్ధమ్ = కోపించినవాడు అయిన, రామమ్ = రాముణ్ణి దృష్ట్వా = చూచి, లక్ష్మణః = లక్ష్మణుడు, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడై, పరిశుష్యతా = ఎండిపోవుచున్న, ముఖేన = ముఖముతో, అబ్రవీత్ = పలికెను.

తా. లోకాభిరాముడైన ఆ రాముడు ఆ విధముగ సీతాహరణము చేత

కృశించి దుఃఖముతో తపించిపోవుచుండెను. ప్రళయకాలాగ్ని వలె లోకములను కాల్చివేయవలె నను భావముతో నారి బిగించిన ధనస్సు వైపు చూచుచు మాటి మాటికి నిట్టూర్చుచుండెను. యుగాంతమునందు జగత్తు నంతనూ కాల్చివేయుటకై ఉద్యమించిన రుద్రుడు వలె ఉండెను. లక్ష్మణుడు పూర్వ మెన్నడూ రాముణ్ణి అ విధముగా చూచి ఉండలేదు. అట్టి కోపావిష్టుడైన రాముణ్ణి చూడగానే భయముచేత లక్ష్మణుని ముఖము ఎండిపోయెను. అట్టి స్థితిలో ఆతడు అంజలి ఘటించి రాము నితో ఇట్లు పలికెను. 1-3

మూ. పురా భూత్వా మృదుర్దాన్తః సర్వభూతహితే రతః,
న క్రోధవశమాపన్నః ప్రకృతిం హాతుమర్హసి. 4

ప్ర. అ. పురా = పూర్వము, మృదుః=మృదుస్వభావము కలవాడవుగాను, దాన్తః = ఇంద్రియనిగ్రహవంతుడవు గాను, సర్వభూతహితే = సమస్తభూతముల హితమునందు, రతః = ఆసక్తుడవుగాను, భూత్వా = ఉండి, క్రోధవశమ్=క్రోధ వశమును, ఆపన్నః = పొందినవాడవై, ప్రకృతిమ్ = నీ స్వభావమును, హాతుమ్ = విడచుటకు, నార్హసి = తగవు.

తా. నీవు ఇంతవరకు మృదుస్వభావముతో, ఇంద్రియనిగ్రహవంతుడవై సకల ప్రాణుల హితమునందు ఆసక్తి కలవాడవై ఉన్నావు. అట్టి నీవు క్రోధము నకు వశుడవై నీ స్వభావమును విడచుట తగదు. 4

మూ. చన్ద్రే లక్ష్మీః ప్రభా సూర్యే గతిర్వాయౌ భువి క్షమా,
ఏతత్తు నియతం సర్వం త్వయి చానుత్తమం యశః. 5

ప్ర. అ. చన్ద్రే = చంద్రునియందు, లక్ష్మీః = శోభ, సూర్యే=సూర్యుని యందు, ప్రభా = కాంతి, వాయౌ = వాయువునందు, గతిః = గమనము, భువి= భూమియందు, క్షమా = ఓర్పు, ఏతత్ సర్వమ్ = ఇది అంతా, నియతమ్ = నిశ్చిత మైనది. త్వయి = నీయందు, అనుత్తమమ్ = శ్రేష్ఠమైన, యశః చ = కీర్తి కూడ, నిశ్చిత మైనది.

తా. చంద్రునిలో శోభ, సూర్యునిలో కాంతి, వాయువునందు సదాగమ నము, భూమియందు ఓర్పు ఏ విధముగా నిశ్చితముగా ఉండునో అట్లే నీయందు ఉత్తమమైన కీర్తి కూడ స్థిరముగా ఉన్నది. 5

మూ. ఏకస్య నాపరాధేన లోకాన్ హన్తుమిహార్హసి,
న తు జానామి కస్యాయం భగ్నః సాంగ్రామికో రథః 6
కేన వా కస్య వా హేతోః సాయుధః సపరిచ్ఛదః

ప్ర. అ. ఏకస్య = ఒక్కనియొక్క, అపరాధేన = అపరాధముచేత, ఇహ = ఇప్పుడు, లోకాన్ = లోకములను, హన్తుమ్ = చంపుటకు, నార్హసి = తగవు. సాయుధః = ఆయుధములతో కూడిన, సపరిచ్ఛదః = పరివారముతో కూడిన, అయమ్ = ఈ, సాంగ్రామికః = యుద్ధమునకు సంబంధించిన, రథః = రథము, కస్య = ఎవనిదో, కేన = ఎవనిచేత, కస్య వా హేతోః = ఏ కారణము వలన, భగ్నః = విరగగొట్ట బడినదో, న జానామి = ఎరుగను.

తా. ఎవడో ఒకడు అపరాధము చేసినందుకు నీవు ఈ లోకము లన్నింటిని సంహరించుట యుక్తము కాదు. ఈ యుద్ధరథము ఎవ్వరిదో, దీనిని, ఆయుధాలను, పరివారమును ఎవరు ఏ కారణముచేత ధ్వంసము చేసినారో తెలియుట లేదు. 6

మూ. ఖురనేమిక్షతశ్చాయం సిక్తో రుధిరబిన్దుభిః, 7
దేశో నిర్వృత్తసంగ్రామః సుఘోరః పార్థివాత్మజ.

ప్ర. అ. పార్థివాత్మజ = రాజకుమారా ! ఖురనేమిక్షతః = గుఱ్ఱముల డెక్కలచేతను రథచక్రాంతములచేతను నలగగొట్టిబడినది, రుధిరబిన్దుభిః = రక్త బిందువులచేత, సిక్తః = తడపబడినది, సుఘోరః = చాల భయంకరము అయిన, అయం దేశః = ఈ ప్రదేశము, నిర్వృత్తసంగ్రామః = జరిగిన యుద్ధము గలది.

తా. రామా ! భయంకరముగా ఉన్న ఈ ప్రదేశము గుఱ్ఱము డెక్కల చేతా, రథచక్రముల అంచులచేత నలిగినది. రక్తబిందువులచేత తడిసి ఉన్నది. ఇక్కడ యుద్ధము జరిగి ఉండును. 7

మూ. ఏకస్య తు విమర్దోఽయం న ద్వయోర్వదతాం వర, 8
న హి వృత్తం హి పశ్యామి బలస్య మహతః పదమ్.

ప్ర. అ. వదతామ్ = మాటలాడువారిలో, వర = శ్రేష్ఠుడా ! అయమ్ =

ఇది, ఏకస్య = ఒక్కనియొక్క, విమర్దః = యుద్ధమే. ద్వయోః = ఇద్దరియొక్క, యుద్ధము, న = కాదు. మహతః = గొప్పదైన, బలస్య = సేనయొక్క, వృత్తమ్ = ఏర్పడిన, పదమ్ = చిహ్నమును, న హి పశ్యామి = చూడనుకదా.

తా. మాటలలో నేర్పరి వైన ఓ రామా ! ఇది ఒక్కడే చేసిన యుద్ధము. ఇద్దరు చేసినది కాదు, ఇక్కడ పెద్దసైన్యము వచ్చిన గుర్తు లేపీ కనబడుటలేదు కదా.

మూ. నైకస్య తు కృతే లోకాన్ వినాశయితుమర్హసి, 9
యుక్తదణ్డా హి మృదవః ప్రశాన్తా వసుధాధిపాః.

ప్ర. అ. ఏకస్య కృతే = ఒక్కని నిమిత్తమై, లోకాన్ = లోకములను, వినాశయితుమ్ = నశింపచేయుటకు, నార్హసి = తగవు. హి = ఎందుచేతననగా, వసుధాధిపాః = రాజులు, యుక్తదణ్డాః = తగు దండము విధించువారు, మృదవః = దయ గలవారు, ప్రశాన్తాః = శాంతచిత్తము గలవారు.

తా. నీవు ఒక్కనికొరకై అన్ని లోకాలను నశింపచేయుట యుక్తము కాదు. ఎందుచేత ననగా ప్రభువులు తగు దండమునే విధించుచు, దయ గలవారై, ప్రశాంతచిత్తులై ఉందురు కదా. 9

మూ. సదా త్వం సర్వభూతానాం శరణ్యః పరమా గతిః 10
కో ను దారప్రణాశం తే సాధు మన్యేత రాఘవ.

ప్ర. అ. త్వమ్ = నీవు, సర్వభూతానామ్ = సకలప్రాణులకు, సదా = ఎల్లప్పుడు, శరణ్యః = రక్షకుడవైన, పరమా గతిః = ఉత్తమమైన గతివి కదా. రాఘవ = రామా ! తే = నీయొక్క, దారప్రణాశమ్ = భార్యయొక్క నాశమును, కో ను = ఎవడు, సాధు = మంచిదానినిగా, మన్యేత = తలచును ?

తా. రామా ! నీవు, ఎల్లప్పుడు సకలప్రాణులకు రక్షకుడవు. నీవే వాళ్లకు ఉత్తమమైన గతివి. నీ భార్య నశించుట మంచిదే అని ఎవడు అనుకొనును ? 10

మూ. సరితః సాగరాః శైలా దేవగన్ధర్వదానవాః, 11
నాలం తే విప్రియం కర్తుం దీక్షితస్యేవ సాధవః.

ప్ర. అ. సరితః = నదులు, సాగరాః = సముద్రములు, శైలాః = పర్వతములు, దేవగన్ధర్వదానవాః = దేవతలు, గంధర్వులు, దానవులు. తే = నీకు, సాధవః = సత్పురుషులు, దీక్షితస్యేవ = యజ్ఞదీక్ష గ్రహించినవానికి వలె, విప్రియమ్ = అపకారమును, కర్తుమ్ = చేయుటకు, నాలమ్ = సమర్థులు కారు.

తా. యజ్ఞదీక్ష గ్రహించినవానికి సత్పురుషులు ఎట్లు అపకారము తల పెట్టరో అట్లే నీకు నదులు గాని, సముద్రములు గాని, శైలములు గాని, దేవతలు గాని, గంధర్వులు గాని, దానవులు గాని అపకారము చేయజాలరు.

మూ. యేన రాజన్ హృతా సీతా తమన్వేషితుమర్హసి, 12
మద్ద్వితీయో ధనుష్పాణిః సహాయైః పరమర్షిభిః.

ప్ర. అ. రాజన్ = రాజా, ధనుష్పాణిః = ధనస్సుహస్తమునందు కలవాడవై, మద్ద్వితీయః = నేను సహాయుడను కలవాడవై, సహాయైః = సహాయులైన, పరమర్షిభిః = మహర్షులతో కూడినవాడవై, సీతా = సీత, యేన = ఎవనిచేత, హృతా = హరించబడినదో, తమ్ = వానిని, అన్వేషితుమ్ = వెదకుటకు, అర్హసి = తగి ఉన్నావు.

తా. రాజా ! నీవు ధనస్సు ధరించి, నా సాహాయ్యముతోను, మహర్షుల సాహాయ్యముతోను, ఎవడు సీతను హరించినాడో వానికొరకు వెదకుము. 12

మూ. సముద్రం చ విచేష్యామః పర్వతాంశ్చ వనాని చ, 13
గుహాశ్చ వివిధా ఘోరా నదీః పద్మవనాని చ.

ప్ర. అ. సముద్రం చ = సముద్రమును, పర్వతాంశ్చ = పర్వతములను, వనాని చ = వనములను, వివిధాః = అనేకవిధములైన, ఘోరాః = భయంకరములైన, గుహాశ్చ = గుహలను, నదీః = నదులను, పద్మవనాని చ = పద్మవనములను, విచేష్యామః = వెదకెదము.

తా. సముద్రములోను, పర్వతములలోను, వనములలోను, భయంకరములైన అనేకవిధములైన గుహలలోను, నదులలోను, పద్మవనములలోను వెదకెదము. 13

మూ. దేవగన్ధర్వలోకాంశ్చ విచేష్యామః సమాహితాః, 14
యావన్నాధిగమిష్యామ స్తవ భార్యాపహారిణమ్.

ప్ర. అ. సమాహితాః = సావధానచిత్తులమై, తవ = నీయొక్క, భార్యాపహారిణమ్ = భార్యను అపహరించినవానిని, యావత్ = ఎంతవరకు, నాధిగమిష్యామః = పొందమో అంతవరకు, దేవగన్ధర్వలోకాంశ్చ = దేవలోకములను, గంధర్వలోకములను, విచేష్యామః = వెదకెదము.

తా. నీ భార్యను అపహరించినవాడు ఎంతవరకు దొరకడో అంతవరకు (దొరికేటంతవరకు) దేవలోకములోను గంధర్వలోకములోను, సావధానమైన చిత్తముతో వెదకెదము. 14

మూ. న చేత్సామ్నా ప్రదాస్యన్తి పత్నీం తే త్రిదశేశ్వరాః, 15
కోసలేన్ద్ర తతః పశ్చాత్ప్రాప్తకాలం కరిష్యసి.

ప్ర. అ. కోసలేన్ద్ర = కోసలదేశరాజా ! త్రిదశేశ్వరాః = దేవతలు, తే = నీయొక్క, పత్నీమ్ = భార్యను, సామ్నా = సామోపాయముచేత, న ప్రదాస్యన్తి చేత్ = ఇవ్వకపోయినట్లయితే, తతః పశ్చాత్ = అటు పిమ్మట, ప్రాప్తకాలమ్ = ఆ సమయమునకు యుక్తమైనదానిని, కరిష్యసి = చేయగలవు.

తా. కోసలాధీశుడవైన రామా ! దేవతలు, సామోపాయముచేత నీ భార్యను తిరిగి ఇవ్వనిచో అటు పిమ్మట ఏమి చేయవలెనో అది చేయవచ్చును.

మూ. శీలేన సామ్నా వినయేన సీతాం
నయేన న ప్రాప్స్యసి చేన్నరేన్ద్ర,
తతః సముత్సాదయ హేమపుఙ్ఖై
ర్మహేన్ద్రవజ్రప్రతిమైః శరౌఘైః. 16

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
పఞ్చషష్టితమః సర్గః.

ప్ర. అ. నరేన్ద్ర = రాజా, శీలేన = సదాచారముచేత, సామ్నా = సామోపాయముచేత, వినయేన = వినయముచేత, నయేన = నీతిమార్గముచేత, సీతామ్ =

సీతను, న ప్రాప్స్యసి యది = పొందకపోయినట్లయితే, తతః = అటుపిమ్మట, హేమపుఙ్ఖైః = బంగారు పొన్నులు గల, మహేన్ద్రవజ్రప్రతిమైః = మహేంద్రుని వజ్రాయుధముతో సమానములైన, శరౌఘైః = బాణసముదాయములచేత, సముత్సాదయ = నశింపచేయుము.

తా. రామా! నీ సదాచారముచేత, సామోపాయముచేత, వినయముచేత, నీతిమార్గముచేత నీకు సీత లభించకపోయినచో అటు పిమ్మట, బంగారుపొన్నులు గల, ఇంద్రుని వజ్రాయుధముతో సమానములైన బాణముల సముదాయములు ప్రయోగించి సంహరించుము. 16

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో అరువదియైదవ సర్గ సమాప్తము.

అథ షట్షష్టితమః సర్గః

[లక్ష్మణుడు రామునకు బోధించుట]

మూ. తం తథా శోకసంతప్తం విలపన్తమనాథవత్
మోహేన మహతావిష్టం పరిద్యూనమచేతనమ్. 1

తతః సౌమిత్రిరాశ్వాస్య ముహూర్తాదివ లక్ష్మణః
రామం సంబోధయామాస చరణౌ చాభిపీడయన్. 2

ప్ర. అ. తతః = అటు పిమ్మట, సౌమిత్రిః = సుమిత్ర కుమారుడైన, లక్ష్మణః = లక్ష్మణుడు, తథా = అట్లు, శోకసంతప్తమ్ = శోకముచేత తపింప చేయబడినవాడు, అనాథవత్ = అనాథుడు వలె, విలపన్తమ్ = విలపించుచున్న వాడు, మహతా = గొప్పదైన, మోహేన = మోహముచేత, ఆవిష్టమ్ = వ్యాపింప బడినవాడు, పరిద్యూనమ్ = క్షీణించినవాడు, అచేతనమ్ = అస్వస్థమైన చిత్తము గలవాడు అయిన, తం రామమ్ = ఆ రాముణ్ణి, ముహూర్తాదివ = ముహూర్త కాలము, ఆశ్వాస్య = ఓదార్చి, చరణౌ చ, = పాదములను, పీడయన్ = స్పృశించుచు, సంబోధయామాస = బోధించెను.

తా. రాముడు శోకముచేత తాపము చెంది అనాథుడు వలె విలపించు చుండెను. అధికమైన మోహము చెంది, క్షీణించి మనఃస్థైర్యము లేక ఉండెను. సుమిత్రాకుమారుడైన లక్ష్మణుడు అట్టి రాముని క్షణకాలముపాటు ఓదార్చి, పాదములు స్పృశించి నమస్కరించుచు, ఇట్లు బోధించెను. 1, 2

మూ. మహతా తపసా రామ మహతా చాపి కర్మణా,
రాజ్ఞా దశరథేనాసి లబ్ధోఽమృతమివామరైః. 3

ప్ర. అ. రామ = రామా ! రాజ్ఞా = రాజైన, దశరథేన = దశరథునిచేత, మహతా = గొప్ప, తపసా = తపస్సుచేతను, మహతా = గొప్ప, కర్మణాచాపి =

కర్మచేతను, అమరైః=దేవతలచేత, అమృతమివ=అమృతము వలె, లబ్ధః అసి=పొందబడినావు.

తా. రామా! దశరథమహారాజు గొప్ప తపస్సు చేసి, గొప్ప కర్మ చేసి, దేవతలు అమృతమును పొంది నట్లు నిన్ను పొందినాడు. 3

మూ. తవ చైవ గుణైర్బద్ధస్త్వద్వియోగాన్మహీపతిః,
రాజా దేవత్వమాపన్నో భరతస్య యథాశ్రుతమ్. 4

ప్ర. అ. భరతస్య=భరతునినుండి, యథా=ఎట్లు, శ్రుతమ్=వినబడినదో, మహీపతిః=భూమికి ప్రభువైన, రాజా=దశరథమహారాజు, తవ=నీయొక్క, గుణైః=గుణములచేత, బద్ధః=కట్టబడినవాడై, త్వద్వియోగాత్=నీ వియోగమువలన, దేవత్వమ్=దేవత్వమును, అపన్నః=పొందినాడు.

తా. నీ గుణములచేత ఆకర్షింపబడి నీయందు అధికప్రేమ గల ఆ దశరథమహారాజు భరతుడు మనకు తెలిపి నట్లు, నీ వియోగమువలన స్వర్గస్థుడైనాడు. 4

మూ. యది దుఃఖమిదం ప్రాప్తం కాకుత్స్థ న సహిష్యసే,
ప్రాకృతశ్చాల్పసత్త్వశ్చ ఇతరః కః సహిష్యతి. 5

ప్ర. అ. కాకుత్స్థ=రామా! ప్రాప్తమ్=ప్రాప్తించిన, ఇదం దుఃఖమ్=ఈ దుఃఖమును, న సహిష్యసే యది=నీవు సహించకపోయినచో, ప్రాకృతః=సాధారణుడు, అల్పసత్త్వశ్చ=అల్పమైన ధైర్యము కలవాడు అయిన, ఇతరః=ఇతరుడు, కః=ఎవడు, సహిష్యతి=సహించగలడు?

తా. రామా! ఈ విధముగా సంప్రాప్తించిన కష్టమును నీవే సహించకపోయినచో, అల్పశక్తి గల సామాన్యుడైన ఇతరు డెవ్వడు సహించగలడు? 5

మూ. దుఃఖితో హి భవాన్ లోకాంస్తేజసా యది ధక్ష్యతే,
ఆర్తాః ప్రజా నరవ్యాఘ్ర క్వ ను యాస్యన్తి నిర్వృతిమ్.. 6

ప్ర. అ. నరవ్యాఘ్ర=నరులలో శ్రేష్ఠుడవైన ఓ రామా! దుఃఖితః=దుఃఖితుడవైన, భవాన్=నీవు, తేజసా=తేజస్సుచేత, లోకాన్=లోకములను,

ధక్ష్యతే యది = కాల్చబోయినట్లయితే, ఆర్తాః = పీడితులైన, ప్రజాః = ప్రజలు, క్వ = ఎక్కడ, నిర్వృతిమ్ = సుఖమును, యాస్యన్తి = పొందగలరు.

తా. రామా! దుఃఖములో ఉన్న నీవు నీ తేజస్సుచేత లోకాలను దహించి నట్లయితే పీడితులైన ప్రజలు ఎక్కడ సుఖము పొందగలరు? 6

మూ. లోకస్వభావ ఏవైష యయాతిర్నహుషాత్మజః,
గతః శక్రేణ సాలోక్యమనయస్తం సమస్పృశత్. 7

ప్ర. అ. ఏషః = ఇది, లోకస్వభావః ఏవ = లోకముయొక్క స్వభావమే. నహుషాత్మజః = నహుషుని కుమారుడైన, యయాతిః = యయాతి, శక్రేణ = దేవేంద్రునితో, సాలోక్యమ్ = ఒకే లోకములో ఉండుటను, గతః = పొందెను. అనయః = దుఃఖము, తమ్ = అతనిని, సమస్పృశత్ = స్పృశించెను.

తా. నహుషుని కుమారుడైన యయాతి దేవేంద్రునితో సాలోక్యమును పొందెను. అయినను అతనికి దుఃఖము తప్పలేదు. లోకస్వభావము ఇంతే.

వి. స్వర్గములోకమునకు వెళ్ళిన యయాతి దేవేంద్రునితో తాను చేసిన యజ్ఞాదిపుణ్య కార్యములను గూర్చి గొప్పగా చెప్పుకొనగా అపుడు దేవేంద్రుడు "ఆత్మస్తుతి చేసికొన్న పాపాత్ముడవు; స్వర్గములో ఉండ దగవు" అని చెప్పి అతనిని స్వర్గమునుండి పడద్రోసినాడను కథ ఇక్కడ నిర్దేశింపబడినది. 7

మూ. మహర్షిర్యో వసిష్ఠస్తు యః పితుర్నః పురోహితః,
అహ్నా పుత్రశతం జజ్ఞే తథైవాస్య పునర్హతమ్, 8

ప్ర. అ. మహర్షిః = మహర్షియైన, యః = ఏ, వసిష్ఠః = వసిష్ఠుడు కలడో, యః = ఏ మహర్షి, నః పితుః = మన తండ్రియొక్క, పురోహితః = పురోహితుడో, అస్య = ఈతనికి, అహ్నా = ఒక్కదివసమునందు, పుత్రశతమ్ = పుత్రులు శతము, జజ్ఞే = పుట్టెను. పునః = మరల, తథైవ = అట్లే, హతమ్ = చంపబడెను.

తా. మన తండ్రిగారి పురోహితుడైన వసిష్ఠమహర్షికి ఒకే దినమునందు నూరుగురు పుత్రులు జనించిరి. వారందరు ఒకే దివసమున విశ్వామిత్రహతులై మరణించిరి. 8

మూ. యా చేయం జగతాం మాతా దేవీ లోకనమస్కృతా,
అస్యాశ్చ చలనం భూమేర్దృశ్యతే సత్యసంశ్రవ. 9

ప్ర. అ.. సత్యసంశ్రవ = సత్యమైన ప్రతిజ్ఞ కలవాడా ! జగతామ్ = జగత్తులకు, మాతా = తల్లి, లోకనమస్కృతా=లోకములచేత నమస్కరింపబడినది, యాఇయమ్ = ఏఈ, దేవీ = దేవిగలరో, అస్యాః = ఈ, భూమేః = భూదేవికి కూడ, చలనమ్ = చలనము, దృశ్యతే = చూడబడుచున్నది.

తా. సత్యమైన ప్రతిజ్ఞ గల రామా ! జగత్తులకు తల్లి, లోకములచేత నమస్కరింపబడేది అయిన భూదేవికి కూడ అప్పుడప్పుడు చలనము కనబడుచున్నది. 9

మూ. యౌ ధర్మౌ జగతాం నేత్రౌ యత్ర సర్వం ప్రతిష్ఠితమ్,
ఆదిత్యచన్ద్రౌ గ్రహణమభ్యుపేతౌ మహాబలౌ. 10

ప్ర. అ. యౌ=ఏ సూర్యచంద్రులు, ధర్మౌ=ధర్మస్వరూపులో, జగతామ్ = జగత్తులకు, నేత్రౌ = నేత్రములో, యత్ర = ఎవరియందు, సర్వమ్=అంతా, ప్రతిష్ఠితమ్ = ప్రతిష్ఠింపబడి యున్నదో, మహాబలౌ = మహాబలవంతులైన, ఆదిత్యచన్ద్రౌ = సూర్యచంద్రులు కూడ, గ్రహణమ్=గ్రహణమును, అభ్యుపేతౌ = పొందిరి.

తా. ధర్మస్వరూపులు, లోకములకు నేత్రములైనవారు, జగత్తు కంతకీ ఆధారభూతులూ, మహాబలశాలులూ అయిన సూర్యచంద్రులు కూడ అప్పుడప్పుడు గ్రహణము పొందుచున్నారు. 10

మూ. సుమహాన్త్యపి భూతాని దేవాశ్చ పురుషర్షభ,
న దైవస్య ప్రముఞ్చన్తి సర్వభూతాని దేహినః. 11

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా ! సుమహాన్తి = చాల గొప్పవైన, భూతాని=భూతములైనను, దేవాశ్చ=దేవతలు, సర్వభూతాని=సమస్తప్రాణులు, దేహినః = దేహధారులు, దైవస్య = దైవముయొక్క శక్తిని, నప్రముఞ్చన్తి = విడువరు.

తా. పురుషశ్రేష్ఠుడా ! చాల గొప్ప భూతములైనను (పృథివ్యాదిభూతము

రైనను), దేవతలైనను, ఏ ప్రాణులూ, ఏ దేహధారులూ కూడ దైవశక్తినుండి విడిపించుకొనజాలరు.

వి. ఈ శ్లోకం ప్రాచ్యపాఠంలో లేదు. 'భూతాని' అనేది రెండుసార్లు, "దేహినః"అనే శబ్దము ప్రయోగించుటచేత అన్వయం సరిగా లేదు. "సర్వభూతాది దేహినః" అనే పాఠం కూడ సంతృప్తికరంగా లేదు. 11

మూ. శక్రాదిష్వపి దేవేషు వర్తమానౌ నయానయౌ,
శ్రూయేతే నరశార్దూల న త్వం శోచితుమర్హసి. 12

ప్ర. అ. నరశార్దూల=నరశ్రేష్ఠుడా ! శక్రాదిషు=దేవేంద్రుడు మొదలైన, దేవేషు = దేవతలలో కూడ, నయానయౌ = మంచి నీతి చెడ్డ నీతి అనునవి, వర్తమానౌ = ఉన్నవిగా, శ్రూయేతే = వినబడుచున్నవి. త్వమ్ = నీవు, శోచితుమ్= దుఃఖించుటకు, నార్హసి = తగవు.

తా. ఓః నరశ్రేష్ఠుడా ! ఇంద్రుడు మొదలైన దేవతలలో కూడ నీతి, దుర్నీతి ఉన్నట్లు వినుచున్నాము కదా. అందుచేత నీవు దుఃఖించవలదు. 12

మూ. నష్టాయామపి వైదేహ్యాం హృతాయామపి చానఘ,
శోచితుం నార్హసే వీర యథాన్యః ప్రాకృతస్తథా. 13

ప్ర. అ. అనఘ = దోషములులేనివాడా ! వీర = వీరుడా ! వైదేహ్యామ్= సీత, నష్టాయామపి=నశించినను, హృతాయామపి=హరించబడినను, ప్రాకృతః = సామాన్యుడైన, అన్యః యథా = ఇతరమానవుడు వలె, శోచితుమ్ = దుఃఖించుటకు, నార్హసి = తగవు.

తా. ఏ దోషములు లేని వీరుడా ! సీత నశించినా, ఆమెను ఎవరైన అవహరించినా కూడ నీవు సామాన్యుడైన ఇతరమానవుడు వలె దుఃఖించకూడదు.

మూ. త్వద్విధా న హి శోచన్తి సతతం సత్యదర్శినః,
సుమహత్స్వపి కృచ్ఛ్రేషు రామానిర్వణ్ణదర్శనాః. 14

ప్ర. అ. రామ = రామా ! సతతమ్ = ఎల్లప్పుడు, సత్యదర్శినః = సత్యమును చూచేవారు, అనిర్విణ్ణదర్శినః = నిర్వేదము చెందని జ్ఞానము కలవారు

అయిన, త్వద్విధాః=నీవంటివారు, సుమహత్సు=చాల గొప్పవైన, కృచ్ఛ్రేష్వపి = కష్టములందు కూడ, న శోచన్తి హి = దుఃఖించరు కదా.

తా. రామా! ఎల్లప్పుడు సత్యమునే చూచేవారు, పొరబాటులేని ఆలోచనలు కలవారు అయిన నీవంటివారు ఎన్ని పెద్ద కష్టములు వచ్చినను దుఃఖించరు కదా. 14

మూ. తత్త్వతో హి నరశ్రేష్ఠ బుద్ధ్యా సమనుచిన్తయ,
బుద్ధ్యా యుక్తా మహాప్రాజ్ఞా విజానన్తి శుభాశుభే. 15

ప్ర. అ. నరశ్రేష్ఠ = నరులలో శ్రేష్ఠుడా! తత్త్వతః = యథార్థముగా (యథార్థస్థితిని గూర్చి), బుద్ధ్యా = బుద్ధితో, సమనుచిన్తయ = ఆలోచించుము. మహాప్రాజ్ఞాః = గొప్ప బుద్ధి కలవారు, బుద్ధ్యా=బుద్ధితో, యుక్తాః=కూడినవారై, శుభాశుభే = మంచిచెడ్డలను, విజానన్తి = తెలుసుకొందురు.

తా. నరులలో శ్రేష్ఠుడవైన ఓ! రామా! యథార్థస్థితిని గూర్చి నీ బుద్ధితో ఆలోచించుము. ఓ! మహాబుద్ధిశాలీ! బుద్ధితో ఆలోచించువారు మంచిచెడ్డలను తెలుసుకొనగలుగుదురు. 15

మూ. అదృష్టగుణదోషాణామధ్రువాణాం తు కర్మణామ్,
నాన్తరేణ క్రియాం తేషాం ఫలమిష్టం ప్రవర్తతే. 16

ప్ర. అ. అదృష్టగుణదోషాణామ్ = చూడబడని గుణదోషములు గలవి. అధ్రువాణామ్ = అస్థిరములు అయిన, తేషామ్=ఆ, కర్మణామ్=కర్మలయొక్క, ఇష్టమ్ = ఇష్టమైన, ఫలమ్ = ఫలము, క్రియామ్ అన్తరేణ=ప్రయత్నము లేకుండగా, న ప్రవర్తతే = ప్రవర్తించదు.

తా. కర్మల గుణదోషములు మనము చూడజాలము. అనగా అవి సుఖమును ఇచ్చునో దుఃఖమును ఇచ్చునో తెలుసుకొనజాలము. అవి అస్థిరములు. ఎందుచేత ననగా ఏ కర్మయైనా అది పూర్తి అయిపోగానే నశించును కదా. అట్టి కర్మలను పూర్వజన్మలో ఆచరించి ఉండకపోయినచో వాటి ఫలము ఇప్పుడు లభించదు. అనగా ఇపుడు లభించుచున్న ఫలమును బట్టి పూర్వకర్మను ఊహించుకొనవలసి ఉండును. కర్మఫలానుభవము తప్పదు గాన విచారించి ప్రయోజనము

లేదు. ఇది గోవిందరాజులు చెప్పిన భావము. ఆయన "అధ్రువాణామ్''కు బదులు ''అధృతానామ్" అను పాఠము గ్రహించి "అనిశ్చితములు'' అని అర్థము చెప్పినారు.

చూడబడని గుణదోషములు గల, అస్థిరములైన (''అధ్రువాణామ్''అని వారి పాఠము)కర్మల నిష్పత్తి మానవుడు చేసిన కాని జరుగదు. వాటివలన ఇష్టఫలము, (''ప్రవర్తతే''కు బదులు ''చ వర్తతే"అను పాఠముండుటచేత, చ = అనిష్టఫలముకూడ) కలుగును"అని తిలకవ్యాఖ్యానము. భావము రెండు వ్యాఖ్యలలోను సమానమే.

కాని ''అదృష్టగుణదోషాణామ్'' ఇత్యాదిపూర్వార్ధమును 15వ శ్లోకములోని ''బుద్ధ్యా యుక్తాః" ఇత్యాది ఉత్తరార్ధముతో కలిపి అన్వయించిన బాగుండును. అప్పుడు- ''మహాప్రాజ్ఞాః=గొప్ప బుద్ధి గలవారు, బుద్ధ్యాయుక్తాః=బుద్ధితో కూడినవారై, అనగా వివేకవంతులై, అదృష్టగుణదోషాణామ్ = చూడబడనిగుణదోషములు గల, అధ్రువాణామ్ = అస్థిరములైన, కర్మణామ్ = కర్మలయొక్క, శుభాశుభే = మంచి చెడులను, విజానన్తి = తెలుసుకొనుచున్నారు"అని అర్థము. "క్రియ లేకుండా, అనగా పురుషప్రయత్నము లేకుండా కర్మల ఇష్టఫలము లభించదు'' అని 16వ శ్లోకం ఉత్తరార్థానికి అర్థము. అందుచేత నీవు ప్రయత్నము చేసి సీతను సంపాదించుటకై ప్రయత్నించుము అని దీని భావము.

ప్రాచ్యపాఠము మరొక విధముగా ఉన్నది.

''అదృష్టగుణదోషాణాం కర్మస్వభిరతాత్మనామ్,
నాన్తరేణ క్రియాం వీర' ఫలమిష్టం ప్రవర్తతే."

''ఓ! వీరుడా ! గుణదోషములు తెలియనివారు, కర్మలయందు ఆసక్తి కలవారు అయిన జనులకు, ప్రయత్నము చేయకుండా ఇష్టపలము లభించదు"అని దాని భావము. 16

మూ. త్వమేవ హి పురా రామ మామేవం బహుశోఽన్వశాః,
అనుశిష్యాద్ధి కో ను త్వామపి సాక్షాద్బృహస్పతిః. 17

ప్ర. అ. రామ = రామా ! పురా = పూర్వము, త్వమేవ = నీవే, మామ్ = నన్ను, ఏవమ్ = ఇటు, బహుశః = అనేకపర్యాయములు, అన్వశాః హి = శిక్షిం

చితివి (బోధించితివి)కదా? సాక్షాత్ = సాక్షాత్తు, బృహస్పతిరపి = బృహస్పతియే యైనను, కో ను = ఎవడు, త్వామ్ = నిన్ను, అనుశిష్యాత్ హి = బోధించును ?

తా. రామా ! పూర్వము నీవే అనేకపర్యాయములు నాకు బోధించితివి కదా? సాక్షాత్తు బృహస్పతి యైనను ఎవడు నీకు బోధించగలడు ? 17

మూ. బుద్ధిశ్చ తే మహాప్రాజ్ఞ దేవైరపి దురన్వయా,
శోకేనాభిప్రసుప్తం తే జ్ఞానం సంబోధయామ్యహమ్. 18

ప్ర. అ. మహాప్రాజ్ఞ=గొప్ప బుద్ధి కలవాడా ! తే బుద్ధిః=నీ బుద్ధి, దేవైరపి = దేవతలచేత కూడ, దురన్వయా = గ్రహింప శక్యము కానిది. శోకేన = శోకముచేత, అభిప్రసుప్తమ్=నిద్రించిన, తే జ్ఞానమ్ = నీ జ్ఞానమును, అహమ్= నేను, సంబోధయామి = మేల్కొలుపుచున్నాను.

తా. గొప్ప బుద్ధి గలవాడా ! నీ బుద్ధిని దేవతలు కూడ తెలిసికొనజాలరు. నేను కేవలము శోకముచేత అణగి ఉన్న నీ జ్ఞానమును మేల్కొలుపుచున్నాను.

మూ. దివ్యం చ మానుషం చ త్వమాత్మనశ్చ పరాక్రమమ్,
ఇక్ష్వాకువృషభావేక్ష్య యతస్వ ద్విషతాం వధే. 19

ప్ర. అ. ఇక్ష్వాకువృషభ=ఇక్ష్వాకువంశీయులలో శ్రేష్ఠుడా ! త్వమ్=నీవు, దివ్యమ్ = దివ్యము, మానుషం చ = మనుష్యులకు సంబంధించినది అయిన, ఆత్మనః = నీయొక్క, పరాక్రమమ్ = పరాక్రమమును, అవేక్ష్య = చూచి, ద్విషతామ్ = శత్రువులయొక్క, వధే = వధయందు. యతస్వ = ప్రయత్నించుము.

తా. రామా ! నీకు దేవతలలో ఉండే (దివ్యమైన) పరాక్రమము. మానవులలో ఉండే పరాక్రమమూ కూడ ఉన్నది. అట్టి పరాక్రమమును గుర్తు ఉంచుకొని శత్రువులను సంహరించుటకు ప్రయత్నించుము.

వి. ''దివ్యంచ మానుషం చాస్త్రమాత్మనశ్చ పరాక్రమమ్''అను ప్రాచ్య పాఠము బాగున్నది. ''నీవద్ద దేవతలకుమాత్రమే తెలిసిన అస్త్రాలు, మానవులకు తెలిసే అస్త్రాలు కూడ ఉన్నవి. అట్టి రెండు విధాలైన అస్త్రాలను, నీ సహజపరాక్రమమును చూచుకొని శత్రుసంహారముకొరకు ప్రయత్నము చేయుము''అని

మూ. కిం తేన సర్వనాశేన కృతేన పురుషర్షభ,
తమేవ త్వం రిపుం పాపం విజ్ఞాయోద్ధర్తుమర్హసి. 20

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకియే ఆదికావ్యే అరణ్యకాణ్డే
షట్షష్టితమః సర్గః.

ప్ర. అ. పురుషర్షభ = ఓ! పురుషశ్రేష్ఠుడా ! కృతేన = చేయబడిన, తేన = ఆ, సర్వనాశేన = సర్వనాశముచేత, కిమ్ = ఏమి ప్రయోజనము? త్వమ్ = నీవు, పాపమ్ = పాపాత్ముడైన, తం రిపుమ్ ఏవ = ఆ శత్రువునే, విజ్ఞాయ = తెలిసికొని, ఉద్ధర్తుమ్ = పెకలించివేయుటకు, అర్హసి = తగియున్నావు.

తా. రామా! సర్వనాశము చేయుటవలన ఏమి ప్రయోజనము? పాపాత్ముడైన ఆ శత్రువు ఎవడో తెలిసికొని వానినే నశింపచేయుము. 20

"బాలానందిని" యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
అరణ్యకాండలో అరువదిఆరవ సర్గ సమాప్తము.

అథ సప్తషష్టితమః సర్గః

[*రామలక్ష్మణులు జటాయువును చూచుట; రాముడు జటాయువును కౌగలించుకొని విలపించుట*].

మూ. పూర్వజో౽ప్యుక్తమాత్రస్తు లక్ష్మణేన సుభాషితమ్,
సారగ్రాహీ మహాసారం ప్రతిజగ్రాహ రాఘవః. 1

ప్ర. అ. సారగ్రాహీ = సారమును గ్రహించు, రాఘవః = రాముడు, పూర్వజో౽పి = అన్నగారే అయినా, లక్ష్మణేన = లక్ష్మణునిచేత, ఉక్తమాత్రః తు = చెప్పబడగానే, మహాసారమ్ = గొప్ప సారము గల, సుభాషితమ్ = మంచి మాటను, ప్రతిజగ్రాహ = అంగీకరించెను.

తా. రాముడు మాటలలోని సారమును గ్రహించే స్వభావము గలవాడు. అందుచే ఆతడు తాను పెద్దవాడేయైనా, లక్ష్మణుడు చెప్పిన, మంచి సారము గల ఉత్తమమైన వాక్యమును అంగీకరించెను. 1

మూ. సంనిగృహ్య మహాబాహుః ప్రవృత్తం కోపమాత్మనః,
అవష్టభ్య ధనుశ్చిత్రం రామో లక్ష్మణమబ్రవీత్. 2

ప్ర. అ. మహాబాహుః = గొప్ప బాహువులు గల, రామః = రాముడు, ప్రవృత్తమ్ = ప్రవర్తించిన, ఆత్మనః = తనయొక్క, కోపమ్ = కోపమును, సంనిగృహ్య = నిగ్రహించుకొని, చిత్రమ్ = చిత్రమైన, ధనుః = ధనస్సును, అవష్టభ్య = ఆనుకొని, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. గొప్ప బాహువులు గల రాముడు తనకు కలిగిన కోపమును నిగ్రహించుకొని, చిత్రవర్ణములు గల ధనస్సును ఆనుకొని నిలచి, లక్ష్మణునితో ఇట్లు పలికెను. 2

మూ. కిం కరిష్యావహే వత్స క్వ వా గచ్ఛావ లక్ష్మణ,
కేనోపాయేన గచ్ఛేయం సీతామితి విచిన్తయ. 3

ప్ర. అ. వత్స = నాయనా. లక్ష్మణ = లక్ష్మణా! కిమ్ = ఏమి, కరిష్యావహే = చేసెదము? క్వ వా = ఎచటికి, గచ్ఛావ = వెళ్లెదము? సీతామ్ = సీతను, కేన = ఏ, ఉపాయేన = ఉపాయముచేత, గచ్ఛేయమ్ = పొందుదును, ఇతి = అను విషమును, విచిన్తయ = ఆలోచించుము.

తా. నాయనా! లక్ష్మణా! ఇప్పుడు మన మేమి చేసెదము? ఎక్కడికి వెళ్లెదము? సీత ఏ ఉపాయముచేత దొరకునో ఆలోచించుము. 3

మూ. తం తథా పరితాపార్తం లక్ష్మణో రామమబ్రవీత్
ఇమమేవ జనస్థానం త్వమన్వేషితుమర్హసి 4
రాక్షసైర్బహుభిః కీర్ణం నానాద్రుమ లతాయుతమ్.

ప్ర. అ. తథా = అట్లు, పరితాపార్తమ్ = మనస్తాపముచేత పీడితుడైన, తం రామమ్ = ఆ రాముణ్ణి గూర్చి, లక్ష్మణః = లక్ష్మణుడు, అబ్రవీత్ = పలికెను, త్వమ్ = నీవు, బహుభిః = అనేకులైన, రాక్షసైః = రాక్షసులచేత, కీర్ణమ్ = వ్యాప్తమైనది, నానాద్రుమలతాయుతమ్ = అనేకవిధములైన వృక్షములతోను, లతలతోను కూడినది అయిన, ఇమమ్ = ఈ, జనస్థానమేవ = జనస్థానమునే, అన్వేషితుమ్ = వెదకుటకు, అర్హసి = తగి యున్నావు.

తా. ఆ విధముగా మనస్తాపముతో బాధపడుచున్న రామునితో లక్ష్మణుడిట్లు పలికెను, "ఈ జనస్థానములో అనేకులు రాక్షసులు నివసించుచున్నారు. ఇది అనేకములైన వృక్షములతోను, లతలతోను వ్యాప్తమైనది. ఇక్కడనే వెదకుము". 4

మూ. సన్తీహ గిరిదుర్గాణి నిర్దరాః కన్దరాణి చ 5
గుహాశ్చ వివిధా ఘోరా నానామృగగణాకులాః
ఆవాసాః కిన్నరాణాం చ గన్ధర్వభవనాని చ. 6

ప్ర. అ. ఇహ = ఇక్కడ, గిరిదుర్గాణి = పర్వతదుర్గములు, నిర్దరాః = లోయలు, కనరాణి చ = రంధ్రములు, వివిధాః = అనేకవిధములైన, ఘోరాః =

భయంకరమైన, నానామృగగణాకులాః = అనేకవిధములైన మృగముల సముదాయములచేత వ్యాకులములైన, గుహాశ్చ = గుహలు, కిన్నరాణామ్ = కింనరుల యొక్క, ఆవాసాః = నివాసములు, గన్ధర్వభవనాని చ = గంధర్వుల గృహములు, సన్తి = ఉన్నవి.

తా. ఈ జనస్థానమునందు పర్వతదుర్గములు, లోయలు, రంధ్రములు, భయంకరములు, అనేకవిధములైన మృగముల గణములచేత వ్యాకులములు అయిన అనేకవిధములైన గుహలు, కింనరుల నివాసములు, గంధర్వుల భవనములు ఉన్నవి. 5, 6

మూ. తాని యుక్తో మయా సార్ధం త్వమన్వేషితుమర్హసి,
త్వద్విధా బుద్ధిసంపన్నా మహాత్మానో నరర్షభ, 7
ఆపత్సు న ప్రకమ్పన్తే వాయువేగైరివాచలాః.

ప్ర. అ. త్వమ్ = నీవు, యుక్తః = ఉద్యుక్తుడవై, (ఏమరుపాటులేనివాడవై), మయా సార్ధమ్ = నాతో కూడ, తాని = వాటిని, అన్వేషితుమ్ = వెదకుటకు, అర్హసి = తగిఉన్నావు. నరరభ = ఓ! నరశ్రేష్ఠుడా! బుద్ధిసంపన్నాః = బుద్ధిసంపన్నులైన, త్వద్విధాః = నీవంటి, మహాత్మానః = మహాత్ములు, వాయువేగైః = వాయువేగములచేత, అచలాః ఇవ = పర్వతములు వలె, న ప్రకమ్పన్తే = కంపించరు.

తా. నీవు నాతో కలిసి ప్రయత్నపూర్వకముగా ఆ స్థానములను అన్వేషించుము. ఓ! నరశ్రేష్ఠుడా! బుద్ధిసంపన్నులైన నీవంటి మహాత్ములు, వాయువేగమునకు పర్వతములు ఎట్లు చలించవో అట్లే ఆపదలలో చలించరు. 7

మూ. ఇత్యుక్తస్తద్వనం సర్వం విచచార సలక్ష్మణః, 8
క్రుద్ధో రామః శరం ఘోరం సంధాయ ధనుషి క్షురమ్.

ప్ర. అ. క్రుద్ధః = కోపించిన, రామః = రాముడు, ఇతి = ఇట్లు, ఉక్తః = పలకబడినవాడై, సలక్ష్మణః = లక్ష్మణునితో కూడినవాడై, ధనుషి = ధనస్సుమీద, ఘోరమ్ = భయంకరమైన, క్షురం శరమ్ = అర్ధచంద్రబాణమును,

సంధాయ = సంధించి, సర్వమ్ = సమస్తమైన, తత్ వనమ్ = ఆ వనమును, విచచార = సంచరించెను.

తా. క్రుద్ధుడైన రాముడు ఆ మాటలు విని, లక్ష్మణసమేతుడై, ధనస్సుపై భయంకరమైన అర్ధచంద్రబాణము సంధించి ఆ వనమునంతా వెదకెను. 8

మూ. తతః పర్వతకూటాభం మహాభాగం ద్విజోత్తమమ్, 9
దదర్శ పతితం భూమౌ క్షతజార్ద్రం జటాయుషమ్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, పర్వతకూటాభమ్ = పర్వతశిఖరముతో సమానుడు, మహాభాగమ్ = మహాభాగ్యవంతుడు, ద్విజోత్తమమ్ = పక్షులలో ఉత్తముడు, భూమౌ = భూమియందు, పతితమ్ = పడి యున్నవాడు, క్షతజార్ద్రమ్ = రక్తముచేత తడిసిన వాడు అయిన, జటాయుషమ్ = జటాయువును, దదర్శ = చూచెను.

తా. పిమ్మట రాముడు మహాభాగ్యవంతుడు, పక్షులలో ఉత్తముడూ అయిన జటాయువును చూచెను. పర్వతశిఖరము వలె ఉన్న ఆతడు రక్తముతో తడిసి నేలపై పడి యుండెను. 9

మూ. తం దృష్ట్వా గిరిశృఙ్గాభం రామో లక్ష్మణమబ్రవీత్, 10
అనేన సీతా వైదేహీ భక్షితా నాత్ర సంశయః.

ప్ర. అ. గిరిశృఙ్గాభమ్ = పర్వతశిఖరము వంటి కాంతి గల, తమ్ = ఆ జటాయువును, దృష్ట్వా = చూచి, రామః = రాముడు, లక్ష్మణమ్=లక్ష్మణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను. అనేన = ఈతనిచేత. వైదేహీ = విదేహరాజు కుమార్తె యైన, సీతా=సీత, భక్షితా=భక్షించబడినది. అత్ర = ఈ విషయము నందు, సంశయః = సంశయము, న = లేదు.

తా. పర్వతశిఖరము వలె ఉన్న ఆతనిని చూచి రాముడు లక్ష్మణునితో ఇట్లు పలికెను. "ఈతడు సీతను భక్షించివేసినాడు. ఈ విషయములో సందేహము లేదు." 10

మూ. గృధ్రరూపమిదం రక్షో వ్యక్తం భవతి కాననే, 11
భక్షయిత్వా విశాలాక్షీమాస్తే సీతాం యథాసుఖమ్,
ఏనం వధిష్యే దీప్తాగ్రైర్ఘోరైర్బాణైరజిహ్మగైః. 12

ప్ర. అ. ఇదమ్ = ఈ, రక్షః = రాక్షసుడు, గృధ్రరూపమ్ = గ్రద్ద రూపము కలవాడై, కాననే = అడవిలో, భవతి = ఉన్నాడు. వ్యక్తమ్=సత్యము. విశాలాక్షీమ్ = విశాలములైన నేత్రములు గల, సీతామ్ = సీతను, భక్షయిత్వా= భక్షించి, యథాసుఖమ్ = సుఖముగా, ఆస్తే = కూర్చున్నాడు, దీప్తాస్యైః=ప్రజ్వలించుచున్న అగ్రభాగములు గల, ఘోరైః=భయంకరములైన, అజిహ్మాగ్రైః= వక్రముగాకాకుండా వెళ్లే, బాణైః = బాణములచేత, ఏనమ్ = వీనిని, వధిష్యే= చంపగలను.

తా. "వీడు గ్రద్దరూపముతో అరణ్యములో నివసించుచున్న రాక్షసుడు. సత్యము. విశాలమైన నేత్రములు గల సీతను భక్షించి సుఖముగా కూర్చున్నాడు. ప్రకాశించుచున్న అగ్రభాగములు గల, భయంకరములైన, వంకర లేకుండా ప్రయాణం చేసే బాణాలతో వీనిని చంపెదను". 11, 12

మూ. ఇత్యుక్త్వాభ్యపతద్గృధ్రం సంధాయ ధనుషి క్షురమ్,
క్రుద్ధో రామః సముద్రాన్తాం కమ్పయన్నివ మేదినీమ్. 13

ప్ర. అ. రామః = రాముడు, ఇతి = ఇట్లు, ఉక్త్వా = పలికి, క్రుద్ధః = కోపించినవాడై, ధనుషి=ధనస్సుపై, క్షురమ్=అర్ధచంద్రబాణమును, సంధాయ= సంధించి, సముద్రాన్తామ్ = సముద్రము కొనలుగా గల, మేదినీమ్ = భూమిని, కమ్పయన్నివ=కంపింపచేయుచున్నవాడు వలె, గృధ్రమ్=ఆ గ్రద్దను గూర్చి, అభ్యపతత్ = తొందరగా వెళ్లెను.

తా. రాముడు ఈ విధముగా పలికి, కోపించినవాడై, ధనస్సుపై అర్ధ చంద్రాకారబాణమును సంధించి, సముద్రమువరకు వ్యాపించి ఉన్న భూమిని కంపింపచేయుచున్నాడా అన్నట్లు ఆ గ్రద్దమీదికి శీఘ్రముగా వెళ్ళెను. 13

మూ. తం దీనం దీనయా వాచా సఫేనం రుధిరం వమన్,
అభ్యభాషత పక్షీ తు రామం దశరథాత్మజమ్. 14

ప్ర. అ. పక్షీ తు = ఆ జటాయువు, సఫేనమ్ = నురుగుతో కూడిన, రుధిరమ్ = రక్తమును, వమన్ = కక్కుచు, దీనమ్ = దీనుడైన, తం = ఆ, దశరథాత్మజమ్ = దశరథకుమారుడైన, రామమ్ = రాముణ్ణి గూర్చి, దీనయా= దీనమైన, వాచా = వాక్కులతో, అభ్యభాషత = పలికెను.

తా. జటాయువు రక్తము, నురుగు కక్కుచు, దీనుడైన ఆ దశరథ కుమారుడైన రామునితో, దీనమైన మాటలతో ఇట్లు పలికెను. 14

మూ. యామోషధిమివాయుష్మన్నన్వేషసి మహావనే,
సా దేవీ మమ చ ప్రాణా రావణేనోభయం హృతమ్. 15

ప్ర. అ. ఆయుష్మన్=ఆయుష్మంతుడవైన రామా! యామ్=ఏ దేవిని, మహావనే= మహావనమునందు, ఓషధిమివ= ఓషధిని వలె, అన్వేషసి=వెదకుచున్నావో, సా దేవీ= ఆ దేవి, మమ= నాయొక్క, ప్రాణాః చ= ప్రాణములు, ఉభయమ్= ఈ ఉభయము కూడ, రావణేన=రావణునిచేత, హృతమ్=హరించబడినది.

తా. ఆయుష్మంతుడవైన రామా! ఏ దేవిని ఈ మహావనములో, ఓషధిని వెదకి నట్లు వెదకుచున్నావో ఆ దేవిని, నా ప్రాణాలను, రెండింటినీ కూడ రావణుడు హరించినాడు. 15

మూ. త్వయా విరహితా దేవీ లక్ష్మణేన చ రాఘవ,
హ్రియమాణా మయా దృష్టా రావణేన బలీయసా. 16

ప్ర. అ. రాఘవ= రామా! త్వయా= నీతోను, లక్ష్మణేన చ= లక్ష్మణునితోను, విరహితా= శూన్యురాలైన, దేవీ=సీత, బలీయసా= బలవంతుడైన, రావణేన= రావణునిచేత, హ్రియమాణా= హరించబడుచున్నదిగా, మయా= నాచేత, దృష్టా= చూడబడినది.

తా. రామా! నీవు, లక్ష్మణుడు దగ్గర లేని సమయములో సీతను బలశాలియైన రావణుడు అపహరించుచుండగా నేను చూచితిని. 16

మూ. సీతామభ్యవపన్నోఽహం రావణశ్చ రణే మయా,
విధ్వంసితరథశ్చాత్ర పాతితో ధరణీతలే. 17

ప్ర. అ. అహమ్= నేను, సీతామ్= సీతను, అభ్యవపన్నః= సమీపించితిని. మయా= నాచేత, రావణశ్చ= రావణుడు కూడ, విధ్వంసితరథః=నశింపచేయబడిన రథము కలవాడై, అత్ర=ఇక్కడ, ధరణీతలే=నేలమీద. పాతితః=

తా॥ నేను వెంటనే సీతను రక్షించుటకు వెళ్ళి రావణుని రథము నశింపచేసి ఆతనిని రథమునుండి నేలమీదకు పడద్రోసితిని. 17

మూ. ఏతదస్య ధనుర్భగ్నమేతదస్య శరావరమ్,
అయమస్య రథో రామ భగ్నః సాంగ్రామికో మయా. 18

ప్ర. అ. రామ = రామా ! ఏతత్ = ఇది, అస్య = ఈ రావణునియొక్క, భగ్నమ్ = విరగగొట్టబడిన, ధనుః = ధనస్సు. ఏతత్ = ఇది. అస్య = ఇతని యొక్క, శరావరమ్ = కవచము, అయమ్ = ఇది. మయా = నాచేత, భగ్నః = విరగగొట్టబడిన, అస్య = ఇతనియొక్క, సాంగ్రామికః = యుద్ధమునకు సంబంధించిన, రథః = రథము.

తా. రామా ! ఇది నేను విరుగగొట్టిన ఆతని ధనస్సు. ఇది కవచము. ఇదే నేను విరగగొట్టిన ఆతని యుద్ధరథము. 18

మూ. అయం తు సారథిస్తస్య మత్పక్షనిహతో యుధి,
పరిశ్రాన్తస్య మే పక్షౌ ఛిత్త్వా ఖడ్గేన రావణః, 19

సీతామాదాయ వైదేహీముత్పపాత విహాయసమ్,
రక్షసా నిహతం పూర్వం న మాం హన్తుం త్వమర్హసి. 20

ప్ర. అ. అయం తు = ఇతడు, యుధి = యుద్ధమునందు, మత్పక్షనిహతః = నా రెక్కలచేత చంపబడిన, తస్య సారథిః = ఆతని సారథి. రావణః = రావణుడు, పరిశ్రాన్తస్య = అలసిఉన్న, మే = నాయొక్క, పక్షౌ = రెక్కలను, ఖడ్గేన = ఖడ్గముచేత, ఛిత్త్వా = ఛేదించి, వైదేహీమ్ = విదేహరాజకుమారియైన, సీతామ్ = సీతను, ఆదాయ = గ్రహించి, విహాయసమ్ = ఆకాశమును గూర్చి, ఉత్పపాత = ఎగిరెను. రక్షసా = రాక్షసునిచేత, పూర్వమ్ = పూర్వమే, నిహతమ్ = చంపబడిన, మామ్ = నన్ను, త్వమ్ = నీవు, హన్తుమ్ = చంపుటకు, నార్హసి = తగవు.

తా. ఇతడు, యుద్ధములో నేను రెక్కలతో చంపి పడవేసిన రావణ సారథి. రావణుడు, అలసి ఉన్న నా రెక్కలు ఖడ్గముచేత ఛేదించి, సీతను గ్రహించి ఆకాశమార్గములోనికి ఎగిరిపోయినాడు. ముందే రాక్షసునిచే చంపబడిన నన్ను నీవు మరల చంపకుము. 19, 20

మూ. రామ స్తస్య తు విజ్ఞాయ బాష్పపూర్ణముఖ స్తదా,
ద్విగుణీకృతతాపార్తః సీతాసక్తాం ప్రియాం కథామ్. 21

ప్ర. అ. తదా = అప్పుడు, రామః = రాముడు, తస్య = ఆతనియొక్క (ఆతనినుండి), సీతాసక్తామ్ = సీతకు సంబంధించిన, ప్రియామ్ = ఇష్టమైన, కథామ్ = కథను, విజ్ఞాయ = తెలిసికొని, బాష్పపూర్ణముఖః = కన్నీటితో నిండిన ముఖముకలవాడై, ద్విగుణీకృతతాపార్తః = రెట్టింపు చేయబడిన తాపముచేత పీడితు డయ్యెను.

తా. రాముడు జటాయువునుండి సీతకు సంబంధించిన ప్రియమైన వార్త విని, కన్నీళ్ళతో నిండిన ముఖము కలవాడై రెట్టింపు చేయబడిన తాపముచేత పీడితుడు అయ్యెను. 21

మూ. గృధ్రరాజం పరిష్వజ్య పరిత్యజ్య మహద్ధనుః,
నిపపాతావశో భూమౌ రురోద సహలక్ష్మణః. 22

ప్ర. అ. మహత్ = గొప్పదైన, ధనుః = ధనస్సును, పరిత్యజ్య = విడచి, గృధ్రరాజమ్ = జటాయువును, పరిష్వజ్య = కౌగలించుకొని, అవశః = వశము తప్పినవాడై; భూమౌ = నేలమీద, నిపపాత = పడెను. సహలక్ష్మణః = లక్ష్మణ సమేతుడై, రురోద = ఏడ్చెను.

తా. రాముడు చేతిలో ఉన్న మహాధనస్సును క్రింద పడవేసి, ఆ జటాయువును కౌగలించుకొని, దుఃఖవివశుడై నేలపై పడెను. ఆ రామలక్ష్మణు లిద్దరు ఏడ్చిరి. 22

మూ. ఏకమేకాయనే దుర్గే నిఃశ్వస న్తం కథంచన,
సమీక్ష్య దుఃఖితతరో రామః సౌమిత్రిమబ్రవీత్. 23

ప్ర. అ. దుర్గే = నడచుటకు అశక్యమైన, ఏకాయనే = ఏకమార్గమునందు (కాలిబాటయందు), ఏకమ్ = ఒంటరిగా, కథంచన = అతికష్టముగా, నిఃశ్వసన్తమ్ = నిట్టూర్పుచున్న ఆ జటాయువును, సమీక్ష్య = చూచి, రామః = రాముడు, దుఃఖితతరః = ఎక్కువ దుఃఖించినవాడై, సౌమిత్రిమ్ = లక్ష్మణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. నడచుటకు కష్టమైన కాలిబాటలో ఒంటరిగా పడి ఉండి అతికష్టముగా ఊపిరి పీల్చుకొనుచున్న ఆ జటాయువును చూచి రాముడు ఇంకా అధికమైన దుఃఖముతో, లక్ష్మణునితో ఇట్లు పలికెను.

వి. "ఏకాయనే కృచ్ఛ్రే"అను పాఠము యుక్తము. "కృచ్ఛ్రే=కష్టమైన, ఏకాయనే= శ్వాసపైకిమాత్రమే ప్రసరించే స్థితియందు"అని అర్థము. ఎగ ఊపిరితో అతికష్టముగా శ్వాస పీల్చుకొనుచున్నాడు అని భావము. ఒక్కరే నడచే కాలిబాటలో పడిఉన్నాడు అనే అర్థం అంతగా ప్రకృతోపయుక్తము కాదు. ఆకాశంలో ఎగిరి యుద్ధం చేస్తూ పడినవాడు ఎక్కడనైనా పడవచ్చు కదా. 23

మూ. రాజ్యం భ్రష్టం వనే వాసః సీతా నష్టా పితా మృతః,
ఈదృశీయం మమాలక్ష్మీర్నిర్దహేదపి పావకమ్. 24

ప్ర. అ. రాజ్యమ్ = రాజ్యము, భ్రష్టమ్ = భ్రష్టమైనది. వనే = వనమునందు, వాసః = నివాసము. సీతా = సీత, నష్టా = కనబడకుండ పోయినది. పితా = తండ్రి, మృతః = మరణించినాడు. 'ద్విజో హతః'అను పాఠమున "ఈ జటాయువు చంపబడినాడు"అని అర్థము. మమ = నాయొక్క, ఈదృశీ = ఇట్టి, అలక్ష్మీః=దౌర్భాగ్యము, పావకమపి=అగ్నిని కూడ, నిర్దహేత్=కాల్చివేయును.

తా. రాజ్యము పోయినది. వనములో నివాసము చేయవలసి వచ్చినది. సీత కనబడకుండా పోయినది. తండ్రి మరణించినాడు. (ఈ జటాయువు చంపబడినాడు). ఈ నా దౌర్భాగ్యము అగ్నిని కూడ కాల్చివేయును. 24

మూ. సంపూర్ణమపి చేదద్య ప్రవిశేయం మహోదధిమ్,
సోఽపి నూనం మమాలక్ష్మ్యా విశుష్యేత్సరితాంపతిః. 25

ప్ర. అ. అద్య = ఇప్పుడు, సంపూర్ణమ్ = జలముతో నిండియున్న, మహోదధిమ్ అపి=మహాసముద్రమునుకూడ, ప్రవిశేయం చేత్=నేను ప్రవేశించినట్లయితే, సః = ఆ, సరితాం పతిః అపి = మహాసముద్రము కూడ, మమ = నాయొక్క, అలక్ష్మ్యా = దౌర్భాగ్యముచేత, విశుష్యేత్ = ఎండిపోవును.

తా. నేను ఇప్పుడు, పూర్తిగా జలముతో నిండి ఉన్న మహాసముద్రములో

ప్రవేశించినచో, దౌర్భాగ్యవంతుడనైన నా స్పర్శ తగలంగానే ఆ మహాసముద్రము కూడ ఎండిపోవును. 25

మూ. నాస్త్యభాగ్యతరో లోకే మత్తోఽస్మిన్ సచరాచరే,
యేనేయం మహతీ ప్రాప్తా మయా వ్యసనవాగురా. 26

ప్ర. అ. యేన మయా = ఏ నాచేత, ఇయమ్ = ఈ, మహతీ = గొప్పదైన, వ్యసనవాగురా = దుఃఖము లనే వల, ప్రాప్తా = పొందబడినదో, మత్తః = అట్టి నాకంటె, అభాగ్యతరః = ఎక్కువ దౌర్భాగ్యవంతుడు, సచరాచరే = జంగమ స్థావరములతో కూడిన, అస్మిన్ = ఈ, లోకే = లోకమునందు, నాస్తి = లేడు.

తా. నేను ఇంత పెద్ద వ్యసనాల వలలో చిక్కుకొని ఉన్నాను. ఈ జంగమస్థావరాత్మకప్రపంచములో నాకంటె ఎక్కువ దౌర్భాగ్యవంతుడు మరొకడెవడూ లేడు. 26

మూ. అయం పితృవయస్యో మే గృధ్రరాజో జరాన్వితః,
శేతే వినిహతో భూమౌ మమ భాగ్యవిపర్యయాత్. 27

ప్ర. అ. మే = నాయొక్క, పితృవయస్యః = తండ్రియొక్క స్నేహితుడు, జరాన్వితః = ముసలితనముతో కూడినవాడు అయిన, అయమ్ = ఈ, గృధ్రరాజః = జటాయువు, మమ = నాయొక్క, భాగ్యవిపర్యయాత్ = అదృష్టముయొక్క వైపరీత్యమువలన, వినిహతః = చంపబడినవాడై, భూమౌ = నేలమీద, శేతే = శయనించిఉన్నాడు.

తా. నా దౌర్భాగ్యమువలననే నా తండ్రిగారి మిత్రుడైన, వృద్ధుడైన ఈ జటాయువు కూడ చంపబడి నేలపై పడి ఉన్నాడు. 27

మూ. ఇత్యేవముక్త్వా బహుశో రాఘవః సహలక్ష్మణః,
జటాయుషం చ పస్పర్శ పితృస్నేహం విదర్శయన్. 28

ప్ర. అ. రాఘవః = రాముడు, ఇత్యేవమ్ = ఇట్లు, బహుశః = అనేకవిధములుగా, ఉక్త్వా = పలికి, సహలక్ష్మణః = లక్ష్మణసహితుడై, పితృస్నేహమ్ = తండ్రియందుండే ప్రేమ వంటి ప్రేమను, విదర్శయన్ = చూపుచు, జటాయుషమ్ = జటాయువును, పస్పర్శ = స్పృశించెను.

తా. రాముడు ఇట్లు అనేకవిధముల విలపించెను. పిదప రామలక్ష్మణులు తండ్రిపై ఎంత ప్రేమ ఉండునో అంత ప్రేమను చూపుచు జటాయువు శరీరమును తడవిరి. 28

మూ. నికృత్తపక్షం రుధిరావసిక్తం
స గృధ్రరాజం పరిరభ్య రాఘః,
క్వ మైథిలీ ప్రాణసమా మమేతి
విముచ్య వాచం నిపపాత భూమౌ. 29

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
సప్తషష్టితమః సర్గః.

ప్ర. అ. సః రామః=ఆ రాముడు, నికృత్తపక్షమ్=ఛేదించబడిన రెక్కలు గలవాడు, రుధిరావసిక్తమ్=రక్తముచేత తడపబడినవాడు అయిన, గృధ్రరాజమ్ = జటాయువును, పరిరభ్య = కౌగలించుకొని, మమ = నాయొక్క, ప్రాణసమా = ప్రాణములతో సమానురాలైన, మైథిలీ = సీత, క్వ = ఎక్కడ, ఇతి = అని, వాచమ్ = వాక్కును, విముచ్య = ఉచ్చరించి, భూమౌ = నేలమీద, నిపపాత = పడెను.

తా. ఆ రాముడు రెక్కలు తెగగొట్టబడుటచే రక్తముతో పూయబడియున్న ఆ జటాయువును కౌగలించుకొని, "నా ప్రాణసమురాలైన సీత ఎక్కడ ఉన్నది"? అని మాత్రము పలికి నేలమీద పడిపోయెను. 29

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో
అరవదిఏడవ సర్గ సమాప్తము.

అథ అష్టషష్టితమః సర్గః

[జటాయువు ప్రాణములు విడచుట. శ్రీరాముడు ఆతనికి దాహ నంస్కారము చేయుట].

మూ. రామః ప్రేక్ష్య తు తం గృధ్రం భువి రౌద్రేణ పాతితమ్,
సౌమిత్రిం మిత్రసంపన్నమిదం వచనమబ్రవీత్. 1

ప్ర. అ. రౌద్రేణ = భయంకరుడైన రావణునిచేత, భువి = నేలమీద, పాతితమ్ = పడగొట్టబడిన, తం గృధ్రమ్ = ఆ జటాయువును, ప్రేక్ష్య = చూచి, రామః = రాముడు, మిత్రసంపన్నమ్ = మంచి మిత్రులతో కూడిన, సౌమిత్రిమ్ = లక్ష్మణుని గూర్చి, ఇదం వచనమ్ = ఈ వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. క్రూరుడైన రావణుడు నేలమీద పడగొట్టిన ఆ జటాయువును చూచి రాముడు మంచి మిత్రసంపద గల సౌమిత్రితో ఇట్లు పలికెను. 1

మూ. మమాయం నూనమర్థేషు యతమానో విహఙ్గమః,
రాక్షసేన హతః సంఖ్యే ప్రాణాం స్త్యక్ష్యతి దుస్త్యజాన్. 2

ప్ర. అ. మమ = నాయొక్క, అర్థేషు = ప్రయోజనములయందు, యతమానః = ప్రయత్నించుచున్న, అయం విహఙ్గమః = ఈ పక్షి, సంఖ్యే = యుద్ధమునందు, రాక్షసేన = రాక్షసునిచేత, హతః = చంపబడినవాడై, దుస్త్యజాన్ = విడువ శక్యముకాని, ప్రాణాన్ = ప్రాణములను, త్యక్ష్యతి = విడువగలడు. నూనమ్ = నిశ్చయము.

తా. ఈ జటాయువు నాకు సాహాయ్యము చేయుటకొరకై ప్రయత్నము చేయుచు యుద్ధములో రాక్షసునిచేత చంపబడినాడు(కొట్టబడినాడు). ఈ విధముగ ఎవ్వరూ విడచుటకు ఇచ్ఛయించని ప్రాణాలను విడువ నున్నాడు. సత్యము. 2

మూ. అతిఖిన్నః శరీరేఽస్మిన్ ప్రాణో లక్ష్మణ విద్యతే,
తథా హి స్వరహీనోఽయం విక్లబః సముదీక్ష్యతే. 3

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! అస్య = ఈతనియొక్క, అస్మిన్ శరీరే = ఈ శరీరమునందు, ప్రాణః = ప్రాణము, అతిఖిన్నః = చాల దుర్బలముగా, విద్యతే = ఉన్నది. తథా హి = అది యుక్తమే కదా. అయమ్ = ఈతడు, స్వరహీనః = స్వరము లేనివాడుగాను, విక్లబః = వ్యాకులుడు గాను, సముదీక్ష్యతే = చూడబడుచున్నాడు.

తా. లక్ష్మణా ! ఈతని శరీరములో ప్రాణము చాల దుర్బలముగా ఉన్నట్లు కనబడుచున్నది. అందుచేతనే ఇతడు కంఠస్వరము తగ్గిపోయి వ్యాకులుడుగా కనబడుచున్నాడు. 3

మూ. జటాయో యది శక్నోషి వాక్యం వ్యాహరితుం పునః,
సీతామాఖ్యాహి భద్రం తే వధమాఖ్యాహి చాత్మనః. 4

ప్ర. అ. జటాయో = జటాయూ ! పునః = మరల, వ్యాహరితుమ్ = మాటలాడుటకు, శక్నోషి యది = సమర్థుడ వైనట్లయితే, తే = నీకు, భద్రమ్ = క్షేమమగుగాక. సీతామ్ = సీతను గూర్చి, అఖ్యాహి = చెప్పుము. ఆత్మనః = నీయొక్క, వధమ్ = వధను గూర్చి, ఆఖ్యాహి = చెప్పుము.

తా. ఓ! జటాయూ ! మరొక సారి మాటలాడకలిగితే సీత విషయము, నీ వధ విషయము చెప్పుము. నీకు మంగళ మగుగాక. 4

మూ. కింనిమిత్తోఽహరత్సీతాం రావణ స్తస్య కిం మయా,
అపరాద్ధం తు యం దృష్ట్వా రావణేన హృతా ప్రియా. 5

ప్ర. అ. రావణః = రావణుడు, కింనిమిత్తః = ఏమికారణముగలవాడై, సీతామ్ = సీతను, అహరత్ = హరించెను ? మయా = నాచేత, తస్య = వానికి, కిమ్ = ఏమి, అపరాద్ధమ్ = అపరాధము చేయబడినది ? యమ్ = దేనిని, దృష్ట్వా = చూచి, ప్రియా = ప్రియురాలు, హృతా = హరించబడినదో.

తా. రావణుడు ఏ కారణమును పురస్కరించుకొని సీతను హరించినాడు;

ఆతనికి నేను ఏ అపకారము చేసినానని ఆతడు నా ప్రియురాలిని అపహరించినాడు ? 5

మూ. కథం తచ్చన్ద్రసంకాశం ముఖమాసీన్మనోహరమ్,
సీతయా కాని చోక్తాని తస్మిన్ కాలే ద్విజోత్తమ. 6

ప్ర. అ. ద్విజోత్తమ = ఓః పక్షిశ్రేష్ఠుడా ! చన్ద్రసంకాశమ్=చంద్రునితో సమానమైన, మనోహరమ్=మనోహరమైన, తత్ ముఖమ్ = ఆ ముఖము, కథమ్ = ఎట్లు, ఆసీత్ = ఉండెను? తస్మిన్ కాలే = ఆ సమయమునందు, సీతయా = సీతచేత, కాని = ఏ వాక్యములు, ఉక్తాని = పలకబడినవి?

తా. పక్షులలో శ్రేష్ఠుడవైన ఓః జటాయూ ! చంద్రునితో సమానమైన, మనోహరమైన ఆ సీత ముఖము ఆ సమయమునందు ఎట్లు అయిపోయినది ? ఆమె ఏమన్నది ? 6

మూ. కథంవీర్యః కథంరూపః కింకర్మా స చ రాక్షసః,
క్వ చాస్య భవనం తాత బ్రూహి మే పరిపృచ్ఛతః. 7

ప్ర. అ. సః రాక్షసః = ఆ రాక్షసుడు, కథంవీర్యః = ఎట్టి పరాక్రమము కలవాడు ? కథంరూపః = ఎట్టి రూపము గలవాడు ? కింకర్మా = ఏమి పని కలవాడు? అస్య = వీనియొక్క, భవనం చ = ఇల్లు, క్వ చ = ఎక్కడ ఉన్నది? తాత = తండ్రీ ! పరిపృచ్ఛతః = ప్రశ్నించుచున్న, మే = నాకు, బ్రూహి = చెప్పుము.

తా. ఆ రాక్షసుని పరాక్రమము ఎట్టిది ? ఆతని రూపము ఎట్టిది ? ఆతడు ఎట్టి పనులు చేయును? ఆతని నివాస మెక్కడ ? తండ్రీ ! ప్రశ్నించుచున్న నాకు సమాధానము చెప్పుము. 7

మూ. తముద్వీక్ష్యాథ దీనాత్మా విలపన్తమనన్తరమ్,
వాచాతిసన్నయా రామం జటాయురిదమబ్రవీత్. 8

ప్ర. అ. అనన్తరమ్=అటు పిమ్మట, దీనాత్మా=దీనమైన మనస్సు గల, జటాయుః = జటాయువు, విలపన్తమ్ = విలపించుచున్న, రామమ్ = రాముని,

ఉద్వీక్ష్య = పైకి కళ్ళు ఎత్తి చూచి, అథ = అటు పిమ్మట, అతిసన్నయా = చాలా క్షీణించిన, వాచా = వాక్కుతో, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. పిమ్మట, దీనమైన మనస్సు గల జటాయువు విలపించుచున్న రాముని వైపు కళ్ళు పైకెత్తి చూచి, చాల క్షీణించిన స్వరముతో ఇట్లు పలికెను. 8

మూ. హృతా సా రాక్షసేన్ద్రేణ రావణేన విహాయసా,
మాయామాస్థాయ విపులాం వాతదుర్దినసంకులామ్. 9

ప్ర. అ. సా = ఆ సీత, రాక్షసేన్ద్రేణ = రాక్షసరాజైన, రావణేన = రావణునిచేత, వాతదుర్దినసంకులామ్ = వాయువుతోను మేఘాచ్ఛాదనముతోను వ్యాకులమైన, విపులామ్ = అధికమైన, మాయామ్ = మాయను, ఆస్థాయ = అవలంబించి, విహాయసా = ఆకాశముచే, హృతా = హరింపబడినది.

తా. రాక్షసరాజైన రావణుడు మాయచేత అధికమైన గాలిని, మేఘాచ్ఛాదనమును సృష్టించి, ఆకాశమార్గమున ఆ సీతను అపహరించినాడు. 9

మూ. పరిశ్రాన్తస్య మే తాత పక్షౌ ఛిత్వా స రాక్షసః,
సీతామాదాయ వైదేహీం ప్రయాతో దక్షిణాం దిశమ్. 10

ప్ర. అ. తాత = తండ్రీ! సః రాక్షసః = ఆ రాక్షసుడు, పరిశ్రాన్తస్య = అలసిపోయి ఉన్న, మే = నాయొక్క, పక్షౌ = రెక్కలను, ఛిత్వా = చేదించి, వైదేహీమ్ = విదేహరాజకుమారియైన, సీతామ్ = సీతను, ఆదాయ = గ్రహించి, దక్షిణాం దిశమ్ = దక్షిణదిక్కును గూర్చి, ప్రయాతః = వెళ్ళినాడు.

తా. తండ్రీ! ఆ రాక్షసుడు నేను అలసిపోయి ఉన్నప్పుడు నా రెక్కలు చేదించి విదేహరాజపుత్రియైన సీతను తీసికొని దక్షిణపు దిక్కు వైపు వెళ్ళినాడు.

మూ. ఉపరుధ్యన్తి మే ప్రాణా దృష్టిర్భ్రమతి రాఘవ,
పశ్యామి వృక్షాన్ సౌవర్ణానుశీరకృతమూర్ధజాన్. 11

ప్ర. అ. రాఘవ = రామా! మే = నాయొక్క, ప్రాణాః = ప్రాణములు, ఉపరుధ్యన్తి = అడగింప బడుచున్నవి. దృష్టిః = దృష్టి, భ్రమతి = తిరిగిపోవు

చున్నది. ఉశీరకృతమూర్ధజాన్ = వట్టివేళ్లచేత చేయబడిన కేశములు గల, సౌవర్ణాన్ = సువర్ణవికారమైన, వృక్షాన్ = వృక్షములను, పశ్యామి = చూచుచున్నాను.

తా. రామా! నా ప్రాణములు అర్థగింపబడుచున్నది. చూపు తిరిగిపోవుచున్నది. వట్టివేళ్ళ వంటి కేశములు గల బంగారు చెట్లను చూచుచున్నాను. (మృత్యువు ఆసన్నమైనవారికి బంగారపు చెట్లు కనబడు నని ప్రతీతి). 11

మూ. యేన యాతి ముహూర్తేన సీతామాదాయ రావణః,
విప్రణష్టం ధనం క్షిప్రం తత్స్వామీ ప్రతిపద్యతే, 12
విన్దో నామ ముహూర్తోఽయం స చ కాకుత్స్థ నాబుధత్.

ప్ర. అ. కాకుత్స్థ = రామా! రావణః = రావణుడు, యేన ముహూర్తేన = ఏ ముహూర్తముచేత(నందు), సీతామ్ = సీతను, ఆదాయ = తీసికొని, యాతి = వెళ్ళుచున్నాడో (వెళ్ళినాడో), అయమ్ = ఇది, విన్దః నామ = విందము అను, ముహూర్తః = ముహూర్తము. ప్రణష్టమ్ = పోయిన, ధనమ్ = ధనమును, తత్స్వామీ = దాని స్వామి, క్షిప్రమ్ = శీఘ్రముగా, ప్రతిపద్యతే = పొందును. సః చ = ఆ రావణుడు, నాబుధత్ = తెలిసికొనలేదు.

తా. రామా! రావణుడు సీతను ఏ ముహూర్తమునందు అపహరించినాడో! ఆ ముహూర్తమునకు విందముహూర్త మని పేరు. ఆ ముహూర్తమునందు పోయిన ధనము అచిరకాలములోనే ఆ యజమానికి తిరిగి లభించును. ఈ విషయము ఆ రాక్షసునికి తెలియదు. 12

మూ. త్వత్ప్రియాం జానకీం హృత్వా రావణో రాక్షసేశ్వరః, 13
ఝషవద్బడిశం గృహ్య క్షిప్రమేవ వినశ్యతి.

ప్ర. అ. రాక్షసేశ్వరః = రాక్షసరాజైన, రావణః = రావణుడు, త్వత్ప్రియామ్ = నీ ప్రియురాలైన, జానకీమ్ = జానకిని, హృత్వా = హరించి, బడిశమ్ = గాలమును, గృహ్య = గ్రహించి, ఝషవత్ = చేపవలె, క్షిప్రమేవ = శీఘ్రముగా, వినశ్యతి = నశించును.

తా. నీ ప్రియురాలైన జానకిని హరించిన రాక్షసరాజైన రావణుడు గాలము మింగిన చేప వలె శీఘ్రముగా నశించగలడు. 13

మూ. 'న చ త్వయా వ్యథా కార్యా జనకస్య సుతాం ప్రతి, 14
వైదేహ్యా రంస్యసే క్షిప్రం హత్వా తం రాక్షసం రణే.

ప్ర. అ. త్వయా = నీచేత, జనకస్య సుతాం ప్రతి = జనకుని కుమార్తెను గూర్చి, వ్యథా = దుఃఖము, న కార్యా = చేయదగినది కాదు. రణే = యుద్ధమునందు, తం రాక్షసమ్ = ఆ రాక్షసుణ్ణి, క్షిప్రమ్ = శీఘ్రముగా, హత్వా = చంపి, వైదేహ్యా = సీతతో, రంస్యసే = క్రీడించగలవు.

తా. నీవు సీతను గూర్చి దుఃఖించకుము. నీవు శీఘ్రముగా యుద్ధములో ఆ రాక్షసుణ్ణి చంపి సీతతో క్రీడించగలవు. 14

మూ. అసంమూఢస్య గృధ్రస్య రామం ప్రత్యనుభాషతః, 15
ఆస్యాత్సుస్రావ రుధిరం మ్రియమాణస్య సామిషమ్.

ప్ర. అ. రామం ప్రతి = రాముణ్ణి గూర్చి, అనుభాషతః = మాటలాడుచున్న, అసంమూఢస్య = తెలివితప్పని, మ్రియమాణస్య = మరణించుచున్న, గృధ్రస్య = జటాయువుయొక్క, ఆస్యాత్ = ముఖమునుండి, సామిషమ్ = మాంసముతో కూడిన, రుధిరమ్ = రక్తము, సుస్రావ = స్రవించెను.

తా. ఇంకా తెలివి తప్పని జటాయువు రామునితో ఈ విధముగా మాటలాడుచుండగా అతనికి మరణము ఆసన్నమగుటచే అతని ముఖమునుండి మాంసముతో కూడిన రక్తము స్రవించెను. 15

మూ. పుత్రో విశ్రవసః సాక్షాద్భ్రాతా వైశ్రవణస్య చ, 16
ఇత్యుక్త్వా దుర్లభాన్ ప్రాణాన్ ముమోచ పతగేశ్వరః.

ప్ర. అ. (ఆ రాక్షసుడు), విశ్రవసః = విశ్రవసునియొక్క, పుత్రః = పుత్రుడు. వైశ్రవణస్య = కుబేరునియొక్క, సాక్షాత్ = సాక్షాత్తు, భ్రాతా = సోదరుడు. ఇతి = ఇట్లు, ఉక్త్వా = పలికి, పతగేశ్వరః = జటాయువు, దుర్లభాన్ = మేరల లభించని, ప్రాణాన్ = ప్రాణములను, ముమోచ = విడచెను.

తా. "ఆ రాక్షసుడు విశ్రవసుని కుమారుడు, సాక్షాత్తు కుబేరుని సోదరుడు"అని చెప్పి జటాయువు దుర్లభములైన ప్రాణాలను విడచెను. 16

మూ. బ్రూహి బ్రూహీతి రామస్య బ్రువాణస్య కృతాఞ్జలేః, 17
త్యక్త్వా శరీరం గృధ్రస్య జగ్ముః ప్రాణా విహాయసమ్.

ప్ర. అ. కృతాఞ్జలేః = చేయబడిన దోసిలి గల, రామస్య = రాముడు, బ్రూహి బ్రూహి ఇతి = చెప్పుము చెప్పుము అని, బ్రువాణస్య = అనుచుండగానే, గృధ్రస్య = జటాయువుయొక్క, ప్రాణాః = ప్రాణములు, శరీరమ్ = శరీరమును, త్యక్త్వా = విడచి, విహాయసమ్ = ఆకాశమును గూర్చి, జగ్ముః = వెళ్ళినవి.

తా. రాముడు దోసిలి పట్టి, "ఇంకా చెప్పుము చెప్పుము"అని అనుచుండగానే జటాయువు ప్రాణాలు శరీరమును విడచి ఆకాశముమీదికి ఎగిరిపోయినవి.

మూ. స నిక్షిప్య శిరో భూమౌ ప్రసాద్య చరణౌ తదా, 18
విక్షిప్య చ శరీరం స్వం పపాత దరణీతలే.

ప్ర. అ. సః = ఆ జటాయువు, తదా = అప్పుడు, శిరః = శిరస్సును, భూమౌ = భూమిమీద, నిక్షిప్య = ఉంచి, చరణౌ = పాదములను, ప్రసార్య = చాపి, స్వమ్ = తన సంబంధమైన, శరీరమ్ = శరీరమును, ధరణీతలే = నేలమీద, విక్షిప్య = జారవిడచి, పపాత = పడిపోయెను.

తా. అప్పు డా జటాయువు శిరస్సును నేలపై పడవేసి, పాదములు చాపి, శరీరమును నేలమీద జారవిడచి, ఒరిగిపోయెను. 18

మూ. తం గృధ్రం ప్రేక్ష్య తామ్రాక్షం గతాసుమచలోపమమ్,
రామః సుబహుభిర్దుఃఖై ర్దీనః సౌమిత్రిమబ్రవీత్.

ప్ర. అ. సుబహుభిః = అనేకమైన, దుఃఖైః = దుఃఖములచేత, దీనః = దీనుడైన, రామః = రాముడు, తామ్రాక్షమ్ = ఎఱ్ఱని నేత్రములు గల, గతాసుమ్ = పోయిన ప్రాణములు గల, అచలోపమమ్ = పర్వతముతో సమానమైన, తం గృధ్రమ్ = ఆ జటాయువును, ప్రేక్ష్య = చూచి, సౌమిత్రిమ్ = లక్ష్మణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. అనేకదుఃఖములు ఒక్కసారిగా వచ్చి పడుటచేత దీనుడైన రాముడు ఎఱ్ఱని కన్ను గల, పర్వతము వంటి దేహము గల, మరణించిన ఆ జటాయువును చూచి లక్ష్మణునితో ఇటనెను. 19

మూ. బహూని రక్షసాం వాసే వర్షాణి వసతా సుఖమ్, 20
అనేన దణ్డకారణ్యే విశీర్ణమిహ పక్షిణా.

ప్ర. అ. రక్షసామ్ = రాక్షసులయొక్క, వాసే=నివాసమైన, ఇహ=ఈ, దణ్డకారణ్యే = దండకారణ్యమునందు, సుఖమ్=సుఖముగా, బహూని వర్షాణి = చాల సంవత్సరములను, వసతా = నివసించుచున్న, అనేన = ఈ, పక్షిణా = పక్షిచేత, విశీర్ణమ్=మరణముపొందుట (జరిగినది).

తా. రాక్షసులకు నివాసమైన ఈ దండకారణ్యములో సుఖముగా నివసించుచున్న ఈ జటాయువు నా నిమిత్తమై మరణించినాడు. 20

మూ. అనేకవార్షికో యస్తు చిరకాలసముత్థితః, 21
సోఽయమద్య హతః శేతే కాలో హి దురతిక్రమః.

ప్ర. అ. అనేకవార్షికః = అనేకసంవత్సరముల వయస్సు గల, యః=ఏ జటాయువు, చిరకాలసముత్థితః = చిరకాలము కార్యోద్యుక్తుడుగా ఉన్నాడో, సః అయమ్ = అట్టి ఈ జటాయువు, అద్య = ఇప్పుడు, హతః = చంపబడినవాడై, శేతే = శయనించినాడు. కాలః = కాలము, దురతిక్రమః హి = అతిక్రమింప శక్యము కానిది కదా ?

తా. అతి దీర్ఘాయుర్దాయము గల ఏ జటాయువు చాల కాలము కార్యవ్యగ్రుడై ఉండేవాడో అట్టి ఇతడు చంపబడి పడి ఉన్నాడు. కాలమును ఎవ్వరూ దాటజాలరు కదా ? 21

మూ. పశ్య లక్ష్మణ గృధ్రోఽయముపకారీ హతశ్చ మే, 22
సీతామభ్యవపన్నో వై రావణేన బలీయసా.

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! సీతామ్ = సీతను, అభ్యవపన్నః = రక్షించుటకై వెళ్ళిన, మే ఉపకారీ = నాకు ఉపకారము చేసిన, అయం గృధ్రః = ఈ జటాయువు, బలీయసా = అధికబలవంతుడైన, రావణేన = రావణునిచేత, హతః = చంపబడినాడు. పశ్య = చూడుము.

తా. లక్ష్మణా ! నాకు ఉపకారము చేయవలె నను కోరికతో సీతను

రక్షించుటకై వెళ్ళిన ఈ జటాయువు అధికబలశాలియైన రావణునిచేత చంపబడి నాడు. 22

మూ. గృధ్రరాజ్యం పరిత్యజ్య పితృపైతామహం మహత్, 23
మమ హేతోరయం ప్రాణాన్ ముమోచ పతగేశ్వరః.

ప్ర. అ. అయం పతగేశ్వరః = ఈ పక్షిరాజు, పితృపైతామహమ్ = తండ్రితాతలకు చెందిన, మహత్ = గొప్పదైన, గృధ్రరాజ్యమ్ = గృధ్రముల రాజ్యమును, పరిత్యజ్య = విడచి, మమ హేతోః = నా మూలమున, ప్రాణాన్ = ప్రాణములను, ముమోచ = విడచెను.

తా. ఈ పక్షిరాజు, తండ్రితాతలనాటినుండి వచ్చుచున్న గొప్ప గృధ్ర రాజ్యమును విడచిపెట్టి నా నిమిత్తమై ప్రాణాలను విడచినాడు। 23

మూ. సర్వత్ర ఖలు దృశ్యన్తే సాధవో ధర్మచారిణః, 24
శూరాః శరణ్యాః సౌమిత్రే తిర్యగ్యోనిగతేష్వపి.

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా। శూరాః = శూరులు, శరణ్యాః = శరణు జొచ్చినవారిని రక్షించేవారు, ధర్మచారిణః = ధర్మమును ఆచరించేవారు అయిన, సాధవః = సత్పురుషులు, సర్వత్ర = అంతటా, తిర్యగ్యోనిగతేష్వపి = తిర్య గ్జంతువులలో కూడ, దృశ్యన్తే ఖలు = చూడబడుచున్నారు కదా.

తా. లక్ష్మణా। శూరులు, శరణాగతరక్షకులు, ధర్మమును ఆచరించువారు అయిన సత్పురుషులు అంతటా ఉందురు కదా। తిర్యగ్జంతువులలో కూడ కనబడు చున్నారు కదా। 24

మూ. సీతాహరణజం దుఃఖం న మే సౌమ్య తథాగతమ్, 25
యథా వినాశే గృధ్రస్య మత్కృతే చ పరంతప.

ప్ర. అ. పరంతప = శత్రువినాశకుడా। సౌమ్య = సౌమ్యుడా, గృధ్రస్య = ఈ జటాయువుయొక్క, వినాశే = వినాశమునందు, మత్కృతే చ = (అందులోను) నా నిమిత్తమై, యథా = ఎట్లో, సీతాహరణజమ్ = సీతను హరించుటవలన కలిగిన, దుఃఖమ్ = దుఃఖము, తథావిధమ్ = ఆవిధమైనది, న = కాదు, ("తథాగతమ్"కు బదులు, "తథావిధమ్" అను ప్రాచ్యపాఠము గ్రహింపబడినది).

తా. శత్రుసంహారకుడవైన లక్ష్మణా ! ఈ జటాయువు మరణించుట వలన, అందులోను నానిమిత్తమై మరణించుటవలన, నా కెంత దుఃఖము కలుగు చున్నదో అంత దుఃఖము సీతాహరణమువలన కూడ కలగలేదు. 25

మూ. రాజా దశరథః శ్రీమాన్ యథా మమ మహాయశాః, 26
పూజనీయశ్చ మాన్యశ్చ తథాయం పతగేశ్వరః.

ప్ర. అ. మహాయశాః = గొప్ప కీర్తి గలవాడు, శ్రీమాన్ = శ్రీమంతుడు, రాజా = రాజైన, దశరథః = దశరథుడు, మమ = నాకు, యథా = ఎట్లు, పూజనీయశ్చ = పూజింపదగినవాడో, మాన్యశ్చ = గౌరవింపదగినవాడో, అయమ్ = ఈ, పతగేశ్వరః = పక్షిరాజు, తథా = అట్లే.

తా. శ్రీమంతుడు, గొప్ప కీర్తి గలవాడు అయిన దశరథమహారాజు నాకు ఎట్లు పూజ్యుడో, గౌరవింపదగినవాడో ఈ పక్షిరాజు కూడ అట్లే పూజ్యుడు, మాన్యుడు. 26

మూ. సౌమిత్రే హర కాష్ఠాని నిర్మథిష్యామి పావకమ్, 27
గృధ్రరాజం దిధక్షామి మత్కృతే నిధనం గతమ్.

ప్ర. అ. సౌమిత్రే = లక్ష్మణా ! కాష్ఠాని = కట్టెలను, హర = తీసికొని రమ్ము. పావకమ్ = అగ్నిని, నిర్మథిష్యామి = మథించెదను. మత్కృతే = నా నిమిత్తమై, నిధనమ్ = మరణమును, గతమ్ = పొందిన, గృధ్రరాజమ్ = జటాయువును, దిధక్షామి = కాల్చదలచుచున్నాను

తా. లక్ష్మణా ! కట్టెలు తీసికొనిరమ్ము. అగ్నిని మథించి, నా నిమిత్తమై ప్రాణాలు విడచిన జటాయువునకు దహనసంస్కారము చేయవలె నని కోరుచున్నాను. 27

మూ. నాథం పతగలోకస్య చితామారోప్య రాఘవ, 28
ఇమం ధక్ష్యామి సౌమిత్రే హతం రౌద్రేణ రక్షసా.

ప్ర. అ. రాఘవ = రఘువంశమునందు పుట్టిన, సౌమిత్రే = లక్ష్మణా ! రౌద్రేణ = భయంకరుడైన, రక్షసా = రాక్షసునిచేత, హతమ్ = చంపబడిన,

ఇమమ్ = ఈ, పతగలోకస్య నాథమ్ = పక్షిసముదాయమునకు ప్రభువైన జటాయువును, చితామ్ = చితిని, ఆరోప్య = ఎక్కించి, ధక్ష్యామి = కాల్చెదను.

తా. రఘువంశమునందు జన్మించిన ఓ లక్ష్మణా! క్రూరుడైన రాక్షసునిచేత చంపబడిన, పక్షిరాజైన ఈ జటాయువును చితిపై ఎక్కించి, దహన సంస్కారము చేసెదను. 28

మూ. యా గతిర్యజ్ఞశీలానామాహితాగ్నేశ్చ యా గతిః, 29
అపరావర్తినాం యా చ యా చ భూమిప్రదాయినామ్,
మయా త్వం సమనుజ్ఞాతో గచ్ఛ లోకాననుత్తమాన్, 30
గృధ్రరాజ మహాసత్త్వ సంస్కృతశ్చ మయా వ్రజ.

ప్ర. అ. మహాసత్త్వ = గొప్ప బలము గల, గృధ్రరాజ = ఓ! జటాయూ! మయా = నాచేత, సమనుజ్ఞాతః = అనుజ్ఞ ఇవ్వబడిన, త్వమ్ = నీవు, యజ్ఞశీలానామ్ = యజ్ఞములు చేయు స్వభావము కలవారికి, యా = ఏ, గతిః = గతియో, ఆహితాగ్నేశ్చ = అగ్న్యాధానము చేసినవానికి, యా గతిః = ఏ గతియో. అపరావర్తినామ్ = తిరిగి ఇంటికి రాని సంన్యాసులకు, లేదా యుద్ధమునుండి వెనుదిరగని యోధులకు, యా చ = ఏ గతియో, భూమిప్రదాయినామ్ = భూమిని ఇచ్చినవారికి, యా చ = ఏ గతియో, ఆ గతిని, గచ్ఛ = పొందుము. మయా = నాచేత, సంస్కృతః చ = సంస్కరింపబడిన నీవు, అనుత్తమాన్ = చాల ఉత్తమములైన, లోకాన్ = లోకములనుగూర్చి, వ్రజ = వెళ్ళుము

తా. గొప్ప బలము గల ఓ! గృధ్రరాజా! సర్వదా యజ్ఞములు (జపయజ్ఞాదులు) చేయువారికి ఏ గతి లభించునో, ఆహితాగ్నులకు ఏ గతి లభించునో, సంన్యాసులకు (లేదా యుద్ధములో వెన్ను చూపనివారికి) ఏ గతి లభించునో, భూదానము చేసేవారికి ఏ గతి లభించునో ఆ గతిని నీవు పొందెదవుగాక. నేను అనుజ్ఞ ఇచ్చుచున్నాను. నాచేత సంస్కరింపబడిన నీవు అత్యుత్తమములైన లోకములకు వెళ్లుము. (ఈ రెండు శ్లోకములు ప్రాచ్యప్రతిలో లేవు). 29, 30

మూ. ఏవముక్త్వా చితాం దీప్తామారోప్య పతగేశ్వరమ్, 31
దదాహ రామో ధర్మాత్మా స్వబంధుమివ దుఃఖితః.

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, రామః=రాముడు, ఏవమ్=ఇట్లు, ఉక్త్వా = పలికి, పతగేశ్వరమ్ = పక్షిరాజైన జటాయువును, చితామ్ = చితను, ఆరోప్య = ఎక్కించి, దుఃఖితః = దుఃఖించుచున్నవాడై, స్వబన్ధుమివ = తన బంధువును వలె, దదాహ = కాల్చెను.

తా. ధర్మాత్ముడైన రాముడు ఇట్లు పలుకుచు, జటాయువును చితిపై ఎక్కించి, చాల దుఃఖించుచు తన బంధువునకు వలె దహనసంస్కారము చేసెను.

మూ. రామోఽథ సహసౌమిత్రిర్వనం గత్వా స వీర్యవాన్, 32
స్థూలాన్ హత్వా మహారోహీననుతస్తార తం ద్విజమ్.

ప్ర. అ. అథ = పిమ్మట, వీర్యవాన్ = పరాక్రమవంతుడైన, రామః = రాముడు, సహసౌమిత్రిః = లక్ష్మణసమేతుడై, వనమ్ = వనమును గూర్చి, గత్వా = వెళ్ళి, స్థూలాన్ = పెద్దవైన, మహారోహీన్=పెద్ద రోహిమృగములను, హత్వా = చంపి, తం ద్విజమ్ = ఆ పక్షిని గూర్చి, అనుతస్తార = దర్భలు పరచెను.

తా. పరాక్రమవంతుడైన రాముడు లక్ష్మణసమేతుడై అడవిలోనికి వెళ్ళి, లావుగా నున్న పెద్ద రోహిమృగలను చంపి, జటాయువునకు పిండప్రదానము చేయుటకై, దర్భలు పరచెను. 32

మూ. రోహిమాంసాని చోత్కృత్య పేశీకృత్య మహాయశాః, 33
శకునాయ దదౌ రామో రమ్యే హరితశాద్వలే.

ప్ర. అ. మహాయశాః = గొప్ప కీర్తి గల, రామః = రాముడు, రోహిమాంసాని=రోహిమృగమాంసములను, ఉత్కృత్య=పెకలించి, పేశీకృత్య=ముద్దగా చేసి, రమ్యే = సుందరమైన, హరితశాద్వలే = ఆకుపచ్చని పచ్చికబీడునందు, శకునాయ = పక్షికొరకు, దదౌ = ఇచ్చెను.

తా. మహాయశఃశాలియైన రాముడు రోహిమాంసములు తీసి ముద్దచేసి, రమ్యమైన ఆకుపచ్చని పచ్చిక బీడునందు జటాయువుకొరకు పిండముల నిచ్చెను.

మూ. యత్తత్ప్రేతస్య మర్త్యస్య కథయన్తి ద్విజాతయః, 34
తత్స్వర్గగమనం తస్య పిత్ర్యం రామో జజాప హ.

ప్ర. అ. తత్ = ప్రసిద్ధమైన, యత్ = దేనిని, ద్విజాతయః = బ్రాహ్మణులు, ప్రేతస్య = మరణించిన, మర్త్యస్య = మానవునకు, స్వర్గగమనమ్ = స్వర్గమును పొందించే దానినిగా, కథయన్తి = చెప్పుదురో, తత్ = ఆ, పిత్ర్యమ్ = పితృదేవతాకమైన మంత్రమును, తస్య = ఆ జటాయువునకు, జజాప = జపించెను.

తా. ఏ మంత్రము మరణించిన మానవుని స్వర్గమునకు పంపునని బ్రాహ్మణులు చెప్పుదురో అట్టి పితృదేవతలకు సంబంధించిన మంత్రమును రాముడు ఆ జటాయువుకొరకై జపించెను. 34

మూ. తతో గోదావరీం గత్వా నదీం నరవరాత్మజౌ, 35
ఉదకం చక్రతుస్తస్మై గృధ్రరాజాయ తావుభౌ.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ఉభౌ = ఇద్దరైన, తౌ = ఆ, నరవరాత్మజౌ = రాజకుమారులు, గోదావరీం నదీమ్ = గోదావరీనదిని గూర్చి, గత్వా = వెళ్ళి, తస్మై = ఆ, గృధ్రరాజాయ = జటాయువునకు, ఉదకమ్ = ఉదకమును, చక్రతుః = చేసిరి.

తా. పిమ్మట ఆ రాజకుమారు లిద్దరూ గోదావరీనదికి వెళ్ళి ఆ జటాయువునకు ఉదకతర్పణములు చేసిరి. 35

మూ. శాస్త్రదృష్టేన విధినా జలే గృధ్రాయ రాఘవౌ, 36
స్నాత్వా తౌ గృధ్రరాజాయ ఉదకం చక్రతుస్తదా.

ప్ర. అ. తదా = అప్పుడు, రాఘవౌ = రామలక్ష్మణులు, శాస్త్రదృష్టేన = శాస్త్రమునందు చూడబడిన, విధినా = విధిచేత, గృధ్రాయ = ఆ జటాయువు నిమిత్తము, జలే = నీటియందు, స్నాత్వా = స్నానముచేసి, గృధ్రరాజాయ = జటాయువునకు, ఉదకమ్ = ఉదకమును, చక్రతుః = చేసిరి (ఇచ్చిరి).

తా. ఆ రామలక్ష్మణులు అప్పుడు ఆ జటాయువును ఉద్దేశించి శాస్త్రోక్త ప్రకారమున నదిలో స్నానము చేసి అతనికి జలతర్పణములు చేసిరి. 36

మూ. స గృధ్రరాజః కృతవాన్యశస్కరం
సుదుష్కరం కర్మ రణే నిపాతితః,
మహర్షికల్పేన చ సంస్కృత స్తదా
జగామ పుణ్యాం గతిమాత్మనః శుభామ్. 37

ప్ర. అ. రణే = యుద్ధమునందు, సుదుష్కరమ్ = చేయుటకు చాల కష్ట మైన, యశస్కరమ్ = కీర్తిని కలిగించు, కర్మ = కర్మను, కృతవాన్ = చేసిన వాడు, నిపాతితః = పడగొట్టబడినవాడు అయిన, సః గృధ్రరాజః = ఆ జటా యువు, తదా = అప్పుడు, మహర్షికల్పేన = మహర్షితో సమానుడైన రామునిచేత, సంస్కృతః = సంస్కరింపబడినవాడై, పుణ్యామ్ = పుణ్యము, శుభామ్=మంగళ ప్రదము అయిన, ఆత్మనః = తనయొక్క, గతిమ్=గతిని, జగామ=పొందెను.

తా. చేయుటకు చాల కష్టమైన, కీర్తికరమైన పని చేసి యుద్ధములో ప్రాణ ములు విడచిన ఆ జటాయువు మహర్షి వంటి ఆ రాముడు సంస్కరించుటచే పుణ్యము, మంగళప్రదము అయిన, తనకు తగిన ఉత్తమగతిని పొందెను. 37

మూ. కృతోదకౌ తావపి పక్షిసత్తమే
స్థిరాం చ బుద్ధిం ప్రణిధాయ జగ్మతుః,
ప్రవేశ్య సీతాధిగమే తతో మనో
వనం సురేన్ద్రావివ విష్ణువాసవౌ. 38

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
అష్టషష్టితమః సర్గః.

ప్ర. అ. తౌ అపి = ఆ రామలక్ష్మణులు, కృతోదకౌ = చేయబడిన తర్ప ణములు గలవారై, పక్షిసత్తమే=పక్షిశ్రేష్ఠునియందు, స్థిరామ్=స్థిరమైన, బుద్ధిమ్ = బుద్ధిని, ప్రణిధాయ = ఉంచి, తతః = అటుపిమ్మట, సీతాధిగమే = సీతను పొందుటయందు, మనః = మనస్సును, ప్రవేశ్య=ప్రవేశపెట్టి, సురేన్ద్రౌ=దేవతా ప్రభువులైన, విష్ణువాసవావివ = విష్ణువు దేవేంద్రుడూ వలె, వనమ్ = వనమును గూర్చి, జగ్మతుః = వెళ్లిరి.

తా. ఆ రామలక్ష్మణులు జటాయువుకు జలతర్పణములు చేసి, ఆతని మాటపై దృఢమైన నమ్మకముతో సీతను వెదకవలె నని నిశ్చయించుకొని దేవతల ప్రభువు వైన విష్ణువు, ఇంద్రుడువలె అడవిలోనికి వెళ్ళిరి. ౩౮

''బాలానందిని''అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో అరువదిఎనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనసప్తతితమః సర్గః

[*లక్ష్మణుడు అయోముఖిని శిక్షించుట, కబంధుని బాహువులలో చిక్కుకున్న రామలక్ష్మణులు చింతించుట*].

మూ. కృత్వైవముదకం తస్మై ప్రస్థితౌ రామలక్ష్మణౌ,
అవీక్షన్తౌ వనే సీతాం పశ్చిమాం జగ్మతుర్దిశమ్. 1

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, రామలక్ష్మణౌ = రామలక్ష్మణులు, తస్మై = ఆ జటాయువునకు, ఉదకం కృత్వా = తర్పణములు ఇచ్చి, ప్రస్థితౌ = ప్రయాణమైనవారై, పశ్చిమామ్ = పశ్చిమమైన, దిశమ్ = దిక్కును గూర్చి, వనే=వనమునందు, సీతామ్ = సీతను, అవేక్షమాణౌ = వెదకుచున్నవారై, జగ్మతుః=వెళ్ళిరి.

తా. రామలక్ష్మణులు ఈ విధముగా జటాయువునకు ఉదకక్రియలు చేసి, సీతను వెదకుచు, పశ్చిమముదిక్కు వైపునకు వెళ్ళిరి. 1

మూ. తౌ దిశం దక్షిణాం గత్వా శరచాపాసిధారిణౌ,
అవిప్రహతమైక్ష్వాకూ పన్థానం ప్రతిపేదతుః. 2

ప్ర. అ. శరచాపాసిధారిణౌ = బాణములను, ధనస్సులను, ఖడ్గములను ధరించిన, తౌ = ఆ, ఐక్ష్వాకౌ = రామలక్ష్మణులు, తామ్ = ఆ, దక్షిణామ్=దక్షిణపు, దిశమ్ = దిక్కును గూర్చి, గత్వా = వెళ్ళి, అవిప్రహతమ్ = నలగగొట్టబడని(జను లెవ్వరూ సంచరించని), పన్థానమ్ = మార్గమును, ప్రతిపేదతుః = పొందిరి.

తా. ఆ రామలక్ష్మణులు బాణములను, ధనస్సులను, ఖడ్గములను ధరించి, దక్షిణదిక్కు వైపు వెళ్ళి, అక్కడ ఎవ్వరూ సంచరించని మార్గమును పొందిరి .2

మూ. గుల్మైర్వృక్షైశ్చ బహుభిర్లతాభిశ్చ ప్రవేష్టితమ్,
ఆవృతం సర్వతో దుర్గం గహనం ఘోరదర్శనమ్. 3

ప్ర. అ. బహుభిః = అనేకమైన, గుల్మైః = పొదలచేతను, వృక్షైశ్చ = వృక్షములచేతను, లతాభిశ్చ = లతలచేతను, ప్రవేష్టితమ్=చుట్టబడినది, సర్వతః = అన్ని వైపులా, ఆవృతమ్ = కప్పబడినది, దుర్గమ్ = నడవ శక్యము కానిది, గహనమ్ = ప్రవేశింప శక్యము కానిది, ఘోరదర్శనమ్ = భయంకరమైన దర్శనము కలది అయిన (మార్గమును చేరిరి).

తా. ఆ మార్గమునందు అడుగడుగునా అనేకమైన పొదలు, వృక్షములు, లతలు ఉండెను. అన్ని మూలలా కప్పబడి యుండుటచేత ప్రవేశించుటకు గాని, నడచుటకు గాని కష్టమై చూచుటకు భయంకరముగా ఉండెను. 3

మూ. వ్యతిక్రమ్య తు వేగేన వ్యాళసింహనిషేవితమ్,
సుభీమం తన్మహారణ్యం వ్యతియాతౌ మహాబలౌ. 4

ప్ర. అ. మహాబలౌ = గొప్ప బలము గల ఆ రామలక్ష్మణులు, వ్యాళసింహనిషేవితమ్ = దుష్టగజములచేతను, సింహములచేతను సేవించబడిన, సుభీమమ్ = చాల భయంకరమైన, తత్ = ఆ, మహారణ్యమ్ = మహారణ్యమును, వేగేన = వేగముతో, వ్యతిక్రమ్య = దాటి, వ్యతియాతౌ = వెళ్ళిరి.

తా. మహాబలశాలురైన ఆ రామలక్ష్మణులు దుష్టగజములకు, సింహములకు నివాసస్థానమైన, భయంకరముగా ఉన్న ఆమహావనమును వేగముగా దాటి వెళ్ళిరి. 4

మూ. తతః పరం జనస్థానాత్త్రిక్రోశం గమ్య రాఘవౌ,
క్రౌఞ్చారణ్యం వివిశతుర్గహనం తౌ మహౌజసౌ, 5

ప్ర. అ. తతః పరమ్ = అటు పిమ్మట, మహౌజసౌ = గొప్ప తేజస్సు గల, తౌ = ఆ, రాఘవౌ = రామలక్ష్మణులు, జనస్థానాత్ = జనస్థానమునుండి, త్రిక్రోశమ్=మూడు క్రోశముల దూరము, గమ్య = వెళ్ళి, గహనమ్=ప్రవేశించ శక్యము కాని, క్రౌఞ్చారణ్యమ్ = క్రౌంచారణ్యమును, వివిశతుః=ప్రవేశించిరి.

తా. పిమ్మట గొప్ప తేజస్సు గల ఆ రామలక్ష్మణులు జనస్థానమునుండి మూడు కోసుల దూరము వెళ్ళి, ప్రవేశింప శక్యము కాని క్రౌంచారణ్యములో ప్రవేశించిరి. 5

మూ. నానామేఘఘనప్రఖ్యం ప్రహృష్టమివ సర్వతః,
నానాపక్షిగణైర్యుక్తం నానావ్యాళమృగైర్యుతమ్,

దిదృక్షమాణౌ వైదేహీం తద్వనం తౌ విచిక్యతుః,
తత్ర తత్రావతిష్ఠన్తౌ సీతాహరణకర్శితౌ. 6,7

ప్ర. అ. సీతాహరణకర్శితౌ = సీతాహరణము చేత కృశింపచేయబడిన, తౌ = ఆ రామలక్ష్మణులు, వైదేహీమ్ = సీతను, దిదృక్షమాణౌ = చూడదలచుచున్నవారై, తత్ర తత్ర = అక్కడక్కడ, అవతిష్ఠన్తౌ = నిలచుచున్నవారై, నానామేఘఘనప్రఖ్యమ్ = అనేకమేఘముల గుంపుతో సమానము, సర్వతః = అంతటా, ప్రహృష్టమివ = సంతోషించుచున్నది వలె ఉన్నది, నానాపక్షిగణైః = అనేకవిధములైన పక్షుల సముదాయములతో, యుక్తమ్ = కూడినది. నానావ్యాళమృగైః = అనేకవిధములైన సర్పములతోను, మృగములతోను, యుతమ్ = కూడినది అయిన, తత్ = ఆ, వనమ్ = వనమును, విచిక్యతుః = వెదకిరి.

తా. సీత అపహరింపబడుటచే కృశించిన ఆ రామలక్ష్మణులు, సీతను చూడవలె నను కోరికతో, మధ్య మధ్య ఆగుచు, ఆ వనమునంతా గాలించి వెదకిరి. ఆ వనము మేఘాల గుంపు వలె ఉండెను. పుష్పవృక్షాదులతో నిండి ఉండుటచే సంతోషించుచున్నట్లు ఉండెను. దానిలో అనేకవిధములైన పక్షిగణములు, అనేక విధములైన సర్పములు, మృగములు నివసించుచుండెను. 6,7

మూ. తతః పూర్వేణ తౌ గత్వా త్రిక్రోశం భ్రాతరౌ తదా,
క్రౌఞ్చారణ్యమతిక్రమ్య మతఙ్గాశ్రమమన్తరా. 8

దృష్ట్వా తు తద్వనం ఘోరం బహుభీమమృగద్విజమ్,
నానాసత్త్వసమాకీర్ణం సర్వం గహనపాదపమ్. 9

దదృశాతే గిరౌ తత్ర దరీం దశరథాత్మజౌ,
పాతాళసమగమ్భీరాం తమసా నిత్యసంవృతామ్. 10

ప్ర. అ. తదా=అప్పుడు, భ్రాతరౌ=సోదరులైన, తౌ దశరథాత్మజౌ=

ఆ రామలక్ష్మణులు, తతః=అక్కడినుండి, పూర్వేణ=తూర్పుగా, త్రిక్రోశమ్= మూడు క్రోశముల దూరము, గత్వా=వెళ్ళి, క్రౌఞ్చారణ్యమ్=క్రౌంచారణ్యమును, అతిక్రమ్య=దాటి, మతఙ్గాశ్రమమ్ అన్తరా=మతంగాశ్రమమునకు మధ్య, ఘోరమ్=భయంకరము, బహుభీమమృగద్విజమ్=అనేకములైన భయంకరములైన మృగములు, పక్షులు గలది, నానాసత్త్వసమాకీర్ణమ్=అనేకవిధములైన మృగములతో వ్యాప్తము, గహనపాదపమ్=ప్రవేశింప శక్యము కాని వృక్షములు కలది అయిన, సర్వమ్=సమస్తమైన, తత్=ఆ, వనమ్ = వనమును, దృష్ట్వా=చూచి, తత్ర=అక్కడ, గిరౌ=పర్వతమునందు, పాతాళసమగమ్భీరామ్=పాతాళమువలె లోతైనది, తమసా=చీకటితో, నిత్యసంవృతామ్= నిత్యము కప్పబడినదీ అయిన, దరీమ్=గుహను, దదృశాతే=చూచిరి.

తా. అప్పుడు సోదరులైన ఆ రామలక్ష్మణులు అక్కడినుండి తూర్పుగా మూడు కోసుల దూరము వెళ్ళి. క్రౌంచారణ్యము దాటి, దానికి మతంగాశ్రమానికి మధ్య భయంకరమైన ఒక మహారణ్యమును చూచిరి. అది అనేక క్రూరజంతువులకు, పక్షులకు నివాసమైయుండెను. అంతటా క్రూరమృగములు సంచరించుచుండెను. చెట్లు చాల దగ్గరదగ్గరగా ఉండుటచే ప్రవేశించుటకు శక్యము కాకుండా ఉండెను. ఆ వనములోని ఒక పర్వతమునందు వారికి పాతాళము వలె లోతైన ఒక గుహ కనబడెను. అది నిత్యము చీకటితో నిండి ఉండెను. 8,9,10

మూ. ఆసాద్య తౌ నరవ్యాఘ్రౌ దర్యాస్తస్యావిదూరతః,
దదృశాతే మహారూపాం రాక్షసీం వికృతాననామ్. 11

ప్ర. అ. తౌ=ఆ, నరవ్యాఘ్రౌ=నరశ్రేష్ఠులు, ఆసాద్య=సమీపించి, తస్యాః=ఆ, దర్యాః=గుహయొక్క, విదూరతః=సమీపమునందు, మహారూపామ్=పెద్ద ఆకారము గల, వికృతాననామ్=వికృతమైన ముఖము గల, రాక్షసీమ్=రాక్షసస్త్రీని, దదృశాతే=చూచిరి.

తా. నరులలో శ్రేష్ఠులైన ఆ రామలక్ష్మణులు ఆ గుహను సమీపించి, దాని దగ్గర పెద్ద ఆకారము, వికృతమైన ముఖము గల ఒక రాక్షసస్త్రీని చూచిరి.

మూ. భయదామల్పసత్త్వానాం బీభత్సాం రౌద్రదర్శనామ్,
లమ్బోదరీం తీక్ష్ణదంష్ట్రాం కరాళీం పరుషత్వచమ్, 12

భక్షయ న్తీం మృగాన్ భీమాన్ వికటాం ము క్తమూర్ధజామ్
ప్రైక్షేతాం తౌ తత స్తత్ర భ్రాతరౌ రామలక్ష్మణౌ. 13

ప్ర. అ. తతః = పిమ్మట, భ్రాతరౌ = సోదరులైన, తౌ రామలక్ష్మణౌ = ఆ రామలక్ష్మణులు, అల్పసత్త్వానామ్ = అల్పబలము గలవారికి, భయదామ్ = భయమును కలిగించేదీ, బీభత్సామ్ = అసహ్యముగా ఉన్నది, రౌద్రదర్శనామ్ = భయంకరమైన దర్శనము కలది, లమ్బోదరీమ్ = వ్రేలాడుచున్న ఉదరము కలది, తీక్ష్ణదంష్ట్రామ్ = తీక్ష్ణములైన కోరలు గలది, కరాళీమ్ = ఎత్తుపల్లములు గలది, పరుషత్వచమ్ = పరుషమైన చర్మం గలది, భీమాన్ = భయంకరములైన, మృగాన్ = మృగములను, భక్షయ న్తీమ్ = భక్షించుచున్నది, వికటామ్ = వికృతాకారము గలది, ముక్తమూర్ధజామ్ = విడువబడిన కేశములు కలదీ అయిన ఆ రాక్షసిని, తత్ర = అక్కడ, ప్రైక్షేతామ్ = చూచిరి.

తా. ఆ రాక్షసి దుర్బలులకు భయమును కలిగించేదిగా ఉండెను. అస్యహ్యమును కలిగించే రూపముతో చూచుటకు క్రూరముగా ఉండెను. వ్రేలాడు చున్న పొట్ట, తీక్ష్ణములైన కోరలు, ఎత్తు పల్లములతో కూడిన అవయవాలు, పరుషమైన చర్మ, విరబోసిన జుట్టు, వీటితో ఆమె ఆకారము చాల వికృతముగా ఉండెను. అట్టి ఆ రాక్షసి, అక్కడ, సోదరులైన రామలక్ష్మణులకు కనబడెను.

మూ. సా సమాసాద్య తౌ వీరౌ వ్రజన్తం భ్రాతురగ్రతః,
ఏహి రంస్యావహేత్యుక్త్వా సమాలమ్బత లక్ష్మణమ్. 14

ప్ర. అ. సా = ఆ రాక్షసి, వీరౌ = వీరులైన. తౌ = రామలక్ష్మణులను, సమాసాద్య = సమీపించి, ఏహి = రమ్ము; రంస్యావహే = రమించెదము, ఇతి = అని, ఉక్త్వా = పలికి భ్రాతుః = అన్నగారియొక్క, అగ్రతః = ఎదుట, వ్రజన్తమ్ = వెళ్ళుచున్న, లక్ష్మణమ్ = లక్ష్మణుణ్ణి, సమాలమ్బత = పట్టుకొనెను.

తా. ఆ రాక్షసి వీరులైన ఆ రామలక్ష్మణులను సమీపించి అన్నగారి ముందు నడచుచున్న లక్ష్మణునితో-"రమ్ము; రమించెదము" అని పలుకుచు అతనిని పట్టుకొనెను. 14

మూ. ఉవాచ చైనం వచనం సౌమిత్రిముపగూహ్య సా,
అహం త్వయోముఖీ నామ లబ్ధా తే త్వమసి ప్రియః,

నాథ పర్వతకూటేషు నదీనాం పులినేషు చ,
అయుఃశేషమిమం వీర త్వం మయా సహ రంస్యసే. 16

ప్ర. అ. సా = ఆమె, సౌమిత్రిమ్ = లక్ష్మణుణ్ణి, ఉపగూహ్య=కౌగలించుకొని, ఏనమ్ = ఇతనిని గూర్చి, వచనమ్ = వచనమును, ఉవాచ చ = పలికెను. అహం తు = నేను, అయోముఖీ నామ = అయోముఖి అను పేరు గలదానను. తే = నీకు, లబ్ధా = పొందబడితిని; త్వమ్ = నీవు, ప్రియః = ప్రియుడవు, అసి = అయి ఉన్నావు. వీర = ఓః వీరుడా! నాథ = నాథా! ఇమమ్ = ఈ, ఆయుఃశేషమ్ = ఆయుర్దాయశేషమును, త్వమ్ = నీవు, మయా సహ = నాతో కూడ, పర్వతకూటేషు = పర్వతశిఖరముల పైనా, నదీనామ్ = నదుల యొక్క, పులినేషు చ = ఇసుకతిన్నెలయందు, రంస్యసే = క్రీడించగలవు.

తా. ఆమె లక్ష్మణుణ్ణి కౌగలించుకొని, అతనితో ఇట్లు పలికెను. "నా పేరు అయోముఖి, నేను నీకు లభించినాను. నీవు నా ప్రియుడవు, వీరుడా! నాథా! ఇంక నీ మిగిలిన ఆయుర్దాయకాల మంతా నాతో కలిసి పర్వతశిఖరములమీదా నదుల ఇసుక తిన్నెల మీదా క్రీడించుము." 15, 16

మూ. ఏవముక్తస్తు కుపితః ఖడ్గముద్ధృత్య లక్ష్మణః,
కర్ణనాసాస్తనం తస్యా నిచకర్తారిసూదనః. 17

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, అరిసూదనః = శత్రువులను నశింపచేయువాడైన, లక్ష్మణః = లక్ష్మణుడు, కుపితః = కోపించినవాడై, ఖడ్గమ్ = ఖడ్గమును, ఉద్ధృత్య = ఎత్తి, తస్యాః = ఆమెయొక్క, కర్ణనాసాస్తనమ్ = చెవులను, ముక్కును, స్తనములను, చకర్త = ఛేదించెను.

తా. శత్రుసంహారకుడైన లక్ష్మణుడు ఆమె మాటలు విని, కోపముతో ఖడ్గమును తీసి ఆమె ముక్కు, చెవులు, స్తనములు ఖండించెను. 17

మూ. కర్ణనాసే నికృత్తే తు విస్వరం సా వినద్య చ,
యథాగతం ప్రదుద్రావ రాక్షసీ భీమదర్శనా. 18

ప్ర. అ. భీమదర్శనా = భయంకరమైన దర్శనము గల, సా రాక్షసీ = ఆ రాక్షసస్త్రీ, కర్ణనాసే = చెవులు ముక్కు, నికృత్తే = ఛేదించబడగా, విస్వరమ్ =

విపరీతస్వరము కలుగునట్లుగా, వినద్య = అరచి, యథాగతమ్=వచ్చిన విధము గానే, ప్రదుద్రావ = పరుగెత్తెను.

తా. చూచుటకు భయంకరముగా ఉండు ఆ రాక్షసి ముక్కు, చెవులు, ఛేదింపబడగా, వికృతస్వరముతో ఏడ్చుచు వచ్చిన మార్గముననే పారిపోయెను.

వి. ఈ అయోముఖీవృత్తాంతము ప్రాచ్యపాఠములో లేదు. 18

మూ. తస్యాం గతాయాం గహనం ప్రజనౌ వనమోజసా,
ఆసేదతురమిత్రఘ్నౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ. 19

ప్ర. అ. తస్యామ్=ఆమె, గతాయామ్=వెళ్ళిన దగుచుండగా, ప్రజనౌ= నడచుచున్న, భ్రాతరౌ = సోదరులైన, అమిత్రఘ్నౌ = శత్రుసంహారకులైన, రామలక్ష్మణౌ = రామలక్ష్మణులు, ఓజసా = తేజస్సుతో, గహనమ్ = ప్రవేశింప శక్యము కాని, వనమ్ = వనమును, ఆసేదతుః = సమీపించిరి.

తా. ఆ రాక్షసి వెళ్ళిపోయినతరువాత, శత్రుసంహారకులైన సోదరులైన రామలక్ష్మణులు, తేజస్సుతో, ప్రవేశింప శక్యము కాని ఆ వనములోనికి ప్రవేశించిరి. 19

మూ. లక్ష్మణస్తు మహాతేజాః సత్త్వవాన్ శీలవాన్ శుచిః,
అబ్రవీత్ప్రాఞ్జలిర్వాక్యం భ్రాతరం దీప్తతేజసమ్. 20

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడు, సత్త్వవాన్ = బలవంతుడు, శీలవాన్ = మంచి శీలముకలవాడు, శుచిః = పవిత్రుడు అయిన, లక్ష్మణస్తు = లక్ష్మణుడు, ప్రాఞ్జలిః=కట్టబడిన దోసిలి కలవాడై, దీప్తతేజసమ్=ప్రకాశించుచున్న తేజస్సు గల, భ్రాతరమ్=సోదరుని గూర్చి, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. మహాతేజశ్శాలి, బలవంతుడు. ఉత్తమశీలము కలవాడు, పవిత్రుడు అయిన లక్ష్మణుడు అంజలి ఘటించి, తేజస్సుతో ప్రజ్వలించుచున్న అన్నగారితో ఇట్లు పలికెను. 20

మూ. స్పన్దతే చ దృఢం బాహురుద్విగ్నమివ మే మనః,
ప్రాయశశ్చాప్యనిష్టాని నిమిత్తాన్యుపలక్షయే. 21

ప్ర. అ. మే = నాయొక్క, బాహుః = బాహువు, దృఢమ్ = అధికముగా, స్పన్దతే = అదురుచున్నది. మనః = మనస్సు, ఉద్విగ్నమివ = దిగులు చెంది నట్లు ఉన్నది. ప్రాయశః = ఎక్కువగా, అనిష్టాని = అనిష్టమును కలిగించు, నిమిత్తాని = శకునములను, ఉపలక్షయే = చూచుచున్నాను.

తా. నా బాహువు ఎక్కువగా అదరుచున్నది. మనస్సు దిగులు చెందు చున్నట్లున్నది. ఎక్కువగా అనిష్టసూచకములైన అపశకునములు కనబడు చున్నవి. 21

మూ. తస్మాత్సజ్జీభవార్య త్వం కురుష్వ వచనం హితమ్,
మమేవ హి నిమిత్తాని సద్యః శంసన్తి సంభ్రమమ్. 22

ప్ర. అ. ఆర్య = పూజ్యుడా ! తస్మాత్ = ఆ కారణమువలన, త్వమ్ = నీవు, సజ్జీభవ = సన్నద్ధుడవు కమ్ము. హితమ్ = హితమైన, వచనమ్ = నా మాటను, కురుష్వ = చేయుము. నిమిత్తాని = దుఃశకునములు, సద్యః = వెంటనే రానున్న, సంభ్రమమ్ = భయమును గూర్చి, మమ = నాకు, శంసన్తీవ హి = చెప్పుచున్నట్లున్నవి.

తా. పూజ్యుడవైన రామా ! అందుచే రాబోవు ఆపదను ఎదుర్కొనుటకు సిద్ధముగా ఉండుము. నేను చెప్పిన హితవాక్యమును వినుము. మన కేదో ఆపద వెంటనే రానున్నట్లు ఈ దుఃశకునములు నాకు చెప్పుచున్నట్లున్నవి 22

మూ. ఏష వఞ్చులకో నామ పక్షీ పరమదారుణః,
ఆవయోర్విజయం యుద్ధే శంసన్నివ వినర్దతి. 23

ప్ర. అ. పరమదారుణః = మిక్కిలి భయంకరమైన, వఞ్చులకో నామ = వంచులక మను పేరు గల, ఏషః పక్షీ = ఈ పక్షి. యుద్ధే = యుద్ధమునందు, ఆవయోః = మన ఇద్దరికి, విజయమ్ = జయమును, శంసన్నివ = చెప్పుచున్నదా అన్నట్లు, వినర్దతి = ధ్వని చేయుచున్నది.

తా. చాల భయంకరమైన వంచులక మనే ఈ పక్షి కూతను పట్టి యుద్ధములో మనకు జయము రానున్నటు తోచుచున్నది. 23

మూ. తయోరన్వేషతోరేవం సర్వం తద్వనమోజసా,
సంజజ్ఞే విపులః శబ్దో ప్రభఞ్జన్నివ తద్వనమ్. 24

ప్ర. అ. తయోః = ఆ రామలక్ష్మణులు, ఏవమ్ = ఇట్లు, ఓజసా = పరాక్రమములో, సర్వమ్ = సమస్తమైన, తత్ వనమ్ = ఆ వనమును, అన్వేషతోః = వెదకుచుండగా. తత్ వనమ్ = ఆ వనమును, ప్రభఞ్జన్నివ = విరచుచున్నది వలె, విపులః = అధికమైన, శబ్దః = శబ్దము, సంజజ్ఞే = కలిగెను.

తా. ఆ రామలక్ష్మణులు ఈ విధముగా తమ తేజస్సుతో ఆ వనము నంతా వెదకుచుండగా, ఆ వనమును విరచివేయుచున్నట్లు ఒక మహాశబ్దము వెలువడెను.

మూ. సంవేష్టితమివాత్యర్థం గగనం మాతరిశ్వనా,
వనస్య తస్య శబ్దోఽభూద్దివమాపూరయన్నివ. 25

ప్ర. అ. గగనమ్ = ఆకాశము, అత్యర్థమ్ = మిక్కిలి, మాతరిశ్వనా = వాయువుచేత, సంవేష్టితమివ = చుట్టబడినట్లుండెను. తస్య = ఆ, వనస్య = వనము యొక్క, శబ్దః = శబ్దము, దివమ్ = ఆకాశమును, ఆపూరయన్నివ = నింపుచున్నది వలె, అభూత్ = ఆయెను.

తా. ఆకాశము నంతా గాలి చుట్టబెట్టినట్లు అయ్యెను. ఆ వనము ధ్వని ఆకాశమును నింపుచున్నట్లుండెను. 25

మూ. తం శబ్దం కాఙ్క్షమాణస్తు రామః కక్షే సహానుజః,
దదర్శ సుమహాకాయం రాక్షసం విపులోదరమ్. 26

ప్ర. అ. తం శబ్దమ్ = ఆ శబ్దమును, కాఙ్క్షమాణః = కోరుచున్నవాడై, సహానుజః = తమ్మునితో కూడిన, రామః = రాముడు, కక్షే = పొదయందు, సుమహాకాయమ్ = చాల పెద్ద శరీరము కల, విపులోదరమ్ = విశాలమైన ఉదరము గల, రాక్షసమ్ = రాక్షసుడ్ని, దదర్శ = చూచెను.

తా. ఆ శబ్దము ఎట్లు వచ్చినదో తెలియ గోరిన, లక్ష్మణసమేతుడైన రాముడు ఇటు అటు చూచి, ఒక పొదలో పెద్ద శరీరము. విశాలమైన ఉదరము గల ఒక రాక్షసుడ్ని చూచెను. 26

మూ. ఆసేదతుస్తతస్తత్ర తావుభౌ ప్రముఖే స్థితమ్,
వివృద్ధమశిరోగ్రీవం కబన్ధముదరే ముఖమ్. 27

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తౌ ఉభౌ = వారిద్దరూ, తత్ర = అక్కడ, ప్రముఖే = తమఎదుట, స్థితమ్ = ఉన్నవాడు, వివృద్ధమ్ = చాలా పెరిగినవాడు, అశిరోగ్రీవమ్ = శిరస్సు కంఠము లేనివాడు, ఉదరే ముఖమ్ = ఉదరమునందు ముఖము గలవాడు అయిన, కబన్ధమ్ = కబంధుణ్ణి, ఆసేదతుః = సమీపించిరి.

తా. అంతలో ఆ రామలక్ష్మణులు అక్కడ తమ ఎదుటనే ఉన్న కబంధుణ్ణి సమీపించిరి. అతని చాల పెద్దగా పెరిగిన దేహమునందు శిరస్సు కాని, కంఠము కాని లేకుండెను. అతని ముఖము పొట్టలో ఉండెను. 27

మూ. రోమభిర్నిచితై స్తీక్ష్ణైర్మహాగిరిమివోచ్ఛ్రితమ్,
నీలమేఘనిభం రౌద్రం మేఘస్తనితనిస్వనమ్ 28

ప్ర. అ. నిచితైః = దట్టముగా ఉన్న, తీక్ష్ణైః = తీక్ష్ణములైన, రోమభిః = రోమములతో, ఉచ్ఛ్రితమ్ = ఉన్నతమైన, మహాగిరిమివ = మహాపర్వతము వలె ఉన్నవాడు, నీలమేఘనిభమ్ = నీలమేఘముతో సమానుడు, రౌద్రమ్ = భయంకరుడు, మేఘస్తనితనిస్వనమ్ = ఉరుమువంటి ధ్వని కలవాడు అయిన (కబంధుని సమీపించిరి).

తా. ఆ రాక్షసుడు మొనలు దేరిన దట్టమైన రోమాలతో ఎత్తైన పర్వతము వలె ఉండెను. నల్లటి మేఘము వలె భయంకరుడైన ఆ రాక్షసుని ధ్వని ఉరుము వలె ఉండెను. 28

మూ. అగ్నిజ్వాలానికాశేన లలాటస్థేన దీప్యతా,
మహాపక్ష్మేణ పిఙ్గేన విపులేనాయతేన చ. 29

ఏకేనోరసి ఘోరేణ నయనేనాశుదర్శినా,
మహాదంష్ట్రోపపన్నం తం లేలిహానం మహాముఖమ్. 30

ప్ర. అ. అగ్నిజ్వాలానికాశేన = అగ్నిజ్వాలతో సమానము, లలాటస్థేన = లలాటమునందున్నది, దీప్యతా = ప్రకాశించుచున్నది, మహాపక్ష్మేణ = పెద్ద రెప్పలు గలది, పిఙ్గేన = పచ్చగా ఉన్నది, విపులేన = విశాలమైనది, ఆయతేన చ = పొడవైనది

ఆశుదర్శినా=శీఘ్రముగా చూచునది, ఘోరేణ=భయంకరమైనది అయిన, ఉరసి =వక్షస్థలమునందున్న, ఏకేన=ఒక, నయనేన=నేత్రముతో కూడినవాడు, మహాదంష్ట్రోపపన్నమ్ = పెద్దకోరలతో కూడినవాడు, లేలిహానమ్ = (నాలుకతో పెదవులు) నాకుచున్నవాడు, మహాముఖమ్ = పెద్ద ముఖముగలవాడు అయిన, తమ్ = ఆ రాక్షసుని (సమీపించిరి).

తా. ఆ రాక్షసుని శిరస్సు పొట్టలో ఉండుటచే ఆతని వక్షఃస్థలము మీద నున్న లలాటమునందు అతివిశాలము, దీర్ఘము అయిన నేత్రముండెను. అది అగ్ని జ్వాల వలె మండుచుండెను. పచ్చని గ్రుడ్డు గల ఆ నేత్రముమీద పెద్ద రెప్పలుండెను. భయంకరమైన ఆ నేత్రముతో అతడు ఎంత దూరమైనా శీఘ్రముగా చూడగలిగి ఉండెను. పెద్ద నోరు, దీర్ఘములైన కోరలు గల ఆతడు మాటి మాటికి నాలుకతో పెదవులు నాకుచుండెను. 29,30

మూ. భక్షయన్తం మహాఘోరానృక్షసింహమృగద్విపాన్,
ఘోరౌ భుజౌ వికుర్వాణముభౌ యోజనమాయతౌ. 31

ప్ర. అ. మహాఘోరాన్=చాల భయంకరములైన, ఋక్షసింహమృగద్విపాన్ = ఎలుగుబంట్లను, సింహములను, మృగములను, ఏనుగులను, భక్షయన్తమ్ = భక్షించుచున్నవాడు, యోజనమ్ = యోజనదూరము, ఆయతౌ = పొడవైన, ఘోరౌ = భయంకరములైన, ఉభౌ=రెండు, భుజౌ = భుజములను, వికుర్వాణమ్ = కదుపుచున్నవాడు (అయిన రాక్షసుని సమీపించిరి).

తా. అతడు అతిభయంకరములైన ఎలుగుబంట్లను, సింహములను, మృగములను, ఏనుగులను భక్షించుచుండెను. అమడ పొడవైన భయంకరములైన రెండు భుజాలను కదుపుచుండెను. 31

మూ. కరాభ్యాం వివిధాన్ గృహ్య ఋక్షాన్ పక్షిగణాన్ మృగాన్,
ఆకర్షన్తం వికర్షన్తమనేకాన్ మృగయూథపాన్. 32
స్థితమావృత్య పన్థానం తయోర్భ్రాత్రోః ప్రపన్నయోః.

ప్ర. అ. ఋక్షాన్ = ఎలుగుబంట్లను, వివిధాన్ = అనేకవిధములైన, పక్షిగణాన్ = పక్షిసముదాయములను, మృగాన్=మృగములను, అనేకాన్=అనేకము

లైన, మృగయూథపాన్ = మృగముల గుంపులలో శ్రేష్ఠమైనవాటిని, కరాభ్యామ్ = హస్తములతో, గృహ్య = పట్టుకొని, ఆకర్షన్తమ్ = తన వైపు లాగుచున్న వాడు, వికర్షన్తమ్ = ఈడ్చుచున్న వాడు, ప్రపన్నయోః = సమీపించిన, తయోః = ఆ, భ్రాత్రోః = సోదరులయొక్క (తమయొక్క), పన్థానమ్ = మార్గమును, ఆవృత్య = ఆవరించి, స్థితమ్ = ఉన్నవాడుఅయిన (ఆ రాక్షసుని సమీపించిరి).

తా. ఆ రాక్షసుడు అనేకవిధములైన పక్షిసమూహములను, మృగములను, ఎలుగుబంట్లను, అనేకమృగశ్రేష్ఠములను తన చేతులతో పట్టి ఈడ్చుచు తన వైపు లాగుచుండెను. దగ్గరకు వచ్చిన ఆ రామలక్ష్మణుల మార్గమును ఆవరించి ఉండెను. 32

మూ. అథ తౌ సమభిక్రమ్య క్రోశమాత్రే దదర్శతుః, 33
మహాన్తం దారుణం భీమం కబన్ధం భుజసంవృతమ్,
కబన్ధమివ సంస్థానాదతిఘోరప్రదర్శనమ్. 34

ప్ర. అ. అథ = అటుపిమ్మట, తౌ = ఆ రామలక్ష్మణులు, సమభిక్రమ్య = నడచి వెళ్ళి, క్రోశమాత్రే = కోసు దూరమునందు, మహాన్తమ్ = చాల పెద్ద ఆకారము గలవాడు, దారుణమ్ = క్రూరుడు, భీమమ్ = భయంకరుడు. భుజసంవృతమ్ = భుజములచేత కప్పబడినవాడు, సంస్థానాత్ = శరీరాకారము వలన, కబన్ధమివ = మొండెము వలె ఉన్నవాడు, ఘోరప్రదర్శనమ్ = భయంకరమైన దర్శనము కలవాడు అయిన, కబన్ధమ్ = కబంధుణ్ణి, దదర్శతుః = చూచిరి.

తా. ఆ రామలక్ష్మణులు ముందుకు నడచి వెళ్ళి కోసుదూరములో చాల పెద్ద శరీరము గలవాడు, భయంకరుడు, క్రూరుడు అయిన కబంధుని చూచిరి. అతడు భుజములచేత కప్పబడియుండెను. అతని శరీరము మొండెము వలె ఉండెను. అతడు చూచుటకు చాల భయంకరుడుగా ఉండెను.

వి. వెనుక "రాముడు తన ఎదుటనే ఒక పొదలో కబంధుని చూచెను" అని చెప్పబడినది. ఇక్కడ రామలక్ష్మణులు ముందుకు నడచి వెళ్ళిన పిమ్మట కబంధుణ్ణి చూచినట్లుగా చెప్పబడుచున్నది. ప్రాచ్యపాఠములో ఇట్లు కాక - రామలక్ష్మణులు కబంధుణ్ణి చూచిరి అని చెప్పి రెండు క్రోసుల దూరమునుంచే ఆతడు వారిద్దరినీ లాగుచుండెను అని చెప్పబడినది. 34

మూ. స మహాబాహురత్యర్థం ప్రసార్య విపులౌ భుజౌ,
జగ్రాహ సహితావేవ రాఘవౌ పీడయన్ బలాత్. 35

ప్ర. అ. మహాబాహుః = పెద్ద బాహువులు గల, సః = ఆ కబంధుడు, విపులౌ = పెద్దవైన, భుజౌ = భుజములను, అత్యర్థమ్ = మిక్కిలి, ప్రసార్య = చాపి, సహితావేవ = కలిసి యుండగానె, రాఘవౌ = రామలక్ష్మణులను, బలాత్ = బలమువలన, పీడయన్ = పీడించుచు, జగ్రాహ = పట్టుకొనెను.

తా. పెద్ద చేతులు గల ఆ రాక్షసుడు అతిదీర్ఘములైన తన చేతులు చాలదూరము చాపి, రామలక్ష్మణుల నిద్దరినీ బలముచేత పీడించుచు కలిపియే పట్టుకొనెను.

మూ. ఖడ్గినౌ దృఢధన్వానౌ తిగ్మతేజోవపుర్ధరౌ,
భ్రాతరౌ వివశం ప్రాప్తౌ కృష్యమాణౌ మహాబలౌ. 36

ప్ర. అ. ఖడ్గినౌ = ఖడ్గములు కలవారు, దృఢధన్వానౌ = దృఢమైన ధనస్సులు కలవారు, తిగ్మతేజోవపుర్ధరౌ = తీవ్రమైన తేజస్సు గల శరీరములను ధరించినవారు, మహాబలౌ = గొప్ప బలము గలవారు అయిన, భ్రాతరౌ = ఆ సోదరు లిద్దరూ, కృష్యమాణౌ = లాగబడుచున్నవారై, వివశమ్ = తమ వశము లేక, ప్రాప్తౌ = అతనిని సమీపించిరి.

తా. ఖడ్గములను, దృఢములైన ధనస్సులను ధరించి తీవ్రమైన తేజస్సుతో ప్రకాశించుచున్న బలశాలులైన ఆ రామలక్ష్మణులు ఆ రాక్షసునిచే లాగబడినవారై, అతనికి లొంగిపోయి, అతని దగ్గర చేరిరి. 36

మూ. తత్ర ధైర్యేణ శూరస్తు రాఘవో నైవ వివ్యథే,
బాల్యాదనాశ్రయత్వాచ్చ లక్ష్మణస్త్వతివివ్యథే. 37
ఉవాచ స విషణ్ణః సన్ రాఘవం రాఘవానుజః.

ప్ర. అ. తత్ర = అప్పుడు, శూరః = శూరుడైన, రాఘవః = రాముడు, ధైర్యేణ = ధైర్యముచేత, నైవ వివ్యథే = వ్యథ చెందలేదు. లక్ష్మణస్తు = లక్ష్మణుడైతే, బాల్యాత్ = బాల్యమువలనను, అనాశ్రయత్వాచ్చ = ఆశ్రయము లేకపోవుట వలనను, అతివివ్యథే = చాల వ్యథ చెందెను. సః = ఆ, రాఘవానుజః = లక్ష్మణుడు,

విషణ్ణః సన్ = విషాదము చెందినవాడై, రాఘవమ్ = రాముణ్ణి గూర్చి, ఉవాచ = పలికెను.

తా. అప్పుడు శూరుడైన రాముడు ధైర్యవంతు డగుటచే వ్యథ చెంద లేదు. కాని లక్ష్మణుడు బాలు డగుటచేతను, రాముడు కూడ కష్టములో చిక్కు కొనుటచే మరొక ఆశ్రయ మేమీ లేకపోవుటచేతను చాల వ్యథ చెందెను. లక్ష్మణు డా విధముగ వ్యథ చెందినవాడై రామునితో ఇట్లు పలికెను.

వి. "అనాశ్రయత్వాచ్చ" అనేదాని అర్థం సంతృప్తికరంగా లేదు. 37

మూ. పశ్య మాం వీర వివశం రాక్షసస్య వశం గతమ్, 38
మయైకేన వినిర్యుక్తః పరిముఞ్చస్వ రాఘవ.

ప్ర. అ. వీర = వీరుడా ! వివశమ్ = వశము తప్పినవాడనై, రాక్షసస్య = రాక్షసునియొక్క, వశమ్ = వశమును, గతమ్ = పొందిన, మామ్ = నన్ను, పశ్య = చూడుము. రాఘవ = రామా ! ఏకేన = ఒక్క, మయా = నాచేత, వినిర్యుక్తః = దూరమైన వాడవై, పరిముఞ్చస్వ = విడిపించుకొనుము.

తా. వీరుడా ! నేను వివశుడనై రాక్షసునికి వశమై పోయినాను చూడుము. రామా ! నన్ను ఒక్కనినీ వీనికి సమర్పించి నీవు విడిపించుకొనుము. 38

మూ. మాం హి భూతబలిం దత్వా పలాయస్వ యథాసుఖమ్,
అధిగన్తాసి వైదేహీమచిరేణేతి మే మతిః.

ప్ర. అ. మామ్ = నన్ను, భూతబలిమ్ = భూతమునకు బలిగా, దత్వా = ఇచ్చి, యథాసుఖమ్ = సుఖముగా, పలాయస్వ = పారిపొమ్ము. వైదేహీమ్ = సీతను, అచిరేణ = కొద్దికాలములో, అధిగన్తాసి = పొందగలవు, ఇతి = అని, మే = నాయొక్క, మతిః = అభిప్రాయము.

తా. నన్ను ఈ భూతానికి బలిగా ఇచ్చి నీవు సుఖముగా పారిపొమ్ము. కొంచెము కాలములోనే నీవు సీతను పొందగలవని నా అభిప్రాయము. 39

మూ. ప్రతిలభ్య చ కాకుత్థ్స పితృపైతామహీం మహీమ్, 40
తత్ర మాం రామ రాజ్యస్థః స్మర్తుమర్హసి సర్వదా.

ప్ర. అ. కాకుత్స్థ = కకుత్స్థవంశమునందు జనించిన, రామ = రామా ! పితృపైతామహీమ్ = తండ్రితాతలకు చెందిన, మహీమ్ = భూమిని, ప్రతిలభ్య చ = పొంది, తత్ర = అక్కడ, రాజ్యస్థః = రాజ్యమునం దున్నవాడవై, సర్వదా = ఎల్లప్పుడు, మామ్ = నన్ను, స్మర్తుమ్ = స్మరించుటకు, అర్హసి = తగి ఉన్నావు.

తా. కకుత్స్థవంశమునందు జనించిన రామా ! తండ్రితాతలకు చెందిన భూమిని తిరిగి పొంది, రాజ్యమును పాలించుచు, నీవు అక్కడ నన్ను ఎల్లప్పుడు స్మరించుము.

మూ. లక్ష్మణేనైవముక్తస్తు రామః సౌమిత్రిమబ్రవీత్, 41
మా స్మ త్రాసం కృథా వీర న హి త్వాదృగ్విషీదతి.

ప్ర. అ. లక్ష్మణేన = లక్ష్మణునిచేత, ఏవమ్ = ఇట్లు ఉక్తః = పలకబడిన, రామః = రాముడు, సౌమిత్రిమ్ = లక్ష్మణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను, వీర = వీరుడా ! త్రాసమ్ = భయమును, మా స్మ కృథాః = చేయకుము. త్వాదృక్ = నీవంటివాడు, న విషీదతి హి = విషాదము చెందడు కదా !

తా. లక్ష్మణుని మాటలు విని రాముడు ఆతనితో ఇట్లనెను. "వీరుడా ! భయపడకుము. నీవంటివాడు విషాదము చెందడు కదా ?

వి. లక్ష్మణుడు ఈ విధముగ భయపడుట ఆతని స్వభావానికే విరుద్ధము. అందులోను రామునకు పారిపొమ్మని సలహా ఇచ్చుట ఎంత ఉచితమో ఊహించవచ్చును. ఈ ఐదు శ్లోకాలు ప్రాచ్యప్రతిలో లేవు. 41

మూ. ఏతస్మిన్నన్తరే క్రూరో భ్రాతరౌ రామలక్ష్మణౌ, 42
పప్రచ్ఛ ఘననిర్ఘోషః కబన్ధో దానవోత్తమః.

ప్ర. అ. ఏతస్మిన్ అన్తరే = ఈ మధ్యలో, క్రూరః = క్రూరుడైన, దానవోత్తమః = దానవులలో ఉత్తముడైన, కబన్ధః = కబంధుడు, ఘననిర్ఘోషః = మేఘము వంటి ధ్వని కలవాడై, భ్రాతరౌ = సోదరులైన, రామలక్ష్మణౌ = రామలక్ష్మణులను, పప్రచ్ఛ = అడిగెను.

తా. ఇంతలో క్రూరుడు, దానవులలో ఉత్తముడూ అయిన కబంధుడు మేఘధ్వని వంటి ధ్వనితో సోదరులైన ఆ రామలక్ష్మణులను ప్రశ్నించెను. 42

మూ. కౌ యువాం వృషభస్కన్ధౌ మహాఖడ్గధనుర్ధరౌ, 43
ఘోరం దేశమిమం ప్రాప్తౌ మమ భక్షావుపస్థితౌ.

ప్ర. అ. వృషభస్కన్ధౌ = ఎద్దు మూపు వంటి మూపు కలవారు. మహాఖడ్గధనుర్ధరౌ = గొప్పవైన ఖడ్గములను ధనస్సులను ధరించినవారు, ఘోరమ్ = భయంకరమైన, ఇమం దేశమ్ = ఈ దేశమును, ప్రాప్తౌ = వచ్చినవారు అయిన, యువామ్ = మీరిద్దరు, కౌ = ఎవరు ? మమ = నాయొక్క, భక్షౌ = ఆహారముగా, ఉపస్థితౌ = వచ్చినారు.

తా. ఏద్దు మూపు వంటి భుజములు కల మీరు ఎవరు? పెద్ద ఖడ్గములను ధనస్సులను ధరించి, భయంకరమైన ఈ ప్రదేశానికి వచ్చినారు ; నాకు ఆహారముగా వచ్చినారు. 43

మూ. వదతం కార్యమిహ వాం కిమర్థం చాగతౌ యువామ్, 44
ఇమం దేశమనుప్రాప్తౌ క్షుధార్తస్యేహ తిష్ఠతః.

ప్ర. అ. ఇహ = ఇక్కడ, వామ్ = మీకు, కార్యమ్ = పని యేమో, వదతమ్ = చెప్పండి. యువామ్ = మీరిద్దరూ, కిమర్థమ్ = ఎందుకు, ఆగతౌ = వచ్చినారు? క్షుధార్తస్య = ఆకలిచేత పీడితుడనై, ఇహ = ఇక్కడ, తిష్ఠతః = ఉన్న నాయొక్క, ఇమమ్ = ఈ, దేశమ్ = ప్రదేశమును గూర్చి, అనుప్రాప్తౌ = వచ్చినారు.

తా. ఇక్కడ మీకు ఏమి పనో చెప్పండి. మీరిద్దరూ ఎందుకు వచ్చినారు? నేను ఆకలితో బాధపడుచు ఉన్న ఈ నా ప్రదేశానికి వచ్చినారు ; 44

మూ. సబాణచాపఖడ్గౌ చ తీక్ష్ణశృఙ్గావివర్షభౌ, 45
మమాస్యమనుసంప్రాప్తౌ దుర్లభం జీవితం పునః.

ప్ర. అ. సబాణచాపఖడ్గౌ = బాణములతోను, ధనస్సులతోను, ఖడ్గములతోను కూడినవారై, తీక్ష్ణశృఙ్గౌ = తీక్ష్ణములైన కొమ్ములు గల, ఋషభౌ ఇవ = ఎద్దులు వలె ఉన్న మీరు, మమ = నాయొక్క, ఆస్యమ్ = ముఖమును, అనుసంప్రాప్తౌ = చేరినారు. పునః = మరల, జీవితమ్ = జీవితము, దుర్లభమ్ = దుర్లభమైనది.

తా. బాణములు, ధనస్సులు, ఖడ్గములు ధరించి తీక్ష్ణములైన కొమ్ములు గల వృషభముల వలె ఉన్న మీరిద్దరూ నా నోటివద్దకు వచ్చినారు. ఇంక మీకు జీవితము దుర్లభము. 45

మూ. తస్య తద్వచనం శ్రుత్వా కబన్ధస్య దురాత్మనః, 46
ఉవాచ లక్ష్మణం రామో ముఖేన పరిశుష్యతా.

ప్ర. అ. దురాత్మనః = దురాత్ముడైన, తస్య కబన్ధస్య = ఆ కబంధుని యొక్క, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, రామః = రాముడు, పరిశుష్యతా = ఎండిపోవుచున్న, ముఖేన = ముఖముతో, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. దురాత్ముడైన ఆ కబంధుని మాటలు వినగానే రాముని ముఖము వాడిపోయెను. అతడు లక్ష్మణునితో ఇట్లనెను. 46

మూ. కృచ్ఛ్రాత్ కృచ్ఛ్రతరం ప్రాప్య దారుణం సత్యవిక్రమ,
వ్యసనం జీవితాన్తాయ ప్రాప్తమప్రాప్య తాం ప్రియామ్.

ప్ర. అ. సత్యవిక్రమ = సత్యమైన పరాక్రమము గలవాడా! కృచ్ఛ్రాత్ = ఒక కష్టమునుండి, కృచ్ఛ్రతరమ్ = ఎక్కువ కష్టమును, ప్రాప్య = పొంది, ప్రియామ్ = ప్రియురాలైన, తామ్ = ఆ సీతను, అప్రాప్య = పొందక, జీవితాన్తాయ = జీవితముయొక్క అంతము కొరకు, దారుణమ్ = భయంకరమైన, వ్యసనమ్ = వ్యసనము, ప్రాప్తమ్ = పొందబడినది.

తా. సత్యమైన పరాక్రమము గల లక్ష్మణా! ఒక కష్టము వెనుక మరొక అధికమైన కష్టము వచ్చుచున్నది. నా ప్రియురాలైన సీత లభించలేదు. కాని ప్రాణములను తీసే ఈ దారుణమైన ఆపద వచ్చిపడినది. 47

మూ. కాలస్య సుమహద్వీర్యం సర్వభూతేషు లక్ష్మణ, 48
త్వాం చ మాం చ నరవ్యాఘ్ర వ్యసనైః పశ్య మోహితౌ.

ప్ర. అ. నరవ్యాఘ్ర = నరులలో శ్రేష్ఠుడా! లక్ష్మణ = లక్ష్మణా! సర్వ భూతేషు = సకలభూతముల విషయమునందూ కూడ, కాలస్య = కాలముయొక్క

వీర్యమ్=శక్తి, సుమహత్=చాల గొప్పది. వ్యసనైః=దుఃఖములచేత, మోహితౌ =బాధింపబడుచున్న, త్వాం చ=నిన్ను, మాం చ = నన్ను, పశ్య=చూడుము.

తా. నరులలో శ్రేష్ఠుడవైన లక్ష్మణా! అన్ని ప్రాణుల విషయమునందూ కూడ కాలము శక్తి చాల గొప్పది. నీవు, నేను కష్టాలచేత ఎట్లు బాధపడుచున్నామో చూడుము. 48

మూ. నాతిభారోఽస్తి కాలస్య సర్వభూతేషు లక్ష్మణ, 49
శూరాశ్చ బలవన్తశ్చ కృతాస్త్రాశ్చ రణాజిరే,
కాలాభిపన్నాః సీదన్తి యథా వాలుకసేతవః. 50

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా! కాలస్య = కాలమునకు, సర్వభూతేషు= అన్ని భూతములయందు, అతిభారః=ఎక్కువ భారము, నాస్తి=లేదు. శూరాశ్చ = శూరులు, బలవన్తశ్చ = బలవంతులు, రణాజిరే= రణరంగమునందు, కృతాస్త్రాశ్చ= చేయబడిన అస్త్రములు గలవారు, కాలాభిపన్నాః= కాలముచేత ఆక్రమింపబడినవారై, వాలుకసేతవః యథా=ఇసుకతో కట్టిన అడ్డకట్టలు వలె, సీదన్తి = నశింతురు.

తా. లక్ష్మణా! కాలానికి ఏ భూతముల విషయమందూ కూడ భారమనేది లేదు. శూరులు, బలవంతులు, యుద్ధరంగములో అస్త్రనైపుణ్యము చూపినవారు కూడ కాలము ఆక్రమించగానే ఇసుకతో కట్టిన అడ్డకట్టల వలె కూలిపోవుదురు. 50

మూ. ఇతి బ్రువాణో దృఢసత్యవిక్రమో
మహాయశా దాశరథిః ప్రతాపవాన్,
అవేక్ష్య సౌమిత్రిముదగ్రపౌరుషం
స్థిరాం తదా స్వాం మతిమాత్మనాఽకరోత్. 51

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ఏకోనసప్తతితమః సర్గః.

ప్ర. అ. దృఢసత్యవిక్రమః = దృఢమూ సత్యమూ అయిన పరాక్రమము గలవాడు, మహాయశాః = గొప్ప కీర్తి కలవాడు, ప్రతాపవాన్ = ప్రతాపవంతుడు

అయిన, దాశరథిః = రాముడు, ఇతి = ఇట్లు, బ్రువాణః = పలుకుచు, ఉదగ్ర పౌరుషమ్ = గొప్ప పౌరుషము గల, సౌమిత్రిమ్ = లక్ష్మణుని, అవేక్ష్య=చూచి, తదా = అప్పుడు, స్వామ్ = తనసంబంధమైన, స్థిరామ్ = స్థిరమైన, మతిమ్ = బుద్ధిని, ఆత్మనా = స్వయముగా, అకరోత్ = చేసెను.

తా. దృఢమూ, సత్యమూ అయిన పరాక్రమము కలవాడు, మహాయశః శాలి, ప్రతాపవంతుడు అయిన రాముడు, ఇట్లు పలుకుచు, తీవ్రమైన పౌరుషము గల లక్ష్మణుని చూచి, అప్పుడు తానే ఒక స్థిరమైన నిర్ణయము చేసికొనెను. 51

'బాలానందిని'' అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో అరువదితొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ సప్తతితమః సర్గః

[రామలక్ష్మణులు పరస్పరము సంప్రదించుకొని కబంధుని భుజములు నరుకుట. కబంధుడు వారిద్దరిని ఆదరించుట].

మూ. తౌ తు తత్ర స్థితౌ దృష్ట్వా భ్రాతరౌ రామలక్ష్మణౌ,
బాహుపాశపరిక్షిప్తౌ కబన్ధో వాక్యమబ్రవీత్. 1

ప్ర. అ. బాహుపాశపరిక్షిప్తౌ = బాహువుల పాశముచేత చుట్టబడిన, తత్ర స్థితౌ = అక్కడ ఉన్న, భ్రాతరౌ = సోదరులైన, తౌ రామలక్ష్మణౌ = ఆ రామలక్ష్మణులను, దృష్ట్వా = చూచి, కబన్ధః = కబంధుడు, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. తన బాహుపాశముచేత బంధింపబడి అక్కడ ఉన్న సోదరులైన ఆ రామలక్ష్మణులను చూచి కబంధు డిట్లనెను. 1

మూ. తిష్ఠతః కిం ను మాం దృష్ట్వా క్షుధార్తం క్షత్రియర్షభౌ,
ఆహారార్థం తు సందిష్టౌ దైవేన గతచేతసౌ. 2

ప్ర. అ. క్షత్రియర్షభౌ = క్షత్రియశ్రేష్ఠులారా ! క్షుధార్తమ్ = ఆకలిచేత, పీడింపబడిన, మామ్ = నన్ను, దృష్ట్వా = చూచి, కిం ను = ఏ కారణమువలన, తిష్ఠతః = నిలచి ఉన్నారు. గతచేతసౌ = పోయిన ప్రాణములు గల మీరు, దైవేన = దైవముచేత, ఆహారార్థమ్ = ఆహారముకొరకు, సందిష్టౌ = పంపబడినారు.

తా. ఓ! క్షత్రియశ్రేష్ఠులారా ! ఆకలితో బాధ పడుచున్న నన్ను చూచుచు కూడ అక్కడ నిలబడి యున్నారేమి ? ఇంక మీరు మరణించినట్లే, ఎందుచేత ననగా దైవము మిమ్ములను నాకు ఆహారముగా పంపినది. 2

మూ. తచ్ఛ్రుత్వా లక్ష్మణో వాక్యం ప్రాప్తకాలం హితం తదా,
ఉవాచార్తిం సమాపన్నో విక్రమే కృతలక్షణః. 3

ప్ర. అ. లక్ష్మణః = లక్ష్మణుడు, తత్ = అది, శ్రుత్వా = విని, తదా = అప్పుడు, ఆర్తిమ్ = దుఃఖమును, సమాపన్నః = పొందినవాడై, విక్రమే = ప్రయత్నమునందు, కృతలక్షణః = చేయబడిన ప్రయత్నము కలవాడై, ప్రాప్తకాలమ్ = కాలమునకుతగిన, హితమ్ = హితమైన, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. అప్పుడు లక్ష్మణు డాతని మాటలు విని, దుఃఖపీడితుడై, పరాక్రమము చూపుటకై ప్రయత్నించుచు, కాలానుగుణము, హితము అయిన మాట పలికెను. 3

మూ. త్వాం చ మాం చ పురా తూర్ణమాదత్తే రాక్షసాధమః,
తస్మాదసిభ్యామస్యాశు బాహూ ఛిన్దావహై గురూ. 4

ప్ర. అ. రాక్షసాధమః = ఈ రాక్షసాధముడు, తూర్ణమ్ = శీఘ్రముగా, త్వాం చ = నిన్నూ, మాం చ = నన్నూ, పురా ఆదత్తే = గ్రహించగలడు. తస్మాత్ = ఆ కారణమువలన, అస్య = ఇతనియొక్క, గురూ = పెద్దవైన, బాహూ = బాహువులను, అసిభ్యామ్ = ఖడ్గములచేత, ఛిన్దావహై = ఛేదించెదము.

తా. ఈ రాక్షసాధముడు నిన్నూ నన్నూ కూడ శీఘ్రముగా గ్రహించగలడు. అందువలన పెద్దవైన వీని బాహువులను వెంటనే ఛేదించెదము. 4

మూ. భీషణోఽయం మహాకాయో రాక్షసో భుజవిక్రమః,
లోకం హ్యతిజితం కృత్వా హ్యావాం హన్తుమి హేచ్ఛతి. 5

ప్ర. అ. భీషణః = భయంకరుడు, మహాకాయః = గొప్ప శరీరము కలవాడు, భుజవిక్రమః = భుజములలో పరాక్రమము గలవాడు అయిన, అయం రాక్షసః = ఈ రాక్షసుడు, లోకమ్ = లోకమును, అతిజితమ్ = పూర్తిగా జయించబడినదానినిగా, కృత్వా = చేసి, ఇహ = ఇప్పుడు, ఆవామ్ = మనల నిద్దరినీ, హన్తుమ్ = చంపుటకు, ఇచ్ఛతి = కోరుచున్నాడు.

తా. పెద్ద శరీరము గల భయంకరుడైన ఈ రాక్షసుని బల మంతా వీని భుజములలో ఉన్నది. ఇతడు లోకములోని అందరిని జయించి మనను కూడ ఇప్పుడు చంప ప్రయత్నించుచున్నాడు. 5

మూ. నిశ్చేష్టానాం వధో రాజన్ కుత్సితో జగతీపతేః,
క్రతుమధ్యోపనీతానాం పశూనామివ రాఘవ. 6

ప్ర. అ. రాజన్ = రాజా । రాఘవ = రామా । నిశ్చేష్టానామ్ = చేష్ట లేని వారియొక్క, వధః = వధ, క్రతుమధ్యోపనీతానాన్ = యజ్ఞమధ్యమునందు తీసికొని రాబడిన పశూనామివ = పశువుల వధ వలె, జగతీపతేః = రాజానకు, కుత్సితః = నిందితమైనది.

తా. రాజావైన రామా ! యజ్ఞము నిమిత్తము తీసికొని రాబడిన పశువులను చంపుట ఎట్లో అట్లే కదలలేనివారిని చంపుట రాజాలకు నింద్యము. 6

మూ. ఏతత్సంజల్పితం శ్రుత్వా తయోః క్రుద్ధస్తు రాక్షసః,
విదార్యాస్యం తదా రౌద్రస్తౌ భక్షయితుమారభత్ 7

ప్ర. అ. క్రూరః = క్రూరుడు, రౌద్రః = భయంకరుడూ అయిన, రాక్షసస్తు = రాక్షసుడైతే, తదా = అప్పుడు, తయోః = ఆ ఇద్దరియొక్క, సంజల్పితమ్ = సంభాషణను, శ్రుత్వా = విని, ఆస్యమ్ = ముఖమును, విదార్య = చీల్చి (తెరచి), తౌ = వారిని, భక్షయితుమ్ = భక్షించుటకు, ఆరభత్ = ప్రారంభించెను.

తా. క్రూరుడు, భయంకరుడూ అయిన ఆ రాక్షసుడు ఆ ఇద్దరి సంభాషణ విని, కోపించినవాడై, నోరు తెరచి వారిని భక్షించుటకు ప్రయత్నించెను. 7

మూ. తతస్తౌ దేశకాలజ్ఞౌ ఖడ్గాభ్యామేవ రాఘవౌ,
అచ్ఛిన్దతాం సుసంవిగ్నౌ బాహూ తస్యాంసదేశతః. 8

ప్ర. అ. ("సుసంవిగ్నౌ" అను పాఠముకంటె ''సుసంహృష్టౌ'' అను పాఠము బాగున్నది)

తతః = అటుపిమ్మట, సుసంహృష్టౌ = చాల సంతోషించిన, దేశకాలజ్ఞౌ = దేశకాలములను ఎరిగిన, తౌ = ఆ, రాఘవౌ = రామలక్ష్మణులు, ఖడ్గాభ్యామేవ = ఖడ్గములతో, తస్య = అతనియొక్క, బాహూ = బాహువులను, అంసదేశతః = భుజముల దగ్గర, అచ్ఛిన్దతామ్ = నరికిరి.

తా. పిమ్మట, దేశకాలములను ఎరిగిన ఆ రామలక్ష్మణులు చాల సంతోషించుచు ఖడ్గములతో అతని బాహువులను భుజముల దగరకు నరికివేసిరి. 8

మూ. దక్షిణో దక్షిణం బాహుమసక్తమసినా తతః,
చిచ్ఛేద రామో వేగేన సవ్యం వీరస్తు లక్ష్మణః. 9

ప్ర. అ. తతః=అటుపిమ్మట, దక్షిణః = నేర్పు గల, రామః=రాముడు, అసక్తమ్=అడ్డులేకుండగా, వేగేన=వేగముతో, దక్షిణం బాహుమ్ = కుడి చేతిని, అసినా = ఖడ్గముతో, చిచ్ఛేద = ఛేదించెను. వీరః = వీరుడైన, లక్ష్మణస్తు = లక్ష్మణుడైతే సవ్యమ్ = ఎడమ చేతిని, ఛేదించెను.

తా. అప్పుడు నేర్పు గల రాముడు వేగముగా, అడ్డు లేకుండగా, రాక్షసుని చెయ్యి ఛేదించెను. వీరుడైన లక్ష్మణుడు ఎడమ చెయ్యి ఖండించెను. 9

మూ. స పపాత మహాబాహుశ్ఛిన్నబాహుర్మహాస్వనః,
ఖం చ గాం చ దిశశ్చైవ నాదయన్ జలదో యథా. 10

ప్ర. అ. మహాబాహుః = దీర్ఘమైన బాహువులు గల, సః=ఆతడు, ఛిన్నబాహుః = ఛేదింపబడిన బాహువులు కలవాడై, మహాస్వనః = గొప్ప ధ్వని కలవాడై, జలదః యథా=మేఘము వలె, ఖం చ=ఆకాశమును, గాం చ=భూమిని, దిశశ్చైవ=దిక్కులను, నాదయన్ = ధ్వనింపచేయుచు, పపాత = పడెను.

తా. దీర్ఘమైన బాహువులు గల ఆ కబంధుడు బాహువులు ఛేదింపబడగానే పెద్ద ధ్వనితో మేఘము వలె ఆకాశమును, పృథివిని, దిక్కులను ధ్వనింపచేయుచు పడిపోయెను. 10

మూ. స నికృత్తౌ భుజౌ దృష్ట్వా శోణితౌఘపరిప్లుతః,
దీనః పప్రచ్ఛ తౌ వీరౌ కౌ యువామితి దానవః. 11

ప్ర. అ. సః = ఆ, దానవః = దానవుడు, నికృత్తౌ = ఖండించబడిన, భుజౌ = భుజములను, దృష్ట్వా = చూచి, శోణితౌఘపరిప్లుతః = రక్తప్రవాహము చేత తడపబడినవాడై, దీనః = దీనుడై, యువామ్ = మీ రిద్దరూ, కౌ = ఎవరు? ఇతి = అని, తౌ వీరౌ = ఆ వీరులను, పప్రచ్ఛ = అడిగెను.

తా. ఆ దానవుడు ఛేదించబడిన తన భుజములు చూచుకొని, రక్త ప్రవాహముచేత తడపబడినవాడై, దీనుడై "మీరు ఎవరు?" అని ఆ వీరులను అడిగెను. 11

మూ. ఇతి తస్య బ్రువాణస్య లక్ష్మణః శుభలక్ష్మణః,
శశంస రాఘవం తస్య కబన్ధస్య మహాత్మనః. 12

ప్ర. అ. తస్య = అతడు, ఇతి = ఇట్లు, బ్రువాణస్య = పలుకుచుండగా, శుభలక్షణః = శుభమైన లక్షణములు గల. సః లక్ష్మణః = ఆ లక్ష్మణుడు, మహాత్మనః = మహాత్ముడైన, కబన్ధస్య = కబంధునకు, రాఘవమ్ = రాముని గూర్చి, శశంస = చెప్పెను.

తా. ఆ దానవుడు ఇట్లు పలుకుచుండగా శుభమైన లక్షణములు గల లక్ష్మణుడు మహాత్ముడైన కబంధునకు రాముని గూర్చి ఇట్లు చెప్పెను. 12

మూ. అయమిక్ష్వాకుదాయదో రామో నామ జనైః శ్రుతః,
అస్యైవావరజం విద్ధి భ్రాతరం మాం చ లక్ష్మణమ్. 13

ప్ర. అ. అయమ్=ఇతడు, రామో నామ=రాముడనే పేరు గలవాడుగా, జనైః = జనులచేత, శ్రుతః = వినబడిన, ఇక్ష్వాకుదాయాదః = ఇక్ష్వాకువంశములో పుట్టినవాడు. మామ్ = నన్ను, అస్య = ఇతనియొక్క, అవరజం భ్రాతరమ్ = తమ్ముడైన, లక్ష్మణమ్ = లక్ష్మణునిగా, విద్ధి = తెలుసుకొనుము.

తా. ఇతడు ఇక్ష్వాకువంశములో పుట్టినవాడు. రాము డను పేరుతో జనులలో ప్రసిద్ధుడు. నేను ఇతని తమ్ముడను. నా పేరు లక్ష్మణుడు. 13

మూ. అస్య దేవప్రభావస్య వసతో విజనే వనే,
రక్షసాపహృతా పత్నీ యామిచ్ఛన్తావిహాగతౌ. 14

ప్ర. అ. విజనే = జనశూన్యమైన, వనే = వనమునందు, వసతః = నివసించుచున్న, దేవప్రభావస్య = దేవతలతో సమానమైన ప్రభావము గల, అస్య = ఈతనియొక్క, పత్నీ = భార్య, రక్షసా = రాక్షసునిచేత, అపహృతా = అపహరించబడినది. యామ్ = ఎవతెను, ఇచ్ఛన్తౌ = పొందగోరుచున్నవారమై, ఇహ = ఇక్కడికి, ఆగతౌ = వచ్చినాము.

తా. దేవతలతో సమానమైన ప్రభావము గల ఇతడు నిర్జనమైన అరణ్య

ములో నివసించుచుండగా, ఇతని భార్యను రాక్షసుడు అపహరించినాడు. ఆమెను వెదకుచు ఇక్కడికి వచ్చినాము. 14

మూ. త్వం తు కో వా కిమర్థం వా కబన్ధసదృశో వనే,
ఆస్యేనోరసి దీప్తేన భగ్నజఙ్ఘో విచేష్టసే. 15

ప్ర. అ. త్వం తు = నీవు, కః వా = ఎవ్వరవు ? కబన్ధసదృశః = మొండెముతో సమానుడవై, ఉరసి = వక్షస్థలమునందు, దీప్తేన = ప్రకాశించుచున్న, ఆస్యేన = ముఖముతో, భగ్నజఙ్ఘః = విరిగిపోయిన కాళ్ళు కలవాడవై, వనే = వనమునందు, కిమర్థం వా = ఎందుకు, విచేష్టసే = దొరలుచున్నావు ?

తా. నీవు ఎవ్వరవు ? మొండెము వలె ఉండి, ముఖము వక్షస్థలమునందు ప్రకాశించుచుండగా, కాళ్ళు విరిగి. ఎందుచేత ఈ అరణ్యములో దొరలుచున్నావు?

మూ. ఏవముక్తః కబన్ధస్తు లక్ష్మణేనోత్తరం వచః,
ఉవాచ పరమప్రీతస్తదిన్ద్రవచనం స్మరన్. 16

ప్ర. అ. లక్ష్మణేన = లక్ష్మణునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, కబన్ధస్తు = కబంధుడైతే, తత్ = ఆ, ఇన్ద్రవచనమ్ = ఇంద్రుని వచనమును, స్మరన్ = స్మరించుచు, పరమప్రీతః = చాలా సంతోషించినవాడై, ఉత్తరమ్ = ప్రత్యుత్తరరూపమైన, వచః = వచనమును, ఉవాచ = పలికెను.

తా. కబంధుడు లక్ష్మణుని మాటలు విని, పూర్వము ఇంద్రుడు చెప్పిన మాటలు స్మరించి, చాల సంతోషించుచు ఇట్లు పలికెను. 16

మూ. స్వాగతం వాం నరవ్యాఘ్రౌ దిష్ట్యా పశ్యామి చాప్యహమ్,
దిష్ట్యా చేమౌ నికృత్తౌ మే యువాభ్యాం బాహుబన్ధనౌ, 17

ప్ర. అ. నరవ్యాఘ్రౌ = నరశ్రేష్ఠులారా ! వామ్ = మీకు, స్వాగతమ్ = స్వాగత మగుగాక. అహమ్ = నేను, దిష్ట్యా = అదృష్టవశముచేత, పశ్యామి = చూచుచున్నాను. దిష్ట్యా = అదృష్టవశముచేత, యువాభ్యామ్ = మీచేత, మే = నాయొక్క, ఇమౌ = ఈ, బాహుబన్ధనౌ = బాహుబంధనములు, నికృత్తౌ = ఛేదించబడినవి.

తా. ఓ! పురుషశ్రేష్ఠులారా! మీకు సుఖాగమనము అగుగాక. అదృష్ట వశముచేత మిమ్ములను చూచుచున్నాను. ఈ నా బాహుబంధనములను మీరు నా అదృష్టవశముచేత ఛేదించినారు. 17

మూ. విరూపం యచ్చ మే రూపం ప్రాప్తం హ్యవినయాద్యథా,
తన్మే శృణు నరవ్యాఘ్ర తత్త్వతః శంసత స్తవ. 18

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
సప్తతితమః సర్గః.

ప్ర. అ. నరవ్యాఘ్ర=నరశ్రేష్ఠుడా! మే=నాయొక్క, విరూపమ్=వికృత మైన, యత్=ఏ, రూపమ్=రూపము గలదో, అది, యథా= ఎట్లు, అవినయాత్ = అవినయమువలన, ప్రాప్తమ్=లభించినదో, తవ=నీకు, తత్త్వతః=యథార్థ ముగా, శంసతః = చెప్పుచున్న, మే = నానుండి, శృణు = వినుము.

తా. ఓ! నరశ్రేష్ఠుడా! ఈ వికృతమైన రూపము నాకే అవినయము చేయుటచే వచ్చినదో యథార్థముగా చెప్పెదను; వినుము.

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్య కాండలో డెబ్బదవ సర్గ సమాప్తము

అథ ఏకసప్తతితమః సర్గః

[కబంధుడు తన వృత్తాంతము చెప్పి "నా శరీరమును దహించి వేసిన పిమ్మట మీకు సీతాన్వేషణమునందు ఉపాయము చెప్పెదను" అని రామునితో పలుకుట]

మూ. పురా రామ మహాబాహో మహాబలపరాక్రమ,
రూపమాసీన్మమాచిన్త్యం త్రిషు లోకేషు విశ్రుతమ్, 1
యథా సోమస్య శక్రస్య సూర్యస్య చ యథా వపుః.

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు కలవాడా! మహాబలపరాక్రమ = గొప్ప బలము పరాక్రమము కలవాడా! రామ = రామా! పురా = పూర్వము, సోమస్య=చంద్రుని రూపము, శక్రస్య=దేవేంద్రునిరూపము, యథా = ఎట్లో, సూర్యస్య చ=సూర్యునియొక్క, వపుః = శరీరము, యథా = ఎట్లో, అట్లే, మమ = నాయొక్క, రూపమ్ = రూపము, అచిన్త్యమ్ = ఊహింప శక్యము కానిదిగాను, త్రిషు లోకేషు = మూడు లోకములయందు, విశ్రుతమ్=ప్రసిద్ధము గాను, ఆసీత్ = ఉండెను.

తా. గొప్ప బాహువులు, అత్యధికమైన బలపరాక్రమములు గల రామా! పూర్వము నా రూపము మూడు లోకములలో ప్రసిద్ధమై, ఊహింప శక్యము కాని విధమున అద్భుతముగా ఉండెను. నా రూపము చంద్రసూర్యుల రూపము వలె, దేవేంద్రుని రూపము వలె ఆశ్చర్యకరముగా ఉండెను. 1

మూ. సోఽహం రూపమిదం కృత్వా లోకవిత్రాసనం మహత్,
ఋషీన్వనగతాన్రామ త్రాసయామి తతస్తతః.

ప్ర. అ. రామ=రామా! సః అహమ్ = అట్టి నేను, లోకవిత్రాసనమ్ = లోకములకు భయము కలిగించు, మహత్ = పెద్దదైన, ఇదం రూపమ్ = ఈ

రూపమును, కృత్వా = చేసికొని, తత స్తతః = అక్కడక్కడ, వనగతాన్ = వన ములో ఉన్న, ఋషీన్ = ఋషులను, త్రాసయామి = భయపెట్టుచుండెడివాడను.

తా. రామా! అట్టి అద్భుతమైన రూపము గల నేను లోకములకు భయము కలిగించే ఈ రూపము దాల్చి అక్కడక్కడ వనాలలో నివసించే మును లను భయపెట్టుచుండేవాడను. 2

మూ. తతః స్థూలశిరా నామ మహర్షిః కోపితో మయా, 3
సంచిన్వన్వివిధం వన్యం రూపేణానేన ధర్షితః.

ప్ర. అ. తతః = అంత, వివిధమ్ = అనేకవిధములైన, వన్యమ్ = వనము నందు లభించే వస్తుసముదాయమును, సంచిన్వన్ = ప్రోగుచేయుచున్న, స్థూల శిరాః నామ = స్థూలశిరస్కు డను పేరు గల, మహర్షిః = మహర్షి, అనేన = ఈ, రూపేణ = రూపముతో, ధర్షితః = బెదిరించబడినవాడై, మయా = నాచేత, కోపి తః = కోపింపచేయబడినాడు.

తా. ఒకనాడు నేను, అనేకవిధములైన వనములో లభించే వస్తువులను సేకరించుచున్న స్థూలశిరస్కు డనే మహర్షిని ఈ రూపముతో బెదిరించి అతనికి కోపము కలిగించితిని. 3

మూ. తేనాహముక్తః ప్రేక్ష్యైవం ఘోరశాపాభిధాయినా, 4
ఏతదేవ నృశంసం తే రూపమస్తు విగర్హితమ్.

ప్ర. అ. ప్రేక్ష్య = నన్ను చూచి, ఘోరశాపాభిధాయినా = ఘోరమైన శాపమును పలికిన, తేన = ఆ మహర్షిచేత, అహమ్ = నేను, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడితిని. తే = నీకు, నృశంసమ్ = క్రూరము, విగర్హితమ్ = నింద్యమూ అయిన, ఏతత్ = ఈ, రూపమేవ = రూపమే అస్తు = ఉండుగాక.

తా. ఆ మహర్షి నన్ను చూచి ఘోరమైన శాప మిచ్చుచు ఇట్లు పలికెను. "నీకు ఇటువైన క్రూరము, నింద్యము అయిన ఈ రూపమే ఉండుగాక".

మూ. స మయా యాచితః క్రుద్ధః శాపస్యాన్తో భవేదితి, 5
అభిశాపకృతస్యేతి తేనేదం భాషితం వచః.

ప్ర. అ. క్రుద్ధః = కోపించిన, సః = ఆమహర్షి, అభిశాపకృతస్య = అపచారముచేత చేయబడిన, శాపస్య = ఈ శాపమునకు, అన్తః = అంతము, భవేత్ = అగుగాక, ఇతి = అని, మయా = నాచేత, ప్రార్థితః = ప్రార్థింపబడెను; తేన = ఆ మహర్షిచేత, ఇదమ్ = ఈ, వచః = వచనము, భాషితమ్ = పలకబడినది.

తా. "నా అపచారమువలన కలిగిన ఈ శాపమునకు అంతము చూపుము" అని నేను క్రుద్ధుడైన ఆ మహర్షిని ప్రార్థింపగా, ఆతడిట్లనెను. 5

మూ. యదా ఛిత్త్వా భుజౌ రామస్త్వాం దహేద్విజనే వనే, 6
తదా త్వం ప్రాప్స్యసే రూపం స్వమేవ విపులం శుభమ్.

ప్ర. అ. రామః = రాముడు, భుజౌ = భుజములను, ఛిత్త్వా = ఛేదించి, త్వామ్ = నిన్ను, యదా = ఎప్పుడు, విజనే = జనశూన్యమైన, వనే = వనమునందు, దహేత్ = కాల్చునో, తదా = అప్పుడు, స్వమేవ = నీ సంబంధమైన, విపులమ్ = విశాలమైన, శుభమ్ = మంగళకరమైన, రూపమ్ = రూపమును, ప్రాప్స్యసే = పొందగలవు.

తా. "జనశూన్యమైన వనములో రాముడు ఎప్పుడు నీ భుజములను ఛేదించి, దహించునో, అప్పుడు నీవు మంగళకరమైన, విశాలమైన నీ రూపమును తిరిగి పొందగలవు". 6

మూ. శ్రియా విరాజితం పుత్రం దనోస్త్వం విద్ధి లక్ష్మణ, 7
ఇన్ద్రకోపాదిదం రూపం ప్రాప్తమేవం రణాజిరే.

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! దనోః = దనువుయొక్క, శ్రియా = శోభతో, విరాజితమ్ = ప్రకాశింపచేయబడిన, పుత్రమ్ = పుత్రుణ్ణిగా, త్వమ్ = నీవు, విద్ధి = తెలుసుకొనుము. ఇన్ద్ర కోపాత్ = ఇంద్రుని కోపమువలన, రణాజిరే = యుద్ధరంగమునందు, ఏవమ్ = ఇట్లు, ఇదం రూపమ్ = ఈ రూపము, ప్రాప్తమ్ = పొందబడినది.

తా. లక్ష్మణా ! నేను దనువు కుమారుడను, లక్ష్మితో ప్రకాశించేవాడను. నా కీటి రూపము యుద్ధరంగములో ఇంద్రుని కోపమువలన వచ్చినది. 7

మూ. అహం హి తపసోగ్రేణ పితామహమతోషయమ్, 8
దీర్ఘమాయుః స మే ప్రాదాత్తతో మాం విభ్రమోఽస్పృశత్.

ప్ర. అ. అహమ్ = నేను, ఉగ్రేణ = ఉగ్రమైన, తపసా = తపస్సుచేత, పితామహమ్ = బ్రహ్మదేవుని, అతోషయమ్ = సంతోషపెట్టితిని. సః = ఆ బ్రహ్మదేవుడు, మే = నాకు, దీర్ఘమ్ = దీర్ఘమైన, ఆయుః = ఆయుర్దాయమును, ప్రాదాత్ = ఇచ్చెను. తతః = పిమ్మట, మామ్ = నన్ను, విభ్రమః = భ్రాంతి, అస్పృశత్ = స్పృశించెను.

తా. నేను ఉగ్రమైన తపస్సు చేసి బ్రహ్మదేవుని సంతోషపెట్టగా ఆ బ్రహ్మదేవుడు నాకు దీర్ఘాయుర్దాయమును ప్రసాదించెను. దానితో నాకు గర్వము కలిగెను. 8

మూ. దీర్ఘయార్మయా ప్రాప్తం కిం మే శక్రః కరిష్యతి, 9
ఇత్యేవం బుద్ధిమాస్థాయ రణే శక్రమధర్షయమ్.

ప్ర. అ. మయా = నాచేత, దీర్ఘమ్ = దీర్ఘమైన, ఆయుః = ఆయుర్దాయము, ప్రాప్తమ్ = పొందబడినది. శక్రః = దేవేంద్రుడు, మే = నాకు, కిం కరిష్యతి = ఏమి చేయగలడు॥ ఇత్యేవమ్ = ఇట్లు, బుద్ధిమ్ = బుద్ధిని, ఆస్థాయ = అవలంబించి, రణే = యుద్ధమునందు, శక్రమ్ = దేవేంద్రుని, అధర్షయమ్ = ఎదిరించితిని.

తా. "నాకు దీర్ఘాయుర్దాయము లభించినది కదా; దేవేంద్రుడు నన్నేమి చేయగలడు"? ఈ విధమైన ఆలోచనతో యుద్ధమునందు ఇంద్రుని ఎదిరించితిని. 9

మూ. తస్య బాహుప్రయుక్తేన వజ్రేణ శతపర్వణా. 10
సక్థినీ చైవ మూర్ధా చ శరీరే సంప్రవేశితమ్.

ప్ర. అ. తస్య = ఇంద్రునియొక్క, బాహుప్రయుక్తేన = బాహువుచేత ప్రయోగింపబడిన, శతపర్వణా = నూరు అంచులు గల, వజ్రేణ = వజ్రాయుధముచేత, సక్థినీ చైవ = తొడలు, మూర్ధా చ = శిరస్సు, శరీరే = శరీరమునందు, సంప్రవేశితమ్ = ప్రవేశపెటబడినది.

తా. ఇంద్రుడు బాహువుతో నూరు అంచులు గల వజ్రాయుధమును ప్రయోగించగా నా తొడలు, తల కూడ శరీరములోనికి చొచ్చుకునిపోయినవి. 10

మూ. న మయా యాచ్యమానః సన్నానయద్యమసాదనమ్. 11
పితామహవచః సత్యం తదస్త్వితి మమాబ్రవీత్,

ప్ర. అ. సః = దేవేంద్రుడు, మయా = నాచేత, యాచ్యమానః సన్ = యాచింపబడుచు, యమసాదనమ్ = యమలోకమును, నానయత్ = పంపలేదు. తత్ = ఆ, పితామహవచః = బ్రహ్మదేవుని వచనము, సత్యమ్ = సత్యము, అస్తు ఇతి = అగు గాక అని, మమ = నాకు, అబ్రవీత్ = పలికెను.

తా. నాప్రార్థనను అంగీకరించి ఇంద్రుడు నన్ను యమలోకమునకు పంపలేదు. బ్రహ్మదేవుని మాట సత్యమగుగాక అని నాతో పలికి వదలిపెట్టెను.

మూ. అనాహారః కథం శక్తో భగ్నసక్థిశిరోముఖః, 12
వజ్రేణాభిహతః కాలం సుదీర్ఘమపి జీవితుమ్.

ప్ర. అ. వజ్రేణ = వజ్రముచేత, అభిహతః = కొట్టబడిన నేను, భగ్నసక్థిశిరోముఖః = విరిగిపోయిన తొడలు, శిరస్సు, ముఖము కలవాడనై, అనాహారః = ఆహారము లేనివాడనై, సుదీర్ఘం కాలమ్ = చాల కాలము. జీవితుమపి = జీవించుటకు కూడా, కథమ్ = ఎట్లు, శక్తః = సమర్థుడ నగుదును?

తా. "వజ్రముచేత కొట్టబడి, తొడలు, శిరస్సు, ముఖము విరిగిపోయిన నేను ఆహారము లేకుండా చాలా కాలము ఎట్లు జీవించగలను"? 12

మూ. ఏవముక్తస్తు మే శక్రో బాహూ యోజనమాయతౌ, 13
ప్రాదాదాస్యం చ మే కుక్షౌ తీక్ష్ణదంష్ట్రమకల్పయత్.

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, శక్రః = దేవేంద్రుడు, మే = నాకు, యోజనమ్ = యోజనము దూరము, ఆయతౌ = పొడవైన, బాహూ = బాహువులను, ప్రాదాత్ = ఇచ్చెను. మే = నాయొక్క, కుక్షౌ = కుక్షియందు, తీక్ష్ణదంష్ట్రమ్ = తీక్ష్ణమైన కోరలు గల, ఆస్యం చ = ముఖమును కూడా, అకల్పయత్ = ఏర్పరచెను.

తా. ఈ విధముగా నేను అడుగగా దేవేంద్రుడు నాకు యోజనము పొడ

వైన బాహువులు ఇచ్చి, నా పొట్టలో తీక్ష్ణమైన దంతము లున్న నోరు కూడా అమర్చెను. 13

మూ. సోఽహం భుజాభ్యాం దీర్ఘాభ్యాం సంకృష్యాస్మిన్వనేచరాన్,
సింహద్విపమృగవ్యాఘ్రాన్ భక్షయామి సమన్తతః.

ప్ర. అ. సః అహమ్ = అట్టి నేను, అస్మిన్ = ఈ, వనే = వనమునందు, దీర్ఘాభ్యామ్=పొడవైన, భుజాభ్యామ్=భుజములతో, అస్మిన్=ఈ, వనే = వనమునందు, సమన్తతః = అంతా, చరాన్ = సంచరించుచున్న, సింహద్విపమృగవ్యాఘ్రాన్ = సింహములను, ఏనుగులను, మృగములను, పెద్దపులులను, సంకృష్య = లాగి, భక్షయామి = భక్షించుచున్నాను.

తా. అట్టి నేను ఈ వనములో అంతటా సంచరించుచున్న సింహములను, గజములను, లేళ్లను, పెద్దపులులను దీర్ఘములైన నా భుజములతో లాగి భక్షించుచున్నాను. 14

మూ. స తు మామబ్రవీదిన్ద్రో యదా రామః సలక్ష్మణః, 15
ఛేత్స్యతే సమరే బాహూ తదా స్వర్గం గమిష్యసి.

ప్ర. అ. సః = ఆ, ఇన్ద్రః తు = ఇంద్రుడైతే, మామ్ = నన్ను గూర్చి, అబ్రవీత్ = పలికెను. యదా=ఎప్పుడు, సలక్ష్మణః=లక్ష్మణసహితుడైన, రామః = రాముడు, సమరే= యుద్ధమునందు, బాహూ = బాహువులను, ఛేత్స్యతే = ఛేదించగలడో, తదా = అప్పుడు, స్వర్గమ్ = స్వర్గమును గూర్చి, గమిష్యసి = వెళ్ళగలవు.

తా. "లక్ష్మణసమేతుడైన రాముడు ఎప్పుడు యుద్ధములో నీ బాహువులను ఛేదించునో అప్పుడు నీవు మళ్ళీ స్వర్గానికి వెళ్లెదవు"అని ఇంద్రుడు నాతో చెప్పెను. 15

మూ. అనేన వపుషా రామ వనేఽస్మిన్రాజసత్తమ, 16
యద్యత్పశ్యామి సర్వస్య గ్రహణం సాధు రోచయే.

ప్ర. అ. రాజసత్తమ = రాజశ్రేష్ఠుడవైన, రామ = రామా ! అస్మిన్ వనే = ఈ వనమునందు, అనేన వపుషా = ఈ దేహముతో, యద్యత్ = దేనిని దేనిని,

పశ్యామి = చూతునో, సర్వస్య = ఆ సకలపదార్థ జాతముయొక్క, గ్రహణమ్= గ్రహణమును, సాధు = బాగుగా, రోచయే = ఇష్టపడుచున్నాను.

తా. రాజశ్రేష్ఠుడవైన రామా ! అది మొదలు నేనీ శరీరముతో ఈ వనములో ఉండి, కనిపించిన ప్రతిదానినీ గ్రహించవలె ననే కోరికతో ప్రవర్తించుచున్నాను. 16

మూ. అవశ్యం గ్రహణం రామో మన్యేఽహం సముపైష్యతి, 17
ఇమాం బుద్ధిం పురస్కృత్య దేహన్యాసకృతశ్రమః.

ప్ర. అ. రామః = రాముడు, అవశ్యమ్ = తప్పక, గ్రహణమ్ = గ్రహణమును, సముపైష్యతి = పొందగలడు, అని, అహమ్ = నేను, మన్యే = తలచుచున్నాను. ఇమామ్ = ఈ, బుద్ధిమ్ = బుద్ధిని, పురస్కృత్య=పురస్కరించుకొని, దేహన్యాసకృతశ్రమః = దేహమును విడచుటయందు చేయబడిన శ్రమ కలవాడనై (ఉన్నాను).

తా. "రాముడు ఎప్పటికైనా తప్పక నా పట్టులోనికి రాగలడు"అను ఆలోచనతో, ఈ దేహమును విడచుటకై ప్రయత్నము చేయుచు (ప్రతివస్తువును పట్టుకొనుచు) ఉన్నాను. 17

మూ. స త్వం రామోఽసి భద్రం తే నాహమన్యేన రాఘవ, 18
శక్యో హన్తుం యథాతత్త్వమేవముక్తం మహర్షిణా.

ప్ర. అ. రాఘవ = రామా ! త్వమ్=నీవు, సః రామః=ఆ రాముడవుగా, అసి = అయి ఉన్నావు. తే = నీకు, భద్రమ్ = మంగళ మగుగాక. మహర్షిణా= మహర్షిచేత, తత్త్వమ్ = యథార్థము, ఏవమ్ = ఇట్లు, యథా=ఎట్లుచెప్పబడినదో, దానిని పట్టి, అహమ్ = నేను, అన్యేన=ఇతరునిచేత, హన్తుమ్=చంపుటకు, శక్యః = శక్యమైనవాడను, న = కాను.

తా. రామా ! నీవు ఆ రాముడవే. నీకు మంగళ మగుగాక. మహర్షి చెప్పిన విధమున నీవు తప్ప నన్నెవ్వరూ చంపజాలరు. 18

మూ. అహం హి మతిసాచివ్యం కరిష్యామి నరర్షభ, 19
మిత్రం చైవోపదేక్ష్యామి యువాభ్యాం సంస్కృతోఽగ్నినా.

ప్ర. అ. నరర్షభ = నరశ్రేష్ఠుడా! అహమ్ = నేను, అగ్నినా = అగ్ని చేత, సంస్కృతః = సంస్కరించబడినవాడనై, యువాభ్యామ్ = మీకు, మతిసాచివ్యమ్ = బుద్ధియందు సాహాయ్యమును, కరిష్యామి = చేసెదను. మిత్రం చైవ= మిత్రుని కూడ, ఉపదేక్ష్యామి = ఉపదేశించెను.

తా. మానవులలో శ్రేష్ఠుడవైన రామా! మీరు నాకు దహనసంస్కారము చేసిన పిమ్మట నేను మీకు ఆలోచనలో సాహాయ్యము చేసెదను. మీకు స్నేహితుని చూపగలను. 19

మూ. ఏవముక్తస్తు ధర్మాత్మా దనునా తేన రాఘవః, 20
ఇదం జగాద వచనం లక్ష్మణస్యోపశృణ్వతః.

ప్ర. అ. తేన = ఆ, దనునా = దనువుచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, ధర్మాత్మా = ధర్మాత్ముడైన, రాఘవః = రాముడు. లక్ష్మణస్య = లక్ష్మణుడు, ఉపశృణ్వతః = వినుచుండగా, ఇదమ్ = ఈ, వచనమ్ = వచనమును, జగాద = జలికెను.

తా. ఆ దనువు పలికిన మాటలు విని ధర్మాత్ముడైన రాముడు, లక్ష్మణుడు వినుచుండగా ఇట్లు పలికెను.

వి. వెనుక ఏడవ శ్లోకంలో ''శ్రియా విరాజితం పుత్రం దనోస్త్వం విద్ధి లక్ష్మణ"అని చెప్పబడినది. దానికి "శోభతో ప్రకాశించుచున్న నేను దనువు కుమారుడను"అని అర్థము. కొందరు వ్యాఖ్యాతలు "శ్రియా విరాజితం"అనేదానిని 6 వ శ్లోకంలోని "రూపమ్" అనేదానికి విశేషణంగా గ్రహించి "శోభాయుక్తమైన రూపమును పొందగలవు"అని అర్థము చెప్పినారు. "నేను దనువు కుమారుడను"అనియే ఇక్కడ (7వ శ్లోకంలో)అర్థము. దానిని పట్టి ఈ శ్లోకంలో 'దనోః' అనుదానికి "దనువంశములో పుట్టినవానియొక్క"అని అర్థం చెప్పినారు. కాని ఇది క్లిష్టార్థము. అందుచేత ప్రాచ్యపాఠము బాగున్నదని తోచుచున్నది. పైన చూపిన ఏడవ శ్లోకం పూర్వార్ధం, ఆ పాఠంలో "శ్రియో మాం మధ్యమం పుత్రం దనుం నామ్నా చ దానవమ్"అని ఉన్నది. "నేను శ్రీ అనువాని మధ్యమపుత్రుడనైన దను వనే పేరు గల దానవుడను"అని దాని అర్థము. ఏడవ శ్లోకంలో "శ్రియా విరాజితమ్''కు బదులు ''శ్రియో విరాజితమ్"అను పాఠమును గ్రహించి కొందరు

వ్యాఖ్యాతలు ''దనోః = దనువంశీయుడైన, శ్రియః = శ్రీ అనువానియొక్క'' ఇత్యాదివిధముగా వ్యాఖ్యానం చేసినారు. ప్రాచ్యపాఠం గ్రహించిన పక్షాన ఇక్కడ "దనునా''అనేదాని అర్థం సరిగా కుదురును. 20

మూ. రావణేన హృతా భార్యా మమ సీతా యశస్విని, 21
నిష్క్రాన్తస్య జనస్థానాత్సహభ్రాత్రా యథాసుఖమ్.

ప్ర. అ. జనస్థానాత్ = జనస్థానమునుండి, సహ భ్రాత్రా = సోదరునితో కూడ, నిష్క్రాన్తస్య = బైటకువెళ్ళిన, మమ = నాయొక్క, భార్యా = భార్యయైన, యశస్వినీ = కీర్తిగల, సీతా = సీత, రావణేన = రావణునిచేత, యథాసుఖమ్ = సుఖముగా, హృతా = హరించబడినది.

తా. నేను నా తమ్ముడూ జనస్థానమునుండి బైటకు వెళ్ళిన సమయమునందు, రావణుడు కీర్తిమంతురాలైన నా భార్య సీతను అనాయాసముగా అపహరించినాడు. 21

మూ. నామమాత్రం తు జానామి న రూపం తస్య రక్షసః, 22
నివాసం వా ప్రభావం వా వయం తస్య న విద్మహే.

ప్ర. అ. తస్య = ఆరాక్షసునియొక్క, నామమాత్రమ్ = పేరును మాత్రమే, జానామి = ఎరుగుదును. రూపమ్ = రూపమును, న = ఎరుగను. తస్య = వాని యొక్క, నివాసం వా = నివాసమును గాని, ప్రభావం వా = ప్రభావమును గాని, వయమ్ = మేము, న విద్మహే = ఎరుగము.

తా. నాకు ఆతని పేరు మాత్రమే తెలిసినది కాని ఆతని రూపము తెలియదు. ఆతని నివాసమును గూర్చి గాని, ప్రభావమును గూర్చి గాని తెలియ లేదు. 22

మూ. శోకార్తానామనాథానామేవం విపరిధావతామ్, 23
కారుణ్యం సదృశం కర్తుముపకారే చ వర్తతామ్.

ప్ర. అ. శోకార్తానామ్ = శోకముచేత పీడింపబడినవారము, అనాథానామ్ = రక్షకులు లేనివారము, ఏవమ్ = ఇట్లు, విపరిధావతామ్ = ఇటు అటు తిరుగాడుచున్నవారము, ఉపకారే = ఉపకారమునందు, వర్తతాం చ = ఉన్నవారము

అయిన, మా విషయమున, కారుణ్యమ్ = కారుణ్యము, కర్తుమ్ = చేయుటకు, సదృశమ్ = యుక్తము.

తా. మేము శోకార్తులమై, దారి చూపువారు లేక తిరుగాడుచున్నాము. మేము నీకు ఉపకారము కూడ చేయుచున్నాము గాన నీవు మా విషయమై కారుణ్యము చూపుట యుక్తము. 23

మూ. కాష్ఠాన్యాదాయ శుష్కాణి కాలే భగ్నాని కుఞ్జరైః, 24
దక్ష్యామస్త్వాం వయం వీర శ్వభ్రే మహతి కల్పితే.

ప్ర. అ వీర = వీరుడా ! కాలే = కాలమునందు, కుఞ్జరైః = ఏనుగులచేత, భగ్నాని = విరుగగొట్టబడిన, శుష్కాణి = ఎండిన, కాష్ఠాని = కట్టెలను, ఆదాయ = గ్రహించి, కల్పితే = ఏర్పరుపబడిన, మహతి = పెద్దదైన, శ్వభ్రే = గోతియందు, త్వామ్ = నిన్ను, దక్ష్యామః = కాల్చగలము.

తా. వీరుడా ! ఆ యా సమయాలలో ఏనుగులు విరచిన ఎండిన కట్టెలు తీసికొనివచ్చి, పెద్ద గొయ్యి ఏర్పరచి నిన్ను దహించెదము. 24

మూ. స త్వం సీతాం సమాచక్ష్వ యేన వా యత్ర వా హృతా.
కురు కల్యాణమత్యర్థం యది జానాసి తత్త్వతః.

ప్ర. అ. సః త్వమ్ = అట్టి నీవు, తత్త్వతః = యథార్థముగా, జానాసి యది = ఎరిగి ఉన్నట్లయితే, సీతామ్ = సీతను గూర్చి, యేన వా = ఎవనిచేత, యత్ర వా = ఎక్కడికి, హృతా = హరించబడినదో, సమాచక్ష్వ = చెప్పుము. అత్యర్థమ్ = మిక్కిలి, కల్యాణమ్ = కల్యాణమును, కురు = చేయుము.

తా. నీకు సీతను గూర్చి నిజముగా తెలిసినచో ఆమెను ఎవరు హరించినారో, ఎక్కడికి హరించుకొనిపోయినారో చెప్పి మంగళకరమైన కార్యమును చేయుము (పుణ్యము కట్టుకొనుము). 25

మూ. ఏవముక్తస్తు రామేణ వాక్యం దనురనుత్తమమ్, 26
ప్రోవాచ కుశలో వక్తుం వక్తారమపి రాఘవమ్.

ప్ర. అ. రామేణ = రామునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన,

వక్తుమ్ = మాటలాడుటకు, కుశలః = నేర్పరియైన, దనుః=దనువు, వక్తారమ్= వక్తయైన, రాఘవమ్ = రాముని గూర్చి, అనుత్తమమ్ = శ్రేష్ఠమైన, వాక్యమ్ = = వాక్యమును, ప్రోవాచ = పలికెను.

తా. రాముని మాటలు విని, మాటలలో నేర్పరియైన ఆ దనువు, మాటలలో నేర్పరియైన రామునితో ఉత్తమమైన మాట పలికెను. 26

మూ. దివ్యమస్తి న మే జ్ఞానం నాభిజానామి మైథిలీమ్. 27
యస్తాం జ్ఞాస్యతి తం వక్ష్యే దగ్ధః స్వం రూపమాస్థితః.

ప్ర. అ. మే = నాకు, దివ్యమ్ = దివ్యమైన, జ్ఞానమ్ = జ్ఞానము, నాస్తి= లేదు. మైథిలీమ్=సీతను, నాభిజానామి=గుర్తించను, దగ్ధః=కాల్చబడినవాడనై, స్వం రూమ్ = నా రూపమును, ఆస్థితః = గ్రహించినవాడనై, తామ్ = ఆమెను గూర్చి, యః = ఎవడు, జ్ఞాస్యతి = తెలుసుకొనగలడో, తమ్ = వానిని గూర్చి, వక్ష్యే = చెప్పగలను.

తా. నాకు దివ్యదృష్టి లేదు. అందుచే సీత ఎక్కడున్నదో గుర్తించజాలను. మీరు నన్ను దహించిన పిమ్మట నా సహజరూపమును తిరిగి పొంది సీతజాడ తెలుసుకొనగలిగినవానిని గూర్చి చెప్పెదను. 27

మూ. అదగ్ధస్య తు విజ్ఞాతుం శక్తిరస్తి న మే ప్రభో, 28
రాక్షసం తం మహావీర్యం సీతా యేన హృతా తవ.

ప్ర. అ. ప్రభో = ప్రభూ ! యేన = ఎవనిచేత, తవ = నీయొక్క, సీతా = సీత, హృతా = హరించబడినదో, తమ్ = ఆ, మహావీర్యమ్ = గొప్ప పరాక్రమము గల, రాక్షసమ్=రాక్షసుని గూర్చి, విజ్ఞాతుమ్=తెలిసికొనుటకు, అదగ్ధస్య = కాల్చబడని, మే = నాకు, శక్తిః = శక్తి నాస్తి = లేదు.

తా. నేను దహింపబడనంతవరకు, నీ భార్యయైన సీతను హరించిన మహాపరాక్రమవంతుడైన రాక్షసుని గూర్చి తెలిసికొను శక్తి నాకు లేదు. 28

మూ. విజ్ఞానం హి మమ భ్రష్టం శాపదోషేణ రాఘవ, 29
స్వకృతేన మయా ప్రాప్తం రూపం లోకవిగర్హితమ్.

ప్ర. అ. రాఘవ = రామా ! శాపదోషేణ = శాపదోషముచేత, మమ =

నాయొక్క, విజ్ఞానమ్ = దివ్యజ్ఞానము, భ్రష్టం హి = నశించినది కదా! మయా = నాచేత, స్వకృతేన = నేను చేసిన పనిచేతనే, లోకవిగర్హితమ్ = లోకమునందు నింద్యమైన, రూపమ్ = రూపము, ప్రాప్తమ్ = పొందబడినది.

తా. రామా! శాపదోషముచేత నా దివ్యజ్ఞానము భ్రష్టమైపోయినది. నే చేసిన పనికి ఫలితముగా లోకులచేత నిందింపబడే ఈ రూపము సంప్రాప్తించినది.

మూ. కిం తు యావన్న యాత్యస్తం సవితా శ్రాన్తవాహనః. 31
తావన్మామవటే క్షిప్త్వా దహ రామ యథావిధి.

ప్ర. అ. రామ = రామా! కిం తు = కాని, సవితా = సూర్యుడు, శ్రాన్త వాహనః = అలసిన గుఱ్ఱములు గలవాడై, అస్తమ్ = అస్త్రాద్రిని గూర్చి, యావత్ న యాతి = ఎంతలో వెళ్లడో, తావత్ = అంతలోగా, మామ్ = నన్ను, అవటే = గోతిలో, క్షిప్త్వా = పడవేసి, యథావిధి = యథాశాస్త్రముగా, దహ = కాల్చుము.

తా. కాని, రామా! సూర్యుడు గుఱ్ఱములు అలసిపోగా అస్త్రాద్రికి చేరక మునుపే నీవు నన్ను గోతిలో పడవేసి కాల్చవలెను. 30

మూ. దగ్ధస్త్వయాహమవటే న్యాయేన రఘునన్దన. 31
వక్ష్యామి తమహం వీర యస్తం జ్ఞాస్యతి రాక్షసమ్.

ప్ర. అ. వీర = వీరుడవైన, రఘునన్దన = రామా! అహమ్ = నేను, త్వయా = నీచేత, న్యాయేన = శాస్త్రానుసారముగా, అవటే = గోతిలో, దగ్ధః = కాల్చ బడినవాడనై, యః = ఎవడు, తం రాక్షసమ్ = ఆ రాక్షసుణ్ణి గూర్చి, జ్ఞాస్యతి = తెలిసికొనగలడో, తమ్ = ఆతనిని గూర్చి, వక్ష్యామి = చెప్పగలను.

తా. వీరుడవైన రామా! నీవు నన్ను గోతిలో వేసి యథాశాస్త్రముగా కాల్చిన పిమ్మట ఆ రాక్షసుణ్ణి గూర్చి తెలుసుకొనగలిగిన వానిని గూర్చి నీకు చెప్పెదను. 31

మూ. తేన సఖ్యం చ కర్తవ్యం న్యాయ్యవృత్తేన రాఘవ, 32
కల్పయిష్యతి తే ప్రీతః సాహాయ్యం లఘువిక్రమః.

ప్ర. అ. రాఘవ = రామా! న్యాయ్యవృత్తేన = న్యాయసమ్మతమైన

ప్రవృత్తిగల, తేన=వానితో, సఖ్యం చ = స్నేహము కూడ, కర్తవ్యమ్=చేయదగినది. లఘువిక్రమః = శీఘ్రమైన పరాక్రమము గల అతడు, ప్రీతః=సంతోషించినవాడై, తే = నీకు, సాహాయ్యమ్ = సాహాయ్యమును, కల్పయిష్యతి=చేయగలడు.

తా. రామా! న్యాయసంమతమైన నడవడిక గల అతనితో నీవు స్నేహము చేసికొనవలెను. శీఘ్రమైన పరాక్రమము గల అతడు సంతోషించి నీకు సాహాయ్యము చేయగలడు. 32

మూ. న హి తస్యాస్త్యవిజ్ఞాతం త్రిషు లోకేషు రాఘవ, 33
సర్వాన్ పరిసృతో లోకాన్ పురాసౌ కారణాన్తరే.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ఏకసప్తతితమః సర్గః.

ప్ర. అ. రాఘవ = రామా !. త్రిషు లోకేషు = మూడు లోకములందూ, తస్య = వానికి, అవిజ్ఞాతమ్ = తెలియనిది, నాస్తి హి = లేదు. అసౌ = ఇతడు, పురా = పూర్వము, కారణాన్తరే = మరియొక కారణమునందు, సర్వాన్ = సమస్తమైన, లోకాన్ = లోకములను, పరిసృతః = సంచరించినాడు.

తా. రామా! ఈ మూడు లోకములలో అతనికి తెలియనిది లేదు. ఎందుచేత ననగా, ఒకానొక కారణముచేత అతడు అన్ని లోకములూ తిరిగినాడు. 33

'బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో
డెబ్బదియొకటవ సర్గ సమాప్తము.

అథ ద్విసప్తతితమః సర్గః

[రామలక్ష్మణులు కబంధుని దహించుట. అతడు దివ్యరూపము ధరించి సుగ్రీవునితో స్నేహము చేయుమని రామునకు చెప్పుట.]

మూ. ఏవముక్తౌ తు తౌ వీరౌ కబన్ధేన నరేశ్వరౌ,
గిరిప్రదరమాసాద్య పావకం విససర్జతుః. 1

ప్ర. అ. కబన్ధేన = కబంధునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తౌ = పలకబడిన, నరేశ్వరౌ = రాజులైన, తౌ వీరౌ = ఆ వీరులు, గిరిప్రదరమ్ = పర్వతముయొక్క లోయను, ఆసాద్య = పొందించి, పావకమ్ = అగ్నిని, విససర్జతుః = విడచిరి.

తా. కబంధుని మాటలు విని మనుష్యుల ప్రభువులు, వీరులు అయిన ఆ రామలక్ష్మణులు వానిని పర్వతము లోయలోనికి పడవేసి నిప్పు ముట్టించిరి. 1

మూ. లక్ష్మణస్తు మహోల్కాభిర్జ్వలితాభిః సమన్తతః,
చితామాదీపయామాస సా ప్రజజ్వాల సర్వతః. 2

ప్ర. అ. లక్ష్మణస్తు = లక్ష్మణుడైతే, జ్వలితాభిః = మండుచున్న, మహోల్కాభిః = పెద్ద కొరవులతో, సమన్తతః = నలు వైపులా, చితామ్ = చితను, ఆదీపయామాస = మండింపచేసెను. సా = ఆ చిత సర్వతః = అంతటా, ప్రజజ్వాల = మండెను.

తా. లక్ష్మణుడు మండుచున్న కొరవులతో చితను నలుమూలలా మండింపచేయగా అది అంతటా మండెను. 2

మూ. తచ్ఛరీరం కబన్ధస్య ఘృతపిణ్డోపమం మహత్,
మేదసా పచ్యమానస్య మన్దం దహతి పావకః. 3

ప్ర. అ. మేదసా = కొవ్వుచేత, పచ్యమానస్య = ఉడుకుచున్న, కబన్ధస్య =

= కబంధునియొక్క, మహత్ = చాల పెద్దదైన, ఘృతపిణ్డోపమమ్=నేతి ముద్ద వలె ఉన్న, తత్ = ఆ, శరీరమ్ = శరీరమును, పావకః = అగ్ని, మన్దమ్ = మందముగా, దహతి = కాల్చెను.

తా. చాల పెద్దదైన ఆ కబంధుని దేహము నేతిముద్ద వలె ఉండెను. అది కొవ్వుతో ఉడుకుచుండుటచే అగ్ని దానిని చాల మెల్లగా కాల్చెను. 3

మూ. స విధూయ చితామాశు విధూమోఽగ్నిరివోత్థితః,
అరజే వాససీ బిభ్రన్మాలాం దివ్యాం మహాబలః. 4

ప్ర. అ. మహాబలః = గొప్ప బలము గల, సః = ఆతడు, అరజే = పరాగము లేని, వాససీ = వస్త్రములను, దివ్యామ్ = దివ్యమైన, మాలామ్ = మాలను, బిభ్రత్ = ధరించుచు, చితామ్ = చితను, విధూయ = త్రోసివేసి, ఆశు = వెంటనే, విధూమః = ధూమము లేని, అగ్నిరివ = అగ్ని వలె, ఉత్థితః = లేచెను.

తా. మహాబలవంతుడైన ఆ కబంధుడు, శుభ్రమైన వస్త్రములను, దివ్యమైన పుష్పములను ధరించి, ఆ చితను త్రోసివేసి ధూమము లేని అగ్ని వలె, పైకి లేచెను. 4

మూ. తతశ్చితాయా వేగేన భాస్వరో విమలామ్బరః,
ఉత్పపాతాశు సంహృష్టః సర్వప్రత్యఙ్గభూషణః. 5

ప్ర. అ. తతః = అటు పిమ్మట, భాస్వరః = ప్రకాశించుచున్న ఆ కబంధుడు, విమలామ్బరః = నిర్మలములైన వస్త్రములు కలవాడై, సంహృష్టః=సంతోషించినవాడై. సర్వప్రత్యఙ్గభూషణః = సమస్త అవయవములయందు అలంకారములు కలవాడై, ఆశు = శీఘ్రముగా, వేగేన = వేగముతో, చితాయాః = చిత నుండి, ఉత్పపాత = పైకి లేచెను.

తా. పిదప ఆతడు ప్రకాశించుచున్న రూపముతో, నిర్మలములైన వస్త్రములు, ప్రతి అవయవమునందు భూషణములు ధరించి, సంతోషించుచు, వెంటనే ఆ చితనుండి వేగముగా పైకి లేచెను. 5

మూ. విమానే భాస్వరే తిష్ఠన్ హంసయుక్తే యశస్కరే,
ప్రభయా చ మహాతేజా దిశో దశ విరాజయన్ 6

సోఽన్తరిక్షగతో రామం కబన్ధో వాక్యమబ్రవీత్,
శృణు రాఘవ తత్త్వేన యథా సీతామవాప్స్యసి. 7

ప్ర. అ. సః కబన్ధః = ఆ కబంధుడు, అన్తరిక్షగతః = ఆకాశమును పొందిన వాడై, హంసయుక్తే = హంసలచేత కట్టబడిన, యశస్కరే = కీర్తిని కలిగించు, భాస్వరే = ప్రకాశించుచున్న, విమానే = విమానమునందు, తిష్ఠన్ = ఉన్నవాడై, మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడై, ప్రభయా = కాంతిచేత, దశ దిశః = పది దిక్కులను, విరాజయన్ = ప్రకాశింపచేయుచు, రామమ్ = రాముని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. రాఘవ = రామా ! సీతామ్ = సీతను, యథా = ఎట్లు, అవాప్స్యసి = పొందగలవో, తత్త్వేన = యథార్థముగా, శృణు = వినుము.

తా. ఆ కబంధుడు ఆకాశమును పొంది, అక్కడ హంసలు కట్టిన, కీర్తిని కలిగించే ప్రకాశించుచున్న విమానమును ఎక్కి, మహాతేజస్సు కలవాడై, తన కాంతిచేత పది దిక్కులను ప్రకాశింపచేయుచు రామునితో ఇట్లు పలికెను. "రామా! నీకు సీత ఎట్లు లభించగలదో చెప్పెదను; వినుము." 6, 7

మూ. రామ షడ్యుక్తయో లోకే యాభిః సర్వం విమృశ్యతే,
పరిమృష్టో దశాన్తేన దశాభాగేన సేవ్యతే. 8

ప్ర. అ. రామ = రామా ! యాభిః = వేటిచేత, సర్వమ్ = సమస్తము, విమృశ్యతే = విమర్శించబడునో, అట్టి, షట్ = ఆరు, యుక్తయః = ఉపాయములు, లోకే = లోకములో ఉన్నవి. దశాన్తేన = దశావిపాకముచేత, పరిమృష్టః = స్పృశించబడినవాడు, దశాభాగేన = దశావిపాకము కలవానిచేత, సేవ్యతే = సేవింపబడును.

తా. రామా ! లోకములో కార్యములను సాధించుటకు సంధి, విగ్రహము, యానము, ఆసనము, ద్వైదీభావము, సమాశ్రయము అను ఆరు ఉపాయములున్నవి. దుర్దశ పరిపాకమునకు వచ్చినవాడు అదే విధముగ దుర్దశావరిపాకముచే బాధపడువానిచేత సేవింపబడును.

వి. ప్రస్తుతము నీ దశ చెడదిగా ఉన్నది. అందుచేతనే కష్టాంలో ఉన్నావు.

నీవలెనే చెడుదశతో బాధపడుచున్నవానితో నీకు స్నేహము యుక్తము అని భావము.

సంధి = శత్రురాజుతో సంధి చేసికొనుట. విగ్రహము = విరోధము కొన సాగించుట. యానము = యుద్ధానికి వెళ్లుట. అసనము = సమయానికి వేచి ఉండుట. ద్వైధీభావము = శత్రుపక్షములో భేదాలు సృష్టించుట. సమాశ్రయణము = మరొకనిని సహాయునిగా ఆశ్రయించుట. ఇవి ఆరు ఉపాయాలు. 8

మూ. దశాభాగగతో హీనస్త్వం హి రామ సలక్ష్మణః,
యత్కృతే వ్యసనం ప్రాప్తం త్వయా దారప్రధర్షణమ్.

ప్ర. అ. రామ = రామా ! సలక్ష్మణః = లక్ష్మణునితో కూడిన, త్వమ్ = నీవు, దశాభాగగతః = దుర్దశాఫలమును పొందినవాడవై, హీనః = చెడ్డ అవస్థలో ఉన్నావు. యత్కృతే = దేని మూలమున, త్వయా = నీచేత, దారప్రధర్షణమ్ = భార్యావమానరూపమైన, వ్యసనమ్ = దుఃఖము, ప్రాప్తమ్ = పొందబడినదో.

తా. రామా ! నీవు, లక్ష్మణుడు కూడ దుర్దశాఫలమును అనుభవించవలసి ఉండుటచేత ఇట్టి హీనపరిస్థితిలో ఉన్నారు. దీని మూలముననే నీకు భార్యా వియోగరూపమైన దుఃఖము సంప్రాప్తించినది. 9

మూ. తదవశ్యం త్వయా కార్యః స సుహృత్సుహృదాం వర,
అకృత్వా హి న తే సిద్ధిమహం పశ్యామి చిన్తయన్. 10

ప్ర. అ. సుహృదామ్ = మంచి హృదయము కలవారిలో, వర = శ్రేష్ఠుడా ! తత్ = ఆ కారణమువలన, సః = అట్టివాడు, త్వయా = నీచేత, అవశ్యమ్ = తప్పక, సుహృత్ = మిత్రుడు, కార్యః = చేసుకొనదగినవాడు. అకృత్వా = స్నేహితుని చేసికొనకుండగా, తే = నీకు, సిద్ధిమ్ = సిద్ధిని, అహమ్ = నేను, చిన్తయన్ = ఆలోచించుచు, న పశ్యామి = చూడను.

తా. మంచి హృదయము కలవారిలో శ్రేష్ఠుడవైన రామా ! ఆ కారణముచే, నీవు తప్పక మిత్రుణ్ణి సంపాదించవలెను. మిత్రుణ్ణి సంపాదించకుండా నీకు కార్యసిద్ధి కలుగ దనియే, ఆలోచించగా నాకు తోచుచున్నది. 10

మూ. శ్రూయతాం రామ వక్ష్యామి సుగ్రీవో నామ వానరః,
భ్రాత్రా నిరస్తః క్రుద్ధేన వాలినా శక్రసూనునా. 11

ప్ర. అ. రామ=రామా! వక్ష్యామి = చెప్పెదను. శ్రూయతామ్=వినబడుగాక. శక్రసూనునా = ఇంద్రుని పుత్రుడు, భ్రాత్రా = సోదరుడు, క్రుద్ధేన = కోపించినవాడు అయిన, వాలినా = వాలిచేత, నిరస్తః = (రాజ్యమునుండి) వెడలగొట్టబడిన, సుగ్రీవో నామ = సుగ్రీవు డనే, వానరః = వానరుడు, (ఉన్నాడు).

తా. రామా! చెప్పుచున్నాను; వినుము. సుగ్రీవు డనే వానరుడు ఉన్నాడు. అతనిని ఇంద్రుని కుమారుడైన వాలి అనే సోదరుడు కోపించి, రాజ్యమునుండి వెడలగొట్టినాడు. 11

మూ. ఋశ్యమూకే గిరివరే పమ్పాపర్యన్తశోభితే,
నివసత్యాత్మవాన్వీరశ్చతుర్భిః సహ వానరైః. 12

ప్ర. అ. ఆత్మవాన్=బుద్ధి మంతుడు, వీరః=వీరుడు అయిన సుగ్రీవుడు, పమ్పాపర్యన్తశోభితే=పంపానదీప్రాంతమునందు ప్రకాశించుచున్న, ఋశ్యమూకే= ఋశ్యమూక మనే, గిరివరే=పర్వతశ్రేష్ఠమునందు, చతుర్భిః=నలుగురు, వానరైః సహ = వానరులతో కూడ, నివసతి = నివసించుచున్నాడు.

తా. బుద్ధిమంతుడు, వీరుడు అయిన ఆ సుగ్రీవుడు, పంపానదీప్రాంతమునందు ప్రకాశించుచున్న ఋశ్యమూక మనే పర్వతశ్రేష్ఠమునందు, నలుగురు వానరులతో కూడా నివసించుచున్నాడు. 12

మూ. వానరేన్ద్రో మహావీర్యస్తేజోవానమితప్రభః,
సత్యసన్ధో వినీతశ్చ ధృతిమాన్మతిమాన్మహాన్. 13

ప్ర. అ. వానరేన్ద్రః = వానరులలో శ్రేష్ఠుడైన ఆ సుగ్రీవుడు, మహావీర్యః = గొప్ప పరాక్రమము కలవాడు. తేజోవాన్=తేజస్సు కలవాడు. అమితప్రభః =అమితమైన కాంతి గలవాడు. సత్యసన్ధః=సత్యమైన ప్రతిజ్ఞ గలవాడు. వినీతః = వినయవంతుడు, ధృతిమాన్ = ధైర్యవంతుడు, మతిమాన్ = బుద్ధిమంతుడు, మహాన్ = గొప్పవాడు

తా. వానరనాయకుడైన ఆ సుగ్రీవుడు గొప్ప పరాక్రమము, తేజస్సు,

సాటిలేని కాంతి గలవాడు, సత్యసంధుడు, వినయవంతుడు, ధైర్యవంతుడు, బుద్ధి శాలి, గొప్పవాడు. 13

మూ. దక్షః ప్రగల్భో ద్యుతిమాన్ మహాబలపరాక్రమః,
భ్రాత్రా వివాసితో రామ రాజ్యహేతోర్మహాబలః. 14

ప్ర. అ. రామ = రామా ! దక్షః = సమర్థుడు, ప్రగల్భః = ప్రగల్భుడు, ద్యుతిమాన్ = కాంతి గలవాడు, మహాబలపరాక్రమః = గొప్ప బలపరాక్రమములు కలవాడుఅయిన, మహాబలః = గొప్ప బలము గల ఆ సుగ్రీవుడు, రాజ్యహేతోః = రాజ్యము మూలమున, భ్రాత్రా = సోదరునిచేత, వివాసితః = దూరముగా వంపి వేయబడినాడు.

తా. రామా ! గొప్ప బలముగల ఆ సుగ్రీవుడు సమర్థుడు. ప్రగల్భుడు, కాంతి గలవాడు, గొప్ప బలపరాక్రమములు గలవాడు. అతనిని రాజ్యము మూలమున సోదరుడైన వాలి బైటకు వంపివేసినాడు. 14

మూ. స తే సహాయో మిత్రం చ సీతాయాః పరిమార్గణే,
భవిష్యతి హితే రామ మా చ శోకే మనః కృథాః. 15

ప్ర. అ. రామ = రామా ! సః = అతడు, తే = నీకు, మిత్రమ్ = మిత్రుడుగాను, సీతాయాః = సీతయొక్క, పరిమార్గణే = అన్వేషణమునందు, సహాయః = సహాయుడుగాను, హితే = నీకు హితమునందున్నవాడుగాను, భవిష్యతి = కాగలడు. శోకే = శోకమునందు, మనః = మనస్సును, మా కృథాః = చేయకుము.

తా. రామా ! అతడు నీకు మిత్రుడై సీతను వెదకుటలో సాహాయ్యము చేయగలడు. నీకు హితము చేకూర్చగలడు. నీ మనస్సునకు శోకము కలుగనీయకుము. 15

మూ. భవితవ్యం హి యచ్చాపి న తచ్ఛక్యమిహాన్యథా,
కర్తుమిక్ష్వాకుశార్దూల కాలో హి దురతిక్రమః. 16

ప్ర. అ. ఇక్ష్వాకుశార్దూల = ఇక్ష్వాకువంశీయులలో శ్రేష్ఠుడవైన రామా యచ్చాపి = ఏది, భవితవ్యమ్ = కావగి యున్నదో, తత్ = అది, అన్యథా = మరొక

విధంగా, కర్తుమ్ = చేయుటకు, న శక్యమ్ = శక్యము కాదు. కాలః = కాలము, దురతిక్రమః హి = అతిక్రమింపశక్యము కానిది కదా!

తా. ఇక్ష్వాకువంశీయులలో శ్రేష్ఠుడవైన రామా! ఏది కాదగి యున్నదో అది మరొక విధముగా చేయుటకు శక్యము కాదు. కాలమును ఎవ్వరూ అతిక్రమింప జాలరు కదా? 16

మూ. గచ్ఛ శీఘ్రమితో రామ సుగ్రీవం తం మహాబలమ్,
వయస్యం తం కురు క్షిప్రమితో గత్వాద్య రాఘవ, 17
అద్రోహాయ సమాగమ్య దీప్యమానే విభావసౌ.

ప్ర. అ. రామ=రామా! ఇతః = ఇక్కడనుండి, శీఘ్రమ్ = శీఘ్రముగా, మహాబలమ్ = మహాబలశాలియైన, తం సుగ్రీవమ్ = ఆ సుగ్రీవుణ్ణి గూర్చి, గచ్ఛ = వెళ్ళుము. రాఘవ=రామా! అద్య = ఇప్పుడే, ఇతః=ఇక్కడినుండి, క్షిప్రమ్ = శీఘ్రముగా, గత్వా=వెళ్ళి, అద్రోహాయ=ద్రోహము లేకుండుటకై, విభావసౌ = అగ్ని, దీప్యమానే = ప్రజ్వలించుచుండగా, తమ్ = ఆతనిని, వయస్యమ్ = మిత్రునిగా, కురు = చేసికొనుము.

తా. రామా! నీవు ఇక్కడినుండి బయలుదేరి శీఘ్రముగా బలశాలియైన ఆ సుగ్రీవుని వద్దకు వెళ్ళుము. రామా! నీవు ఇప్పుడే శీఘ్రముగా వెళ్ళి, అగ్ని మండుచుండగా(అగ్నిసాక్షిగా) ఆతనితో మైత్రి ఏర్పరచుకొనుము. అట్లు చేసినచో మిత్రద్రోహ మనునది ఉండదు. 17

మూ. స చ తే నావమన్తవ్యః సుగ్రీవో వానరాధిపః, 18
కృతజ్ఞః కామరూపీ చ సహాయార్థీ చ వీర్యవాన్.

('వానరాధిపః'కు బదులు "వానరోఽపి సన్"అను ప్రాచ్యపాఠము బాగున్నది).

ప్ర. అ. వానరోఽపి సన్ = వానరుడే యైనను, సః సుగ్రీవః = ఆ సుగ్రీవుడు, తే = నీకు, నావమన్తవ్యః = అవమానింపదగినవాడు కాదు. అతడు, కృతజ్ఞః = కృతజ్ఞుడు, కామరూపీ చ = స్వేచ్ఛారూపము గలవాడు. సహాయార్థీ చ = సహాయుని అపేక్ష గలవాడు. వీర్యవాన్ = పరాక్రమవంతుడు.

తా. ఇతడు వానరుడే కదా అని నీవు సుగ్రీవుని అవమానించరాదు. అతడు కృతజ్ఞుడు. స్వేచ్ఛానుసారము రూపము ధరించగలవాడు. సాహాయ్యము చేసేవారి అవసర మున్నవాడు, పరాక్రమవంతుడు. 18

మూ. శక్తౌ హ్యద్య యువాం కర్తుం కార్యం తస్య చికీర్షితమ్, 19
కృతార్థో వాఽకృతార్థో వా కృత్యం తవ కరిష్యతి.

ప్ర. అ. యువామ్ = మీరిద్దరు, అద్య = ఇప్పుడు, తస్య = ఆ సుగ్రీవుని యొక్క, చికీర్షితమ్ = చేయదలచిన, కార్యమ్ = కార్యమును, కర్తుమ్ = చేయుటకు, శక్తౌ హి = సమర్థులే కదా. కృతార్థో వా = కృతార్థుడైనా, అకృతార్థో వా = కృతార్థుడు కాకపోయినా, తవ = నీయొక్క, కృత్యమ్ = కార్యమును, కరిష్యతి = చేయగలడు.

తా. మీరిద్దరూ ఇపుడు అతడు చేయగోరుచున్న కార్యమును సాధించుటకు సమర్థులే. తన కార్యము సఫలమైనా కాకపోయినా కూడ అతడు నీ పని చేయగలడు. 19

మూ. స ఋక్షరజసః పుత్రః పమ్పామటతి శఙ్కితః, 20
భాస్కరస్యౌరసః పుత్రో వాలినా కృతకిల్బిషః.

ప్ర. అ. ఋక్షరజసః = ఋక్షరజస్సు అను వానరునియొక్క, పుత్రః = పుత్రుడు, భాస్కరస్య = సూర్యునియొక్క, ఔరసః పుత్రః = ఔరసపుత్రుడు అయిన, సః = ఆ సుగ్రీవుడు, వాలినా = వాలిచేత, కృతకిల్బిషః = చేయబడిన పాపము కలవాడై, శఙ్కితః = భయపడుచున్నవాడై, పమ్పామ్ = పంపానదిని, అటతి = తిరుగుచున్నాడు.

తా. ఆ సుగ్రీవుడు ఋక్షరజస్సు అను వానరుని భార్యకు సూర్యునివలన పుట్టినాడు. అందుచే ఋక్షరజస్సుకు క్షేత్రజపుత్రుడు. సూర్యునకు ఔరసపుత్రుడు. వాలి ఆతని విషయమున పాపముగా ప్రవర్తించుటచే అతనికి భయపడుచు పంపానదీప్రాంతమున తిరుగుచున్నాడు. 20

మూ. సంనిధాయాయుధం క్షిప్రమృశ్యశృఙ్గాలయం కపిమ్, 21
కురు రాఘవ సత్యేన వయస్యం వనచారిణమ్.

ప్ర. అ. రాఘవ = రామా ! ఆయుధమ్ = ఆయుధమును, సంనిధాయ = దగ్గర ఉంచుకొని, వనచారిణమ్ = వనములలో సంచరించుచున్న, ఋష్యశృఙ్గాలయమ్ = ఋష్యశృంగపర్వతము నివాసముగా గల, కపిమ్ = వానరుడైన సుగ్రీవుని, సత్యేన = సత్యముచేత, క్షిప్రమ్ = శీఘ్రముగా, వయస్యమ్ = మిత్రునిగా, కురు = చేసికొనుము.

తా. రామా! ఆ సుగ్రీవుడు అడవులలో తిరుగుచు ఋష్యశృంగపర్వతము మీద ఉన్నాడు. నీవు ఆయుధధారివై అక్కడికి వెళ్ళి, సత్యముపై శపథము చేసి, వెంటనే, అతనితో మైత్రి చేసికొనుము. 21

మూ. స హి స్థానాని సర్వాణి కార్త్స్న్యేన కపికుఞ్జరః, 22
నరమాంసాశినాం లోకే నైపుణ్యాదధిగచ్ఛతి.

ప్ర. అ. కపికుఞ్జరః = వానరులలో శ్రేష్ఠుడైన, సః = ఆ సుగ్రీవుడు, లోకే = ఈ లోకమునందు, నరమాంసాశినామ్ = నరమాంసమును తినే రాక్షసుల యొక్క, సర్వాణి = సమస్తమైన, స్థానాని = స్థానములను, కార్త్స్న్యేన = పూర్తిగా, నైపుణ్యాత్ = నేర్పువలన, అధిగచ్ఛతి హి = తెలిసికొని ఉన్నాడు కదా.

తా. వానరశ్రేష్ఠుడైన ఆ సుగ్రీవునకు లోకములో ఉన్న నరమాంసభక్షకులైన రాక్షసుల స్థానము లన్నీ పూర్తిగా తెలియును. అతని నేర్పు అట్టిది. 22

మూ. న తస్యావిదితం లోకే కించిదస్తి హి రాఘవ, 23
యావత్సూర్యః ప్రతపతి సహస్రాంశురరిందమ.

ప్ర. అ. అరిందమ = శత్రుసంహారకుడవైన, రాఘవ = రామా ! సహస్రాంశుః = వెయ్యి కిరణములు గల, సూర్యః = సూర్యుడు, యావత్ = ఎంతవరకు, ప్రతపతి = తపించుచున్నాడో, అంతవరకూ ఉన్న, లోకే = లోకమునందు, తస్య = అతనికి, అవిదితమ్ = తెలియనిది, కించిత్ = ఏదీ కూడ, నాస్తి హి = లేదు కదా.

తా. శత్రుసంహారకుడవైన రామా ! ఈ లోకములో సహస్రకిరణుడైన సూర్యుడు ఎంతవరకు తన ప్రకాశమును వ్యాపింపచేయుచున్నాడో అంతవరకు ఆ సూర్యపుత్రునకు తెలియనిది ఏదీ లేదు. 23

మూ. స నదీర్విపులాన్ శైలాన్ గిరిదుర్గాణి కన్దరాన్, 24
అన్వీక్ష్య వానరైః సార్ధం పత్నీం తేఽధిగమిష్యతి.

ప్ర. అ. సః = అతడు, వానరైః సార్ధమ్ = వానరులతో కూడ, నదీః = నదులను, విపులాన్ = విశాలములైన, శైలాన్ = పర్వతములను, గిరిదుర్గాణి = పర్వతదుర్గములను, కన్దరాన్ = గుహలను, అన్వీక్ష్య = వెదకి, తే = నీయొక్క, పత్నీమ్ = భార్యను, అధిగమిష్యతి = పొందగలడు.

తా. అతడు వానరులతో కలిసి వెళ్ళి నదులను విశాలములైన పర్వతములను పర్వతదుర్గములను గుహలను వెదకి నీభార్య జాడ తెలిసికొనగలడు. 24

మూ. వానరాంశ్చ మహాకాయాన్ ప్రేషయిష్యతి రాఘవ, 25
దిశో విచేతుం తాం సీతాం త్వద్వియోగేన శోచతీమ్,
స జ్ఞాస్యతి వరారోహాం నిర్మలాం రావణాలయే 26

ప్ర. అ. రాఘవ = రామా। త్వద్వియోగేన = నీ వియోగముచేత, శోచతీమ్ = దుఃఖించుచున్న, తాం సీతామ్ = ఆ సీతను, విచేతుమ్ = వెదకుటకు, మహాకాయాన్ = పెద్ద శరీరములు గల, వానరాంశ్చ = వానరులను కూడ, దిశః = దిక్కులను గూర్చి, ప్రేషయిష్యతి = పంపగలడు. సః = అతడు, రావణాలయే = రావణుని గృహమునందున్న, నిర్మలామ్ = పవిత్రురాలైన, వరారోహామ్ = అందమైన కటిప్రదేశము గల సీతను గూర్చి, జ్ఞాస్యతి = తెలుసుకొనగలడు.

తా. నీ వియోగముతో దుఃఖించుచున్న సీతను అన్వేషించుటకై అతడు పెద్ద శరీరములు గల వానరులను అన్ని దిక్కులకు పంపగలడు కూడ. ఈ విధముగ అతడు రావణుని ఇంటిలో ఉన్న సీతను గూర్చి తెలిసికొనగలడు. 25, 26

మూ. స మేరుశృఙ్గాగ్రగతామనిన్దితాం
ప్రవిశ్య పాతాలతమేఽపి వా శ్రితామ్,
ప్లవఙ్గమానాం ప్రవరస్తవ ప్రియాం
నిహత్య రక్షాంసి పునః ప్రదాస్యతి. 27

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
ద్విసప్తతితమః సర్గః.

ప్ర. అ. ప్లవఙ్గమానామ్ = వానరులలో, ప్రవరః = శ్రేష్ఠుడైన, సః = అతడు, అనిన్దితామ్ = నిందింపబడని, తవ ప్రియామ్ = నీ ప్రియురాలిని, మేరు శృఙ్గాగ్రగతామ్ = మేరుపర్వతశిఖరాగ్రమునందు ఉన్నా, పాతాలతలే = పాతాళ తలమునందు, శ్రితాం వాపి = ఆశ్రయించిఉన్నా, ప్రవిశ్య = అచటికి ప్రవేశించి, రక్షాంసి = రాక్షసులను, నిహత్య = చంపి, పునః = మరల, ప్రదాస్యతి = ఇవ్వగలడు.

తా. ఎట్టి దోషములూ లేని నీ ప్రియురాలు మేరుపర్వతశిఖరాగ్రమునందున్నా, పాతాళలోకములో ఉన్నా, ఆ వానరశ్రేష్ఠుడైన సుగ్రీవుడు అక్కడికి వెళ్ళి, రాక్షసులను సంహరించి, మరల తీసికొనివచ్చి ఇవ్వగలడు. 27

''బాలానందిని'' యను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో డెబ్బదిరెండవ సర్గ సమాప్తము.

అథ త్రిసప్తతితమః సర్గః

[*కబంధుడు ఋష్యమూకపర్వతపంపాసరోమార్గములు వర్ణించి చెప్పి, మతంగముని వనమార్గము కూడ తెలిపి రాముని అనుమతితో స్వస్థానమునకు వెళ్ళిపోవుట.*]

మూ. దర్శయిత్వా తు రామాయ సీతాయాః పరిమార్గణే,
వాక్యమన్వర్థమర్థజ్ఞః కబన్ధః పునరబ్రవీత్. 1

ప్ర. అ. అర్థజ్ఞః=కార్యమును ఎరిగిన, కబన్ధః=కబంధుడు, సీతాయాః= సీతయొక్క, పరిమార్గణే = అన్వేషణము విషయమున, దర్శయిత్వా = ఉపాయమును చూపి, అన్వర్థమ్ = సరియైన అర్థము గల, వాక్యమ్ = వాక్యమును, పునః = మరల, అబ్రవీత్ = పలికెను.

తా. ప్రయోజనమును బాగుగా తెలుసుకొన గలిగిన కబంధుడు సీతాన్వేషణము నిమిత్తమై రామునకు ఉపాయమును చెప్పి, ఉత్తమమైన అర్థము గల వాక్యమును మరల పలికెను. 1

మూ. ఏష రామ శివః పన్థా యత్రైతే పుష్పితా ద్రుమాః,
ప్రతీచీం దిశమాశ్రిత్య ప్రకాశన్తే మనోరమాః. 2

జమ్బ్వప్రియాళపనసప్లక్షన్యగ్రోధసిన్దుకాః,
అశ్వత్థాః కర్ణికారాశ్చ చూతాశ్చాన్యే చ పాదపాః. 3

ధన్వనా నాగవృక్షాశ్చ తిలకా నక్తమాలకాః,
నీలాశోకాః కదమ్బాశ్చ కరవీరాశ్చ పుష్పితాః, 4
అగ్నిముఖ్యా అశోకాశ్చ సురక్తాః పారిభద్రకాః.

ప్ర. అ. రామ = రామా ! యత్ర = ఎక్కడ, ప్రతీచీమ్=పశ్చిమమైన,

దిశమ్ = దిక్కును, ఆశ్రిత్య = ఆశ్రయించి, మనోరమాః = మనోహరమైన, పుష్పితాః = పుష్పించిన, ద్రుమాః = చెట్లు, జమ్బ్వప్రియాళపనసప్లక్షన్యగ్రోధ సిన్దుకాః = నేరేడు, మోరటి, పనస, జువ్వి, మఱ్ఱి, తుమ్మికటుచెట్లు, అశ్వత్థాః= రావిచెట్లు, కర్ణికారాశ్చ = కొండగోగుచెట్లు, చూతాశ్చ = మామిడిచెట్లు, అన్యే చ = ఇతరములైన, పాదపాః = వృక్షములు, ధన్వనాః = చంద్రచెట్లు, నాగ వృక్షాశ్చ = పొన్నచెట్లు, తిలకాః = బొగ్గుచెట్లు, నక్తమాలకాః = కానుగుచెట్లు, నీలాశోకాః = నల్లని అశోకవృక్షములు, కదమ్బాశ్చ = కదంబవృక్షములు, పుష్పితాః = పుష్పించిన, కరవీరాశ్చ = గన్నేరుచెట్లు అగ్నిముఖ్యాః=భల్లాతక వృక్షములు, అశోకాశ్చ = అశోకవృక్షములు, సురక్తాః=రక్తచందనవృక్షములు, పారిభద్రకాః = వేపచెట్లు, ప్రకాశన్తే = ప్రకాశించుచున్నవో, ఏషః=ఇది, శివః= మంగళకరమైన, పన్థాః = మార్గము.

తా. రామా ! పశ్చిమదిక్కు వైపున ఎక్కడ పుష్పించిన వృక్షములు ఉన్నవో, నేరేడు, మోరటి, పనస, జువ్వి, మఱ్ఱిచెట్లు, తుమ్మికచెట్లు, రావిచెట్లు, కొండగోగు చెట్లు, మామిడిచెట్లు, చంద్రచెట్లు, పొన్నచెట్లు, బొగ్గుచెట్లు, కానుగు చెట్లు, నల్లని అశోకవృక్షములు, కదంబవృక్షములు, పుష్పించిన గన్నేరుచెట్లు, భల్లాతకవృక్షములు, అశోకవృక్షములు, రక్తచందనవృక్షములు, వేపచెట్లు, ప్రకాశించుచున్నవో అది మంగళకరమైన మార్గము. 2-4

మూ. తానారుహ్యాథవా భూమౌ పాతయిత్వా చ తాన్ బలాత్, 5
ఫలాన్యమృతకల్పాని భక్షయన్తౌ గమిష్యథః.

ప్ర. అ. తాన్ = ఆ వృక్షములను, ఆరుహ్య = ఎక్కి, అథవా = లేదా, బలాత్ = బలమువలన, తాన్ = వాటిని, పాతయిత్వా = పడగొట్టి, అమృత కల్పాని = అమృతముతో సమానములైన, ఫలాని = ఫలములను, భక్షయిత్వా= భక్షించి, గమిష్యథః = వెళ్ళగలరు.

తా. ఆ వృక్షములను ఎక్కిగాని, బలముచేత క్రిందికి పడగొట్టి గాని వాటి అమృతము వంటి ఫలములను భక్షించుచు వెళ్ళుడు. 5

మూ. తదతిక్రమ్య కాకుత్స్థ వనం పుష్పితపాదపమ్, 6
నన్దనప్రతిమం చాన్యత్కురవో హ్యుత్తరా ఇవ.

ప్ర. అ. కాకుత్స్థ = రామా ! పుష్పితపాదపమ్ = పుష్పించిన వృక్షములు గల, తత్ = ఆ, వనమ్ = వనమును, అతిక్రమ్య = దాటి, నన్దనప్రతిమమ్ = నందనవనముతో సమానము, ఉత్తరాః కురవః ఇవ = ఉత్తరకురుదేశము వలె ఉన్నదీ అయిన, అన్యత్ = మరియొక వనము (ఉన్నది).

తా. రామా ! పుష్పించిన వృక్షములు గల ఆ వనమును దాటిన పిమ్మట, నందనవనముతో సమానము, ఉత్తరకురుదేశతుల్యమూ అయిన మరొక వనము ఉన్నది. 6

మూ. సర్వకాలఫలా యత్ర పాదపా మధురస్రవాః, 7
సర్వే చ ఋతవస్తత్ర వనే చైత్రరథే యథా.

ప్ర. అ. యత్ర = ఎక్కడ, సర్వకాలఫలాః = అన్ని కాలములయందు ఫలములు గల, పాదపాః = వృక్షములు, మధురస్రవాః = మధురమైన రసము గలవో, తత్ర వనే = ఆ వనమునందు, సర్వే = సమస్తమైన, ఋతవః = ఋతువులు, చైత్రరథే యథా = చైత్రరథమునందు వలె, ఉండును.

తా. ఆ వనమునందు వృక్షములు అన్ని కాలములయందు ఫలముల నిచ్చును. మధురమైన రసము గలవి. చైత్రరథమునందు వలె ఆ వనమునందు అన్ని ఋతువులు ఒకే సమయమునం దుండును. 7

మూ. ఫలభారానతాస్తత్ర మహావిటపధారిణః, 8
శోభన్తే సర్వతస్తత్ర మేఘపర్వతసన్నిభాః.

ప్ర. అ. తత్ర = అక్కడ, ఫలభారానతాః = ఫలముల భారముచేత వంగిన, మేఘపర్వతసన్నిభాః = మేఘములతోను, పర్వతములతోను సమానములైన, మహావిటపధారిణః = పెద్ద కొమ్మలను ధరించిన వృక్షములు, శోభన్తే = శోభించుచున్నవి.

తా. ఆ వనమునందు పెద్ద కొమ్మలు గల వృక్షములు, పండ్లభారముచేత వంగినవై, మేఘముల వలె, పర్వతముల వలె ప్రకాశించుచుండును. 8

మూ. తానారుహ్యాథవా భూమౌ పాతయిత్వా యథాసుఖమ్, 9
ఫలాన్యమృతకల్పాని లక్ష్మణస్తే ప్రదాస్యతి.

ప్ర. అ. లక్ష్మణః = లక్ష్మణుడు, తాన్ = ఆ వృక్షములను, ఆరుహ్య = ఎక్కి, అథవా = లేదా, యథాసుఖమ్ = సుఖముగా, పాతయిత్వా = క్రిందికి రాల్చి, అమృతకల్పాని = అమృతముతో సమానములైన, ఫలాని = ఫలములను, తే = నీకు, ప్రదాస్యతి = ఇవ్వగలడు.

తా. లక్ష్మణుడు ఆ చెట్లను ఎక్కి గాని లేదా క్రిందికి పడగొట్టి గాని అమృతము వంటి ఫలములను నీకు ఇవ్వగలడు. 9

మూ. చఙ్క్రమాణౌ వరాన్ దేశాన్ శైలాచ్ఛైలం వనాద్వనమ్,
తతః పుష్కరిణీం వీరౌ పమ్పాం నామ గమిష్యథః. 10

ప్ర. అ. వీరౌ = వీరులారా! శైలాత్ = పర్వతమునుండి, శైలమ్ = పర్వతమును, వనాత్ = వనమునుండి, వనమ్ = వనమును, చఙ్క్రమాణౌ = నడచుచు, తతః = అటుపిమ్మట, పమ్పాం నామ = పంప అనే, పుష్కరిణీమ్ = పద్మసరస్సును, గమిష్యథః = పొందగలరు.

తా. వీరులారా! పర్వతమునుండి పర్వతమునకు, వనమునుండి వనమునకు వెళ్ళుచు, అక్కడినుండి పంప అనే పద్మసరస్సును గూర్చి వెళ్లుడు. 10

మూ. అశర్కరామవిభ్రంశాం సమతీర్థామశైవలామ్, 11
రామ సంజాతవాలూకాం కమలోత్పలశాలినీమ్.

ప్ర. అ. రామ = రామా! అశర్కరామ్ = గులకరాళ్ళులేనిది, అవిభ్రంశామ్ = జారుడు లేనిది, సమతీర్థామ్ = సమానమైన రేవులు గలది, అశైవలామ్ = నాచు లేనిది, సంజాతవాలూకామ్ = పుట్టిన ఇసుక తిన్నెలు గలది, కమలోత్పలశాలినీమ్ = పద్మములతోను నల్లకలవలతోను ప్రకాశించుచున్నది అయిన పంపానదిని గూర్చి వెళ్ళుడు.

తా. ఆ పంపాసరస్సులో గులకరాళ్ళు గాని, జారుడు ప్రదేశము గాని, నాచు గాని ఉండదు. రేవులు సమముగా ఉండును. అక్కడక్కడ ఇసుకతిన్నెలు ఏర్పడి ఉండును. పద్మములతోను, నల్లకలవలతోను ప్రకాశించుచుండును. 11

మూ. తత్ర హంసాః ప్లవాః క్రౌఞ్చాః కురరాశ్చైవ రాఘవ, 12
వల్గుస్వనా నికూజన్తి పమ్పాసలిలగోచరాః.

ప్ర. అ. రాఘవ = రామా! తత్ర = అక్కడ, పమ్పాసలిలగోచరాః = పంపాసరస్సు నీటిలో నివసించు, హంసాః = హంసలు, ప్లవాః = నీరుకోళ్ళు, క్రౌఞ్చాః = క్రౌంచపక్షులు, కురరాశ్చైవ = కురరపక్షులు, వల్గుస్వనాః = మధురములైన ధ్వనులు కలవై, వికూజన్తి = కూయుచుండును.

తా. రామా! అక్కడ హంసలు, నీరుకోళ్ళు, క్రౌంచపక్షులు, కురరపక్షులు పంపాజలములో ఉన్నవై మధురమైన ధ్వనులతో కూయుచుండును. 12

మూ. నోద్విజన్తే నరాన్ దృష్ట్వా వధస్యాకోవిదాః శుభాః, 13
ఘృతపిణ్డోపమాన్ స్థూలాంస్తాన్ ద్విజాన్ భక్షయిష్యథః.

ప్ర. అ. వధస్య = వధకు, అకోవిదాః = ఎగిరినవి కాని, శుభాః = శుభములైన ఆ పక్షులు, నరాన్ = మనుష్యులను, దృష్ట్వా = చూచి, నోద్విజన్తే = భయపడవు. ఘృతపిణ్డోపమాన్ = నేతిముద్దలతో సమానములైన, స్థూలాన్ = స్థూలములైన, తాన్ = ఆ, ద్విజాన్ = పక్షులను, భక్షయిష్యథః = భక్షించగలరు.

తా. చంపుట అనేది తెలియని ఉత్తమములైన ఆ పక్షులు మనుష్యులను చూచి బెదరవు నేతిముద్దల వలె ఉన్న పెద్ద ప్రమాణములో ఉన్న ఆ పక్షులను మీరు భక్షించవచ్చును. 13

మూ. రోహితాన్వక్రతుణ్డాంశ్చ నడమీనాంశ్చ రాఘవ, 14
పమ్పాయామిషుభిర్మత్స్యాంస్తత్ర రామ వరాన్ హతాన్.
నిస్త్వక్పక్షానయస్తప్తానకృశానేకకణ్టకాన్, 15
తవ భక్త్యా సమాయుక్తో లక్ష్మణః సంప్రదాస్యతి.

ప్ర. అ. రాఘవ = రఘువంశసంజాతుడవైన, రామ = రామా! తత్ర = అక్కడ, పమ్పాయామ్ = పంపాసరస్సునందు, ఇషుభిః = బాణములచేత, హతాన్ = చంపబడినవి, వరాన్ = శ్రేష్ఠములైనవి, నిస్త్వక్పక్షాన్ = చర్మ రెక్కలు లేనివి, అయస్తప్తాన్ = ఇనుముమీద కాల్చబడినవి, అకృశానేకకణ్టకాన్ = చిక్కినవి గాని అనేకమైన ముళ్ళుకలవి గాని కానివి అయిన, మత్స్యాన్ = మత్స్యములను, రోహితాన్ = గండుమీనులను, వక్రతుణ్డాంశ్చ = చొరమీనులను, నడమీనాంశ్చ = రొయ్యమీనులను, లక్ష్మణః = లక్ష్మణుడు, భక్త్యా = భక్తితో, సమాయుక్తః = కూడినవాడై, తవ = నీకు, సంప్రదాస్యతి = ఇవ్వగలడు.

తా. రఘువంశమునందు పుట్టిన రామా! ఆ పంపాసరస్సులో శ్రేష్ఠములైనవి, బలిసినవి, చాల ముళ్ళు లేనివి అయిన మత్స్యములను, గండుమీనులను, చారమీనులను, రొయ్యమీనులను, లక్ష్మణుడు బాణములచేత చంపి, వాటి చర్మలను రెక్కలను తీసివేసి, ఇనుముమీద కాల్చి భక్తిపురఃసరముగా నీకు సమర్పించగలడు. 14,15

మూ. భృశం తే ఖాదతో మత్స్యాన్ పమ్పాయాః పుష్పసంచయే,
పద్మగన్ధి శివం వారి సుఖశీతమనామయమ్,
ఉద్ధృత్య సతతాక్లిష్టం రౌప్యస్ఫాటికసన్నిభమ్, 17
అసౌ పుష్కరపర్ణేన లక్ష్మణః పాయయిష్యతి.

ప్ర. అ. భృశమ్ = మిక్కిలి, మత్స్యాన్ = మత్స్యములను, ఖాదతః = తినుచున్న, తే = నీకు, పుష్పసంచయే = పుష్పముల సముదాయమునం దున్నది, పద్మగన్ధి = పద్మాల సువాసన గలది, శివమ్ = మంగళప్రదము, సుఖశీతమ్ = సుఖకరముగాను, చల్లగాను ఉన్నది, అనామయమ్ = రోగము లేనిది, సతతాక్లిష్టమ్ = ఎల్లప్పుడూ నిర్మలముగా ఉండేది, రౌప్యస్ఫాటికసంనిభమ్ = వెండితోను స్ఫటికముతోను సమానము, అయిన, వారి = ఉదకమును, అసౌ = ఈ, లక్ష్మణః = లక్ష్మణుడు, పుష్కరపర్ణేన = తామరాకుచేత, పాయయిష్యతి = త్రాగించగలడు.

తా. నీవు మత్స్యములను అధికముగా తినుచుండగా, లక్ష్మణుడు పంపాసరస్సులోని పుష్పసముదాయములో ఉన్నది, పద్మముల సువాసన గలది, మంగళప్రదము, సుఖకరము, చల్లనిది, ఆరోగ్యకరము, ఎల్లప్పుడు వెండి వలె, స్ఫటికము వలె నిర్మలముగా ఉండేది, అయిన ఉదకమును తామరాకుదొప్పలో తీసికొనివచ్చి నీకు త్రాగించగలడు. 16, 17

మూ. స్థూలాన్ గిరిగుహాశయ్యాన్ వరాహాన్ వనచారిణః, 18
అపాం లోభాదుపావృత్తాన్ వృషభానివ నర్దతః,
రూపాన్వితాంశ్చ పమ్పాయాం ద్రక్ష్యసి త్వం నరోత్తమ.

ప్ర. అ. నరోత్తమ = నరులలో ఉత్తముడవైన రామా! స్థూలాన్ =

లావైనవి, గిరిగుహాశయ్యాన్ = పర్వతగుహలు శయ్యలుగా గలవి, వనచారిణః = వనమునందు సంచరించేవి, అపామ్ = నీటియొక్క, లోభాత్ = ఆశవలన, ఉపావృత్తాన్ = వచ్చినవి, వృషభానివ = ఎద్దుల వలె, నర్దతః = ధ్వనిచేయు చున్నవి, రూపాన్వితాన్ = మంచి ఆకారముతో కూడినవి అయిన, వరాహాన్ = వరాహములను, పమ్పాయామ్ = పంపాసరస్సునందు, త్వమ్ = నీవు, ద్రక్ష్యసి = చూదగలవు.

తా. నడులలో శ్రేష్ఠుడవైన రామా ! నీకు పంపాసరస్సు దగ్గర నీరు త్రాగుటకై వచ్చిన, మంచి ఆకారము గల అదవిపందులు కనబడును. చాల లావుగా ఉన్న ఆ అదవిపందులు అరణ్యములో సంచరించుచు గుహలలో శయ నించుచుండును. అవి ఆబోతుల వలె రంకెలు వేయుచుండును. 18, 19

మూ. సాయాహ్నే విచరన్రామ విటపీన్మాల్యధారిణః,
శీతోదకం చ పమ్పాయా దృష్ట్వా శోకం విహాస్యసి. 20

ప్ర. అ. రామ = రామా ! సాయాహ్నే=సాయంకాలమునందు, విచరన్ = సంచరించుచు, మాల్యధారిణః = పుష్పమాలలను ధరించు, విటపీన్ = వృక్ష ములను, పమ్పాయాః = పంపాసరస్సుయొక్క, శీతోదకం చ = చల్లని ఉదక మును, దృష్ట్వా = చూచి, శోకమ్=శోకమును, విహాస్యసి=విడువగలవు.

తా. రామా : సాయంకాలమునందు నీవు ఇటు నటు సంచరించుచు పుష్ప మాలలు ధరించిన వృక్షాలను, పంపాసరోజలమును చూచి నీ శోకమును విడిచి పెట్టెదవు. 20

మూ. సుమనోభిశ్చితాంస్తత్ర తిలకాన్నక్తమాలకాన్,
ఉత్పలాని చ పుల్లాని పఙ్కజాని చ రాఘవ. 21

ప్ర. అ. రాఘవ = రామా ! తత్ర = అక్కడ. సుమనోభిః = పుష్పము లతో, చితాన్ = వ్యాప్తములైన, తిలకాన్ = బొట్టుగుచెట్లను, నక్తమాలకాన్ = కానుగుచెట్లను, పుల్లాని = వికసించిన, ఉత్పలాని చ=నల్లకలువలను, పఙ్కజాని చ = పద్మములను (చూదగలవు).

తా. రామా ! నీకు అక్కడ పుష్పములతో నిండిన బొట్టుగు చెట్లు, కానుగు చెట్లు, వికసించిన కలవలు, పద్మములు కనబడగలవు. 21

మూ. న తాని కశ్చిన్మాల్యాని తత్రారోపయితా నరః,
న చ వై మ్లానతాం యాన్తి న చ శీర్యన్తి రాఘవ. 22

ప్ర. అ. రాఘవ = రామా ! తత్ర = అక్కడ, తాని మాల్యాని = ఆ మాలికలను, ఆరోపయితా = ధరించే, నరః = మనుష్యుడు, కశ్చిత్ = ఎవ్వడూ, న = లేడు. మ్లానతామ్ = వాడిపోవుటను, న యాన్తి = పొందవు. న చ శీర్యన్తి= రాలిపోవు.

తా. రామా ! అక్కడ ఉన్న ఆ పుష్పమాలలు ధరించేవా రెవరూ లేరు. అవి వాడవు; రాలిపోవు. 22

మూ. మతఙ్గశిష్యాస్తత్రాసన్నృషయః సుసమాహితాః,
తేషాం భారాభితప్తానాం వన్యమాహరతాం గురోః. 23

యే ప్రపేతుర్మహీం తూర్ణం శరీరాత్స్వేదబిన్దవః,
తాని జాతాని మాల్యాని మునీనాం తపసా తదా. 24
స్వేదబిన్దుసముత్థాని న వినశ్యన్తి రాఘవ.

ప్ర. అ. తత్ర = అక్కడ, సుసమాహితాః = చాల ఏకాగ్రమైన చిత్తము గల, మతఙ్గశిష్యాః = మతంగమహర్షి శిష్యులైన, ఋషయః=ఋషులు, ఆసన్= ఉండిరి. గురోః = గురువునకు, వన్యమ్ = వనమునందలి వస్తుసముదాయమును, ఆహరతామ్ = తీసికొనివచ్చుచున్న, భారాభితప్తానామ్=భారముచేత బాధితులైన, తేషామ్=ఆ మునులయొక్క, శరీరాత్ = శరీరమునుండి, యే = ఏ, స్వేదబిన్దవః = చెమటచుక్కలు, తూర్ణమ్ = శీఘ్రముగా, మహీమ్ = భూమిని (మీద), పేతుః = పడినవో, తాని = అవి, తదా = అప్పుడు, మునీనామ్ = మునులయొక్క, తపసా = తపస్సుచేత, మాల్యాని = మాలలుగా, జాతాని=అయినవి. రాఘవ = రామా ! స్వేదబిన్దుసముత్థాని = చెమటచుక్కలనుండి పుట్టిన, ఆ మాలలు, న వినశ్యన్తి = నశించవు.

తా. అక్కడ మంచి మనోనిగ్రహము గల మతంగముని శిష్యులైన

ఋషులు నివసించేవారు. గురువుకొరకై, వనములో లభించే సమిధలు మొదలైన వాటిని తెచ్చునప్పుడు వాటి బరువుచేత క్లేశము చెందిన వాళ్ళ శరీరములనుండి నేలమీద పడిన చెమట చుక్కలు, ఆ మునుల తపఃప్రభావముచేత పుష్పమాలలుగా మారినవి. రామా ! చెమట చుక్కలనుండి పుట్టిన ఆ పుష్పమాలలు నశించకుండా ఉన్నవి. 23, 24

మూ. తేషాం గతానామద్యాపి దృశ్యతే పరిచారిణీ, 25
శ్రమణీ శబరీ నామ కాకుత్స్థ చిరజీవినీ.

ప్ర. అ. కాకుత్స్థ = రామా ! తేషామ్ = ఆ మునులు, గతానామ్ = వెళ్ళిపోయినవారగుచుండగా, పరిచారిణీ = వాళ్ళకు ఉపచారములు చేసిన, ("సహచారిణీ"అని ప్రాచ్యపాఠము; దానికి"వారితో కలిసి తపస్సు చేసిన" అని అర్థము),చిరజీవినీ = దీర్ఘకాలము జీవించిన, శబరీనామ = శబరి అను పేరు గల, శ్రమణీ = = సన్న్యాసిని, అద్యాపి = ఇప్పటికి కూడా, దృశ్యతే = చూడబడుచున్నది.

తా. రామా ! ఆ ముని లందరు స్వర్గస్థులైనా వారికి ఉపచారములు చేసిన (లేదా వారితో కలిసి తపస్సు చేసిన) చిరాయుర్దాయవంతురాలైన శబరి అనే సన్న్యాసిని నేటికీ అక్కడ ఉన్నది. 25

మూ. త్వాం తు ధర్మే స్థితా నిత్యం సర్వభూతనమస్కృతమ్,
దృష్ట్వా దేవోపమం రామ స్వర్గలోకం గమిష్యతి.

ప్ర. అ. రామ = రామా ! నిత్యమ్ = ఎల్లప్పుడు, ధర్మే=ధర్మమునందు, స్థితా = ఉన్న ఆమె, సర్వభూతనమస్కృతమ్ = సకలజనులచేత (ప్రాణులచేత) నమస్కరింపబడిన, దేవోపమమ్ = దేవతాతుల్యుడవైన, త్వామ్=నిన్ను, దృష్ట్వా = చూచి, స్వర్గలోకమ్ = స్వర్గలోకమును గూర్చి, గమిష్యతి = వెళ్లగలదు.

తా. రామా ! నిత్యము ధర్మమార్గమునందున్న ఆ శబరి, సకలభూతముల చేత నమస్కరింపబడేవాడవు, దేవతాతుల్యుడవూ అయిన నీ దర్శనము చేసికొని స్వర్గమునకు వెళ్ళగలదు. 26

మూ. తత స్త్వద్రామ పమ్పాయా స్తీరమాసాద్య పశ్చిమమ్, 27
ఆశ్రమస్థానమతులం గుహ్యం కాకుత్స్థ పశ్యసి.

ప్ర. అ. కాకుత్స్థ=కకుత్స్థవంశమునందు జనించిన, రామ = రామా! తతః=అటుపిమ్మట, పమ్పాయాః=పంపయొక్క, తత్=ఆ, పశ్చిమం తీరమ్=పశ్చిమ తీరమును, ఆసాద్య = పొంది, అతులమ్=సాటి లేని, గుహ్యమ్=రహస్యమైన, ఆశ్రమస్థానమ్ = ఆశ్రమమును, పశ్యసి = చూచెదవు.

తా. కాకుత్స్థవంశమునందు జనించిన రామా! పిమ్మట ఆ పంపాసరస్సు పశ్చిమతీరము చేరగా, అక్కడ నీకు సాటి లేనిది, రహస్యమూ అయిన ఆశ్రమము కనబడును. 27

మూ. న తత్రాక్రమితుం నాగాః శక్నువన్తి తమాశ్రమమ్, 28
వివిధాస్తత్ర వై నాగా వనే తస్మింశ్చ పర్వతే,
ఋషేస్తస్య మతఙ్గస్య విధానాత్తచ్చ కాననమ్. 29

ప్ర. అ. తత్ర = అక్కడ, నాగాః = ఏనుగులు, తమ్ = ఆ, ఆశ్రమమ్ = ఆశ్రమమును, ఆక్రమితుమ్ = ఆక్రమించుటకు, న శక్నువన్తి=సమర్థములు కావు. తస్మిన్ = ఆ, పర్వతే = పర్వతమునందు, వనే = వనమునందు, వివిధాః =అనేకవిధములైన, నాగాః=ఏనుగు లున్నవి. తత్=ఆ, కాననమ్=అరణ్యము, తస్య = ఆ, మతఙ్గస్య ఋషేః = మతంగమహర్షియొక్క, విధానాత్ = నియమమువలన (ఏర్పడినది).

తా. ఆ పర్వతమునందు, వనమునందు కూడ అనేకవిధములైన ఏనుగులు ఉన్నవి. కాని ఆ ఏనుగులు ఆ ఆశ్రమమును ఆక్రమింపజాలవు. ఆ అరణ్యమునందు మతంగమహర్షి ఏర్పరచిన నియమములు పాటింపబడుచున్నవి. 28,29

మూ. తస్మిన్నన్దనసంకాశే దేవారణ్యోపమే వనే,
నానావిహగసంకీర్ణే రంస్యసే రామ నిర్వృతః. 30

ప్ర. అ. రామ = రామా! నన్దనసంకాశే = నందనవనముతో సమానమైన, దేవారణ్యోపమే = దేవతల అరణ్యములతో సమానమైన, నానావిహగసంకీర్ణే = అనేకవిధములైన పక్షులతో వ్యాప్తమైన, తస్మిన్ వనే=ఆ వనమునందు, నిర్వృతః = సుఖము పొందినవాడవై, రంస్యసే = క్రీడించగలవు.

తా. రామా! నందనవనముతోను, చైత్రరథాదివనములతోను సమాన

మైనది, అనేకవిధములైన పక్షులతో వ్యాప్తమూ అయిన ఆ వనమునందు నీవు సుఖముగా విహరించవచ్చును. 30

మూ. ఋష్యమూకశ్చ పమ్పాయాః పురస్తాత్పుష్పితద్రుమః,
సుదుఃఖారోహణో నామ శిశునాగాభిరక్షితః, 31
ఉదారో బ్రహ్మణా చైవ పూర్వకాలే వినిర్మితః.

ప్ర. అ. పమ్పాయాః = పంపయొక్క, పురస్తాత్ = ముందుగా, పుష్పితద్రుమః = పుష్పించిన వృక్షములు గలది, సుదుఃఖారోహణః = ఎక్కుటకు చాల కష్టమైనది, శిశునాగాభిరక్షితః = చిన్న ఏనుగులచేత రక్షింపబడినది, ఉదారః = శ్రేష్ఠమైనది, బ్రహ్మణా = బ్రహ్మచేత, పూర్వకాలే = పూర్వకాలమునందు, వినిర్మితః = నిర్మించబడినది అయిన, ఋష్యమూకపర్వతము ఉన్నది.

తా. ఋష్యమూకపర్వతము పంపకు ముందుగానే ఉన్నది. దానిని ఎక్కుట చాల కష్ట మని ప్రసిద్ధి. పూర్వకాలమునందు బ్రహ్మచే నిర్మింపబడిన ఈ పర్వతమును చిన్న ఏనుగులు రక్షించుచుండును. పుష్పించిన వృక్షములతో చాల సుందరముగా ఉండును. 31

మూ. శయానః పురుషో రామ తస్య శైలస్య మూర్ధని, 32
యత్స్వప్నే లభతే విత్తం తత్ప్రబుద్ధోఽధిగచ్ఛతి.

ప్ర. అ. రామ = రామా! తస్య = ఆ, శైలస్య = పర్వతముయొక్క, మూర్ధని = శిరస్సుపై, శయానః = శయనించిన, పురుషః = పురుషుడు, స్వప్నే = స్వప్నమునందు, యత్ = ఏ, విత్తమ్ = ధనమును, లభతే = పొందునో, తత్ = దానిని, ప్రబుద్ధః = మేల్కొన్నవాడై, అధిగచ్ఛతి = పొందును.

తా. రామా! ఆ పర్వతముమీద నిద్రించిన పురుషునకు స్వప్నములో ఏ ధనము లభించునో, ఆ ధనమును అతడు మేల్కొనగానే పొందును. 32

మూ. న త్వేనం విషమాచారః పాపకర్మాధిరోహతి, 33
యస్తు తం విషమాచారః పాపకర్మాధిరోహతి,
తత్రైవ ప్రహరన్త్యేనం సుప్తమాదాయ రాక్షసాః. 34

ప్ర. అ. విషమాచారః = విషమమైన ఆచారము గల, పాపకర్మా = పాప కర్మ చేయువాడు, ఏనమ్ = దానిని, న అధిరోహతి = ఎక్కజాలడు. విషమాచారః = విషమమైన ఆచారము గల, పాపకర్మా=పాపకర్మ గలవాడు, యః= ఎవడు, తమ్ = దానిని, అధిరోహతి = ఎక్కునో, సుప్తమ్ = నిద్రించుచున్న, తమ్ = అతనిని, ఆదాయ = గ్రహించి, రాక్షసాః = రాక్షసులు, తత్రైవ= అక్కడనే, ప్రహరన్తి = కొట్టెదరు.

తా. చెడ్డ ఆచారము గల పాపకర్మ గలవా డెవ్వడూ ఈ పర్వతమును ఎక్కడు. చెడ్డ ఆచారము గల పాపాత్మ డెవడైన ఎక్కినచో, అతడు నిద్రించు చున్నపుడు రాక్షసులు వానిని పట్టుకొని చంపుదురు. 33, 34

మూ. తత్రాపి శిశునాగానామాక్రన్దః శ్రూయతే మహాన్,
క్రీడతాం రామ పమ్పాయాం మతఙ్గారణ్యవాసినామ్. 35

ప్ర. అ. రామ = రామా ! తత్రాపి = ఆ ఋష్యమూకపర్వతమునందు కూడా, పమ్పాయామ్ = పంపాసరస్సునందు, క్రీడతామ్ = ఆడుకొనుచున్న, మతఙ్గారణ్యవాసినామ్ = మతంగారణ్యమునందు నివసించుచున్న, శిశునాగానామ్ = చిన్న ఏనుగులయొక్క, మహాన్ = గొప్ప, ఆక్రన్దః = అరుపు, శ్రూయతే = వినబడుచుండును.

తా. రామా ! మతంగాశ్రమములో నివసించు చిన్న ఏనుగులు పంపలో ఆడుకొనుచుండునపుడు, వాటి మహాధ్వని ఆ ఋష్యమూకపర్వతముమీదకి కూడ వినబడుచుండును. 35

మూ. సిక్తా రుధిరధారాభిః సంహృత్య పరమద్విపాః,
ప్రచరన్తి పృథక్కీర్ణా మేఘవర్ణాస్తరస్వినః. 36

ప్ర. అ. మేఘవర్ణాః = మేఘములవంటి వర్ణములుగల, తరస్వినః = బలము గల, పరమద్విపాః = శ్రేష్ఠములైన ఏనుగులు, సంహృత్య = కొట్టుకొని, రుధిరధారాభిః = రక్తధారలచేత, సిక్తాః = తడపబడినవై, పృథక్ = వేరుగా, కీర్ణాః = వ్యాప్తమైనవై, ప్రచరన్తి = సంచరించుచుండును.

తా. మేఘము వంటి వర్ణము గల, బలము గల ఏనుగులు పోటాడుకొని,

రక్తధారలచేత తడపబడినవై, వేరు వేరు గుంపులుగా చెదిరిపోయి, తిరుగు చుండును. 36

మూ. తే తత్ర పీత్వా పానీయం విమలం శీతమవ్యయమ్,
నిర్వృతాః సంవిగాహన్తే వనాని వనగోచరాః. 37

ప్ర. అ. వనగోచరాః = వనములో సంచరించు, తే = ఆ ఏనుగులు, విమలమ్ = నిర్మలము, శీతమ్ = చల్లనిది, అవ్యయమ్ = ఆరోగ్యకరము అయిన, పానీయమ్ = ఉదకమును, పీత్వా = త్రాగి, నిర్వృతాః = తృప్తి చెందినవై, వనాని = వనములను, విగాహన్తే = ప్రవేశించుచుండును.

తా. వనములో సంచరించే ఆ ఏనుగులు ఆ పంపాసరస్సులో నిర్మలము, ఆరోగ్యకరము అయిన చల్లని నీరు త్రాగి, సంతృప్తి చెంది, వనములలోనికి పోవుచుండును. 37

మూ. ఋక్షాంశ్చ ద్వీపినశ్చైవ నీలకోమలకప్రభాన్,
రురూనపేతాపజయాన్ దృష్ట్వా శోకం జయిష్యసి. 38

ప్ర. అ. ఋక్షాంశ్చ = ఎలుగుబంట్లను, ద్వీపినశ్చైవ = పెద్దపులులను, నీలకోమలకప్రభాన్ = నీలమాణిక్యముల వలె కోమలమైన కాంతి గలవి, అపేతాపజయాన్ = పరాజయము లేనివి అయిన, రురూన్ = రురుమృగములను, దృష్ట్వా = చూచి, శోకమ్ = శోకమును, జయిష్యసి = జయించగలవు.

తా. ఎలుగుబంట్లను, పెద్దపులులను, ఇంద్రనీలము వంటి కోమలమైన కాంతి గల, పరాజయమును (భయమును) ఎరుగని నల్ల చారల దుప్పులను చూచుచు శోకమును మరచిపోయెదవు. 38

మూ. రామ తస్య తు శైలస్య మహతీ శోభతే గుహా,
శిలాపిధానా కాకుత్స్థ దుఃఖం చాస్యాః ప్రవేశనమ్. 39

ప్ర. అ. కాకుత్స్థ = కకుత్స్థవంశమునందు పుట్టిన, రామ = రామా! తస్య శైలస్య = ఆ పర్వతముయొక్క, శిలాపిధానా = శిల అచ్ఛాదనముగా గల, మహతీ = గొప్పదైన, గుహా = గుహ, శోభతే = ప్రకాశించుచున్నది. అస్యాః = దీనియొక్క, ప్రవేశనమ్ = ప్రవేశించుట, దుఃఖమ్ = కష్టమైనది.

తా. కకుత్స్థవంశమునందు జనించిన రామా ! ఆ పర్వతమునందు పెద్ద గుహ శోభించుచున్నది. దానికి పెద్ద శిల ఆచ్ఛాదనముగా ఉన్నది. దానిలో ప్రవేశించుట చాల కష్టము. 39

మూ. తస్యా గుహాయాః ప్రాగ్ద్వారే మహాన్ శీతోదకో హ్రదః,
ఫలమూలాన్వితో రమ్యో నానామృగసమావృతః. 40

ప్ర. అ. తస్యాః = ఆ, గుహాయాః = గుహయొక్క, ప్రాగ్ద్వారే = తూర్పు ద్వారమునందు, శీతోదకః = చల్లని ఉదకము గలది, ఫలమూలాన్వితః = ఫలముల తోను మూలములతోను కూడినది, రమ్యః = సుందరమైనది, నానామృగ సమావృతః = అనేకవిధములైన మృగములచేత చుట్టబడినది అయిన, మహాన్ = పెద్ద, హ్రదః = చెరువు ఉన్నది.

తా. ఆ గుహ తూర్పు ద్వారమునందు చల్లని ఉదకము గలది, ఫలముల తోను మూలములతోను నిండినది, చుట్టూ అనేకమృగములు నివసించేదీ అయిన రమ్యమైన గొప్ప చెరువు ఉన్నది. 40

మూ. తస్యాం వసతి సుగ్రీవశ్చతుర్భిః సహ వానరైః,
కదాచిచ్ఛిఖరే తస్య పర్వతస్యావతిష్ఠతే. 41

ప్ర. అ. సుగ్రీవః = సుగ్రీవుడు, చతుర్భిః = నలుగురు, వానరైః సహ = వానరులతో కూడ, తస్యామ్ = ఆ గుహలో, వసతి = నివసించుచున్నాడు. కదాచిత్ = అప్పుడప్పుడు, తస్య పర్వతస్య = ఆ పర్వతముయొక్క, శిఖరే = శిఖరముపై, అవతిష్ఠతే = ఉండును.

తా. సుగ్రీవుడు నలుగురు వానరులతో కలిసి ఆ గుహలో నివసించు చున్నాడు. అప్పుడప్పుడు ఆ పర్వతము శిఖరముమీద ఉండును. 41

మూ. కబన్ధస్త్వనుశాస్యైవం తావుభౌ రామలక్ష్మణౌ,
స్రగ్వీ భాస్కరవర్ణాభః ఖే వ్యరోచత వీర్యవాన్. 42

ప్ర. అ. వీర్యవాన్ = పరాక్రమవంతుడు, స్రగ్వీ = మాలలు గలవాడు అయిన, కబన్ధస్తు = కబంధుడు, తౌ = ఆ, రామలక్ష్మణౌ = రామలక్ష్మణులను, ఉభౌ = ఇదరినీ, ఏవమ్ = ఇటు, అనుశాస్య = బోధించి, ఖే = ఆకాశమునందు,

భాస్కరవర్ణాభః = సూర్యునివర్ణము వంటి కాంతి గలవాడై, వ్యరోచత = ప్రకాశించెను.

తా. పుష్పమాలలు ధరించి ఉన్న పరాక్రమవంతుడైన కబంధుడు ఆ రామలక్ష్మణు లిద్దరికి ఈ విధముగా చెప్పి ఆకాశమునందు సూర్యుని వంటి కాంతితో ప్రకాశించుచుండెను. 42

మూ. తం తు ఖస్థం మహాభాగం కబన్ధం రామలక్ష్మణౌ,
ప్రస్థితౌ త్వం వ్రజస్వేతి వాక్యమూచతురన్తికే. 43

ప్ర. అ. ప్రస్థితౌ = ప్రయాణమైన, తౌ రామలక్ష్మణౌ = ఆ రామలక్ష్మణులు, అన్తికే = సమీపమునందు, ఖస్థమ్ = ఆకాశమునందున్న, మహాభాగమ్ = గొప్ప భాగ్యము గల, తం కబన్ధమ్ = ఆ కబంధుని గూర్చి, త్వమ్ = నీవు, వ్రజస్వ = వెళ్లుము, ఇతి = అని, వాక్యమ్ = వాక్యమును, ఊచతుః = పలికిరి.

తా. రామలక్ష్మణులు బయలుదేరి, దగ్గరనే ఆకాశములో ఉన్న మహాభాగ్యవంతుడైన ఆ కబంధునితో "ఇక నీవు వెళ్లుము''అని పలికిరి. 43

మూ. గమ్యతాం కార్యసిద్ధ్యర్థమితి తావబ్రవీత్స చ,
సువ్రతౌ తావనుజ్ఞాప్య కబన్ధః ప్రస్థితస్తదా. 44

ప్ర. అ. తదా = అప్పుడు, ప్రస్థితః = ప్రయాణమైన, సః కబన్ధశ్చ = ఆ కబంధుడు కూడ, సువ్రతౌ = మంచి నియమములు గల, తౌ = వారిని, అనుజ్ఞాప్య = అనుజ్ఞ ఇచ్చునట్లు చేసికొని, కార్యసిద్ధ్యర్థమ్ = కార్యసిద్ధికొరకు, గమ్యతామ్ = వెళ్లెదరుగాక అని, తౌ = వారిని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. అప్పుడు ఉత్తమమైన నియమములు గల ఆ రామలక్ష్మణుల అనుజ్ఞ తీసికొని బయలుదేరిన కబంధుడు ''కార్యసిద్ధికై వెళ్లుడు''అని ఆ రామలక్ష్మణులతో పలికెను. 44

మూ. స తత్కబన్ధః ప్రతిపద్య రూపం
వృతః శ్రియా భాస్కరతుల్యదేహః,
నిదర్శయన్ రామమవేక్ష్య ఖస్థః
సఖ్యం కురుష్వేతి తదాభ్యువాచ. 45

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే త్రిసప్తతితమః సర్గః.

ప్ర. అ. సః కబన్ధః = ఆ కబంధుడు, తత్ = ఆ, రూపమ్=రూపమును, ప్రతిపద్య = పొంది, శ్రియా = శోభతో, వృతః = కూడినవాడై, భాస్కరతుల్య దేహః = సూర్యునితో సమానమైన దేహము కలవాడై, ఖస్థః = ఆకాశమునం దున్నవాడై, రామమ్ = రాముణ్ణి, అవేక్ష్య = చూచి, నిదర్శయన్ = ఋష్య మూకమువైపు చూపుచు, సఖ్యమ్ = స్నేహమును, కురుష్వ = చేయుము, ఇతి= అని, తదా = అప్పుడు, ఉవాచ = పలికెను.

తా. ఆ కబంధుడు తన రూపమును పొంది, శోభాన్వితుడై సూర్యుని వంటి దేహముతో ఆకాశములో నిలచి, రాముణ్ణి చూచి, అప్పుడు అతనికి ఋష్య మూకము వైపు చూపుచు, ''సుగ్రీవునితో స్నేహము చేయుము''అని పలికెను.

'బాలానందిని''అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో డెబ్బదిమూడవ సర్గ సమాప్తము.

అథ చతుఃసప్తతితమః సర్గః

[రామలక్ష్మణులు పంపాతీరమునందున్న మతంగవనములో శబరి ఆశ్రమమునకు వెళ్ళి ఆమె చేసిన సత్కారమును అందుకొని ఆమెతో కలిసి మతంగవనమును పర్యవేక్షించుట, శబరి తన శరీరమును అగ్నిలో ఆహుతిగా సమర్పించి స్వర్గము చేరుట.]

మూ. తౌ కబన్ధేన తం మార్గం పమ్పాయా దర్శితం వనే,
ఆతస్థతుర్దిశం గృహ్య ప్రతీచీం నృవరాత్మజౌ. 1

ప్ర. అ. తౌ = ఆ, నృవరాత్మజౌ = దశరథకుమారులు, వనే = వనమునందు, ప్రతీచీం దిశమ్ = పశ్చిమదిక్కును. గృహ్య = గ్రహించి, కబన్ధేన = కబంధునిచేత, దర్శితమ్ = చూపబడిన, తమ్ = ఆ, పమ్పాయాః = పంపాసరస్సుయొక్క, మార్గమ్ = మార్గమును, ఆతస్థతుః = పొందిరి.

తా. ఆ రామలక్ష్మణులు, వనమునందు, పశ్చిమాభిముఖులై బయలుదేరి కబంధుడు చెప్పిన పంపాసరోవరమార్గమును చేరిరి. 1

మూ. తౌ శైలేష్వాచితానేతాన్ క్షౌద్రకల్పఫలాన్ ద్రుమాన్,
వీక్షన్తౌ జగ్మతుర్ద్రష్టుం సుగ్రీవం రామలక్ష్మణౌ. 2

ప్ర. అ. తౌ రామలక్ష్మణౌ = ఆ రామలక్ష్మణులు, శైలేషు = పర్వతములయందు, ఆచితాన్ = నాటబడిన (మొలచిన), క్షౌద్రకల్పఫలాన్ = తేనె వంటి పండ్లు గల, ద్రుమాన్ = వృక్షములను, వీక్షన్తౌ = చూచుచున్నవారై, సుగ్రీవమ్ = సుగ్రీవుని, ద్రష్టుమ్ = చూచుటకు, జగ్మతుః = వెళ్ళిరి.

తా. ఆ రామలక్ష్మణులు పర్వతాలమీద మొలచిన, తేనెవంటి ఫలములు గల వృక్షములను చూచుచు సుగ్రీవుని చూచుటకై వెళ్ళిరి. 2

మూ. కృత్వా చ శైలపృష్ఠే తు తౌ వాసం రామలక్ష్మణౌ,
పమ్పాయాః పశ్చిమం తీరం రాఘవావుపతస్థతుః. 3

ప్ర. అ. రాఘవౌ = రఘువంశ సంజాతులైన, తౌ రామలక్ష్మణౌ = ఆ రామలక్ష్మణులు, శైలపృష్ఠే = పర్వతము పైభాగమునందు, వాసమ్ = నివాసమును, కృత్వా = చేసి, పమ్పాయాః = పంపాసరస్సుయొక్క, పశ్చిమం తీరమ్ = పశ్చిమతీరమును, ఉపతస్థతుః = సమీపించిరి.

తా. రఘువంశమునందు పుట్టిన ఆ రామలక్ష్మణులు మార్గమధ్యములో పర్వతము పైభాగమునందు ఆగుచు, పంప పశ్చిమతీరమును చేరిరి. 3

మూ. తౌ పుష్కరిణ్యాః పమ్పాయాస్తీరమాసాద్య పశ్చిమమ్,
అపశ్యతాం తతస్తత్ర శబర్యా రమ్య మాశ్రమమ్. 4

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తౌ = ఆ రామలక్ష్మణులు, పమ్పాయాః = పంప అను, పుష్కరిణ్యాః = పద్మసరస్సుయొక్క, పశ్చిమమ్ = పడమటిదైన, తీరమ్ = తీరమును, ఆసాద్య = పొంది, తత్ర = అక్కడ, శబర్యాః = శబరి యొక్క, రమ్యమ్ = రమ్యమైన, ఆశ్రమమ్ = ఆశ్రమమును, అపశ్యతామ్ = చూచిరి.

తా. పిమ్మట ఆ రామలక్ష్మణులు పంపాసరస్సు పశ్చిమతీరము చేరి అక్కడ, శబరి నివసించు రమ్యమైన ఆశ్రమమును చూచిరి. 4

మూ. తౌ తమాశ్రమమాసాద్య ద్రుమైర్బహుభిరావృతమ్,
సురమ్యమభివీక్షన్తౌ శబరీమభ్యుపేయతుః. 5

ప్ర. అ. తౌ = ఆ రామలక్ష్మణులు, తమ్ = ఆ, ఆశ్రమమ్ = ఆశ్రమమును, ఆసాద్య = సమీపించి, బహుభిః = అనేకమైన, ద్రుమైః = వృక్షములచేత, ఆవృతమ్ = కప్పబడిన, సురమ్యమ్ = చాల రమ్యమైన ఆ ఆశ్రమమును, అభివీక్షన్తౌ = చూచుచున్నవారై, శబరీమ్ = శబరిని, అభ్యుపేయతుః = పొందిరి.

తా. ఆ రామలక్ష్మణులు ఆ ఆశ్రమమును సమీపించి, అనేకమైన వృక్షములచేత కప్పబడిన, చాల అందమైన ఆ ఆశ్రమమును చూచుచు శబరిని సమీపించిరి. 5

మూ. తౌ చ దృష్ట్వా తదా సిద్ధా సముత్థాయ కృతాఞ్జలిః,
రామస్య పాదౌ జగ్రాహ లక్ష్మణస్య చ ధీమతః. 6

ప్ర. అ. తదా = అప్పుడు, సిద్ధా = సిద్ధురాలైన ఆ శబరి, తౌ = ఆ రామలక్ష్మణులను, దృష్ట్వా = చూచి, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలికలదై, సముత్థాయ = లేచి, రామస్య = రాముని యొక్క, ధీమతః = బుద్ధిమంతుడైన, లక్ష్మణస్య చ = లక్ష్మణుని యొక్క, పాదౌ = పాదములను, జగ్రాహ = గ్రహించెను.

తా. అప్పుడు సిద్ధురాలైన ఆ శబరి రామలక్ష్మణులను చూచి అంజలి ఘటించి, లేచి రాముని పాదములను, ధీమంతుడైన లక్ష్మణుని పాదములను స్పృశించి నమస్కరించెను. 6

మూ. పాద్యమాచమనీయం చ సర్వం ప్రాదాద్యథావిధి,
తామువాచ తతో రామః శ్రమణీం సంశితవ్రతామ్. 7

ప్ర. అ. పాద్యమ్ = పాద్యమును, ఆచమనీయం చ = ఆచమనీయమును, సర్వమ్ = అంతనూ, యథావిధి = యథాశాస్త్రముగా, ప్రాదాత్ = ఇచ్చెను. తతః = అటుపిమ్మట, సంశితవ్రతామ్ = మిక్కిలి తీవ్రమైన నియమములు గల, తామ్ = ఆ, శ్రమణీమ్ = సంన్యాసినియైన శబరిని గూర్చి, రామః = రాముడు, ఉవాచ = పలికెను.

తా. ఆమె వారిద్దరికీ, యథాశాస్త్రముగా పాద్యము, ఆచమనము చేయుటకు ఉదకము మొదలైనవి అన్నీ సమర్పించెను. పిమ్మట రాముడు తీవ్రమైన నియమములను పాటించుచు తపస్సు చేయుచున్న ఆ సంన్యాసినితో ఇట్లు పలికెను. 7

మూ. కచ్చిత్తే నిర్జితా విఘ్నాః కచ్చిత్తే వర్ధతే తపః,
కచ్చిత్తే నియతః క్రోధ ఆహారశ్చ తపోధనే. 8

ప్ర. అ. తపోధనే = తపస్సే ధనముగా గల ఓ! శబరీ! తే = నీయొక్క, విఘ్నాః = తపోవిఘ్నములు, నిర్జితాః కచ్చిత్ = జయింపబడినవా? తే = నీయొక్క, తపః = తపస్సు, వర్ధతే కచ్చిత్ = వృద్ధి పొందుచున్నది కదా? తే = నీయొక్క,

క్రోధః = కోపము, ఆహారశ్చ = ఆహారము, నియతః కచ్చిత్ = నిగ్రహింప బడినదా ?

తా. ఓ ! తాపసురాలా ! నీ తపస్సునకు విఘ్నము లేవీ కలుగుట లేదు కదా ? నీ తపస్సు వృద్ధి పొందుచున్నది కదా ? నీవు క్రోధమును నిగ్రహించు కొన్నావు కదా ? ఆహారము విషయమునందు కూడ నిగ్రహము అలవరచు కొన్నావు కదా ! 8

మూ. కచ్చిత్తే నియమాః ప్రాప్తాః కచ్చిత్తే మనసః సుఖమ్,
కచ్చిత్తే గురుశుశ్రూషా సఫలా చారుభాషిణి. 9

ప్ర. అ. చారుభాషిణి = అందముగా మాటలాడుదునా ! తే = నీకు, నియమాః = నియమములు, ప్రాప్తాః కచ్చిత్ = పొందబడినవికదా ? తే = నీయొక్క, మనసః = మనస్సునకు, సుఖం కచ్చిత్ = సుఖమే కదా ? తే = నీయొక్క, గురుశుశ్రూషా = గురుశుశ్రూష, సఫలా కచ్చిత్ = సఫలమైనదా ?

తా. చక్కగా మాటలాడు ఓ: శబరీ ! నీవు చాంద్రాయణాది నియమము లన్నీ పూర్తి చేసికొంటివా? నీ మనస్సుకు సుఖము లభించినదా? నీవు చేసిన గురు సేవ సఫల మైనదా? 9

మూ. రామేణ తాపసీ పృష్టా సా సిద్ధా సిద్ధసంమతా,
శశంస శబరీ వృద్ధా రామాయ ప్రత్యవస్థితా. 10

ప్ర. అ. రామేణ = రామునిచేత, పృష్టా=అడగబడిన, సిద్ధా=సిద్ధురాలు, సిద్ధసంమతా = సిద్ధులకు ఇష్టురాలు, తాపసీ = తపఃసంపన్నురాలు, వృద్ధా = వృద్ధురాలు అయిన, సా శబరీ = ఆ శబరి, ప్రత్యవస్థితా = ఎదురుగా నిలచినదై, రామాయ = రామునకు, శశంస = చెప్పెను.

తా. తపఃసంపన్నురాలు, తపఃసిద్ధి సంపాదించినది, తపఃసిద్ధిసంపన్నుల గౌరవమును పొందినది, వృద్ధురాలూ అయిన ఆ శబరి రాముని మాటలు విని, అతనికి ఎదురుగా నిలచి ఇట్లు పలికెను. 10

మూ. అద్య ప్రాప్తా తపఃసిద్ధిస్తవ సందర్శనాన్మయా,
అద్య మే సఫలం తప్తం గురవశ్చ సుపూజితాః. 11

ప్ర. అ. అద్య = ఇప్పుడు, తవ=నీయొక్క, సందర్శనాత్ = దర్శనము వలన, మయా = నాచేత, తపఃసిద్ధిః = తపఃసిద్ధి, ప్రాప్తా = పొందబడినది. అద్య = ఇపుడు, మే = నాయొక్క, తప్తమ్ = తపస్సు, సఫలమ్ = సఫలమైనది. గురవశ్చ = గురువులు కూడ, సుపూజితాః = బాగుగా పూజించబడినారు.

తా. ఈనాడు నీ దర్శనము లభించుటచేత నాకు తపఃసిద్ధి లభించినది. నేను చేసిన తపస్సు, నేను చేసిన గురుశుశ్రూషా కూడ సఫలము లైనవి. 11

మూ. అద్య మే సఫలం జన్మ స్వర్గశ్చైవ భవిష్యతి,
త్వయి దేవవరే రామ పూజితే పురుషర్షభ. 12

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా ! దేవవరే = దేవతాశ్రేష్ఠుడవైన, త్వయి = నీవు, పూజితే=పూజింపబడినవాడ వగుచుండగా, అద్య = నేడు, మే= నాయొక్క, జన్మ = జన్మము, సఫలమ్ = సఫలమైనది. స్వర్గశ్చైవ = స్వర్గము కూడ, భవిష్యతి = లభించగలదు.

తా. పురుషశ్రేష్ఠుడవైన రామా ! ఈనాడు దేవతాశ్రేష్ఠుడవైన నిన్ను పూజించిన పిదప నా జన్మ సఫలము కానున్నది. నాకు స్వర్గము లభించగలదు.

మూ. చక్షుషా తవ సౌమ్యేన పూతాస్మి రఘునన్దన,
గమిష్యామ్యక్షయాన్ లోకాంస్త్వత్ప్రసాదాదరిందమ. 13

ప్ర. అ. రఘునన్దన=రామా ! తవ=నీయొక్క, సౌమ్యేన=సౌమ్యమైన, చక్షుషా=నేత్రముచేత, పూతా=పవిత్రింపచేయబడినదానను, అస్మి=అయితిని. అరిందమ = శత్రుసంహారకుడా! త్వత్ప్రసాదాత్ = నీ అనుగ్రహమువలన, అక్షయాన్ = అక్షయములైన, లోకాన్ = లోకములను గూర్చి, గమిష్యామి = వెళ్ళగలను.

తా. రామా ! సౌమ్యమైన నీ దృష్టి నాపై ప్రసరించుటచేత పవిత్రురాలను అయినాను. శత్రుసంహారకా! నీ అనుగ్రహమువలన నేను అక్షయములైన ఉత్తమ లోకములకు వెళ్ళగలను.

వి. పై మూడు శ్లోకాలు ప్రాచ్యప్రతిలో లేవు. 13

మూ. చిత్రకూటం త్వయి ప్రాప్తే విమానై రతులప్రభైః,
ఇతస్తే దివమారూఢా యానహం పర్యచారిషమ్. 14

ప్ర. అ. అహమ్ = నేను, యాన్ = ఎవరిని, పర్యచారిషమ్ = సేవించితినో, తే = ఆ మహర్షులు, త్వయి = నీవు, చిత్రకూటమ్ = చిత్రకూటపర్వతమును, ప్రాప్తే = పొందినవాడవగుచుండగా, అతులప్రభైః = సాటి లేని కాంతి గల, విమానైః = విమానముల చేత, ఇతః = ఇక్కడినుండి, దివమ్ = స్వర్గమును, ఆరూఢాః = ఎక్కినారు.

తా. నేను పరిచర్యలు చేసిన మును లందరూ, నీవు చిత్రకూటపర్వతము చేరినప్పుడే, ఈ ప్రదేశమును విడచి, సాటి లేని కాంతి గల విమానములు ఎక్కి స్వర్గమునకు వెళ్ళిపోయినారు. 14

మూ. తైశ్చాహముక్తా ధర్మజ్ఞైర్మహాభాగై ర్మహర్షిభిః,
ఆగమిష్యతి తే రామః సుపుణ్యమిమమాశ్రమమ్, 15
స తే ప్రతిగ్రహీతవ్యః సౌమిత్రిసహితోఽతిథిః,
తం చ దృష్ట్వా వరాన్ లోకా నక్షయాంస్త్వం గమిష్యసి.

ప్ర. అ. ధర్మజ్ఞైః = ధర్మమును ఎరిగిన, మహాభాగైః = పూజ్యులైన, తైః మహర్షిభిః = ఆ మహర్షులచేత, అహమ్ = నేను, ఉక్తా = చెప్పబడితిని. రామః = రాముడు, తే = నీయొక్క, సుపుణ్యమ్ = చాల పుణ్యమైన, ఇమమ్ ఆశ్రమమ్ = ఈ ఆశ్రమమును గూర్చి, ఆగమిష్యతి = రాగలడు. సౌమిత్రిసహితః = లక్ష్మణునితో కూడిన, సః = అతడు, తే = నీకు, అతిథిః = అతిథిగా. ప్రతిగ్రహీతవ్యః = గ్రహింపదగినవాడు. తమ్ = ఆ రాముణ్ణి, దృష్ట్వా = చూచి, త్వమ్ = నీవు, వరాన్ = శ్రేష్ఠములైన, అక్షయాన్ = నాశములేని, లోకాన్ = లోకములను గూర్చి, గమిష్యసి = వెళ్ళగలవు.

తా. ధర్మవేత్తలు, చాల పూజనీయులు అయిన ఆ మహర్షులు నాతో ఇట్లు చెప్పిరి. ''పవిత్రమైన నీ ఆశ్రమమునకు రాముడు రాగలడు. లక్ష్మణసమేతుడైన ఆ రామునకు నీవు తగు విధముగ అతిథిసత్కారము చేయవలెను. అతని దర్శనము చేసిన పిమ్మట నీవు అక్షయములైన ఉత్తమలోకములకు వెళ్ళగలవు. 15,16

మూ. మయా తు వివిధం వన్యం సంచితం పురుషర్షభ,
తవార్థే పురుషవ్యాఘ్ర పమ్పాయాస్తీరసంభవమ్. 17

(పురుషర్షభ' అనుదానికి బదులు "రఘునన్దన" అను ప్రాచ్యపాఠము బాగున్నది.)

ప్ర. అ. పురుషవ్యాఘ్ర = పురుషశ్రేష్ఠుడవైన, రఘునన్దన = రామా ! మయా = నాచేత, తవ అర్థే = నీ నిమిత్తమై, పమ్పాయాః = పంపయొక్క, తీర సంభవమ్ = తీరమునందు పుట్టిన, వివిధమ్ = అనేకవిధములైన, వన్యమ్ = వనము నందు లభించు పదార్థజాతము, సంచితమ్ = ప్రోగుచేయబడినది.

తా. పురుషశ్రేష్ఠుడవైన రామా ! నేను నీకొరకై పంపాతీరమునందు పుట్టిన, అనేకవిధములైన వనమునందు లభించే పదార్థసముదాయము ప్రోగుచేసి ఉన్నాను. 17

మూ. ఏవముక్తస్స ధర్మాత్మా శబర్యా శబరీమిదమ్,
రాఘవః ప్రాహ విజ్ఞానే తాం నిత్యమబహిష్కృతామ్. 18

ప్ర. అ. శబర్యా = శబరిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, ధర్మాత్మా = ధర్మాత్ముడైన, సః రాఘవః = ఆ రాముడు, నిత్యమ్ = ఎల్లప్పుడు, విజ్ఞానే = జ్ఞానమునందు, అబహిష్కృతామ్ = బహిష్కరింపబడని (దూరముగా ఉండని), తాం శబరీమ్ = ఆ శబరిని గూర్చి, ప్రాహ = పలికెను.

తా. ధర్మాత్ముడైన రాముడు శబరి మాటలు విని, నిత్యము జ్ఞానమార్గము నందు ఉండు ఆ శబరితో ఇట్లు పలికెను. 18

మూ. దనోః సకాశాత్తత్త్వేన ప్రభావం తే మహాత్మనః,
శ్రుతం ప్రత్యక్షమిచ్ఛామి సంద్రష్టుం యది మన్యసే. 19

ప్ర. అ. మహాత్మనః = మహాత్ముడైన, దనోః సకాశాత్ = దనువు సమీపమునుండి, శ్రుతమ్ = వినబడిన, తే = నీయొక్క, ప్రభావమ్ = ప్రభావమును, మన్యసే యది = నీవు అంగీకరించినట్లయితే, ప్రత్యక్షమ్ = ప్రత్యక్షముగా, సంద్రష్టుమ్ = చూచుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. మహాత్ములైన దనువునుండి నీ ప్రభావమును గూర్చి విని ఉన్నాను. నీవు అంగీకరించినట్లయితే దానిని ప్రత్యక్షముగా చూడదలచుచున్నాను. 19

మూ. ఏతత్తు వచనం శ్రుత్వా రామవక్త్రాద్వినిఃసృతమ్,
శబరీ దర్శయామాస తావుభౌ తద్వనం మహత్. 20

ప్ర. అ. శబరీ = శబరి, రామవక్త్రాత్ = రాముని ముఖమునుండి, వినిః సృతమ్ = బయల్వెడలిన, ఏతత్ = ఈ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = = విని; తౌ ఉభౌ = వారిద్దరిని(కి), మహత్ = గొప్పదైన, తత్ = ఆ, వనమ్ = వనమును, దర్శయామాస = చూపెను.

తా. శబరి రాముని నోటినుండి ఈ మాట వెలువడగానే వారిద్దరికీ, గొప్పదైన ఆ వనమును చూపించెను. 20

మూ. పశ్య మేఘఘనప్రఖ్యం మృగపక్షిసమాకులమ్,
మతఙ్గవనమిత్యేవ విశ్రుతం రఘునన్దన. 21

ప్ర. అ. రఘునన్దన = రామా ! మేఘఘనప్రఖ్యమ్ = దట్టమైన మేఘముతో సమానము, మృగపక్షిసమాకులమ్ = మృగములతోను పక్షులతోను వ్యాకులము, మతఙ్గవనమిత్యేవ = మతంగవన మని, విశ్రుతమ్ = ప్రసిద్ధము అయిన వనమును, పశ్య = చూడుము.

తా. రామా ! మతంగవన మను ప్రసిద్ధి గల ఈ వనమును చూడుము. ఇది దట్టమైన మేఘము వలె ఉన్నది. మృగములతోను, పక్షులతోను వ్యాప్తమై యున్నది. 21

మూ. ఇహ తే భావితాత్మానో గురవో మే మహాద్యుతే,
జుహవాఞ్చక్రిరే తీర్థం మన్త్రవన్మన్త్రపూజితమ్. 22

ప్ర. అ. మహాద్యుతే = గొప్ప కాంతి గలవాడా ! భావితాత్మానః = పవిత్రముగా చేసికొనబడిన మనస్సులు గల, తే = ఆ, మే గురవః = నా గురువులు, ఇహ = ఇక్కడ, మన్త్రవత్ = మంత్రములు గలది, మన్త్రపూజితమ్ = మంత్రములచేత పూజింపబడినది అయిన, తీర్థమ్ = గంగాదితీర్థమును, జుహవాఞ్చక్రిరే

= ఆహ్వానించిరి. లేదా-తీర్థమ్ = యజ్ఞమును, జుహవాఞ్చక్రిరే = హోమము చేసిరి (లేదా చేసిరి).

తా. గొప్ప కాంతి గల రామా! పవిత్రమైన మనస్సులు గల నా గురువులు, ఇక్కడ, మంత్రములతో కూడి, మంత్రములచేత పూజింపబడిన గంగాది తీర్థములను ఆహ్వానించిరి. లేదా యజ్ఞము చేసిరి.

వి "జుహవాఞ్చక్రురనలం మన్త్రివన్మన్త్రికోవిదాః"అను ప్రాచ్యపాఠమునకు అర్థము అక్లిష్టముగా ఉన్నది. "మన్త్రికోవిదాః = మంత్రములందు ప్రావీణ్యము గల నా గురువులు, మన్త్రివత్=మంత్రపూర్వకముగా, అనలమ్=అగ్నిని, జుహవాఞ్చక్రుః = హోమము చేసిరి"అని అర్థము. 22

మూ. ఇయం ప్రత్యక్స్థలీ వేదిర్యత్ర తే మే సుసత్కృతాః,
పుష్పోపహారం కుర్వన్తి శ్రమాదుద్వేపిభిః కరైః. 23

ప్ర. అ. మే=నాయొక్క(చేత), సుసత్కృతాః=బాగుగా సేవించబడిన, తే = ఆ మునీశ్వరులు, యత్ర = ఎక్కడ, శ్రమాత్ = శ్రమవలన, ఉద్వేపిభిః = వణకుచున్న, కరైః=హస్తములతో, పుష్పోపహారమ్=పుష్పసమర్పణమును, కుర్వన్తి=చేయుచుండిరో, అట్టి, ప్రత్యక్స్థలీ వేదిః=పశ్చిమమునందు ఎత్తైన వేది, ఇయమ్ = ఇదే.

తా. నేను శుశ్రూష చేసిన ఆ మునీశ్వరులు పశ్చిమాన ఎత్తుగా ఉన్న ఈ వేదిమీదనే దౌర్బల్యముచేత వణకుచున్న చేతులతో పువ్వులను సమర్పించుచుండేవారు. 23

మూ. తేషాం తపఃప్రభావేణ పశ్యాద్యాపి రఘూద్వహ,
ద్యోతయన్తి దిశః సర్వాః శ్రియా వేద్యోఽతులప్రభాః. 24

ప్ర. అ. రఘూద్వహ = రామా! తేషామ్=వారియొక్క, తపఃప్రభావేణ = తపస్సుయొక్క ప్రభావముచేత, అతులప్రభాః=సాటి లేని కాంతి గల, వేద్యః = వేదులు, శ్రియా = శోభచేత, అద్యాపి = ఇప్పుడు కూడ, సర్వాః = సమస్తమైన, దిశః = దిక్కులను, ద్యోతయన్తి = ప్రకాశింపచేయుచున్నవి, పశ్య = చూడుము.

తా. రామా! చూడుము! ఆ మునీశ్వరుల తపఃప్రభావముచేత, సాటి లేని కాంతి గల వేదులు తమ శోభతో, అన్ని దిక్కులను ఎట్లు ప్రకాశింపచేయుచున్నవో చూడుము. 24

మూ. అశక్నువద్భిస్తైర్గన్తుముపవాసశ్రమాలసైః,
చిన్తితేఽభ్యాగతాన్ పశ్య సహితాన్ సప్త సాగరాన్. 25

ప్ర. అ. ఉపవాసశ్రమాలసైః = ఉపవాసములవలన కలిగిన శ్రమచేత మందులూ, గన్తుమ్ = వెళ్ళుటకు(నడచుటకు), అశక్నువద్భిః = అసమర్థులూ అయిన, తైః = ఆమునీశ్వరులచేత, చిన్తితే = ఆలోచించగానే, అభ్యాగతాన్ = వచ్చిన, సహితాన్ = కలిసిఉన్న, సప్త సాగరాన్ = ఏడు సాగరములను, పశ్య = చూడుము.

తా. ఉపవాసములచేత కలిగిన దౌర్బల్యముచేత అలసులై నడచుటకు కూడ శక్తి లేని ఆ మునీశ్వరులు స్మరించగానే ఏడు సముద్రములు కలిసి వచ్చినవి. వాటిని చూడుము. 25

మూ. కృతాభిషేకైస్తైర్న్యస్తా వల్కలాః పాదపేష్విహ,
అద్యాపి నావశుష్యన్తి ప్రదేశే రఘునన్దన. 26

ప్ర. అ. రఘునన్దన = రామా! ఇహ = ఇక్కడ, కృతాభిషేకైః = చేయబడిన స్నానముగల, తైః = ఆ మునీంద్రులచేత, ప్రదేశే = ఈ ప్రదేశమునందు, పాదపేషు = వృక్షములమీద, న్యస్తాః = ఉంచబడిన, వల్కలాః = నారచీరలు, అద్యాపి = ఇప్పటికి కూడ, నావశుష్యన్తి = ఎండుటలేదు.

తా. రామా! ఇక్కడ స్నానములు చేసిన ఆ ఋషీశ్వరులు ఈ ప్రదేశమునందు చెట్లపై ఆర వేసిన నారచీరలు ఇప్పటికి కూడ ఎండలేదు. 26

మూ. దేవకార్యాణి కుర్వద్భిర్యానీమాని కృతాని వై,
పుష్పైః కువలయైః సార్ధం మ్లానత్వం నోపయాన్తి వై. 27

ప్ర. అ. దేవకార్యాణి = దేవకార్యములను, కుర్వద్భిః = చేయుచున్న ఆ మునీశ్వరులచేత, కువలయైఃసారమ్ = నల్లకలువలతో కూడ, పుష్పైః = పుష్పము

లతో, యాని = ఏ మాలికలు, కృతాని = చేయబడినవో, ఇమాని = ఇవి, మ్లానత్వమ్ = వాడిపోవుటను, నోపయాన్తి వై = పొందుటలేదు.

తా. దేవతాపూజాదికార్యములు చేయు ఆ మునీశ్వరులు నల్లకలువలతోను, పుష్పములతోను ఏ మాలికలు నిర్మించినారో అవి ఇంకను వాడలేదు. 27

మూ. కృత్స్నం వనమిదం దృష్టం శ్రోతవ్యం చ శ్రుతం త్వయా,
తదిచ్ఛామ్యభ్యనుజ్ఞాతా త్యక్తుమేతత్కళేబరమ్. 28

ప్ర. అ. త్వయా = నీచేత, కృత్స్నమ్ = సమస్తమైన, ఇదం వనమ్ = ఈ వనము, దృష్టమ్ = చూడబడినది. శ్రోతవ్యమ్ = వినదగినది, శ్రుతం చ = వినబడినది కూడ, తత్ = ఆ కారణమువలన, అభ్యనుజ్ఞాతా = (నీచేత) అనుమతింపబడినదాననై, ఏతత్ = ఈ, కళేబరమ్ = శరీరమును, త్యక్తుమ్ = విడచుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. ఈ వనము నంతా చూచినావు. వినవలసిన విషయములు వినినావు. అందుచేత ఇక నేను నీ అనుజ్ఞ పొంది ఈ కళేబరమును విడువ వలె నని కోరుచున్నాను. 28

మూ. తేషామిచ్ఛామ్యహం గన్తుం సమీపం భావితాత్మనామ్,
మునీనామాశ్రమో యేషామహం చ పరిచారిణీ. 29

ప్ర. అ. ఆశ్రమః = ఈ ఆశ్రమము, యేషాం మునీనామ్ = ఏ మునీశ్వరులదో, అహం చ = నేను, పరిచారిణీ = ఎవరి పరిచారికనో, భావితాత్మనామ్ = పవిత్రముచేయబడిన మనస్సు గల, తేషామ్ = ఆ మునీశ్వరులయొక్క, సమీపమ్ = సమీపమును గూర్చి, గన్తుమ్ = వెళ్లుటకు, ఇచ్ఛామి = ఇచ్ఛయించుచున్నాను.

తా. ఈ ఆశ్రమములో నివసించిన ఏ మునీశ్వరులకు నేను శుశ్రూష చేసే దాననో, పవిత్రమైన మనస్సు గల ఆ మునీశ్వరుల సమీపమునకు వెళ్ళవలె నని కోరుచున్నాను. 29

మూ. ధర్మిష్ఠం తు వచః శ్రుత్వా రాఘవః సహలక్ష్మణః,
ప్రహర్షమతులం లేభే ఆశ్చర్యమితి తత్త్వతః. 30

ప్ర. అ. సహలక్ష్మణః = లక్ష్మణునితో కూడిన, రాఘవః = రాముడు, ధర్మిష్ఠమ్ = ధర్మయుక్తమైన, వచః=వచనమును, శ్రుత్వా = విని, తత్త్వతః = యథార్థముగా, ఆశ్చర్యమ్ = ఆశ్చర్యకరమైనది, ఇతి=అని పలుకుచు, అతులమ్ = సాటి లేని, ప్రహర్షమ్ = సంతోషమును, లేభే = పొందెను.

తా. ధర్మయుక్తమైన ఆమె మాటలు విని రామలక్ష్మణులు, "నిజముగా ఈ ఆశ్రమము ఆశ్చర్యజనకముగా ఉన్నది"అని పలుకుచు సంతోషించిరి. 30

మూ. తామువాచ తతో రామః శ్రమణీం సంశితవ్రతామ్,
అర్చితోఽహం త్వయా భక్త్యా గచ్ఛ కామం యథాసుఖమ్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రామః = రాముడు, సంశితవ్రతామ్ = తీవ్రమైన వ్రతము గల, శ్రమణీమ్=ఆ సంన్యాసిని యైన శబరిని గూర్చి, ఉవాచ = పలికెను. అహమ్ = నేను, త్వయా = నీచేత, భక్త్యా = భక్తితో, అర్చితః = పూజింపబడినాను. కామమ్ = యథేచ్ఛగా, యథాసుఖమ్ = సుఖముగా, గచ్ఛ= వెళ్లుము."

తా. కఠినమైన వ్రతములు గల ఆ శబరితో రాముడు ఇట్లు పలికెను. "నీవు నన్ను భక్తిపూర్వకముగా పూజించితివి. సుఖముగా, నీ ఇచ్ఛానుసారము వెళ్ళుము.

వి. ఈ శ్లోకంలోని ఉత్తరార్ధానికి బదులు ప్రాచ్యపాఠంలో-"అనుజానామి గచ్ఛేతి ప్రహృష్టవదనోఽబ్రవీత్"అని ఉన్నది. 31

మూ. ఇత్యుక్తా జటిలా వృద్ధా చీరకృష్ణాజినామ్బరా,
తస్మిన్ ముహూర్తే శబరీ దేహం జీర్ణం జిహాసతీ, 32

అనుజ్ఞాతా తు రామేణ హుత్వాత్మానం హుతాశనే,
జ్వలత్పావకసంకాశా స్వర్గమేవ జగామ సా. 33

ప్ర అ. ఇతి = ఇట్లు, ఉక్తా = పలకబడిన, జటిలా=జటాధారిణి, వృద్ధా = వృద్ధురాలు, చీరకృష్ణాజినామ్బరా = నారచీరను కృష్ణాజినమును వస్త్రముగా ధరించిన, శబరీ = శబరి, జీర్ణమ్ = జీర్ణమైన, దేహమ్ = దేహమును, తస్మిన్

ముహూర్తే = ఆ ముహూర్తమునందు, జిహాసతీ = విడవదలంచుచున్నదై, రామేణ = రామునిచేత, అనుజ్ఞాతా = అనుమతింపబడినదై, ఆత్మానమ్ = తనను, హుతాశనే = అగ్నియందు, హుత్వా = హోమముచేసి, జ్వలత్పావకసంకాశా = ప్రజ్వలించుచున్న అగ్నితో సమానురాలై, స్వర్గమేవ = స్వర్గమును గూర్చి, జగామ = వెళ్ళెను.

తా. జటలను, నారలను, కృష్ణాజినమును ధరించిన, వృద్ధురాలైన ఆ శబరి రాముని మాటలు విని, ఆ ముహూర్తమునందే దేహమును విడువవలె నని నిశ్చయించుకొని, రాముని అనుజ్ఞ పొంది, తన శరీరమును అగ్నిలో హోమము చేసి, ప్రజ్వలించుచున్న అగ్నితో సమానమైన శరీరముతో స్వర్గమునకు వెళ్ళెను. 32,33

మూ. దివ్యాభరణసంయుక్తా దివ్యమాల్యానులేపనా,
దివ్యామ్బరధరా తత్ర బభూవ ప్రియదర్శనా, 34
విరాజయన్తీ తం దేశం విద్యుత్సౌదామినీ యథా.

ప్ర. అ. దివ్యాభరణసంయుక్తా = దివ్యములైన అలంకారములతో కూడినదై, దివ్యమాల్యానులేపనా = దివ్యమైన పుష్పమాలికలు, చందనము మొదలైన అనులేపనము కలదై, దివ్యామ్బరధరా = దివ్యములైన వస్త్రములను ధరించినదై, విద్యుత్ = మెరయుచున్న, సౌదామనీ యథా = మెరుపువలె, తం దేశమ్ = ఆ దేశమును, విరాజయన్తీ = ప్రకాశింపచేయుచున్నదై, తత్ర = అక్కడ, ప్రియదర్శనా = ప్రియమైన దర్శనము కలదిగా, బభూవ = ఆయెను.

తా. పిదప ఆమె దివ్యములైన అలంకారములు, దివ్యములైన పుష్పమాలలు, అనులేపనము, దివ్యములైన వస్త్రములు ధరించి, మెరయుచున్న మెరుపు వలె ఆ ప్రదేశము నంతా ప్రకాశింపచేయుచు, చూచుటకు ఆనందమును కలిగించునదిగా ఆయెను. 34

మూ. యత్ర తే సుకృతాత్మానో విహరన్తి మహర్షయః, 35
తత్పుణ్యం శబరీ స్థానం జగామాత్మసమాధినా.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
చతుఃసప్తతితమః సర్గః.

ప్ర. అ. శబరీ = శబరి, ఆత్మసమాధినా = తనయొక్క తపస్సుచేత, సుకృతాత్మానః = పుణ్యస్వరూపులైన, తే మహర్షయః = ఆ మహర్షులు, యత్ర = ఎక్కడ, విహరన్తి = విహరించుచున్నారో, తత్ = ఆ, పుణ్యమ్ = పుణ్యమైన, స్థానమ్ = స్థానమును, జగామ = పొందెను.

తా. శబరి తన తపోబలముచేత, పుణ్యాత్ములైన ఆ మహర్షులు ఏ స్థానమునందు విహరించుచున్నారో ఆ పుణ్యస్థానమును పొందెను. 35

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో డెబ్బదినాల్గవసర్గ సమాప్తము.

అథ పఞ్చసప్తతితమః సర్గః

[రామలక్ష్మణులు మాటలాడుకొనుచు పంపాతీరము చేరుట].

మూ. దివం తు తస్యాం యాతాయాం శబర్యాం స్వేన తేజసా,
లక్ష్మణేన సహ భ్రాత్రా చిన్తయామాస రాఘవః. 1

ప్ర. అ. తస్యామ్=ఆ, శబర్యామ్=శబరి, స్వేన తేజసా=తన తేజస్సు చేత, దివమ్=స్వర్గమును గూర్చి, యాతాయామ్=వెళ్ళిన దగుచుండగా, రాఘవః =రాముడు, భ్రాత్రా=సోదరుడైన, లక్ష్మణేన సహ=లక్ష్మణునితో కూడ, చిన్తయామాస=ఆలోచించెను.

తా. ఆ శబరి తన తపోబలముచేత స్వర్గమునకు వెళ్ళిన పిమ్మట రాముడు సోదరుడైన లక్ష్మణునితో ఆలోచించెను. 1

మూ. స చిన్తయిత్వా ధర్మాత్మా ప్రభావం తం మహాత్మనామ్,
హితకారిణమేకాగ్రం లక్ష్మణం రాఘవోఽబ్రవీత్. 2

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, సః రాఘవః = ఆ రాముడు, మహాత్మనామ్ = మహాత్ములైన ఆ మునీశ్వరులయొక్క, ప్రభావమ్ = ప్రభావమును, చిన్తయిత్వా = ఆలోచించి, హితకారిణమ్ = హితమును చేయువాడు, ఏకాగ్రమ్ = ఏకాగ్రచిత్తము కలవాడు అయిన, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. ధర్మాత్ముడైన ఆ రాముడు మహాత్ములైన ఆ మునీశ్వరుల ప్రభావమును గూర్చి ఆలోచించి, హితమును చేయువాడు, ఏకాగ్రచిత్తము కలవాడు అయిన లక్ష్మణునితో ఇట్లు పలికెను. 2

మూ. దృష్టోఽయమాశ్రమః సౌమ్య బహ్వాశ్చర్యః కృతాత్మనామ్
విశ్వస్తమృగశార్దూలో నానావిహగసేవితః. 3

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా! కృతాత్మనామ్ = నిగ్రహించుకోవబడిన మనస్సు గల మునీశ్వరులయొక్క, బహ్వాశ్చర్యః = చాల ఆశ్చర్యకరము, విశ్వస్త మృగశార్దూలః = విశ్వాసము గల మృగములు, పెద్దపులులు కలది, నానావిహగ సేవితః = అనేకవిధములైన పక్షులచేత సేవించబడినది అయిన, అయమ్ ఆశ్రమః = ఈ ఆశ్రమము, దృష్టః = చూడబడినది.

తా. లక్ష్మణా! చాల ఆశ్చర్యకరము, నమ్మిక గల (భయములేని) లేళ్ళు పెద్దపులులూ కలది, అనేకవిధములైన పక్షులచేత సేవింపబడినది అయిన, పవిత్రములైన హృదయములు గల మహర్షుల ఆశ్రమమును చూచినాము. 3

మూ. సప్తానాం చ సముద్రాణామేషు తీర్థేషు లక్ష్మణ,
ఉపస్పృష్టం చ విధివత్పితరశ్చాపి తర్పితాః. 4

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా!, సప్తానామ్ = ఏడు, సముద్రాణామ్ = సముద్రములయొక్క, ఏషు తీర్థేషు = ఈ తీర్థములయందు, ఉపస్పృష్టమ్ = స్నానము చేయబడినది. పితరశ్చాపి = పితృదేవతలు కూడ, విధివత్ = యథా శాస్త్రముగ, తర్పితాః = తృప్తిపొందింపబడినారు.

తా. లక్ష్మణా! ఈ ఏడు సముద్రముల తీర్థములలో స్నానము చేసినాము. యథాశాస్త్రముగా పితృతర్పణములు కూడ చేసినాము. 4

మూ. ప్రణష్టమశుభం తత్తత్కల్యాణం సముపస్థితమ్,
తేన తత్త్వేన హృష్టం మే మనో లక్ష్మణ సంప్రతి. 5
హృదయే హి నరవ్యాఘ్ర శుభమావిర్భవిష్యతి.

ప్ర. అ. అశుభమ్ = అశుభము, ప్రణష్టమ్ = నశించినది. తత్తత్ = ఆ యా, కల్యాణమ్ = కల్యాణము, సముపస్థితమ్ = ప్రాప్తించినది. లక్ష్మణ = లక్ష్మణా! తేన = ఆ, తత్త్వేన = తత్త్వముచేత, సంప్రతి = ఇప్పుడు, మనః = మనస్సు, హృష్టమ్ = సంతోషించినది. నరవ్యాఘ్ర = నరులలో శ్రేష్ఠుడా! హృదయే = హృదయమునందు, శుభమ్ = శుభము, ఆవిర్భవిష్యతి హి = ఆవిర్భవించును కదా.

తా. లక్ష్మణా! అశుభము నశించినది. ఆ యా కల్యాణములు ప్రాప్తించి

నవి. ఈ యథార్థవిషయముచేత నా మనస్సుకు సంతోషము కలిగినది. శుభము రానున్నపుడు హృదయమునకు తెలియుచుండును కదా ? 5

మూ. తదాగచ్ఛ గమిష్యామి పమ్పాం తాం ప్రియదర్శనామ్,
ఋష్యమూకో గిరిర్యత్ర నాతిదూరే ప్రకాశతే,
యస్మిన్వసతి ధర్మాత్మా సుగ్రీవోంఽశుమతః సుతః. 7
నిత్యం వాలిభయాత్త్రస్తశ్చతుర్భిః సహ వానరైః.

ప్ర. అ. తత్ = ఆ కారణమువలన, ధర్మాత్మా = ధర్మాత్ముడైన, అంశుమతః సుతః=సూర్యుని కుమారుడైన, సుగ్రీవః=సుగ్రీవుడు, నిత్యమ్=నిత్యము, వాలిభయాత్ = వాలినుండి భయమువలన, చతుర్భిః=నలుగురు, వానరైః సహ =వానరులతో కూడ, యస్మిన్ = దేనియందు, వసతి = వసించుచున్నాడో అట్టి, ఋష్యమూకః = ఋష్యమూకపర్వతము, యత్ర = ఎక్కడ, నాతిదూరే=సమీపమునందు, ప్రకాశతే = ప్రకాశించుచున్నదో, తామ్ = అట్టి, ప్రియదర్శనామ్= ప్రియమైన దర్శనము గల, పమ్పామ్ = పంపాసరస్సును గూర్చి, గమిష్యామి = వెళ్ళెదను. ఆగచ్ఛ = రమ్ము.

తా. అందువలన, సూర్యకుమారుడు, ధర్మాత్ముడూ అయిన సుగ్రీవుడు నిత్యమూ వాలికి భయపడుచు, నలుగురు వానరులతో కలిసి నివసించుచున్న ఋష్యమూకపర్వతము ఏ పంపాసరస్సుకు దగ్గరగా ప్రకాశించుచున్నదో, అట్టి, చూచుటకు ఆనందము కలిగించు పంపాసరస్సుకు వెళ్ళుదము ; రమ్ము. 6,7

మూ. అభిత్వరే చ తం ద్రష్టుం సుగ్రీవం వానరర్షభమ్, 8
తదధీనం హి మే సౌమ్య సీతాయాః పరిమార్గణమ్.

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా ! వానరర్షభమ్ = వానరశ్రేష్ఠుడైన, తం సుగ్రీవమ్ = ఆ సుగ్రీవుణ్ణి, ద్రష్టుమ్ = చూచుటకు, అభిత్వరే చ = తొందరపడుచున్నాను. సీతాయాః = సీతయొక్క, పరిమార్గణమ్ = అన్వేషణము, తదధీనమ్ = అతనిపై ఆధీనమైనది కదా ?

తా. సౌమ్యుడా ! వానరశ్రేష్ఠుడైన సుగ్రీవుని చూడవలెనని నాకు తొంద

రగా ఉన్నది ; ఎందుచేత అనగా సీతాన్వేషణము అతనిపైననే ఆధారపడి యున్నది. 8

మూ. ఏవం బ్రువాణం తం ధీరం రామం సౌమిత్రిరబ్రవీత్, 9
గచ్ఛావ స్త్వరితం తత్ర మమాపి త్వరతే మనః.

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, బ్రువాణమ్ = పలుకుచున్న, ధీరమ్ = ధీరుడైన, తం రామమ్ = ఆ రాముడ్ని గూర్చి, సౌమిత్రిః = లక్ష్మణుడు, అబ్రవీత్ = పలికెను. మమ = నాయొక్క, మనః అపి = మనస్సు కూడ, త్వరతే = తొందరపడుచున్నది. త్వరితమ్ = తొందరగా, తత్ర = అక్కడికి, గచ్ఛావః = వెళ్ళుదము.

తా. ఇట్లు పలుకుచున్న ధీరుడైన రామునితో లక్ష్మణుడు ఇట్లనెను. "నా మనస్సు కూడ తొందరపడుచున్నది. శీఘ్రముగా అక్కడికి వెళ్లెదము".

మూ. ఆశ్రమాత్తు తత స్తస్మాన్నిష్క్రమ్య స విశాం పతిః. 10
ఆజగామ తతః పమ్పాం లక్ష్మణేన సహ ప్రభుః.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, విశాం పతిః = మానవులకు అధిపతి యైన, సః = ఆ, ప్రభుః = సర్వలోకప్రభువైన రాముడు, తస్మాత్ = ఆ, ఆశ్రమాత్ = ఆశ్రమమునుండి, నిష్క్రమ్య = బయలుదేరి, తతః = అక్కడినుండి, లక్ష్మణేన సహ = లక్ష్మణునితో కూడ, పమ్పామ్ = పంపాసరస్సును, ఆజగామ = పొందెను.

తా. పిమ్మట మానవుల అధిపతి, ప్రభువు అయిన రాముడు, ఆ ఆశ్రమము నుండి బయల్వెడలి, లక్ష్మణునితో కలిసి అక్కడినుండి పంపను చేరెను. 10

మూ. స దదర్శ తతః పుణ్యాముదారజనసేవితామ్, 11
నానాద్రుమలతాకీర్ణాం పమ్పాం పానీయవాహినీమ్,
పద్మైః సౌగన్ధికై స్తామ్రాం శుక్లాం కుముదమణ్డలైః,
నీలాం కువలయోద్ఘాతైర్బహువర్ణాం కుథామివ.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, సః = ఆ రాముడు, పుణ్యామ్ = పవిత్రము, ఉదారజనసేవితామ్ = ఉత్తమపురుషులచేత సేవింపబడినది, నానాద్రుమ

లతాకీర్ణామ్ = అనేకవిధములైన వృక్షములచేత, లతలచేత వ్యాప్తము, పానీయ వాహినీమ్ = జలముతో నిండినది, సౌగన్ధికైః = మంచి సువాసన గల, పద్మైః = ఎఱ్ఱని పద్మములచేత, తామ్రామ్ = ఎఱ్ఱగా ఉన్నది. కుముదమణ్డలైః = తెల్ల కలువల సముదాయములచేత, శుక్లామ్ = తెల్లనిది, కువలయోద్ఘాటైః = నల్ల కలువల సముదాయములచేత, నీలామ్ = నల్లగా ఉన్నది, బహువర్ణామ్ = అనేకమైన వర్ణములు గల, కుథామివ = కంబళము వలె ఉన్న, పమ్పామ్ = పంపను, దదర్శ = చూచెను.

తా. పిమ్మట రాముడు పవిత్రమైన ఆ పంపను చూచెను. దానిని ఉత్తములైన నరులు సేవించుచుండిరి. దాని తీరములు అనేకవిధములైన వృక్షముల చేత, లతలచేత వ్యాప్తములై ఉండెను. అది త్రాగుటకు తగిన మంచి నీటితో నిండి ఉండెను. ఆ సరస్సులో మంచి సువాసన గల ఎఱ్ఱని పద్మములు, తెల్లని కలువలు, నల్లని కలువలు ఉండుటచేత అది వివిధవర్ణములతో విచిత్రముగా ఉన్న కంబళి వలె ఉండెను. 11,12

మూ. స తామాసాద్య వై రామో దూరాదుదకవాహినీమ్, 13
మతఙ్గసరసం నామ హ్రదం సమవగాహత.

ప్ర. అ. సః రామః = ఆ రాముడు, ఉదకవాహినీమ్ = ఉదకమును వహించుచున్న, తామ్ = ఆ పంపను, దూరాత్ = దూరమునుండి, ఆసాద్య = పొంది, (చూచి), మతఙ్గసరసం నామ = మతంగసరస మను పేరు గల, హ్రదమ్ = చెరువును, సమవగాహత = ప్రవేశించెను.

తా. రాముడు ఉదకముతో నిండిన ఆ పంపాసరస్సును దూరమునుండియే చూచి, దాని సమీపమునందున్న మతంగసరస మను పేరు గల చెరువులో దిగి స్నానము చేసెను. 13

మూ. అరవిన్దోత్పలవతీం పద్మసౌగన్ధికాయుతామ్, 14
పుష్పితామ్రవణోపేతాం బర్హిణోద్ఘుష్టనాదితామ్,
తిలకైర్బీజపూరైశ్చ ధవైః శుక్లద్రుమైస్తథా, 15
పుష్పితైః కరవీరైశ్చ పున్నాగైశ్చ సుపుష్పితైః,
మాలతీకున్దగుల్మైశ్చ భాణ్డీరైర్నిచులైస్తథా. 16

అశోకైః సప్తపర్ణైశ్చ కేతకై రతిముక్తకైః,
అన్యైశ్చ వివిధై ర్వృక్షైః ప్రమదామివ భూషితామ్, 17
సమీక్షమాణౌ పుష్పాఢ్యం సర్వతో విపులద్రుమమ్,
కోయష్టికైశ్చార్జునకైః శతపత్రైశ్చ కీరకైః, 18
ఏతైశ్చాన్యైశ్చ విహగైర్నాదితం తు వనం మహత్,
తతో జగ్మతురవ్యగ్రౌ రాఘవౌ సుసమాహితౌ, 19
తద్వనం చైవ సరసః పశ్యన్తౌ శకునైర్యుతమ్.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, రాఘవౌ = రామలక్ష్మణులు. అరవిన్దోత్పలవతీమ్ = ఎఱ్ఱని పద్మములు, కలవలు కలది, పద్మసౌగన్ధికాయుతామ్ = తెల్ల పద్మములతోను ఎఱ్ఱని కలవలతోను కూడినది, పుష్పితామ్రవణోపేతామ్ = పుష్పించిన మామిడితోటలతో కూడినది, బర్హిణోద్ఘుష్టనాదితామ్ = నెమళ్ళ అరపులచేత ధ్వనింపచేయబడినది, తిలకైః = బొట్టుగచెట్లతోను, బీజపూరైశ్చ = దానమ్మచెట్లతోను, ధవైః = చంద్రచెట్లతోను, తథా = మరియు, శుక్లద్రుమైః = ఏరుమద్దిచెట్లతోను, పుష్పితైః = పుష్పించిన, కరవీరైశ్చ = గన్నేరుచెట్లతోను, సుపుష్పితైః = బాగా పూసిన, పున్నాగైశ్చ = సురపొన్నచెట్లతోను, మాలతీకున్దగుల్మైశ్చ = జాజిపొదలతోను, మల్లిపొదలతోను, భాణ్డీరైః = మఱ్ఱిచెట్లతోను, తథా = మరియు, నిచులైః = తినాసపుచెట్లతోను, అశోకైః = అశోకవృక్షములతోను, సప్తపర్ణైః = ఏడాకుల అరటిచెట్లతోను, కేతకైః = మొగలిచెట్లతోను, అతిముక్తకైః = గురివిందచెట్లతోను, అన్యైః = ఇతరములైన, వివిధైః = అనేకవిధములైన, వృక్షైశ్చ = వృక్షములతోను, కూడినది, భూషితామ్ = అలంకరింపబడిన, ప్రమదామివ = స్త్రీవలె ఉన్న పంపాసరస్సును, సర్వతః = నలుమూలలా, సమీక్షమాణౌ = చూచుచు, పుష్పాఢ్యమ్ = పుష్పములతో నిండినది, విపులద్రుమమ్ = పెద్ద వృక్షములు కలది, కోయష్టికైశ్చ = కోయష్టికపక్షులచేతను, అర్జునకైః = నెమళ్ళచేతను, శతపత్రైః = బెగ్గురుపక్షులచేతను, కీరకైః = చిలుకలచేతను, ఏతైః = ఈ పక్షులచేతను, అన్యైః = ఇతరములైన, విహగైశ్చ = పక్షులచేతను, నాదితమ్ = ధ్వనింపచేయబడినదీ, మహత్ = గొప్పదీ అయిన, శకునైః = పక్షులతో, యుతమ్ = కూడిన, వనమ్ = వనమును, పశ్యన్తౌ = చూచుచున్నవారై, అవ్యగ్రౌ =

తొందరపాటు లేనివారై, సుసమాహితౌ = బాగుగా సావధానచిత్తులై, సరసః = సరస్సుయొక్క, తత్ = ఆ, వనమ్ = వనమును గూర్చి, జగ్మతుః = వెళ్ళిరి.

తా. ఆ రామలక్ష్మణులు సావధానచిత్తులై, తొందర లేనివారై ఆ వనములోనికి వెళ్ళిరి. మార్గమధ్యమునందు పంపాసరస్సును, దాని ప్రక్క నున్న వనమును చూచిరి. ఆ పంపాసరస్సునందు ఎఱ్ఱనిపద్మములు, కలవలు, తెల్లని పద్మములు, ఎఱ్ఱని కలవలు ఉండెను. దాని చుట్టూ పుష్పించిన మామిడిచెట్లు, బొట్టుగచెట్లు, దానమ్మచెట్లు, చంద్రచెట్లు, ఏరుమద్దిచెట్లు, పుష్పించిన గన్నేరుచెట్లు పొన్నచెట్లు, జాజితీగలు, మల్లెపొదలు, మఱ్ఱిచెట్లు, తినాసపుచెట్లు, అశోకవృక్షములు, ఏడాకుల అరటిచెట్లు, మొగలిచెట్లు, గురివెందచెట్లు ఇంకా ఎన్నో ఇతరములైన చెట్లు ఉండుటచే ఆ సరస్సు అలంకరించుకొన్న స్త్రీ వలె ఉండెను. నెమళ్ళ కేకాధ్వనులతో ఆ ప్రాంతము ప్రతిధ్వనించుచుండెను కోయిల్లిక పక్షులు, బెగ్గురుపక్షులు, చిలకలు మొదలైన పక్షుల ధ్వనులు వినబడుచుండెను. ఆ సరస్సు ప్రక్కనే ఉన్న వనమును కూడ చూచుచు దానిలోనికి ప్రవేశించిరి.

మూ. స దదర్శ తతః పమ్పాం శీతవారినిధిం శుభామ్, 20
తిలకాశోకపున్నాగవకుళోద్దాలకాశినీమ్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సః = ఆ రాముడు, శీతవారినిధిమ్ = చల్లని నీటికి నిధి. శుభామ్ = మంగళప్రదము, తిలకాశోకపున్నాగ వకుళోద్దాలకాలినీమ్ = తిలక, అశోక, పుంనాగ, వకుళ, ఉద్దాల వృక్షములతో ప్రకాశించునదీ అయిన, పమ్పామ్ = పంపను, దదర్శ = చూచెను.

తా. పిమ్మట ఆ రాముడు చల్లని నీటితో నిండి ఉన్నది, మంగళప్రదము, తిలక - అశోక పుంనాగ - వకుళ - ఉద్దాలవృక్షములతో ప్రకాశించుచున్నది అయిన పంపాసరస్సును చూచెను. 20

మూ. స రామో వివిధాన్ వృక్షాన్ సరాంసి వివిధాని చ, 21
పశ్యన్ కామాభిసంతప్తో జగామ పరమం హ్రదమ్.

ప్ర. అ. సః = ఆ, రామః = రాముడు, వివిధాన్ = అనేకవిధములైన, వృక్షాన్ = వృక్షములను, వివిధాని = అనేకవిధములైన, సరాంసి = సరస్సులను,

పశ్యన్ = చూచుచు, కామాభిసంతప్తః = మన్మథునిచేత పీడించబడినవాడై, పరమమ్ = శ్రేష్ఠమైన. హ్రదమ్ = చెరువును గూర్చి, జగామ = వెళ్లెను.

తా. ఆ రాముడు అనేకవిధములైన వృక్షాలను, అనేకసరస్సులను చూచుచు, మన్మథునిచే పీడింపబడుచున్నవాడై శ్రేష్ఠమైన ఆ పంపాసరస్సును సమీపించెను. 21

మూ. పుష్పితోపవనోపేతాం సాలచమ్పకశోభితామ్, 22
షట్పదౌఘసమావిష్టాం శ్రీమతీమతులప్రభామ్,
స్ఫటికోపమతోయాఢ్యాం శ్లక్ష్ణవాలుకసంతతామ్, 23
స తాం దృష్ట్వా పునః పమ్పాం పద్మసౌగన్ధికైర్యుతామ్
ఇత్యువాచ తదా వాక్యం లక్ష్మణం సత్యవిక్రమః. 24

ప్ర. అ. సత్యవిక్రమః=సత్యమైన పరాక్రమము గల, సః=ఆ రాముడు, పుష్పితోపవనోపేతామ్ = పుష్పించిన సమీపమునందలి వనములచే చుట్టబడినది, సాలచమ్పకశోభితామ్ = సాలవృక్షములచేతను. సంపెంగచెట్లచేతను ప్రకాశింపచేయబడినది, షట్పదౌఘసమావిష్టామ్=తుమ్మెదల సముదాయముచేత వ్యాప్తము, శ్రీమతీమ్ = శోభాయుక్తము, అతులప్రభామ్ = సాటిలేని కాంతి గలది, స్ఫటికోపమతోయాఢ్యామ్=స్ఫటికమువంటి నీటితో నిండినది, శ్లక్ష్ణవాలుకసంతతామ్= మృదువైన ఇసుకతో నిండినదీ, పద్మసౌగన్ధికైః = పద్మములతోను, ఎఱ్ఱని కలువలతోను, యుతామ్=కూడినది అయిన, తామ్=ఆ పంపను, పునః=మరల, దృష్ట్వా = చూచి, తదా=అప్పుడు, లక్ష్మణమ్=లక్ష్మణుని గూర్చి, ఇతి=ఇట్లు, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. ఆ పంపాసరస్సు చుట్టూ పుష్పించిన వనములు ఉండెను. సాలవృక్షములు, చంపక వృక్షములు దాని ప్రకాశమును ఇనుమడింపచేయుచుండెను. అక్కడ తుమ్మెదలు గుంపులు గుంపులుగా ఎగురుచుండెను. శోభాయుక్తమై, సాటిలేని కాంతితో ప్రకాశించుచున్న ఆ పంపా సరస్సులోని జలము స్ఫటికమువలె నిర్మలముగా ఉండెను. దానిలోని ఇసుక చాల మృదువుగా ఉండెను. పద్మములతోను, ఎఱ్ఱని కలువలతోను నిండి యున్న ఆ పంపానదిని మరల చూచుచు, సత్యమైన పరాక్రమము గల రాముడు లక్ష్మణునితో ఇటు పలికెను.

మూ. అస్యాస్తీరే తు పూర్వోక్తః పర్వతో ధాతుమణ్డితః,
ఋష్యమూక ఇతి ఖ్యాతః పుణ్యః పుష్పితపాదపః. 25

ప్ర. అ. పూర్వోక్తః = పూర్వము చెప్పబడిన, ధాతుమణ్డితః = ధాతువుల చేత అలంకరించబడిన, పుణ్యః = పుణ్యమైన, పుష్పితపాదపః = పుష్పించిన వృక్షములు గల, ఋష్యమూకః ఇతి = ఋష్యమూకము అని, ఖ్యాతః = ప్రసిద్ధమైన, పర్వతః = పర్వతము, అస్యాః = దీనియొక్క, తీరే = తీరమునందు ఉన్నది.

తా. ధాతువులచేత అలంకరింపబడినది, పుణ్యము, పుష్పించిన వృక్షములు కలది అయిన, ఋష్యమూక మనే ప్రసిద్ధి గల, వెనుక చెప్పిన పర్వతము దీని తీరమునందే ఉన్నది. 25

మూ. హరేర్ ఋక్షరజోనామ్నః పుత్రస్తస్య మహాత్మనః,
అధ్యాస్తే తం మహావీర్యః సుగ్రీవ ఇతి విశ్రుతః. 26

ప్ర. అ. ఋక్షరజోనామ్నః = ఋక్షరజస్సు అను పేరు గల, మహాత్మనః = మహాత్ముడైన, తస్య = ఆ, హరేః = వానరునియొక్క, పుత్రః = పుత్రుడు, మహావీర్యః = గొప్ప పరాక్రమము గలవాడు, సుగ్రీవః ఇతి = సుగ్రీవుడు అని, విశ్రుతః = ప్రసిద్ధుడూ అయిన వానరుడు, తమ్ = ఆపర్వతమును, అధ్యాస్తే = అధిష్ఠించిఉన్నాడు.

తా. ఋక్షరజస్సు అను పేరు గల మహాత్ముడైన వానరుని కుమారుడు, సుగ్రీవు డని ప్రసిద్ధుడు, మహాపరాక్రమశాలి అయిన వానరుడు ఆ పర్వతము మీద ఉన్నాడు. 26

మూ. సుగ్రీవమభిగచ్ఛ త్వం వానరేన్ద్రం నరర్షభ,
ఇత్యువాచ పునర్వాక్యం లక్ష్మణం సత్యవిక్రమమ్. 27

ప్ర. అ. నరర్షభ = నరులలో శ్రేష్ఠుడవైన లక్ష్మణా ! త్వమ్ = నీవు, వానరేన్ద్రమ్ = వానరుల ప్రభువైన, సుగ్రీవమ్ = సుగ్రీవుని గూర్చి, అభిగచ్ఛ = వెళ్లుము. పునః = మరల, సత్యవిక్రమమ్ = సత్యమైన పరాక్రమముగల, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, ఇతి = ఇట్లు, ఉవాచ = పలికెను.

తా. లక్ష్మణా ! నీవు వానరనాయకుడైన సుగ్రీవునివద్దకు వెళ్ళుము అని రాముడు సత్యమైన పరాక్రమము గల లక్ష్మణునితో చెప్పి మరల పలికెను. 27

మూ. రాజ్యభ్రష్టేన దీనేన తస్యామాసక్తచేతసా,
కథం మయా వినా శక్యం సీతాం లక్ష్మణ జీవితుమ్. 28

ప్ర. అ. లక్ష్మణ = లక్ష్మణా ! రాజ్యభ్రష్టేన = రాజ్యమునుండి భ్రష్టుడను, దీనేన = దీనుడను, తస్యామ్ = ఆమెయందు, ఆసక్తచేతసా = లగ్నమైన చిత్తము గలవాడను అయిన, మయా = నాచేత, సీతాం వినా = సీత లేకుండా, జీవితుమ్ = జీవించుటకు, కథమ్ = ఎట్లు, శక్యమ్ = శక్యమైనది ?

తా. లక్ష్మణా ! నేను రాజ్యమును పోగొట్టుకొంటిని. దీనుడను. నా మనస్సు సీతపై లగ్నమై ఉన్నది. అట్టి నేను సీత లేకుండా ఎట్లు జీవించ గలను ?

మూ. ఇత్యేవముక్త్వా మదనాభిపీడితః
స లక్ష్మణం వాక్యమనన్యచేతసమ్,
వివేశ పమ్పాం నలినీం మనోరమాం
రఘూత్తమః శోకవిషాదయన్త్రితః. 29

ప్ర. అ. మదనాభిపీడితః = మన్మథునిచేత పీడింపబడిన, సః రఘూత్తమః = ఆ రాముడు, అనన్యచేతసమ్ = మరొక ఆలోచన లేని, లక్ష్మణమ్ = లక్ష్మణుని గూర్చి, ఇత్యేవమ్ = ఇట్లు, వాక్యమ్ = వాక్యమును, ఉక్త్వా = పలికి, శోకవిషాదయన్త్రితః = శోకముచేతను, దిగులుచేతను పీడితుడై, మనోరమామ్ = సున్దరమైన, పమ్పాం నలినీమ్ = పంపాసరస్సును, వివేశ = ప్రవేశించెను.

తా. మన్మథునిచేత పీడింపబడిన ఆ రాముడు, వేరు ఆలోచన లేపి లేని లక్ష్మణునితో ఇట్లు పలికి, శోకవిషాదములతో బాధపడుచు మనోహరమైన ఆ పంపాసరస్సును ప్రవేశించెను. (సరస్సును సమీపించెను). 29

మూ. తతో మహద్వర్త్మ సుదూరసంక్రమం
క్రమేణ గత్వా ప్రవిలోకయన్వనమ్,
దదర్శ పమ్పాం శుభదర్శకాననా
మనేకనానావిధ పక్షిజాలకామ్. 30

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాణ్డే
పఞ్చసప్తతితమః సర్గః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సుదూరసంక్రమమ్ = చాల దూరమైన నడక గల, మహత్ = దీర్ఘమైన, వర్త్మ = మార్గమును, క్రమేణ = క్రమముగా, గత్వా = వెళ్ళి, వనమ్ = వనమును, ప్రవిలోకయన్ = చూచుచు, శుభాదర్శకానవామ్ = శుభముగా కనబడు అడవులు గల, అనేకనానావిధపక్షిజాలకామ్ = అనేకములైన, బహువిధములైన పక్షిసముదాయములు గల, పమ్పామ్ = పంపా సరస్సును, దదర్శ = చూచెను.

తా. పిమ్మట రాముడు చాల దూరము నడవవలసి ఉన్న దీర్ఘమైన మార్గమును క్రమముగా నడచి, వనమును చూచుచు, మంగళకరమైన దర్శనము గల (చూచుటకు మంగళకరమైన) అడవులు గలది, అనేకవిధములైన, అనేకమైన పక్షుల సముదాయములు కలది అయిన పంపను చేరెను. 30

'బాలానందిని'' అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు అరణ్యకాండలో డెబ్బదియైదవ సర్గ సమాప్తము. అరణ్యకాండము సమాప్తము.

యత్కృపాలేశసంసర్గాద్వ్యాఖ్యేయం రచితా మయా,
తస్యైవ జానకీజానేః పదయోరియమర్ప్యతే,

దేవతానుగ్రహః పిత్రోస్తపశ్చాచార్యసత్కృపా,
కర్తాస్మర్గ్రన్థజాతస్య కరణం కేవలం వయమ్.

శ్రీః శ్రీః శ్రీః శ్రీః